పీఠిక.

"కారణజన్ముఁడై కవినికాయము మెచ్చఁగఁ గావ్యకర్త యై
భూరికళాకలాపుఁ డయి పొల్పువహించిన బట్టుమూర్తిచే
నీరిత మై సుఖార్థసదహీనపదాస్పద మైనయావసు
క్ష్మారమణప్రవృత్తము సుసాధ్యము గాదు తలంచి చూడఁగన్." (సోమకవి.)

ఆంధ్రప్రబంధములలో వసుచరిత్ర ముత్తమోత్తమ మైనది. నిరర్గళమగు కవితాధార, సహజములగు శబ్దాలంకారములు, ఉచితమగు శ్లేషనైపుణ్యము, మనోజ్ఞమగువర్ణనముగల యీయుత్తమగ్రంథము రచించి విద్యార్థులకు సారస్వతభిక్ష పెట్టి యశఃకాయుఁడైన రామరాజభూషణుని జీవితచరిత్రము వసుచరిత్రమునందలి సారస్వతవిశేషములు నెఱుంగుట ప్రతిభాషాసేవకునకును విధి యగుటచే, బహుపర్యాయపఠనచాపల్యమునను సారస్వతపోషకులగు బ్రహ్మశ్రీ వావిళ్ల. వేంకటేశ్వరశాస్త్రులవారి యాజ్ఞావశమునను బీఠికను వ్రాయ దొరకొంటిమి. వసుచరిత్రమువలనను హరిశ్చంద్రనలోపాఖ్యానమువలనను గ్రంథకర్తనామము రామరాజభూషణుఁ డని స్పష్టమగుచున్నది. కులనిర్ణయమున కిం దాధారములు గానరావు. కృష్ణదేవరాయల కల్లుఁడును సదాశివరాయలను నామమాత్రమునకు రాజుగ నుంచి విజయనగరసామ్రాజ్యము నేకథాటిగఁ బరిపాలించి మహాసంగ్రామములలో విజయముగడించిన వీరాధివీరుఁడునగు (అళియ) రామరాజువలన నీకవి బహువిధసత్కారముల నొందిన యదృష్టశాలి. రామరాజుకాలమున సమకాలికరాజు లందఱకంటె మిన్నయై పలుకుబడియందును వీరత్వమునందును ఐశ్వర్యమునందును నసమానుఁడై యుండి సారస్వతాభిమానముతోఁ బ్రకృతకవినిగూడఁ బలుమాఱు గౌరవించి గ్రంథముల రచింపఁజేసి యంకితము నొందెను. నాఁటఁగోలెఁ దాను రామరాజుచే భూషితుఁడుగాన కవి రామరాజభూషణుఁడ నని చెప్పుకొనుచు వచ్చెను. పూర్వనామ మీయుభయగ్రంథములయందును గానరాదు. వసుచరిత్రమునఁ దిరుమలరాయలు కవిని బ్రశంసించుతఱి

"శ్రీరామక్షితిపున్ మదగ్రజు జయశ్రీలోలు నానాకళా
పారీణున్ బహుసంస్కృతాంధ్రకృతులం బల్మాఱు మెప్పించి త
త్కారుణ్యంబున రత్నహారహయవేదండాగ్రహారాదిస
త్కారం బందితి రామభూషణకవీ ధన్యుండ వీ వన్నిఁటన్."

అని కవిని బ్రశంసించియున్నాఁడు. ఈప్రశంసవలన గ్రంథకర్తనామము రామభూషణుఁ డని వ్యక్తమగుచున్నది. వసుచరిత్రము గద్యమునందు "సాహిత్యరసపోషణ రామరాజభూషణ". యని చెప్పుకొనినాఁడు. హరిశ్చంద్రనలోపాఖ్యానములోఁ

త్సామానాధికరణ్యలబ్ధి నచటం జక్రాయుధుం డొందు ని
ద్రాముద్రానుగతప్రబోధములఁ జిత్రం బేకకాలంబునన్. వసు. ఆ. 1. ప.

శా.''గంగం దాల్చితి వుత్తమాంగముననన్ గైకోలు గావించి త
ద్ధాంగీకార మనం బురంధ్రి నిను వామాంగంబునం దాల్ప నే
శృంగారోన్నతిఁ జూడు మంచు గిరిజన్ శీర్షాపగా బింబిత
స్వాంగానందితఁ జేయు శంభుఁడు నృసింహాధీశునిం బ్రోవుతన్.'' (నరసభూపాలీయము.)

శా.''ఆమందాకిని మౌళిఁ దాల్చి నను నర్ధాంగీకృతం జేసి తా
నా మే త్మేలని యార్య యల్గఁ బ్రణతుండై తత్పదాంభోజయో
గామర్షంబున గంగయు న్మోరయఁ జూడాభోగసవ్యక్రియా
సామర్థ్యంబున వేఁడు శంభుఁడు కృతిస్వామిం గృపం బ్రోవుతన్.'' (వసుచరిత్రము.)

ఇటులె పోలికగలపద్యము లుభయగ్రంథములనుండి పెక్కు లుదాహరింప వచ్చునుగాని విస్తరశంకచే వదలుచున్నారము. ఇఁకఁ బ్రకృతమగు వసుచరిత్రమును దానిరచనావిధానమును గుఱించి తెలిసికొనుట యవసరమగుటచే వసుచరిత్రము వంక కొంకమాఱు దృష్టి మఱలింతము.

వసుచరిత్ర మాంధ్రభాషలోఁగల ప్రశస్తగ్రంథములలో నొకటి. ఇందు రామరాజభూషణుఁడు తనయావచ్ఛక్తి నుపయోగించి యున్నాఁడు. ఇతఁడు యమకాది శబ్దాలంకారములకుఁ బాటువడక శ్లేషలు ధ్వనులు శ్రుతిరంజకమగు ననుప్రాసాలంకారములు, ముక్తపదగ్రస్తములు చెప్పియున్నాఁడు. చిత్రకవిత కొండొకచో శ్రుతిపేయముగా నున్నను నందు నిరుపయోగపదాడంబరము నిండి యర్థగ్రహణమునకు వీలుకలుగదు గావునఁ దొల్లిటి యాలంకారికశిరోమణులు చిత్రకవితను యమకాదుల నీక్రిందివిధముగా గర్హించియున్నారు.

''ప్రాయేణ యమకే చిత్రే రసపుష్టి ర్నవిద్యతే''
''కావ్యాంతర్గడుభూతా యా సాతు నేహ ప్రపంచ్యతే'' (విశ్వనాథపంచాననుఁడు.)

తఱచుగా యమకము చిత్రకవిత లోనగువానివలన రసపుష్టి నశించుననియు బంధములు కావ్యమునకుఁ బుండువంటి వనియు నుదాహృతశ్లోకభావము. వసుచరిత్రమున బంధకవితయు గర్భకవితయు లేదు. అందందు యమకములు కానవచ్చిన నవియు సాహిత్యరసపోషణుని యమృతవాణినుండి వచ్చినవగుటచే నందు రసప్రతిబంధము కానరాదు. రామరాజభూషణుఁడు సంగీతకళారహస్యనిధి యగుటచేఁ బఠనానుకూలముగ లయగ్రహించి, యనుప్రాసాలంకారములు విశేషించి యుపయోగించియున్నాఁడు. శబ్దాలంకారరచనాకౌశలము రామరాజభూషణుని యెడల సహజమగుటచే నలంకారాభిరామములగు పద్యములలో మచ్చునకేని వ్యర్థవాక్యముగాని భావలోపముగాని కానరాదు. శబ్దాలంకారమగు ననుప్రాసములు నింపియున్న యీక్రిందిపద్యములలో భావలోపముగాని వ్యర్థపదప్రయో

గముగాని కానరాక పఠనసౌకర్యము శ్రోత్రపేయమునై యెంత మనోజ్ఞముగ నున్నదో చూడుఁడు.

సీ. "ఒకచాయ ననపాయ పికగేయ సముదాయ మొకసీమ నానామయూరనినద
మొకవంక నకలంక మకరాంక హయహేష లోకక్రేష వనదేవ యువతిగీతి
ఒకచెంత సురకాంత లకరాంతతతనాద మొకదారి వనశారికోదితంబు
ఒకయోరఁ బటుచారణకుమారభణితంబు లోకదండ నలిమండలికలగాన
తే. మొక్కమొగి మ్రోయఁ గదళీగృహోపపన్న, కిన్నరీబృందబృందసంగీతగీతి
నమరు నతివేలకోలాహలములకలిమి, నమరు నీయద్రి కోలాహలాఖ్య మొప్ప."
సీ. "లలనాజనాపాంగవలనావసదనంగతులనాభికాభంగదోఃప్రసంగ
మలసానిలవిలోలదళసాసవరసాలఫలసాదరశుకాలపనవిశాల
మలినీగరుదనీకమలినీకృతధునీకమలినీసుఖితకోకకులవధూక
మతికాంతసలతాంతలతికాంతరనితాంతరతికాంతరణతాంతసుతనుకాంత
తే. మకృతకామోదకురవకావికలవకుల, ముకులసకలవనాంతప్రమోదచలిత
కలితకలకంఠకులకంఠకాకలీవి,భాసురము పొల్చు మధుమాసవాసరంబు."
క. "వీనులవిందై యమృతపు, సోనలపొందై యమందసుమచరదళినీ
గానముక్రందై యారవ, మానందబ్రహ్మమైన నధిపతిపల్కెన్."

ఇట్టి యనుప్రాసాద్యంతనియమపద్యములు వసుచరిత్రమునఁ బెక్కులు గలవు. అందు భావసమృద్ధికిఁ గవితాగాంభీర్యమున కెట్టి కొఱంత గానరాదుగాని యావలి కవులీశబ్దాలంకారములలో వసుచరిత్రము ననుకరింపఁబోయిమాత్రము కృతార్థులు కాఁజాలరైరి. వసుచరిత్రమునందు ముఖ్యముగాఁ జూడఁదగినది శ్లేష, ధ్వని. రామరాజభూషణుఁ డిట్టిశ్లేషలను విదూషకునిచరిత్రము చెప్పించుతావునను, శుక్తిమతిగర్భధారణాకథావసరమునను మిగుల మనోజ్ఞముగాఁ జెప్పియున్నాఁడు. కృత్యాదియందలి కృతిపతివంశావతారమునందును చంద్రమలయానిలమన్మథాద్యుపాలంభనములందును రామరాజభూషణుఁడు తనశ్లేషనైపుణ్యము వెల్లివిరియించి యున్నాఁడు. ఇంతయేల వసుచరిత్రమునందు శ్లేషయో ధ్వనియో శబ్దాలంకారమో అపూర్వమగు భావసౌష్ఠవమో వర్ణనాచమత్కారమో లేనిపద్య మరుదనుట సాహసముగాదు.

వసుచరిత్రమునందు కైశిక్యాదివృత్తులు వైదర్భ్యాదిరీతులు మాధుర్యాది గుణములు ద్రాక్షాదిపాకములు శృంగారాదిరసములు ఉద్దీపనవిభావాది సంభోగశృంగారభావములు లోనగునరసభూపాలీయమునందలి కావ్యగుణములకు లక్ష్యములైనపద్యములు చాలగలవు. వీనినిబట్టియే వసుచరిత్రము నరసభూపాలీయమునకు లక్ష్యగ్రంథమనుటలో విమర్శకులు సంశయింపకున్నారు. వసుచరిత్రమునందలి కథావస్తువును భట్టుమూర్తి భారతమునుండి గ్రహించెను. కాని మూలకథను ఔచితినిబట్టి స్వతంత్రించి తనప్రబంధమునందుఁ బెక్కువిధములమార్చి పరిహారము నిట్లు చెప్పినాఁడు.

ప్రథమాశ్వాసము 53 వ పద్యములోఁ దనవృత్తాంత మీక్రిందివిధముగాఁ జెప్పుకొనియున్నాఁడు.

సీ. "వనధిలంఘనకృపావర్ధితోభయకవితాకళారత్నరత్నాకరుండ
సకలకర్ణాటరక్షాధురంధరరామవిభుదత్తశుభచిహ్నవిభవయుతుఁడ
వసుచరిత్రాదికావ్యప్రీతబహునృపప్రాపితానేకరత్నప్లవుండ
శాశ్వతశ్రీవేంకటేశ్వరానుగ్రహానిరుపాధికైశ్వర్యనిత్యయశుఁడ

తే-గీ. "శ్రీకరమహాప్రబంధాంకసింగరాజ, తిమ్మరాజప్రియతనూజ ధీరసూర
పాత్మజుఁడ రామనృపభూషణాఖ్యసుకవి, నంకిత మొనర్తు నీకావ్య మనఘభక్తి."

ఉదాహృతపద్యములు రెంటివలనను కవి కర్ణాటదేశాధీశ్వరుని గ్రంథరచనాచాకచక్యముచే మెప్పించినట్లును నుభయగ్రంథగద్యలతో సమన్వయించిచూచిన గ్రంథకర్తనామము రామభూషణుఁడని రామరాజభూషణుఁడని రామనృపభూషణుఁడని యుంటచే నిది బిరుదనామ మనుట కెంతమాత్రము సంశయింపఁ బనియుండదు. ఇతనినామము మూర్తియనియు బట్టుకులమువాఁడనియు గ్రహించుట కీకవికృతమని ప్రతీతిగలిగియున్న ఉత్పలమాలికలోని వగు

"లొట్ట యిదేటిమాట పెనులోభులతో మొగమోట యేల తా
... ...
రట్టడి బట్టుమూర్తి కవిరాయనిమార్గ మెఱుంగఁ జెప్పితిన్."

అను భాగమువలన రామరాజభూషణుని మూర్తి యని వ్యవహరించువారనియు నిందులకుఁ బీఠికాదియం దుదాహృతమైన పద్యమునందలి బట్టుమూర్తినామము, బట్టుమూర్తి బాపురమని యేడ్చెనను నైతిహ్యము మఱియు సర్వవిధముల నేకకర్తృకమని విశ్వసింపఁబడు నరసభూపాలీయమునందలి కర్తృపదమగు మూర్తి నామము తార్కాణ యగుచున్నవి. నరసభూపాలీయము రచించిన మూర్తికవియు, వసుచరిత్రము, హరిశ్చంద్రనలోపాఖ్యానములు రచించిన రామరాజభూషణుఁడు వేఱువేఱువ్యక్తులను వాద మొకటిగలదు. గాని యందు సత్యమున్నటులఁ గానరాదు. భిన్నత్వము వాకొనువారిలోఁ గీర్తిశేషులగు పూండ్లరామకృష్ణయ్యపంతులు ప్రభృతులు ముఖ్యులు. మిగిలినచరిత్రవిదులలోఁ జాలమంది యేకత్వము నామోదించినవారె? నరసభూపాలీయమునఁ గవి తనప్రతిభాదికమును వంశానుక్రమణికయు నీవిధముగాఁ జెప్పుకొనియున్నాఁడు.

సీ. "శతలేఖినీపద్యసంధానధౌరేయు ఘటికాశతగ్రంథకరణధుర్యు
ఆశుప్రబంధబంధాభిజ్ఞు నోష్ఠ్యనిరోష్ఠ్యజ్ఞు నచలజిహ్వోక్తి నిపుణు
తత్సమభాషావితానజ్ఞు బహుపద్యసాధితవ్యస్తాక్షరీధురీణు
ఏకసంధోచితశ్లోకభాషాకృత్యు చతురనోష్ఠ్యనిరోష్ఠ్యసంకరజ్ఞు
'నమితయమకాశుధీప్రబంధాంకసింగ, రాజసుతతిమ్మరాజ పుత్రప్రసిద్ధ
వేంకటరాయభూషణసుపుత్రు, ననుబుధవిధేయు. శుభమూర్తి నామధేయు."

పైపద్యమునందలి మూర్తికవి పూర్వులనామములు హరిశ్చంద్రనలోపాఖ్యానమునందలి రామరాజభూషణుని పూర్వులనామములు సర్వవిధముల సరిపోవుచున్నవి. తండ్రిపేరు సూరపరాజనియు నతని బిరుదనామము వేంకటరాయభూషణుఁడనియు నిశ్చయింతుమేని యేకత్వము సర్వవిధముల నిర్బాధకము కాఁగలదు. ఇరువురిశైలి యొకటి. కాలమొకటి. బిరుదము లొక్కతీరువె. ఇష్టదైవ మొకఁడె. కావున రామరాజభూషణుని జన్మనామము మూర్తియై యుండును. ఇంతదనుక నుపలభ్యములైన యీకవి పుస్తకములలో మొదటిది నరసభూపాలీయము, రెండవది వసుచరిత్రము, మూడవది హరిశ్చంద్రనలోపాఖ్యానముగ నిశ్చయింపవచ్చును. కీర్తిశేషులు వీరేశలింగముపంతులువారు వసుచరిత్రమునకు నరసభూపాలీయము లక్షణగ్రంథమనియుఁ దొలుత వసుచరిత్రము పిదప నరసభూపాలీయము రచింపఁబడినటులఁ దలంచిరిగాని యాయూహ కెన్నియో బాధకములు గలవు. నరసభూపాలీయకాలమునాఁటికిఁ దిరుమలరాయలు పట్టాభిషిక్తుఁడు గాలేదుగాన నాతని నెజ్జితిమ్మరాజని వాకొనఁబడెను. ఇంతియగాక నరసభూపాలీయములో రామరాజు ప్రశంస యీక్రిందివిధముగాఁ గావింపఁబడెను.

సీ. “ఖలు నతిద్రోహిసల్కాము తిమ్మని హరించి సకలకర్ణాటదేశంబు నిలిపె
నతునివర్ధితునిఁ దత్సుతునిబట్టముగట్టి కుతుపనమల్కానక్షోణి నిలిపెఁ
బదిలుఁ డై రాచూరు ముదిగల్లు కప్పంబు సేయఁ గాంచి సపాదు సీమ నిలిపె
శరణన్న మల్కా నిజామున కభయం బొసంగి తదీయరాజ్యంబు నిలిపె
తే-గీ. నవని నంతయు రామరాజ్యంబుచేసెఁ, దనగుణంబులు కవికల్పితములుగాఁగ
నలవియె వచింపఁ దత్కావ్యములను వెలయ, భూమి నొకరాజమాత్రుఁడే రామవిభుఁడు.”

ఆశ్వా-౧. ప-౩౦.

ఈపద్యమువలన నరసభూపాలీయరచనాకాలమునాఁటికి రామరాజు సలకము తిమ్మరాజును జంపించి సదాశివరాయలను రాజ్యమునఁ బ్రతిష్ఠించెననియుఁ గుతపనముల్కని చెప్పఁబడిన ఇబ్రహీం కుతుపషాను బట్టాభిషిక్తుఁ గావించెననియు ఆలీ ఆదిల్‌షాకు ముదిగల్లు రాచూరుదుర్గములతోనున్న కళ్యాణపురము నొసంగెననియు హుస్సేను శరణాగతుఁడు కాఁగా వానిరాజ్యము వాని కొసంగెననియు మూర్తికవి చెప్పియున్నాఁడు. ఈవిజయములన్నియుఁ జరిత్రముతో సమన్వయించితిమేని క్రీ. శ. 1550 నాఁటివి. అప్పటికి మూర్తికవియు రామరాజుచే సత్కృతు లొంది రామరాజభూషణుఁడు కాలేదు. ఇక్కతన నరసభూపాలీయము క్రీ. శ. 1555 లోఁగ రచింపఁబడిన దనుటకు సంశయము లేదు. ఇఁక వసుచరిత్రమందుమా! రామగాజు తల్లికోటయుద్ధములో వీరమరణము నొందినపిదప నెజ్జితిమ్మపార్థివుఁడు తిరుమలదేవరాయనామముతో జీర్ణకర్ణాటరాజ్యమును బునరుద్ధరించి మహమ్మదీయుల యలజడికి సహింపఁజాలక రాజధానిని బెనుగొండగఁ జేసికొని పరిపాలిం

చుట సూచింపఁబడెనని వసుచరిత్రమునందలి యీక్రిందిపద్యమువలన గ్రహింపవచ్చును.

చ. "తిరుమలరాయశేఖరునిధీరచమూభటరాజి యాజిభీ
కరయవనేశ్వరప్రహితఖానబలంబునఁ జక్కసేయ ని
ద్ధరఁ బెనుగొండ కొండలు మదద్విపచర్మకపాలమాలికా
పరికరభూషితంబులయి బల్విడిఁ గాంచె గిరీశభావమున్." వసు. ఆ-1. ప. 39

వసుచరిత్రమును దిరుమలదేవరాయ లంకితము నొందునాఁటికి వార్ధకదశలో నుండియుండును గాననే యందు దాతనికుమారుల విక్రమములును గుమారుఁడు శ్రీరంగరాయలు యువరాజపట్టాభిషిక్తుఁ డగుటయుఁ జెప్పఁబడెను.

చ. "హరిపదభక్తిశీలుఁ డగు నారఘునాథనృపాలు కూర్మిసో
దరుఁడు సిరంగరాయ వసుధావరుఁ డాత్మగుణప్రమోదవ
త్తిరుమలరాయశేఖర వితీర్ణ మహాయువరాజపట్టబం
ధురుఁ డయి సర్వభూభువనధూర్వహశక్తివహించు నెంతయున్." వసు- ఆ-1. ప-7.

రాజ్యము పెనుగొండకు మార్చినను గూడ మహమ్మదీయులదాడి తగ్గలేదనియుఁ బై పద్యమువలన తిరుమలదేవరాయలు ముస్తఫాఖానుతో క్రీ. శ. 1577 లో సంగర మొనరించి నష్టపడెననియుఁ బిదప తిరుమలదేవరాయలు కుమారులకు రాజ్యమునొసంగి తాను విద్యాగోష్ఠులతోఁ గాలయాపనముఁ జేయుతఱి మూఁడవకుమారుఁడగు వేంకటపతిరాజు ఆలీ ఆదిల్ షాతోఁ బెనుగొండలో సంగర మొనరించి పరాజితుఁడై పెనుగొండవదలి చంద్రగిరి రాజధానిగఁ జేసికొని యట కాలము గడపెననియు నీక్రింది వసుచరిత్రపద్యమువలనఁ దెలిసికొన నవకాశము కలుగుచున్నది.

మ. "హరుఁ డాతారకశైలదుర్గమున నధ్యాసీనుఁడై రాజశే
ఖరవిఖ్యాతివహించుఁ జంద్రగిరిదుర్గం బందు శ్రీవేంకటే
శ్వరుఁ డొప్పెన్ బహురాజశేఖర సదాసంసేవ్యుఁడై యార యి
ద్ధరబంటేలికవాసి తద్గిరులకున్ దద్వల్లభశ్రీలకున్."

వీనినన్నింటిని సమన్వయించి చూచితిమేని భట్టుమూర్తి శ్రీకృష్ణదేవరాయల సామ్రాజ్యమున నూత్నయౌవనము విద్యార్థిదశయుఁ గడపి తద్రాజ్యపతనానంతరము నరసభూపాలకు నాశ్రయించి నరసభూపాలీయగ్రంథరచనాముఖంబున బహువిధసత్కారములనొంది వేంకటపతిరాయల యనంతరము రాజైన సలకము తిమ్మయను వధించి సదాశివరాయలను నామమాత్రముగ విద్యానగరరాజ్యమునకు రాజును జేసి యావద్భూమండలమును రామరాజు పాలించుతఱి నట నాశ్రయము గల్పించుకొని రసికుఁడగు రామరాజును బహువిధసంస్కృతాంధ్రకృతులచే మెప్పించి "రత్నహారహయవేదండాగ్రహారాది" సత్కారములనొంది రామరాజ

భూషణబిరుదము దాల్చి సుప్రసిద్ధుఁడై 1565 లో జరిగిన తల్లికోటయుద్ధమున రామరాజు ఘోరమృత్యువునొంది విజయనగరరాజ్యము భిన్నభిన్న మైపోయినపుడు తిరుమలదేవరాయలు పెనుగొండలోఁ గొంతకాలము జీర్ణకర్ణాటరాజ్యము నుద్ధరించి పాలించుచున్న క్రీ. శ. 1577 ప్రాంతమునను, దరువాత, చంద్రగిరికీరాజకుటుంబము పోయినకాలమునను కవి యీరాజకుటుంబము నాశ్రయించి యుండెననియు క్రీ. శ. 1577 పైనను 1580 కిఁ గొంచెము పూర్వమునను వసుచరిత్రము తిరుమలదేవరాయల కంకితము గావించెననియు విశ్వసింపవచ్చును. భట్టుమూర్తి నరసరాజువలన నొందినసత్కారములు సామాన్యములై యుండును. దానశీలుఁడగు రామరాజును తనవిద్యావివేకముచేఁ బలుమారు మెప్పించి రామరాజభూషణబిరుదనామము వహించి యేనుగులు హయములు రత్నహారములు అగ్రహారములు నొంది యైశ్వర్యశాలి యయ్యెను. వసుచరిత్రము తిరుమలరాయల కంకితము నొసంగి కవు లెవరు నొందియెఱుంగని రత్నాభిషేకగౌరవము నొందెను. పిదప నీతఁడు సమధికైశ్వర్యములతోఁ దులఁదూఁగుచు నుండెననుటకు హరిశ్చంద్రనలోపాఖ్యానములోని యీపద్యపాదములు తార్కాణ కాఁగలవు.

"వసుచరిత్రాదికావ్యప్రీతబహునృపప్రాపితానేకరత్నాఢ్యవుండ
శాశ్వత శ్రీవేంకటేశ్వరానుగ్రహనిరుపాధికైశ్వర్యనిత్యయశుఁడ."

రామరాజభూషణుఁడు స్వప్రతిభాదికముచే నమితధనము అగ్రహారములు మడిమాన్యములు గజతురంగాదులు సముపార్జించి పరితృప్తుఁడై తనయంతిమగ్రంథమును రామభద్రున కంకితముగావించుచుఁ దా నొనరించిన ధర్మకార్యములు కృతిరచనాభిలాషము నీక్రిందివిధముగా హరిశ్చంద్రనలోపాఖ్యానమునఁ బ్రశంసించియున్నాఁడు.

సీ. "సుతులఁ బెక్కండ్ర శాశ్వతరామనామధన్యులఁ జేసి పిలుచు భాగ్యోదయంబు
రచితాగ్రహారంబు రామచంద్రపురాంకపూతం బొనర్చిన పుణ్యరేఖ
నవదివ్యభవనంబు నవరించి శ్రీ రామవిభుఁ బ్రతిష్ఠించిన విపులమహిమ
రామసరోనామరమణీయముగఁ దటాకము వినిర్మించిన ఘనయశంబు

తే-గీ. "సఫలతవహించు నీహరిశ్చంద్ర నలకథాయుగనిబంధచిత్రబంధప్రబంధ
మంకిత మొనర్ప రఘుభర్త కఖిలభర్త, ఘనతరాభీప్సితము లెల్ల నొదవు నీకు."

(ప్రథ. ఆ. ప 14.)

రామరాజభూషణుఁడు అగ్రహారప్రదానము, శ్రీరామాలయనిర్మాణము, సరోవరప్రతిష్ఠ గావించి పరమార్థముగూడ సంగ్రహించియున్నాఁడు. ఇంతవఱకీకవినివాసస్థల మిదమిత్థమని రూపింపఁబడకపోవుట సంతాపకరము. ఈకవి జన్మస్థానము బట్టుపల్లెయనియు నిది రామరాజభూషణుని పూర్వులగు ప్రబంధాంకమువారను నింటిపేరుగలవారికిఁ గృష్ణదేవరాయ లొసంగిరని కీర్తిశేషులగు వీరేశలింగ

ముపంతులువారు వ్రాసియున్నారు. ఇది బళ్లారిమండలము పాళమండలముచెంత గలదని కొందఱును గడపమండలములోని పులివెందలచెంతగలదని కొందఱును జెప్పుచున్నారు. జటప్రోలు చెంతగలదని సురభివంశచరిత్రకారులు చెప్పుచున్నారు. కృష్ణామండలములోని మోదుకూరె యీకవిజన్మస్థానమని మఱికొందఱు చెప్పుచున్నారు. ఇందలి సత్యనిర్ణయమునకుఁ బాటుపడి రామరాజభూషణప్రతిష్ఠాపితకీర్తిచిహ్నముల నారయుటకు సోదరపరిశోధకులు పూనుకొనమి పరితాపకారణము.

శ్రీకృష్ణదేవరాయలు విద్యానగరసంస్థానము పాలించుచు క్రీ. శ. 1530 లోఁ గీర్తిశేషుఁడగునాఁటికి భట్టుమూర్తి విద్యార్థిదశ పూర్తిచేసికొని యాసంస్థానమున నుండెననియుఁ బిదప 1580 వఱకు జీవించి యశఃకాయము గైకొనియుండుననియు నితనిజననము 1510 ప్రాంతమున నైయుండుననియు డెబ్బదియేండ్లకుఁ బైఁగ జీవించెననియుఁ బూర్వోక్తవిషయసమన్వయముచేఁ దెలిసికొనవచ్చును. గాని యీనిర్ణయమువలన వసుచరిత్రము రచించునాఁటికి అఱువదియైదుసంవత్సరములవయస్సు. హరిశ్చంద్రనలోపాఖ్యానము రచించునాఁటి కంతకంటె నెక్కుడువయస్సుండియుండును. ఇంతవార్ధకములో శృంగారరసపూరితమగు వసుచరిత్రము ద్వ్యర్థికావ్యమగుహరిశ్చంద్రనలోపాఖ్యానము రచించియుండునని మేము చెప్పఁజాలము. వసుచరిత్రము నీకవి నరసభూపాలీయము రచించినపిదప కొంతకాలమునకుఁ బూర్తిచేసి సత్కారాదులనొంది తిరుమలరాయల నానందపఱచియుండును. ఆవల కవి సజీవిగ నుండియుంటచేఁ దిరుమలరాయపుత్రుల ప్రోత్సాహమున శ్రీరంగరాయల యువరాజ్యపట్టాభిషేకము వేంకటపతిరాయల చంద్రగిరిపరిపాలనము చేర్చియుండును. తరువాతఁ గొంతకాలమునకు రచింపఁబడినది హరిశ్చంద్రనలోపాఖ్యానము. ఈరీతిగ యోచించినచో వసుచరిత్రము హరిశ్చంద్రనలోపాఖ్యానము వయస్సు తీరకముందు రచించియున్నటుల నిశ్చయింప నగునుగాని యిందులకు నాధారములు గానరామిచే వంశాదికమునందలి తుదియంశములను లక్ష్యమునందుంచుకొని కాలనిర్ణయ మొనరించితిమి. ఈసమన్వయమున కిచ్చగింపక కవులచరిత్రములో వీరేశలింగముపంతులువారు రాయలకాలమున రామరాజభూషణుండుండి యుండఁడనియు నరసభూపాలీయము కవికృతమగు ద్వితీయగ్రంథమనియు శాసించిరని తోఁచెడిని.

రామరాజభూషణుఁడు సంగీతశాస్త్రమునందును, జ్యోతిశ్శాస్త్రమునందును యోగశాస్త్రమునందును, పరిజ్ఞానముగలవాఁడనియు వ్యాకరణశాస్త్రజ్ఞుఁడనియు వసుచరిత్రము చెప్పక చెప్పుచున్నది. కృతినొందిన తిరుమలదేవరాయలో రసికుఁడు. సంస్కృతాంధ్రసాహిత్యసంపన్నుఁడు. ఇతఁడు జయదేవుని గీతగోవిందముపై వ్రాసిన శ్రుతిరంజనియను వ్యాఖ్యానము మదరాసు ప్రాచ్యలిఖితపుస్తకాలయములోఁ గలదు. గీతగోవిందవ్యాఖ్య చెఱుకూరి లక్ష్మణసూరికృతముగఁ బ్రత్యంతరములు లభించుచున్నవనియు "యథామదీయే ప్రసన్నరాఘవవ్యాఖ్యానే" అని

యుదాహరించినభాగములు లక్ష్మణసూరికృతప్రసన్నరాఘవవ్యాఖ్యయందుఁ గలవు గాన తిరుమలరాయల కారోపించిన శ్రుతిరంజని కర్తృత్వము విశ్వసనీయముగా దని శృంగారశ్రీనాథమునఁ బ్రభాకరశాస్త్రిగారు వ్రాసియున్నారు. శ్రుతిరంజని వ్యాఖ్యాత తిరుమలరాయలు కాకపోయినను అతఁడు రసజ్ఞుఁడు పండితుఁ డనుటకు నీక్రిందియాధారములు దృష్టాంతములు కాఁగలవు.

"శ్రీరామరాయే శ్రితభాగధేయే శౌరేః పదం శాశ్వత మభ్యుపేతే.
తదనుభువ మశేషాం పాలయన్ రాజనీత్యా
పవనతనయజేతా దానరీత్యామహాత్మా
భరతమహితభూమా భాతితస్యానుజన్మా
వరతిరుమలరాజస్సాహితీభోజరాజః." (శాసనశ్లోకములు.)

శా. 'వర్ధిష్ణు ప్రతిభాపరాశర' ఆ. 2. ప 157
సుగంధి—'సారసాహితీసదధ్వచారిభూరిధీరసా' ఆ. 6. ప 102

ఈయుదాహృతాంశములవలనఁ దిరుమలదేవరాయలు భాషాప్రవీణుఁడనియు సుధీలోలుఁడనియు విద్యావినోదియనియు స్పష్టమగుచున్నది.

రామరాజభూషణుని గ్రంథములు.

రామరాజభూషణుఁడు మూర్తినామముతో రచించిన నరసభూపాలీయము లక్ష్యలక్షణవిశిష్టమగు నలంకారగ్రంథము. దీనికే కావ్యాలంకారసంగ్రహమని నామాంతరముగలదు. నాటకలక్షణభాగమును మాత్రము వదలి ప్రతాపరుద్రీయమును నరసరాజున కంకితముగా నింద్రాంధ్రీకరింపఁబడెను. ఇందలిపద్యములు చాల వఱకు వసుచరిత్రములోని పద్యములను బోలియున్నవి. నరసభూపాలీయము రచించునాఁటికి మూర్తికవి తనప్రతిభాదికము తానే చెప్పుకొనవలసినస్థితియందుంట చేనెన్నియో బిరుదాదికములను వాకొనెను. వసుచరిత్ర రచనమునాఁటికి అశేష పండితమండితమగు రామరాజుసభాస్థలమునఁ బ్రముఖుఁడై సత్కారములనొందుచు జగమెఱిఁగిన బ్రాహ్మణునకు జందెమేందుల కనుసామెతకు దృష్టాంతమయ్యెను. కావుననే తన్నుఁగూర్చి వసుచరిత్రమునందు విస్తరించి చెప్పుకొనఁడయ్యెను. వసుచరిత్రము నరసభూపాలీయము నేకకర్తృకమనుటకు నుభయగ్రంథములందు సమానములగు పద్యములు గలవు. ఇది యేకకర్తృత్వ మనుటకు సాధకము.

శా."ఆమోదంబున శ్రీనృసింహవిభుదానాంభోనదు ల్సాగర
స్వామిం జెంద యశంబు మేఘములఁ బర్వం గల్గు వర్షాశర
త్సామానాధికరణ్యశంక నచటం దామోదరుం డొందు ని
ద్రాముద్రానుగతప్రమోదములఁ జిత్రం బేకకాలంబునన్." (నరస-ద్వితీ)

మ."రామక్ష్మావరుదానతోయతటినీవ్రాతంబు కల్లోలినీ
స్వామిం జెంద యశంబు మేఘములఁ బర్వం గల్గు వర్షాశర

త్సామానాధికరణ్యలబ్ధి నచటం జక్రాయుధుం డొందు ని
ద్రాముద్రానుగతప్రబోధములఁ జిత్రం బేకకాలంబునన్. వసు. ఆ. 1. ప.

శా. "గంగం దాల్చితి వుత్తమాంగమునన్ గైకోలు గావించి త
ద్ధాంగీకార మనం బురంధ్రి నిను వామాంగంబునం దాల్ప నే
శృంగారోన్నతిఁ జూడు మంచు గిరిజన్ శీర్షాపగా బింబిత
స్వాంగానందితఁ జేయు శంభుఁడు నృసింహాధీశునిం బ్రోవుతన్." (నరసభూపాలీయము.)

శా. "ఆమందాకిని మౌళిఁ దాల్చి నను నర్ధాంగీకృతం జేసి తా
నా మే ల్మేలని యార్య యల్గఁ బ్రణతుండై తత్పదాంభోజయో
గామర్షంబున గంగయు న్మొరయఁ జూడాభోగసవ్యక్రియా
సామర్థ్యంబున వేఁడు శంభుఁడు కృతిస్వామిం గృపం బ్రోవుతన్." (వసుచరిత్రము.)

ఇటులె పోలికగలపద్యము లుభయగ్రంథములనుండి పెక్కు లుదాహరింప వచ్చునుగాని విస్తరశంకచే వదలుచున్నారము. ఇఁకఁ బ్రకృతమగు వసుచరిత్రమును దానిరచనావిధానమును గుఱించి తెలిసికొనుట యవసరమగుటచే వసుచరిత్రము వంక కొంకమాఱు దృష్టి మఱలింతము.

వసుచరిత్ర మాంధ్రభాషలోఁగల ప్రశస్తగ్రంథములలో నొకటి. ఇందు రామరాజభూషణుఁడు తనయావచ్ఛక్తి నుపయోగించి యున్నాఁడు. ఇతఁడు యమకాది శబ్దాలంకారములకుఁ బాటుపడక శ్లేషలు ధ్వనులు శ్రుతిరంజకమగు ననుప్రాసాలంకారములు, ముక్తపదగ్రస్తములు చెప్పియున్నాఁడు. చిత్రకవిత కొండొకచో శ్రుతిపేయముగా నున్నను నందు నిరుపయోగపదాడంబరము నిండి యర్థగ్రహణమునకు వీలుకలుగదు గావునఁ దొల్లిటి యాలంకారికశిరోమణులు చిత్రకవితను యమకాదుల నీక్రిందివిధముగా గర్హించియున్నారు.

"ప్రాయేణ యమకే చిత్రే రసపుష్టి ర్నవిద్యతే"
"కావ్యాంతర్గడుభూతా యా సాతు నేహ ప్రపంచ్యతే" (విశ్వనాథపంచాననుఁడు.)

తఱచుగా యమకము చిత్రకవిత లోనగువానివలన రసపుష్టి నశించుననియు బంధములు కావ్యమునకుఁ బుండువంటి వనియు నుదాహృతశ్లోకభావము. వసుచరిత్రమున బంధకవితయు గర్భకవితయు లేదు. అందందు యమకములు కానవచ్చిననవియు సాహిత్యరసపోషణుని యమృతవాణినుండి వచ్చినవగుటచే నందు రసప్రతిబంధము కానరాదు. రామరాజభూషణుఁడు సంగీతకళారహస్యనిధి యగుటచేఁ బఠనానుకూలముగ లయగ్రహించి, యనుప్రాసాలంకారములు విశేషించి యుపయోగించియున్నాఁడు. శబ్దాలంకారరచనాకౌశలము రామరాజభూషణుని యెడల సహజమగుటచే నలంకారాభిరామములగు పద్యములలో మచ్చునకేని వ్యర్థవాక్యముగాని భావలోపముగాని కానరాదు. శబ్దాలంకారమగు ననుప్రాసములు నిండియున్న యీక్రిందిపద్యములలో భావలోపముగాని వ్యర్థపదప్రయో

గముగాని కానరాక పఠనసౌకర్యము శ్రోత్రపేయమునై యెంత మనోజ్ఞముగ నున్నదో చూడుఁడు.

సీ. "ఒకచాయ ననపాయ పికగేయ సముదాయ మొకసీమ నానామయూరనినద
మొకవంక నకలంక మకరాంక హయహేష లోకక్రేష వనదేవ యువతిగీతి
ఒకచెంత సురకాంత లకరాంతతతనాద మొకదారి వనశారికోదితంబు
ఒకయోరఁ బటుచారణకుమారఫణితంబు లొకదండ నలిమండలికలగాన
తే. మొక్కమొగి మ్రోయఁ గదళీగృహోపపన్న, కిన్నరీబృందబృందసంగీతగీతి
నమరు నతివేలకోలాహలములకలిమి, నమరు నీయద్రి కోలాహలాఖ్య మొకొ."

సీ. "లలనాజనాపాంగవలనావసదనంగతులనాభికాభంగదోఃప్రసంగ
మలసానిలవిలోలదళసాసవరసాలఫలసాదరశుకాలపనవిశాల
మలినీగరుదనీకమలినీకృతధునీకమలినీసుఖితకోకకులవధూక
మతికాంతసలతాంతలతికాంతరనితాంతరతికాంతరణతాంతసుతనుకాంత
తే. మకృతకామోదకురవకావికలవకుల, ముకులసకలవనాంతప్రమోదచలిత
కలితకలకంఠకులకంఠకాకలీవి,భాసురము వొల్చు మధుమాసవాసరంబు."

క. "వీనులవిందై యమృతపు, సోనలపొందై యమందసుమచరదళినీ
గానముక్రందై యారవ, మానందబ్రహ్మమైన నధిపతిపల్కెన్."

ఇట్టి యనుప్రాసాద్యంతనియమపద్యములు వసుచరిత్రమునఁ బెక్కులు గలవు. అందు భావసమృద్ధికిఁ గవితాగాంభీర్యమున కెట్టి కొఱంత గానరాదుగాని యావలి కవులీశబ్దాలంకారములలో వసుచరిత్రము ననుకరింపఁబోయిమాత్రము కృతార్థులు కాఁజాలరైరి. వసుచరిత్రమునందు ముఖ్యముగాఁ జూడఁదగినది శ్లేష, ధ్వని. రామరాజభూషణుఁ డిట్టిశ్లేషలను విదూషకునిచరిత్రము చెప్పించుతావునను, శుక్తిమతిగర్భధారణాకథావసరమునను మిగుల మనోజ్ఞముగాఁ జెప్పియున్నాఁడు. కృత్యాదియందలి కృతిపతివంశావతారమునందును చంద్రమలయానిలమన్మథాద్యుపాలంభనములందును రామరాజభూషణుఁడు తనశ్లేషనైపుణ్యము వెల్లివిరియించి యున్నాఁడు. ఇంతయేల వసుచరిత్రమునందు శ్లేషయో ధ్వనియో శబ్దాలంకారమో అపూర్వమగు భావసౌష్ఠవమో వర్ణనాచమత్కారమో లేనిపద్య మరుదనుట సాహసముగాదు.

వసుచరిత్రమునందు కైశిక్యాదివృత్తులు వైదర్భ్యాదిరీతులు మాధుర్యాదిగుణములు ద్రాక్షాదిపాకములు శృంగారాదిరసములు ఉద్దీపనవిభావాది సంభోగశృంగారభావములు లోనగునరసభూపాలీయమునందలి కావ్యగుణములకు లక్ష్యములైనపద్యములు చాలగలవు. వీనినిబట్టియే వసుచరిత్రము నరసభూపాలీయమునకు లక్ష్యగ్రంథమనుటలో విమర్శకులు సంశయింపకున్నారు. వసుచరిత్రమునందలి కథావస్తువును భట్టుమూర్తి భారతమునుండి గ్రహించెను. కాని మూలకథను ఔచితినిబట్టి స్వతంత్రించి తనప్రబంధమునందుఁ బెక్కువిధములమార్చి పరిహారము నిట్లు చెప్పినాఁడు.

ఉ. "కేవల కల్పనాకథలు కృత్రిమరత్నము లాద్యసత్కృతుల్
వావిరిపుట్టురత్నము లవారితసత్కవికల్పనావిభూ
షావహపూర్వవృత్తములు సానలఁ దీరిన జాతిరత్నముల్."

భారతములో నింద్రుఁడు వసురాజుతపమునకు మెచ్చి విమానాదిక మొసంగినటు లుండఁ గోలాహలు నెగమీటి భువనక్షేమము సంతరించినందుల కొసంగినటుల మార్పఁబడెను. వసురాజునకు గిరికాపరిగ్రహణమునాఁటికే పురుపుత్రులున్నటు లుండ రామరాజభూషణుఁడు వసురాజు నవివాహితుఁడాయని యనుమానించువిధముగ జిత్రించెను. వసురాజు వేఁటకేగి గిరికను స్మరింప రేతస్ఖలనమగుటయు నతఁడా రేతస్సు గిరికకడ చేర్చుటయు లోనగుకథాంశము లీప్రబంధమునందుఁ దొలంగింపఁబడెను. ఇవియన్నియుఁ గథాకల్పనమునకు రామరాజభూషణుఁడు పెట్టినమెఱుంగులు. ఇన్ని మెఱుంగులు బెట్టినను వసుచరిత్రమునందుఁ గథాకల్పన మున్నటులఁ దోఁచదు. వర్ణనములు, కల్పనములు, భావములు, కవితాసౌష్ఠవముతోఁబాటు కథాసౌష్ఠవమును బాటింపకపోవుట యొకగొప్పకొఱంత. కావుననే వసుచరిత్రమును రసికులు సారస్వతపరిచయమునకుఁ బఠింతురుగాని కథాపఠనమునకుఁ బఠింపకున్నారు. వసుచరిత్రమునందలి కథాకల్పనలోపములనుగూర్చి రక్తాక్షిసంవత్సరపు టుగాదిసంచికయందు వసుచరిత్రము చంద్రికాపరిణయముల కథావస్తునిర్మాణమనువ్యాసములో నిటుల వ్రాసియున్నారము.

"వసుచరిత్రము కేవలము లక్ష్యగ్రంథము. అందుఁ గథాపరికరములు చాలినన్ని లేవు. శబ్దాలంకారములు, శ్లేష, వైదగ్ధ్యము, వర్ణననైపుణ్యము, పదాడంబరము మాత్రము కానవచ్చును. ప్రతిపద్యము నూతనభావమును వెల్లడించును. రసము వెదఁజల్లును. భాషామాధుర్యము తేటపడును గాని యాపద్యరత్నములఁ గథాసూత్రమున గ్రుచ్చ వీలులేదు. భట్టుమూర్తి సాహిత్యరసపోషకుఁడు సంగీతరహస్యనిధి. వసుచరిత్రములోని ప్రతిపద్యము నాయంశమునే వెల్లడించును. సాహిత్యరసపోషణమునకు రసపోషణమున నేమికొఱంత! భట్టుమూర్తి సాహిత్యసముద్రమును మథించి పద్యరత్నములను బ్రోగుచేసెను. సానఁబట్టెను. క్రొత్తమెఱుంగులు వెలయించెను. సాహిత్యపీఠమును బాలించు భారతికి రత్నసమూహము నొసంగెనే కాని కథాసూత్రమున నందచందముగ గ్రుచ్చి యొసంగఁజాలకపోయెను."

వసుచరిత్రమునందుఁ బ్రథమాశ్వాసమున సహజశోభాభిరామముగ నొప్పు వనలక్ష్మి యలంకృతమైనవిధము మనోహరతరముగఁ జెప్పఁబడినది. రెండవయాశ్వాసమునందలి శుక్తిమతీకోలాహలుల సంగమఘట్టము శ్లేషాలంకారవృతమై కవికిఁ గలయపారప్రతిభాతిశయమును వెల్లడించుచున్నది. కథాంశము నటుంచినచో కోలాహలుఁడు యౌవనోన్మాది. శుక్తిమతి భీరువుగ స్ఫురించును. ఇట శ్లేషరూపమున
నము జెప్పుటలోఁ గవి లోకోత్తరమార్గముల నన్వేషించెను. మూఁడవ

యాశ్వాసమునఁ గపటజటిలుని వంచనప్రసంగము సమయోచితవాగ్ధోరణి వేషధారణము మిగులఁ బ్రశస్తతరము. నాలుగవయాశ్వాసమునందలి మన్మథాద్యుపాలంభనములు మంజువాణిదౌత్యము గిరికాసాంత్వనము మొదలగువర్ణనాంశములు మనోజ్ఞతరములు. ఐదవయాశ్వాసమున నింద్రుఁడు వివాహసంధాన మొనరించి ప్రత్యేకనగరమును నిర్మించుట. చుట్టపక్కముల నాహ్వానించుట పెండ్లికూతునిఁ జేయుటతోఁ గడచినది. ఇందుఁ గథాంశము చాలతక్కువ. ఆఱవయాశ్వాసము యథాశాస్త్రీయవివాహము గిరికను బుద్ధులఁజెప్పి యత్తవారింటికిఁ బంపుట. వసురాజు తనగృహమున నొకశుభముహూర్తమునందు గిరికతో సమాగమోత్సవ మొనరించుకొనుట. ఈకథాంశముల రామరాజభూషణుఁడు శ్లేషనైపుణ్యము, వర్ణనసౌష్ఠవము, ఉచితపదప్రయోగము సంగీతసాహిత్యవేతృతచే నిండారఁజేసి వసుచరిత్రమున నద్వితీయముగా రచించెను. మనుచరిత్రభావచ్ఛాయలు శృంగారనైషధశృంగారశాకుంతలాభాదిపచ్ఛాయలు గొన్ని వసుచరిత్రమునఁ గలవు. అవి యన్నియు రామరాజభూషణుని బహుగ్రంథపరిచయమునకుఁ దార్కాణములు కాఁగలవు.

వసుచరిత్రమునందలి నాటకరీతులు.

రామరాజభూషణుఁడు ప్రకృతకావ్యమునఁ గొన్నియెడల నాటకరీతులను జూపి యాకాలమున రసికులకుఁగల నాటకపఠనాభిలాషను సూచించియున్నాఁడు. ఇట్టి నాటకరీతులు ప్రభావతీప్రద్యుమ్నమునందుఁ దక్క నితరగ్రంథములందుఁ గానరావు. విదూషకపాత్రమును రాజు వెంటగొని తెచ్చుట నాటకకవులయెడఁ గాననగును. అతఁడు రాజున కిష్టప్రియాఘటనమునఁ బాటుపడి కథాకల్పనమునకుఁ దీయరానిసంబంధము గలవానిగ నాటకకవులు సృజింతురు. రత్నావళి, శాకుంతలాదులు కేవల విదూషకప్రాముఖ్యమిళితములు. వసుచరిత్రమునందును నటులె విదూషకుని కార్యనైపుణ్యము నాటకానుకూలముగ నభివర్ణింపఁబడినది. వసురాజు గిరికను సందర్శింప నేతెంచుట, విదూషకుఁడు కుమారికల దరియ నేగుట, మంజువాణి రాజుచెంత నవకాశము పురస్కరించుకొనుట లోనగురసవత్కథాఘట్టములు మంజువాణిచే గిరికాజన్మవృత్తాంతమును వసురాజు చాటుననుండ విదూషకునకుఁ జెప్పించుట, పరస్పరసంభాషణసందర్భములు, నాటకరీతులను సమస్తవిధముల ననుకరించియున్నవి. చెలికత్తియలు గిరికపాటయందు యతిలియ్యమై యున్నదన యతివేషమున విదూషకుఁ డేతెంచుటయు, తుమ్మెదబాధ నపనయింపఁ గలహంసిరాదాయె ననుకొనునంతలో మాతృసఖియగు కలహంసివచ్చుటయు, దుష్యంతుని యొద్దనుండి శకుంతలవలె రాజువద్దనుండి గిరిక హేత్వంతరములఁ బురస్కరించికొని మోముద్రిప్పుచుఁ బోవుటయుఁ బ్రసంగావసరమున వసునామము విని గిరిక యూరడిల్లుటయు లోనగునవి నాటకానుకూలములగు పాత్రప్రవేశసూచనములుగాఁ జెప్పవచ్చును. ఇంతయేల కృత్యాదిపద్యము కథాసూచనముగను గృత్యంతి

మందలిశాంతిభరతవాక్యమగు ప్రశస్తియను నిర్వహణసంధ్యంగమునకుఁ బోలికగా నున్నవి. వసురాజు గిరికాదులను దర్శించుటకు వంచకయతివాక్సహాయమును బురస్కరించుకొని ప్రవేశించుట వందిమాగధస్తోత్రాదికముతో యవనికచాటు నుండి రాజపాత్రము వచ్చునటులుగా నీక్రిందివిధమున రామరాజభూషణుఁడు మనోహరముగాఁ జెప్పియున్నాఁడు.

మ. "ఇది సంధింపఁగ వేళ యంచు వసురాజేంద్రుండు నీరంధ్రనీ
రదవారప్రతిసీర వెల్వడినతారాభర్తలీలన్ లతా
చ్ఛదసంఛాదికఁ బాసి నిల్చె నెదుటన్ సారంగరాగభ్రమ
న్మదభృంగీరుతి వందిమాగధకథామాధుర్యముం దెల్పఁగాన్." 3 ఆశ్వా. ప 45

ఆకాలమున నాటకరంగములలోఁ బ్రధానపాత్రము బ్రవేశించినపుడు తెరలు కొంచెముకొంచెము సడలించువిధము క్రమక్రమముగాఁ బాత్రధారి యొక్క ముత్తెములపట్టయు నొసలు మోముదోఁచువిధము చంద్రోదయావసరమును బురస్కరించికొని యీక్రిందివిధముగ రామరాజభూషణుఁడు మనోహరతరముగా నభివర్ణించియున్నాఁడు.

మ. "హరిదంభోరుహలోచన ల్గగనరంగాభోగరంగత్తమో
భరనేపథ్యము నొయ్యనొయ్య సడలింపన్ రాత్రిశైలూషికన్
వరుసన్ మౌక్తికపట్టమున్ నిటలమున్ వక్త్రంబునుం దోఁచె నా
హరిణాంకాకృతి వొల్చె రేకయి సగం బై బింబమై తూర్పునన్." చతుర్థాశ్వాసము ప. 17

మఱియొకచోట రామరాజభూషణుఁడు తెర నాకస్మికముగా సడలింపఁగ థాపాత్రములు ప్రేక్షకులకు గోచరించువిధము గూడ నీక్రిందివిధముగాఁ జెప్పియున్నాఁడు. దీనిచేఁ గవికి నాటకసంప్రదాయములఁ బ్రబంధములలోఁ బ్రవేశ పెట్టుటలోఁగల యభిరుచి తేటతెల్లము గాఁగలదు.

సీ. ... ...

నిఖిలభూములు జవనిక వాపదారున నెదిరిన ట్లైతోఁచు నింతులార

చతుర్థాశ్వాసము. ప 59

ఇంతియగాక, మంజువాణి యాకాశయానమున బోవునపుడు భూమి కనిపించిన దని వర్ణించినభాగము శాకుంతలమునందలి దుష్యంతుఁడు రథ మాకాశము నుండి క్రిందికిదిగునపుడు గోచరించినభూమిని వర్ణించినశ్లోకముతోడను, కోలాహలాదులు అత్తవారింటికిఁ బంపునపుడు గిరికకు బుద్ధులు చెప్పుట శకుంతల నత్తవారింటికిఁ బంపుతఱి కణ్వమహర్షి బుద్ధులు చెప్పినశ్లోకముతోడను బోలియున్నవి. తెలుఁగునం దింకను రమణీయత సమకూర్పఁబడినది. ఇటులె కొన్నిచోటుల నింకను నాటకానుకరణములు నాటకచ్ఛాయలుగూడఁ గలవు.

వసుచరిత్రమునందుఁ గొన్ని లోపములుగూడ లేకపోలేదు. ముఖ్యములగు వ్యాకరణసంశయములు ఆలంకారికసందేహములు వ్యాఖ్యానమునం దాయాతావులలోఁ జర్చించియున్నారము. కావున విస్తరశంకచే నిట వదలితిమి. విదూషకపాత్రమువలని ప్రయోజనము కథయందుఁగలదు గాని యీపాత్రము కథారంగమునుండి నిష్క్రమించుపట్టునఁ గవి సామాన్యప్రబంధధర్మము నవలంబించెఁగాని తన కల్పనావిదగ్ధతఁ బ్రకటించియుండలేదు. మంజువాణి కనవసరముగా నాకాశసంచారశక్తి, కామరూపధారణశక్తి యొసంగి యాయమ కమానుషధర్మముల నారోపించుట, కొండొకచో సామాన్యసఖిగ నుపయోగించుటలోఁ గవియాశయము బోధయగుటలేదు. వసురాజు పరిజనులతో రథసహాయమునఁ జేరవచ్చిన ప్రదేశమునుండి వసురాజపురము జేరుటకు మంజువాణి కాకాశయానము జెప్పుటలోఁ బ్రయోజనమంతగాఁ గానరాకున్నది. గిరిక జాబిల్లి వెలుంగుల కోరువఁజాలక పరితాపము నొందుచున్నసమయమున మంజువాణి తదభీష్టక్రియాధుర్యయై

తే. "అబ్జముఖులార యేఁబోయి యచలకన్య, యుత్తలముఁ దెల్పి వసురాజుచిత్త మరసి
వత్తు నత్యంతశుభవార్తఁ దెత్తు (ననుచు, గొమ్మ హారంబు పూని యేఁగుటయు నిచట)."

పైవిధముగ నేగెను. తరువాత గిరిక నోదార్చుచు వసురాజుచెంతనుండి వచ్చితినని తాను కార్యవేగమ్మున నంబరోత్పతనకౌశల మొందితినని తెలుపుచు నధిష్ఠానపురవర్ణనము పిటవిటీకృత్యములు రాజశయనమందిరము తనపాంచాలీరూపధారణము రాజు పరితాపోక్తులు లోనగు ప్రబంధోచితప్రసంగముతోఁ జాలకాలము మంజువాణి గడపినది. రాజున కీపె యంత్రపాంచాలియైనదియు నాకాశగమనమున వచ్చినదియుఁ దెలియదు. కాని నే త్వరగఁబోయి తనయంగుళీయకము గిరిక కిచ్చి యాయమప్రాణము కాపాడుమనెను. దీనిని బట్టిచూడ మంజువాణి ప్రగల్భమునకు నాకాశగమన మొందినటుల వాకొనెననియె తలంపవలసివచ్చును. లేకున్న కవి వసురాజు విమానయానకథాంశము నాధారపఱచికొని ప్రబంధము రచించినట్లు మంజువాణి యాకాశయానశక్తి నాధారపఱచికొని వేఱొకప్రబంధము చెప్పవలసివచ్చును. ఎటులైననేమి మంజువాణి వసురాజువద్దకుఁ బోయివచ్చితినని చెప్పుప్రసంగము కథకు సంబంధించినదిగాఁ గనుపించుటలేదు. ఈయవకాశమును గల్పించుకొని కవి తనకవితాప్రతిభ జూపుటకుఁ గథాంశము గమనింపక యత్నించెనని తోఁచును. ఈస్వల్పాంశముల విడచితిమేని వసుచరిత్రము లోకోత్తరగ్రంథమనుటలో సంశయములేదు. వసుచరిత్రమును జూచి యనేకులు ఆనియమములఁ బాటించి ప్రబంధములు వ్రాసిరి. అట్టివానిలో చంద్రికాపరిణయము, శకుంతలాపరిణయము, రసికజనమనోభిరామము, కవిరాజమనోరంజనము లోనగునవి చాలవఱ కనుకరణగ్రంథములే. ఇంతియకాక యొకానొకసంస్కృతకవి వసుచరిత్రమును యథారూపముగ సంస్కృతీకరించి రామరాజభూషణుని భావములు

దేవభాషలోఁ బ్రతిష్ఠించెను. మఱియొకకవి కథాంశము కొలఁదిగానున్నను గవితాలోలుఁడై వసుచరిత్రమును సంస్కృతరూపకముగా మార్చెను. మఱియొకకవి పిల్లవసుచరిత్ర మను పేర వసుచరిత్రమునందలి ముఖ్యకథ చిన్నిప్రబంధముగా రచించెను. ఇవియన్నియు వసుచరిత్రము నెడ సమకాలికవిద్వల్లోకమునకుఁగల యాదరణాతిశయమునకు దృష్టాంతములు.

రామరాజభూషణుఁడు విద్యావివాదములలో జోక్యముగలుగఁ జేసికొని యవసరమైనచో దిట్టుకవితఁగూడఁ జెప్పి యాత్మౌన్నత్యమును బ్రతిష్ఠించుకొనెననియు నవసరము వెంట నెంతవిద్వాంసునేని దిరస్కరించుచుండెననియు అయ్యలరాజు రామభద్రున కీకవికి బద్ధమత్సర ముండియుండుననియు నీక్రిందిపద్యములవలన గ్రహింప నవకాశము కలుగుచున్నది.

శా. "గుత్తిం బుల్లెలు గుట్టి చంద్రగిరిలోఁ గూడెత్తి పెన్గొండలో
హత్తిక్ సత్రమునందు నెండి బలుదుర్గాధీశు తాంబూలపుం
దిత్తుల్ మోసి పదస్థులైనఘనులం దీవింప దీవించెదర్
మత్తారాతియయాతినాగమసుతుక్ మంత్రీశ్వరుం దిమ్మరున్." (చాటువు)

ఉ. "లొట్టయి దేటిమాట పెనులోభులతో మొగమోట మేల తాఁ
గుట్టక మున్న వృశ్చికముఁ గుమ్మరపు ర్వని యందురేగదా
పట్టపురాజు బట్టి సరిపల్లె సరాసరి యీాయకున్న నే
తిట్టకమాన ... ...
... ...
రట్టడిభట్టుమూర్తి కవిరాయని మార్గ మెఱుంగఁ జెప్పితిన్." (చాటువు)

సీ-గీ. "రామరాజవిభూషణరత్నఖచిత, చారుమస్తకలాపాదిహారివాక్య
గౌరవము పెక్కుభంగుల గణనఁ జేసి." అప్పకవీయము.

ఉ. "గట్టిగ భట్టుమూర్తి పగఁగట్టి ప్రబంధము లెన్నిచెప్పినన్
గిట్టక యుగ్గ లెన్నియుఁడికించిన రాము గుఱించి నెమ్మదిం
బుట్టిన చింతఁ దత్కథనపూర్వముగా రచియించి గెల్పుచే
పట్టిన రామభద్రకవిఁ బ్రస్తుతిఁజేసిన పున్నె మబ్బదే." నాగ్నజితీపరిణయము.

రామరాజభూషణుని శ్రేయస్సు సహింపకయో రామరాజభూషణుఁడు ఎదటివారిని దిరస్కరించు స్వభావముగలవాఁడగుటవలననో సమకాలికకవు లితని ద్వేషించినటులఁ బై పద్యములు తార్కాణ యగుచున్నవి. అల్లసాని పెద్దనార్యునకు రామరాజభూషణుఁడు శిష్యుఁడని జనపరంపర చెప్పుటయేగాక ఆంధ్రకౌముదియందు సమకాలికుఁడగు తద్గ్రంథకర్త వ్రాసియున్నాఁడు. "నానాసూనవితానవాసనల" యనుపద్యము ముక్కుతిమ్మనదనియు "మోహోపదేశతమోదితములైన" అనుపద్యము అయ్యలరాజు రామభద్రకృతమనియు ఈ రెండుపద్యములు వసుచరి

త్రములోఁ జేర్పఁబడుటకుఁ గథాంతరములుగల వందురుగాని యవి విశ్వసనీయములు కావు.

హరిశ్చంద్రనలోపాఖ్యానము.

రామరాజభూషణుని గ్రంథములలో నీద్వ్యర్థికావ్యముగూడ నొకటియై యున్నది. రచనాకాలమును జెప్పియున్నారముగాన యీవ్యాసము పూర్తిచేయులోఁగా నీగ్రంథమునుగూర్చి యించుక చెప్పుట చాలయవసరము. చరిత్రమును బరిశీలించినను రచనావిధానమును జూచినను హరిశ్చంద్రనలోపాఖ్యానము రాఘవపాండవీయము రచింపఁబడిన పిదప రామరాజభూషణుఁడు వ్రాసియుండునని మానమ్మకము. పింగళిసూరకవి తనపొత్తము తెలుఁగుబాసలో మొదటిదిగాన రచనమునందలి కష్టములు రచనావిధానమునుగూర్చి ముచ్చటించినాఁడు. అట్టిప్రసంగము హరిశ్చంద్రనలోపాఖ్యానమునందు గానరాదు. కొన్నికొన్ని స్థానములయందు రామరాజభూషణుఁడు పింగళిసూరకవి రాఘవపాండవీయమునందుకంటె హరిశ్చంద్రనలోపాఖ్యానమునందె ప్రాగల్భ్యము చూపినాఁడు. అంతమాత్రమున హరిశ్చంద్రనలోపాఖ్యానము రాఘవపాండవీయము నతిక్రమించఁజాలదు. గౌరనకవికాలము స్పష్టముగఁ బదమూఁడవశతాబ్దమని తెలియుచుండ నతఁడు హరిశ్చంద్రద్విపదకుఁ గథాంశము హరిశ్చంద్రనలోపాఖ్యానమునుండి గ్రహించెననుటయు రామరాజభూషణుని కీవలివాఁడై యుండుననుటయు నవిచారవాక్యములు. హరిశ్చంద్రనలోపాఖ్యానము, ఐదాశ్వాసముల చిన్నగ్రంథము. పరస్పరసాదృశ్యము లేని నలహరిశ్చంద్రకథాంశములను గలిపిచెప్పుట సామాన్యకార్యముగాదు. కథలను రెంటిని జోడించునపుడు రామరాజభూషణుఁడు చూపిననైపుణ్య మనన్యసామాన్యమైనది. సూరకవి వర్ణనాంశముల కెడమీయక రాఘవపాండవీయమునందుఁ గథాకల్పనమునకె యెక్కుడుపాటుపడెను. రామరాజభూషణుఁ డట్లుగాక కథాంశము నటులుంచి తన ద్వ్యర్థికావ్యమున అష్టాదశవర్ణనలకుఁ దావొసంగి కథాంశము తగ్గించినాఁడు. కావుననే హరిశ్చంద్రనలోపాఖ్యానము పాఠకలోకము నాకర్షించుచున్నది.

వసుచరిత్రము—వ్యాఖ్య.

ఈయుత్తమగ్రంథము వ్యాఖ్యానసహాయము లేకున్నచోఁ గవిభావములన్నియు నవగతమగుట కష్టము. పలువురీగ్రంథమునకు వ్యాఖ్యలు వ్రాసిరిగాని యందు నిజామురాష్ట్రమునందలి లేములవాడనివాసియు రాజేశ్వరస్వామిభక్తుఁడును బహుగ్రంథకర్తయునగు సోమనాథకవికృతమగు విద్వద్రంజనీవ్యాఖ్య విపులముగ సరసముగా నున్నటులఁ దోఁచుచున్నది. ప్రాచీనముద్రితప్రతులం దన్నింటియందును సోమనాథునివ్యాఖ్యానము సంగ్రహింపఁబడి ముద్రితమైయున్నది. గద్యమునందుఁగూడ ముద్రాపకులు సోమకవివ్యాఖ్యయందలి ముఖ్యాంశములు చేర్చితి

మని వ్రాసికొనిరి. సోమనాథునివ్యాఖ్య సంపూర్ణప్రతి మా కెటను లభింపదయ్యెను. ముద్రితవ్యాఖ్యాభాగ మసమగ్రముగ నుండెను. బ్రౌనుదొరవారు చిరకాలము క్రిందట వసుచరిత్రమునకు జూలూరు అప్పయ్యపంతులువారిచే వ్యాఖ్య వ్రాయించి ప్రకటించిరిగాని యది కేవలప్రతిపదార్థరూపమైనదిగఁ గోచరించెను. అందుచే సర్వజనోపయోగార్హ్యముగా సోమనాథకవి వ్యాఖ్యానమునందులేని యనేకా పూర్వాంశములు దృష్టాంతములు అలంకారసమన్వయములు వ్యాకరణసిద్ధాంతములు సమకూర్చి యీముద్రణమున వ్యాఖ్యానమునందు బ్రహ్మశ్రీ వావిళ్ల. వేంకటేశ్వరశాస్త్రిగారి యాజ్ఞానుసారముగా మిగుల విపులముగా మేము వ్రాసియున్నారము. ఇంక విస్తృతిఁ జేయవలసియున్నను బ్రకాశకులయాజ్ఞానుసార మింతతో ముగింపవలసివచ్చినది. సోమనాథకవివ్యాఖ్యానమునం దుదాహరించని యనేకసంస్కృతాంధ్రో దాహరణములను సోమనాథుని కీవలిగ్రంథములనుండి కొన్నిదృష్టాంతములను నీవ్యాఖ్యయందు మే మొసంగి వ్యాఖ్యానమమాత్రము కృతజ్ఞతాసూచకముగా సోమనాథునిదిగనే యుంచితిమి. భవిష్యత్పరిశోధకు లుదాహృతగ్రంథములన్నియు సోమనాథుని వని నిశ్చయించి కాలనిర్ణయమునఁ బ్రమాదపడుదురేమో యని మేముచేసిన స్వల్పసేవ నిటఁ బ్రశంసించుకొనవలసివచ్చినది. పూర్వముద్రణమునందులేని యనేకముఖ్యాంశము లీముద్రణమునందుఁ జేర్చి వ్యాఖ్యానమువిపులీకరణము గావించితిమిగాన రసజ్ఞులగు భాషావిదులకు మే మొనరించినకృషి పూర్వవ్యాఖ్యతోఁ బోల్చి పరిశీలించినఁ దెలియగలదు. ప్రత్యంతరములతో మూలగ్రంథమునుబోల్చి కవ్యభిప్రాయానుసారముగాఁ గొని పాఠములు నిర్ణయింపవలసియున్నది. సోమనాథుని సంపూర్ణవ్యాఖ్యాసహాయమున నింకను వ్యాఖ్యానము విపులముచేయవలసియున్నదిగాని చిరకాలముక్రిందనే వసుచరిత్రము ప్రతులు చెల్లిపోవుటవలనఁ ద్వరలో నూతనముద్రణము ముగింపకున్నఁ బాఠకలోకము నిరుత్సాహులగుదురని యిప్పటి కీవిధముగా నీగ్రంథరాజమును బ్రచురణమునకు సిద్ధపఱచితిమి.

ఆంధ్రభాషయందును సంస్కృతభాషయందును గల యమూల్యగ్రంథరాజములను విపులవ్యాఖ్యలతో నుచితములగు నవతారికలతోఁ బరిశుభ్రముగ ముద్రించుచు సారస్వతసేవయే లక్ష్యమునం దుంచుకొని యాంధ్రమాతృపరిచర్యగావించుటలోఁ దనివిసనని బ్రహ్మశ్రీ వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రిగారి సదుద్యమమే యీపీఠిక వ్రాయుటకు వ్యాఖ్య విపుల మొనర్చుటకుఁ బ్రధానకారణమగుటచే ఆంధ్రలోకముతోఁబాటు మేమును వారియెడఁ గృతజ్ఞుల మగుచున్నారము.

ఇట్లు, భాషాసేవకులు,
శేషాద్రిరమణకవులు,
శతావధానులు.

నందిగామ,
10-1-26

శ్రీ ర స్తు.

వసుచరిత్రము, సవ్యాఖ్యానము

ప్ర థ మా శ్వా స ము.



భూపుత్రీ వివాహవేళ నిజమం◆జీరాగ్రరత్న స్వలీ
లాభివ్యక్తి వరాంఘ్రి రేణుభవక◆న్యాలీల యంచున్మదిం
దా భావింప శుభక్రమాకలనచేఁ ◆ దద్రత్నముం గప్పుసీ
తాభామాపతి ప్రోవుతం దిరుమలేం◆ద్ర శ్రీమహారాయనిన్. 1

అవతారిక:—పవననందన కరుణాసమాసాదిత సంస్కృతాంధ్రకవితాసామ్రాజ్యధురంధరుండును సంగీతసాహిత్యవిదుండును నగు రామరాజభూషణమహాకవి "శ్లో. కావ్యం యశసేఽర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే, సద్యః పరనిర్వృతయే కాంతాసమ్మితతయోపదేశయుజే" అను కావ్యప్రకాశకారుని అలంకారవచన ప్రమాణానుసారముగ సమస్తఫలసాధన భూతమగునని తలంచి 'కావ్యాలాపాంశ్చ వర్జయేత్' అను నియమమును గ్రహించి వసుచరిత్రమను లోకోత్తరశృంగారకావ్యరత్నము రచింప నుద్యోగించి "ఆశీర్నమస్క్రియావస్తునిర్దేశో వాపి తన్ముఖం" అను నాచార్యదండివాక్యానుసారముగ గావ్యారంభము ఆశీర్వాదరూపముగనైనను, నమస్కారరూపముగనైనను, వస్తునిర్దేశరూపముగనైనను గావచ్చునుగాన నాశీర్వాదరూపముగ నీవిధముగ గ్రంథారంభముఁ గావించెను.

శ్రీ=లక్ష్మీస్వరూపురాలైన, భూపుత్రి=పుడమికూఁతురైన సీతాదేవి, 'శ్రీరూపా భూపుత్రీ శ్రీభూపుత్రీ' అని సమాసము. (శ్లో. 'రాఘవత్వేఽభవత్సీతా రుక్మిణీ కృష్ణజన్మని, అన్యేషు చావతారేషు విష్ణోరేషాఽనపాయనీ' అను ప్రమాణముచేత లక్ష్మికి సీతాత్వము) వివాహవేళన్=పెండ్లికాలమందు, అనఁగా వరుఁడును దాను నొక్కచోఁ గూర్చున్నసమయమం దనుట. నిజ=తనసంబంధమైన, మంజీర=అందెయొక్క, ని. 'పాదాఙ్గదం తులాకోటి ర్మఞ్జీరో నూపురోఽస్త్రియామ్, హంసకః పాదకటకః' అని యమరము. అగ్రరత్న=శ్రేష్ఠమైన రత్నమందుఁగల, అనఁగా ముఖమణియందుఁ గలయనుట. ని. 'పరార్ధ్యాగ్రప్రాగ్రహరప్రాగ్ర్యాగ్ర్యాగ్రీయమగ్రియమ్' అని యమరము. స్వలీలా=స్వకీయమైన విలాసాకృతియొక్క, అభివ్యక్తిన్=ప్రతిబింబమును, తనమంజీరాగ్రరత్నమందుఁ బ్రతిబింబించిన తనస్వరూపము నని యర్థము. ఇక్కడ లీలాశబ్ద మాకారపరము. వర=పెనిమిటియైన శ్రీరామమూర్తియొక్క, అంఘ్రిరేణు=పాదధూళివలన, భవ=పుట్టిన, కన్యా=కన్నియయొక్క, లీల యంచున్=విలాసమని, ఇక్కడ లీలాశబ్దము విలాసపరము. ని. 'లీలావిలాసక్రియయోః' అని అ. శ్రీరాములపాదరేణుస్పర్శముచేతఁ బాషాణము, అహల్యాదేవిరూపమును వహించెఁ గావున మంజీరాగ్రరత్నంబును బాషాణజాతి యగుటంబట్టి తత్పాదరేణుస్పర్శముచేత స్త్రీరూపమును వహించెనో యనియాశయము. మదిం దా భావింపన్=మనస్సునఁ దా నూహింపఁగా, శుభక్రమాకలనచేన్=

శుభ=పెండ్లికాలమందలి, క్రమ=పాదవిన్యాసముయొక్క, ఆకలనచేన్ = చేయించుటచేత, తద్రత్నమున్=ఆమణిని, కప్పు=మఱుఁగుచేయునట్టి, సీతాభామాపతి = సీతాంగనానాథుఁడైన శ్రీరామస్వామి, తిరుమలేంద్ర శ్రీమహారాయనిన్=తిరుమలదేవరాయశ్రేష్ఠుని, ప్రోవుతన్=రక్షించుఁగాత, అనికృతిపతి కాశీర్వచనము.

సీతాదేవి తనవివాహకాలమునందుఁ దనయందియముందుఁగల రత్నమునందుఁ బ్రతిబింబమును గాంచి శ్రీరామునిపాదస్పర్శనమువలన మంజీరరత్నము స్త్రీరూపము దాల్చుటచే నాయమలీల గాన వచ్చుచున్నదని తలంపఁగా సన్నెకల్లుఁ ద్రొక్కించునెపముచే మంజీరముఖస్థమగు రత్నమును మాటు పఱచి సీతాదేవిభ్రాంతిని బోఁదోలిన శ్రీరామచంద్రుఁడు కృతికర్తయగు తిరుమలరాయప్రభునకు సమస్తైశ్వర్యములు ప్రసాదించుఁగాత మనితాత్పర్యము.

ఇక్కడ వివాహవేళ యనఁగా సన్నెకల్లు ద్రొక్కించువేళ, క్రమ మనఁగాఁ బాదవిక్షేపము 'క్రముపాదవిక్షేపే' అని ధాతువు.

విద్వజ్జనరంజనియను వ్యాఖ్యానములో సోమకవి క్రముపాదవిక్షేపేయను ధాతువుననుసరించి సన్నెకల్లు త్రొక్కించుట యనుమిషచే రాముఁడు రత్నము మాటుపఱచెననుట ప్రకారాంతరమనియు, సన్నెకల్లు ద్రొక్కుతఱి సీత నిలచియుండవలెనుగానఁ బ్రతిబింబము కానరాదనియు, శుభక్రమాకలనమునకు శుభపాదవిక్షేపణమను నర్థము చెప్పినయెడల "క్లిష్టంతదావగతి ర్దూరదూరాయతోభవేత్" అను లక్షణానుసారముగాఁ గ్లిష్టనామకదోషము ప్రాప్తించుననియుఁ గవిభావ మదియేయైనఁ బదక్రమాకలనమనియే వ్రాసియుండుననియు వాకొని శుభక్రమాకలనమునకు శుభలీల యను నర్థము సాధించియున్నాఁడు కాని శుభ, క్రమ, ఆకల మను మూఁడుశబ్దముల కర్థమువదలి శుభలీల యనుట సాభిప్రాయము కాఁజాలదు. క్రమమనఁ బాదవిక్షేపమనుట ప్రయోగరూఢమగుటచేఁ గ్లిష్టనామదోషమున కిట నవకాశము కానరాదుగానఁ బదక్రమాకలన మనవలసిన యవసరము కానరాదు. సీత భ్రాంతిని విస్తరించి వర్ణించినటుల రాముఁడు గావించిన భ్రాంతినివారణముగూడ విస్తరించి వర్ణించుట యావశ్యకముగావున సన్నెకల్లు త్రొక్కించుట యిట ననుకూలముగనున్నది. వివాహవేదికపై నున్నతఱి సీతామంజీరస్థప్రతిబింబము సన్నెకల్లు త్రొక్కుటకు వివాహానంతరము సాచినపుడును సన్నెకల్లు త్రొక్కునపుడును మఱుగుపఱచె ననుటలో సరసముగలదు. అపుడు శంక - శంకానివారణము విపులముగఁ జెప్పినటులగును. కావున నిప్పట్లఁ బూర్వాధునిక వ్యాఖ్యాతలమతమే సోమకవి మతముకంటె గణనీయము.

"ప్రియోపలాలితానిత్యం స్వాధీనపతికామతా, ఏకాయత్తోఽనుకూలస్యాత్" అనులక్షణమువలన భర్తృలాలితయై ప్రణయకోపము నుజ్జగించిన సీతాసాధ్విస్వాధీనపతికయనియు నేకపత్నీవ్రతుఁడును ఏకాయత్తుఁడునగు శ్రీరామచంద్రమూర్తి అనుకూలనాయకుఁడనియు నెఱుంగఁ జనును.

ప్రతిభాశాలియగు రామరాజభూషణుఁ డీపద్యమునఁ గథాసూచనము గావించియున్నాఁడు. మంజీరాగ్రరత్నమునందలి ప్రతిఫలమువలన శుక్తిమతి కోలాహలుల కలయికవలనఁ గలిగిన గిరికాజనన ప్రకారమును, సన్నెకల్లు త్రొక్కించుటఁ దెలుపు శుభక్రమాకలనమువలన వసురాజు కోలాహలుని గోటితో మీటుటయు సువ్యక్తము లగుచున్నవి. ఇదియె కావ్యార్థసూచన మనఁబడును. సీతారాముల

కళ్యాణావసరము ప్రకృతపద్యమునఁ బ్రస్తావితమగుటచేఁ గృతికర్తయగు తిరుమలరాయనికి సమస్త శుభప్రాప్తి యగుననియు సీతారాముల ప్రణయకోపము క్షణములో నుపాయాంతరముచే విచ్ఛిన్నమైనటుల తిరుమలరాయనిరాజ్యమునఁ దోఁచు సామాన్యారిష్టములు తొలఁగి శుభప్రాప్తి యగుననియుఁ గవి యాశయము. రామునిగూడ సీతాభామాపతి యనుటవలనను ఇందు సీతకుఁ బ్రాముఖ్య మొసంగఁబడుటవలనను సీతాపురుషకార మిట సూచితము.

కావ్యారంభమున శ్రీకారము శుభదాయకమనుట కీక్రిందిపద్యములు దృష్టాంతములు కాఁగలవు.

తే. "వేదములకెల్ల నోంకార మాదియైన, కరణి కృతులకు నెల్ల శ్రీకార మాది
కానఁ గవివరులెల్లను దాని దక్క, నితరవర్ణంబు లిడరు సత్కృతుల మొదల."

క. పదపడి శ్రీకారము కృతి, మొదల నిలచి దోషపుంజము లడంచి శుభం
బొదవించుఁ బరుస మినుమును, గదిసి సువర్ణంబు సేయుకరణిక్ ధరణిక్.

ఈ పద్యమున మొదటిచరణమందు మంజీరశబ్దమునకు, 'మఞ్జురుచ్యమీరయతీతిమఞ్జీరః' అని వ్యుత్పత్తి విచారింపవలయు 'మంజు ఈరయతి' యన్నచోట 'ఇకోయణచి' అను పాణినిసూత్రము చేత మంజుశబ్దపు కొననున్న యుకారమునకు వకారము ప్రాప్తింపఁగా మంజీరశబ్దము శకంధ్వాదిగణములోనిది గనుక, 'శకన్ధ్వాదిషు పరరూపం వాచ్యమ్' అను వరరుచివాక్యముచేత నది యపవాదింపఁబడి యుకారమునకుఁ బరరూప మీకారము వచ్చినది.

శ్లో. 'శకన్ధురథకర్కన్ధూః కుద్దాలోఽలక్తపర్కటీ, లాఙ్గలీషా మనీషాచ హలీషా చ పతఞ్జలిః,
కుత్కీలోష్ణీష మంజీర మస్తిష్క కులటాదయః, తథా వృకన్ధు సీమన్తాశ్శకన్ధ్వాదిగణే స్మృతాః.'

అన్నందున నివి మొదలైన పదములయందు హల్లునకును మీఁద నదికిన యచ్చునకును విశ్రమము చెల్లును గనుక మంజీరశబ్దమందు హల్లయిన జకారమునకు విశ్రమము చెప్పినాఁడు ఇందుకు లక్షణము.

క. 'విరతికి వ్యాకరణమునను, వరరుచిచేఁ జెప్పఁబడినవాక్యమువలనం
బరరూప మనిత్యంబై, పరగు శకంధ్వాదులకు నుభయముం జెల్లుక్'

అని యప్పకవి. ఇది పరరూపయతి యనిపించుకొనును. పద్యాదియందు మగణము శ్రీప్రదము; 'మో భూమి స్త్రిగురు శ్ర్నియం వితనుతే' అని లక్షణము. తా భావింప ననుచో భ్రాంతిమదలంకారము.

శార్దూలవిక్రీడితవృత్తము:—

'సారాచారవిశారదాయినయతిక్ శార్దూలవిక్రీడితా
కారంబై మసజమ్ము లిమ్ముగ సతాగప్రాప్తిమైఁ జెల్వగుక్.'

సీ. సకలలోకాభినం♦ద్యకలాకలాపంబు దొరయు నెమ్మోముచం♦దురునితోడ
బహుదివ్యఫలపరి♦పాకసౌభాగ్యంబు నెరపు కెమ్మోవిమా♦నికముతోడ
నవవయశ్శ్రీనిధా♦నంబు లై తగునురోభవసుధాపూర్ణకుం♦భములతోడ
నమ్లానసుమమాలి♦కాభిరూప్యముఁ దాల్చు లలితభుజాకల్ప♦లతలతోడ

తే. నదరి జనకాబ్ధిసీమఁ రా◆మాభిధాన
హారి కహీనగుణప్రోత◆హారశరాస
గిరిమథనయత్నమునఁ దోఁచు◆సిరి యశేష
రాజ్యము లొసంగుఁ దిరుమల◆రాయమణికి. 2

ఈ పద్యములోఁ గర్తృపదము సిరి యని చెప్పుటచేత సీతాదేవియందు లక్ష్మీత్వారోపణముఁ జేసి యర్థద్వయము గలుగఁ జెప్పినాఁడు.

ఎట్లనఁగా, సీతాపరమైన యర్థము. సకలలోక=సమస్తజనులచేత, అభినంద్య=మిక్కిలి స్తోత్రముచేయఁదగిన, కలా=లావణ్యమనెడు, కలాపంబుల్=భూషణమును, దొరయు=పొందుచున్న, నెమ్మోము=చక్కనిముఖమనెడి, చందురునితోడన్=సోమునితోడఁగూడను, [లక్ష్మీపరమైన యర్థము.] సకలలోక=సమస్తభువనములచేత, ని. 'లోకస్తు భువనే జనే' యని అ. అభినంద్య=మిక్కిలియుఁ గొనియాడఁదగిన, కలా = షోడశకళలయొక్క, కలాపంబుల్=సమూహమును, ని. 'కలాపో భూషణే బర్హే తూణీరే సంహతా వపి' యని అ. దొరయు=పొందుచున్న, నెమ్మోము=తనముఖమునుబోలిన, చందురునితోడన్=సోమునితోడఁగూడను,

సీతాదేవి జనుల కొనియాడికలకునికిపట్టగుచు లావణ్యకళలచే నలరారు మోమనుచందమామచేఁ బ్రకాశించుచున్నదనియు లక్ష్మీదేవి షోడశకళాభిరాముఁడును హృదయాహ్లాదకరుఁడునగు చంద్రుని బోలిన ముఖముగలదనియు భావము. ఇందుఁ గ్రమముగా లక్ష్మీముఖము మోవి స్తనములు భుజములు సముద్రసంభవములతోఁ బోల్పఁబడుట గమనింపఁదగినది.

[సీ] బహు=అధికములైన, దివ్యఫల=కల్పవృక్షఫలములయొక్క, పరిపాకసౌభాగ్యంబుల్=పరిపక్వసౌష్ఠవమును, అనఁగా మాధుర్యమును, 'దివి భవాని దివ్యాని' యని వృత్తి. 'దిగాదిభ్యో య' త్తని యత్ప్రత్యయము. నెరపు=ప్రకటించుచున్న, కెమ్మోవి=ఎఱ్ఱని పెదవియనెడి, మానికముతోడన్=మాణిక్యముతోడఁగూడను, [ల] బహు=అనేకులైన, దివ్య = దేవతలయొక్క, ఫలపరిపాకసౌభాగ్యంబుల్=వాంఛితార్థసిద్ధియొక్క సుభగత్వమును, నెరపు=ఘటించుచున్న, కెమ్మోవి=తనయరుణాధరమును బోలిన, మానికముతోడన్ = చింతామణిరత్నముతోడఁగూడను,

సీతాదేవి వేల్పుమ్రాఁకుల ఫలరుచుల కీడుజోడగు పెదవియనుకెంపుతో నలరారుచున్నదనియు లక్ష్మీదేవి దేవతలకుఁ గామితములొసంగుచుఁ బ్రజ్వరిల్లు చింతామణిని బోలిన మోవితో నలరారుచున్నదనియు భావము. మోవియనక కెమ్మోవియనుటచేఁ బెదవి యెఱ్ఱగానున్నదనియు నందుచే సజీవకాంతిగల చింతారత్నమును గెంజాయయందుఁ బోలియున్నదని తెలియనగును.

[సీ] నవ = క్రొత్తయైన, వయశ్శ్రీ = యౌవనలక్ష్మికి, నిధానంబులై తగు=నివాసములై యొప్పుచున్న, ఉరోభవ = కుచములనెడు, సుధాపూర్ణకుంభములతోడన్=అమృతపూర్ణకలశములతోడఁగూడను, [ల] నవవయశ్శ్రీ=అభినవయౌవన మనెడు ధనమునకు, నిధానంబులై తగు=నివాసస్థానములై యొప్పుచున్న, ఉరోభవ=తనకుచములనుబోలిన, సుధాపూర్ణకుంభములతోడన్=అమృతపూర్ణకలశములతోఁగూడను, అమృతపానముఁ జేసినవా రెల్లప్పుడును యౌవనము గలవారై యుందురని భావము.

సీతాదేవి వయసు పెంపుఁ దెల్పు నిబ్బరంపుటుబ్బుగుబ్బలనెడి యమృతకుంభములతో నొప్పుచున్నదనియు లక్ష్మీదేవి యెలజవ్వనమను ధనమునకుఁ గని యనఁదగి యమృతపూర్ణకుంభములతో జత యగు కుచములతోఁ దనరుచున్నదనియుఁ భావము. క్షీరసముద్రము దఱచినపుడు జనించిన సుధాభాండ మొకటియై యుండ నిట బహుత్వమునకుఁ గారణము విచార్యము.

[సీ] అమ్లాన=వాడని, సుమమాలికా=పూవుదండలయొక్క, ఆభిరూప్యముఁ=చక్కఁదనమును, అభిరూపము=చక్కనిది. అభిరూపముయొక్కభావ మాభిరూప్యము. ని. 'ప్రాప్తరూపసురూపాభిరూపాబుధమనోజ్ఞయోః' అని అ. తాల్చు=వహించుచున్న, లలిత=ఒప్పుచున్నట్టి, భుజ=బాహువులనెడి, కల్పలతలతోడన్=కల్పవృక్షపుతీఁగెలతోఁగూడను, [ల] అమ్లాన=ఎప్పటికిని వాడకుండునట్టి, సుమమాలికా=పుష్పసమూహములయొక్క, ఆభిరూప్యముఁదాల్చు=సౌందర్యమును వహించుచున్న, లలిత=సుందరములైన, భుజ = తనబాహువులనుబోలిన, కల్పలతలతోడన్ = కల్పవృక్షపుతీఁగలతోఁ గూడను, అడరి=ఒప్పి,

సీతాదేవి వాడిపోవని పూవుదండల పొంకముగల భుజములను కల్పలతికలతో నలరారుచున్నదనియు లక్ష్మీదేవి యెన్నటికి వాడిపోవనిపూవులతో నిండారుచున్న కల్పలతలకు సాటియగు భుజములతో నొప్పుచున్నదనియుభావము. కల్పలతాప్రసవములు మానససరోవర కమలములు వాఁడిపోవనుట ప్రసిద్ధము. ఆటులె వేల్పుగరిత యగుకతన లక్ష్మిసైతము సదా యౌవనలక్ష్మితో నలరుననుట యూహ్యము.

[సీ] జనక=జనకమహారాజనెడి, అబ్ధిసీమన్=సముద్రప్రదేశమందు, రామాభిధానహరికిన్=రాముఁడనుపేరుగల విష్ణుమూర్తికి, అహీన=అధికసారసమేతమయిన, లేక, సర్పములకుఁ బ్రభువగు శేషరూపమయిన, 'అహీనాం సర్పాణాం, ఇనః, ప్రభుః, అహీనః, శేషః, వాసుకిశ్చ' అని సమాసము. ని. 'ఇన స్సూర్యే ప్రభౌ' అని అ. గుణ = నారిచేత, గుణ మనఁగా నారియుఁ ద్రాడును, ని. 'గుణ స్త్వావృత్తిశబ్దాదిజ్యేన్ద్రియాముఖ్యతన్తుషు' అని వైజయంతి. ప్రోత=కూర్పఁబడిన, హరశరాసగిరి యనెడుపదమునకు నర్థద్వయము. హరశరాస=శివధనుస్సనెడు,గిరి=మందరగిరియొక్క యనికానీ, హరశరాసగిరియని యేకపదముచేసి హరశరాసరూపమేరుగిరి యనెడు హరశరాసగిరియొక్క యనిశ్లిష్టరూపకముచేసిగానీ చెప్పవచ్చును.హరశరాసగిరియనఁగామందరగిరి యనుటకు వ్యుత్పత్తియెట్టులనఁగా, హరశర మనఁగా, శివునకు బాణమయిన విష్ణువు. కూర్మరూపముచేత నవతరించునపు డతనియందు నిలిచియున్నగిరి కాఁగా హరశరాసగిరి, దానియొక్క, మథనయత్నమునన్=చిలికెడువూనికయందు, తోఁచు=సంప్రాప్తమయిన, సిరి=సీతయనెడులక్ష్మి, [ల] జనకాబ్ధిసీమన్=జన్మస్థానమయిన క్షీరసముద్రగర్భమునందు, రామాభిధానహరికిన్=మనోహరములైన నామములుగల విష్ణుమూర్తికి, అహీన=సర్పరాజైన వాసుకి యనెడు, గుణ=కవ్వపుఁద్రాటిచేత, ప్రోత=కూర్పఁబడిన, హరశరాసగిరి=మందరగిరివలన నయిన, మథనయత్నమునన్=త్రచ్చుటచేత, తోఁచు=ఆవిర్భవించిన, సిరి=లక్ష్మి, లక్ష్మీస్వరూపురాలయినట్టి సీతాదేవి,

సీత రాముఁడను విష్ణునకు హరశరాసనభంగవశమున లభించెననియు లక్ష్మీదేవి వాసుకిని గవ్వపుఁద్రాడుగఁజేసి మందరగిరిచే సముద్రము మథింపఁగా జనించెననియు భావము. లక్ష్మి సముద్రజాత

యగుటచేఁ జంద్రునికిఁ దనమోమునకుఁ జింతామణికిఁ దనమోవికి అమృతకుంభములకుఁ దనకుచములకుఁ గల్పలతలకుఁ దనభుజములకుఁ బోల్కి గడింపఁగల్గెను.

తిరుమలరాయమణికిన్=తిరుమలరాయశ్రేష్ఠునికి, అశేష రాజ్యములు = సమస్తరాజ్యములను, ఒసంగుత్=ఇచ్చుఁగాత మని యాశీర్వచనము.

లక్ష్మీదేవిముఖము చంద్రునిబోలియుండుటచే నిఖిలభువన సంతోషకరమనియు మోవి చింతామణినిబోలియుండుటచే వరప్రదానమునకుఁ దగినదియనియు స్తనములు అమృతకుంభములఁ బోలియుండుటచేఁ జిరంజీవత్వముఁ గృపసేయ సమర్థురాలనియు భుజములు కల్పలతికలఁ బోలియుండుటచే నభీష్టసంపదల నొసంగసమర్థురాలనియు గ్రాహ్యము. ఇట్టియమానుష తేజోవిభవ సమృద్ధురాలగుటచేఁ దిరుమలరాయనికి సమస్తసామ్రాజ్యము లొసంగుఁగాక యని కవియాశయము.

పూలతోనున్న కల్పలతికలకు భుజములకుఁ బోలికచెప్పుటవలనఁ దీఁగకు భుజములకునుం బూవులకును హస్తములకును బోలికయని తెలియనగును.

పద్యాంత చరణాంత పదాంత నకారలోపమునకుఁ గారిక. శ్లో. 'వాక్యావసానగస్యాస్య ల్లోపో న ప్రాయశోఽత్ర హి' యని యథర్వణాచార్యులు. వాక్యమనఁగా నిచట పదంబు, సీసాదులయందు వాక్యంబు ప్రతిపాదంబును, వృత్తాదులయందుఁ బూర్వార్ధమును నుత్తరార్ధంబు ననువాక్యద్వయంబునుగాఁ దెలియునది. ఈపద్యమున శ్లేష సంకీర్ణరూపకము. సీసలక్షణము.

'అనిమిషపతి షట్కముపై, నినయుగ మగు నంఘ్రి దాన నిరుచోట్ల యతుల్
సనునది నాల్గడుగులఁ బై,నొన నొకగీతియు నమర్చినొన సీస మగున్.'

మ. సకలామోదకతాళవృత్తగతులన్ ♦ సంగీతసాహిత్యనా
మకవిద్యాయుగళంబు పల్కుఁజెలికిం ♦ బాలిండ్లజోడై సిరుల్
ప్రకటింపన్ నఖరేఖలందు నలఘు♦ప్రస్తారము ల్సేయును
ర్వికలాకాంతుఁడు ప్రోచుఁ దిర్మలమహా♦రాయక్షమావల్లభున్. ౩

ఈపద్యమునఁ గుచపరంబుగను విద్యాపరంబుగను నర్థద్వయము గలుగఁజెప్పినాఁడు. ఎట్లనఁగా [కుచపరమయిన యర్థము], సకలామోదక=సర్వానందకరమయిన, తాళవృత్తగతులన్=తాళఫలవర్తులత్వముచేత [విద్యాపరమయినయర్థము], సకల=కలాసహితులకు, అనఁగా విద్వాంసులకు, ఆమోదక=ఆనందకరమయిన, తాళ=ధ్రువాదితాళమార్దవములచేతను, వృత్తగతులన్=శార్దూలాదివృత్తరీతులచేతను, సూ. 'అన్యస్యాః క్వచిద్భవేచ్చాన్యా' యను నన్నయభట్టీయసూత్రముచేతఁ దృతీయకు ద్వితీయా విభక్తి, సంగీత = సాహిత్యములకుఁ గ్రమాలంకారము. సంగీత = సంగీతమును, సాహిత్య = సాహితియు ననెడి, విద్యాయుగళంబు=విద్యాద్వయము, పల్కుఁజెలికిన్=సరస్వతీదేవికి, పాలిండ్లజోడై=స్తనద్వంద్వమయి, శ్లో. 'సఙ్గీతమపి సాహిత్యం సరస్వత్యా స్తనద్వయమ్, ఏకమాపాతమధుర మన్యదాలోచనామృత'మ్మని ప్రమాణము. సిరులు=కాంతిసంపదలను, ప్రకటింపన్=ప్రకాశింపఁజేయుచునుండఁగా, అందున్=ఆ స్తనయుగళమందును, అవిద్యాయుగళమందును [కు] నఖరేఖలు=నఖక్షతములను, అలఘు=అధికమయిన, ప్రస్తారములు గలవానిఁగా, చేయు=ఒనర్చునట్టి, లేక, అలఘు వనఁగా గురువు; అది బాలచంద్రాకృతిగా వ్రాయఁబడుచున్నది. గనుక, బాలచంద్ర సదృశాంకములు గల

వానిఁగాఁ జేయుచున్నట్టి, [వి] నఖరేఖలు=అంగుళిరేఖలను, అనఁగా వ్రేల వ్రాయువ్రాఁతలను, అలఘుప్రస్తారములు=గురుప్రస్తారములు గలవానిఁగా, చేయు=ఒనర్చునట్టి, 'అలఘూనామివ ప్రస్తారో యాభిః' అని విగ్రహము. 'లోవంకవ్రాయ గురువగు, నేవంకయు లేక యున్న నెసఁగును లఘువై' యని లక్షణము. నఖశబ్దముచేతఁ దదాశ్రయమయిన యంగుళిలక్షిత మగుచున్నది. రేఖ యనఁగా లేఖ, రలల కభేదము. శ్లో. 'రలయో ర్లడయో స్తద్వ ల్లళయో శ్శసయో రపి, వబయో ర్నణయో శ్చాన్తే సవిసర్గావిసర్గయోః, సబిన్దుకాబిన్దుకయో స్స్యా దభేదేన కల్పన' మ్మని భోజరాజు, సకలచ్ఛందములకును మొదట సర్వగురువృత్తము పుట్టుచున్నది గనుక గురుప్రస్తారమును జెప్పినాఁడు. నఖరేఖలన్నచోట, 'తస్యాః ప్రథమా చ జడపదానాం స్యా' త్తనెడు నన్నయభట్టీయసూత్రముచేత ద్వితీయకుఁ బ్రథమ. అలఘుప్రస్తారము లన్నచో స్త్రీలింగవిశేషణ మయినను, 'ఉభయవిధమమహతీనా' మనెడు సూత్రముచేత నపుంసకలింగము. సర్వ = సమస్తములైన, కలా=విద్యలచేత, కాంతుఁడు=ఒప్పుచున్నవాఁడు, లేక, సర్వకలా=సరస్వతీదేవికి, కాంతుఁడు=పెనిమిటియయిన చతుర్ముఖుఁడు,

సరస్వతీస్తనద్వయములోఁ దొలుతదానిని సంగీతముగను రెండవదానిని సాహిత్యముగను నిరూపించి రెంటికి ననుకూలములగు ప్రస్తారములు వర్ణించుట కడుసరసముగనున్నది. అలఘుప్రస్తారము లనుట వలన స్తనములు తాళఫలోపమానము లగుటవలనను బ్రహ్మదేవుఁడు సర్వకలాకాంతుఁ డగుటవలనఁ గలల గ్రహించి (కళాకాంతరూపములగు) చంద్రరూపములగు నఖాంకములను (అర్ధచంద్రాకారములగు) గురురేఖలను పాలిండ్లజోడుపైఁ జిత్రించెననుట స్వారస్యము. సంగీతమునకు స్వరప్రస్తారము ఛందములకు ఛందఃప్రస్తారములు సుప్రసిద్ధములు.

సంగీత సాహిత్యములగు స్తనములపై నలఘుప్రస్తారములు గావింపఁదగినవాఁడు సర్వకలాకాంతుఁ డెగావున బ్రహ్మకు సర్వకలాకాంతుఁ డనుటలో సరసముగలదు. సంగీతమపి సాహిత్యం సరస్వత్యాః స్తనద్వయం ఏకమాపాత మధురం అన్యదాలోచనామృతం.

సరస్వతీస్తనములలో నొకటియగుసాహిత్యము ఆలోచనామృత మగుటవలనను వేఱొకటియగు సంగీతము ఆపాతరమ్య మగుటవలనను సంగీతసాహిత్యములు సకలామోదకములని గ్రాహ్యాము.

తిర్మలమహారాయక్షమావల్లభుక్=తిరుమలమహారాయభూపతిని, ప్రోచుక్=రక్షించుఁగాత మని యాశీర్వచనము.

తాత్పర్యము. సమస్తజనులకు సంతోషములై యొప్పారుచుఁ దాటిపండువలె వట్రువగాఁ బటువుగా (తాళవృత్తరూపమగు సంగీతసాహిత్యాకారముతో) నున్న సరస్వతీదేవి గుబ్బలపై (నలఘు ప్రస్తారరూపములగు) గోటిగంటుల నెలకొల్పుచున్న సమస్తకళాధీశ్వరుఁడగు బ్రహ్మదేవుఁడు కృతికర్తకు సమగ్రాయురారోగ్యములఁ బ్రసాదించుఁగాత.

ఇక్కడ పల్కుఁజెలికిం బాలిండ్లజోడై యన్నచోట, పల్కుఁజెలికి ననెడునకారాంత పదముపై నున్నపకారము బకారమయినది, పదాంతనకారము బిందు వైనది. ఇందులకు లక్షణము.—

క. 'నాంతము లయినపదంబుల, పొంతంబై నున్నశబ్దముల కచటతపల్
దొంతి గజడదబలగు న, య్యంత నకారంబు సున్న యభినవదండీ.'

దాపల బిందువు గదిసి యున్నందున బకారము రెండవచరణము మొదలనున్న మకారమునకు విశ్రమాక్షరమయినది. ఇది బిందుయతి యనిపించుకొనును. ఇందుకు, అప్ప.

క. 'పనిఁబూని నిలుచుఁ దమతమ, యనునాసికములకు బిందుయుతు లన వెనుకన్
గనుపట్టు నాల్గుఁదీపులును, బెనుసున్నలు డాసి తమకుఁ బిఱుదఁ గదియుచోన్.'

అని లక్షణము.

మ. రమణీయాక్షసరాకృతిం బొలుచువర్ణశ్రేణి వీణానులా
పముచేతం గరఁగించి యందు నిజబింబం బొప్ప నచ్ఛామృత
త్వము నాత్మప్రతిపాదకత్వమును దద్వర్ణాళియం దెల్లఁ బూ
ర్ణము గావించినవాణి తిర్మలమహారాయోక్తిఁ బొల్చుం గృపన్. 4

ఈపద్యమునందుఁ గవి బ్రహ్మాత్మకత్వము బ్రహ్మప్రతిపాదకత్వమును భంగ్యంతరమున వర్ణపంక్తికి నధ్యవసించినాఁడు.—

రమణీయ=సుందరమయిన, అక్షసర=స్ఫటికాక్షమాలికయొక్క, ఆకృతిన్ = ఆకారముచేత, పొలుచు=ప్రకాశించుచున్న, వర్ణశ్రేణి=అక్షరపంక్తిని, వీణా=వల్లకియొక్క, అనులాపముచేతన్= పలుకఁబడిచే, కరఁగించి=నీరుసేసి, అందున్ = కరఁగి నీరైన యాయక్షరపంక్తియందు, నిజ=తన యొక్క, బింబంబు=నీడ, ఒప్పన్=కనుపడుచుండఁగా, అచ్ఛ=స్వచ్ఛమైన, అమృతత్వమును, బ్రహ్మస్వరూపము నని యర్థము. నిర్మలోదకమాటనని భావము. ఆత్మప్రతిపాదకత్వమును, బ్రహ్మప్రతిపాదకత్వము నని యర్థము. బింబాపాదకత్వమునని భావము. కరఁగించి యందు నిజబింబం బొప్ప నన్నదియే యధ్యవసించినాఁడు. క్రమాలంకారము. తద్వర్ణాళియం దెల్లన్=ఆవర్ణశ్రేణియందంతట, పూర్ణము గావించిన = నిండింపఁజేసిన, వాణి=సరస్వతీదేవి, తిర్మలమహారాయ = తిరుమలదేవరాయనియొక్క, ఉక్తిన్=వాక్కునందు, కృపన్=దయచేత, పొల్చున్=వర్తించుఁగాత మని యాశీర్వచనము.

భాషయందలి వర్ణములు స్ఫటికమాలికవలె వర్తులాకారముగ నున్నవనియు సరస్వతీ వీణాగానవశమున వర్ణరూపముగనున్న యక్షమాలిక గఱఁగి నీరయ్యెననియుఁ బిదప నిర్మలామృతత్వము నాత్మప్రతిపాదకత్వము నా రసమునందుఁ బూర్ణముగ నించి అచ్ఛామృతత్వము శుద్ధబ్రహ్మముగను ఆత్మప్రతిపాదకత్వము బ్రహ్మప్రతిపాదకత్వముగను నధ్యవసించిన బ్రాహ్మి యీపద్యమునఁ జెప్పఁబడుటచే అలం. రూపకాతిశయోక్తి.

తాత్పర్యము. అక్షసరాకారముగనున్న యక్షరపంక్తిని వీణాగానవశమునఁ గఱఁగించి యారసమునందుఁ దననీడ ప్రతిబింబింప నావర్ణశ్రేణియందు అచ్ఛామృతత్వము ఆత్మప్రతిపాదకత్వము నిండారఁజేయు వాగ్రూపయగు సరస్వతీదేవి కృతికర్తయగు తిరుమలరాయని వాక్కులలో నిల్చుఁగాక.

తిర్మల యన్నచోట సమాసము సేయునపుడు, తిరు అను శబ్దమున రేఫముమీఁది ఉకారము లోపముచేసి తిర్మల యని చెప్పినాఁడు. ఇందుకు లక్షణము. గీ. 'కాంతచన్గవ చనుగవ కార్మెఱుపులు, కారుమెఱుపులు' అని యప్పకవీయమున. తిర్మలమహారాయోక్తిన్ అనుచోట, వ. 'ఇతరత్ర చ ద్వితీయా' అనెడు సూత్రముచేత సప్తమ్యర్థమందు ద్వితీయ వచ్చినది.

శా. ఆమందాకిని మౌళిఁ బూని నను నర్ధాంగీకృతం జేసి తా
నా మేల్మే లని యార్య యల్గఁ బ్రణతుండై తత్పదాంభోజయో

గామర్షంబున గంగయు న్మొరయఁ జూడాభోగసమ్యక్క్రియా
సామర్థ్యంబున వేఁడుశంభుఁడు కృతిస్వామిం గృపం బ్రోవుతన్. 5

మందాకిని యనఁగా, 'మన్దం అకతి వృద్ధత్వ కృతాఙ్గ శైథిల్యేన కుటిలం గచ్ఛతీతి మన్దాకినీ' అను వ్యుత్పత్తిచేత, ని. 'షష్టి వర్షాతు మన్దాకినీ' అను నిఘంటువుచేతను, అఱువదిసంవత్సరములు చెల్లిన ముసలిదానికిని, ని. 'మన్దాకినీ వియద్గఙ్గా' అను నమరనిఘంటువుచేత, ఆకాశగంగకును నభిధానముగనుక, ఆమందాకిని మాళిఁబూని=ఆముసలిదాని నెత్తి నెక్కించుకొని, ఆర్యయనఁగా, ('అరణీయా విలాసిభి రభిగమ్యే త్యార్యా') అను వ్యుత్పత్తిచేతను, (ని. 'ఆర్యా షోడశవత్సరా' అను నిఘంటువుచేతను) బదియాఱు సంవత్సరముల వయసుగల జవ్వనికిని, (ని. 'ఆర్యా దాక్షాయణీచైవ' అను నమరనిఘంటువుచేతఁ) బార్వతికిని బేరు గనుక, నను నర్ధాంగీకృతం జేసితి, పదియాఱేండ్ల వయసుగల భార్యనయిన నన్ను నర్ధాంగీకారము చేయంబడినదానిఁగాఁ జేసితివి, ఔనౌ మేల్మేలని యార్య యల్గన్ = అవునవును బాగుబాగని పార్వతీదేవి యలుక వహింపఁగా ననియర్థము. శివునకు నాకాశగంగ జటాజూటవాసిని యనియును, పార్వతీదేవి యర్ధదేహముగాఁ జేయఁబడినదనియును భావము.

ముదుసలిదగు మందాకినిని నెత్తి నెక్కించుకొని పదియాఱుసంవత్సరముల జవ్వనినగు నన్ను సగము పాటించుట తగదని పార్వతివిచారమునొంద, ప్రణతుండై=నమస్కరించినవాఁడై, తత్=సవతియైన యా పార్వతియొక్క, పదాంభోజ యోగ=పాదములు సోఁకుటవలననైన, అమర్షంబునన్=కోపముచేత, గంగయు న్మొఱయన్=జటాజూటమందలి గంగయుఁను మొఱవెట్టఁగా నని యర్థము. శివుఁడు శిరస్సువంచి పార్వతీదేవిపాదములకు నమస్కరింపఁగాఁ దలనుండు గంగ కదలఁబాఱి ధ్వని చేసినదనిభావము. చూడా+ఆభోగ=జటాపటలముయొక్క, సమ్యక్క్రియా, అనఁగాఁ (దలవంచినప్పుడు క్రిందికి జాఱిన గంగవలనఁ జెదరఁగాఁ దిరుగఁ దానిం) జక్కపఱుచుకొనుట, దానియందలి, సామర్థ్యంబునన్=నేర్పుచేత, అనఁగాఁ జక్కపఱుచుకొనుట యనెడు వ్యాజముచేత ననుట, వేఁడు=గంగనోదార్చుటకై ప్రార్థించునట్టి, శంభుఁడు=శివుఁడు, కృతిస్వామిన్=కృతిపతియైన తిరుమలదేవరాయని, కృపన్=దయచేత, బ్రోవుతన్=రక్షించుఁగాతమని యాశీర్వచనము.

ఇక్కడ హరునిదక్షిణనాయకునిగా వర్ణించినాఁడు, పలువురియందు సమానుఁడుగా నుండువాఁడు దక్షిణనాయకుఁడు 'తుల్యో౽నేకత్ర దక్షిణః' అని లక్షణము.

ప్రణతుఁడయ్యె ననుటచేఁ బూర్ణముగ శివుఁడు తలవంచెననియు నందువలననే పదాంభోజయోగము సంభవించి గంగ మొరసెనని గ్రాహ్యము. జడలలోఁ బదిలపఱుపఁబడినను అవమానము సహింపలేక మొరయుటచే నిరువురకు సవతికలహము గాటముగఁ గలదనియు శివుఁడు నేర్పు పరిహరించెనని భావము.

తాత్పర్యము. శివుఁడు (ముదుసలికత్తెయగు) మందాకినిని నెత్తి నెక్కించుకొని (పదునాఱేండ్ల ప్రాయముగల యార్యయగు) తనను నర్ధాంగీకృతను గావించుటచేఁ బార్వతి కినుక నొందెను. పార్వతికోపముఁ బోఁగొట్టనెంచి శంకరుఁడు పాదానతుఁడు కాఁగా నాయవమానమునకు నోర్వక మందాకిని ప్రవాహధ్వనిమిషచే నసిష్టముఁ దెలిపెను. నేర్పరియగు శివుఁడు చెక్కుచెదరిన జడల

సవరించుకొనునెపమున గంగ నోదార్చెను. అట్టి శంకరుఁడు కృతికర్తకు మంగళములను బ్రసాదిం చుఁగాత.

సీ. ఘనఘనాఘనలక్ష్మి నెనయుకొ ప్పిరుగడ నిరుగడఁ దరుణాబ్జకృతవతంస
మురుచిత్రకాగ్నిశిఖోన్మేష మిరువంక నిరువంకఁ గుండలిస్ఫురితకర్ణ
ముడివోనిమిన్కు లీనెడుపేరు లిరుదెస నిరుదెసఁ గమలబంధురకరంబు
నెఱి మించు చిలుతవన్నియచేల మిరుమేన నిరుమేన రతిమనోహరవిభూతి
తే. యమర నన్యోన్యవేషభేదాసహిష్ణు, భావవిభవంబుఁ దెలుపుచుఁ బరమమైత్రి
మగనిసామేననిలిచిన యగతనూజ, ప్రథనజయ మిచ్చుఁ దిరుమలరాయమణికి.

ఈపద్యమందు నాలుగు పాదములయందు నర్థద్వయమునకు నభేదాధ్యవసాయము చేసి శివపార్వతుల కొకవేషమునే కవి ప్రతిపాదించినాఁడు. ఎట్లన్నను,

ఇరుగడక్ =రెండువైపులను, ఘనఘనాఘనలక్ష్మి నెనయుకొప్పు, అనఁగా, శివునివైపున, ఘన= అధికమైన, ఘనాఘన=వర్షించుచున్న మేఘముయొక్క, లక్ష్మిక్ =సంపదను, ఎనయు=పొందుచున్న యాకాశము, కొప్పు=కేశబంధము శివుఁడు వ్యోమకేశుఁడౌట ప్రసిద్ధము, (ని. 'శక్ర ఘాతుక మత్తేభ వర్షుకాబ్దా ఘనాఘనాః' అని అ.) పార్వతివైపున, అధికమైన వర్షాకాలపు మేఘపుకాంతి వంటికాంతిని బొందుచున్నకొప్పును, అబ్జశబ్దము చంద్రకమలములయందు వర్తించుచున్నది. (ని. 'అబ్జో ధన్వన్తరౌ చన్ద్రేనిచులే శఙ్ఖపద్మయోః' అని వి.) ఇరుగడక్ =రెండువైపులను, తరుణాబ్జ= బాలచంద్రునిచేత, కృత=చేయఁబడిన, వతంసముక్ = శిరోభూషణమును, అవ యను నుపసర్గ మొదటి యకారమునకు వికల్పముచేత లోపముగలదుగనుక, అవతంసము, వతంసము అని రెండువిధ ములును గలదు. ఇందుకు, శ్లో. 'వష్టివాగురిరల్లోపమ వాప్యో రుపసర్గయోః' అని ప్రమాణము. పార్వతివైపున, నూతనకమలముచేఁ జేయఁబడినశిరోభూషణమును, నీలమేఘమువంటి నల్లనిపెన్నెఱులతోడను కర్ణావతంసితమగు కమలముతోడను బార్వతియుఁ, మిన్నుసికతోడను శిరోభూషణమగు బాలచంద్రరేఖతోడను శివుఁడును నుండిరని భావము.

ఇరువంకక్ =ఉభయపార్శ్వములయందును, ఉరుచిత్రకాగ్నిశిఖోన్మేషము, అనఁగా భవుని పార్శ్వమందు, ఉరుచిత్రక=అధికాశ్చర్యకరమైన, అగ్నిశిఖా=ఫాలనేత్రాగ్నిజ్వాలయొక్క, ఉన్మేష ముక్ =వికాసమును, పార్వతీదేవిపార్శ్వమందు, ఉరు=అధికమైన, చిత్రక=తిలకరూపమైన, అగ్నిశిఖ=కుంకుమయొక్క, ఉన్మేషముక్ =వికాసమును, (ని. 'చిత్రం స్యా దద్భుతా లేఖ్య తిలకేషు') (ని. 'కుంకుమేఽగ్నిశిఖం మతమ్' అని వి.) ఇరువంకక్ =రెండుప్రక్కలను, కుండలిస్ఫురితకర్ణము, అనఁగా, శివునివైపున, కుండలి=వాసుకిచేత, స్ఫురిత=ప్రకాశించుచున్న, కర్ణము=చెవియును, పార్వతివైపున, రత్నకుండలముగలదై ప్రకాశించుచున్నచెవియును, కుంకుమతిలకముతోడను గుండలాలంకృతవర్ణములతోడను బార్వతియు, జ్వాలారూపమగు నొసలికంటితోడను గుండలముగాఁజేయఁబడిన సర్పముతోడను శంకరుఁడు నుండిరనిభావము.

మినుకులనఁగా,పలుకులును గాంతులును,ఇరుదెసక్ =రెండుదిక్కులయందును, ఉడివోనిమిన్కులు=శివునిదిక్కున ఉడిగిపోనిపలుకులు, అనఁగా వేదములు, వానిని, ఈనెడు=పుట్టించుబ్రహ్మాముఖ

ములు, పేరులు=హారములు, అనఁగా బ్రహ్మకపాలమాలిక లనుట, పార్వతిదిక్కున, ఉడిగిపోని కాంతులఁ బుట్టించునవి రత్నములుగనుక ఇక్కడ నుడిగి యను పదమందలి కొనయక్షరము లుప్తమైనది, కమలమనఁగా లేడియును, పద్మమును, (ని. 'స్యాత్కురఙ్గేఽపి కమలః' అని అ.) ఇరుదెసన్ = రెండుదిక్కులను, కమలబంధురకరంబు, అనఁగా శివునిదిక్కున, కమల=లేడిచేత, బంధుర=సుందరమైన, కరంబు=హస్తమును, పార్వతిదిక్కున, పద్మముచే సుందరమయినహస్తమును, రత్నహారములతోడను, కమలాలంకృతహస్తముతోడను బార్వతియు బ్రహ్మకపాలమాలికలతోడను లేడితోఁగూడిన హస్తముతోడను శివుఁడు నుండిరనిభావము.

ఇరుమేనన్=శరీరద్వయమందును, శివునిశరీరమందు, సెకిమించు=బాగుమీఱు, చిఱుతవన్నియ చేలము=మూఁడువన్నెలుగలిసిన వ్యాఘ్రాజినాంబరమును, పార్వతిశరీరమందు, చిత్రవర్ణముగల వస్త్రమును, విభూతి, అనఁగా భస్మమును, ఐశ్వర్యమును. ని. 'భూతి ర్భస్మని సమ్పది' అని అ.) ఇరుమేనన్=శరీరద్వయమందును, రతి మనోహరవిభూతి, శివునిశరీరమందు, రతిమనోహర = మన్మథుని యొక్క, విభూతి=భస్మమును, పార్వతీశరీరమందు, మన్మథైశ్వర్యమును, లేక రతీదేవివలెఁ జక్కనైన శోభ, చిత్రవస్త్రముతోడను, రతీదేవివంటి చెలువముతోడను బార్వతియు, పులితోలుతోడను, మన్మథుని బూదితోడను శంకరుఁడు నుండిరనిభావము.

అమరన్ = ఒప్పుచుండఁగా, అన్యోన్య = పరస్పరసంబంధమయిన, వేషభేద = భేదముగల వేషమందలి, అసహిష్ణుభావ=సహింపనితాత్పర్యముయొక్క, విభవంబున్=వైభవమును, తెలుపుచున్ =తెలియఁజేయుచును,అనఁగా దంపతులకిద్దఱకు నొక్కవేషమేయుండవలె నన్న తాత్పర్యముఁ దెలియఁ జేయుచు ననుట. పరమమైత్రిన్ = ఉత్కటమయిన స్నేహముచేత, మగనిసామేననిలిచిన=పెనిమిటి యొక్క యర్ధశరీరమందుఁ బాదుకొనియున్న, అగతనూజ=పర్వతపుత్రియైనపార్వతి, తిరుమలరాయమణికిన్=తిరుమలరాయశ్రేష్ఠునికి, ప్రధనజయమిచ్చున్=యుద్ధములయందలిజయము నిచ్చుఁగాక యని యాశీర్వచనము.

ఇరుఁగడ దరుణాబ్జకృతవతంసమన్నచోట ఋత్వసంబంధయతి చెప్పినాఁడు. ఇందుకు,

తే.'సారిదిఁ గాదులఁ గలపట్రుసుదులకెల్ల, ఋత్వమిత్రంబు లగునచ్చు లెనయ నైదు
చెల్లు హాయలను స్వరమైత్రిఁ జెందునపుడు, వెలయు నివి ఋత్వసంబంధవళు లనంగ.'

అని యప్పకవీయము. ఇరు, అనెడిపదములోనిది రేఫగాని శకటరేఫగాదు.

తాత్పర్యము. అన్యోన్యప్రేమాతిరేకవశమున శివరూపమును ధరించి మగనిసామేను నలంకరించిన లోకమాతయగు పార్వతీదేవి తిరుమలదేవరాయలకు సంగ్రామ విజయమును బ్రసాదించుగాత. శివుఁడు సంహారదేవతయగుట శివకుటుంబినియగు పార్వతియు భర్తృభావానుసారముగ విరోధులఁ దెగటార్చి కృతిపతికి సంగ్రామవిజయము ప్రసాదించుగాతమని కవ్యాశయము. శివుఁడు పార్వతియు నభేదస్వభావులనుటకు ''వాగర్థావివ సంపృక్తౌ'' అనుకాళిదాసోక్తితార్కాణము.

అలంకా—శ్లేషమూలకోత్ప్రేక్ష.

శా. దంతాఘట్టిత రాజతాచల చల•ద్గౌరీస్వయంగ్రాహముం
గంతుద్వేషికిఁ గూర్చి శైలజకుఁ ద•ద్గంగాఝరాచాంతి న
త్యంతామోదము మున్నుగా నిడి కుమా•రాగ్రేసరుం డై పితృ
స్వాంతంబు ల్వెలయింపఁ జాలు నిభరా•డ్వక్త్రుం బ్రశంసించెదన్. 7

దంత=దంతమనుసంజ్ఞ గలకొమ్ముచేత, ఆఘట్టిత=అంతట గట్టనచేయఁబడిన, రాజతాచల=వెండికొండయందు, చలత్=భయకంపితురాలౌచున్న, గౌరీ=పార్వతియొక్క, స్వయంగ్రాహముమ్=తానే కౌఁగిలించికొనుటను, కంతుద్వేషికిన్=మన్మథవిరోధియైనశివునకు, కూర్చి=సంఘటింపఁజేసి, శైలజకున్=పార్వతికి, తత్=ఆశివశిరోవర్తినియైన, గంగాఝర=గంగాప్రవాహముయొక్క, ఆచాంతిన్=ఆచమనముచేత, అత్యంతామోదమున్=అతిశయ సంతోషమును, మున్నుగానిడి=ముందుగాఁ గలుగఁజేసి, (ఇక్కడ మున్నుగానిడి యని చెప్పుట యేలయనఁగా, శ్లో. 'గర్భధారణ పోషాభ్యాం పితుర్మాతా గరీయసీ' గర్భధారణపోషణములవలనఁదండ్రికంటెఁ దల్లియధికురాలుగాన నామెకు సవతియైన శివశిరోగంగను శుండాగ్రముచేత నిశ్శేషముగాఁబీల్చి తల్లిని ముందుగా సంతోషింపఁజేసినాఁడనియు గజముఖుఁడు గనుక గజములుముందుగా నుదకపానముచేసి తరువాత సంతోషముచే వప్రక్రీడసేయుట ప్రసిద్ధమయినందున ముందుగా గంగాప్రవాహజలపానముచేసి పిమ్మట కైలాసమందు వప్రక్రీడసలిపినాఁడనియునుభావము.) కుమారాగ్రేసరుండై=కుమారులలో శ్రేష్ఠుఁడై యనియర్థము. (కుమారస్వామికగ్రజుఁడనిభావము.) పితృస్వాంతంబు ల్వెలయింపఁజాలు=తల్లిదండ్రులమనస్సులనుల్లసిల్లఁజేయఁజాలిన, ఇభరాడ్వక్త్రున్=గజముఖుఁడైనవిఘ్నేశ్వరుని, ప్రశంసించెదన్=మిగుల స్తోత్రముచేయుచున్నాఁడను. ఇక్కడ పితృశబ్దము తల్లిదండ్రులకు పేరు, (ని. 'మాతాపితరౌ పితరౌ' అని అ.)

ఈపద్యములో నాలవచరణము మొదట స్వాంతశబ్దమందు స్వశబ్దముమీఁద స్వరమున్నను స్వాంతసిద్ధాంతాదికములు నిత్యసమాసములుగనుకను, నిత్యసమాసమందు హల్లునకును హల్లుమీఁద నదికిన యచ్చునకును విశ్రమము చెల్లునుగనుకను స్వాంతశబ్దమందలి హల్లయిన వకారమునకు విశ్రమము చెప్పినాఁడు. ఇందుకు లక్షణము, అప్పకవీయమున,

గీ. 'ఒక్కసమసనమున శబ్దయుగముగూడి, పదము లేర్పాటుగాఁ గానఁబడనిప్రాణ
సంధులకు నిత్యసమసనశ్రాంతులును న, ఖండవిశ్రమములు నన రెండుఁ జెల్లు.'

కన్యాకుమారీ గౌరీతు అనునిఘంటు వాక్యానుసారముగఁ బార్వతిని గౌరియనుటచే నాయమ కౌమారావస్థలో నున్నదనియుఁ గాననే కుమారునిచేతకు వెఱచెననియు భావము. కంతుద్వేషియంతవానికి వధూపరిష్వంగము సమకూర్చె ననుటచే వినాయకుఁడ ఘటనాఘటనధురీణుఁ డనియుఁ గాననే స్వయంగ్రహసౌఖ్యము శివునకుఁ జవిచూపెనని స్వారస్యము. గజసహజములగు చేష్టలు ప్రకృత పద్యమున నుత్ప్రేక్షింపఁ బడుటచే వినాయకుఁడనక కవి గజముఖుఁడని పేర్కొనుట సాభిప్రాయము.

అలంకార ముత్ప్రేక్ష.

తాత్పర్యము. ఇభవక్త్రుఁడు కోరతో ఘట్టన మాచరించి రజతాచలము గదల్చుటచే వెఱచి శంకరుని గౌఁగిలించికొనెను. అంతతోనూఱకుండక తుండముతో శివమౌళిస్థమై గంగాజలమునంతయుఁ బీల్చెను. అప్రయత్నపరీరంభణముచేఁ బరమేశ్వరుని సవతిని జిన్నపుచ్చి పార్వతి నానందపఱచి

పుత్త్రధర్మము సార్థకము గావించుకొనిన శివుఁడు కృతికర్తకుఁ గార్యారంభములందు విఘ్నములఁ బోకార్చుఁగాక.

సీ. తరుణార్కకబళనోద్ధతిఁ జూపె నెవ్వాఁడు రుచులచే ఫలమోహరుచులచేత
సకలంకరామముద్రికఁ బూనె నెవ్వాఁడు శయముచే హృత్కుశేశయముచేత
మున్నీరుఁ బల్వలంబుగ దాఁటె నెవ్వాఁడు జవముచే గుణగణార్జవముచేత
నక్షశిక్షాప్రౌఢి నలరారె నెవ్వాఁడు రణముచే నియమధారణముచేత

తే. ధరణి నెవ్వాఁడు దానవద్విరదదళన
విహృతిఁ దనకేసరికిశోరవృత్తిఁ దెలిపె
నతని మత్కావ్యభవ్యవాగమృతఘటన
మంజులస్వాంతు హనుమంతు మదిఁ దలంతు. 8

ఎవ్వాఁడు=ఎవ్వఁడు, రుచులచేన్ = శరీరకాంతులచేతను, ఫలమోహరుచులచేతన్=ఫలమను భ్రాంతివలనఁబుట్టిన స్పృహచేతను, (ని. 'అభిషఙ్గస్స్పృహాయాంచగభస్తౌచరుచిస్స్త్రియామ్' అని అ.) తరుణార్క=బాలసూర్యునియొక్క, కబళన=మ్రింగుటయందును,తిరస్కరించుటయందును, ఉద్ధతిన్=ఎగురుపాటును, చూపెన్=కనుపఱచెనో, హనుమంతుఁడు రక్తవర్ణుఁడన్నందుకు నుదాహరణము. 'అరుణకమలవర్ణం ప్రజ్వలత్పావకాక్షః' మిత్యాది హనుమద్వర్ణనము. ఇటనాంజనేయుని శైశవక్రీడాదికములు దైవదత్తవరప్రభావాదికములు, అమానుషకార్యనిర్వహణములు సూచితములు.

ఎవ్వాఁడు, శయముచేతన్=హస్తముచేతను, హృత్కుశేశయముచేతన్=హృదయకమలముచేతను, అకలంక=నిష్కళంకమయిన, ముద్రికయనఁగా, ఉంగరమును స్వరూపమును గనుక, రామముద్రికన్=రామాంగుళీయకమును, రామస్వరూపమును, పూనెన్=వహించెనో, అనఁగా హస్తముచేత నుంగరమును హృదయముచేత స్వరూపమును వహించినాఁడని క్రమాలంకారము. (ని. 'పఞ్చశాఖశ్శయః పాణిః శతపత్త్రంకుశేశయమ్' అని అ.) ఇట నాంజనేయుని జవపరాక్రమాదికములు స్వామికార్యనిర్వహణశక్తియు ననన్యసామాన్యకార్యఘటనశక్తియు సూచితములు.

ఎవ్వాఁడు, జవముచేన్=వేగముచేతను, గుణగణార్జవముచేతన్ = గుణసమూహముయొక్క ఋజుభావముచేతను, మున్నీరున్=సముద్రమును, పల్వలంబుగ దాఁటెన్=చవుటిపడియమాత్రముగా దాఁటెనో, ఇక్కడ గుణగణార్జవముచేత ననియుం జెప్పుటవలన సురసను జయించుట మొదలైనయుపాయసాధనములచేతఁగూడ ననిభావము. ఇటజవాతిశయము నసురనిగ్రహణబలాతిశయము నాంజనేయుని బ్రహ్మచర్యాది నియమపాలనరూపకమగు సుగుణసమృద్ధియు సూచితములు.

ఎవ్వాఁడు, రణముచేన్=యుద్ధముచేతను, నియమధారణముచేతన్ = బ్రహ్మచర్యాదినియమములయొక్క ధారణముచేతను, అక్షశిక్షాప్రౌఢి నలరారెన్=అక్షశబ్దము రావణపుత్త్రునియందు నింద్రియములయందును వర్తించుచున్నదిగనుక, అక్షాసురుని శిక్షాప్రౌఢిచేతను, ఇంద్రియనిగ్రహమం

దలి బుద్ధిమచేతను నొప్పినవాఁడాయెనో. ఇక్కడ క్రమాలంకారము. అక్షశబ్ద మింద్రియవాచక మయినందులకు, (ని. 'అక్షమిన్ద్రియే' అని అ.) ఇట నాంజనేయుని వైరాగ్యాతిశయము బలబాహువీర్యసంగ్రామ నైపుణ్యాదికములు దుష్టసంహరణశక్తియు సూచితములు.

ఎవ్వాఁడు, ధరణిన్=భూమియందు, దానవద్విరదు లనఁగా, 'దానవా ద్విరదా ఇవ దానవద్విరదా' అని స. 'ఉపమితంవ్యాఘ్రాదిభిః' అనెడు పాణినీయసూత్రముచేత, ఉపమితసమాసము చేయఁగా రాక్షసశ్రేష్ఠులని యర్థము. ఇందుకు, (ని. 'స్యురుత్తరపదేవ్యాఘ్రపుఙ్గవ ర్షభ కుఞ్జరాః, సింహ శార్దూల నాగాద్యాః పుంసి శ్రేష్ఠార్థగోచరాః' అని అ.) దానవద్ద్విరదము లనఁగా మదవద్గజములును, ఇందుకు ని. 'మదోదానం' అని అ. దానవద్విరద=దైత్యశ్రేష్ఠులనెడు, దానవద్ద్విరద=మదవద్గజములయొక్క, ఇచట దానవత్ +ద్విరద. దానవ+ద్విరద. అను రెండుపక్షములయందును, ద్విరదశబ్దాదిదకారమునకు ద్విత్వమేర్పాయవలయును. అన చి చ, 'అచఃపరస్యయరో ద్వేవాస్తోనత్వచి' అని పాణిని. అచ్చుకంటెఁ బరమైన హకారేతరహల్లునకుఁ బరమం దచ్చులేనప్పుడు ద్విత్వము వికల్పముగా నగును. దళన=భేదనమందలి, విహృతిన్=విహారముచేత, తన కేసరికిశోరవృత్తిఁ దెలిపెన్=తనయొక్క సింహకిశోరవ్యాపారమును గనుపఱిచెనోయని యర్థము. కేసరి యనెడు వానరునికిఁ గుమారుఁడనిభావము అతనిన్=అట్టిసద్గుణ విశిష్టుఁడును, మత్కావ్య=నాచేత రచింపఁబడెడు కావ్యమందు, భవ్యవాక్=శుభవాక్కులనెడి, అమృత=అమృతముయొక్క, ఘటన=పొందించుటయందు, మంజుల=మృదువైనట్టి, స్వాంతున్=మానసముగలిగినవాఁడునునగు, హనుమంతున్=హనుమద్దేవుని, మదిఁదలంతున్=మనస్సునందు ధ్యానముచేయుచున్నాను.

రామరాజభూషణుఁడు పవననందన కరుణాప్రాప్తకవితావైభవుఁ డగుటచే మనోహరకవితాసిద్ధికి నిష్టదేవతాస్తుతి నిటులఁ గావించెను. అర్థాలంకారము. శ్లేష. శబ్దాలంకారము ఛేకానుప్రాసము. ఇందుకు లక్షణము.

తా. బాల్యమున భాస్కరుని ఫలమని మ్రింగఁబోయి యమానుషశక్తినిసాటి, సీతాన్వేషణమునకు శ్రీరామముద్రికను గైకొని స్వామికార్యనిర్వహణశక్తి ప్రకటించి, సముద్రమును పడియవలెదాఁటి జవాతిశయము సువ్యక్తమొనరించి, అక్షకుమారాదిరాక్షసులఁ దునిమి, సంగ్రామనైపుణ్యము ప్రకటించిన రాక్షసదంతావళములకుఁ గేసరికిశోరమగు (సింగపుఁబిల్లయగు కేసరిపుత్రుఁడగు) నాంజనేయునకుఁ గవి మధురకవితార్థియై నమస్కరించుచున్నాఁడు.

సీ. భువిఁ గవితాకన్యఁ ♦ బుట్టించె నెవ్వాఁడు బడినాగమము లెల్ల ♦ నడపె నెవ్వాఁ
డేను నీ పనుమాట ♦ లెనయించె నెవ్వాఁడు కోవఁలపదలీలఁ ♦ గూర్చె నెవ్వాఁ
డనఘతులాకోటి ♦ నలరించె నెవ్వాఁడు నిఖిలగుణంబులు ♦ నేర్పె నెవ్వాఁ
డినకరసంప్రాప్తి ♦ నెసఁగించె నెవ్వాఁడు రహి నించె నర్థగౌ ♦ రవము నెవ్వాఁ
తే. డట్టి వాణీగురుత్వ మ ♦ హత్త్వ ఖనుల
ఘనులఁ బ్రాచేతస వ్యాస ♦ కాళిదాస
దండి భవభూతి మాఘస ♦ త్కవి మయూర
భారవుల భారవుల నాత్మఁ ♦ బ్రస్తుతింతు. 9

ఈపద్యమందు వాల్మీకిమొదలుగాఁగల సంస్కృతమహాకవులను గవితయనెడు కన్యకకు జననాద్యవస్థాసంపాదకులనుగా నేర్పఱిచి యర్థద్వయమునకు నభేదాధ్యవసాయము చేసి చెప్పినాఁడు.

ఎట్లన్నను, ఎవ్వాఁడు=ఎవ్వఁడు, భువిన్ = భూమియందు, కవితాకన్యన్ = కవితయనెడు కన్యకను, పుట్టించెన్=జనింపఁజేసెనో, అనఁగా వాల్మీకియని తెలియవలెను. వాల్మీకియే కవితాకన్యను బుట్టించె ననుటకు,

శ్లో. 'ఆదికవీ చతురాస్యౌ కమలజ వల్మీకజౌ వందే
లోకశ్లోక విధాత్రో ర్యయోర్భిదాలేశమాత్రేణ.'

భువియనెడుపదము ప్రథమాంతమైన తద్భవము. ఇందుకు శబ్దానుశాసనసూత్రము 'భూదివోస్తు జ్ఞాయత్తత్' భూ దివ్ శబ్దములకు సంస్కృతసప్తమ్యేకవచనమందుఁగల, భువి, దివి, అనురూపము లాంధ్రమందుఁ బ్రాతిపదికముగా నుండునని సూత్రార్థము. బడిన్=వెంబడిగా, ఎవ్వఁడు, ఆగమము లెల్లనడిపెన్=వేదములనెల్ల విభజించి ప్రవర్తింపఁజేసెనో, అని కవితాపరమైన యర్థము. అనఁగా వ్యాసులని తెలియవలయు.

శ్లో. 'నమ స్సర్వవిదే తస్మై వ్యాసాయ కవివేధసే
చక్రే పుణ్యం సరస్వత్యా యోవర్షమివ భారతమ్.'

అను శ్లోకమువలన వ్యాసుఁడు కవితాకాంతకు దేశికుఁడని స్పష్టమగుచున్నది. ఆగమోక్తధర్మముల జరిగించెనో యని కన్యాపరమైన యర్థాంతరము.

ఎవ్వాఁడు, ఏనునీవనుమాటలు='త్వమేవాహం నసంశయః' అని కాళిదాసునిఁగూర్చి సరస్వతీదేవి చెప్పెను గనుక సరస్వతియైన నేనే నీవనుమాటలను, ఎనయించెన్ = వ్యాపింపఁజేసెనోయని యర్థము. నేను నీవనునవి మొదలుగాఁగల మాటలను బాల్యమందు నేర్పినాఁడని యర్థాంతరము. ఎవ్వఁడు, కోమల=లలితమైన, పదలీలన్=శబ్దవిలాసమును, కూర్చెన్=ఘటింపఁజేసెనోయని యర్థము. శ్లో. 'దణ్డినః పదలాలిత్య' మన్నాఁడు గనుక దండియని తెలియవలయు. కోమల=మృదువైన, పదలీలన్=పాదక్రియను, అనఁగా నడుగులుపెట్టి నడుచుటను, కూర్చెన్=ఘటింపఁజేసెనోయని యర్థాంతరము. (ని. 'లీలావిలాసక్రియయోః' అని అ.)

ఎవ్వాఁడు, అనఘ=పవిత్రమైన, తులా=త్రాసుయొక్క, కోటిన్=ఒకప్రదేశమందు, అలరించెన్=కవితారూప సరస్వతి నొప్పునట్లు చేసెనోయని యర్థము. శ్లో. 'అహో మేసౌభాగ్యం మమచ భవభూతేశ్చ ఫణితిం తులాయా మారోప్య ప్రతిఫలతి తస్యాం లఘిమని, గిరాందేవీ సద్యశ్శ్రుతికలిత కల్హారకలికా కళాయామాధుర్యం క్షిపతి పరిపూర్త్యై భగవతీ' అన్నాఁడు గావునఁ గవితారూప సరస్వతిని దులయందుఁ దూచినవాఁడు భవభూతియని గ్రహింపవలయును. అనఘమైన, తులాకోటిన్=పాదభూషణమును అలంకరించెనని యర్థాంతరము. (ని.'పాదాఙ్గదం తులాకోటిః' అని అ.) ఎవ్వఁడు, నిఖిలగుణంబులు=శ్లేషాదిసమస్తగుణములను, నేర్పెన్=తెలియఁజేసెనోయని యర్థము. శ్లో. 'దణ్డినః పదలాలిత్యం భారవే రర్థగౌరవమ్, ఉపమా కాళిదాసస్య మాఘస్సైతే త్రయోగుణాః' అన్నాఁడు గనుక నీగుణత్రయము గలవాఁడు మాఘుఁ డని తెలియవలెను. కన్యకు సమస్తగుణములఁ దెలిపెనో యని యర్థాంతరము.

ఎవ్వాఁడు, ఇన=సూర్యునియొక్క, కర=కిరణములయొక్క, సంప్రాప్తిన్=పొందుటను, ఎసఁగించెన్=ప్రకటింపఁజేసెనో యని యర్థము. అనఁగా మయూరుఁడని తెలియవలయును. ఇన=పెనిమిటియొక్క, కరసంప్రాప్తిన్=పాణిగ్రహణమును, ఎసఁగించెన్=ఒనగూర్చెనోయని యర్థాంతరము. (ని. 'ఇన 'స్సూర్యే నృపేపత్యౌ' అని వి.) ఎవ్వఁడు, అర్థగౌరవమున్ = శబ్దమందలి యర్థాతిశయమును, రహిన్=ఒప్పునట్లు, నించెన్=నిండించెనో యని యర్థము. అనఁగా భారవియని తెలియవలెను. వివాహానంతరమందు ధనాతిశయత్వమును నిండించెనో యని యర్థాంతరము.

అట్టి=అటువంటి, వాణీ=కవితారూప సరస్వతియొక్క, గురుత్వ=జనకత్వ ప్రయుక్తమయిన, మహత్త్వ=శ్రేష్ఠతకు, ఖనులన్=ఆధారభూతులైన, ఘనులన్=శ్రేష్ఠులైన, భారవులన్, భా=కాంతియందు, రవులన్=సూర్యులైన, ప్రాచేతస=వాల్మీకిని, వ్యాస=వ్యాసుని, కాళిదాస = కాళిదాసుని, దండి=దండిని, భవభూతి=భవభూతిని, మాఘసత్కవి=మాఘుఁడనెడు కవిశ్రేష్ఠుని, మయూర=మయూరుని, భారవులన్=భారవిని, ఆత్మన్=అంతరంగమందు, ప్రస్తుతింతున్=స్తోత్రముచేయుచున్నాను.

అనఁగాఁ గవితాకన్యఁబుట్టించె నన్నది మొదలుకొని అర్థగౌరవము నించె నన్న పర్యంతము చెప్పఁబడిన కార్యములకు వాల్మీక్యాదిభారవిపర్యంత మహాకవులు క్రమముగాఁ గర్తలని క్రమాలంకారము గ్రహింపవలయు. కవితాకన్య యనుచోట రూపకాలంకారము. శ్లో. 'ఆరోప్యవిషయస్యస్యాదతిరోహితరూపిణః, ఉపరఞ్జక మారోప్య గుణం తద్రూపకం విదుః' అనిలక్షణము. ఆగమము లనునిది మొదలైన స్థలములయందు నర్థద్వయమునకు భేదమున్నను నభేదాధ్యవసాయము చేసినాఁడు గనుక నతిశయోక్తి, ఇక్కడ శ్లేషమూలమని తెలియవలయును. రూపకాతిశయోక్తులకు నంగాంగీభావముచే సంకరము.

తాత్పర్యము. కవిత్వమును జన్మింపఁ జేసినవాఁడు (ఆదికవి) వాల్మీకిమహర్షి. పిదప వేదవిభాగము గావించినవ్యాసుఁడాకవిత నభివృద్ధినొందింప సరస్వతీ స్వరూపుఁడగు కాళిదాసుఁడు క్రొత్తనిగ్గులు గూర్చెను. ఆవల దండి మృదుశైలిలోఁ గవితారచనము గావింప భవభూతి మిగులమనోహరముగా నలరించెను. తరువాత మాఘుఁడు సమస్తగుణములు సమకూర్ప సూర్యశతకరచనముచే మయూరుఁడు అర్థగౌరవముచే భారతి కవితను శోభిల్లఁజేసిరి. ఇటుల గీర్వాణకవితకు వివిధాలంకృతుల సమకూర్చినసంస్కృత మహాకవులకు నమస్కరించుచున్నాఁడను (కన్యపరమగు నర్థము సుగమమగుటచే నుదాహరింపలేదు).

మ. మహి మున్వాగనుశాసనుండు సృజియింపం, గుండలీంద్రుండు ద
న్మహనీయస్థితిమూల మై నిలువ, శ్రీనాథుండు ప్రోవన్మహా
మహులై సోముఁడు భాస్కరుండు వెలయింపన్, సొంపు వాటించు నీ
బహుళాంధ్రోక్తిమయప్రపంచమునఁ దత్ప్రాగల్భ్య మూహించెదన్. 10

ఈపద్యమందు నన్నయభట్టాద్యాంధ్రకవులను వర్ణించినాఁడు. ప్రపంచమనఁగా విస్తరమును విశ్వమును గనుక బహుళాంధ్రోక్తిమయప్రపంచమనెడు ప్రపంచముచేత నని యర్థముచేసి యాంధ్రోక్తిమయ ప్రపంచపరముగాను నర్థద్వయంబును జేయవలసినది,

మహిన్ =భూమియందు, మున్ =ముందు, వాగనుశాసనుండు=శబ్దానుశాసనుఁడైన నన్నయభట్టును, సరస్వతీశాసనుఁడైన బ్రహ్మయును, సృజియింపన్ =నన్నయభట్టుపుట్టింపఁగానని యాంధ్రప్రబంధవిస్తారపరమయినయర్థము. బ్రహ్మదేవుఁడు పుట్టింపఁగానని ప్రపంచపరమయిన యర్థాంతరము. కుండలీంద్రుండు=కుండలేష్టిఁ జేసి కుండలములు ధరించిన తిక్కనసోమయాజిశ్రేష్ఠుఁడును, శేషాహియును, తత్ = ఆయాంధ్రప్రబంధవిస్తారముయొక్క, మహనీయ=ఒప్పిదమయిన, స్థితి=ఉనికికి, మూలమై=ఆధారమయి, నిలువన్ =నిలిచియుండఁగా ననియర్థము. ఆవిశ్వముయొక్క యునికికి నాధారమయి నిలువఁగానని యర్థాంతరము. శ్రీనాథుండు=శ్రీనాథుడనుకవి, ప్రోవన్ =పోషింపఁగానని యర్థము, విష్ణువు సంరక్షింపఁగానని యర్థాంతరము. మహామహులై =మహాతేజస్సుగలవారై , సోముఁడు=నాచనసోముఁడును, భాస్కరుండు=హుళిక్కి భాస్కరుఁడును వీరిద్దఱుకవులును, వెలయింపన్ = ప్రకాశింపఁ జేయఁగా ననియర్థము. చంద్రసూర్యులు ప్రకాశింపఁజేయఁగానని యర్థాంతరము. సొంపువాటించు=చక్కనగుచున్న, ఈబహుళాంధ్రోక్తిమయప్రపంచమునన్ =ఈయధికమయిన యాంధ్రప్రబంధవిస్తార మనెడువిశ్వముచేత, తత్ =ఆపూర్వోక్త కవులయొక్క, ప్రాగల్భ్యము=ప్రౌఢిమను, ఊహించెదన్ =భావించుచున్నాను. ని. 'ప్రపఞ్చ స్సృఞ్చయే ప్రోక్తో విస్తరే చ ప్రతారణే' అని విశ్వనిఘంటువు. మత్తేభవృత్తము. 'నలువొందన్ సభరల్ నమల్ యవలతోనం గూడి మత్తేభమిం, దలరారుం బదునాలుగావిరతిచే నానందరంగాధిపా.'

అలంకారము. వ్యంగ్యధ్వని.

తాత్పర్యము. నన్నయభట్టారకుఁడు తొలుత కవితాసతిని బుట్టించెను. తిక్కనసోమయాజి కవితాసతియభివృద్ధికి మూలమయ్యెను. శ్రీనాథుఁడు కవితాసతిని రక్షించెను. సోముఁడు భాస్కరుఁడు వెలయించిరి. ఇటులొప్పారు నాయాకవులనేర్పు నెన్నెదనని కవిస్తుతిపరమగు నర్థము. ప్రపంచమును దొలుత బ్రహ్మసృష్టించెననియు, శేషుఁడా ప్రపంచమును భరించెననియు, విష్ణువుపోషించెననియుసూర్యచంద్రులు వెలుఁగొందఁజేసిరనియుఁ బ్రపంచసంబంధమగు నర్థాంతరము నీపద్యమున నిమిడియున్నవి.

శా. భావం బెక్కడ లేక, వృత్తనియమా♦పాయంబుఁ జింతింప కెం,
దే వర్తించి పరార్థవంచనలచే ♦ దీపించి, మూర్ఖాళి సం
భావింపం గుకవిప్రణీతకృతి సా♦మాన్యాకృతిం బూని పై
పైపన్నె ల్పచరింప దానిఁ దిలకిం♦పం బోరు ధీరోత్తముల్. 11

ఈ పద్యమందుఁ గుకవినిందనము రామరాజభూషణుఁడు చేయువాఁడై కుకవిప్రణీతకృతి సామాన్యాకృతిం బూని పైపై పన్నెల్పచరింపనని చెప్పుటచేత సామాన్య యనఁగా వేశ్యగనుకఁ గుత్సితకవిచేతఁ జెప్పఁబడిన ప్రబంధపరముగాను వేశ్యాస్త్రీపరముగాను నర్థద్వయము గలుగఁ జెప్పినాఁడు. అది యెట్లనఁగా,

భావం బెక్కడలేక=భావమనఁగా వ్యంగ్యార్థమును, చిత్తమును, వ్యంగ్యమెక్కడ విచారించినను లేకయని కుత్సితకవి ప్రబంధపరమైనయర్థము, చిత్త మెవనియందును లేకయని సామాన్యపరమైనయర్థము. వృత్తనియమాపాయంబుఁ జింతింపక, వృత్తములనఁగా శార్దూలమత్తేభవిక్రీడితాది వృత్తములును వ్యాపారములును, వృత్త=శార్దూలాది వృత్తములయొక్క, నియమ=యతిప్రాసాది లక్షణముయొక్క,

అపాయంబుల్ =హానిని, చింతింపక=విచారింపక యని యర్థము. వ్యాపారనియమముయొక్క హానిని విచారింపక యని యర్థాంతరము. ఎందేవర్తించి = ఎక్కడనో యపండితులయొద్దఁ జదువఁబడినదై యని యర్థము. ఎల్లెడల వ్యభిచరించినదై యని యర్థాంతరము. పరార్థవంచనలచేత్ =పరకవులయుక్తిని దొంగిలించుటచేత, దీపించి=ప్రకాశించినదై యని యర్థము. పరద్రవ్యముల నపహరించుటచేతఁ బ్రకాశించినదై యని యర్థాంతరము. మూర్ఖాళి సంభావింపన్ =తెలిసీతెలియనివారియొక్క శ్రేణి మెచ్చుఁగానని యర్థము. మూర్ఖులైన, ఆళియనఁగాఁ జెలికత్తియ మెచ్చుఁగాననియర్థాంతరము. కుకవి ప్రణీతకృతి, కుకవి=కుత్సితకవిచేత, ప్రణీత=చెప్పఁబడిన, కృతి=ప్రబంధము, సామాన్యాకృతిఁ బూని ('విత్తమాత్రోపాధే స్సకలపురుషాభిలాషిణీ సామాన్యవనితా' అనులక్షణలక్షితయైన) వేశ్యయొక్క స్వరూపమును వహించి, భోగముదానిఁబోలినదై యనుట. పైపై వన్నెల్వచరింపన్ =పైపైమెఱుఁగులు గనుపట్టుచుండఁగా, దానిన్ =ఆకుకవిప్రణీతకృతిని, ధీరోత్తముల్ = పండితశ్రేష్ఠులు, తిలకింపం బోరు=విమర్శించి చూడరనియర్థము. దానిన్ =ఆ వేశ్యను, ధీరోత్తముల్ = క్రోధాదులచేతఁ దిరస్కరింపఁ బడనియంతఃకరణముగల ధైర్యశాలులు, తిలకింపంబోరు=కన్నెత్తిచూడరని యర్థాంతరము.

మొదటి పాదమునకు ప్రాదియతి. అర్థద్వయాభేదాధ్యవసాయమువలన నలంకారము శ్లేషమూలకాతిశయోక్తి. ఆకృతిశబ్దము సాదృశ్యవాచకముగాన నలంకార ముపమ. ఉపమకు అతిశయోక్తికి సంకరము.

తాత్పర్యము. దుష్కవుల కవిత్వము పంగ్యార్థాదికావ్యగుణములును, శార్దూలాది వృత్తనియమములులేనిదై శబ్దార్థచౌర్యములచే నొప్పారి పామరజనస్తోత్రపాత్రమై పైపైమెఱుఁగులతో నుండునని యర్థము. వేశ్య నిలుకడతోనుండక నడవడిని గొంచెమేని పాటింపక విచ్చలవిడిగాఁ దిరుగుచు నితర ద్రవ్యహరణమె నియతిగాఁవించుకొని మూర్ఖులగు చెలికత్తెలు పాటించుచుండ సంచరించుచుండును. కావున (దుష్కవిత్వమును వేశ్యను) ధీరోత్తములు (పండితులు ధైర్యశాలురు) దానిని జూడనొల్లరని అర్థాంతరము.

వ. అని యిష్టదేవతానందనంబును సుకవికవితాభినందనంబును గుకవినిందనంబునుం గావించి సనాతనాధునాతనాఖిలమహాకవిజనానుగ్రహంబునఁ బురాతన పుణ్యశ్లోకరాజర్షివర్ణనాకర్ణనోత్కంఠిత సకలజనసేవ్యం బగు నొక్కమహాకావ్యంబు రసోచిత చమత్క్రియాకల్ప భవ్యంబుగా నొనరింపం బూని యున్న సమయంబున 12

అని=ఇట్లని, ఇష్టదేవతావందనంబును=ఇష్టదేవతలనుగురించిన నమస్కారమును, సుకవికవితాభినందనంబును, సుకవి=సత్కవీశ్వరులయొక్క, కవితా=కవిత్వముయొక్క, అభినందనంబును=స్తోత్రమును, కుకవినిందనంబును=కుత్సితకవులదూషణమును, కావించి = చేసి, సనాతన=ప్రాచీనులైనవారును, అధునాతన = నవీనులైనవారుననగు, అఖిలమహాకవిజన = సకలమహాకవులయొక్క, అనుగ్రహంబునన్ =అంగీకారముచేత, పురాతన=ప్రాచీనుఁడైన, పుణ్యశ్లోక = పుణ్యకరమైన కీర్తి గలిగిన, రాజర్షి=రాజర్షియొక్క, వర్ణన=వర్ణనముయొక్క, ఆకర్ణన=వినుటయందు, ఉత్కంఠిత=

సంజాతోత్కంఠులైన, సకలజన=సమస్తజనులచేత, సేవ్యంబగు=సేవింపఁదగిన, ఒక్కమహాకావ్యంబుఁ=ఒకమహాప్రబంధమును, రసోచిత = శృంగారాదిరసములకుఁ దగియుండెడు, చమత్క్రియా=శబ్దచమత్కారముయొక్క, కల్పనా=రచనయనెడు, ఆకల్ప=అలంకారముచేత, భవ్యంబుగాఁ=యోగ్యమానట్టులుగా, ఒనరింపంబూని = నిర్మించుటకు సిద్ధపడి, ఉన్నసమయంబునఁ = ఉన్నకాలమందు, దీనికి ముందరిపద్యముతో నన్వయము. 'ప్రకృత్యుక్తప్రకారేణ రచనారసరఞ్జనీ' యని యథర్వణాచార్యుఁడు.

సీ. వసుమతీభారధూ•ర్వహత నెవ్వనియుర్వ రావరాహాంక మ•ర్థము వహించుఁ
గరగతచక్రవి•క్రమశక్తి నెవ్వానిరామానుజత్వంబు • రమణ కెక్కు
జీర్ణకర్ణాటల•క్ష్మీపునస్సృష్టి నెవ్వానిలోకేశ్వర•త్వము పొసంగుఁ
జటులశార్వరమగ్న •సర్వవర్ణోద్ధారపటిమ నెవ్వనిరాజ•భావ మెసఁగు
తే. నతఁడు వీరప్రతాపరా•జాధిరాజ, రాజపరమేశ్వరాష్టది•గ్రాజనులమ
నోభయంకరబిరుదస•న్నుతజయాభి, రామగుణహారి తిరుమల•రాయశౌరి. 13

ఇందుఁ దిరుమలదేవరాయనికిఁ ద్రిమూర్త్యాత్మకత్వముఁ బ్రతిపాదించి యర్థద్వయమునకు నభేదాధ్యవసాయముచేసి చెప్పినాఁడు. ఎట్లన్నను,

వసుమతీభార=భూభారముయొక్క, ధూర్వహతఁ=భారవాహిత్వముచేత, అనఁగా భరించుటచేత, ఎవ్వని=ఏరాజుయొక్క, ఉర్వరావరాహాంకము=భూవరాహరూపమైన బిరుదు, అర్థము వహించుఁ = సార్థకత్వమును దాల్చునోయని యర్థము. ఏరాజుయొక్క భూవరాహ మనెడుపేరు సార్థకత్వమును వహించునోయని యర్థాంతరము. రెండర్థములకు నభేదాధ్యవసాయము. అంక మనఁగా లాంఛనమునకును నామమునకును బేరు. 'అంక ముత్సంగచిహ్నయోః' అమ. తిరుమలదేవరాయలు భూవరాహరూపమగు బిరుదముగలవాఁడుగ నుండెనని భావము.

కరగత=హస్తగతములైన, చక్ర=రాష్ట్రములుగలిగిన, విక్రమశక్తిఁ = పరాక్రమశక్తిచేత, ఎవ్వాని=ఏరాజుయొక్క, రామానుజత్వంబు=రామదేవరాయల సోదరత్వము, రమణకెక్కుఁ= వన్నెకెక్కునోయని యర్థము. కరగత=హస్తగతమైన, చక్ర=సుదర్శనముయొక్క, విక్రమశక్తిఁ= పరాక్రమశక్తిచేత, ఎవ్వని=ఏరాజుయొక్క, రామానుజత్వంబు = బలరామసహోదరత, అనఁగాఁ గృష్ణమూర్తియౌట, రమణకెక్కునోయని యర్థాంతరము. (ని. 'చక్రం రాష్ట్రే చక్రం సుదర్శన' మని అ.) ఈరెండుచరణములయందును, రాజునకు భూవరాహనామమును గృష్ణరూపమును గలుగఁజెప్పినాఁడు గనుక నామరూపములు చెప్పఁబడినవిష్ణు వని గ్రహింపవలయును. తిరుమలదేవరాయలు హస్తమున రాజ్యచక్రము నిమిడిచికొని స్వతంత్రముగా రాజ్యమును బరిపాలనము గావించుచున్నాఁడని భావము.

జీర్ణ=శిథిలమయిపోయిన, కర్ణాటలక్ష్మీ=కర్ణాటరాజ్యలక్ష్మియొక్క, పునస్సృష్టిఁ=తిరిగి కలిగించుటవలన, ఎవ్వాని=ఏరాజుయొక్క, లోకేశ్వరత్వము=జనేశ్వరత్వము, పొసంగుఁ=ఒప్పుచుండునోయని యర్థము. ఇక్కడ లోకశబ్దము జనపరము (ని. 'లోకస్తుభువనేజనే' అని. అ.) జీర్ణకర్ణుఁడనఁగా వృద్ధశ్రవః పదపర్యాయముచేత నింద్రుఁడు, అతనినుండి, అట=దుర్వాసశ్శాపమువలనఁ జలించిన,

లక్ష్మీ=రాజ్యలక్ష్మియొక్క, పునస్సృష్టిన్=పునరుద్ధరణముచేత, ఏరాజుయొక్క లోకేశ్వరత్వమనఁగా బ్రహ్మత్వము, పొసంగున్=ఒప్పుచుండునో యని యర్థాంతరము. ఈ యర్థము కవిహృదయముగాదని యును, వసుమతీభార ధూర్వహత యనెడుపదమువలె, జీర్ణకర్ణాటలక్ష్మీపునస్సృష్టి యనెడుపదము శ్లిష్టముగాదనియును రాజును సృష్టిమాత్రముచేతనే సృష్టికర్తయైన బ్రహ్మఁగాఁ జెప్పినాఁడనియును గ్రహింపవలయును. తల్లికోటయుద్ధమునందు మహమ్మదీయాపహృతమైన యాత్మీయరాజ్యమును దిరుగ నుద్ధరించి జీర్ణకర్ణాటరాజ్యస్థాపనబిరుదమును బొందఁగలిగెనని భావము.

శార్వరశబ్దము, ఘూకులయందు నంధతమస్సునందును వర్తించును. వర్ణములనఁగా బ్రాహ్మణాదివర్ణములును శుక్లపీతాదివర్ణములును (ని. 'శార్వరం త్వన్ధతమసే ఘాతుకే భేద్యలిఙ్గకం' వర్ణో ద్విజాదౌ శుక్లాదౌ' అని అ.) చటుల=క్రూరులైన, శార్వర=ఘూకులయందు, మగ్న=మునిఁగిపోయిన, సర్వవర్ణ = బ్రాహ్మణాదివర్ణములయొక్క, ఉద్ధారపటిమన్=ఉద్ధరించుటయందలి సామర్థ్యముచేత, ఎవ్వని=ఏరాజుయొక్క, రాజభావమెసఁగున్=ప్రభుత్వము ప్రకాశించునో యని యర్థము. చటుల =గాఢమైన, శార్వర=కటికచీఁకటియందు, మగ్న=లీనమయిన, సర్వవర్ణ=శుక్లపీతాదివర్ణములయొక్క, ఉద్ధారపటిమన్=ఏర్పాటుగాఁ దెలుపుటయందలి సామర్థ్యముచేత, ఏరాజుయొక్క, రాజభావము= చంద్రత్వము, ప్రకాశించునో యనియర్థాంతరము. (ని. 'రాజామృగాఙ్కే క్షత్రియే నృపే' అని అ.) చంద్రుఁడు శివుని యష్టమూర్తులలో నొకమూర్తి గనుక నిందువలన నీశ్వరత్వముఁ బ్రతిపాదించి నాఁడు. శ్లో. 'పృథివీ సలిలం తేజో వాయు రాకాశమేవచ, సూర్యాచన్ద్రమసౌ సోమయాజీ చేత్య ష్టమూర్తయః' అని ప్రమాణము. ఇదివఱకు రాజునకుఁ ద్రిమూర్త్యాత్మకత్వముఁ జెప్పినాఁడు. తిరుమ లరాయఁడు అంతరించినవర్ణాశ్రమధర్మములు తిరుగనిలువఁబెట్టి యపనోపద్రవము మతములయెడ నపాయము గలిగింపకుండఁ గాపాడె నని భావము.

అతఁడు = ఆరాజు, వీరప్రతాప, రాజాధిరాజపరమేశ్వర, అష్టదిగ్రాజకుల మనోభయంకర, అనునట్టి, బిరుద=బిరుదులచేత, సన్నుత=స్తోత్రముచేయఁబడిన, జయ=జయముచేత, అభిరామ = ఒప్పు చున్న, గుణ=గుణములచేత, హారి=మనోహరుఁడైన, తిరుమలరాయశౌరి = తిరుమలదేవరాయవీరా గ్రణి యని యర్థము. ఇదియును ముందరిపద్యముతో నన్వయము. అలం. శ్లేషమూలకాతిశయోక్తి.

తాత్పర్యము. పరరాజాపహృతమగు రాజ్యము నుద్ధరించి స్వహస్తవశంవదము గావించుకొని జీర్ణమైనకర్ణాటరాజ్యమును బునరుద్ధరణము గావించి పరమతమగ్నములైన బ్రాహ్మణాదిమతములఁ దిరుగ నుద్ధరించి తిరుమలదేవరాయలు సమస్తబిరుదాభిరాముఁడై రాజ్యము పరిపాలించుచున్నసమయమందు (ముందరి పద్యముతో నన్వయము).

వ. వెండియుం బ్రచండరుచిపిచండిల మార్తాండమండల పాండిత్యభూషితభుజార్గళ నిర్గళప్రతాప దీపిత ప్రకాశకౌశికీభూతకదనభూతలభీతాభీతవిమతక్షమాధీశ్వ రుండును, విశ్వవిశ్వంభరావిమతశాశ్వతైశ్వర్యధుర్యతామహేశ్వరుండును, నంభోధివసనసంభాసమాన కుంభినీవలయసంభరణదీక్షాసమారంభ సుభగంభా వుకగంభీరభేరీభాంకరణ దంభశుంభదంభోధరగర్జాసముజ్జృంభణ సంభావితాత్మీ యపట్టాభిషేకసమయసముత్తంభితశాతకుంభకుంభనిగుంభితాంభోవర్ష విద్రావి

తక్షుద్రనృపోపద్రవతాపభద్రవద్రసానిత్య రసార్ద్రితానుసంధాయక దైనందిన దానధారాప్రవాహుండును, నసమసమరసముత్సాహసాహస హాసితసితవాహుండును, నభంగభువనమంగళసర్వస్వ మరకత వండపుండరీకాగ్రవర్ణనీయ సువర్ణకలశకర్ణికాధిష్ఠిత రాజ్యలక్ష్మీరతోల్పధానాడంబర సంబోధకాంబురుహబంధుబింబానుబింబ వైభవుండును, త్రైలోక్యవినుత చాళుక్య నారాయణాజ్ఞాసంకల్పితాశేష పోషణప్రాభవుండును, గృపాణకృష్టనిర్మథ్యమాన రణార్ణవనముత్పన్న విజయలక్ష్మీనితీక్షిత్త నిరుపమ నిరీక్షణనర్మకరమకరపతాకాలోకన మాత్రసంపాదిత కంపస్వేదభీరూభవన్నానావజీర సేనామానభేదనుండును, శ్రీరామచంద్ర చరణకమలయుగళాభివాదనుండును, నాత్రేయగోత్రపావనుండును, నఖిలకర్ణాటరాజ్యపునరుజ్జీవనుండును, శ్రీరంగరాజరత్నాకర పూర్ణచంద్రుఁడును నగు తిరుమలరాయదేవేంద్రుండు, నిస్తంద్రవిభవసాంద్రుండై యొక్కనాఁడు వజ్రకీలితద్వారబంధబంధురలక్ష్మీవిలాసంబు జననసమయజలాంతర్లక్ష్యమాణజలజసవనాసమాగమనసంపదసొంపు సంపాదింప సాభోగయవనికాభ్యంతరసవ్యస్నముద్యతయంత్రపాంచాలికాసంచారంబులు జిలుగుతరంగలమరుంగుదొరంగివచ్చు నచ్చరమెఱుంగుబోండ్ల తెఱంగు లెఱుంగింపఁ జంద్రకాంత భిత్తిబింబిత చంద్రాననావదనంబులు తరంగభక్తిబహూకృత నవేందుబింబంబుల యందంబు పొందుపఱుప నభినవస్ఫటికోపలసంస్థాపిత సోపానపార్శ్వకరికరాకారరేఖావిశేషంబులు సప్రతిచ్ఛాయసంజాయమానసంక్రందనవేదండశుండాదండప్రచారంబులం బచరింపఁ గలశవారాశిచెలువునం బొలు పలరు విమలపట్టాంబరవితానవిద్యోతమాన మహాస్థానభవనరాజంబునం దెలిదీవిఁ దీవి నలరు నమూల్యముక్తామయసింహాసనంబున సుఖాసీనుండై సామంతమకుటఘట్టనజాత జాతరూపరేణుపరంపరఁ బీతాంబరత్వంబు వహించిన మిత్రవర్గంబుతో సారూప్యదేదీప్యమానభక్తోపలాలనపరాయణుండగు నాదినారాయణు కరణి సిరుల నిర వొందుచు. 14

వెండియుఁ = మఱియును, ప్రచండ=మిక్కిలితీక్ష్ణమైన, రుచి = తేజస్సుచేత, పిచండిల = పరిపూర్ణమైన, మార్తాండమండల = సూర్యమండలమువలె, పాండిత్య=సామర్థ్యము చేత, భూషిత= అలంకరింపఁబడిన - అనఁగా సూర్యమండలమువలె సముజ్జ్వలమైన, భుజార్గళ=తలుపున కడ్డము వేయుం గడియమానులవంటి భుజములయొక్క, నిరర్గళ=అడ్డములేని, ప్రతాప=పరాక్రమముయొక్క, దీపిత= తేజరిల్లుచున్న, వర్తమానార్థమం దుక్తప్రత్యయము. ప్రకాశ=ప్రకాశముచేత, కౌశికీభూత=గుడ్లగూబవలె నంధులైనవారును, ఇంద్రులైనవారును, (ని. 'మహేన్ద్రగుగ్గులూలూకవ్యాళగ్రాహిషు కౌశికః' అని అ.) కదనభూతల=యుద్ధభూమియందు, భీత=భయపడినవారును, అభీత=భయపడనివారునునగు, విమతక్ష్మాధీశ్వరుండును=శత్రురాజులుగలవాఁడును, ఇక్కడ క్రమాలంకారము. అనఁగా నీరాజుయొక్క మిక్కిలి తీక్ష్ణమైన భుజపరాక్రమముచేత యుద్ధమందు భయపడి పాఱిపోయిన శత్రురాజులు

గుడ్లగూబలవలె: గొందగుహలయందుఁ జొచ్చిరనియు, భయపడక నిల్చి మృతిఁబొందినవార లింద్రుని వలె స్వర్గభోగము లనుభవించిరనియుం దాత్పర్యము.

తిరుమలదేవరాయల పరాక్రమము సూర్యమండలమువలెఁ బ్రకాశించుచుంటచే విరోధు లెదిరింపఁజాలక గ్రుడ్లగూబలవలె గొందులలోఁ జేరిరనియు, పౌరుషశాలురగువా రాపరాక్రమమును సూర్యమండలము భేదించి స్వర్గమును జేరి యింద్రులైరనియు గ్రాహ్యము. అలంకారము సావయవరూపకము. (ప్రతాపము సూర్యమండలముతో సాదృశ్యముగాఁ జెప్పుటచే విరోధు లింద్రులైరనుటలో నంతగాఁ బ్రయోజనము లేదని యొకవ్యాఖ్యాత చెప్పెను గాని యది గణనీయముగాదు. ప్రతాపము సూర్యమండలముగఁ జెప్పుటచే ప్రతాపమున కడ్డుపడునటుల సూర్యమండలము భేదించెననియు నక్కతన విరోధిసేన యింద్రత్వము నొందె ననుభావము సుగమము.)

విశ్వ=సమస్తమైన, విశ్వంభరా=భూమిచేత, అనఁగా భూమియందలి జనులచేత, వినుత=స్తోత్రము చేయఁబడిన, శాశ్వత=స్థిరమైన, ఐశ్వర్య=ఐశ్వర్యముయొక్క, ధుర్యతా=ధురంధరత్వమందు, మహేశ్వరుండును=శివుఁడైనవాఁడును,

అంభోధి=సముద్రమనెడి, వసన=వస్త్రముచేత, సంభాసమాన=మిక్కిలి ప్రకాశించుచున్న, కుంభినీవలయ=భూమండలముయొక్క, సంభరణ=భరించుటయందలి, దీక్షా=దీక్షయనెడు, శుభారంభ=శుభకార్యారంభమందు, సుభగంభావుక=మనోహరమగుచున్న అని యర్థము. అంభోధివసనసంభాసమాన=సముద్రమనెడు వస్త్రముచేత మిక్కిలి ప్రకాశించుచున్న, కుంభినీ=భూదేవియొక్క, వలయసంభరణదీక్షా శుభారంభ=కంకణధారణదీక్షా శుభారంభమందు, సుభగంభావుకమైన యని ప్రకారాంతరము. ఇక్కడఁ గుంభినికిని దద్గతస్త్రీలింగగమ్యమయిన లౌకికనాయికకును నభేదాధ్యవసాయము. సముద్రము దారణయోగ్య వస్త్రముగానున్న భూమండలమును భరించుటకుఁ దిరుమలరాయలు దీక్షవహించుటచే శుభసూచకముగ భేరులు మ్రోఁగెననియు, భూమిని యను చెలువ కంకణములదాల్చు శుభావసరమున మంగళధ్వనిరూపములుగ భేరులు మ్రోఁగెననియు భావము.

గంభీర=గుంభనముగలిగిన, భేరీభాంకరణ=భేరీభాంకారమనెడి, దంభ=మిషగలిగిన, శుంభత్=ప్రకాశించుచున్న, అంభోధరగర్జా = మేఘధ్వనియొక్క, సముజ్జృంభణ = విజృంభణముచేత, సంభావిత=బహుమానింపఁబడిన, ఆత్మీయ=తనదైన, పట్టాభిషేకసమయ=పట్టాభిషేకకాలమందు, సముత్తంభిత=మిక్కిలియెత్తఁబడుచున్న, శాతకుంభ=సువర్ణవికారములైన, (ని. 'తపనీయం శాతకుమ్భం' అని అ.) కుంభ=కలశములనుండి, నిగుంభిత=వెడలింపఁబడుచున్న, అంభః = ఉదకమనెడి, వర్ష=వృష్టిచేత, విద్రావిత=పోఁగొట్టఁబడిన, (ని. 'ప్రద్రావోద్దావసంద్రావవిద్రావాః' అని అ.) క్షుద్రనృప=నీచప్రభువులని, ఉపద్రవ=బాధయనెడు, తాప=తాపముగల, భద్రవత్=భద్రవతియైన, రసా=భూమికి, నిత్య = ఎడతెగకుండునట్లు, రసార్ద్రితా=ఉదకముచేతఁ దడిసియుండుటకు, అనుసంధాయక=ఘటనపఱచుచున్న, దైనందిన=ప్రతిదినమందైన, దానధారాప్రవాహుండును=దానోదకధారాప్రవాహముగలవాఁడును, ఈచెప్పుటచేత భూమికిఁ దాపనివారణ రూపఫలమును భద్రప్రాప్తి యనఁగా నిష్టావాప్తిరూపఫలమును సిద్ధించెననియును రాజుయొక్క పట్టాభిషేకకాలమందే సకలోపద్రవనివారణమాయెననియును పట్టాభిషేకానంతరమందు నిత్యమును నర్థుల కర్థము లిచ్చుచుండెననియును నాశయము.

భూమియనుసతి నీచనృపులవలని బాధయను తాపముచేఁ బరితపించుతఱి శిశిరకృత్యములచేఁ దాపమును బోఁగొట్టవలయును గావున దానధారలచే రసార్ద్రీభావము సంతరించె ననియు, దానధారలు ప్రతిదినమును నతిశయించుటచే ధారాజలము ప్రవాహరూపము దాల్చెననియుఁ దిరుమలరాయ లవతరించి భూకాంతసౌఖ్యము గడించుటచే భద్రవతి యయ్యెననియు భావము. భేరీభాంకరణము మేఘధ్వనిగను పట్టాభిషేక సమయావర్జితశాతకుంభకుంభములు మేఘములుగాఁ జెప్పఁబడుటచే భూమికి రసార్ద్రీత సమస్తావయవములకుఁ జెందెనని గ్రహింపనగును. అలంకారములు.అతిశయోక్తి రూపకకావ్యలింగ, అపహ్నవములు.

అసమ = సమానరహితమైన,సమర=యుద్ధమందలి, సముత్సాహ=మిక్కుటమైన యుల్లాసముచేతను, సాహస=తెగువచేతను, హసిత=పరిహసింపఁబడిన, సితవాహుండును = శ్వేతవాహనుఁడయిన యర్జునుఁడును,

అంభగ=భంగములేనిదియు, భువనమంగళసర్వస్వ=జగన్మంగళమునకు యావద్ధనమైనదియు, మరకతదండ=మరకతరత్నమయమైన కాడగలిగినదియునగు, పుండరీక=శ్వేతచ్ఛత్రమనెడి, అభంగ=తరంగప్రసారములేనిదియు, భువనమంగళసర్వస్వ=సలిలమంగళమునకు యావద్ధనమైనదియు, మరకతదండ=మరకతమణివలె పచ్చనైనమృణాళము గలిగినదియు, (ని. 'భఙ్గ స్తరఙ్గే రుగ్భేదే భేదే జయవిపర్యయే, భువనం విష్టపే లోకే సలిలేపి వియత్యపి.' అని వి). (మకరవక్త్రాజ్జాతం మరకతం) మకరవక్త్రమువలన రత్నములు పుట్టునని ప్రసిద్ధి. శ్లో. 'ప్రసహ్య మణి ముద్ధరే న్మకరవక్త్రదంష్ట్రాంతరాత్' అని భర్తృహరి. మకర వక్త్రమునందు రత్నము లుదయించు ననుటకు రత్నశాస్త్రమునందలి యీ పద్యము దృష్టాంతము కాఁగలదు.

క. "జలధరఫణిఫణకీచక, జలచరకరిమస్తకేక్షుశంఖవరాహో
జ్జ్వలదంష్ట్రశుక్తు లుదరం, బుల ముత్యము లొదవు వర్ణములు వివిధములై."

ఈశబ్దమువలె వర్ణవ్యత్యయసిద్ధములైన శబ్దము లనేకములు గలవు. కశ్యపః, పశ్యకః, హింసికా, సింహికాఇత్యాదులు. పుండరీక=తెల్లతామరయొక్క, అగ్ర=కొనయందలి, వర్ణనీయ=స్తోత్రముచేయఁదగిన సువర్ణ కలశ=శ్వేతచ్ఛత్రాగ్రమందలి బంగారపుకలశ మనెడి, కర్ణికా=దిమ్మెయందు, అధిష్ఠిత=నివసించిన, రాజ్యలక్ష్మీ=రాష్ట్రసంపదయొక్క, రత్నోపధాన=పద్మరాగమణిమయమైనయొరుగుడుబిళ్ళయొక్క, ఆడంబర = విజృంభణమునకు, సంబోధక = తెలివిడిపఱచునట్టి, అనఁగా నొరుగుడుబిళ్లయొక్క విలాసమును గనుపఱచుచున్నట్టి, అంబురుహబంధుబింబ = సూర్యబింబముయొక్క, అనుబింబ=ప్రతిఫలించుటయొక్క, వైభవుండును = వైభవముగలవాఁడును, అనఁగా నీరాజుయొక్క శ్వేతచ్ఛత్రసువర్ణకలశమందు సూర్యబింబము ప్రతిఫలింపఁగా నెట్లుండుననిన నాశ్వేతచ్ఛత్ర మనెడి శ్వేతపద్మమందు నివసించియుండు రాజ్యలక్ష్మియొక్క కెంపులుగూర్చిన యొరుగుడుబిళ్లయో యనునట్లుండునని తాత్పర్యము. ని. 'పుణ్డరీకం సితామ్భోజే సితచ్ఛత్రేపి భేషజే' అని వి.

మరకతదండముతోడను వర్ణకలశముతోడను నొప్పారి భువన(లోక-జల)మంగళసర్వస్వమగు శ్వేతచ్ఛత్రము పుండరీకమని చెప్పఁబడుటచే ఛత్రదండము మృణాలమనియు ఛత్రాగ్రమునఁగల సువర్ణకలశమె కర్ణికయనియు నందు రాజ్యలక్ష్మి నివసించుచున్నదనియుఁ బ్రతిబింబరూపముగ నున్న

సూర్యబింబ మెరుగుడుబిళ్లయనియు నెఱుంగ నగును. శ్వేతచ్ఛత్రమునకుఁ బుండరీకమనియు నందుఁ బ్రతిబింబించు సూర్యునకు అంబుజబంధుఁడనియుఁ జెప్పుటచే రత్నఖచితమగు శ్వేతచ్ఛత్రము సూర్య కిరణప్రసారముచేఁ బ్రజ్వరిల్లుచుండెనని స్వారస్యము.

త్రైలోక్య = మూఁడులోకములవారిచేత, వినుత=స్తోత్రముచేయఁబడిన, చాళుక్యనారాయ ణాంక = చాళుక్యనారాయణబిరుదనెడి నామముచేత, సంకల్పిత=సంకల్పింపఁబడిన, అశేషపోషణ ప్రాభవుండును=సమస్తజనపోషణమందు సామర్థ్యముగలవాఁడును, నారాయణమూర్తి సర్వప్రపంచ పోషకుఁడౌట ప్రసిద్ధంబకదా.

కృపాణ=ఖడ్గమనెడు, కృష్ణ-కృష్ణనామముగల విష్ణువుచేత, నిర్మథ్యమాన=లెస్సగా మథింపఁ బడుచున్న, రణార్ణవ=యుద్ధమనెడుసముద్రమువలన, సముత్పన్న=ఉద్భవించిన, విజయలక్ష్మీ=విజయ సమృద్ధియనెడు సంపదచేత, నిక్షిప్త=ప్రసరింపఁజేయఁబడిన, నిరీక్షణ=చూపులయొక్క, నర్మ కర= విలాసమునుగలుగఁజేయుచున్న, నిరీక్షణములో యన్నట్టులుగానున్న, మకరపతాకా=చిత్రితమకరా కారములుగల టెక్కెములయొక్క, అనఁగా బైతకునిషానీలయొక్క, ఆలోకనమాత్ర=చూచుటమా త్రముచేత, సంపాదిత= సంపాదింపఁబడిన, కంప=వణఁకును, స్వేద=చెమటయునుగలిగి, భీరూ భవత్=భయశీలురగుచున్న, నానా = సమస్తమైన, వజీర=మ్లేచ్ఛప్రధానులయొక్క, సేనా=సైన్య ములయొక్క, మాన=గర్వమును, భేదనుండును=పోఁగొట్టినవాఁడును, మకరపతాకలు విజయలక్ష్మీ నిరీ క్షణములవంటివి గనుక తదాలోకనముచేత వజీరసైనికులు కంపస్వేదరూపశృంగారానుభావములు గల వారైరనుట, కంపస్వేదములు శృంగార భయానకరస సాధారణములు గనుక భీరూభవద్వజీర సేనల యొక్క భయానకరసకార్యములైన కంపస్వేదములను శృంగారరసకార్యములైన కంపస్వేదములనుగా నధ్యవసించినాఁడు.

లక్ష్మి సముద్రమథనమున జనించినటుల విజయలక్ష్మిగూడ జనించెను. ఎటులన, ఖడ్గమను విష్ణువుచే మథింపఁబడిన సంగ్రామమనెడు సముద్రమునందు లక్ష్మివలె విజయలక్ష్మి జన్మించినదనియుఁ నాయమ వాలారుచూపులవలె మకరపతాక లొప్పుటచే దురకవజీరులు కంపము స్వేదము (వణఁకుట, చెమర్చుట) శృంగార భావవికారముల నొందిరనిభావము. చూపులు రూపమునకంటె మోహకరములనుట నిర్వా దాంశము. ''విలాసినీసమంచిత తరళాక్షిపాతములచే గెలువంబడి రింద్రముఖ్యులు'' అను పద్య మిట ననుసంధించుకో నగును.

శ్రీరామచంద్ర=శ్రీరామస్వామియొక్క, చరణకమలయుగళ=పాదకమలద్వంద్వమునుగూర్చి, అభివాదనుండును=నమస్కారములు గలవాఁడును, ఆత్రేయగోత్ర పావనుండును = ఆత్రేయగోత్ర మును బవిత్రముచేసినవాఁడును, అనఁగాఁ దద్గోత్రజుఁడనుట, అఖిలకర్ణాటరాజ్యపునరుజ్జీవనుండును, అఖిల = సమస్తమయిన, కర్ణాటరాజ్య = కర్ణాటరాజ్యముయొక్క, పునరుజ్జీవనుండును = మరల నుద్ధ రించుటగలవాఁడును, శ్రీరంగరాజరత్న=శ్రీరంగరాజశ్రేష్ఠుఁడనెడు, రత్నాకర=సముద్రమునకు, పూర్ణ చంద్రుండును = రాకాసుధాకరుండును, అగు=అయినట్టి, తిరుమలరాయ దేవేంద్రుండు=తిరుమల రాయశ్రేష్ఠుఁడు, ఇంతపర్యంతము జోడుగా నంత్యనియమములు చెప్పినాఁడు. నిస్తంద్రవిభవసాం ద్రుండై=నిశ్చలమైన యైశ్వర్యముచేత సంపూర్ణుఁడై, ఒక్కనాఁడు=ఒకదినమందు,

ఇక్కడనుండి యీరాజుయొక్క సభామంటపమును క్షీరసముద్రముగాను సింహాసనమును శ్వేతద్వీపముగాను రాజు నాదినారాయణమూర్తినిగాను వర్ణించుచున్నాఁడు. ఎట్లనిన, వజ్రకీలిత=వజ్రమణులుదాపిన, ద్వారబంధ=ద్వారబంధమందు, అనఁగా లక్ష్మికమ్మియందు, బంధుర=సుందరమౌచున్న, లక్ష్మీవిలాసంబు=లక్ష్మీప్రతిమయొక్క విలసనము, జననసమయ=జన్మించుసమయమందు, జలాంతర్లక్ష్యమాణ=ఉదకములోపలఁ గనుపడుచున్న, జలజసదనా=లక్ష్మీదేవియొక్క, సమాగమనసంపద=వచ్చునట్టి వైభవముయొక్క, సొంపు=శృంగారమును, సంపాదింపన్=కనుపఱుప, సాభోగ=పరిపూర్తతోఁగూడిన, అనఁగా విశాలమైన, యవనికా=తెరయొక్క, అభ్యంతర=లోపలనుండి, సద్యః=అప్పుడె, సముద్యత=బయలువెడలి రాఁజూచుచున్న, యంత్రపాంచాలికా = కీలుబొమ్మలయొక్క, సంచారంబులు=ప్రచారములు, (ని. 'పాఞ్చాలికా పుత్త్రికాస్యా ద్వస్త్రదన్తాదిభిఃకృతా' అని అ.) జిలుగుతరంగలమరుంగుదొరంగి వచ్చు=సాంద్రములైన యలలయొక్క మరుగునువిడిచివచ్చుచున్న, అచ్చరమెఱుంగుబోండ్ల=పఁప్సరః స్త్రీలయొక్క, తెఱంగులెఱుంగింపన్=విధములను దెలియఁజేయుచుండఁగా, తరంగలనుటకు, క. పులకము లలకము లనఁగాఁ, బులక లలక లనఁ దరంగములు నాఁగఁ దరం, గలు తరగ లనఁగ హంసం,బులు హంస లనంగఁ గృతులఁ బొలుచుముకుందా. అని యుదాహరణము. చంద్రకాంత=చంద్రకాంతమణినిర్మితములైన, భిత్తి=గోడలయందు, బింబిత=ప్రతిఫలించిన, చంద్రాననావదనంబులు = చంద్రునివంటిముఖములుగల స్త్రీలయొక్క వదనములు, తరంగభక్తి = తరంగములయొక్కరచనచేత, బహూకృత=అనేకములుగాఁజేయఁబడిన, నవ = నూతనమైన, ఇందుబింబంబుల=చంద్రబింబములయొక్క, అందంబులు = చక్కఁదనములను, పొందుపఱుపన్ = చక్కఁజేయుచుండఁగా,

అభినవ=మిక్కిలినూతనములైన, స్ఫటికోపల = స్ఫటికమణులచేత, సంస్థాపిత=స్థాపింపఁబడిన, సోపానపార్శ్వ=మెట్లప్రక్కలయందలి, కరికరాకార=గజతుండాకృతులుగాఁ దీర్పఁబడిన, రేఖావిశేషంబులు=రేఖాభేదములు, సప్రతిచ్ఛాయ = ప్రతిబింబముతోఁ గూడునట్టులుగా, సంజాయమాన=జన్మించుచున్న, సంక్రందనవేదండ=ఐరావతముయొక్క, శుండాదండ=తుండముయొక్క, ప్రచారంబులన్=విధములను, పచరింపన్=కల్పించుచుండఁగా, కలశవారాశిచెలువునఁబొలుపలరు=క్షీరసముద్రమువలె నొప్పుచున్న, విమల=స్వచ్ఛమైన, పట్టాంబర=పట్టువస్త్రముయొక్క, వితాన=మేలుకట్టుచేత, (శ్లో. 'అస్త్రీవితానముల్లోచః' అని అ.) విద్యోతమాన=మిక్కిలియుఁ బ్రకాశించుచుండెడు, మహాస్థానభవనరాజంబునన్ = ఘనమైన యాస్థానమంటపశ్రేష్ఠమందు, తెలిదీవికీవినలరు = శ్వేతద్వీపమువలె నొప్పుచున్న, కీవియనుపద మన్యదేశ్యము. అమూల్యముక్తామయసింహాసనంబునన్ - అమూల్య = విలువలేనట్టి, ముక్తామయ = ముత్తియములుగూర్చిన, సింహాసనంబునన్ = సింహాసనమందు, సుఖాసీనుండై = హాయిగాఁ గూర్చున్నవాఁడై, సామంత = సమానప్రతిపత్తిగలరాజులయొక్క, మకుట=కిరీటములయొక్క, ఘట్టన = ఒరయికలచేతను, జాత = పుట్టిన, జాతరూప రేణు = బంగారపురజముయొక్క, (శ్లో. 'చామీకరం జాతరూపం' అని అ.) పరంపరన్ = వరుసలచేత, పీతాంబరత్వంబువహించిన = పచ్చనివస్త్రములుగలుగుటనుదాల్చినవిష్ణుసారూప్యమువహించిన, మిత్రవర్గంబుతోన్ = స్నేహితులసమూహముతో, అనఁగా సామంతరాజుల కిరీటములు రాపాడిరాలిన బంగారపురజముచేత దగ్గిరనున్న స్నేహితుల వస్త్రములన్నియు బంగారువస్త్రములవలె నుండెనని

భావము. సారూప్య=సమానరూపత్వముచేత, దేదీప్యమాన=మిక్కిలి ప్రకాశించుచున్న, భక్త=ఏకాంతులయొక్క, ఉపలాలన=మన్ననయందు, పరాయణుండగు=ఆసక్తుఁడైన, ఆదినారాయణుకరణిన్ = శ్వేతద్వీపనివాసుఁడైన యాదినారాయణమూర్తివలె, సిరుల నిరవొందుచున్=సకలైశ్వర్యములచేత నొప్పుచున్నవాఁడై, అని ముందర కన్వయము.

సీ. కటకేంద్రుఁ డంపిన•గంధసింధురము లాత్మస్వామిమారుహ•స్తములు మొగుప
హయనాథుఁ డంపిన•హరులుకైజామోర లార్పుచుఁ బతికి జో•హారు సేయ
నావాడపతిపంపి•నయమూల్యకటకముల్ కర్తపేరుగఁ బదా•గ్రములఁ బెనఁగఁ
బాండ్యేశుఁ డంపిన•భర్మంబు లధిపతి ప్రతిగా నిజాంకము•ద్రలు వహింప
తే. శౌర్యకీర్తులతో వచ్చు•సకలదిఙ్న
రేంద్రరాజ్యేందిరలమాడ్కి • నిగురుబోండ్లు
చటులమాణిక్యమయదండ•చారుచామ
రములు వీవంగఁ బేరోల•గమున నుండి. 15

కటకేంద్రుఁడు=కటకపురిరాజు అనఁగా గజపతి, అంపిన=పంపించిన, గంధసింధురములు=మదపుటేనుఁగులు, ఆత్మస్వామిమారు=తమరాజు ప్రత్యామ్నాయముగా, హస్తములు మొగుపన్=చేతులు జోడించి మ్రొక్కఁగానని యర్థము. తుండములు ముడవఁగాననిభావము. ని. 'హస్తోనక్షత్ర భేదేస్యాత్కరేభకరయోరపి' అని వి.

కటకపాలకుఁడు గజపతియగుటచే నేనుఁగులను బంపెననియు నవి హస్తములను మోడ్చి తమ యజమానులకు బదులుగా రాజభక్తి సామంతధర్మము ప్రచురింపసాగెను.

హయనాథుఁడంపిన=అశ్వపతిపంపించిన, హరులు=గుఱ్ఱములు, కైజామోరలార్పుచున్=కైజామోరలనఁగా, కళ్లెముతో వెనుకబిగించిపెట్టిన మూతులు, వానినల్లార్పుచున్=చిమ్ముచు, పతికిన్= తమరాజునకుఁ బ్రతిగాననుట, జోహారుసేయన్=దండములు పెట్టఁగా,

అశ్వపతులగు మహమ్మదీయులంపిన జాతిగుఱ్ఱములు కళ్లెపుఁబూన్కిచే మెడలు మూతులు బిగఁబట్టి కదలించుచు నుంట నమస్కారసమయమునందలి తలకదల్చుటతో సమముగా నుండెననియుఁ దమప్రభువులకు మాఱుగ నమస్కరించుచుండెనని యెఱుంగనగును.

నావాడపతిపంపిన=నావాడదేశాధిపతిపంపించిన, ఇక్కడ నావాడ యనఁగా దేశవిశేషవాచకమగు నకారాదిపదము, అమూల్యకటకముల్=విలువలేనట్టి గండపెండెరములు, కర్తపేరుగన్= తమరాజు పేరుగా, పదాగ్రములఁబెనఁగన్=పాదాగ్రంబులయందుఁ బెనుచుకొనఁగా,

నావాడదేశప్రభువుపంపిన కటకాద్యాభరణములు ప్రభువునకు మాఱుగాఁ బాదములను బెనఁగి విడువకుండెను. దోషులగువారు పాదములపైఁబడి వదలక పెనఁగినటులఁ గటకములుండెను.

పాండ్యేశుఁడంపిన=పాండ్యదేశాధిపతి పంపిన, భర్మంబులు=సువర్ణంబులు, అధిపతిప్రతిగాన్ =తమరాజునకు బదులుగా, ఇక్కడ ప్రతి యనునది దేశ్యపదము గాని సాంస్కృతికావ్యయము గాదు. 'ప్రతిమాటలేటికిఁ బలుకవయ్యా' యని శబ్దానుశాసనుప్రయోగము. నిజ=తనయొక్క, అంకముద్రలు వహింపన్=తిరుమలరాయఁడు వరాహధ్వజుఁడు గనకలాంఛనమైన వరాహముద్రల బొమ్మన

ధరింపఁగానని యర్థము. ఉరస్థ్సలముచే ముద్రలువహించుట దాస్యలక్షణము. నామముద్రలు వహింపఁగానని భావము.

పాండ్యరాజు పంపినసువర్ణము తమరాజునకు మాఱుగాఁ దామె ప్రభునామాంకచిహ్నితములై నాణెములై యొప్పారుచుండెను.

శౌర్యకీర్తులతోవచ్చు=వారివారి ప్రతాపకీర్తులతోఁగూడవచ్చిన, సకలదిఙ్నరేంద్ర రాజ్యేందిరలమాడ్కిన్=సమస్తదిక్కులయందుండురాజులయొక్క రాజ్యలక్ష్ములో యన్నట్టులుగా, ఇగురుబోండ్లు=స్త్రీలు, చటుల=ప్రకాశములైన, మాణిక్యమయ=పద్మరాగమణి వికారములైన, దండ=కాఁడలచేత, చారు=సుందరములైన, చామరములన్=వెల్లచోరీలచేత, వీవంగన్=విసరుచుండఁగా, ఇక్కడ ప్రతాపమెఱ్ఱనిదియుఁ గీర్తి తెల్లనిదియుం గనుకఁ బ్రతాపమునకును బద్మరాగమణిదండములకును గీర్తికిని జామరములకును రాజ్యలక్ష్ములకును జామరగ్రాహిణులైన స్త్రీలకును నుపమానోపమేయభావము. పేరోలగమునసుండి=పెద్దకొలువునందున్నవాఁడై, దీనికి ముందరిపద్యముతో నన్వయము.

అలంకార ముత్ప్రేక్ష. మూఁడునాలుగుపాదములం దతిశయోక్తి దిగ్విజయరాజవైభవాదికములు పేర్కొనఁబడుటచే ఉదాత్తాలంకారము.

తాత్పర్యము. కటకేశ్వరుఁడంపిన మాతంగములు అశ్వపతులంపిన యశ్వరాజములు కొలువుసావడిలో నందముగనుండఁ గటకరాజంపిన యాభరణములను ధరించి పాండ్యాధిపుడొసంగిన సువర్ణమును నాణెములుగా నుపయోగించుచుఁ బూవుబోండ్లు పరరాజన్యుల కీర్తిప్రతాపములఁబోలు వింజామరలను గెంపులుచెక్కిన పిడులుగల వానినిధరించి వీచుచుండఁ దిరుమలరాయలు కొలువుతీఱె. (ముందఱిపద్యముతో నన్వయము.)

మ. నను శ్రీరామపదారవిందభజనానందున్ జగత్ప్రాణనం
దనకారుణ్యకటాక్షలబ్ధకవితాధారాసుధారాశిసం
జనితైకైకదినప్రబంధఘటికాసద్యశ్శతగ్రంథక
ల్పను సంగీతకళారహస్యనిధిఁ బిల్వం బంచి పల్కెం గృపన్. 16

శ్రీరామ=శ్రీరామునియొక్క, పదారవింద=పాదపద్మములయొక్క, భజన = సేవయందలి, ఆనందున్=సంతోషముగలవాఁడనైన, జగత్ప్రాణనందన=వాయుకుమారుఁడైన హనుమద్దేవునియొక్క, జగత్ప్రాణశబ్దము సాభిప్రాయముగానఁ బరికరాఙ్కురాలంకారము. శ్లో. 'సాభిప్రాయే విశేష్యేతు భవే త్పరికరాఙ్కురః' అని లక్షణము. జగత్తులకుఁ బ్రాణభూతుఁడు గనుక నధికమాహాత్మ్యముగలవాఁడని యభిప్రాయము. కారుణ్యకటాక్ష=కృపాకటాక్షముచేత, లబ్ధ=పొందఁబడిన, కవితాధారా=కవిత్వధారయనెడు, సుధారాశి=అమృతరాశివల్ల, సంజనిత=ఉద్భవించుచున్న, ఏకైకదిన ప్రబంధ=ఒక్కొక్కదినమునకు నొక్కొక్కప్రబంధముయొక్కయును,

కవితాధారయే యమృతరాశిగాఁ జెప్పఁబడుటచే రామరాజభూషణునికవిత సజీవమైనదనియు నేకైకదినప్రబంధాదికములు ఆయమృతవారాశిలో నుప్పతిల్లు నమృతబిందువులనియుఁ గవిభావము.

ఘటికాసద్యశ్శతగ్రంథ=ఒకగడియకు నొకశతకముయొక్కయును, కల్పనన్=కల్పించుట గలిగినవాఁడనైన, సంగీతకళా=సంగీతవిద్యయొక్క, రహస్య=మర్మములకు, నిధిన్=స్థానభూతుఁడ

నైన, ననుఁ=నన్ను, పిల్వంబంచి=పిలుపించి, కృపన్=దయారసముచేత, పల్కెన్=సంభాషించెను. ఆ సంభాషించిన క్రమమును ముందరిపద్యములోఁ జెప్పుచున్నాఁడు.

తాత్పర్యము. శ్రీరాముని సేవాసంబంధమగు నానందమున మునిఁగి తేలువాఁడును, ఆంజనేయ కరుణాలబ్ధ కవితావిభవుఁడును, సంగీతరసవిదుఁడును నగు రామరాజభూషణుని గాంచి తిరుమలదేవరాయ లిటులఁ గృపాపూర్వకముగఁ బల్కెను.

శా. శ్రీరామక్షితిపు న్మదగ్రజు జయ♦శ్రీలోలు నానాకళా
పారీణుఁ బహుసంస్కృతాంధ్రకృతులం♦ బల్మారు మెప్పించి త
త్కారుణ్యంబున రత్నహారహయవే♦దండాగ్రహారాదిస
త్కారం బందితి రామభూషణకవీ♦ ధన్యుండ వీ వన్నిటన్. 17

నానాకళాపారీణుఁ=సమస్తమైనవిద్యలయందుఁ దుదముట్టినవాఁడును, జయశ్రీలోలుఁ=జయలక్ష్మియం దాసక్తుఁడైనవాఁడును, మదగ్రజుఁ = నాయన్నయైనవాఁడునునగు, శ్రీరామక్షితిపుఁ=సంపద్యుక్తుఁడైనరామదేవరాయలను, బహుసంస్కృతాంధ్రకృతులఁ=అనేకములైన సంస్కృతాంధ్రభాషాకావ్యములచేత, పల్మాఱుమెప్పించి=మాటిమాటికి మెప్పించి, తత్కారుణ్యంబునన్=ఆతనిదయచేత, రత్నహార = మణిహారములును, హయ=గుఱ్ఱములును, వేదండ=ఏనుఁగులును, అగ్రహార=అగ్రహారములును, ఆది=మొదలుగాఁగల, సత్కారంబు=బహుమానమును, అందితి=పొందితివి, రామభూషణకవీ=రామభూషణనామధేయముగల కవీ, ఈవు=నీవు, అన్నిటఁ=సమస్తవిధములచేత, ధన్యుండవు=కృతార్థుండవు.

వేదండమన్నచోట, 'వేద స్సామవేదః అండో జననకారణంయస్యేతివేదండః' సామవేదమే జననకారణముగాఁగలిగినదిగనుక వేదండమని విగ్రహము. ఈశబ్దము శకంధ్వాదిగణాంతఃపాతి గనుక సవర్ణదీర్ఘమురాక పరరూపమువచ్చినది. శకంధ్వాదులయందు స్వరవ్యంజనములు రెండును విశ్రమము లగునుగానఁ దకారవిశ్రమము చెప్పినాఁడు.

అలంకారము. కావ్యలింగము.

తాత్పర్యము. తిరుమలరాయఁడు రామ(రాజ)భూషణునిగాంచి సమస్తవిద్యాపారంగతుఁడును విశేషించి నా కగ్రజుఁడునగు రామరాయలమెప్పించి సమస్తసత్కారములనొంది సంస్కృతాంధ్రగ్రంథరచనము గావించియున్నాఁడవు. నీ వన్నిటఁ గృతార్థుఁడవని పలికెను.

తే. తరుతటాకాదిసంతతు♦ల్ధరణి నెచట, నిలిపి రచటనె యుండువా♦నికిని గృతిము
ఖంబునసె విశ్వవిఖ్యాతి♦గానఁ గృతియొ,సంతతివతంస మది మాకు♦సంఘటింపు.

తరుతటాకాదిసంతతులు, తరు=వృక్షవనప్రతిష్ఠయును, తటాక=చెరువుద్రవ్వించుటయును, ఆది=మొదలుగాఁగలిగిన, సంతతులు=సంతానములు, ధరణిన్=భూమియందు, ఎచటనిలిపిరి=ఎక్కడఁ బ్రతిష్ఠ సేయుచున్నారో, అచట నేయుండుఁ=అక్కడ నేయుండును, సప్తసంతానములనఁగా, వనము, తటాకము, ధననిక్షేపము, అగ్రహారము, దేవాలయము, కుమారుఁడు, కృతి, అనునివి. శ్లో. 'బ్రహ్మ ప్రతిష్ఠా సన్తానం తటాకో వన మేవచ, కృతి ర్దేవాలయం చైవ నిక్షేపః సప్తసన్తతిః' అని ప్రమాణము. క. 'తనయుఁడు చెఱువును గావ్యం,బు నిధానము గుడి వనంబు భూదేవస్థా, వనమును

ననునియ్యెడును, జనుశాస్త్రములందు సప్తసంతతు లనఁగన్.' అప్ప. ఇందుఁ గృతిగాక తక్కినసంతానములు ప్రతిష్ఠ సేసినచోటనే యుండుననియును గృతిమాత్రము సర్వత్ర వ్యాపించునదియనియును దాత్పర్యము. వానికిని=తక్కిన యాసంతానములకును, కృతిముఖంబుననె=కృతిమూలముచేతనే, విశ్వవిఖ్యాతిగానన్=ప్రపంచమునందుఁ బ్రసిద్ధిగలుగునుగనుక, కృతియె=ప్రబంధమే, సంతతివతంసము=సంతానములలో శ్రేష్ఠమైనది, అది మాకు సంఘటింపు=కాఁబట్టి యాకృతి మాకు ఘటించున ట్లొనర్పుము. అనఁగాఁ బ్రబంధము చెప్పి యది మాకుఁ గృతి యిమ్మనుట.

తాత్పర్యము. సప్తసంతానములలోఁ జేరిన తరుతటాకాదికములు ఎటనిలిపిన నచటనే యుండును. వానికి వ్యాపకశక్తిలేదు. సమస్తమునకుఁ గృతివలననే పేరు ప్రతిష్ఠలు కలుగునుగాన కృతిరచనము గావింపుమని కృతికర్త కవిని గోరెను.

ఉ. కేవలకల్పనాకథలు • కృత్రిమరత్నము| లాద్యసత్కథ
లావిరిపుట్టురత్నము | ల•వారితసత్కవికల్పనావిభూ
షావహపూర్వవృత్తములు • సానలఁ దీరినజాతిరత్నముల్,
గావున నిట్టిమిశ్రకథ•గా నొనరింపుము నేర్పు పెంపునన్. 19

కేవలకల్పనాకథలు=పురాణాదులయందుఁ జెప్పఁబడక కేవలము కవిచేతఁ గల్పింపఁబడినకథలు, కృత్రిమరత్నములు=గాజుపచ్చలు ముష్మాయిముత్యములు మొదలైనవానిపంటివి, ఆద్యసత్కథల్ = పూర్వరాజచరిత్రలు, వావిరిపుట్టురత్నములు = పుట్టినవి పుట్టినట్టుగానే యుండువజ్రములు మొదలైనవానివంటివి; అవారిత=నివారింపఁబడని, సత్కవికల్పనా = శ్రేష్ఠుఁడైనకవియొక్కరచనయనెడు, విభూషా=అలంకారమును, వహ=వహించిన, పూర్వవృత్తములు = పూర్వులయొక్క కథలు, సానలఁదీరినజాతిరత్నముల్=వజ్రపుసానలఁదీర్పఁబడిన యుత్తమరత్నములవంటివి. కావునన్=కాఁబట్టి, నేర్పుపెంపునన్=నిపుణత్వాతిశయముచేత, ఇట్టిమిశ్రకథగా నొనరింపుము = ఈలాటి మిశ్రకథగానుండునట్లు రచియింపుము, అనఁగాఁ గవికల్పనాచమత్కృతియును బూర్వరాజవృత్తాంతమును గూడియుండునట్లు లోకకృతి రచియింపుమనుట. అలంకారము. రూపకము.

తాత్పర్యము. కేవలము పురాణకథావస్తువిశేషములేక కల్పింపఁబడిన కథావస్తుకావ్యములు పచ్చలు గాజుతాళ్ళవంటి కృత్రిమరత్నములు. పురాణకథలు గనినుండి యపుడెతీసిన రత్నపుమూఁగతాళ్ళవంటివి. కల్పనామనోహరములగు పూర్వకథావిశేషములు సానలతేఱిన మణులవంటివి గావున మిశ్రకథ నేర్పుమెయి గావింపుమని భావము.

వ. అని సబహుమానంబుగాఁ దాంబూలజాంబూనదాంబరాగ్రహారాది ప్రదానంబుల నాదరించుటయు నేను నానందకందళితాంతరంగుండ నై కృతిపతి వంశావతారం బభివర్ణించెద. 20

అని=ఇట్లుపలికి, సబహుమానంబుగాన్=బహుమానపూర్వకముగా, తాంబూల=కర్పూరతాంబూలమును, జాంబూనద=సువర్ణమును, అంబర = చీనాంబరములును, అగ్రహార=అగ్రహారములును, ఆది=మొదలుగాఁగలవానియొక్క, ప్రదానంబులన్=ఈవులచేత, ఆదరించుటయున్=మన్ననసేయఁగా, ఏనున్=నేనును, ఆనంద=సంతోషముచేత, కందళిత=పల్లవించుచున్న, అంతరంగుండనై=అంతః

కరణముగలవాఁడనై, కృతిపతి = కృతీశ్వరుఁడైన తిరుమలదేవరాయలయొక్క, వంశావతారంబు= వంశావతారమును, అభివర్ణించెదన్=వర్ణించుచున్నాను. అది యెట్లనఁగా-

అవ. ఈపద్యమునందుఁ గృతికర్త మూలపురుషుఁడగు చంద్రునిపరముగను బాలయౌవనాద్యవస్థావిశేష విశిష్టుఁడగు నొకమహాపురుషుని పరముగను నర్థద్వయము చెప్పఁబడుచున్నవి. ఎటులనిన:-

సీ. జనకనేత్రఫలం బగుయినపాలపాపఁడు వరవృద్ధిఁ గాంచుజైవాతృకుండు
శ్యామాభిరాముఁడై యమరురేఖాశాలి రహిఁ గళల్వ్వాను సర్వజ్ఞమౌళి
కువలయానందంబుఁ గూర్చు చల్లనిరాజు తమ మెల్ల నడఁచు సత్పథవిహారి
వసువులు గురియుదివ్యవదాన్యతిలకుండు లచ్చితోఁ బుట్టినలక్షణాఢ్యుఁ
తే. డంబుజాసనుఁ డన విధుఁడనఁగ సోముఁ, డన నెగడి హంససంగతినడర సురలఁ
బ్రోవ దాక్షాయణీప్రేమఁబూననేర్చు,జాణచంద్రుండు కాంతినిస్తంద్రుఁడలరు.

జనకనేత్రఫలంబయిన=తండ్రికినేత్రసాఫల్యకరుఁడైన, పాలపాపఁడు = పాలుద్రావుచిన్నవాఁడనియర్థము. జనకుఁడైనయత్రిమునియొక్క నేత్రమువలనఁ బుట్టినవాఁడనియును క్షీరసముద్రునికుమారుఁడనియునుభావము. ఫలంబయినయన్నచోట, ఐకారమునకు నయి యను నాదేశము వచ్చినది. ('వాయిరపుర్వ్వక్రతమా' అని స.) వక్రతమములనఁగా నైకారౌకారములు, ఐకారమునకు, అయి యనియు, ఔకారమునకు అవు అనియుఁ నాదేశంబులు వికల్పంబుగానని సూత్రార్థము. వరవృద్ధిఁగాంచు= ఘనమైనయభివృద్ధిని బొందుచున్న, జైవాతృకుండును=దీర్ఘాయుష్మంతుఁడనియర్థము. శుక్లపక్షమం దభివృద్ధినొందుచున్నవాఁడనియును, జైవాతృకనామముగలవాఁడనియును భావము. (ని. 'జైవాతృకః కృశేచన్ద్రే భేషజాయుష్మతోరపి' అని వి.)

పాలపాపఁడు. జైవాతృకుఁడను పదమువలన నిందుసూచితమైనమహాపురుషుఁడు తొలుత శిశువుగను బిదప నభివృద్ధినొందుచున్నవాఁడుగ నుండెననుట గ్రాహ్యము.

శ్యామాభిరాముఁడై=శ్యామలనఁగా యౌవనమధ్యస్థలైన స్త్రీలు, వారికి మనోహరుఁడై, అమరు =ఒప్పుచుండెడు, రేఖాశాలి=హలకులిశాదిభాగ్యరేఖలచేత నొప్పుచున్నవాఁడనియర్థము. శ్యామయనఁగా రాత్రి, రాత్రియం దభిరాముఁడనియును, రేఖాకారముచే నొప్పువాఁడనియును భావము. (ని. 'శ్యామా యౌవనమధ్యస్థా త్రివృతా శారిబా నిశా' అని నానార్థరత్నమాల.) రహిన్=ఒప్పిదముగా, కళల్వ్వాను=విద్యలవహించినట్టి, సర్వజ్ఞమౌళి=సర్వజ్ఞశ్రేష్ఠుఁడని యర్థము. షోడశకళలను ధరించినవాఁడనియును సర్వజ్ఞనామముగలశివునకు శిరోభూషణమైనవాఁడనియును భావము.

శ్యామాభిరాముఁడు సర్వజ్ఞమౌళియను విశేషములవలన నిందు సూచితుఁడైనవాఁడు యౌవనుఁడనియుఁ సమస్తవిద్యావిదుఁడనియు గ్రాహ్యము.

కువలయానందంబుఁగూర్చు = భూవలయమునకు సంతోషమును ఘటింపఁజేసెడు, చల్లనిరాజు =చల్లనిప్రభువనియర్థము. కలువలకు వికాసము పుట్టింపఁజేయువాఁడనియు శైత్యగుణముగలవాఁడనియుఁ రాజనామముగలవాఁడనియునుభావము. తమమెల్లనడఁచు=తమమనఁగాఁ దమోగుణమును నంధకారమును,తమోగుణమునంతయుఁ బోఁగొట్టునట్టి, సత్పథవిహారి=సచ్ఛబ్దము శ్రేష్ఠార్థమందును నక్షత్రములయందును వర్తించును గనుక సన్మార్గప్రవర్తకుఁడని యర్థము. అంధకారమునంతయుఁ బోఁగొట్టు

వాఁడనియును నక్షత్రమార్గమందు, అనఁగా నాకాశమందుఁ బ్రవర్తించువాఁడనియును భావము.

కువలయానందకరుఁడు తమోహారి యను విశేషణములవలన నిట సూచితుఁడైనవాఁడు. లోకానందకరుఁడును అహంకారాది దుర్గుణములఁ బోఁదోలువాఁడై యౌవనము నాంతమున సుప్రసిద్ధుఁడై యుండెనని గ్రాహ్యము.

వసువులుగురియు = వసువులనఁగా ధనములును, కిరణములును గనుక ధనముల వెదఁజల్లునట్టిఁ దివ్యవదాన్యతిలకుండు=శ్రేష్ఠులైనదాతలకు భూషణమైనవాఁడని యర్థము, కిరణములను బ్రసరింపఁ జేయువాఁడనియును, దివ్యులనఁగా దేవతలు, శ్లో. 'ప్రథమాం పిబతే వహ్ని ర్ద్వితీయాం పిబతే రవిః' అను రీతిగా దేవతలకుఁ గళాప్రదానముచేత దాతృశ్రేష్ఠుఁడైనవాఁడనియును భావము. ని. 'దేవభేదే నరేరశ్మౌ వసూ రత్నే ధనే వసు' అని వి. లచ్చితోఁబుట్టిన=అగర్భశ్రీమంతుఁడైన, లక్షణాఢ్యుఁడు=విశాలఫాలత్వాది శుభలక్షణసంపన్నుఁడనియర్థము. లక్ష్మీదేవికిఁ దోడఁబుట్టినవాఁడనియును మృగలాంఛనుఁ డనియును భావము.

వసువులు గురియుట లచ్చితోఁబుట్టుట యనువిశేషణములవలన నిందుఁ జేరొ్కనఁబడినవాఁడు దాతయనియు నైశ్వర్యసమృద్ధి గలవాఁడనియు గ్రాహ్యము.

అంబుజాసనుఁడనఁ = బ్రహ్మయనునట్టులుగాననియర్థము. కమలములను దిరస్కరించువాఁడని భావము. విధుఁడనఁగ=విష్ణువనునట్టులుగాననియర్థము. విధునామముగలవాఁడనిభావము. సోముఁడనఁ=శివుఁడనునట్టులు గాననియర్థము. సోమనామముగలవాఁడని భావము. నెగడి = ప్రకాశించి, హంసనంగతినదరఁ=హంసవాహనసంగతిచేతఁ బ్రకాశించుటకు నని యర్థము.

సూర్యసంగమముచేఁ జంద్రుఁడు ప్రకాశించుననుటకు

తే. ఇనకర సర్శనంబున నింపుమిగిలి, చిన్నిసారంగధరుఁడు భ్రాజిల్లునట్లు

ఇనకరస్పర్శనంబున నింపుమీఱి, చిన్నిసారంగధరుఁడు భాసిల్లసాగె.

సారంగధరచరిత్రము.

సూర్యసంగమముచేతఁ బ్రకాశించుటకనిభావము. (ని. 'రవౌ శ్వేతచ్ఛదే హంసః' అని అ.) సురలఁబ్రోవఁ=దేవతలరక్షించుటకు ననియర్థము. అమృతకళాదానముచేత దేవసంరక్షణముసేయుటకనిభావము. సురలనెడుపదమునకు స్త్రీత్వబహుత్వములు వచ్చుటకు, న. 'స్త్రీత్వబహుత్వే సురాదేరసమాసే' అని న. దాక్షాయిణీప్రేమఁబూనఁ = పార్వతియందుఁ బ్రీతివహించుటకనియర్థము. అశ్విన్యాదినక్షత్రములయందుఁ బ్రీతివహించుట కనిభావము. చంద్రునికి రోహిణియందుఁ బ్రేమాతిశయము గనుక నిచ్చట రోహిణియందనిచెప్పిన విశేషము. ని. 'దాక్షాయణీ త్వపర్ణాయాం రోహిణ్యాం తారకాసుచ' అని వి. నేర్చుజాణ=నేర్చినచతురుఁడును, కాంతినిస్తంద్రుఁడు=కాంతియందు నిశ్చలుఁడైనవాఁడునైన, చంద్రుండు=చందురుఁడు, అలరుఁ=ఒప్పుచుండును.

తాత్పర్యము. కృతికర్తకుఁ గూటస్థుఁ డగుచంద్రుఁడు తొలుతఁ బాలసముద్రమున జనించి దినదినాభివృద్ధి శుక్లపక్షమున నొందుచు రాత్రుల నలంకరించి షోడశకళాశాలియై కలువలఁ దనుపుచుఁ జీకటులఁ బోఁదోలుచుఁ గిరణప్రసారము గావించుచు లక్ష్మికి సహోదరుఁడై త్రిమూర్తిరూపముగ హంస సంగతితో నలరారెను. సురలఁబ్రోవ దాక్షాయణీ (అశ్వని) ప్రేమదాల్చెను.

అలంకారము. కావ్యలింగము. సమాసోక్తి. రూపకము.

చ. అతనికిఁ గల్గె సౌమ్యుఁడు గుణార్జవరమ్యుఁ డతం డవార్యదో
ర్యుతదివిజారిభైరవుఁ బురూరవుఁ గాంచెఁ జిరాయు వాయు వా
కృతికి జనించె నాసుకృతికిం గలిగె న్నహుషుం డకల్మషుం
డతనికిఁ బుట్టె శామ్యదభియాతి యయాతి తదన్వయంబునన్. 22

అతనికిన్=ఆ చంద్రునికి, గుణార్జవరమ్యుఁడు, గుణ = సుగుణములయొక్క, ఆర్జవ=ఋజుభావముచేత, అనఁగా దిన్నఁదనముచేత, రమ్యుఁడు=సుందరుఁడైన, సౌమ్యుఁడు=అనఁగా మనోజ్ఞుఁడైన బుధుఁడు, ఇక్కడ శ్లిష్టవిశేషణము. (ని. 'సౌమ్యో బుధే మనోజ్ఞేస్యా దనుగ్రే సోమదైవతే' అని వి.) కల్గెన్=సంభవించెను. ఆతండు=ఆబుధుఁడు, అవార్యదోర్యుతదివిజారిభైరవున్, అవార్య=నివారింపశక్యముగాని, దోర్యుత=భుజపరాక్రమముగల, దివిజారి = రాక్షసులకు, భైరవున్=భయంకరుఁడైన, పురూరవున్=పురూరవుని, కాంచెన్=కనియెను. చిరాయువు=దీర్ఘాయుష్మంతుఁడైన, ఆయువు=ఆయువనెడిరాజు, ఆకృతికిన్=కుశలుఁడైన యాపురూరవునికి, జనించెన్=జన్మించెను. ఆసుకృతికిన్ = పుణ్యాత్ముఁడయిన యా యాయువునకు, అకల్మషుండు=కల్మషరహితుఁడయిన, నహుషుండు=నహుషుఁడనెడిరాజు, కలిగెన్=పుట్టెను. అతనికిన్=ఆనహుషునికి, శామ్యదభియాతి, శామ్యత్=నశించుచున్న, అభియాతి=శత్రువులుగల, యయాతి = యయాతియనెడు రాజు, పుట్టెన్=జనియించెను. తదన్వయంబునన్=ఆయయాతియొక్క వంశమందు, ఇది ముందరి పద్యమున కన్వయము.

తాత్పర్యము. పూర్వోక్తగుణవిశిష్టుఁడగు నాచంద్రునకు గుణగణశోభితుఁడు మనోహరరూపుఁడగు బుధుఁడును, ఆతనికి రాక్షససమూహభయంకరుఁడగు పురూరవుఁడును, నాతనికిఁ జిరంజీవియగు నాయువును, నతనికిఁ బాపరహితుఁడగు నహుషుండును జన్మమొందిరి. ఆనహుషునకు విరోధులబీరము శాంతింపఁజేయు యయాతి జనించెను. ఆవంశమునందు.—

శా. ద్వీపప్రోద్భవసూక్తపంచమమహావేదంబు దీపించె నే
భూపాలోత్తముపేర భారతియు నేపుణ్యాత్మువంశస్తవం
బాపాదించి కృతార్థ యయ్యె నతఁ డాశాంతనుమాపాలన
వ్యాపారాభిరతుండు వొల్చు భరతుం డాత్రేయగోత్రేయుఁడై. 23

ద్వీప=ఏటినడిదీవియందు, ప్రోద్భవ=ఉద్భవించిన వ్యాసులచేత, సూక్త=లెస్సఁగాఁ జెప్పఁబడిన, పంచమమహావేదంబు, (శ్లో. 'భారతఃపఞ్చమో వేదః' అని చెప్పియున్నది గనుక) నయిదవ వేదమయిన భారతము. ఏభూపాలోత్తముపేరన్=ఏ రాజశ్రేష్ఠునిపేరిట, దీపించెన్=ప్రకాశించెనో భరతమధికృత్యకృతో గ్రంథః భారతః అనఁగా భరతు నధికరించి చేయఁబడినగ్రంథము భారతము. భారతియున్=సరస్వతీదేవియును, ఏ పుణ్యాత్మువంశస్తవం బాపాదించి కృతార్థయయ్యెన్=ఏధర్మాత్మునియొక్క వంశస్తవమును బ్రతిపాదించి కృతార్థురాలాయెనో, అనఁగా భరతునివంశస్తవరూపమైన ధన్యత్వము నొందెనోయని యర్థము. భరతస్య పుణ్యాత్మనాగుణేనభారత్యాః కృతార్థత్వగుణోవర్ణిత ఇత్యుల్లాసాలంకారః. (శ్లో. 'ఏకస్యగుణదోషాభ్యా ముల్లాసోన్యస్యతౌయది' ఇతిలక్షణమ్.) కృతార్థయనఁగా నన్వర్థయనియుఁ భరతవంశస్తవాపాదనమ్ముచే భారతియని యన్వర్థనామము గలదనియును గ్రహింప

వలయును. (భరతస్యేయంభారతీ, సరస్వత్యాః భారతీతినామప్రసిద్ధమ్, తస్యాయోగతోన్వర్థప్రకల్పనాన్నిరుక్త్యలంకారః. శ్లో. 'నిరుక్తిర్యోగతోనామ్నామన్యార్థత్వప్రకల్పన'మితిలక్షణమ్.) అతండు, ఆశాంతక్ష్మా=దిక్కులంతముగాఁగల భూమియొక్క, పాలన=పరిపాలనరూపమైన, వ్యాపార=వ్యాపారమందు, అభిరతుండు=ఆసక్తుఁడైన, భరతుండు=భరతుఁడనురాజు, ఆత్రేయగోత్రేయుఁడై=ఆత్రేయగోత్రమందు జన్మించినవాఁడై, పొల్చున్=ప్రకాశించును. అనఁగాఁ బైఁజెప్పఁబడిన యయాతియొక్క వంశమందు భరతుఁడనురాజు సార్వభౌముఁడై ప్రసిద్ధినొందెనని భావము.

ద్వీపశబ్దమునకు, 'ద్విధాగతాఆపః అత్రేతిద్వీపః, ద్వ్యంతరుపసర్గేభ్యోప ఈత్' అనెడు పాణినీయసూత్రముచేత ద్విశబ్దమునకంటెఁ బరంబైన యప్శబ్దముయొక్క యకారమునకు నీకారాదేశమువచ్చినది, నిత్యసమాసమందు స్వరవ్యంజనములు రెండును జెల్లును గనుక నీశబ్దమందలి వకారమునకు విశ్రమముఁ జెప్పినాఁడు, ఇది యఖండయతియనియు నిత్యసమాసయతియనియుఁ జెప్పంబడుచున్నది.

క. లోకంబునఁ గర్ణాటవ, నౌకోద్వీపాంతరీప నాస్తిపదార్థా
నేకాన్యోన్యజనార్దన, నౌకాదులు నిత్యసమసనములండ్రు బుధుల్.

భారతికృతార్థులు భరతుని వంశస్తవము గావించుకతన నయ్యె ననుటవలన భరతుని మహోన్నతస్థితి యిట సూచితము. కావుననే నతఁ డాశాంతక్ష్మాపాలకుఁడని చెప్పఁబడెను. భారతమని చెప్పక పంచమవేదమనుటవలన నాగ్రంథప్రాశస్త్యమును వ్యాసునకు ద్వీపప్రోద్భవుఁడనుటచే నయోనిసంభూతత్వము సూచితమగుటవలన భారతముయొక్కయు వ్యాసునియొక్కయుఁ మహత్త్వములు గ్రాహ్యములు. అలంకారము. నిరుక్తి. ఉల్లాసాలంకారము.

తా. భరతుఁడు వ్యాసకృత మహాభారతమునకుఁ గథానాయకుఁడై నిజవంశస్తవమువలన భారతీదేవిని బునీతముగావింపనేర్చి సమస్తదిగంతములను దనపరిపాలనమునఁ జేర్చుకొని యాత్రేయగోత్రుఁడై ప్రశస్తినొందెను.

ఉ. ఆభరతాన్వయంబున రణాధ్వరయూపభుజుల్ మహాధరి
త్రీభుజు లుద్భవించిరి యుధిష్ఠిరముఖ్యులు విశ్రుతాఖ్యు లు
ర్వీభరణప్రవీణులు వివేకధురీణులు దానదీక్షితా
గ్రాభిహితు ల్సుధీయుతు లుదారదయాహృదయు ల్శుభోదయుల్. 24

ఆభరతాన్వయంబునన్=ఆ భరతునియొక్క వంశమందు, రణాధ్వరయూపభుజుల్, రణ = యుద్ధమనెడి, అధ్వర=యజ్ఞమందు, యూప = యూపస్తంభములైన, భుజుల్ = బాహువులుగలవారును, మహాధరిత్రీభుజులు=ధరిత్రీభుజులనఁగా భూమినిబాలించురాజులు గనుక మహారాజులైనవారును, విశ్రుతాఖ్యులు=ప్రసిద్ధమైననామధేయములుగలవారును, ఉర్వీభరణప్రవీణులు=భూభరణమందు నిపుణులైనవారును, వివేకధురీణులు=వివేకధురంధరులైనవారును, దానదీక్షిత = దానదీక్షగలవారిలో, అగ్రాభిహితుల్ = అగ్రగణ్యులైనవారను, సుధీయుతులు = యోగ్యమైనబుద్ధితోఁగూడినవారును, ఉదార=అతిశయమైన, దయా=దయ, హృదయులు = మానసమునందుఁగలవారును, శుభ=శుభకరమైన, ఉదయులు = అభ్యుదయముగలవారుననగు, యుధిష్ఠిరముఖ్యులు = ధర్మరాజాదుల్లు,

ఉద్భవించిరి = సంభవించిరి, ధరిత్రీభుక్ఛబ్దమునకు సంస్కృతద్వితీయైకవచనమగురూపము ప్రాతిపదికముగా గ్రహింపఁబడియె. 'గుణవద్గణోద్వితీయైకవచనతుల్యోభవేత్స్వకృతౌ' అని నన్నయభట్టీయము.

తా. భరతునివంశమునందు సంగరకలాప్రవీణులు ప్రతిష్ఠాశాలురు త్యాగమూర్తులు ధర్మస్వరూపులునగు ధర్మరాజాదులు జనించిరి.

క. ఆసంతతి వైభవజిత, వాసవుఁ డగు తాతపిన్న•వసుధాధిపుఁ డు
ద్భాసిల్లెఁ గీర్తిమయము, క్తాసౌధసువర్ణకలశి•తవిభావసుఁ డై. 25

ఆసంతతిన్ =ఆధర్మరాజాదులయొక్క వంశమందు, (ని. 'సంతతిర్గోత్రజననకులాన్యభిజనాన్వయాః' అని అ.) వైభవ=విభవముచేత, జిత = జయింపఁబడిన, వాసవుఁడగు = ఇంద్రుఁడుగల, తాతపిన్న వసుధాధిపుఁడు = తాతపిన్ననయనురాజు, కీర్తిమయ = కీర్తిరూపమైన, అనఁగా, కీర్తిరూపయినట్టి, ముక్తాసౌధ = ముత్యాలమేడయందు, సువర్ణకలశిత=బంగారుకలశముగాఁజేయఁబడిన, విభావసుఁడై=సూర్యుఁడుగలవాఁడై, ఉద్భాసిల్లెన్ = మిక్కిలియుఁ బ్రకాశించెను. అనఁగా ధర్మరాజాదులసంతతిలోఁ దాతపిన్నన యనెడురాజు సూర్యమండలపర్యంతము వ్యాపించిన శుభ్రమయిన కీర్తిగలవాఁడై ప్రకాశించెననుట.

కీర్తి తెల్లగాఁ జెప్పుట కవిసమయము గావున నిటఁ గీర్తి ముక్తాసౌధముగాఁ జెప్పఁబడెను. మౌక్తికసౌధ మనుటవలనఁ గీర్తి భూభాగమునందు విస్తృతముగ నుంటయేగాక యాకాశమునుగూడ నొరయుచున్నదని యాశయము. సూర్యుఁడు కనకకలశముగా నుంటవలనఁ గీర్తి దివము నంటెనని గ్రహింపవలయును. విభాప్రభైవ వసుద్రవ్య మస్య విభావసుః అను వ్యుత్పత్తివలన విభావసుఁడు కాంతియే ధనముగాఁగలవాఁ డగుటచే ముక్తాసౌధాగ్రమునఁ బ్రకాశార్థముగ సూర్యునిఁ గాంతిమంతముగనుండు కలశముగఁ జేసిరని యాశయము.

తా. ఆవంశమునఁ గీర్తిశాలియగు తాతపిన్నభూపాలుఁడు జనించి పేరెన్నికఁగాంచెను.

ఉ. ఆసుగుణాబ్ధికిం బ్రశమి•తాఖిలదోషుఁడు చక్రపాలనా
భ్యాసుఁడు సోమదేవుఁ డను•సద్భుతశీలుఁడు గల్గె నాకళా
భ్యాసికి నుద్భవించె దుర•హంకృతిమత్సరవాహినీశసం
త్రాసదబాణలాఘవుఁడు • రాఘవుఁ డాజికృతప్రమోదుఁ డై. 26

అసుగుణాబ్ధికిన్ =ఆసుగుణసముద్రుఁడనెడు సముద్రునికి, ప్రశమితాఖిలదోషుఁడు = నిరసింపఁబడిన సమస్తములైన రాత్రులుగలవాఁడని యర్థము. పోఁగొట్టఁబడిన సమస్తపాపములుగలవాఁడని భావము. (ని. 'దోషస్స్యా ద్దూషణే పాపే దోషా రాత్రౌ భుజేపి చ' అని వి.) చక్రపాలనాభ్యాసుఁడు = చక్రవాకపరిపాలనమం దభ్యాసముగలవాఁడని యర్థము. రాష్ట్రపరిపాలనమం దభ్యాసముగలవాఁడనిభావము. సోమదేవుఁడను నద్భుతశీలుఁడు=దేవుఁడనఁగా దేవతయను రాజును, చంద్రుఁడును విరుద్ధగుణవిశిష్టుఁడని యర్థము. సోముఁడనెడు నద్భుతసద్వృత్తిగలరాజని భావము. కల్గెన్ = సంభవించెను. (ని. 'దేవ స్సురే ఘనే రాజ్ఞి' అని వి.) ఇక్కడ సముద్రునివలనఁబుట్టి రాత్రి నిరాసకత్వాది విరుద్ధగుణములతోఁగూడిన చంద్రుండయినాఁడు గనుక నద్భుతశీలుఁడని చెప్పఁబడినాఁ

డు. ఆకళాభ్యాసికిన్=కళలనఁగా షోడశకళలును, విద్యలును, ఆచంద్రునికని యర్థము. ఆరాజున కనిభావము. దురహంకృతిమత్ = దురహంకారయుక్తుఁడైన, పరుఁడనఁగా నుత్కృష్టుఁడును శత్రువును, పర=ఉల్లోలకల్లోలమాలికలచేత నుత్కృష్టుఁడైన, వాహినీశ = వాహినియనఁగా నదియును, సేనయును నదీనాథుఁడయిన సముద్రునికి, సంత్రాసద = భయప్రదమాచున్న, బాణలాఘవుఁడు = శరలాఘవముగలిగిన, రాఘవుఁడు=శ్రీరామస్వామియని యర్థము. దురహంకారయుక్తులైన శత్రుసేనాధిపతులకు భయప్రదమాచున్న బాణలాఘవముగల రాఘవుఁడను రాజనిభావము. (శ్లో. 'పరస్స్యాదుత్తమా నాప్తవైరి దూరేతేషు కేవలే, వాహిన్యాం చ తరఙ్గిణ్యాం సేనాసైన్యప్రభేదయోః.' అని వి.) ఆజి=అజమహారాజు కుమారుఁడయిన దశరథునియందు, కృత=చేయఁబడిన, ప్రమోదుఁడై=సంతోషము గలవాఁడయి యనియర్థము. యుద్ధరంగమందుఁ జేయఁబడిన సంతోషముగలవాఁడయి యని భావము. ఉద్భవించెన్=జన్మించెను. ఇక్కడఁ జంద్రునికి జన్మించిన చంద్రేతరవంశసంభవుఁడయిన రాముఁడును నద్భుతశీలుఁడేయని తెలియవలయు. కారణమయిన చంద్రునకుఁ గార్యమయిన రామునకును సారూప్యమున్నది గనుక సమాలంకారప్రభేదము. శ్లో. 'సారూప్యమపి కార్యస్య కారణేన సమం విదుః' అని లక్షణము. చంద్రరాఘవపరములను నర్థాంతరములుంటచే శబ్దమూలధ్వని.

చంద్రుఁడు రాత్రుల నిరసించుటయుఁ జక్రవాకములను బాలించుటయు (నర్థాంతరముగ)ఁ జెప్పుట యద్భుతశీలహేతువులు. చంద్రుఁడు సహజధర్మమువదలుట యద్భుతక్రియగఁ బ్రశంసింపఁబడినది. కళాభ్యాసి యనుటవలనఁ జంద్రుఁడు షోడశకలాభిరాముఁడయ్యుఁ బూర్వోక్తవిపరీతగుణవిశిష్టుఁడగుట యద్భుతశీలము. దోషము శమింపఁజేయుట రాష్ట్రములనేలుట యద్భుతశీలధర్మములు.

తా. తాతసిన్నరాజునకుఁ బుణ్యశీలుఁడు రాజ్యపాలనకుశలుఁడగు సోమదేవుఁడను నాతనికి విరోధిసేనావినాశనహేతుభూతుఁడగు రాఘవరాజును జనించిరి.

క. ఆవిభునకు నర్జునపరి, భావకుఁడై పిన్నశౌరి•పగిదిఁ బొడమె వం
శావహుఁడు పిన్నశౌరి ర,మావల్లభుఁ డతఁడు బుక్క•మహీధవుఁ గాంచెన్.

ఆవిభునకున్=ఆ రాఘవరాజునకు, అర్జునపరిభావకుఁడై=శౌర్యముచేత నర్జునుని దిరస్కరించినవాఁడైయని రాజపరమైన యర్థము. అర్జునములనఁగా వేరుమద్దిచెట్లు, వానిని బెకలించినవాఁడని బాలకృష్ణపరమైన యర్థాంతరము. వంశావహుఁడు=వంశోద్ధారకుఁడని యర్థము. వేణువును ధరించినవాఁడని యర్థాంతరము. రమావల్లభుఁడు=రాజ్యలక్ష్మీవల్లభుఁడని యర్థము. లక్ష్మీవల్లభుఁడని యర్థాంతరము. ఈపదత్రయమందును నర్థద్వయమునకభేదాధ్యవసాయము. అటువంటి, పిన్నశౌరియనురాజు, పిన్నశౌరిపగిదిఁ బొడమెన్=బాలకృష్ణునివలె జనించెను. ఇక్కడ ధర్మసామ్యనామసామ్యములచేతఁ బిన్నశౌరితోఁ బిన్నశౌరిసమానుఁడని తాత్పర్యము. అతఁడు=ఆపిన్నశౌరి, బుక్కమహీధవుఁ గాంచెన్=బుక్కరాజును గనియెను. అలంకారము ఉపమ. అర్జునపరిభవాదులు శ్లేషములగుటచే నలంకారము శ్లేషమని యాధునికులు.

తా. రాఘవభూపాలునకు నర్జున పరిభవకరణ పరాక్రమశాలియగు పిన్నశౌరి జన్మించెను. ఆతనికి బుక్కరాజు తనయుఁడై జనించెను.

సీ. తనభవ్యధామంబు • తనభవ్యధామంబుకరణి మిత్రోన్మేష•కరము గాఁగఁ
దనధర్మగుణములు • దనధర్మగుణములట్లతులితశ్రుతిమార్గ•గతుల నెసఁగఁ

దనమహాహవదీక్ష ◆ దనమహాహవదీక్షపగిది నానావనీ◆పకులఁ బెంపఁ
దనయంబకంబులు ◆ దనయంబకములట్ల పరభీరువిముఖతఁ ◆ బరిఢవిల్లఁ
తే. బరఁగుఁ గఠినాద్రిజడలుత◆జ్జగతకమత, కూటకిటిగూఢచరణద్వి◆కోటికరటి
కుటిలతాసహభూసౌఖ్య◆ఘటనభూరి, భుజబలవిహారియార్వీటి◆బుక్కశౌరి. 28

ధామమనఁగాఁ బ్రతాపమును గృహమును (ని. 'గృహ దేహ త్విట్ప్రభావా ధామాని' అని అ.) తన=తనయొక్క, భవ్యధామంబు=శుభకరమైన ప్రతాపము, తనభవ్యధామంబుకరణి=తనయొక్క శుభకరమైన గృహమువలె, మిత్రోన్మేషకరము గాఁగన్=మిత్రుఁడనఁగా సూర్యుఁడును, మిత్రమనఁగా బంధువును, (ని. 'మిత్రంసుహృదిమిత్రోర్కః' అని వి.) సూర్యప్రకాశకర మగుచుండఁగా నని ప్రతాపపరమైన యర్థము. బంధుజనవికాసకరమగుచుండఁగా నని గృహపరమైన యర్థము. బుక్కరాయలు బంధుజనపోషకుఁడనియు సూర్యునిమించిన పరాక్రమశాలియు ననిభావము.

ధర్మమనఁగా ధనస్సును, న్యాయమును, గుణమనఁగా నారియును, గుణమును, (శ్లో. 'ధర్మః పుణ్యే యమే న్యాయే స్వభావాచారయోః క్రతౌ, ఉపమాయా మహింసాయాం చాపే' అని వి.) ('మౌర్వ్యాంద్రవ్యాశ్రితేసత్త్వశుక్లసంధ్యాదికేగుణః' అని అ.) తన ధర్మగుణములు = తనయొక్క చాపశింజినులు, తనధర్మగుణములట్ల=తనయొక్క న్యాయగుణములవలె, శ్రుతియనఁగా గర్ణమును వేదమును, (ని. 'వేదేశ్రవణేశ్రుతిః' అని అ.) అతులిత = సమానరహితమగునట్టులుగా, శ్రుతిమార్గగతులన్=శ్రవణమార్గప్రవర్తనములచేత, ఎసఁగన్=ఒప్పుచుండఁగానని ధనుర్గుణపరమైన యర్థము. వేదమార్గ ప్రవర్తనములచేత నొప్పుచుండఁగానని న్యాయగుణపరమైన యర్థము. బుక్కరాయలు సంగరమున నాకర్ణాంతము ధనువులాగుననియు శ్రుతిధర్మముల ననుసరించి సంచరించుననియు భావము.

ఆహవమనఁగా యుద్ధము, హవమనఁగా యజ్ఞము.(శ్లో. 'ఆజ్ఞాహ్వానాధ్వరాహవాః' అని అ.) తన మహాహవదీక్ష=తనయొక్కయధికమైన యుద్ధదీక్ష, తనమహాహవదీక్షపగిదిన్=తనయొక్క యుత్కటమైన యజ్ఞదీక్షవలె, అవనీపకులనఁగా రాజులు, వనీపకులనఁగా యాచకులు, పెంపు అనఁగా క్షయమును, వృద్ధియును, నానా=సమస్తమైన, అవనీపకుల=రాజులను, పెంపన్=నాశనము నొందించుచుండఁగానని యుద్ధదీక్షాపరమైన యర్థము. సమస్తమైన యాచకులను వృద్ధిఁబొందింపఁగానని యజ్ఞదీక్షాపరమైన యర్థము. బుక్కరాయలు యాగములయందు త్యాగగుణముచే యాచకులను దనుపుననియు సంగ్రామమున విరోధిరాజన్యులఁ దెగటార్చుననియు భావము. పెంపన్=అనుటలో నాశనముచేయుట వృద్ధినొందించుట యను నర్థద్వయముకలదు. పెంచుట=నశింపఁజేయుట యనుటకు-

ఉ. తెంపరివై పొరింబొరిని దేవికిఁబుట్టుల ముద్దుబిడ్డలన్
జంపితి వంతసైన నుపశాంతి వహింపక బాలమీఁద నన్
బెంపితి విస్సిరో...

భాగవతము.

అంబకము లనఁగా బాణములును నేత్రములును, (ని. 'అంబకం నేత్రశరయోః' ఇతికోశః.) తన యంబకంబులు=తనయొక్క బాణములు, తనయంబకములట్ల=తన నేత్రములవలెనే, పరులనఁగా శత్రువులును, అన్యులును, భీరువనఁగా భయశీలుఁడును స్త్రీభేదమును, పరభీరు=శత్రువులలో భయపడువాండ్రవలన, విముఖతన్=తిరుగుటచేత, పరిఢవిల్లన్=ఒప్పుచుండఁగానని బాణపరమైన యర్థము. పరస్త్రీపరాఙ్ముఖత్వముచేత నొప్పుచుండఁగానని నేత్రపరమైన యర్థము. ఇక్కడ నుపమానోపమేయ

ములు ప్రకృతములేగనుక సముచ్చయోపమాలంకారము. బుక్కరాయలు పిఱికివారిపై బాణములను బ్రయోగింప నొల్లఁడనియుఁ బరకాంతలను సందర్శింపనొల్లఁడనియు భావము.

కఠిన=కర్కశములైన, అద్రి=పర్వతములయొక్కయు, జడమనఁగా మాంద్యమును, జలమును, లడలకభేదము. జడ=మాంద్యములోనని యర్థము. ఉదకములోనని భావము. లుఠత్=పొరలుచుండెడు, జరఠకమఠ=ముదికూర్మముయొక్కయు, కూటకిటి=కపటవరాహముయొక్కయు, గూఢచరణుఁడనఁగా గూఢప్రచారుఁడును బన్నగుఁడును, గూఢప్రచారుఁడైన శేషాహియొక్కయు, దిక్కోటికరటి=దిగ్భాగములఁబడియుండెడు ఏనుఁగులయొక్కయు, కుటిలత=కుటిలత్వమును, అనఁగా క్రూరభావమును, అసహ=సహింపని, భూ=భూదేవికి, సౌఖ్య=సుఖభావమును, ఘటన=పొందించునట్టి, భూరి=అధికమైన, భుజబల=బాహుబలముచేత, విహారి=విహరించునట్టి, ఆర్వీటిబుక్కశౌరి=ఆర్వీడను రాజధానికధిపతియైన బుక్కరాజు, పరగున్=ఒప్పును. అనఁగాఁ గులపర్వతములు మొదలైనవాని పరిస్పందము లేక యావద్భూభారము నీ బుక్కరాజు తన బాహుబలముచేతనే భరించియుండెనని భావము.

తా. భూభరణనియుక్తములగు కమఠము జడసంచారము ముదిమిగలదగుటయుఁ గిటి కాపట్యస్థితి గలదగుటయుఁ శేషువురహస్యముగనున్న నడవడిగలవాఁడగుటయు దిగ్గజములు మూలలనున్నవియు నగుటచే భూదేవి తనకుఁ దాన బుక్కరాయలవరించి మిగుల సౌఖ్యములొందుచున్నదని భావము.

మొదటినాలుగు పాదములందు శ్లేషమని యుపమ యని యందురు. మూడవపాదమున నలంకారము శబ్దశ్లేష. ఆయాతావుల వాక్యార్థహేతుక కావ్యలింగము. పదార్థహేతుక కావ్యలింగాలంకారములు గ్రాహ్యములు. భవ్యధామము భవ్యధామము అనుచో ఛేకానుప్రాసము. గీతమున తవర్ణములు మాటిమాటికి వచ్చుట వృత్త్యనుప్రాసమను శబ్దాలంకారము.

క. ఆబుక్కనృపతి కతులభు, జాబందీకృతమదాంధ•శత్రురమావే
ణీబంధవిలసదసిధా, రాబంధురుఁడైనరామ•రాజు జనించెన్. 29

ఆబుక్కనృపతికిన్=ఆబుక్కరాజునకు, అతుల=సమానరహితమైన, భుజా=బాహువులచేత, బందీకృత=చెఱపెట్టఁబడిన, మదాంధ=మదముచేతఁ గన్ను గానకయున్న, శత్రు=శత్రురాజుల యొక్క, రమా=రాజ్యలక్ష్మియొక్క, వేణీబంధ=జడయేమోయన్నట్లుగా, విలసత్=ప్రకాశించుచున్న, అసిధారా=ఖడ్గధారచేత, బంధురుఁడైన=సుందరుఁడైన, రామరాజు=రామరాజనెడు కుమారుఁడు, జనించెన్=పుట్టెను. అలంకారము వస్తూత్ప్రేక్ష.

తా. బుక్కరాజునకు రామరాజు జనించెను. అతని ఖడ్గము విరోధిరాజుల రాజ్యలక్ష్మిజడయేమో యనునటులుండెను. ఖడ్గమును దత్కాంతిని వేణితో (నల్లపునకుఁ) బోల్చుటకు-

సీ. పార్శ్వభూమి నభీరు భటకదంబ కరాళ హేతిచ్ఛటాచ్ఛాయ లెరు కొనఁగ. మనుచరిత్రము.

సీ. ఏ రాజుభూరి తే•జోరుణాలోకంబు లోకంబుతమము ని•రాకరించు
నేధన్యుబాహాధ•రాధరాభోగంబు భావంబు నవరించు•భూమిసతికి
నేపుణ్యునభిరూప•రూపానుభావంబు భావంబు గరఁగించు•భామినులకు
నేభవ్యుశుభకీర్తి•శోభావిహారంబు హారంబు దశదిశా•యావతమున

తే. కతఁడు మతిమంతుఁ డతిశాంతుఁ•డరికృతాంతుఁ
డనుపమస్వాంతుఁ డాశ్రిత•వనవసంతుఁ

డనఘుతరకందనోలిమ•హాపురిని
శాంతుఁ డగురామమేదినీ•కాంతుఁ డలరు. 30

ఏరాజు=ఏ ప్రభువుయొక్క, భూరి = అధికమైన, తేజః=ప్రతాపమనెడు, అరుణ=సూర్యుని యొక్క, ఆలోకంబు=ప్రకాశము, లోకంబు=లోకముయొక్క, తమము=చీఁకటిని, నిరాకరించుఁగా=నిరసించునోయనియర్థము. శోకమును బోఁగొట్టునోయని భావము. (శ్లో. 'అరుణో భాస్కరేపి స్యాద్వర్ణభేదే సత్రిషు' అని అ.) (శ్లో. 'రాహౌ ధ్వాంతే గుణే శోకే తమశ్శబ్దోభిధీయతే' అని వి.)

ప్రతాపమునకుఁ బోలికగా నితరభాస్కరనామములు చెప్పక అరుణనామము చెప్పుటవలనఁ బ్రతాపము ఎఱ్ఱగానున్నదనిభావము. లోకంబు తమము అనుచో షష్ఠికి ప్రథమావిభక్తి.

ప్రయోగము.—

చ. పరువడినొప్పునప్పురము భద్రగజంబుల పెల్లు నుల్లస
త్తురగచయంబు పెంపున విదూషితగోనికరంబు పేర్మియుఁగా. భోజరాజీయము.

ఏధన్య=ఏకృతార్థునియొక్క, బాహా=భుజమనెడు, ధరాధర=శేషునియొక్క,ఆభోగంబు=పరిపూర్ణత్వము, భూమిసతికిఁగా=భూకాంతకు, భోగంబుసవరించుఁగా=సుఖమునుగలుగఁజేయునో, బాహువులను శేషువుతోఁ బోల్చుటవలన నాజానులంబములనియు భూభరణసమర్థములనియు నాశయము.

ఏపుణ్య=ఏపుణ్యాత్ముసియొక్క, అభిరూప=మనోహరమైన, రూప=చక్కఁదనముయొక్క, అనుభావంబు=ప్రభావము, భామినులకుఁగా = స్త్రీలకు, భావంబు=మనస్సును, కరఁగించుఁగా=ద్రవింపఁజేయునో, సౌందర్యము స్త్రీజనమనోహరముగ నుపభోగార్హముగ నున్నది. రూపము నాలంకారికు లిటుల నిర్వచించిరి.

శ్లో. అంగాన్యభూషితాన్యేవ ప్రక్షేపాద్యైర్విభూషణైః, యేనభూషితవద్భాతి తద్రూపమితికథ్యతే.

లక్ష్యము.—

సీ. తొడవులూడ్చినసైన తొయ్యలిరూపులోఁ జిన్నపోయినపట్లు చెన్నుమీఱు. హరివం.

ఏభవ్య=ఏయోగ్యునియొక్క, శుభ = శుభకరమైన, కీర్తి = యశస్సుయొక్క, శోభావిహారంబు = కాంతిప్రచారము, దశదిశాయువతమునకుఁగా = దశదిక్కులనెడు యువతీసమూహమునకు, హారంబు=ముత్యాలహారమువలెసుందునో,

కీర్తికిఁగల దిగంతవ్యాపకత్వము మనోహరత్వము. శుభ్రకాంతి విశేషము నిచట సూచితము.

అతఁడు=అట్టి,మతిమంతుఁడు=బుద్ధిమంతుఁడైనవాఁడును,అతిశాంతుఁడు=మిక్కిలిశాంతిగుణముగలవాఁడును, అరికృతాంతుఁడు=శత్రువులకు యముఁడైనవాఁడును, అనుపమస్వాంతుఁడు=ఉపమానరహితమైన మనస్సుగలవాఁడును, ఆశ్రితవనవసంతుఁడు = ఆశ్రితులనెడు వనములకు వసంతర్తువైనవాఁడును, అనఘుతర=మిక్కిలి నిష్కల్మషమైన, కందనోలిమహాపురి=కందనోలనెడు మహాపట్టణమే, నిశాంతుఁడు=నివాసముగాఁగలవాఁడును, అగు=అయిన, రామమేదినీకాంతుఁడు = రామభూమీశ్వరుఁడు, అలరుఁగా=ఒప్పుచుండును. అలంకారము. రూపకము. సంసృష్టి శబ్దాలంకారము ఛేకానుప్రాసము.

తా. కందనోలుమహానగరము నేలు రామధాత్రీశ్వరుఁడు సూర్యునిమించినపరాక్రమముతోడను భూభరణయోగ్యమగు భుజశక్తితోడను, యువతీమనోరంజకమగు రూపముతోడను దిశావిశ్రాంతమగు కీర్తితోడను నలరి విరోధుల వంచించుచు నాశ్రితుల రంజించుచు భూమండలమునఁ బేరొందెను.

శా. ఆరామక్షితిభర్తకుం బ్రథితసత్యాలాపధర్మోద్భవ
శ్రీరమ్యుం డగుతిమ్మరాజు బలలక్ష్మీధామభీమప్రథా
పారీణుం డగుకొండశౌరి విజయప్రఖ్యాతచారిత్రుఁ డౌ
శ్రీరంగేంద్రుఁడు గల్గి రైందవకులక్షేమంకరాకారులై. 31

ఆరామక్షితిభర్తకున్=ఆరామరాజునకు, ప్రథిత=ప్రసిద్ధమయిన, సత్యాలాప = సత్యవాక్యములుగల, ధర్మోద్భవ=ధర్మరాజుయొక్క, శ్రీ=కాంతిచేత, రమ్యుండగు=ఒప్పుచున్నవాఁడైన, అనఁగా ధర్మరాజయిన, తిమ్మరాజు=తిమ్మరాజును, అని యర్థము. ప్రసిద్ధమయిన సత్యవాక్యరూపధర్మములవలనఁ బుట్టిన సంపదచేత నొప్పుచున్నవాఁడని భావము. బలలక్ష్మీ=బలసమృద్ధికి, ధామ=స్థానభూతుఁడైన, భీమ=భీమునియొక్క, ప్రథా=ప్రసిద్ధియందు, పారీణుండగు=దరిముట్టినవాఁడైన, అనఁగా భీముఁడైన, కొండశౌరి=కొండలరాయఁడును, అనియర్థము. బలసమృద్ధికి స్థానభూతులైనవారలకు భయంకరమయిన ప్రసిద్ధియందు దరిముట్టినవాఁడని భావము. విజయ=అర్జునునియొక్క, ప్రఖ్యాత=ప్రసిద్ధమయిన, చారిత్రుఁడౌ=చరిత్రలుగలిగిన, అనఁగా నర్జునుఁడయిన, అనియర్థము. విజయప్రతిపాదకములైన ప్రసిద్ధచరిత్రలు గలవాఁడనిభావము. శ్రీరంగేంద్రుఁడు ఐందవకుల=చంద్రసంబంధమైన వంశమునకు, క్షేమంకర=క్షేమకరములైన, ఆకారులై=రూపములుగలవారై, కల్గిరి. ఇది ధర్మజభీమార్జునులకు నీ ముగ్గురురాజులకును సాధారణవిశేషణము, కలిగిరి=సంభవించిరి.

అలంకారము పదార్థహేతుక కావ్యలింగము.

ఈముప్పురు వీరలు నైందవకులక్షేమంకరులనుటకు సత్యాలాపసంసక్తి, బలలక్ష్మీధామత్వము, విజయప్రఖ్యాతియు హేతువులు. కావుననే క్షేమకరము, సత్యాలాపము ప్రథితమైనదనియు బలము భీమ మనియు విజయము ప్రఖ్యాతమనియు నాశయము. క్షేమంకర-"క్షేమప్రియ మద్రే౽ణ్చ"అని. ఖ ప్రత్యయము. "అరుర్ద్విషదజన్తస్యముమ్" అని ముగాగమము. ఇటులె శుభంకరాదు లూహ్యములు.

తా. రామరాజునకుఁబరాక్రమశాలురగు తిమ్మరాజుకొండరాజు శ్రీరంగరాజు అనుముప్పురు కుమారు లుదయించిరి. ఈముప్పురు ధర్మరాజభీమార్జునులవలె సత్యబలవిజయసంశోభితులై ప్రతిష్ఠ గడించిరి.

శా. ఆరాజత్రితయంబులో సమబాణారాతి విజ్ఞాతదో
స్సారుం డాత్తసుభద్రుఁ డర్జునగుణశ్లాఘ్యుండు నై పొల్చునా
శ్రీరంగేంద్రుఁ డశేషరాజ్యపదవీసింహాసనాక్షీణల
క్ష్మీరాజన్నిజసంతతిప్రథితుఁడై మించెన్ ధరామండలిన్. 32

ఆరాజత్రితయంబులోన్ = పైఁజెప్పఁబడిన ముగ్గురురాజులలోపల, ఇది నిర్ధారణషష్ఠి. శ్లో. 'లోపలనిర్ధారణోద్భవాషష్ఠీ' అనిన. అసమబాణ=మన్మథునికి, అరాతి=శత్రుఁడైన రుద్రునిచేత, విజ్ఞాత=ఎఱుఁగఁబడిన, దోస్సారుండు=భుజబలముగలవాఁడును, అని యర్థము. అసమ=సమానరహితములైన, బాణ=బాణములుగలిగిన, అరాతి=శత్రువులచేత, విజ్ఞాత=ఎఱుఁగఁబడిన, దోస్సారుండు=భుజబలము గలవాఁడని భావము. ఆత్త=పొందఁబడిన, సుభద్రుఁడు=సుభద్రగలవాఁడును, అని యర్థము. పొందఁబడిన మంచిశుభగుణములు గలవాఁడనిభావము. అర్జునగుణశ్లాఘ్యుండు=అర్జునునియొక్క గుణములచేత

గొనియాడఁదగినవాఁడును, అనఁగా సర్జునుఁడని యర్థము. నిర్మలమయిన గుణములచేతఁ గొనియాడఁదగినవాఁడని భావము. ఐ=అయినవాఁడై, పొల్చు=ప్రకాశించుచున్న, ఆ శ్రీరంగేంద్రుఁడు=ఆశ్రీరంగరాజు, అశేష=సమస్తమైన, రాజ్య=రాజ్యములయొక్క, పదవీ=వైభవముతోఁగూడిన, సింహాసన=సింహాసనసంబంధమైన, అక్షీణ=క్షీణముగాని, లక్ష్మీ=సంపదచేత, రాజత్=ప్రకాశించుచున్న, నిజసంతతి=స్వకీయమయిన సంతతిచేత, అనఁగాఁ బరిక్షిత్తుమొదలైనవారిచేత, ప్రథితుఁడై=ప్రసిద్ధుఁడై యని యర్థము. తనసంతతిచేతనని భావము. ఇక్కడ ధర్మజభీమార్జునులలో నర్జునునిసంతతి రాజ్యసింహాసనాధిపత్యమునకు నంకురమై నిలిచిన ట్లామువ్గురు రాజులలో శ్రీరంగరాజుసంతతిమాత్రమే రాచరికమునకు నిలిచినదని తాత్పర్యము. ధరామండలిక్=భూమండలమందు, మించెక్=అతిశయించెను.

విజయప్రఖ్యాతచరిత్రుఁడగు శ్రీరంగరాయనియెడ నింకను నర్జునగుణశ్లాఘ్యస్థితిగలదు. అసమబాణాతివిజ్ఞాత దోశ్శక్తి. ఆత్తసుభద్రభుత్వము. ఇందుచే విజయప్రఖ్యాతచారిత్రము రూఢము. రాజ్య మశేషమైనదగుటచే లక్ష్మి యక్షీణ యనిచెప్పఁబడెను. కావుననే సంపద సంతతికిఁగూడ యథావిధముగ సంక్రమించెనని యాశయము.

తా. పరాక్రమశాలురగు విరోధులను వంచింప నేర్పరియు శుభలక్షణలక్షితుఁడునగు శ్రీరంగరాజు సమస్తరాజ్యము నాక్రమించి తనరాజ్యము సంతానముసైతము యథేచ్ఛముగా ననుభవింపఁదగిన కట్టుదిట్టములు గావించెను.

శా. క్షోణీవిశ్రుతనిత్యదాననిధియై • సొంపొందు శ్రీరంగరా
ట్పాణిం బాయనిసత్కృపాణి యదనం • బ్రత్యర్థిదానైకపా
రీణం బౌ టరుదే తదీయకరతా•దృక్ఖడ్గవిద్ధాహిత
శ్రేణు ల్మున్నుగఁ గర్ణఖేచరవితీ•ర్ణిప్రౌఢి వాటింపఁగన్. 33

క్షోణీ=భూమియందు,విశ్రుత=ప్రసిద్ధమైన,నిత్య=ఎడతెగని, దాననిధియై=దానమునకుస్థానమై, సొంపొందు=చక్కనౌచున్న, శ్రీరంగరాట్=శ్రీరంగరాజుయొక్క, పాణిక్=హస్తమును, పాయని=ఎడబాయకయుండునట్టి, సత్కృపాణి=శ్రేష్ఠమయిన ఖడ్గము, అదనక్=సమయమందు, ప్రత్యర్థి=ప్రతియాచకవిషయమయిన,దాన=త్యాగమందు,ఏక=ముఖ్యముగా, పారీణంబౌట=సమర్థమయినదౌట, అరుదే=ఆశ్చర్యమా, అనఁగా నాశ్చర్యము కాదని యర్థము. ప్రత్యర్థి=శత్రువులయొక్క, దాన=ఛేదనమందు, పారీణమయినదనిభావము. (ని. 'అభియాతిపరారాతి ప్రత్యర్థిపరిపన్థినః." అని అ. 'దానంగజమదేత్యాగే పాలన చ్ఛేద శుద్ధిషు' అని వి.) ఇక్కడ స్త్రీలింగమయిన కృపాణీశబ్దమునకు విశేషణంబైన ప్రత్యర్థిదానైకపారీణంబన్నపదము నపుంసకమయినందులకు (సూ. 'ఉభయవిధమమహతీనామ్' అనిన.) అదను, అన్నపద ముకారాంతముగనుక, (సూ. 'కేషాంచిదుదంతానాం నేతి విభక్తావునోలుక్స్యాత్' అను నన్నయభట్టీయపుసూత్రముచేత సప్తమీవిభక్తి పరమగుచుండఁగా ఉన్నకు లోపమువచ్చినది.) తదీయకర=ఆశ్రీరంగరాజుహస్తమందలి, తాదృక్ఖడ్గ=అలాటిఖడ్గముచేత, విద్ధ=వేధింపఁబడిన, అహితశ్రేణుల్మున్నుగక్=శత్రుసమూహములుగూడ,కర్ణ ఖేచరవితీర్ణిప్రౌఢివాటింపఁగక్=కర్ణునివలెను వితరణమహిమను వహించె ననియర్థము. కర్ణునివలె నర్థమును ఖేచరునివలెఁ బ్రాణమును నిచ్చెనని భావము.

కృపాణి శ్రీరంగరాయలహస్తమున వదలకుంటకు క్షోణీవిశ్రుతనిత్యదానమె హేతువు. కాననే యది సత్కృపాణి. తాదృగ్విశేషణవలన ఖడ్గమునెడల సుప్రసిద్ధగుణములు సూచితములు కర్ణఖేచర

వితీర్ణిప్రౌఢియనుటలో శ్రీరంగరాయని ఖడ్గధాటికి వెఱచి లోనైనరాజులు కర్ణులవలె ధనము హతులు ఖేచరునివలెఁ బ్రాణముల నొసంగిరని భావముగాన నిచటను విజయప్రఖ్యాతి సూచితము.

తా. దానవిధియగు శ్రీరంగరాయలఖడ్గము హస్తమునం బెడబాయకయుంటచేఁ బ్రత్యర్థి(విరోధి-యాచక) దానైక (ఖండన-త్యాగ) పారీణమగుటలో నచ్చెరు వించుకేనిలేదు. ఆఖడ్గము చేమరణము నొందినవారుగూడఁగర్ణునివలెఁద్యాగమునకు ఖేచరునివలె మరణమునకు నలవాటుపడియున్నారు.

ఖేచరుఁడనువాఁడు సర్పనగరమం దొకానొక నాగకుమారునిమారుగాఁ దాను గరుత్మంతున కాహారమయి ప్రాణత్యాగము సేయఁబూనెననుట పురాణప్రసిద్ధము. నిత్యదాననిధియైన రాజుహస్తము నెడబాయనిఖడ్గము దానపారీణమౌటయేమి వింతగా నగరమునందలి యాఖడ్గముచేత విద్ధులైన శత్రువులును వితరణమహిమను బూనినారని యర్థము. ఇక్కడఁ బాణిస్థితకృపాణి వితరణగుణమహితశ్రేణులయందు నుల్లసితమగుచున్నదని చెప్పినాఁడు గనుక నుల్లాసాలంకారము. శ్లో. 'ఏకస్యగుణదోషాభ్యా ముల్లాసోన్యస్యతౌ యది' అని లక్షణము.

సీ. వెస విభీషణరాజ్య • విముఖుఁడై సహ్యభూవలయంబు చేకొని • నిలువఁడేని
సప్తసాలాంతర • స్థాయియై నిదురించుతఱిని జాగరణంబుఁ • దాల్పఁడేని
శ్రుతిదూరభోగస • క్తత నొప్పియుఁ గొ ల్చుచెంతఁ జరణ మగ్రజుఁ డెసఁగ • జూపఁడేని
నలరారుసిరి దన • యడుగునఁ గూర్చి గట్టిగ నీగిచేయి మా • టికొనఁడేని

తే. రమణఁ బ్రతి సేయ వచ్చు శ్రీ • రంగశౌరి, భయదరిపుపురహారి ని • ర్భయవిహారి
యార్యసత్కారకారి యౌ • దార్యవిభవ, ధారియై మించుశ్రీరంగ • శౌరికెపుడు.

ఇందు శ్రీరంగశౌరియనఁగా శ్రీరంగనాయకస్వామి, శ్రీరంగశౌరికి ననఁగా నీపైఁ జెప్పఁబడిన శ్రీరంగరాజునకు నామసామ్యమున్నను గుణసామ్యములేనందున సమానుఁడు గాఁడని చెప్పినాఁడు. ఏలాగన్నను,

వెసన్=శీఘ్రముగా, విభీషణరాజ్య=భయంకరులైన శత్రువులయొక్క దేశములకు, విముఖుఁడై=ఎదిరించిపోఁజాలనివాఁడై, సహ్యభూవలయంబుచేసికొని = సహ్యమయినంతభూవలయము ననఁగా దనజీవనమునకుఁ దగినభూమిని గ్రహించి, నిలువఁడేనిన్=అందులోఁ గాలముగడుపుచుండకపోయిన ట్టులాయెనేని అనియర్థము. విభీషణరాజ్యమనఁగా లంక, దానికిఁ బోకయున్నవాఁడనియు సహ్యభూవలయమనఁగా సహ్యపర్వతమువల్లబుట్టిన కావేరియొక్క వలయము, దానిఁ బరిగ్రహించి నిలిచియున్నవాఁడనియు,అనఁగానుభయ కావేరీమధ్యస్థుఁడై యున్నవాఁడనియునుభావము. (స. 'సహ్యాంచ తత్ భూవలయంచ' అనియును,'సహ్యాత్పర్వత విశేషాద్భవతీతిసహ్యాభూః కావేరీ, తస్యాః వలయః, సహ్యభూవలయః' అనియు నుభయత్ర విచారింపవలయును.) (ని. 'సహ్య శైలాంతరారోగ్యసోఢవ్యేషు ప్రచక్షతే' అని వి.)

సప్తసాలాంతరస్థాయియై = సాలమనఁగాఁ గోట ఏడుకోటలలోపల నున్నవాఁడై, నిదురించుతఱిని = నిద్రించునిశాసమయమందు, జాగరణంబుసలుపఁడేనిన్ = కన్నుమూయక నిద్రవేగించుచుండకపోయెనేని అని యర్థము. సప్తప్రాకారమధ్యగతుఁ డనుటకు.-

శ్లో. ''సప్తప్రాకారమధ్యే సరసిజముకుళోద్భాసమానే విమానే
కావేరీ మధ్యదేశే ఫణిపతిశయనే శేషపర్యంకభాగే

నిద్రాముద్రాభిరామం"
అను శ్లోకముగూడ నాధారము కాఁగలదు.

సప్తప్రాకారమధ్యగతుఁ డనియు దేవుఁడుగానఁ గన్నుమూయక యున్నాఁడనియును భావము. విగ్రహముగనుక మూయలేఁడనియును జెప్పవచ్చును. నిదురించుతఱి ననఁగా జాతుర్మాస్యయందు జాగ్రదవస్థయైనయోగనిద్రను బొందినవాఁడనియైనను జెప్పవచ్చును. యోగనిద్ర జాగ్రదవస్థ యన్నందుకు, శ్లో. 'నిద్రాజాగ్రతిరేవయస్యనిగమస్తోమావతంసోత్పలమ్' శ్లో. 'నిద్రాముద్రాం నిఖిల జగతీరక్షణేజాగరూకా' మనునవి ప్రమాణములు.

శ్రుతిదూర = వేదబాహ్యమయిన, భోగ = సుఖమందలి, సక్తతన్ = ఆసక్తిచేత, విఱ్ఱవీఁగి = గర్వించి, తాన్ = తాను, చరణమగ్రజుదెసఁజాపఁడేని = అన్నయగుటచేఁ బూజ్యుఁడయిన యింద్రుని దిక్కునఁ గాళ్లుసాపి పరుండక పోయినట్టాయెనేని యనియర్థము. ఇక్కడ నింద్రావరజశబ్దార్థ మను సంధించిచెప్పినాఁడు. శ్రుతిదూర = చెవులులేనిశేషాహియొక్క, భోగ=శరీరముయొక్క, సక్తతన్ = సంపర్కముచేత, అనఁగా శేషగాత్రమందుఁ బవళించుటచేత, విఱ్ఱవీఁగినాఁడనియును దూర్పు దిక్కునఁ బాదములు చాపి పడమటిశిరస్సుగాఁ బవ్వళించియున్నాఁడనియునుభావము. (ని. 'భోగ స్సుఖే ధనే చాహే శ్శరీరఫణయో ర్మతః' అని అ.)

అలరారు = ఒప్పుచున్న, సిరి = ధనమును, తనయడుగునఁ గూర్చి = తనక్రిందదాచిపెట్టు కొని, గట్టిగన్ = దృఢముగాను, ఈఁగిచేయి = దానమిచ్చెడు కుడిచెయ్యి, మాటికొనఁడేని = ముడిచి పెట్టుకొనియుండకపోయెనేని అనియర్థము. సిరియనఁగా లక్ష్మి, ఆమెకు పాదసేవ ఘటింపఁజేసినాఁడని యును గుడిచెయ్యి తలక్రిందఁబెట్టుకొన్నాఁడనియును భావము.

"కటినికటశిరః పార్శ్వవిన్యస్తహస్తం"
అను శ్లోకభావమువలన శ్రీరంగనాయకుల హస్తవైఖరి దెలియవచ్చును.

భయద = భయంకరులైన, రిపు = శత్రువులయొక్క, పుర=పట్టణములను, హారి = హరించు వాఁడును, నిర్భయ = భయరహితమానట్టులుగా, విహారి = విహరించువాఁడును, ఆర్య = పూజ్యుల యొక్క, సత్కార = పూజను, కారి=చేయువాఁడును, ఔదార్యవిభవధారి = వితరణవైభవమును వహించినవాఁడును, ఐ = అయినవాఁడయి, మించు = అతిశయించుచున్న, శ్రీరంగశౌరికిన్ = శ్రీరంగరాజునకు, ఎపుడున్ = ఎప్పుడును, శ్రీరంగశౌరి = శ్రీరంగనాయకస్వామి, రమణన్ = యుక్తమానట్లుగా, ప్రతిసేయవచ్చున్ = ఈడుచేయవచ్చును.

అనఁగా రాజైన యీ శ్రీరంగశౌరి భయంకర శత్రుపట్టణములను, హరించువాఁడు గనుక నితనికి పైఁజెప్పఁబడిన భయంకర శత్రురాజ్యవిముఖుఁ డయిన శ్రీరంగశౌరి సమానుఁడుకాఁడనియు భయరహితమానట్లుగా విహరించు శ్రీరంగశౌరికి నేడుకోటలలోపలనుండియు భయముచేతఁ గన్ను మూయకయుండునట్టి శ్రీరంగశౌరి సమానుఁడుగాఁడనియుఁ బూజ్యులయినవారియొక్క పూజసేయు నట్టి యీరంగశౌరికిఁ బూజ్యుఁడయిన యన్న నవమానించిన శ్రీరంగశౌరి సమానుఁడు కాఁడనియుం వితరణవైభవమునువహించిన యీరంగశౌరికి ధనము దాచిపెట్టికొనియిచ్చునట్టి చెయ్యి ముడుచు కొన్న శ్రీరంగశౌరి సమానుఁడు కాఁడనియును దాత్పర్యము.

అలంకారము యథాసంఖ్యము. వ్యతిరేకము.

తా. విరోధులకు వెఱచి రాజ్యమును వదలి తరలుట పెద్దకోటల చాటుననుండియు జాగరణావస్థలో నుండుట శ్రుతిదూరమగు భోగసక్తి (వేదాచారవిరుద్ధవర్తనము) సిరినడుగున జేర్చి దానహస్తము దాచుటలోనగులోపములవలన శ్రీరంగనాయకులు ప్రకృత వంశమూలపురుషుఁడగు శ్రీరంగశౌరికి సాటిగాఁడు. (అర్థాంతముచే శ్రీరంగనాయకుల గుణగణము లూహ్యములు.)

క. ఆమనుజేంద్రునకుఁ బురం, ధ్రీమణి యగుతిమ్మమాంబ • శ్రీరామునకున్
భూమిజ సుత్రామునకుఁ బు,లోమజయునుబలె జగంబు•లో నుతి కెక్కన్. 35

ఆమనుజేంద్రునకున్=ఆ రంగరాజునకు, పురంధ్రీమణియై = భార్యారత్నమై, తిమ్మమాంబ= తిమ్మమ్మయనునామె, శ్రీరామునకున్ = శ్రీరామస్వామికి, భూమిజ = సీతాదేవియును, సుత్రామునకున్=దేవేంద్రునకు, పులోమజయుఁనుబలెన్=శచీదేవివలె, (ని. 'పులోమజాశచీంద్రాణీ' అని అ.) జగంబులోనుతికెక్కన్=జగత్తునఁ బ్రసిద్ధికెక్కియుండును.

తిమ్మమాంబ యనుటలో నంబాశబ్దముమీద నంబాశబ్దమునకుఁ గవి ప్రయోగములు చాల గలవు.

శ్లో. "ఆర్యాంబాదికశబ్దాస్స్యు రత్రశ్రేష్ఠత్వగోచరాః,
తత స్తద న్తశబ్దేభ్యో నైవశ్రేష్ఠత్వగోచరాః." (అధర్వణ)

తా. ఆశ్రీరంగరాయలకు ధర్మపత్నియగు తిమ్మమాంబ శ్రీరామునకు సీతవలె నింద్రునకు శచీదేవివలె నొప్పి భర్తృప్రియముగా సంచరించెను.

సీ. ధర యేయపాంసుల•తల చూపరాకుండఁ దనకూర్మిఁ జేని న•ప్పునవె ముంచెఁ
గమల యేనిశ్చల•రమణు పేరెదకు మోపై నిల్చి యతనిపే • రడుగుపఱచె
సతి యేయచండిక • పతిఁ జట్టుకూఁతురై జగడాలు పచరించి • సగము చేసె
వాణి యేమితసూక్తి•వదలదు తలవాకిలి నిజేశు మాటమో•చె నన జేసె
తే. ననుచు భూకాంతశ్రీకాంత•హరునికాంత, నజునికాంతను నిరసించి•యాసిరంగ
పార్థివునికాంత తిమ్మాంబ•పతికిఁ గుశల, కీర్తిబలవృద్ధినిర్మల•స్ఫూర్తి లొసఁగు.

పాంసులయనఁగా జారిణి (ని. 'స్వైరిణీపాంసులాధస్యాత్' అని అ.) అనఁగాఁ బతివ్రత, ధర=భూకాంత, ఏయపాంసుల=ఏ పతివ్రత, అనఁగా గాదనుట, ఏమన్నను, తలచూపరాకుండన్=తల యెత్తుకొని తిరుగఁగూడకుండునట్లు, తనకూర్మిఁ జేనిన్=తన ప్రాణేశ్వరుని, అప్పునవెముంచెన్ = అప్పులతోనే మునింగిపోవునట్లు చేసెను అని యర్థము. పాంసువనఁగాఁ బరాగము. ఆదిగలది పాంసుల, అదిగానిది యపాంసుల గనుక భూమియే పరాగరహితురాలు, అనఁగాఁ బరాగసహితురాలనియును దలగానరాకుండునట్లుగాఁ ధన్నుధరించినకూర్మరాజును నీటమునిఁగియుండునట్టులు చేసినదనియును భావము. కూర్మిఁ జేఁడన్నచోట కూర్మశబ్దముమీఁద జీష్‌విధింపఁబడినదిగనుకఁ గూర్మమనిచెప్పవలసి నందుకుఁ గూర్మిఁ జేఁడని చెప్పినాఁడు.

కూర్మమనుటను కూర్మిఁ జేఁడనుట అపుష్టార్థదోషమైనను (తల్లక్షణము 'ప్రకృతానుపయుక్తార్థమపుష్టార్థం తదుచ్యతే') శ్లేషమునందు అపుష్టార్థదోషముండ దనునధర్వణాచార్యుని "అపుష్టార్థోపిసాధుస్యాత్ యతిచేత స్సుఖావహః" కారికవలన హృదయరంజకవాక్యమున దోషవిచారణము తగదని సోమకవివ్యాఖ్యలోఁ గలదు.

కమలయే నిశ్చల=శ్రీకాంత యే నిశ్చలురాలు, అనఁగా నిశ్చలురాలుకాదనుట, అదేమన్నను, రమణుపేరెదకు మోపైనిల్చి=పెనిమిటియైన విష్ణుమూర్తియొక్క అఱ్ఱునకు బరువగునట్లుగాఁ ద్రొక్కి పట్టినదై, అతనిపేరడుగుపఱిచెన్=ఆయనపేరడఁగిపోవునట్టులుగాఁ జేసెనని యర్థము. లక్ష్మి యే నిశ్చలురాలు, అనఁగాఁ జంచలురాలేయనియును బెనిమిటి వక్షస్థలమందునిలిచి యాయనయొక్క పేరును, అనఁగా హారమును గ్రిందుపఱిచినదనియుఁను భావము. లక్ష్మీనారాయణాదినామములయందుఁ దనపేరు ముందుగాఁ బలుకఁబడుచున్నది, గనుక యాయననామమును గ్రిందుపఱిచినదని ప్రకారాంతరము.

సతి=అనఁగా హరునికాంత, ఏయచండిక=ఏటిసాధ్వి, అనఁగా సాధ్విగాదనుట, ఏమన్నను, పతిన్=నాథుఁడైన హరుని, చట్టుకూఁతురై=రాతికిఁబుట్టినదై, అనఁగాఁ గఠినురాలై, జగడాలుపచరించి=జగడాలాడి, సగముచేసెన్ = కృశించి సగమగునట్లుగాఁ జేసెనని యర్థము. చండికానామముగలదియును, హిమవంతునికిఁ గూఁతురైనదనియుఁను జగడాలుపచరించి జగ+డాలు, అనఁగాఁ బ్రకాశరూపమైన కాంతిగలుగఁజేసి పతి నర్ధనారీశ్వరునిఁ జేసినదనియును భావము.

వాణి=అనఁగా నజునికాంత, ఏమితసూక్తి=ఏ మితభాషిణి, అనఁగా బహుభాషిణి యనుట, వదలదుతలవాకిలి=బయిఁటవాకిటనే నిలుచును, నిజేశుమాట మోచెననఁ జేసె=తన పెనిమిటిని నిందపాలాయె ననునట్టులుగాఁ జేసెనని యర్థము. వాగ్రూపిణి గనుక సరస్వతి యేమితసూక్తి యనఁగా సకలోక్తిస్వరూపురాలనియును నోరెడఁబాయదనియుఁను నిజేశ్వరుని వాణీవహుఁడనఁ జేసె ననఁగా వాణీయుక్తముఖునిఁ జేసెననియుఁను భావము.

అనుచున్=ఇట్లు పలుకుచు, భూకాంతన్=భూదేవిని, శ్రీకాంతున్=లక్ష్మీదేవిని, హరుని కాంతన్ = పార్వతీదేవిని, అజునికాంతన్=సరస్వతీదేవిని, నిరసించి=తిరస్కరించి, ఆసిరంగపార్థివునికాంత=ఆశ్రీరంగరాజుయొక్క భార్యయైన, తిమ్మాంబ=తిమ్మమ్మ, పతికిన్ = పెనిమిటికి, కుశల=క్షేమమును, కీర్తి=కీర్తిని, బలవృద్ధి=బలసంపత్తిని, నిర్మలస్ఫూర్తులు=మాలిన్యరహితమైన స్ఫూర్తులను, ఒసఁగున్=కలుగఁజేయునని క్రమాలంకారము. భూమివలనఁ గూర్మమునకు లోపించిన కుశలత్వము లక్ష్మివలన విష్ణునకు లోపించినకీర్తి పార్వతివలన శివునకు లోపించిన బలము సరస్వతివలన బ్రహ్మకు లోపించిన నిర్మలస్ఫూర్తి గుర్తించి తిమ్మమాంబ యీశుభోదయములు తనభర్తకుఁ గలుగఁజేసెను.

తా. భూదేవియు లక్ష్మీదేవియుఁ బార్వతియు సరస్వతీదేవియు భర్తృసేవావిధులలోఁ జాలలోపములు గావించిరని తిమ్మమాంబిక గుర్తించి పతికి కుశలము యశస్సు బలము నిర్మలత్వమును గూర్చి భర్తృసేవాపరాయణురాలై పొగడిక గాంచెను. అలంకారము వ్యతిరేకము.

శా. చేతోజాతసమానమూర్తి యగునా శ్రీరంగధాత్రీధవుం
డాతిమ్మాంబికయందుఁ గోనవిభుఁ దిమ్మాధీశు రామప్రభున్
ధూతాశేషవిపత్తు శ్రీతిరుమలేంద్రు న్వేంకటాఖ్యానవి
ఖ్యాతుం గాంచె సురద్రుపంచకము నయ్యంభోధిరాజుంబలెన్. 37

చేతోజాతసమానమూర్తియగు=మన్మథునికి సమానమైన యాకృతిగలవాఁడైన, ఆశ్రీరంగధాత్రీధవుండు=ఆశ్రీరంగరాజు, ఆతిమ్మాంబికయందున్=భార్యారత్నమైన తిమ్మమ్మయందు, కోనవిభున్=

కోనమరాజును, తిమ్మాధీశున్=తిమ్మరాజును, రామప్రభున్=రామరాజును, ధూతాశేషవిపక్షున్= కంపింపఁజేయఁబడిన సమస్తశత్రువులు గలిగిన, శ్రీతిరుమలేంద్రున్=సంపద్యుక్తుఁడైన తిరుమలదేవరాయలను, వేంకటాఖ్యానవిఖ్యాతున్=వేంకటరాయఁడను ప్రసిద్ధిగలవానిని, సురద్రుపంచకమున్ = కల్పవృక్షపంచకమును, అయ్యంభోధిరాజుంబలెన్ = ఆక్షీరసముద్రుఁడువలెనే, కాంచెన్=కనెను. అలంకారము ఉపమ.

అంభోధిరాజుంబలెన్ అనుటలో సోమకవి అంభోధిరాజున్ అని విడఁదీసి ద్వితీయైకవచన మనెనుగాని కవిప్రయోగానుసారముగా నది ప్రథమవిభక్తియె. పూర్ణానుస్వారము నుగాగమనకు బదులు ఆదేశసరళపూర్వస్థమగుటచే వచ్చియుండును. వాఁడుంబోలె, నీవుంబలె, అనుపదములు ప్రయోగరూఢములు.

తా. సముద్రమునకు సంతానము మొదలగు కల్పవృక్షములైదు జనించినటుల శ్రీరంగాధిపునకుఁ దిమ్మాంబికయందు కోనరాజు తిమ్మరాజు రామరాజు తిరుమలరాజు వెంకటరాయలు అనునైదుగురు కుమారులు జననము నొందిరి.

క. అందగ్రజుండు రాజపు, రందరుఁ డన వెలసెఁ గోన • రాజు నిజభుజా
సందీపితాసిభిదుర, స్పందనిపాతితమహావి • పక్షోత్కరుఁడై. 38

అందున్=ఆ కుమారులయందు, అగ్రజుండు=పెద్దవాఁడైన, కోనరాజు=కోనమరాజను కుమారుఁడు, నిజ=స్వకీయమయిన, భుజా=బాహువునందు, సందీపిత=మిక్కిలియుఁ బ్రకాశించుచున్న, అసి=ఖడ్గమనెడి, భిదుర=వజ్రాయుధముయొక్క, స్పంద=చలనమాత్రముచేత, నిపాతిత=కొట్టిపడవేయఁబడిన, మహాత్ = అధికమైన, విపక్ష = శత్రువులయొక్క, ఉత్కర = సమూహము లనెడు, మహాత్=అధికమైన, అవి=కులపర్వతముయొక్క,(ని. 'అవిశ్శైలేరవౌమేషే' అని వి.) విపక్షోత్కరుఁడై=ఱెక్కలగమిగలవాఁడై, రాజపురందరుఁడనన్=రాజులలో నింద్రుఁడనునట్టులుగా, వెలసెన్= ప్రకాశించెను. అలంకారము రూపకము.

తా. వారిలోఁ బెద్దవాఁడగు కోనరాజు దేవేంద్రుఁడు తనవజ్రాయుధముతోఁ గొండల ఱెక్కలను నఱికి పరాక్రమించినటులఁ దనకరస్థమగు ఖడ్గముతో విరోధులఁ జెండి పేరు ప్రతిష్ఠల నొందెను.

శా. శ్రీరంగాధిపుకోనభూవిభునికీ • ర్తిస్వచ్ఛతుండాంకతే
జోరాజద్ద్విజరాజు తీవ్రగతిచే • సూర్యాతిగుం డై నభం
బారోహించి పవిన్ హసించుచు నహీ • నాగాతులం జించి త
త్సారాహర్నిశగుప్తవాసవసుధన్ • సాధించుఁ జిత్రంబుగన్. 39

శ్రీరంగాధిపుకోనభూవిభుని = శ్రీరంగరాజుకుమారుఁడైన కోనమరాజుయొక్క, కీర్తి=కీర్తియనెడు, స్వచ్ఛ=తెల్లనైన, తుండ=ముఖమే, అంక=చిహ్నముగాఁగల, తేజః=ప్రతాపమనెడు, రాజత్=ప్రకాశించుచున్న, ద్విజరాజు=గరుత్మంతుఁడు, తీవ్రగతిచే సూర్యాతిగుండై = తీవ్రమనఁగా నత్యుష్ణము నత్యంతమును గనుక నత్యుష్ణగతిచేత సూర్యునిఁ దిరస్కరించినవాఁడైయనియుఁ, అత్యంత గతిచేత సూర్యమండలమును దాఁటినవాఁడయియనియు నర్థము. (ని. 'తీవ్ర మత్యుష్ణ కటుక నితాంతే

ష్వన్యవన్మతమ్' అని అ.) నభంబారోహించి=ఆకాశముపైకిఁబోయి, పవిఁ హసించుచుఁ=వజ్రాయుధమును దిరస్కరించుచు ననియును వజ్రాయుధమును లక్ష్యముసేయక యనియునర్థము. అహీన=అధికులైన,అరాతులఁ=శత్రువులను,చించి=చీరికలుఁ చేసియనియును,అహి+ఇన=అమృతరక్షకసర్పశ్రేష్ఠులనెడు, అరాతులంజించియనియు నర్థము. తత్=ఆయధికులైన శత్రువులయొక్క, సార=బలముచేత, అహర్నిశ=దివారాత్రములును,గుప్త=రక్షింపఁబడుచున్న, వాస+వసుధఁ=నివాసభూమినియనియును, తత్=ఆసర్పశ్రేష్ఠులయొక్క,సార=బలముచేత,అహర్నిశ=గుప్తమయిన,వాసవ=ఇంద్రునియొక్క,సుధఁ=అమృతముననియునర్థము.చిత్రంబుగఁ=ఆశ్చర్యమానట్లుగా,సాధించుఁ=స్వవశముగాఁ జేసికొనును, అనఁగా రంగరాజుపెద్దకుమారుఁడయిన కోనమరాజు సూర్యునిమించిన వేఁడిమిగల ప్రతాపముచేత బలవంతులైన శత్రువుల సంహరించి వారివారి నివాసభూములన్నిటిని దనవశముచేసికొన్నాఁడని భావము. అలం. రూపకము.

తేజోద్విజరాజు రక్తవర్ణుఁడనియు నాతని తలకీర్తి యను స్వచ్ఛవర్ణము గలదనియు భావము. పరాక్రమము తొలుత సూర్యమండలమును ఆవలనాకాశమును ఇంద్రలోకమును దాఁటుటచే దిగంతలోకాంతర వ్యాపకశక్తి దానికి సహజమనియుఁ గాననే అహీన+అరాతినిరాసము సాధ్యమయ్యెనని యాశయము.

తా. కోనభూపాలుని పరాక్రమము సూర్యమండలమును మించి యాకాశమునంటి వజ్రాయుధమును దిరస్కరించి బలవంతులగు విరోధులను జెండాడి వారిచే సురక్షితమగు వసుధ నార్జించుచున్నది. (గరుడుఁడు అమృతముదెచ్చుటకు సూర్యమండలము, ఆకాశము దాఁటి యింద్రుని లక్ష్యపెట్టక సర్పములఁ జెండి యమృతముఁ దెచ్చుట యర్థాంతరము.)

క. ఆతనితమ్ముఁడు తిమ్మ, క్ష్మాతలపతి వొగడుఁ గనియె ♦ ఘనుఁ డనఁ గీర్తి
వ్రాతవినూతనకైతక, జాతద్యోతనకృపాణ♦చపలాన్వితుఁ డై. 40

ఆతనితమ్ముఁడు=ఆకోనమరాజు తమ్ముఁడయిన, తిమ్మక్ష్మాతలపతి=తిమ్మరాజు, కీర్తివ్రాత=కీర్తిసమూహమనెడు, వినూతన=మిక్కిలి నూతనమైన, కైతక=కేతకీపుష్పములయొక్క, జాత=సమూహమునకు, ద్యోతన=సూచకమైన, కృపాణ=ఖడ్గమనెడు, చపలా=మెఱుపుతోడ, అన్వితుఁడయి=కూడుకొన్నవాఁడయి, ఘనుఁడనఁ=మేఘుఁడనునట్టులుగానని యర్థము. మహాత్ముఁడనునట్లుగా ననిభావము. పొగడుగనియెఁ=స్తోత్రముఁజెందెను. (ని. 'తటిత్సౌదామనీవిద్యు చ్చఞ్చలా చపలాపిచ' అని అ.) ఇక్కడ మేఘవాచకమయిన శబ్దమునకు మువర్ణకమురావలసినను, సూ. 'విపక్షాతః ప్రవృత్తిశ్చ ప్రత్యయస్యక్వచిత్క్వచిత్' అను నథర్వణవచనముచేత మహద్వివక్షచేసి ఘనుఁడని చెప్పినాఁడు. అలం. రూపకము.

తా. మెఱపు మెఱయఁగనే మొగలిపూయుట సహజము. తిమ్మరాజు ఘనుఁడు (మేఘుఁడు) గావున నతనికృపాణమను మెఱుపులకాంతు లతిశయింపఁగనే కీర్తియను మొగలిరేకు లుదయించుచున్నవి. (తిమ్మరాజునకుఁ బరాక్రమచిహ్నమగు ఖడ్గము కీర్తికరముగ నున్నదని భావము.)

సీ. ధాత్రీశ్వరులు గాని ♦ ధాత్రీశ్వరులు గారు పురుడు వాగనుభూతి♦భూతిగతుల
మానవేంద్రులు గాని ♦ మానవేంద్రులు గారు పోల్కి నయాభోగ♦భోగకళల

రాజహంసులు గాని • రాజహంసులు గారు సరి సత్కళాసార•సారరుచుల
నరపుంగవులు గాని • నరపుంగవులు గారు తర మెన్న వరధర్మ•ధర్మభృతుల
తే. జగతినీమేటికనినృపు•ల్వొగడనెగడె, నేబిరుదురాయరాహుత్తా•హితవధూభు
జంగబిరుదాంకపుంఖిత•సమరవిజయ, కాహళుఁడుతిమ్మవిభుఁ డాజి•దోహళుండు.

జగతిన్=భూమియందు, ఈమేటికిన్=ఈరాజశ్రేష్ఠునికి, వాగనుభూతి, వాక్=విద్యయొక్క, అనుభూతి=అనుభవముయొక్కయు, భూతి=ఐశ్వర్యముయొక్కయు, గతులన్=మార్గములచేత నని యర్థము. ఇక్కడ వాగ్దేవీపరిపాలనముచేతను భస్మముచేతను నని యర్థాంతరమును గ్రహించి యభేదాధ్యవసాయము చెప్పవచ్చును. పురుషుఁ=ఈఁడు, ధాత్రీశ్వరులుగాని=ధాతయు నీశ్వరుఁడుగాని, అనఁగా బ్రహ్మరుద్రులుగాని, ఇక్కడ క్రమాలంకారము. నాల్గుపాదములయందు నీలాగే యని తెలియవలెను. ధాత్రీశ్వరులనుచో ఇకోయణచి యను సూత్రానుసారముగ రేఫాదేశము వచ్చునుగాన ధాతాచ ఈశ్వరశ్చ ధాత్రీశ్వరౌ యని యొకచోటను ధాత్ర్యాః ఈశ్వరాః+ధాత్రీశ్వరాః అని వేఱొకచోటను విగ్రహమును జెప్పుకొనవలయును.

ధాత్రీశ్వరులుగారు=భూమీశ్వరులుగారు, నయాభోగ=నీతిపరిపూర్ణతయొక్కయును, భోగ=భోగములయొక్కయు, కళలన్=విశదభావములచేత, పోల్కి=పోలిక, మానవేంద్రులుగాని=మనువు నింద్రుఁడుగాని, 'అత్రమనురేవమానవఇతివ్యుత్పత్తిః ప్రాజ్ఞఇతివత్' మానవేంద్రులుగారు = నరేంద్రులుగారు, మానవశ్చ+ఇంద్రశ్చ మానవేంద్రౌ అనువిగ్రహముచే మానవుఁడే మనువనియు, మానవానాం+ఇంద్రాః, మానవాః+ఇంద్రఇవ మానవేంద్రాః మానవశ్రేష్ఠుఁడనియు విగ్రహము చెప్పుకొనవలయును.

సత్కళాసార=శ్రేష్ఠమైన చతుష్షష్టికళాసారముచేత ననియర్థము, షోడశకళలచేత ననిభావము. సారరుచులన్=బలమైనతేజస్సుచేతను, సరి=సాటి, రాజహంసులుగాని=చంద్రసూర్యులుగాని, రాజహంసులుగారు=రాజశ్రేష్ఠులుగారు, ఇక్కడ సూర్యవాచకమైన హంసశబ్దమునకు డుజ్వోధాన మావశ్యకముగావున నుకారయుక్తమైన పాఠము సాధువని గ్రహింపవలయును. రాజాచ హంసశ్చ రాజహంసౌ యనియు, వేఱొకచో రాజానో హంసాఇవ రాజహంసాః యనియు విగ్రహము.

వరధర్మ=శ్రేష్ఠమైనధనుస్సుయొక్కయు, ధర్మ=న్యాయముయొక్కయు, భృతులన్=భరణములచేత, తరమెన్నన్=సామ్యమెంచిచూడఁగా, నర=అర్జునుఁడును, పుంగవులుగాని=ధర్మదేవతయైన వృషభముగాని, నరపుంగవులుగారు=రాజులుగారు, ఇక్కడపశువాచకమైనపుంగవశబ్దముమీఁద మహద్వివక్షచేసి డుజ్జు విధించినాఁడు. ఈవిషయము ౪౦ వ పద్యమందు ఘనుఁడన్నచోట స్పష్టీకృతంబై యున్నది. నరశ్చ పుంగవశ్చ నరపుంగవౌ యనియు, నరాః పుంగవాఇవ నరపుంగవాః అనియు విగ్రహము.

అని=ఇట్లు, నృపుల్వొగడన్ = రాజులు స్తోత్రముచేయఁగా, బిరుదరాయరాహుత, అను నదియు, అహితవధూభుజంగ, అనునదియునగు, బిరుదాంక=బిరుదావళులచేత, పుంఖిత=నిండింపఁబడిన, సమర=యుద్ధమందలి, విజయకాహళుఁడు=విజయప్రయుక్తమైన కాహళులు కలిగినవాఁడును, ఆజి=యుద్ధమందు, దోహళుండు=వికాసముగలిగినవాఁడును నగు, ఏతిమ్మవిభుండు=ఏ తిమ్మరాజు,

నెగడెఁ=వృద్ధిఁబొంది ప్రకాశించెనో, యెత్తుగీతియందలి యచ్ఛబ్దము (ఏశబ్దము)నకును ముందరివచనపు మొదల నున్నతచ్ఛబ్దమునకును నన్వయము. అలంకారము శ్లేషమూలకపరిసంఖ్య.

తా. తిమ్మరాజు విద్యచే బ్రహ్మను ఐశ్వర్యముచే శంకరుని నీతిచే మనువును, ఇంద్రునికళలచేఁ జంద్రుని ప్రకాశముచే సూర్యుని ధనుర్విద్యలో నర్జునుని ధర్మమునందు ధర్మదేవతను మించి సాటిరాజులలోఁ బేరెన్నికనొంది రాయరాహుత్త, అహితవధూభుజంగాదిబిరుదములొంది కీర్తి గాంచెను.

వ. తత్క్రమంబున. 42

ఆ తిమ్మరాజుయొక్క కులమువరుసయందు.

తే. రవికులం బలరింప శ్రీ•రాముఁ డైన, శౌరి తనరెండుకన్ను లు•సరియె కాఁగఁ
దలఁచిసోమాన్వయము పవి•త్రంబు సేయ, నవని శ్రీరంగవిభు రాముఁ•డై జనించె.

రవికులంబలరింపన్=సూర్యవంశమును బ్రకాశింపఁజేయుటకొఱకు, శ్రీరాముఁడయినశౌరి=శ్రీరామావతారమునొందిన విష్ణుమూర్తి, తన రెండుకన్నులు సరియె కాఁగఁదలఁచి=తనయొక్క రెండుకన్నులను సమానముగ నెంచి, ఇక్కడ విష్ణుమూర్తియొక్క కన్నులు సూర్యచంద్రులని భావము. సోమాన్వయము పవిత్రంబుసేయన్=చంద్రవంశముఁ బవిత్రముచేయుటకు, అవనిన్=భూమియందు, శ్రీరంగవిభురాముఁడై=శ్రీరంగరాజుకుమారుఁడైన రామరాజై, జనించెన్=జన్మించెను.

అలంకారము సంబంధాతిశయోక్తి, రూపకమును.

తా. సూర్యచంద్రులు విష్ణువునకుఁ గనులు గావున విష్ణువు తొలుత సూర్యవంశమున దశరథునకుఁ దనయుఁడుగాఁబుట్టి రెండవకన్ను గౌరవించుట కిపుడు చంద్రవంశమున శ్రీరంగవిభునిపుత్రుఁడగు రామరాజుగా జనించెను.

సీ. పట్టాభిషేకవి•పర్యయంబునఁ బ్రోలు వెడలి ప్రియానుజు • ల్వెంటఁ గొలువఁ
జిత్రకూటాభిఖ్యఁ • జెలఁగుపెన్గొండసాంద్రహరిద్విపేంద్రనా•దవనిఁ జెంది
ఖలజనస్థానవా•సులఁ బల్వుర వధించి మహిమ సలకఖర•స్మయ మడంచి
హరివీరభటమహో•ద్ధతి నబ్ధి గంపింప దురమునఁ గదిసి త•ద్దోర్విహిఁ దునిమి
తే. యనఘతరపార్థివేందిర • నధిగమించి, సాధుకర్ణాటవిభవసం•స్థాపనంబు
పూనిశరణాగతులనెల్లఁ•బ్రోచె రాముఁ, డతఁడునిజచరితంబు రా•మాయణముగ.

ఈపద్యమునందలి రాముఁ డతఁడు అను వాక్యమును బట్టిచూడ రామరాజుపరముగా శ్రీరామునిపరముగా నర్థద్వయము కనుపట్టుచున్నది.

రాముఁడతఁడు=రాముఁడైన యారాజు, నిజ=స్వకీయమయిన, చరితంబు=చరిత్రము, రామాయణముగన్=రామాయణకథ యగునట్టులుగా, అభేదాధ్యవసాయముచేత ననుట, ఇక్కడ రాముని చరిత్రము రామాయణము కావలసినదేయని యానురూప్యము గ్రహింపవలయును. పట్టాభిషేక విపర్యయంబునన్=పట్టాభిషేకముయొక్క వ్యత్యయమందు, రామస్వామికివలె రామరాజునకును బట్టాభిషేకము విఘ్నమయినదని చెప్పుచున్నాఁడు. ప్రోలువెడలి=పట్టణమును బయలువెళ్లి, ప్రియానుజుల్వెంటఁగొలువన్=ప్రియులైన యనుజులు, అనఁగాఁ దిరుమలరాయఁడు వేంకటరాయఁడు నను తమ్ములు వెంబడిఁ గొలిచిరాఁగానని రామప్రభుపరమయిన యర్థము. ప్రియయనఁగా భార్యయైన సీతయు ననుజుఁడనఁగాఁ దమ్ముఁడైన లక్ష్మణుఁడును దోడఁ గొలిచిరాఁగా నని శ్రీరామపరమయిన యర్థాంతరము.

అభిఖ్య యనఁగా నామము, ప్రభయును, చిత్ర=విచిత్రములైన, కూట=శృంగములయొక్క, అభిఖ్యన్ = ప్రభచేత, చెలఁగు=విలసిల్లుచున్న, పెన్గొండన్ = పెన్గొండనున్న, సాంద్ర=వట్టమయిన, హరి=గుఱ్ఱములును, ద్విపేంద్రన్=మదపుటేనుఁగులునుగలిగిన, ఆదవనిన్=ఆదవనియనెడుపట్టణమును, చెంది=ఆక్రమించి యని యర్థము. చిత్రకూటాభిఖ్యన్=చిత్రకూటమనెడు పేరుచేత, చెలఁగు=ఒప్పుచున్న, పెన్గొండన్=మహాపర్వతమందు, సాంద్ర = నిబిడమయిన, హరి=సింహములయొక్కయు, ద్విపేంద్ర=గజశ్రేష్ఠములయొక్కయు, నాద=ధ్వనులుగలిగిన, వనిన్=అరణ్యమును, చెంది=ప్రవేశించియని యర్థాంతరము. (ని. 'అభిఖ్యా నామశోభయోః' అని అ.)

ఖల=పాపాత్ములైన, జనస్థానవాసులన్=జనపదనివాసులను, పల్వురవధించి=అనేకులసంహరించి, మహిమన్=ప్రభావముచేత, సలక=సలకుఁడను, ఖర=క్రూరునియొక్క, స్మయమడంచి=గర్వమునడంచి యని యర్థము. ఖల=పాపాత్ములయిన, జనస్థానవాసులన్=జనస్థానమందున్న రాక్షసులను, పల్వురవధించి=అనేకులను సంహరించి, మహిన్=భూమియందు, మసలక = జాగుసేయక, ఖర=ఖరాసురుని యొక్క, స్మయమడంచి=గర్వనాశముచేసి యని యర్థాంతరము.

సలకము తిమ్మరాజును సలకనామమున వ్యవహరింతురనుటకు దృష్టాంతము.—

శ్లో. మహత్తరే మానవలోకశాసితు ర్మనోనుకూలా మహిషీపదే తదా,
కృతాభిషేకా సలకక్షితీశితు స్స్వరాత్మజాసీ ద్వరదాంబికావధూః.

అచ్యుతరాయాభ్యుదయము, మూఁడవసర్గము ౪ వ శ్లో.

హరి=గుఱ్ఱములయొక్కయు, వీరభట=శూరులైన భటులయొక్కయు, మహోద్ధతిన్ = అధికమైన యౌద్ధత్యముచేత, అబ్ధిగంపింపన్=సముద్రము చలించునట్టులుగా, దురమునఁగదిసి=యుద్ధమందుఁ దారసించి, తద్ద్రోహిఁదునిమి=పూర్వమందుఁ జెప్పఁబడిన సలకనామకద్రోహిని వధించి యనియర్థము. హరివీరభట=కపివీరులయొక్క, మహోద్ధతిన్=అధికౌద్ధత్యముచేత, అబ్ధిగంపింపన్=దక్షిణసముద్రము వణఁకఁగా, దురమునఁగదిసి=యుద్ధమందుఁ దారసించి, తద్ద్రోహిఁదునిమి=ప్రసిద్ధుఁడైనరావణుని వధించి యని యర్థాంతరము.

అనఘతర=మిక్కిలి నిష్కల్మషమైన, పార్థివేందిరన్=రాజలక్ష్మిని, అధిగమించి=పొంది యని యర్థము. అనఘతర=నిష్పాపురాలైన, పార్థివేందిరన్ = పృథివికిఁగొమార్తెయైన లక్ష్మిని అనఁగా సీతాదేవిని, అధిగమించి=కలిసికొని యని యర్థాంతరము. సాధు=లెస్సైన, కర్ణాటవిభవసంస్థాపనంబు=కర్ణాటరాజ్యవైభవసంస్థాపనమును, పూని=వహించి యని యర్థము. సాధు=యోగ్యులైనవారియొక్క, కర్ణాట=కర్ణగోచరమైన, విభవసంస్థాపనంబు పూని=వైభవముయొక్క సంస్థాపనమును వహించి యని యర్థాంతరము. శరణాగతులనెల్లఁబ్రోచెన్=శరణమనఁగా గృహమును రక్షణమును, గృహమునుగూర్చి వచ్చినవారినందఱిని రక్షించెనని యర్థము. రక్షణమునుగూర్చి వచ్చినవిభీషణాదులను సంరక్షించెనని యర్థాంతరము. (ని. 'శరణం గృహరక్షిత్రోః' అని విశ్వము.) అలంకారము శ్లిష్టరూపకము.

తా. రామరాజు పట్టాభిషేకప్రయత్నము భంగముగా గనే సోదరసహితుఁడై ఆదోనికిఁజేరి యచటిదుష్టులఁ బెక్కండ్రను దెగటార్చి సలకముతిమ్మయగర్వ మడచి సైన్యముతో నిజరాజధానికిఁజేరి కర్ణాటరాజ్యస్థాపకుఁడయ్యెను. ఇతనిచరిత్ర మాయావిశేషయుక్తమై రామచరిత్రమగు రామాయణమును బోలియున్నది.

మ. హరిశౌర్యుం డగురామభూవిభునితీవ్రాటోపవద్వాహినీ
శరవేగంబున నాత్మమూలబలము ల్జారన్ దళాడంబరం
బరుగం గొమ్మలు వోవ లావరి నిజామాదు ల్వజీరు లజిం
తురు నమ్రత్వముఁ గానలో ముసలిమానుల్గా వితర్కింపఁగన్. 45

హరి శౌర్యుండగు=సింహముయొక్క పరాక్రమమువంటి పరాక్రమముగల, రామభూవిభుని=రామరాజుయొక్క, తీవ్ర=అత్యంతమయిన, ఆటోపవత్=యుద్ధత్వరతోఁ గూడిన, వాహినీ=సేనయొక్క, శరవేగంబునన్=బాణవేగముచేతనని యర్థము. తీవ్రాటోపవత్ = అత్యంతాడంబరముతోఁ గూడిన, వాహినీ=నదియొక్క, శరవేగంబునన్=జలవేగముచేతనని యర్థాంతరము. ఆత్మమూలబలములు=తమకు నమ్మకమయిన మూలబలములు, జారన్ = పలాయనమయిపోఁగా ననియర్థము. తమయొక్క వ్రేళ్లసత్తువ హరించిపోఁగా నని వృక్షపరమయిన యర్థాంతరము. దళాడంబరంబరుగన్=దళమనఁగా రాణువయును బత్రమును, రాణువయొక్క విజృంభణము నశింపఁగా ననియర్థము. ఆకులయొక్క విజృంభణము నశింపఁగానని యర్థాంతరము.ని. 'దళోంశే స్త్రీభటే భేదే' అని వి. 'దళంపర్ణంఛదఃపుమాన్' అని అ. కొమ్మలువోవన్=పుత్రపౌత్త్రాదులు హతులుకాఁగా నని యర్థము. శాఖలు విరిగిపడిపోఁగా ననియర్థాంతరము. ఇంతవఱకు నర్థద్వయమునకు నభేదాధ్యవసాయము. లావరి=బలముచెడి, నిజామాదుల్వజీరుల్=నిజాము మొదలైన ప్రభువులుఁ బ్రధానులును, కానలోన్=అరణ్యమందు, ముసలిమానుల్గావితర్కింపఁగన్=ముదిమ్రానులోయని (జనులు) ఊహించునట్టులుగా మానులన్నచోట రేఫసంశ్లేషము లేమికిఁ గారణము మృగ్యము. తురకలని భావము. నమ్రత్వమున్=వంగుటను, భజియింతురు=అంగీకరింతురు. ఇక్కడ నుభయసాధారణ్యము.

అర్థద్వయమునకు నభేదాధ్యవసాయము సం. 'జీర్ణవృక్షగతధర్మసంబంధేన నిమిత్తేన మ్లేచ్ఛానాం వృక్షత్వేనోత్ప్రేక్షణా దుత్ప్రేక్షాలంకారః హరిశౌర్యవిశేషణస్యమ్లేచ్ఛాదినమ్రీకరణహేతుతయా కావ్యలింగభేదః అనయోస్సంకరః.'

ముసలిమ్రాఁకులని బహువచనమునందుంటకు బదులు ముసలిమానులనుట అర్థాంతరము గాపాడుటకుఁ గవి యొనరించిన నియమోల్లంఘనము. ముసలిమానులనుచోట ముసలి యనువిశేషణము ప్రాణివాచకమున కర్హముగాని యచేతనమున కర్హము గాదనువాద మొకటికలదు. ఇట్టి ప్రయోగములు కలవు.

సీ. సఖివనప్రియవతంస మితంఁడు గాఁ డైన మునియలికొమ్మలఁ గదియకున్నె.

చంద్రాంగదచరిత్రము.

తా. రామభూపాలుని వాహినీశరవేగమున కోరువఁజాలక మూలబలములు కోలుపోయి దళములు కొమ్మలు పోవ నిజామాది యవనప్రభువులు నమ్రులై ముసలిమానులుగాఁ బరిగణింపఁబడుచున్నారు.

సీ. ఎదలపైఁ బొదలుపయ్యెదలు జాఱఁగఁ బారు బిబ్బీలకు ముసుంగులబ్బఁ జేసె
ఘనభేరికాధ్వను ల్విని గుండియలు వ్రీల వ్రాలుమల్కలకు గోలీలు సేసె
నుడుగనిరిభాగింతిఁ దశగాల్లో వడ నిల్చు ఖానులు డాగఁ జీఁకటులు సేసెఁ
గడ లేనికాందిశీకత నేగువమకుర్వి జడధు లెల్లను గాలిసడులు సేసె

తే. అనుచు శిరములఁ దాల్తు రె•వ్వనిసమగ్ర
సైన్యధుతధూళిఁ జకితు లై • చనుసపాద
కుతుపశాహినిజామాది•కుతలపతు ల
తండు నృపమాత్రుఁడే రామ•ధరణివిభుఁడు. 46

ఎదలపై బొదలు=వక్షస్థలములమీఁద నొప్పారెడు, పయ్యెదలు=పైఁటచెఱఁగులు, జారన్=జారి పోవునట్టులుగా, పారు=పరుగిడునట్టి, బిబ్బీలకున్=నిజామాదుల యంతఃపురస్త్రీలకు, ముసుంగులబ్బఁ జేసెన్=ముసుఁగులు గలుగునట్టుగాఁ జేసెను. సైన్యధూళికిఁగల ప్రసరణశక్తి=సూచితము. ఆ ప్రసరణము భయార్తలై తొలంగినపైఁట నెఱుఁగని యవనాంతఃపురకాంతలకు (గోషాగాపాడు) ముసుఁగగుటయే ధూళి శిరోధారణ మగుటకు హేతువు.

ఘనభేరికాధ్వనులువిని=ఘనమైన రణభేరియొక్క భాంకారధ్వనులువిని, గుండియలువ్రీలన్=గుండెలు పగులఁగా, వ్రాలు=నిర్జీవులై కూలిన, మల్కలకున్=తురకలకు, గోలీలుసేసెన్=గోలీలేర్పఱచెను. ఇచట ధూళికిఁగల వ్యాపకనిబిడత్వములు సూచితములు. అనాథలై గతించిన మల్కలకు గోలీలేర్పఱచుటయే ధూళిఁ దలఁ దాల్చుటకు హేతువు.

ఉడుగనివిభ్రాంతిన్=తీరకయుండెడు భయవిభ్రాంతిచేత, తడగాళ్లువడన్=కాళ్లుతడబడఁగా, నిల్చున్=కదలలేక నిలిచిన, ఖానులు=మ్లేచ్ఛప్రభువులు, డాగన్=దాగుటకు, చీఁకటులుసేసెన్=చీఁకట్లు గల్పించెను. ఇట నిబిడత్వమునకుఁగల పరమావధి సూచితము. ఇందుచేఁ బ్రాణభయార్తులగు పిఱికివాండ్రకు దాగ నవకాశము గలుగుటయే ధూళి తలఁ దాల్చుటకు హేతువు.

కడలేనికాందిశీకతనేగు=తుదిముట్టని భయపలాయనముచేతఁ బోవుచున్న, తమకున్=తమకు, ఉర్విన్=భూమియందు, జడధులెల్లను=సముద్రముల నన్నిటిని, కాలినడలుసేసెన్=నడిచిపోఁదగిన లోఁతుగలవానిఁగాఁ జేసెను. ఇట ధూళికిఁగల సముద్రపర్యంతవ్యాప్తి సూచితము. సముద్రతరణమున కవకాశము గల్గించుటయే ధూళిని దలదాల్చుటకు హేతువు.

అనుచున్=ఇట్లనుచు, ఎవ్వని=ఏ రాజుయొక్క, సమగ్ర=సంపూర్ణమైన, సైన్య=సేనలచేత, ధుత=ఎగరఁగొట్టఁబడిన, ధూళి=పరాగమును, చకితులై చను=భయపడి పోవుచుండు, సపాదకుతుపశాహినిజామాది=సపాదులు మొదలైన, కుతలపతులు=ప్రభువులు, శిరములఁ దాల్తురు=శిరసావహింతురో యని యర్థము. ధూళి శిరస్సులమీఁదఁబడుననిభావము. అతఁడు=అట్టివాఁడైన, రామధరణి విభుఁడు=రామరాజు, నృపమాత్రుఁడే=అందఱురాజులవంటివాఁడా, అనఁగాఁ గాఁడనుట. సేనాపరాగము తమపై వ్యాపించుచుండఁగా శత్రురాజులు పలాయితులైరని భావము. ఇచట మ్లేచ్ఛులకు సేనాధూళులయందు ముఖావరణాదికల్పనాసంబంధము లేకున్నను సంబంధమునుఁ జెప్పుటచే నతిశయోక్త్యలంకారము. అది శిరస్సుచే వహించుట యనెడు శ్లాఘనమనురూపకమును నిలుపుచుండుటచే రెండిటికిని సంకరము.

రామరాయలు మహమ్మదీయుల జయించినను వారియంతఃపురికాంతల యభిమానమునకు మహమ్మదీయమత ధర్మమునకు వ్యతిరేకముగ వర్తింపలేదని యాశయము. సమగ్రసైన్యధూళి గావుననే యింతవ్యాప్తి నొందినది. ఇందుఁ జెప్పఁబడిన సపాదుని నిజముగుపేరు పహబాత్తు.

పయ్యెద అనుటకుత్పత్తి. పైవియెదకు వక్రోక్తిని బయ్యెదయ్యె. అప్పకవి.

"పయ్యోదేత్యాదినామగత యకారస్యాపి ఇతిపృథగేత్వవిహిత మేవ-
డోలాభూషోత్తరీయాణి విసైత్వం నాస్తి మధ్యయః." ఆహోబలపండితీయము.

పయ్యోద యని పయ్యాద యని రెండురూపములును గలవు.

తా. రామరాజుసేనాధూళి బిబ్బీలకు ముసుఁగులుగను మల్కులకుఁ గోలీలుగను, ఖానులకుఁ జీఁకటులుగను, సముద్రము కాలినడగను జేయుటచే నుపకారకృతజ్ఞతాసూచకముగా నిజామాదియవన ప్రభువులు తలఁదాల్పసాగిరి.

శా. విశ్వామిత్రునిఁ గొల్చి రాముఁ డతఁ డుర్విం జెందెఁ గళ్యాణము
న్విశ్వామిత్రులు గొల్వ రాముఁ డితఁ డుర్విం జెందెఁ గళ్యాణముల్
శశ్వత్కీర్తులు రాము లయ్యిరువురున్ సాధించుకళ్యాణలా
భైశ్వర్యంబులు ధర్మనిర్మథనధర్మాలంబనవ్యక్తముల్. 47

విశ్వామిత్రునిఁగొల్చి=విశ్వమునకు శత్రుఁడైనవానిఁ గొల్చి యని యర్థము. విశ్వామిత్రమహామునిని సేవించి యని భావము. రాముఁడతఁడు = ఆ దశరథపుత్రుఁడైన రాముఁడు, ఉర్వింజెందెఁ గళ్యాణమున్ = భూమియందు వివాహమంగళమును బొందెను. విశ్వామిత్రులుగొల్వన్ = విశ్వామిత్రమహామునులే తన్నుఁ గొల్వఁగా, రాముఁడితఁడు=ఈ రామరాజు, ఉర్వింజెందెఁ గళ్యాణమున్ = భూమియందుఁ గల్యాణమును బొందెనని యర్థము. కల్యాణప్రాప్తి యిక్కడ సమానధర్మము. విశ్వ =సమస్తమైన, అమిత్రులు = శత్రువులు, కొల్వన్ = సేవింపఁగా, ఉర్వియందుఁ గల్యాణమనెడు పట్టణమును బొందినాఁడని భావము. శశ్వత్కీర్తులు = ప్రకాశించుచున్న కీర్తిగలిగిన, రాములయ్యిరువురున్=ఆ ఇద్దఱురాములును, సాధించు = సాధించిన, కల్యాణలాభైశ్వర్యంబులు = కల్యాణప్రాప్తిరూప వైభవములు, ధర్మమనఁగా న్యాయమును జాపమును గనుక, ధర్మనిర్మథన = న్యాయవిధ్వంసముచేతను, ధర్మాలంబన = న్యాయావలంబనముచేతను, వ్యక్తములు = ప్రకటములైనవియని యర్థము. చాపఖండన చాపావలంబనములచేతఁ బ్రకటములైనవి యనిభావము. అనఁగా ధర్మనిర్మథన వ్యాపారమువలనఁ గల్యాణలాభమును బొందినరామునికంటె ధర్మావలంబనవ్యాపారముచేతఁ గల్యాణమునుబొందిన రామప్రభుం డుత్తముఁడని చమత్కారము గ్రహింపవలయును.

అలంకారము వ్యతిరేకము.

తా. రాముఁడు విశ్వామిత్రుని సేవించి కళ్యాణమొందును. రామరాజు విశ్వ+అమిత్రులుగొల్వ కళ్యాణ(నగర)మును బడసెను. ఇరువురును గల్యాణమునొందిరిగాని శ్రీరాముఁడొందిన కల్యాణప్రాప్తి ధర్మనిర్మథనరూపము (ధనుర్భంగరూపము) రామరాజొందిన కళ్యాటము ధర్మాలంబనరూపము- (ధర్మస్థాపనరూపము.)

సీ. ప్రబలావలేపవిగ్రహజాయమానాగ్రహముడించి బహుభావనాప్తిఁ గాంచుఁ
బురమెల్లఁ బ్రత్యగ్రభూతిపాలుగఁ జేసి యచలాసనాభ్యాసినైయి కృశించు
రతినిభ రామానుగతమైత్రిపై రోసి కల నైనఁ గల్యాణకాంక్ష యుడుఁడు
సరవిఁ బ్రాణాయామసంసిద్ధికై సారెసారెకుఁ గుండలిస్థాన మంటు

తే. మానకనిజాముఁ డపవర్గమార్గవృత్తిఁ, బెరయుపరబుద్ధి నెవ్వాని పేరు దలఁచి

యతఁడు శ్రీరాముఁడఖిలసంస్తుతికెక్కఁగఁడై, సేతుకాశీతలాంతరసంఖ్యాతయశుఁడు.

రామరాజు నిజామునకుఁగావించిన పరాజయపరముగను శ్రీరామకృతమగు నవర్థ పరముగను నీపద్యమున కర్థద్వయము గలదు.

మానక=విడువక, నిజాముఁడు=నిజాముసాహేబు, పరబుద్ధిన్ = శత్రుబుద్ధిచేతనని యర్థము. పరబ్రహ్మబుద్ధిచేత నని యర్థాంతరము. ఎవ్వాని పేరుదలఁచి=ఏ రామరాజు నామమునెంచి యనియర్థము. ఏ శ్రీరాముల పేరుదలఁచి యని యర్థాంతరము. ప్రబల=ఉత్కృష్టమైన, అవలేప=గర్వముచేతనైన, విగ్రహ=విరోధమువలన, జాయమాన = పుట్టుచున్న, ఆగ్రహామున్=కోపమును, డించి =విడిచిపెట్టి, బహు = తఱుచుగా, ధావనాప్తిఁగాంచున్=పలాయనమును బొందునోయని యర్థము. ప్రబల=మిక్కుటమైన, అవలేప=వ్యాప్తిగల, విగ్రహ = దేహమువలన, జాయమాన = పుట్టుచున్న, ఆగ్రహామున్ = అభిమానమును, డించి = పరిత్యజించి, బహుధా = పలువెఱంగులుగా, వనాప్తిఁగాంచున్ = అరణ్యమునుబొందునోయని యర్థాంతరము. నిజాము రామరాజుధాటికి వెఱచి విరోధము మఱచి యడవులకుఁ జేరఁబోయెననుట.

పురమెల్లన్ = పట్టణమంతయును, ప్రత్యగ్ర = నూతనమైన, భూతిపాలుగఁజేసి = బూడిదపాలుచేసి, అచలాసనాభ్యాసియై = కొండలలోనుండు నలవాటుగలవాఁడై, కృశించున్ = క్షీణించునోయనియర్థము. పురమెల్లన్ = దేహమంతయు, ప్రత్యగ్రభూతిపాలుగఁజేసి, అనఁగా నొంటినిండఁ బూడిదెపూసికొని, అచల = నిశ్చలమైన, ఆసన = పద్మాసనము మొదలైనవానియందలి, అభ్యాసియై = పరిచయముగలవాఁడై, కృశించున్ = క్షీణించునోయని యర్థాంతరము. (ని. 'పురంపురి శరీరేచ' అని వి.) నిజాముఁడు రామరాజునకుఁ దనరాజ్యము కైవసముజేయనొల్లక దహించి యడవుల కేగెననుట.

ఇభరామ = ఇభరాం అనెడువానియందు, అనుగత = పొందఁబడిన, మైత్రిపైన్ = స్నేహముమీఁదనుండెడు, రతిన్ = ఆసక్తిని, రోసి = మానుకొని, కలనైనన్=స్వప్నమందైనను, కల్యాణకాంక్షయిడఁడు = కల్యాణమను పట్టణముమీఁదివాంఛ మనస్సునఁ బెట్టకయుండునోయని యర్థము. రతినిభ = చక్కఁదనమందు రతీదేవితో సమానురాలైన, రామా = స్త్రీలయందు, అనుగత=పొందఁబడిన, మైత్రిపైరోసి = స్నేహముమీఁద నిరక్తిఁజెంది, కలనైనన్=స్వప్నమందైనను, కల్యాణకాంక్షయిడఁడు = కాంచనాభిలాషచేయకుండునో యని యర్థాంతరము. నిజాముఁడు ఇభరాంపైగల ప్రేమగూడ మఱచి కలనైనఁ గళ్యాణనగరమును దలంచుట లేదనుట.

సరవిన్ = యుక్తమైనట్టులుగా, ప్రాణాయామసంసిద్ధికై = ప్రాణదైర్ఘ్యముకొఱకు, అనఁగాఁ జావుదప్పించుకొనుకొఱకు, సారెసారెకున్ = మాటిమాటికి, కుండలిస్థానమంటున్=సర్పములకు స్థానమైన పుట్టపైనెక్కునని యర్థము. ఇక్కడఁ బుట్టనెక్కినవానిని బూరిగఱచినవానిని బారిపోవువానిని యుద్ధమందుఁ జంపరని సంప్రదాయము. ప్రాణాయామమనెడు యోగాంగసిద్ధికొఱకుఁ గుంభకావిష్టమానసుఁడగుచుఁ గుండలినీశక్తికి స్థానమైన మూలాధారమంటునని యర్థాంతరము. నిజాముఁడు చావుదప్పించుకొనుటకుఁ బుట్టలనెక్కి బ్రతుకుచున్నాఁడనుట.

అపవర్గమార్గవృత్తిఁబెరయు = వర్గమనఁగాఁ బుత్రపౌత్రాదికము, అపగతమైన పుత్రపౌత్రాదికముయొక్క మార్గమందలి వృత్తినిబొందునోయని యర్థము. అపవర్గమనఁగా మోక్షము, మోక్షమార్గ

స్ఫూర్తిని బొందునోయని యర్థాంతరము. అతఁడు = అనఁగా నిజాముఁడు, పరబుద్ధిచేత నెవరిపేరు దలఁచి పైనిఁజెప్పిన ప్రకారముగాఁ బ్రవర్తించునో యతఁడైన, శ్రీరాముఁడు, శ్రీ = సంపద్యుక్తుఁడైన, రాముఁడు=రామప్రభుఁడని యర్థము. శ్రీ=లక్ష్మీయుక్తుఁడైన, రాముఁడు=శ్రీరాముఁడని యర్థాంతరము. అఖిలసన్నుతికిఁదగఁడె = సకలమైనవారియొక్క స్తోత్రమునకు నర్హుఁడుకాఁడా, అనఁగాఁ గాదగుననుట. అతఁడు మఱియు నెట్టివాఁడనఁగా, సేతుకాశీతలాంతరఖ్యాతయశుఁడు = సేతుకాశీగలమధ్యభూమియందుఁ బ్రసిద్ధమైన కీర్తిగలవాఁడని యర్థము.

కుండలిస్థానము.

శ్లో. భుజంగాకారరూపేణ మూలాధారం సమస్థితా, శక్తిఃకుండలినీనామ బిసతంతునిభాశుభా.

వ. దేహమధ్యస్థానంబున మూలాధారచక్రం బలరు నదిమొదలుగ సహస్రారంబు తుదగాఁ బృష్ఠభాగంబున వీణాదండంబుభంగి సమస్తనాడికామూలకందంబై మూలోర్ధ్వచ్ఛిన్నవంశాభంబై షడాధారసమన్వితంబై యుండుదీర్ఘాస్థి బ్రహ్మదండి యనంబరగు. నాబ్రహ్మదండి మూలాధారచక్రకోణస్థయై కుండలీనామపరాశక్తియుక్తయై ప్రాణాగ్నిబిందునాదనిలయయై సావిత్రీసరస్వతీనామికయై బ్రహ్మరంధ్రగతయై సుషుమ్నానాడి ప్రవర్తిల్లు. సీతారామాంజనేయసంవాదము.

గుదస్థానమునందున్నమూలాధారచక్రమునందు అధఃకుండలిగలదనియు శిరస్సునం దూర్ధ్వకుండలికలదనియుఁ జెప్పుదురు. కుండలినే కుండలిని యందురు.)

తా. రామభూమి విభునిపేరువిన్నంతనె నిజాముఁడు మోక్షశీలుఁడై వనవాసియగుటకు గర్వాదు లుజ్జగించి మేన విభూతిఁబూసి కాంతాకనకములపై నాసమాని ప్రాణాయామాభ్యాసమునఁ గుండలిస్థానమంటి అపవర్గమునకుఁ బాటుపడెను. (నిజాముఁడు రామరాజు నెదిరింపఁజాలక పొందిన పరాజయ మాయాతావులసూచితములు.)

చ. అరిజయకీర్తిసాంద్రుఁ డగు•నయ్యభిరామనరేంద్రసోదరుం
దిరుమలదేవరాయల ను•తింపఁ దరంబె తదీయహేతిశాం
కరి యతిలోహితావయవ•గాఁ దను నాత్మహృదంతరంబులం
దరలక తాల్చువారలకుఁ • దార్చు సురీవరణీయవైఖరుల్. 49

అరిజయ=శత్రుజయమువలని, కీర్తి = యశస్సుచేత, సాంద్రుఁడగు=సమగ్రుఁడైన, అయ్యభిరామనరేంద్రసోదరున్ = ఆరామనృపునితమ్ముఁడైన, తిరుమలదేవరాయలన్=తిరుమలదేవరాయలను, నుతింపఁదరంబె=స్తోత్రముచేయశక్యమా, అనఁగా శక్యముగాదనుట. అదేమనిన, తదీయ = ఆతిరుమలరాయనిసంబంధమైన, హేతి = ఖడ్గమనెడు, శాంకరి=శాంకరీనామకశక్తి, అతిలోహితావయవఁగాన్ = మిక్కిలిరక్తముగల మూర్తిగలదానిఁగా, తనున్ = తన్ను, ఆత్మహృదంతరంబులన్ = స్వకీయవక్షస్థ్సలాంతరములయందు, తరలకతాల్చువారలకున్ = చలింపకధరించినవారికి, సురీవరణీయవైఖరుల్=దేవతాస్త్రీలకు వరింపఁదగిన వైఖరులను, తార్చున్=ఘటనపఱుచును, అని ఖడ్గపరమైనయర్థము. అనఁగా వారిని హతముగావించి స్వర్గమందలి యప్సరఃస్త్రీప్రాప్తిగలుగఁజేయునని తాత్పర్యము. ఉదయభాస్కరునిరీతిగా నత్యంతరక్తిమతోఁగూడిన దేహముకలదానినిగాఁ దన్ను స్వకీయవక్షస్సాంతరములయందు ధ్యానముచేసి నిలిపినవారికి దేవతాస్త్రీవశీకరణసామర్థ్యమునిచ్చునని శక్తి

పరమయిన యర్థము. శాంకరి నరుణాకారముగలదానిఁగాను నామె దేహకాంతిచేత ముందుగానే భూమి నరుణితమైనదానిగాను ధ్యానముచేసినవారికి స్త్రీవశీకరణసిద్ధియగునని యోగమరహస్యమున నిట్లు చెప్పఁబడెను.

శ్లో. "యోపకాష్ఠానిమగ్నాంయో దివం భూమించ చింతయేత్,
తస్య సర్వావశం యాంతా స్త్రైలోక్యవనితాధ్రువమ్."

యుద్ధనిహతులకు సురాంగనాసమాగమము కలుగు ననుటకు-

క. అతని యనుజుండు చినమ, ల్లతరుణనీరేజశరుఁడు లలి నొప్పెమ హో
న్నతగాయక నుతసాయక, హతనాయక ఘటితసౌర హరిణేక్షణుఁడై.

చంద్రికాపరిణయము.

తా. రామరాజసహోదరుఁడగు తిరుమలదేవరాయలు మహావీరుఁడై శత్రురక్తారుణితమగు ఖడ్గము దాల్చి పేరొందెను. అతనిఖడ్గముచేఁ దెగిన ప్రతిపక్షవీరులు సురకాంతాసమాగమమునొంది స్వర్గమున సుఖింపసాగిరి.

క. ఆరాయమణికి జగతీ, హారాయితకీర్తిఘృణికి ననుసంభవుఁడై
నారాయణాంశభవుఁడితఁ, డౌరా యన వేంకటక్షమాధిపుఁ డలరున్. 50

జగతీ=భూమికి, హారాయిత=ముత్యాలహారమువలె నాచరించుచున్న, కీర్తిఘృణికిన్=కీర్తియొక్క శుభ్రకాంతిగలిగిన, ఆరాయమణికిన్ = ఆతిరుమలదేవరాయశ్రేష్ఠునికి, అనుసంభవుఁడై = తోడఁబుట్టినవాఁడై, అనఁగాఁ దమ్ముఁడై, నారాయణాంశభవుఁ డితఁ డౌరా యనన్ = ఇతఁడు నారాయణమూర్తియొక్క యంశమువల్ల జన్మించినవాఁ డవురా యనునట్టులుగా, వేంకటక్షమాధిపుఁడలరున్=వేంకటరాయభూమీశ్వరుఁ డొప్పుచుండును. అలం. ఉపమ.

తా. ఆతిరులదేవరాయల తరువాతివాఁడగు వేంకటరాయలు లోకమునకు హారమువలెనున్న కీర్తిగలవాఁడై నారాయణాంశభవుఁ డనుకొనునటులఁ బ్రసిద్ధినొందెను.

సీ. నిరతంబు దుర్మార్గనిరతు లౌతురకల నతులసన్మార్గసంగతులఁ జేసె
ననియతమోహాంధు లౌపారసీకుల స్వస్త్రీసుఖైకనిశ్చలులఁ జేసె
నతినిర్దయాత్ము లౌయవనుల భూతసంతానతృప్తిప్రదాత్మకులఁ జేసె
ద్విజపక్షపాతంబు దెగడుపాశ్చాత్యుల ద్విజపక్షపాతభావితులఁ జేసె
తే. ననుచుఁ గడు మెచ్చి జయలక్ష్మి యాజిరంగ
కాతరబరీద కేతనఘటితభద్ర
కలశ మెదురుగఁ బూని యేఘనునిఁ జెందె
నతఁడు సామాన్యుఁడే వేంకటాద్రివిభుఁడు. 51

నిరతంబున్=ఎల్లప్పుడును, దుర్మార్గనిరతులౌ=దుర్మార్గమం దాసక్తులౌచున్న, తురకలన్=తురకలను, అతులసన్మార్గసంగతులఁజేసెన్ - అతుల=సమానరహితమైన, సన్మార్గ=సజ్జనమార్గముతోడ, సంగతులఁజేసెన్=కూడుకొన్నవారినిగాఁ జేసెనని యర్థము. సత్+మార్గమనఁగా నక్షత్రమార్గమగునాకాశము, ఆకాశసంగతులఁ జేసెనని యర్థాంతరము. వేంకటరాయలు దుర్మార్గులగు తురకల మంచిత్రోవను ద్రిప్పెనని స్వర్గాభిముఖులఁ గావించెనని భావము,

అనియత=నియతములేని, మోహ=కాముకత్వముచేత, అంధులౌ=కన్ను గానకయున్న, పారసీకులన్=మ్లేచ్ఛులను, స్వఃస్త్రీ=స్వకీయ లైనభార్యలవలని, సుఖ=భోగమందు, ఏక = ముఖ్యమానట్టులుగా, నిశ్చలులఁ జేసెన్=చలించనివారినిగాఁ జేసెననియర్థము. స్వర్గస్త్రీసుఖాసక్తులనుగాఁ జేసెనని యర్థాంతరము. ఇచట స్వ + స్త్రీ = తమయాఁడుది, స్వః + స్త్రీ స్వర్గస్త్రీ అని యర్థము. ఈరెండు పక్షములయందును స్త్రీశబ్దసకారమునకు ద్విత్వముగాని, స్వరశబ్దవిసర్గమునకు వికల్పలోపముగాని చేయవచ్చును. మోహాంధులగు పారశీకులఁ గులకాంతాలోలురుగ నొనర్చెనని దేవకాంతాసుఖలోలురుగఁ జేసెనని భావము.

అతినిర్దయాత్ములౌ = అత్యంతనిర్దయాంతఃకరణులైన, యవనులన్=యవనదేశపుతురకలను, భూతసంతానతృప్తిప్రదాత్మకులఁ జేసెన్ = ప్రాణికోటికిఁ దృప్తిప్రదమైన మనస్సుగలవారినిగాఁ జేసెననియర్థము. పిశాచగణమునకుఁ దృప్తిప్రదమైన, అనఁగాఁ దినఁదగినదై తనివిఁ జెందించునట్టి దేహముగలవారినిగాఁ జేసెనని యర్థాంతరము. ఇక్కడ నాత్మన్ శబ్దము దేహపరము. (ని. 'ఆత్మాయత్నో ధృతిర్బుద్ధి స్స్వభావో బ్రహ్మవర్ష్మ చ' అని అ.) నిర్దయాత్ములగు యవనుల భూతదయాపరతంత్రులుగఁ జేసెననియుఁ బిశాచాదుల కాహారముఁ జేసెననియు భావము.

ద్విజపక్షపాతంబుఁ దెగడు=బ్రాహ్మణపక్షపాతమును నిందించునట్టి, పాశ్చాత్యులన్ = పశ్చిమదేశస్థులైన తురకలను, ద్విజపక్షపాతభావితులఁ జేసెన్ = అనఁగా బ్రాహ్మణపక్షపాతమందుఁ జిత్తముగలవారినిగాఁ జేసెననియర్థము. ద్విజ=కంకగృధ్రాదిపక్షులయొక్క, పక్షపాత=పక్షవిక్షేపముచేత, భావితులఁ జేసెన్ = పొందఁబడినవారినిగాఁ జేసెననియర్థాంతరము. (ని. 'లబ్ధంప్రాప్తంవిన్నంవిత్తంభావితమాసాదితంచభూతంచ' అని అ.) బ్రాహ్మణద్వేషులగు పాశ్చాత్యుల బ్రాహ్మణాభిమానులుగఁ జేసెననియుఁ బక్షులపక్షవిక్షేపములు గావించె ననియు భావము.

అనుచున్ = ఈలాగుపలుకుచు, కడుమెచ్చి= మిక్కిలియు శ్లాఘించి, జయలక్ష్మి=జయలక్ష్మియనెడునాయిక, అజిరంగ=యుద్ధరంగమందు, కాతర=భయశీలుఁడైన, బరీద=బెడదకోటనబాబుయొక్క, కేతనఘటిత=ధ్వజమందునిలుపఁబడిన, భద్రకలశము=సువర్ణకలశమనెడు పూర్ణకలశము, ఎదురుగఁబూని=ఎదురుగఁ బట్టుకొనివచ్చి, ఏఘనునిఁ జెందెన్=ఏమహానుభావునిఁ బొందెనో, అతఁడు=అట్టి, వేంకటాద్రివిభుఁడు = వేంకటరాయఁడు, సామాన్యుఁడే = అందఱురాజులవంటివాఁడా, అనఁగాఁ గాఁడనుట. అలంకారము పర్యాయోక్తి. అతిశయోక్తి. జయలక్ష్మి యిచట నభిసారికగాఁ జెప్పఁబడెను. అభిసారికాలక్షణము.—

"మదనానలసంతప్తా యాభిసారయతిప్రియం, జ్యోత్స్నీతమస్వినీయానయోగ్యాంబరవిభూషణా.
స్వయంవాభిసరేద్యాతు సాభవేదభిసారికా, అస్యా స్సంతాపచింతాద్యా విక్రియాస్తు తథోచితం."

రసార్ణవసుధాకరము.

ఇట జయలక్ష్మి దివాభిసారిక:—

తా. వేంకటరాయలు దుష్టులగు విరోధులనందఱను సాధించి సత్ప్రవర్తకులనుగా (నిహతులనుగా)ఁ జేయుటచే జయలక్ష్మి యానందించి బెడదకోట నవాబు కేతనముపైఁ గలసువర్ణకుంభమును గొని యెదురుగావచ్చి వరించెను.

మ. కడిమి న్వేంకటరాయశౌరి నెదురం•గా లేక యత్యాహితం
బడరన్ గౌతమి దాఁటువేళ నిజకాం•తాశ్రుప్రవాహాప్తిఁ గా

ల్నడ దప్పఁ జడుఁడై నిజాముఁ డుడుపాలంబంబునం దాఁటి యె
క్కడఁ గన్న న్భజియించునయ్యుడుపరేఖ న్నామమోహంబునన్. 52

కడిమిన్=పౌరుషములచేత, వేంకటరాయశౌరి నెదురంగాలేక=శూరవంశసంజాతుఁడైన వేంకటరాయల నెదిరించి నిలువఁజాలక, అత్యాహితంబడరన్=మహాభయము ద్రేకింపఁగా, గౌతమిదాఁటువేళన్ = పారిపోవుచు గోదావరిని దాటుసమయమందు, నిజ=స్వకీయమైన, కాంతా = భార్యయొక్క, అశ్రు=శోకబాష్పములవల్లనైన, ప్రవాహ=పైనీటిపొర్లుయొక్క, ఆప్తిన్=కూడికచేత, కాల్నడ దప్పన్=కాల్నడకుఁ బాదియ్యకపోఁగా, జడుఁడై=విభ్రాంతిఁ బొందినవాఁడై, నిజాముఁడు=నిజాము సాహేబు, ఉడుపాలంబంబునందాఁటి=ఉడుపశబ్దము తెప్పయందును జంద్రునియందును వర్తించును, తెప్పకొయ్యయొక్క యాధారముచేత దాఁటి, ఎక్కడఁగన్నన్ = ఏకడఁజూచినను, అయ్యుడుపరేఖన్=నెలపొడుపునాఁటిచంద్రరేఖను, నామమోహంబునన్=ఏకనామభ్రాంతిచేత, భజియించున్=సేవించును. అనఁగా నుడుపరేఖ యాపత్కాలమందుఁ దన్ను నుద్ధరించుటచేత నుడుపరేఖానామము గల చంద్రరేఖను సేవించునని తాత్పర్యము. నెలపొడుపునాఁడు తురకలందఱు చంద్రునిఁ జూచుట ప్రసిద్ధము గదా. అలంకారము హేతూత్ప్రేక్ష. అతిశయోక్తి.

మహమ్మదీయులు చంద్రుని భజింతురనుటకు-

క. 'గోవధము చేయుతురకల, దైవంబవు నీవు మొదలఁ దక్కఁగఁ బాంథ
స్త్రీవధము సేయ రోయుదె, నీవర్తన మేమిచెప్ప నీరజవైరీ.' మనుచరిత్రము.

తా. మహమ్మదీయులు వేంకటరాయల నెదిరింపలేక గోదావరిదాఁటి పాఱిపోవుతఱిబిబ్బీలకన్నీటి ప్రవాహముచేఁ గాలినడ తప్పెను. అంత ఉడుపసహాయమున గోదావరి దాఁటినామసామ్యముచే నుడుప(పడవ)కృతమగు మేలునకు ఉడుపరేఖకు (బాలచంద్రునకు) మ్రొక్కుచున్నారు.

ఉ. ఏకసపాదలక్షమిత మింద్రజుదోశ్చరితప్రబంధ మ
స్తోకమె యంచుఁ జాపజితధూర్జటి వేంకటశౌరి శౌర్యదీ
క్షాకృతి కర్ణభీష్మజయశక్తి ననేకసపాదలక్షసం
ఖ్యాకమనీయభూరివిభవాప్తి వహించు నుదంచితోన్నతిన్. 53

ఇంద్రజు=ఇంద్రుకుమారుఁడైన యర్జునునియొక్క, దోశ్చరితప్రబంధము=భుజపరాక్రమచరిత్రమయిన ప్రబంధము, అనఁగా భారతము, ఏకసపాదలక్షమితము = పాదసహితమయిన లక్షయనెడు నిబంధముగలది, అస్తోకమె = అది మిక్కిలియు నధికమయినదా, అనఁగాఁ గొంచెము, అంచున్=అనివచించుచు, చాపజితధూర్జటి-చాప=ధనుస్సుచేత, జిత=జయింపఁబడిన, ధూర్జటి=శివుఁడుగలిగిన, అర్జునునివలె, అని యర్థము. ధూర్జటియనెడు పరరాజుగలవాఁడని భావము. వేంకటశౌరి=వేంకటరాయఁడు, శౌర్యదీక్షా=పరాక్రమదీక్షయందు, కృతి=కుశలుఁడైనవాఁడయి, కర్ణభీష్మజయశక్తిన్=అర్జునునివలెఁ గర్ణుని భీష్ముని జయించుటయందలి సామర్థ్యముచేత, చెవులకు భయంకరమైన జయశక్తిచేత నని భావము. అనేక=మితములేని, సపాదలక్ష=పాదసహితములైన లక్షయనెడి, సంఖ్యా=సంఖ్యచేత, కమనీయ=ఒప్పుచున్న, భూరి=అతిశయమయిన, విభవాప్తిన్=పరాక్రమప్రబంధవిభవప్రాప్తిని, ఉదంచితోన్నతిన్=మిక్కిలియు నొప్పుచున్న యౌన్నత్యముచేత, వహించున్=

పొందించుకొనును, అని యర్థము. అనేకులైన సపాదులయొక్క లక్షలకొలఁదియగు కాంచనవిభవము యొక్క ప్రాప్తిని బొందించుకొనునని భావము. అనఁగా నర్జునునికంటె నితఁడు పరాక్రమచరిత్రమం దధికుఁడని ఫలితార్థము. ఇక్కడ భూరిశబ్దము కాంచనవాచకము. (ని. 'భూరిప్రాజ్యసువర్ణయోః' అని విశ్వము.) అలం. శ్లేషోత్థాపితవ్యతిరేకము.

తా. సపాదలక్షశ్లోకపరిమితిగల యర్జున దోశ్చరితము దెలుపుభారతము గొప్పదియా యని నిరసించి చాపవిద్యలో ధూర్జటి (యనువాని) ని జయించిన వేంకటపతిరాయలకీర్తికృతి కర్ణభీష్మ జయశక్తి (చెవికి భయంకరమగు గెల్పుబీరముతో) నొప్పి యనేక సపాదలక్షసంఖ్యల (సపాదుల యొక్క) భూరి (సువర్ణ) విభవముతోఁ బేరెన్నికను గాంచెను.

ఉ. ఆయనుజు ల్విశుద్ధహరి•దంతమహాకరిదంతకాంతిరే
ఖాయతకీర్తులై కొలువ • గౌతమినీట నరాతిఘాతికౌ
క్షేయకరక్తము ల్గడిగి • శ్రీరమణీవరమూర్తిరామభూ
నాయకుఁ డుర్వి నేలె భువ•నస్తవనీయజయాభిరాముఁడై. 54

ఆయనుజుల్=పైనిఁజెప్పఁబడినతమ్ములు, అనఁగాఁ దిరుమలరాయఁడు వేంకటరాయఁడు నను వారు, విశుద్ధ=స్వచ్ఛమయిన, హరిదంత=దిగంతములయందలి, మహాకరిదంత = మహాగజదంతముల యొక్క, కాంతిరేఖా=కాంతిశ్రేణివలె, ఆయత=విస్తారమయిన, కీర్తులై=యశస్సుగలవారై, (కాంతి రేఖాయిత అని పాఠముఁజేసినచో యతికి భంగములేకుండును, కాంతిరేఖవలె నాచరించునట్టి యని యర్థము. ఇదియే కవిహృదయమని తోఁచెడిని.) కొలువన్=సేవింపఁగా, గౌతమినీటన్=గోదా వరీజలమందు, అరాతి=శత్రువులను, ఘాతి=ఖండించిన, కౌక్షేయక=ఖడ్గముయొక్క, రక్తముల్గడిగి= నెత్తురులను గడిగివైచి, అనఁగాఁ గందనోలు మొదలుకొని గోదావరిపర్యంతము తనఖడ్గముచేత శత్రు సంహారముచేసి గోదావరిలోఁ గత్తిగడిగినాఁడని భావము. (ని. 'కౌక్షేయకో మణ్డలాగ్రః కరవాలః కృపాణవత్' అని అ.) శ్రీరమణీవరమూర్తి=లక్ష్మీకాంతకు నాథుఁడైన నారాయణునివంటి స్వరూప ముగల, రామభూనాయకుఁడు=రామభూమీశ్వరుఁడు, భువన=లోకములచేత, స్తవనీయ=స్తోత్రము చేయఁదగిన, జయ=శత్రుజయముచేత, అభిరాముఁడై=ఒప్పుచున్నవాఁడై, ఉర్విన్=భూమిని, ఏలెన్ =పరిపాలించెను. కాంతిరేఖాయితకీర్తు లనుచోట నుపమాలంకారము.

గౌతమీజలమున ఖడ్గమును గడుగుట పరాక్రమచిహ్నము.

'గౌతమీవారి తరవారి కడిగినాఁడు.' శ్రీనాథుఁడు.

అరాతులు గౌతమిదాఁటిపోవుటవలననే గౌతమీజలమున ఖడ్గము గడుగవలసివచ్చెను. రామ రాయసోదరులకీర్తి కుపమానముగ దిగంతదంతిదంతములు చెప్పఁబడుటచే వారలకీర్తి దిగంతవిశ్రాంత మయ్యెనని యాశయము.

తా. సోదరు లీవిధముగాఁ గీర్తిశాలురై పరాక్రమధురంధరులై తోడుపడుచుండ రామరాజు గౌతమీజలమున శత్రురక్తారుణితమైన ఖడ్గము గడిగి నిర్విరోధముగాఁ బ్రతాపవంతుఁడై రాజ్య మును బరిపాలింపసాగెను.

క. ఆరామశౌరిపిమ్మట, ధీరామరశాఖి వీర•తిరుమలరాయం
డారామసేతుహిమవ, త్క్ష్మారమణీరమణుఁడై జ•గంబు భరించెన్. 55

ఆరామశౌరిపిమ్మటన్=ఆరామదేవరాయని యనంతరమందు, ధీరామరశాఖి=విద్వాంసులకుఁ గల్పవృక్షమయిన, అనఁగాఁ గల్పవృక్షమువలెఁ గోరినపదార్థములనెల్ల నిచ్చువాఁడనిభావము. వీరతిరుమలరాయండు=శూరుఁడైన తిరుమలదేవరాయఁడు, ఆరామసేతుహిమవత్క్ష్మారమణీరమణుఁడై=రామసేతువుమొదలుకొని హిమవత్పర్వతపర్యంతమైన భూకాంత కధిపతియై, జగంబుభరించెన్=జగత్తును భరించినవాఁడాయెను. ధీరామరశాఖి యనుచో రూపకాలంకారము.

తా. రామరాయలపిదపఁ బండితులపాలి పారిజాతమగు తిరుమలరాయలు సేతువుమొదలు హిమవంతమువఱకుఁగల విశాలరాజ్యమును బరిపాలింపసాగెను.

సీ. కావుకా వనువారిఁ ♦ గదిసి తుంగపయోధరపదాంతరంబు చే♦రంగనీదు
విపృతాగ్రరదనులై♦వ్రేళ్లు చీఁకెడువారి మోము చేర్చి శిరంబు♦మూరుకొనదు
పదములు దొట్రిలఁ ♦ బరువు లెత్తెడివారి ననురక్తవృత్తి వె♦న్నాడి చనదు
పలుచాపలములఁబు♦ట్టలు మెట్టఁజనువారిఁ దత్తరంబున గ్రుచ్చి ♦ యెత్తుకొనదు
తే. కాంచదో విజయశ్రీలఁ♦బెంచదో ప్ర, తాపబాలార్కులనుశుభో♦దయము మీఱ
నౌర తిరుమలరాయబా♦హాసిపుత్రి, యఖిలలోకాద్భుతక్రీడ ♦ నతిశయిల్లు. 56

ఈపద్యమందుఁ దిరుమలరాయనియొక్క బాహాసిని బుత్రవతియైన పుత్రికనుగా నధ్యవసించి యర్థద్వయమును గలుగఁజెప్పినాఁడు. ఎట్లనిన,

కావుకావనువారిన్=రక్షించురక్షించుమనువారిని, కదిసి=సమీపించి, తుంగ=ఉన్నతములైన, పయోధర=మేఘములకు, పద=స్థానమైన యాకాశముయొక్క, అంతరంబు = మధ్యప్రదేశమును, చేరంగనీదు=ప్రవేశించునట్టులుగాఁ జేయదు, అనఁగా నట్టివారిని హతముచేసి యూర్ధ్వలోకగతులనుగాఁ జేయదని ఖడ్గపరమైన యర్థము. కావుకావురని పోరుపెట్టియేడ్చెడు శిశువులను దగ్గఱఁబోయి యున్నతకుచమధ్యప్రదేశమందుఁ జేర్చుకొనదని పుత్రికాపరమైన యర్థాంతరము. ఇక్కడఁ బయోధరశబ్దము స్తనపరము. ని. 'స్త్రీస్తనాబ్దౌ పయోధరౌ' అని అ. పసికూన లేడ్చునపుడు తల్లులు పాలుబ్బుచనుదోయిమధ్యఁ జేర్చుట తల్లులకు సహజము. అసిపుత్రి యటులఁ జేయదు.

విపృత=తెఱవఁబడిన, అగ్రరదనులై=ముందరిపండ్లుగలవారై, వ్రేళ్లుచీఁకెడువారిన్=వ్రేళ్లనోటఁగఱచుకొన్నవారిని, మోముఁజేర్చి=మొనవాఁడితాఁకించి, శిరంబుమూరుకొనదు=శిరస్సును భిన్నముగాఁ జేయదని యర్థము. విపృతాగ్రరదనులై=కానఁబడిన ముందరిపండ్లుగలవారై, వ్రేళ్లుచీఁకెడువారిన్=వ్రేళ్లుగుడుచుకొనుబాలకులను, మోముఁజేర్చి=ముఖమానించి, శిరంబుమూరుకొనదు=మూర్ధాఘ్రాణముసేయదని యర్థాంతరము. నోటఁ జేయివేసికొను విరోధి పరాజయమున కొప్పుకొన్నటు లగునుగాన నట్టివానిని జంపకవిడుచుట రాజధర్మమును సంగరధర్మమును నై యున్నది.

పదములు దొట్రిలఁ బరువులెత్తెడువారిన్=కాళ్ళుతడఁబడఁగాఁ బారిపోవువారిని, అనురక్తవృత్తివెన్నాడిచనదు=అనుగతమైన రక్తముగల వృత్తిచేత వెంటఁ దరుముకొనిపోదని యర్థము. తప్పటడుగులుపెట్టి నడుచునట్టి చిన్నవాండ్ర ననురాగయుక్తమైనవృత్తిచేత వెంబడించిపోదని యర్థాంతరము. ప్రతివీరున కెదురునడవక తడగాళ్లతోఁ బరుగెత్తుట భీరులక్షణము. అట్టివారల వెన్నాడుట తునుమాడుట వీరధర్మమునకు వ్యతిరేకము.

పలు=అనేకవిధములైన, చాపలములన్=చిత్తచాంచల్యములచేత, పుట్టలుమెట్టఁజనువారిన్=పుట్టలపై నెక్కఁబోవువారిని, తత్తరంబునఁ గ్రుచ్చి యెత్తుకొనదు=త్వరపాటుచేతఁగ్రుచ్చి లేవనెత్తదని యర్థము. బాల్యచాపల్యముచేతఁ బాముపుట్టలమీఁదికిఁ బోవుచున్న బాలురను గ్రుచ్చి కౌఁగిలించుకొనదని యర్థాంతరము. పుట్టలమెట్టలకేగుట దాగుకొనుటకు సలుపు ప్రయత్నము కాననే యట్టివారిని ఖండింపదు. కావుకావనుతఱిఁ బురిటికందువనియు ప్రేళ్లచీకెడితఱి నెలలబిడ్డయనియుఁ దప్పటడుగులు వేయుతఱి నేడాదిశిశువనియుఁ బుట్టలుమెట్టలెక్కుతఱి నొకటిరెండేండ్లశిశువని విజయశ్రీయనుబాలికను ప్రతాపార్కుఁడనుబాలుని గ్రహింపవలయును.

శుభోదయముమీఱన్=శుభకరమైన యభ్యుదయమతిశయించునట్లులుగా నని యర్థము. జననమతిశయించునట్లులుగా నని యర్థాంతరము. కాంచదోవిజయశ్రీలన్=విజయసమృద్ధులను బొందలేదా యని యర్థము. విజయలక్ష్ములను బాలికలను కనలేదా యని యర్థాంతరము. పెంచదో ప్రతాపబాలార్కులను=బాలసూర్యులవంటి ప్రతాపముల నతిశయింపఁజేయలేదా యని యర్థము. ప్రతాపములనెడు బాలసూర్యులను, అనఁగా బాలురను, పెంచలేదా యని యర్థాంతరము. ఔర=భళా, తిరుమలరాయబాహాసిపుత్త్రి=తిరుమలదేవరాయని బాహువునందలి యసి యనెడు, అనఁగా ఖడ్గలత పుత్త్రికయు, అఖిలలోకాద్భుతక్రీడనతిశయిల్లున్=సమస్తలోకములకు నాశ్చర్యకరమైన విహారముచేత నతిశయించును.

(ని. 'స్యాచ్ఛస్త్రీచాసిపుత్రీచ ఛురికాచాసిధేనుకా' అని అ.) అనఁగా దిరుమలదేవరాయని బాహువునందలి ఖడ్గమనెడుస్త్రీ విజయశ్రీలనెడు కొమార్తెలను బ్రతాపము లనెడుబాలసూర్యులవంటి కొమాళ్ళను గనిపెంచిన బిడ్డలతల్లియయ్యుండినను బైనాల్గుచరణములయందును భేదాధ్యవసాయముచేతఁ బ్రాప్తమైన బిడ్డలతల్లులయందుఁ గనుపడని చరిత్రచేతను నద్భుతక్రీడయని యావిష్కృతము చేసినాఁడు. కావుకావనుచోఁ గృపాణపరమైన యర్థమందు మధ్యమపురుషైకవచనముగనుక మువర్ణకము రావలసినది (సూ. 'ప్రార్థనార్థేమురేకత్వే కథ్యతేమధ్యమార్థకః, విభాషాంతం పదంత్వేకే న ప్రాణేతుకదాచన')అనునథర్వణవచనమువల్ల మొదటికావనుపదముమీఁద హల్లుపరమగుచుండఁగా వైకల్పిక మువర్ణకమురాకున్నను,రెండవకావనుపదమున కచ్చుపరమగుచుండఁగా నిత్యముగా రావలసినది గనుక నిక్కడ 'శబ్దశాస్త్రవిరుద్ధం హి చ్యుతసంస్కార మిష్యతే' అనులక్షణముచేత చ్యుతసంస్కారదోషము ప్రాప్తమగుచున్నదని శంకింపఁగూడదు. ఎందువలనననిన, (సూ. 'తజ్జాసమాచదేశ్యాగ్రామ్యాచైవం చతుర్విధా భవతి' అను స.) సూత్రోక్తక్రమంబున నాంధ్రభాష నాలుగువిధములు గలది, అందు నిది గ్రామ్యోక్తి, ఈ గ్రామ్యోక్తిప్రయోగము తత్తత్స్వభావవర్ణనయందు యుక్తమని యథర్వణాచార్యాదులమతము, కావున శ్లేషైకతానుండగు నీకవి కిది దోషముగాదు.

"కావుము" పదమునకు హల్లుపరమైనపుడు మువర్ణము లోపించుటకలదు. అచ్చుపరమగుచో లోపించుట వ్యాకరణవిరుద్ధమైనను గవిప్రయోగము లిట్టికార్యమునకుఁ గానవచ్చెడిని.

కావుకా వనుట రక్కసులమూఁకనె (పాండురం.)
ఆడిదె నీదు పందెము (కళాపూ.)
భవచ్చిత్తేప్సితం బెద్ది చెప్పనినన్ (మార్కం.)

ఇక్కడఁ గాందిశీకస్వభావవర్ణనయందే చెప్పినాఁడు గదా. సం. 'అత్రాసిపుత్రీత్యపుత్రవత్యా

అపి పుత్రపోషణ కృత్యవైధుర్యేణాద్భుతచరిత్రం వ్యజ్యతే నాత్ర సమాసోక్తిః శ్లేషోవా విశేష్యస్యాపి శ్లిష్టత్వాత్. అలం. వ్యంగ్యము. మీఁదినాల్గుపాదములు శ్లేషమూలాతిశయోక్తి.

తా. తిరుమలదేవరాయఖడ్గపుత్రి విజయశ్రీలను కుమారితలఁ గాంచియుఁ బ్రతాపార్కుఁడను కుమారునిగాంచియు (శిశుపోషణమునందును శత్రుసంహారమునందును బూర్వోక్తసందర్భములలో జోక్యము గలిగించుకొనకున్నను) లోకాద్భుతవిధముగఁ గనిపెంచుటలోఁ బేరొందెను.

చ. కిరి కసహాయజీవనము ♦ కేవలగండము లద్రికోటికిం
గరులకు దుస్సహప్రకట♦ఖర్జువు శ్వేతపుమేను చక్రి కీ
విరసులఁ బొంద నొల్ల నని ♦ వేడ్కఁ భజించె ధరాపురంధ్రి శ్రీ
తిరుమలదేవరాయజగ♦తీరమణుక్ రమణీమనోభవున్. 57

కిరికిక్=ఆదివరాహమునకు సహాయసంపత్తిలేని బ్రదుకు,అని యర్థము. ఒంటిగాఁదిరుగుట యని భావము. (ని. 'కోలఃపోత్రీకిరిఃకిటిః' అని అ.) అద్రికోటికిక్=కులపర్వతములకు, కేవలగండములు=అన్నియుఁ బ్రాణగండములేయని యర్థము. గండశిలలని భావము. కరులకుక్=దిగ్గజములకు, దుస్సహ=సహింపశక్యముగాని, ప్రకట=స్ఫుటమైన, ఖర్జువు=అనఁగా గజ్జియని యర్థము. కండూతి యని భావము. చక్రికిక్=శేషాహికి, శ్వేతపుమేను=అనఁగా బొల్లివిడిచినదేహమని యర్థము. ధవళదేహమని భావము. (ని. 'చక్రీజాలికభిత్కోకకులాలాజాహిసూచకే' అని మే.) కాఁబట్టి, ఈవిరసులఁబొంద నొల్లనని=ఈఱోఁతగొట్టువాండ్రను బొందనొల్లనని, ధరాపురంధ్రి=భూకాంత, రమణీమనోభవుక్=స్త్రీజనమన్మథుఁడైన, శ్రీతిరుమలదేవరాయజగతీరమణుక్ = సంపద్యుక్తుఁడైన తిరుమలదేవరాయ ప్రభువును, వేడ్కక్=వేడుకచేత, భజించెక్=సేవించెను. అలం. ఉత్ప్రేక్ష. కావ్యలింగము.

అసహాయజీవనము అను ఒంటరితనము. వరాహములలో గుంపును జీలి విడిగా సంచరించు వానిని ఒంటరికాఁడు, ఒంటికాఁ డనుటకుఁ బ్రమాణములు-

సీ. 'కమ్మినొంటరికానిదొమ్మినొంచుయశంబు బయటిపల్లెలు గూల్చు బల్మి కల్మి'

(చంద్రాంగదచ. ఆ. ౧)

సీ. 'అనురక్తిరేచునూతనసారసాటోప మొంటికాండ్రకుఁ బెంపు లొసఁగు నెచట'

హరిశ్చంద్రార్థమున నొంటికాఁడు పంది. నలార్థమున వియోగి. (హరిశ్చంద్రనలో. ఆ. ౨)

తా. వరాహ మొంటరిదనియు, శైలములు గండములు గలవనియు, ఏనుఁగులు కండూతిగలవనియు, సర్పము బొల్లివిడచినదనియుఁ దలంచి యీవిరసులనందఱను భూసతి విసర్జించి సుందరాకారుఁడగు తిరుమలదేవరాయలను భజించెను.

సీ. బహుమహీధరకూట♦పటలిపాలుగఁ జేసె గంధాంధసింధుర♦ఘటల నెల్ల
శాఖిశాఖాశిఖా♦చయములఁ దగిలించె నమితకోదండదం♦డముల నెల్ల
శరధికుటుంబినీ♦ఝరుల వెంబడిఁ బంచె రామాకుచాగ్రహా♦రముల నెల్ల
దుర్దమకర్దమ♦స్తోమంబులో వైచె విజయమంగళశంఖ♦వితతి నెల్లఁ
తే. దగవరి గదా నిజాముఁ డు♦ద్దండజయప, టిష్ఠతిరుమలరాయధా♦టికిఁ జలించి
పఱచు నెడశక్తిమఱచియు♦మఱువఁడయ్యెఁ,దత్తదుచితప్రవేశసం♦ధానయుక్తి.

గంధాంధ=గర్వాంధము లైన, సింధురఘటలనెల్లన్ = గజఘటలనన్నిటిని, ఘటయనఁగాఁ బండ్రెండేనుఁగులగుంపు, (ని. 'కరిణాంఘటనాఘటా' అని అ.) బహుమహీధరకూట=అనేకము లైన పర్వతశిఖరములయొక్క, పటలిపాలుగఁ జేసెన్ = సమూహము పాలగునట్టులుగాఁ జేసెను, అమితకోదండదండములనెల్లన్ = మితములేని వింటిబద్దలనన్నిటిని, శాఖి = వృక్షములయొక్క, శాఖా = కొమ్మలయొక్క, శిఖా=అగ్రములయొక్క, చయములన్=సమూహములయందు, తగిలించెన్=సక్తములుగాఁ జేసెను, రామా=భార్యలయొక్క, కుచ=స్తనములయందలి, అగ్ర = శ్రేష్ఠము లైన, హారములనెల్లన్= ముత్యాలహారము లన్నిటిని, శరధి=సముద్రునియొక్క, కుటుంబినీ = భార్య లైన నదులయొక్క, ఝురులవెంబడిన్=ప్రవాహములవెంబడి, పంచెన్=పంపెను. విజయ=జయప్రయుక్తము లైన, మంగళ=శుభకరము లైన, శంఖ=శంఖములయొక్క, వితతినెల్లన్=సమూహమునంతయు, దుర్దమ=సహింపఁగూడని, కర్దమస్తోమంబులోన్=బురదరొంపిలో, వైచెన్=పడవైచెను, నిజాముఁడు=నిజాంఖానుఁడు, తగవరిగదా=మర్యాదగలవాఁడుగదా, ఏమనిన, ఉద్దండ=పరాక్రమప్రయుక్తమైన, జయ=విజయమందు, పటిష్ఠ=సమర్థుఁడైన, తిరుమలరాయ=తిరుమలదేవరాయలయొక్క, ధాటికిఁ జలించి=దాడికిఁ జంచలించినవాఁడై, ధాటీలక్షణము, (సం. 'శత్రుసేనావమర్దాయ సద్యస్సుభటఘోటకైః, విజిగీషాప్రవృత్తిర్యా సాధాటీతినిగద్యతే.') పఱచునెడన్ = పారిపోవునప్పుడు, శక్తిమఱచియున్=తనసామర్థ్యముమఱచిపోయినను, తత్తత్=వానివానియొక్క, ఉచితప్రవేశ=తగినచోటఁ బ్రవేశించుటయొక్క, సంధాన=కూర్చుటయందలి, యుక్తిన్=ఉపాయమును, మఱవఁడయ్యెన్=విస్మృతినొందఁడాయెను.

శక్తిమఱచియు నుచితప్రదేశసంధానశక్తి మఱచిపోవకుంటవలననే నిజాముఁడు తగవరి (ఉచితజ్ఞుఁడయ్యెను) నిజామునకు మదపుటేనుఁగులు ధనుర్ధారులు విజయశంఖములు గలవని చెప్పుటలోఁ గవి హైందవసాంగ్రామికవస్తుసముదాయము మహమ్మదీయులకుఁ జెప్పుటవలన సహజమునకు విరుద్ధము. కావున నిది సమయవిరోధమను కావ్యదోషము. ఇందులకుఁ గవిజనాశ్రయమున దృష్టాంతము-

క. ఘనదండకాష్టకృష్ణా, జినములు సొగయింప నొక్కజినముని చనుదెం
చె ననఁగ సమయవిరోధం, బనికవులకుఁ జెప్పఁ గవిజనాశ్రయుఁ డొనరన్.

ఇటులఁ గొందఱందురు. తిరుమలరాయలధాటి ఉద్దండ జయపటిష్ఠ మనుటవలనను నిజాముఁడు చలించిపఱచె ననుటవలన నాయక ప్రతినాయకులగు వీరు లిరువురు సములని తెలియును. నిజాముఁడసామాన్యుఁ డనుటకు సింధురఘటలు, అమితకోదండములు, రామాకుచాగ్రహారములు, శంఖవితతి తార్కాణము.

తా. తిరుమలదేవరాయనిదాడికి నిలువలేక పారిపోవునప్పు డేనుఁగులను బర్వతశిఖరములకై పాఱఁదోలి, వింటిబద్దలు చెట్లకొమ్మలకుఁదగిలించి భార్యలయొక్క ముత్యాలహారములు నదులలోఁబారవైచి విజయశంఖములు బురదలోఁ వైచిపోఁగా నది వానివాని జన్మస్థానములయందు వానివానిని బ్రవేశపెట్టుట యుచితమని విచారించి ప్రవేశపెట్టినాఁ డనునట్టులనుండెను. (ఏనుఁగులు పర్వతములయందు జన్మించుటయును వింటిబద్దలు వృక్షశాఖలచేతఁ జెయ్యఁబడుటయును ముత్యాలు జలధియందుఁ బుట్టుటయును శంఖములు బురదలోఁ బుట్టుటయును లోకంబునఁ బ్రసిద్ధంబకదా.) అలం. హేతూత్ప్రేక్ష.

చ. తిరుమలరాయశేఖరుని ♦ ధీరచమూభటరాజి యాజిభీ
కరయవనేశ్వరప్రహిత♦ఖానబలంబులఁ జక్కు సేయ ని
ద్ధరఁ బెనుగొండకొండలు మ♦దద్విపచర్మకపాలమాలికా
పరికరభూషితంబు లయి ♦ బల్విడిఁ గాంచె గిరీశభావమున్. 59

తిరుమలరాయశేఖరుని=తిరుమలదేవరాయశ్రేష్ఠునియొక్క, ధీర=ధైర్యయుక్తమైన, చమూభటరాజి=సేనాభటసమూహము, ఆజి=యుద్ధమందు, భీకర=భయంకరమైన, యవనేశ్వరప్రహిత=నవాబులచేఁ బంపఁబడినట్టి, ఖానబలంబులక్=తురకలఫౌజులను, చక్కుసేయక్=ఖండింపఁగా, (మహమ్మదీయు లాజిభీకరు లగుటచేతనే యెదిరించి విజయమొందుటకు దిరుమలరాయలు ధీరచమూభటరాజిని నియోగించెను. సేన యవనేశ్వరప్రహిత మనుటవలన నాసంగమునకు నవాబులు సైనికులను మాత్రమే పంపిరనియుఁ దాము రాలేదనియు నాశయము.)

ఇద్ధరక్=ఈభూమియందు, పెనుగొండకొండలు=పెనుగొండసంబంధమైనకొండలు, మదద్విప=మదపుటేనుఁగులయొక్క, చర్మ=చర్మములను, కపాలమాలికా=కపాలమాలిక లనునట్టి, పరికర=అలంకారసామగ్రిచేత, భూషితంబులయి=అలంకరింపఁబడినవియై, గిరీశభావముక్=రుద్రభావమునని యర్థము. పర్వతరాజత్వమునని భావము. (ని. 'గిరిశో గిరిశో మృడః' అని అ.) బల్విడిఁగాంచెక్=తత్క్షణమేపొందెను. మదద్విపచర్మకపాలమాలికా పరికరభూషితత్వము గిరీశునకును బెనుగొండ కొండలకును సమానధర్మము.

తా. తిరుమలదేవరాయని సేనాభటులు, తురకలయొక్క చతురంగబలములను సంహరింపఁగాఁ బెనుగొండకొండలపై నేనుఁగులయొక్క చర్మములును దలపుర్రెలయొక్క పంక్తులును బడియుండుటచేత నాకొండలు గజచర్మకపాలమాలికాధరుఁడైన రుద్రునివలె నుండెనని అలంకారము. కావ్యలింగభేదము. శ్లేషసంకీర్ణము.

సీ. కప్పువాటింపదు ♦ గగనమధ్యంబుపై నుప్పొంగుపృథులప♦యోధరముల
నలఁత నొందదు విని♦ర్మలసుధాధామకో♦పరిసమారోహవై♦భవమునందుఁ
దడబాటుఁ బూన దు♦త్తమరసజ్ఞాస్థానవాటిఁ బాటిలునాట్య♦పాటవమున
శ్రమము నొంద దశేష♦కమలాకరాభోగతరుణకేళీమహో♦ద్యమమునందు
తే. ననుపమాకల్పపరిపూర్తి ♦ నతిశయిల్లు, ననిశనిస్తంద్రగతిఁ బొల్చు♦నఖిలభువన
గర్భగౌరవ మేరీతిఁ గాంచెనొక్కొ, వీరతిరుమలరాయభూ♦విభునికీర్తి. 60

ఈ పద్యమందుఁ దిరుమలదేవరాయని కీర్తియందలి స్త్రీలింగస్వారస్యముచేత గర్భిణీస్త్రీత్వారోపణముచేసి యర్థద్వయమునకు నభేదాధ్యవసాయముఁగాఁ జెప్పినాఁడు. ఎట్లనఁగా,

వీరతిరుమలరాయభూవిభునికీర్తి=వీరుఁడైన తిరుమలరాయని కీర్తియనెడుస్త్రీ, అఖిలభువన=సమస్తప్రపంచమనెడి, గర్భ=గర్భముయొక్క, గౌరవముక్=భారమును, ఏరీతిఁగాంచెనొక్కొ=ఎట్లు పొందినదోగాని, (అఖిలభువన = సమస్తలోకములయొక్క, గర్భ=మధ్యభాగమునందు, గౌరవము=గొప్పతనము అని యర్థాంతరము.)

గగనమధ్యంబుపైక్=ఆకాశమధ్యమందు, ఉప్పొంగు=అభివృద్ధియగు, పృథుల=విస్తారమయిన, పయోధరములక్=మేఘములచేత, కప్పువాటింపదు=నల్లఁబడదని కీర్తిపరమైన యర్థము. కీర్తి నిరుపా

ధికస్వచ్ఛవస్తువుగనుక సంపర్కదోషముచేత మలినము కానేరదని భావము. గగనమధ్యంబుపైఁ=గగనమువలె సూక్ష్మమైన మధ్యప్రదేశముమీఁద, ఉప్పొంగు=పొంగుచున్న, పృథులపయోధరములన్=పీనస్తనచూచుకములయందు, ఇక్కడ సప్తమ్యర్థమందు ద్వితీయవచ్చినందుకు, న. 'అన్యస్యాః క్వచిద్భవేచ్ఛాస్యా' అని, కప్పువాటింపదు=నైల్యమును వహింపదని గర్భిణీస్త్రీపరమయిన యర్థాంతరము. గర్భిణికి సూక్ష్మమధ్యత్వమును నాశ్చర్యమే యని తెలియవలయును.

వినిర్మల=మిక్కిలియు స్వచ్ఛమయిన, సుధాధామక=చంద్రునియొక్క, ఉపరి=మీఁదికి, సమారోహ = వ్యాపించుటయొక్క, వైభవమునందున్ = వేడుకయందు, అలఁతనొందదు = వెనుకదీయదని కీర్తిపరమయినయర్థము. వినిర్మల=మిక్కిలియుఁదెల్లనైన, సుధాధామక=సున్నపుగచ్చుచేసిన సౌధములయొక్క, ఉపరి=మీఁదికి, సమారోహ=ఎక్కుటయొక్క, వైభవమునందున్ = విలాసమందు, అలఁతనొందదు=ఆయాసమునుబొందదని గర్భిణీపరమైన యర్థాంతరము. గర్భవతియయ్యు నున్నతములగుభవనముల నెక్కుతఱి నలసటనొందక పోవుట యొకవిశేషము. పృథులపయోధరముల వ్రేగుని తంబభరము గర్భభారము నలసటగూర్పమి యాశ్చర్యము.

ఉత్తమ=సత్పురుషులయొక్క, రసజ్ఞా=జిహ్వాయనెడు, ఆస్థానవాటిన్=ఆస్థానప్రదేశమునందు, పాటిలు=ప్రవర్తించుచున్న, నాట్యపాటవమునన్=నటించునేర్పునందు, అనఁగాఁ గొనియాడఁబడుటయందనుట, తడబాటుఁబూనదు=విపర్యాసమును వహింపదని యర్థము. (ని. 'రసజ్ఞారసనాజిహ్వా' అని అ.) ఉత్తమ=శ్రేష్ఠులైన, రసజ్ఞ=శృంగారాదిరసముల గుర్తెఱిఁగినవారియొక్క, ఆస్థానవాటిఁబాటిలు=సభాస్థలియందుఁ బ్రవర్తించుచున్న, నాట్యపాటవమునన్=తాండవనైపుణ్యమందు, తడబాటుఁబూనదు=శ్రమచేతఁ దడబడదనియర్థాంతరము. సాధారణము నొంటరిపాటునఁ జెలికత్తెలముందునఁగాక రసజ్ఞుల యాస్థానవాటికలలో నాట్యమునలుపుచుండినను శ్రమనొందకపోవుట విశేషము. (రసజ్ఞుల యాస్థానిలో నృత్యప్రకటనము తడబాటునకు హేతువు.)

అశేష=సమస్తమయిన, కమలాకర=కమలమనఁగా నుదకము, దానికి నాకరములైనవి సముద్రములు వానియొక్క, ఆభోగ=పరిపూర్ణతయొక్క, తరణకేళి=దాఁటుటయనుక్రీడయొక్క, మహోద్యమమునందున్=అధికప్రయత్నమునందు, శ్రమమునొందదు=కష్టముఁజెందదని యర్థము. అశేష=సమస్తమయిన, కమలాకర=సరోవరములయొక్క, ఆభోగ=పరిపూర్ణతయొక్క, తరణకేళి=జలక్రీడావిహారముయొక్క, మహోద్యమమునందున్=అధికప్రయత్నమునందు, శ్రమమునొందదు=ప్రయాసపడదని యర్థాంతరము. (ని. 'సలిలంకమలంజలమ్' అని అ.) జలక్రీడ పరిపూర్ణమైనదగుటచేతను, ఆది సరోవరముగాక కమలాకరమగుటచే మెలపునఁ జరింపవలసియుంటవలనను నామహోద్యమమున శ్రమసహజము శ్రమలేమియాశ్చర్యము.

అనుపమ=సమానరహితమైన, ఆకల్పపరిపూర్తిన్=కల్పపర్యంతపరిపూర్ణతచేత, అతిశయిల్లు=అతిశయించునట్టి, అని యర్థము. ఆకల్పమనఁగా నలంకారము వస్త్రాభరణమాల్యాద్యలంకారపరిపూర్తిచేత నతిశయించునని యర్థాంతరము.(ని. 'ఆకల్పవేషానైపథ్యమ్'అని అ.) అనిశ=ఎల్లప్పుడును, నిస్తంద్రగతిఁబొల్చున్=నిరుపద్రవగతిచేతఁ బ్రకాశించునని యర్థము. మాంద్యములేని నడకచేతఁ బ్రకాశించునని యర్థాంతరము.

తా. (వీరతిరుమలరాయని కీర్తికాంత యఖిలభువనగర్భభారమును వహించి గర్భిణియైయుండియు స్తనచూచుకములందు నైల్యము వహింపకపోవుట మొదలైన గర్భిణీవ్యతిరిక్తధర్మములచేతఁ బ్రవర్తించెను గనుక నాగౌరవమును నెట్టులుపొందెనో) తిరుమలదేవరాయనికీర్తి మేఘమండలము నావరించి చంద్రమండలము నతిక్రమించినదనియు నుత్తమజనులచేతఁ బ్రశంసింపఁబడుచున్న దనియును సముద్రములను దాఁటిపోయినదనియును బ్రహ్మకల్పపర్యంతము నిలిచియుండుననియును సర్వకాలమును నిరుపద్రవగతిచేతఁ బ్రకాశించునదియును ఫలితార్థము.

మ. ధర నెవ్వానికి వ్రాయఁ బద్మజుఁడు వ్రాఁత ల్వానితో నేగు న
స్థిరము ల్శాశ్వతకీర్తి యాతిరుమలశ్రీరాయనారాయణుం
డు రహి న్వ్రాసినశాసనాక్షరము లుండుం బుత్త్రపౌత్త్రాన్వయ
స్థిరవృత్తిం బృథుకాక్షరంబులు గురుశ్రీవర్ణతుల్యంబులే. 61

ధరన్=భూమియందు, ఎవ్వానికిన్=ఎవ్వనికి, పద్మజుఁడు=బ్రహ్మ, వ్రాయున్=నొసటవ్రాయు చున్నాఁడో, వ్రాఁతలు=ఆవ్రాలు, వానితో నేగున్=ఆపురుషునితో నడంగును, అస్థిరములు=శాశ్వతములుగానివి యని యర్థము. 'అస్థీనిరాంతిగృహ్ణంతీత్యస్థిరాణి. రా ఆదానే' అనువ్యుత్పత్తిచేత నస్థులను గ్రహించినవనిభావము. శాశ్వతకీర్తియా=శాశ్వతమైన కీర్తిగలిగిన, తిరుమలశ్రీరాయ=తిరుమలదేవరాయఁడనెడు, నారాయణుండు=నారాయణమూర్తి, ఇక్కడ శాశ్వతకీర్తియనెడు పదమారోప్యమాణారోపవిషయములగు సాధారణవిశేషణము. రహిన్=లెస్సగా, వ్రాసిన శాసనాక్షరములు=ఎవరికైనను వ్రాసియిచ్చినశాసనములమీఁదివ్రాలు, పుత్త్ర=కొమాళ్లు, పౌత్త్ర=మనమలు, అన్వయ=వానివంశము, అంతపర్యంతమైన, స్థిరవృత్తిన్=శాశ్వతవృత్తిచేత, ఉండున్=ఉండును. పృథుకశబ్దమర్భకుని యందును బ్రహ్మయందును వర్తించును. బ్రహ్మపరమైనప్పుడు, (ని. 'పృథుర్మహాన్ కో బ్రహ్మ') అని యర్థము గ్రహింపఁదగినది. (ని. 'పోతః పాకోర్భకో డింభః పృథుకశ్శాబకశ్శిశుః' అని అ. 'మారుతే వేధసి బ్రధ్నే పుంసికః' అని అ.) తిరుమలశ్రీనారాయణుండన్నాఁడు గనుకఁ దిరుమలదేవరాయని నారాయణుఁడని చెప్పవలయును. పృథుక=అర్భకుఁడైన బ్రహ్మయొక్క, అక్షరంబులు=వ్రాలు, గురు=జనకుఁడైన నారాయణునియొక్క, శ్రీవర్ణ=శుభాక్షరములతోడ, తుల్యంబులే=సమానములౌనా, అనఁగాఁ గావనుట, పృథుకుఁడనఁగా బ్రహ్మయును, గురుశ్రీయనఁగా గురుతరసంపత్తిగలవాఁడు రాజునని భావము.

బ్రహ్మవ్రాఁతకంటెఁ దిరుమలరాయఁడు వ్రాసినవ్రాఁత శాశ్వతమయినదని ఫలితార్థము. (ని. కీర్తిస్తునారాయణో') అన్నాఁడుగనుక నారాయణునికీర్తి శాశ్వతము. పృథుకుఁడనఁగా బ్రహ్మదేవుఁడు గనుక బ్రహ్మదేవునివ్రాలు గురువైన నారాయణునివ్రాలతో సమానమవునా యని ప్రకారాంతము. ఇచట నప్రకృతమైన బ్రహ్మలిఖితాక్షరమునకుఁ బ్రకృతమైన తిరుమలదేవరాయ శాసనాక్షరముతో సామ్యానివృత్తి వర్ణించుటచేఁ బ్రతీపాలంకారభేదము. అది అస్థిరాదిపదగతశ్లేషచే జీవించినది. (శ్లో. వర్ణ్యేనాన్యస్యోపమాయా అనిష్పత్తివచశ్చ తత్' అని లక్షణము.) (మాతృశ్రీయన్నటులఁ దండ్రిని గురుశ్రీయనుటఁ దగునుగాన గురుశ్రీయనఁ దండ్రియని కొందఱందురు.)

తా. బ్రహ్మదేవుఁడు మానవుల ఫాలములపై వ్రాసినవ్రాఁతలు వారితోనే పోవును. స్థిరకీర్తిశాలియగు తిరుమలరాయ నారాయణుని వ్రాఁతలగు శాసనవర్ణము లటులఁగాక తరతర ముప

కరించును. బ్రహ్మవ్రాసినవ్రాత యతనితండ్రియగు నారాయణుని వ్రాతతో సమానము కాఁజాలదు.

సీ. ఘనసీధురక్తలో•చనయుక్తిఁ గడ నుండు మాతంగతతి నంటు•మలిన మెల్ల
గరదుఁడై వెస నధో•గతిఁ బడ్డయమ్మహాహీనుని నెనసిన•యేవ మెల్ల
నరకహేతుహిరణ్య•హరణవృత్తిఁ జరించుకొమ్ముకాని భజించు•కొదవ లెల్ల
రౌరవాధారఘో•రప్రతాపకు లైన విషమగోత్రుల నంటు•వృజిన మెల్లఁ
తే. గడిగికొనియె వసుంధరా•కమలనయన, యారవీరప్రతాపరా•జాధిరాజ
రాజదేవేంద్రతిరుమల•రాయచంద్ర, సాంద్రపట్టాభిషేకాంబు•సముదయమున.

సీధువనఁగా మద్యమును, నేనుఁగులకన్నులయందుఁ బుట్టెడుమదమును. ఇందుకు-

ఉ. చెక్కున దాన మత్తులను సీధువు వీనులసాగరంబుచే
ముక్కున శీర్ణకంబు చనుముక్కున శిక్యము శేషసిన్మదం
బక్కున దానవారి విపులాంఘ్రిల మేఘము జారుచుండఁ బెం
పెక్కె కరీంద్ర మొప్పె సెలయేఱులతోడి నగేంద్రమో యనన్. అని ప్రయోగము.

మాతంగతతియనఁగాఁ జండాలసమూహంబును, గజసమూహంబును, ఘన=అధికమైన, సీధు=మద్యపానమువలన, రక్త=ఎఱ్ఱనైన, లోచన=కన్నులయొక్క, యుక్తిన్=సంయోగముచేత, కడనుండు=వెలిగానుండెడు, మాతంగతతిన్=చండాలసమూహమును, అంటు=అంటుకొన్న, మలినమెల్లన్=మాలిన్యమంతయును, అని యర్థము. అధికమైనసీధు వనెడుమదముచేత నెఱ్ఱనైన కన్నులతో దిక్కుల యందున్న గజసమూహము నంటియున్నదని భావము.

గరదుఁడై=గరదుఁడనఁగా (శ్లో. 'అగ్నిదో గరదశ్చైవ శస్త్రపాణి ర్ధనాపహః, క్షేత్రదారాపహర్తాచ షడేతేహ్యతతాయినః' అని చెప్పియున్నది గనుక) విషప్రయోగముచేయునట్టి యాతతాయియై, వెసన్=శీఘ్రముగా, అధోగతిఁబడ్డ=అధోగతిపాలైన, అమ్మహాహీనునిన్=ఆయతినీచుని, ఎనసిన=కలిసిన, ఏవమెల్లన్ = అసహ్యమంతయు అని యర్థము. విషప్రదుఁడై పాతాళలోకమందున్న, అమ్మహాహీను, మహత్+అహి+ఇను ననఁగా నామహాపన్నగస్వామిని గలిసికొనియున్నదని భావము. శేషుని గరదుఁడని మహాహీనుఁడని యధోగతి నొందినవాఁడని తలంచితలంచి భూకాంత విసర్జించెను.

నరకహేతు=నరకమునఁబడుటకుఁ గారణమైన, హిరణ్యహరణవృత్తిన్=స్వర్ణస్తేయవృత్తిచేత, చరించు=ప్రవర్తించునట్టి, కొమ్ముకానిన్=అగసాలవానిని, భజించు=సేవించిన, కొదవలెల్లన్=తక్కువలన్నియును అని యర్థము. నరకహేతు=నరకాసురోత్పత్తికిహేతువైన, హిరణ్యహరణవృత్తిన్=హిరణ్యాక్షసంహారవ్యాపారముచేత, చరించు=సంచరించిన, కొమ్ముకాని=కొమ్ముగలిగిన యజ్ఞవరాహమూర్తిని భజించినదనిభావము. హిరణ్యశబ్దము హిరణ్యాక్షపరమైనందుకు-శ్లో. 'క్రీడాభిన్నహిరణ్యకుక్షికుహర' మ్మని ప్రయోగము. ఆదివరాహముయొక్కయు భూమియొక్కయు సంయోగమువలన నరకాసురుఁడు జనించెను గావుననే వరాహము నరకహేతుభూతుఁడయ్యెను.

రౌరవ=రౌరవమనెడు నరకమునకు, ఆధార=ఆధారమైన, ఘోరప్రతాపకులైన=భయంకరోత్కృష్టపాపములు గలవారైన, విషమగోత్రులన్ = ఎగుడు దిగుడులైన కులము గలవారిని,

చెందు=పొందిన, వృజినమెల్లన్=పాపమంతయును అని యర్థము. రౌరవ=రురుమృగసమూహము నకు, అనఁగా జింకగుంపులకు, ఆధార=ఆధారభూతములైన, ఘోర=భయంకరములైన, ప్రపాతకులైన=దరులుగలిగినట్టి, విషమగోత్రులన్=విషమసంఖ్యగల అనఁగా సప్తసంఖ్యగల కులపర్వతములనియును విషమాకారముగల పర్వతములనియును జెప్పఁదగినవానిఁ బొందియున్నదనిభావము. ఇక్కడ, శ్లో. 'వివక్షాతః ప్రవృత్తిశ్చ ప్రత్యయస్య క్వచిత్క్వచిత్' అను నథర్వణవచనముచేతఁ బుంస్త్వము విధించినాఁడు.

వసుంధరాకమలనయన=భూకాంత, వీరప్రతాప, రాజాధిరాజరాజదేవేంద్ర యనెడు బిరుదులుగల, తిరుమలరాయచంద్ర=తిరుమలరాయచంద్రునియొక్క, సాంద్ర=దట్టమైన, పట్టాభిషేక=పట్టాభిషేకసంబంధమైన, అంబుసముదయమునన్=జలసమూహముచేత, కడిగికొనియెన్=కడిగివైచికొనెను, అనఁగాఁ బోఁగొట్టుకొనెనుట, ఔర=ఆశ్చర్యము, అనఁగాఁ దిరుమలదేవరాయనికిఁ బట్టాభిషేకము కాఁగా భూదేవి యాజలముచేతఁ దడుపఁబడినదై యిదివఱకుఁ దనకు సాంగత్యముగలిగియున్న దిగ్గజములను శేషాహిని యజ్ఞవరాహమును గులపర్వతములను నిరసించి తిరుమలదేవరాయలను బొందినదని భావము. ఇచటఁ దిరుమలదేవరాయ పట్టాభిషేకోదకమునకు భూదేవీవృజినక్షాళనముఁ జేయుటతో సంబంధములేకున్నను దత్సంబంధముఁ జెప్పుటవలన నతిశయోక్త్యలంకారము. అది శ్లేషతో సంకరమైనది.

తా. భూదేవి తొలుత మాతంగసమూహమువలన నంటినయేవమును మహాహీనసంసక్తివలన నెనసినయేవమును కొమ్ముకానిచెలిమిచే నొందిన కొదువను విషమగోత్రసంసక్తివలన నంటిన కలుషమును తిరుమలదేవరాయల పట్టాభిషేక జలమువలనఁ గడగికొని శుద్ధురాలయ్యెను. (అనఁగాఁ దిరుమలరాయల పట్టాభిషేక సమయజలము భూభాగమునందంతట ప్రవహించెనని భావము.)

తే. ఆవిభునిదేవి శ్రీవెంగళాంబ పుట్టి, నిల్లుమెట్టినయిల్లు వర్థిల్లఁ జేసెఁ
బుట్టినింటికి మథనంబు మెట్టినింటి, కమితదోషాహతియుఁగూర్చుకమలఁ దెగడి.

ఆవిభునిదేవి=ఆతిరుమలదేవరాయనిభార్య, శ్రీవెంగళాంబ=సంపద్యుక్తురాలైన వెంగళమ్మ, పుట్టినింటికి మథనంబు మెట్టినింటి కమితదోషాహతియుఁ గూర్చుకమలఁ దెగడి=పుట్టినింటికి రాపాటను మెట్టినింటికి మితములేని దోషంబులచేతఁ గొట్టుపడుటయును గలుగఁజేసిన లక్ష్మీదేవిని దిరస్కరించి, పుట్టినిల్లు మెట్టినయిల్లు వర్థిల్లఁజేసెన్=పుట్టినయిల్లును మెట్టినయిల్లును వృద్ధిఁబొందఁజేసెను అని యర్థము. లక్ష్మీదేవికిఁ బుట్టినిల్లు క్షీరసముద్రమును మెట్టినయిల్లు పద్మమును గనుక, పుట్టినింటికిన్=క్షీరసముద్రమునకు, మథనంబు=మందరాచలమథనమును, మెట్టినింటికిన్=పద్మమునకు, అమితదోషాహతియున్=మితములేని రాత్రి వేధయునని భావము. పుట్టినిల్లు, మెట్టినయిల్లు అనుచోట, సూ. 'వాతః' న. అనుసూత్రముచేత అకారమునకుఁ బరమైనయికారమునకు వచ్చుసంధి వైకల్పికమని తెలియవలయును. ఇచట నుపమానమైనలక్ష్మిఁబట్టి వెంగళాంబయందు గుణవిశేషవర్ణనవలన వ్యతిరేకాలంకారము. అదియు దోష అను పదగతశ్లేషచే జీవించినది.

తా. పుట్టినిల్లగు సముద్రమునకు మథనమును మెట్టినిల్లగు తామరపూవునకు దోషాహతి(రాత్రివలనిబాధ) కలుగఁజేసిన లక్ష్మిని నిరసించి తిరుమలదేవరాయల ధర్మపత్నియగు వెంగళాంబ పుట్టినిల్లు మెట్టినయిల్లు నలంకరించి మిగులఁ జేరొందెను.

ఉ. ఉంచినయగ్రహారముల ♦ నున్నతవైఖరివిద్య లెల్ల ర
ప్పించినవిప్రవక్త్రములఁ ♦ బెంచినవ్యవనోత్కరంబులన్
నించినబల్తటాకముల ♦ నెమ్మిఁ గనం దగువెంగళాంబ య
భ్యంచితకీర్తిసౌధవిశ ♦ దాక్షరసూనమరాళరాజమై. 64

ఉంచినయగ్రహారములన్=ఆమెనిలిపిన యగ్రహారములయందును, ఉన్నతవైఖరిన్=మహోన్నతముఁగా, విద్యలెల్లరప్పించిన=వేదశాస్త్రాదివిద్యల నన్నిటిని వచ్చునట్టులు చేయఁబడిన, విప్రవక్త్రములన్=బ్రాహ్మణులయొక్క ముఖములందును, పెంచినవ్యవనోత్కరంబులన్=వృద్ధిఁబొందింపఁబడిన నూతన వన సమూహములయందును, నించినబల్తటాకములన్ = నిండింపఁబడిన గొప్పచెరువులయందును, వెంగళాంబయభ్యంచితకీర్తి=వెంగళమ్మయొక్క మిక్కిలి యొప్పిదమగుచున్నకీర్తి, సౌధ విశదాక్షర సూనమరాళరాజమై=సున్నపుగచ్చుచేసిన మేడలును బరిశుద్ధములైన యక్షరములును దెల్లని పువ్వులును హంసశ్రేష్ఠములును నయినదై, నెమ్మిన్=ప్రీతిచేత, కనందగున్=చూడఁదగియుండునని క్రమాలంకారము.

అనఁగా వెంగళమ్మపైనిఁ జెప్పఁబడిన యగ్రహారాది సంతానము లనేకములుగాఁ జేసి బహుకీర్తిఁబొందినదని తాత్పర్యము. సౌధవిశదాక్షరసూనమరాళరాజ మన్నది సమాహారద్వంద్వము. ఇచటఁ గీర్తిని సౌధాద్యనేకవిధరూపముగా నూహించుటవలన నుల్లేఖాలంకారము. శ్లో. 'ఏకస్యబహుధోల్లేఖాదుల్లేఖాలంకృతి ర్మతా' అని సాహిత్యదర్పణము.

కీర్తి సౌధరూపముగ నున్నదనుటచే నాకాశపర్యంతవ్యాప్తి, అక్షరరూపముగ నున్నదనుటచే స్థిరత్వము, హంసరూపముగ నున్నదనుటచే భూస్వర్గవ్యాపకము, సూనరూపముగ నున్నదనుటచే జనవశీకరణాదికములు సూచితములు.

తా. వేంగళాంబకీర్తి యామె ప్రతిష్ఠించిన యగ్రహారములలో సౌధరూపముగను విద్య చెప్పించిన బ్రాహ్మణముఖముల నక్షరరూపముగను నెలకొల్పిన వనములందు సుమరూపముగను బాదుకొల్పిన తటాకములందు మరాళరూపముగ నున్నది.

సీ. వసుమతి దానయ్యు ♦ వరుని వారింపదు కందమూలంబులఁ ♦ గడుపుపెంప
శ్రీకాంత దానయ్యుఁ ♦ బ్రియు నిరోధింపదు క్రిందైవిరోధికిఁ ♦ గేలు సాపఁ
దానురుక్మిణియయ్యుఁ ♦ దగ దన దాత్మనాయకుఁ డొకనరుక్రింద ♦ హరులఁ బట్టఁ
దా నన్నపూర్ణాభి ♦ ధాన యయ్యును మాన్ప దొకనాఁడుఁ దనతేఁడు ♦ బికిరమెత్త
తే. ననుచు ధరనిందిరనుభోజ ♦ తనయ నార్య, నార్యనుతనార్యమేయచ ♦ ర్యలహసించి
పతికి నభిమతభోగసౌ ♦ భాగ్య మొసఁగు, విమలసద్గుణనికురుంబ ♦ వెంగళాంబ.

వసుమతిదానయ్యున్=వసువులనఁగాధనములు, తాను ధనవంతురాలై యుండియు, వరునిన్=పెనిమిటిని, కందమూలంబులఁగడుపుపెంపన్=దుంపగడ్డలు వ్రేళ్లు మొదలైనవానిచేతఁ బొట్టఁబోసికొనుచుండఁగా, వారింపదు = వలదని మాన్పదు, అనియర్థము. భూదేవి వసుమతీనామముగలదనియుఁ దామెకు వరుఁడైన వరాహమూర్తికి దుంపగడ్డలు మొదలైనవి యాహారము లనియును భావము.

శ్రీకాంతదానయ్యుఁ=శ్రీయనఁగా సంపద, తాను సంపదచేత నొప్పుచున్నదనియును, ప్రియుఁ=పెనిమిటిని, క్రిందై విరోధికిఁ గేలుసాపఁ = శత్రువునికిఁ గ్రిందుపడి చెయిచాపఁగా, నిరోధింపదు=వలదని నివారింపదు అని యర్థము. లక్ష్మీదేవి శ్రీకాంతానామము గలదనియు నామె పెనిమిటియైన విష్ణుమూర్తి వామనుఁడై విరోధియగు బలిచక్రవర్తిని యాచించినాఁడనియును భావము.

రుక్మిణిదానయ్యుఁ=రుక్మమనఁగా బంగారము, అదిగల స్త్రీ రుక్మిణి, తాను బంగారముగలదయ్యుండియు, ఆత్మనాయకుఁడు=ప్రాణేశ్వరుఁడు, ఒకనరుని క్రింద హరులఁబట్టఁ = ఒకమనుష్యుని క్రింద గుఱ్ఱములను బట్టెడుకొలువు సేయఁగా, తగదనదు=ఇదికూడదనిచెప్పదు, అనియర్థము. భోజతనయ రుక్మిణీనామము గలదనియు నామెకుఁ బెనిమిటియైనకృష్ణుఁ డర్జునునికి సారథియైనాఁడనియును భావము.

తా నన్నపూర్ణాభిధానయయ్యును = తా నన్న సమృద్ధిచేత సంపూర్ణురాలను పేరుగలదైయుండియును, తనఱేఁడు బికిరమెత్తఁ=తననాథుఁడు భిక్షమెత్తుచుండఁగా, ఒకనాఁడుఁ=ఒక్కనాఁడైనను, మాన్పదు=నివారింపదు, అనియర్థము. పార్వతీదేవి యన్నపూర్ణయను నామధేయము గలదనియు నామెకు నాథుఁడైన హరుఁడు కపాలహస్తుఁడై భిక్షమెత్తినాఁడనియును భావము. బికిరమనునది వికిరశబ్దమునకుఁ దద్భవము.

అనుచుఁ=ఈలాగుపలుకుచు, ధరఁ=భూదేవిని, ఇందిరను=లక్ష్మీదేవిని, భోజతనయఁ=రుక్మిణీదేవిని, ఆర్యఁ=పార్వతీదేవిని, ఆర్యనుత నార్యమేయచర్యలఁ-ఆర్యనుత=పతిసేవాపారతంత్ర్యము వలనఁ బూజ్యులైనవారిచేత స్తుతిచేయఁబడిన, నారీ=స్త్రీలయొక్క, అమేయ=ఎన్నశక్యముగాని, చర్యలఁ=చర్యలచేత, హసించి=తిరస్కరించి, విమలసద్గుణనికురుంబ=నిర్మలమైన సద్గుణ సమూహము గల, వెంగళాంబ=వెంగళమ్మ, పతికిఁ = పెనిమిటియైన తిరుమలదేవరాయనికి, అభిమతభోగసౌభాగ్యమొసఁగుఁ=ఇష్టమైన భోగములయొక్క సౌష్ఠవమును గలుగఁజేయును, అనఁగా వెంగళాంబ పతివ్రతా శిరోమణియై పెనిమిటియొక్క సేవ సేయుచుండెనని తాత్పర్యము. ఇచట శ్లేషచే నిలుపఁబడిన వ్యతిరేకాలంకారము. ఆర్యయనుశబ్ద మనేకపర్యాయములా వృత్తియౌటచే వృత్త్యనుప్రాసమనుశబ్దాలంకారము.

తా. వసుమతి (భూదేవి) తనభర్తయగు నాదివరాహము కందమూలములు భుజించుచుండవారింపలేదనియు శ్రీకాంత (లక్ష్మీదేవి) క్రిందుపడి యాచించువామనుని నడ్డగింపలేదనియు రుక్మిణి తన భర్త యొకసామాన్యునిగుఱ్ఱములఁ బట్టుట మానుపలేదనియు అన్నపూర్ణ శివునిభిక్షావృత్తి మానుపలేదనియు వారివారిలోభస్వభావములను దెగనాడి భర్త కభిమతభోగాదికములు సంతరించుచు వెంగళాంబ పేరొందెను.

శా. రారాజద్గుణశాలి తిర్మలమహారాయండు శ్రీవెంగళాం
బారామామణియందుఁ గాంచె సుతులం బ్రఖ్యాతసత్కీర్తిల
క్ష్మీరాముఁ రఘునాథభూమిరమణుఁ శ్రీరంగరాయాగ్రణిఁ
శ్రీరామావనినాథుఁ బ్రాభవనిధిఁ శ్రీవేంకటక్ష్మావరున్. 66

రారాజత్=మిక్కిలియుఁ బ్రకాశించుచున్న, ఇది యఙుగంతముపై శతృప్రత్యయాంతము. గుణ=సద్గుణములచేత, శాలి=ఒప్పుచున్న, తిర్మలమహారాయండు=తిరుమలదేవరాయఁడు, శ్రీవెంగళాం

బారామామణియందుఁ=సంపద్యుక్తురాలైన వెంగళమ్మయను వనితారత్నమునందు, సుతులఁ=కొమాళ్ళను, కాంచెఁ=కనెను. ఎవరిననఁగా, ప్రఖ్యాతసత్కీర్తి=ప్రసిద్ధమైన మంచికీర్తియందు, లక్ష్మీరామున్=నారాయణుఁడైన, ఇక్కడ, 'కీర్తిస్తునారాయణే' అనువచనప్రకారము నారాయణసామ్యము చెప్పినాఁడు. రఘునాథభూమిరమణున్=రఘునాథరాజును, శ్రీరంగరాయాగ్రణిన్=శ్రీరంగరాయశ్రేష్ఠుని, శ్రీరామావనినాథున్=శ్రీరామరాజును, ప్రాభవనిధిన్=ప్రభుత్వమునకు నిధియైన, వేంకటక్ష్మావరున్=వేంకటరాయని, కాంచెన్=కనెను. అనియన్వయము.

తా. గుణశాలియగు తిరుమలదేవరాయ నృపాలుఁడు వేంగళాంబికయందు రఘునాథభూపాలకుఁడు, శ్రీరంగరాయలు, శ్రీరామరాజు, వేంకటరాయలు అనునామములుగల నలుగురు కుమారులఁ గాంచెను.

క. ఆజగదభినుతసుగుణస, మాజులలో నగ్రజుండు ♦ మహనీయయశో
రాజీవాసనుఁడు సుధీ, రాజీవాసనుఁడు వెలసె ♦ రఘునాథుఁ డిలన్. 67

ఆజగదభినుతసుగుణసమాజులలోన్=జగజ్జనులచేత మిక్కిలియు స్తోత్రముచేయఁబడిన సుగుణసమూహముగల యారాజులలోపల, అగ్రజుండు=జ్యేష్ఠుఁడైనవాఁడును, మహనీయ=ఒప్పుచున్న, యశః=కీర్తియందు, రాజీవాసనుఁడు=చంద్రుఁడైనవాఁడును, (ఇక్కడ, 'రాజీవాని+ఆస్యంతే క్షిప్యంతేఅనేనేతి రాజీవాసనః, అసుక్షేపణే' యనెడు ధాతువువలన రాజీవము లితనిచేతఁ దిరస్కరింపఁబడుచున్నవి గనుక రాజీవాసనుఁడనఁగాఁ జంద్రుఁడనియర్థము) సుధీరాజీవాసనుఁడు, సుధీ=యోగ్యమైనబుద్ధియందు, రాజీవాసనుఁడు = బ్రహ్మయైనవాఁడునగు, రఘునాథుఁడు = రఘునాథరాజు, ఇలన్=భూమియందు, వెలసెన్=ప్రకాశించెను. ఇచట రఘునాథరాజును గీర్తిబుద్ధిరూపవిషయభేదముచేఁ జంద్రబ్రహ్మలుగా నెంచుటచే నుల్లేఖాలంకారము. శ్లో. 'ఏకస్య బహుధోల్లేఖేప్యసౌ విషయభేదతః' అని లక్షణము.

తా. లోకోత్తరులగు నా నలువురుకుమారులలోఁ బెద్దవాఁడగు రఘునాథరాజుచంద్రునివంటి ధవళయశము గలవాఁడై పవిత్రశీలమునందు నలువను బురడించుచుఁ బేరొందెను.

సీ. బలువాహినుల మించు♦మలకల ఘననామకంబులు దూల మూ♦లంబు లెత్తుఁ
బ్రతిరోధివరణవ♦ర్గము ద్రోచి తన్మహాభోగశాలిక్షేత్ర♦ములు హరించు
వల గొన్న బహురాజ♦వంశగుల్మంబులఁ బలుదెఱంగుల గ్రుచ్చి ♦ పారవైచు
వడిఁ జొచ్చి కలఁచి యా♦వనరాసుల సమగ్రజీవనం బెల్ల దు♦ష్కీర్తిఁ గలుపు
తే. నవని నసహాయశూరత ♦ నధిగమించు, ననఘతిరుమలరాయనం♦దనసమిద్ధ
భీరరఘునాథభుజపీఠిఁ ♦ బీట వెట్టు, సాహసోదగ్రబిరుదవ♦రాహమూర్తి. 68

ఈపద్యగీతిచివర బిరుదవరాహమూర్తి యని చెప్పుటచేత బిరుదపరముగాను వరాహపరముగాను నర్థద్వయము విచారింపవలసినది. ఎట్లనఁగా,

బలు=బలవంతములైన, వాహినులన్=సేనలచేత, మించు=అతిశయించుచున్న, మలకల=మ్లేచ్ఛులయొక్క, ఘననామకంబులు దూలన్=ఘనమైనపేళ్లడఁగిపోవునట్టులుగా, మూలంబులెత్తున్=మొదళ్లులాగివైచు నని బిరుదపరమైన యర్థము. బలువాహినులమించు=బలువైన నదులయందు నతిశయించుచున్న, మలకల=మలుపులయందలి, ఘననామకంబులు దూలన్=మేఘనామములన్నియుఁ దుంగలకుఁ

జెల్లునుగనుక ఘననామకంబులనఁగాఁ దుంగలు, అవి తూలిపోవునట్లుగా, మూలంబులెత్తుచున్=వాని దుంపలు పెల్లగించునని వరాహపరమైనయర్థాంతరము. (ని. 'కురవిన్దో మేఘనామా ముస్తా ముస్తక మస్త్రియామ్' అని అ.)

ప్రతిరోధివరణవర్గము: ద్రోచి=ప్రతిరోధు లనఁగాఁ జోరులు,వారియొక్క-వరణవర్గమనఁగాఁ బ్రాకారసమూహము,దానిఁబడఁగొట్టి, తత్=ఆచోరులయొక్క, మహాభోగశాలి=అధికభోగములచేత నొప్పుచున్న, క్షేత్రములు=కళత్రములను, హరించున్ = చెఱఁబట్టును అనియర్థము. (ని. ప్రతిరోధిప రాస్కందిపాటచ్చరమలిమ్లుచాః, ప్రాకారోవరణస్సాలః' అని అ.) ప్రతిరోధివరణవర్గముఁద్రోచి=అవరోధక మైన చుట్టుకంచెలు మొదలైనవాని సమూహమును బడఁద్రోచి, తత్=ఆయావరణవర్గమందలి, మహాభోగ=అతివిస్తృతములైన,శాలిక్షేత్రములు=వరిమళ్లను,హరించున్=తిను నని యర్థాంతరము. (ని. 'క్షేత్రం శరీరే కేదారే సిద్ధస్థానకళత్రయోః' అని వి.)

వలఁగొన్న=చుట్టువైచిన, బహురాజ=అనేకశత్రురాజులయొక్క, వంశ=వర్గముయొక్క, గుల్మంబులన్ = సేనలను, పలుతెఱంగుల గ్రుచ్చిపారవైచున్=అనేక విధములచేత గ్రుచ్చి నఱికివైచును అనియర్థము. వలఁగొన్న = ఆవరించిన, బహు=అనేకములైన, రాజవంశ గుల్మంబులన్=శ్రేష్ఠమైన వెదురుపొదలను, పలుతెఱంగులన్=దంష్ట్రాప్రచారములచేత, గ్రుచ్చి పారవైచున్=గ్రుచ్చి పెలగివేయు నని యర్థాంతరము. (ని. 'గుల్మారుక్స్తంబ సేనాశ్చ' అని అ.) పలుదెఱంగులన్నచోటఁ దకారంబు చెప్పవలయును. రాజపక్షమందుఁ గర్మధారయసమాసముగనుకను,

గీ. 'సంధిగూర్పంగఁ బ్రథమాంతశబ్దవితతి, పైఁ గచటతపలకు వికల్పంబుచెల్లుఁ
గాకు సంబోధనావ్యయకర్మధార, యంబుల నచేతనంబుల నబ్జనాభ.'

అని చెప్పియున్న ప్రకారముగాఁ గర్మధారయమందుఁ దకారాదేశము వైకల్పికముగనుక నిక్కడ తకారంబ యుక్తమని యెఱుంగునది.

వడిఁజొచ్చి కలఁచి=త్వరగాఁజొచ్చి కలగుండుపడఁజేసి, యావనరాసుల=యవనదేశ సంభవులైన తురకలయొక్క, సమగ్రజీవనం బెల్లన్=నిండారులైన బ్రతుకంతయును,దుష్కీర్తిఁగలుపున్= అపకీర్తిపాలుగాఁ జేయుననియర్థము. వడిఁజొచ్చి కలఁచి=వడిగాఁ బ్రవేశించి కలకపారునట్లులు చేసి, ఆ వనరాసుల=ఆ సముద్రములయొక్క, సమగ్రజీవనం బెల్లన్=సంపూర్ణమైనయుదకమునంతయును, దుష్కీర్తిఁగలుపున్=కీర్తియనఁగా నిక్కడ బురద, కొఱమాలిన బురదపాలుసేయునని యర్థాంతరము. ('కీర్తిర్యశసికర్దమే' అ.)

అవని నసహాయశూరత నధిగమించున్=భూమియందు నసహాయశూరత్వముచేతఁ బ్రవర్తించునని యర్థము. ఒంటిగాఁ దిరుగునని యర్థాంతరము.

(56-వ పద్యమువద్ద వరాహమునకుఁ గల ఒంటరికాఁడను పేరునకుఁగల యసహాయశూరపద ప్రయోజనము కొంతవఱకు సూచింపఁబడినది.)

అనఘ=పుణ్యాత్ముఁడైన, తిరుమలరాయ నందన=తిరుమలదేవరాయని కుమారుఁడైన, సమిద్గభీర=యుద్ధమందు గంభీరుఁడైన, రఘునాథభుజపీఠిఁ బీటవెట్టు=రఘునాథరాజుయొక్క బాహుపీఠమందుఁ గూర్చున్నయట్టి, సాహసోదగ్ర=సాహసమునం దుత్కృష్టమైన, బిరుదవరాహమూర్తి = లాంఛనవరాహమూర్తి, పైనిఁ జెప్పఁబడినకార్యములు సేయునని సంబంధము,

ఇందులో వరాహలాంఛనముగల రఘునాథరాజు చేసినకార్యములన్నిటిని లాంఛనమైన వరాహమూర్తిపరముగా నభేదాధ్యవసాయము చేసి చెప్పినాఁడు. ఇచట బిరుదవరాహవిశేష్యము శ్లేషించినందున నప్రకృతవరాహవిషయమైన శబ్దశక్తిమూలధ్వని. కాని శ్లేషాలంకారముగాదు. ఉభయ శ్లేషయందు విశేష్యము శ్లేషింపదు.

భోగశాలిక్షేత్రములనుచో పోలికవడి.—

క. పోలింపఁ బుభుబుభులకు ము, పోలికవడి శీల ముల్లమున కెన యనఁగా
శీలం బుల్లం బనఁగా, భూలోకం బమరలోకమున కెన యనఁగన్.

తా. తిరుమలదేవరాయల కుమారుఁడగు రఘునాథరాయలు శూరశిరోమణియై వరాహలాంఛనుఁడై మ్లేచ్ఛసేనల రూపుమాపి, విరోధుల కోటల నుగ్గునూచముగావించి, విరోధిరాజకుటుంబములఁ దెగటార్చి యవనసేనలఁ బరాజయరూపమగు నపకీర్తిపాలు గావించి పరాక్రమించి పేరొందెను.

శా. యాదోరాశిగభీరమూర్తి రఘునాథాధీశుఁ డుద్దండబా
హాదర్పాంధసపాదమల్కికనిజామానీకముల్ ద్రుంప జ
న్యాదూరక్షితిఁ బారుకృష్ణకును గృష్ణాంకంబు నాఁ డబ్బె బి
బ్బీదీవ్యన్నయనాబ్జ కజ్జలజలాభీల ప్రవాహంబునన్. 69

యాదోరాశి=సముద్రునివలె, గభీరమూర్తి=గంభీరుఁడైన, రఘునాథాధీశుఁడు=రఘునాథరాజు, ఉద్దండ=ఉత్కటమైన, బాహాదర్ప=భుజగర్వముచేత, అంధ=కన్నుఁగానకయున్న, సపాద=సపాదులయొక్కయు, మల్కిక=మలకలయొక్కయు, నిజామ=నిజామునియొక్కయు, అనీకములు=సైన్యములను, త్రుంపన్=సంహరింపఁగా, జన్య=యుద్ధమునకు, అదూరక్షితిన్=సమీపభూమియందు, పారు=ప్రవహించుచున్న, కృష్ణకున్=కృష్ణానదికి, బిబ్బీ=మ్లేచ్ఛస్త్రీలయొక్క,అనఁగా బూబులయొక్క, దీవ్యత్=ప్రకాశించుచున్న, నయనాబ్జ=పద్మములవంటి కన్నులయందలి, కజ్జలజల=కాటుక నీళ్లయొక్క, ఆభీలప్రవాహంబునన్=భయంకర ప్రవాహముచేత, కృష్ణాంకంబు=కృష్ణయనుపేరు, నాఁడబ్బెన్=నాఁడుకలిగెను. కృష్ణానదిజన్యాదూరక్షితిని బ్రవహించుటవలననే సంగరరంగమున గుడారముల నాశ్రయించియున్న యవనాంగనలు కజ్జలబాష్పములు విడిచి ప్రవాహమును గృష్ణనామాంకితముఁ జేయ వీలుపడినది. నిజామాదులను రఘునాథరాయలు ద్రుంచుటకు వారియుద్దండబాహాదర్పాంధతయే కారణము. కన్నీటిప్రవాహము ఆభీలమగుటవలననే కృష్ణకుఁ గృష్ణాంకము సమకూర్పఁ జాలినదని పదప్రయోజనము వ్యక్తమగుచున్నది.

తా. రఘునాథరాయనిచేత యుద్ధమందు హతులైన తురకలభార్య లంద ఱేడువఁగా వారి కాటుకకన్నీళ్లయొక్క ప్రవాహము కృష్ణలోఁగలిసి నదీజలమెల్ల నల్లఁబడినందున నాఁటనుండి యా కృష్ణకు కృష్ణయనుపేరుగలిగెను. (కృష్ణానదీజలమంతయు నల్లనగుటకుఁదగిన కాటుకకన్నీళ్ల ప్రవాహమై పారుచుండుట కెంతమంది స్త్రీ లేడవవలసి యుండునో యంతమంది తురకలను రఘునాథరాయఁడు వధించినాఁడని భావము.)

ఇది నిరుక్త్యలంకారము. శ్లో. 'నిరుక్తి ర్యోగతో నామ్నా మన్యార్థత్వప్రకల్పనమ్' అనిలక్షణము. మఱియు నదికిం గృష్ణాభిఖ్యను గూర్చి హేతువుగాని యంజనాశ్రుప్రవాహమును హేతు

వుఁగాఁ జెప్పుటవలన నుత్ప్రేక్షాలంకారము. అంజనాశ్రు ప్రవాహమునకు నదీనైల్యసంపాదకత్వ సంబంధములేకున్నం దత్సంబంధముఁ జెప్పుటవలన నతిశయోక్తియు. ఈరెండలంకారములకు సంకరము.

మ. హరిమైఁ సాదిశిరంబు సాదిమెయి జాత్యశ్వోత్తమాంగంబు గూ
డ రణోర్విన్ రఘునాథశౌరి యసిఁ జెండన్ దివ్యమందారవృ
ష్టి రహిం బ్రాణయుతంబులై గగనవాటిం బర్వ గంధర్వ కి
న్నర రూపంబులు దాల్చి సారె కవి యానందించుఁ దచ్ఛౌర్యమున్. 70

హరిమైన్=గుఱ్ఱపుకళేబరమందు, సాదిశిరంబు = రౌతుతలయును, సాదిమెయిన్=రౌతుకళేబరమందు, (ని. 'అశ్వారోహా స్తు సాదినః' అని అ.) జాత్యశ్వోత్తమాంగంబు=ఉత్తమాశ్వముయొక్క తలయును, కూడన్=అంటుకొనునట్లుగా, రణోర్విన్=యుద్ధభూమియందు, రఘునాథశౌరి=రఘునాథరాయఁడు, అసిఁ జెండన్=ఖడ్గముచే నఱుకఁగా, దివ్య మందారవృష్టిన్=దేవతలు గురిపించునట్టి పారిజాతపుష్పవర్షముచేత, రహిన్=లెస్సఁగా, ప్రాణయుతంబులై=ప్రాణములతోఁ గూడుకొన్నవియై, గగనవాటింబర్వి=ఆకాశవీథికినెగసి, గంధర్వ కిన్నరరూపంబులుదాల్చి=ఇక్కడ వ్యుత్క్రమము, ఏలాగనిన, గుఱ్ఱపుకళేబరమందు, రౌతుతల చెలంగఁగాఁ గిన్నరులైనారనియును రౌతుకళేబరమందుగుఱ్ఱపుతల చెందఁగా గంధర్వులైనారనియు దెలియవలయు. అశ్వదేహమును మనుష్యముఖమును గలవారు కిన్నరులు, మనుష్యదేహము నశ్వముఖమును గలవారు గంధర్వులు గనుక నీపద్యములో వ్యుత్క్రమముగాఁ జెప్పఁబడినది.

ఇందుకు మాఘుని ప్రయోగము-

'బింబోష్ఠం బహుమనుతే తురఙ్గవక్త్రశ్చుంబంతం ముఖమిహకిన్నరం ప్రియాయాః,
శ్లిష్యంతంముహురితరోపి తన్నిజస్త్రీముత్తుఙ్గస్తనభరభఙ్గభీరుమధ్యామ్.' అని.

సారెకున్=మాటిమాటికి, అవి=ఆ కిన్నర గంధర్వరూపములు, తచ్ఛౌర్యమున్=ఆరఘునాథరాయని శూరత్వమునుగూర్చి, ఆనందించున్=సంతోషించును. ఇచట అసంబంధసంబంధాతిశయోక్త్యలంకారము.

అశ్వశిరము మనుష్యుని మొండెమువద్దను మనుష్యశిర మశ్వకళేబరము వద్దను బడునటులఁ జెండుటవలన రఘునాథరాయల ఖడ్గలాఘవము సూచితము. ఖండితులు దివిచేరి యానందించుట రఘునాథరాయశౌర్యమునకు గొప్ప దృష్టాంతము.

తా. రఘునాథరాయలు తనఖడ్గముతో రౌతులను సంగరమునఁ జెండఁగా గుఱ్ఱముల మొండెములకడ రౌతులతలలు రౌతుల మొండెములకడ గుఱ్ఱముల తలలు పడెను. సంగ్రామ వినోదాగతులగు దేవతలు గురియు కల్పకుసుమవర్షమువలన హతులు కిన్నరులుగను గంధర్వులుగను మాఱి దివికెగసి రఘునాథరాయల పరాక్రమము ప్రశంసింప సాగిరి.

చ. హరిపదభక్తిశీలుఁ డగునారఘునాథనృపాలుకూర్మిసో
దరుఁడు సిరంగరాయవసుధావరుఁ డాత్మగుణప్రమోదవ
త్తిరుమలరాయశేఖర వితీర్ణమహాయువరాజపట్టబం
ధురుఁ డయి సర్వభూభువనధూర్వహశక్తి వహించు నెంతయున్. 71

హరిపదభక్తిశీలుఁడగు=విష్ణుమూర్తియొక్క పాదములయందలి భక్తియే స్వభావముగాఁగల, ఆరఘునాథనృపాలుకూర్మిసోదరుఁడు=ఆరఘునాథరాయనిముద్దుతమ్ముఁడు, సిరంగరాయవసుధావరుఁడు =శ్రీరంగరాయభూమీశ్వరుఁడు, ఆత్మ=తనయొక్క, గుణ=సుగుణములకు, ప్రమోదవత్=సంతోషము గల, తిరుమలరాయశేఖర=తిరుమలదేవరాయ శ్రేష్ఠునిచేత, వితీర్ణ=ఇయ్యఁబడిన, మహత్=ఉత్కృష్టమైన, యువరాజపట్ట బంధురుఁడయి=యువరాజపట్టాభిషేకముచేత నొప్పినవాఁడై, ఎంతయున్= అతిశయముగా, సర్వభూభువన=సమస్త భూలోకముయొక్క, ధూః=భారమును, వహ=వహించునట్టి, శక్తిన్=సామర్థ్యమును, వహించున్=పూనియుండు.

రఘునాథరాయలువహింపఁదగిన యువరాజపదవి శ్రీరంగరాయలొందుటకు హేతువూహ్యము. రఘునాథరాయ లొకపరాక్రమమునందె పేరొందెను. శ్రీరంగరాయలు పరాక్రమమునందునను ఆత్మ గుణసమృద్ధిచే (పిత్రాజ్ఞానిర్వహణముచేఁ) దండ్రి నలరించుటచేతను యువరాజపదవి నొందెనని తలంప వచ్చును.

తా. శ్రీరంగరాయలు తన సుగుణసముదయముచేఁ దండ్రియగు తిరుమలదేవరాయల నలరించి తండ్రివలన యువరాజపదవి నొంది భూభరణయోగ్యమగు శక్తిసామర్థ్యములు గలిగి హరిపదభక్తిచేఁ బేరొందెను.

చ. ఉరమున నేగుఁ గుండలి ప•యోధరధారల నాను నెప్పుడున్
గిరులు కరుల్ రజోవిహృతి•కిం జను వెళ్ళఁడు నేల కూర్మశే
ఖరుఁ డిది యేల బాలజన•కల్పితసౌఖ్య మటంచు ధారుణీ
తరుణి సిరంగరాయవసు•ధావరుఁ జేరెఁ గుమారమన్మథున్. 72

ఈపద్యములో భూభర్తలైన శేషాహి మొదలైనవారియందు బాలత్వారోపము చేసి యందు వలన భూమి వారిని బరిత్యజించి కుమారమన్మథుఁడైన శ్రీరంగరాయనిం జేరెనని చెప్పినాఁడు.

ఎట్లనిన, ఉరమున నేగుఁ గుండలి=కుండలి యనఁగా శేషుఁడు, ఉరమున నేగున్=బొమ్మతోఁ బారియాడు ననియర్థము. సర్పముగనుక బొమ్మననడుచు నని భావము. గిరులు=అనఁగాఁ గులపర్వతములు, ఎప్పుడున్=నిరంతరమును, పయోధర ధారల నానున్= స్తన్యపానము సేయు నని యర్థాం=రము. మేఘజలధారలచేతఁ దడియునని భావము. కరులు=దిగ్గజములు, రజోవిహృతికిం జనున్=దుమ్ముఁ బూసికొను నాటలకుఁ బోవునని యర్థము. ఏనుఁగులుగనుక మన్ను చల్లుకొనునని భావము. కూర్మశేఖరుఁడు=కూర్మరాజు, వెళ్ళఁడు నేల = నేలంటు వదలఁడని యర్థము. భూమికాధారమై యుండు నని భావము. ఇది యేల బాలజనకల్పిత సౌఖ్య మటంచున్=ఇదియేమి పసిబాలురచేతఁ గల్పింపఁబడిన సంయోగసౌఖ్యం బని యాలోచించి, ధారుణీతరుణి = భూమియను కౌమరుఁబ్రాయముగల స్త్రీ, కుమారమన్మథున్=యౌవనపురుషులలో మన్మథునివంటివాఁడైన, సిరంగరాయ వసుధావరుఁ జేరెన్= శ్రీరంగరాయ భూమీశ్వరునిఁ జేరెను. (శ్లో. 'యథాయూన స్తద్వ త్పరమరమణీయాపి రమణీ కుమారాణామంతఃకరణహరణం నైవకురుతే' అనుశ్లోకార్థము ననుసంధించి చెప్పినాఁడు.)

అనఁగా శ్రీరంగరాయఁడు భూభరణసామర్థ్యమందు శేషాహి మొదలైనవారికంటె నధికుఁడని తాత్పర్యము. పయోధరధార లనెడి పదము కొననున్న నకార మానుననెడి పదము మొదటనున్న

స్వరముతో నడుకునపుడు సంధి గాంచినదనియుఁ, నాను ననెడిపదము మొదటనున్న నకారము పరమగు చుండఁగా లోపమును బొందినదనియును దెలియవలయును. ఇచట భూకాంతకు శ్రీరంగరాయనిం బొందుటను గూర్చి శేషాదుల బాలత్వము హేతువుగాకున్నను హేతువుగా వర్ణించుటవలన హేతూత్ప్రేక్ష. అదియుఁ బయోధరేత్యాది పదగతశ్లేషచే నిల్చినది.

భూదేవి తరుణిగాన బాలజనకల్పితసౌఖ్యము నిరాకరించెను. కావుననే యుపభోగార్హుఁడగు కుమారమన్మథుని వరించెను. బాలురకు యువతుల మెలఁకువ తెలియంగరా దనుటకు-

'జవరాలు చెక్కుగీఁటిన వసవల్చుబాలకుఁడు డెందమునం దలరంగ నేర్చునే.'

యను నైషధపద్యము గ్రాహ్యము.

తా. సర్పము బొమ్మతోఁ బోవుట, శైలములు పయోధరధార లానుట, కరులు రజోవిహృతి సంచరించుట, కూర్మము నడువఁ జాలక పోవుట శిశుచిహ్నములుగా భావించి బాలురతోఁ గలసి యుండుట సుఖముగాదని కుమారమన్మథుఁడు శ్రీరంగరాయలను వలచి ధారుణీతరుణి చేరెను.

సీ. కుంతలస్థలికి నే♦గుణగరిష్ఠునిచీటి కమనీయకేతకీ♦గర్భదళము
మంజులలాటసీ♦మకు నేమహాభాగు తేజంబు కాశ్మీర♦తిలకరేఖ
వక్షోభాగమున కే♦వైభవాధికుని యపారకీర్తిమతల్లి♦ హారవల్లి
కాంచిదేశమున కే♦ఘనుని సంతతదానవారి నిర్ఝరధార♦హీరరశన
తే. యంగమున కెవ్వనిచమూతు♦రంగకోటి, ధాటికాధుతధూళి మా♦ధాళిపట్టు
సమధికాకల్పరుచిఁబూను♦జగతికతఁడు, రాజమాత్రుండె శ్రీరంగ♦రాయశౌరి. 73

సమధిక=అత్యంతాతిశయమైన, ఆకల్పరుచిన్=ఆకల్పమనఁగా వస్త్రాభరణ మాల్యానులేపన రూపమైన చతుర్విధ శృంగారాత్మక నైపథ్యమునకుఁ బేరు గనుక నట్టి చతుర్విధశృంగారముయొక్క శోభను, ('చతుర్ధాలంకృతిర్వాసో భూషామాల్యానులేపనైః' అని లక్షణము.) (ని. 'ఆకల్పవేషౌ నేపథ్యమ్'అని అ.)పూను=వహించునట్టి, జగతికిన్=భూదేవియను స్త్రీకి, కుంతలస్థలికిన్=కుంతలదేశ మనెడు కుంతలదేశమునకు, అనఁగా శిరస్సునకు, ఏగుణగరిష్ఠునిచీటి = గుణశ్రేష్ఠుఁడైన యేరాజుయొక్క యాజ్ఞాపత్రిక, కమనీయ=మనోహరమైన, కేతకీ=మొగలియొక్క, గర్భదళము=గర్భములోపలి ఱేకాయెనో, అనఁగా లేఁతగేదఁగిపూవు ఱేకాయెనో,

మంజుల = మనోహరమైన, లాటసీమకున్ = లాటసీమయనెడు, మంజు = సుందరమైన, లలాటసీమకున్ = ఫాలప్రదేశమునకు, ఏమహాభాగు=మహాభాగుఁడైన యేరాజుయొక్క, తేజంబు= ప్రతాపము, కాశ్మీరతిలకరేఖ=కుంకుమబొట్టుయొక్క రేఖయాయెనో, తేజము (ప్రతాపము) రక్తవర్ణముగాఁ జెప్పుట కవిసమయము గావునఁ గుంకుమపూవు తిలకముతో నిటఁబోలఁ జెప్పఁబడెను. తిలకము రేఖాకారముగ నున్నదనుటచేఁ బ్రతాపము జగద్వ్యాపక మొందుచున్నదని భావము.

వక్షోభాగమునకున్=వత్సదేశ మనెడు వక్షోభాగమునకు, ఏవైభవాధికుని=వైభవచేత నధికుఁడైన యేరాజుయొక్క, అపారకీర్తిమతల్లి=అంతములేని కీర్తిమతల్లిక, మతల్లికాశబ్దము ప్రశస్తవాచకము.(శ్లో.'మతల్లికామచర్చికా ప్రకాండముద్ధతల్లజౌ, ప్రశస్తవాచకాని' అని. అ.) హారవల్లి=తీఁగపంటెముత్యాలహారమాయెనో, వక్షమన వక్షోభాగమునకుఁ జెల్లుననుటకు-

ని. 'వత్సరేకుటజేవత్స స్సు, తాదౌ తర్ణకేత్రిషు' వక్షస్య స్త్రీచా నానార్థరత్నమాల.
క. తోరముగ వత్సదోగ్ధ్రి, క్షీరంబులు. విష్ణుపురాణము.

కాంచిదేశమునకున్=కాంచిదేశమనెడు కాంచిదేశమునకు, అనఁగాఁ గటిభాగమునకు, ఏఘనుని=ఘనుఁడైన యేరాజుయొక్క, సంతత=ఎడతెగని, దాన=దానసంబంధమైన, వారి=ఉదకముయొక్క, నిర్ఝరధార=ప్రవాహధార, హీరరశన=వజ్రమణిమయమైన మొలనూలాయెనో, (ని. 'స్త్రీకట్యాం మేఖలా కాంచీ సప్తకీరశనాచసా' అని అ.) హీరకాంతి జలధారకాంతియు సమముగా నుంటచే నుపమానోపమేయములు యుక్తముగ నున్నవి. హీరరశన జలధారను బోలియున్నదని భావము.

అంగమునకున్=అంగదేశమను నంగమునకు, అనఁగా శరీరమునకు, ఎవ్వని=ఏ రాజుయొక్క, చమూతురంగకోటి=సేనాసంబంధమైన యశ్వసమూహముయొక్క, ధాటికా=దవుడుచేత, ధుత=ఎగరఁగొట్టఁబడిన, ధూళి=పరాగము, మాంధాళిపట్టు=మదుపువన్నెగల పట్టువస్త్ర మాయెనో, ఇంతవఱకుఁ బ్రథమచరణమందు మాల్యశృంగారమును రెండవచరణమం దనులేపనశృంగారమును మూఁడవచరణమందును, నాలవచరణమందును నాభరణశృంగారమును నెత్తుగీతియందు వస్త్రశృంగారమును నాయెనని తెలియవలయును. అతఁడు=అట్టి, శ్రీరంగరాయశౌరి=శ్రీరంగరాయశ్రేష్ఠుఁడు, రాజమాత్రుండె=సాధారణరాజువంటివాఁడా, అనఁగాఁ గాఁడనుట. అనఁగాఁ బైనిఁ జెప్పఁబడిన కుంతలాది దేశములనన్నిటిని స్వాధీనముచేసికొని యేలినాఁడని తాత్పర్యము. ఇచటరూపకాలంకారము. అదియుఁ గుంతలేత్యాదులయందు శ్లేషించినది. తక్కినచోట శ్లేషించలేదు.

తా. శ్రీరంగరాయల యాజ్ఞాపత్రము భూసతి కుంతలస్థలమున మొగలిరేకువలెను పరాక్రమము నొసట (లాటదేశమున) కుంకుమపూవు తిలకముగను కీర్తి వక్షస్సభాగమున హారముల రీతిగను దానజలము కాంచీదేశమునకు వజ్రముల మొలనూలువలెను సైన్యధూళి మదుపువన్నె పట్టువలువవలెను జతుర్విధాలంకారదాయకముగ నుండెను.

మ. జలధిన్ దానపయోధునీఝరులచేఁ • జంద్రున్ యశోలక్ష్మిచే
జలదవ్రాతము నాత్మకారితమహా•సత్రాగ్నిధూమంబుచేఁ
జెలు వొప్ప న్వెలయింపఁ జాలు భళిరే • శ్రీరంగరాయక్షమా
లలనావల్లభుఁ డెల్లదాతలకు నెల్లన్ దాత యూహింపఁగన్. 74

జలధిన్=సముద్రుని, దాన=దానసంబంధమైన, పయః = ఉదకముచేతనైన, ధునీ=నదులయొక్క, ఝరులచేన్=ప్రవాహముచేతను, చంద్రున్ = చంద్రుని, యశోలక్ష్మిచేన్ = కీర్తిశోభచేతను, జలదవ్రాతమున్ = మేఘసమూహమును, ఆత్మకారిత=తనచేతఁ జేయింపఁబడిన, మహాసత్ర=మహాయజ్ఞములయందలి, (ని. 'సత్రమాచ్ఛాదనేయజ్ఞే సదాదానేవనేపిచ' అని వి.) అగ్ని=అగ్నిసంబంధమైన, ధూమంబుచేన్ = పొగచేతను, చెలువొప్పన్=బాగొప్పఁగా, వెలయింపఁజాలు=ప్రకాశింపఁజేయంజాలును, భళిరే=మఝ్ఝారె, శ్రీరంగరాయ క్షమాలలనావల్లభుఁడు=శ్రీరంగరాయభూపతి, ఊహింపఁగన్=విచారింపఁగా, ఎల్లదాతలకు నెల్లన్ దాత=దాతలైనవారికందఱికిని దాతయౌను, అనఁగా లోకములో సముద్రుఁడును జంద్రుఁడును మేఘుఁడును దాతలలో శ్రేష్ఠులని చెప్పఁబడుచున్నారు. గనుక వారలకు నీ శ్రీరంగరాజు దాతయైనాఁడని యర్థము. దానోదకనదీప్రవాహముల

చేత సముద్రునికి జలసమృద్ధిని శుభ్రయశస్సుయొక్క శోభచేతఁ జంద్రునికిఁ గాంతిసమృద్ధిని యాగాగ్నిధూమముచేత మేఘునికి రూపసమృద్ధిని గలుగఁ జేసినాఁడనిభావము. వెలయింపఁజాలును అనువఱకు వాక్యముచేత రాజునందు దాతలకు దాతృత్వమును సమర్థించుటవలనఁ గావ్యలింగాలంకారము.

ఈపద్యమున శ్రీరంగరాయల దానాతిశయము కీర్తి వైభవము యజ్ఞనిర్వహణము సూచితములు.

తా. శ్రీరంగరాయలు దానజలముచేత సముద్రమును కీర్తివైభవముచేత శశాంకుని యజ్ఞధూమముచేత మేఘములను నభివృద్ధినొందించి పేరొందెను. అందువలన దాతలని పేరుగొన్న సముద్రము చంద్రుఁడు జలదములకంట శ్రీరంగరాయలె దాతయని భావము.

శా. తుంగక్ష్మాధరకోటు లెక్కి కమలాప్తు న్మిగింగి వీరారిశౌ
ర్యాంగారంబుల నొక్కగ్రుక్కఁ గొని సద్యశ్శ్రాంతి మానంగ నా
నుం గల్లోలవతీభుజంగజలసందోహంబు లెల్లన్ సమి
ద్రంగప్రౌఢసిరంగరాయపృతనారంగద్రజోజాలముల్. 75

సమిద్రంగ=యుద్ధరంగమందు, ప్రౌఢ=సమర్థుఁడైన, సిరంగరాయ = శ్రీరంగరాయనియొక్క, పృతనా=సేనాసంబంధమైన, రంగత్=ఒప్పుచుండెడు, రజోజాలముల్=పరాగ సముదాయములు, తుంగ క్ష్మాధరకోటు లెక్కి=పొడవైన పర్వతసమూహముల నెక్కి (లేక పర్వతాగ్రముల నెక్కి), కమలాప్తున్ మ్రింగి=సూర్యునిఁ గబళించి, వీరారిశౌర్యాంగారంబులన్=వీరులైనశత్రువులయొక్క శౌర్యములనెడునిప్పులను, ఒక్కగ్రుక్కఁగొని=ఒకసారిగ దిగమ్రింగి, సద్యశ్శ్రాంతి మానంగన్=అప్పుడుపొందిన శ్రమనివారణ మగునట్టులుగా, కల్లోలవతీ=నదులకు, భుజంగ=విటుఁడైన సముద్రునియొక్క, జలసందోహంబులెల్లన్=ఉదకసమూహముల నన్నిటిని, ఆనున్=త్రాగును. (ని. 'భుజఙ్గో విటసర్పయోః' అని అ.)

తా. శ్రీరంగరాయలయొక్క చతురంగబలపాదఘట్టనమువల్లఁ బుట్టినపరాగము కమ్ముకొనుచుండఁగాఁ గులపర్వతములు కప్పఁబడియెననియు సూర్యబింబము కనుపడక పోయెననియుఁ బరాక్రమవంతులైన శత్రువుల శౌర్యములు నశించెననియు సముద్రములన్నియుఁ బూడిపోయె ననియును భావము.

ఇచట సేనాధూళి సముద్రపానముఁ జేయుటకుఁ బర్వతారోహణాదులవలనం గలిగిన యాయాసముఁ బోఁగొట్టుకొనుటఫలముగాకున్నను ఫలముగా నుత్ప్రేక్షించుటచే ఫలోత్ప్రేక్ష. అర్థాపత్తి. సమాసోక్తి.

సైన్యధూళి యాకాశమువఱకు నంటుననుట కవిసంప్రదాయము.

మ. తలపంజొప్పడి యొప్పెనప్పుడు తదుద్యజ్జైత్రయాత్రాసము
త్కలికాసంఖ్య దసంఖ్య సంఖ్య జయవత్కంఖాణరింఖావిశృం
ఖల సంఘాత ధరాపరాగ పటలాక్రాంతంబు మిన్నే అన
ర్గళభేరీరవనిర్గళద్గగనరేఖాలేప పంకాకృతిన్. రాఘవపాండవీయము.

సీ. భూరిభుజంగికాభుక్త నిర్ముక్తుఁ డై వారక బుసకొట్టువానిఁ దెగడి
పంకనిశ్శంకుఁ డై పారదారికవృత్తి వదలక పల్లొత్తువాని నెడసి

మధుపాంగనాసంగ♦మప్రౌఢి నెపుడు వోవని చెక్కుచెమరుల♦వాని రోసి
బింకపుసానుల♦వంక రాపడి నెలవంక వ్రైఁ బూనిన♦వాని మాని
తే॥ పుడమిచెలి చెందె నకలంక♦భోగభాస, మాను నక్షయసౌకర్య♦మానితాను
భావు నమలినదానవై♦భవు నకూట, రాగనిస్తంద్రు శ్రీరంగ♦రాయచంద్రు. 76

భూరి=అనేకులైన, భుజంగికా=జారస్త్రీలచేత, భుక్త=భోగింపఁబడి, నిర్ముక్తుఁడై=విడువఁబడినవాఁడై, వారకబుసకొట్టువానిక్=విడువక నిట్టూర్పులు పుచ్చు శేషుని, తెగడి=నిరసించి యని యర్థము. భూరి=అనేకులైన, భుజంగికా=ఆఁడుపాములచేత, భుక్త=భోగింపఁబడి, నిర్ముక్తుఁడై=కుబుసము విడిచినవాఁడై, ని. 'నిర్ముక్తో ముక్తకఞ్చుకః' అని అ. వారకబుసకొట్టు=విరామము లేక ఫూత్కారము సేయుచున్నవాఁడని భావము.

పరకాంతాభుక్తనిర్ముక్తగాత్రుఁడు రాజ్యపాలనమున కనర్హుఁడని భూకాంత పరిత్యజించెనని యాశయము.

పంక=పాపవిషయమై, నిశ్శంకుఁడై=శంకలేనివాఁడై, పారదారికవృత్తిక్ = పరస్త్రీకాముకవృత్తితోడ, వదలకపల్లొత్తువానిక్=విడిచిపెట్టక దంతక్షతములు సేయు యజ్ఞవరాహమును, ఎడసి=ఎడఁబాసి యని యర్థము, పంకమనఁగా బురద, దానికి, సందేహింపనివాఁడై, పారదారికవృత్తిక్ = పారంద్భృణాతీతి పారదారీ, సఏవ పారదారికః. అనఁగా దరులనురలంద్రోయు వ్యాపారముతోడ నెల్లప్పుడును, దంష్ట్రాగ్రములచేత ఘట్టనము సేయువాఁడని భావము. ని. 'పఙ్కః కర్దమపాపయోః' అని వి

పరదారావృత్తి మిగుల పాపదాయకము. అట్టిదుర్నీతిని విడువఁజాలనివాఁడు రాజ్యపాలన కనర్హుఁడని భూకాంత విడనాడెను.

మధుపాంగనాసంగమప్రౌఢిక్=మద్యపానము జేయు స్త్రీలతోడి సంభోగమందలి ప్రౌఢిమచేత, ఎపుడువోవని చెక్కుచెమరుల వానిక్=ఎపుడును బోకుండెడు చెక్కుచెమటలుగల దిగ్గజమును, రోసి=అసహ్యపడి యనియర్థము. మధుపాంగన లనఁగా నాఁడుతుమ్మెదలు వానియొక్క సాంగత్యప్రౌఢిమగలవాఁడు, ఎప్పుడును గండస్థలమదధారలు గలవాఁడును అనిభావము.

స్త్రీగమనమె పాపమైయుండ మధుపానముచేయుసతుల గవయుట మిగుల దోషకరము. కాన నట్టివారిని వర్జించెను.

బింకంపుసానులవంకరాపడి=సానియనఁగా వారకాంత, సానువనఁగాఁ బర్వతపుపెద్దచరియ, బింకముగల వారకాంతలవల్ల రాపిళ్ళఁబడి, నెలవంక వైఁబూనినవానిక్=నక్షత్రములు వహించిన కులపర్వతమును, మాని=విడిచిపెట్టి యని యర్థము. పెద్దచరులయొక్క మలకలయందు రాపిళ్లఁబడి చంద్రికలను బైధరించినది. అనఁగా నత్యున్నతమై యుండునది యని భావము.

వారకాంతాలోలురను గూడ భూతరుణి విసర్జించును. అందు సామాన్యపుసానులుగాక బింకపుసానులగుట రాజులకు వారివలన నాపదలు చిక్కులుగూడ నెక్కువగునని యాశయము.

పుడమిచెలి=భూకాంత, అకలంకభోగ భాసమానుక్ = కళంకరహితమైన భోగముచేతఁ బ్రకాశమానుఁడైనట్టియు, అని రాజపరమైన యర్థము. శేషుఁడు కళంకరహితమైన భోగముగలవాఁడనుట. ఇది ప్రథమచరణమునకుఁ గ్రమమని తెలియవలయును. భోగములనఁగాఁ బడగలు నల్లని

మచ్చలుగల పడగలచేత నొప్పుచున్నవాఁడని భావము. (శ్లో. 'మూర్ధ్నా ముకున్దపదపఙ్కజముద్రితేన' అని) శేషశిరోవిశేషణముగాఁ జెప్పఁబడియున్నది. (ని. 'కళఙ్కోఙ్కాపవాదయోః' అని అ.) అక్షయ=క్షయములేని, సౌకర్య=తిన్నఁదనముచేత, మానిత = ఒప్పుచున్న, అనుభావుక్=ప్రభావము గలిగినట్టియు, అని రాజపరమైన యర్థము. యజ్ఞవరాహము క్షయముగల సౌకర్యముతోఁ గూడినదనుట. ఇది రెండవచరణమునకుఁ గ్రమము. క్షయమనఁగాఁ గల్పాంతమును, సౌకర్యమనఁగా సూకరభావమును, కల్పాంతసూకరత్వముతోఁ గూడినదని భావము. (ని. 'క్షయఃకల్పాన్తఇత్యపి' అని అ.) అమలిన=మాలిన్యరహితమైన, దానవైభవుక్=త్యాగముయొక్క వైభవము గలిగినట్టియు, అని రాజపరమైన యర్థము. దిగ్గజము మాలిన్యసహితమైన త్యాగవైభవముగల దనుట. ఇది మూఁడవచరణమునకుఁ గ్రమము. దానమనఁగా మదము, మలినమైన మదవైభవము గలదనిభావము. (ని. 'దానం గజమదేత్యాగే' అని వి.) అకూట = కపటములేని, రాగ=అనురాగముచేత, నిస్తంద్రుక్ =నిశ్చలుఁడైనట్టి, అని రాజపరమైనయర్థము. కులపర్వతము కపటముగల యనురాగముతోఁ గూడినదనుట,ఇది నాలవచరణమునకుఁ గ్రమము, కూటములనఁగా శిఖరములు శిఖరములయందలి ధాతురాగముతోఁ గూడినదై చలింపని దనిభావము. (ని.'మాయానిశ్చలయన్త్రేషు కైతవానృతరాశిషు, అయోఘనే శైలశృఙ్గే సీరాఙ్గే కూట మస్త్రియామ్' అని అ.) శ్రీరంగరాయచంద్రుక్ = శ్రీరంగరాయశ్రేష్ఠుని, చెందెక్=పొందెను. అనఁగా భూకాంత తనకు భర్తలైన శేషాహి మొదలైనవారియందు శబ్దశ్లేషచేత సంప్రాప్తమైన దుర్విటభావములను విచారించినదై వారిసాంగత్యము నిరసించి యుత్తమనాయకధర్మములుగల శ్రీరంగరాయప్రభుపును బొందెనని యర్థము.ఇచట శ్లేషోత్థాపిత వ్యతిరేకాలంకారము.

తా. శేషుఁడు భుజంగికాభోగని ర్యుక్తుఁడగుటవలనను వరాహము పారదారికవృత్తి నుంటవలనను దిగ్గజములు మధుపాంగనాసంగముతో నుంటవలనను పర్వతములు పెద్దసానులతో నలరారుటవలనను భోగయోగ్యములు కావని గ్రహించి భూకాంతయే తాదృగ్దోషరహితుఁడగు శ్రీరంగరాయల వరించి సుఖజీవనము చేయసాగెను.

మ. ఘనశౌర్యుండు సిరంగరాయనరలోకస్వామితోఁబుట్టు రా
మనృపాలాగ్రణి సహ్యజాంబుధిపయోమధ్యోర్వి శ్రీరంగప
ట్టనలంకానగరంబు పుణ్యజనపీడావార్త లేకుండఁ గై
కొనియె న్మిత్రభవోపకారనిరపేక్షుం డై విచిత్రంబుగన్. 77

ఘనశౌర్యుండు=అధికపరాక్రమముగలిగిన, సిరంగరాయనరలోకస్వామితోఁబుట్టు=శ్రీరంగరాయజననాథుని తమ్ముఁడైన, రామనృపాలాగ్రణి=రామనరపాలశ్రేష్ఠుఁడు, తోఁబుట్టు, అన్నచోట ('వువర్ణశోభ వేద్యత్ర క్వచిన్నత్యః క్వచిత్తువా') అను నథర్వణవచనమువలన వువర్ణకము వైకల్పికము గనుక తోఁబుట్టువులు అని చెప్పఁబడలేదు. సహ్యజా=కావేరియనెడు, అంబుధి=సముద్రముయొక్క, పయః=ఉదకముయొక్క, మధ్యోర్విక్ = మధ్యభూమియందలి, శ్రీరంగపట్టణలంకానగరంబు=శ్రీరంగపట్టణమనులంకాపురమును, పుణ్యజనపీడావార్తలేకుండక్=సజ్జనబాధ యనెడుమాట లేకుండునట్టులు, మిత్ర=స్నేహితులవలన, భవ=కలిగిన, ఉపకార=సహాయమందు, నిరపేక్షుండై=అపేక్ష లేనివాఁడై, అనఁగా నసహాయుఁడై, కైకొనియెక్=సాధించి పుచ్చుకొనెను. అనియర్థము. దశరథరాముఁడు మిత్రభవోపకారము నపేక్షించినవాఁడై,పుణ్యజనులకు బాధగలుగునట్టులుగా సముద్రోదకమధ్యభూమి

యందలి లంకాపట్టణమును సాధించినవాఁడనుట, మిత్రభవుఁ డనఁగా సూర్యునివలన సంభవించిన సుగ్రీవుఁడుగనుక నతనిసహాయ మపేక్షించినాఁడనియునుఁ బుణ్యజనులనఁగా రాక్షసులు. ని.'యాతుధానః పుణ్యజనః' అని అ. వారలకుఁబీడగలుగునట్టులుగా సాధించినాఁడనియును భావము. ఇచట రామనరపాలుఁడనెడు రామనరపాలుఁడని రూపకము.అదియు 'సహ్యజాంభోధి' త్యాదిరూపకములచే సాహాయ్యము చేయఁబడుటచే సావయవరూపకము.తొల్లిటియవస్థకంటె రాజభావావస్థయందు మిత్రభవోపకార నిరపేక్షత్వాది శ్లేషచే ననుగ్రహింపఁబడినవిశేషముం జెప్పుటచే నధికాభేదరూపకము. ఘనశౌర్యత్వ విశేషణముచే మిత్రాపేక్ష లేకయే లంకాసాధనమును సమర్థించుటవలనఁ గావ్యలింగాలంకారము. ఈరెంటికిని సంకరము.

రాముఁడు పుణ్యజనపీడ మిత్రభవోపకారాపేక్షతో లంకానగరముచేకొన రామరాజపుణ్యజనపీడారహితముగ మిత్రభవోపకారానపేక్షముగ నాయానగరములు చేకొనుట విచిత్రము. పుణ్యజనుల పీడించుట మిత్రభవోపకార మాసించుట లేమిచే శ్రీరామునకంటె రామరాజె యుత్తముఁడు కాననే ఘనశౌర్యుఁడు.

తా. రామరాజు శ్రీరంగపట్టణమును పుణ్యజనపీడారహితముగా మిత్రభవోపకార నిరపేక్షముగఁ గైకొని పరిపాలింపసాగెను.

శా. రామక్ష్మావరు దానతోయతటినీవ్రాతంబు కల్లోలినీ
స్వామిం జెంద యశంబు మేఘములఁ బర్వం గల్గువర్షాశర
త్సామానాధికరణ్యలబ్ధికచటం జక్రాయుధుం డొందు ని
ద్రాముద్రానుగతప్రబోధములఁ జిత్రం బేకకాలంబునన్. 78

రామక్ష్మావరు=రామభూమీశ్వరునియొక్క, దానతోయతటినీవ్రాతంబు=దానజలనదీసముదాయము, కల్లోలినీస్వామిం జెందన్=నదీనాయకుఁడైన సముద్రునియందుఁ బ్రవేశించుచుండఁగా, యశంబు=కీర్తి, మేఘములఁబర్వన్=మేఘములయందు వ్యాపింపఁగా, కల్గు = సంప్రాప్తమగుచున్న, వర్షాశరత్సామానాధికరణ్యలబ్ధికిన్=వర్షాకాలశరత్కాలములయొక్క యేకకాలావస్థానమునకు, అచటన్=ఆక్షీరసముద్రమందు, చక్రాయుధుండు=శ్రీమహావిష్ణువు, నిద్రాముద్రానుగత ప్రబోధములన్=నిద్రాజాగరూకతలను, ఒందున్=పొందుచుండును.

నిద్రాప్రబోధము లేకకాలమున నొందుట చిత్రము. దానతోయము తటినీవ్రాతమగుటవల్లనే విష్ణువు వర్షాకాలవాహినులని గుర్తింపఁగలిగెను. తటినీవ్రాతము సంగమించుటవల్లనే సముద్రుఁడు కల్లోలినీస్వామి యనిపించుకొనెను. యశము మేఘములఁ దెల్లఁజేయుటవలనఁ బాండురవర్ణవిశేషము. ఆకాశపర్యంతవ్యాప్తి సూచితములు.

తా.విష్ణుమూర్తికి వర్షర్తువునందు నిద్రయును శరదృతువునందు మెలఁకువయును గనుక నీరామప్రభువు సేయుచుండెడు దానములనుగురించి విడువఁబడిన యుదకము నదులై ప్రవహించి క్షీరసముద్రమందుఁ బ్రవేశించుచుండఁగా నప్పుడే యితనియొక్క శుభ్రయశస్సుచేత మేఘములన్నియుఁ దెల్లనగుటయుఁ గలుగఁగా నక్కడ శయనించియుండెడు విష్ణుమూర్తి నదులు సముద్రమందుఁ బ్రవేశించుటచేత వర్షాకాలమని నిద్రను, మేఘములు తెల్లఁగానుండుటచేత శరత్కాలమని జాగరూకతను బొందుచుండెను. ఇచట మూఁడు సంబంధాతిశయోక్తులకు సంకరము.

క. ఆరఘునాథప్రభృతిధ, రారమణేంద్రులకు మువ్వురకు సోదరుఁడై
సారమతి వేంకటపతి, క్ష్మారమణీప్రియుఁడు వెలయు శత్రుఘ్నుఁ డనన్. 79

ఆరఘునాథప్రభృతిధరారమణేంద్రులకు మువ్వురకు సోదరుఁడై=రఘునాథుఁడు మొదలైన యా ముగ్గురు రాజశ్రేష్ఠులకును దమ్ముఁడై యని యర్థము. రామ లక్ష్మణ భరతులకుఁ దమ్ముఁడై యని యర్థాంతరము. సారమతి=యోగ్యమయిన బుద్ధిగలిగిన, వేంకటపతిక్ష్మారమణీప్రియుఁడు=వేంకటపతి యనురాజు, శత్రుఘ్నుఁడనన్=శత్రుసంహారకుఁడనునట్టులుగా నని యర్థము. శత్రుఘ్నుఁడనునట్టులుగా నని యర్థాంతరము. వెలయున్=ప్రకాశించును. ఇందు రఘునాథాదులకు మువ్వురకుఁ దమ్ముఁడౌట యను ధర్మనిమిత్తముచేత శత్రుఘ్నస్వరూపోత్ప్రేక్ష.

తా. రఘునాథరాయలు మొదలగు మువ్వురు సోదరులకుఁ గడసారివాఁడై శత్రుఘ్నుఁడేమో యనునటుల వేంకటపతిరాయలనువాఁడు పొగడొందెను.

సీ. చెక్కు నొక్కదె యంచు దిక్కరిగ్రామణి,
యక్కుఁ జేరదె యంచు రిక్కరాయఁ
డఱుత నొందదె యంచు హాలాహలాహారి,
కంటి కబ్బదె యంచు దంటచిలువ
యంక మొందదె యంచు యదుకులశ్రేష్ఠుండు,
మోముఁ జూడదె యంచు మొదటిగిబ్బ
యడుగు ద్రొక్కదె యంచు నమృతంపుమున్నీరు,
చాయ నుండదె యంచు సౌరశాఖి
తే. తనచెలిమి కాసపడ నొచ్చు మునికి వారిఁ
దెగడి యాత్మసవర్ణలబ్ధికిఁ జరాచ
రంబునఁ జరించుఁ దిరుమలరాయతనయ
ధీరవేంకటరాయసత్కీర్తికన్య. 80

చెక్కునొక్కదెయంచున్=చెక్కిలినొక్కి ముద్దయినను బెట్టుకొనదాయెనని, దిక్కరిగ్రామణి=దిగ్గజశ్రేష్ఠమయినయైరావతమును, అక్కుఁజేరదెయంచున్ = ఱొమ్ముపైకైనను రాదాయెనని, రిక్కరాయఁడు=చంద్రుఁడును, అఱుత నొందదె యంచున్=కంఠాశ్లేషమైనం జేసికొనదాయెనని, హాలాహలాహారి=శివుఁడును, కంటికబ్బదె యంచున్=కంటికైనదక్కదాయెనని, దంటచిలువ=ప్రౌఢసర్పమును, అనఁగా శేషుఁడనుట, అంకమొందదెయంచున్=తొడమీఁదికి రాదాయెనని, యదుకులశ్రేష్ఠుండు=బలరాముఁడును, మోముఁజూడదెయంచున్=మొగమయినం జూడదాయెనని, మొదటిగిబ్బ=ఆది వృషభమును, అడుగుద్రొక్కదెయంచున్=కాలుద్రొక్కకయైనఁబోయెనని, అమృతంపుమున్నీరు=క్షీరసముద్రుఁడును, చాయనుండదెయంచున్=సరసనైన నుండదాయెనని, సౌరశాఖి=కల్పవృక్షమును, ఇంతవఱకుఁ జెక్కునొక్కదెయంచున్, అక్కుఁజేరదెయంచు నిత్యాది విశేషణము వలన నైరావతచంద్రాదులయందు నాయకవ్యవహారస్ఫూర్తియగుచున్నది, తనచెలిమికాసపడన్=తన

సాంగత్యమునకు నాశింపఁగా, ఒచ్చెమునికిన్=లోపమున్నందున, వారిఁదెగడి=పైనిఁజెప్పఁబడిన వారిని దిరస్కరించి, ఆత్మసవర్ణలబ్ధికిన్=తనకుఁదగినవారు లభించుకొఱకు, తిరుమలరాయతనయ ధీరవేంకటరాయసత్కీర్తికన్య = తిరుమలదేవరాయలకొమారుఁడై ధీరుఁడైన వేంకటరాయలయొక్క శ్రేష్ఠమయిన కీర్తియనుకన్య, చరాచరంబునఁజరించున్ =చరాచరాత్మకమయిన ప్రపంచమందంతట సంచరించునని యర్థము.

తా. వేంకటపతిరాయలకీర్తి నిష్కళంకమయిన ధావళ్యముగలదిగనుకఁ దనతో సామ్యమును బొందవలయునని విచారించిన యైరావత చంద్రాదులకుఁ గ్రమముగా లోపము లుండుటచే అనఁగా నైరావతమునకు గండస్థలమందు మదజలమాలిన్యమునుఁ జంద్రునకు వక్షోభాగమందు గళంకమును శివునకుఁ గంఠమందు నైల్యమును శేషునికిఁ గన్నులయందు నీలిమయును బలరామునికిఁ దొడలయందు నీలాంబరమును నాదివృషభమునకు ముక్కున నల్లమచ్చలును క్షీరసముద్రునికి నడుగున నఁనగా నథళ ప్రదేశమందు నల్లనిబురదయును గల్పవృక్షమునకు ఛాయయందు నీలిమయును ననునవి కలిగియుం డుటచేత సామ్యమును బొందలేరైరి గనుక వారిని దిరస్కరించి తనతో సమానమయిన వస్తువును వెదకునిమిత్తమయి తిరుగుచున్నదో యనునట్లుగా జగత్తునందంతటను వ్యాపించెనని భావము.

చెక్క నొక్కదే యనునది మొదలైనవిశేషణములవలన దిక్కరిచంద్రాదులయందు నాయక స్ఫూర్తి గలుగుచున్నది గనుక సమాసోక్త్యలంకారము. మదజలకళంకాదిమలినీభూతగండస్థల వక్షస్స్థలాదియుక్తము లయినదిక్కరిచంద్రాద్యుపమానములకంటెఁ గీర్తియం దాధిక్యముస్ఫురించుచున్నది గనుక వ్యతిరేకాలంకారము, శ్లో. 'విశేషణానాంతౌల్యేన యత్ర ప్రస్తుతవర్తినా, అప్రస్తుతస్యగ మ్యత్వే సాసమాసోక్తిరిష్యతే. భేదప్రధానసాధర్మ్య ముపమానోపమేయయోః, ఆధిక్యాదల్పకథనా ద్వ్యతిరేక స్స ఉచ్యతే.' అని లక్షణములు కీర్తికన్య జగమునం దిరుగుటకు సవర్ణప్రాప్తిఫలముగా నుత్ప్రేక్షించుటచే ఫలోత్ప్రేక్ష.

మ. హరుఁ డాతారకశైలదుర్గమున న•ధ్యాసీనుఁ డై రాజశే
ఖరవిఖ్యాతి వహించుఁ జంద్రగిరిదు•ర్గంబందు శ్రీవేంకటే
శ్వరుఁ డొప్పెన్ బహురాజశేఖరసదా•సంసేవ్యుఁ డై యౌర యి
ద్ధర బంటేలికవాసి తద్గిరులకుం • దద్వల్లభశ్రీలకున్. 81

హరుఁడు=శివుఁడు, ఆతారకశైలదుర్గమునన్=నక్షత్రము పేరిటి యాపర్వతదుర్గమందు, అధ్యాసీనుఁడై=నివసించినవాఁడై, రాజశేఖరవిఖ్యాతివహించున్=రాజశ్రేష్ఠుఁడను ప్రసిద్ధిచేత నొప్పుచుండు ననియర్థము. వెండికొండయందు నివసించినవాఁడనియుఁ జంద్రశేఖరనామము గలవాఁడనియును భావము. శ్రీవేంకటేశ్వరుఁడు=సంపద్యుక్తుఁడైన వేంకటరాయఁడు, చంద్రగిరిదుర్గంబందున్=చంద్రుని పేరిటి పర్వతదుర్గమందు, బహురాజశేఖరసదాసంసేవ్యుఁడై = బహురాజశ్రేష్ఠులచేత నెల్లప్పుడును సేవింపఁబడినవాఁడై, ఒప్పెన్=వెలయుచుండెను. ఔర=భళీ, ఇద్ధరన్=ఈభూమియందు, తద్గిరులకున్=ఆతారకగిరి చంద్రగిరులకును, తద్వల్లభశ్రీలకున్=ఆతారకగిరి చంద్రగిరుల కధిపతులైన హర వేంకటేశ్వరుల సంపదలకును, బంటేలికవాసి=బంటుదొరవాసి యని యర్థము. చంద్రమనఁగా బంగారముగనుకఁ జంద్రగిరియనఁగా బంగారుకొండయనిచెప్పి వెండికొండకును బంగారుకొండకును

బంటేలికవాసియనియును బ్రకారాంతరము. (ని. 'వసుచన్ద్రిం చార్జునంచ కళ్యాణం భూరిగైరికమ్' అని అమరశేషము.) ఇచట మొదటిరెండువాక్యములయందు దారకగిరి చంద్రగిరులకు వానియేలికలకును భృత్యరాజాంతరమును సమర్థించుటచే వాక్యార్థహేతుకకావ్యలింగాలంకారము. అది శ్లేషచే లేవనెత్తఁబడినది.

తా. శివుఁడు వెండికొండపై రాజశేఖరనామముతో నొప్పెను. వేంకటపతిరాయలను వేంకటేశ్వరుఁడు చంద్రగిరి (బంగారుకొండ)పై ననేకరాజశేఖరులు గొలువ కొలువుదీరిచి యుండెను. కావున శివునకు వేంకటేశ్వరునకు (వేంకటపతిరాయలకు) బంటునకు రాజునకుఁగల యంతవ్యత్యాసముగలదు.

సీ. చుట్టఁ జుట్టుకొని శే•షుఁడు నిద్రపోవును ముదిపన్నగములలో•మొదటివాఁడు
మొనయకాదిమకూర్మ•ము ముఁడుంగుమేను మోపినపెద్దవారిలోఁ•బెద్దవాఁడు
సమధికాశాప్తి హ•స్తము చాఁచుఁ బద్మినీవైరి దిక్కరి తల•వడఁకువాఁడు
తనయొంటిపంటి చే•తనె యంటునాదికాలముఘోణి పాండురో•మములవాఁడు
తే. కదలలేఁడద్రి బహువయః•క్రమమువాఁడ,టంచు వారలనిరసించి•యవనికాంత
తనభుజాదండమున నుండఁ•దనరుచుండు,భావజనిభుండు వేంకట•క్ష్మావిభుండు.

చుట్టఁజుట్టుకొని శేషుఁడు నిద్రపోవును=శేషుఁడు శరీరమంతయుఁ గుదియఁదీసికొని యెప్పుడును నిద్రించుచుండును. అదియునుంగాక, ముదిపన్నగములలో మొదటివాఁడు=ముదిసినపాములలో నగ్రగణ్యుఁడు, ఆదిమకూర్మము, అనఁగా భూమికిముందుగాఁ బుట్టినకూర్మము, మేనుమోపినన్=శరీరము మోపఁగా, మొనయక=పైకొనక, ముడుంగున్=ముడుచుకొనిపోవును. అదియునుంగాక, పెద్దవారిలోఁ బెద్దవాఁడు=వృద్ధులలో మిక్కిలివృద్ధు, దిక్కరి=దిగ్గజము, సమధిక=మిక్కిలియు నధికమైన, ఆశాప్తిన్=ఆశనుబొందుటచేతను, హస్తముచాచున్=చేఁజాచుచుండును, అనఁగా లేకిత్రనముగా యాచించును. అదియునుంగాక, పద్మినీవైరి=పద్మినీజాతిస్త్రీలకుఁ గొఱగానివాఁడును, తలవడఁకువాఁడ=తలవణఁకించుముసలివాఁడు, అని యర్థము. ఆశలనఁగా దిక్కులు, ని. 'ఆశాతృష్ణా దిశాప్రోక్తా' అని అ. హస్తమనఁగాఁదుండము, (శ్లో. 'హస్తోనక్షత్రభేదేస్యాత్కరేభకరయోరపి' అని వి.) పద్మినియనఁగాఁ బద్మలత. (ని. 'పద్మినీస్త్రీవిశేషేపి సరస్యామంబుజేపిచ' అని వి.) కనుక దిక్కులయందుఁ దుండముసాచువాఁడనియును దామరతీఁగెలనుఁ ద్రెంచివేయువాఁడనియును, శిరశ్చాంచల్యమే స్వభావముగాఁగలవాఁడనియును భావము. ఆదికాలముఘోణి=అనఁగా నాదివరాహము, తనయొంటిపంటిచేతనె యంటున్ = ఒంటిపల్లనఁగా నన్నిపండ్లు నూడిపోఁగా మిగిలినపల్లని యర్థము. దానిచేతనే నొక్కుననియును, అదియునుంగాక, పాండురోమముగలవాఁడు=నెరసినవెండ్రుకలుగలవాఁడనియును అర్థము. ఒంటికోఱగలవాఁడనియు శ్వేతవరాహముగనుక తెల్లనివెండ్రుకలు కలదనియును భావము. (దంష్ట్రీఘోణీస్తబ్ధరోమా' అని అ.)

కదలలేఁడద్రి=అద్రియనఁగాఁ గులపర్వతుఁడు కదలలేఁడు, కూర్చున్నచోటినుండి యివతల నవతల కదలలేఁడు. అదియునుంగాక, బహువయఃక్రమమువాఁడు-బహు=అనేకములైన, వయః=బాల్యకౌమారయౌవనములయొక్క, క్రమమువాఁడు=క్రమించుటగలవాఁడు, అని యర్థము. అచల

మనియు ననేకములైన పక్షులయొక్క గతిగలిగినవాఁడనియును భావము. ఇక్కడ వయశ్శబ్దము పక్షిపరము. (ని. 'వయః పక్షిణి బాల్యాదౌ వయో యౌవనమాత్రకే' అని వి.) అటంచున్=ఈలాగని, వారలనిరసించి=వృద్ధధర్మములుగల శేషుఁడు మొదలైనవారిని నిరాకరించి, అవనికాంత=భూకాంత, తనభుజాదండముననుండన్=తనయొక్క బాహుదండమందు నివసింపఁగా, భావజనిభుండు= ఈపదము సాభిప్రాయము, మన్మథసమానుఁడైన, వేంకటక్ష్మావిభుండు=వేంకటరాయభూమీశ్వరుఁడు, తనరున్=ఒప్పుచుండును. ఇక్కడ దిక్కరి ఘోణాద్రులకు మహద్వివక్షచేసి చెప్పినాఁడు. అలంకారము శ్లేషోత్థాపితహేతూత్ప్రేక్ష. కావ్యలింగము పరికరమును.

అవనికాంతగఁ జెప్పఁబడుటఁ బడుచుగుబ్బెత యని తెలియవలయును. కాంత కావుననే ముదుసలివారలందఱిపొందును విడనాడి భావజనిభుఁడుగనున్న వేంకటపతిరాయల వరించెను. భుజాదండములనుటచే వేంకటపతిరాయలు నడిమివయస్సువాఁడని గరిడీసాములలో నారితేరి దేహపటుత్వము గడించినాఁడనియుఁ గాననే ధరణీకాంతావహనయోగ్యమగు భుజపటుత్వముగలదని యెఱుంగునది.

తా. శేషుఁడు, ఆదికూర్మము, మాతంగము, ఆదివరాహము, భూమీధరము అనువీరలు తనను ధరింపఁదగినవారు కారని ముదుసలివాండ్రనిభావించి భూకాంత భావజునిబోలు మనోహరాకారము గల వేంకటపతిరాయల భుజాదండము నాశ్రయించి సుఖజీవనము గడపసాగెను.

మ. అతిధీరుం డతిదానశూరుఁ డతిరమ్యాకారుఁ డత్యంతసు
వ్రతుఁ డంచుం దను సన్నుతించు కవివాగ్వ్యాపార మెల్లన్ యథా
ర్థతమం బై విలసిల్లఁ దిర్మలమహారాయేంద్రు శ్రీవేంకట
క్షితినాథోత్తముఁ డందు నిందు గతిఁ గల్పించెం గవిశ్రేణికిన్. 83

అతిధీరుండు=అత్యంతధైర్యము గలవాఁడును, అతిదానశూరుఁడు=అతిశయమైన దానమందుఁ దెగువగలవాఁడును, అతిరమ్యాకారుఁడు=మిక్కిలి మనోహరమైన రూపముగలవాఁడును, అత్యంతసువ్రతుఁడు=అత్యుత్కృష్టమైన నియమముగలవాఁడును, అంచున్=అనిపలుకుచు, తనున్=తన్ను, సన్నుతించు=స్తుతిచేయుచున్న, కవి=కవులయొక్క, వాగ్వ్యాపారమెల్లన్=వాగ్వృత్తినంతయును, యథార్థతమంబైవిలసిల్లన్=మిక్కిలి యథార్థమై యొప్పునట్టులుగా, తిర్మలమహారాయేంద్రు శ్రీవేంకటక్షితినాథోత్తముఁడు = తిరుమలదేవరాయని కుమారుఁడైన వేంకటరాయభూనాథశ్రేష్ఠుఁడు, కవిశ్రేణికిన్=కవిసమూహమునకు, అందునిందున్=అనఁగాఁ బరలోకమందు నీలోకమందును, గతిఁగల్పించున్=సద్గతిఁగలుగఁజేయును. ఇక్కడ నపరిమితధనప్రాప్తిచేత నైహికమును ధీరత్వము మొదలైన యర్థగుణములతోఁ గూడిన పుణ్యశ్లోకునిసన్నుతిచేత నాముష్మికమును గవిశ్రేణికిఁ గలుగఁ జేయునని యాశయము.

క. ఆతనయులు జగతీవి, ఖ్యాత నయులు గొలువ శాశ్వతైశ్వర్యకళా
న్వీతుఁడు తిర్మలరాయో, ర్వీతలనాయకుఁడు వెలయు విభవోన్నతుఁడై. 84

జగతీ=భూమియందు, విఖ్యాత=ప్రసిద్ధమయిన, నయులు=నీతిగల, ఆతనయులు=పూర్వోక్తులైన రఘునాథప్రముఖకుమారులు, కొలువన్=సేవించుచుండఁగా, శాశ్వతైశ్వర్యకళాన్వితుఁడు=స్థిర

మయిన వైభవముతోఁ గూడిన, తిర్మలరాయోర్వీతలనాయకుఁడు = తిరుమలదేవరాయ భూమీశ్వరుఁడు, విభవోన్నతుఁడై=ఐశ్వర్యముచేత నధికుఁడై, వెలయున్=ఒప్పును.

తా. శాశ్వతైశ్వర్యశాలురును కీర్తిశాలురునగు సీనలువురుకుమారులు తన్నుఁ గొలుచుచుండ తిరుమలరాయఁడు మిగుల విభవముతో రాజ్యమును బాలింపసాగెను.

సీ. ఎంతకాలము మహా◆శాంతసంగతి దివ్యదంతావళంబులు ◆ దరల కుండు
నెంతకాలము వరా◆హేంద్రుఁ డద్వంద్వుఁడై కల్పము ల్వనరాశిఁ◆గడపుచుండు
నెంతకాలము భుజం◆గేశుఁ డాదిమభిక్షుపదనిషేవణనిష్ఠఁ ◆ బాయ కుండు
నెంతకాలము గిరు◆ల్సంతతాభ్యున్నతి నలహంసపద్ధతి ◆ నంటి యుండు
తే. నంతకాలముఁ దనయంద◆యచలయై య◆నంతయై రత్నగర్భయై◆యవని యలర
నలరుఁ గర్ణాటరాజ్యసిం◆హాసనాధి,రాజ్యశుభశాలి తిరుమల◆రాయమౌళి. 85

ఎంతకాలము = ఎంతమట్టుకు, మహాశాంతసంగతిన్ = మహాశాంతులైనవారి సాంగత్యము తోడ, దివ్యదంతావళంబులు=దిగ్గజములు, తరలకుండున్=కదలకుండునో యని యర్థము. దిగంత సంగతి నెంతకాలముండునో యని భావము. ఎంతకాలము=ఎంతమట్టుకు, వరాహేంద్రుఁడు=యజ్ఞవరాహమూర్తి, అద్వంద్వుఁడై=సుఖదుఃఖాది ద్వంద్వరహితుఁడై, వనరాశిన్=వనసమూహమందు, కల్పములు=అనేకకల్పములు, కడపుచుండున్ = తపము సేయుచుండునోయని యర్థము. అసహాయుఁడై జలరాశియందుఁ గల్పములు గడపుచుండునోయని భావము. ఎంతకాలము = ఎంతమట్టుకు, భుజంగేశుఁడు=శేషుఁడు, ఆదిమభిక్షు=పురాతనభిక్షుకులయొక్క, పదనిషేవణనిష్ఠఁబాయకుండున్=పాదసేవానిష్ఠను బాయకుండునోయని యర్థము. ఆదిమభిక్షువనఁగా శివుఁడు, ఆతనిపాదభూషణమయి యుండునో యనిభావము. ఎంతకాలము=ఎంతమట్టుకు, గిరులు = కులపర్వతములు, సంతతాభ్యున్నతిన్ = నిరంతరాతిశయముచేత,అలహంసపద్ధతినంటియుండున్=ఆయోగిమార్గ మవలంబించియుండునో యని యర్థము. ఇక్కడ హంసశబ్దము యోగిపరము, ఔన్నత్యముచేత సూర్యమార్గమైనగగనము నంటి యుండునోయని భావము. ఇక్కడ హంసశబ్దము సూర్యపరము. అంతకాలము=అంతమట్టుకు,అనఁగా దంతావళప్రభృతు లెంత కాలము వైరాగ్యదశలతోనుందురో యంతకాలమనియర్థము. శాశ్వతకాలమనుట. దిగ్దంతిప్రభృతులకు దిగంతసంగతిమొదలైనవి శాశ్వతముగా సంభవించుట ప్రకటము, తనయంద=తనయందే, అవని=భూమి, అచలయై=చలింపనిదైయని యర్థము. అచలానామముగలదై యని భావము. అనంతయై = అంతములేనిదై యనఁగా నాశములేనిదై యనియర్థము. ని. 'మృతావవసితేరమ్యేసమాప్తావన్తః' అని వి. అనంతానామము గలదై యనిభావము. రత్నగర్భయై=రత్నపరిపూర్ణయై యని యర్థము. రత్నగర్భానామముగలదై యని భావము. ని. 'జగతీరత్నగర్భాచ' అని అ. అలరన్= ఒప్పుచుండఁగా, కర్ణాటరాజ్యప్రయుక్తమైన, సింహాసన=సింహాసనమందలి, అధిరాజ్య=అధిరాజభావమనెడు, శుభ=శుభముచేత, శాలి=ఒప్పుచున్న, తిరుమలరాయమౌళి=తిరుమలదేవరాయశ్రేష్ఠుఁడు, అలరున్=ప్రకాశించును.

భూమిభరణశీలురైన శేషాహిప్రభృతులకు నురమున నేగుఁగుండలి యనెడుపద్యములో బాల్యావస్థయును భూరిభుజంగికా యనెడుపద్యములో యౌవనావస్థయును జుట్టఁజుట్టుకొని యనెడుపద్యము

లో వార్ధకావస్థయును నెంతకాలము మహాశాంతసంగతి యనెడు నీపద్యములోఁ దుర్యావస్థయును జెప్పఁబడెనని గ్రహింపవలయును.

ఇచట దిగ్గజాదులయందు విశేషణసామర్థ్యమువలన నప్రస్తుతయోగివృత్తాంతముతోఁచుచుండుట వలన సమాసోక్త్యలంకారము. శ్లో. 'విశేషణానాం తౌల్యేన యత్ర ప్రస్తుతవర్తినామ్, అప్రస్తుతస్య గమ్యత్వే సా సమాసోక్తి రిష్యతే.' అని లక్షణము.

తా. దిగ్గజములు దిక్కుల భరించునంతకాలమును, ఆదివరాహము ఆదిశేషువు శైలములు భూభరణప్రశస్తిచే నలరునంతకాలమును కర్ణాటరాజ్యసింహాసనము నధిష్ఠించిన తిరుమలదేవరాయల పరిపాలనమునం దీయవనీకాంత శాశ్వతసుఖలోలయై వర్తించుఁగాక.

ష ష్ఠ్యం త ము లు.

క. ఏవంవిధవివిధగుణ, శ్రీవారిధి కఖిలసుజన•సేవధికి ధనుః
ప్రావీణ్యశరధిశరధికి, ధావద్రిపుసంఘలంఘిత•దిశావధికిన్. 86

ఏవంవిధ=ఈవిధమైన, వివిధగుణ=నానావిధములైన సుగుణములయొక్క, శ్రీ=సంపదకు, వారిధికిన్=సముద్రుఁడైనవానికి, గుణశ్రీయనెడు శ్రీకి ననఁగా లక్ష్మికి, వారిధికిన్, ఉత్పత్తిస్థానమైనవానికిని,అని ప్రకారాంతరము. అఖిలసుజన=సమస్తసజ్జనులకు,సేవధికిన్=నిధియైనవానికిని, ని. 'నిధి ర్నా సేవధిః' అని అ. ధనుఃప్రావీణ్య=విలువిద్యయొక్కసామర్థ్యమందు, శరధి=సముద్రమే, శరధికిన్=అమ్ములపొదిగాఁగల రుద్రుఁడైనవానికిని, ధావత్=పారిపోవుచున్న, రిపు=శత్రువులయొక్క, సంఘ=సమూహముచేత, లంఘిత=దాఁటఁబడిన, దిశావధికిన్=దిగంతముగలవానికిని, ఈపద్యముమొదలు కృతికర్తకు నైదుపద్యములవఱకు షష్ఠ్యంతములు చెప్పుచున్నాఁడు. ప్రతిపద్యమున నంత్యప్రాసము కడవఱకుఁ జెప్పఁబడుచున్నది. ఉల్లేఖాలంకారము.

క. ఉన్నతజయజన్యబిరుద, మన్నెవిభాళాదిబిరుద•మాన్యునకు మహో
ద్యన్నిబిడజన్యపటహజ, ధాన్నినదక్షరదరిచ్ఛ•టాసైన్యునకున్. 87

ఉన్నత=ఉత్కృష్టమైన, జయ=విజయమువల్ల, జన్య=సంభవించిన, బిరుదమన్నెవిభాళాది=మన్నెవిభాళుఁడనెడి బిరుదుమొదలైన, బిరుద=బిరుదులచేత, మాన్యునకున్ = పూజ్యుఁడైనవానికిని, సీసపాదము. 'శౌర్యధుర్యునకు లాంఛనమునకును నామమగు బిరుదనుటపన్నగవిభూష' అని యాంధ్రనిఘంటువున, మహత్=ఉత్కటముగా, ఉద్యత్=ప్రకాశించుచున్న, నిబిడ=సాంద్రమైన, జన్యపటహజ=రణభేరివలనఁబుట్టిన, ధాన్నినద=ధాంకారధ్వనివలన, క్షరత్=నశించుచున్న,అరిచ్ఛటా=శత్రుసమూహముయొక్క, సైన్యునకున్=సేనలుగలవానికిని, అనఁగా నితనిరణభేరియొక్కనాదము వినఁగా గుండెలుపగిలి శత్రుసైన్యములన్నియు నశించుననుట.

క. క్ష్వేళారుతశీలాహిత, ఫాలాహృతలిపినిభాసి•భాసిచ్ఛాయా
పాళికిఁ బరిపాలితనర, పాళీసత్త్వవిపాద్య•పాయనతతికిన్. 88

క్ష్వేళారుతమనఁగా సింహనాదము, ని. 'క్ష్వేళాతు సింహనాద స్స్యాత్' అని అ. క్ష్వేళారుతశీల=సింహనాదమేస్వభావముగాఁగలిగిన, అనఁగాఁ బరాక్రమవంతులైన, అహిత=శత్రువులయొక్క, ఫాల=నొసళ్ళనుండి, ఆహృత=హరింపఁబడిన, లిపినిభ=అక్షరపంక్తివలెనున్న, అసి=ఖడ్గముయొక్క,

భాసి=ప్రకాశమానమైన, ఛాయాపాళికిన్=చాయలపరుసగలవానికిని, పరిపాలిత=స్వీకరింపఁబడిన, నరప=రాజులయొక్క, ఆళీ=సమూహముచేత, దత్త=సమర్పింపఁబడిన, ద్విపాది=ఏనుఁగులు మొదలైన, ఉపాయనతతికిన్=కానుకలసమూహముగలవానికిని, ని. 'ఉపాయన ముపగ్రాహ్య ముపహార స్తథోపదా' అని యమరము. అలం. ఉత్ప్రేక్ష.

క. ఉద్ధతరిపువిద్ధతపన, పద్ధతి కరిభవనదవని•పటదంబుధిసం
పద్ధరణసముద్ధరణస,మిద్ధరణరజోవ్రజోద్య•దిభమదసృతికిన్. 89

ఉద్ధత=ఉత్కటమానట్టులుగా హతులైన, రిపు=శత్రువులచేత, విద్ధ=భేదింపఁబడిన, తపనపద్ధతికిన్=సూర్యమండలముగలవానికిని, శ్లో. 'ద్వావిమౌ పురుషౌలోకే సూర్యమణ్డలభేదినౌ, పరివ్రాడ్యోగయుక్తశ్చ రణేచాభిముఖోహతః.' అనెడు వచనమువలన యుద్ధాభిలాషచేత నెదిరించి హతులైన శూరులు సూర్యమండలమును భేదించుకొనిపోయి వీరస్వర్గమును బొందుచున్నారనిసంప్రదాయము. అరి=శత్రువులకు, భవనత్=దాఁగియుండెడు గృహమగుచున్నట్టియు, అవని=భూదేవికి, పటత్=వస్త్రమగుచున్నట్టియు, అంబుధి=సముద్రముయొక్క, సంపద్ధరణ=జలరూపమైనసంపత్తియొక్క హరణముచేత, సముద్ధరణ=ఆసంపత్తియొక్క పునరుద్ధరణముచేత, సమిద్ధ=ప్రకాశమానములైన, రణరజోవ్రజ=యుద్ధరంగమందలిపరాగసమూహమును, ఉద్యత్=ఉదయించుచున్న, ఇభమద=గజమదజలముయొక్క, సృతికిన్=స్రవణముగలవానికిని, ఇది క్రమాలంకారము. సముద్రము శత్రువులకు డాఁగందగినగృహమైనందున రణధూళిచేత సంపద్ధరణముచేసినాఁడనియును నవనికాంతకునాచ్ఛాదనపటమైనందున నిభమదజలప్రవాహముచేతఁ బూరించినాఁ డనియును దెలియవలయును. అలం. అతిశయోక్తి— కావ్యలింగము.

క. ధీరవివిధారిగిరిపవి, ధారికిఁ గర్ణాటకాంధ్ర•ధరణీపునరు
ద్ధారికిఁ దిరుమలదేవమ, హారాయాగ్రణికి వితర•ణామరమణికిన్. 90

ధీర=ధైర్యవంతులైన, వివిధారి = నానావిధశత్రువులనెడు, గిరి=పర్వతములకు, పవిధారికిన్=వజ్రాయుధధరుఁడైనవానికిని, అనఁగా నింద్రుఁడైనవానికిని, కర్ణాటకాంధ్రధరణీపునరుద్ధారికిన్=కర్ణాటభూమిని నాంధ్రభూమిని మరల నుద్ధరించినవానికిని, అనఁగాఁ గర్ణాటాంధ్రదేశములు మ్లేచ్ఛులచేత నాక్రమింపఁబడియుండఁగా వాండ్రనుజయించి తిరుగా నేలినాఁడని తాత్పర్యము. తిరుమలదేవమహారాయాగ్రణికిన్ = తిరుమలదేవరాయశ్రేష్ఠునికిని, వితరణామరమణికిన్=దాతృత్వమందు నమరమణి యనఁగాఁ జింతామణియైనవానికిని. అలం. రూపకము. ఉపమ.

వ. అభ్యుదయపరంపరాభివృద్ధిగా నాయొనర్పం బూనినవసుచరిత్రం బనుమహా
ప్రబంధంబునకుఁ గథాక్రమం బెట్టి దనిన. 91

అభ్యుదయ పరంపరాభివృద్ధిగాన్=పైనిఁ జెప్పఁబడిన తిరుమలదేవరాయనికి శ్రేయఃపరంపరలయొక్క యభివృద్ధి యగునట్టులుగా, నాయొనర్పంబూనిన=నేను రచింపఁబూనిన, వసుచరిత్రంబను మహాప్రబంధంబునకున్=వసుచరిత్రమనెడు మహాప్రబంధమునకు, కథాక్రమం బెట్టిదనినన్=కథయొక్క క్రమ మెట్టి దనఁగా,

కథాప్రారంభము.

శా. శ్రీరమ్యం బగు నైమిశంబునఁ దప◆శ్శ్రీరాజితావ్యాజతే
జోరాజుల్ శుకశౌనకాదిమునిరా◆జుల్ సూతజుం జూచి ము
న్నేరాజేంద్రుఁడు దివ్యచిహ్నధరుఁడై ◆ యేలెన్ మహీమండలం
బారాజేంద్రునిఁ దెల్పు మా కన నతం◆ డత్యంతహర్షంబునన్. 92

శ్రీరమ్యంబగు-శ్రీ=వనలక్ష్మిచేత, రమ్యంబగు=మనోహరమైన, నైమిశంబునన్=నైమిశారణ్యమందు, తపశ్శ్రీ=తపస్సంపదచేత, రాజిత=ప్రకాశించుచున్న, అవ్యాజ=దంభరహితమైన, తేజోరాజులు=తేజస్సమూహము గలిగిన, శుక శౌనకాది మునిరాజులు=శుకుఁడు శౌనకుఁడు మొదలుగాఁగల మునిశ్రేష్ఠులు, సూతజుంజూచి = సూతునివీక్షించి, మున్ను=పూర్వకాలమందు, ఏరాజేంద్రుఁడు=ఏరాజశ్రేష్ఠుఁడు, దివ్యచిహ్నధరుఁడై=దేవతా లాంఛనములను ధరించినవాఁడై, మహీమండలంబు=భూమండలమును, ఏలెన్=పరిపాలించెనో, ఆరాజేంద్రునిఁ దెల్పుమాకనన్=ఆరాజశ్రేష్ఠుని మాకుఁ దెలియఁజెప్పుమని పలుకఁగా, అతండు=ఆసూతుఁడు, అత్యంతహర్షంబునన్=మిక్కిలి సంతోషముతో, ఇది ముందరిపద్యముతో నన్వయము. తెలుపుమాకనుచోట మధ్యమపురుషైకవచనమైనందువలన మువర్ణకము రావలసినదయినను (స. 'పరేహలివికల్పేన మువర్ణః ప్రార్థనార్థకే') అను నధర్వణవచనమువల్ల హల్లుపరమగుచుండఁగా వైకల్పికమువర్ణము రాదయ్యె.

దృష్టాంతము:—

క. తగునే యిట్లు కృతార్థుఁడ, వగునీ కురి కొఱుక కిట్టు లాలస్యము సేఁ
దగుట కృతఘ్నతకును నెల, వగు టొప్పనె కొఱుకు కడక నద్రోహుఁడవై.

(భారతము - శాంతిపర్వము.)

తా. ప్రకృతిసౌందర్యముచే మనోహరముగానున్న నైమిశవనమందు శౌనకాదిమహామునీంద్రులు సూతునిగాంచి భూమండలము నేరాజు దివ్యచిహ్నములను ధరించి పరిపాలించెనో యాతని చరిత్రమును మాకు నెఱింగింపుఁడనికోరఁగా సూతుఁడు మిగుల సంతోషముతో (నిటులఁ జెప్పెను.)

శా. శక్రాపాదితదివ్యచిహ్నధరుఁడై ◆ చంచద్విమానాధిరా
జక్రీడాపరుఁడై యమానుషమహా◆సత్త్వాఢ్యుఁడై చేదిభూ
చక్రేశుండు ధరిత్రి యేలె వసుసం◆జ్ఞం దచ్చరిత్రంబు ని
ర్వక్రప్రౌఢిమ విన్నవింతు నని వా◆గ్వైచిత్రితో నిట్లనున్. 93

శక్ర=దేవేంద్రునిచేత, ఆపాదిత=పొందింపఁబడిన, దివ్యచిహ్నధరుఁడై=దేవతాలాంఛనములను ధరించినవాఁడై, చంచత్=ప్రకాశించుచున్న, విమానాధిరాజ=విమానశ్రేష్ఠమందలి, క్రీడా=విహారమందు, పరుఁడై=ఆసక్తుఁడై, అమానుష=మనుష్యసాధారణముగాని, మహాసత్త్వాఢ్యుఁడయి=మహాబలముచేతనధికుఁడయి, చేదిభూచక్రేశుండు=చేదిదేశాధీశ్వరుఁడు, వసుసంజ్ఞన్=వసువనెడిపేరుచేత, ధరిత్రి యేలెన్=భూమిని బరిపాలించెను, తచ్చరిత్రంబున్=అతనికథను, నిర్వక్రప్రౌఢిమన్=సరళమైన ప్రౌఢిమచేత, విన్నవింతునని=విన్నపము చేయుచున్నానని, వాగ్వైచిత్రితోన్ = వాక్యచమత్కృతితోడ, ఇట్లనున్=ఈవక్ష్యమాణప్రకారముగాఁ బలికెను. తచ్చరిత్రంబు నిర్వక్రప్రౌఢిమ

ననుచో ద్రుతమునకు స్థిరమగువివర్ణము పరముగానున్నందున ('లుగ్వాద్రుతప్రకృతికాత్పరతస్సరళే స్థిరేనస్యస్యాత్' న.) అనుసూత్రముచేత లోపమువచ్చినది. ఇచట ననుధాతువు తద్ధర్మార్థక రూపము భూతార్థమునం బ్రయోగింపఁబడెను.

తా. దేవేంద్రునివలన దివ్యచిహ్నముల నొంది విమాన సంచారియై మనుష్యాతీతశక్తిశాలియై చేదిదేశపురాజగు వసుమహారాజు భూమండలమును బరిపాలించెను. అతని చరిత్రమును మీ కెఱింగింతునని చిత్రవాక్కల్పనలతో సూతుఁడు మునుల కీకథ తెలుప సాగెను.

సీ. వరసుమనోభవ్య•తరుల కావాల మత్యలఘుకలాపాలి • కలరుభరణి
సరి లేనితెలిముత్తె•సరులకోటారు కళ్యాణపరంపర•లతోలుదీవి
సురుచిరమణుల కా•కరసీమ శ్రుతిహితభాషితద్విజకోటి•పట్టుఁ గొమ్మ
సరసుల కారామ•సరణి శ్రీరంగగేహక్రోడవాసిని • కాటపట్టు
తే. వెలయునావరణాంబుసం•వీతహాట, కాండమోహాదపరిఖావృ•తాంఘ్రివజ్ర
దంతురప్రాంతగంగాని•రంతరాగ్ర, భూరివరణం బధిష్ఠాన•పురవరంబు. 94

వర=శ్రేష్ఠులును, సుమనః=మంచిమనస్సుచేత, భవ్యతరులు=అత్యంతయోగ్యులు ననెడు, వరసుమనో భవ్యతరులకున్-వర=శ్రేష్ఠములయిన, సుమనః=పుష్పములచేత, భవ్య=యోగ్యములైన, తరులకున్=వృక్షములకు, ఆవాలము=పాదైనదియు, అత్యలఘు=అత్యధికములయిన, కలా=విద్యలయొక్క, పాలికలు=సమూహములనెడు, అత్యలఘు=అత్యంతఘనమైన, కలాప=భూషణములయొక్క, ఆలికలకున్=సమూహములకు, భరణి=సొమ్ములుంచెడు భరణియైనదియు,

సరిలేని=సమానము లేని, తెలిముత్తెసరుల=శుభ్రములైన ముత్యాలహారములనెడు, సరిలేని తెలిముత్తెసరుల=సమానములేని తెల్లముత్తెసరి వడ్లయొక్క,కోటారు=ధాన్యపురాసులుంచెడు స్థలమైనదియు, కళ్యాణపరంపరల=శుభపరంపరలనెడు, కళ్యాణపరంపరల = సువర్ణపరంపరలయొక్క, తోలుదీవి=జంబూద్వీపమైనదియు, (ని. 'కల్యాణ మక్షయే స్వర్ణే కళ్యాణం మఙ్గళేపిచ' అని వి.) తోలుదీవి యనుటలో "జంబూప్లక్షకుశక్రౌంచ"యనితొలుదొలుత జంబూద్వీపము లెక్కింపఁబడుననియు దీవులలోఁ జేరెన్నిక గలదని భావము.

సురుచి=మంచికాంతిగలిగిన, రమణులు=స్త్రీలనెడు, సురుచిర=లెస్సగాఁ బ్రకాశించునట్టి, మణులకున్=రత్నములకు, ఆకరసీమ=గనియైనదియు, శ్రుతిహిత=వేదవిహితములైన, భాషిత=వాక్యములుగల: ద్విజకోటి=బ్రాహ్మణసమూహమనెడు, శ్రుతిహిత=చెవులకింపైన, భాషిత=పలుకులుగల, ద్విజకోటి=శుకపికాది పక్షిసమూహముయొక్క, పట్టుఁగొమ్మ=అవలంబశాఖయైనదియు,

సరసులు=శృంగారాదిరసజ్ఞులనెడు, సరసులకున్=సరస్సులకు, ఆరామసరణి=ఉద్యానవాటికయైనదియు, శ్రీరంగగేహక్రోడవాసినికిన్-శ్రీరంగగేహ = శ్రీరంగమేమందిరముగాఁగల విష్ణుమూర్తియొక్క, క్రోడవాసినికిన్=వక్షస్స్థలవాసినికి, అనఁగా లక్ష్మికి, లక్ష్మియనెడు, శ్రీరంగగేహక్రోడవాసినికిన్-శ్రీ = శోభాయుక్తమైన, రంగగేహక్రోడవాసినికిన్=నాట్యమందిరాంతరవర్తిని యగు నర్తకికి, ఆటపట్టు=నాట్యస్థానమైనదియు, (ని. 'ననా క్రోడంభుజాన్తరం' అని అ.)

ఆవరణాంబు=మహాజలముచేత, సంవీత=ఆవరింపఁబడిన, హాటకాండ=హిరణ్మయమైన బ్రహ్మాం

డమోయుననట్టి, మోహద=భ్రాంతి గలుగఁజేయుచున్న, పరిఖావృతాంఘ్రి - పరిఖా=అగడ్తచేత, వృత=పరివేష్టింపఁబడిన, అంఘ్రి=అడుగు మట్టుగలిగినదియు, వజ్రదంతురప్రాంత=వజ్రమణులచేతఁ జెక్కఁబడిన పార్శ్వభాగము గలిగినదియు, గంగానిరంతరాగ్ర-గంగా = ఆకాశగంగతోడ, నిరంతర=ఎడములేకయున్న, అగ్ర=అగ్రభాగము గలిగినదియు, భూరి=సువర్ణమయమయిన, వరణంబు=కోటగలిగినదియు, (ని. 'స్వర్ణేపి భూరి' అని అ. (ని. 'ప్రాకారో వరణస్సాలః' అని అ.) అధిష్ఠాన పురవరంబు=అధిష్ఠాన మనెడు పట్టణశ్రేష్ఠము, వెలయున్=ప్రకాశించును.

ఇందు శ్లిష్టరూపకము. అందు కలాపాలికలు సురుచిరమణులు అన్న రెండుచోట్ల శబ్దశ్లేషము. తక్కినది యర్థశ్లేషము. ఆకరసీమేత్యాదులయం దుల్లేఖాలంకారము. రెంటికి సంకరము.

తా. అధిష్ఠానపురము పూవుఁదీగలకు, బుద్ధివంతులకు, విద్యలకు, విభూషణములకు, శుద్ధమౌక్తికములకు, తెలిముత్తెములను వడ్లకు, శుభములకు, సువర్ణమునకు, ప్రకాశవంతములగు మణులకు, సుందరాంగులకు, విద్యావంతులగు విప్రులకు, విహగరాజములకు, సరసులకు, సరోవరములకు, లక్ష్మికి, నర్తకురాండ్రకు నునికిపట్టై పరిఘాజలముచేతను పార్శ్వభాగ వజ్రకాంతులచేతను అగ్రభాగమునందు సందు లేకున్న గంగాజలముచేతను నావరింపఁబడిన బంగారపుకోట మహాజలముచేత నావరింపఁబడిన హిరణ్మయమైన బ్రహ్మాండమువలె నొప్పుఁ దనరారును.

చ. అలఘుతరగ్రహాంశుగుణి•తాగణితాభినుతాగ్రరత్నకం
దళరుచిఁ బొల్చువీటివర•ణంబు గతావరణం బొనర్ప ని
చ్చలు నలకోటకొమ్మబలు•సందులపొందుల నేగఁగాఁ జుమీ
యలవఱిచెం బతంగుఁ డస•హాయరథాంగముగా శతాంగమున్. 95

అలఘుతర=మహత్తరములైన, గ్రహాంశు=సూర్యాదినవగ్రహకాంతులచేత, గుణిత=రెట్టింపఁజేయఁబడిన తత్తద్గ్రహసమానవర్ణములు గలిగినవియు, అగణిత=యెన్నశక్యముగానియవియు, అభినుత=మిక్కిలికొనియాడఁదగినవియునగు, అగ్రరత్నకందళరుచిఁబొల్చు=అగ్రభాగమందలి పద్మరాగాది రత్నాంకురముల కాంతిచేత నొప్పుచున్న, వీటివరణంబు=అధిష్ఠానపురముయొక్క కోట, గతావరణం బొనర్పన్=గతమనఁగా గతి, దానికి (నావరణ మనఁగా నిరోధము) గతి నిరోధము సేయఁగా, నిచ్చలున్=నిరంతరమును, అలకోటకొమ్మబలుసందులపొందులనేగఁగాఁజుమీ = ఆకోటకొమ్మలయొక్క బలమైనసందులవెంబడిగాఁ బోవుటకేసుమీ, పతంగుఁడు=సూర్యుఁడు, శతాంగమున్=రథమును, ని. 'శతాఙ్గ స్స్యన్దనో రథః' అని అ. అసహాయరథాంగముగాన్ = జతలేనియొంటిబండికల్లు గలదానినిగా, అలవఱిచెన్=పనుపఱిచెన్, గ్రహాంశుగుణిత, అన్నచోట గ్రహమండలము నంటియున్నందున సూర్యాంగారకులు రక్తవర్ణముగలవారును శుక్రచంద్రులు శ్వేతవర్ణము గలవారును గురుబుధులు పీతవర్ణముగలవారును శని నీలవర్ణముగలవాఁడును రాహుకేతువులు ధూమ్రవర్ణముగలవారునని చెప్పియున్నది గనుక నాయాగ్రహకాంతులచేత నాయావర్ణసామ్యముగల పద్మరాగాదిమణులకాంతులినుమడింపఁబడినవని యర్థము. శ్లో. 'భాస్కరాఙ్గారకౌ రక్తౌ శ్వేతౌ శుక్రనిశాకరౌ, గురుసోమాత్మజౌ పీతౌ కృష్ణవర్ణశ్శనిస్తథా, రాహుకేతూధూమ్రవర్ణౌ గ్రహవర్ణాః ప్రకీర్తితాః' అని నవగ్రహవర్ణములకు లక్షణము. నవరత్నములకును దత్తద్వర్ణసామ్యమూలకముగా నవగ్రహము లధిదేవతలు. ఎట్లన,

గా, శ్లో. 'మాణిక్యం తరణే స్సుజాతమమలం ముక్తాఫలం శీతగో ర్మాహేయస్యతు విద్రుమో మరకతం సౌమ్యస్య గారుత్మతమ్, దేవేజ్యస్య తు పుష్పరాగ మసురామాత్యస్య వజ్రంశనే ర్నీలం నిర్మల మన్యయోశ్చ కథితే గోమేధ వైదూర్యకే' అని ప్రమాణము. అలం. ఫలోత్ప్రేక్ష.

సూర్యుఁడు పతంగుఁడు (పక్షి) గాన కొమ్మలసందునఁ బోవ సాగెను. సూర్యగమన నిరోధి యగుటచేఁ గోటపైఁగల రత్నములకాంతి సూర్యకాంతి నెంతయో యతిశయించి యుండెననుట. సూర్యునకు గమన నిరోధ మొకనాటిదికాదు. నిచ్చలు జరుగునది. కావుననే యసహాయరథాంగమును జేసికొనెను.

తా. నవగ్రహాదుల కాంతులచేఁ బ్రతిష్ఠానపురపుఁ గోటపైఁగల రత్నములకాంతులు పైకి వ్యాపింప సూర్యుఁ డాకాంతిపుంజమునుండి పోవఁజాలక కోటకొమ్మల సందులనుండి యెటులోఁ బోవుటకు అసహాయచక్రముగల రథము నేర్పఱచుకొని ప్రయాణ మలవఱచికొనెను.

చ. పురిపరిఖామహాంబునిధి • భూరిగభీరతరాంబుపూరముల్
సరభసవృత్తిఁ జొచ్చి బలి • సద్మతలం బతలం బొనర్పఁగాఁ
జరణకృతప్రచారములు • సాగవు వీరికి నంచు నబ్జజుం
డురగులఁ జేసెఁ బన్నగకు • లోద్భవులన్ వడిఁ దేలి యాడఁగన్. 96

పురి=అధిష్ఠానపురసంబంధమైన, పరిఖా=అగడ్తయనెడు, మహాంబునిధి=మహాసముద్రముయొక్క, భూరి=అతిశయమును, గభీరతర = మిక్కిలిలోఁతునైన, అంబుపూరములు = జలప్రవాహములు, సరభసవృత్తిఁజొచ్చి = వేగముతోఁజొరఁబారి, బలిసద్మతలంబు=రసాతలమును, (ని. 'అధోభువన పాతాళ బలిసద్మరసాతలమ్' అని అ.) అతలంబొనర్పఁగాన్ = స్వరూపరహిత మైనదానిఁ జేయఁగా నని యర్థము. (ని. 'అథస్వరూపయోరస్త్రీతలమ్' అని అ.) అతలమనఁగాఁబాతాళము గనుక నిక్కడ స్వారస్యము గ్రహింపవలయును. (శ్లో. 'భూపాపేటీభువనమతలమ్') ఇత్యాది ప్రయోగములు విచారింపవలయును, చరణకృత ప్రచారములు సాగవువీరికినంచున్=వీరికి నడఁగా నీసర్పములకు, చరణకృత ప్రచారములు=పాదములచేతఁజేయఁబడిన సంచారములు, సాగవు=జరుగనేరవు, అంచున్=అని విచారించి, అబ్జజుండు=బ్రహ్మదేవుఁడు,పన్నగకులోద్భవులన్=సర్పకులసంభవులను,వడిఁ దేలియాడఁగన్= వడిగా నీటిపైఁ దేలియాడెడుకొఱకు, ఉరగులఁజేసెన్=ఉరముచేత నడుచువారిఁగాఁ జేసెను. పన్నగ పదంబు సాభిప్రాయ మని తెలియవలయును. ('ఉరసాగచ్ఛంతీత్యురగాః పద్భిః నగచ్ఛంతీతిపన్నగాః' అని వ్యుత్పత్తులు.) అలం. అతిశయోక్తి. ఉత్ప్రేక్ష. నిరుక్తి.

పన్నగకులోద్భవుల నురగులఁ జేసెననుటవలనఁ దొలుత నడువనే లేకుండి రనియు నిందులకుఁ బాతాళ మతల మగుటయే కారణమనియు ఉరగులగుటచే నిపుడు దేలియాడఁగలిగిరనియు భావము. పరిఘాజలము మహాంబుధిరూపముగను గభీరాంబుపూరరూపముగ నుండుటవలననే బలిసద్మము సరభసవృత్తిఁ జేరఁగలిగెను.

తా. అధిష్ఠానపురపు అగడ్త మిగుల లోతు గలిగి పాతాళలోకమువఱకు నుంటచే నందలిజలము పాతాళలోకమునంతట నిండి యతలము (ప్రదేశము లేనటుల) గావింప నచట నుండు పన్నగములు నడువఁజాలకుంటచే బ్రహ్మ కరుణించి యురగములుగా (ఉరముతోఁ బోవువానిగా)ఁ జేసెను. కావుననే నీళ్లపై తేలి యాడుచు నురముతోఁ బాములు పోవుచున్నవి.

మ. చతురాస్యు ల్పురుషోత్తము ల్బుధగురు • ల్సర్వజ్ఞమూర్తు ల్మహా
శతమన్యు ల్శుచిధర్మపుణ్యజనతా • శ్లాఘ్యు ల్ప్రచేతు ల్సదా
గతు లక్షీణనవార్థకర్తలు కళా • కాంతు ల్జగద్బంధు లా
క్షితిదేవు ల్పురి దేవతామహిమలం • జెన్నొందుట ల్చిత్రమే. 91

ఈపద్యములో నధిష్ఠానపురమందలి బ్రాహ్మణులయందు దేవత్వమారోపించి యర్థద్వయమునకు నభేదాధ్యవసాయముగాఁ జెప్పినాఁడు. అదియెట్లనఁగా, చతురాస్యుల్=ఆస్యమందుఁ బుట్టినది యాస్యము, అనఁగా వాక్యము, చతురములైన (అనఁగాఁ బ్రౌఢములైన) వాక్యములు గలవారును అవి యర్థము, చతురాస్యుఁడనఁగా నాలుగుముఖములు గలవాఁడు బ్రహ్మగనుక బ్రహ్మలని యర్థాంతరము. పురుషోత్తముల్=పురుషశ్రేష్ఠులనియర్థము, విష్ణుమూర్తులని యర్థాంతరము. బుధగురుల్=పండితులైనవారికిని గురువులు, (అనఁగా హితాహితోపదేష్టలనియర్థము.) బుధబృహస్పతులని యర్థాంతరము. సర్వజ్ఞమూర్తుల్=సకలము దెలిసినవారని యర్థము, రుద్రమూర్తులని యర్థాంతరము. మహాశతమన్యుల్=మహత్తరములైన యనేకయజ్ఞములు చేసినవారని యర్థము. మహేంద్రులనియర్థాంతరము. శుచిధర్మ=పవిత్రతచేతను, పుణ్యజనతా=సుజనత్వముచేతను, శ్లాఘ్యులు=కొనియాడఁ దగినవారని యర్థము, అగ్నియమ నిరృతు లని యర్థాంతరము. ప్రచేతుల్=ప్రకృష్టమైన మనస్సుగలవారని యర్థము, వరుణులని యర్థాంతరము. (ని. 'ప్రచేతావరుణః పాశీ' అని అ.) సాంతపదాంత సకారమునకు వికల్పముచేత లోపము గలదు గనుక నిక్కడ లోపమువచ్చినది. ('సాంతాదపయః ప్రభృతేస్లోపో స్యేషాంచ ప్రయోగమహితానామ్' అని న.) సదాగతులు=శ్రేష్ఠమైన యాగమనముగలవారని యర్థము, వాయుదేవులని యర్థాంతరము. అక్షీణ=క్షీణముగాని, నవ=నూతనమైన, అర్థకర్తలు=అర్థకల్పనములు చేయువారని యర్థము, నవార్థములనఁగా నవసంఖ్యగలనిధులు వానికిఁ గర్త లనఁగాఁ గుబేరులని యర్థాంతరము. (ని. 'అర్థోభిధేయరైవస్తు ప్రయోజననివృత్తిషు' అని అ.) అక్షీణసదర్థకర్తలని పాఠాంతరము కళాకాంతుల్=విద్యలకధిపతులని యర్థము, చంద్రులని యర్థాంతరము. జగద్బంధులు=జగజ్జనుల కాప్తులని యర్థము, సూర్యులని యర్థాంతరము. (ని. 'ఖద్యోతో లోకబాన్ధవః' అని అ.) ఇట్టివారైన, ఆక్షితిదేవుల్=ఆబ్రాహ్మణులు, పురిన్=పట్టణమందు, దేవతామహిమలన్ = దేవప్రభావములచేత, చెన్నొందుటల్ = ఒప్పుచుండుటలు, చిత్రమే = ఆశ్చర్యమా. అనఁగా శబ్దశ్లేషచేత ప్రాప్తములైన బ్రహ్మాదిదేవతాధర్మములుగల బ్రాహ్మణులు దేవతామహిమలచేతఁ జెన్నొందుట యేమివింత యని యర్థము. అలం. శ్లేష. కావ్యలింగము.

తా. ఆపురమందలి బ్రాహ్మణులు విద్యలందు నేర్పరులై పురుషశ్రేష్ఠులై పండితులకుఁ గూడ గురువులై పుణ్యాత్ములై బుద్ధిశాలురై యజ్ఞరతులై దేవతామహిమలతో నుండిరి. (పురబ్రాహ్మణులు బ్రహ్మస్వరూపులు శివస్వరూపులు బృహస్పతి శుక్రస్వరూపులు నయి క్షితి దేవులుగావున దేవతాస్వరూపముతో నలరారు చుండిరని యర్థాంతరము.)

సీ. పగలైనఁ దెల్విఁ గో • ల్పడనిరాజులు శరంబులు చన్న వెలవెలఁ • బోనిఘనులు
ధనదాశఁ గేలుమో • డ్పనిసార్వభౌమాంకు లనివెన్కముందుఁ జూ • డనికుమారు
లరి మెచ్చఁ గరములు • నెరపనియినులు లాలమునవాలుమఱువని • పురుషసింహు
లనయంబు నడకఁ ద • ప్పనిగోత్రపతు లెప్పుడును సీదరము లేని • యనఘభోగు

తే. లౌరవీరనవీరన•వైకపరులు, వరలుదురు వీటఁ బుష్పవ•ద్వంశ్యు లగుటఁ
గువలయాధారకమలాను•గుణవిహార, సారసౌజన్యధరులు రా•జన్యవరులు. 98

ఈపద్యమునందు నధిష్ఠానపురమందలి రాజుల నభివర్ణించిచెప్పినాఁడు. పగలైనఁ దెల్విఁ గోల్పడనిరాజులు, పగలనఁగా విరోధములును దివాభాగమును, రాజులనఁగా క్షత్త్రియులుఁ జంద్రులును, తెల్వియనఁగా ముఖవికాసంబును గాంతియును, పగలైనన్ = విరోధములు ప్రసక్తమయినను, తెల్విఁ గోల్పడని=ముఖకాంతిఁదప్పని, రాజులు=రాజులైన క్షత్త్రియులు అనియర్థము. ఇందువలన రాజైన చంద్రుఁడు విరోధము ప్రసక్తమైనప్పుడు ముఖకాంతి దప్పెడువాఁడని తెలియఁబడుచున్నది. దివాభాగమందుఁ జంద్రుఁడు కాంతిహీనుఁడగుచున్నాఁడని భావము. ఇక్కడ నభేదాధ్యవసాయమూలకమైన వ్యతిరేకాలంకారము. ఉత్తరత్ర యీరీతిగా గ్రహింపవలయును. శరంబులు చన్న వెలవెలఁ బోని ఘనులు-శరములనఁగా బాణములును నీళ్లును, ఘనులనఁగా నధికులును మేఘములును, శరంబులు చన్నన్=బాణము చెల్లిపోఁగా, వెలవెలఁబోని తెల్లపోకయుండెడు, ఘనులు=అధికులైనరాజులు అని యర్థము. ఘనులైన మేఘములు బాణములు చెల్లిపోఁగానే తెల్లపోవునట్టి వనుట. ఉదకములువర్షింపఁబడఁగా మేఘములు తెల్లఁబడుచున్నవని భావము.

ధనదుఁడనఁగా ధనమిచ్చువాఁడును గుబేరుఁడును, ఆశయనఁగాఁ దృష్ణయును దిక్కును, సార్వభౌముఁడనఁగాఁ జక్రవర్తియును నుత్తరదిగ్గజమును, (ని. 'ఆశాతృష్ణాదిశాప్రోక్తా' అని వి.) (ని. 'సార్వభౌమ స్సర్వపృథ్వీపాలకే దిగ్గజాన్తరే' అని నా.) ధనదాశ=ధనమిచ్చువానియందలి యాశచేత, కేలుమోడ్పని=చేయిముడుచుకొని యాచింపని, సార్వభౌమాంకులు=చక్రవర్తిచిహ్నములు గలవారని యర్థము. సార్వభౌమనామక దిగ్గజము ధనదాశచే హస్తముపట్టి యడుగుకొనునది యనుట, కుబేరుని దిక్కునఁ దుండము ముడిచికొనియున్నదని భావము. కుమారుఁడనఁగా = రాజకుమారుఁడును గుమారస్వామియును, అనిన్=యుద్ధమందు, వెన్కముందుఁజూడని=సంకోచింపని, కుమారులు=కొమరుప్రాయముగల రాజులని యర్థము. కుమారస్వామి యుద్ధమందు వెనుకముందు చూచువాఁడనుట, షణ్ముఖుఁడు ముందుమూఁడుముఖములతోడను వెనుకమూఁడుముఖములతోడను జూచునని భావము.

అరియనఁగా శత్రువును జక్రవాకమును, కరములనఁగాఁ బన్నులును గిరణములును, ఇనుఁడనఁగాఁ బ్రభువును సూర్యుఁడును, అరమనఁగాఁజక్రాంగము. (ని. 'అరంశీఘ్రేచచక్రాఙ్గే' అని వి.) అరాణ్యస్యసంతియనెడు వ్యుత్పత్తిచేత నరియనఁగా బండిగారెకుఁ బేరు గనుకను బండిగారెపేళ్లన్నియుఁజక్రవాకములకుఁ జెల్లునుగనుకను నిక్కడ నరిశబ్దము చక్రవాకములయందును వర్తించుచున్నది. (ని. 'కోక శ్చక్ర శ్చక్రవాకో రథాఙ్గాహ్వయ నామకః' అని అ.) (ని. 'బలిహస్తాంశవః కరాః' అని అ.) (ని. 'ఇనస్సూర్యేఘనే రాజ్ఞి' అని అ.) అరిమెచ్చన్=శత్రువుమెచ్చునట్లుగాఁ బన్నులియ్యని ప్రభువులని యర్థము. ఇనుఁడైన సూర్యుఁడు శత్రువు మెచ్చునట్లుగాఁ బన్నిచ్చువాఁడనుట, సూర్యుఁడుచక్రవాకము మెచ్చునట్లుగాఁ గిరణప్రసారణము సేయుచున్నాఁడని భావము. వాలు=అనఁగాఁ గత్తి,పురుషసింహుఁడనఁగాఁ బురుషశ్రేష్ఠుఁడును, నరసింహుఁడును, ఆలమునన్=యుద్ధమందు, వాలుమఱువని=కత్తియేమఱని, పురుషసింహులు=పురుషశ్రేష్ఠులని యర్థము. నరసింహుఁడు యుద్ధమందుఁ గత్తి యేమఱినవాఁ డనుట. నరసింహుఁ డాయుధములేకయే హిరణ్యకశిపుని వధించినాఁడని భావము.

నడక యనఁగా నడవడియు, సంచారమును, గోత్రపతులనఁగాఁ గులపతులును బర్వతశ్రేష్ఠములును, అనయంబున్ = సర్వకాలమును, నడకఁదప్పని=నడవడిఁదప్పని, గోత్రపతులని=కులపతులని యర్థము. గోత్రపతులైన పర్వతశ్రేష్ఠములు నడవడి దప్పినవనుట. పర్వతము లెప్పుడును సంచారము లేకయుండునని భావము. సీదర మనఁగా శృంగారభావంబును కుబుసమును, భోగులనఁగా రాజులును సర్పములును, (ని. 'భోగీ భుజఙ్గమే రాజ్ఞి' అని వి.) ఎప్పుడును = ఏసమయమందును, సీదరములేని= జోఁతగొట్టుతనములేని,అనఘభోగులు=భోగపరులైన రాజులనియర్థము. సర్పములెప్పుడును సీదరముగా నుండునవియనుట. పాములు నిరంతరమును గుబుసము గలవియనియును భావము.

శౌరవీరన్=శౌరావీరు అనునట్లుగా, వీరనయైకపరులు = వీరనీతియందు ముఖ్యాసక్తిగలవారును, పుష్పవద్వంశ్యులగుటన్=పుష్పవంతులనఁగాఁ జంద్రసూర్యులు, (ని. 'ఏకయోక్త్యాపుష్పవంతౌ దివాకరనిశాకరౌ' అని అ.) వారివంశమందుఁ బుట్టినవారు పుష్పవద్వంశ్యులు, పుష్పవద్వంశ్యులగుటవల్ల, కువలయ=కలువలకు, ఆధార=ఆధారమైనదియు, కమలానుగుణ=పద్మముల కనుకూలమైనదియునగు, విహార=సంచారములుగలవారనియును, బుష్పవంతులవంశమందుఁబుట్టినవారుగనుకఁ బుష్పపరిపాలనము సేయుచున్నవారనియు నర్థద్వయము. కువలయమనఁగా భూవలయము, కమల అనఁగా, లక్ష్మియుఁ గావున భూవలయాధారరాజ్యలక్ష్మ్యనుగుణవిహారములు గలవారని భావము. సారసౌజన్యధరులు=యోగ్యమయిన సుజనత్వమును వహించినవారునయిన, రాజన్యవరులు=రాజశ్రేష్ఠులు, వీటన్ = అధిష్ఠానపురమందు, వరలుదురు=ప్రకాశింతురు.

ఇచట రాజఘనాదిపదములు శ్లేషించుటచేఁ బ్రకృతమాత్రమందు విశ్రమించిన శక్తిగలవైనను బగలైనఁదెల్విఁగోల్పడనీత్యాది వ్యతిరేకవిశేషముల సామర్థ్యముచేఁ దోఁచుచున్నచంద్రమేఘాదులయందు వైరకాలవైరూప్యాదిదోషములు దోఁచుటచేత రాజులయందుఁ జంద్రాది ప్రతియోగికవ్యతిరేకము దోఁచుచున్నది. అలం. వ్యతిరేకాలంకారధ్వని. సమాలంకారము.

తా. ఆపురమందలి రాజకుమారులు సూర్యచంద్రవంశజులు, భూభరణసమర్థులు, లక్ష్మీవిహితప్రవర్తనులును. ఇంతియకాక యెంతవిరోధమందేని ప్రతిభఁ గోల్పోవరు. బాణములుముగిసినను తెల్లఁబోరు. ఎన్నఁడును యాచింపరు. సంగరమున ముందువెనుకలు చూడరు. పన్నులు విశేషముగా విధింపరు. సంగరమునఁ గత్తి యేమఱరు. నీతిని దప్పరు. వారినడవడిలో జోఁతగొట్టుతనమనునది లేదు.

చ. చెలిపులిగూడు మానుపని॰శ్రీదుని గాదని మిత్రునక్షయో
జ్జ్వలవసుఁ జేయ మిత్రవసు॰సంపద కైనఘనావరోధము
న్వెలివడఁ జేయ నేర్తురు మ॰ణీవిపణీతపనీయరాశిపే
శలరుచిఁ గోటికోటివిల॰సద్ధ్వజకోటిఁ బురీకిరాటకుల్. 99

చెలి=స్నేహితుఁడైన హరునియొక్క, పులిగూడు=భిక్షాన్నమును, మానుపని=విడిపింపలేని, శ్రీదునిన్=కుబేరుని, కాదని=నిందించి, ఇక్కడ శ్రీదశబ్దము సాభిప్రాయము. పురీ=అధిష్ఠానపురమందలి, కిరాటకుల్=కోమట్లు, మణీవిపణీ=రత్నమయములైన యంగడివీథులయందలి, తపనీయరాశి=సువర్ణరాసులయొక్క, పేశలరుచిన్=నిద్దంపుకాంతిచేతను, కోటికోటి=ప్రతికోటిధనమందును, ఈశబ్దము లాక్షణికము. విలసత్ = ప్రకాశించుచున్న, ధ్వజకోటి=పడగలసమూహముచేతను, మిత్రున్=స్నేహితుఁ

డైనసూర్యుని, అక్షయ=అక్షయములేనిదియు, ఉజ్జ్వల=ప్రకాశమానమైనదియునగు, వసు=ధనము గలవానిఁగా, చేయన్=చేయుటకును,మిత్రవసుసంపదకైన ఘనావరోధము న్వెలివడఁజేయన్=అతని ధనసంపదకువచ్చిన ప్రబలవిరోధమును బోఁగొట్టుటకును, నేర్తురు=సమర్థులౌదురని యర్థము. (ని. 'మిత్రంసుహృదిమిత్రోర్కః' అని వి.) సుహృద్వాచకమైనమిత్రశబ్దము నిత్యనపుంసకమైనను బుంలింగ ప్రయోగంబును గలదు. (ని. 'క్వచిదర్థవిశేషేతుక్లీబేప్యుభయలిఙ్గతా') అని యథర్వణవచనము. (ని, 'దేవభేదే నరే రశ్మౌ వసూరత్నే ధనే వసు' అని అ.)

అనఁగానిష్టావాప్త్యనిష్ట పరిహారరూప ఫలద్వయ సంపాదకులౌదురనుట. సువర్ణరాసులయొక్క నిద్ధమైనకాంతిచేతను, నక్షయోజ్జ్వల వసుఁజేయనఁగా నక్షయరశ్మివంతునిఁ జేయను, రశ్మికిఁ దటస్థమైనఘనావరోధమనఁగా మేఘావరోధనమును, కోటికోటివిలసద్ధ్వజకోటిచేతను, అనఁగా ధ్వజపట జనితవాయువులచేతఁ బోఁగొట్టనేర్తురనిభావము. అనఁగా నాపట్టణమందుండెడుకోమట్లు సూర్యమండల మేఘమండలములపర్యంతమువ్యాపించియుండెడు సువర్ణరాసులును ధనరాసులును గలిగి కుబేరునిఁ దిరస్కరించుచున్నారని తాత్పర్యము. ఇచటఁ గోమట్లకుఁ గుబేరునికంటె ఆధిక్యమును వర్ణించుటవలన వ్యతిరేకాలంకారము.

తాను శ్రీదుఁడయ్యుఁ జెలికాని భిక్షావృత్తి బోఁగొట్టలేమి లోపము.కానసే వానిదిరస్కరించి మిత్రునకు వసుసంపదఁ గూర్చిరి. అంతఁబోక ఘనావరోధములఁ దొలఁగించిరి. కానపురీకిరాటులు మిత్రజనోపకారులు. ఇంతియేగాక వారికోటు లపరిమితిగల ధనరాసులుగూడఁ గోటులైయున్నవిగాన నైశ్వర్యమునను మిన్నలె.

తా. కుబేరుఁడు తనచెలికాఁడగు శివుఁడు భిక్షాన్న మారగించుట నివారింపనందులకుఁ బురవైశ్యులు నిరసించి తాము మిత్రునకు (సూర్యునకుఁజెలికానికి) వసుసంపద (కిరణసమృద్ధిధనము) తమ సువర్ణరాసులకాంతులచే సమకూర్చి వారికిఁగల్గు ఘనమేఘములవలని (గొప్పవియగు) నిర్బంధములు కోటలపై నెత్తిన టెక్కెముల సాహాయ్యమున నివారింపఁగలిగిరి.

మ. బలిచూడామణు లందు విష్ణుపదజుల్ • పాటించు ధాన్యంపుఁది
ప్పలు చంద్రామృతసాంద్ర సేకమునఁ బై • పై మోసు లెత్తంగఁ ద
త్కలమాంకూరపుఁబంపు మేయునెలజిం•కన్ సారె వారించు వా
రలతోఁబుట్టువు గంగ పద్మముఖని•ర్యద్భృంగనాదాగ్భటిన్. 100

బలిచూడామణులు=బలవంతులలో శ్రేష్ఠులైన యని యర్థము. శూద్రులు విష్ణుపదజులుగనుక బలిచక్రవర్తి శిరోభాగము విష్ణుపాదాక్రాంతమైనందున దానికిఁ జూడారత్నములని ప్రకారాంతరము. విష్ణుపదజుల్=శూద్రులు, అందనెడుపదము తత్రార్థమైన దేశ్యపదము. (న. 'సాశ్రయానాశ్రయాపిస్యాత్తత్రార్థగతసప్తమీ' అని యథర్వణోక్తి.) అందున్=ఆ పట్టణమందు, పాటించు=రచించునట్టి, ధాన్యంపుఁదిప్పలు=ధాన్యరాసులు, చంద్రామృతసాంద్రసేకమునన్=చంద్రసంబంధమైన యమృతము యొక్క దట్టమైన తడుపుటవలన, పైపైమోసు లెత్తంగన్=పైపైని మొలకలెత్తఁగా, తత్కలమాంకూరపు=ఆవరిమొక్కపైరుయొక్క, పంపు=ప్రదేశమును, మేయు=తినునట్టి, నెలజింకన్=చంద్రునిలోనున్న జింకను, వారలతోఁబుట్టువు=ఆ శూద్రులకుఁ దోఁడఁబుట్టినదైన, అనఁగా శూద్రులును గంగయును విష్ణుపాదమందుఁ బుట్టినారుగనుక వారలతోఁబుట్టువని చెప్పినాఁడు, గంగ=ఆకాశగంగ,

పద్మముఖ=పద్మమనెడు ముఖములవలన, నిర్యత్=బయలువెడలుచున్న, భృంగనాద = తుమ్మెదలయొక్క ఝుంకారమనెడు, ఆర్భటిన్=అంతుచేత, సారెన్=మాటిమాటికిని, వారించున్ = మేయకుండఁ బోలును, అనఁగా నాపట్టణమందుండు శూద్రులు పండించుధాన్యరాసులు చంద్రమండలము నంటియుండు ననుట. విష్ణుపదజుల్పండించు, అని పాఠాంతరము. అలం—కావ్యలింగము.

చంద్రుఁడు ప్రకాశించుటయుఁ దామరపూవులు వికసించుటయు నేకకాలమునందు జరుగవనియుఁ గవి రెంటి నేకకాలమునఁ జెప్పుట యొకదోషమని కొందఱందురు. కాని యట్టిదోషమునకిట నవకాశములేదు. (ముకుళించిన) తామరపూవులనుండి తుమ్మెదలధ్వని బయలువెడలుట చెప్పఁబడుటచే నిదియుక్తియుక్తము.

తా. ఆపురమునందలి శూద్రులు ధాన్యరాసులు చంద్రమండలము నంటునటులఁ బోయఁ జంద్రామృత సేకమునఁ బైభాగమున మొలకలెత్తెను. చంద్రునియందలి లేడి యామొలకల మేయఁబోవ శూద్రులతోఁబుట్టువగు గంగ పద్మముఖమునుండి వెలువడు తుమ్మెదల నాదముచే నాలేడిని వారింపసాగెను.

చ. పరబలభంగచంగము ల•భంగురతుంగమతంగజంబు ల
ప్పురిఁ బరికీర్ణకర్ణపుట•పూరితభూరితరానిలాహతి
న్విరియఁగఁ దోల మేఘములు • నింగిఁ దొలంగి తదంఘ్రిమూలముల్
శరణము నందఁ బోలు నని•శంబు పదంబుమదంబు పేరిటన్. 101

పరబల=శత్రుసైన్యముయొక్క, భంగ=భంగక్రియయందు, చంగములు = సమర్థములైనట్టియు, అభంగుర=జయవిపర్యయములేనట్టియు, తుంగ=అత్యున్నతములైనట్టి, మతంగజంబులు=ఏనుఁగులు, అప్పురిన్=ఆపట్టణమందు, పరికీర్ణ=మిక్కిలివ్యాప్తమైనదియు, కర్ణపుటపూరిత=దొప్పలవంటి కర్ణద్వయముచేత నిండింపఁబడినదియు, భూరితర=అత్యధికమైనదియునగు, అనిల=వాయువుయొక్క, ఆహతిన్ = తాఁకుడుచేత, విరియఁగన్ = విచ్చిపోవునట్టులుగా, తోలన్ = పారఁగొట్టఁగా, మేఘములు=మొయిళ్లు, నింగిఁదొలంగి=ఆకాశమునువిడిచి, తదంఘ్రిమూలముల్=ఆయేనుఁగులయొక్క పాదములనుగూర్చి, శరణమునందఁబోలున్ = శరణుఁజొచ్చియుండఁబోలును. ఏలాగనిన, అనిశంబు=నిరంతరమును, పదంబుమదంబు పేరిటన్ = పాదములవలనఁబుట్టెడు మదవ్యాజముచేత, శరణము నందఁబోలునని సంబంధము. ఏనుఁగులకుఁ గపోలద్వయాదులైన యష్టస్థానములయం దష్టమదములు పుట్టుచున్నవనియు నందుఁ బాదములయందు మేఘమను మదముపుట్టుచున్నదనియుఁ దెలియునది. ఇందుకు-

శ్లో. 'దానం కపోలయో స్సిధురణ్ణో శ్శ్రోత్రోస్తు సాగరః,
కరాగ్రే శీకర స్సిక్యం స్తనాగ్రే మేహనే మదః.
హృదయే ఘర్మసలిలం మేఘస్తు చరణవ్రజే,
సఞ్జ్ఞయాష్టమదా హ్యేతే జాయన్తే భద్రదన్తినామ్.'

అని యమరశేషమునఁ జెప్పఁబడియున్నది. అనఁగా నాపట్టణమందలి యేనుఁగులు మేఘమండల పర్యంతమైన పొడవుగలిగి యున్నవని యాశయము. అలం. అతిశయోక్తి. ఉత్ప్రేక్ష. అపహ్నవము.

తా. విరోధులబలములను రూపుమాపు నాపురమాతంగములు చెవిగాడ్పులతో నింగినున్న మేఘములను విరియఁదోలనవి (యేనుఁగులపాదములను బుట్టుమదజలముపేరు మేఘము గావున) మద వ్యాజమున నేనుఁగులను శరణు గోరుచుండవచ్చును.

మహాస్రగ్ధర. పరభూభృత్ప్రాప్తినబ్ధిం • బడురవిహరులం • బ్రౌఢిఁ బాటింప వెందున్
సరిగాఁ దద్ధిక్కృతులై న్సైచక రవి హరి యై • చాయకున్ రా నడంచుం
జరణోద్యద్ధూళిఁ దద్వాసతఁ దగుహరియున్ • సప్తిగాఁ బాదధారా
స్ఫురణం బేవింతయంచుం • బురిహరులు నగుం • బూర్ణధారాసమృద్ధిన్. 102

ఈపద్యమున నధిష్ఠానపురమందలి యశ్వములవర్ణించినాఁడు. ఏలాగనిన, పురి=ఆపట్టణసంబంధమైన, హరులు=గుఱ్ఱములు, పరభూభృత్ప్రాప్తిన్=శత్రురాజప్రాప్తివలన (భయపడి), (ని. 'భూభృద్భూమిధరే నృపే' అని అ) అబ్ధింబడు=సముద్రముఁగోఁ బడునట్టి, రవిహరులన్=సూర్యాశ్వములను, ప్రౌఢిన్=ప్రౌఢిమచేత, సరిగాన్=తమకు సమానమానట్టులుగా, ఎందున్=ఏసమయమందును, పాటింపవు=విచారింపవు అని యర్థము. సూర్యాశ్వము లస్తాచలప్రాప్తిచేత సముద్రములో మునుఁగుచున్నవనిభావము. తద్ధిక్కృతులై న్సైచక=తనగుఱ్ఱములయొక్క యవమానములను సహింపక, రవి=సూర్యుఁడు, హరియై=తానుగుఱ్ఱమై, చాయకున్ రాన్=పోలికకు రాఁజాలఁడుగా, చరణోద్యద్ధూళిన్=గొరిసెలవల్ల నెగురుచున్న పరాగముచేత, అడంచున్=అడఁచును అనియర్థము. సూర్యుఁడు హరియనెడు నామముగలవాఁడనియును లేక సంజ్ఞాదేవి నూఱడించుకొఱకు నశ్వమయినాఁడనియును మధ్యాహ్నసమయమందు నీడక్రిందికి జలపానార్థమయివచ్చు గుఱ్ఱములయొక్క ఖురధూళిచేత నాచ్ఛాదితుఁ డగుచున్నాఁడనియును భావము. తద్వాసతఁదగు, ఆసూర్యునియందలి నివాసత్వముచేత నొప్పుచున్న, హరియున్=విష్ణుదేవుఁడును, (శ్లో. 'ధ్యేయస్సదా సవితృమండలమధ్యవర్తీ నారాయణః' అని యున్నది.) సప్తిగాన్=సూర్యతిరస్కారమును సహింపక తాను గుఱ్ఱముగాఁగా, పాదధారాస్ఫురణం బేవింతయంచున్=ధారయనఁగా నాస్కందితము, (ధౌరితకము, రేచితము, వల్గితము, ప్లుతము అనెడు గతిభేదములకుఁ బేరు.) పూర్ణత్వములేక పాతికపాలయిన ధారాస్ఫురణ మేమి యాశ్చర్యమని పలుకుచు, పూర్ణధారాసమృద్ధిన్=సంపూర్ణమయినధారాసమృద్ధిచేత, నగున్=పరిహాసము సేయునని యర్థము. విష్ణుదేవుఁడు హయగ్రీవమూర్తియైనాఁడనియును బాదమందు గంగాజలధారాస్ఫురణము గలవాఁ డనియును భావము. (ని. 'పాదారశ్మ్యంఘ్రితుర్యాంశాః' అని అ.) (శ్లో. 'ఆస్కన్దితం ధౌరితకం రేచితం వల్గితం ప్లుతమ్, గతయోమూః పఞ్చధారాః' అని అ.) అనఁగా నధిష్ఠానపురమందలి గుఱ్ఱములు సూర్యాశ్వములు మొదలైనవానిఁ దిరస్కరించిన వేగముగలవని ఫలితార్థము.

ఇందు సూర్యాశ్వములకు సముద్రపతనమునుగూర్చి శ్లేషచే ననుగ్రహింపఁబడిన పరరాజప్రాప్తిని హేతువుగాఁజెప్పుటవలన హేతూత్ప్రేక్ష. మఱియు సూర్యవిష్ణువుల కశ్వత్వమునొందుటకు నిజాశ్వపరిభవాసహత్వమును సూర్యమండలవాసమును హేతువులుగాఁ జెప్పుటవలన రెండుహేతూత్ప్రేక్షలు. ఈమూఁడిటికి సంకరము. ఇది మహాస్రగ్ధరావృత్తము. 'లసదుద్యత్కీర్తివల్లీ లలితగుణగణాలంకృతాంగా సతాన, స్థసరాగంబు ల్మహాస్రగ్ధరకు పసమునిస్థాన విశ్రాంతియొప్పన్' అని లక్షణము.

తా. ఆపురమునందలి యశ్వములు సూర్యుని యశ్వములను దిరస్కరించును. అవమానము సహింపక మింటిమొగమున నవి పైకిరాఁగా గిట్టలదుమ్ముచేఁగప్పును. సూర్యమండలస్థుఁడగు విష్ణువు గుఱ్ఱమై యెదిరింపరాఁగాఁ బాదధారాస్థితికిఁ బరిహసించి పంచధారాప్రశస్తిచేఁ బరాభవించును.

మ. అలఘుస్యందనకోటి వీటిమణిర◆థ్యావాటికాహాటకా
కలితక్షోణుల నేగుచోఁ జటులచ◆క్రక్షుణ్ణతత్క్షోదముల్
గలయం బర్వి సుపర్వలోకనదిలో◆ గాంగేయపంకంబు జొ
బ్బిలఁ జేయం దఱుచై జనించి యచటం◆ బెం పొందుఁ బొందామరల్. 103

అలఘుస్యందనకోటి=అధికమయినరథసమూహము, వీటి=పట్టణముయొక్క, మణి=రత్నస్థాపితములయిన, రథ్యావాటికా=రథ్యయనఁగా రథములకు హితమైనత్రోవ, (ని. 'రథ్యాప్రతోళీవిశిఖా' అని అ.) వానియొక్క శ్రేణియందలి, హాటకాకలిత క్షోణులన్=సువర్ణమయములైన కట్టడపునేలలయందు, ఏగుచోన్=పోవుచుండెడు సమయమందు, చటుల=చంచలములైన, చక్ర=బండికండ్లచేత, క్షుణ్ణ=నలిగిన, తత్క్షోదముల్=ఆబంగారపు చూర్ణములు, కలయంబర్వి=అంతటఁ గలయఁబ్రాకి, సుపర్వలోకనదిలోన్=దేవతానదియైన యాకాశగంగలో, గాంగేయపంకంబు జొబ్బిలఁ జేయన్=బంగారపు బురదను ఉప్పొంగునట్లు చేయఁగా, (ని. 'తపనీయం శాతకుంభం గాఙ్గేయం భర్మ కర్బురమ్' అని అ.) తఱుచైజనించి=దట్టమైజన్మించి, అచటన్=ఆయాకాశగంగయందు, పొందామరలు=బంగారపు కమలములు, పెంపొందున్ = వృద్ధిఁబొందుచుండును. ఇచట రథ్యాపరాగములకు నాకాశగంగయందు వ్యాపించుటకు సంబంధము లేకున్నను సంబంధముఁ జెప్పుటచేత నతిశయోక్త్యలంకారము.

పొందామర, పొన్ను + తామర పొందామర. సూ. సమాసంబులందుఁ బ్రాఁతాదుల తొలియచ్చుమీఁదివర్ణంబులకు లోపంబు లుప్తశేషంబులకుఁ బరుషంబులు పరంబగునపుడు నుగాగమంబగు ననుసూత్రములచేఁ బైరూపసిద్ధి.

స్యందనములు అలఘు అనుటచే భారముగనున్నవనియుఁ గోటియనుటచే నసంఖ్యాకములనియుఁ జక్రక్షుణ్ణము చటులము లగుటవలననే క్షోదము జనించినదనియు నది కలయఁబర్వుటవలననే యాకాశగంగలోన సైతముఁ బడెనని యాశయము.

తా. ఆవీటి రాచబాటలు బంగారుకట్టడములుగలవి గావున రథము లాప్రదేశమునఁ బోవుటచే బంగారుధూళి లేచి యాకాశగంగలోఁ బడఁగా నందు బంగారు తామరలు జనించెను.

క. అన్నగరనాట్యశాలలఁ, జెన్నగుమురజములరవళిఁ◆ చే నటియించుచ్
గన్నియలకన్న మున్నుగఁ, బన్నగభుక్తతులు దృష్టి◆పాత్రము లగుచున్. 104

అన్నగర=ఆయధిష్ఠానపురసంబంధములైన, నాట్యశాలలన్=నాటకశాలలయందు, చెన్నగు=ఒప్పిదమగుచున్న, మురజములరవళిచేన్=మృదంగములయొక్క నాదములచేత, (ని. 'మృదఙ్గా మురజాః' అని అ.) కన్నియలకన్నమున్నుగన్=నాట్యముచేయవలయు పడుచులకంటెముందుగా, పన్నగభుక్=నెమళ్ళయొక్క, తతులు=సమూహములు, ని. 'మయూరో బర్హిణో బర్హీ నీలకణ్ఠో భుజఙ్గభుక్' అని అ. దృష్టిపాత్రములగుచున్ = దర్శనయోగ్యములగుచు, (స. 'దృష్టియుక్తందృష్టిసదృశచిహ్న

యుక్తం + పాత్రంపత్రసమాహారోయేషాంతే') అనెడు సమాసముచేత దృష్టిసదృశములైన చిహ్నముల తోఁగూడిన యీఁకలుగలవగుచు అని యర్థద్వయము, నటియించుచున్=నాట్యముసేయును. నెమలి యీఁకలమీఁదఁ గన్నులవలెఁ బొడలు గలిగియుండుట ప్రకటము. మృదంగధ్వనియందు మేఘధ్వని భ్రాంతి జనించెనని భావము. ఇందు భ్రాంతిమదలంకారము వ్యంగ్యము. శ్లో. 'కవిసమ్మతసాదృశ్యా ద్విషయేపిహితాత్మని, ఆరోప్యమాణానుభవోయత్రసభ్రాంతిమాన్ మతః' అని లక్షణము. అదియును నటనరూపవాచ్యసిద్ధ్యంగమైనది గావున గుణీభూతవ్యంగ్యము.

తా. ఆనగరమునందలి నాట్యశాలలలోని మద్దెలల మ్రోఁత లుఱుములనుకొని నృత్యము నేర్చు చెలువలకంటె మున్నుగ నెమిళ్లు నటింపసాగును.

ఉ. చందనగంధు లిందుమణిసౌధతలంబుల గొండ్లి సల్పఁగా
నందలిదివ్యచిత్రములయం దొకరై యనిమేషభామినుల్
కందళితాద్భుతస్ఫురణఁ గన్గొని తన్నటనాంతగీతని
ష్యందసజీవచిత్రములసందడి నేగుదు రప్పురంబునన్. 105

అప్పురంబునన్=ఆయధిష్ఠానపురమందు, చందనగంధులు = స్త్రీలు, ఇందుమణిసౌధతలంబులన్ =చంద్రకాంతమణి నిర్మితములైన మేడలయందు, గొండ్లిసల్పఁగాన్=నాట్యము సేయఁగా, అందలి దివ్యచిత్రములయం దొకరై = ఆమేడలయందలి దివ్యములైన చిత్రప్రతిమలయందుఁ దాము నొక చిత్రప్రతిమలవలె నున్నవారై, అందలి యన్నచోట నల్యాగమము వచ్చినందునకు, (సూ. 'జేరలిచ' అని న.) (శ్లో. 'అల్యాగమస్స్యా దద్విద్వోః' అని యథర్వణవచనము.) అనిమేషభామినుల్= ఱెప్పపాటులేని దేవతాస్త్రీలు, ఇక్కడి దేవతాస్త్రీలు ఱెప్పపాటు లేనివారు గనుక ఱెప్పపాటు లేని చిత్తరువు బొమ్మలలోఁ గలిసి యేర్పడకయుండిరని యాశయము. కందళిత=అంకురించుచున్న, అద్భుతస్ఫురణన్=ఆశ్చర్యస్ఫూర్తిచేత, కన్గొని=ఆయాటచూచి, తన్నటనాంత=ఆనాట్యపుతీరుగడ యందలి, గీత=గానామృతముయొక్క, నిష్యంద=ప్రసరముచేత, సజీవ=ప్రాణయుక్తములైన, చిత్రముల=చిత్తరువుబొమ్మలయొక్క, సందడిన్=తొట్రుపాటునందు, ఏగుదురు=పోవుచుందురు. అనఁగా నాపట్టణమందలి మేడలు స్వర్గము నంటియున్నవనియు నక్కడనున్న స్త్రీలయొక్కనాట్య మప్సర స్త్రీలకును వింతయై కనుపడుచున్నదనియు నా నాట్యమందు జరిగెడు గానరసమందు నచేతన ములను సచేతనములుగాఁ జేయుసామర్థ్యము గలిగి యున్నదనియుఁ దాత్పర్యము. అలంకారము సామాన్యము.

వేల్పుచెలువలు చిత్రములలోఁ గలసిపోవుటకు అనిమేషభామినులగుట తోడ్పడినది. అంగ చలనముచే ద్యోతకము కాకుంటకు అద్భుతస్ఫురణవలని మ్రాన్పాటు తోడైనది. ఆశ్చర్యమువలన మ్రాన్పాటు కలుగుననుటకు-

శ్లో. స్తంభోహర్షభయామర్ష విషాదాద్భుతసంభవః
అనుభావా భవం త్యేతే స్తంభస్య మునిసమ్మతాః.
అద్భుతాద్యథా. తద్గీతశ్రవణైకాగ్రా సంసదశ్రుముఖీబభౌ
హిమనిష్యందినీప్రాతః నివాతేవనస్థలీ.

అత్ర కుశలవగీతమాధుర్యాతిశయేన శ్రవణైకాగ్రతారూప విస్మయేన స్తంభః.

తా. చెలువలు మేడలపై నాట్యముచేయుచుండ వేల్పుచెలులు చూడవచ్చి ములలోఁగలసి యొరుల గురుతింపరానటుల వర్తించి గానామృతప్రసరణమునఁ జిత్రప్ర చలించుచుండ నాసందడిలోఁ దమదారిని బోవుదురు.

చ. ఒనరుఁ బురాధిరాజమున ♦ నుజ్జ్వలవజ్రకలాపగోపురా
గ్రనిహితహేమకుంభములు ♦ గాంగహిరణ్మయకంజమంజిమం
దనరఁగ నిక్కి దిక్కరుల♦తండము తుండము సాఁచు నంచునుం
చినవెఱబొమ్మలో యనఁగఁ ♦ జిత్రితసాంద్రమృగేంద్రరూపముల్.

పురాధిరాజమునన్=అధిష్ఠానపట్టణశ్రేష్ఠమునందు, ఉజ్జ్వల=ప్రకాశమానములైన మణులయొక్క, కలాప=సముదాయముతోఁగూడిన, గోపుర=పురద్వారములయొక్క భాగములయందు, నిహిత=ఉంచఁబడిన, హేమకుంభములు=బంగారపు కలశములు, రంతు గోపురమ్' అని అ. గాంగ=ఆకాశగంగా సంబంధమైన, హిరణ్మయకంజ=సు యొక్క, మంజిమన్=సౌందర్యముచేత, అనఁగా సువర్ణకమలములవలె, తనరఁగన్=ఒ నిక్కి=పైకి నుబికి, దిక్కరులతండము=దిగ్గజములసమూహము, తుండముసాఁచునంచున్ జాఁపి పట్టఁబోవునని, ఏనుఁగులు తుండములతోఁ గమలములంబట్టి త్రెంచివైచు వాడు సువర్ణకమలభ్రాంతిచేతఁ బట్టి పెకలింపఁ బోవునని తాత్పర్యము. ఉంచినవెఱబొమ్మలో నిలిపిన బెదురు జంత్రపురూపములో యన్నట్టులుగా, చిత్రితసాంద్రమృగేంద్రరూపః చిన దట్టమైన సింహరూపములు, ఒనరున్=ఒప్పుచుండును. అనఁగా గోపురాగ్ర సువ గోపురస్థాపితములైన వజ్రమణులయొక్క తెల్లని కాంతులపైని స్వచ్ఛమైన యాకాశగఁ ప్రకాశించెడు సువర్ణకమలములవలె నుండెననియు నాకలశములు దిగ్గజములను మించి భావము. ఇచట గోపురాగ్ర సువర్ణకలశముల నాకాశగంగాకమలములనుగా నుత్ప్రే స్వరూపోత్ప్రేక్ష. అచట సింహప్రతిమాస్థాపనమునకు దిగ్గజకర ప్రసారణనివృత్తిఫలము క్షించుటవలన ఫలోత్ప్రేక్ష.

తా. గోపురములపైఁగల కనకకలశములు బంగారు తామరపూవులని దిగ్గజములు సాచకుండుటకై నెలకొల్పిన వెఱపుబొమ్మలవలెఁ బురమునందుఁ జిత్రితములై సింహప్ర బడుచుండును.

సీ. ఘనులఁగొండలపాలు♦గాఁజేసినకొఱంత ద్విజరాజు నెపుడుఁ గుం♦దిం
కువలయంబు దినంబుఁ♦గూల్చునాడిక బంధుజీవ మామోదిగాఁ ♦ జేం
కల్యాణగోత్రంబు♦గరిమ వంచినదూరు సరసుల నింకించు♦పరుసఁదనము
దానికే ల్వసులక్ష్మిఁ ♦ బూనఁ జేయనిరట్టు తమ్ములఁ బంకాప్తిఁ♦దార్చు;
తే. నలువ వారించుకొని యోఁ ద♦న్నగరసతుల
నెఱికురులు ముద్దుమోములు ♦ నిడుదకన్ను
లలతిమోవులు బిగిగుబ్బ ♦ లరిదినాభు
లలరుఁదొడలును మృదుపద♦ంబులు నొనర్చి.

౦ంగొండలపాలుగాఁ జేసినకొఅంత=ఘనులనఁగా మహాత్ములును మేఘములును,మహాత్ములైన
ాలుగాఁజేసిన తక్కువ యని యర్థము. మేఘములను బర్వతములయందు వ్యాపింపఁ
ావము. ద్విజరాజు నెపుడుఁగుందించుకొదవ=ద్విజరాజనఁగా బ్రాహ్మణోత్తముఁడును, చం
ాహ్మణోత్తముని నెల్లకాలము విచారపడఁజేసిన వెలితియని యర్థము. చంద్రునిఁ బ్రతిపక్ష
ింపఁ జేసినాఁడని భావము. కువలయంబుదినంబుఁ గూల్చునాడిక=కువలయమనఁగా
ము, గలువయును, భూవలయమును బ్రతిదినమును గూలిపోవునట్లుచేసిన యపవాదమని
వలను దివాభాగమందు ముకుళింపఁజేసినాఁడని భావము. బంధుజీవమామోదిగాఁజేయ
వమనఁగా బంధుజనజీవంబును, మంకెనపువ్వును, బంధుజనుల జీవమును సంతోషముగల
కపోయిననింద యని యర్థము. మంకెనపువ్వును పరిమళహీనమైనదానిగాఁ జేసినాఁడని

బన్ధూకో బన్ధుజీవకః' అని అ.) కళ్యాణగోత్రంబుగరిమవంచినదూరు=కళ్యాణగోత్ర
ళకరమైన వంశమును, కాంచనాచలమును, ని. 'కల్యాణ మక్షయే స్వర్గే మఙ్గళేపి న
మే. మంగళకరమైన వంశముయొక్క గౌరవమును బోఁగొట్టినదూషణయని యర్థము,
ుక్క యౌన్నత్యమును వంచి హరునకు విల్లుగాఁజేసినాఁడని భావము. సరసులనింకించు
రసులనఁగా రసజ్ఞులును, సరోవరములును, రసజ్ఞులైనవారిని దగ్గుపఱిచిన పరుషత్వమని
వరముల నెండకాలమందింకిపోవునట్టులు చేసినాఁడని భావము. దానికేల్వసులక్ష్మిఁ
ట్టు=దానియనఁగా దాతయు, నేనుఁగును, కేలనఁగా హస్తంబును, గజతుండంబును,
ా ధనసంపదయును, గాంతిసంపదయును, దాతయొక్క హస్తము ధనసంపదను వహిం
ునరద్దియని యర్థము, ఏనుఁగుతుండము కాంతిసంపదను వహింపఁజేసినాఁడు గాఁడని
ుఁ బంకాప్తిఁ దార్చునగడు=తమ్ములనఁగా సోదరులును, దామరలును, పంకమనఁగాఁ
దయును, సోదరులను బాపప్రాప్తియందుఁ బొందించిన రవ్వయని యర్థము, తామ
లుచేసినాఁడని భావము.

బ్రహ్మదేవుఁడు, తన్నగరసతుల=ఆయధిష్ఠానపురస్త్రీలయొక్క, నెఱికురులు=చక్కని
ు, ముద్దుమోములు = మనోహరములైన మొగంబులను, నిడుదకన్నులు=నోఁగలైన
ి మోవులు=సన్నపుపెదవులను, బిగిగుబ్బలు=దృఢములైనకుచంబులను, అరిదినాభులు=
ను, అలరుఁదొడలును=ఒప్పిదమయినతొడలను, మృదుపదంబులును=కోమలములైన
నర్చి = సృజించి, వారించుకొనియెన్ = నివారించుకొనియెను. ఘనులఁ గొండలపా
అంత యనునది మొదలుకొని తమ్ములఁబంకాప్తిఁ దార్చునగడు అనుపర్యంతంబును సం
ుపవాదంబును బోఁగొట్టుకొనెనని యర్థము. మేఘంబులనుఁ గొండలపాలుగాఁ జే
ుసునది మొదలుకొని తామరలను బురదపాలుచేసిన యగడు, అనెడు పర్యంతము
లగుచున్న మేఘాదు లుపమానంబు లగుచున్నట్టులుగా శిరోజంబులు మొదలైన యవ
ృజించినాఁడని భావము. ఇది క్రమాలంకారము. శీర్షాది పాదపర్యంతంబు వర్ణించి

తా. నాపట్టణపుస్త్రీలు మేఘంబులవంటి నల్లని తలవెండ్రుకలును, జంద్రునివంటి మనోహరంబులైన మొగంబులును, గలువఱేకులవంటి సోఁగలైన కన్నులును, మంకెనపువ్వువంటి యెఱ్ఱని పెదవులును, బంగారుకొండలవంటి బటువైన చన్నులును, సరోవరంబులవంటిలోఁతుగల నాభులును, నేనుఁగుతుండంబులవంటి చక్కనితొడలును, తామరపువ్వులవంటి మృదువైనపాదంబులును గలవారని ఫలితార్థము. అలంకారము రూపకము. యథాసంఖ్యము.

మ. పురిపూఁదోఁటలతావి మిన్నలమ వేల్పుల్ మెచ్చి తదూ్భజభా
స్వరసంతానములన్ దివిం బెనుప నా•సంతానముల్ దివ్యని
ర్ఝరిణీనిర్మలవారిపూరపరిపో•షం బందియుం దన్మహా
తరులక్ష్మీపరిపూర్తి గాన కెసఁగెం • దత్కల్పశాఖిప్రథన్. 108

పురి=ఆయధిష్ఠానపురసంబంధమైన, పూఁదోఁటల = పువ్వుతోఁటలయొక్క, తావి=పరిమళము, మిన్నలమన్=ఆకాశము నావరింపఁగా, వేల్పుల్మెచ్చి=దేవతలాపరిమళమును మెచ్చి, తదూ్భజ=ఆపువ్వులచెట్లయొక్క, భాస్వరసంతానములన్=ప్రకాశమానములైన పిలకలను, దివింబెనుపన్=స్వర్గమందు నాటి పెంపుసేయఁగా, ఆసంతానములు=ఆపిలకలు, దివ్యనిర్ఝరిణీ=ఆకాశగంగయొక్క, నిర్మల=స్వచ్ఛమైన, వారిపూర=జలసమృద్ధిచేత, పరిపోషంబందియున్=మిక్కిలి పోషణముఁ జెందినదయ్యును, తన్మహాతరులక్ష్మీపరిపూర్తిఁగానక = ఆమొదటిచెట్లయొక్క శోభాసమృద్ధిని బొందఁజాలక, తత్కల్పశాఖిప్రథన్=వానికంటెఁగొంచెముతక్కువైనవియను ప్రసిద్ధిచేత, ఎసఁగెన్=ప్రకాశించెను, అనియర్థము. కల్పప్రత్యయ మీషదసమాప్తియందుఁ జెప్పఁబడి యున్నది. దేవతరుపంచకమునకును గల్పతరువ్యవహారము గలదు గనుక సంతానములు తత్కల్పశాఖిప్రథనఁగాఁ బ్రసిద్ధమైన కల్పవృక్షవ్యవహారముచేతఁ బ్రకాశించె ననిభావము. అనఁగా నాపట్టణోద్యానములయందలి వృక్షములు స్వర్గమందుండెడు కల్పవృక్షములకంటె నతిశయించి యున్నవని యాశయము. పూఁదోఁటయనుచోట పూవుతోఁట యని యుండఁగా ప్రాతాదిగణములోనిది గనుక తొలియచ్చుమీఁదివర్ణములకు లోపమును శేషమునకు నుగాగమమును దాని కనుస్వారాదేశమును రాఁగాఁ బూఁదోఁట అను రూపము. ఇచట దేవవృక్షములకు యోగముచే నన్యార్థకల్పనవలన నిరుక్త్యలంకారము. అతిశయోక్తియు.

దేవ భూరుహములకు సంతానము లనుపేరువచ్చుట భూమిలోని వృక్షముల సంతతి యగుటవలననియుఁ గల్పవృక్షములని పేరువచ్చుటసుగంధాదులయందు భూలోకవృక్షములకంటె తక్కువయై యుంటవలననే యని యాశయము.

తా. పురమునందలి పూఁదోఁటలతావులు మిన్నంట వేలుపులు మెచ్చి యాపూఁదోఁటల మొలకలు కొన్ని స్వర్గమున వేల్పులు నాటిరి. ఆమొలకల నాకాశగంగాజలముచేఁ బెంపొందించిరి. అవి భూలోకవృక్షములకంటెఁ గొఱఁతఁబడియుంటచేఁ గల్పవృక్షము లని పేరొందెను.

సీ. పొన్నపూ వోడి నేల•పొదివితే చెలి యది పొడమె బల్దీవిపైఁ•బొదువ వలదె
చెలువమూటికితి వేల • కలువచా లదియుఁ గప్పఁగ రాదె మిన్నుల•బావికడది
మొగడతమ్ములనేల•మూసి తేసతి మూయఁ దగదె మానసభూని•ధానము లవి
తరుణి పూరెమ్మ యే•త్తవదేల యది హేమశిఖరిదాపుది బయ•ల్సేయఁదగునె

తే. యనుచు రసమర్మసరసోక్తు లాడునట్టి, జట్టికాండ్ర యథోచిత సరసవచన
రచనఁ దేల్చుచు వివిధవిభ్రమమువరల, విరులువిలుతురుపుష్పలావికలు వీట.

పద్యములో నధిష్ఠానపురమందలి పువ్వులమ్మెడు పడుచులతోఁ బువ్వులుకొనవచ్చిన కోడెకాండ్రు పలికెడు మర్మగర్భిత నర్మవాక్యములకు నారీతిన ప్రత్యుత్తరములిచ్చుచు వారు పువ్వులమ్ముటను వర్ణించినాఁడు. ఏలాగన్నను,

పొన్నపూ వోడిసేలపొదివితేచెలి యదిపొడమె బల్దీవిపైఁ బోదువవలదె=ఇక్కడఁ బొన్నపూవుపమానము నాభి యుపమేయము, బల్దీవి యుపమానము జఘన ముపమేయము. ఉపమానములచేత నుపమేయముల గ్రహింపవలయును. ఇది రూపకాతిశయోక్త్యలంకారము. శ్లో. 'రూపకాతిశయోక్తిస్స్యా న్నిగీర్యాధ్యవసానతః' అని లక్షణము. నాభి నోడిలోఁగనుపడకుండఁ బొదువుకొన్నా వేమే యని మర్మము, పొన్నపువ్వును జూపక యొడిలో దాచినావేమేయని మర్మగర్భితమైన నర్మము. [ఇది జట్టికాండ్ర ప్రశ్నము] అది, ఆనాభి = జఘనముమీఁదం బొడమెను బొదువవలదా యని మర్మము, ఆపొన్నపువ్వు బలువైన ద్వీపాంతరముమీఁద నుద్భవించెనుగనుక నపురూపమైనది దాని దాచవలదా యని మర్మగర్భితమైన నర్మము. [ఇది పుష్పలావికల ప్రత్యుత్తరము] ఉత్తరత్ర యీలాగున మర్మనర్మములను బ్రశ్నోత్తరములను విచారింపవలయును.

చెలువమాటితివేల కలువచాలు=చిన్నదానా నల్లగలువలచాలు కప్పిపెట్టితి వేమేయని నర్మము, నూఁగారు కప్పిపెట్టితివేమేయని మర్మము. [ఇది ప్రశ్నము] అదియుఁ గప్పఁగరాదె మిన్నులబావి కడది =ఆకలువచాలు మిన్నులబావికడది యనఁగా నాకాశగంగదాపుది గనుకఁ గప్పిపెట్టఁదగదా యని నర్మము, మిన్న నఁగా నడుము బావియనఁగా నాభి, ఆనూఁగారు నడుముపైనున్న నాభిదాపుదిగనుకఁ గప్పిపెట్టఁదగదా యని మర్మము. [ఇది యుత్తరము] మిన్నులబావియన పొక్కిలి యనుటకు-

శ్లో. 'వాపీకాపిస్ఫురతి గగనే తత్పరే సూక్ష్మపద్యా.' (కువలయానందము.)

మొగడతమ్ముల నేలమూసితే సతి=ఓచిన్నదానా తామరమొగ్గల నేలమూసిపెట్టితివే యనినర్మము, గుబ్బచన్నుల నేలమూసిపెట్టితివే యనిమర్మము. [ఇది ప్రశ్నము] అవి=ఆతామరమొగ్గలు, మానసభూనిధానములు=మానస సరోభూమియందలి నిక్షేపములు, మూయఁదగదె=మూసిపెట్టఁగూడదా యని నర్మము, అవి= ఆగుబ్బచన్నులు, మానస భూనిధానములు=మానసభూమి యనఁగా వక్షస్థ్సలము తన్నిక్షేపములు, లేక మానసభూ అనఁగా మన్మథుఁడు మన్మథనిక్షేపములు గనుక మూసిపెట్టఁగూడదా యని మర్మము. [ఇది యుత్తరము]

తరుణి పూరెమ్మయెత్తవదేల = లేఁతవయస్సుగల యోచిన్నదానా పూఁదీఁగె యేలయెత్తవే యనినర్మము, బాహువు నేటి కెత్తవేయని మర్మము. [ఇది ప్రశ్నము] అది=ఆపూరెమ్మ, హేమశిఖరిదాపుది=మేరుపర్వతముకడనుండునది, బయల్పేయఁ దగునె=బయలుపఱుపవచ్చునా యని నర్మము, బాహువు స్తనసమీపముననున్నది బయలుపుచ్చవచ్చునా యని మర్మము. [ఇది యుత్తరము]

అనుచున్=ఈలాగుపలుకుచు, రసమర్మసరసోక్తులాడునట్టి=మోహరస గర్భితములైన సరసవాక్యములు పలుకునట్టి, జట్టికాండ్రన్=పువ్వులుకొనవచ్చిన కోడెకాండ్రను, యథోచిత సరస వచన రచనఁ దేల్చుచున్=వానికిఁదగిన సరసవాక్యములయొక్క రచనచేత సంతోషింపఁ జేయుచు, వివిధవిభ్ర

మమువరలన్=నానావిధమైన విలాసము లొప్పఁగా, వీటన్=ఆయధిష్ఠానపురమందు, పుష్పలావికలు=పువ్వులఁగోసెడువనితలు, విరులు విలుతురు=పువ్వులమ్ముచుందురు. అలం. రూపకాతిశయోక్తి.

మ. అమరుం దత్పురిచెంతఁ గాంతకనకాబ్జాలంబరోలంబ శ
క్తిమతీవాహిని సారసారణులు తత్కేదారకోదారస
స్యము ముక్కారును బండఁ జేయ దివివారల్ వీటిసత్రాన్నభా
గము లాసింపఁగఁ దత్సురాలయనదీఖ్యాతిన్ విడంబించుచున్. 110

తత్పురిచెంతన్=ఆయధిష్ఠానపుర సమీపమందు, కాంత=మనోహరములైన, కనకాబ్జ=సువర్ణకమలములే, ఆలంబ=అవలంబనముగాఁగల, రోలంబ=తుమ్మెదలు గలిగిన, (ని. 'ఇన్దిన్దిర శ్చఞ్చరీకో రోలంబో బంభరశ్చ సః' అని అ.) ఈవిశేషణము శక్తిమతీనదికి నాకాశగంగకును సాధారణవిశేషణము. శక్తిమతీవాహిని = శక్తిమతియను పేరుగలనది, సార = బలమైన, సారణులు = కాలువలు, (ని. 'సారణీ చాల్పసరితి' అని వి.) తత్=ఆపట్టణసంబంధమైన, కేదార = వరిమళ్ళయందలి, సస్యమున్=పైరును, ముక్కారునుబండఁజేయన్=మూఁడుకార్లయందును బండునట్లులు చేయుచుండఁగా, దివివారల్=స్వర్గసంబంధులు, అనఁగా దేవతలు, వీటిసత్రాన్నభాగము లాసింపఁగన్ = సత్రమనఁగా యజ్ఞము. (ని. 'సత్ర మాచ్ఛాదనే యజ్ఞే సదాదానేవనేపిచ' అని అ) ఆపట్టణమందలి యజ్ఞాన్నభాగములు, అనఁగా హవిర్భాగములు కోరి వచ్చియుండుటచేత, తత్సురాలయనదీఖ్యాతిన్ విడంబించుచున్=హవిర్భాగములనిమిత్తమయి వచ్చి దేవతలెప్పుడు నాపట్టణమంద యుండుటచేతఁ బట్టణము సురాలయముగా నుండునుగనుక శక్తిమతీనది సురాలయనదీఖ్యాతిని విడంబించుచు, అనఁగా స్వర్గగంగాఖ్యాతిచేఁ బ్రకాశించుచు, అమరున్ = ఒప్పుచుండును. అనఁగా నాపట్టణప్రాంతమందలి శక్తిమతి యనెడునది బంగారుకమలములుగలిగి యుండుటచేతను, యజ్ఞాన్నభాగములకొఱకై దేవతలు వచ్చి యెప్పుడునుండుటచేతను నాపట్టణము స్వర్గమువలెనేయుండును గనుక దానిచెంతఁ బ్రవహించుచుండుటచేత నానదియుఁ స్వర్గనదివలె నొప్పుచుండునని యాశయము. ఇచట శక్తిమతీనదికి సురాలయనదీఖ్యాతి న్విడంబించుచున్, అనుటచే సాదృశ్యవర్ణనవలన నుపమాలంకారము.

ముక్కారులఁ బండుటకు జలప్రశస్తియే కారణముగాని భూసారణము కారణము గాదనుటకు-

మ. విలసత్సారణికానుయాయి విబుధద్వీపి న్యనర్ఘామృతం
బుల ముక్కారును బండుశాలులు,

(చంద్రికాపరిణయము.)

తా. పొందమ్ములఁదేనె క్రోలు తేటుల కిరవగు శక్తిమతీనది కాలువల సహాయమున నావీటియందు ముక్కారు వరిపండును ఆధాన్యసహాయమునఁ బౌరులు యజ్ఞములు చేయుచుండ దేవతలు హవిర్భాగములకై వచ్చుచుంటవలన శక్తిమతి యాకాశగంగవలెఁ బేరొందెను.

శా. వీటన్ మీటగుజోటు లేటివరదన్ వేమాఱుఁ గ్రీడింపఁ ద
త్పాటీరాంకసపంకశంఖగతముక్తాశ్రేణి యవ్వాసనన్
బాటించున్ మృగనాభిపంకయుతభామాకంబుకంఠాప్తి నే
నాటన్ మిన్కులు గల్గువారి కగు జన్మస్థానసౌఖ్యోన్నతుల్. 111

జోటియనఁగా స్త్రీ, ఇది యోషిచ్ఛబ్దతద్భవము. వీటన్=ఆయధిష్ఠానపురమందు, మీటగు=శ్రేష్ఠులయిన, జోటులు=స్త్రీలు, ఏటివరదన్=శుక్తిమతీనదీప్రవాహమందు, వేమాఱుఁ గ్రీడింపన్=పలుమాఱును జలక్రీడలాడుచుండుటచేత, తత్ = ఆపురస్త్రీలసంబంధమైన, పాటీర=శ్రీచందనమే, అంక=చిహ్నముగాఁగలవై పరిమళించునవియు, సపంక=బురదతోఁగూడుకొన్నవై నల్లనైనవియునగు, శంఖ=నదీగర్భస్థములైన శంఖములను, గత=పొందిన, అనఁగా నాశంఖములయందుఁ బుట్టిన, ముక్తాశ్రేణి=మౌక్తికసమూహము, అవ్వాసనన్=ఆ సంస్కారముచేత, మృగనాభిపంకయుత = కస్తూరికాపంకముతోఁ గూడుకొన్న, భామాకంబుకంఠ=కంబుగ్రీవయనఁగా మూఁడురేఖలుగల కంఠము, ని. 'కంబుగ్రీవాత్రిరేఖాసా' అని అ. స్త్రీలయొక్క రేఖాత్రయయుక్తకంఠములయొక్క, ఆప్తిన్=ప్రాప్తిని, పాటించున్=పొందును.

అనఁగాఁ జందనపరిమళముతోఁగూడిన కర్దమమంటిన మూఁడుచుట్లుగలశంఖములయందు మునుపున్నవి గనుక నా సంస్కారముచేత నాశంఖములకుఁ బ్రతినిధియైన కస్తూరికర్దమయుక్తరేఖాత్రయ సహిత కాంతాకంఠప్రదేశములను బొందుచున్నవనుట. ఏనాట న్మిన్కులుగల్గువారికగు జన్మస్థానసౌభాగ్యోన్నతుల్=మిన్కులనఁగా ధనములు, అవి గలిగినవారికి జన్మస్థానసౌభాగ్యోన్నతులు గలుగునని యర్థము. మిన్కులనఁగాఁ గాంతులును, ముత్తియములు కాంతులుగలవని భావము. శుక్తిమతీనదీగర్భగత శంఖజనిత ముక్తాఫలములు పురకాంతాకంఠదేశములయందు హారములై ప్రకాశించునని ఫలితార్థము. శంఖములయందు ముత్యములు పుట్టుట రత్నశాస్త్రప్రసిద్ధము. ఇందుకుఁ బ్రమాణము. రత్నపరీక్షయందు,

క. 'వరశంఖజనితమౌక్తిక, మరయఁ గపోతాండమువలె నత్యుజ్జ్వలమై,
పరఁగునది మంత్రసాధన, పరులకుఁ దక్కంగ దుర్లభం బితరులకున్'

ఇచట ముత్యములకు స్త్రీకంఠప్రాప్తిని గూర్చి శంఖోత్పత్తివాసనకారణమాటచే హేతూత్ప్రేక్ష. ఏనాటన్ ఇత్యాదికముచేతసామాన్యముచేఁ బ్రకృతార్థమును సమర్థించుటవలన నర్థాంతరన్యాసము.

తా. శుక్తిమతీనదియం దాపురకాంతలు పలుమాఱు జలక్రీడఁ గావించుటచే నది యందలి శంఖములందలి ముత్తెములకునైత మాతావి పట్టువడెను. అందుచే మౌక్తికములను దండలుగా గ్రుచ్చి యఱుతఁ దాల్తురు.

ఉ. చెన్నగునన్నదీపులిన•సీమల దాఁగిలిమూఁత లాడుచున్
వెన్నెలరేలు కప్పురపు•విప్పటనంటులనీడ నీఁగురా
కన్నెలబోయినన్నులకుఁ • గన్నులు మూయుఁ దదీయవాసనల్
మన్ననఁ గాంచి కప్రపుదు•మారము రేఁచుసమీరడింభముల్. 112

చెన్నగు=చక్కనగుచున్న, అన్నదీపులిన సీమలన్ = ఆశుక్తిమతీనదియొక్క యిసుకతిన్నెలయందు, దాఁగిలిమూఁతలాడుచున్=దాఁగిలిమూఁతలనఁగాఁ జిన్నపడుచులాడెడునాట (అదియేలాగనిన, నొకతెకూర్చుండి ముందుగా నొకదానికిఁ గన్నులు గట్టిగామూసి పట్టి కడమపడుచులందఱుఁ బోయి యెక్కడెక్కడనో దాఁగియున్నతర్వాత దీనివిడిచిపెట్టినఁ బోయి వెదకి దాఁగినవాండ్రలో నెవరినైనఁ దాఁకినఁ దాఁకఁబడినవాండ్రు కన్నులుమూయించుకొనవలయునదిగా నాడునాటకుఁ

చేరఁగనుక) అట్టియాటయాడుచు, వెన్నెలరేలు=వెన్నెలగలరాత్రులు, కప్పురపువిప్పటనంటుల=గొప్పలైన కర్పూరపరఁటిచెట్లయొక్క, నీడన్=నీడయందు, ఈఁగు=దాఁగియుండెడు, రాకన్నెలన్=రాచకన్నియలను, ఓయు=వెదకునట్టి, అన్నులకున్=స్త్రీలకు, కప్రపుదుమారము రేఁచుసమీరడింభముల్=కర్పూరపుధూళి సెగరఁగొట్టుచున్న పిల్లవాయువుల నెడుపిల్లలు, ఇక్కడ సమీరడింభములనెడు డింభములని రూపకాలంకారము. తదీయ=ఆదాఁగియున్న స్త్రీలయొక్క, వాసనల్=దేహవాసనలను, మన్ననఁగాంచి=మన్ననచేత గ్రహించి, కన్నులుమూయున్=కన్నులుమూయును, అనఁగా నాదాఁగియున్న స్త్రీలవాసనలుగాంచినవై యాదాఁగిన స్త్రీలకు సహాయముగా వెనుకవచ్చిన స్త్రీలకుఁ దముచేత రేఁపఁబడిన కర్పూరపు దుమారముచేతఁ గన్నులు కనుపడకుండఁ జేయునని భావము. అలం. సామాన్యాలంకారము. హేతూత్ప్రేక్ష.

తా. వెన్నెలరేలయందుఁ జెలువలు శుక్తిమతీపులినముల దాఁగిలిమూఁతలాడుచుండునెడఁ గొందఱు కర్పూరపుటరఁటిచెట్లనీడలలోఁ దాఁగ వారిని వెదకవచ్చు చెలులకనులనిండఁ గప్పురపుదుమారము నిండినగాలి వీచుటచేఁ గనులు మూఁతపడుచుండును.

చ. వల నగునమ్మహాతటిని • వారి నవారితకేళిసల్పు కాం
తలచనుమిట్టలం దొలఁగు • దట్టపుతట్టుపునుంగువాసనల్
చిలుకుచు వీటిరాజనపు • చేలకు దిద్దినకాల్వవెంట రా
దళముగ నాని యప్పునుఁగు • తావులె వల్చుఁ దదీయధాన్యముల్. 123

వలనగు=యుక్తమైన, అమ్మహాతటినివారిన్=ఆ మహానదియొక్క యుదకమందు, అవారితకేళి సల్పు=అనివారితమౌనట్టులుగా జలక్రీడలాడుచుండెడు, కాంతల=స్త్రీలయొక్క, చనుమిట్టలందొలఁగు=మిట్టచన్నులవలననుండి వదలుచున్న, దట్టపు=దట్టమైన, తట్టుపునుంగు=తట్టుపునుఁగువాసనలు, చిలుకుచున్=పరిమళము వెదచల్లుచు, వీటిరాజనపుచేలకు దిద్దినకాల్వవెంటరాన్=ఆపట్టణసంబంధమైన రాజనపువరిచేలకుఁ బారునట్టులుతీర్చిన కాలువవెంబడిరాఁగా, దళముగనాని=బలమౌనట్టులుగా నా తట్టుపునుఁగును గ్రహించి, తదీయధాన్యముల్=ఆరాజనపుధాన్యములు, అప్పునుఁగుతావులె వల్చున్=ఆ పునుఁగువాసనలనే పరిమళింపఁజేయును. అనఁగాఁ బునుఁగువాసన గలిగియుండుననుట. ఇచట ధాన్యములకుఁ బునుఁగువాసనసంబంధములేకున్నను సంబంధముఁ జెప్పుటచేనతిశయోక్త్యలంకారము.

వలనగుననుటవలన శుక్తిమతి జలక్రీడోచితముగ నున్నదనియు నది మహాతటినియైనను జరుపునది యవారితకేళి గావునఁ జెలువల గుబ్బలపై దువాళించుపునుఁగుతావులు జలములలోఁ గలసి పోవఁగలిగెనని యాశయము. చనుమిట్టలనుటచే జలకేళి యవారితమనుటవలనను స్నానమాడువారు ప్రౌఢకాంతలని గ్రాహ్యము.

తా. శుక్తిమతీజలమునందుఁ బునుఁగుతావులొలయు గుబ్బలుగలజవరాండ్రు జలక్రీడగావింప వారిగుబ్బల పూఁతతావులు నీటఁగలసి కాలువలవెంటఁబోవుజలము వరిమళ్ళకుఁ జేరుటచే నందుదయించువరి పునుఁగుతావుల వెదచల్లును.

చ. పగడపుజిట్టలన్ మనికి • పట్టుగఁ గట్టినపట్టుజీనువుల్
జిగి బిగి మించుచంచువులఁ • జించినచో రసపూర ఘూర్ణఁ జె

న్నగురసదాడిగుంపులు పు•రాంతికసీమలశాలిపాలికా
జగదభినంద్యగానరస•సంగతిఁ గన్నుల నీరు గన్గతిన్. 114

పగడపుజిట్టలన్=శుక్తిమతీతీరమందున్న పవడపుఁదీఁగెలచిట్టిపొదలను, మనికిపట్టుగఁగట్టిన=నివాసభూమిగా గ్రహించిన, పట్టుజీనువులు=పట్టుజీనువులనెడు పక్షివిశేషములు, జిగి=కాంతిచేతను, బిగి=కాఠిన్యముచేతను, మించు=అతిశయించుచున్న, చంచువులన్=ముక్కులచేత, చించినచోన్=బ్రద్దలుచేసినయెడల, రసపూరమూరన్=రసప్రవాహ మూరుచుండఁగా, రసదాడిగుంపులు=తెల్లచెఱకుగుంపులు, పురాంతికసీమలన్=పట్టణసమీపప్రదేశమందలి, శాలిపాలికా=వరిచేలుకాపాడెడు పడుచులయొక్క, జగదభినంద్య=జగజ్జనులచేతఁ గొనియాడఁదగిన, గానరస=సంగీతరసముయొక్క, సంగతిన్=అనుభవముచేత, కన్నులనీరుగన్గతిన్=కన్నుల నానందబాష్పములు వహించినట్టులుగా, చెన్నగున్=ఒప్పుచుండును. ఇక్కడఁ జెఱకులయందుఁ గన్నులు అనఁగాఁ గణుపులు గలవు గనుకఁ బక్షివిశేషములయొక్క చంచుస్ఫుటనముచేతఁ గన్నులయందైన రసపూరోదయమును రసదాడిగుంపులయందు నానందబాష్పములుగా నుత్ప్రేక్షించినాఁడు. మఱియు గానరసప్రభావముచేత మోళ్లుచిగుర్చుట ఱాళ్లుగఱఁగుట మొదలైనవి కవిసమయసిద్ధములై యున్నవి గనుక నచేతనములైన యిక్షుకాండములయం దానందబాష్పోదయము యుక్తమే యని విచారింపవలయును. మ్రాఁకులు చిగిర్చుటకు దృష్టాంతము. భారతచంపువు మొదటిస్తబకమున,

శ్లో. 'ఆలాపకాలసమపల్లవితాంకపీణా సౌరభ్యపాతిమధుపారవసంకులస్య,
తంత్రీస్వరస్యసమితో తరుణీస్వనస్య జానాతి యత్రచతురోఽపి న తారతమ్యమ్.'

అను నీపద్యమున నాలాపకాలమునకు సమముగా నొడియందలి వీణచిగిర్చెనని చెప్పంబడియెను. ఉత్ప్రేక్షాలంకారము.

తా. శుక్తిమతీతీరముననున్న పగడపుఁదీఁగెలలో గూండ్లుగట్టిన పట్టుజీనువులను పక్షులు తెల్లచెఱకుఁ జెట్టులను జంచువులతోఁ జీల్ప నూరుచున్న రసపూరము శాలికాపాలికలపాటచే నుదయించు నానందబాష్పోదయమువలె నొప్పును.

క. ఆరాజధాని కధిపతి, యై రాజిలువసునృపాలుఁ • డతఁ డసిధారా
ధారాధరధారాజల, ధారాహతరాజహంస•పద్మోదయుఁడై. 115

ఆరాజధానికిన్=ఆ యధిష్ఠానపురమునకు, అధిపతియై=ప్రభువై, వసునృపాలుఁడు=వసురాజు, రాజిలున్=ప్రకాశించును. ఏలాగనిన, అతఁడు=ఆ వసురాజు, అసిధారా=ఖడ్గధారయనెడు, ధారాధర=మేఘసంబంధమైన, ధారాజలభార=ధారారూపమైన యుదకభారముచేత, ఆహత=కొట్టఁబడిన, రాజహంస=రాజశ్రేష్ఠులయొక్క, పద్మా=సంపదయొక్క, ఉదయ=అభ్యుదయమనెడు, రాజహంస=రాజహంసలయొక్కయు, పద్మ=కమలములయొక్కయు, ఉదయుఁడై = అభ్యుదయముగలవాఁడై, ప్రకాశించునని సంబంధము. అనఁగా మేఘసంబంధిధారారూపజలభారము రాజహంసలయొక్కయుఁ గమలములయొక్కయు నభ్యుదయము నేలాగున హరించునో యాలాగుననే వసురాజుయొక్క ఖడ్గధార రాజశ్రేష్ఠులయొక్క సంపదభ్యుదయమును హరించునని భావము. వర్షజలధారలు రాజ

జేరుగనుక) అట్టియాటయాడుచు, వెన్నెలరేలు=వెన్నెలగలరాత్రులు, కప్పురపువిప్పుటనంటుల=గొప్పలైన కర్పూరపరఁటిచెట్లయొక్క, నీడన్=నీడయందు, ఈఁగు=దాఁగియుండెడు, రాకన్నెలన్=రాచకన్నియలను, అోయు=వెదకునట్టి, అన్నులకున్=స్త్రీలకు, కప్రపుదుమారము రేఁచుసమీరడింభముల్=కర్పూరపుధూళి సెగరఁగొట్టుచున్న పిల్లవాయువుల నెడుపిల్లలు, ఇక్కడ సమీరడింభములనెడు డింభములని రూపకాలంకారము. తదీయ=ఆదాఁగియున్నస్త్రీలయొక్క, వాసనల్=దేహవాసనలను, మన్ననఁగాంచి=మన్ననచేత గ్రహించి, కన్నులుమూయున్=కన్నులుమూయును, అనఁగా నాదాఁగియున్నస్త్రీలవాసనలుగాంచినవై యాడాఁగినస్త్రీలకు సహాయముగా వెనుకవచ్చిన స్త్రీలకుఁ దమచేత రేఁపఁబడిన కర్పూరపు దుమారముచేతఁ గన్నులు కనుపడకుండఁ జేయునని భావము. అలం. సామాన్యాలంకారము. హేతూత్ప్రేక్ష.

తా. వెన్నెలరేలయందుఁ జెలువలు శుక్తిమతీపులినముల దాఁగిలిమూఁతలాడుచుండు నెడఁ గొందఱు కర్పూరపుటరఁటిచెట్లనీడలలో దాఁగ వారిని వెదకవచ్చు చెలులకనులనిండఁ గప్పురపుదుమారము నిండినగాలి వీచుటచేఁ గనులు మూఁతపడుచుండును.

చ. వలనగునమ్మహాతటిని• వారి నవారితకేళిసల్పు కాం
తలచనుమిట్టలం దొఱఁగు• దట్టపుతట్టుపునుంగువాసనల్
చిలుకుచు వీటిరాజనపు• చేలకు దిద్దినకాల్వవెంట రా
దళముగ నాని యప్పునుఁగు• తావులె వల్చుఁ దదీయధాన్యముల్. 113

వలనగు=యుక్తమైన, అమ్మహాతటినివారిన్=ఆ మహానదియొక్క యుదకమందు, అవారితకేళిసల్పు=అనివారితమానట్టులుగా జలక్రీడలాడుచుండెడు, కాంతల=స్త్రీలయొక్క, చనుమిట్టలందొఱఁగు=మిట్టచన్నులవలననుండి వదలుచున్న, దట్టపు=దట్టమైన, తట్టుపునుంగు=తట్టుపునుఁగువాసనలు, చిలుకుచున్=పరిమళము వెదచల్లుచు, వీటిరాజనపుచేలకు దిద్దినకాల్వవెంటరాన్=ఆపట్టణసంబంధమైన రాజనపువరిచేలకుఁ బారునట్టులుతీర్చిన కాలువవెంబడిరాఁగా, దళముగనాని=బలమానట్టులుగా నా తట్టుపునుఁగును గ్రహించి, తదీయధాన్యముల్=ఆరాజనపుధాన్యములు, అప్పునుఁగుతావులె వల్చున్=ఆ పునుఁగువాసనలనే పరిమళింపఁజేయును. అనఁగాఁ బునుఁగువాసన గలిగియుండుననుట. ఇచట ధాన్యములకుఁ బునుఁగువాసనసంబంధములేకున్నను సంబంధముఁ జెప్పుటచేనతిశయోక్త్యలంకారము.

వలనగుననుటవలన శుక్తిమతి జలక్రీడోచితముగ నున్నదనియు నది మహాతటినియైనను జరుపునది యవారితకేళి గావునఁ జెలువల గుబ్బలపై దువాళించుపునుఁగుతావులు జలములలోఁ గలిసిపోవఁగలిగెనని యాశయము. చనుమిట్టలనుటచే జలకేళి యవారితమనుటవలనను స్నానమాడువారు ప్రౌఢకాంతలని గ్రాహ్యము.

తా. శుక్తిమతీజలమునందుఁ బునుఁగుతావులొలయు గుబ్బలుగలజవరాండ్రు జలక్రీడగావింప వారిగుబ్బల పూఁతతావులు నీటఁగలసి కాలువలవెంటఁబోవుజలము వరిమళ్ళకుఁ జేరుటచే నందుదయించువరి పునుఁగుతావుల వెదచల్లును.

చ. పగడపుజిట్టలన్ మనికి• పట్టుగఁ గట్టినపట్టుజీనువ్రల్
జిగి బిగి మించుచంచువులఁ• జించినచో రసపూర ఘూర్ణఁ జె

న్న గురసదాడిగుంపులు పుర • రాంతికసీమలశాలిపాలికా
జగదభినంద్యగానరస•సంగతిఁ గన్నుల నీరు గన్గతిన్. 114

పగడపుజిట్టలన్=శుక్తిమతీతీరమందున్న పవడపుఁదీఁగెలచిట్టిపొదలను, మనికిపట్టుగఁగట్టిన=నివాసభూమిగా గ్రహించిన, పట్టుజీనువులు=పట్టుజీనువులనెడు పక్షివిశేషములు, జిగి=కాంతిచేతను, బిగి=కాఠిన్యముచేతను, మించు=అతిశయించుచున్న, చంచువులన్=ముక్కులచేత, చించినచోన్=బ్రద్దలుచేసినయెడల, రసపూరమూరన్=రసప్రవాహ మూరుచుండఁగా, రసదాడిగుంపులు=తెల్ల చెఱుకుగుంపులు, పురాంతికసీమలన్=పట్టణసమీపప్రదేశమందలి, శాలిపాలికా=వరిచేలు కాపాడెడు పడుచులయొక్క, జగదభినంద్య=జగజ్జనులచేతఁ గొనియాడఁదగిన, గానరస=సంగీతరసముయొక్క, సంగతిన్=అనుభవముచేత, కన్నులనీరుగన్గతిన్=కన్నుల నానందబాష్పములు వహించినట్టులుగా, చెన్నగున్=ఒప్పుచుండును. ఇక్కడఁ జెఱకులయందుఁ గన్నులు అనఁగాఁ గణుపులు గలవు గనుకఁ బక్షివిశేషములయొక్క చంచుస్ఫుటనముచేతఁ గన్నులయందైన రసపూరోదయమును రసదాడిగుంపుల యందు నానందబాష్పములుగా నుత్ప్రేక్షించినాఁడు. మఱియు గానరసప్రభావముచేత మోళ్లుచిగు ర్చుట ఱాళ్లుగఱఁగుట మొదలైనవి కవిసమయసిద్ధములై యున్నవి గనుక నచేతనములైన యిక్షు కాండములయం దానందబాష్పోదయము యుక్తమే యని విచారింపవలయును. మ్రాఁకులు చిగిర్చు టకు దృష్టాంతము. భారతచంపువు మొదటి స్తబకమున,

శ్లో. 'ఆలాపకాలసమపల్లవితాంకవీణా సౌరభ్యపాతిమధుపారవసంకులస్య,
తంత్రీస్వరస్యసమితో తరుణీస్వనస్య జానాతి యత్ర చతురోఽపి న తారతమ్యమ్.'

అను నీపద్యమున నాలాపకాలమునకు సమముగా నొడియందలి వీణచిగిర్చెనని చెప్పంబడియెను. ఉత్ప్రేక్షాలంకారము.

తా. శుక్తిమతీతీరముననున్న పగడపుఁదీఁగెలలో గూండ్లుగట్టిన పట్టుజీనువులను పక్షులు తెల్ల చెఱుకుఁ జెట్టులను జంచువులతోఁ జీల్చ నూరుచున్న రసపూరము శాలికాపాలికలపాటచే నుదయించు నానందబాష్పోదయమువలె నొప్పును.

క. ఆరాజధాని కధిపతి, యై రాజిలువసునృపాలుఁ • డతఁ డసిధారా
ధారాధరధారాజల, ధారాహతరాజహంస•పద్మోదయుఁ డై. 115

ఆరాజధానిన్=ఆ యధిష్ఠానపురమునకు, అధిపతియై=ప్రభువై, వసునృపాలుఁడు=వసురాజు, రాజిలున్=ప్రకాశించును. ఏలాగనిన, అతఁడు=ఆ వసురాజు, అసిధారా=ఖడ్గధారయనెడు, ధారాధర=మేఘసంబంధమైన, ధారాజలధార=ధారారూపమైన యుదకభారముచేత, ఆహత=కొట్టఁబడిన, రాజహంస=రాజశ్రేష్ఠులయొక్క, పద్మా=సంపదయొక్క, ఉదయ=అభ్యుదయమనెడు, రాజహంస=రాజహంసలయొక్కయు, పద్మ=కమలములయొక్కయు, ఉదయుఁడై = అభ్యుదయముగలవాఁడై, ప్రకాశించునని సంబంధము. అనఁగా మేఘసంబంధిధారారూపజలభారము రాజహంసలయొక్కయుఁ గమలములయొక్కయు నభ్యుదయము నేలాగున హరించునో యాలాగుననే వసురాజుయొక్క ఖడ్గధార రాజశ్రేష్ఠులయొక్క సంపదభ్యుదయమును హరించునని భావము. వర్షజలధారలు రాజ

హంసలకును బద్మములకును ననిష్టము లౌట ప్రసిద్ధంబకదా. ఇచట ఖడ్గాసులను మేఘాదిరూపముచే రూపించుటవలన రూపకాలంకారము.

తా. సుగమము.

సీ. తనయశోవిశదము♦క్తాసౌధపాళికి నంబుదాయనము వా♦తాయనముగఁ
దనశౌర్యశిఖిశిఖా♦తతికి జాంబూనదభూధరం బపరంజి♦పూదె గాఁగఁ
దనబలోద్ధతరజో♦దంభకుంభినికిఁ దారాగ్రహంబులు గర్భ♦రత్నములుగఁ
దనదానధారాఖ్య♦వనధికి మిన్నేఱు కల్లోలధుతవారి♦కణము గాఁగఁ
తే. దనవినూతనసుగుణసం♦తానవల్లి, సముదయంబున కంభోజ♦సంభవాండ
భాండములఖండఫలపరం♦పరలుగాఁగ, వరలుభవ్యవిభావిభా♦వసుఁడు వసుఁడు.

భవ్య=ఉత్కృష్టమైన, విభా=తేజస్సునందు, విభావసుఁడు=సూర్యుఁడైన, (ని. 'విభావసుర్గ్రహపతిః' అని అ.) వసుఁడు=వసురాజు, తన=తనయొక్క, యశః=కీర్తియనెడు, విశద=స్వచ్ఛమైన, ముక్తాసౌధపాళికిన్=ముత్యాలమేడయొక్క సమూహమునకు, అంబుదాయనము=ఆకాశము, వాతాయనముగన్=గవాక్ష మగుచుండఁగా, అనఁగాఁ గగనముకంటెఁ గీర్తి యతిశయమైనదనిభావము. ఉత్తరత్ర యీలాగుననే గ్రహింపవలయును. తన=తనయొక్క, శౌర్య=ప్రతాపమనెడు, శిఖిశిఖాతతికిన్=అగ్నిజ్వాలాసమూహమునకు, జాంబూనద భూధరంబు=కాంచనాచలము, అపరంజిపూదెగాఁగన్=బంగారుపూదె యగుచుండఁగా,

తన=తనయొక్క, బల=సైన్య (పదఘట్టన)ముచేత, ఉద్ధత=ఎగిరిన, రజః=పరాగమనెడు, దంభకుంభినికిన్=కృత్రిమభూమికి, తారాగ్రహంబులు=నక్షత్రములును సూర్యాది గ్రహములును, గర్భరత్నములుగన్=గర్భస్థములైన రత్నములగుచుండఁగా భూమి రత్నగర్భయగుట ప్రసిద్ధము. తన=తనయొక్క, దానధారాఖ్యవనధికిన్ = దానధారాజలమనెడు సముద్రమునకు, మిన్నేఱు=ఆకాశగంగ, కల్లోల=మహాతరంగములవలననుండి, ధుత=ఎగసిన, వారికణముగాఁగన్=ఉదకబిందు వగుచుండఁగా,

తన=తనయొక్క, వినూతన=అపూర్వమైన, సుగుణసంతాన = సుగుణసముదాయ మనెడు, సంతానవల్లి సముదయంబునకున్=కల్పలతాసమూహమునకు, అంభోజసంభవాండభాండములు=బ్రహ్మాండభాండములు, అఖండసంపూర్ణమైన ఫలపరంపరలుగాఁగన్=ఫలములయొక్క దొంతరలగుచుండఁగా, వరలున్=ప్రకాశించును. ఇచట నైదు పరంపరితరూపకములకుసంసృష్టి. ఈరూపకములవలనంగీర్త్యాదుల కతివైపుల్యము ధ్వనించుచుండెం గావున నలంకారముచే వస్తుధ్వని.

తా. వసురాజు విశాలమగు యశము నసమానమగుశౌర్యము నధికజలసమృద్ధియు విశేషమగు దానగుణముగలవాఁడై సద్గుణవంతుఁడని పేరొందెను.

చ. మసలక నెల్లకాలమును ♦ మారుతపారణధార్యమాణ యై
యసమశిలోచ్చయంబుల న♦నంత యనంతతపం బొనర్చి తా
వసుమతి యై తదీయగుణ♦వాసన గంధవతీప్రతీతియుం
బొసఁగఁగఁ దెల్పె రత్న పరి♦పూర్ణమహాకటకాభిరూప్యమున్. 117

టీ. అనంత=భూదేవి, (ని. 'భూర్భూమిరచలానన్తా' అని అ.) మసలక=జాగు సేయక, ఎల్లకాలమును=నిరంతరమును, మారుతపారణ = వాయు భక్షణముచేత, ధార్యమాణయై=ప్రాణధారణము చేయుచున్నదై, అసమ=విషమాకారములైన, అనఁగా దుర్గమములైన, శిలోచ్చయంబులన్=పర్వతములయందు, అనంతతపంబొనర్చి=అంతములేని తపస్సుచేసి, అనఁగాఁ జిరకాలము తపస్సుచేసి యని యర్థము. మారుతపారణమనఁగా వాయువాహారము గాఁగలది సర్పముగనుక శేషుఁడని చెప్పవలయును. అతనిచేత ధరింపఁబడుచున్నదనియు, అసమశిలోచ్చయంబుననఁగా సప్తసంఖ్యగల కులపర్వతములయందు నిలిచియున్నదనియును భావము. తా వసుమతియై=అనఁగా వసురాజుగలదై యని యర్థము. వసుమతీనామముగలదైయని భావము. (ని. 'సర్వంసహా వసుమతీ వసుధోర్వీ వసున్ధరా' అని అ.) తదీయగుణవాసనన్=ఆవసురాజుయొక్క గుణవాసనచేత, ఇక్కడ గుణప్రకాశమునువాసనగా నధ్యవసించినాఁడు. గంధవతీ ప్రతీతియున్=గంధవతియను ప్రసిద్ధియును, పొసఁగఁగన్=ఒప్పుచుండఁగానని యర్థము. ('ని. గన్ధవతీ పృథివీ') అని చెప్పఁబడియున్నది గనుక భూమిగంధవతియని భావము. రత్నపరిపూర్ణ మహాకటకాభిరూప్యమున్ = కటకశబ్దము హస్తకంకణములయందును బర్వత సానువులయందును వర్తించును గనుక రత్నములచేతఁ బరిపూర్ణమైన కంకణసౌభాగ్యమును, తెల్పన్=ప్రకటింపఁజేసెనని యర్థము. (ని. 'కటకం వలయే సానౌ రాజధానీ నితంబయోః' అని వి.) రత్నకటకమనఁగా రత్న సానువైన మేరుపర్వతము, దానిచేతఁజేయఁబడిన సౌభాగ్యమును దెల్పెనని భావము. (ని. 'మేరు స్సుమేరు ర్హేమాద్రీ రత్నసాను స్సురాలయః' అనిఅమరము.) ఇచట భూమికిఁ గులపర్వతనివాసమును దపశ్చర్యగా నధ్యవసించుట వసుమతీత్వప్రాప్తి హేతువౌటచే నుపన్యసించుటవలన హేతూత్ప్రేక్ష. అదియు శ్లేషచే జీవించినది రూపకాతిశయోక్తితో సంకరమైనది.

భూదేవి మారుతపారణగావించి యసమశైలాదులకడఁ దపస్సుచేసి వసుమతి (వసురాజు గలదియు ధనవంతురాలు) యై తత్పుణ్యావాసన వలన గంధవతి (మాల్యాది సుగంధవస్తువులుగలది భూదేవి) యను పేరొంది రత్నకటకాభిరూప్యము (మేరుపర్వతము కర్ణికగానుంట-కంకణ సౌభాగ్యము) కలిగి వెలయుచున్నది.

సీ. మీఱినరాజు బ♦ల్మి నడంప లోనైన నభినవస్థితిఁ బెంప ♦ నతఁడె నేర్చు
దేఱి చూపినఁ దీవ్ర♦దీప్తిఁ జూప జనాళి కక్షిసాఫల్య మీ ♦ నతఁడె నేర్చు
సింధు లింకఁ బ్రతాప♦శిఖిఁ బూన విశ్రాణి తాంబుల నపి నింప ♦ నతఁడె నేర్చు
సమిదున్ముఖుని తేజ♦ము మలంపఁ బాదంబు లంటిన వెలయింప ♦ నతఁడె నేర్చు
తే. మండలముఁదాల్ప హరిదెస♦మైత్రి నిలుప, నలఘుసన్మార్గగతిఁ దెల్ప♦నతఁడె నేర్చు
నాజగద్బంధునకు వసు♦రాజనామ, మిడినచతురాస్యకౌశలం ♦ బెన్నఁదరిది. 118

ఈపద్యమునందు వసురాజును శబ్దశ్లేషచేత సూర్యునిగా నధ్యవసించి యర్థద్వయమునుగలుగఁ జెప్పినాఁడు. ఏలాగనిన,

మీఱినరాజు బల్మి నడంప లోనైన నభినవస్థితిఁ బెంప నతఁడె నేర్చున్=రాజనఁగా నొకానొక రాజును జంద్రుఁడును, గర్వించి తన్ను నధఃకరించిన రాజుయొక్క బల్మి నడఁగించుటకును లోఁబడ్డయైన నంతకంతకు వృద్ధిఁబొందించుటకును నతఁడ నేర్చునని రాజపరమైనయర్థము, తనకంటె మీఁదనున్న

చంద్రునియొక్క కాంతిసంపద నణఁగించుటకునుదర్శయందుఁ దనతోఁ గూడినవెనుక స్వకిరణప్రాప్తిచేతఁ గళాయుక్తునిఁగాఁ జేయుటకును నతఁడ నేర్చునని సూర్యపరమైన యర్థాంతరము. సూర్యునికిరణములే చంద్రునియందు సుధాభూతములవుచున్నవని శాస్త్రము.

శ్లో. 'సలిలమయేశశినిరవేర్దీధితయోమూర్ఛితాస్తమోనైశం,
క్షపయంతి దర్పణోదరనిహితా ఇవమన్దిరస్యాన్తః' అని ప్రమాణము.

తేజిచూచినఁ దీప్రదీప్తిఁజూప జనాళి కక్షిసాఫల్యమీనతఁడె నేర్చున్ = ఎదిరించి చూచిన వారికిఁ దీక్ష్ణమైన ప్రతాపమును గనుపఱుచుటకును దదితరజనులకునుఁ బ్రసన్నభావముచేత నేత్రానందము సేయుటకును నతఁడే నేర్చునని రాజపరమైనయర్థము. తనమీఁద దృష్టినిలిపినవారికిఁ దీక్ష్ణకాంతి గనుపఱుచుటకును సకలపదార్థప్రకాశముచేత జనులకు నేత్రసాఫల్యముఁ గలుగఁ జేయుటకును నతఁడే నేర్చునని సూర్యపరమైనయర్థాంతరము. సింధులింకఁ బ్రతాపశిఖిఁ బూనవిశ్రాణితాంబుల నవినింప నతఁడె నేర్చున్=సింధుశబ్దము సముద్రములయందును నదులయందును వర్తించునుగనుక సముద్రము లింకిపోవునట్టులుగాఁ బ్రతాపము గనుపఱుచుటకును దానోదకములచేత నాసముద్రములను మరల నిండింపఁజేయుటకును నతఁడే నేర్చునని రాజపరమైన యర్థము. ఇక్కడ విశ్రాణితశబ్దమునకు భావార్థమందు క్తప్రత్యయము గనుక దానమని యర్థము, నదు లింకునట్లుగా నెండగాయుటకును దిరుగ మేఘజనితజలధారలచేత నింకిపోయిననదులను నిండింపఁజేయుటకును నతఁడే నేర్చునని సూర్యపరమయిన యర్థాంతరము, ఇక్కడ విశ్రాణితశబ్దమునకుఁ గర్మార్థమందు క్తప్రత్యయము. ని. 'సిన్ధుస్సముద్రే నద్యాం చ' అని అ. సూర్యకిరణములచేతనే వర్షముకలుగుచున్నదని శ్రుతిప్రమాణము.

సమిదున్ముఖునితేజము మలంపఁ బాదంబులంటిన వెలయింప నతఁడె నేర్చున్=సంగరోన్ముఖుఁడైనవానిప్రతాప మడఁగించుటకును గాళ్ళమీఁదఁ బడిన బాగుపఱుచుటకు నతఁడేనేర్చునని రాజపరమైన యర్థము. సమిదున్ముఖుఁడనఁగాఁ గట్టెలకెదురెక్కుడువాఁడు-అగ్ని, అతనితేజస్సును బగటివేళఁ బోఁగొట్టుటకును స్వకిరణప్రాప్తినిఁ జెందఁగానే రాత్రివేళఁ బ్రకాశింపఁజేయుటకును నతఁడేనేర్చునని సూర్యపరమైన యర్థాంతరము. ని. 'పాదారశ్మ్యఙ్ఘ్రితుర్యాంశాః' అని అ.

మండలముదాల్పన్=దేశమువహించుటకని యర్థము. మండలాకారమునువహించుటకని యర్థాంతరము. (ని. 'మణ్డలం పరిధౌ కోష్ఠే దేశే ద్వాదశరాజసు, క్లీబే థ నివహే బింబే త్రిషు' అని మే.) హరిదాసమైత్రినిలుపన్=హరియనఁగా నింద్రుఁడును శ్రీకృష్ణుఁడును, మైత్రియనఁగా స్నేహమును ('మిత్రస్య సూర్యస్యాపత్యం స్త్రీమైత్రీ') అనెడు వ్యుత్పత్తిచేత సూర్యపుత్రియైన కాళిందియును, ఇంద్రునియందు స్నేహము నిలుపుటకని యర్థము, శ్రీకృష్ణునియందుఁ గాళిందీకన్యను సమర్పించుటకని యర్థాంతరము. అలఘుసన్మార్గగతిఁ దెల్పన్=శిష్టాచారప్రవర్తనము దెలియఁజేయుటకని యర్థము, గగనగతిఁ దెలియఁజేయుటకని యర్థాంతరము. అతఁడె నేర్చున్=ఆరాజే నేర్చునని యర్థము, ఆసూర్యుఁడే నేర్చునని యర్థాంతరము. ఆజగద్బంధునకున్=జగజ్జనులకునాప్తుఁడైన యారాజునకని యర్థము. జగద్బంధుఁడనఁగా సూర్యుఁడునుగనుకనిక్కడ సారస్యము గ్రహింపవలయును. వసురాజనామమిడిన= వసురాజనఁగా వసువనెడు రాజును వసువులనఁగా రశ్ములును వానికిరాజు సూర్యుఁడు గనుక నతనికివసురాజనెడు పేరుపెట్టిన, చతురాస్యకౌశలంబు= బ్రహ్మదేవునినిపుణత్వము, ఎన్ననరిది = ఎంచుటకు శక్యముగానిది, ఇక్కడఁ జతురాస్యశబ్దము చతురములైన ముఖములు గలవాఁడని సాభిప్రాయముగావునఁ

బరికరాంకురాలంకారము. ఇచట శబ్దశక్తిమూలధ్వని లేక శ్లేషము. సాభిప్రాయమని విచారింప వలయును.

తా. వసురాజు తన్నుమించిన రాజులవంచించుటకు లోఁబడినవారిని వృద్ధినొందించుంటకును, ప్రజల సాగ్రహముజూచి లోఁబఱచుకొనుటకునను గ్రహదృష్టితోఁగాంచుటకును, పరాక్రమము వెల యించుటకు ఔదార్యము ప్రకటించుటకును, ఎదిరించినచోఁ దేజము వెలయించుటకుఁ బాదములంటిన ననుగ్రహించుటకుఁ, గత్తిపట్టుటకుఁ జెలిమి నెఱపుటకు సమర్థుఁడై వసురాజనామముతోనొప్పెను.

మ. జననాథాగ్రణి యొక్కనాఁడు హిమవ◆జ్జాతుండు కోలాహలా
ఖ్యనగాధీశుఁడు ప్రాలి శుక్తిమతి నా◆గన్ వేగ లేగవ్వ మీ
టినసూటిన్ బోటప్రేలిగోట నెగమీ◆టెం గుంఠితాహార్యశా
సనగర్వాగ్రహుఁడై బలారి తనతో◆ సఖ్యంబు వాటింపఁగాన్. 119

జననాథాగ్రణి=రాజశ్రేష్ఠుఁడైన యావసురాజు, ఒక్కనాఁడు=ఒకదినమందు, హిమవజ్జాతుండు=హిమవంతునివలన సంభవించిన, కోలాహలాఖ్యనగాధీశుఁడు=కోలాహలుఁడనెడు పేరుగలపర్వత శ్రేష్ఠుఁడు, ప్రాలి=పైఁగావచ్చి ప్రవేశించినవాఁడై, శుక్తిమతినాగన్=శుక్తిమతీనది నడ్డగింపఁగా, వేగన్=శీఘ్రముగా, లేగవ్వమీటినసూటిన్=చిన్నగవ్వ నెగమీటినటులుగా, బోటప్రేలిగోటన్=కాలిబొటన ప్రేలిగోటిచేత, ఎగమీటెన్=ఎగిరిపోవునట్టులుగా మీటివైచెను. ఏలాగనిన, బలారి=దేవేంద్రుఁడు, కుంఠిత=మొక్కపోయిన, ఆహార్యశాసన=పర్వతశిక్షవలనఁబుట్టిన, గర్వాగ్రహుఁడై=గర్వశౌర్యములు గలవాఁడై, తనతో సఖ్యంబు వాటింపఁగన్=తనతో స్నేహముసేయునట్టులుగా, ఎగమీటెనని సంబంధము. ఇంద్రుఁడు తాను వజ్రాయుధముచేఁ జేసిన పర్వతశిక్ష వసురాజుయొక్క కాలిగోటిచేఁ జెయ్యఁబడెను గనుకఁ దనయొక్క పర్వతశాసన గర్వశౌర్యములను విడిచిపెట్టి వసురాజుతో స్నేహముచేసె నని తాత్పర్యము. అలంకార-వ్యతిరేకము. కావ్యలింగము.

బొటప్రేలనుటకు-

సీ. ఘనసారచూర్ణ మొక్కలతాంగి తెచ్చిన బొటప్రేలనే చుక్కబొట్టు వెట్టె. మను. అ. 3.

కోలాహలుఁడు హిమవజ్జాతుఁ డనుటవలన మిగులగొప్పవాఁడనియు నగాధీశుఁ డనుటవలన నున్నతోన్నతశైలరాజములలో నొకటియని భావము. కాననే మహాతటిని యగుశుక్తిమతిని నాగినది. దేవేంద్రుఁడు సఖ్యమువాటించుటకు లేగవ్వను మీటునటుల బొటనప్రేలిగోట నెగమీటుటయే కారణము. ఈకార్యము వేగ జరిగిన దగుటచే బలలాఘవాదికములు సూచితములు.

తా. కోలాహలపర్వత మొకమాఱు శుక్తిమతి కడ్డము ప్రాలిదానిగమన నిరోధముగావింప వసురాజా పర్వతమును గాలిగోటితో నెగమీటెను. అందులకు మెచ్చి యింద్రుఁడు వసురాజుతో స్నేహముచేయఁ దొడఁగెను.

తే. ప్రబలకోలాహలాహార్య◆పతనరుద్ధ, విపులశుక్తిమతీమగ్న◆విపుల కతని
చరణనఖరేఖసంవర్త◆సమయజలధి, నుద్ధరించినకిటిదంష్ట్ర◆ యొఱపుఁదెలిపె.

ప్రబల=బలిష్ఠమయిన, కోలాహలాహార్య=కోలాహలపర్వతముయొక్క, పతన=పడుటవలన, రుద్ధ=అడ్డగింపఁబడిన, విపుల=విస్తారముమైన, శుక్తిమతీ=శుక్తిమతీనదియందు, మగ్న=మునిఁగియున్న, విపు

లకున్=భూమికి, (ని. 'విపులాగహ్వరీధాత్రీ' అని అ.) అతని=ఆవసురాజుయొక్క, చరణనఖరేఖ=రేఖాకృతిగల పాదనఖము, సంవర్తసమయజలధిన్=ప్రళయకాలసముద్రమువలననుండి, ఉద్ధరించిన=పైకెత్తిన, కిటిదంష్ట్ర=యజ్ఞవరాహమూర్తి కోఱయొక్క, ఒఱపుఁదెలిపెన్=రీతిని గనుపఱిచెను. ఇక్కడఁ బ్రళయకాలసముద్రమునకును శత్రుమతీనదికిని వరాహదంష్ట్రకును వసురాజపాదనఖమునకును నుపమానోపమేయభావమని విచారింపవలయును. ఉపమాలంకారము స్పష్టమే.

తా. కోలాహలము వ్రాలుటచే మగ్నమైన భూమి నుద్ధరించుటలో వసురాజుపద నఖరేఖ ప్రళయమున భూమి నుద్ధరించిన వరాహదంష్ట్రవలె నుండెను.

చ. బలరిపుమిత్రుఁ డైనయల • పార్థివతల్లజు పాదపల్లవో
జ్జ్వలనఖరేఖదండ నగ • షండవిఖండనచండిమంబు తా
వలముగ నభ్యసించెనొకొ • వజ్రము రాజశిరోవిభాగభా
గలఘుకిరీటవజ్రకళి • కాకృతి నిచ్చలు నాశ్రయించుచున్. 121

వజ్రము=వజ్రాయుధము, (ని. 'వజ్రోస్త్రీహీరకేపవౌ' అని అ.) రాజ=సామంతరాజులయొక్క, శిరోవిభాగ=శిరఃప్రదేశములను, భాక్=పొందిన, అలఘు=అతిశయములైన, కిరీట=కిరీటములయందలి, వజ్రకళికాకృతిన్=మొగ్గలుగాఁ దీర్పఁబడిన వజ్రమణిస్వరూపముచేత, నిచ్చలునాశ్రయించుచున్=నిరంతరమును నాశ్రయించినదై, బలరిపుమిత్రుఁడైన=దేవేంద్రునికి స్నేహితుఁడైన, అలపార్థివతల్లజు=రాజశ్రేష్ఠుఁడైన యావసురాజుయొక్క, పాదపల్లవ=చిగురుటాకువంటి పాదమందు, ఉజ్జ్వల=ప్రకాశించుచున్న, నఖరేఖ=రేఖాకృతిగల నఖముయొక్క, దండన్=సమీపమున, నగషండ=పర్వతసమూహములయొక, విఖండన=భేదనమందలి, చండిమంబు=తీక్ష్ణత్వమును, తావలముగన్=స్థిరమైనటులుగా, అభ్యసించెనొకొ=నేర్చుకొనఁబోలును. పాదనఖరేఖ పల్లవోజ్జ్వలము గావున వజ్రముకళికాకృతినొందెను. ఆశ్రయించినదినిచ్చలు, విద్యనభ్యసించినది తావలముగ, రాజువద్దవజ్రాయుధము విద్యనభ్యసించుట బలరిపుమిత్రుఁడగుటవలన, పార్థివతల్లజుఁడుగాననే దేవేంద్రునకు మిత్రుఁడైనది.

తా. వసురాజుయొక్కపాదనఖము పర్వతభేదనముచేసినది గనుక నాసామర్థ్యము తనకు లభించుకొఱకుసామంతరాజమకుటసంఘటిత వజ్రకళికారూపముచేత నాశ్రయించి యాయనపాదనఖసన్నిధానమందుఁ బర్వతసమూహభేదనపాండిత్యమును నేర్చుకొన్నది.

ఈచెప్పుటచేత వసురాజు కాలిగోటిచేతఁ బ్రబలమయినపర్వతము నెగమీటినబలముగలవాఁడనియును సామంతరాజులచేత నిరంతరమును బాదప్రణామము చేయఁబడుచున్నవాఁడనియును దెలియఁబడుచున్నది. అలం. ఉత్ప్రేక్ష.

చ. ఘనుఁ డతఁ డేగుదెంచి సరి • గద్దియ నుండ నగారి శైలఖం
డనకథ చారణాళి వొగ • డన్ నిజసన్నుతి కోసరించు నే
ర్పునఁ దల వంచి పీఠతట • రూఢమణిన్ బొటవ్రేల మీటు న
య్యనఘుఁడు కొండ మీటినమ • హాద్భుతకృత్యము దెల్పుకైవడిన్. 122

ఘనుఁడు=గుణాధికుఁడైన, అతండు=ఆవసురాజు, ఏగుదెంచి=వచ్చినవాఁడై, సరిగద్దియనుండన్=సమానముగా గద్దెమీఁదఁ గూర్చుండఁగా, నగారి=పర్వతద్వేషియైన యింద్రుఁడు, శైలఖండన

కథ=తాను బర్వతములను ఖండించినకథను, చారణాళివాగడర్=స్తోత్రపాఠకసమూహము స్తోత్రము సేయఁగా, నిజసన్నుతికోసరించు నేర్పునర్ = ఆత్మస్తుతికి సహింపకపోయినట్టులుగా, అనఁగా నామిష చేతననుట, తలవంచి=తలవంచుకొని, పీఠతట=గద్దెపీటయొక్క దరియందు, రూఢ=స్థాపింపఁబడిన, మణిర్ = ఒకానొకరత్నమును, బొటవ్రేలమీటుర్ = కాలిబొటనవ్రేలితోమీటును, ఏమితాత్పర్య ముచేతననఁగా, అయ్యనఘుఁడు=నిష్కల్మషుఁడైన యావసురాజు, కొండమీటిన=కోలాహలపర్వత మును కాలిబొటనవ్రేలిగోటితో నెగమీటిన, మహాద్భుతకృత్యముర్ = అత్యాశ్చర్యకరమైన కార్య మును, తెల్పుకైవడిర్=తెలియఁజేయునటులుగా, పీఠతటరూఢమణిని బొటనవ్రేలమీటునని సంబం ధము.

తా. వసురాజు దివ్యవిమానారూఢుఁడై స్వర్గమునకుఁబోయి దేవేంద్రునితోఁగూడ సరిగద్దియ మీఁద గూర్చున్నసమయమందు దేవేంద్రుఁడు పర్వతభేదనముచేసిన మహిమను జారణులు కైవారము సేయఁగా నాత్మస్తుతికి లజ్జించినవానివలెఁ దలవంచుకొని బొటనవ్రేలితోఁ బీఠపార్శ్వగత రత్నమును మీటుచుండుట వసురాజీప్రకారముగా బొటనవ్రేలిగోటిచేతఁ బర్వతమును మీటివైచినాఁడు.ఇట్టివాని సన్నిధానమందు నేను వజ్రాయుధముచేతఁ బర్వతభంజనముచేసినకథ యేమిగొప్ప యని పొగడుచు న్నారు కాఁబట్టి పొగడవద్దని తెలియఁజేసినట్టులుగా నుండెను.

ఇచట లజ్జ కనుభావమైన పీఠలేఖనమందు వసురాజొనర్చిన పర్వతసముత్సారణవ్యాపారముం దెలుపుట నుత్ప్రేక్షించుటచే నుత్ప్రేక్షాలంకారము.

మ. అనఘాత్మీయపదోపకంఠమునఁ బ్రాణాచారముం బూనురీ
తి నితాంతానతశృంగమై నిభృతమై దిక్కేడి యకొండ యుం
డిన గొన్నాళ్లకుఁ గేళిశైలముగఁ బాటించె న్మహీజాని మ
న్ననఁ దచ్ఛైలశిరంబుపై మృదుపదన్యాసంబు గావించుచున్. 123

అనఘ=కల్మషరహితమైన, ఆత్మీయ=స్వకీయమైన, పద=పాదములయొక్క, ఉపకంఠమునర్= సమీపమందు, అనియర్థము. పదోపకంఠమునర్=స్థానమైన పట్టణముయొక్క సమీపమందనిభావము. ప్రాణాచారముం బూనురీతిర్=ప్రాణాచారము పడ్డట్టులుగా, నితాంత=మిక్కిలియు,ఆనత=వంపఁబడిన, శృంగమైన=శిఖరముగలదై,నిభృతమై=నిశ్చలమైనదై, దిక్కేడి=దిక్కుచెడి,అకొండయుండినర్=ఆ కోలాహలపర్వతముండఁగా,కొన్నాళ్ళకుర్=కొన్నిదినములమీఁద, మహీజాని=వసురాజు,(మహీజాయా అస్యేతి మహీజానిః జాయాని జెతి సమాసాన్తో నిఙాదేశః) బహువ్రీహియందు జాయాశబ్దంబు జానియగు (బాలవ్యా.)

మన్ననర్ = ఆదరముచేత, తచ్ఛైలశిరంబుపైర్=ఆ పర్వతశిరోభాగముమీఁద, మృదుపద న్యాసంబు గావించుచుర్=మృదువైన పాదవిన్యాసము సేయుచు, కేళిశైలముగఁబాటించెర్=క్రీడా పర్వతముగా నంగీకరించెను. ఇందు నితాంతానతశృంగత్వ నిభృతత్వా నన్యగతికత్వాదులు ప్రాణా చారలక్షణములని తెలియవలయును. ఉత్ప్రేక్షాలంకారము.

కోలాహలుఁడు పరాభవింపఁబడి శృంగము వాల్చి చలింపక కొంతకాల మున్నపిదప వసురాజు కరుణించెను. వెంటనే కరుణింపలేదు. కరుణించుటకు హేతువు ప్రాణాచారపడుటయే. నితాంతా నతశృంగమగుటవలననే నగాధీశుఁడు కేళిశైలమగు నవకాశము కలుగుట.

తా. తనపదోపకంఠమున శృంగము వ్రాల్చి నిశ్చంచలముగాఁ బ్రాణాచారముపడుటచేఁ గోలాహలుని వసురాజు కౌన్నాళ్లకుఁ గరుణించి క్రీడాశైలముగఁ గొని శైలశిఖరమున విహరింపసాగెను.

ఉ. ఆనరలోకపాలకు మహామహనీయభుజోపగూహన
శ్రీ నిరవొందుచుం బుడమి చేడియ గోత్రము లూఱడిల్ల సం
తానసమృద్ధిచే శుభవితానముతానక మయ్యె నేకసం
తానముఁ గన్నదైవతవతంసపురిం బురణించి నవ్వుచున్. 124

ఆ నరలోకపాలకు=ఆ వసురాజుయొక్క, మహత్=అధికమైన, మహనీయ=ఒప్పుచున్న, భుజోపగూహనశ్రీన్=భుజాలింగనసంపత్తిచేత, ఇరవొందుచున్=ఒప్పుచు, పుడమిచేడియ=భూకాంత, గోత్రములూఱడిల్లన్=వంశములూఱడిల్లఁగానని యర్థము, కులపర్వతములు ధరాభరణశ్రమమునుబాసి విశ్రాంతినొందఁగానని భావము. సంతానసమృద్ధిచేన్=సంతానపరంపరలచేత ననియర్థము,సప్తసంతానసమృద్ధిచేత ననిభావము. ఏకసంతానముఁగన్న=ఒక్కకొడుకు కొడుకుగాఁడన్నసామెతగా నొకసంతు గలిగి కదళీవంధ్యయైన, దైవతవతంసపురిన్ = ఇంద్రపట్టణమయిన స్వర్గమును, పురణించినవ్వుచున్ = విజృంభించి పరిహాసముసేయుచు, శుభవితానముతానకమయ్యెన్=శుభసముదాయమున కాస్పదమాయె నని యర్థము, స్వర్గమందు సంతానవృక్ష మొక్కటియే యున్నదని భావము. (ని. 'సన్తాన స్సన్తతౌ గోత్రే స్యా దపత్యే సురద్రుమే' అని విశ్వము.)

పుడమిచేడెగాన నరలోకపాలకుని భుజోపగూహన మొందెను. ఉపగూహనము మహామహనీయము. శుభవితానములు సంతానసమృద్ధిగోత్రాంగీకరణము. నవ్వుట స్వోత్కర్షాసూచకము.

తా. భూకాంత వసురాజు భుజోపగూహనములతో నానందించుచు గోత్రములు (భూమిని భరించుశైలములు) ఊఱడిల్ల శుభాస్పదమగు సంతానసమృద్ధితో నలరి యేకసంతానము (ఒకకల్పవృక్షము) గల యమరావతిని నవ్వసాగెను.

క. ఆగతి నభిమతభోగ, శ్రీ గలభువి కొసఁగె నుల్లసితపత్రలతా
సౌగంధ్యము నవకళికా, సౌగంధ్యము చైత్రలక్ష్మి సైరంధ్రిక్రియన్. 125

ఆగతిన్=పూర్వోక్తప్రకారముగా, అభిమతభోగశ్రీగల=అభీష్టసుఖసంపత్తిగలిగిన, భువికిన్=భూకాంతకు, చైత్రలక్ష్మి=వసంతలక్ష్మి, సైరంధ్రిక్రియన్=సైరంధ్రియనఁగా పాతివ్రత్యహాని లేకుండఁ బరగృహమందు స్వాధీనురాలై యుండి రాజకన్యకలకు మకరికాపత్రరచనాదికృత్యములాచరించునట్టి స్త్రీకిపేరుగనుక నట్టిసైరంధ్రివలెనే,(ని. సైరంధ్రీ పరవేశ్మస్థా స్వవశా శిల్పకారికా'అని అ.)ఉల్లసిత=వికసించిన, పత్రలతా=తీఁగెలుగా వ్రాయఁబడు మకరికాపత్రరచనలయొక్క, సౌగంధ్యము=సంబంధసహితత్వమునని యర్థము, ఆకులయొక్కయు దీఁగెలయొక్కయు సంబంధసహితత్వమునని భావము. సౌగంధ్యశబ్దమునకు నిక్కడగంధమనఁగా సంబంధము సంబంధసహితమయినది సగంధము సగంధభావము. సౌగంధ్యమని విచారింపవలయును. (ని. 'గన్ధో గన్ధక ఆమోదే లేశే సంబన్ధ గర్వయోః' అని వి.) నవకళికా=కొంచెముగా వికసించిన మొగ్గలయొక్క, సౌగంధ్యము=సౌరభ్యమును, ఒసఁగెన్=ఇచ్చినదాయెను. అనఁగా భూమియందు వసంతర్తువు ప్రవేశించి వృక్షలతాదులను జిగిరింపఁజేసి పుష్పింపఁజేసెనని భావము.

శ్రీగల యన్నచోటఁ బ్రథమావిభ క్తియైన శ్రీశబ్దమునకంటెఁ బరమందున్న కల యనెడుపద మందలి కకారమునకు గకారాదేశమువచ్చినది గనుకం బ్రాసముగాఁ జెప్పినాఁడు. ఇది సంధిగతప్రాస మనంబడును. దీనికిఁ బ్రమాణము.

తే. 'సంధిఁగూడిన ప్రాలుప్రాసంబులైన, నవియె సంధిగతాఖ్యల నమరుచుండు
దివిజు లాశ్చర్య మొంద శౌరివడ వైచెఁ, జెంగి పోనీక మధురలో నంగరిననఁ.'

అలం. కావ్యలింగము. ఉపమ. అప్పకవీయము.

తా. భూదేవి రాజన్యునకు నభీష్టసుఖములఁ గూర్చుచుండ నంతలోఁ జైత్రలక్ష్మి సైరంధ్రివలెఁ బత్త్రలతాసౌగంధ్యము కళికాసౌగంధ్యము సమకూర్చి భూదేవి నలరింపసాగెను. (అంతలో వసంత ము వచ్చె ననుట.)

సీ. లలనాజనాపాంగ • వలనావసదనంగ తులనాభికాభంగ • దోగ్రప్రసంగ
మలసానిలవిలోల • దళసాసవరసాల ఫలసాదరశుకాల • పనవిశాల
మలినీగరుదనీక • మలినీకృతధునీక మలినీసుఖితకోక • కులవధూక
మతికాంతసలతాంత • లతికాంతరనితాంత రతికాంతరణతాంత • సుతనుకాంత

తే. మకృతకామోదకురవకా • వికలవకుల, ముకులసకలవనాంతప్ర • మోదచలిత
కలితకలకంఠకులకంఠ • కాకలీవి, భాసురగము వొల్చు మధుమాస • వాసరంబు.

లలనాజన=స్త్రీజనముయొక్క, అపాంగ=క్రేగంటిచూపులయొక్క, వలన=చలనమందు, అప సత్=నివసించిన, అనంగ=మన్మథునితోడ, తులన=సమానధర్మముగల, అభిక = కాముకులయొక్క, (ని. 'కమనః కామనో భికః' అని అ.) అభంగ = అంతరాయములేని, దోర్గ్రప్రసంగము=ఆలింగన ప్రచారములు గలిగినదియు,

మన్మథుఁడు చెలువల కడగంటిచూపుల కదలికల నాశ్రయించి యుండుననుట ప్రసిద్ధము.

శ్లో. ''నూన మాజ్ఞా కర స్తస్య సుభ్రువో మకరధ్వజః,
యత స్తన్నేత్రసంచార సూచితేషు ప్రవర్తతే.'' భర్తృహరి.

అతఁ డనంగుఁడు గావుననే క్రేగంటిచూపుల నాశ్రయించి బ్రతుకవలసివచ్చినది. పురుషులు మన్మథసమానులగుటవలనఁ జెలువలు కౌఁగిలింతలు అభంగముగా నెఱవేర్చుచున్నారు.

అలస=మందగతిగల, అనిల=వాయువుచేత, అనఁగా మలయమారుతముచేత, విలోల = మిక్కిలియుఁ జలించుచున్న, దళ=చిగురుటాకులుగలిగినవియుఁ, సాసవ=ఆసవ మనఁగా మకరందము, మకరందముతోఁ గూడుకొన్నవియునగు, రసాల = తియ్యమామిడిచెట్లయొక్క, (ని. 'ఆమ్ర శ్చూతో రసాలో సౌ' అని అ.) ఫల=ఫలములయందు, సాదర = ఆదరముతోఁ గూడుకొన్న, శుక=చిలుకల యొక్క, ఆలపన=ఆలాపముచేత, విశాలము=విస్తారమయినదియు,

గాడ్పులు మందముగా వీచుచున్నవి. ఫలములు ఆసవము విరివిగానున్నది. ఫలాశచేఁ జిలుకలు కలస్వనము చేయుచున్నవి. చిలుకలకు ఫలాశదీఱకున్నదనియు ఫలోత్పత్తి కాలమనియు నెఱుంగనగు. పరిమళభారవాహములగుటచే గాడ్పు లలసముగనుండెను.

అలినీ=ఆఁడుతుమ్మెదలయొక్క, గరుత్=ఱెక్కలయొక్క, అనీక=సమూహముచేత, మలినీ

కృత=నల్లనివిగాఁజేయఁబడిన, ధునీ=నదీసంబంధములైన, కమలినీ=తామరతీఁగెలయందు, సుఖిత = సంజాతసుఖములైన, కోకకులవధూకము=చక్రవాకస్త్రీలుగలిగినదియు,

పుష్పరసము విరివిగా లభించుటచేఁ దుమ్మెదలు మెఱుఁగెక్కినవనియు వానిఱెక్కల కాంతులచేఁ దమ్ములు నల్లఁగ నున్నవనియుఁ భావము.

అతికాంత=అత్యంతమనోహరములైన, సలతాంత=పుష్పసహితములైన, లతికాంతర=తీఁగెలయిండ్లలోపల, నితాంత=ఎడతెగని, రతికాంతరణ = మన్మథయుద్ధమందు, తాంత=అలసిన, సుతనుకాంతము=స్త్రీపురుషులుగలిగినదియు,

వసంతర్తువు మనోహరముగనుంటచే స్త్రీపురుషులు నిరంతరకేళికల మెలఁగసాగిరి. కాననే బడలిరి. పొదరిండ్లు ప్రసవావృతములై కామోపభోగములకుఁ దగియుండును. మొదటిపాదమున దట్టపుఁగౌఁగిలింతలు ఇందు రతియుఁ జెప్పఁబడినది. వసంతమునఁ బొదరిండ్లు భోగార్హములనుట.

అకృతక=కృత్రిమముగాని, అనఁగా స్వభావసిద్ధమయిన, ఆమోద = పరిమళముగలిగిన, కురవక=గోరంటపువ్వులుగలిగినదియు, అవికల=విచ్ఛిన్నములుగాని, వకుళ=పొగడచెట్లయొక్క, ముకుళ =మొగ్గలుగలిగిన, సకల=సమస్తములైన, వనాంత = వనమధ్యములయందు, ప్రమోద=సంతోషముచేత, చలిత=సంచరించుచున్న, కలిత=ఒప్పిదములగుచున్న, కలకంఠ=కోయిలలయొక్క, కుల=సమూహముయొక్క, కంఠకాకలీ=కంఠసంబంధమయిన యవ్యక్తమధురధ్వనిచేత, భాసురము=ప్రకాశించుచున్నదియునగు, మధుమాసవాసరంబు=వసంతవాసరము, పొల్చున్=ప్రకాశించును. ఈసీసపద్యపు ప్రతిపాదమునను నాలుగంత్యప్రాసములు గలుగఁజెప్పినాఁడు.

తా. వసంతమునందు పొగడలు గోరంటలు పూచియుఁబొగడలు మొగ్గలు తొడిగియుండఁ గోకిలలు కూయసాగెను. కాముకులు కౌఁగిలింతలసుఖ మనుభవింపసాగిరి. చిలుకలు తీయమావిపైఁ జేరి మధురముగ భాషింపసాగెను. తుమ్మెదఱెక్కలచే నల్లనైన తమ్మితీవియలలోఁ జక్కవలు మెలఁగఁ దొడఁగెను. స్త్రీపురుషులు వసంతవశమునఁ బుష్పితములై మనోహరముగానున్న పొదరిండ్లలో నలసట గలుగునటులఁ గామకేళికల దేలిరి.

చ. ఒనర హిమావకుంఠనము • లూడ్చి తెమల్చినపత్త్రభంగముల్
సన నసియాడుచున్ మొగడ•చన్నులు పల్లవపాణిఁ గప్పునూ
తనలతికాలతాంగుల నుదారగతిం జలి వాపి నెయ్యపుం
బెనకువ నేర్పె దక్షిణస•మీరణుఁ డొయ్యనఁ దావు లంటుచున్. 127

ఒనరన్=ఒప్పిదమగునట్టులుగా, హిమ = మంచనెడు, అవకుంఠనములు = పైముసుఁగులను, ఊడ్చి=విడఁదీసి, తెమల్చిన=చలింపఁజేయఁబడిన, పత్త్రభంగముల్సనన్=భంగములనఁగాఁ బరంపరలును రచనలును, భంగములనఁగాఁ బరంపరలనుటకు-

శ్లో. 'కస్తూరీవరపత్త్రభంగనికరో భ్రష్టో న గండస్థలే.' శృంగారతిలకము.

పర్ణపరంపరలనెడుకస్తూరికాపత్త్రరచనలు చెదరిపోవుచుండఁగా, అసియాడుచున్ = కంపించుచు, మొగడచన్నులు = పూమొగ్గలనెడు లేఁతచన్నులను, పల్లవ=చిగురుటాకులనెడు, పాణి = హస్తములచేత, కప్పు = ఆచ్ఛాదించుచుండెడు, నూతన = క్రొత్తవైన, లతికా = తీఁగె

లనెడు, లతాంగులన్ = స్త్రీలను, అనఁగా నవోఢలను, ఉదారగతిన్ = ఉదారశబ్ద మతిశయమందును దాతయందును వర్తించుచున్నదిగనుక నతిశయగతియనెడు ముక్తాహారాది ప్రదానముచేత, చలివాపి = శైత్యనివారణము చేసి యనియును గంపము పోఁగొట్టి యనియును నర్థము. దక్షిణసమీరణుఁడు = దక్షిణవాయువనెడు దక్షిణనాయకుఁడు, ఒయ్యనన్ = తిన్నఁగా, తావులంటుచున్=తావులనఁగాఁ బరిమళములును స్థానమును గనుకఁ బరిమళములంటుచు ననియును గళాస్థానములంటుచు ననియును నర్థము. 'నెయ్యపుం బెనుకువ నేర్పెన్' పెనుకువ యనఁగా నల్లికయును గలయికయును గనుక నిష్టమైన యల్లిక నేర్పెననియును గలయిక నేర్పెననియు నర్థము. అనఁగా శీతకాలముపోయి వసంతకాలము రాఁగానే మలయమారుతము వ్యాపించి నూతనపుతీఁగెలయందుఁ జిగురుటాకులను పూమొగ్గలను నుత్పాదించి తీఁగెలంతట నల్లుకొనునట్లులుగాఁ జేసెనని తాత్పర్యము. అలం-రూపకసావయవము. శ్లిష్టమును.

ఇట లతాంగులు నవోఢలు. కాననే నూతనలతికాలతాంగు లనఁబడిరి. మొగడచన్నులు చేతులఁ గప్పుకొనుట, హిమావకుంఠనము గీలించికొనుట స్వభావగుణములు. బహుప్రియాసదృశశీలుఁడు దక్షిణనాయకుఁడు గావున దక్షిణసమీరుఁ డిట దక్షిణనాయకుఁడని తెలియునది. లతాంగులయెడ సదృశముగా వర్తించుటయే యిందులకుఁ దార్కాణ.

నవోఢాలక్షణము. రసమంజరినుండి-

శ్లో. బలా న్నీతా పార్శ్వం ముఖ మనుముఖం నైవ కురుతే
ధునానా మూర్ధానాం క్షిపతి వదనం చుబసనవిధౌ,
హృది న్యస్తం హస్తం క్షిపతి గమనారోపితమనా
నవోఢా వోఢారం రమయతి చ సన్తాపయతి చ.

తా. మంచుముసుఁగులు తొలఁగించి పత్రాదులు చెదర మొగడచన్నులు చేత మాటుపఱచుకొను నూతన లతాంగుల (నవోఢలను-తీవియలను) జలివాపి దక్షిణ సమీరుఁడు తావులు (సుగంధములు-కళాస్థానము) తాఁకుచుఁ బెనకువ నేర్పుచుండెను.

మ. అలరుంగైదువుజోదుకూర్మిసయిదో•డై మాధవశ్రీతపః
ఫలమై యాడుమరుత్కుమారుఁ బ్రియ మొ•ప్పం దేనెనీరార్చి పెం
దెలిపూజొంపపుపొత్తులం బొదివి ధా•త్రీజాతముల్ జోలవా
డె లసత్పల్లవడోలనుంచి కలకం•ఠీనాదగీతంబులన్. 128

అలరుంగైదువుజోదు=పుష్పాయుధుఁడైన మన్మథునియొక్క, కూర్మిసయిదోడై=ముద్దుతమ్ముఁడై, మాధవశ్రీ=వసంతలక్ష్మియనెడు లక్ష్మీదేవియొక్క, తపఃఫలమై=తపస్సునకుఫలరూపమై, యాడు=క్రీడించుచుండెడు, మరుచ్ఛబ్దము వాయువునందును దేవతలయందును వర్తించును. (ని. 'మరుతౌ పవనామరౌ' అని అ.) మరుత్కుమారున్=కుమారవాయువనెడు దేవతాకుమారుని, ప్రియమొప్పన్=ప్రేమాతిశయమొప్పఁగా, తేనెనీరార్చి=పువ్వుదేనియలచేత జలకమాడించి, పెందెలి పూజొంపపుపొత్తులంబొదివి=విశాలమైన తెల్లని పువ్వుగుత్తులనెడు పొత్తులలోఁ బొదిగి, లసత్=ఒప్పుచున్న, పల్లవ=చిగురుటాకులనెడు, డోలనుంచి=తొట్లలోఁ బరుండఁబెట్టి, కలకంఠీనాద = ఆఁడుకోయిలలయొక్క-

ధ్వనియనెడు, గీతంబులన్ =పాటలచేత, ధాత్రీజాతముల్ = వృక్షములనెడు పెంపుడుతల్లులయొక్క సమూహములు, జోలవాడెన్ =జోలపాడెను. (సి. 'ధాత్రీ స్యా దుపమాతాపి క్షితిర ప్యామలక్యపి' అని విశ్వము.) అలం-పరికరము. కావ్యలింగము.

తా. మన్మథుని చెలికాఁడును, మాధవ (వసంత-విష్ణు) తపఃఫలమునగు మరుత్కుమారుని (చిఱుగాడ్పులు-దేవపుత్రుఁడు) తేనెనీటఁ దానమాడించి పూఁజొంపంపుఁ బొత్తులఁ బరుండఁబెట్టి పల్లవ డోలికనుంచి కోయిలలనాదముతో ధాత్రీజాతములు (వృక్షములు-దాదులు) జోలఁబాడ సాగెను.

సీ. మునుసుమనోరాగ•మునవసంతము సూపెఁ గాననేందిర యశో•కంపుఁగొమ్మ
  కాకొమ్మ నగుచు నెయ్యమునఁ గ్రొన్ననతేనె మెలఁగెడుసరసాళి•మీఁదఁజల్లె
  నాసరసాళిసో•యగపుఁబాటలతోడఁ జని మాధవి ప్రవాళ•శాటిఁ దుడిచె
  నామాధవి పరాగ • మక్షిరాగము మించఁ బఱతెంచుకలకంఠి•పై విదిర్చె
తే. నిట్లు లతికలు హితకోటి•నెనసి యపుడు, మదనదేవోత్సవక్రీడఁ•బొదలు ననిన
  వరులుఁ దరుణులువిరులయో•వరులవరలు,సిరులవలరాచజాతర • లేసేయుటరుదె.

మును=ముందుగా, కాననేందిర=వనలక్ష్మియనెడు నొకానొక స్త్రీ, అశోకంపుఁగొమ్మకున్ = అశోకతరుశాఖ యనెడు శోకరహితస్త్రీకి, సుమనోరాగమునన్ = మంచి మనోరాగముచేత, లేక కుసుంబాపువ్వులయొక్క పుప్పొడిచేత ననియర్థము, పుష్పరక్తిమయనిభావము. వసంతముసూపెన్ = రంజకద్రవ్యవిశేషమును గనుపఱిచెను, అనఁగా వసంతము చిలికెననియర్థము. వసంతర్తుధర్మమును గనుపఱిచెనని భావము. ఆకొమ్మ=ఆయశోకపుకొమ్మ,నగుచున్=పరిహాసముచేయుచు, నెయ్యమునన్ = చెలిమిచేత, క్రొన్ననతేనె=క్రొత్తపూఁదేనియ, మెలఁగుడు = తిరుగుచున్న, సరసాళిమీఁదఁజల్లెన్ = సరసమైన తుమ్మెదయనెడు సరసురాలైన సఖిమీఁదఁజల్లెను.

ఆసరసాళి=అనఁగా సరసమైన యాతుమ్మెద యనియెడు సరసురాలైన యాసఖియని యర్థము. సోయగపుఁబాటలతోడఁజని=శృంగారయుక్తమైన పాటలుపాడుచుఁబోయి, మాధవి=యనఁగా బండి గురువిందతీఁగె,అది యనెడు మాధవీనామముగలయొకానొక స్త్రీయొక్క, ప్రవాళమనఁగాఁ జిగురు టాకు, అదియనెడు వస్త్రముచేత, తుడిచెన్=ఆ పూఁదేనియను దుడిచివైచెను, ఆమాధవి, అనఁగా బండిగురువిందతీఁగెయనెడు మాధవీనామముగల యాస్త్రీ, పరాగము, అనఁగా రంజకద్రవ్యవిశేషమును అని యర్థము, పుప్పొడి యనిభావము. అక్షిరాగముమించఁ బఱతెంచుకలకంఠిపై విదిర్చెన్ = స్వాభావికమయిన నేత్రరక్తిమ మించుచుండఁగాఁ బరుగెత్తివచ్చుచున్న యాడుకోయిలమీఁద విదిలించెననియును ద్వరితముగావచ్చుచున్న యవ్యక్తమధుర కంఠస్వరముగల స్త్రీమీఁదను గన్ను లెఱ్ఱఁ బడునట్టులుగా విదలించెననియును నర్థము విచారింపవలయును. ఇచట నభేదాధ్యవసాయము సేయ వలయును.

ఇట్లు=ఈప్రకారముగా, లతికలు=తీఁగెలు, హితకోటినెనసి = ఇష్టసమూహమును గలిసికొని, అపుడు=ఆవసంతర్తువునందు, మదన దేవోత్సవక్రీడఁ బొదలుననినన్=మన్మథదేవతాసంబంధమయిన యుత్సవక్రీడచేత నొప్పుచుండునని చెప్పుచుండఁగా, వరులుఁదరుణులు=పురుషులును స్త్రీలును, విరుల

యౌవరులన్=పూఁజప్పరములయందు, పరలుసిరులన్=ప్రకాశించుచుండెడు సంపదలచేత, వలరాచజాతరల్సేయుటరుదె=మన్మథోత్సవములు సేయుట యాశ్చర్యమా, అనఁగా నాశ్చర్యముగాదనుట. అలం-శ్లేషము. అర్థాపత్తి.

తా. అశోకాదులు పుష్పింప నామకరందమును దుమ్మెదలు పానము జేసి పాటలుపాడసాగెను. బండిగురివెందలు పుష్పాదులతో నలరెను. కోకిలలు సంచరింపఁదొడఁగెను. ఇదియంతయుఁ లతికలొనరించు వసంతక్రీడవలెనుంటచే స్త్రీపురుషులు వసంతోత్సవములు జరుపుటలో నచ్చెరువేమున్నది?

మ. అరిగాఁ బంచమ మేవగించి నవలాలవ్వేళ హిందోళవై
ఖరి సూపం బికజాత మాత్మరవభంగవ్యాకులం బై వనీ
ధర నాలంబితపల్లవవ్రతవిధుల్ దాల్పం దదీయధ్వనిన్
సరిగాఁ గైకొని యెన్ వసంతము మహాసంపూర్ణభావోన్నతిన్. 130

నవలాలు=అనఁగా స్త్రీలు, ఇది దేశ్యపదముగనుక హ్రస్వము రాలేదు. ఇందుకు, (ని. దీర్ఘాణాంహ్రస్వస్సాద్యన్నచదేశ్యపదేనచైకవర్ణేపి' అని న.) అవ్వేళన్=ఆవసంతాదియందు, అరిగాఁ బంచమ మేవగించి=కోవెలలకుఁ బ్రతికూలమగునట్టులుగాఁ బంచమస్వరమును విసర్జించి యని యర్థము. రి, అనఁగా ఋషభస్వరమునకు సంజ్ఞగనుక ఋషభస్వరరహితమగునటులుగా నని భావము.

శ్లో. 'ప్రథమశ్రవణాచ్ఛబ్దశ్శ్రూయతే హ్రస్వమాత్రకః,
సాశ్రుతి స్సమ్పరిజ్ఞేయా స్వరావయవలక్షణా,
శ్రుతిభ్యస్స్యు స్స్వరాష్షడ్జర్షభగాంధార్యమధ్యమాః,
పంచమో ధైవతశ్చాథ నిషాద ఇతి సప్తతే,
తేషాంసంజ్ఞా స్సరిగమపధనీతి స్వరామతాః.'

అని సంగీతశాస్త్రమున, హిందోళవైఖరి సూపన్ =హిందోళమనఁగా హిందోళరాగము, అది ఋషభపంచమస్వరములు రెండునుగాక కడమ యయిదుస్వరములతోఁ గూడుకొన్న యౌడవరాగమనియును శిశిరర్తువసంతర్తువులయొక్క సంధికాలమందు గానముచేయఁబడునదియనియు సంగీతశాస్త్రప్రసిద్ధముగనుక నట్టి హిందోళరాగముయొక్క వైఖరిని గనుపఱుపఁగా, అనఁగా నారాగమును బాడఁగా ననుట.

శ్లో. 'శిశిరస్య వంసతస్య సన్ధౌ హిన్దోళరాగకః' అనియును,
శ్లో. 'ఔడవః పఞ్చభిః ప్రోక్త స్స్వరై ష్షడ్భిస్తు షాడవః,
సంపూర్ణ స్సప్తభి ర్జ్ఞేయ ఏవంరాగాస్త్రిధామతాః.'

అనియు నిత్యాదులు సంగీతశాస్త్రమందుఁ జెప్పఁబడియున్నవి. పికజాతము = కోకిలసమూహము, ఆత్మరవ = స్వీయమయిన పంచమస్వరముయొక్క, భంగ=తిరస్కారమువలన, వ్యాకులంబై=విచారముగలదై, వనీధరన్ = వనభూమియందు, ఆలంబిత=అవలంబింపఁబడిన, పల్లవ=చిగురుటాకులుగల, వ్రత=నియమముయొక్క, విధులు=విధానములను, తాల్పన్=వహింపఁగా, అనఁగాఁ బర్ణభక్షణముచేసి తపస్సుచేయఁగా ననుట, తదీయధ్వనిన్ = ఆకోకిలసమూహముయొక్క రవమును, అనఁగా బంచమస్వరమును, వసంతము=వసంతరాగము; మహాసంపూర్ణభావోన్నతిన్=మహత్తయిన సంపూర్ణభావాతిశ

యముచేత, సరిగాన్=కోకిల కనుకూలమానట్టులుగా నని యర్థము. ఋషభసహితమగునట్టులుగా నని భావము. కైకొనియెన్=అంగీకరించెనని యర్థము. వసంతర్తు ప్రవేశముకాఁగానే స్త్రీలు ఋషభపంచమములతోఁగూడ సప్తస్వరసహితమయి సంపూర్ణసంజ్ఞగలవసంతరాగమును బాడిరని యాశయము.

"కేచిదౌడవసంపూర్ణాః కేచిత్షాడవపూరణాః, కేచిత్సంపూర్ణరాగాశ్చ" అని ఔడవషాడవములును పంచషడ్స్వరముల నొప్పి సంపూర్ణము లగుటవలన సప్తస్వరసహితమైన వసంతరాగమును సంగీతకలారహస్యనిధియగు రామరాజభూషణుఁడు మహాసంపూర్ణవిశేషణవిశిష్టముగాఁ జెప్పెను.

మ. కరఘాతంబుల కోర్వ లేక హిమసంఘాతంబు శీతక్ష్మా
ధరదుర్గంబు భజింపఁగా నలజగత్కంపప్రదాస్తోకభీ
కరదోషాయతిశాలిఁ జుట్టుకొని లగ్గల్వట్టి ఘట్టింతు నం
చరవిందాప్తుఁ డుదీచి కేఁగెఁ బ్రబలుండై మాని దాక్షిణ్యమున్. 131

కరఘాతంబులకోర్వలేక=ముష్టిఘాతములకు సహింపలేక యని యర్థము. కిరణములవేఁడిమికి తాళలేకయని భావము. హిమసంఘాతంబు=మంచుయొక్కగుంపు, శీతక్ష్మాధరదుర్గంబుభజింపఁగాన్=హిమవత్పర్వతదుర్గము నవలంబింపఁగా నని యర్థము. స్వకీయస్థానముగనుక శీతక్ష్మాధరదుర్గమును శీతసంఘాత మాశ్రయించెనని యాశయము. అల=ఆ, జగత్కంపప్రద=జగత్తులకుఁ దొందరనిచ్చుచున్నదనియు, అస్తోకభీకర=అధికభయమును బుట్టించునదియు, దోష=పాపముయొక్క, ఆయతి=దైర్ఘ్యముచేత, శాలి=ఒప్పుచున్నట్టి హిమసంఘాతంబు అని యర్థము. జగత్తులను జలిచేత వడఁకించుననియు మిక్కిలి భయంకరమయియుండుననియు దోషాయతిశాలియనఁగా రాత్రియొక్క దైర్ఘ్యముచేత నొప్పుచుండుననియును భావము. శీతకాలపురాత్రి యెక్కువగా నుండుట ప్రకటముగదా. చుట్టుకొని=ఇట్టిహిమసంఘాతమునఁ జుట్టవైచికొని, లగ్గల్వట్టి=ఆవరణముదాఁటి, ఘట్టింతునంచున్=మర్దింతుఁగాక యని, అరవిందాప్తుఁడు=కమలములకు హితుఁడయిన సూర్యుఁడు, మాని దాక్షిణ్యమున్=మోమోటము వదలి యని యర్థము. దక్షిణస్థితత్వము మానియనిభావము. ప్రబలుండై=బలాధికుఁడయి, ఉదీచి కేగెన్=ఉత్తరపుదిక్కునకుఁబోయెను. మంచువలన నరవిందములు చెడిపోవుచున్నవి గనుక సూర్యుఁ డరవిందాప్తుఁ డయినందున మంచును శిక్షింపఁ బోవుట యుక్త మనునభిప్రాయమును గ్రహింపవలయును. అలం. హేతూత్ప్రేక్ష. కావ్యలింగమును.

మంచువలనఁ దామరపూవులు చెడిపోవుటఁ జూచి యరవిందాప్తుఁడు తనయాప్తభావము ప్రకటింప నెంచెను. కావుననే దాక్షిణ్యమును విడనాడెను. తామరలు మంచుచేఁ జెడిపోవు ననుటకు-

శ్లో. అథవా మృదువస్తు హింసితుం మృదునైవా రభతే ప్రజాంతకః,
హిమసేకవిపత్తిరత్ర మే నలినీ పూర్వనిదర్శనం మతా.

మ. చివురుంగైదువువేల్పు చైత్రమున నక్షీణధ్వజోత్క్షేపవై
భవుఁడై తెమ్మెర తేరిపైఁ గదలి రాఁ బ్రత్యగ్రసాలాగ్రహ
ర్మ్యవిటంకంబులు ప్రాకి వల్లివనజాస్యల్సల్లి రుత్ఫుల్లప
ల్లవహస్తంబుల భావిభావుకఫలోల్లాసంబుతోఁ గ్రొవ్విరుల్. 132

చివురుంగైదువువేల్పు=అనఁగా మన్మథుఁ డనెడుదేవుఁడు, చైత్రమునన్=చైత్రమాసమందు, అక్షీణ=తక్కువగాని, ధ్వజోత్క్షేపవైభవుఁడై=మీనధ్వజారోహణమనెడు పట్టాంబరధ్వజారోహణ

వైభవముగలవాఁడయి, తెమ్మెరతేరిపైఁ గదలిరాన్=మలయమారుతమనెడు రథముమీఁద నెక్కి రాఁగా, ప్రత్యగ్ర=నూతనములయిన, సాలాగ్ర=వృక్షాగ్రములనెడు, హర్మ్యవిటంకంబులుప్రాకి=సౌధాగ్రములపై కెక్కి, వల్లివనజాస్యలు=తీఁగలనెడు స్త్రీలు, ఉత్ఫుల్ల=వికసించిన, పల్లవ=చిగురుటాకులనెడు, హస్తంబులన్=హస్తములచేత, భావి=ముందురాఁగలిగిన, భావుక=భవ్యమయిన, ఫలోల్లాసంబుతోన్ = పండ్లయొక్క యుల్లాసమనెడు ఫలోల్లాసముతోడ, క్రొవ్విరులు=క్రొత్తగా వికసించినపుష్పములను, చల్లిరి=చల్లినవారైరి.

తెమ్మెర తేరుగాఁగలవాఁ డగుటవల్లనే వేలుపు. తెమ్మెర రథముగాన నరదమునకంటె టెక్కెమెత్తుగానుండవలయుఁ గాన నది యత్క్షీణమైనది. కాననే క్రొవ్విరులు చల్లుటకు సాలాగ్రహర్మ్యవిటంకము లెక్కవలసి వచ్చినది. చైత్రమున మన్మథోత్సవములు గావించుట సుప్రసిద్ధము. మీనధ్వజమిట ధ్వజోత్క్షేపవైభవము, రథోత్సవము తెమ్మెరతేరిపైఁ గదలివచ్చుట యని తెలియునది.

లోకములో నొకానొక దేవునికి సంవత్సరోత్సవము జరిగించునెడల నాదేవుఁడు ధ్వజారోహణవైభవము నంగీకరించి క్రమముగా రథారూఢుఁడై వచ్చుచుండఁగాఁ బురస్త్రీలా రథముమీఁద దోసిళ్ళతోఁ బువ్వులు మొదలయినవి చల్లెడు సంప్రదాయముగనుక దాని ననుసంధించి మన్మథరథోత్సవవిషయముగాఁ జెప్పినాఁడు. అలం. రూపకము. సావయవము.

తెమ్మెర. తెం. దక్షిణపు ఎరల్ గాలిగావునఁ దెమ్మెరలు అనువ్యుత్పత్తివలనఁ దెమ్మెరలు అనుశబ్దమె యుక్తము. పూర్వకవు లీశబ్దములు వర్ణాంతముగఁ బ్రయోగించిరి. ఇటీవలికవులు ఏకవచనరూపము తెమ్మెర యని భ్రాంతిపడిరి.

మ. మహిళామండలమంజులభ్రమరకాఽమర్దంబు శ్యామాముహు
ర్ముహురున్మీలితపత్త్రభేదనిపుణంబుం బద్మినీకంకణ
గ్రహణాపాదియునై సగంధపటపప్రాప్తిన్ విజృంభించుచున్
విహరించెన్ మధుమత్తగంధవహ మవ్వేళన్ వనాంతంబునన్. 133

ఈపద్యమునందు మధుమాసమునందలి గంధవహపరముగను మద్యపానముగావించిన గర్వాత్మునిపరముగాను అర్థద్వయమును గవి చెప్పియున్నాఁడు.

మహిళా=ప్రేంకణపుతీఁగెలయొక్క, (శ్లో. 'శ్యామాతుమహిళాహ్వాయా, లతాగోవిన్దనీగున్ద్రా ప్రియఙ్గుః ఫలినీఫలీ' అని అ.) మండల=సమూహమందు, మంజుల=మనోహరములయిన, భ్రమరక=తుమ్మెదలయొక్క, ఆమర్దంబు = సమ్మర్దము గలిగినదియునని యర్థము. మహిళామండల=స్త్రీసమూహముయొక్క, మంజుల=కోమలములయిన, భ్రమరక=ముంగురులయొక్క, ఆమర్దంబు=పీడనము గలదని యర్థాంతరము. (శ్లో. 'అలకాశ్చూర్ణకున్తలాః, తే లలాటే భ్రమరకాః' అని అ.) శ్యామా=లతావిశేషముయొక్క, ముహుర్ముహురున్మీలిత = మాటిమాటికిని వికాసమును బొందుచుండెడు, పత్త్ర=ఆకులయొక్క, భేద=భేదనమందు, నిపుణంబున్=సమర్థమయినదియును, అని యర్థము. శ్యామా = యౌవనమధ్యస్థురాలియొక్క, ముహుర్ముహురున్మీలిత=మాటిమాటికిని రచియింపఁబడుచుండెడు, పత్త్ర=మకరికాపత్త్రములయొక్క, భేద = భిన్నపఱచుటయందు, నిపుణంబున్=సమర్థమయినదని యర్థాంతరము. పద్మినీ=పద్మలతాసంబంధమయిన, కంకణ=జలబిందువులయొక్క,

గ్రహణ=గ్రహించుటను, ఆపాదియగున్ = ఆపాదించుచున్నదియగునని యర్థము. పద్మినీ=పద్మినీ జాతిస్త్రీయొక్క, కంకణగ్రహణాపాదియును, ఇక్కడఁ గంకణశబ్దముచేత హస్త ముపలక్షిత మగుచున్నదిగనుక హస్తగ్రహణాపాదనము సేయుచున్నదని యర్థాంతరము. ఐ=ఇట్టిదై, సగంధ=పరిమళయుక్తమయిన, విటప=తరువిస్తారముయొక్క, ప్రాప్తిన్=పొందికచేత, విజృంభించుచున్=గర్వించుచును అని యర్థము. (ని. 'విస్తారో విటపోఽస్త్రియామ్' అని అ.) సగంధ=గర్వసహితుఁడయిన, విటప=విటనాయకునియొక్క, ప్రాప్తిన్=సాంగత్యముచేత, విజృంభించుచున్=విఱ్ఱవీఁగుచు అని యర్థాంతరము. మధు = మధుమాసమందు, మత్త=క్రొవ్విన, గంధవహము = వాయువు అని యర్థము. మద్యముచేత మదించినదని యర్థాంతరము. (ని. 'గన్ధో గన్ధక ఆమోదే లేశే సమ్బన్ధ గర్వయోః' అని వి.) అవ్వేళన్=ఆకాలమందు, వనాంతంబునన్=వనమధ్యమందు, విహరించెన్=సంచరించెను.

మధుమత్తగంధవహమను నమహన్నపుంసకమునకుఁ బుంస్త్వవివక్షచేయుట కవిసమ్మతము-

ఉ. శ్రీయుతమూర్తి యోపురుషసింహమ! సింహముపాలిసొమ్ము గో
మాయువు గోరు... (భాగవతము)

తా. మారుతము వసంతునిస్నేహమున నుల్లసిల్లి ప్రేంకణపుఁజెట్లపైఁగల తుమ్మెదల రొత్తిడి గూర్చుచు, లతావిశేషములఁ జివురాకులను వేఱుపడునటులఁ గదిలించుచు, తమ్మిపూలపైఁగల జలకణములంటుచుఁ దావులొలయుఁ జెట్ల నాశ్రయించి వనాంతరము సంచరింపసాగెను. (మధుమత్తుఁడగు పురుషుఁడు చెలువలముంగురులఁ దొలంగఁ ద్రోయుచు చెలువలమకరికాపత్త్రాదులఁ జెదర జేయుచుఁ బద్మినీజాతిస్త్రీలహస్తములఁ దాఁకుచు విటులచెలిమితోఁ జెలరేగెనని యర్థాంతరము.)

సీ. ఏపారుపొదరిండ్ల • నాపాటలాశోకదీపార్చిఁ గనకక•లాప మరసె
సాలావలులు దాఁటి • యేలాలతావారబాలాతతిపరాగ•పటము లూడ్చె
నానామధుపనవ్య•గానామృతము మెచ్చి సూనాసవము లెల్లఁ • జూఱ లిచ్చె
శంకారహితధీర•హుంకారశుకభటాహంకారముల ఫలా•హతి యొనర్చె
తే. ననుచు నాగంధవహునిధౌ•ర్త్యములు దెలుపు, లీలవిరిసినవిరులు రా•లినరజంబు
లొలికినరసంబు లురిలిన•ఫలము లధిపు, ప్రోలనిడిపల్కి రుద్యాన•పాలురపుడు.

వసంతవాయువును దొలుత గంధవహశబ్దసారస్యముచే గర్వగాఁ జెప్పి దుండగములను జూపి యిపుడు గంధవహనామ మానుకూలముగఁ గావించిన ధౌర్త్యములు వనపాలకులు రాజునకు దృష్టాంత సహితముగా నెఱింగించునటులఁ జెప్పుచున్నాఁడు.

ఏపారు=అతిశయించుచున్న, పొదరిండ్లన్=లతాగృహములనెడు గృహములయందు, ఆపాటలాశోకదీపార్చిన్- ఆపాటల = అంతటనెఱ్ఱనైన, అశోక=రక్తాశోకపుష్పమనెడి, దీపార్చిన్=దీపజ్వాలికచేత, కనకకలాపమరసెన్=కనకమనఁగా సంపెఁగయును బంగారమును, బంగారము పేళ్లన్నియు సంపెఁగకుఁ జెల్లును. సంపెఁగపువ్వులనెడు కనకస్తోమము గాంచెను. పొదరిండ్లు గావునఁ దలుపులు ద్వారబంధములు లేనివి. అందు ఆపాటలములగు నశోకపుష్పములను దీపములు గలవు. కాన కనకకలాప మరయఁ గలిగెను పరద్రవ్యసందర్శనమె యిట ధౌర్త్యము.

సాలావలులుదాఁటి=సాలమనఁగా వృక్షమును బ్రాకారమును, (ని. 'అనోకహః కుటస్సాలః' అని అ. ని.) ('ప్రాకారో వరణ స్సాలః' అని అ.) వృక్షసమూహములనెడు ప్రాకారసమూహములు దాఁటి, ఏలాలతా=ఏలకితీఁగెలనెడు, వారబాలా=వేశ్యాంగనలయొక్క, తతి=సమూహముయొక్క, పరాగ=పుప్పొడియనెడు, పటములు=వస్త్రములను, ఊడ్చెన్=విడిపించెను. మధుపశబ్దము తుమ్మెద యందును మద్యపాయియందును వర్తించును. లతావారః దీవెలచాలను బాలాః బాలికలయొక్క యనుట తగును. వారస్త్రీ సర్వజనపరిగ్రహణయోగ్యరాలు గాన నట ధార్త్యమునకుఁ దావులేదు. ఉండెఁబో బాలాపటము లూడ్చునంత ధార్త్యముగాదు.

నానా=సమస్తములయిన, మధుప = తుమ్మెదలనెడు మద్యపాయులయొక్క, నవ్య=నూతన మయిన, గానామృతము మెచ్చి=అమృతప్రాయమయిన సంగీతమును మెచ్చి, సూనాసవము లెల్లఁ జూర లిచ్చెన్=సూనాసవమనఁగా పూఁదేనెయు నిప్పపువ్వు మొదలైన పువ్వులచేతఁ జేయఁబడిన మద్యం బును, పూఁదేనియలనెడు నిప్పపూసారా మొదలైనవానిఁ జూరలిచ్చెను. మధుపులు త్రాగుఁబోతులు గాన వారలగానమునకు మెచ్చుట వారలకు పుష్పాసవము (సారాయము) కానుకగా నొసంగుట ధార్త్యము. ఇందుల కొలికినరసము తారాకాణము.

శంకారహిత=శంక లేనట్టి, ధీర=సమమైన, హుంకార = హుమ్మనెడు ననుకరణశబ్దముతోఁ గూడుకొన్న, శుక=చిలుకలనెడు, భట=భటులయొక్క, అహంకారములన్=గర్వములచేత, ఫల= పండ్లయొక్క, ఆహతి=పతనమనెడు, ఫలాహతి=వస్తులాభభంగమును, ఒనర్చెన్=చేసెను. చిలుకలు బంట్లు. కాననే జంకుగొనరు. వారికొలకు ఫలాహతిగావించుటయు ధార్త్యమె. ఫలాహతి యను టలోఁ గార్యఫలము చెఱచుటయు నగుగాన నదియ యుక్తమని యాశయము.

అనుచున్=అనిపలుకుచు, ఆగంధవహుని=గంధవహుఁడనఁగా వాయువును గర్వగ్రస్తుఁడును- ఆవాయువనెడు గర్వగ్రస్తునియొక్క, ధార్త్యములు దెలుపులీలన్=దుండగములు తెలియఁజేసినట్టు లుగా, విరిసినవిరులు=ఊడిపడినపువ్వులును, రాలినరజంబులు=రాలినపుప్పొడులును, ఒలికినరసంబులు= క్రుమ్మరిల్లినపూఁదేనియలును, ఉరిలినఫలములు=రాలిపడిన ఫలములును, అని క్రమాలంకారము. అధి పుప్రోలనిడి=వసురాజుముందర నుంచి, ఉద్యానపాలురు=వనపాలకులు, అపుడు=ఆసమయమందు, పలికిరి=ఒకవాక్యమును బలికిరి. ఉద్యానపాలు రన్నచోట (ని. 'లుజసోలజసోలాంతాల్లాంతాత్తురు రోతయోః క్రమేణ స్తః.' న.) అనుసూత్రముచే నకారపరక లకారాంతశబ్దమగు నీవనపాలశబ్దము నకు బహువచనమున రువర్ణకము వచ్చినది. అలం. ఉత్ప్రేక్ష. క్రమము. శ్లేషోత్థాపితము.

క. స్వామీ యేమని పొగడెద, మామనికిన్ మనికి యైన • యారామమునం
గామనిశితాస్త్రములు ద, త్కోమలతరలతలు చిగురు•కొమ్మల చేవల్. 135

స్వామీ=ఏలినవాఁడా, ఆమనికిన్=వసంతమునకు, మనికియైన=నివాసస్థానమైన, ఆరామము నన్=ఉద్యానవనమందు, కోమలతరలతలు=ఇక్కడ లతాశబ్దమువలనఁ దజ్జన్యములైన పుష్పములు లక్షితములగుచున్నవి. కోమలతర=అత్యంతసుకుమారములైన, లతలు=తీఁగలయందుండు పుష్పములు, కామనిశితాస్త్రములు=మన్మథకతీరబాణములు, చిగురుకొమ్మలున్=లేఁతకొమ్మలును సారములు కాఁబట్టి, ఏమనిపొగడెదము=ఏమనికొనియాడఁగలము. అనఁగాఁ గొనియాడఁజాలమనుట. అత్యంత సుకుమార

త్రములనేకములుగా నున్నవనియు వృక్షవిస్తారములు సూర్యకిరణములఁ జేరనియ్యక నీడలచేతఁ జీఁకట్లు కమ్మించుచున్నవనియును భావము. అలం. ఉత్ప్రేక్ష.

గొజ్జంగినీ రుప్పొంగుచుంటవలననే కప్రపుటనంటి కప్రపుఁదిప్పలను గప్పఁగలిగినది. కాన నాజలమునకుఁ గర్పూరసుగంధముఁగూడఁ గలదు. జలమందు వేగముంటవలననే జలయంత్రములనుండి తుంపురులుగా జారఁగలిగినది. ఇందువలన జలయంత్రములు కప్పురపుటనంటులు గొజ్జంగులు నావనమున మిగులఁ గలవనియు వనము వసంతమున విహారయోగ్యముగా నున్నదని భావము.

తా. గొజ్జంగినీ రావనములోని కప్పురపుఁదిప్పల ముంచి ప్రవహించి కేళాకూళిలోఁజేరి యందుండి జలయంత్రములనుండి తుంపురులుగా జారుచున్నది. చెట్లును దట్టముగాఁ బెనఁగొని చీకటులవలె నీడలు గ్రమ్మియున్నవి.

శా. ఆయారమ్ములఁ బొల్చుకొమ్మలబెడం • గాపల్లవశ్రేణిరం
గాయాతావులమించుపూఁబఱపు లాఽహా యెన్నఁగా శక్యమే
యాయుద్యానముసాటి చైత్రరథ మోఽట్లౌ నాయతశ్రీయుతం
బై యొక్కొక్కనగంబె చైత్రరథ మైఽయందుఱ్ విజృంభింపఁగన్. 140

ఆయారమ్ములఁబొల్చు=అపాదరిండ్లయందుఁ బ్రకాశించునట్టి, కొమ్మల=శాఖలయొక్కయు, స్త్రీలయొక్కయు, బెడంగు=చక్కఁదనంబును, ఆపల్లవశ్రేణి=ఆచిగురుటాకుల పంక్తియొక్కయు, విటశ్రేణియొక్కయు, (శ్లో. 'పల్లవకికసలేషిద్గే' అని వి.) రంగు=సొగసును, ఆయాతావులమించుపూఁబఱపులు=ఆయాపరిమళములచేత నతిశయించుచున్న పుష్పవిస్తారములును, ఆయాస్థలములయందతిశయించుచున్న పుష్పశయ్యలును, ఆహా=ఆశ్చర్యము, ఎన్నఁగా శక్యమే=గణించుటకు శక్యమా అనఁగా శక్యము గాదనుట. ఆయుద్యానము సాటిచైత్రరథమెట్లౌను = చైత్రరథమనఁగాఁ గుబేరవనము. (శ్లో. 'అస్యోద్యానం చైత్రరథమ్' అని అ.) ఆయుద్యానవనమునకు సమానము కుబేరవనమేరీతిగా నవుచున్నది యనఁగా సమానము గాదనుట. ఎందువలన ననిన, ఆయత=విస్తారమైన, శ్రీ=సమృద్ధితోడ, యుతంబై=కూడుకొన్నదై, ఒక్కొక్కనగంబె=ఒక్కొక్కవృక్షమే, చైత్రరథమై=కుబేరవనమై యని యర్థము. శోభాయుక్తమయినదియుఁ జైత్రునికి ననఁగా వసంతునికి రథమయినయదియు ననిభావము. అందున్విజృంభింపఁగన్=ఆవనమందుఁ బ్రకాశించుచుండఁగా, ఆయుద్యానవనమునకు సాటి చైత్రరథమెట్లౌనని సంబంధము. శ్లేషానుప్రాణితార్థాపత్తి. కావ్యలింగము.

కుబేరుని యుద్యానవనమంతయుఁ జైత్రరథమనఁబడుచున్నది. ఈవనమందున్న యొక్కొక్క వృక్షమే చైత్రరథ=మనిపించుకొనుచున్నది. కాన నుద్యానము పెక్కు చైత్రరథములుకలది. కుబేరుఁడొకచైత్రరథము కలవాఁడు. కుబేరచైత్రరథమునకును, చైత్రుని (వసంతుని) రథములకు నెలవగు నీయుద్యానవనమునకు సాటిసేయఁదగదు.

తా. కొమ్మలసొంపు, పల్లవరీతి, తావులమించు, పూఁబఱపుల యొఱపుఁగల యాయుద్యానమునకుఁ జైత్రరథ మెన్నటికి సాటిగాదు. ఆయుద్యానవనమందలి ప్రతివృక్షమును జైత్రరథమువలె నొప్పుచున్నది.

సీ. ఇమ్ములై మరుహజాఽరమ్ములై పొదలుండఁ బూఁజవికలు వేఱె • పూనవలదు
తెప్పలై నెత్తావిఽకుప్పలై పుప్పొళ్లురుల గందవొడిత్రోవఁ • జిలుకవలదు

సారమై హిమజలా♦సారమై పూఁదేనె నెఱయఁ గేళాకూళి♦ నింపవలదు
మొత్తమై మారుతా♦యత్తమై గంబూర మెగయవితానముల్♦బిగియవలదు
స్వామి యారామశుభవైభ♦వములు సూడ
నెపుడు విచ్చేయుదురొ యంచు♦ నెదురు సూచు
సహజసౌభాగ్యములు గూర్చు♦చైత్రుఁ డతఁడు
కూర్మి భవదీయవనపాల♦కుండు గాఁడె. 141

ఇమ్ములై=విశాలములైనవై, మరుహజారమ్ములై=మన్మథునికిఁ గొలువుకూటములై, పొదలుం =పొదరిండ్లుండఁగా, పూఁజవికలు వేఱువూనవలదు=పువ్వుచప్పరములు ప్రత్యేకముగా నిర్మాణము సు నక్కఱలేదు. పొదరిండ్లు మరుహజారములను మించియున్నవి. అనఁగా రత్యాతిక్రీడలకుఁ యున్నవనుట. ఇమ్ముగా నున్నకతనఁ బ్రమదాజనమున కెందఱకేని చాలునని యాశయము.

తెప్పలై=తెట్టెలుతెట్టెలై, నెత్తావికుప్పలై=పరిమళరాసులై, పుప్పొళ్లు=పుష్పపరాగములు, రలన్=రాలుచుండఁగా, గందవొడి=బుక్కాపొడి, త్రోవన్=మార్గమందు, చిలుకవలదు=చల్ల క్కఱలేదు. గందవొడిలో నొకవిధమగు సుగంధమేగలదు. పుప్పొడిలో వివిధసుగంధము లిమిడి యున్నవి. అట్టి పుప్పొడి తెప్పలై తావులకుప్పలై యున్నపుడు వనము పుష్పవల్లికలచే నెంత మనో జ్ఞముగనున్నదో యెంత సుగంధబంధురముగ నున్నదో తెలిసికొ మ్మనుట.

సారమై=బలమై, హిమజలాసారమై=మంచువానవలెనున్నదై, పూఁదేనె=మకరందము, నెఱ యన్=వ్యాపించుచుండఁగా, కేళాకూళినింపవలదు=హౌతుఖానాలో నీళ్ళునింపనక్కఱలేదు. మంచు వానవలెఁ దేనియ గురియుటచేఁ బ్రసవబాహుళ్యము సూచితము. ప్రసవవల్లికలు పొదరిండ్లుగ, వాసనల నొసంగునవిగ, మకరందవాహినుల నుండెననుట.

మొత్తమై=రాశియై, మారుతాయత్తమై = వాయువశమై, గంబూరమెగయన్=పచ్చకర్పూర మెగయుచుండఁగా, వితానముల్బిగియవలదు=మేలుకట్లుకట్టనక్కఱలేదు. చిఱుతగాడ్పులకె పచ్చకప్పు రము మారము లేచుచున్నది. అది చాందినివలెనున్నది. పచ్చకప్పురము వాయువులో లీనమై మేలుకట్టు వలె నున్నదని భావము.

స్వామి=దేవరా, ఆరామ=ఉద్యానవనసంబంధమైన, శుభవైభవములుసూడన్=శుభసంపద లను జిత్తగించుకొఱకు, ఎపుడువిచ్చేయుదురొయంచున్=ఎప్పుడువిజయముచేయుదురోయని, సహజ =స్వభావసిద్ధములైన, సౌభాగ్యములు=శృంగారములను, కూర్చు=ఘటనపఱిచెడు, చైత్రుఁడు=వసం తుఁడు, ఎదురుసూచున్=ఎదురెదురుచూచుచుండును. ఏమనిన, అతఁడు=ఆ వసంతుఁడు, కూర్మిన్ =ప్రీతిచేత, భవదీయవనపాలకుండుగాఁడె=దేవరవారియొక్క తోఁటమాలికాఁడా యని యర్థము. వసంతుఁడు వనములను బాలించువాఁడని భావము. పొదరిండ్లు మన్మథుని కొలువుకూటములటులుంట, పుప్పొడి రాసులై త్రోవలనిండియుండుట, పూవుదేనియలు కేళాకూళులలో బూర్తిగనుండుట, కప్పురపుధూళి మింటికెగసి చాందినీవలెనుండుట యారామశుభవైభవములగు సహజసౌభాగ్య ములు. వీనిని సంతరించుటవలననే చైత్రుఁడు వనపాలకుఁ డగుచున్నాఁడని భావము.

తా. ప్రభువులు వనవిహారార్థమై వత్తురని వనపాలకు లుద్యానవనమందుఁ బూలపందిళ్ళు వేసి వనమందు మెత్తగానుండుకొఱకు గంధవొడిచల్లి యౌతుఖానాలో నీళ్లునింపి పైని మేలుకట్లుకట్టి సిద్ధ

పటుపవలయునని మర్యాదగనుక నివి మేముచేయనక్కఱలేకయే వసంతుఁడు దేవరవారివనపాలకుఁడయినందున వీనికిమారుగాఁ బైఁజెప్పఁబడిన పొదరిండ్లు మొదలైనవాని సిద్ధపఱిచి తన రాకడకెదురుచూచుచున్నాఁడు. ఉద్యానవన మింతరమ్యముగానున్నది గనుక వనవిహారార్థముగా దేవరవారు విజయము చేయఁదగినదని వనపాలకులు విజ్ఞాపనముచేసిరని ఫలితార్థము.

అలం. ఉదాత్తము. కావ్యలింగము.

క. అని వనపాలురు దెలిపిన, జనపాలున కనఘపూగ • సాలావళినూ
తనపాళీఘనకేళీ, వనపాళీదర్శనోత్సవం బిగురించెన్. 142

అని=ఈలాగని, వనపాలురు దెలిపినన్=వనపాలకులు విన్నపముసేయఁగా, జనపాలునకున్=రాజునకు, అనఘ=నిష్కల్మషమైన, పూగసాల=పోకచెట్లయొక్క, ఆవళి=పంక్తులయొక్క, నూతన=నవీనమయిన, పాళీ=సముదాయముతోఁగూడిన, ఘన=అధికమయిన, కేళీవనపాళీ=క్రీడావనప్రదేశముయొక్క, దర్శన=చూచుటయందలి, ఉత్సవంబు=వేడుక, ఇగురించెన్=అంకురించెను.

అలం. వృత్త్యనుప్రాసము.

తా. ఇటుల వనపాలురు తెలుప వసురాజునకుఁ బోకమ్రాకులచేఁ గనువిందుఁగూర్చు వనములందు విహరింపఁ గోర్కికలిగెను.

తే. నృపుఁ డలవనీపకుల నవ • నీపకుల నొ
నర్చి యచ్చో నిజారామ • నవవసంత
సమయసౌభాగ్యములు చూడఁ • జనుమనోర
థంబున రథంబుఁ దెమ్మనఁ • దడయ కపుడు. 143

నృపుఁడు=వసురాజు, అలవనీపకులన్=ఆవనపాలకులనని యర్థము. యాచకులనని యర్థాంతరము. అవనీపకులనొనర్చి=అనేకగ్రామములు నగ్రహారములనునిచ్చి దేశాధిపతులను జేసియని యర్థము. యాచకులు గానివారినిఁగాఁ జేసియని యర్థాంతరము. (ని. 'వనీపకో యాచనకః' అని అ.) అచ్చోన్=ఆ సమయమందు, నిజారామ=స్వకీయమయిన యుద్యానవనమందలి, నవ=నూతనమయిన, వసంతసమయ=వసంతర్తుసంబంధమయిన, సౌభాగ్యములు=వైభవములను, చూడఁజను=చూడఁబోవునట్టి, మనోరథంబునన్=అభిలాషచేత, రథంబు దెమ్మనన్=రథము దెమ్మని యాజ్ఞాపింపఁగా, తడయక=జాగుసేయక, అపుడు=ఆ సమయమందు, దీనికి ముందరిపద్యముతో నన్వయము.

అలం. విరోధాభాసము. శబ్దా. వృత్త్యనుప్రాసము.

తా. వసురాజు వనపాలురకు ధనాదికముల నొసంగి గౌరవించి తన యారామమునందుఁగల వసంతఋతు సౌభాగ్యములను సందర్శింప నెంచి రథము నాయత్తము గావింపుమని యాజ్ఞ నొసంగెను.

సీ. జతఁ గూర్చి తారవ • జ్రాబ్జఁ బమ్మినకమ్మి గ్రమ్మినమణిరథాం • గములగములు
నీలాలదృష్టిపూ • నినచక్రముఖములఁ దగుపచ్చపనినిగ • నిగనినొగలు
ముత్యాలబవిరెకెం • పులచట్టము తదంశుధట్టంబుమాడ్కిఁ గెం • బట్టుపఱుపు
పగడాలకంబాల • జిగిమించుపుష్యరాగపులోవవైదూర్య • ఘంటికలును

సీ. దళతళనిమానికంబుల • కలశమును జ
యాంకకేతనమును గల్గు • నరద మొకటి
మనసుతోనన మెలఁగుసా • మ్రాణికాశ్వ
రత్నములఁ బన్ని తెచ్చె సా • రథి యొకండు. 144

జతఁగూర్చి=జోడించి, తారవజ్రాల=తారశబ్దము ముత్యములు మొదలైనవానియొక్క సంశుద్ధి
పందు వర్తించుచున్నది. శ్లో. 'తారో వానరభిన్ముక్తా విశుద్ధౌ శుద్ధమౌక్తికే' అని మే. వజ్రాలన్నం
యు, సూ. 'వికృతౌక్వచిచ్చలోపో మోర్ధీర్ఘ శ్చాతఆదిమస్యభవేత్' న. అనుసూత్రముచేతను, శ్లో.
ప్రాయశోవైకృతపదేలోపోదీర్ఘశ్చ మోర్మతః' అను నథర్వణవచనమందలి ప్రాయశ్శబ్దగ్రహణము
లనఁ గొన్నియెడలఁ దత్సమశబ్ద మువర్ణకమునకు లోపంబును దత్పూర్వవర్ణమందలి యకారమునకు
ర్ఘంబును వచ్చునని వేద్యముగనుక నిచట వజ్రాలని ప్రయోగించినాఁడు. పరిశుద్ధములైన వజ్ర
ులచేత, పమ్మిన=నిర్మించిన, కమ్మిక్=కట్టుటచేత, క్రమ్మిన=పొదిగిన, మణిరథాంగముఃగములు=పద్మ
ాగ మణిమయములైన చక్రములయొక్క సముదాయములును,

నీలాలదృష్టిపూనిన=నీలమణులే దృష్టులుగాఁ బెట్టిన, నక్రముఖములక్=మకరవక్త్రములచేత,
గు=ఒప్పుచున్న, పచ్చపని=మరకతమణిరచనచేత, నిగనిగని=నిగనిగమెఱయునట్టి, నొగలు=ధూర్దండ
ులును, అనఁగా నొగకఱ్ఱలును, మరకతమణి మొసలిమేనిచాయవలెఁ బసుపురంగుగాఁగూడ నుం
ను. ఇందులకుఁ బ్రమాణము-

. ...మెరుగుడుపురుగుమే మెఱయుచందంబునఁ గొమరుమిగిలిన పాలకొమ్ముచాయ
జిగి దళుకొత్తు రాచిలుకఱెక్కలవన్నె పొలుపారు దిరిసెంపుఁబూవువన్నె
. గ్రాలు నెనిమిదిరంగుల డాలుగలిగి,......శుద్ధమరకతంబు. (రత్నపరీక్ష.)

ముత్యాలబవిరె=ముత్యాలుగూర్చిన వలయముగల, కెంపులచట్టము = కెంపులుచెక్కిన చట్ట
ును, తదంశుఘట్టంబుమాడ్కిక్=ఆ కెంపులయొక్క కాంతిపుంజమో యన్నట్టులుగానున్న, కెం
ట్టుపఱపు=ఎఱ్ఱపట్టుపఱపును, ముత్తెములవలయమునకుఁ గెంపులు తాపడముచేసిరి. కెంపులకాంతి
ుంజమువలె నెఱ్ఱపట్టుపఱపు పైనమర్పఁబడియున్నది. ముత్తెములకాంతిని గెంపులకాంతిమించి కెంజా
ు తులకించుటచే నాకాంతులే పఱపువలె నున్నవనుట. అలం. ఉత్ప్రేక్ష.

పగడాలకంబాలజిగిమించు=పవడపుస్తంభములయొక్క కాంతిచేత నతిశయించుచున్న, పుష్య
ాగపులోవ=పుష్యరాగ మణిమయమయిన చప్పరపువలయమును, వైదూర్యఘంటికలును=వైదూర్య
ణివికారములైన చిఱుగంటలును, వైదూర్యము లోహకాంతి గలిగియుండును. వైదూర్యలక్షణము-

. పగలు గొందిఁ గానఁబడిన బిడాలంపుఁ, గన్నువోలె వెలుఁగు గలిగి నూలు
తిరిగినట్లు మీఁదఁ జెరబారువైదూర్య, రత్నమున కతిప్రయత్నమునను. (రత్నపరీక్ష)

తళతళనిమానికంబుల=గోమేధికమణివికారమయిన, కలశమును = పైకలశమును, ఈమట్టుకు
వరత్నములును గలుగఁజెప్పినాఁడు. ఇందునకుఁ బ్రమాణము. రత్నపరీక్షయందు-

. 'కురువింద వజ్ర మౌక్తిక, వరమరకత శక్రనీల వైదూర్య మనో
హరపుష్యరాగ విద్రుమ, నరనుత గోమేధికములు నవరత్నంబుల్.'

జయాంకకేతనమును=జయప్రయుక్తమయిన బిరుదులుగలధ్వజమును, కల్గు=కలిగిన, అరదమొకటి=ఒకానొకరథమును, మనసుతోనసమెలఁగు=మనస్సుప్రకారముగా నడుచునట్టి, అనఁగా మనోవేగముగల, సామ్రాణికాశ్వరత్నములఁ బన్ని=సామ్రాణిసంజ్ఞగల యశ్వశ్రేష్ఠములనుగట్టి, ఇక్కడ రత్నమయమయిన రథమునకు నశ్వరత్నసంయోగమర్హమని విచారింపవలయును. తెచ్చెసారథియొకండు=ఒక సారథి తీసికొనివచ్చెను.

ఈ పద్యములో మొదటిచరణమందు మణిరథాంగములనియును, మూఁడవచరణమందుఁ గెంపులచట్టమనియును జెప్పుటవలనఁ బౌనరుక్త్య మనఁదగదు. పద్మరాగమునకుఁ గెంపునకును భేదముగలదనియుఁ బద్మరాగము కలియుగమందు లేదనియుఁ బూర్వయుగములయందుఁ గలదనియును స్ఫురింపఁజేయుకొఱకు మణిశబ్దమును గ్రహించినాఁడని తెలియవలయు.

క. 'ధరఁ బద్మరాగమెందును, దొరకదు కలియుగమునందుఁ దోఁచినవ్రేగై
నిరుపమనిర్మలరుచిగల, కురువిందపు కెంపుగలదుకోరి ధరింపన్.'

అని రత్నపరీక్షయందుఁ జెప్పంబడియున్నది. అలం. ఉత్ప్రేక్ష. ఉదాత్తము.

తే. తెచ్చిన ననేకచక్రసందీప్తమును న, తీతహరిదశ్వమును జగద్విశ్రుతోరు
సారథియునైనయమ్మహాసారసహితు, నరదమరుదయ్యె జనలోచనాబ్జములకు.

తెచ్చినన్=సారథి రథమును దోలుకొనిరాఁగా, అనేక = అనేకములైన, చక్ర=బండికండ్లతోడ, సందీప్తమును=మిక్కిలియుఁ బ్రకాశించుచున్నదియు నని యర్థము. సూర్యరథ మొకబండికల్లు గలదనుట. అతీత=అతిక్రమింపఁబడిన, హరిత్=దిక్కులుగల, ని. 'దిశస్తు కకుభః కాష్ఠా ఆశాశ్చ హరితశ్చతాః' అని అ. అశ్వము=గుఱ్ఱాలుగలదియునని యర్థము. సూర్యరథ మతిక్రమింపఁబడకున్న దిక్కులుగల గుఱ్ఱముగలదనుట. హరిద్వర్ణముగల గుఱ్ఱముగలదని భావము. జగద్విశ్రుత=జగత్ప్రసిద్ధుఁడైన, ఉరు=ఘనుఁడైన, సారథియును=సారథిగలదియునని యర్థము. సూర్యరథము జగద్విశ్రుతోరుసారథిలేనిదనుట. జగత్ప్రసిద్ధుఁడైన యనూరునితోఁ గూడుకొన్నదని భావము. ఐన = అయినట్టి, అమ్మహాసారసహితు నరదము = సారసహితుఁడనఁగాఁ బద్మబాంధవుఁడైన సూర్యుఁడు, ఆ మహాసూర్యునియొక్క రథమని యర్థము. మహాబలసమేతుఁడైన యా వసురాజురథమని భావము. జనలోచనాబ్జములకున్=జనులయొక్క నేత్రములనెడు కమలములకు, అరుదయ్యెన్=ఆశ్చర్యకరమాయెనని యర్థము. ప్రసిద్ధసూర్యరథవిలక్షణము గనుక జనలోచనాబ్జముల కరుదయ్యెనని తెలియవలయును. అనర్ఘ్యమణిమయమయినదిగనుక జనులయొక్క నేత్రకమలములకువింతగాఁగనుపడెనని భావము.

తా. అనేకచక్రములతోఁ గూడియున్నదియు, సూర్యాశ్వములవంటివాజులఁ బూన్చినదియు నేర్పరియగు సారథికలదియు నగువసురాజురథము చూపరులకు మిగుల నాశ్చర్యకరముగ నుండెను.

మ. ద్రవిణాధీశ్వరుఁ డాత్మరూఢవసునాథఖ్యాతిభీతిం గరం
బు విమానోత్తమ మంపెనో యన రుచిం బొల్పారునాస్యందనం
బవనీనాయకుఁ డెక్కె నొక్కమొగి శంఖారావము ల్వందిపుం
గవవాచావిభవంబు వేత్రధరహుంకారంబు దోరంబుగన్. 146

ద్రవిణాధీశ్వరుఁడు = ద్రవిణమనఁగా ధనము, దానికధిపతియైన కుబేరుఁడు, ఆత్మ=తనయందు, రూఢ=ప్రసిద్ధమైయుండెడు, వసునాథఖ్యాతి=(వసుర్తితినాథః వసునాథః అని విగ్రహము.)

వసువనెడు రాజనునట్టి ప్రఖ్యాతివలనఁ బుట్టిన, లేక వసురాజునకు నాథుఁడనునట్టి ఖ్యాతివలనఁ బుట్టిన, భీతిన్=భయముచేత, అనఁగా నిట్టి ప్రసిద్ధికి నితఁ డర్హుఁడౌనాయని వసురాజునకుఁ గోపమువచ్చు ననుభయముచేతనని యర్థము. వసువనఁగా ధనము దానికి నాథుఁడనిభావము. (వసూనాం ధనానాం నాథః వసునాథః అని విగ్రహము.) ఈయర్థమున కనుగుణముగా ద్రవిణాధీశ్వరపదమును బ్రయోగించినాఁడు. కరంబు = అప్పనమగునట్టులుగా, విమానోత్తమ మంపెనోయనన్ = విమానశ్రేష్ఠమును, అనఁగాఁ బుష్పకమునంపినాఁడోయనునట్టులుగా, రుచింబొల్పారు=రత్నకాంతిచే నొప్పుచున్న, ఆ స్యందనంబు=ఆ రథమును, ఒక్కమొగిన్ = ఏకకాలమందు, శంఖారావముల్=శంఖనాదములును, వందిపుంగవ = స్తుతిపాఠకోత్తములయొక్క, వాచావిభవంబు=వాక్యవైభవమును, వేత్రధర=వెండి బెత్తములవారియొక్క, హుంకారంబు=హుమ్మనెడు నదలింపులును, తోరంబుగన్ = అతిశయించున ట్టుగా,అవనీనాయకుఁడు=వసురాజు,ఎక్కెన్=ఎక్కినవాఁడాయెను. అలం. పరికరము. ఉత్ప్రేక్ష.

కుబేరుఁడు ద్రవిణాధీశ్వరుఁడు గావున నితరులు వసునాథులైయుండ వెఱచుట సంభవించినది. కాననే యాత్మరూఢమగు వసునాథఖ్యాతి గాపాడుకొనవలసివచ్చినది. రత్నఖచితమగుటవలన రుచిం బొల్పారి రథమొప్పెను. కావునఁ గుబేరుఁ డంపినటుల నుండెను. తొలుత శంఖనాదములు పిదపఁ బ్రయాణానుకూలముగ వందిస్తోత్రములు మ్రోగిన ప్రజలఁ బోఁదోలుటకు వేత్రహస్తులయదలింపులు క్రమముగా నెఱవేర్పఁబడెనని భావము.

తా. కుబేరుఁడు పంపినవిమానమువలెనున్న యలంకృతమగు రథముపై వసురాజెక్కి బయలు దేరెను.

చ. పొడఁగన వేళ యబ్బె నని • పొంగి కళింగశకాంకముఖ్యుల
య్యెడ నెడ యీక క్రందుకొని • యెల్లెడలన్ వెడలంగ వారిబల్
తొడవులరాలి ముత్యములు • తోరము లై తొరఁగెం బురంబున
ల్గడలఁ బ్రసూనకోరకని•కాయము నింపినసొంపు పెంపునన్. 147

పొడఁగనవేళయబ్బెనని=దర్శనముసేయుటకు సమయముదొరకెనని, పొంగి=సంతోషించి, కళింగశకాంగముఖ్యులు = కళింగదేశ శకదేశాంగదేశాధిపతులు మొదలైనవారు, అయ్యెడన్=ఆ సమయమందు, ఎడయీక క్రందుకొని=సందియ్యక దొమ్మిగూడి, ఎల్లెడలన్వెడలంగన్=అన్నిదిక్కుల నుండి బయలుదేరఁగా, వారిబల్తొడవులరాలి=ఆ రాజులయొక్క ఘనమైనభూషణములనుండి రాలి, ముత్యములు=ముక్తాఫలములు, తోరములై=అధికములై, పురంబునల్గడలన్=పట్టణపునాల్గుదిక్కుల యందును, ప్రసూనకోరకనికాయము=పూమొగ్గలయొక్క గుంపులును, నింపినసొంపుపెంపునన్= నిండుగాఁబోసిన చందముగా, తొరఁగెన్=రాలిపడెను. అలం. నిదర్శనము.

ఎడయీక క్రిక్కిరిసినటులుంటవలననే భూషణస్థమౌక్తికములు రాలెను. రాజముఖ్యులు ఎల్లెడల వెడలుటవలననే పురము నలుగడల ముత్తెములు రాలు నవకాశము కలిగెను. దర్శనోత్సాహమునఁ బొంగినకతనఁ బరస్పరఘట్టనములు మౌక్తికములు రాలుట గమనింపలేదని భావము.

తా. రథమునెక్కి బయలువెడలు వసురాజును సందర్శించుట కితరదేశాధిపతులగురాజులు క్రిక్కిరిసివచ్చుటవలన వారివిభూషణస్థమౌక్తికములు పురమునఁ బూవులు మొగ్గలు చల్లినటుల నొప్పెను.

వ. అప్పు డప్పురందరవైభవుండు మణిచాపశరకలాపరాజితంబును మదాంధ రాజహంసోద్వేజకకూజితంబును మంజుతరకంజరాగపుంజపింజరితమరీచిమంజరీ సంజనితసమంజససౌదామనీధామంబును మౌక్తికవితానదంతురితాంతరాభి రామంబును మసారసారకిరణధోరణీసంస్మారితవినీలశరదంబును నగు నరదంబు నధివసించి సముజ్జ్వలితహేతిధరవిభ్రమంబులు నుద్దండదండధరసంభ్రమం బును నున్నిద్రపుణ్యాజన వాగ్విశేషంబులు నుజ్జృంభితవాహినీశ్వరరసోన్మేషం బులు నుద్ధూతకేతనానిలకోలాహలంబును నున్నతరాజరాజభజనకౌతూహలం బులు నుగ్రసేనాగణకలకలంబులు నవధరించుచు నానందనోద్యానరాజంబుఁ జేరం జనుసమయంబున. 148

ఈ వచనపు మొదట వసురాజును బురందరవైభవుండని చెప్పుటచేత రాజపరముగాను నింద్ర పరముగాను నర్థద్వయము నాలోచింపవలయును. ఏలాగనిన,

అప్పుడు=ఆప్రయాణసమయమందు, అప్పురందరవైభవుండు=ఇంద్రవైభవముగల యీ వసు రాజు, మణిచాప=రత్నమయచాపముచేతను, శరకలాప=బాణతూణీరములచేతను, రాజితంబును= ప్రకాశించుచున్నదియును, అని రాజపరమైన యర్థము. మణిచాప = ఇంద్రధనువుచేతను, శరక లాప=జలసముదాయముచేతను, రాజితంబును=ప్రకాశించుచున్నదియు నని మేఘరూప మహేంద్ర రథపరమయిన యర్థాంతరము. (ని. 'శరంనీరే శరః కాణ్డే' అని వి. 'కలాపో భూషణే బర్హే తూణీరే సంహతేపిచ' అని అ.) మదాంధ=మదముచేతఁ గన్నులుగానకయున్న, రాజహంస=రాజశ్రేష్ఠులకు, ఉద్వేజక=పీడాకరమయిన, కూజితంబును=నేమిధ్వని గలదియును, అని యర్థము. నేమియనఁగా రథచక్రముయొక్క యంచులు, మదాంధములైన రాజహంసలకుఁ బీడాకరమయిన గర్జాధ్వనిగలది యౌనని యర్థాంతరము. మంజుతర = మిక్కిలియు మనోహరములైన, కంజరాగ=పద్మరాగమణుల యొక్క, పుంజ=సమూహముయొక్క, పింజరిత = సాంద్రమగుచున్న, మరీచి=కాంతులయొక్క, మంజరీ=గుచ్ఛములవలన, సంజనిత=పుట్టిన, సమంజస=చక్కనైన, సౌదామనీ=మెఱుపుతీఁగెలవంటి, ధామంబును=కాంతిగలిగినదియునని రథపరమయిన యర్థము. మంజుతరకంజరాగపుంజపింజరితమరీచి మంజరివలె సంజనితమగుచున్న మెఱుపుతీఁగెలయొక్క కాంతిగలదియు నని మేఘపరమయినయర్థాం తరము. ని. 'తటిత్సౌదామనీ విద్యుచ్చఞ్చలాచపలాపిచ' అని అ. మౌక్తిక=ముత్తియములుగూర్చిన, వితాన=మేలుకట్టుచేత, దంతురిత=విరళముగాఁజేయఁబడిన, అంతర=మధ్యప్రదేశముచేత, అభిరామం బును=ఒప్పుచున్నదియు నని యర్థము. (ని. 'అస్త్రీవితానముల్లోచః' అని అ.) మౌక్తికవితాన=ముక్తా ఫలసమూహముచేత, దంతురిత=వ్యాపింపఁబడిన, అంతర=ఉదరాంతరముచేత, అభిరామంబును= ఒప్పుచున్నదియు నని యర్థాంతరము. (ని. 'పూగోవితానం ప్రకరః' అని యమరశేషము.) మేఘ మందు ముత్యాలుపుట్టుచున్నవన్నందుకుఁ బ్రమాణము.

ఉ. 'నీరదముల్ దిగంతముల నిండి తటిద్ఘనగర్జితంబు లే
పార మహోగ్రవృష్టి గురియం బ్రభవించి నితాంతకాంతితో
నారయఁ గుక్కుటాండసమమై పడుముత్యము లంతరిక్షసం
చారులు పట్టుకొందురు వెసన్ వసుధం బడకుండ నేర్పునన్.'

అని రత్నపరీక్షయందుఁ జెప్పఁబడియున్నది.

మసారసార=ఇంద్రనీలమణిశ్రేష్ఠములయొక్క, (ని. 'మసారమిన్ద్రనీలంస్యాత్' అని వి.) కిరణ=కాంతులయొక్క, ధోరణీ=సరణిచేత, సంస్కారిత=లెస్సగా స్మరింపఁజేయఁబడిన, వినీల=మిక్కిలినల్లనైన, శరదంబును=మేఘముగలదియునని యర్థము. మసారసారకిరణధోరణీసంస్కారితమయినసీలమేఘమని యర్థాంతరము. అగు=అయినట్టి, అరదంబు నధివసించి=రథము నెక్కి కూర్చున్నవాఁడై, సముజ్జ్వలిత=మిక్కిలియుఁ బ్రజ్వరిల్లుచున్న, హేతి=ఖడ్గములను, ధర=ధరించినవారియొక్క, విభ్రమంబులును=వీరవిలాసంబులుననియర్థము. హేతియనఁగానగ్నిజ్వాలకును బేరుగనుక హేతిధరుఁడనఁగా నగ్నిదేవుఁడు, సముజ్జ్వలితుఁడగుచున్న యగ్నియొక్కవిలాసములును, అని యర్థాంతరము.(ని. 'రవే రర్చిశ్చ శస్త్రంచ వహ్నిజ్వాలాచహేతయః' అని వి.) ఉద్దండదండధరసంభ్రమంబులును=ఉద్దండులైన దండధరులనఁగా బాణాకట్టులు ధరించినవారు. వారియొక్క ఉత్సాహములను, అనియర్థము. ఉద్దండుఁడైన యముని యొక్క యుత్సాహములను, అనియర్థాంతరము. ఉన్నిద్ర=వికాసయుక్తులైన, పుణ్యజన=సజ్జనులయొక్క, వాగ్విశేషంబులును=వాక్యవిశేషములను, అని యర్థము. పుణ్యజనుఁడనఁగా నైరృతి-ఉన్నిద్రుఁడైన నైరృతియొక్క వాగ్విశేషములను, అనియర్థాంతరము. ఉజ్జృంభిత=ఉత్కటముగా విజృంభించుచున్న, వాహినీశ్వర=సేనానాయకులయొక్క, రసోన్మేషంబులు=వీరరసవికాసములను, అని యర్థమున వాహినీశ్వరుఁడనఁగా నదులకు రాజైనవరుణుఁడు, రసమనఁగా జలము, ఉజ్జృంభితుఁడగుచున్న వరుణునియొక్క జలోన్మేషములను, అని యర్థాంతరము. ఉద్ధూత=ఎగరఁగొట్టఁబడుచున్న, కేతన=ధ్వజపటములసంబంధమయిన, అనిల=వాయువుయొక్క, కోలాహలంబులను=కలకలధ్వనులను, అని యర్థము. ఉద్ధూతకేతనుఁడైనవాయువుయొక్క కోలాహలమును అని యర్థాంతరము. ఉన్నతరాజరాజభజనకౌతూహలంబులును=రాజాధిరాజులయొక్క సేవాకౌతూహలములను అని యర్థము. రాజరాజనఁగాఁ గుబేరుఁడు, అతనిసేవాకౌతూహలములను, అని యర్థాంతరము.(ని. 'రాజరాజో ధనాధిపః' అని అ.) ఉగ్రసేనాగణకలకలంబులును=ఉగ్రమయిన సేనాసమూహమందలి కలకలములను, అని యర్థము. ఉగ్రుఁడనఁగా రుద్రుఁడు, అతని సేనారూపమయిన ప్రమథగణములయొక్క కలకలములను, అని యర్థాంతరము.అవధరించుచున్=చిత్తగించుచును, ఆనందనోద్యానరాజంబుఁ జేరఁ జనుసమయంబునన్=ఆనందకరమయిన యుద్యానవనశ్రేష్ఠమును సమీపించిపోవుచున్న సమయమునందని యర్థము. ఆనందనోద్యానమును సమీపించిపోవుచున్న సమయమందని యర్థాంతరము. ఇచట నందనోద్యానమనఁగా నింద్రునియుద్యానవనమునకుఁ బేరు. ఎట్లనఁగా, (ని. 'నన్దనంవనమ్' అని అ.) దీనికి ముందటిపద్యముతో నన్వయము. శ్లేషాలంకారము.

తా. వసురాజు సమస్తవస్తుసంపూర్ణముగనున్న రథమునధిష్ఠించి పరిజనులప్రసంగమున కానందించుచు మహేంద్రవైభవముతో నలరి యుద్యానమునకు బయలుదేరెను.

సీ. నృపమౌళిభవసువ◆ర్ణపరాగములు సువర్ణపరాగములు నభి◆న్నత వహించెఁ
గమనీయతపనీయ◆కదళికాపవనంబు కదళికాపవనంబు ◆ కలిసి మెలఁగె
లలితమాగధలోక◆కలకంఠగానంబు కలకంఠగానంబు ◆ నలమికొనియెఁ
దతవాదకసమీర◆హతకిన్నరీరుతుల్ కిన్నరీరుతులు నే◆కీభవించె
తే. నపుడు సేరంగవచ్చిన◆యవనిజాని, కవనిజానీక మచట సా◆ష్టాంగ మెఱఁగెఁ
గేళివనబహిరంగణా◆క్షీణమధుర, మధురసఝరానుబింబసం◆భావనమున. 149

నృప=రాజులయొక్క, మౌళిభవ=కిరీటముల రాపిడివలన రాలిన, సువర్ణపరాగములు=బంగారు రాపొడులును, సువర్ణపరాగములు=బంగారుపేళ్లు సంపెఁగకుఁజెల్లును గనుక సువర్ణమనఁగా సంపంగి, సంపంగి చెట్లయొక్క పుష్పొడులును, అభిన్నతవహించెన్=వేఱులేక పోవుటను వహించెను, కదళియనఁగా ధ్వజమును గదళీవృక్షమును, (ని. 'కదళీవైజయన్త్యాం చ రంభాయాం హరిణాన్తరే' అని వి.) కమనీయ=సుందరమైన, తపనీయ=సువర్ణవికారమునైన, కదళికా=ధ్వజసంబంధమైన, పవనంబు=వాయువును, కదళికాపవనంబు=కదళీవృక్షసంబంధమైన వాయువును, కలిసిమెలఁగెన్=కలిసికొని ప్రవర్తించెను. కలకంఠమనఁగా మధురధ్వనిగల కంఠంబును గోయిలయును, లలిత=ఒప్పుచున్న, మాగధలోక=గానరూపముగా స్తుతిచేయు మాగధజనముయొక్క, కలకంఠగానంబు=మధురధ్వనిగల కంఠములచేతఁ బాడెడు సంగీతంబును, కలకంఠ=కోయిలలయొక్క, గానంబు=పంచమస్వరగానములును, అలమికొనియెన్=మిళితమాయెను.

శ్లో. 'రాజ్ఞః పురజనస్యాపి మఙ్గళాచారశంసినః,
మాగధైర్మాగధికాగీతైర్మాగధా ఇత్యుదీరితాః.' అని మాగధలక్షణము.

తతవాదక=వీణలు వాయించువారియొక్క, (ని. 'తతం వీణాదికంవాద్యమ్' అని అ.) సమీరహతకిన్నరీరుతుల్=వాయువుచేతఁ గొట్టఁబడుచున్న తీఁగెలుగల కిన్నరీసంజ్ఞగల వీణలయొక్క నాదములును, కిన్నరీరుతులును=కిన్నరపక్షి కాంతానినాదములును, ఏకీభవించెన్=ఒకటియాయెను.

అపుడు=ఆసమయమందు, చేరంగవచ్చిన=సమీపింపవచ్చిన, అవనిజానికిన్=వసురాజునకు, అవనిజ=వృక్షములయొక్క, అనీకము=సముదాయము, అచటన్=ఆప్రదేశమున, కేళివన=ఉద్యానవనముయొక్క, బహిరంగణ=బైటిముంగిలియందలి, అక్షీణ=తక్కువగాని, మధుర=తియ్యని, మధురస=మకరందముయొక్క, ఝర = ప్రవాహమందయిన, అనుబింబసంభావనమునన్=ప్రతిబింబ మనెడు మిషచేత, సాష్టాంగమెరఁగెన్=సాష్టాంగమగునట్లుగా నమస్కరించెను. అనఁగా వనబాహ్యప్రదేశమందలి మకరందప్రవాహమందు వనతరుసమూహము ప్రతిఫలింపఁగా నేలాగుననుండెననిన, వచ్చిన వసురాజునకు వనవృక్షములన్నియు నమస్కరించినట్టులుగా నుండెననుట. అలం. సహోక్తి. వ్యాజోక్తి. శబ్దాలం. ఛేకానుప్రాసము.

తా. రాజుదాల్చిన సొమ్ముల యొఱపిడివలన రాలినపరాగము పుష్పొడియుఁ, డెక్కెములు గాడ్పులు నరఁటిచెట్లులగాడ్పులును, మాగధగానము కోకిలలగానమును, వీణాగానము కిన్నరిపక్షిగానము గలసిపోయెను. కేళివనసమీపముననున్న తేనెయేళ్లయందుఁ బ్రతిబింబించిన యాకృతులతో వృక్షరాజములు రాజునకు సాష్టాంగనమస్కృతు లాచరించెను.

క. కులపతియు వేత్రధరు లొ, త్తిలి సాంగు భళా యనంగఁ • దేరు డిగి మహీ
శుల ననిపి బలము నచటనె, నిలిపి యుపవనంబు సొచ్చి • నిజహితయుతుఁ డై.

కులపతియుఁన్=వంశకర్తయైన వసురాజును, వేత్రధరులు = వెండిబెత్తములవారు, ఒత్తిలి=ఒకవైపునకు నోరసిల్లి, సాంగుభళాయనంగ=సాంగుభళాయని హెచ్చరికసేయఁగా, తేరుడిగి=రథముపైనుండిదిగి, మహీశులననిపి = తనతోఁ గూడవచ్చినరాజులను బంపించి, బలము నచటనె నిలిపి=సేనలవారి నావనబాహ్యమంద నిలిపి, ఉపవనంబుసొచ్చి=ఉద్యానవనములోఁ బ్రవేశించి, నిజహితయుతుఁడై=తనయిష్టసఖునితోఁ గూడుకొన్నవాఁడై, దీనికి ముందరిపద్యముతో నన్వయము.

తా. వేత్రహస్తులు బరాబరులుసేయ వసుమహారాజు రథము దిగి పరివారమునంతయు నట నుంచి హితులతోఁగలసి యుద్యానవనమునఁ బ్రవేశించెను.

తే. ఘనతరఫలానతాఖండ•కదళికలును, గీరరాజీకృతసజీవ•తోరణములుఁ
బొంగునెలమావికురుజుల•భంగనవఫ, లావళులుఁగాంచెనృపుఁడువ•నాగ్రసీమ.

ఘనతర=అధికతరములైన, ఫల=పండ్లగెలలచేత, ఆనత = వంగియున్న, అఖండ=సంపూర్ణములైన, కదళికలును, అరఁటిచెట్లును, కీరరాజీ = శుకపంక్తులచేత, కృత=చేయఁబడిన, సజీవతోరణములున్=ప్రాణసహితములైన తోరణములును, పొంగు = ఉల్లసిల్లుచున్న, ఎలమావి = గుజ్జుమామిళ్ళయొక్క, కురుజులున్=జొంపములును, అభంగ=చిలుకలు మొదలైనవానిచేత కొట్టఁబడనివియును, నవ=నూతనమైనవియునగు, ఫలావళులున్ = ఫలసమూహములును, వనాగ్రసీమన్=ఉద్యానవనముముందరను, నృపుఁడు=వసురాజు, కాంచెన్=చూచెను.

రాజాధిరాజు వచ్చునపుడు పట్టణముముందరఁగాని క్రీడావనముముందరఁగాని పండ్లగెలలతో నుండెడు నరఁటిచెట్ల నుభయపార్శ్వములయందు నిలిపి పచ్చనితోరణములుగట్టి మామిడిచిగురు జొంపములు వ్రేలఁగట్టి భిన్నములుగాని ఫలముల నాస్వాదించి యీరీతిగా నలంకరించుటయును రాజాయలంకారమునుఁ జూచుచుఁ బ్రవేశించుటయునుఁ బ్రసిద్ధముగనుక వనాగ్రసీమయందు స్వతస్సిద్ధములుగానున్న కదళీస్తంభాదులను వసుమహారాజు చూచెనని భావము. అలం. సమాసోక్తి.

తఱచుగానగరాలంకారములయందు ఖండితకదళికలు నిర్జీవములగు చివురుతోరణములు త్రెంపినఫలము లుపయోగించుట సహజము. ఇట నటులఁగాక యరఁటిచెట్లు తామున్నచోటన నఖండితముగఁ జిలుకగుంపులు బారులుగఁ దిరుగుచు సజీవతోరణములుగ ఫలావళులు తమనెలవులనే పక్షిచంచూహతులచే భిన్నములుగాక యభంగములుగానుండి నేత్రోత్సవము గలిగించెను.

తా. అరఁటిచెట్లు ద్వారస్తంభములుగ నిలిపి చిలుకలబారులు తోరణములుగఁజేసి మావిచివురులు, ఫలములు, వ్రేలగట్టినటులున్న వనాగ్రసీమ రాజు చూచెను.

మ. అలచైత్రాంచితసత్త్రశాలికల ని•ష్టాహారతృప్తిం గుతూ
హలము ల్గాంచుద్విజావళుల్ శ్రుతిహితా•వ్యాజానులాపంబుతో
నలఘుశ్రీకరశాఖికాంచలవిని•ర్యత్నేసరార్ద్రాక్షతం
బులు రాల్చెన్ నరదేవరత్నమకుటీ•భూషావిశేషంబుగన్. 152

అల=ఆ, చైత్ర=వసంతునిచేత, అంచిత=ఒప్పుచున్న, సత్త్రశాలికలక్ = వనప్రదేశములయం దని యర్థము. చైత్రాంచిత=చైత్రమాసమం దొప్పిదములగుచున్న, సత్త్రశాలికలక్ =యజ్ఞశాలలయం దనియైనను నిరతాన్నదానశాలలయందనియైనను నని యర్థాంతరము. (ని. 'సత్త్ర మాచ్ఛాదనే యజ్ఞే సదాదానే వనేఽపి చ' అని అ.) ఇష్టాహారతృప్తిక్ = ఇష్టమైన యాహారమువలని తృప్తిచేత, కుతూహలముల్గాంచు = సంతోషములను బొందుచున్న, ద్విజావళుల్ = శుకపికాదులైన పక్షులయొక్క సముదాయములని యర్థము. బ్రాహ్మణ సమూహములని యర్థాంతరము. శ్రుతిహిత = చెవులకింపును, అవ్యాజ=దంభరహితములైన, అనులాపంబుతోక్ = ముహుర్భాషణముతోడ, అలఘు=అధికములును, శ్రీకర = శోభాకరములునైన, శాఖికా = కొమ్మలయొక్క, అంచల=అగ్రములవలన, వినిర్యత్ = జారుచున్న, కేసరార్ద్రాక్షతంబులు=ఆర్ద్రాక్షతములవంటి యనఁగాఁ బసపుచేతఁ దడుపఁబడిన యక్షతలవంటి, కేసరములు = కింజల్కములను, నరదేవ = వసురాజుయొక్క, రత్నమకుటీ = మణిమయ కిరీటమునకు, భూషావిశేషంబుగక్ =అలంకారవిశేషమౌనట్టులుగా, రాల్చెక్ =చల్లెను, అనియర్థము. శ్రుతిహితావ్యాజ = వేదహితమైన, అవ్యాజమైన, అనులాపంబుతోక్ = వాక్కుతోడ, అలఘుశ్రీ=అధికశోభాకరములైన, కరశాఖికా = అంగుళులయొక్క, (ని. 'అఙ్గుళ్యః కరశాఖాస్స్యుః' అని అ.) అంచల=అగ్రములనుండి, వినిర్యత్ =జారుచున్న, కేసరార్ద్రాక్షతంబులు = కింజల్కసదృశములైన యార్ద్రాక్షతములును, నరదేవరత్నమకుటీభూషావిశేషమగునట్టులుగాఁ జల్లెనని యర్థాంతరము. బ్రాహ్మణాశీర్వాద మంత్రాక్షతములు రాజకిరీటాలంకార మగుట ప్రకటంబకదా. అలం. శ్లిష్టరూపకము.

చైత్రము యజ్ఞాదులకు వసంతునకు ననుకూలమైనది. కావుననే సత్త్రశాలిక లంచితములైనది. కేసరార్ద్రాక్షతలు అలఘుశ్రీకరశాఖికాచ్యుతములు గావుననే సువర్ణచ్ఛాయాశోభితములుగనున్నవి. కావున మకుటమునకు భూషావిశేషముగ నొప్పెను. పూవులు విరియఁబూచి తమంతరాలుచున్నవి గానఁ గేసరార్ద్రాక్షతచ్ఛాయములని గ్రాహ్యము.

తా. వనప్రదేశమునఁ జెట్లపైఁగల స్వరముతోఁ బలుకుచున్న చిలుకలు కదలుచుంటవలన విరియఁబూచిన కొమ్మలనుండి పచ్చని కింజల్కములు వసురాజు కిరీటముపై భూషణప్రాయముగా రాలెను.

ఉ. ఆదరణీయరామకథ • నాంకశుకోక్తులతోడఁ దీవము
త్తైదువచాలు శోభనపు • టారతు లెత్తె సదాగతిం గిరి
క్షోదపినోదికిం జిగురు • జొంపపుఁ గెంపులపళ్లెరంబులం
ప్రోదిఁ దనర్చునగ్గలపు • మొగ్గలు ముత్తెపుమ్రుగ్గు లీనఁగన్. 153

ఆదరణీయ=మన్నింపఁదగిన, రామకథనాంక = రామరామ యనెడుకథనమే చిహ్నముగాఁ గల, శుకోక్తులతోడక్ = చిలుకపలుకులనెడు రామనామాంకములైన, చిలుకపలుకులవంటి పలుకులతోడ, తీవముత్తైదువచాలు=తీఁగెలనెడుసువాసినులపంక్తి, సదాగతిక్ =వాయువుచేత నని యర్థము. శుభాగమనముచేత నని యర్థాంతరము. చిగురుజొంపపుఁ గెంపులపళ్లెరంబులక్ = ఎఱ్ఱని చిగురుటాకులగుత్తులనెడు కెంపులతోఁ జేసినపళ్లెరములయందు, ప్రోదిఁదనర్చు = పెంపుచేత నొప్పుచున్న,

అగ్గలపుమొగ్గలు=మిక్కుటమైన తెల్లనిపూమొగ్గలు, ముత్తైపుముగ్గులీనఁగన్=ముత్యాలరంగవల్లులను గల్పించుచుండఁగా, గిరిక్షోదవినోదికిన్ = కోలాహలపర్వత భంజనవినోదియైన వసురాజునకు, శోభనపుటారతులెత్తెన్=మంగళహారతులెత్తెను. అనఁగా నుద్యానవనమందుఁ బుష్పలత లెఱ్ఱనిచిగురుటాకుల జొంపములతోడను దెల్లనిపూమొగ్గలతోడను మలయమారుతముచేతఁ గదిలి యాడుచుండఁగా వానిమీఁదనుండి చిలుకలు రామరామయని పలుకుచుండె నని తాత్పర్యము. అలం. రూపకము.

సత్ + ఆగతికి నానందించి ముత్తైదువులు సంతసముతో నాగతునకు హారతినిచ్చుట యాచారము. కాన శోభనపుటారతులెత్తిరి. శోభనపుటారతి భావిశుభసూచకము. పళ్లెరము చిగురుజొంపము. పళ్లెరమందలి ముత్తైపురంగవల్లు లగ్గలపుమొగ్గలు. ఆరతినిచ్చువారు తీవముత్తైదువులు. ఇవి వసంతసౌభాగ్యమునకు రాజన్యుని శుభప్రాప్తికిఁ గారణములు. ఆవనమునఁ బువుతీగలు మొగ్గలప్రేగుచేఁ గదలుచు రాజున కారతినిచ్చునటులుండెనని యాశయము.

మ. అలరారన్ సెలఱాలఁ గట్టినమహీ•జావాలము ల్గొన్ని స
త్ఫలసాంద్రంబులు గొన్ని పల్లవరుచి•ప్రాగ్భారపట్టాంబరో
జ్జ్వలము ల్గొన్ని సమగ్రశారదరజో•జాలంబులై మాధవుం
డులుపానించినరౌప్యపాత్రికలు నా•నొప్పెన్ నృపాగ్రంబునన్. 54

వనవృక్షములు సాష్టాంగపడుట, రంభాస్తంభములు శుకములు ద్వారాలంకరణములగుట, శుకాదిస్వనముతోఁ దీవియపడఁతులు మంగళపుటారతులు బాడుటచెప్పి వసంతుఁడు వసురాజునకుఁ గానుక లొసంగుటను జెప్పుచున్నాఁడు.

అలరారన్=ఒప్పెసలారఁగా, సెలఱాలఁగట్టిన = చంద్రకాంతమణులతోఁగట్టిన, మహీజావాలముల్ = వృక్షములయొక్క పాదులు, కొన్నిసత్ఫలసాంద్రంబులు=కొన్ని శ్రేష్ఠమయిన ఫలములచేత నిండింపఁబడియున్నవియును, కొన్ని = ఒకకొన్ని, పల్లవరుచిప్రాగ్భార=ఎఱ్ఱని చిగురుటాకులయొక్క కాంత్యతిశయమనెడు, పట్టాంబర = ఎఱ్ఱపట్టుతాప్తాలచేత, ఉజ్జ్వలములు = ప్రకాశించుచున్నవియును, కొన్ని=మఱికొన్ని, సమగ్ర=సంపూర్ణమయిన, శారదరజోజాలంబులు = శారదములనఁగా నేడాకుల యరఁటిచెట్లు, వానియొక్క రజోజాలమనఁగాఁ గర్పూరసముదాయము, అదిగలవియును (ని. 'సప్తపర్ణో విశాలత్వ క్చారదో విషమచ్ఛదః' అని అ.) ఐ=అయినవై, మాధవుండు=వసంతుఁడు,(ని. 'మాధవస్తు వసంతే స్యాత్' అని వి.) ఉలుపానించిన=కానుకలచేతనింపిన, రౌప్యపాత్రికలునాన్=వెండిపళ్లెరము లనునట్టులుగా, నృపాగ్రంబునన్=వసురాజుముందఱ, ఒప్పెన్ = ఒప్పుచుండెను. రాజులకు వెండిపళ్లెరములయందు మంచిమంచిఫలములను బట్టుతాప్తాలును గర్పూరమును నుంచి యెదుటఁ గానుక పెట్టుట ప్రకటంబకదా. చంద్రకాంతములచేతఁ గట్టినపాదులను రౌప్యపాత్రికలుగాను నందు రాలినఫలాదులను గానుకలుగాను జెప్పినాఁడని తెలియవలయు.

అలం. రూపకము. ఉత్ప్రేక్ష.

సెలఱాలపాదులు వెండిపళ్లెరములవలె నున్నవి. అందుఁ దమంతరాలిన ఫలములు, చివుళ్ల కాంతియను పట్టువలువలు, ఏడాకుల యరఁటిచెట్ల కప్పురపుఁబొడి వసంతుఁడు సమకూర్చిన కానుక

పలెనున్నది. వసంతుఁడు మాధవుఁడు (లక్ష్మీశ్వరుఁడు) గాన నైశ్వర్యశాలియైన రాజునకుఁ దగిన కానుక సంతరించెనని భావము.

తా. చంద్రకాంతశిలలతో రచించిన పాదులు పళ్లెములవలెను, అందు రాలినపండ్లు, చివురులను పట్టువస్త్రములు, కప్పురపురజము కానుకగ వసంతుఁడు సేకరించిన వస్తుసముదాయమువలె నుండెను.

మ. కలకంఠార్భటి నొండొరుం బిలుచుచున్ ♦ గాఢచ్ఛదాచ్ఛాదికల్
పొలయంగా నవగంధబంధురరజం♦బు ల్చిందఁగా జాలకం
బులు గాసిం బడఁగా నికుంజనిలయం♦బుల్ మీఱి వాయుత్వరం
దల చూపెం బ్రతతీసతీవితతి గో♦త్రాకాంతుఁ డేతేరఁగన్. 155

గోత్రాకాంతుఁ డేతేరఁగన్ = భూకాంతుఁడైన వసురాజు రాఁగా, ప్రతతీ=తీఁగెలనెడు, సతీ=స్త్రీలయొక్క, వితతి=సమూహము, కలకంఠార్భటిన్ = కలకంఠములనఁగాఁ గోయిలలు వానియొక్క నాదమనెడు కలకంఠార్భటీ ననఁగా మధురమైన కంఠనాదముచేత, ఒండొరుంబిలుచుచున్ = ఒకరినొకరు పిలుచుచు, గాఢ=దృఢమైన, ఛద = ఆకులనెడు, ఆచ్ఛాదికల్ = మేలుముసుఁగులు, పొలయంగాన్=తొలఁగిపోవఁగా, నవగంధబంధురరజంబుల్చిందఁగాన్ = గంధమనఁగాఁ బరిమళమును మైపూఁతకుఁ దీసినగంధమును, నవ=నూతనమైన, గంధ = పరిమళముచేత, బంధుర=మనోహరమగుచున్న, రజంబులు=పుష్పరాగములనెడు, రజంబులు=అనఁగా నంగరాగములు, చిందఁగాన్=చెదిరిపోఁగా, జాలకంబులు గాసింబడఁగాన్ = జాలకములనఁగాఁ బూమొగ్గలుగవాక్షములు పూమొగ్గలనెడు గవాక్షమును గలఁగిపోఁగా, (ని. 'జాలం గవాక్ష ఆనాయే క్షారకే దంభబృందయోః' అని వి.) నికుంజ = పొదరిండ్లనెడు, నిలయంబుల్ = గృహములను, మీఱి=అతిక్రమించి, వాయుత్వరన్ = వాయువుయొక్క వేగముచేతనని యర్థము. వాయువేగమువంటి వేగముచేతనని యర్థాంతరము. తలచూపెన్=పొడచూపెను. అనఁగా నుద్యానవనమందు మలయమారుతము వీచుచుండఁగా బొదలలోపలనున్నతీఁగెలు కోవెలలు నాదములుచేయఁగాఁ బైయాకులు తొలఁగిపోఁగాఁ బుప్పొడులు రాలఁగాఁ బూమొగ్గలు గాసిపడఁగాఁ బొదరిండ్లు దాఁటి పైకి వచ్చెనని యాశయము.

తా. రాజు నగరము ప్రవేశించుతఱి పురకాంతలు మేడలెక్కి సందర్శించుట సహజము గావున రాజు వనమున కేతెంచుతఱి వనసుందరులగు చివురుతీగబోండ్లు కలకంఠస్వరమున నొకరినొకరు బిల్చుకొనుచుఁ జిగురాకుముసుఁగు తొలఁగిపోవ గంధరజము రాపిడిచేఁ జారిపోవుచుండ జాలకములు (గవాక్షములు మొగ్గలు) ఒరయునటుల వాయుత్వరతో సందర్శింపవచ్చిరి.

అలంకారము శ్లిష్టరూపకము.

చ. జనపతి దారసిల్ల నొక♦సంపఁగి తావులకొమ్మ రాగవ
ద్ఘనసుమనోభిరామ యయి ♦ కాఁక వహింపఁగఁ బోలుఁ గానిచో
ననుపమపంచసాయకక♦రాంచలచంచలచాపశింజినీ
జనితకఠోరఝుంకృతులు ♦ సైఁపక యున్నె పరాగపాండువై. 156

జనపతిదారసన్నిధిన్ = వసురాజు సమీపమునకు రాఁగా, ఒకసంపఁగితావులకొమ్మ = ఒకానొక సంపఁగిచెట్టుయొక్క వాసనలు గలకొమ్మయనెడు సంపంగిపువ్వులవాసన గలస్త్రీ, ఇది కర్తృపదము. రాగవత్=అనురాగము గలిగినదియు, ఘన=అతిశయమైనదియు, సు=లెస్సైనదియునగు, మనః=మనస్సుచేత, అభిరామయయి = ఒప్పుచున్నదై యని యర్థము. రాగవత్=గౌరవర్ణముగల, ఘనసుమనోభిరామయయి = ఘనమైన పుష్పములచేత నొప్పుచున్నదని భావము. తాఁక వహింపఁగఁబోలున్=విరహతాపమును వహింపఁబోలును, అని యర్థము. సంపఁగిపువ్వులయందుఁ గాఁకగుణము గలదనిభావము. కానిచోన్=లేకపోయినట్టులయ్యోనేని, పరాగపాండువై =పరాగమువలెఁ దెల్లనివర్ణము గలదై, అనఁగా విరహతాపముచేతఁ దెల్లఁబడిన దేహముగలదై యని యర్థము. పుష్పాడిచేత దెల్లఁగా నున్నదనిభావము. అనుపమ=ఉపమానరహితమైన, పంచసాయక = మన్మథునియొక్క, కరాంచల=హస్తాగ్రమందు, చంచల=చలించుచున్న, చాప=ధనువుయొక్క, శింజినీ = తుమ్మెదచాలుచేతఁ గల్పింపఁబడిననారివల్ల, జనిత=పుట్టించఁబడిన, కఠోర=పరుషములైన, ఝుంకృతులు=ఝుంకారములను, సైఁపకయున్నె = సహింపలేకపోవునాయని యర్థము. అనఁగా విరహతాపమును బొందకయున్నట్టయిన సహించునుగదా యనుట. విరహులు మన్మథచాపశింజినీధ్వనులను సహింపలేకపోవుట ప్రసిద్ధంబు కదా. సంపఁగికిని దుమ్మెదలకును విరోధముగనుక సంపఁగికొమ్మ తుమ్మెదలయొక్క ఝుంకారమును సహింపదని భావము. మధుపఝుంకారములను మన్మథచాపగుణధ్వనులనుగా వర్ణించినాఁడు. అనఁగా వసురాజుసమీపమందొకసంపఁగిపువ్వులకొమ్మ స్వభావసిద్ధమయిన యుష్ణగుణము గలిగి పుష్పాడిచేతఁ గప్పఁబడినదై తుమ్మెదలు లేక కనఁబడె ననుట.

అలం. రూపకము. పర్యాయోక్తము.

పంచసాయకుని చంచలశింజిని తుమ్మెదలబారు. కావున నారిమ్రోఁత ఝుంకృతిగఁ జెప్పఁబడెను. సంపఁగికొమ్మ రాజునుజూచి తొలుతరాగము వహించెను. ఆవల విరహతాపమొందెను. తుమ్మెద నారిమ్రోఁతలు కఠోరములయ్యెను. పిదపఁ బరాగ పాండుతనొందెనని యాశయము.

మన్మథునినారి తుమ్మెదచా లనుటకు-

శ్లో. మౌర్వీలోలంబమాలా ధనురథవిశిఖాః కౌసుమాః పుష్పకేతోః
భిన్నంస్యా దస్యబాణై ర్యువజనహృదయం స్త్రీకటాక్షేణ తద్వత్. (సాహిత్యదర్పణము)

చ. చలితలతాంతకాంతి యను♦చందురుకావిచెఱంగు దాఁటి స
మ్మిళితవయోవిలాసముల ♦ మీటిన విచ్చుఫలస్తనాగ్రము
ల్వెలువడఁ గప్పెఁ దత్క్షణము ♦ వేల్లితదోహదధూపధూమకుం
తలములు విప్పి దాడిమల♦తాలలితాంగి నృపాలుచెంగటన్. 157

నృపాలుచెంగటన్=వసురాజుసమీపమందు, దాడిమలతా=దాడిమశాఖయనెడు, లలితాంగి=స్త్రీ, చలిత=కదల్పఁబడిన, లతాంతకాంతియను = ఎఱ్ఱనిపూవుయొక్క కాంతియనెడు, చందురుకావిచెఱంగు దాఁటి = చంద్రకావిపైఁటకొంగును దొలఁగఁద్రోచికొని, సమ్మిళిత = సమకూడియున్న, వయోవిలాసములన్ = పక్షిచంచువిలాసములచేత నని ఫలపరమయినయర్థము. యౌవనవిలాసములచేత నని స్తనపరమయినయర్థము. మీటినవిచ్చు=మీటితేఆవిసిపోవుచున్న, ఫల=ఫలములనెడు, గోటమీటి

తే విచ్చిపోవునట్లుగానున్న, ఫలస్తనాగ్రములు=ఫలములవంటి కుచములయొక్క కొనలు, వెలువడన్=బయలుపడఁగా, తత్క్షణమ=అప్పుడే, వేల్లిత=వక్రమయిన, ని.'ఆవిద్ధం కుటిలం భుగ్నం వేల్లితం వక్రమిత్యపి' అని అ. దోహదలక్షణము.

శ్లో. 'తరుగుల్మలతాదీనా మకాలే కుశలైః కృతమ్,
పుష్పాద్యుత్పాదకం ద్రవ్యం దోహదంస్యాత్తుతత్క్రియా.'

దోహద మనఁగాఁ దరుగుల్మలతాదులకు నకాలమందుఁ బుష్పములు మొదలైనవానిని బుట్టించుద్రవ్యమునకును నట్లుచేసెడు క్రియకును బేరు. అట్టిదోహదసంబంధమయిన, ధూపధూమ=ధూపముయొక్క ధూమరేఖయనెడు, ఇక్కడ దానిమ్మచెట్టునకుఁ జేయుదోహదము ధూపములు వేయుటయని తెలియవలయును. కుంతలములువిప్పి = తలవెండ్రుకలు విడఁదీసి, కప్పెన్=ఫలస్తనాగ్రములను గప్పెను. వస్త్రహీనత సంభవించినప్పుడు తలవెండ్రుకలచేత మానసంరక్షణముచేసికొనుట స్త్రీలకు స్వభావమని తెలియవలయును. అనఁగా వసురాజునకుఁ జేరువ నొక దాడిమ్మచెట్టుకొమ్మ యెఱ్ఱని పువ్వుయొక్క కాంతి నతిక్రమించి చిలుకలు మొదలైనవి యంటినంతనఁ బగిలిపోవు మొనలుగలవై, దోహదధూపధూమముచేతఁ గప్పఁబడిన పక్వఫలములతోఁ గనుపించెనని తాత్పర్యము.

గుబ్బలు పయంటదాఁటుట సమకూడిన వయసు పొంకమువలన. స్తనాగ్రములంటిన విచ్చునటులుండె ననుటవలన జవ్వనపుబింకము సూచితము. మోహమునఁ బొలఁతులకు గుబ్బలుబ్బుననుట ప్రసిద్ధము. కాననే గుబ్బలు మీటిన విచ్చునటులున్నవని చెప్పఁబడెను. ఇటులె మోహావస్థలోనున్న వరూధినిని జెప్పుచు ''మీటినవిచ్చుగబ్బిచనుమిట్టని'' పెద్దన చెప్పెను.

ధూమాదిదోహదములు ఫలవృక్షముల కకాలఫలకును మోత్పత్తులకై గావించుట యాచారము.

ఉ. దోహదధూపధూమములతోఁ గనుపట్టెడి తత్పురీవన
వ్యూహము నోసమస్తవిబుధోత్తమ చూచితే .. (ప్రభావతీప్రద్యుమ్నము)

దాడిమకు ధూపక్రియయుఁ దోహదవిశేషమె.

'మేషామిషాంబుసంసేక స్తత్కేశామిషధూపనమ్,
శ్రేయానయం ప్రయోగః స్యా ద్దాడిమీఫలవృద్ధయే.
మత్స్యాజ్యత్రిఫలాలేపై ర్మాంసై రాజావికోద్భవైః,
లేపితాధూపితా సూతే ఫలంతాళీవదాడిమీ.'

సీ. చిగురుకెంగేలు సాఁచె రసాలవల్లరి ♦ తేఁటిచూపులఁ జూచె ♦ తిలకలతిక
పికగీతిఁ బాడి చూఁపెఁ బ్రియాళులత ♦ పల్కెఁ గీరభాషలఁ గర్ణి♦కారశాఖ
ముఖరక్తి నింపె నిం♦పు గలసంపఁగికొమ్మ ♦ వన్నెగా నగియె లేఁ♦బొన్నతీఁగె
సురభిళశ్వాసంబు ♦ నెరపె సింధుకవల్లి ♦ గ్రుచ్చెఁ దావులు పోఁకఁ♦ గ్రోవిరెమ్మ
తే. యాత్మరుచిరోపచారంబు ♦ లధిపకల్ప, కంబునకుఁ దత్తదామోద♦గరిమఁ బెనుప
నంగనానిత్యకలితదో♦హదవిశేష, సన్నుతాచారములసడి♦సన్నకతన. 158

ఈపద్యములో రసాలవల్లర్యాదులయందు స్త్రీలింగమహిమచేత స్త్రీతత్వద్యోతనమగుచున్నవి గనుక వానియొక్క పల్లవస్పర్శాదులు వసురాజునందుఁ జేయఁబడిన కరస్పర్శాదినర్మచేష్టలు

గాను వసురాజనెడు కల్పవృక్షమునకుఁ జేయఁబడిన దోహదవిశేషములుగాను జెప్పినాఁడు. ఏలాగునననిన,

రసాలవల్లరిమొదలైన, అంగనా=స్త్రీలచేత, నిత్య=నిరంతరమును, కలిత=తమకుఁ జేయఁబడుచుండెడు, దోహదవిశేష = పూర్వోక్తదోహదవిశేషరూపములైన, సన్నుతాచారముల=ప్రసిద్ధాచారములయొక్క, నడిసన్నకతనన్=సంజ్ఞచేత, ఆత్మరుచిరోపచారంబులు = తాము సేయుచున్న మనోహరములైన కరస్పర్శాదిదోహదోపచారములు, అధిపకల్పకంబునన్=వసురాజనెడు కల్పవృక్షమునకు, తత్తదామోదగరిమఁ బెనుపన్ - తత్తత్=ఆయా, ఆమోద = ఆనందముయొక్క లేక పరిమళముయొక్క, గరిమన్=ఆధిక్యమును, పెనుపన్=వృద్ధిఁబొందించునట్టులుగా, రసాలవల్లరి=తియ్యమామిడికొమ్మయనెడు రసాలవల్లరియను పేరుగల నాయిక, చిగురుకెంగేలుసాఁచెన్ = చిగురనెడు హస్తమును వసురాజుపైకిఁ జాఁచెను. అనఁగా హస్తస్పర్శము చేసెననుట. ఇది కరస్పర్శరూపమైనదోహదము, తియ్యమామిడి హస్తస్పర్శరూపమైనదోహదముచేతఁ బూచునదిగనుక నాపరిచితిచేత హస్తస్పర్శ చేసెనని భావము. సర్వత్ర యీలాగున నాయాదోహదపరిచితిగల వృక్షశాఖాంగనలవలన నాయాదోహద మాచరింపఁబడినదని తెలియవలయును.

తిలకమనఁగా బొట్టుగుచెట్టు, తిలకలతిక=బొట్టుగుకొమ్మయనెడు తిలకలతికానామకనాయిక, తేఁటిచూపులఁజూచెన్ = తుమ్మెదలనెడు చూపులచేతఁ జూచెననియర్థము. ఇది వీక్షణరూపమయిన దోహదము. ప్రియాళువనఁగాఁ బ్రేంకణము. ప్రియాళులత=ప్రేంకణపుతీఁగెయనెడు ప్రియాళులతానామకనాయిక, పికగీతిఁబాడిచూపెన్ = కోకిలగానమనెడు పాటఁబాడెనని యర్థము. ఇది గానరూపమయిన దోహదము. కర్ణికారశాఖ = కొండగోఁగుకొమ్మ యనెడు కర్ణికారశాఖానామకనాయిక, కీరభాషలన్=చిలుకపలుకులవంటి పలుకులచేత, పల్కెన్=భాషించెను, అనియర్థము. ఇది సల్లాపరూపదోహదము. ముఖరక్తి యనఁగా శాఖాముఖపుష్పరక్తిమయును ముఖమిచ్చుటయును. ఇంపుగలసంపంగికొమ్మ=సంపఁగికొమ్మ యనెడు సంపఁగికొమ్మయను పేరుగల నాయిక,ముఖరక్తినింపెన్ =శాఖాముఖకుసుమరక్తియనెడు ముఖమిచ్చుటను గలుగఁజేసెనని యర్థము. ఇది ముఖరాగరూపదోహదము. లేఁబొన్నతీఁగె = లేఁతపొన్నతీఁగె యనెడు లేఁబొన్నతీఁగెయను పేరుగల నాయిక, వన్నెగానగియెన్=వన్నెయనఁగాఁ బుష్పకాంతియును సొగసును, పుష్పకాంతియనెడు నవ్వుచేత సొగసుగా నవ్వెను. ఇది హసితరూప దోహదము. శ్వసనమనఁగా వాయువును నిశ్వాసమును, సింధుకవల్లి = వావిలికొమ్మయనెడు సింధుకవల్లీనామక నాయిక. (ని. 'అథ సింధుకః, సిన్దువారేన్ద్రసురసౌ నిర్గుణ్డీన్ద్రాణికేత్యపి' అని అ.) సురభిళ = పరిమళయుక్తమైన, శ్వసనంబున్ =వాయువనెడు నిశ్వాసమును, నెరపెన్ = పొడించెను. ఇది ముఖవాయురూపదోహదము. తావులనఁగా వాసనలును గళాస్థానములును,క్రోవిరెమ్మ=క్రోవికొమ్మ యనెడు క్రోవిరెమ్మ యనుపేరుగలనాయిక, తావులునోఁకన్ = పరిమళములనెడు కళాస్థానము లంటునట్టులుగా, క్రుచ్చెన్ = కౌఁగిలించెను. ఇది యాలింగనరూపదోహదము.

కల్పక మభీష్టఫలదాయి గనుక సకలదోహదక్రియాయోగ్యమని తెలియవలయును.ఆయావృక్షములకుఁ జేయఁదగిన దోహదక్రియలకుఁ బ్రమాణము.

శ్లో. 'అశోకశ్చరణాహత్యా వకుళో ముఖసీధునా,
ఆలిఙ్గనాత్కురవక స్తిలకో వీక్షణేనచ,
కరస్పర్శేన మాకన్దో ముఖరాగేణచమ్పకః,
సల్లాపతః కర్ణికార స్సిన్దువారో ముఖానిలాత్,
గీత్యాప్రియాళుర్నితరాం నమేరు ర్హాసితేనచ'

అనఁగా నశోకవృక్షము పాదతాడనముచేతను బొగడచెట్టుమియుటచేతను నెట్టిపువ్వులపెద్ద గోరింట యాలింగనముచేతను దిలకవృక్షము చూచుటచేతను మామిడిచెట్టు హస్తస్పర్శముచేతను సంపెఁగచెట్టు ముఖరాగముచేతను గొండగోఁగుచెట్టు సల్లాపముచేతను వావిలిచెట్టు ముఖవాయువుచేతను బ్రేంకణపుచెట్టు గానముచేతను సురపొన్న నవ్వుటచేతను బుష్పించుచున్నవి. అనఁగా నాయావృక్షము లాయాదోహదములచేత నకాలమందును బుష్పించుచున్నవని శాస్త్రప్రసిద్ధము.

అంగనాదోహదములచే శిక్షితములు గావున లతలు ఉపచరించెను. రాజు అధిపకల్పకము గావున రసాలవల్లర్యాదులు ఆమోదగరిమ పెంచెను.

తా. వసురాజు వనములోనికి రాఁగానే తియ్యమావిచివురులు నిక్కెను. బొట్టుగుతీఁగ తుమ్మెదలతో నిండియుండెను. ప్రేంకణపుఁదీఁగ కోకిలగానములతో నలరెను. కొండగోగు చిలుకపలుకులతో నొప్పెను. సంపెఁగ కెంజాయలతోఁదనరెను. పొన్నపూచెను. వావిలిపూలతావితో నెసఁగెను. క్రోవిసుగంధానిలములకుఁ దానకమయ్యెను. ఇవి రాజున కుపచారములు చేయునటులుండెను.

అలం. రూపకము. సమాసోక్తి.

మ. చను వొప్పన్ నగి పల్కి పాడి కని యాశ్వాసంబు నొందించి చే
కొని మోమిచ్చి కవుంగిలించి తరులం • గొన్నింటి మన్నించి యం
గన లయ్యా మము నెంతచేసి రనుచుం • గంకేళియుం గేసరం
బును భూజానికి మ్రొక్కె గుచ్ఛవినతిం • బూఁదేనెకన్నీటితోన్. 169

చనువొప్పన్ = మన్ననయొప్పునట్టులుగా, నగి=నవ్వి, పల్కి =సంభాషించి, పాడి=గానముచేసి, కని=వీక్షించి, ఆశ్వాసంబునొందించి = ఊరటఁబొందునట్టులుచేసి, చేకొని=అంగీకరించి యని యర్థము, కరస్పర్శచేసి యనిభావము. మోమిచ్చి=ముఖరక్తినొసఁగి, కవుంగిలించి=ఆలింగనము చేసికొని, తరులంగొన్నింటిమన్నించి=పైపద్యములోఁ జెప్పఁబడిన రసాలాదివృక్షముల నెనిమిదింటిని మన్నించి, అనఁగాఁ బైనిజెప్పఁబడిన హాసనము మొదలుగాఁగలదోహదక్రియ లెనిమిదియును మన్ననచేత జరిగించెను నర్మచేష్టల ననుసరించినవి యయినందున నాక్రియలచేత వాని మన్నించినారనుట. అంగనలు=స్త్రీలు, అయ్యో=అక్కటా, మము నెంతచేసిరనుచున్ =మమ్ము నెంతయవమానము చేసినారో చూచితివాయని, అనఁగాఁ దన్ని యుమిసినారనుట. అశోకము తన్నినఁ బూయునది యనియుఁ బొగడయుమిసినఁ బూయునదియనియును దెలియవలయును. కంకేళియున్ =అశోకమును, కేసరంబును=పొగడయును, గుచ్ఛవినతిన్ =పువ్వుగుచ్ఛభారమువలని వంగుట యనెడునమ్రత్వముచేత, పూఁదేనెకన్నీటితోన్ =మకరందమనెడు కన్నీటితోడ, భూజానికి మ్రొక్కెన్ =వసురాజునకు నమస్కరించెను. అలం. ఉత్ప్రేక్ష.

అంగనలు మమ్మెంత చేసిరని చేసినయవమానము చెప్పుకొనకపోవుటవలన నశోకమునకుఁ గేసరమునకుఁ గలిగిన యవమానాతిశయము సూచితము. సాటివారిలో గౌరవములేకపోఁగా నగౌరవము కలుగుటచేఁ జెలులయ్యు రాజుముందుఁ జెప్పుకొనవలసివచ్చినది. పూఁదేనె కన్నీరనుటవలన నశ్రులు నయనాంచలపూరములుగ నున్నవనియుఁ బూలవ్రేఁగున వంగుట చనుగవవ్రేఁగున వంగినటులున్నదనియు భావము. కేసరకంకేళులు పూలతోఁ దేనెతో నలరెననుట.

తా. ఇతరలతల సగౌరవముగ దోహదములచేఁ దృప్తినొందించి యంగనలు తమ్మవమానించిరని పూలవ్రేగుచో వంగిన తేనియచాలాలయు కంకేళికేసరములు రాజుముందు నమస్కరించి కన్నీరు విడచుచున్నటులుండెను.

మ. లలితైణాంకశిలాలవాల మనుకే◆ళాకూళిలో నీరుపైఁ
జెలు వొప్పన్ ధరియించి తోడనె మిళ◆చ్చిక్రోడదంష్ట్రాదళ
త్ఫలరంధ్రంబులచే వెలార్చి జలసూ◆త్రస్తంభముం బోనియ
గ్గలపుంజాయలగుజ్జునారికెడముం ◆ గాంచెన్ విభుం డయ్యెడన్. 160

లలిత=ఒప్పుచున్న, ఏణాంకశిలా=చంద్రకాంతశిలలచేత రచింపఁబడిన, ఆలవాలము=పాదునట్టి, కేళాకూళిలోన్=కుండులో, అనఁగా నౌతుఖానాలో, నీరుపైఁ జెలువొప్పన్ ధరియించి= ఉపరిభాగమందుఁగాయలలో నీళ్లుధరించి, అనఁగాఁ బైనున్నకాయలలోనికి నీళ్లెగఁబీల్చియనియర్థము. తోడనే=వెంబడిగానే, మిళత్=సమకూడుచున్న, చిక్రోడ=ఉడుతలయొక్క, ని. 'చిక్రోడ స్థూల దంతకః' అని యమరశేషము. దంష్ట్రా=కోఱలచేత, దళత్=బ్రద్దలగుచున్న, ఫల=కాయలయొక్క, రంధ్రములచేన్=రంధ్రములచేత, వెలార్చి=బయలువెడలించుచున్నదై, జలసూత్రస్తంభముం బోని= జలయంత్రనాళమువలెనున్న, అగ్గలపుంజాయల = దట్టమైన నీడలుగల, గుజ్జునారికెడమున్=గున్న టెంకాయచెట్టును, అయ్యెడన్=ఆవనస్థలియందు, విభుండు=వసురాజు, కాంచెన్=చూచెను. అలం. రూపకానుప్రాణితమగు నుపమ.

గుజ్జునారికెడము గావున సమోన్నతమగు జలసూత్రస్తంభమువలె నుండెను. అగ్గలపుంజాయల గుజ్జునారికెడమనుటవలన ఫలరంధ్రములనుండి జలము, నీడనాసించివచ్చినవారిపై సరాసరిగఁ బడుచు నంతటియెత్తుగానుండెనని తోఁచును. అగ్గలంపుంజాయల నారికేళము గావున నే చంద్రకాంతశిలాలవాలములోని జలమును జల్లబఱచుటకుఁ దగియున్నదని యెఱుఁగనగును. దళత్ఫలరంధ్రములనుటవలన నుడుత లపుడే కోఱలతో గంట్లువేయుచున్నవనియుఁ గాననే మితముగ బిందురూపముగఁ దుంపురులు రాలుచున్నవనియు జలయంత్రమువలె వసంతర్తువున నారికేళములుంటచే రాజు చూచెనని తెలియనగును.

తా. చంద్రకాంతశిలాలవాలమునందున్న కొబ్బరిచెట్టు జలసూత్రస్తంభమువలె నుండెను. ఉడుతలుకొఱకు కొబ్బరికాయలులోనినీరు వడియుచు జలయంత్రమువలెనుండ రాజు చూచెను.

తే. నృపునెదుటఁ దేనెవాఁకలో ◆ నిబిడవిచల
ద్దతనుపత్త్రాళిఫలసాంద్ర ◆ మగుచు నొక్క

నగము కైవ్రాలి యేటిలో • నాటియున్న
నాఁటియున్న తనగరాజు • నలువుఁ దెలిపె. 161

నృపునెదుటన్=వసురాజుముందఱ, తేనెవాఁకలోన్ = పూఁదేనెకాలువలో, నిబిడ=దట్టమౌనట్టులుగా, విచలత్=చలించుచున్న, అతను=గొప్పలైన, పత్త్రాళి=ఆకులచేతను, ఫల=కాయలచేతను, సాంద్రమగుచున్=దట్టమైనదై, ఒక్కనగము=ఒకవృక్షము, కైవ్రాలి=ఒరగఁబడినదై, ఏటిలోన్=శుక్తిమతీనదిలో, నాటియున్న=పాదుకొనియున్న, నాఁటి=ఆకాలమందలి, ఉన్నతనగరాజు=పొడవుగలిగిన కోలాహలపర్వతశ్రేష్ఠునియొక్క, నలువుదెలిపెన్ = చందమును దెలియఁజేసెను. అనఁగా శుక్తిమతీ ప్రవాహస్థితకోలాహలపర్వతస్మృతి నుదయింపఁజేసెననుట. (ని. 'శైలవృక్షౌ నగా వగౌ' అని యమరము.) అలం. నిదర్శనము.

తా. తేనియప్రవాహములోఁ బ్రతిబింబించు ఆకులతోఁ బండ్లతో నలరువృక్షము శుక్తిమతీనదిలో నొరగి నాటుకొనియున్న కోలాహలపర్వతమును వసురాజునకు జ్ఞాపకము చేయుచుండెను.

ఉ. ఉన్నతి నన్నగాగ్రమున • నున్న యొకానొకకిన్నరద్వయం
బన్నిఖిలోక్తివేది కపు • డన్యదురాసద మైన యొక్కయా
సన్నశుభంబుఁ దిన్నని ప్ర•సన్ననిజోక్తులఁ దెల్పి తోన యే
గె న్నరదేవపాదపవి•ఖిన్న బృహన్నగకూటవాటికిన్. 162

ఉన్నతిన్=సుఖాతిశయముచేత, అన్నగాగ్రముననున్న=ఆవృక్షాగ్రమునందున్న, ఒకానొక కిన్నరద్వయంబు=ఒకకిన్నరపక్షిమిథునము, అన్నిఖిలోక్తివేదికిన్=సకలజంతువులయొక్క పలుకు దెలిసిన యావసురాజునకు, అపుడు=ఆసమయమందు, అన్యదురాసదమైన=మఱియొకరికిఁ బొందశక్యముగాని, ఒక్కయాసన్నశుభంబున్ = ఒకసమీపకాలశుభమును, తిన్నని=మృదువైన, ప్రసన్ననిజోక్తులన్= ఆదరముతోఁగూడిన స్వకీయభాషలచేత, తెల్పి=తెలియఁజెప్పి, తోన = వెంటనే, నరదేవ=వసురాజుయొక్క, పాద=పాదము నెడు, పవి=వజ్రాయుధముచేత, ఖిన్న=భేదపెట్టఁబడినదియు, బృహత్= మిక్కిలి గొప్పదైనదియునగు, నగ=కోలాహలపర్వతముయొక్క, కూటవాటికిన్=శిఖరశ్రేణికి, (ని. 'కూటో స్త్రీ శిఖరం శృఙ్గమ్' అని అ.) ఏగెన్=పోయెను. అనఁగా వసురాజును గోలాహలపర్వతగమనోత్సుకునిఁగా నొనర్పనోయన కిన్నరమిథునంబు పర్వతశిఖరతలమున కరిగెనని భావము.

వృక్షమునకు శైలమునకు నర్థమగు నగమునె మరల చెప్పుటవలనను గిన్నరశబ్దము పక్షివిశేషమునకు: గిన్నరులకు సరిపడుటవలనను జెట్టుపైఁ గిన్నరపక్షిమిథునముండెననియు శైలాగ్రమునఁ గిన్నరులు విహరించుచుండిరనియు భావాంతరము స్ఫురించును. కిన్నరసూక్తిభావమును వసురాజునిఖిలోక్తివేదిగావుననే గ్రహింపఁగలిగెను. అన్యదురాసదమగు శుభముగాన వసురాజు అనన్యసాధ్యమహిమాసంపన్నుఁడనుట. నగాగ్రమునుండి నగాగ్రమున కేగుట కిన్నరసహజము. కోలాహలపర్వతముపైకిఁ గిన్నరమిథున మేగుట యానగరమున కేగ వసురాజున కుత్సుకము కలిగించుటకు.

తా. కిన్నరద్వయము నగముపైఁ జేరి పలుకుచుండ రాజు త్వరలో నన్యసాధ్యమగు శుభము తనకు సమకూడనున్నదని తలంచెను. వెంటనే కిన్నరద్వయము కోలాహలపర్వతముమీఁదికి వెడలిపోయెను.

క. ఆలోకాద్భుతవిహగయు, గాలోకప్రీతివలన • నతిలోకవయః
కోలాహలకోలాహల, లీలాహలహళిక చెంగ•లించెఁ బతికిన్. 163

ఆ=అట్టి, లోకాద్భుత=లోకాశ్చర్యకరమైన, విహగయుగ = కిన్నరపక్షిమిథునముయొక్క, ఆలోకప్రీతివలనన్=దర్శనమువలనఁ బుట్టిన మక్కువచేత, పతికిన్=వసురాజునకు, అతిలోక=లోకాతీతమైన, వయః=పక్షులయొక్క, కోలాహల = కలకలధ్వనులుగలిగిన, కోలాహల=కోలాహల పర్వతమందలి, లీలాహలహళిక=లీలావిహారోత్సవము, చెంగలించెన్=ఉద్రేకించెను. కిన్నరపక్షులు భూలోకమునకు నాశ్చర్యకరములైనవియ కదా.

తా. లోకాశ్చర్యకరములగు కిన్నరపక్షులను జూచినంతన రాజునకు వేడుక గలిగెను. అవి కోలాహలపర్వతముపైఁ జేరి కలకలధ్వనులు గావించుచుంట నాలించి యటకుఁ బోవనెంచెను.

ఆశ్వాసాంతము.

మ అవితోర్వీనవఖండఖండపరశు•జ్యాభోగిసాభోగభో
గవిభాస్వద్భుజదండ దండధరవీ•క్షారూక్షనానావిప
క్షవిభుక్షేపకకాండ కాండభయకృ•ద్గంభీరభేరీమహా
రవదీర్ణాద్రిపిచండ చండబలధౌ•రంధర్యహార్యగ్రజా. 164

అవిత=రక్షింపఁబడిన, ఉర్వీనవఖండ=భూమియొక్క భరతఖండము మొదలైననవఖండములుఁ గలవాఁడా, ఖండపరశు=శివునియొక్క, (ని. 'భూతేశః ఖణ్డపరశుః' అని అ.) జ్యా=వింటినారియైన, భోగి=సర్పముయొక్క, అనఁగా శేషాహియొక్క, సాభోగ=అతిదీర్ఘత్వముతోఁగూడిన, భోగ=శరీరమువలె, (ని. 'భోగస్సుఖే స్త్ర్యాదిభృతావహేశ్చ ఫణకాయయోః' అని వి.) విభాస్వత్=విలసిల్లుచున్న, భుజదండ=బాహుదండములు గలవాఁడా, దండధర=యమునియొక్క, వీక్షా=(క్రూర)దృష్టివలె, రూక్ష=తీక్ష్ణమైన, నానా=సమస్తమైన, విపక్షవిభు=శత్రురాజులను, క్షేపక=చిమ్మివైచునట్టి, కాండ=బాణములుకలవాఁడా, (వ్యు. 'కస్య బ్రహ్మణః అణ్డః కాణ్డః' అనువ్యుత్పత్తిచేతఁ గాండమనఁగా బ్రహ్మాండము.) కాండ = బ్రహ్మాండమునకు, భయకృత్=భయంకరమైన, గంభీర=గంభీరమైన, భేరి=రణభేరియొక్క, మహత్=గొప్పదియయిన, రవ=ధ్వనిచేత, దీర్ణ=బ్రద్దలుచేయఁబడిన, అద్రిపిచండ=పర్వతోదరములుగలవాఁడా, (ని. 'పిచణ్డ ముదరే విద్యాత్పశో రవయవేపిచ' అని వి.) చండ=సమర్థమైన, బల=బలముయొక్క, ధౌరంధర్య=భారమును వహించుటయందు, హార్యగ్రజా=బలరాముఁడైనవాఁడా, అనిసంబోధనము. ఈపద్యము ముక్తపదగ్రస్తముగాఁ జెప్పఁబడియెను.

క. శ్రీకర్ణాటేశ్వర వి, శ్వాకర్ణితబిరుదశాస•నాంక వితీర్ణ
శ్రీకర్ణ దశదిశాలల, నాకర్ణాభరణసుగుణ•నవరత్నఖనీ. 165

శ్రీ=సంపద్యుక్తమయిన, కర్ణాట=కర్ణాటరాజ్యమునకు, ఈశ్వర=ప్రభువైనవాఁడా, విశ్వ=ప్రపంచముచేత, ఆకర్ణిత=వినఁబడిన, బిరుదశాసనాంక=బిరుదులతోఁ గూడిన శాసనచిహ్నములు గలవాఁడా, వితీర్ణశ్రీ=వితరణసమృద్ధియందు, కర్ణ=కర్ణుఁడైనవాఁడా, దశదిశా = పదిదిక్కులనెడి, పూర్వాదిక చతుర్దిక్కులును నాగ్నేయాదిక చతుర్విదిక్కులును నూర్ధ్వాధఃప్రదేశములునుగూఢ నీ

పదియు దశదిక్కు లనంబడును. లలనా=స్త్రీలకు, కర్ణాభరణ=కర్ణభూషణములైన, సుగుణ=సుగుణములనెడు, నవరత్న=నూతనరత్నములకు, ఖనీ=గనియైనవాఁడా, ఈపద్యము ద్విప్రాసముగలదిగాఁ జెప్పంబడియెను.

పృథ్వి. కబంధహరధీరతా•కర కరాసికృత్తత్రుట
త్కబంధపరిపంథిసం•గ్రథితసూర్య సూర్యర్పిత
ప్రబంధరసబంధురా•ర్థపదబంధ బంధుస్వధీ
నిబంధన యబింధనా•గ్నినిభనిత్య తేజోనిధీ. 166

కబంధహర=కబంధాసురసంహారకుఁడైన శ్రీరామునియొక్క, ధీరతా=ధైర్యమునకు, ఆకర=స్థానమైనవాఁడా, అనఁగా శ్రీరామునితో సమానమైన పరాక్రమము గలవాఁడని భావము. ఖరాసి=తీక్ష్ణమైనఖడ్గముచేత, కృత్త=ఖండితులై, త్రుటత్=తెగిన, కబంధ=మొండెములుగల, ని. 'కబన్ధో స్త్రీ క్రియా యుక్తమపమూర్ధకళేబరమ్' అని అ. పరిపంథి=శత్రువులచేత, సంగ్రథిత=భేదింపఁబడిన, సూర్య=సూర్యమండలముగలవాఁడా, సూరి=విద్వత్కవులచేత, అర్పిత=సమర్పింపఁబడిన, ప్రబంధ=ప్రబంధములయందలి, రస=శృంగారాది రసములచేత, బంధుర=సుందరమగుచున్న, అర్థ=అర్థంబును, పదబంధ=పదసందర్భమునుగలవాఁడా, బంధు = బంధువులయందు, స్వధీనిబంధన=తా ననెడుబుద్ధిని బంధనముగలవాఁడా, అనియైనను, బంధువులకు స్వాధీనుఁడవైనవాఁడా, అనియైనను అర్థము. అబింధనాగ్ని=బడబాగ్నితోడ, నిభ=సమానమైన, నిత్య=శాశ్వతమైన, తేజః=ప్రతాపమునకు, నిధి=స్థానమైనవాఁడా, ఈవృత్తము ముక్తపదగ్రస్తముగాను ద్విప్రాసముగలదిగాను జెప్పంబడియె. ఈ పృథ్వీవృత్తమునకు జ స జ స య వ గణములును బండ్రెండవ యక్షరము యతిస్థానమునుగా నుండవలయును. ఇది పదియేడవఛందం బగు నత్యష్టిఛందంబునఁ బుట్టిన వృత్తము.

లక్షణము-

ప్రియంబగుచు రుద్రవిశ్రమము పృథ్వికాసంజ్ఞికా
హ్వయంబగు జసంబుతో జసయవంబులుఁ గూడినన్.

కాని యాధునికకవులు పృథ్వీవృత్తమునకు తొమ్మిదింట యతివాడియున్నారు.

గద్యము. ఇది శ్రీరామచంద్రచరణారవిందవందనపవననందన ప్రసాదసమాసాదిత సంస్కృతాంధ్రభాషాసామ్రాజ్యసర్వంకష చతుర్విధ కవితానిర్వాహక సాహిత్యరసపోషణరామరాజభూషణప్రణీతం బైనవసుచరిత్రంబునందుఁ బ్రథమాశ్వాసము.

ఇది శ్రీమదాత్రేయకులకలశాంభోనిధి సంపూర్ణసోమ సోమాభిధాన మంత్రివరపౌత్రుండును సోమసుతసిద్ధేశ్వరమంత్రీశ్వరపుత్త్రుండును శ్రీమత్పార్వతీరాజేశ్వరవరప్రసాద సమాసాదిత హృద్యానవద్య నిఖిలవిద్యావిశారదుండును నగుసోమకవిచేత విరచితం బయినవిద్వజ్జనరంజనీనామకప్రతిపదటీకారూపం బగువసుచరిత్రనామ కాంధ్రకావ్యరత్నవ్యాఖ్యానమునందలి ప్రథమాశ్వాసము.

శ్రీ ర స్తు.

వసుచరిత్రము సవ్యాఖ్యానము.

ద్వి తీ యా శ్వా స ము.

శ్రీతిరుమలరాయ జయ
శ్రీతరుణీరమణ సుగుణ•శీతల యాకా
శీతలసేతుధరాతిధు
రాతతభుజదండ మూరు•రాయరగండా. 1

శ్రీ=సంపద్యుక్తుఁడవైన, తిరుమలరాయ = తిరుమలరాయ నామము గలవాఁడా, జయశ్రీ
శ్రీ రమణ=జయలక్ష్మీనాథుఁడ వైనవాఁడా, సుగుణ=శుభగుణములచేత, శీతల=చల్లనైనవాఁడా,
త్వము సర్వజనాహ్లాదగుణసూచకము. ఆకాశీతల=కాశీప్రదేశము మొదలుకొని, ఇక్కడ ఆజనె
నిపాతము, అభివ్యాప్త్యర్థకము. (ని. 'ఆ జీషదర్థే భివ్యాప్తౌ సీమార్థే ధాతుయోగజే' అని అమ
•) సేతు=సేతుపర్యంతమైన, ధరా=భూమియొక్క, అతిధురా=అత్యంతభారముచేత, తత=
ప్తమైన, భుజదండ=బాహుదండముగలవాఁడా, మూరురాయరగండా=మూరురాయరనఁగా అశ్వ
నరపతి, గజపతులు, వారికి భర్తవైనవాఁడా యని యర్థము. అనఁగా నీముగ్గురు రాయలను
సుచేసికొని విశాలమగు భూచక్రము నిర్వక్రపరాక్రమముతోఁ బరిపాలించుచున్నాఁడనుట.

అవధరింపుము శౌనకా•ద్యఖిలసన్మునీంద్రులకు రౌమహర్షణి • యిట్లు పలుకు
నమ్మహీజాని నిజవిహా•రాచలేంద్ర,దివ్యసౌభాగ్యములు చూడఁ•దివురుటయును.

అవధరింపుము=చిత్తగింపుము, శౌనకాద్యఖిలసన్మునీంద్రులకు = శౌనకుఁడు మొదలుగాఁగల
స్త మునిశ్రేష్ఠులకు, రౌమహర్షణి యిట్లుపలుకు=రోమహర్షణ పుత్రుఁడైన సూతుఁడు, ఈలా
పలుకును. ఏమనిన, అమ్మహీజాని=ఆవసురాజు, నిజ విహారాచలేంద్ర దివ్యసౌభాగ్యములు
డఁ దివురుటయును=స్వకీయమైన క్రీడాపర్వత మగుచున్న కోలాహలాద్రియొక్క దివ్యమైన
వములు చూచుటకొఱకుఁ బ్రయత్నముచేయఁగాను.

ఆయెడ నొక్క నర్మసచి•వాగ్రణి యి ట్లను నోయఖండతే
జోయుత యద్భుతం బొకటి • చూచితిఁ జూపెద నీకు నాదుచే
చాయనె చూడు మభ్రమునఁ • జక్కఁగ నల్లదె నల్లమబ్బులోఁ
బాయపు కొన్నిమ్రాఁకులు నృ•పా యవుఁ జు మ్మవి నాకభూజముల్. 3

ఆయెడన్=ఆసమయమందు, ఒక్కనర్మసచివాగ్రణి=ఒకయిష్టుఁడయిన మంత్రిశ్రేష్ఠుఁడు,
చున్=వక్ష్యమాణప్రకారముగాఁ బలికెను. ఓయఖండతేజోయుత = అఖండ తేజస్సంపన్నుండ
యోరాజాగ్రణీ, అద్భుతం బొకటి చూచితిన్=నేనొక యాశ్చర్యమును జూచితిని, చూపెద

నీకు నాదుచేచాయనె చూడుము = నీకుఁ గనుపడుచున్నాను నాయొక్క చేతివెంబడిగానే చూడుము. అభ్రమునఁ జక్కఁగను=ఆకాశమందు సూటిగాను చూడుమని వెనుకకన్వయము. అల్లదె నల్లమబ్బులోఁ బాయవు కొన్ని మ్రాఁకులు=అల్లవిగో నీలమేఘములోఁ గొన్నివృక్షము లెడతెగకయున్నవి, నృపా=వసురాజా, అవి=ఆకనుపడెడు వృక్షములు, నాకభూజముల్=కల్పవృక్షములు, అవుఁజుమ్ము=అవునుజుమీ. భూలోకవాసులకు దేవవృక్షదర్శన మద్భుతము. ఆకాశమునందున్న నల్లమబ్బులోనుండి వృక్షము లగుపడుటయే దేవభూరుహభ్రాంతిహేతువు.

తా. వసురాజు నాతనిప్రియమంత్రి చూచి రాజా! నేనొకయాశ్చర్యమును జూచితిని. నీకుఁ గూడఁ జూపెదను. నావ్రేలిచాయను దిలకింపుము. ఆకాశమునందలి నల్లమబ్బులో నెడతెగక కానవచ్చునవి దేవవృక్షములు సుమా! అనెను.

చ. అన విని నవ్వి సూక్ష్మగతి • నారసి యారసికావతంసుఁ డి
ట్లను మన కేళిశైల మది • యల్లది తన్మఘువాశ్మకూట మ
మ్మనికిమహీజము ల్చదలు•మ్రాఁకు లటంచు భ్రమించి పల్కెదై
నను మృష గాదు నీపలుకు • నాకనగంబులె తద్ద్రుమావళుల్. 4

అనవిని=నర్మసచివుఁ డీలాగు పలుకఁగా విని, నవ్వి=నవ్వినవాఁడై, సూక్ష్మగతినారసి=సూక్ష్మమార్గముచేత విచారించి, ఆరసికావతంసుఁడు=రసికజనశ్రేష్ఠుఁడైన యావసురాజు, ఇట్లనున్=ఈలాగనిపలికెను. ఏమనియనిన, మనకేళిశైల మది=ఆకనఁబడునది మనక్రీడాపర్వతము, అల్లది=అదిగో కనఁబడునది, తత్=ఆక్రీడాపర్వతసంబంధమైన, మఘువాశ్మ=ఇంద్రనీల మణిమయమైన, కూటము=శిఖరము, అమ్మనికిమహీజముల్=ఆయింద్రనీలమణి శిఖరమందలి వృక్షములు, చదలు మ్రాఁకులటంచు భ్రమించి పల్కెదు=ఆకాశవృక్షములని భ్రమపడి పల్కుచున్నావు. ఐనను=అయినప్పటికిని, మృషకాదు నీపలుకు=నీమాట యబద్ధముగాదు. ఏమనిన, తద్ద్రుమావళుల్=మనక్రీడాపర్వతసంబంధమైన యింద్రనీలమయ శిఖరములయందలి వృక్షములు, నాకనగంబులె=నీవుచెప్పినట్లుగా నాకనగంబులె, అనఁగా నాకాశవృక్షములే యని యర్థము. స్వర్గసంబంధమైన కల్పవృక్షముల వంటివే యనిభావము.

నాకశబ్దము ఆకాశమందును స్వర్గమందును వర్తించుచున్నది. ని. 'ఆకాశే త్రిదివే నాకః' అని అమరము. ఇందులో సచివుఁడు భ్రమనొందినవాఁడు రాజు భ్రమనివారణము చేసినవాఁడును గనుక రాజునకంటె సచివుఁడు కొంచెము తక్కువవాఁడైనందున పీఠమర్దుఁడని తెలియవలెను. ఇందునకు, శ్లో.'కించిదూనః పీఠమర్దః' అని లక్షణము. మంత్రి స్థూలగతినారయక చెప్పినది గావున రసికావతంసుఁడగు రాజు దానిని సూక్ష్మగతి నారయుటయు నర్థాంతరముచే సమర్థించుటయు రసికావతంసత్వమునకు హేతువులు. సచివాగ్రణినే ఇంద్రనీలశిఖరము మేఘసమూహముగను శైలోపరివృక్షములు దేవవృక్షములుగను భ్రమింపఁజేయుట శిఖరప్రకాశమునకు ఔన్నత్యాతిశయమునకు సూచనలు. మనకేళిశైలమునే గురితింపలేకపోతివా? యిదియేనా నీవు కనిపెట్టిన విచిత్రమని రాజు నవ్వెను.

అలం. పరికరము. నిరుక్తి.

తా. రసికాగ్రేసరుఁడగు వసురాజు మంత్రిమాటలాలకించి నవ్వి సూక్ష్మదృష్టితోఁ జూచి ఓయీ! నీవు భ్రమపడుచున్నాఁడవు. అదే మనక్రీడాశైలము. నీవు మేఘములనినవి ఇంద్రనీలపుఁ

జటీయలు. నాకభూజములన్నవి శిఖరస్థవృక్షములు. ఐనను నీమాట తప్పుగాదు. అవి నాకభూజములే.

సీ. అచటిసానులు రత్న♦రుచిరంబు లననేల వానివంశములెల్ల ♦ నీను మణుల [లు
ద్రుమములెల్లను సురా♦గమములౌటరుదె నిత్యసురాగములుతదీ♦యాంకురము
లతలు సంజీవను ♦ ల్గావె యచ్చట వానితావులు నతనుసం♦జీవనములు
రసములెల్లను సిద్ధ♦రసములౌటెంత తత్ప్రసవంబులును సిద్ధ♦రసము లచట
తే. నచటిమణిచిత్రభూములు ♦ నచట నమరు, నమరతరువులగుమురులు ♦ నచటి తీవ
లచటిపొందమ్మికొలఁకులు ♦ నభవునింట, నైన నాదంటబలువింట ♦ నైనఁ గలవె.

అచటిసానులు = ఆకోలాహలాద్రియందలి చఱులు, రత్నరుచిరంబులననేల = మణులచేతఁ బ్రకాశమానములైనవని వేఱ చెప్పనేల, వంశమనఁగా సంతతులును వెదుళ్లును, (వి. 'వంశో వేణౌ కులే వర్గే పృష్ఠస్యావయవే పిచ' అని విశ్వము.) వాని=ఆచఱులసంబంధమైన, వంశములెల్ల=సంతతులన్నియుఁగూడ, ఈనుమణులన్=రత్నముల నుత్పాదించును, అనియర్థము. ఆచఱులయందలి వెదుళ్లు ముత్యములను బుట్టించుచున్నవని భావము. వెదుళ్లయందు ముత్యాలు పుట్టుచున్నవనుటకు-

క. 'విదితముగ బొంగువెదురున, నొదవినమౌక్తికము తారకోజ్జ్వలము శుభ
ప్రదము' అనిరత్నశాస్త్రము.

ద్రుమములెల్లను = అక్కడివృక్షము లన్నియును, సురాగమములౌటరుదె - సుర+అగములు=దేవతాసంబంధమైనవృక్షములు, అనఁగాఁ గల్పవృక్షములౌట ఆశ్చర్యమా అనఁగాఁ గాదనుట. ఏమనిన, తదీయాంకురములు = ఆవృక్షములయొక్క చిగుళ్లుఁగూడ, నిత్య=నిత్యములయిన, సురాగములు = కల్పవృక్షములే యని యర్థము. సు+రాగములు శోభనరక్తిమ గలవని భావము. లతలు సంజీవనుల్గావె=తీఁగలు సంజీవనీలతలుగావా, అనఁగా అవుననుట. ఏమనిన, అచ్చట = ఆకోలాహలాద్రియందు, వానితావులును = ఆతీఁగెలయొక్క వాసనలుగూడ, అతను సంజీవనములు=అధికసంజీవనులని యర్థము. అతను=దేహరహితు లయినవారికిని, సంజీవనములు=బ్రతికించునవి యని ప్రకారాంతరము. అతనుఁడనఁగా మన్మథుఁడు గనుక మన్మథోద్దీపకములని భావము. రసములెల్లను = జలములన్నియును, సిద్ధ=ప్రసిద్ధమైన, రసములౌట = మధురసములౌట, ఎంత=ఏమిగొప్ప, అచట=ఆపర్వతమందు, తత్ప్రసవంబులు=ప్రసవ మనఁగా గర్భమోచనము, ఆజలములయొక్క శిశువులుఁగూడ, సిద్ధరసములు=ప్రసిద్ధ మధురరసములే యని యర్థము. ఆజలములయందలి ప్రసవములనఁగా పుష్పములు, సిద్ధమైన మకరందము గలవని భావము.

శ్లో. 'స్యాదుత్పాతే ఫలే పుష్పే ప్రసవో గర్భమోచనే' అని అమరము.

కాఁబట్టి, అచటిమణిచిత్రభూములు = అక్కడి రత్నప్రచురము లైనభూములును, అచట నమరు నమరతరువుల గుమురులు=అక్కడ నొప్పుచుండెడు దేవతావృక్ష సమూహములును, అచటి తీవలు=అక్కడి తీఁగెలును, అచటి పొందమ్మికొలఁకులు = అక్కడనుండెడు బంగారు తామరలు గలకొలఁకులును, అని క్రమాలంకారము. అభవునింట నైనన్=హరునకు గృహమైన కైలాసపర్వతమందైనను, ఆదంట=ఆహరునియొక్క, బలువింట నైనన్ = గొప్పవిల్లయిన మేరుపర్వతమందైనను, కలవె=ఉన్నవా, అనఁగా లేవనుట, అనఁగాఁ గైలాస మేరు పర్వతములకంటె మహిమాతిశయము గలదనిభావము. అలం-శ్లేషానుప్రాణితార్థాపత్తి.

తా. కోలాహలపర్వతమునందలి చఱియలు రత్నమయములై యుంటయేకాదు. అచటి వెదుళ్లయందుఁగూడ రత్నములు (ముత్యములు) జనించుచున్నవి. చెట్లు కల్పవృక్షములవలె నలరి క్రొంజివుళ్ళతోఁ దనరుచున్నవి. తీఁగలు మన్మథోద్దీపనకరములై తావులొలయుచున్నవి. జలము తేనియచవు లొలుకుచున్నది. శివుని మనికియగు కైలాసముగాని విల్లగు మేరువుగాని యీవిధముగ విహారయోగ్యసమస్తవస్తుసమృద్ధిగ నలరుటలేదు.

మ. అది గాదే మనకేళిభూధరము ద♦వ్వా చూత మాయద్రిసం
పద లంచుం గయిదండఁ బూని ధరణీ♦పాలుండు లీలాగిరిం
గదియన్ నర్మసఖుండు వల్కు నచటం ♦ గల్పద్రుహాలారసో
న్మద వైమానికమానినీ మధురగా♦నస్వాన సానందుఁడై. 6

అదిగాదే మనకేళిభూధరము = ఆదేకాదా మనక్రీడాపర్వతము, అనఁగా ఆకనఁబడునట్టిది గాదా మన క్రీడాపర్వతమైన కోలాహలాద్రి యనుట. దవ్వా=దూరమా, అనఁగా దూరము కాదనుట. కాఁబట్టి, చూత మాయద్రిసంపదలంచున్ = ఆపర్వత సంబంధమైన సౌభాగ్యముల నన్నిటిని జూతమనిపలుకుచు, కయిదండఁబూని = హస్తావలంబనముచేసి, ధరణీపాలుండు = వసురాజు, లీలాగిరింగదియన్=క్రీడాపర్వతమును చేరఁబోఁగాను, అచటన్ = ఆసమీపించిన స్థలమందు, కల్పద్రు=కల్పతరుసంబంధమైన, హాలారస=సురాపానముచేత, ఉన్మద = మత్తుగొనియున్న, వైమానికమానినీ=దేవతాస్త్రీలయొక్క, మధుర = మనోహరమైన, గానస్వాన = సంగీతనాదముచేత, సానందుఁడై =ఆనందసహితుఁడై, నర్మసఖుండు = ప్రియసఖుండు, వల్కున్=వక్ష్యమాణప్రకారముగాఁ బలికెను.

తొలుత కిన్నరీమిథునకోలాహలములు రాజు నుత్సుకపఱుప నిపుడు వేల్పుచెలువలగానము మఱింత సంతోషాతిశయము గూర్చెను. శైలము మిగుల సమీపమునందుంటవలననే రాజు మంత్రికైదండతో నేగెను. వేల్పుచెలువలు కల్పవృక్షాసవము గ్రోలి పాటలు పాడుచుంటచేతనే వారిగానము మధురము, ఆనందకరముసైయుండెను. కంఠస్వరము మధుపానమువలన మధురమగు ననుటకు-

ఉ. ఆళియుఁబోలె నిప్డు వనాళి యమార్గమునం జరించు ని
న్నోలలితాంగి కాదనుచు నున్నది మందసమీరణంబునన్
గ్రాలుప్రవాళమంజరులు క్రమ్రకరంబుల విభ్రమంబుగా
బాలరసాలపుష్పరసపాయి వనప్రియకంఠహుంకృతిన్.

శ్లో. 'రతిపతిప్రహితేనకృతక్రుధః ప్రియతమేషు వధూ రనునాయికాః,
వకుళపుష్పరసాసవపేశల ధ్వనిరగాన్నిరగాన్మధుపాళినః.' మాఘము.

తా. రాజు మంత్రికయిదండగొని మిగుల సమీపముననున్న కోలాహలపర్వతమునందలి విశేషముల దర్శింపవలయునని యుత్సాహపడి దరియ కల్పవృక్షాసవము గ్రోలి పాటలపాడు వేల్పుముగుదల మధురగానము వినవచ్చెను. ఆనందముతో నాపాట నాలించి యిటులఁ జెప్పఁదొడంగెను.

సీ. ఒకచాయ ననపాయ♦పికగేయసముదాయ మొకసీమ నానామ♦యూరనినద
మొకపంక నకలంక♦మకరాంక హయహేష లొకక్రేవ వనదేవ♦యువతిగీత

వొకచెంత సురకాంత•ల కరాంతతతనాద మొకదారి నవశారి•కోదితంబు
లొకయోరఁ బటుచార•ణకుమారఫణితంబు లొకదండ నలిమండ•లికలగాన
తే. మొక్కమొగి మ్రోయఁ గదళీగృ•హోపపన్న, కిన్నరీబృందబృందసం•గీతరీతి
నమరునతివేలకోలాహ•లములకలిమి, నధిపయీయద్రికోలాహ•లాఖ్యమొక్క.

ఒకచాయన్ = ఒకదిక్కున, అనపాయ = ఎడఁబాటులేని, పిక = కోకిలయొక్క, గేయ= గానములయొక్క, సముదాయము = సంఘంబును, ఒకసీమన్=ఒకప్రదేశమందు, నానా=సమస్తమయిన, మయూర = నెమళ్ళయొక్క, నినదము=కేకారవంబును, ఒకవంకన్=ఒకవైపున, అకలంక=తొట్రుపాటులేని, మకరాంకహయ = మన్మథాశ్వములయొక్క, అనఁగా చిలుకలయొక్క, హేషలు = సకిలింపులును, అనఁగా పలుకులును, ఒకక్రేవన్=ఒకపార్శ్వమందు, వనదేవయువతిగీతము=వనదేవతాస్త్రీలయొక్క గానమును, ఒకచెంతన్ = ఒకపార్శ్వమందు, సురకాంతల=అప్సరఃస్త్రీలయొక్క, కరాంత=హస్తాగ్రములయందలి, తత = వీణాదివాద్యములయొక్క, నాదము=ధ్వనియును, ఒకదారిన్=ఒకమార్గమందు, నవ=నూతనమయిన, శారికా=గోరవంకలయొక్క, ఉదితంబులు=భాషితములును,(ని. 'ఉక్తం భాషిత ముదితం' అని అమరము.) ఒకయోరన్=ఒకవైపున,పటు=సమర్థులైన, చారణకుమార = పిన్నవయసుగల చారణులయొక్క, ఫణితంబులు = స్తుతివాక్యములును, ఒకదండన్=ఒకవైపున, అలిమండలి = తుమ్మెదగుంపులయొక్క, కలగానము = అవ్యక్తమధురమైన గానంబును, ఇవన్నియు నేకసమయమునందుంటయే యేకగతి మ్రోయుటగాఁ జెప్పఁబడెను. ఈమధురధ్వనులన్నియుఁ గలసిపోవుట నదియంతయుఁ గోలాహలముగ నుండెను. అలంకారము - నిరుక్తి. ఉత్ప్రేక్ష.

ఒక్కమొగి మ్రోయన్ = ఏకరీతిగా ధ్వనించుచుండఁగా, కదళీగృహ = అరఁటిచప్పరముల యందు, ఉపపన్న=కూడుకొనిన, కిన్నరీబృంద=కిన్నరస్త్రీసమూహముయొక్క, బృందసంగీతరీతిన్=సముదాయగానముయొక్క వైఖరిచేత, అమరు=ఒప్పుచుండెడు, అతివేల=అతిశయమయిన, కోలాహలములకలిమిన్=కలకలధ్వనులు గలిగియున్నందున, అధిప = వసుమహారాజా, ఈయద్రి= ఈపర్వతము, కోలాహలాఖ్యమొక్క=కోలాహలమనెడు పేరుగలదాయెనో యేమొ.

తా. ఈపర్వతమునం దెడతెగని కోకిలలపాటలు, నెమిళ్ళయఱపులు, చిలుకలపలుకులు, వనదేవతాగానములు, వేల్పుచెలువల వీణాగానములు, గోరవంకలనుడువులు చారణయువకుల భాషణములు తుమ్మెదలఝుంకారములు కలసి మెలసి మ్రోయఁ గిన్నరీబృందగీతరవమందు లీనమై కోలాహలముగానుంటచేఁ గాఁబోలు కోలాహలనామ మీశైలము పొందినది ?

మ. ఘనజాంబూనదరౌప్యరత్నరుచులం • గన్పట్టు నీగట్టుఁ జు
ట్టినగండోపలమండలంబు గనుఁగొం•టే మేదినీశైలశా
సన యుష్మచ్చరణావధూత మగునీ•శైలంబు నూరార్పఁగా
ననుకంపామతిఁ జేరుమేరుముఖగో•త్రాధీశులం బోలెడిన్. 8

ఘన=అధికమయిన, జాంబూనద = బంగారుయొక్కయు, రౌప్య = వెండియొక్కయు, రత్న=మణులయొక్కయు, రుచులన్ = కాంతులచేత, కన్పట్టు = కనుపడుచున్న, ఈగట్టుఁజుట్టిన

గండోపలమండలంబు = ఈకోలాహలపర్వతమును జుట్టుకొనియున్న గండశిలలయొక్క సమూహము, కనుఁగొంటే=చూచితివా, మేదినీ = భూమియందు, శైలశాసన=ఇంద్రుఁడవైన వసురాజా, ఈసంబోధనము కోలాహలపర్వతభంజనాభిప్రాయగర్భము. యుష్మత్=మీయొక్క, చరణ=పాదముచేత, అవధూతమగు=ఎగురఁగొట్టఁబడిన, ఈశైలంబును=ఈకోలాహలపర్వతమును, ఊరార్పఁగాన్=ఊరడించుకొనుటకుఁ గాను, అనుకంపామతిన్=దయామతిచేత, చేరు=వచ్చి ప్రవేశించిన, మేరుముఖ గోత్రాధీశులం బోలెడిన్=మేరువు మొదలయిన పర్వతాధిపతులను బోలుచున్నవి చూచితివా యని సంబంధము. ఇందులో గండోపలములు జాంబూనద రౌప్య రత్న కాంతులచేతఁ గానఁబడుచున్నవి గనుక నీకాంతులుగల మేరు కైలాస రోహణాద్రులు మొదలయిన పర్వతములే వచ్చియున్నట్టుగానే యున్నవని యర్థము. గండోపలములు మేరుముఖ పర్వతరాజములవలె నున్నవని చెప్పుటచేతఁ గోలాహలపర్వతమునకు లోకాతీతమైన మహత్త్వము ధ్వనితమగుచున్నది.

అలంకారవిచారము—'అత్ర గండోపలమండలస్య జాంబూనదరౌప్యరత్నమయత్వాసంబంధేఽపి తత్సంబంధోక్త్యా అతిశయోక్తిః తయానుప్రాణితయా గండోపలానాం మేరుముఖపర్వతత్వోత్ప్రేక్షయా కోలాహలస్యలోకాతిశాయి మహత్త్వం ధ్వన్యత ఇత్యలంకారేణ వస్తుధ్వనిః.' అను సోమకవివాక్యమువలన నలంకారము అతిశయోక్తి. వస్తుధ్వని.

తా. ఓ భూదేవేంద్రా! కోలాహలపర్వతముచుట్టునుగల బంగారుగండశిలలు మేరువువలెను, వెండిగండశిలలు కైలాసమువలెను, రత్నమయములగు శిలలు రోహణపర్వతమువలె నున్నవి. నీకాలి తాఁకిడిచే నొచ్చిన నీనగరాజు నోదార్చుటకు వచ్చిన శైలరాజములవలె నీగండశిలలున్నవి.

ఉ. అక్కట నీయుదగ్రచరణాహతి కోరువ లేక యేగతిన్
స్రుక్కెనొ గట్టురాచకొమరుం డలనాఁడు కపోతహుంకృతిం
గ్రక్కున మూల్గుచుం బిలముఖంబున నేఁడును గంటె నెత్తురుల్
గ్రక్కెడు ధాతువుల్సెదరఁగా నరుణాంబుఝరీమిషంబునన్. 9

అక్కట=అయ్యయ్యో, నీ=నీయొక్క, ఉదగ్ర=ఉత్కటమయిన, చరణాహతికిన్=పాదప్రహారమునకును, ఓరువలేక=సహించలేక, గట్టురాచకొమరుండు=పర్వతాధిపతియైన హిమవంతుని కుమారుఁడు, అనఁగా నీకోలాహలుఁడు, అలనాఁడు=తన్నఁబడిన యాసమయమందు, ఏగతిన్ స్రుక్కెనో=ఏప్రకారముగా సొమ్మసిల్లెనో తెలియదు. కపోత=గువ్వలయొక్క, హుంకృతిన్=హుంకారమనెడు హుంకారముచేతను, అనఁగా ఆయాసముచేత హుం అనెడు అనుకరణధ్వనిచేత, గ్రక్కునమూల్గుచున్=నిల్పులేక మూల్గుచును, బిలముఖంబునన్=గుహయనెడు ముఖముచేత, ధాతువుల్సెదరఁగాన్=నాడులు చెదరఁగా ననియర్థము. గైరికాదిధాతువులు చెదరఁగానని భావము. అరుణ=ఎఱ్ఱనైన, అంబు=ఉదకముయొక్క, ఝరీ=ప్రవాహమనెడు, మిషంబునన్=వ్యాజముచేత, నేఁడును=ఇప్పుడును, నెత్తురుల్ గ్రక్కెడున్=నెత్తురు గ్రక్కుచున్నాఁడు, కంటే=చూచితివా. ఝరీమిషంబునన్ అనుచోట అపహ్నవాలంకారము. రూపకము. శ్లేషము. అర్థాపత్తి.

చరణాహతి ఉదగ్రమైనదగుటచేతనే గట్టురాకొమరుఁ డోరువలేకపోయెను. అనఁగా నంతవానిని నొప్పించెననుట. ఆనాఁటియవస్థ యెటుల సహించెనోగాని యీనాఁటికి నేడ్చుచున్నాఁడు. కావనే నీవు మేదినీశైలశాసనుఁడవని సారస్యము.

కపోతధ్వనిని హుంకృతిగా మూల్గుటగాఁ జెప్పుదురనుటకు దృష్టాంతము-

శ్లో॥ పరిణతరవిగర్భవ్యాకులా పౌరుహూతీ
దిగపి మదకపోతీ హుంకృతైః క్రందతీవ. భోజచరిత్రము.

శ్లో॥ ఆలీవపశ్య ప్రతిషేధతీయం కపోతహుంకారగిరా వనాళిః. నైషధము. తృ. స.

మ. నను నువ్వెత్తుగఁ బాఱ మీటితివి నానాధైర్యసామగ్రి మ
జ్జనకున్ మున్నె తృణీకరించితి కృపాస్వాంతంబునం బ్రోవు మిం
క నరేంద్రా యని గట్టు వేఁడెడి నినుం గంటే తృణగ్రాహిసూ
తననీలాశ్మదరీముఖాగ్రవిచలద్వాతూలమంద్రధ్వనిన్.

ననున్ = నన్ను, ఉవ్వెత్తుగఁ బాఱమీటితివి=బొత్తిగా నెగిరిపోవునట్టు గోటమీటితివి, నానాధైర్యసామగ్రిన్=నానావిధమైన ధైర్యసంపదచేత, మజ్జనకున్=మాతండ్రియైనహిమవంతుని, మున్నె తృణీకరించితివి=మునుపే తృణప్రాయముగాఁ జేసితివి. కాఁబట్టి, కృపాస్వాంతంబునన్= దయాసహితమైన మనస్సుచేత, ఇంకన్=ఇఁకమీఁదను, ప్రోవుము=రక్షింపుము. నరేంద్రాయని= వసురాజాయని, తృణగ్రాహి = గఱికగఱచుకొన్న, నూతన = నవీనమైన, నీలాశ్మ=మహానీలముల యొక్క, దరీ=గుహాయనెడు, ముఖ=ముఖముయొక్క, అగ్ర=చివరను, విచలత్=చరించుచున్న, వాతూల=వాయుసంబంధమయిన, మంద్రధ్వనిన్=గంభీరధ్వనియనెడు హీనస్వరముచేత, గట్టు కోలాహలాద్రి, వేఁడెడినినున్=నిన్ను ప్రార్థించుచున్నది, కంటే=చూచితివా. అనఁగా లోక మందు బలవంతునిచేత నవమానమును బొందినవాఁడు భయపడి నోట గఱిక గఱచుకొని హీనస్వర ముచేతఁ గాఁచి రక్షింపుమని వేఁడుకొనుట ప్రసిద్ధము. మాతండ్రియగు హిమవంతుని తొలుత నే గడ్డి పఱకగ ధైర్యసంపదచే నిర్జించితివి. నన్నో పాఱమీటితివి. కాన నే రక్షింపుమని కోలాహలుఁడు ప్రార్థించెను. ప్రార్థించుతఱిగడ్డికఱచుట వధింపవలదని తెలుపుట. విచారాతిశయమున భయాతిశయమునఁ బ్రార్థించుతఱి కంఠముగద్గదికమై సంకుచితస్వరమగును గాన గంతరవము మంద్రధ్వనిగఁ జెప్పఁబడెను.

అలం. రూపకము. శ్లేష. అపహ్నవము. అర్థాపత్తియును.

వ. మఱియు నిక్కులాంచలసంతానంబు, సంతానకుసుమవాసనాసమాగతసారంగ సంగీతభంగీతరంగంబు లుపాంగంబులుగాఁ బాడు వేల్పుగాణీలపాణీరిత మాణిక్యవీణామధురరాణామృతంబులఁ గరఁగి జరగుకురువిందకందళంబుల జలంబులఁ బద నైనగైరికతలంబులం బొడమినకారణగుణంబునఁ బగడంబు డంబు విడంబించునిగనిగనితొగరునిగుడనెగడునగణితలతావితానంబుల నొయ్యనొయ్యన యొయ్యారంబుల నుయ్యెల లూఁగునజరగజరాజయానలయు పరివిస్ఫురచరణకంజమంజుతరమంజీరంబులఁ బెచ్చు పెరుగునచ్చపుఁబచ్చలచాయలు మెచ్చులు సేయఁ బచ్చికల మచ్చికల విచ్చలవిడిఁ గ్రచ్చుకొని మేసవ నుంకించునంకపురాజింక జంకించి మగుడరాఁ దివియునెడ బెగడి తొడిఁబడఁ దడఁబడ నడుగు లిడఁ గందుచందురుని మేనఁ జిందుసుధాబిందుసందోహంబుల పొందున డిందుపడి భవదరుణచరణనిహతిఁ బెకలినకఱకుటెఱకలు మగుడ నిగి

రించిన తెఱంగునఁ బరఁగుకార్ష్ణాంగుల తెగలను గని సమదసామజసమాజంబు లని యరసి మెఱసిన మెఱపునొఱపు లుపరిపరికీర్ణగైరికపరాగంబు లనియు నుఱుము లురుముఖబృంహితంబు లనియు రేసి యేసఁగాఁ దివిసి తడవిండ్ల నేసి క్రెవ్వనం గూసి డాసి తదుదరకరకనికరములు జలజలఁ దొరంగినం జూచి గుత్తంపుముత్తియంబు లని యేఱి సారెసారె గీరనగింజలాడం దలంచుచెంచుమఁద్దియలయశ్రాంతమృగయాపరిశ్రాంతి నివారించుపటీరతరువాటికలును, బటీరతరువాటికావిటపములు నికటకూటకోటీవిటంకంబుల నొరయ నెరయు సురభిళరజంబులతోఁ బరిఫుల్లహల్లకపరాగపూరంబులు పరిక్షుణ్ణకాశ్మీరకేసరాసారంబులు పరిమృదితశైలేయసారంబులుఁ బసిమి యొసఁగ సగపాలు మేళవించి యభ్యంచితకాంచనప్రసవసౌరభసమాగమంబునం బువ్వగట్టి గంధవహుండు సవరించినయందంపుగందవొడి నెఱవలపులు వలపులరేనికలనం గలయలపు లపనయింప నింపుసొంపునఁ బెంపుమిగులుకింపురుషచంపకామోదలకు దాఁపు లగుసేవంతిపూఁబొదలును, సేవంతిపూఁబొదలజిఱుకున ననఘహిమసలిలములు నెలచలప దొనలఁదొట్టి జలజలన జాలుగొని వెల్లువలై మల్లడిగొని యల్లనల్లన నతిశీతలశిలాతలంబుల మెలఁగుకస్తూరిమెకంబులమదభరంబులం దొరఁగునాభీరక్తంబు లిగిరి గనిగట్టిననిగరములు గరఁచికొని పఱచి యవలఁ గమ్మనఁ బరిమళించుకజ్జజవ్వాదికలయికలఁ గలనిగ్గుల నగ్గలంబులై కదలి కర్పూరకదళికలపుప్పొడితిప్పల యొప్పు నప్పళించి గ్రక్కునఁ జిక్కనైన యాచొక్కపుకదంబంబులు పూయువిద్యాధరీకదంబంబుల యాటపాటలకు మెచ్చి యచ్చట వనదేవత లెత్తునారపతిపళ్లెరంబులకరణిఁ దనరుతరణికాంతపట్టికలను దరణికాంతపట్టికలఁ బుట్టుదట్టంపుసెకలపై నెట్టుకొనుననతిచిరప్రసూతచమరీస్తన్యంబులు పొంగిన గనుంగొని చెంగటిమునిజనతపోవనసవనభవనంబులఁ బ్రవర్గ్యారంభంబు లని విందులకు ముందుముందుగాఁ గ్రందుకొని వచ్చుబృందారకసందోహంబులునుం గలిగి, నవరతామోదసిద్ధమహిళాకులం బయ్యు ననవరతామోదసిద్ధమహిళాకులంబై, నిశాకరకాంతరాజీవరాగచ్ఛాయం బయ్యు ననిశాకరకాంతరాజీవరాగచ్ఛాయంబై, మేరుభూరిప్రభాభాసమానం బయ్యు నమేరుభూరిప్రభాభాసమానంబై వెలయుచున్నయది విలోకింపుము. 11

మఱియును, ఇక్కులాచలసంతానంబు = కులపర్వతమైన హిమవంతునిసంతానమవుచున్న యీ కోలాహలపర్వతము, సంతానకుసుమ = పారిజాతపుష్పములయొక్క, వాసనా=పరిమళమును గూర్చి, సమాగత = వచ్చిన, సారంగ = తుమ్మెదలయొక్క, సరస=మనోహరమైన, సంగీత=గానముయొక్క, భంగీ=రీతియొక్క, తరంగంబులు=పరంపరలు, ఉపాంగంబులుగా=శ్రుతులౌనట్టుగా, పాడు=గానముసేయుచున్న, వేల్పుగాణీల = గానముసేసెడునచ్చరలయొక్క, పాణి = హస్తముల చేత, ఈరిత = పలికింపఁబడుచున్న, మాణిక్యవీణా = పద్మరాగమణివికారములైన వీణలయొక్క,

మధుర=మనోహరమైన, రాణామృతంబులఁగరఁగి = రాణయనఁగా రాగము, అమృతప్రాయములైన రాగములచేత నీరుగాఁగరఁగి, జరగు=ప్రవహించుచున్న, కురువిందమనఁగా కెంపు:-నీ. 'సులలితమత్తకోకిలలోచనద్యుతి నలరారుఁ గురువింద మనెడు కెంపు' అని రత్నశాస్త్రము. కురువిందకందళంబుల=మొలకకెంపులసంబంధమైన, జలంబుల=ఉదకములచేత, పదనైన=తడిసి బురదయైయున్న, గైరికతలంబులన్ = గైరికాది ధాతుప్రదేశములయందు, పొడమినకారణగుణంబున = అనఁగా నెఱ్ఱనైన కెంపులనీటిచేత బురదపదనైన రక్తధాతుప్రదేశములయందుఁ బుట్టిన హేతువువలన, పగడంబు డంబు విడంబించు=పగడపుకాంతిని ప్రకటముసేయుచున్న, నిగనిగని = నిగనిగమెఱయునట్టి, తొగరునిగుడన్=రక్తిమయతిశయింపఁగా, నెగడు=వృద్ధిఁబొందుచున్న, అనఁగా పగడపుతీఁగెలవలెనున్న, అగణిత=ఎన్నశక్యముగాని, లతావితానంబులన్=తీఁగెమొత్తములయందు, ఒయ్యనొయ్యనన్=తిన్నతిన్నఁగాను, ఒయ్యారంబులన్ = విలాసములచేత, ఉయ్యెలలూఁగు = ఉయ్యెలలూఁగునట్టి, అజరగజరాజయానల = దేవతాస్త్రీలయొక్క, ఉపరి = ఊర్ధ్వభాగమందు, విసృమర=వ్యాపించునట్టి, చరణకంజ = పాదకమలములయందు, మంజుతర = మిక్కిలియు మనోహరములౌచున్న, మంజీరంబులన్ = అందెలయందు, పెచ్చుపెరుగు = అతిశయించుచున్న, అచ్చపుపచ్చల = పరిశుద్ధములైన మరకతమణులయొక్క, చాయలు = కాంతులు, మెచ్చులుసేయ = మనోరంజనముసేయఁగా, పచ్చికలమచ్చికలన్ = పచ్చగడ్డిపరకలనెడు భ్రమతచేత, విచ్చలవిడిఁ గ్రచ్చుకొని = స్వేచ్ఛగా కదియఁబడి, మెసవనుంకించు = మేయఁజూచుచున్న, అంకపురాజింకన్ = లాంఛనరాజకురంగమును, జంకించి = అదలించి, మగుడఁదివియునెడ = వెనుకకుఁ దిరుగఁదీసెడు సమయమందు, బెగడి=బెదురుకొని, తోడఁబడన్=వెంబడివెంబడిగా, తడఁబడు నడుగులిడన్ = తప్పటడుగులువెట్టి త్రొక్కఁగా, కందు=కమలిన, చందురునిమేనన్ = చంద్రునిదేహమునందు, చిందు=వెడలిపడుచున్న, సుధాబిందుసందోహంబుపొందునన్ = అమృతబిందుసమూహముయొక్క సాంగత్యముచేత, డిందుపడి = పూర్వమందడఁగిపడి, భవత్ = నీసంబంధమైన, అరుణ = ఎఱ్ఱనైన, చరణ=పాదముయొక్క, నిహతిన్=దెబ్బచేత, పెకలిన=పెల్లగిలి ఊడిపోయిన, కఱకుఱెకకలు=కర్కశములైన రెక్కలు, మగుడనిగిరించిన తెఱంగునంబరఁగు=మరల నిగురువెట్టినవో యన్నట్లుగానున్న, కార్మొగులతెగలనుగని = నల్లని మబ్బుగుంపులను జూచి, మద = మదయుక్తములైన, సామజ=ఏనుఁగులయొక్క, సమాజములని = సమూహములని, ఆరసి=విచారించి, మెఱసిన మెఱపునొఱపులు=ఆమబ్బుగుంపులయందు మెఱసిన మెఱుపుతీఁగెలయొక్క కాంతులను, ఉపరి=మీఁదను, పరికీర్ణ=వ్యాపింపఁబడిన, అనఁగా చల్లుకొనఁబడిన, గైరిక=గైరికధాతుసంబంధమైన, పరాగంబులనియును=జాజురేఖలనియును, ఉఱుములు=గర్జితములు, ఉరుముఖబృంహితంబులనియున్ = అధికతరములైననోటియందలి ఘీంకారములనియును భ్రాంతిని బొందియని భావము. రేసి=ఉద్రేకించి, అనఁగా చెలరేఁగి, ఏసగాఁదివిసి = ఏటవాలుగాఁదీసి, తడవిండ్లనేసి = తడవింటిబద్దలచేత బాణములువేసి, క్రొవ్వునంగూసి=ఉత్సాహముచేత క్రొవ్వునకేకవేసి, డాసి=సమీపమునకుఁబోయి, తదుదర=ఆమేఘగర్భములయందలి, కరక=వడగండ్లయొక్క, నికరములు = సమూహములు, ని. 'వర్షోపలస్తు కరకః' అని యమరము. జలజలఁ దొరఁగినంజూచి=జలజలరాలఁగాఁ జూచి, గుత్తంపుముత్తియంబులని=బిగువైన ముత్తెములని భ్రమసి, ఏఱి=ఏఱిపుచ్చుకొని, సారెసారెకున్ = మాటిమాటికిని, గీరనగింజలాడం

దలంచు = అచ్చెనగండ్లాడవలెనని తలంచుచున్న, చెంచుముద్దియల = చెంచుకన్నెపడుచులయొక్క, అక్రాంత=ఎడతెగని, మృగయా=వేటయందలి, పరిశ్రాంతిన్ = ఆయాసమును, నివారించు=పోఁగొట్టుచున్న, పటీరతరువాటికలును = శ్రీచందనతరువులయొక్క సమూహములును,

గీరనగింజలన ఓమనగుంటలయాట యని పూర్వవ్యాఖ్యాతలు వ్రాసియున్నారు గాని యది గణనీయముగాదు. ఓమనగుంటలయాటకు గట్టివి యనవసరము. కావున బిగితములగు జాలతో నాడఁదగుసాట అచ్చనగండ్లే యని తెలిసికొననగును. గీరనగింజలన అచ్చనగండ్లయాటలో నొకవిధమగు భేదముగలయాట. ఇందులకుఁ బ్రయోగము-

ఉ. చారుచిరత్నరత్నమయసౌధములన్ బురివైశ్యకన్యకల్
గీరనగింజలాడుతఱిఁ గ్రిందను జిందినదివ్యరత్నముల్
చోరులు ద్రొక్కుచుం జనఁగఁ జాడుకొనన్ ధరణీపురంధ్రికిన్
వారకరత్నగర్భ యనునామము పెట్టిరి సత్కవీశ్వరుల్. తారాశశాంకము. ఆ. 2.

పటీరతరువాటికావిటపములు = శ్రీచందనతరు సమూహములయొక్క విస్తారములు, నికట=సమీపమందలి, కూట=శిఖరములయొక్క, కోటి=అంచులయొక్క, విటంకంబులను=అగ్రభాగములను, ఒరయన్=రాపాడఁగా, నెఱయు=రాలిన, సురభిళరజంబులతోన్=పరిమళయుక్తమయిన రాపొడితోడ, పరిఫుల్ల=లెస్సగావికసించిన, హల్లక=ఎఱ్ఱకలువలయందలి, పరాగపూరంబులు = పుప్పొడుల యొక్క మొత్తములును, పరిక్షుణ్ణ=మిక్కిలి నలిగిన, కాశ్మీర=కుంకుమపువ్వుయొక్క, కేసర=కింజల్కములయొక్క, ఆసారంబులు=ధారాపాతములును, పరిమృదిత=లెస్సగామర్దింపఁబడిన, శైలేయ=రాతిపువ్వుయొక్క, సారంబులు = స్థిరాంశములును, ఇది పరిమళయుక్తమైనదని తెలియవలయును. ని. 'శైలేయగన్ధీని శిలాతలాని' అని ప్రయోగము. పసిమియొసఁగ సగపాలు మేళవించి = పచ్చఁదన మొప్పునట్టుగా నర్థభాగముగూడఁగలిపి, అభ్యంచిత = మిక్కిలి యొప్పుచున్న, కాంచనప్రసవ=సంపంగిపువ్వులయొక్క, సౌరభ=పరిమళముయొక్క, సమాగమంబునన్ = చేరుటచేత, పువ్వుగట్టి=వాసనాయుక్తముచేసి, గంధవహుండు = వాయువనెడు బుక్కావాఁడు, సవరించిన=సిద్ధపఱిచిన, అందంపుగందవొడి = యోగ్యమయిన బుక్కాయొక్క, వలపులనఁగా వాసనలు. ఇందులకు ప్రయోగము. క. 'కుందనపుకమ్మవలపుం, జెందిన చందమునఁ దెల్ల చెఱుకునబండై, సుందరి యగునక్కన్నియ, యందెలప్రాయంబువిడువ నాయిత మయ్యెన్.' అని కవికర్ణరసాయనము. నెఱవలపులు=నిండువాసనలు, వలపులరేని = మన్మథునియొక్క, కలనఁగల=యుద్ధమందు సంప్రాప్తమైన, అలయికలను=బడలికలను, అనఁగా సురతశ్రమములను, అపనయింపన్=పోఁగొట్టుచుండఁగా, ఇంపుసొంపునఁ బెంపుమిగులు = ఇష్టమైన విలాసముచేతను నతిశయించుచున్న, కింపురుష చంపకామోదలకున్ = సంపంగిపువ్వువాసనవంటి వాసనగల కింపురుషస్త్రీలకు, తావులగు=నివాసస్థానములైన, సేమంతిపూఁబొదలును=చేమంతిపువ్వుఁ బొదలును, వలపులజొనికలయికలలోని యలసటఁ బోఁగొట్టఁదగినవి వలపులేనని యాశయము.

సేమంతిపూఁబొదలఁజినుకు = చేమంతిపువ్వుఁ బొదలవలనఁ గురియుచున్న, అసఘుహిమసలిలములు=నిర్మలమైన మంచునీళ్లు, నెలచలపదొనలఁదొట్టి=చంద్రకాంతశిలామయములైన కొండదొనల

యందు నిండి, జలజలనజాలుగొని = జలజలజాఱునట్టుగాఁ జాలుగట్టి, వెల్లువలై మల్లడిగొని=పఱదలై చుట్టుకొని, అల్లనల్లనన్=తిన్నతిన్నఁగాను, అతిశీతల=మిక్కిలి చల్లనైన, శిలాతలంబులన్=ఱాతిబండలయందు, మెలఁగు=ప్రవర్తించునట్టి, కస్తూరిమెకంబుల=కస్తూరి మృగములయొక్క, మదభరంబులఁ దొరఁగు=మదాతిరేకముచేత స్రవించునట్టి, నాభీరక్తంబులు=నాభిసంబంధమైన నెత్తురులు, ఇగిరిగనిగట్టిన=ఎండిగడ్డగట్టిన, నిగరములుగరఁచికొని = పెళ్లికలను గరఁగఁదీసికొని, పఱచి = ప్రవహించి, అవల=ఆవలను, గమ్మనఁ బరిమళించు=గమ్మనునట్లుగాఁ బరిమళించుచున్న, కట్టజవ్వాదికలయికలఁగల=కట్టజవ్వాదియొక్క మేళనమువలనఁ గలిగిన, నిగ్గులన్=నిగ్గులచేత, అగ్గలంబులై=అతిశయించినవై, కదలి=అక్కడనుండిసాగి, కర్పూరకదళికల=కర్పూరపుఁటులయొక్క, పుప్పొడితిప్పల=పుప్పొడితిన్నెలయొక్క, అనఁగాఁ గర్పూరపురాసులయొక్క, ఒప్పును=ఒప్పిదమును, అప్పళించి=అలమికొని, గ్రక్కునఁ జిక్కనైన=అప్పుడేగట్టిపడిన, ఆచొక్కపుకదంబంబులుపూయు=చొక్కమైన యాయనులేపనముల నలఁదుకొన్న,అప్పుడె సమకూడిన కలపములనలందుకొనినటులఁ దెలుపుట సుగంధాతిశయము సూచించుట. విద్యాధరీకదంబంబుల=విద్యాధరస్త్రీసమూహములయొక్క, ఆటపాటలకు మెచ్చి=నృత్తగీతములకు మెచ్చుకొన్నవారై, విద్యాధరశబ్దము సాభిప్రాయము. వారు విద్యాధరస్త్రీలు గావుననే నృత్తగీతముల ప్రశస్తి వెల్లడియగునటులఁ బ్రాగల్భ్యము చూపఁగల్గిరి. అచ్చటన్=ఆస్థలమందు, వనదేవతలెత్తు=వనదేవతలుపట్టిన, ఆరతిపళ్లెరంబులకరణిన్=నివాళిపళ్లెరములోయన్నట్టుగా, తనరు=ఒప్పుచున్న, తరణికాంతపట్టికలును=సూర్యకాంతమణులయొక్క పట్రనిపలకలును,

తరణికాంతమణిపట్టికలవలనఁ బుట్టు=సూర్యకాంతమణిపట్టికలవలనఁ బుట్టిన, దట్టంపుసెకలపైన్=దట్టమైనకాఁకలమీఁద, సెట్టుకొను=వ్యాపించిన, అనతిచిరప్రసూత=అతిచిరప్రసూతలుగాని అనఁగా నూతనముగా నీనిన, చమరీ=చమరీమృగములయొక్క, స్తన్యంబులు=చనుపాలు, అనఁగా స్తనములకు మిక్కుటమయి తమకుఁ దామ స్రవించుచున్న చనుపాలనుట, పొంగినఁగనుంగొని=పొంగఁగాఁ జూచి, చెంగటి=అక్కడికిసమీపమందున్న, మునిజనతపోవనసవనభవనంబుల=మునిజనులయొక్క తపోవనములయందుండెడు యజ్ఞశాలలయందలి, ప్రవర్గ్యారంభంబులని=యజ్ఞమందు పాలతోఁ జేయఁబడెడు ప్రవర్గ్యహోమములయొక్క ప్రారంభములనుకొని, విందులకున్=హవిర్భాగములకు, ముందుముందుగా క్రందుకొనివచ్చు=ఒకరికంటె నొకరు ముందుగా సందడిపడివచ్చునట్టి, బృందారక సందోహంబులును=దేవతాసమూహములును, సూర్యకాంతశిలలు సూర్యరశ్మిసోఁకినంతనఁ దాకరానంత వేఁడి వహించును. కావున నటఁబడి సవరపుమృగములపాలు పొంగఁగలిగినవి. సూర్యకాంతములపై జలముపడిన మ్రోఁతకలిగి పొంగు ననుటకు-

నళినీబాంధవభానుతప్తరవికాంతస్యందినీహారకం
దళచూత్కారపరంపరల్. మను. ద్వితీ. 12.

కలిగి=కలిగియుండి, నవరత=ప్రథమసురతమందలి, ఆమోద=ఆనందముతోఁగూడిన, సిద్ధమహిళా=సిద్ధాంగనల, కులంబయ్యును=సమూహముగలదైనను, అనవరతామోదసిద్ధమహిళాకులంబై అనివిరోధము. అనవరత=ఎల్లప్పుడును, ఆమోద=సౌరభముచేత, సిద్ధ=సిద్ధమైయుండెడు, మహిళా=ప్రేంకణపుతీఁగెలచేత, ని. 'శ్యామాతు మహిళాహ్వయా, లతా గోవిన్దనీగున్ద్రా' అని అమరము. ఆకులంబై=వ్యాప్తమైనదియుం నని విరోధపరిహారము. నిశాకరకాంతరాజీవరాగచ్ఛాయం బయ్యు

ననిశాకరకాంత రాజీవరాగచ్ఛాయంబై యనివిరోధము. నిశాకరకాంత=చంద్రకాంతములయొక్క, రాజీ=సమూహంబును, పరాగచ్ఛాయంబయ్యును=శ్రేష్ఠమైన వృక్షచ్ఛాయలును గలదియనియును, లేక చంద్రకాంతములును పద్మసంబంధిరక్తచ్ఛాయలును గలదనియును, అనిశ=నిరంతరమును, ఆకర=గనులయందు, కాంత=మనోహరములైన, రాజీవరాగ=పద్మరాగమణులయొక్క, ఛాయంబై=కాంతులుగలదియును అని విరోధపరిహారము. మేరు=మేరుపర్వతమువలె, భూరిప్రభా=కాంచనప్రభలచేత, భాసమానంబై=ప్రకాశమానమైనదనియు, నమేరు=సురపొన్నవృక్షములయొక్క, భూరి=అధికమైన, ప్రభా=శోభలచేత, భాసమానంబై=ప్రకాశమానమైనదనియును విరోధపరిహారము. ని. 'భూరి ప్రాజ్య సువర్ణయోః' అని విశ్వము. వెలయుచున్నయది=ప్రకాశించుచున్నది, విలోకింపుము=కటాక్షించి చూడుము.

చ. కొలఁకులపజ్జ సజ్జికపు • గొజ్జఁగిపూఁబొదరిండ్ల జోరునం
జిలుకుహిమాంబుపూరములు • శీతకరోపలపట్టికాతటం
బుల దుముకం బుటం బెగయు • భూరితుషారకణంబు లెల్లెడ
న్వలఁగొన నిన్నగంబు హిమ • వన్నగ మం దనరారు భూవరా. 12

భూవరా=వసురాజు, కొలఁకులపజ్జన్=తామరకొలఁకులయొక్క చేరువను, సజ్జికపు=మనోహరమైన, గొజ్జఁగి పూఁబొదరిండ్ల=గొజ్జంగిపూఁబొదలయందు, జోరునంజిలుకు=జోరునగురియునట్టి, హిమాంబుపూరములు=మంచునీళ్ళధారలు, శీతకరోపలపట్టికా=చంద్రకాంత శిలామయములైన పలకలయొక్క, తటంబులన్=దరులయందు, దుముకన్=వడిగాఁ బడుచుండఁగా, పుటంబెగయు=మీఁదికెగురుచున్న, భూరి=అధికమైన, తుషార=మంచుయొక్క, కణంబులు=తుంపురులు, ఎల్లెడన్వలఁగొనన్=అంతటం బరివేష్టింపఁగా, ఇన్నగంబు = ఈకోలాహలపర్వతము, హిమవన్నగమన్=హిమవత్పర్వత మనునట్టుగా, తనరారున్=ఒప్పుచుండును. అనఁగాఁ దండ్రినిఁ బోలియుండునని భావము. హిమవన్నగము=హిమవత్పర్వతము, అన్ తనరున్=అనునొప్పిదమును, ఆరును=నిండియుండునని యొక వ్యాఖ్యయందు గలదు. అన్ అనుదాని కనునటుల ననునర్థము చెప్పుటకు వలనుపడదు. అనన్ అనుదానికి హ్రస్వరూపముగ అన్ అనుట విచార్యము. అన్ దానిని తదర్థార్థకోకారముగాఁ గొనుటకంటె గ్రంథకర్త స్వతంత్రించి అనన్ అనుటకు అన్ అని యనెననుటయే సమయోచితము సరసమునైయున్నది. తనరు విశేష్యముగాఁగొని ఆరున్ క్రియగాఁగొని అన్ తదర్థార్థకక్రియగాఁగొనుట సరసముగాదు.

తా. సరస్సులనంటియున్న గొజ్జంగి పొదరిండ్లనుండి మంచునీరురాలి చంద్రకాంతశిలలపైఁ జిందులువార-ఎల్లెడల మంచువానలు గురియుచుండఁ జల్లదనమున కునికిపట్టుగానున్న యీకోలాహల పర్వతము మంచుకొండ యనఁదగియున్నది.

అలం. కావ్యలింగము.

మ. అని కేళీసచివుండు దెల్ప నిజలీ • లాహార్య మాసింహాసం
హానసుం డెక్కి తదీయనిర్ఝరసమీ • రాందోళితైలాసుగం
ధినికుంజాంతనవేందుకాంతమణివే • దిం బ్రోదిమై విశ్రమిం
చిన నందొక్కకలస్వనంబు విన వ • చ్చెన్ మాధురీధుర్యమై. 13

అని=ఇట్లని, కేళీసచివుండు దెల్పన్=క్రీడాసహాయుండైన మంత్రి విజ్ఞాపనము సేయఁగా, నిజ=స్వకీయమైన, లీలాహార్యము = క్రీడాపర్వతమును, ఆసింహసంహననుండెక్కె = సింహసంహననుఁడనఁగా శ్రేష్ఠములైన యంగములతోఁగూడినవాఁడు, అట్టివసురాజెక్కినవాఁడై, (ని. 'వరాఙ్గరూపోపేతోయ స్సింహసంహననోహిసః' అని అమరము.) తదీయ=ఆ క్రీడాపర్వతసంబంధమైన, నిర్ఝర=సెలయేటి ప్రవాహముయొక్క, సమీర=వాయువుచేత, ఆందోళిత=చలింపఁజేయఁబడుచున్న, ఏలా=ఏలకితీఁగెలచేత, సుగంధి=మంచిపరిమళముగల, నికుంజ=పొదరింటియొక్క, అంత = సమీపమందలి, (ని. 'అన్తస్తు ప్రాన్తికే నాశే స్వరూపే' అనివిశ్వము.) నవ=నూతనమయిన, ఇందుకాంతమణి=చంద్రకాంతమణికల్పితమైన, వేదిన్=అరుగుమీఁదను, ప్రోదిమైన్ = సుఖమగునట్లుగా, విశ్రమించినన్=కూర్చుండియుండఁగా, అందున్=ఆపర్వతమందు, ఒక్కకలస్వనంబు=ఒకానొకఅవ్యక్తమధురమైననాదము, మాధురీధుర్యమై=మాధుర్యాతిశయమును వహించినదై, వినవచ్చెన్=శ్రవణగోచరమాయెను. వసురాజు విశ్రమించినది చంద్రకాంతశిల. వసంతమునఁ బ్రోదిమై విశ్రమింపఁదగినది. సెలయేటిగాడ్పుచే నేలకీసుగంధమట నొలయుచున్నది. కలస్వనము మాధుర్యముగ వినవచ్చినది. ఇవి కిన్నరీవచనముల కనుకూలఫలసూచనలు.

తా. క్రీడాసచివునితోఁ గూడి వసురాజు కోలాహలపర్వతమెక్కి యొకచంద్రకాంతశిలపై విశ్రమించియుండ కలస్వనాభిరామమగు మధురగానము వినవచ్చెను.

క. వీనులవిందై యమృతపు, సోనలపొందై యమంద•సుమచలదళినీ
గానముక్రందై యాస్వన, మానందబ్రహ్మమైన • నధిపతి వల్కెన్. 14

వీనులవిందై=చెవులపండువై, అమృతపుసోనలపొందై = అమృతవర్షములతో మైత్రిగలదై, అమంద=అధికమైన, సుమ=పుష్పములయందు, చలత్=సంచరించుచుండెడు, అళినీ=ఆఁడుతుమ్మెదలయొక్క, గానము=సంగీతమువంటి, క్రందై=నాదముగలదై, ఆస్వనము=(వినఁబడిన) యామధురధ్వని, ఆనందబ్రహ్మమైనన్=ఆనందజనకమయినపరబ్రహ్మముతో సమానముకాఁగా, అధిపతివల్కెన్=వసురాజొకవాక్యము పలికెను. కలస్వనము గానము గనుక ఉద్దీపనవిభావమని తెలియవలెను. అళిగానముకంటె ఆళినిగానము మిగుల మనోహరము. సుమచరదళినీ యనుటవలనఁ బూవులపైఁ జరించుచుఁ దేనియద్రావు తుమ్మెదయని భావము. పుష్పాసవము కంఠరవమునకుఁ బ్రశస్తిగూర్చుగాన నాగాన మానందబ్రహ్మమునకుఁ జేరువలో నుండెననుట.

తా. చెవులకుఁ బండువుగ నమృతస్వరూపముగ భ్రమరీగానసమానముగానుండిన యాధ్వని యానందస్వరూపముగనుంటచే రాజు మంత్రితో నిటులనెను.

శా. నాదం బొక్కటి పిక్కటిల్లె దిశలన్ • నవ్యామృతావ్యాహతా
స్వాదం బై విన నయ్యెడిం బ్రియవయ•స్యా/వింటివే షట్పదీ
నాదంబో కలకంఠనాదమొ మరు•న్నారీమణీవల్లకీ
నాదంబో వివరింప రాదు పరమా•నందానుసంధానమై. 15

పరమానంద=ఉత్కృష్టమైన యానందమునకు, అనుసంధానమై=సంఘటనము సేయునట్టిదై, నాదంబొక్కటి=ఒకానొకధ్వని, దిశలన్=దిక్కులయందు, పిక్కటిల్లెన్=పూర్ణీభవించెను, నవ్య=

నూతనమయిన, అమృత=అమృతమువలె, అవ్యాహత=అవిచ్ఛిన్నమైనట్టుగాను, ఆస్వాదంబై=అనుభవయోగ్యమై, వినవయ్యెడిన్=వినఁబడుచున్నది, ప్రియవయస్యా=ఇష్టసఖుఁడా, వింటివే=విన్నావా, షట్పదీనాదంబో=ఆఁడుతుమ్మెదలయొక్క నాదమో, కలకంఠనాదమో=కోవెలలయొక్క కంఠనాదమో, మరున్నారీమణీ=దేవతాస్త్రీలయొక్క, వల్లకీనాదంబో=వీణానాదమో, వివరింపరాదు=ఏర్పఱుప శక్యముగాదు. వసంతసౌభాగ్యసందర్శనార్థమువచ్చిన విబుధకాంతలవీణాగానమో పంచమస్వరమునఁ బాడు పరభృతములపాటయో తుమ్మెదలరవళియో నేర్పఱుపరాకుండె ననుటచే నీమాటి నతిశయించి విలక్షణరూపముగ గానముండెనని యాశయము. దిక్కులఁ బిక్కటిల్లుటవలన షట్పదీవల్లకీకోకిలగానములలో నొకటికాదనుట. కావుననే యమృతమువలె ననుభవయోగ్యముగ నుండె ననుట.

తా. అమృతమువంటి గానము దిక్కులఁ బిక్కటిల్లినది. తేటిపాటయో వీణాధ్వనియో కోకిలకూఁతయో యేర్పఱుపరానంత మనోహరముగానున్నది. మిత్రమా! విన్నాఁడవుగదా?

శా. నానాగాయనగాయనీమణులగా◆నం బుర్వి నాలింపమో
నానాఁటన్ నగభేదిపీటఁ గల గం◆ధర్వాప్సరోగీతవి
ద్యానైపుణ్యము లెన్నియేని వినమో ◆ యం దైన నిం దైన విం
దై నాదం బొనగూర్చునే మదికి ని ◆ ట్లానందసందోహమున్. 16

ఉర్విన్=భూమియందు, నానా=వివిధములయిన, గాయనగాయనీమణుల=సంగీతముపాడెడు పురుషులలోను స్త్రీలలోను శ్రేష్ఠులైనవారియొక్క, గానంబు=సంగీతమును, ఆలింపమో=విన్నవారముగామా, నానాఁటన్=నాఁడునాఁడు, నగభేదిపీటఁగల = నగభేదియైన యింద్రునిపట్టణమందున్న, అనఁగా స్వర్గమందున్న, గంధర్వ = గంధర్వులయొక్కయు, అప్సరః=అచ్చరలయొక్కయు, గీతవిద్యా=సంగీతవిద్యయందలి, నైపుణ్యములు=నేర్పులు, ఎన్నియేనివినమో=ఎన్నియైనప్పటికిని విన్నారముగామా, అందైనన్=ఇప్పుడు చెప్పఁబడిన యాస్వర్గమందైనను, ఇందైన=ఈభూమియందైనను, విందై=హితమైనదై, నాదంబు=శబ్దము, మదికిన్=మనస్సునకు, ఇట్లు=ఈప్రకారముగా, ఆనందసందోహమున్=సంతోషపరంపరను, ఒనగూర్చునే=సంఘటించెనా, అనఁగా లేదనుట.

తా. మనము పెక్కండ్రు గాయకులయొక్కయు గాయకురాండ్రయొక్కయు గానము వినుచున్నారము. స్వర్గమునందున్న వేల్పుజవరాండ్ర గానవిద్యావిశేషములు పలుమాఱు దేవేంద్రుని కొలువుకూటములోఁ జవి చూచియున్నారము. కాని యిట్టి యానందదాయకమగు గానమును దొల్లి వినియెఱుఁగము.

చ. అన విని కేళికాసచివుఁ ◆ డాస్వన మల్లన నాలకించి యో
జనవర వల్లకీరవము◆సంగతిఁ బాడెద రెవ్వరో వినూ
తనగతి నిమ్మహాద్రిపయి ◆ దన్మృదుపంచమషడ్జశయ్య కో
య్యన నెలుఁ గిచ్చె వింటె ప్రమ◆దాకులకోకిలకేకిలోకముల్. 17

అనవిని=వసురాజట్లుపల్కఁగా విన్నవాఁడై, కేళికాసచివుఁడు = క్రీడాసహాయుఁడైన మంత్రి, ఆస్వనమల్లననాలకించి=ఆనాదము తిన్నఁగా విని, ఓజనవర=ఓరాజా, ఎవ్వరో = ఎవరో

కాని, వల్లకీరవముసంగతిక్ = వీణానాదముతోఁగూడ, పాడెదరు = గానము సేయుచున్నారు. వినూతనగతిక్ = క్రొత్తరీతిగా, ఇమ్మహాద్రిపయిక్ = ఈకోలాహలపర్వతముమీఁద, పాడెదరని వెనుక కన్వయము. తత్ = ఆగానసంబంధమైన, మృదు=మృదులమయిన, పంచమషడ్జశయ్యాకు = పంచమస్వరశయ్యాకును షడ్జస్వరశయ్యాకును, ప్రమద = సంతోషముచేతఁగాని, ప్రకృష్టమయిన మదముచేతఁగాని, ఆకుల=తొట్రుపడుచున్న, కోకిల=కోవెలలయొక్కయు; కేకి=నెమళ్ళయొక్కయు, లోకముల్ =సమూహములు, ఒయ్యనక్ =వెంబడిగానె, ఎలుఁగిచ్చెక్ = ప్రతిధ్వనినిచ్చెను, వింటె = విన్నావా. ని. 'పికః కూజతి పఞ్చమం, షడ్జం మయూరో వదతి' అని చెప్పఁబడియున్నది. గనుక పంచమశయ్యకుఁ గోవెలలును షడ్జశయ్యకు నెమళ్లును, ఎలుఁగిచ్చె నని క్రమాలంకారము.

తా. రాజిటులఁ జెప్పఁగా: గేళీసచివుడు మెల్లఁగ నాధ్వనినాలకించి యెవ్వరోవీణారవమువలెఁ గ్రొత్తపోకడలతో నీగిరిపైఁ బాడుచున్నారు. ఆగానమందలి పంచమస్వరము నాలకించి కోయిలలు షడ్జమస్వరము నాలకించి నెమిళ్ళు ప్రతిధ్వనిచేయుచున్నవి వింటివా యనెను.

క. అనవుడు శశికాంతదరీ, జనితప్రతినాద మైన ♦ సంగీతకల
స్వనము మనమున నొకానొక, యనురాగభరంబుఁ బెనుప ♦ నవనిపుఁ డనియెన్.

అనవుడు=నర్మసచివుఁ డీరీతిఁ బలుకఁగా, శశికాంత = చంద్రకాంతశిలామయమయిన, దరీ=గుహాలవల్ల, జనిత=పుట్టఁబడిన, ప్రతినాదమయిన=ప్రతిధ్వనికలిగిన, సంగీతకలస్వనము = నానసంబంధమయిన అవ్యక్తమధురధ్వని, మనమునక్ = మనస్సునందు, ఒకానొక = ఒకానొకమైన, అనురాగభరంబు=ప్రేమాతిశయమును, పెనుపక్ = వృద్ధిఁబొందింపఁగా, అవనిపుఁడనియెక్ =వసురాజొకవాక్యము పలికెను.

గీతము పంచమషడ్జశయ్యాలకు నెలవై వీణాగానమువలె నుంటయేగాదు. చంద్రకాంతశిలాతలములలోఁ బ్రతిధ్వనించినది. కావున శిలాతలముల సహజశైత్యవశమునఁ గలస్వనమై వినవచ్చినది. రసికావతంసుఁడు గాన వినికిడివలననే యనురాగభరము వహించెను.

అలం. సమాధివ్యంగ్యము.

ఉ. ఎచ్చటివారొ యీదరుల ♦ నీబలుకోనల నీనగాళిలో
నెచ్చట నున్నవారొ మది ♦ కింపులు నింపుకలస్వనంబుతో
నిచ్చటఁ బాడుచుండఁ గత ♦ మెయ్యదియో వివరించి క్రమ్మఱక్
వచ్చెదవే తదాయతన♦వాటికిఁ బోవుద మీక్షణంబునన్. 19

ఎచ్చటివారో = ఎక్కడనుండువారో, ఈ దరులక్ = ఈగుహాలయందును, ఈబలుకోనలక్ =ప్రబలమయిన యీకోనలయందును, ఈనగాళిలో=ఈవృక్షశ్రేణిలోను, ఎచ్చట నున్నవారో=ఏస్థలమందునున్నారో, మదికి = మనస్సునకు, ఇంపులనింపు=ఇష్టముల నాపాదించుచున్న, కలస్వనంబుతో=అవ్యక్తమధురమయిన నాదముతోడ, ఇచ్చటఁబాడుచుండ = ఈపర్వతమందు గానముసేయుచుండుటకు, కతమెయ్యదియో = కారణమేమో, వివరించి=విమర్శించి, క్రమ్మఱవచ్చెద= వేగ తిరుగవచ్చెదవా, తదాయతనవాటికి = ఆగృహవాటికి, ఈక్షణంబునక్ =ఇప్పుడే, పోవుదము= పోదము.

ఆ పాటపాడువారి సెలవున కీక్షణముననే పోవుదము వారెవ్వరో విమర్శించిరమ్మనుట యను రాగభరమునకు సూచన. క్రమ్మఱవచ్చెదవే యనుటలో నాకర్షణకరమగు నాపాటవినుచున నెడయుం దువేమో మనమిరువుర మేగుద మనుట.

తా. ఈగుహలయందు ఈకోనలలో ఈకొండలపై నింత మనోహరముగాఁ బాడుచున్న యా చెలువలెవరో యిటుఁ బాడుటకుఁ గారణమెద్దియో తెలిసికొనిరమ్ము. వారున్నచోటి కిపుడపోవుదము.

చ. అని యనుపన్ వినోదసఖుఁ • డచ్చటిపూఁబొదరిండ్లు చూచి కాం
చనమణికందరాసదన•సంతతు లారసి పక్వగోస్తనీ
ఘనతరకాయమానములు • గన్గొని తిన్ననికన్నెమావిగుం
పునఁ బెనగొన్నమల్లియలఁ • బూచినకోనలు గాంచి యొక్కచోన్. 20

అని=ఈలాగనిపల్కి, అనుపన్ = పంపఁగాను, వినోదసఖుఁడు = నర్మసఖుఁడు, అచ్చటి= ఆకోలాహలపర్వతమందలి, పూఁబొదరిండ్లుచూచి = లతాగృహముల వీక్షించి, కాంచన=సువర్ణ మయములైన, మణి = రత్నమయములయిన, కందరా=గుహలనెడు, సదనసంతతులు = గృహసము దాయములు, ఇచ్చట కందరా శబ్దము ఆకారాంత స్త్రీలింగము.(ని. 'దరీ తు కందరో వా స్త్రీ' అని అమరము.) ఆరసి=వెదకి, పక్వ=పండిన, గోస్తనీ = ద్రాక్షలయొక్క, (ని. 'మృద్వీకా గోస్తనీ ద్రాక్షా' అని అమరము.) ఘనతర=గొప్పలయిన, కాయమానములు=పందిళ్ళు, కన్గొని=పరీక్షించి, తిన్నని=చక్కనైన, కన్నెమావి = గున్నమామిళ్ళయొక్క, గుంపునన్ = సమూహమందు, పెనగొన్న =అల్లిన, మల్లియలు = మల్లెతీఁగెలు, పూచిన = పుష్పించియున్న, కోనలుగాంచి=వనప్రదేశములు చూచి, ఒక్కచోన్=ఒకానొకస్థలమందు, ముందరికన్వయము.

పొదరిండ్లు పూవులతో నిండియుంటయు గుహాజాతము కాంచనమణిసంవృతములై యుంట యుఁ గాయమానములు పక్వద్రాక్షాలతావృతములై యుంటయు మల్లియలు మావిగున్నలఁ బెనఁ గొనియుంటయు శైలము దర్శనీయముగ విహారయోగ్యముగ నున్నదనుటకు సూచనలు. ఆమనోగాన ము గావించువారీప్రకృతిసుందరప్రదేశమునందుండువారై యుందురని వినోదసఖుఁడు పరికింప సాగెను.

సీ. రేలెల్ల నమృతమ•రీచి నంటున నంటఁగరఁగి నిర్మలపయో•ఝరులఁ దొరఁగి
బలువిడి పెనులోయఁ•బడినక్రొన్నెలరాలచఱులలో నిరుగడఁ•దఱచు మెఱచు
పటికంపుపణకుల•పజ్జ గొజ్జఁగినీటి యేటిక్రేవలఁ జలి•యిసుకవెట్టు
నేడాకుటనఁటుల • నెలమావిగుమురుల సురపొన్నపూటాలఁ • జుట్టుకొనిన
తే. బండిగురువిందతీఁగెచ•ప్పరము లెనసి, ముడిగొనినద్రాక్షపందిళ్ళ•నడుమఁ గిన్న
రీనినాదానుకారిశా•రీశుకాది, ఘోషఘుమఘుమితం బైన•కోనఁ గనియె. 21

రేలెల్ల=రాత్రులయందంతయు, అమృతమరీచి=చంద్రునియొక్క, నంటున=సంపర్కముచేత, అంటఁగరఁగి = మొదలుముట్ట నీరుగాఁగరఁగి, నిర్మలపయోఝరుల=స్వచ్ఛమయిన జలప్రవాహ రూపముచేత, తొరఁగి=బయలువెడలి, బలువిడి=విస్తారమానట్టులుగా, పెనులోయఁబడిన=పెద్దసొరి యఁబడిన, క్రొన్నెలఱాల=చంద్రకాంతశిలలయొక్క; చఱులలోన్=చఱియలలో, ఇరుగడ=ఉభ

యపార్శ్వములయందును, తఱచు మెఱచు=అతిశయముగా ప్రకాశించుచున్న, పటికంపు=స్ఫటిక శిలలయొక్క, పణకుల=పేటులయొక్క, పజ్జన్=చేరువను, గొజ్జఁగినీటి=గొజ్జంగిపువ్వులనీరువలననైన, ఏటి=ఏటియొక్క, క్రేవలన్=పార్శ్వములయందు, చలియిసుక వెట్టు=కర్పూరమును గూడఁబెట్టుచున్న, (ని. 'ఘనసార శ్చన్ద్రసంజ్ఞ స్సితాభ్రో హిమవాలుకా' అని యున్నది గనుక చలియిసుక యనునీపదము హిమవాలుకానామార్థమని తెలియవలెను.) ఏడాకుటనఁటులను=కర్పూరపుటరఁటులను, ఎలమావిగుమురులన్=లేఁతమామిడిచెట్లగుంపులను, సురపొన్నకూటాలన్=కూటములవంటి సురపొన్నచెట్లను, చుట్టుకొనిన = అల్లుకొన్న, బండిగురువిందతీఁగెచప్పరములెనసి = బండిగురువిందతీఁగెలయొక్క చవికెలను గలసికొని, ముడిగొనిన=పెనగొన్న, ద్రాక్షపందిళ్ళ=ద్రాక్షపందిళ్ళయొక్క, నడుమన్=మధ్యభాగమందు, కిన్నరీ=తంతికట్టువాద్యభేదములలో నొకటైన కిన్నెరయొక్క, నినాద=నాదమును, అనుకారి=పోలియున్న, శారీశుకాదిఘోష=గోరవంకలు చిలుకలు మొదలయిన పక్షులయొక్క కలకలధ్వనులచేత, ఘుమఘుమతంబైన=ఘుమఘుమయనెడు శబ్దముగలదిగాఁ జేయఁబడుచున్న, కోనఁగనియెన్=ఒకకోననుఁ జూచెను. అలం. సహజోక్తి.

తా. వినోదసచివుఁడు పోయిపోయి యొకకోన గాంచెను. అది చంద్రకిరణములు సోకి చంద్రకాంతశిలలనుండి జాలువారిన జలమె చంద్రకాంతశిలారూపముగనున్న లోయతో నలరుచుండెను. దానికిరుగడ పటికపుఁబేటులుగలవు. చెంత గొజ్జఁగినీటికాలువ పాఱుచుండెను. చెంగటఁ జలియిసుముగల యేడాకులయనంటులు మావిగుమురులు సురపొన్నగున్నలు నిండియుండెను. వీనినావరించి బండిగురువిందతీఁగలు ద్రాక్షలు పందిరులవలె నుండెను. చిలుకలు గోరవంకలు నచట పాటలు పాడుచు ఘుమఘుమారావములు జనింపఁజేయుచుండెను.

లయగ్రాహి.

ఓరఁగయివ్రాలినన• మేరువులపుప్పొడుల•సారువులవెంట సహ• కారమిళ దేలా
ధారములజారుహిమ•వారికృతసారణులఁ•బైరయినచెంగలువ•యీరికలలోఁగా
శ్మీరకృతసేతువుల•దారిఁ జనుచో నచటఁ•గూరుకలహంసలగ•డై రొదలు సేయం
గీరములుసారెఁబెఱ•వారలిటుచేరి రని•చారణులఁ జీరవసు•వీరసఖుఁ డంతన్.

ఓరఁగయివ్రాలిన=ఒరగఁబడి వ్రాలిన, నమేరువుల=సురపొన్నలయొక్క, పుప్పొడుల=పుష్పపరాగములయొక్క, సారువులవెంటన్=సారువులనఁగా గురుతరవస్తువులను మీఁది కెక్కించుటకు గట్టిన సేతువులు, వానివెంబడిగానున్న, సహకార = తియ్యమామిళ్ళతోఁడ, మిళత్=కూడుకొన్న, ఏలా=ఏలకితీఁగెలయొక్క, ఆధారముల = పాదులవల్లనుండి, జాఱు=స్రవించుచున్న, హిమవారి=మంచునీరిచేత, కృత=చేయఁబడిన, సారణులన్=కాలువలవలన, (ని. 'సారణీ చాల్పసరితి' అని విశ్వము). పైరైన=పెరిగిన, చెంగలువ=మెట్టచెంగల్వలయొక్క, ఈరికలలోన్=చాల్వలలోను, కాశ్మీర=కుంకుమపువ్వుచేత, కృత=చేయఁబడిన, సేతువుల=కట్టలయొక్క, దారిన్=మార్గమునను, చనుచోన్=పోయెడుసమయమందు, అచటఁగూరు=అక్కడ నిద్రించుచున్న, కలహంసలు=ధూమ్రవర్ణముగల హంసలు, అగడై=బెదరుకొన్నవై, రొదలుసేయన్=క్రేంకారములు సేయఁగాను, కీరములు=చిలుకలు, సారె=మాటిమాటికిని, పెఱవారలు=అన్యులు, ఇటుచేరిరని=ఇక్కడికివచ్చినారని, చారణులఁ జీరన్=చారణులనువారిని బిల్వఁగా, వసువీరసఖుఁడు=శూరుఁడైన వసురాజుయొక్క స్నేహితుఁడు,

అంతక్=ఆమీఁదటను, పుప్పొడి సారువులవలె రాలుటవలన నమేరువులు పుష్పభరముచేఁ బూర్తిగ వంగియున్నవనుట. అలం. ఉదాత్తము.

తా. సురపొన్నతరువులు పుష్పభరముచే నొరగియుండఁ బుప్పొడికుప్పలు వంతెనలవలె నుండెను. దానివెంట గుజ్జుమావిడుల నల్లుకొన్న యేలకితీఁగలనుండి మంచుబిందువులురాలి జాలు బారుచుండ నిరుక్రేవలఁ జెంగలువ లచటఁ బైరగుచుండెను. కుంకుమపూవుకుప్ప లాచెంగలువతోఁటలకు గనిమలవలె నుండెను. వినోదసచివుఁ డాత్రోవను బోవుచుండ నటఁ గూర్కుపోవు కలహంసములు లేచి రొదలుచేయఁ దొడంగెను. చిలుక లారొదలవిని పరు లిటకువచ్చిరని చారణులఁ బిలుచుచుండు తఱి (ముందఱిపద్యముతో నన్వయము.)

సీ. పగడాలకొణిగలఁ•నిగనిగ ల్వజ్రంపుజగతిక్రేవల నెఱి•జాజు నింప
నీలజాలకజాల•జాలోకములఖండ కాలాగరుజధూప•కాంతిఁ బెనుప
ముత్యాలనవరంగ•ములరంగు నవరంగ వల్లీవిభూతి ముం•గిళ్ల నునుప
గారుత్మతద్వార•చారుప్రభాపూరతోరణంబులహరి•త్తులు పొసంగ
తే. భర్మపాంచాలికాపాణి•పద్మరాగ, రాజినీరాజనోపచా•రముగ పఱలఁ
దరళవైదూర్యవలభిక•ల్తెరలు నెరప, నిరుపమం బైనదివ్యమం•దిరము గనియె.

పగడాలకొణిగెలనిగనిగల్=కొణిగె లనఁగా ముంజూరులు, పగడాలజాలరుగట్టిన ముంజూర్లయొక్క నిగనిగని మెఱయునట్టికాంతిరేఖలు, జగతి యనఁగా వేదిక. 'గీ. 'జిగిలి యన నరు గనఁగను జగతి యనఁగఁ, దిన్నె యన వేదికాఖ్య లై యెన్నఁ దనరు' అని ఆంధ్రనామసంగ్రహము. వజ్రంపుజగతిక్రేవలక్=వజ్రమణికల్పితములై నయరుగులయొక్క పార్శ్వభాగములయందు (ప్రతిఫలించి), నెఱజాజునింపక్=జాజుపట్టెలనెడు భ్రాంతి నుదయింపఁజేయఁగాను, వజ్రములకాంతి జాజుపట్టెలరంగుగాఁగూడ నుండును. అటులుండుట వజ్రప్రశస్తికిఁగూడ నొకతార్కాణ. ఇందులకు దృష్టాంతము-

"సర్వద్రవ్యాభేద్యం లఘ్వంభసితరతిరశ్మిమత్ స్నిగ్ధం
తటిదనలశక్రచాపోపమంచ వజ్రం హితాయోక్తం." బృహత్సంహిత.

నీల=ఇంద్రనీలమణిమయములైన, జాలక = గవాక్షములయొక్క, జాల=సమూహమువలన, జ=పుట్టిన, ఆలోకములు=కాంతులు, అఖండ=ఎడతెగని, కాలాగరు=కృష్ణాగరువల్లను, జ=పుట్టిన ధూపకాంతిక్=అనఁగా తదాశ్రయమయినధూపమును, పెనుపక్=వృద్ధిఁబొందించఁగాను, అనఁగా కృష్ణాగరుధూపధూమమనెడు భ్రాంతి నుదయింపఁజేయఁగా ననుట. ముత్యాలనవరంగములరంగు=నవరంగములనఁగా నవరంగపుచవికెలనెడు గృహవిశేషములు, ముక్తామయములైననవరంగములయొక్క కాంతి, నవ=నూతనమైన, రంగవల్లీ=ముత్యాలముగ్గులయొక్క, విభూతిక్=సంపదను, ముంగిళ్ళక్=గృహాంగణములయందు, ఉనుపక్=ఉండునట్టుచేయఁగాను, అనఁగాముత్యాలనవరంగపుచవికెలయొక్కకాంతి ముంగిళ్లయందు వ్యాపించి ముత్యపుముగ్గులనెడు భ్రాంతి నుదయింపఁజేయఁగాననుట. గారుత్మత=మరకతరత్నమయములైన, ద్వార = వాకిళ్ళయొక్క, చారు=సుందరమయిన, ప్రభాపూర=కాంతిసమృద్ధియనెడు, తోరణంబుల=తోరణములయొక్క, హరిత్తులు=పసరుచాయలు

పొసంగన్=ఒప్పఁగాను, అనఁగా మరకతద్వారకాంతిపూరములు తోరణభ్రాంతి నుదయింపఁజేయఁగా ననుట.

భర్మ=సువర్ణవికారములయిన, పాంచాలికా = బొమ్మలయొక్క, పాణి=హస్తములయందలి, పద్మరాగ=మాణిక్యములయొక్క, రాజి=పంక్తి, నీరాజనోపచారముగవఱలన్=నీరాజనదీపపంక్తియానట్టు ప్రకాశించఁగాను, అనఁగా నీరాజనదీపభ్రాంతి నుదయింపఁజేయఁగా ననుట. తరళ=తెరలఁబాఱుచుండెడు, వైదూర్య=వైడూర్య మణిమయములయిన, వలభికల్=స్తంభములమీఁద నుండెడు శ్రేణులు, తెరలునెరపన్=తెరచీరలను గల్పింపఁగాను, అనఁగా వైడూర్య వలభికలయొక్క కాంతులు తెరలనెడు భ్రాంతి నుదయింపఁజేయఁగా ననుట.

ఆ. వె. 'పగలు గొంది గానఁబడెడఁబిడాలంబు, కన్నుఁబోలె వెల్గు గల్గి నూలు
దిరుగునట్టు మీఁదఁ దెరబారువైడూర్య, రత్నమునకు దీప్రయత్నమునకు.'

అని రత్నశాస్త్రము.

నిరుపమంబైన=ఉపమానరహితమయియున్న, దివ్యమందిరము=యోగ్యతరమయిన గృహమును, కనియెన్=చూచెను. అనఁగా నాగృహసంబంధములైన రత్నకాంతులే గృహాలంకారములై యొప్పఁగా బ్రకాశించునట్టి యొకానొకదివ్యమందిరమును జూచెననుట.

అలం. స్వభావోక్తి. ఉత్ప్రేక్ష. ఉదాత్తమును.

తా. క్రీడాసచివుఁ డాశోనలో నొకదివ్యమందిరమును గాంచెను. దానికిఁ బగడములతో మంజూరులమర్పఁబడియుండెను. అవి వజ్రవేదికలపైఁ బ్రతిబింబించిజాజుపట్టెలవలె నుండెను. నీలపు గవాక్షులకాంతులు కాలాగురుధూపములవలె నుండెను. ముత్తెములు చవికలనేలపైఁ బ్రతిబింబించి ముగ్గులవలె నుండెను. గరుడపచ్చతోరణములు పచ్చనికాంతులఁ గ్రక్కుచుండెను. బంగరుబొమ్మల కేలగల పద్మరాగమణులు హారతులుగను వైదూర్యస్తంభశ్రేణులు తెరలవలె నుండెను.

క. కనుఁగొని మణిమందిరమున, మునుకొని కలధౌతభిత్తిముకురతలబహి
ర్జనితానుబింబనమ్ములు, వనితారత్నములు మెలఁగువల నెఱిఁగింపన్. 24

కనుఁగొని=చూచినవాఁడై, మణిమందిరమునన్=రత్నమయమయిన గృహమునందు, మునుకొని=ముందుగానె, కలధౌత=సువర్ణమయమయిన, (ని. 'కలధౌతం రౌప్యహేమ్నోః' అని అమరము.) భిత్తిముకురతల=అద్దమువంటి గోడవలననుండి, బహిః=బాహ్యమునందు, జనిత=ఉదయించుచున్న, అనుబింబనమ్ములు=ప్రతిబింబములు, వనితారత్నములు=శ్రేష్ఠస్త్రీలు, (ని. 'జాతౌ జాతౌ యదుత్కృష్టం తద్రత్న మితి కథ్యతే' అని అ.) మెలఁగు=ప్రవర్తించునట్టి, వలను=జాడను, ఎఱిఁగింపన్=తెలియఁజేయుచుండఁగా, పైపద్యముతో నన్వయము. మందిరము మణిమయమయినది గనుక తదీయ మణిమయమయిన కాంచనభిత్తిని ముకురతలముగాఁ బోల్చినాఁడు. అనఁగా ఆగోడచుట్టును బంగారు కుందనంబును మధ్యప్రదేశమందు రత్నఫలకములును గలిగియున్నదని భావము.

తా. ఆమణిమందిరమునకు రజతవికారములగు నద్దమువలె మెఱుఁగులు గ్రక్కు గోడలు గలవు. అందుఁ బ్రతిబింబితములైన యాకారములు మందిరమునఁ జెలువలు గలరనుజాడఁ గ్రీడాసచివున కెఱుంగఁజేసెను.

చ. తరువులపొంతఁ బొంచి వసుధావరమిత్త్రుఁడు గాంచె నచ్చటం
దరుణిఁ దమోవినీలకచఁ దామరసోదరసోదరప్రభం
దరళవిలోచనం దతనితంబఁ దటిన్నిభగాత్త్రవల్లరిం
దరుణశశాంకఫాల నొకతన్విఁ దరంగవళిం దలోదరిన్. 25

తరువులపొంతఁబొంచి = చెట్లచాటున పొంచియుండి, వసుధావరమిత్త్రుఁడు = వసురాజుయొక్క స్నేహితుఁడు, (ని. 'అథ మిత్త్రం సఖాసుహృత్' అని మిత్త్రశబ్దము. నిత్యనపుంసకమగుటవలన మిత్త్రమని చెప్పవలసినదైనను, శ్లో. 'క్వచి దర్థవిశేషేతు క్లీబే ప్యుభయరూపతా' అనెడు అథర్వణవచనమువలన మిత్త్రుఁడని చెప్పినాఁడు.) అచ్చటన్=ఆమణిమందిరమందు, తరుణి=కొమరుప్రాయము గలిగినట్టియు, తమః=చీఁకటివలె, వినీల=మిక్కిలి నల్లనైన, కచన్=తలవెండ్రుకలు గలిగినట్టియు, తామరస=పద్మముయొక్క, ఉదర=గర్భమునకు, సోదర=సమానమైన, ప్రభన్=కాంతిగలిగినట్టియు, తరళ=చంచలములైన, విలోచనన్=నేత్త్రములు గలిగినట్టియు, తత=విశాలమైన,నితంబన్=కటిభాగము గలిగినట్టియు, తటిత్=మెఱుపుతోడ, నిభ=సమానమైన, గాత్త్రవల్లరిన్=తీఁగెవంటి దేహముగలిగినట్టియు, తరుణశశాంక=బాలచంద్రునివంటి, ఫాలన్=నొసలుగలిగినట్టియు, తరంగవళిన్=తరంగములవంటి కడుపుమడతలు గలిగినట్టియు, తల=అరచేతివంటి, ఉదరిన్=గర్భముగలిగినట్టియు, ఒకతన్విన్=ఒకానొక స్త్రీని, కాంచెన్=చూచెను.

ఈపద్యమందు రీతియనెడు గుణము గ్రహింపవలెను. ని. 'యథార్థక్రమనిర్వాహే రీతి రిత్యభిధీయతే'.అని లక్షణము. ఈపద్యమునఁ దన్వి యనుశబ్దమునకుఁ గలవిశేషణములన్నియుఁ దకారముతోఁ బ్రారంభించబడినవి గావున, నొకతన్వి యనువిశేష్యమును దకారముతో నుండవలయునని వ్యాఖ్యాత. ఒకదన్వి. యని దిద్ది ఒకదన్వి యనునది కర్మధారయసమాసము గనుకను కర్మధారయసమాసమందు గసడదవాదేశము వికల్పముగావచ్చును గనుకను తవర్గతృతీయవర్ణమే యని తెలియవలెను అని వ్రాసియున్నాఁడు. అది శబ్దశాస్త్రసాహసముదక్క నన్యముగాదని వేఱొకవ్యాఖ్యాత వ్రాసియున్నాఁడు. ఇటఁ గవ్యభిప్రాయ మిదియని ఊయిగ్రుద్ది యొకదన్వి యనుటయే గ్రంథకర్తమతమనుట యత్యూహ. తెనుఁగులమీఁది సాంస్కృతికపరుషములకు గసడదవాదేశము పూర్వకవుల కవితలోఁ దఱచుగఁ గానరాదు. కొలఁదిగనున్నను నవి ప్రకృతమునకు లక్ష్యములు కావు. భారతాదులయందలి "ఎంతగుమతులైన" "ఇట్లు దపంబుసేయు" ఎవ్వండు పఠించులో నగుచోటులగలయాదేశగసడదవలు ప్రాసస్థానములగుట రూఢములు. ఇటనో శబ్దాలంకారప్రియుఁడగు నీకవిదవర్ణమె పెట్టనెంచి ఒకదన్వియని యుండునని యూహ. ప్రథమమున పద్యము తకారముతో నారంభింపఁబడినది. మూఁడవపాదము యతిస్థలమున నితంబయనుచో తవర్ణమె యతిలోఁ జేర్పఁబడినది. మొదటిపాదమున థవర్ణము యతి. ఇఁకనాలుగవపాదమున నొకదన్వియనెనని నిశ్చయించుట కవ్యభిప్రాయమునకు భిన్నము.కాదుపో: కేవల ప్రయోగశరణ్యమగు సాంస్కృతికపరుషములపైఁగల గసడదవాదేశమును దృక్పథమునందుంచికొని యొకదన్వియని శాసింపఁబోవుట యుచితముగాదు.

తా. చెట్లచాటుననుండి రాజమిత్త్రుఁడు పొంచి చీఁకటివంటి పెన్నెరియు తమ్మిగద్దియవంటి మేనిచాయయు నిలుకడలేని చూపులు వ్రేఁగైన కటిభాగము మెఱుపువంటి మేనుదీఁగ బాలచంద్రునివంటి నుదురు తరగలవంటి వళులుగల యొకానొక సుందరిని గాంచెను.

మ. లలితామోదలతావితానవృతలీలాచంద్రశాలాతలో
జ్జ్వలనీలాతతవేదిపై మొగులుక్రేవన్ మించుక్రొమ్మించు నా
నలువై యత్తఱి నత్తలోదరియు వీణావాదనప్రౌఢిచేఁ
జెలులన్ రంజిలఁ జేయుచున్కి నృపసంసేవాపరుం డాత్మలోన్. 26

లలిత=సుందరమయిన, ఆమోద = పరిమళముగల, లతా=తీఁగెలయొక్క, వితాన = సమూహముచేత, వృత=ఆవరింపఁబడిన, లీలా=విలాసయుక్తమయిన, చంద్రశాలాతల = శిరోగృహప్రదేశమందు, (ని. 'చన్ద్రశాలా శిరోగృహం' అని అమరము,) ఉజ్జ్వల=ప్రకాశించుచున్న, నీల=ఇంద్రనీలమణిమయమయిన, ఆతత=విశాలమైన, వేదిపైన్ = అరుగుమీఁద, మొగులుక్రేవన్మించు=మేఘసమీపమం దతిశయించుచున్న, క్రొమ్మించునాన్ = క్రొత్తమెఱుపోయన్నట్టుగా, నలువై = ఒప్పిదమై, అత్తఱిన్=ఆసమయమందు, అత్తలోదరియున్=ఆస్త్రీయును, వీణావాదనప్రౌఢిచేన్=వీణ వాయించుటయందలి ప్రౌఢిమచేత, చెలులన్ = చెలికత్తియలను, రంజిలఁజేయుచున్కిన్=సంతోషింపఁ జేయుచుండుటచేత, నృపసంసేవాపరుండు = వసురాజుయొక్క భృత్యకృత్యమునం దాసక్తుఁడైన యానర్మసఖుఁడు, ఆత్మలోన్=తనలోను, ముందరిపద్యముతో నన్వయము.

ఉజ్జ్వలనీలవేదిక యనుటవలనఁ జంద్రశాలయందంతటను వేదికాకాంతు లావరింపఁబడియున్నవనియు నట సామాన్యమగు మెఱుపు ప్రకాశింపదుగాన తొలుకరిమెఱుపువలెఁ గాంతామణి యున్నదనియు భావము.

తా. తావులీలయు దీవలచేఁ బెనఁగొనియున్న చంద్రశాలయందలి నీలవేదికపైఁ దొలుకరిమెఱుపువలెనుండి వీణియ నేర్పుగా వాయించుచుఁ జెలికత్తియలఁ దనుపుచున్న కాంతామణిని రాజమిత్రుఁడుగాంచి తనలో-

సీ. తనకప్పు నెఱికొప్పునన నెపూని గౌరీసమాఖ్య మించ జనించినట్టియార్య
తనచాపలము చూపులనె చూపి సిరులెల్ల కడఁ జల్లవచ్చినకమలపాణి
తనపాండిమము నవ్వులనె యుంచి గాంధర్వ మవనికిఁ దెచ్చినహంసయాన
తనయదృశ్యత నడుమనె తాల్చి సాంగమై మొనసిన యతనుసమ్మోహవిద్య
తే. గావలయు నీవెలఁదిదీని కాంతి గుణకళాభిరూప్యంబు లెఱిఁగించియామహేశు
నా నగోద్ధారకుని నాప్రజాధినాథు, నాజగన్మోహనుని దెత్తునసుచుఁ జనియె.

తనకప్పు = తనయొక్క శరీరనైర్మల్యమును, నెఱిగొప్పుననెపూని = ఘనమైన కేశపాశమందే వహించి, గౌరీసమాఖ్యమించ = గౌరియనుపేరు మించునట్లుగా, జనించినట్టి=సంభవించిన, ఆర్య = ఆర్యాదేవి, అనఁగాఁ బార్వతియని యర్థము. (ని. 'ఆర్యా దాక్షాయణీ చైవ గిరిజా' అని అమరము.) గౌవర్ణయుక్తురాలు గనుక గౌరియనియును,ఆర్యయనఁగాఁ గులీనురా లనియును అర్థము గ్రహించవలెను. (ని. 'మహాకుల కులీ నార్య సభ్య సజ్జన సాధవః' అని అమరము.) తనచాపలము=తనయొక్క చపలభావమును, చూపులనెచూపి = వీక్షణములయందే కనుపఱచి, సిరులు=సంపదలను, ఎల్లకడన్=అంతటను, చల్లవచ్చిన = వెదచల్లెడునిమిత్తమయి వచ్చిన, కమలపాణి = లక్ష్మీదేవి యనియును, కమలములవంటి హస్తములు గలదనియును అర్థము. తనపాండిమము = తనయొక్క శరీరధావళ్యమును, నవ్వులనెయుంచి = నవ్వులయందే యుంచి, గాంధర్వము=గానమును, అవనికిఁదెచ్చిన=

భూమికిం దీసికొని వచ్చిన, హంసయాన = హంసవాహనముగల సరస్వతియనియును, హంసనడపుల వంటి నడపులు గలదనియును అర్థము. గాంధారమును బాడుట దేవతలకుమాత్రము సాధ్యముగాని మానవులకు సాధ్యముకాదు. గాంధారమును భూలోకమునఁ బ్రసరింపఁజేసినది తొలుత సరస్వతీదేవి యొకాన గాంధర్వమనుచో గాంధారమనుట యుచితమని కొందఱందురు. గాంధారము దేవైకగేయ మనుటకు-

శ్లో. షడ్జమధ్యమనామానౌ గ్రామౌ గాయంతిమానవాః
నతగాంధారనామానం సలభ్యో దేవయోనిభిః.

తనయదృశ్యతక్ = తనయొక్కకనుపడకపోవుటను, నడుమనెతాల్చి = మధ్యభాగమందేవహించి, సాంగమై మొనసిన=ఆకారసహితయై యవతరించిన, అతను సమ్మోహవిద్య=మన్మథునియొక్క సమ్మోహనవిద్య యనియును, అతను=అధికమయిన, సమ్మోహనవిద్యయని యర్థము. నడుమనె యన్నచోట, (సి. 'కేషాంచిదుదంతానాం నేతి విభక్తావునోలుక్స్యాత్' అనుసూత్రముచేత, ఉన్నకు లోపము వచ్చినది. ఎ-అనునది ఏవార్థకము.)

ఈ వెలఁది అనఁగా నీకనఁబడుచున్న చిన్నపడుచు, కావలయుక్=పైనూహింపఁబడిన ప్రకారముగానే యుండవలెను. కాఁబట్టి, దీని=ఈచిన్నదానియొక్క, కాంతి=గౌరవర్ణమును, గుణ=నిశ్చలగుణమును, కళా=సంగీతవిద్యను, ఆభిరూప్యంబులు=సౌందర్యమును, ఎఱిఁగించి=తెలియఁజెప్పి, ఇక్కడ, తనకప్పు నెఱిగొప్పననెపూని గౌరీసమాఖ్యమించ జనించినదని చెప్పుటచేత, కాంతికి సార్వకాలికత్వంబును సిరులవెదచల్లుటకు సర్వవిషయికత్వంబును గాంధర్వకళకు స్వర్గభూలోకములయందు నుభయత్ర ప్రకాశకత్వంబును సాంగమై మొనసిన దన్నందున నాభిరూప్యమునకు సద్భావమును అని తెలియవలెను. ఆమహేశుక్=ఆమహేశ్వరు ననియర్థము, ఆమహాప్రభువు ననిభావము. ఆనగోద్ధారకుని=ఆమందరధరుఁడైన నారాయణమూర్తినని యర్థము, ఆకోలాహాలపర్వతము నెత్తినవాని నని భావము. ఆప్రజాధినాథుక్ = ఆబ్రహ్మనని యర్థము, ఆజననాథునని భావము. ఆజగన్మోహనుని = జగత్తును మోహింపఁజేయు నామన్మథునని యర్థము, జగన్మోహనకారునని భావము. ఆత్తునసుచుఁ జనియెక్=తీసికొనివచ్చెదనని పోయెను.

ఆచిన్నదానిం బార్వత్యాదులఁగాఁ జెప్పినాఁడు గనుక వసురాజు నీశ్వరాదులఁగాఁ జెప్పెను. కావున నీమె కాతఁడు తగినభర్తయని భావము. క్రమాలంకారము. ఇందులో తనకప్పు నెఱికొప్పన నెపూని యన్నందునఁ గొప్పున కతినైల్యంబును, తనచాపలము చూపులనెచూపి యన్నందున వీక్షణముల కతిచాంచల్యంబును, తనపాండిమము నవ్వులనె యుంచి యన్నందున నవ్వునకు ధావళ్యంబును, తనయదృశ్యత నడుమనె తాల్చి యన్నందున మధ్యమున కతిసూక్ష్మత్వమును సిద్ధించినది గనుక ఇందువలన నత్యంతసౌందర్యద్యోతన మగుచున్నదని తెలియవలెను.

'మానవాః మౌళితోవర్ణ్యాః దేవతాశ్చరణ స్తథా' యను నాలంకారికనియమానుసారముగ గిరిక మనుజకాంత యగుటచే ముఖాదిగా నవయవవర్ణనము గావింపఁబడుచున్నది. గిరికను గౌర్యాద్యుపమానములతోఁ జెప్పుటచే రూపకాలంకారము. శబ్దశ్లేషమువలన విశేషోక్తియుఁ గావలయునను నుత్ప్రేక్షావాచకమునలన నుత్ప్రేక్షయు మహేశాదిశబ్దసాభిప్రాయవశమున సమమును బరికరాలంకారమును గ్రాహ్యములు.

తా. ఈకాంత తన నల్లదనము కొప్పున నిమిడ్చినపార్వతియో చాంచల్యము చూపుల నిమిడించిన లక్ష్మియో పాండిమము నవ్వునం దిమిడించిన సరస్వతియో అదృశ్యత నడుమునందుంచిన మోహనవిద్యయో కావలయును. ఈచెలువ కలరూపుమాటని తెలుకజేసి యిటకుఁగొనివత్తునని క్రీడాసచివుఁడటనుండి పోయెను.

చ. చని విభుఁ గాంచి పల్కె బల♦శాసనసన్నిభ నీదుపంపునం
బనివిని తీవెగుం పనక ♦ పాండురసైకతనిర్ఝరీతటం
బనక దరీపుటం బనక ♦ నన్నియు నారసి యొక్కచో వినూ
తనలవలీలతావళుల♦తావులతావల మైనతావునన్. 28

చని=పోయి, విభుఁగాంచి=వసురాజును జూచి, పల్కెన్ = పలికెను. ఏమనియనిన, బలశాసనసన్నిభ=ఇంద్రసమానుఁడవైనస్వామీ, నీదుపంపునన్ = నీయొక్క పంపకముచేత, పనివిని = పోయినవాఁడనై, తీవెగుంపనక=పొదరిండ్లే యనికాక, పాండుర = తెల్లనైన, సైకత=ఇసుకదిన్నెలుగల, నిర్ఝరీ = నదులయొక్క, తటంబనక = దరియనికాక, దరీపుటంబనక = గుహాయనికాక, అన్నియుం నారసి=సమస్తమునువెదకి, ఒక్కచోన్ = ఒకస్థలమందు, వినూతన=మిక్కిలి సుకుమారములైన, లవలీలతావళుల = ఏలకితీఁగెలగుంపులయొక్క, తావుల=పరిమళములకు, తావలమైన = స్థానమైన, తావునన్=ప్రదేశమందు, ముందరిపద్యముతో నన్వయము.

తా. పోయి రాజునుజూచి రాజా! నీయానగొని తీవలు సైకతములుగల సెలయేళ్లు గుహాలు తిరిగితిరిగి యొకానొక యేలకీలతల కునికియగు ప్రదేశమునందు-

శా. నాళీకాకరతీరసారకదళీ♦నారంగపూగావళీ
పాళీవాసిత మైనకోనఁ గని యా♦బల్కోనలో గానలో
లాళిప్రేరకరత్నకోరకమయూ♦ఖాలీసమాలీఢ మౌ
కేళీధామము గంటి భూరమణ యా♦కేళీనివాసంబునన్. 29

నాళీకాకర=పద్మాకరముయొక్క, తీర=దరియందు, సార=యోగ్యమైన, కదళీ=అరఁటులయొక్కయుం, నారంగ = నారింజచెట్లయొక్కయు, పూగ=పోకచెట్లయొక్కయుం, ఆవళీ=సమూహముయొక్క, పాళీ=చొకముచేత, వాసితమైన = పరిమళింపఁజేయఁబడుచున్న, కోనఁగని=కోనను జూచి, ఆబల్కోనలోన్=ప్రబలమైన ఆకోనలో, గానలోల=ఝుంకార రూపగానమునం దాసక్తిగలిగిన, అళి=తుమ్మెదలకు, ప్రేరక = ఉల్లాసమును గల్పించుచున్న, రత్నకోరక=మణిమయములైన మొగ్గలయొక్క, మయూఖాలీ=కిరణసముదాయముచే, సమాలీఢమౌ=వ్యాప్తమైన, కేళీధామమున్=క్రీడాగృహమును, కంటిన్ = చూచితిని, భూరమణ = వసుమహారాజా, ఆకేళీనివాసంబునన్=ఆక్రీడాగృహమునందు, ముందరిపద్యముతో నన్వయము.

నాళీకకదళీనారంగవాసిత మగుటచే నటఁ దుమ్మెదలు మెండుగాఁ గలవనుట. అవి రత్నకోరకముల పనితనము జూచి నిజమగు మొగ్గలని తేనియఁ ద్రావి పాటలుపాడుచు వచ్చుచున్నవి. దీనిచే శిల్పాతిశయము సూచితము. అలం. భ్రాంతిమంతము.

తా. సుగంధబంధురమగు నొకకోనగలదు. అట నొకక్రీడాగృహముగలదు. దానికిఁ జెక్కిన రత్నకుట్మలములను నిజముగ మొగ్గలనిభ్రమసి తుమ్మెదలు దరియుచున్నవి. రాజా! ఆక్రీడాగృహమునందు-

సీ. వలుదగుబ్బలు ప్రసేవకవృత్తి దగుగుబ్బకాయల కపరంజిచాయ లొసఁగ
లలితాంగుళీదళంబులు సమేళము లైన సారెలపై రాగసంపద లిడఁ
బాణికంకణరుతుల్ ప్రాణానుబంధంబు గల తాళగతి కనుగ్రహము లీన
నాలాపభంగి యత్యక్తసంవాదిసమస్వరంబులకు గ్రామంబు లునుపఁ
తే. బ్రచురతానామృతములమూర్ఛనలచే న,చేతనంబులు చేతనరీతిఁ దనరఁ
జేతనంబు లచేతనభాతి నొనర, వీణ వాయించు నొకయలివేణి గంటి. 30

వలుదగుబ్బలు = వట్రువగుబ్బచన్నులు, ప్రసేవకవృత్తిక్ = ప్రసేవకమనఁగా కరివెయనెడు వీణాంగము, దానివ్యాపారముచేత ననియర్థము. (ని. 'కకుభస్తు ప్రసేవకః' అని అమరము.) శ్రేష్ఠుఁడైన సేవకునియొక్క వ్యాపారముచేతనని యర్థాంతరము. తగు=అర్హమవునట్టి, గుబ్బకాయలకుక్ = వీణకు వేసిన కాయలకు, అపరంజిచాయలొసఁగక్ = అపరంజి బంగారపురంగుల నియ్యగాను, ఇది సాధారణపదము. అనఁగా వీణకాయలు కుచముల నొరయుచుండఁగా కుచములయొక్క శుద్ధసువర్ణచ్ఛాయలు ఆకాయలమీఁద ప్రసరించిన బంగారురంగు చేసినట్టులుగానున్నవని భావము.

లలిత=ఒప్పుచున్న, అంగుళీదళంబులు=చిగురుటాకులవంటివ్రేళ్ళు, సమేళములైన=మేళమనఁగా నాయారాగమునకు అనుగుణముగా స్వరస్థానములయందు మెట్లు కుదిరికపఱచుట, అట్టిమేళముతోఁ గూడికొనియున్నదని యర్థము. కూడియున్నదని యర్థాంతరము. సారెలపైక్=మెట్లమీఁదను, రాగసంపదలిడక్=అనఁగా రక్తిమయొక్క సమృద్ధులను, లేక రాగములయొక్క సంపదలను కలుగఁజేయఁగా నని యర్థము. అనఁగా నంగుళులచేత వీణమెట్లపైతీఁగెలు వాయించునప్పుడు అంగుళులు తమయొక్క సహజరక్తిమచేత మెట్ల నెఱ్ఱనౌనట్టులు చేసినవనిగాని, లేక అంగుళ్యగ్రములచేత తీఁగెలమీఁద వాయించఁగా రాగములు పుట్టుచున్నవి గనుక రాగములు గలుగునట్లుగాఁ జేసినవనిగాని భావము. అనురాగములయొక్క సంపదల నియ్యగా నని యర్థాంతరము.

పాణికంకణ=హస్తకంకణములయొక్క, రుతుల్=ధ్వనులు, ప్రాణానుబంధంబుగల తాళగతికిక్=ప్రాణము లనఁగా, శ్లో. 'కాలో మార్గః క్రియాఙ్గాని గ్రహో జాతిః కళాలయః, యతిః ప్రస్తారకశ్చైవ తాళప్రాణా దశస్మృతాః.' కాలము, మార్గము, క్రియ, అంగము, గ్రహము, జాతి, కళ, లయ, యతి, ప్రస్తారము అను నివి పదియును, తాళప్రాణములు=ఆప్రాణములయొక్క, అనుబంధంబుగల=సంబంధము గలిగిన అని యర్థము. ప్రాణమైత్రి గలిగినదని యర్థాంతరము. తాళగతికిక్ = తాళప్రచారమునకు, అనుగ్రహములీనక్=అనుగ్రహము లనఁగా, గీతము తాళము సమముగా నడుచునట్టి సమగ్రహములు, అట్టి సమగ్రహములను గలుగఁజేయఁగా నని యర్థము. శ్లో. 'గీతాతీతే త్వతీతస్స్యాత్తాళాతీతే త్వనాగతః, సమ స్సమగ్రహశ్చైవ విషమో విషమగ్రహః.' అని సంగీతశాస్త్రము. ప్రసాదముల నిచ్చుచుండఁగా నని యర్థాంతరము.

ఆలాపభంగి=రాగసంచారమార్గము, అత్యక్త=అసంత్యక్తనామకములయిన, శ్లో. 'అసంత్యక్తాస్సమాజ్ఞేయా స్సంత్యక్తా విషమస్వరాః' అని సంగీతశాస్త్రప్రామాణికవచనము. సంవాది=అనూత్యసంజ్ఞ గలిగిన, శ్లో. 'వాదీ రాజా స్వరస్తస్య సంవాదీస్యా దమాత్యవత్' అని సంగీతశాస్త్రము. సమ=సమసంజ్ఞ గల, స్వరంబులకుక్=షడ్జపంచమాదిసప్తస్వరములకని యర్థము. శ్లో. 'శ్రుత్యనన్తరభావీయ్య

స్స్వరోను రణనాత్మకః, స్వతో రఞ్జయతి శ్రోతృ చిత్తం సస్వరఉచ్యతే' అనియు, శ్లో. 'స్వయం రఞ్జయతే నాద స్సస్వరః పరికీర్తితః' అనియును, సంగీతశాస్త్రస్వరలక్షణము. అత్యక్త=పరిత్యక్తములు గాని, సంవాది=సమ్యగ్వాదముగల, సమ=వైషమ్యరహితములయిన, స్వరంబులకుఁ=కంఠనాదముగల వానికి, అనఁగా నేకరీతిగా సమభావముచేత మంచిమాటలాడెడువాని కని యర్థాంతరము. గ్రామంబులునుపఁ=గ్రామములనఁగా స్వరసమూహములు, వానినియ్యఁగా నని యర్థము. శ్లో. 'యథా కుటుంబిన స్సర్వే ప్యేకీ భూతా భవన్తి హి, తథా స్వరాణాం సన్దోహో గ్రామఇత్యభిధీయతే.' అని సంగీతశాస్త్రగ్రామలక్షణము. మొఖాసాగ్రామము లియ్యఁగా నని యర్థాంతరము.

ప్రచుర=బహుళములయిన, తానామృతములఁ=తానములనెడు అమృతములచేతను, మూర్ఛనలచే=సప్తస్వరములయొక్క ఆరోహణావరోహణములచేతను, శ్లో. 'క్రమాత్స్వరాణాం సప్తానామారోహ శ్చావరోహణమ్, మూర్ఛనే త్యుచ్యతే గ్రామ స్తా ఏతా స్సప్తసప్తచ.' అనిసంగీతశాస్త్రమూర్ఛనాలక్షణము. అచేతనంబులు=చేత రహితములైన దారుశిలాదులు, చేతనరీతిఁదనరఁ=సచేతనములైన మనుజ పశు పక్షి మృగాదులవలె నొప్పఁగాను, చేతనంబులు=నర పశు పక్షి మృగాదులు, అచేతనభాతినొనరఁ=అచేతనములయిన దారు శిలాదులవలె నొప్పఁగాను, వీణవాయించు నొకయలివేణిఁగంటిఁ=వీణవాయించునట్టి యొకస్త్రీని జూచితిని. గానమహిమచేత అచేతనములయిన ఱాళ్లు గరఁగుట మోళ్లు చిగురించుటయును, చేతనములయిన నర పశు మృగాదులు పరవశతనుబొంది నిశ్చేష్టితము లగుటయును కవిసంకేతసిద్ధమని తెలియవలెను. మూర్ఛనలవలన చేతనము లచేతనములుగ మాఱుచున్నవనియు (తాన) అమృతవశమున నచేతనములు చేతనములగుచున్నవనియుం గ్రహించునది. అలం. శ్లేషమూలకకావ్యలింగము. సమాసోక్తి.

తా. గుబ్బలమెఱుంగులు వీణకువేసిన గుబ్బకాయలపై బంగారుపూతఁబూయుచుండ, వ్రేళ్ల కాంతులు దంతపుసరికట్లపైఁ బ్రతిబింబింప, కంకణధ్వని తాళగతులతో నేకీభవింప ఆలాపము స్వరములకు స్వరసమూహములఁ బ్రసాదింప నచేతనములను జేతనములుగను జేతనముల నచేతనములుగను మార్చునటుల మనోహరముగ వీణవాయించు నొకసుందరిని గంటిని.

క. నరరాజకన్యలును గి, న్నరరాజకుమారికలు ఫణాధర విద్యా
ధర వీణాధర శోణా, ధరలును నాతరుణిఁ బోల్పఁ దగరు నరేంద్రా. 31

నరరాజకన్యలును=మానవనాథులయిన రాజులయొక్క కొమార్తెలును, కిన్నరరాజకుమారికలు=కిన్నరశ్రేష్ఠులయొక్క కుమార్తెలును, ఫణాధర=పన్నగులయొక్కయు, విద్యాధర=విద్యాధరులనెడు దేవయోనులయొక్కయును, వీణాధర=వీణాగానప్రవీణలయిన, శోణాధరలును=అరుణాధరోష్ఠము గల స్త్రీలును, ఆతరుణిఁ=ఆచిన్నదాని, పోల్పఁ=పోలికసేయుటకు, తగరు=అర్హలుగారు, నరేంద్రా=వసుమహారాజా యని సంబోధనము.

తా. రాజేంద్రా! ఆచెలువ రూపరేఖావిలాసములందుఁ గిన్నరకాంతలను జిలుపచెలువలను విద్యాధర్యరమణులను మించియున్నది.

తే. మేటిజమ్మేటియసటఁ గ్రొమ్మించుమించుఁ, బొడివిమదనప్రతాపాగ్నిఁ బుటము
తమ్మిగద్దియదాకటఁ గ్రమ్మి యట్టి, కొమ్మఁ గావింపఁబోలునే తమ్మిచూలి. [వెట్టి.

మేటి=శ్రేష్ఠమైన, జమ్మేటి=జంబూనదియొక్క, అసటన్=బురదచేత అనఁగా బంగారపు బురదచేత, క్రొమ్మించు=క్రొత్తమెఱుపుయొక్క, మించు=కాంతిని, పొదివి=పొదిగినవాఁడై, మదన ప్రతాపాగ్నిన్=మన్మథునియొక్క ప్రతాపమనెడు అగ్నియందు, పుటముపెట్టి=పుటము వేసి, తమ్మి గద్దియ=తామరపువ్వులోనుండెడు మిద్దెయనెడు, దాకటన్=దాగలిమీఁద, గ్రమ్మి=కమ్మిసాగించి, తమ్మి చూలి=పద్మసంభవుఁడైన బ్రహ్మ, అట్టి=అటువంటి, కొమ్మఁగావింపఁబోలున్=స్త్రీని నిర్మించఁబోలును, అనఁగా మొదటనే మెఱుపుతీఁగెయొక్క కాంతి యత్యంతప్రకాశమైనది. దాని బంగారుబురదలో పొదిగి పుటము వేయుటచేత నతిశయకాంతి గలుగుటయును, దాని సువర్ణచ్ఛాయగల తామరమిద్దె మీఁద కమ్మిసాగించి చేయుటచేత ఆ స్త్రీయొక్క దేహకాంతి మేలిమిబంగారు చాయకంటె నతిశయించియున్నదని తాత్పర్యము. అలం. ఉత్ప్రేక్ష.

దేవకాంతియు సౌందర్యాతిశయముగల కాంతల మేనులు లోకోత్తరవస్తుసహాయమున నిర్మితములయ్యెనని కవు లుత్ప్రేక్షించుట యాయాతావుల తఱచుగాఁ గాననగును. ఇటులె-

సీ. గీ. నేరమేటియసల్ దెచ్చి నీరజాప్త
సానబట్టిన ఱాపొడి చల్లి మెదిపి
పదను సుధనిడి జేసెనో పద్మభవుఁడు. మను.

సీ. వనితపాదములు ప్ర♦వాళంబులై మించుఁ గటియచలాభోగ♦కలనఁ బొదలు
పడఁతిగుబ్బలు మీఱు♦భద్రకుంభనిరూఢి వదన మబ్జఖ్యాతి♦ వదల కొనరుఁ
గలికిచెక్కులు చంద్ర♦ఖండంబులై పొల్చుఁ గన్నులు రాజీవ♦గణనఁ గాంచు
వెలఁది వేనలి నీల♦విషధరంబై తోఁచుఁ దనువెల్ల కాంచనం♦బనఁగ నెసఁగుఁ
తే. బగడ మిగురాకు నిలచట్టు♦పసఁటులు కరి
కుంభములు దమ్మినెలనెల♦కూనఁగపుర
మబ్జములు మీలు మొగులు కా♦లాహిపసిఁడి
సంపఁగులఁ గూర్చి నలువ ని♦ర్మింపఁబోలు. 33

వనితపాదములు=స్త్రీలయొక్క పాదములు, ప్రవాళంబులై మించున్ = పగడములవంటివియును, చిగురుటాకులవంటివియును నయి అతిశయించునని యర్థము. పగడములయందలి రక్తిమయును చిగురుటాకులయందలి మార్దవమును గలిగియున్నవని భావము. ని. 'ప్రవాళో స్త్రీకిసలయే వీణాదణ్డే చ విద్రుమే' అని మేదిని. కటి=పిఱుఁదు, అచలాభోగకలనఁబొదలున్-అచల=భూమియొక్కయు అచలపర్వతముయొక్కయు, ఆభోగ = పరిపూర్ణతయొక్క, కలనన్=సంపత్తిచేత, పొదలున్=ఒప్పునని యర్థము. భూమియొక్క విశాలత్వమును పర్వతముయొక్క యౌన్నత్యమును గలిగియున్నదని భావము. (ని. 'అచలా వసుధాయాం స్యా దచలః శైల కీలయోః' అని మేదిని.) పడఁతిగుబ్బలు=ఆచిన్నదానియొక్క గుబ్బచన్నులు, భద్రకుంభనిరూఢిన్=భద్రకుంభసువర్ణకలశములయొక్కయు భద్రగజ కుంభములయొక్కయు, నిరూఢిన్=ప్రసిద్ధిని, మీఱున్=అతిక్రమించునని యర్థము. సువర్ణకలశములయందలి కాంతియును భద్రగజకుంభములయందలి సమస్థితియును గలిగియున్నవని భావము. వదనము=ఆ స్త్రీయొక్క ముఖము, అబ్జఖ్యాతివదలకొనరున్-అబ్జ=కమలము

యొక్కయు చంద్రునియొక్కయు, ఖ్యాతిన్=ప్రసిద్ధిని, వదలక=విడువక, ఒనరున్=ఒప్పుచుండును, అని యర్థము. కమలమందలి సౌందర్య పరిమళములును చంద్రునియందలి కాంతిప్రసన్నతలును గలిగియున్నదని భావము.

కలికిచెక్కులు = ఆస్త్రీయొక్క చెక్కిళ్లు, చంద్రఖండంబులై పొల్చున్=చంద్రశకలముల వంటివియును కర్పూరశకలములవంటివియును, అయి పొల్చున్=ప్రకాశించునని యర్థము. చంద్రశకలములయందలి నిగనిగమెఱయు కాంతియును, కర్పూరశకలములయందలి పరిమళస్నిగ్ధత్వములును గలిగియున్నవని భావము. (ని. 'చన్ద్రః కర్పూర కాంపిల్ల సుధాంశు స్వర్ణ వారిషు' అని మేదిని.) కన్నులు=ఆస్త్రీయొక్క కన్నులు, రాజీవగణనఁ గాంచున్-రాజీవ=కమలములయొక్కయు, బెళుకు చేఁపలయొక్కయుఁ, గణనన్=ప్రఖ్యాతిని, కాంచున్=పొందునని యర్థము. కమలదళములయందలి విశాలత్వదైర్ఘ్యములును బెళుకుచేఁపలయందలి తళుకులును గలిగియున్నవని భావము. ని. 'రాజీవం నళినే నాతు భేదే హరిణమీనయోః' అని మేదిని. వెలఁది=ఆస్త్రీయొక్క, వేనలి=జడ,నీల=నల్లనైన, విషధరంబై తోఁచు=మేఘమువంటిదియు, కృష్ణసర్పమువంటిదియును అయి కనుపడునని యర్థము. మేఘమందలి నైల్యమును కృష్ణసర్పమందలి పొడవును ఆఁదోఁకయును గలిగియున్నదని భావము. (ని. 'విషాత్వతి విషాయాం స్త్రీ విషంతు గరళే జలే' అని నా.) తనువల్లన్=ఆస్త్రీయొక్క శరీరమంతయు, కాంచనంబనఁగ నెసఁగున్=బంగారమనునట్లుగాను, సంపఁగి యనునట్లుగాను ఒప్పునని యర్థము. బంగారమువంటి పచ్చనికాంతియును సంపఁగిపువ్వుల పరిమళమువంటి పరిమళమును గలిగియున్నదని భావము. బంగారముపేళ్ళన్నియు సంపంగికిఁ బేళ్లగును.

కాఁబట్టి, పగడ మిగురాకును = పగడమును చిగురుటాకును, ఇలచట్టు = భూమినిని పర్వతమును, పసఁటులు కరికుంభములున్=కలశములను గజకుంభములను, తమ్మినెల=పద్మమును చంద్రునిని, నెలకూనఁగపురము=బాలచంద్రునిని కర్పూరమును, అబ్జములుమీలు=కమలములను బెళుకుచేఁపలను, మొగులుకాలాహి=మేఘమును కృష్ణసర్పమును, పసిఁడిసంపంగులన్=బంగారమును సంపఁగిపువ్వులను, కూర్చి=జతచేసి, నలువ=బ్రహ్మదేవుఁడు, నిర్మింపఁబోలున్=అనఁగా పైనిఁజెప్పఁబడిన పాదాద్యవయవములను నిర్మాణముచేయఁబోలును. ఇందులో ప్రవాళాద్యుపమానపదములకును అర్థద్వయము బోధపడునట్లుగా నీగీతిలో గ్రంథకర్త తానే చెప్పినాఁడు. అలం. శ్లేషసంసృష్టోత్ప్రేక్ష.

తే. వదనవనజ హృతాంశుస • ర్వస్వుఁ డగుచుఁ
గుందునిందుని దరహాస • కందళమున
మనుపు మని పాదముల వ్రాలి • చననివిధుని
కొమ్మ లన నింతిమృదునఖాం • కురము లమరు. 34

వదన=ముఖమనెడు, వనజ=పద్మముచేత, హృత=హరింపఁబడిన, అంశు = కిరణములనెడు, సర్వస్వుఁడగుచు=యావద్ధనము గలవాఁడై, కుందు=కృశించుచున్న, ఇందునిన్=చంద్రుని, ఇక్కడ పద్మములను జయించిన చంద్రునకు పద్మముచేతనే సర్వధనాపహరణమగుట యత్యంతదుఃఖకరమని తెలియవలయును. దరహాస=చిఱునవ్వుయొక్క, కందళమునన్=అంకురముచేత, మనుపుమని=వృద్ధిఁ బొందించుమని, అనఁగా దరహాసము వెన్నెలవంటిది గనుక దీనిచేత అంశుహీనుఁడైన చంద్రునిఁ గాంతియుక్తునిఁగాఁ జేయుమనిభావము, పాదములవ్రాలి=కాళ్లమీఁదఁబడి, చనని=లేచిపోకయున్న,

విధునికొమ్మలన్=చంద్రునికి భార్యలైన నక్షత్రములో యన్నట్లుగా, ఇంతి=ఆస్త్రీయొక్క, మృదు=కోమలములైన, నఖాంకురములు=మొలకలవంటిగోళ్లు, అమరున్=ఒప్పును. అనఁగా నాస్త్రీయొక్క ముఖము చంద్రుని జయించి పద్మముతో సమానమై యున్నదనియును, చిఱునవ్వు వెన్నెలవలెనున్నదనియును పాదనఖములు నక్షత్రములవలె నున్నవనియును ఫలితార్థము. అలం. అతిశయోక్తి. ఉత్ప్రేక్ష.

కిరణవిభవము పూర్తిగఁ గోలుపోయిన చంద్రునిసగవుచేఁ బునరుజ్జీవింపఁజేయుమనక చిఱునగవుచే నుజ్జీవింపఁజేయుమనక చిఱునగవు మొలకచే నుజ్జీవింపఁజేయుమనుటచే ముఖము చంద్రుని పెక్కురెట్లు మించియున్నదనుట. దీనిచే దరహాసధావళ్యాతిశయము సూచితము.

తా. ఆచెలువమోమును బోలఁజాలక చంద్రుఁడు తనకాంతిసమృద్ధిఁగోలుపోయియుండుచుండ భర్తృపరిభవముగాంచలేక చంద్రునిభార్యలగు నక్షత్రములు చిఱునగవుమొలకచే నుజ్జీవింపఁజేసి పతిభిక్షపెట్టుమని యాకాంతపాదములపై వ్రాలి లేవనటులఁ బాదనఖములున్నవి.

ఉ. భామపదద్వయం బడుగుఁ • బాయక కొల్చుసరోజరేఖలన్
శ్రీ మెఱయన్ భరించి మధు•జృంభణచే మొనచూపుపల్లవ
స్తోమము సౌకుమార్యమును • శోభయు గైకొనఁబోలుఁ గానిచోఁ
గోమలతారుణత్వములు • గోల్పడునే యవి నాఁడునాటికిన్. 35

భామపదద్వయంబు=ఆస్త్రీయొక్క పాదయుగళము, అడుగుఁబాయకకొల్చు=ఒకఅడిగెడైన నెడఁబాయక కొలువుసేయుచున్న, సరోజరేఖలన్=కమలపంక్తులను అనియర్థము. అడుగులయందుండెడు పద్మరేఖలనని భావము. శ్రీ మెఱయన్ భరించి=సంపద ప్రకాశించునట్టుగా సహించి యని యర్థము. కాంతి ప్రకాశించునట్టుగాననిభావము. మధుజృంభణచేన్ = మద్యపాన మదాతిరేకము చేత, మొనచూపు=ప్రతిఘటించుచున్న, పల్లవస్తోమము=విటసమూహముయొక్క, సౌకుమార్యమును=సుకుమారత్వమును, శోభయున్=తేజస్సును, కైకొనఁబోలున్=హరించఁబోలును అనియర్థము. మధుజృంభణచేన్=మధుమాసవిజృంభణముచేత, మొనచూపు=పొడచూపుచున్న, పల్లవస్తోమము=చిగురుజొంపముయొక్క, సౌకుమార్యమును=మృదుత్వమును, శోభయున్=అరుణకాంతిని, కైకొనఁబోలు ననిభావము. కానిచోన్ = అలాగున హరించకపోయినట్లాయెనేని, అవి=ఆపల్లవములు, నాఁడునాటికిన్=నానాటికి, కోమలతా=మార్దవమును, అరుణత్వములు = రక్తిమను, కోల్పడునే=పోఁగొట్టుకొనునా యని యర్థము. చిగురుటాకులు నానాఁటికి ముదిరి కఱకుపాఱి పచ్చఁబడుచున్నవని భావము. అనఁగా ఆస్త్రీయొక్కపాదయుగళము తన్ననుసరించిన పదపంక్తులను ఆదరముచేత నంగీకరించి ప్రతిఘటించిన పల్లవస్తోమముయొక్క గర్వపరిహారము చేసెనని యాశయము. ఎఱ్ఱదామరలనుబోలి చిగురుటాకులను తిరస్కరించి అత్యంతకోమలత్వారుణత్వములచేత నొప్పుచున్నదని ఫలితార్థము. భాగ్యముగల స్త్రీలయడుగులందుఁ బద్మరేఖలుండును. ఇందులకు దృష్టాంతము—

శ్లో. చక్ర స్వస్తిక శంఖాబ్జ ధ్వజ మీనాతపత్రవత్
యస్యాః పాదతలే రేఖా సా భవేత్ క్షితిపాంగనా. (సాముద్రికశాస్త్రము)

అలం. శ్లేషమూలక హేతూత్ప్రేక్ష. సమాసోక్తి.

తా. ఆచెలువపాదములు పద్మరేఖలతోఁ దనరారి చివురుటాకులవంటి మెత్తఁదనము గలిగి కోమలతారుణత్వములతో మనోహరముగా నున్నవి.

తే. కలమగర్భహిరణ్యకాహళులు దొరయ
నీఁతలును మ్రోఁతలును జూపి యెలమి మకర
లీల లోఁగొని దోనల శరాళి ముంచి
యబలమృదుజంఘికాప్రకాశౌఘ మడరు. 36

అబల=ఆస్త్రీయొక్క, మృదుజంఘికా ప్రకాశౌఘము = ఓఘమనఁగా బృందంబును జలప్రవాహంబును, (ని. 'ఓఘో వేగే జలస్యచ, బృన్దే పరంపరాయాం చ' అనిమేదిని.) మృదు=కోమలమైన, జంఘికా=పిక్కలయొక్క, ప్రకాశౌఘము = ప్రకాశబృందమనెడు జలప్రవాహము, కలమగర్భహిరణ్య కాహళులు దొరయన్=కలమగర్భము లనఁగా వరిపొట్టలును హిరణ్యకాహళులనఁగా బంగారుబూరలును, అనఁగా తుతారాలును, దొరయన్ = సామ్యమునకు తారసించిరాఁగా, ఈఁతలును మ్రోఁతలును జూపి=ఈనుటలును మ్రోయుటలును గనుపఱచి, అనఁగా నీయవగుణములచేత సామ్యయోగ్యములు గాకపోవుటను దెలియఁజేసియని జంఘాపరమైన యర్థము. ఈఁదులాటలును ధ్వనిచేయుటలును గనుపఱచినదని ప్రవాహపరమయిన యర్థము. ఎలమిన్=వేడుకచేత, లీలయనఁగా విలాసంబును క్రియయును, మకరలీలన్=మకరాకృతియొక్క విలాసమును, లోఁగొని = అపహరించి యని జంఘాపరమయిన యర్థము. మకరములయొక్క చేష్టను లోఁగాఁ జేర్చుకొన్నదని ప్రవాహపరమైన యర్థము. (ని. 'లీలా విలాస క్రియయోః' అని అమరము.) దోనలనఁగా అంపపొదులును బండలమీఁది జలాశయములును, శరమనఁగా బాణంబును ఉదకంబును, దోనలన్=అంపపొదులను, శరాళిముంచి = బాణపరంపరలచేత ముంచి యని జంఘాపరమయిన యర్థము. అంపపొదులయందు బాణములు నిండియుండుట ప్రకటమేకదా. ఱాతిదోనెలను జలసమూహములచేత నిండించినదని ప్రవాహపరమయిన యర్థము. అడరున్ = ప్రకాశించును. అనఁగా ఆస్త్రీయొక్క జంఘలు వరిపొట్టలను బంగారు కాహళములను మకరాకృతులను అంపపొదులను తిరస్కరించిన చక్కఁదనముచేత నొప్పుచుండు నని భావము.

వరిపొట్టలు బంగారుసన్నాయిలు పిక్కలఁ బోలనెంచెనుగాన కలమగర్భముల కీఁతలుగలవు. ఇవి కాంతివిజృంభణమునకు వ్యతిరేకములు. కాహళులమ్రోఁత స్వోత్కర్షాసూచకముగావున నదియు దోషము. మకరలీల, దోనలు మున్నె లోఁగొనఁబడిన, శరాళి మునిఁగి, యంతరించినవికాననే జంఘాప్రకాశము అభివృద్ధినొందుట తటస్థించెను. కలమగర్భములు కాహళులు జంఘలసొంపును బోలనెంచి దొరయుటచేఁ దదాకారచిహ్నములుగ నున్నవనియు మకరలీల దోనలు తమంతఁ బరాభవింపఁబడుటచే జంఘాసౌష్ఠవమున కవి యంతగా సామ్యములుగావని భావము.

అలం. శ్లిష్టరూపకము.

తా. ఆయింతిపిక్కలు వరిపొట్టలను, బంగారు సన్నాయిలను అమ్ములపొదులను మకరవైఖరులను మించి మనోహరముగఁ బ్రకాశవంతముగా నున్నవి.

మ. సతియూరుద్యుతిఁ జెందఁ బూని నిజదుశ్చర్మాపనోదక్రియా
రతిఁ బాథోలవపూరితోద్ధరము లై రంభేభహస్తంబు లు

న్నతతిన్ వీడె మరుద్విభూతిఁ గదళీ • త్వగ్దోష మాచంచలో
ద్ధతశుండాతతిఁ బాయ దయ్యె నదె వో • తద్వైరమూలం బిలన్. 37

సతి=ఆ స్త్రీయొక్క, ఊరు=తొడలయొక్క, ద్యుతిన్=శోభను, చెందఁబూని=పొందవలెనని యత్నముచేసి, నిజ=తనయొక్క, దుశ్చర్మ=దుష్టమైన చర్మముయొక్క, అనఁగా నిక్కడ అరఁటియందుండు చొదుమును గజతుండమందు కర్కశత్వంబును తెల్లపొడలును అని తెలియవలెను. అపనోదక్రియా=పోఁగొట్టుకొనెడు కార్యమందలి, రతిన్=ఆసక్తిచేత, అనఁగా తమయందు నీదోషము లుండుటచేత ఊరుసామ్యము సిద్ధించదుగనుక ముందుగా నీదోషములు పోఁగొట్టుకొనవలెనన్నయాసక్తిచేత ననిభావము. పాథః=ఉదకముయొక్క, లవ=లేశమాత్రముచేత, పూరిత=నిండింపఁబడిన, ఉదరములై=కడుపులు గలిగినవై, అనఁగా లోకమం దెవరైనను దోషనివృత్తికొఱకు మితాహారులై తపస్సు చేయవలసినది గనుక నివియు జలకణమాత్రప్రాశనముచేత నుదరపోషణము చేయుచున్నవై యనుట. అరఁటియందును గజతుండమందును నీరునిండియున్నదనిభావము. రంభా=అరఁటిచెట్లును,ఇభహస్తంబులు=గజతుండములును, ఉన్నతతిన్ = దీక్షచేసియుండఁగా, మరుద్విభూతిన్= దేవతాసంపత్తిచేత ననియర్థము. వాయుసంపత్తిచేత ననిభావము. (ని. 'మరుతౌ పవనామరౌ' అని అమరము.) కదళిన్=అరఁటియందు, త్వగ్దోషము=అనఁగా దుశ్చర్మదోషము, వీడెన్=వదలిపోయెనని యర్థము. గాలిగొట్టి పైచొదుము వీడిపోయెనని భావము. ఆచంచల=మొదటినుండి చాంచల్యగుణముగలిగిన, ఉద్ధత = ఎగురుపాటుగలిగిన, శుండాతతిన్ = గజతుండసమూహమందు, పాయదయ్యెన్=ఆదుశ్చర్మదోషము వదలిపోదాయె ననియర్థము. ఏనుఁగులయొక్క తుండములయందు చపలగుణంబును, పైకియెత్తఁబడుచుండుటయును గలిగియుండుట ప్రకటమేకదా. ఇలన్ = భూమియందు, తద్వైరమూలంబు=ఆయరఁటిచెట్లకును గజతుండములకు నుండెడు విరోధమునకు హేతువు. అదెవో=అదేసుమా. అనఁగా కదళీ గజహస్తములుగూడ తపస్సుచేసినందులకు అరఁటులయందలిత్వగ్దోషము నివారణమై తమయందలి త్వగ్దోషము నివారణము కాకపోయెనుగనుక ఆయీర్ష్యచేత గజతుండములు అరంట్లను పెల్లగించివేయుచున్నవని యాశయము. ఏనుఁగులు అరఁటిచెట్లను బెల్లగించి తినుట ప్రకటమేగదా. అనఁగా నాస్త్రీయొక్క తొడలు అరఁటిబోదెలవలె నునుపుగలిగి గజతుండమువలె ఆఁదోఁకగలిగి యున్నవని ఫలితార్థము.

మరుద్విభూతి యన దేవతానుగ్రహముగావున దైవశక్తియే విజయకారణమైనది. తపశ్చర్యకై జలపానము రంభాస్తంభము కరికరము గావించినను మరుద్విభూతి కరికరమునకుఁ ద్వగ్దోషము వారింప లేదయ్యెను. అదియు దైవదుర్నివారముగ నుండెననుట. చంచలము,ఉద్ధతి యీరెండు తపశ్చర్యకు వ్యతిరేకము గావున నీదుర్గుణము మానసంతవఱకుఁ గరికరము త్వగ్దోషము తొలఁగించుకొనఁజాలదు. చంచలతకుఁ దార్కాణము తపోనిశ్చలతలేమి, ఉద్ధతికిఁ దార్కాణ మాత్మలోపము గమనింపక కదళితోఁ బోరాడుట.

అలం. హేతూత్ప్రేక్ష. కావ్యలింగము. అతిశయోక్తి.

తా. ఆయమయూరువులు పైనితొడుపులాడిన యరఁటిబోదెలవలెనున్నవి. ఏనుఁగుతుండములనుగూడఁ గొంతవఱకుఁ బోలియున్నవిగాని వానియందుఁ జంచలత యుద్ధతి యుంటచే సరిపడ

నున్నవి. అరఁటియూరువులఁబోలెను నేను బోలనైతినను మచ్చరముతో నేనుఁగులు కదళీకాండములను ద్వేషించుచున్నవి.

చ. అతివనితంబబింబ మఖి•లావనిభాగము నేలి దీవు లం
చితరుచి నాక్రమించి యరి•జృంభణవారణధుర్యమై సువృ
త్తతఁ బరిపూర్ణరాజరమఁ • దాల్చి కదా గజమస్తకోపరి
స్థిత మయి కాంచెఁ గాంచిగుణ•దీపితకాంచనపట్టబంధమున్. 38

అతివ=ఆస్త్రీయొక్క, నితంబబింబము = కటిమండలము, అఖిలావనిభాగము నేలి=సమస్తభూవిస్తారమును లోఁబఱచుకొని యనియును సర్వభూభాగమును పాలించియనియును అర్థము. దీవులు=ద్వీపములను, అంచితరుచిన్ = రుచియనఁగా సౌందర్యమును స్పృహయును, ఒప్పుచున్న సౌందర్యముచేతను, ఆక్రమించి = తిరస్కరించి యనియును, సప్తద్వీపములను ఒప్పుచున్న స్పృహచేత నాక్రమించియనియును అర్థము. అరియనఁగా రథచక్రంబును శత్రుఁడును, అరి = రథచక్రముయొక్క, జృంభణ=గర్వసమృద్ధియొక్క, వారణ=పోఁగొట్టుటయందు, ధుర్యమై=సమర్థమైనదై యనియును, అరి=శత్రువులయొక్క, గర్వహరణమందు సమర్థమైనదనియును అర్థము. సువృత్తతన్=యోగ్యమైన వర్తులత్వముచేత, పరిపూర్ణరాజరమన్=సంపూర్ణచంద్రమండలసంపదను, తాల్చికదా=వహించియేకదా యనియును, సువృత్తతన్=సత్ప్రవర్తనముచేత, పరిపూర్ణరాజరమన్=సంపూర్ణరాజలక్ష్మిని, తాల్చికదా=వహించియేకదా యనియును అర్థము. గజమస్తకోపరిస్థితమై = గజకుంభముల నధఃకరించినదై యనియును గజస్కంధముపై నెక్కినదై యనియును అర్థము. కాంచిగుణ=బంగారు మొలనూలనెడు, దీపిత=ప్రకాశించుచున్న, కాంచన=సువర్ణమయమైన, పట్ట = రాజ్యాభిషేక సమయమందు నొసటఁ గట్టఁబడెడు పట్టికయొక్క, బంధమున్ = కట్టుటను, కాంచెన్=పొందినదాయెను. అనఁగా నాస్త్రీయొక్క కటిప్రదేశము భూవిస్తారమునకంటె విశాలమైనదనియు, ద్వీపములకంటె నత్యున్నతమైనదనియు, రథచక్రముకంటె చక్కనైనదనియు, సంపూర్ణచంద్రమండలమునకంటె వర్తులమైనదనియు, గజకుంభములకంటె సమస్థితి గలిగినదనియు, ఉపరిభాగమందు బంగారు మొలనూలుగలిగి యొప్పుచున్నదనియు భావము.

బింబమనుటవలన నితంబము చక్రాకారముగ నున్నదనియు అఖిలావనిభాగము లేలెననుటవలన విశాలముగనున్నదనియు రథచక్రాకారముగ నుంటవలననే రాజరమ నొందెననియు పట్టపుటేనుంగు నెక్కి కాంచనపట్టబంధము నలంకరించుకొనఁగలిగె ననుటవలనఁ గరికుంభసమాకారముగఁ గాంచీసమలంకృతముగా నుండెననిభావము.

అలంకారము సమాసోక్తిరూపకము.

తా. ఆచెలువనితంబమండలము విశాలమై చక్రాకారముగలదై కరికుంభములవలె సమతగలిగి కాంచీసమలంకృతమై దర్శనీయముగ నున్నది.

చ. కలికిముఖేందుకాంతికర•కాంతపయోజలదాంతవేళ వ
ర్తులకుచగండశైలములుఁ • దోఁప వళిత్రయశోషరేఖ లిం
పలరఁగ మధ్యక్షీమ బయ • లై కటిసైకత మొప్ప బాల్యమ
న్బలునది యింకుచో మెఱసె • నాభిగభీరజలాశయం బనన్, 39

కలికి=ఆస్త్రీయొక్క, ముఖేందు = మొగమనెడు చంద్రునకు, కాంతికర=లావణ్యమనెడు ప్రకాశమును జేయునట్టి, కాంత = మనోహరమైన, వయః = యౌవనమనెడు, జలదాంతవేళన్ = శరదాగమసమయమందు, సర్తుల=వట్రువలైన, కుచ=స్తనములనెడు, గండశైలములు = పెద్దఱాతిగుండ్లు, తోపన్ = కానవచ్చునట్లుగాను, వళిత్రయ = మూఁడైన కడుపుమీఁది ముడుతలనెడు, శోషరేఖలు=నీళ్ళు ఎండిపోవుటవలన నేరుపడునట్టి యిసుకరేఖలు, ఇంపలరఁగన్=చక్కనై కనుపించునట్లుగాను, మధ్యసీమ బయలై = నడుము మతిసూక్ష్మమై యని స్త్రీపరమైన యర్థము. మధ్యప్రదేశము ప్రవాహరహితమైయని నదీపరమైన యర్థము. కటి=పిఱుఁదనెడు, సైకతము=ఇసుకదిన్నె, ఒప్పన్ = ఒప్పునట్టుగాను, బాల్యమను = బాల్యప్రాయ మనెడు, బలునది = గొప్పయేఱు, ఇంకుచోన్=ఎండిపోవుచుండఁగా, నాభి=పొక్కిలి, గభీర=లోఁతైన, జలాశయంబనన్=మడుగోయన్నట్లుగా, మెఱసెన్=ప్రకాశించెను. అనఁగా ఆవనితయొక్క బాల్యప్రాయము గడిచిపోయి యౌవనప్రాయమురాఁగానె ముఖకాంతి యతిశయించెననియుఁ కుచము లున్నతములై కనుపించెననియును, వళు లేర్పడియె ననియు, నడుము మిక్కిలి సన్నగించె ననియును, పిఱుఁదు గొప్పదాయె ననియును, నాభి లోఁతుగా నుండె ననియును దాత్పర్యము. ఇట్లు చెప్పుటచేత ఆస్త్రీ యౌవనవంతురాలని సూచన చేయఁబడుచున్నది. ఈపద్యములో ప్రకృతాప్రకృతములైన యౌవనశరదాగమములయందు వస్తుప్రకాశనము యథాక్రమముచేతఁ జెప్పినాఁడు.

వయోజలదాంతవేళ యనుటవలన జవ్వనము శరత్కాలమువలె దర్శనీయముగ హృదయానందకరముగ నుండెననుట. వయస్సు నెమ్మొగమునకుఁ గాంతిగలిగించును. కాననే ముఖేందుకాంతికరమని చెప్పఁబడెను. శరత్కాలమున నదులింకినటుల వయోవశమున బాల్యచిహ్నము లంతరించి పొలంతిపొలుపము మనోజ్ఞముగనుండి గుబ్బలప్రేగు, త్రివళులు, మధ్యకార్శ్యము కటిపటుత్వము పొక్కిలిపొలుపు కనవచ్చెను.

అలం. రూపకానుప్రాణితోత్ప్రేక్ష.

తా. బాల్యమనునది యింక జవ్వనమను శరదృతు వాచెలువ నావరించెను. కాననే ముఖచంద్రుఁడు ప్రకాశవంతముగను, కుచగండశైలములు పటువుగను, మధ్యసీమ బయలుగను, కటి సైకతమువలెను, నాభి జలాశయమువలెను నుండెను.

చ. అలికులవేణియారు నవ•యౌవన మన్ వలరాచతోఁటలోఁ
బొలుచునితంబవేదికడఁ • బొక్కిలిడిగ్గియచెంత నీలసం
కలితనవాంబుయంత్ర మగుఁ • గాని యెడన్ రసగుంభనంబు సం
ధిలఁ బుటముబ్బునే నడుమ • నిల్చి ఘనస్తనసూనగుచ్ఛముల్. 40

అలికులవేణి = తుమ్మెదగుంపువంటి జడగల యాస్త్రీయొక్క, ఆరు=నూఁగారు, నవయౌవనమన్=నూతనతారుణ్య మనెడు, వలరాచతోఁటలోన్ = మన్మథోద్యానమందు, పొలుచు=ప్రకాశించునట్టి, నితంబవేదికడన్ = పిఱుఁదనెడు అరుగుదగ్గఱను, పొక్కిలి డిగ్గియచెంతన్=నాభియనెడు బొడ్డనబావి సమీపమం దుండునట్టి, నీలసంకలిత=ఇంద్రనీలములతోడఁ గూడుకొనిన, నవ=నూతనమైన, అంబుయంత్ర మగున్=నీళ్ళపాఱెడు దోనెపెట్టె అవును. డిగ్గియ అనెడు పదము దీర్ఘి

కాశబ్దమునకు తద్భవము. కానియెడల్ = అదిగాకపోయినపక్షమందు, రస = శృంగారరసమనెడు జలధారయొక్క, గుంభనంబు = కూర్పు, సంధిలన్ = ఘటనపడుచుండఁగా, ఘన స్తన సూనగుచ్ఛముల్ =గొప్పలైనకుచములనెడు పువ్వుగుత్తులు, నడుమనిల్చి = మధ్యభాగమందు నిలువఁబడి, పుటముబ్బునే=పైకినుబుకునా, అనఁగా, ఉబకకయేపోవుననుట.

ఆస్త్రీయొక్క యౌవనము మన్మథోద్యానమువలె సర్వజనమనోరంజకమయి యున్నదనియు, పిఱుఁదు అరుగువలె నున్నదనియు, నాభి బొడ్డనబావివలె నున్నదనియు, నూఁగారు నీలమణులు చెక్కిన జలయంత్రమువలె నున్నదనియు, కుచములు పువ్వుగుత్తులవలె నున్నవనియు భావము.

అలం. రూపకము.

స్తనములు ఘనగుచ్ఛములుగాఁ జెప్పఁబడుటవలన ఉబ్బునిబ్బరము సూచితము. యౌవనము మన్మథోద్యాన మనుటవలన నుపభోగార్హ్యముగ నుండెననియు, నితంబవేది యనుటవలన విరివియు నున్నతిగొని యుండెననియుఁ బొడ్డిడిగ్గి యనుటవలనలోఁతుగనుండెననియు నూఁగారు నీలములుదాపిన జలయంత్ర మనుటవలన నలుపుచేఁ బొలుపారియున్నదనియుఁ దెలియును. మన్మథునియుద్యానమునఁ గల ప్రసూనగుచ్ఛములు రసగుంభనముగ నుండెననుట నెలఁతచనుంగవ శృంగారభావముల నభివృద్ధిఁ జేయుచు ద్రష్టవ్యములుగ నుండెననుట. మన్మథునకుఁ బొలఁతులచనుంగవలే రసోదయస్థానములు కావుననే యట రసగుంభనోదయము చెప్పఁబడినది. ఇటులే భర్తృహరి-

శ్లో. కామినీకాయ కాంతారే కుచ పర్వతదుర్గమే
మాసంచరమనః పాంథ తత్రాస్తే స్మరతస్కరః.

మ. ఘననాభీగుహ చెంత నారుపొగ లేఁ•గౌ నాని తా నాయనం
గుని మెప్పించి తదాత్మతం బొరయఁ గ•న్గోఁ జాల కుజ్జృంభిత
స్తనయుగ్మం బతనుత్వ మొందె నధరో•ష్ఠం బిక్షుధర్మస్థితిం
దనరెం గన్నులు శంబరాహితగతిం• దాల్చెం బయోజాస్యకున్. 41

పయోజాస్యకున్=పద్మమువంటి ముఖముగల యాస్త్రీకి విచారింపఁగా, ఘన=శ్రేష్ఠమైన, నాభీ=పొక్కిలియనెడు, గుహా=బిలముయొక్క, చెంతన్=సమీపమందు, లేఁగౌను = సూక్ష్మమైన నడుము, ఆరుపొగ=నూఁగారనెడు ధూమమును, ఆని=పానముచేసి, అనఁగా ఉగ్రతపస్సుచేసి, తాను =ఆనడుము, ఆయనంగుని మెప్పించి=శరీరవిహీనుఁడైన యామన్మథుని సంతోషింపఁజేసి, తదాత్మతం బొరయన్=అనఁగా తాదాత్మ్యమును బొందఁగా, అనఁగా మన్మథసాయుజ్యమును బొందఁగానని యర్థము. అదృశ్యత్వమును బొందఁగాననిభావము. కన్గోఁజాలక=ఈమేలుచూచి సహింపలేక, ఉజ్జృంభిత=విఱ్ఱవీగుచున్న, స్తనయుగ్మంబు=కుచద్వయము, అతనుత్వ మొందెన్=అతనుఁడనఁగా మన్మథుఁడు, మన్మథసాయుజ్యమును బొందెనని యర్థము. ఆధిక్యమును పొందెనని భావము. అధరోష్ఠంబు=మోవి, ఇక్షుధర్మస్థితిందనరెన్=ధర్మమనఁగా విల్లును గుణంబును, చెఱకుతుంటే విల్లుగాఁగల మన్మథుని సాయుజ్యమును బొందెనని యర్థము. ఇక్షువుయొక్కధర్మము మాధుర్యము గనుక మాధుర్యస్థితిచేత నొప్పెననిభావము. కన్నులు=నేత్రములు, శంబరాహితగతిందాల్చెన్=శంబరుఁడనఁగా శంబరాసురుఁడు, శంబరమనఁగా లేడియును, శంబరాసురున కహితుఁడైన మన్మథునియొక్క సాయుజ్యమును బొందె

నని యర్థము. లేడికన్నులను దిరస్కరించినవిధము వహించెనని భావము. (ని. 'శంబరం సలిలే పుంసీ మృగ దైత్య విశేషయోః' అని విశ్వము.) అనఁగా ఆస్త్రీయొక్క నాభి గుహవలె నున్నదనియు, నడుము కానరాకయున్నదనియు, నూఁగారు నల్లఁగా ధూమరేఖవలె నున్నదనియు, స్తనయుగళము గొప్పదై యున్నదనియు, పెదవి మధురమై యున్నదనియు, కన్నులు లేడికన్నులఁ దిరస్కరించుచున్న వనియు భావము.

కొనుననుచో కోయను నాదేశము పూర్వకవుల పద్యములందుఁ జూపట్టుచున్నది. తపశ్చర్య గావించువారు ధూమపానము గావించుచుంటయు సుప్రసిద్ధము. ఇందులకుఁ బ్రయోగము.

శ్లో. అథ ధూమాభితామ్రాక్షం వృక్షశాఖావలంబినం
దదర్శకశ్చి దైక్ష్వాక స్తపస్య స్త మధోముఖం
పృష్టనామాన్వయో రాజ్ఞా స కిలాచష్ట ధూమపః
ఆత్మానంశంబుకంనామ శూద్రం సుర పదార్థినం

(రఘువంశము. దశమస్సర్గము.)

అలం. ఉత్ప్రేక్ష. శ్లేషానుప్రాణితపర్యాయోక్తి. సమాసోక్తి.

తా. ఆచెలువ లేగొను నారుపొగనాని యనంగుని మెప్పించి యనంగత్వము (శూన్యభావము) నొందఁజూచి యోర్వలేక చనులుగూడ నటులె యతనుత్వమును (మన్మథరూపమును పటుత్వమును) నొందెను. పెదవి యిక్షుధర్మస్థితి (చెఱకువిలుకానితనము చెఱకురసమువంటి తీయదనము) నొందెను. కనులు శంబరాహితత్వము (లేడికన్నుల దిరస్కరించుట. మన్మథత్వము) నొందెను. ఆతన్వంగి యంగకములు మన్మథపూర్ణములై యున్నవి.

సీ. క్షణవిలాసమె కాని • గజనిమ్మపండులు సరియె దుర్గాధివా•సమున మనినఁ
బైపూఁతరుచి గాక • ప్రతియె కిన్నరకాయ లరిది మేరువు తల•యంపి నిడినఁ
బ్రొద్దువన్నె లెకాని • యుద్దియే తమ్మిమొగ్గలు చక్రములఁ గూడి•దళముకొనినఁ
గాఁకచాయలె కాక • కనకకుంభము లీడె శ్రీకరులశిరోగ్ర•సీమ నున్న
తే. మిళితఘనసారమై నున్ను•మిగిలికదిసి, యంతరము సూత్రమున కీక•యలరిజోడు
వదల కమితరసప్రౌఢిఁ బొదలి మెఱయు, నన్ను తలమిన్న వలగుబ్బ•చన్నుఁగవకు.

ఈపద్యమున గిరికాదేవియొక్క కుచవర్ణనముఁ జెప్పినాఁడు. ఏలాగనిన, గజనిమ్మపండులు= గజనిమ్మపండ్లు, క్షణవిలాసమెకాని = నిమిషమాత్రపుశృంగారమేకాని, దుర్గాధివాసమునమనినన్= అనఁగా దుర్గమందలి ఉనికిచేత వర్తించినప్పటికిని అనియర్థము. పర్వతసహవాసము గలిగియున్నప్పటికిని అనిభావము. సరియె=సమానమా నా? అనఁగా కావనుట. కిన్నరకాయలు=కిన్నరయనెడు వీణెకు వేసెడు గుబ్బకాయలు, పైపూఁతరుచిగాక=పైనబూసిన పూఁతరంగేకాక, అరిది=ఆశ్చర్యకరమయిన, మేరువుతలయంపినిడినన్=బంగారుకొండ తలక్రింద నుంచుకొన్నప్పటికిని అని యర్థము. మేరువుపూసతోఁగూడుకొన్నప్పటికిని అనిభావము. ప్రతియె=ఈడా నా? అనఁగా కావనుట. తమ్మిమొగ్గలు= తామరమొగ్గలు, ప్రొద్దువన్నెలెకాని=వేళవేళగుణములేకాని యనియర్థము. సూర్యునిచేతనైన వికాసములనిభావము. చక్రములఁగూడిదళముకొనినన్=సేనలతోఁగూడి బలువుపాటించినప్పటికిని అని యర్థ

ము. (ని. 'చక్రం చానీక మస్త్రియాం' అని అమరము.) చక్రవాకములతోఁగూడి యున్నప్పటికిని అని భావము. ఉద్దియే=జతయౌనా? అనఁగా జతగావనుట. కనకకుంభములు=బంగారుకలశములు, కాఁకచాయలెకాక=కాఁకలవలనవచ్చిన వన్నెలేకాక, శ్రీకరులనఁగా సంపద హస్తమందుగలవారు అనఁగా భాగ్యవంతులు-వారియొక్క, శిరోగ్రసీమనున్నన్=తలమీఁద గూర్చున్నప్పటికిని అని యర్థము. శ్రీలక్ష్మీదేవిని స్నానముచేయించునట్టి, కరుల=దివ్యగజములయొక్క, శిరోగ్రసీమనున్నన్=కుంభములతోఁగూడుకొన్నప్పటికిని అనిభావము. ఈడె=ఈడౌనా? అనఁగా కావనుట. ('లక్ష్మీ ర్దివ్యై ర్గజేంద్రై ర్మణిగణఖచితై స్స్నాపితా హేమకుంభైః' అని ప్రయోగము.)

ఈనాల్గుచరణములయందును జెప్పఁబడిన గజనిమ్మపండ్లు పర్వతములును, కిన్నరకాయలును వానిమేరువును, తామరమొగ్గలును, చక్రవాకములును, సువర్ణకలశములును, గజకుంభములును ఈయెనిమిదియు ఉపమానములయందుండెడు లోపములచేత నివి సమానములు కావని చెప్పఁబడినవి. వేని కనినఁ జెప్పుచున్నాఁడు. మిళిత=కూడికొనఁబడి, ఘన=అధికమైన, సారమై=చేవగలదై యనియర్థము. కర్పూరముతోఁగూడినదని భావము. గజనిమ్మపండ్లయితే క్షణమాత్రవిలాసములు గనుక నల్పసారములనుట. ఇక్కడ కుచద్వంద్వమునకు కర్పూరానుకూల్యమును నిమ్మపండ్లకు కర్పూరప్రాతికూల్యమును గనుక నీరీతిగ వ్యతిరేకమును జెప్పవచ్చును. 'కర్పూరప్రతికూలతా యది నచే త్త్వయ్యేవ సర్వే గుణాః' అని జంబీరఫలమునుగూర్చి చెప్పినాఁడు. నున్నమిగిలి=నున్నఁదనముచేత నతిశయించి యని యర్థము. పర్వతములయితే బర్బరములనుట. కదిసి=కదియఁబడి యని యర్థము, కిన్నరకాయలయితే యెడముగా నున్నవనుట. అంతరము సూత్రమునకీక=దారముదూరెడుమాత్రమైనను సందులేక యని యర్థము. మేరువుపూస అయితే దారముచేత గ్రుచ్చఁబడుచున్నదనుట. అలరి=ఉల్లసించి అనియర్థము. తామరమొగ్గలైతే వికాసమును బొందవనుట. జోడువదలక=జోడెడఁబాయక యనియర్థము. చక్రవాకములైతే సాయంకాలముకాఁగానే జోడెడఁబాయుచున్నవనుట. అమితరసప్రౌఢిఁబొదలి=మితములేని శృంగారరసప్రౌఢిమచేత నొప్పుచుండి యనియర్థము. సువర్ణకలశములైతే మితరసప్రౌఢిమచేత నొప్పుననుట, మితజలపూర్ణము లనిభావము. మెఱయు=ప్రకాశించునట్టి యని యర్థము. గజకుంభములైతే ప్రకాశించవనుట. అన్నుతలమిన్న=కాంతాశిరోమణియైన యాస్త్రీయొక్క, వలి=చల్లని, గుబ్బ=గుబ్బలవలెనుండెడు, చన్నుఁగవకున్=స్తనద్వయమునకు, అని సంబంధము.

గజనిమ్మపండ్లు దుర్గములను, కిన్నరకాయలు మేరువులను, తమ్మిమొగ్గలు చక్రములను, కనకకుంభములు శ్రీకరులకుంభములను దోడ్పఱచికొనినను పొలఁతిగుబ్బలఁ బోలఁజాలకున్నవి. దుర్గాధివాసము, మేరువుతలయంపి, చక్రములచెలిమి, శ్రీకరులశిరోగ్రసీమ సహాయసంపత్తిగల తత్తదుపమానవస్తువులె పరాభూతములగుట స్తనయుగళ సౌందర్యాతిశయమునకు ననుపమేయతకు దృష్టాంతములు. అలంకారము. వ్యతిరేకము. కావ్యలింగమును. స్తనములతాయిడి ద్రవ్యము సుఖము నొసగూర్చిపతిని సుఖపెట్టునుగాన నీ వాకాంతను బరిగ్రహించిన నన్వర్థవసునామధేయుఁడ వగుదువని సారస్యము. స్తనములకుఁగలవృత్తత్వము, ఘనత్వము, అవిషమత్వము, కఠినత్వము అర్థసుఖావహమనుటకుఁ బ్రయోగము-(బృహత్సంహితనుండి)

శ్లో. మధ్యం స్త్రియా స్త్రివళి సార్థమలోమశంచ
వృత్తౌ ఘనా వవిషమౌ కఠినా వురస్యౌ

రోమాపవర్తిత మురో మృదు చాంగనానాం
శ్రీవాచకంబు నిచితార్థ సుఖానిధత్తే.

చనుగవ సూత్రావకాశమేనిలేక హత్తుకొనియుంట యుపభోగార్హము సుఖదాయకమును. కావుననే రసప్రౌఢి పొనరి మన్మథోజ్జీవకములుగా నుండెననుట. ఇటులె కుమారసంభవమునఁ గాళిదాసుఁడు గౌరీ స్తనములను వర్ణించెను.

✓ శ్లో. అన్యోన్య ముత్పీడయ దుత్పలాక్ష్యాః స్తనద్వయం పాండు తథాప్రవృద్ధం
మధ్యే యథా శ్యామముఖస్య తస్య మృణాళసూత్రాంతర మప్యలభ్యం.

తా. ఆపొలంతిచనుగవ గజనిమ్మపండ్లను దుర్గములను మించి ఘనసారవంతముగను, కిన్నరకాయలను మేరువులను మించి నునుపుగను, తమ్మిమొగ్గలను చక్రవాకములను మించి యంతరము లేనట్లుగను, కనకకుంభములను కరికుంభములను మించి జోడువదలకయు మనోహరముగా నున్నవి.

చ. సతిహృదయాలవాలమున • జవ్వనపుం బెనుకాఁకఁ జేసి య
య్యతనుఁడు గుబ్బపొంబనఁటులా రనులోహశలాక నెత్తి యూ
ర్జితరుచి నింపఁగాఁ దుదలఁ • జెందినరాపొడి బాహుమూలజ
ద్యుతి యగుఁ గాకిచో నచట • దోర్మయభర్మలతల్ జనించునే. 43

సతి=ఆస్త్రీయొక్క, హృదయ=వక్షస్స్థలమనెడు, ఆలవాలమునన్=కుదుటియందు, జవ్వనపుం బెనుకాఁకఁ జేసి=యౌవనమనెడు పెద్దకాఁకచేత నిర్మించి, అయ్యతనుఁడు=ఆమన్మథుఁడనెడు అగసాలెవాఁడు, ఇక్కడ ఏకదేశవర్తిరూపకము, ఇందుకు లక్షణము. క. 'అవయవియు నవయవంబును, వివరింప సమస్తవస్తువిషయంబులలో, నవయవి యవయవగమ్యం, బవునది యేకతలవర్తి యగు నెట్లన్నన్.' అని. గుబ్బ=స్తనములనెడు, పొంబనఁటులు=బంగారుకలశములు, ఆరను=నూఁగారనెడు, లోహశలాక నెత్తి=ఇనుపకడ్డిచేత నెత్తిపట్టి, ఊర్జితరుచినింపఁగాన్=ఉచితమైన మెఱుఁగువచ్చునట్లు సానఁబట్టఁగాను, తుదలఁ జెందినరాపొడి=ఆకుచములనెడు బంగారు కలశములయొక్క చివరలయందు రాలినరజమే, బాహుమూలజ=భుజముల మొదటఁబుట్టిన, ద్యుతియగున్=కాంతియైయుండును. కాని చోన్=అట్లు కాకపోయినట్లాయెనేని, అచట=ఆబాహుమూలప్రదేశములయందు, దోర్మయ=బాహురూపములయిన, భర్మలతల్=బంగారుతీఁగెలు, జనించునే=సంభవించునా, అనఁగా బంగారపుభూమి గనుకనే బంగారుతీఁగెలు పుట్టినవనుట. కారణానుగుణములుగా కార్యములు పుట్టుట ప్రసిద్ధమేకదా.

గుబ్బలు సువర్ణకుంభములనుటచే వర్తులవయుఁ గాంతియు గలిగి సమము ప్రేగుగలిగి యున్నవనియుఁ రాపొడి తుదలఁ జెందెననుటచేఁ గుంభములు మెఱుంగుగనుంటకై సానబెట్టఁబడినవనియుఁ గాననే బాహుమూలకాంతి ఆపొడివలె నున్నదనియు భావము. దోర్మయములె బాహువుల కుత్పత్తిస్థానములుగావున నట బాహులతలు జనించుటకు బంగారుదుమ్ము విరివిగఁ జల్లఁబడినది. కాన నందు సువర్ణలతలు బాహురూపముగఁ జనించినవనుటచే హస్తములు లతలవలె నుంటయే సువర్ణకాంతుల వెదజల్లుచున్నవని భావము.

అలం. రూపకానుప్రాణితోత్ప్రేక్ష.

తా. మన్మథుఁడను నగసాలి హృదయమను గుంపటిపైకి ఆరనుకడ్డీతోఁ జనులను బంగారు కుండలనెత్తి మెఱుఁగునకై పైనిజల్లిన సువర్ణరజమువలె బాహుమూలకాంతులును,అందుండి జనించిన బంగారుతీఁగలవలె భుజలతలు తనరారఁ నాకాంత దర్శనీయముగ నున్నది.

చ. విలసితమౌక్తికంబులు సవిభ్రమరేఖలు నుక్కి సాటి రాఁ
దలఁచి మహోద్ధతిన్ మొరసి • తన్మృదునాదవిలాసకౌశలం
బలవడమిన్ మునింగి దర • మై తనలో వివరం బెఱింగి యా
వలమురి దాఁ బ్రదక్షిణము • వచ్చెనొ యాసతికంఠలక్ష్మికిన్. 44

విలసిత=మిక్కిలి ప్రకాశించుచున్న, మౌక్తికంబులు=ముత్యాలపేరులును, సవిభ్రమరేఖలు= విభ్రమశబ్దము భ్రాంతియందును విలాసమందును వర్తించుచున్నది. (ని. 'విభ్రమో భ్రాన్తి హావయోః' అని అమరము.) విలాసయుక్తమైన రేఖాత్రయమును అని కంఠపరమైన యర్థము.

శ్లో. 'లలాటే చ గళే చైవ మధ్యే చైవ వళిత్రయం,
స్త్రీపుంసయో రిదం జ్ఞేయం మహాభాగ్యైకసూచకం.' అని సాముద్రికశాస్త్రము,

ముత్యములును తిరుగుడుగల రేఖలును అని శంఖపరమైనయర్థము. ఉన్కిన్=ఉన్నందువలన, అనఁగా విలసితమౌక్తికంబులు సవిభ్రమరేఖలును కంఠమందును శంఖమందును సాధారణముగా నున్నందున ననియర్థము. ఆవలమురి=శంఖము, సాటిరాఁ దలఁచి=ఆ స్త్రీకంఠముతో సామ్యమును బొందఁదలఁచినదై, మహోద్ధతిన్మొఱసి=మహత్తరమైన యెగుపుచేత ధ్వనిచేసి, తత్=ఆకంఠసంబంధమైన, మృదు=శ్రావ్యమైన, నాద=స్వరముయొక్క, విలాస=సౌష్ఠవమందలి, కౌశలంబు=నైపుణ్యము, అలవడమిన్=లభించకపోవుటచేత, మునింగి=సంకోచమును బొంది యని యర్థము. నీళ్ళలో మునిఁగిన దని భావము. దరమై=భయమైయని యర్థము. దరమనెడి పేరుగలది యని భావము. తనలోవివరం బెఱింగి=తనలోనుండెడు యావద్వృత్తాంతమును తెలిసికొని అని యర్థము. రంధ్రము గలిగినదని భావము. ఆసతి=ఆ స్త్రీయొక్క, కంఠలక్ష్మికిన్=గళసౌందర్యలక్ష్మికి, తాన్=తాను, ప్రదక్షిణము వచ్చెనో=అపరాధక్షమకొఱకు ప్రదక్షిణము చేసినది కాఁబోలును, ఇక్కడ శంఖగత దక్షిణావర్తత్వమును ప్రదక్షిణాగమనముగా నుత్ప్రేక్షించినాఁడు. శంఖమునందు సతీకంఠమునుబోలదగిన పోలిక లొకటిరెండున్నను మృదునాదకౌశలములేదు. మహోద్ధతిన్ మొరయుటగలదు. కావున సామ్యమున కవకాశములేకపోయెను. వలమురియను శబ్దమునకుఁ బూర్వరూపము వలపురియనియు ననఁగా కుడి నుండి మెలికలు గలదనియుఁ గ్రమముగా నుచ్చరించుటలో వలమురియను రూప మేర్పడెనని శబ్దవిదులు వాకొందురు. వలమురియెగానఁ బ్రదక్షిణము గావించుచున్నటులున్నది. ప్రదక్షిణము కంఠలక్ష్మికనుటచే శంఖము లక్ష్మీసహజన్మలుగానఁ బోలికలకు వీలు బ్రదక్షిణమునకు సార్థకము గలిగినదనుట. అలం. హేతూత్ప్రేక్ష. సమాసోక్తి.

తా. లోన మౌక్తికములు రేఖలుగల శంఖము చెలువకంఠముతోఁ బోలనెంచి మనోహరధ్వని తనకులేమిచే భయపడి తనగుట్టు తానెఱింగి యపరాధక్షమార్థము కంఠలక్ష్మికిఁ బ్రదక్షిణము గావించి నటుల దక్షిణావర్తముతో నలరియున్నది.

రోమాపవర్తిత మురో మృదు చాంగనానాం
గ్రీవాచకంబు నిచితార్థ సుఖానిధత్తే.

చనుగవ సూత్రావకాశమేనిలేక హత్తుకొనియుంట యుపభోగార్హము సుఖదాయకమును. కావుననే రసప్రౌఢి పొనరి మన్మథోజ్జీవకములుగా నుండెననుట. ఇటులె కుమారసంభవమునఁ గాళిదాసుఁడు గౌరీ స్తనములను వర్ణించెను.

శ్లో. అన్యోన్య ముత్పీడయ దుత్పలాక్ష్యాః స్తనద్వయం పాండు తథాప్రవృద్ధం
మధ్యే యథా శ్యామముఖస్య తస్య మృణాళసూత్రాంతర మప్యలభ్యం.

తా. ఆపొలంతిచనుగవ గజనిమ్మపండ్లను దుర్గములను మించి ఘనసారవంతముగను, కిన్నరకాయలను మేరువులను మించి నునుపుగను, తమ్మిమొగ్గలను చక్రవాకములను మించి యంతరములేనట్లుగను, కనకకుంభములను కరికుంభములను మించి జోడువదలకయు మనోహరముగా నున్నవి.

చ. సతిహృదయాలవాలమున • జవ్వనపుం బెను కాఁకఁ జేసి య
య్యతనుఁడు గుబ్బపొంబనఁటులా రనులోహశలాక నెత్తి యూ
ర్జితరుచి నింపఁగాఁ దుదలఁ • జెందినరాపొడి బాహుమూలజ
ద్యుతి యగుఁ గానిచో నచట • దోర్మయభర్మలత ల్జనించునే. 43

సతి=ఆస్త్రీయొక్క, హృదయ=వక్షస్థలమనెడు, ఆలవాలమునన్=కుదుటియందు, జవ్వనపుం బెనుకాఁకఁ జేసి=యౌవనమనెడు పెద్దకాఁకచేత నిర్మించి, అయ్యతనుఁడు=ఆమన్మథుఁడనెడు అగసాలెవాఁడు, ఇక్కడ ఏకదేశవర్తిరూపకము, ఇందుకు లక్షణము. క. 'అవయవియు నవయవంబును, వివరింప సమస్తవస్తువిషయంబులలో, నవయవి యవయవగమ్యం, బవునది యేకతలవర్తి యగు నెట్లన్నన్.' అని. గుబ్బ=స్తనములనెడు, పొంబనఁటులు=బంగారుకలశములు, ఆరను=నూఁగారనెడు, లోహశలాక నెత్తి=ఇనుపకడ్డిచేత నెత్తిపట్టి, ఊర్జితరుచినింపఁగాన్=ఉచితమైన మెఱుఁగువచ్చునట్లు సానఁబట్టఁగాను, తుదలఁ జెందినరాపొడి=ఆకుచములనెడు బంగారు కలశములయొక్క చివరలయందు రాలినరజమే, బాహుమూలజ=భుజముల మొదటఁబుట్టిన, ద్యుతియగున్=కాంతియైయుండును. కాని చోన్=అట్లు కాకపోయినట్లాయెనేని, అచట=ఆబాహుమూలప్రదేశములయందు, దోర్మయ=బాహురూపములయిన, భర్మలతల్=బంగారుతీఁగెలు, జనించునే=సంభవించునా, అనఁగా బంగారపుభూమి గనుకనే బంగారుతీఁగెలు పుట్టినవనుట. కారణానుగుణములుగా కార్యములు పుట్టుట ప్రసిద్ధమేకదా.

గుబ్బలు సువర్ణకుంభములనుటచే వర్తులవయుఁ గాంతియు గలిగి సమము వ్రేగుగలిగి యున్నవనియుఁ రాపొడి తుదలఁ జెందెననుటచేఁ గుంభములు మెఱుంగుగనుంటకై సానబెట్టఁబడినవనియుఁ గాననే బాహుమూలకాంతి రాపొడివలె నున్నదనియు భావము. దోర్మయములె బాహువుల కుత్పత్తిస్థానములుగావున నట బాహులతలు జనించుటకు బంగారుదుమ్ము విరివిగఁ జల్లఁబడినది. కాన నందు సువర్ణలతలు బాహురూపముగఁ జనించినవనుటచే హస్తములు లతలవలె నుంటయే సువర్ణకాంతుల వెదజల్లుచున్నవని భావము.

అలం. రూపకానుప్రాణితోత్ప్రేక్ష.

తా. మన్మథుఁడను నగసాలి హృదయమను గుంపటిపైకి ఆరనుకడ్డీతోఁ జనులను బంగారు కుండలనెత్తి మెఱుఁగునకై పైనిజల్లిన సువర్ణరజమువలె బాహుమూలకాంతులును,అందుండి జనించిన బంగారుతీఁగలవలె భుజలతలు తనరార నాకాంత దర్శనీయముగ నున్నది.

చ. విలసితమౌక్తికంబులు సవిభ్రమరేఖలు నుక్కి సాటి రాఁ
దలఁచి మహోద్ధతిన్ మొగసి • తన్మృదునాదవిలాసకౌశలం
బలవడమిన్ మునింగి దర • మై తనలో వివరం బెఱింగి యా
వలమురి దాఁ బ్రదక్షిణము • వచ్చెనొ యాసతికంఠలక్ష్మికిన్. 44

విలసిత=మిక్కిలి ప్రకాశించుచున్న, మౌక్తికంబులు=ముత్యాలపేరులును, సవిభ్రమరేఖలు= విభ్రమశబ్దము భ్రాంతియందును విలాసమందును వర్తించుచున్నది. (ని. 'విభ్రమో భ్రాన్తి హావ యోః' అని అమరము.) విలాసయుక్తమైన రేఖాత్రయమును అని కంఠపరమైన యర్థము.

శ్లో. 'లలాటే చ గళే చైవ మధ్యే చైవ వళిత్రయం,
స్త్రీపుంసయో రిదం జ్ఞేయం మహాభాగ్యైకసూచకం.' అని సాముద్రికశాస్త్రము,

ముత్యములును తిరుగుడుగల రేఖలును అని శంఖపరమైనయర్థము. ఉన్కిన్=ఉన్నందువలన, అనఁగా విలసితమౌక్తికంబులు సవిభ్రమరేఖలును కంఠమందును శంఖమందును సాధారణముగా నున్నందున ననియర్థము. ఆవలమురి=శంఖము, సాటిరాఁ దలఁచి=ఆస్త్రీకంఠముతో సామ్యమును బొందఁదలఁచినదై, మహోద్ధతిన్మొఁగసి=మహత్తరమైన యెగుపుచేత ధ్వనిచేసి, తత్=ఆకంఠసంబంధమైన, మృదు=శ్రావ్యమైన, నాద=స్వరముయొక్క, విలాస=సౌష్ఠవమందలి, కౌశలంబు=నైపుణ్యము, అలవడమిన్=లభించకపోవుటచేత, మునింగి=సంకోచమును బొంది.యని యర్థము. నీళ్ళలో మునిఁగిన దని భావము. దరమై=భయమైయని యర్థము. దరమనెడి పేరుగలది యని భావము. తనలోవివరం బెఱింగి=తనలోనుండెడు యావద్వృత్తాంతమును దెలిసికొని అని యర్థము. రంధ్రము గలిగినదని భావము. ఆసతి=ఆస్త్రీయొక్క, కంఠలక్ష్మికిన్=గళసౌందర్యలక్ష్మికి, తాన్=తాను, ప్రదక్షిణము వచ్చెనో=అపరాధక్షమకొఱకు ప్రదక్షిణము చేసినది కాఁబోలును, ఇక్కడ శంఖగత దక్షిణావర్తత్వమును ప్రదక్షిణాగమనముగా నుత్ప్రేక్షించినాఁడు. శంఖమునందు సతీకంఠమునుబోలదగిన పోలిక లొకటిరెండున్నను మృదునాదకౌశలములేదు. మహోద్ధతిన్ మొరయుటగలదు. కావున సామ్యమున కవకాశములేకపోయెను. వలమురియను శబ్దమునకుఁ బూర్వరూపము వలపురియనియు ననఁగా కుడి నుండి మెలికలు గలదనియుఁ గ్రమముగా నుచ్చరించుటలో వలమురియను రూప మేర్పడెనని శబ్దవిదులు వాకొందురు. వలమురియెగానఁ బ్రదక్షిణము గావించుచున్నటులున్నది. ప్రదక్షిణము కంఠలక్ష్మికనుటచే శంఖము లక్ష్మిసహజన్మలుగానఁ బోలికలకు వీలు బ్రదక్షిణమునకు సార్థకము గలిగినదనుట. అలం. హేతూత్ప్రేక్ష. సమాసోక్తి.

తా. లోన మౌక్తికములు రేఖలుగల శంఖము చెలువకంఠముతోఁ బోలనెంచి మనోహరధ్వని తనకులేమిచే భయపడి తనగుట్టు తానెఱింగి యపరాధక్షమార్థము కంఠలక్ష్మికిఁ బ్రదక్షిణము గావించి నటుల దక్షిణావర్తముతో నలరియున్నది.

సీ. కొమ్మవాతెరతో గుణమ్ముఁ గైకొనవచ్చి కఠినవిద్రుమము చేకట్లఁబడియెఁ
గోమలియధరంబుతో మొనల్పచరించి యరుచిబింబఫలమ్ము లవిసిపడియె
మృగనేత్రపెదవితోసొగసుఁబూనఁ గడంగి కెంపునీరసముఁజెక్కించుకొనియె
సతిమోవితో రసస్థితులు చూపి సుగంధ వికలబంధూక మూరకయె విరిసె
తే. డాయుపగడంబునకుఁ బగడంబు బింబ
మునకు బింబంబు మెఱయుకెంపునకుఁ గెంపు
బంధుజీవంబునకుఁ దానబంధుజీవ
మౌర యాకుందరదనరదాంశుకంబు. 45

కొమ్మవాతెఱతోన్=ఆస్త్రీయొక్క మృదువైన పెదవితోడ, గుణమ్ముఁగైకొనవచ్చి=సమాన ధర్మమును గ్రహింపవచ్చినదై, కఠినవిద్రుమము=కాఠిన్యగుణముగల పగడము, చేకట్లఁబడియెన్=చేతియందలి కట్లఁబడియెను. అనఁగా చేతులు గట్టివేయఁబడెనని యర్థము. గుణమనఁగా దారము గనుక దారము గ్రుచ్చఁబడి చేకట్లనెడు హస్తాభరణములయందుఁ జేరినదనిభావము. కోమలి యధరంబుతోన్=ఆస్త్రీయొక్క మధురమయినరుచిగల మోవితోడ, మొనల్పచరించి=ఎదిరించినవై, అరుచిబింబఫలంబులు=రుచిలేని దొండపండ్లు, అవిసిపడియెన్=గుప్పునఁగూలెనని యర్థము. మొనలనఁగా ఫలములయొక్క క్రిందఁగనుపడెడు అగ్రములును గనుక మొనఁజూపి కుళ్లిపడిపోవుచున్నవని భావము. మృగనేత్రపెదవితోన్=ఆస్త్రీయొక్క రసయుక్తమైన యధరోష్ఠముతోడ, సొగసు పూనఁగడంగి=సొగసనఁగా నిక్కడ కాంతియని చెప్పవలెను. కాంతినివహించుటకుద్యోగించి, కెంపు=రసహీనమైన పద్మరాగము, నీరసముఁ జెక్కించుకొనియె=తేలికగుణమును జెక్కవేయించుకొనెనని యర్థము. కాంతివహించుకొఱకు సానవేయఁబడుచున్నదని భావము. సతిమోవితోన్=ఆస్త్రీయొక్క సుగంధసహితమైన కెమ్మోవితోడ, రసస్థితులు చూపి=రసమనఁగా నిక్కడ స్నేహము-స్నేహముగలిగి యుండుటను గనుపఱచి, సుగంధవికలబంధూకము=సుగంధరహితమైన మంకెనపువ్వు, ఊరకయె విరిసె=నిష్కారణముగా విచ్చిపోయెనని యర్థము. రసమనఁగా మకరందంబును గనుక మకరందరసస్థితులుచూపి తనకుఁ దానే వికసించుచున్నదని భావము.

ఔర=ఆశ్చర్యము, ఆకుందరదన=ఆస్త్రీయొక్క, రదాంశుకంబు=అధరోష్ఠము, డాయు=తారసించిన, పగడంబునకున్=విద్రుమమునకు, పగ=విరోధముయొక్క, డంబు=అతిశయరూపమైనదియు, బింబమునకు=దొండపండునకు, బింబంబు=ప్రతిపక్షియైనదియు, మెఱయుకెంపునకు=ప్రకాశించెడు పద్మరాగమునకు, కెంపు=కోపప్రయుక్తమైన రక్తిమగలదియును, బంధుజీవంబునకు=మంకెనపువ్వునకు, ని. 'బన్ధూకో బన్ధుజీవకః' అనిఅమరము. తానబంధుజీవము=తానేజ్ఞాతిజీవమైనదియును, అని యర్థము. క్రమాలంకారము. ఇక్కడ మన్మథునకు మన్మథుఁడన్నట్లుగా, పగడంబునకు పగడంబు, బింబమునకు బింబంబు, కెంపునకు కెంపు, బంధుజీవమునకు తానే బంధుజీవము అని సారస్యమును గ్రహించవలెను. అనఁగా నితరవస్తువులకంటె విద్రుమబింబపద్మరాగబంధూకములకు నెట్టి అరుణత్వాతిశయముగలదో ఆవిద్రుమాదులకంటెను వర్ణనీయమైన అధరమునకు నట్టి అరుణత్వాతిశయముగలదని తెలియఁదగినది. కుందరదన యనుపదము సాభిప్రాయము. పలువరుస

కుందకుసుమములవలె నుంటకతనఁ బేదవి మఱియుఁ గెంపువారి యుండెను. పెదవియనక యితర పర్యాయపదములు చెప్పక రదాంశుకమనుటచే నొండొకటి యలంకారముగ నుండెననుట.

అలంకారము - వ్యతిరేకము. శబ్దాలంకారము. ఛేకానుప్రాసము.

తా. ఆపొలంతివాతెర కఠినస్వభావముగల పగడములను మృదుస్వభావముచేఁ దిరస్కరించి, అరుచిగనుండు బింబఫలములను దీయని తనమోవిచే నోటుపుచ్చి నీరసము జెక్కించుకొను కెంపును సొగసుచే నతిశయించి సుగంధశూన్యమగు బంధూకమును మోవిరసస్థితిచే నోడించి యలరుచున్నది.

ఉ ఇంతిమృదూక్తిమాధురికి • నిక్షురసం బెన వోలఁ జాల కా
  ద్యంతము నోడి మధ్యమగు•ణాశ్రయ మై నెఱకాఁక నెన్ని జ
  న్మాంతరము ల్వహించియుఁ ద•నంతనె ఖండము లయ్యెఁ గాని యా
  వంతయుఁ బూన దెంత వొడి • యయ్యు నఖండతదీయసంపదన్. 46

ఇంతిమృదూక్తిమాధురికిన్=ఆస్త్రీయొక్క మృదువైనవాక్యమాధుర్యమునకు, ఇక్షురసంబు=చెఱకుపానకము, ఎనవోలఁజాలక=సాటినిపోలలేక, ఆద్యంతమునోడి=ఆద్యంతములయందు నోడిపోయినదై యని యర్థము. ('ఆదిశ్చ అన్తశ్చ ఆద్యన్తమ్' అని ఏకవద్భావము.) ఇక్కడ 'అన్యస్యాః క్వచిద్భవేచ్ఛాన్యా' అనెడు సూత్రముచేత సప్తమ్యర్థమందు ప్రథమవచ్చినది. చెఱకు మొదటికణుపునందును చివరకణుపునందును మధురరసములేనిదని భావము. మధ్యమగుణాశ్రయమై=ఉత్తమగుణముగాక మధ్యగుణాశ్రయమై యని యర్థము. మధ్యభాగమందు మాధుర్యగుణాశ్రయమైనదని భావము. నెఱ=గొప్పయిన, కాఁకన్=కోపముచేత ననియర్థము. ఘనమైనయగ్నిచేత నని భావము. ఎన్ని జన్మాంతరముల్వహించియున్=అనేకజన్మము లెత్తినప్పటికిని అని యర్థము. గుడశర్కరాదిభావములను బొందుచున్నదని భావము. తనంతనె ఖండములయ్యెఁగాని=తనంతట తానే తునుకలై పోయెఁగాని యని యర్థము. ఖండశర్కరయాచున్నదని భావము. ఎంతవొడియయ్యును=ఎంతపొడిపొడియయినప్పటికి నని యర్థము. చూర్ణాకృతితోడ శర్కరాభేద మగుచున్నదని భావము. అనఁగా, నవాయతు, పంచదార యాచున్నదనుట. అఖండ=సంపూర్ణమైన, తదీయసంపదన్=ఆస్త్రీయొక్కమృదువచనమాధుర్యసంబంధమైన సమృద్ధిని, ఆవంతయుఁ బూనదు=అవగింజంతయైనను వహింపఁజాలదు, అనఁగా ఆస్త్రీయొక్క వాఙ్మాధుర్యము గుడశర్కరాదులను తిరస్కరించునని భావము. చెఱకుఖండమగుటచే నఖండమగు మోవితీయఁదనమును బోలఁజాలదయ్యెను. జన్మాంతరమొందియు సామ్యమొందకపోవుటచేఁ జెఱకున కది యసాధ్యమనుట.

అలం. వ్యతిరేకము. కావ్యలింగము. సమాసోక్తి.

తా. ఆపొలంతిమాటల తీయదనముతో సరిబోలనెంచి చెఱకురసము మొదటినుండి తుదివఱకోడిపోయి మధ్యమగుణాశ్రయమున నెన్నిజన్మాంతరములు కాకచే నొందినను దనంత ఖండఖండములయ్యెగాని శర్కరారూపమున బొడియయ్యు మాధుర్యసమత గడింపలేకపోయెను.

శా. నానాసూనవితానవాసనల నా•నందించు సారంగ మే
  లా న న్నొల్ల దటంచు గంధఫలి బ•ల్కాఁకం దపం బంది యో

షానాసాకృతిఁ బూని సర్వసుమనస్సౌరభ్యసంవాస మై
పూనెం బ్రేక్షణమాలికామధుకరీపుంజంబు నిర్వంకలన్. 47

నానా=సమస్తమైన, సూన=పుష్పములయొక్క, వితాన=సమూహముయొక్క, వాసనలన్=పరిమళములచేత, ఆనందించు=సంతోషించునట్టి, సారంగము=తుమ్మెద, ఏలా నన్నొల్ల దటంచున్=ఎందుకు నన్నొల్లదని, గంధఫలి=సంపఁగిమొగ్గ. (ని. 'అథ చాంపేయ శ్చమ్పకో హేమపుష్పకః, ఏతస్య కలికా గన్ధఫలీ స్యాత్' అని అమరము.) బల్కాఁకన్=బలువైన కోపముచేతననిగాని పంచాగ్నిమధ్యమందనికాని చెప్పవచ్చును. తపంబంది=తపస్సుచేసి యని యర్థము. తపమనఁగా గ్రీష్మకాలమను గనుక, అధికమయిన ఉష్ణగుణముతోడ, గ్రీష్మర్తువునందుఁ బుట్టుచున్నదని భావము. (ని. 'ఉష్ణ ఉష్మాగమ స్తపః' అని అమరము.) యోషా=ఆస్త్రీయొక్క, నాసాకృతిఁబూని=నాసికారూపజన్మాంతరమునువహించి, సర్వ=సమస్తమయిన, సుమనః=పుష్పములయొక్క, సౌరభ్య=సువాసనలకు, సంవాసమై=నివాసస్థానమైయని యర్థము. సకలకుసుమామోదములను గ్రహించుచున్నదని భావము. ప్రేక్షణమాలికా=వీక్షణపంక్తులనెడు, మధుకరీ=ఆఁడుతుమ్మెదలయొక్క, పుంజంబులున్=సమూహమును, ఇర్వంకలన్=ఉభయపార్శ్వములయందును, పూనెన్=వహించెను. తుమ్మెదలను సేవకులనుగా నేలి యుభయపార్శ్వములయందును నిల్పెనని ప్రకారాంతరము. అనఁగా ఆస్త్రీయొక్క నాసిక సంపఁగిమొగ్గవలె చక్కనై యున్నదనియు, వీక్షణములు తుమ్మెదచాళ్లవలె నున్నవనియును తాత్పర్యము. సారంగము నానాకుసుమవాసనల కానందింపఁగలది. సంపెఁగయో ('గంధమేవఫలం అస్యాః ఇతి గంధఫలీ' అనువ్యుత్పత్తిచే) సుగంధమే ఫలముగాఁ గలది. అట్లయ్యుఁ దుమ్మెదచే నామోదింపఁబడమి కొంతగా నెంచినది. తుమ్మెద పూవుతావుల కానందించుచుండఁ దన్వంగినాసిక సుమనఃసౌరభ్యసంవాసమైనది. అంతతో నూరకయుండక యిరువంకల తుమ్మెదలగుంపులఁ జూపులపేర నిలుపుట తన్నొల్లనందులకు దిరుగవచించుట. అలం. అతిశయోక్తి. ఉత్ప్రేక్ష.

మ. తనరాజీవశరం బెఱుంగదు నిశాతత్వంబు లేఁగల్వతూ
పునకుం జాలదు వేగలీల యని యాపూముల్కు లెగ్గించి క్రొ
న్ననవిల్కాఁడు నవాంబుజోత్పలవితానం బీనుమీనాక్షిలో
చనము ల్వింట ఘటింపఁ బోల్చె నవి నిస్తంద్రాంబకఖ్యాతులన్. 48

తనరాజీవశరంబు=తనయొక్క అరవిందబాణము, నిశాతత్వంబు=వాఁడిగలుగుటను, ఎఱుంగదు=గుర్తెఱుఁగదు. అనఁగా పద్మబాణమునకు వాఁడిలేదనియర్థము. కమలము=నిశాస్వరూపము నెఱుఁగదని భావము. లేఁగల్వతూపునకున్=కోమలమైన నీలోత్పలబాణమునకు, వేగలీల=తీవ్రగమనక్రియ, చాలదు=సరిపోలదని యర్థము. కలువకు, వేగన్=తెల్లవారఁగానే, లీల=వికాసరూపవిలాసము చాలదనిభావము. ఈయర్థమందు వేగన్ అనునది భిన్నపదము. (ని. 'లీలావిలాసక్రియయోః'అని అమరము.) అని=ఇట్లనివిచారించి, ఆపూముల్కు లెగ్గించి=పురాతనములైన ఆపుష్పబాణములను నిరసించి, క్రొన్ననవిల్కాఁడు=ఎఱ్ఱనిచిగురువిల్లుగాఁగలమన్మథుఁడు, నవ=నూతనములైన, అంబుజ=పద్మములయొక్కయు, ఉత్పల=నల్లకల్వలయొక్కయు, వితానంబు=సమూహమును, అనఁగా నభినవాంబుజోత్పలబాణములను, ఈను = ఉత్పాదించుచున్న, మీనాక్షిలోచనముల్ = స్త్రీయొక్క నేత్రము

లను, వింటఘుటింపక్ = క్రొన్ననవిల్తాఁడని చెప్పినందున క్రొన్ననవింటను సంధించఁగా, ఇక్కడ నేత్రము నంబుజోత్పలవితానమీనుటట ధవళనీలకాంతుల నీనుటయే యని భావము. ఇక్కడ రూపకాతిశయోక్త్యలంకారము. ఈ అలంకారముచేత నానావిధానేక బాణసంపాదక కామసాయక సామ్రాజ్యము స్ఫురింపుచున్నది గనుక ఉపమాలంకారధ్వని కలుగుచున్నదని గ్రహించవలెను. అవి= ఆ నేత్రములు, నిస్తంద్రాంబకఖ్యాతులక్=నిస్తంద్రశబ్దము ఖ్యాతిశబ్దమునకు విశేషణమయ్యెను అర్థసౌందర్యబలముచేత అంబకశబ్దమునకును విశేషణ మగుచున్నది. తంద్ర యనఁగా దోషవిశేషము. అంబకములనఁగా బాణములును నేత్రములును, ఆనిశాతత్వతీవ్రగమనాది దోషములు లేనిబాణముల యొక్క ప్రసిద్ధులచేత, పొల్చెక్=ప్రకాశించెను. తంద్రారూపదోషములేని నేత్రములని భావము. అనఁగా ఆ స్త్రీయొక్క నేత్రములు తెల్లదామరరేకులకంటెను నల్లగల్వరేకులకంటెను అతిశయించిన చక్కఁదనముగలిగి మన్మథబాణములవలె నున్నవని తాత్పర్యము.

అలంకారము. రూపకాతిశయోక్తి. ఉపమానధ్వని.

లోచనములు నవాంబుజోత్పలవితాన మీనుననుటవలనఁ గడగంటిచూపులకాంతులు తెల్లగను, కనీనికాకాంతులు నల్లగను బ్రసరించుచున్నవనుట, కనుగ్రుడ్డుకాంతులు తెల్లఁగను కనుపాపకాంతులు నల్లగను నుండు గావున నొకమాఱె తెల్లనినల్లనికాంతులు వెల్లివిరియుచున్నవని భావము. కంటినుండి తెల్లనికాంతులు నల్లనికాంతు లొకమాఱె ప్రసరించుచున్నవనుటకు-

సీ. కర్పూరకస్తూరికా ప్రవాహంబులు ప్రసరింప లోచనప్రాంగణముల. ✓

శృంగారనైషధము. ఆ. ౫-౭.

చూపులు నలుపుగా వర్ణించుటకు-

వేశ్యాస్త్వత్తో నఖపదసుఖాన్ ప్రాప్య వర్షాగ్రబిందూన్
ఆమోక్ష్యన్తే త్వయిమధుకరశ్రేణి దీర్ఘాన్ కటాక్షాన్.

చూపులు తెల్లగా వర్ణించుటకు-

చ. పతిగని లజ్జనాననము వాయఁగ నల్లనవాంచి సమ్మదా
మృతరసపూరితార్థవినిమీలితలోలకటాక్షవీక్షణా
యతసితదీధితుల్ కలయ నద్రిజవిచ్చె మహేశుమీఁద రా
జతగిరిమీఁదనున్నతి నిశాకరదీప్తులు గప్పుకై వడిన్.

నన్నెచోడుని కుమారసంభవము. షష్ఠా. ప. ౯౦౧.

తే. త్రిజగతీసుదతీరూప•విజయకీర్తి, గలుగు నని యింతిఫాలభా•గమున వ్రాసి
నలువ యాశుభవాచకం•బులకు శ్రీల, మొదలఁదుదినిల్పెననఁగర్ణ•ములుదనర్చు.

నలువ=బ్రహ్మ, త్రిజగతీ=జగత్త్రయమందలి, సుదతీ=స్త్రీలయొక్క, రూప=చక్కఁదనమును, విజయ=గెలుచుటచేతనైన, కీర్తి=యశస్సు, కలుగునని=కలుగుచున్నదని, ఇంతి=ఆ స్త్రీయొక్క, ఫాలభాగమున వ్రాసి=నుదుట వ్రాసినవాఁడై, ఆశుభవాచకంబులకు=ఆ వ్రాయఁబడిన శుభవాక్యములకు, శ్రీలక్=శ్రీకారములను, మొదలఁదుదినిల్పెనన్=మొదటను చివరనునిలిపినాఁడో యన్నట్లుగానే, కర్ణములు దనర్చు=చెవులొప్పుచుండును. అనఁగా ఆ స్త్రీయొక్క కర్ణములు శ్రీకారములవలె నున్నవని భావము. అలం. ఉత్ప్రేక్ష.

త్రిలోకసుదతీరూపవిజయకీర్తి ఫాలమున వ్రాయఁబడెననుటచే నాకాంత త్రిలోకకాంతాతిశయసౌందర్యవతి యనుట. ఫాలభాగమున శుభవర్ణములు వ్రాసెననుటచే నుదురు విశాలముగ ఫలకమువలె నుండెనని భావము. శుభవాచకములకు శ్రీకారములు వ్రాయుట లోకధర్మము.

తా. నలువ తొలుత నుదుట నీచెలువ ముల్లోకములచెలువలఁ జక్కఁదనముచే గెలువఁగలదని వ్రాసి ప్రక్కల శ్రీకారములఁ జుట్టినటుల కర్ణయుగళి యొప్పుచున్నది.

చ. అనయము నీలకంధరము ♦ నభ్రము నన్న సమాఖ్యవారితో
నొనరియు నింతివేనలికి ♦ నోడి యనిశ్చితరూపధేయ మై
చనియె మొగుల్ నగావళికి ♦ శబ్దగుణంబులు నూపువాని నె
ట్టనఁ బురివిచ్చువానిదరి ♦ డాయుజడాత్మల కెవ్వి నిల్కడల్. 50

అనయముఁ=ఎల్లప్పుడును, నీలకంధరము నభ్రమునన్న సమాఖ్య వారితో నొనరియుఁ=అనఁగా నీలకంధరము, అభ్రము, అనునట్టి తనకు సమానములయిననామధేయములుగల నెమలితోడను ఆకాశముతోడను గూడుకొని యుండియును అనియర్థము. మేఘము మయూరమునకు ప్రియమయినదియును ఆకాశముతోఁ గూడుకొన్నదియు నని భావము. ఇంతి=ఆస్త్రీయొక్క, వేనలికిఁ=కొప్పునకు, ఓడి=కాంతిచేత సమముగాలేక యోడి, అనిశ్చితరూపధేయమై=తెలియఁబడనిరూపముగలదై యని యర్థము, నానారూపములు గలదని భావము. మొగులు=మేఘములు, నగావళికిఁ=పర్వతసమూహములకై, చనియెఁ=వెళ్లెను. ఎందువలన ననిన, శబ్దగుణంబులు నూపువాని=ఇక్కడ గుణములనఁగా ఆవృత్తులు, శబ్దావృత్తులను గనుపఱచువానియొక్కయు, అనఁగా ఆడినమాటలే ఆడుచుండెడు వదరుపోతుయొక్కయు నని యర్థము. శబ్దగుణక మాకాశమని భావము. (ని. 'గుణస్త్వావృత్తిశబ్దాది జ్యేంద్రియాముఖ్యతన్తుషు' అని వైధృతి.) నెట్టనఁ బురివిచ్చువాని=శీఘ్రముగా పురికొలినవానియొక్కయు నని యర్థము. నెమలిపింఛము విప్పుచున్నదని భావము. ఇక్కడ వ్యుత్క్రమము. దరిడాయు=దాపునఁ జేరునట్టి, జడాత్ములకుఁ=మందమతులకని యర్థము, జల మాత్మయందుఁ గలిగియున్నదని భావము. (లడయోరభేదః,) ఎవ్వినిల్కడల్=స్థిరభాగములెక్కడివి, అనఁగా మందమతులకు స్థిరచిత్తములు లేవనుట. అనఁగా ఆస్త్రీయొక్క కొప్పు మేఘమునకంటె నతిశయమయిన నీలకాంతిగలిగి నెమలిపింఛమువలె విప్పుగలిగియున్నదని భావము. అలంకారము. హేతూత్ప్రేక్ష. అర్థాంతరన్యాసము. సమాసోక్తి.

తా. జడాత్మ యగు మొగులు నీలకంధరము. అభ్రమను పేరుగలవారితో నలరి యాచెలువ వేనలిని గెలువనెంచి కడ కోడిపోయి నామరూపములు కోలుపోయి కొండలపాలయ్యెను. వదరుబోతులను పురివిచ్చువారిని తోడ్పాటుగొను జడాత్ముల కపజయము సహజము.

సీ. కన్నె పాదము లజుఁ ♦ గన్న మేటికి నైన బాలజంఘలు వర♦శాలి కైనఁ
బూఁబోఁడిజఘనంబు ♦ భూరివేదికి నైనఁ బొలఁతిపొక్కిలి సర♦సులకు నైన
సతికౌను సర్వజ్ఞ♦మతి కైన నతివచన్నవ ప్రసన్నాదిత్య♦కవుల కైన
రమణినెమ్మోము పూ♦ర్ణకళానిధికి నైన వనితవేనలి ఫణి♦స్వామి కైన

తే. గుణము లన్నియును గ్రహింప • గోచరింప
వనిన మముబోంట్లకు నుతింప • నలవి యగునె
కువలయాధీశ నీవు గ•న్గొంటివేని
చెలువచెలు వాత్మఁ బాయక • నిలుచునేమొ. 51

కన్నెపాదములు=ఆకన్యకయొక్క యడుగులు, అజుఁగన్నమేటికి నైనన్ = బ్రహ్మనుగన్న విష్ణుమూర్తికైన ననియర్థము. పద్మమునకయిననని భావము. బాలజంఘలు=ఆస్త్రీయొక్క పిక్కలు, వరశాలికైనన్=వరములచేత నొప్పుచున్నవాని కయినను, అనఁగా వరములుపడసినవానికైన ననియర్థము. వర=శ్రేష్ఠమయిన, శాలికిన్=వరిపొట్టకైన నని భావము. పూఁబోఁడి జఘనంబు=ఆస్త్రీయొక్క కటిపురోభాగము, భూరివేదికి నయినన్=మిక్కిలి తెలిసినవానికైన ననియర్థము, సువర్ణమయమయిన వేదికకైనప్పటికి ననిభావము. పొలఁతిపొక్కిలి = ఆస్త్రీనాభి, సరసులకునయినన్ = శృంగారరసయుక్తులకైన నని యర్థము. సరోవరములకయిన నని భావము. సతికౌను = ఆవనితయొక్కనడుము, సర్వజ్ఞమతికైనన్=సర్వజ్ఞుఁడయిన శివునియొక్క బుద్ధికయిన నని యర్థము. ఆకాశమునకయిన నని భావము. అతివచన్గవ=ఆస్త్రీయొక్క స్తనద్వయము, ప్రసన్నాదిత్యకవులకయిన = ప్రసన్నులయిన దేవతలుగల కవులకయిన నని యర్థము. ('కే జలే వయః పక్షిణః' అనెడు వ్యుత్పత్తిచేత) కవులనఁగా ఃలపక్షులు ప్రసన్నుఁడయిన సూర్యుఁడుగల కవులు చక్రవాకములు గనుక చక్రవాకములకైనప్ప ికి నని భావము. రమణిమెమ్మోము= ఆ సుందరియొక్క సుందరమయినముఖము, పూర్ణకళానిధికి నయి న్=సంపూర్ణవిద్యానిధికైన నని యర్థము. సంపూర్ణచంద్రునకైన నని భావము. వనితవేనలి=ఆస్త్రీ యొక్కజడ, ఫణిస్వామి కయినన్ = శేషునకయిన నని యర్థము, సర్పశ్రేష్ఠునకయిన నని భావము. ుణములన్నియును గ్రహింపగోచరింపవు = అనఁగా నిక్కడ పాదములు మొదలైనవి అజుఁగన్నమేటి మొదలయినవారికి గుణములన్నియును గ్రహింప గోచరింపవని యన్వయము. పాదములు మొద యినవి విష్ణువు మొదలయినవారికి గుణములనన్నిటిని దెలిసికొనుటకు గోచరించవని యర్థము, పద్మ ు మొదలయినవానికి గుణములనన్నిటిని స్వీకరించుటకు గోచరించవని భావము.

అనినన్=చెప్పుచుండఁగా, మముబోంట్లకు నుతింప నలవియగునె = మావంటివారికి స్తోత్రము ేయుటకు శక్యమౌనా, అనఁగా నలవిగాదనుట. కువలయాధీశ=ఓయి వసుమహారాజా, నీవు గన్గొం వేని=నీవు చూచితివేని, చెలువ చెలువు = ఆస్త్రీయొక్క చక్కఁదనమును, ఆత్మఁబాయక నిలుచు ెమొ=అంతఃకరణమున నెడఁబాయక నిలిచియుండునేమొ, అనఁగా నీవుచూచి తీరవలెఁగాని నేను చక్కఁదనమును కొనియాడను శక్తుఁడను గానని భావము. ఆకాంతచెలువము లోకోత్తరమగుటచే ొక్కొక్కయవయవము నొక్కొక్క వేలుపు వర్ణింపలేకున్నాఁడు. ఒక్కొక్కలోకోత్తరవస్తు ామె యవయవసౌందర్యమును బోలఁజాలకున్నది. కావున నాబోంట్లకు పొగడనలవికాదని యాశ ంము. అలంకా - అర్థాపత్తి - ఉపమాధ్వని.

తా. ఆచెలువపాదములు తామరపూలను, పిక్కలు వరిపొట్టలను, జఘనము అరుగును, పొక్కిలి ుస్సులను, నడుము ఆకాశమును, చనుగవ చక్రవాకములను, ముఖము చంద్రుని పెన్నెఱి శేషుని ంచియున్నది. ఆకాంతచక్కదనము శివుఁడు బ్రహ్మ శేషువు మొదలగు వేలుపులే పొగడఁజాలరు. ప్రకాశించినచో చిత్తమునందు హత్తుకొనునేమొ.

మ. కమనీయాకృతి యోగ్యకీర్తనములం • గన్పట్టునాశ్యామ యా
సుమబాణాంబక యాయమూల్యమణి యా•చొక్కంపుపూబంతి యా
సుమనోవల్లరి యాసుధాసరసి యా•సొంపొందుడాల్దీవి యా
కొమరుంబ్రాయపురంభ యాచిగురుటా•కుంబోఁడి నీకే తగున్. 52

కమనీయ=సుందరమయిన, ఆకృతియోగ్యకీర్తనములన్=అవయవయోగ్యకీర్తనములతోను, మస్తకాది పాదపర్యంతావయవయోగ్య కీర్తనములతోను అని యర్థము. లేక అవయవయోగ్యమైన శ్యామాదిపదములచేతఁ జేయఁబడిన స్వవిషయకస్తుతులతోడను, కన్పట్టు = కనుపడుచున్న, ఇక్కడ శ్యామాదిపదములకు స్త్రీపరముగాను తత్కర్బర్యా ద్యవయవపరముగాను అర్థము చెప్పవలెను. ఆశ్యామ = ఆయౌవనమధ్యస్థురాలును, లేక శ్యామ యనఁగా ప్రేంకణపుతీఁగెయును గనుక ప్రేంకణపుతీఁగెవలె నున్నట్టిదియును; (ని. 'శ్యామాతు మహిళాహ్వయా' అని అమరము.) ఆసుమ బాణాంబకపదము మొదలుకొని రంభాపదము తుదిగానుండెడి ఉపమానపదములచేత నుపమేయ మయిన స్త్రీలక్షిత యగుచున్నది గనుక అభేదరూపాతిశయోక్త్యలంకారము. ఆసుమబాణ=ఆమన్మథునియొక్క, అంబక=బాణములవంటి కన్నులుగలదియును, ఆ అమూల్య=విలువలేని, మణి=పద్మరాగమణివంటి అధరోష్ఠముగలదియును, ఆచొక్కంపుపూబంతి = ఆసుందరమయిన పూలబంతుల వంటి కుచములుగలది, ఆసుమనోవల్లరి=ఆపూఁదీఁగెలవంటి బాహువులు గలదియును, ఆసుధాసరసి =ఆ అమృతసరోవరమువంటి నాభిగలదియును, ఆసొంపొందుడాల్దీవి = ఆచక్కనౌచున్న కాంతిగల తిన్నెలవంటి పిఱుఁదులుగలదియును, ఆకొమరుంబ్రాయపురంభ = ఆతరుణవయస్సుగల రంభలవంటి అనఁగా నరఁటిబోదెలవంటి తొడలు గలదియునని యర్థము. ఇదియునుంగాక అమూల్యమణివంటి దియు, చొక్కంపుపూబంతివంటిదియు, సుమనోవల్లరివంటిదియు, సుధాసరసివంటిదియు, సొం పొందుడాల్దీవివంటిదియు, కొమరుంబ్రాయపురంభవంటిదియు, అని అవయవపరముగాను చెప్పవలెను. ఆచిగురుటాకుంబోఁడి = ఆచిగురువంటి మార్దవము గలదియును, ఇక్కడ పల్లవసౌందర్యయుక్తమయిన పాదములు గలదియునని చెప్పవలెను. నీకేతగున్ = ఈచెప్పఁబడిన సౌందర్యము గల స్త్రీ నీకే తగును, అనఁగా ఆసుందరికి ఇతరులు తగరని భావము.

శ్యామాలక్షణము-

శ్లో. శీతే సుఖోష్ణసర్వాంగీ గ్రీష్మేతు సుఖశీతలా
తప్తకాంచనవర్ణాభా సా స్త్రీ శ్యామేతికథ్యతే.

ఇందు అవయవములనుబట్టి యవయవికి కమనీయాకృతియోగ్యకీర్తనములు చేర్కొనఁబడెను. ఇటులనుటచే నొక్కొక్కవిశేషణ మొక్కొక్కరీతిగా నవయవిపరముగ సరిపడును. పూబంతి యన్నచోఁ జనుగవ వల్లరి యన్నచో బాహులతలు సుధాసరసియన్నచోఁ బొక్కిలి యిటులె యవయవపరముగా గ్రాహ్యము. అలం. అభేదరూపకాతిశయోక్తి.

తా. చక్కదనముల కుప్పయగు నాపాలంతి సర్వవిధముల నీకేతగియున్నది.

తే. చిత్తజాకారయాచెల్వ• చెలులచెల్వ,ములవియె నుతింప వారువా•మాటవలన
గలికిచూపులునవద్య•గతులుబొరయఁ, గదిసినసురాహిరాజన్య•కన్యలొక్కఁ

చిత్తజాకార=మన్మథునివంటి రూపముగల వసుమహారాజా, ఆచెల్వచెలులచెల్వము = ఆస్త్రీ యొక్క చెలికత్తియల చక్కఁదనము, అలవియె నుతింపన్=నుతిసేయుటకు శక్యమా, అనఁగా శక్యము గాదనుట. ఏమనిన, వారు=ఆచెలికత్తెలు, వామాక్షివలనన్=సుందరమయిన నేత్రములుగల ఆవనితవలన, కలికిచూపులును = మనోహరములయిన బెళుకుచూపులను, అనవద్యగతులు = తొట్రుపాటులేని నడకలను, బొరయ=నేర్చుకొనుకొఱకు, కదిసిన=కదియవచ్చియున్న, సుర=దేవతలయొక్కయు, అహి=పన్నగులయొక్కయు, కన్యలొక్కొ = కన్నెపడుచు లయ్యుందురేమో, అని క్రమాలంకారము. అనఁగా దేవతాకన్యలు ఱెప్పపాటులేని చూపులు గలవారును నాగకన్యలు పాదప్రచారములు లేనివారును గనుక దేవతాకన్యలు ఱెప్ప లల్లార్చెడు చూపులను నాగకన్యలు పాదములచేత నడిచెడునడకలను ఆస్త్రీవలన నేర్చుకొనవలయు నని వచ్చిన దేవ నాగ కన్యలుగాని సాధారణపు మానవకన్యలు గారుసుమా యని భావము. అలం. ఉత్ప్రేక్ష.

చూపునిలుకడగల వేలుపుకాంతలనుగూడ నాచెలువ కడకంటిచూపుల నేర్చుకొనుటకు శిష్యురాండ్రనుగా బరిగ్రహించుట యోరచూపుల పొంకమును, నడకయెఱుంగని చిలువజవరాండ్రనడల నభ్యసింపఁజేకొనుట విలాసమందయానము సూచించును. దీనిచే నాచెలువ వేల్పుచెలువల నాగలోకకామినుల మించెనని భావము.

శా. ఆలావణ్యవతీమణుల్ గొలువఁగా • నాలేమ యాకోనలో
నాలీలాభవనంబులో ననఘకం•ఠాల ప్తిసౌభాగ్యముల్
వ్యాలోలాంగుళిసంజ్ఞచేఁ గఱపు రే•వన్ వీణఁ బల్కించుచున్
యాలాపంబె గిరిం దరీముఖర మై • యాలింపఁగా నయ్యెడిన్. 54

ఆలావణ్యవతీమణు ల్గొలువఁగాన్ = ఆట్టిస్త్రీరత్నములు సేవించఁగాను, ఆలేమ = ఆస్త్రీ, ఆకోనలోన్=పూర్వమందుఁజెప్పఁబడిన ఆకోనలోను, ఆలీలాభవనంబులోన్ = ఆక్రీడాగృహాములోపల, అనఘ=నిష్కల్మషములైన, కంఠాలప్తి = గాత్రసంగతులయొక్క, సౌభాగ్యములు=సౌష్ఠవములను, వ్యాలోల=కదలుచున్న, అంగుళి=వ్రేళ్ళయొక్క, సంజ్ఞచేన్=సైగచేత, కఱపురేవన్ = నేర్పుచున్నదో యన్నట్టులుగానే, వీణఁబల్కించు = వీణయందు బలికించుచున్న, ఆయాలాపంబె= రాగసంచారమె, గిరిన్ = ఈకోలాహల పర్వతమందు, దరీముఖరమై = గుహలయందు మారుమ్రోయుచున్నదై, ఆలింపఁగా నయ్యెడిన్=వినవచ్చుచున్నది. చెప్పినంతన గ్రహించునెడ బోధించుటలో శ్రమపడ నవసరముండదుగాననే అంగుళిసంజ్ఞచేబోధింప వీలుకలిగినది. వీణతంతులపైఁగల శ్లిష్ట గాత్రసంగతులు నేరుపుచున్నటు లున్నవనుట.

తా. సుందరాంగులు పెక్కండ్రు కొలిచియుండఁ గొండలోయలోని విలాసమందిరమునందు ఆసుందరి వీణకు సంగీతవిద్యగాత్రమాధుర్యము బోధించునటుల వీణవాయించు చున్నది. ఆరాగసంచారమె గుహల మాఱుమ్రోగి వినఁబడుచున్నది.

ఉ. స్వైరవిహారధీర లగు•సారసలోచన లున్నచోటికిన్
భోరున లాతివారు చొరఁ•బూనినచో రసభంగ మంచు నేఁ
జేరక పువ్వుఁదీవియల•చెంతనె నిల్చి లతాంగిరూపు క
న్నారఁగఁ జూచి వచ్చితి న•వాంబురుహాంబక నీకుఁ దెల్పగన్. 55

స్వైరవిహార = స్వేచ్ఛావిహారమందు, ధీరలగు = ప్రౌఢలైన, సారసలోచనలు = స్త్రీలు, ఉన్నచోటికిన్ = ఉన్నస్థలమునకు, భోరున = హఠాత్తుగాను, లాతివారు = అన్యులు, చొరఁబూనిన చోన్ = చొచ్చిపోఁ జూచినయెడల, రసభంగమంచున్ = అసారస్యముగా నుండునని, నేఁజేరక = నేను వారియెదుటికిఁబోక, పువ్వుదీవియలచెంతనె నిల్చి = పుష్పలతలయొక్క చాటుననే యుండి, లతాంగిరూపు = ఆ స్త్రీయొక్క చక్కఁదనము, కన్నారఁగఁ జూచి = నేత్రములకు తృప్తియౌనట్టుగాఁ జూచినవాఁడనై, నవ = నూతనమైన, అంబురుహ = తామరరేకులవంటి, అంబక = నేత్రములు గల వసుమహారాజా, నీకుఁదెల్పఁగన్ = నీకుఁ దెలియఁజేయునిమిత్తమై, వచ్చితిన్ = వచ్చితిని. ఇక్కడ సారసలోచనలున్నచోటికి, నవసారసలోచనుఁడవైన నీవు పోవుట యుక్తమని అను రూప్యము గ్రహింపవలెను, నవాంబురుహాంబక యన్నచోట నవమన్మథుఁడనియును విచారించవలెను. రూపు అనెడు పదము ఉకారాంతము. (ఇందుకు,శ్లో. 'ధూర్తమూర్ఖా నీచవృద్ధావు దన్తావపి సమ్మతౌ, ఉత్వేనైవ భవత్యస్యే ప్రయోగస్తత్ర కారణమ్.' అని అథర్వణవచనము.)

వారు సారసలోచనలు. వారితోఁగలిసిమెలసియుంటకు నవసారసలోచనుఁడవు మన్మథాకారుఁడవగు నీవు తగుదువు. నేను లాతినిగాన చాటుననుండి చూచితినని భావము. ఆటనున్న చెలువలు సారసలోచనలు. లాతి నేనేగిన రసభంగమగును. అనఁగా రసశబ్ద మట లోపించుటచే సాలోచన లగుదురు. పరునిజూచి యాలోచనామగ్నులయ్యెదరు. కావునఁ గార్యభంగమగునని మరలితినని సాదస్యము. ఇది శబ్దచిత్రము. అలం. కావ్యలింగము. పరికరాంకురము.

తా. జవరాండ్రు స్వేచ్ఛావిహారములు చేయుతరి నటకుఁ గ్రొత్తవారు పోఁదగదు. పోయిరేని రసభంగమగునుగావున నే నటకుఁజేరక పూవుఁదీఁగలచాటుననుండి యాచెలువ చెలువము చూచి నీకుఁ జెప్పవచ్చితిని.

చ. అని చెలి విన్నవించుటయు • నాహితవాక్యము మున్ను విన్నయ
న్నినదముకన్నఁ దిన్న నయి • నీరజలోచన యున్నకోనకుం
జనఁ దివిరింపఁ దత్ప్రియవ•చఃస్థితికన్న విరాళి నించె న
జ్జనపతికిన్ మనోజభుజ•చాపలతాగుణగుంజితార్భటుల్. 56

అని చెలి విన్నవించుటయును = పైనిఁ జెప్పఁబడినప్రకారముగా ప్రియసఖుఁడు విజ్ఞాపనము సేయఁగాను, ఆహితవాక్యము = ఆప్రియవచనము, మున్నువిన్న = మునుపువిన్నట్టి, అన్నినదముకన్నన్ = ఆ సంగీతనాదముకంటె, తిన్ననయి = చక్కనై, నీరజలోచనయున్న కోనకున్ = స్త్రీయున్నకోనకు, చనన్ = పోవునిమిత్తముగాను, తివిరింపన్ = తీవరపెట్టుచుండఁగా, తత్ప్రియవచస్థితికన్నన్ = ఆప్రియసఖుని వాక్యసంగతికంటె, మనోజ = మన్మథునియొక్క, భుజ = బాహువునందలి, చాపలత = తీఁగెవంటిధనుస్సుయొక్క, గుణ = నారియొక్క, గుంజిత = మ్రోఁతయొక్క, ఆర్భటులు = ఆడంబరములు, అజ్జనపతికిన్ = ఆవసురాజునకు, విరాళినించెన్ = విరహమును పూర్ణీభవింపఁజేసెను. ఇక్కడ మధుపఝుంకారములను మన్మథశింజినీటంకారములుగాఁ జెప్పినాఁడు.

హంసముఖమున విన నలునెడ దమయంతి కనురాగోదయమైనట్లు కృష్ణునకు వినికిడివలన రుక్మిణిపై ననురాగోదయమైనటుల వసురాజునకు నాయికయెడ ననురాగోదయము వినికిడివలన నయ్యెను.

" యత్ప్రేమసంగమాత్పూర్వం దర్శనశ్రవణోద్భవం
పూర్వానురాగ స్సజ్ఞేయ శ్శ్రవణం తద్గుణశ్రుతిః
ప్రత్యక్షచిత్రస్వప్నాదౌ దర్శనం దర్శన మ్మతం"

అను నాలంకారికసూక్తివలన దర్శనము జనించినటుల గుణాకర్ణనమువలన సైత మనురాగోదయ మగునని వ్యక్తమగుచున్నది. చెలియగీతమె మనోహరమైనది. అంతకంటె నాయమసౌందర్యవర్ణనము మనోహరముగనుండెను. అంతకెక్కుడుగఁ దుమ్మెదలమ్రోఁతలు మనోహరముగనుండి విరాళినించెను. అనఁగాఁ జెలువచెలువముగూర్చి విన్నంతన మన్మథుఁడు విల్లెక్కుపెట్టి వసురాజును లోఁబఱచికొనెనని భావము.

తే. కిన్నరవిహంగయుగళిచేఁ ◆ మున్ను విన్న, సన్నుతాసన్నశుభదప్ర◆సన్నఫణితి
మదికిసరిదాకముదమునఁ◆బొదలి మేది, నీపతిహితాగ్రణినిత్రో◆వఁజూపుమనుడు.

కిన్నరవిహంగ యుగళిచేన్=కిన్నరపక్షి మిథునముచేత, మున్నువిన్న = మునుపు ఆకర్ణించిన, సన్నుత=స్తోత్రముచేయఁబడిన, ఆసన్నశుభద=సన్నిహితశుభము నిచ్చునట్టి, ప్రసన్న=స్వచ్ఛమయిన, ఫణితి=వాక్యరచన, మదికిన్=తనమనస్సునకు, సరిదాకన్=తార్కాణకాఁగాను, ముదమునఁ బొదలి=సంతోషముచేత పొదలుకాఁడి, మేదినీపతి=వసురాజు, హితాగ్రణిని=హితులలో శ్రేష్ఠుఁడయిననర్మసఖుని, త్రోవఁజూపు మనుడు=మార్గముచూపించు మని పలుకఁగాను, ఇది ముందరి కన్వయము.

తా. తొలుత రాజు కిన్నరవిహంగముల యఱపువలన గ్రహించిన యాసన్నశుభము హృదయమునకు స్ఫురింప నానందించి చెలిమికానిని ఆచెలువ లున్నచోటునకుఁ ద్రోవఁజూపు మనెను.

సీ. ఈఱాలఁ బోరాదు ◆ హేరాళము జవాది యీరాలనడుచక్కి ◆ నేగ వలయు
నాకాన నేకాల ◆ మడరుఁ దేనియవాన లాకాన నేర్పున ◆ నరుగ వలయు
నీవంక నేవంక ◆ నెనసినతుహినాంబు లీవంకఁ బూఁదెప్ప ◆ నీఁద వలయు
నామూలనునుమూల ◆ ఱామొత్తములచఱు లామూలముగఁ దీవ ◆ లంటవలయు
తే. నధిప యిదిమానికపుఁగోన ◆ యది లతాంత,రజము సాగువ యిదికప్పు ◆ రంపుటనఁటి
చప్పరం బలయదికాంత ◆ సదన మనుచు, నరపతికిఁ దెల్పె నరుగుచో ◆ నర్మసఖుఁడు.

ఈఱాలఁబోరాదు=ఱాలనఁగా శిలలు, ఈశిలలమీఁదుగాఁ బోఁగూడదు. ఎందువల్లననిన, హేరాళముజవాది=జవాది బహువిస్తారము, అనఁగా జవ్వాదిపిల్లులు ఆఱాళ్లమీఁద జవ్వాది నింపినందున దానిజిడ్డుచేత జారుచున్న వని భావము. ఇఁకనెటుపోవలెననిన, ఈరాలనడుచక్కి నేగవలయున్= ఈరాలనఁగా పొదలు, పొదలనడుముగాఁ బోవలెను. ఆకానన్=ఆ యడవియందు, తేనియవానలు=మకరందవర్షములు, ఏకాల మడరున్=ఎల్లకాలము నతిశయించుచుండును. కాఁబట్టి, ఆకానన్=ఆకులడ్డమగునట్టుగా, అరుగవలయున్=పోవలయును. ఈవంకన్=ఈపార్శ్వమందు, ఏవంకను=ఏదిక్కునను, ఎనసినతుహినాంబులు=కలియఁ బారియుండెడు మంచునీళ్లు, కాఁబట్టి, ఈవంకన్= ఈసెలయేరును, పూఁదెప్పన్=పువ్వులతెప్పచేత, ఈఁదవలయున్=దాఁటిపోవలెను. ఆమూలన్ = ఆకోణమందు, నును=నునుపుగలిగిన, మూలరామొత్తముల=వజ్రమణిసమూహమయములైన, చరులు= చరియలు, కాఁబట్టి, ఆమూలముగన్=మొదలంటుగా, తీవలంటవలయున్=తీఁగెలనవలంబించవలెను. అనఁగా తీఁగెలుపట్టుకొని దిగవలెననుట.

అధిప=రాజా, ఇది మానికపుఁగోన=ఇది మాణిక్యమయమైనకోన, అది=ఆకనుపించునదే, లతాంతరజము=పుష్పోడియొక్క, సారువ=మేరువ, అనఁగా బరువైనవస్తువులు పైకెక్కించుటకై యున్నతముగా మంటితోఁబోసిన మేరువకు సారువయని పేరు గనుక నిక్కడ పుష్పోడిదిన్నెయని తెలియవలెను. ఇది కప్పురంపుటనఁటిచప్పరంబు=ఇదే కర్పూరపరఁటిచవికె, అల్లయది=అదిగో ఆ కానవచ్చునదె, కాంతసదనము=నేను చూచిన స్త్రీయొక్క గృహము, అనుచున్=అని చెప్పచును, అరుగుచోన్=పోవుచున్నసమయమందు, నర్మసఖుఁడు = ప్రియసఖుఁడు, నరపతికిఁ దెల్పెన్=వసురాజునకు విశదపఱచెను. శబ్దాలంకారము వృత్త్యనుప్రాసము.

తా. పోవునెడ రాజుతో మంత్రి యిట్లనెను. రాజా! యిచట శిలలపై జవ్వాది పేరియున్నది, కాలుజారును. అదె తేనియవాన, మెల్లఁగవగా నడువవలయును. అవి మంచునీటిసెలయేళ్లు, పూవుఁదెప్పలతో నీదవలయును. ఇవి నునుపుబాఱినవజ్రపుఁజఱియలు, దీవలంటిపై నడువవలయును. ఇది మణిలోయ. అదియె యరఁటిచవికె. అదియె కాంతాసదనము.

సీ. ప్రకటితోన్మేష కీ♦పద్మిని కినకరకౌతుకావాప్తి వే♦గనె ఘటించుఁ
దతవయోవిభవ కీ♦లతకూన కాసన్నపున్నాగవిహృతి గొ♦బ్బున నెయబ్బు
విలసితామోద కీ♦కలికికొమ్మకు రాజసారంగయోగ మి♦క్షణమ కల్గు
భువనాభిసంధ్య కీ♦నవరసరసికి మానసప్రియలీ♦తోన దొరకు
తే. ననుచుఁ దపలోన లేఁదోఁట♦ లరయుమగువ
లాడు నుడువులు విన నయ్యె♦ నని యెఱింగి
నృప యుపశ్రుతి వింటివే♦ యిచట ననుచు
నాప్తుఁ డెఱిఁగింప హర్షించె♦ నధిపుఁ డపుడు. 59

ప్రకటిత=తెలియంబడుచున్న, ఉన్మేషకున్ = పరువముగలిగిన, ఈపద్మినికిన్ = ఈపద్మలతకు, ఇనకర= సూర్యకిరణములచేతనైన, కౌతుక = హర్షముయొక్క, అవాప్తి=ప్రాప్తి, వేగనె = ప్రభాతసమయము కాఁగానే, ఘటించున్=చేకూడుననియర్థము. ప్రకటితోన్మేషకున్=ప్రకటితోల్లాసయైన, ఈపద్మినికిన్ = ఈపద్మినీజాతిస్త్రీకి, ఇనకర=రాజహస్తముయొక్క, కౌతుకావాప్తి=అభిలాషప్రయుక్తమైన ప్రాప్తి, వేగనెఘటించున్=శీఘ్రముగానే పొందుచున్నదని యర్థాంతరము. (ని. 'కౌతుకం త్వభిలాషే స్యా దుత్సవే నర్మహర్షయోః, పరంపరాసమాయాతమఙ్గళే చ కుతూహలే' అని విశ్వము.) వేగన నెస పదము, కుశాదిగణపఠితముగనుక ముపర్ణలోపముఁ జేసినాఁడు. తత=విస్తారమైన, వయః=శుకశారికాదిపక్షులయొక్క, విభవకున్=వైభవముగలిగిన, ఈలతకూనకున్ = ఈలేఁతతీఁగెకు, ఆసన్న = సమీపమందున్న, పున్నాగ = పొన్నచెట్టునందలి, విహృత=విహారము, అనఁగా పొన్నచెట్టు నల్లుకొనుట, గొబ్బున నెయబ్బున్=త్వరితముగా నేలభించుననియర్థము. ని. 'పున్నాగే పురుష స్తుఙ్గః కేసరో దేవవల్లభః' అని అమరము. తతమైనయౌవనవిభవముగల యీకన్యకు సమీపగతుఁడైన పురుషునియొక్క విహారము త్వరగానే లభించునని యర్థాంతరము. విలసిత=ఒప్పుచున్న, ఆమోదకున్=పరిమళముగల, ఈకలికికొమ్మకున్=ఈసుందరమైనవృక్షశాఖకు, రాజసారంగయోగము=రాజభృంగసంయోగము, ఈక్షణమ కల్గున్=ఇప్పుడే కలుగుచున్నదని యర్థము. విలసితమైన సంతోషముగల యీ

చక్కని స్త్రీకి రాజకుంజరునియొక్క అనఁగా రాజశ్రేష్ఠునియొక్క సంబంధ మీక్షణమందే కలుగుచున్న దని యర్థాంతరము. భువన=ఉదకముచేత, అభినంద్యకున్=మిక్కిలిస్తోత్రము చేయఁదగిన, ఈనవరసస రసికిన్=ఈనూతనమైన మాధుర్యరసముగల సరోవరమునకు, మానసప్రియ=హంసలయొక్క, లీల=క్రీడ, తోనదొరకున్=వెంటనే కలుగునని యర్థము. జగదభినంద్యమయిన శృంగారసరసికి మనోవల్లభక్రీడ వెంబడిగానే దొరకునని యర్థాంతరము. ని. 'భువనం విష్టపే పిస్యా త్సలిలే గగనే' అని మే.

అనుచున్=ఇట్లుపలుకుచు, తమలోనన్=పరస్పరము, లేఁదోఁటలరయుమగువలు=లేఁతతోఁటలను బరిశీలించుచున్నస్త్రీలు, ఆడునుడువులు వినవయ్యె నని యెఱింగి=ఆడుకొనుమాటలు వినఁబడెనని తెలిసికొన్నవాఁడై, ఆప్తుఁడు=ప్రియసఖుఁడు, నృప=రాజా, ఇచటన్=ఈప్రదేశమున, ఉపశ్రుతి వింటివే=ఉపశ్రుతివాక్యంబు విన్నావుగదా? ఉపశ్రుతి యనఁగా నొక కార్యార్థమై పోవునపు డేనియు మాటాడునపు డేనియుఁ దదనుకూలముగా వినవచ్చునట్టిమాటల సముదాయము. అనుచున్=అనిపలుకుచును, ఎఱిఁగింపన్=తెలియఁజెప్పఁగా, హర్షించి=సంతోషించి, అధిపుఁడు=ఆవసుమహారాజు, అపుడు=ఆ సమయమందు, ఈపద్యమునకుఁ బైపద్యంబుతో నన్వయము.

ఇందుఁ జెలికత్తియల సంభాషణము భావిశుభసూచనముగాఁ జెప్పఁబడెను. తోఁటనరయుమగువలు తమలోఁదామనుకొనుమాటలు తమకుఁ గలసివచ్చుటయే యుపశ్రుతి. మన్మథచాపగుణగుంజితార్భటులచే వివశుఁడైయుంటచే రాజా ప్రసంగభావము తానుగ్రహింపలేఁడయ్యెను. కావుననే మంత్రి రసికావతంస మగురాజునకు నెఱుఁగఁజేయవలసివచ్చినది.

క. కుతుకమున నచలసుత యగు, సతిఁ గనఁజను రాజమౌళిచాడ్పున నపు డా
క్షితిపతి సతిఁ జూచుతమిన్, హితసూచితసరణిఁ గాన కేఁతెంచు నెడన్. 60

కుతుకమునన్=సంతోషముచేత, అచలసుతయగు=హిమవత్పర్వతపుత్త్రియైన, సతిన్=యువతిని అనఁగాఁ బార్వతీదేవిని, కనఁజను=చూచునిమిత్తమైపోవునట్టి, రాజమౌళిచాడ్పునన్=చంద్రశేఖరుఁడైన హరునివలె, అనఁగా హరుఁడో యన్నట్టుగానే, ఇక్కడ అచలసుతయగు సతియనఁగాఁ గోలాహలపర్వత పుత్త్రియైన గిరికాదేవి యనియును, రాజమౌళియనఁగా వసురాజనియును అర్థాంతరము. ఇక్కడ నవీనమతమందు ఉపమాలంకారము. రాజమౌళిత్వము సమానధర్మమని గ్రహించవలెను. రాజమౌళిపదము ఉపమానవాచకంబును రాజమౌళిత్వరూప సమానధర్మవాచకంబును నౌచున్నదిగనుక నుభయథా చెప్పవలెను. అచలసుతాదిపదములకు సమానధర్మవాచకత్వముస్పష్టమే. ప్రాచీనులు విశేషణశ్లిష్టతయందు శబ్దమాత్రసాధర్మ్య మంగీకరించి ధర్మసామ్యము లేదుగనుక శ్లేషాలంకార మనిచెప్పిరి. అపుడు=ఆ సమయమందు, ఆక్షితిపతి=ఆవసురాజు, సతిఁజూచుతమిన్=గిరికాదేవిని జూచెడు నభిలాషముచేత, హిత=నర్మసఖునిచేత, సూచిత=తెలుపఁబడిన, సరణిన్=మార్గముననే, కోనకేఁతెంచు నెడన్=కోనకుం జేరవచ్చెడు సమయమందు, ముందరిపద్యముతో నన్వయము.

ఈపద్యము బొమ్మదొరగారి వ్యాఖ్యావసుచరిత్రమునఁగానరాదనిరి. (౬౩వ పద్యముగఁ గలదు) సోమకవియు వ్యాఖ్యగావించియే యున్నాఁడు కావునఁ బ్రక్షిప్తమన వీలులేదు. ఇందు గిరికకచలసుతత్వాదులు శ్లేషచే స్థాపింపఁబడి యుండుటచేఁ గథాపటుత్వమునకు రామరాజభూషణుని వచనాసంప్ర

దాయమునకు భిన్నముగావునఁ గథారామణీయకమును గుందించుచున్నదనుట సత్యము. ప్రత్యంతరములలోఁ బరిశీలించి పద్యము ప్రక్షిప్తమేమొ తెలిసికొనవలసియున్నది.

తే. తొలుదొలుత భద్రకుంభముల్ ♦ దోఁపఁ బిదపఁ
బచ్చతామానికపునిచ్చఁ ♦ బచ్చతోర
ణంబు వొడసూప వరుసఁ గ♦న్యాగృహంబు
నరపతి కమూల్యకల్యాణ♦గరిమఁ దెలిపె. 61

తొలుదొలుతన్=ముందుముందుగా, భద్రకుంభముల్దోఁపన్=పూర్ణకలశంబులు గనుపడఁగా ననియర్థము. బంగారుకలశంబు లని భావము. (ని. 'భద్రస్స్యాన్మఙ్గళే హేమ్ని మస్తకే కరణాన్తరే' అని వి.) పిదపన్=తర్వాత, పచ్చతామానికపునిచ్చఁబచ్చతోరణంబు వొడసూపన్=పచ్చతోరణంబు గనుపింపఁగాననియర్థము. మరకతమణిరైన బహిర్ద్వారమనిభావము. (ని. 'తోరణోఽస్త్రీ బహిర్ద్వారమ్' అని అ.) 'వరుసన్=క్రమమంబుగా, కన్యాగృహంబు=ఆకన్యకయొక్క మందిరము, నరపతికిన్=వసురాజునకు, అమూల్య కల్యాణగరిమఁ దెలిపెన్ = అనర్ఘ్యమైన శుభాతిశయమును దెలియఁబఱిచెనని యర్థము. అనర్ఘ్యమయిన కాంచనాతిశయంబు నెఱింగించెనని భావము. ని. 'కల్యాణం మఙ్గళే స్వర్ణే' అని నానార్థరత్నమాల.

ఈపద్యమునందలి నిచ్చ యనుపద మన్వయమునఁ గలియకున్నది. నిచ్చ అవ్యయము. వికృతిని సమాసమధ్యగతమగుట పొసఁగదు. కవియాశయ మిట వ్యంగ్యము. తొలుత భద్రకుంభములు తోఁచె ననుటవలన మందిరాగ్రస్థాపితములగుటచేఁ గనఁబడెననియు మందిరము సమీపించినగాని పచ్చలతోరణము కనఁబడలేదనియు భావము. కళ్యాణము శుభమునకు వివాహమునకు సూచనము. కళ్యాణ మప్రయత్నలభ్యముగాన నమూల్యము.

అలం. శ్లేషము. అనుమానము.

శా. ఆలోఁ గాంచనమందిరంబు నవర♦త్నాలోక ముల్లోక మై
యాలోకోత్సవ మాచరింపఁ బతి డా♦యం బోయి ప్రాచీనపుం
జాలుందీవెలచాటున న్నిలిచి వా♦చాలాళిపక్షానిలా
లోలత్పల్లవజాలమార్గముల నా♦లోలాక్షి నీక్షించినన్. 62

ఆలోన్=అంతలోన, కాంచనమందిరంబు=సువర్ణమయమైన గృహముయొక్క, నవరత్న = నవవిధ రత్నములయొక్క, ఆలోక=ప్రకాశము, ఉల్లోకమై=లోకాతీతమై, ఆలోకోత్సవమాచరింపన్=నేత్రోత్సవము సేయఁగా, (ని. 'ఆలోకౌ దర్శనోద్యోతౌ' అని అ.) పతి=వసురాజు, డాయంబోయి = సమీపముగాఁబోయి, ప్రాచీనపుంజాలుందీవెలచాటునన్నిలిచి = ప్రాచీనమనఁగా నింటికిఁ జుట్టు వార నుండెడు కంచెకుఁ బేరు. (ని. 'ప్రాచీనం ప్రాన్తతోవృతిః' అని అ.) ప్రాచీన = అట్టి కంచెకోటసంబంధమైన చాల్పుగానున్న తీఁగెలయొక్క మరుగుననుండి, ఇక్కడఁ జా లనెడుపద ముకారాంతముగనుక సమాసమందు నుగాగమము వచ్చినది. (శ్లో. 'సరళే పరుషేచైవ సమాసే నుముతో భవేత్' అని యథర్వణవచము.) వాచాల = ఝుంకారధ్వనిసేయుచున్న, అళి=తుమ్మెదలయొక్క, పక్ష=ఱెక్కలవలనఁబుట్టిన, అనిల=వాయువుచేత, ఆలోలత్ = అంతటఁ జలించుచున్న, పల్లవ=చిగురుటాకులకెడు, జాలమార్గములన్=గవాక్షరంధ్రములనుండి, ఆ లోలాక్షిన్ = ఆగిరికా

దేవిని, ఈక్షించినన్=చూడఁగా అనఁగా గిరికాదేవిని వసుమహారాజు పొంచుండి చూచె నని భావము. ఈపద్యమునకు మూందరిపద్యముతో నన్వయము.

కంచెగానున్నతీవియలచాటుననున్న మందిరమందలి జవరాలు కానరాకుండ వలసినదె కాని తుమ్మెద ఱెక్కలచేఁ జివుళ్ళు కదలుటవలన దర్శింప వీలుచిక్కినది తుమ్మెదలఝుంకారములు వసురాజు రాకవలనఁ గలిగిన చప్పుడు మరుగుపఱచెను. తుమ్మెదలు అంతట చరించుటచేతఁ గంచెకు జాలమార్గము లేర్పడెననుట.

తా. అంతలో వసురాజు నవరత్నఖచితమై ప్రకాశమున కాటపట్టుగానున్న యాదివ్యమందిరమును జూచి కంచెచాటున నిలిచి తుమ్మెదలఱెక్కలచేఁ గదల్పఁబడు చివుళ్ళసందునుండి సతీమణిని సందర్శించెను.

చ. కనుఁగవ పూర్ణకామ మగుఁ • గన్నవకన్నను బూర్ణకామ మై
మన మతిచిత్రవృత్తి యగు•మానసవృత్తికి మున్న చిత్ర మై
తనువు రసోత్తరంగ మగుఁ • దత్తనువైఖరికన్న సంభ్రమం
బెనసి రసోత్తరంగ మగు • నీప్సిత మానగమానభేదికిన్. 63

ఆనగమానభేదికిన్=కోలాహలపర్వత గర్వభంగము చేసిన యావసురాజునకు, కనుఁగవ=నేత్రయుగళము, పూర్ణ=సంప్రాప్తమయిన, కామమగున్=మనోరథముగలది యగును, మనము=మనస్సు, కన్నవకన్నను=పూర్ణకామమయిన నేత్రయుగళమునకంటె మిక్కిలియును, పూర్ణకామమయి=సంప్రాప్తమనోరథమయి యని యర్థము పూర్ణుఁడయిన మన్మథుఁడుగలదై యని భావము. (శ్లో. 'కామః స్మరేఽభిలాషేచ' అని వి.) అతిచిత్రవృత్తియగున్=అత్యద్భుతవృత్తియగుననియర్థము. తనువు=శరీరమును, మానసవృత్తికిమున్న=అతిచిత్రవృత్తియయిన మనస్సుకంటెముందుగా, చిత్రమై=అత్యంతచిత్రవృత్తియయి యని యర్థము. చిత్రప్రతిమవలెఁ జేష్టారహితమయి యని భావము. (ని. 'చిత్రం స్యా దద్భు తాలేఖ్య తిలకేషు' అని వి.) రసోత్తరంగమగున్=రసమనఁగా స్వేదజలము, దానిచేత సాంద్రమగునని యర్థము. ఈప్సితము=అభిలాషము, తత్తనువైఖరికన్నన్=రసోత్తరంగమయిన యాశరీరమునకంటె మిక్కిలియును, సంభ్రమంబెనసి=తొట్రుపాటుఁ జెంది, రసోత్తరంగమగునని యర్థము. రసమనఁగా నిక్కడ ననురాగము. దానిచేత నతిశయించెనని భావము. (వి. 'శృఙ్గారముఖ్యమధురాది సువర్ణరేతో నిర్యాసరాగగరళద్రవపారదేషు, ఆస్వాదనధ్వని సుధాంబురసాఖ్యధాతుష్విష్టో రసోధరసనాధరణీరసాస్యాత్' అని నా.) అనఁగా గిరికాదేవిని జూడఁగానే వసురాజునకు నేత్రద్వయము పొందఁబడిన కోరిక గలదాయెననియును మనస్సు మన్మథాధీనమయి యద్భుతవ్యాపారయుక్తమాయె ననియును శరీరము చిత్రప్రతిమవలెఁ జేష్టారహితమయి స్వేదజలసాంద్రమాయె ననియును నభిలాషము తొందరపాటుఁ జెంది యనురాగాతిశయముతోఁ గూడినదాయె ననియును భావము. ఇటఁ జక్షుఃప్రీతి, మనస్సంగము, లోనగుననంగదశలు వివరింపఁబడెను. చక్షుఃప్రీతియనఁ దర్శనేచ్ఛ; రసగంగాధరమునందలి "తత్ర స్త్రీపుంసయోరన్యోన్యాలంబనః ప్రేమాఖ్యశ్చిత్తవృత్తివిశేషోరతిః స్థాయిభావః" అను వాక్యమువలన స్త్రీపురుషులకుఁ బరస్పరాలంబనమై ప్రేమయని చెప్పఁబడు చిత్తవృత్తివిశేషమురతి. అదిస్థాయిభావమగును. అనంగదశలు పదియని కొందఱు పండ్రెండని కొందఱు అలంకారికులు నిర్వచించియున్నారు. పదియనుపక్షమే బహుజనగణనీయము.

"చక్షుః ప్రీతి ర్మనస్సంగః సంకల్పోఽథ ప్రజాగరః
అరతిః సంజ్వరః కార్శ్యం లజ్జాత్యాగో భ్రమో మృతిః
దశావస్థా భవంత్యేతే విప్రలంభేఽభిలాషజే."

తా. ఆచెలువరూపు చూచినంతనఁ గనులకు దర్శనోత్సుకత్వము మెండయ్యెను. మనస్సు చిత్రవృత్తులకు నెలవయ్యెను. మేన స్వేదజలమూరెను. అన్నిటికంటె నతిశయముగా ననురాగము జనించి వసురాజును లోఁగొనెను.

మ. జననాథోత్తముఁ డింతిఁ జూడ ననిమేషత్వంబుఁ గాంక్షించు న
య్యనిమేషత్వము కాంతకాంతముఖచంద్రాసేవనానందవా
సనఁ బ్రాపించినఁ గోరు నప్పు డనిమేషస్వామిభావంబుఁ గ
న్గొన నెందున్ నృపు లుత్తరోత్తరపదానూనస్పృహాచంచలుల్. 64

జననాథోత్తముఁడు=వసురాజు, ఇంతిఁజూడన్=ఆగిరికాదేవిని చూచుటకు, అనిమేషత్వంబుఁ గాంక్షించున్=దేవత్వమును గోరునని యర్థము. ఱెప్పపాటులేకయుండుటను గోరునని భావము. అయ్యనిమేషత్వము=ఆదేవత్వమును, కాంత=సౌందర్యవతియయిన, కాంత=గిరికాదేవియొక్క, (శ్లో. 'కాన్తం చారౌ స్త్రీతు యోషి త్ప్రియయ్గా వృపలే పినా' అని నా.) ముఖ=వదనమనెడు, చంద్ర=చంద్రకళామృతముయొక్క, ఆసేవన=సమగ్రసేవనమువల్లనయిన, ఆనంద=సంతోషముయొక్క, వాసనన్=సంస్కారముచేత, ప్రాపించినన్=పొందఁగానని యర్థము. (శ్లో. 'ప్రథమాంపిబతే వహ్ని ర్ద్వితీయాంపిబతే రవిః' అను నిత్యాదివచనములవలన దేవతలకుఁ జంద్రకళామృతపానము స్వభావధర్మము.) గిరికాదేవిముఖము నత్యాదరముచేతఁ జూచుచుండుటవలన ఱెప్పపాటులేకయుండుట సిద్ధింపఁగా ననిభావము. అప్పుడు=ఆసమయమందు, అనిమేషస్వామిభావంబు=దేవాధిపతిత్వమును, అనఁగా నింద్రత్వమునని యర్థము. వేయికన్నులు గలిగియుండుట నని భావము. కోరును=కాంక్షించును, కన్గొనన్=విచారించిచూడఁగా, ఎందున్=ఎచ్చోటను, నృపులు=రాజులు, ఉత్తరోత్తరపద=అంతకంతకు హెచ్చైనస్థానములందలి, అనూన=అధికమయిన, స్పృహా=అపేక్షయందు, అచంచలుల్=చలింపనివారుగదా యని యర్థము. ఏమనిన, వసురాజు మనుజుఁడైయుండి ముందుగా దేవత్వముఁగోరి యది సిద్ధింపఁగానే యింద్రత్వముఁ గోరినాఁడు గనుక రాజు లంతకంతకు హెచ్చైనయధికారమునే కోరుచుందురనుట. (శ్లో. 'అసంతుష్టా ద్విజానష్టా స్సంతుష్టా ఇవ పార్థివాః, సలజ్జాగణికానష్టా నిర్లజ్జేవకులాఙ్గనా' అనియున్నది.) అనఁగా వసురాజు గిరికాదేవిని జూచునెడల ముందుగా ఱెప్పపాటులేని చూపులు గలుగుటను గోరి గిరికాముఖవీక్షణాత్యాదరముచేత నది సిద్ధింపఁగా నంతటఁ దనివితీరక వేయిగన్నులుగలుగుటను గోరెనని భావము. అలం. పరికరము. అర్థాంతరన్యాసము.

తా. ఆచెలువ చక్కఁదనము చూచుటకు ఱెప్పపాటు ఆటంకమగునేమొ యని వసురాజనిమేషత్వము కోరును. ఆచెలువమోము జాబిల్లినిసేవించుటచే ననిమేషత్వము సిద్ధింప నంతతోఁ దనిఃసనక నిలువెల్లకన్నులైన నాసుందరిరూపరేఖ లింకఁ దృప్తిదీఱఁగనవచ్చుఁగదాయని యనిమేషస్వామిభావము కోరెను. రాజులు అంతకంతకు హెచ్చగు పదవి కోరువారుగదా!

తే. కాంతపద మొంది యటయూరుఁ గ్రమ్మి కాంచి, సీమ నెనసి పయోధర శిఖరిదుర్గ
సంగతికి లాచు నృపదృష్టి చక్రశాస, నోన్నతస్థాన మపుడుగా యొదవుఁ దనకు.

నృపదృష్టి=వసురాజుచూపు, కాంతపద మొంది=గిరికయొక్క పాదమందుఁ జేరి యనియర్థము. రమ్యమయిన స్థానమును బొందియని యర్థాంతరము. అటయూరుఁ గ్రమ్మి=ఆపిమ్మట తొడ నావరించియని యర్థము. గ్రామము నాక్రమించి యని యర్థాంతరము. కాంచిసీమ నెనసి=కటిప్రదేశము గలిసికొని యని యర్థము. మేఖలాసీమ నెనసియని యర్థాంతరము. వెంటనే ముందర శిఖరిదుర్గమని చెప్పినాఁడు గనుకఁ గాంచీపదము మేఖలాశబ్దార్థకమని గ్రహింపవలయును. మేఖలయనఁగాఁ బర్వతనితంబము. (ని. 'మేఖలా ఖడ్గబన్ధే స్యాత్కాంచీ శైలనితంబయోః' అని వి.) పయోధరశిఖరిదుర్గసంగతికిన్=కుచగిరులయొక్క దుర్గమయిన సంగతికి, అనఁగాఁ బొంద శక్యముగాని సంగతికి, లాచున్=పెనఁగులాడుచున్నదియని యర్థము. మేఘయుక్తపర్వత దుర్గసంగతికి లాచుచున్నదని యర్థాంతరము. తనకున్=అనఁగా నృపదృష్టియయిన తనకు, అపుడుగా=అనఁగాఁ బయోధరశిఖరిదుర్గసంగతి గలిగినప్పటికిఁగదా, చక్రశాసన=చక్రవాక నిరాసకమయిన ఉన్నతస్థానము, కుచప్రదేశము అని యర్థము. రాష్ట్రప్రతిపాలకమయిన యున్నతస్థాన మని యర్థాంతరము. (ని. 'చక్రం చ యే జలావర్తే రథాఙ్గే రాష్ట్రసైన్యయోః, ఘటసాధనభేదేపి క్లీబే కోకేతు పుంస్యయమ్' అని నా.) ఒదవున్=లభించును అని యర్థాంతరము.

అనఁగా వసురాజుయొక్క దృష్టి ముందుగా గిరికాదేవిపాదములయందుఁ బ్రసరించి తర్వాతఁ దొడల నావరించి యాపిమ్మటఁ గటిప్రదేశమును గలిసికొని యక్కడనుండి గమింప శక్యముగాని కుచగిరులతోఁ గూడుకొనుటకుఁగా నధికప్రయత్నము సేయుచుండెనని తాత్పర్యము. అనఁగా నంతపర్యంతము నొకలాగున వచ్చినదై యక్కడనుండి కుచములు దాఁటి పోఁజాలకుండెననుట. అర్థాంతరమందలి భావము. ఎవఁడైన నొకానొకఁడు నిరాశ్రయముగా నున్నవాఁడై ముందుగాఁ గొంచెము యుక్తమయిన స్థలమును సంపాదించుకొని యాపిమ్మట నొకగ్రామ మాక్రమించుకొని యావెంబడి నొకసీమను, అనఁగాఁ దాలూకాను స్వవశము చేసికొని యక్కడనుండి పర్వతదుర్గము నవలంబించుటకుఁ దగిన యత్నము సేయుట యుక్తమని తెలియవలయును. అలం. శ్లేషమూలకమగు సమాసోక్తి.

మ. నిరతిన్ నాభిసురంగ మీఁగియు వళీ నిశ్రేణికన్ హత్తియు
న్వరరోమావళివల్లరీగుణము నంటం బ్రాకియుం దత్పయో
ధరదుర్గంబుల నాక్రమించె నచలేంద్రద్వేషిచూ పౌరసం
గరసామోదవినిద్రవృత్తికి నశక్యం బెద్దియుం గల్గునే. 66

అచలేంద్ర=పర్వతశ్రేష్ఠుఁడైన కోలాహలునికి, ద్వేషి=శత్రువైన, లేక (ని. 'అచలో ద్రిభువ్యచలా' నా.) అనియుండుటవలన నచలశబ్దము పర్వతమందును, అచలాశబ్దము భూమియందును వర్తించును గనుక అచలేంద్రులనఁగా భూమీంద్రులైన శత్రురాజులు, వారికి ద్వేషియైన వసురాజుయొక్క, చూపు=దృష్టి, నిరతిన్=అధికాసక్తిచేత, నాభిసురంగ మీఁగియున్=గిరికాదేవియొక్క పొక్కిలియనెడు సొరంగములో దూరియును, వళీ=ముత్తరులనెడు అనఁగా కడుపుమీఁద నుండెడు మూఁడుముడతలనెడు, నిశ్రేణికన్=నిచ్చెనను, (ని. 'నిశ్రేణి స్త్వధిరోహిణీ' అని అ.) హత్తియున్

=హత్తుకొనియును, పర=శ్రేష్ఠమయిన, రోమావళివల్లరీ=వల్లరియనఁగాఁ దీఁగవలెనున్న నూఁగారనెడు, గుణమును=లగ్గపట్టుత్రాడును, అంటంబ్రాకియుఁన్ = చివరముట్టనల్లుకొనియును, తత్=ఆగిరికయొక్క, పయోధర=కుచములనెడు, దుర్గంబులన్=పర్వతదుర్గములను, ఆక్రమించెన్=స్వవశముచేసికొనెను. చోద్య=ఆశ్చర్యము, సంగరస=సంభోగానురాగమందలి, ఆమోద=సంతోషము చేతనైన, వినిద్రవృత్తికిన్=నిద్రారహితవ్యాపారము గలవానికి, అనఁగా జాగరూకత గలవానికని యర్థము. సంగర=యుద్ధమందు, సామోదవినిద్రవృత్తికిన్=సంతోషయుక్తమైన జాగరూకతగల వానికని యర్థాంతరము. అశక్యంబెద్దియుం గల్గునే=శక్యముగానిపని యేదైననున్నదా, అనఁగా లేదనుట.

రాజుయొక్క దృష్టి సంభోగానురాగసమ్మోదముచేత హెచ్చరికగలదై గిరికాదేవియొక్క నాభీబిలములోఁ జొచ్చి వళిత్రయమును హత్తుకొని రోమావళివెంటఁ బ్రాకి కుచములమీఁదఁ బ్రసరించెనని యర్థము. అర్థాంతరమందలి భావము. ఎవఁడైన నొకఁడు యుద్ధమందలి యుత్సాహముతోఁ గూడిన జాగ్రత్తగలవాఁడై నేలసొరంగముఁ ద్రవ్వించి దానినుండి దూరిపోయియైనను లేక నిచ్చెనయొక్క సహాయముచే నెక్కియయినను లగ్గపట్టుత్రాళ్ళవెంటఁ బ్రాకి యయినను దుర్గము సాధించి యాక్రమించుకొనుట యుక్తము గదా. అలం. సమాసోక్తి. అర్థాంతరన్యాసము.

ఉ. ఆమనుజేంద్రుచూపు తిలకాంచితమై నెఱదావి చల్లు నా
రామముఖంబున న్నెరయ వ్రాలును హాస మరంద చిక్కణం
బై మెఱుఁగారుగండఫలకామృతభానుశిలాతలంబుల
న్వేమఱు జారి యూతఁ గొను నిద్దపు పెన్నెఱితీవజొంపముల్. 67

ఈపద్యమందంతటను రూపకమున్నందున రాజుదృష్టిని దుమ్మెదగా నిరూపణము సేయఁ జనును. (కావుననే యేకదేశవర్తిరూపకము.) ఆమనుజేంద్రుచూపు=ఆవసురాజుదృష్టి, తిలకాంచితమై=కస్తూరీతిలకముచేత నొప్పుచున్నదై, నెఱదావిచల్లు=నిండువాసనను వెదచల్లుచున్న, వ్యాపింపఁ జేయుచున్న, ఆ రామ ముఖంబునన్=ఆ గిరికాదేవియొక్క ముఖమందని యర్థము. తిలకవృక్షాంచితమయి పుష్పవాసనలను వ్యాపింపఁజేయుచున్న యుద్యానవనాగ్రమం దని యర్థాంతరము. ఆరామముఖంబున నన్నచోట రామయొక్క ముఖమనియు, నారామముయొక్క ముఖమనియును విచారింపవలయును. నెరయ వ్రాలుచున్=అంతటఁ గలయ వ్రాలుచు, హాస=నవ్వనెడు, మరంద=పూఁదేనియచేత, చిక్కణంబై=నునుపువారినదై, మెఱుఁగారు=మెఱయుచున్న, గండఫలక=పలకలవంటి చెక్కిళ్ళనెడు, అమృతభానుశిలాతలంబులన్=చంద్రకాంత శిలాప్రదేశములయందు, వేమఱుజారి=పలుమాఱును జారి పడఁబోవుచు, నిద్దపు పెన్నెఱితీవజొంపముల్=స్నిగ్ధములైన గొప్ప తలవెండ్రుకలనెడు తీఁగెగుంపులను, ఊఁతఁగొనున్=గట్టిగాఁ బట్టుకొనును.

తా. వసురాజుయొక్క చూపు గిరికాదేవియొక్క కస్తూరీతిలకముచేత శోభిల్లుచున్న ముఖసౌందర్యము నంతయు గ్రహించుచును నవ్వుచేత దట్టమై తళతళమెఱయుచును జంద్రకాంతమణి శకలములవలె నున్న చెక్కిళ్ళయందు నిబ్బరముగా నిలువలేక బెసికిపోవుచును నిగారమయి సోగలై యున్న తలవెండ్రుకలపై వ్యాపించి నిలిచెను. (అర్థాంతరమందలి భావము.) తుమ్మెదతిలకవృక్షాంచితమయి పుష్పవాసనను గుప్పుచుండెడు నుపవనాగ్రమందంతట వ్రాలుచును మకరందముచేత నునుపు

వారియున్న చంద్రకాంతశిలలయందు వ్రాలి యచ్చోటనిలువ నవకాశములేక తీఁగెగుంపుల నవలంబించియుండుట యుక్తంబ కదా.

అలం. శ్లిష్టరూపకము.

సీ. పదములఁ బల్లవింపఁగనోపుఁ దొడల మంగళమహారంభాప్తిఁ గాంచ నోపుఁ
గటిఁ గరిస్కంధాధిగమలీలఁ గన నోపు నసదుగా నెనసి మిన్నంద నోపు
గుబ్బలసిరికల్మిఁ గొండఁ దాఁకఁగ నోపు నఱుత నొక్కనిధాన మరయ నోపుఁ
జక్కెరమోవి నిష్టఫలం బెనయనోపు శ్రుతుల శ్రీలనె యెదుర్కొనఁగనోపు

తే. రమ్యవదనాబ్జమునఁ బూర్ణ రాజమండలాధిపత్యాశుభావాప్తి నలర నోపుఁ
గురుల ఘనసంపదలు చూఱఁ గొనఁగనోపు, నింతినెమ్మేనఁ బర్వునుర్వీశదృష్టి.

ఇంతినెమ్మేనఁబర్వు=గిరికాదేవియొక్క దేహమందు వ్యాపించిన, ఉర్వీశదృష్టి = వసురాజుయొక్క చూపు, పదములన్ = పాదములయందు వ్యాపించి, పల్లవింపఁగనోపున్=ఉల్లసింపఁగనోపునని యర్థము. చిగురువెట్టనోపు నని భావము. పదరురూపపల్లవము గలదనుట. తొడలన్=ఊరువులయందు, మంగళమహారంభాప్తిఁ గాంచనోపున్=శుభారంభప్రాప్తిని బొందనోపుననియర్థము. మంగళార్థమయిన కదళీస్తంభాప్తిని గాంచనోపు నని భావము. ఊరుకాండరూప రంభాస్తంభాప్తిఁ గాంచుననుట. కటిన్=పిఱుఁదునందు, కరిస్కంధాధిగమలీలఁ గననోపున్=ఏనుఁగుపెక్కనోపునని యర్థము. గజమస్తకప్రాప్తిఁ గాంచనోపు ననిభావము. కటిరూపగజమస్తకప్రాప్తిఁ గాంచు ననుట. అసదుగానెనసి=సూక్ష్మమయిన మధ్యప్రదేశమును బొందినదై, మిన్నందనోపున్=మిన్ను ముట్టనోపు నని యర్థము. గగనస్పర్శము సేయనోపు నని భావము. మధ్యరూప గగనమును స్పృశించుననుట, గుబ్బలసిరికల్మిన్=సిగియనఁగా సంపదయనియర్థము. కాంతియనిభావము. స్తనసంపత్సమృద్ధియందు, కొండఁదాఁకఁగనోపున్=కొండతో డీకొననోపునని యర్థము. పర్వతస్పర్శ సేయనోపు నని భావము, పయోధరరూప పర్వతముల దాఁకుననుట. అఱుతన్=కంఠమందు, ఒక్కనిధాన మరయనోపున్=అనిర్వాచ్యమయిన యొక నిక్షేపమును గననోపు నని యర్థము. శంఖమును గననోపుననిభావము. కంఠరూపశంఖము నరయుననుట—ఇక్కడ నొక్కనిధానమని చెప్పుటచేత, ని. 'మహాపద్మశ్చ పద్మశ్చ శంఖో మకరకచ్ఛపౌ, ముకుందః కుంద నీలౌచ వరశ్చ నిధయో నవ' అమరశేషము. అను నీశ్లోకమునఁ జెప్పఁబడిన నవనిధులలో నొకటైన శంఖము లక్షితమగుచున్నది. చక్కెరమోవిన్=పంచదారతోసమానమైన మాధుర్యముగల పెదవియందు, ఇష్టఫలంబెనయనోపున్ = అభీష్టఫలమును బొందనోపు నని యర్థము. మధురఫలమును బొందనోపునని భావము. అధరోష్ఠరూప మధురఫలము నెనయుననుట. శ్రుతులన్=కర్ణములయందు, శ్రీలనెయెదుర్కొనఁగనోపున్=సంపదల నెదుర్కొననోపునని యర్థము. శ్రీకారముల నెదుర్కొననోపు నని భావము. శ్రవణరూపశ్రీకారముల నెదుర్కొనుననుట.

రమ్యవదనాబ్జమునన్=సుందరమయిన పద్మమువంటి ముఖమందు, పూర్ణ=సంపూర్ణమయిన. రాజమండల=రాజసమూహముయొక్క, ఆధిపత్య=ప్రభుత్వముయొక్క, శుభావాప్తిన్=శుభప్రాప్తిచేత, అలరనోపున్=సంతోషింపనోపుననియర్థము. సంపూర్ణచంద్రమండలాధిపత్యముయొక్క శుభావాప్తినోపునని భావము. వదనరూప సంపూర్ణచంద్రమండలాధిపత్యముయొక్క శుభావాప్తిచేత నలరుననుట. కురులన్=తలవెండ్రుకలయందు, ఘన=అధికులయిన ఘరరాజులయొక్క, సంపదలు=విభవములను, చూఱఁ

గానఁగనోపుక్=చూచుకొననోపునని యర్థము. మేఘసంపదలు చూడఁగాననోపుననిభావము. కుంతల రూపమేఘసంపదలు చూడఁగొనుననుట. రాజసృష్టి గనుక రాజోచిత కార్యము లాచరింపఁ దగి యుండెనని తెలియవలయును.

ఇందుకుఁ బల్లవించుట మొదలుకొని ఘనసంపదలు చూడఁగొనుటతుదిగా రాజకీయములయిన యుత్తరోత్తరావస్థలను యథాక్రమముగాఁ జెప్పినాఁడు. పాదాది చికురపర్యంతవర్ణనము స్పష్టము. ఇక్కడ నతిశయోక్త్యనుప్రాణితమయిన సమాలంకారము. కనుఁగవ పూర్ణకామ మగు ననెడి పద్యము మొదలుకొని యీపద్యమువఱకుఁగల యీయుపద్యములయందును వసురాజునకు మన్మథద్వాదశావస్థలలోఁ బ్రథమావస్థయైన నయనోత్సవంబును జెప్పినాఁడు. ఇందుకు, శ్లో. 'ఆదరా ద్దర్శనంచక్షుః ప్రీతి రిత్యభిధీయతే' యని లక్షణము. ఆదరముచేత నాయికం జూచుట నయనోత్సవమనుట. గీ. 'ద్వాదశావస్థ లీక్షణోత్సవము చిత్త, సంగమంబును సంకల్పసంప్రతాప, జాగరము కార్శ్య మరతి లజ్జావిముక్తి, సంజ్వరోన్మాదమూర్ఛనాచరమములును.' ఇవి మన్మథద్వాదశావస్థలు. కొందఱు సంప్రతాప సంజ్వరము లనురెండవస్థలు విడిచిపెట్టి మిగులు పదియ యవస్థలని యెంతురు. రతి యంకురపల్లవాద్యవస్థాపంచకముగలది. అందు అంకురావస్థయందుఁ బ్రేమమని పల్లవావస్థయందు మానమని కలికావస్థయందుఁ బ్రణయమని పుష్పావస్థయందు స్నేహమని ఫలావస్థయందు రాగమని భోగావస్థయందు అనురాగమని యాలంకారికులందురు. మొదటియైదును నభిలాషజన్యవిప్రలంభమునందును గడమదియగు భోగావస్థ సంభోగశృంగారమునందును జేరియుండును. ఇందులకుఁ బ్రమాణము.

శ్లో. అంకురః పల్లవః కలికా ప్రసూన ఫల భోగభాగియం క్రమశః
ప్రేమామానః ప్రణయస్నేహో రాగోఽనురాగశ్చ.
ఇయ మంకురితా ప్రేమ్ణా మానా త్పల్లవితా భవేత్
సకోరకా ప్రణయత స్స్నేహా త్కుసుమితా భవేత్
రాగా త్ఫలవతీ సేయ మనురాగేణ భుజ్యతే.

తే. వాఙ్మనసగోచరేతరా◆ద్వైతరాగ, జలధి నపు డోలిఁ దేలి రా◆జన్యమౌళి
ఘనతరాశ్చర్యశాలియై ◆ వనితరూప, మనితరాయత్త మగునాత్మ ◆ నభినుతించె.

వాఙ్మనసగోచరేతర=వాక్కునకును మనస్సునకు గోచరముగానిదియును, అద్వైత=అద్వితీయమయినదియునగు, రాగ=శృంగారస్థాయిభావమనెడు, జలధిక్=సముద్రమందు, అపుడు=ఆసమయమందు, ఓలిక్=యుక్తమానట్టులుగా, తేలి=ఓలలాడి, రాజన్యమౌళి=వసురాజశిఖామణి, ఘనతరాశ్చర్యశాలియై = అధికమయిన యాశ్చర్యముతోఁ గూడుకొన్నవాఁడై, వనితరూపము=గిరికాదేవి యొక్క యాకృతిని, అనితరాయత్తమగు=పరాధీనము గాకయున్నట్టి, ఆత్మక్=తనహృదయములో, అభినుతించెక్=కొనియాడెను.

ఇక్కడ రాగమనఁగా స్థాయిభావము. సజాతీయమయిన నాయికాంతరాసక్తిచేతను విజాతీయమయిన క్రోధాదికముచేతను గొట్టఁబడక నిల్చి సజాతీయవిజాతీయములను స్వస్వరూపములనుగాఁ జేయు రాగము శృంగారస్థాయిభావ మనఁబడును. దీనికి, శ్లో. 'సజాతీయై ర్విజాతీయై రతిరస్కృతమూర్తిమాన్, యావద్రసంవర్తమానస్స్థాయిభావ ఉదాహృతః.' అని లక్షణము. రాగము జ్జలధి

యనుటవలన జనసామాన్యము దానిని తరింపఁజాలరనుట. కావుననే దాని గొప్పతనము వాక్కునకు మనస్సునకు గోచరముకానిది. దానికి సాదృశ్యములేదు. గాననే యద్వైతము. రాగముచేనావరింపఁ బడుటయే హృదయము పరాధీనమగుటకు హేతువు. లోకాతిశయసౌందర్యము ఆశ్చర్యకరము.

సీ. ఘనలక్ష్మి నెసఁగునం • గనముంగురులపేర భ్రమరకంబులు ధాత్రిఁ • బ్రబలఁబోలుఁ
గమలావళినదల్చు • విమలాంగి మోముతో నొనఁగూడి సన్మిత్రుఁ • డొనరఁబోలు
నమృతసంగతమైన • యతివచక్కెరమోవి సీడయై బింబంబు • నెగడఁబోలు
మేలిమిగట్టులౌ • మెలఁతచన్నులకనుంగై గోత్రవర్గ మిం • పలరఁబోలు
తే. సాటి రాఁబోలు సరులు భు • జాలతలకుఁ
జక్ర మేల్బడి గాఁబోలు • జఘనరమకుఁ
దమ్ములు పదానుజన్ములై • తనరఁబోలుఁ
బ్రసవములు గోళ్లనిసువులై • యెసఁగఁబోలు. 70

ఘనలక్ష్మినెసఁగు = అధికసంపదచేత నొప్పుచున్న, అంగనముంగురులపేరన్ = స్త్రీయొక్క నుదుటిపై కురులయొక్క పేరునువహించి, భ్రమరకంబులు=తుమ్మెదలు, ధాత్రిన్=భూమియందు, ప్రబలఁబోలున్=వృద్ధిఁబొందఁబోలునని యర్థము. ఇక్కడ భ్రమరకములనఁగా ముంగురులును తుమ్మెదలును, (శ్లో. 'భృంగాలకా భ్రమరకా' అని నా.) ముంగురులు ఘనలక్ష్మినెసఁగు ననఁగా మేఘకాంతిచేత నొప్పునని భావము. కమలావళినదల్చు=పద్మపంక్తిని ధిక్కరించుచున్న, విమలాంగి మోముతోన్=ఈస్త్రీయొక్క ముఖముతోడ, ఒనఁగూడి=జతగలిసి, సన్మిత్రుఁడు=అనఁగా నక్షత్రముల కాప్తుఁడైన చంద్రుఁడు, ఒనరఁబోలున్=సన్మిత్రుఁడై యొప్పుచుండఁబోలునని యర్థము. అనఁగా శ్రేష్ఠుఁడైన సఖుఁడై యొనరఁబోలుననుట. (శ్లో. 'సన్ సత్యే విదుషి శ్రేష్ఠే సాధౌ భవతి చ త్రిషు, సత్క్లీబ మృత్వే' అని నా.) ఇక్కడ ముఖమునకుఁ జంద్రునకును బద్మనిరాసకత్వము సమానకార్యము గనుక మైత్రికర్తృత్వయని తెలియవలయును. అమృతసంగతమైన=సుధాపూరితమైన, అతివచక్కెరమోవి = ఈస్త్రీయొక్క చక్కెరవలెఁ దియ్యనైన పెదవియొక్క, సీడయై = ఛాయయై, బింబంబు=దొండపండు, నెగడఁబోలున్=బింబమనునట్లుగాఁ బ్రసిద్ధిఁబొందఁబోలును. బింబమనఁగా సీడయును దొండపండును, (శ్లో. 'ప్రతిబింబే తత్ప్రతికృతౌ ప్రతికృత్యాంచమండలే, వాంఛనేపిచ బింబో స్త్రీ నద్వయో ర్బింబికాఫలే' అని నా.) మేలిమిగట్టులౌ=మేలిమిబంగారు కొండలైన, మెలఁతచన్నులకున్=ఈస్త్రీయొక్క కుచములకు, అనుంగై=నెనరంటినదై, గోత్రవర్గము=పర్వతసమూహము, ఇంపలరఁబోలున్=గోత్రవర్గమనునట్లుగా హితమై యొప్పఁబోలును అని యర్థము. గోత్రవర్గమనఁగా నిక్కడ బంధుసమూహమును, బర్వతసమూహంబును గనుకఁ జన్నులను బంగారుకొండలుగాఁ జెప్పి పర్వతములకు సంబంధము దెచ్చినాఁడు.

సరులు=అనఁగా హారములు, భుజాలతలకున్=ఈస్త్రీయొక్క తీఁగెలవంటి భుజములకు, సాటి రాఁబోలున్=సరులనునట్లుగా, అనఁగా సమానము లనునట్లుగా సీడుపడఁబోలును. సరియనఁగా సమానంబును, హారంబును, చక్రము=బండికల్లు, జఘనరమకున్=ఈస్త్రీయొక్క కటిపురోభాగసమృద్ధికి, ఏల్బడిగాఁబోలున్=చక్రమనునట్లుగా నేలుకోఁదగినదిగాఁ బోలును. చక్రమనఁగా నిక్కడ

గొలుచునట్టి సైన్యము, తమ్ములు=కమలములు, పదానుజన్ములై=ఈస్త్రీయొక్క పాదములకుఁ దోడ, బుట్టినవై, తనరఁబోలుక్=తమ్ములనునట్టులుగా నొప్పఁబోలు నని యర్థము. తమ్ములనఁగా నిక్కడఁ గనిష్ఠభ్రాతలు. క. 'తమ్ములు నాఁ బేరగుఁ బ, ద్మమ్ముల కనుజన్ములకును దరుణేందుధరా' అని యాంధ్ర నామసంగ్రహము. ప్రసవములు=పుష్పములు, గోళ్ళనిసువులై=ఈస్త్రీనఖములయొక్క శిశువులై ఎసఁగఁబోలుక్=ప్రసవము లనునట్టులుగా వృద్ధిఁబొందఁబోలును. ప్రసవములనఁగా నిక్కడ శిశువులు—ఈపద్యమందు గిరికాదేవియొక్క యాకేశపాదవర్ణనము చేసినాఁడు.

తా. ఆచెలువముంగురులు మేఘములవలెఁ దుమ్మెదలవలె నున్నవి. మొగము తామరపూవు వలెఁ జందమామవలె నున్నది. పెదవి యమృతమురసమువలె దొండపండువలె నున్నది. చనుదోయి గట్టులవలెను భుజములు పూదండలవలెను పిఱుఁదులు బండికండ్లవలెను పాదములు తామరపూవుల వలెను గోళ్లు చివుళ్ళవలె నున్నవి. అలం. కావ్యలింగము. పరికరాంకురము. ఉత్ప్రేక్ష. అంగి.

చ. బొమవిలు చూపుతూపులును • బూని మృగాంకుని గెల్చి యింతిమో
మమృతము మందహాసమున • నచ్ఛపుడాలు కపోలలీల ఫా
లమునఁ గళావిలాస మఖి•లంబుఁ గొనం గని వెన్కఁ జొచ్చె న
య్యమృతగభస్తిభీతతిమి•రావళి వేనలిపెంపుసొంపునన్. 71

బొమవిలు=కనుబొమ్మయనెడుధనుస్సును, చూపు=వీక్షణములనెడు, తూపులును=బాణములును, పూని=ధరించి, మృగాంకుని గెల్చి=చంద్రుని జయించి, ఇంతిమోము=ఈస్త్రీయొక్క ముఖము, అమృతమున్=చంద్రునిలోనుండు నమృతమును, మందహాసమునన్=చిఱునవ్వుచేతను, అచ్ఛపుడాలు=నిర్మలమయిన కాంతిని, కపోలలీలన్=చెక్కిళ్ళయొక్క విలాసముచేతను, ఫాలమునన్=నొసటిచేత, కళావిలాసము=చంద్రఖండముయొక్క డంబము, అఖిలంబుఁగొనన్=సర్వమును హరింపఁగా, కని=చూచినదై, అయ్యమృతగభస్తిభీత=ఆచంద్రునివలన జడిసిన, తిమిరావళి=అంధకారసమూహము, వేనలిపెంపుసొంపునన్=ఈస్త్రీయొక్క కొప్పనెడు మిషచేత, వెన్కఁజొచ్చెన్=శరణుఁజొచ్చి వెనుకఁ జేరెను అని యర్థము.

పగవానియొక్క పగవాఁడు బంధువనియున్నది గనుకఁ జీఁకటులు తమకు విరోధియైన చంద్రుని గెలిచిన ముఖమును మిత్రమునుగాఁ దలఁచి వెనుకఁ జొచ్చెననుట. అనఁగా గిరికయొక్క కనుబొమ్మలు వంపఁబడినవిండ్లవలె నున్నవనియుఁ జూపులు బాణములవలె నున్నవనియు ముఖము చంద్రునివలె నున్నదనియు నవ్వమృతమువలె నున్నదనియుఁ జెక్కిళ్లు చంద్రప్రభలవలె నున్నవనియు నొసలు చంద్రకళవలె నున్నదనియుఁ గొప్పు గాఢాంధకారమువలె మిగుల నల్లనై యున్నదనియు ఫలితార్థము.

చంద్రుఁడు మృగాంకుఁడగుటచే నకలంకమగు మొగము గెలువఁజాలినది. గెలుపొందిన వారోడినవారి సర్వస్వము వినియోగించుకొందురుగావునఁ జంద్రునియందలి యమృతము చిఱునవ్వున, వెన్నెలనిగ్గు చెక్కులయందును, కళలసొంపు ఫాలమునను నెలకొల్పెను. వేనలిపెంపనుటవలనఁ జెన్నెతె జంపుగా విశేషముగ నుండెననుట. అలం. అతిశయోక్తి. అపహ్నవము.

చ. బలితపుగుబ్బగుబ్బలుల•పై నిర వొంది మెఱుంగుదీఁగచే
నలరి హృతాబ్జపూగరుచి•యై నిరవద్యకలారవామృతం

బులకలిమిం బికాంగనల ◆ మూఁకకు మూకత సంఘటించునీ
చిలుకలకొల్కికంధర భ◆జింపఁగఁ జెల్లదె కంధరాంకమున్. 72

బలితపుగుబ్బ గుబ్బలులపై నిరవొందిన=గొప్పవైన చనుఁగొండలమీఁద నొప్పుచున్నదై యని యర్థము. కొండలమీఁదనుండుట మేఘధర్మములని తెలియవలయును. మెఱుంగుదీఁగెచే నలరి=మెఱుఁగైన బంగారుతీఁగెయనెడు భూషణవిశేషముచేతఁ బ్రకాశించియని కంఠపరమైన యర్థము. మెఱుపుతీఁగెచేత నలరియని మేఘపరమైన యర్థము. హృత=హరింపఁబడిన, అబ్జ=శంఖముయొక్కయు, పూగ=పోఁకమ్రాని కుత్తుకయొక్కయు, రుచియయి=శోభగలిగినదై యని కంఠపరమైన యర్థము. హృతాబ్జపూగ రుచిమై యనఁగా హరింపఁబడిన పద్మసమూహశోభగలదై యని మేఘపరమైన యర్థము. కమలమునకు మేఘము ప్రతికూలమగుట ప్రకటముగదా. (ని. 'అబ్జోధన్వంతరౌచంద్రే నిచులే శంఖ పద్మయోః' అని వి. ని. 'పూగః క్రముక బృన్దయోః' అని అ.) నిరవద్య=అనింద్యమయిన, కల=అవ్యక్తమధురమైన, ఆరవామృతంబులకలిమిన్=అమృతప్రాయములైన స్వరములకలిమిచేత నని కంఠపరమైన యర్థము. నిరవద్యమయిన గర్జారవముయొక్కయు జలసందోహములయొక్కయు కలిమిచేతనని మేఘపరమయిన యర్థము. అమృతమనఁగా నుదకమునకును బేరు. ని. 'స్యాద్యజ్ఞశేషాంబు నభో రసాయన క్షీరాజ్య సోమాన్న సుధాసు చామృతమ్' అని నా. పికాంగనల మూఁకకున్=ఆఁడుకోయిలలయొక్క సమూహమునకు, మూకతసంఘటించు=మూఁగతనము సంపాదించుచున్న, అనఁగా నీకంఠస్వర మాధుర్యముతోఁ దమకంఠనాదము సమానము గాదని సిగ్గుపడి కోయిలలు పలుకకుండునని తాత్పర్యము. వర్షర్తువునందుఁ గోయిలలు గూయుటలేదు గనుకఁ బిక సమూహములకు మూకత్వమును సంఘటించుటయు మేఘధర్మంబ యని విచారింపవలయును. ఈ చిలుకలకొల్కికంధర=ఈముద్దుగుమ్మయొక్క కంఠము, కంధరాంకమున్=కంధరమను మేఘనామమును, (ని. 'గ్రీవాయాం కంధరా మేఘే పుమాన్' అని నా.) భజింపఁగఁజెల్లదె=వహింపఁగూడదా? అనఁగా వృత్తిసామ్యంబును నామసామ్యంబును గలకంధర, కంధరాంకమును వహించుటకుఁ దగుననుట. వృత్తిసామ్యము నామస్యామమువలనఁ గంధరాంకము తగియున్నది.

అలంకారము. కావ్యలింగము. పరిణామము.

తా. గుబ్బలకుఁ బైనలరి స్వర్ణభూషాలంకృతమై పోకబోదె చెలువమును మించి కలరవామృతముచేఁ గోయిలపులుఁగులకు వాకట్టుచు నాసతికంఠ మలరారుచున్నది.

మ. సమదాభంగమనోజసామజ మురో◆జగ్రావలీలాధిక
క్లమమై నాభిసరోంతరంబున మునుం◆గం బొంగునుద్వేలభం
గము లయ్యెన్ వళు లంతరాళమునఁ ద◆ద్గంధానుబంధంబుచే
నమరుం దుమ్మెదచాలు నా నొనరె నూఁ◆గారింతి లేఁగౌనునన్. 73

సమద=మదయుక్తమైనదియు, అభంగ=పరాజయములేనిదియునగు, మనోజ=మన్మథుఁడనెడు, సామజము=ఏనుఁగు, ఉరోజ=స్తనములనెడు, గ్రావ=పర్వతములయందలి, లీలా=క్రీడలచేత-అనఁగాఁ బర్వతములయందుఁ జేయఁబడిన వప్రక్రీడలచేత ననుట. అధికక్లమమై=అత్యంత

మయిన బడలికగలదై, నాభిసరోంతరంబునన్=పొక్కిలియనెడు కొలఁకులోపల, మునుంగన్=మునుఁగఁగా, పొంగు=పైకినుప్పొంగిన, వళులు=కడుపుమీఁది మడతలు, ఉద్వేలభంగములయ్యెన్=ఉత్కటమయిన తరంగము లన్నట్టులుగానుండెను. అంతరాళమునన్=వళులనెడు తరంగములయొక్కనడుమ, తత్=ఆనాభీసరోవరమగ్న మయిన మన్మథమదసామజముయొక్క, గంధ=మదసౌరభమందలి, అనుబంధంబుచేన్=ఆసక్తిచేత, అమరుందుమ్మెదచాలునాన్=ఒప్పుచున్న భ్రమరపంక్తియేమో యన్నట్టులుగా, ఇంతిలేఁగౌనునన్=ఈస్త్రీయొక్క యతిసూక్ష్మమయిన నడుమునందు, నూఁగారు=రోమావళి, ఒనరున్=ఒప్పును.

అనఁగా నీస్త్రీయొక్కకుచములు పర్వతంబులవలె గట్టిగానున్నవనియును నాభి కొలనువలె లోఁతుగలిఁయున్నదనియును గడుపుమీఁది మడతలు తరంగములవలె వెంబడిగానున్నవనియును నూఁగారు తుమ్మెదచాలువలెనల్లనై సోగగా నున్నదనియును ఫలితార్థము. అమరుందుమ్మెదచాలు, అన్నచోట అమరునసెడు ఉకారాంతపదముమీఁదఁ బరుషవర్ణమయిన తకారము పరమగుచుండఁగా నుమాగమువచ్చినది. శ్లో. 'పరుషే సరళే చైవ సమాసే నుమతోభవేత్' అని యథర్వణవచనము.

సామజము మదించినది పరాజయము లేనిదిగావున గ్రావముతో లీలఁగోరాడఁ దొడంగెను. అక్కడికిఁ బరాజయమొందక బడలినది. బడలినవారు నీట మునుఁగుటాచారము గావున సరస్సున మునిఁగినది. ఏనుఁగు చాలగొప్పదగుట తరంగము లుద్వేలములయ్యెను. మదపుటేనుఁగు గావుననే తుమ్మెదచాలు ముసరికొనినది. కౌను లేఁతదగుటచే నారుగూడ నూగుగానుండెను. గుబ్బలబింకము నడుముసన్నఁదనము ఆరుపలుచన సౌందర్యచిహ్నములు.

అలం. రూపకము. ఉత్ప్రేక్ష.

సమదాభంగ యనుచో మదశబ్దము తరుణీయౌవనాతిశయసూచకము. తారుణ్యమదమునకు దృష్టాంతము.

శ్లో. దృష్టిస్మేరా ముఖేరాగః సస్మితాకుంచితం వచః
లీలావిదగ్ధగత్యాద్యా శ్చేష్టా స్యు స్తరుణే మదే. (రసార్ణవసుధాకరము.)

చ. వనితకుచాద్రులం బొడమి ♦ వాటపుఁబొక్కిలి నిండి యుబ్బి జా
ల్గొని కటిచక్ర మాని మెఱుఁ♦గుందొడ లై విరవాసి వచ్చునూ
తనకిరణామృతౌఘముల ♦ దండ హలాంకపదోత్థితంబు లై
మను నుడివోనిగర్భకల♦మంబులు గావె లతాంగిజంఘికల్. 74

వనితకుచాద్రులంబొడమి=ఈస్త్రీయొక్క గుబ్బచన్నులనెడు కొండలయందుఁబుట్టి, వాటపుఁ బొక్కిలినిండి=కుదురైన నాభియనెడు నేలగుంతయందుఁ బూర్ణీభవించి, పొక్కిలి యనఁగా నాభికిని నేలగుంతకును బేరు. ఉబ్బి=అందులోనుండి పైకినుప్పొంగి, జాల్గొని=జాలుగాఁ బ్రవహించి, కటిచక్రమాని=కటిప్రదేశమనెడు రాష్ట్రమును లోఁగొని, మెఱుఁగుందొడలై = మెఱయుచున్న యూరురూపములై, విరవాసి=రెండుపాయలై, వచ్చు=ఏతెంచుచున్న, నూతన కిరణామృతౌఘముల దండన్, నూతన=అభినవమైన, కిరణ=కాంతియనెడు, అమృతౌఘముల=జలప్రవాహములయొక్క, దండన్=చేరువ, హలాంక=హలరేఖాంకములైన, పద=పాదములనెడు, హలాంక=నాఁగటిదుక్కి

గల, పద=స్థానములవలన, అనఁగా నాఁగేటిచేత దున్ని వెదవేసిన మడిచేలవలన ననుట. (ని. 'పదం వ్యవసితత్రాణ స్థాన లక్ష్మాంఘ్రి వస్తుషు' అని అ.) ఉత్థితంబులై=మొలిచినవై, మను = వృద్ధిఁబొందుచున్న, ఉడివోని=ఉడిగిపోకుండెడు, గర్భకలమంబులుగా వె=పొట్టతోనున్న వరిపైరులుగావా, లతాంగిజంఘికల్=ఈ చిన్నదానిపిక్కలు, అనఁగా వరిపొట్టలే యవుననుట.

సౌందర్యకాంతులు గుబ్బలువలెనున్న గుబ్బలందును లోఁతుగానున్న పొక్కిలియందును గటిచక్రమందును తొడలందును వెల్లివిరియుచున్నవనుటచేఁ బ్రత్యవయవము యౌవనవిలాసములకు నెలవుగానుండెననుట, పదములందు హలాంకములుంట శుభసూచకములు.

ఇక్కడ నుడివోనిపిక్కలను నుడివోనివరిపొట్టలుగా నుత్ప్రేక్షించినాఁడు. ఘనలక్ష్మి సెసఁగు ననెడి పద్యము మొదలుకొని యీపద్యము తుదిగా నైదుపద్యములలో నవస్థాభేదమయిన ప్రలాపమును జెప్పినాఁడు. ఇందుకు, క. 'వెలయఁగ సతిఁ గొనియాడుట, దలఁపఁ బ్రలాపము' అని లక్షణము.

చ. అని వనితాలలామవిను•తాంగతరంగితసౌకుమార్యముల్
గని కొనియాడు సమ్మదము • గ్రమ్ముకొనం దల యూఁచు నవ్వు న
వ్వనరుహసూతిచేతి యని•వారితచాతురి మెచ్చుఁ గాని య
య్యనఘుఁ డెఱుంగఁ డయ్యె మన•నాంతర మాంతరవిస్మయంబునన్. 75

అని=ఈప్రకారముగా, వనితాలలామ=సౌందర్యవతియైన యాస్త్రీయొక్క, (ని. 'లలామం త్రిషు రమ్యే స్యాన్ముఖ్య సామర్థ్య లక్ష్మసు' అని వి.) వినుత=స్తోత్రముచేయఁబడిన, అంగ=అవయవములయందు, తరంగిత=తరంగప్రాయములుగాఁ జేయఁబడిన, సౌకుమార్యముల్=కోమలత్వములను, కని=చూచి, కొనియాడున్=స్తోత్రముసేయుచును, సమ్మదము గ్రమ్ముకొనన్=సంతోష మావరింపఁగా, తలయూఁచున్=శిరఃకంపముచేయుచును, నవ్వున్=వెఱ్ఱినవ్వుగా నవ్వును, అవ్వనరుహసూతిచేతి=కమలసంభవుఁడైన యాబ్రహ్మచేతియొక్క, అనివారితచాతురి మెచ్చున్=నివారింపఁబడని చాతుర్యమును మెచ్చుకొనును, కాని=ఇంతియకాని, అయ్యనఘుఁడు=పాపరహితుఁడైన యావసురాజు, (ని. 'దుఃఖే నోవ్యసనేష్వఘమ్' అని నా.) ఆంతర=హృదయమందలి, విస్మయంబునన్=ఆశ్చర్యముచేత, మననాంతరము=మఱియొక యాలోచనను, ఎఱుంగఁడయ్యెన్=గుర్తెఱుఁగఁడాయెను. అనఁగా విభ్రాంతి పడిచూచుచు నూరకుండెననుట.

తా. ఇట్లు వసురాజు వనితాలలామ సౌందర్యాతిశయముఁ గొనియాడుచు సంతోషవశమునఁ దలయూఁపుచు నవ్వుచు బ్రహ్మసృష్టిని గొనియాడుచు నుండెనేగాని హృదయగతమగు నాశ్చర్యాతిశయమువలన వేఱువిధమగు నాలోచన మెఱుంగఁడయ్యెను.

మ. అపుడానర్మసఖుండు చేరఁ జని క•న్యారత్నముం జూచి తే
తపనీయాచలధీర నాపలుకు త•థ్యం బౌఁ గదా యింక నే
జపివేషంబునఁ జేరఁ బోయి లలనా•జన్మప్రకారంబు దే
ట్టపడం గాంచెదఁ బంపు మన్నను నఖం•డప్రేమసామగ్రితోన్. 76

అపుడు=వసురాజేమియు నాలోచనతోఁచక యున్న సమయమందు, ఆనర్మసఖుండు=ఆప్రియసఖుఁడు, చేరంజని=సమీపింపఁబోయి, తపనీయాచలధీర=బంగారుకొండవలె, అనఁగా మేరువువలె ధైర్యయుక్తుఁడవైన యో వసురాజా, కన్యారత్నముంజూచితే = కన్నెపడుచులలో రత్నమువలె నున్న చిన్నదాని లెస్సగాఁ జూచితివా, నాపలుకు తథ్యంబౌఁగదా=నామాట నిజమేకదా, ఇంకన్=ఇఁక మీఁద, నే జపివేషంబునఁ జేరఁబోయి=నేను మునివేషముచేత సమీపముగాఁ బోయి, లలనాజన్మప్రకారంబు=ఈస్త్రీయొక్క పుట్టుపూర్వక్రమమును, తేటపడంగాంచెదన్ = విశదపడునట్టులుగాఁ దెలిసికొనుచున్నాను, పంపుమన్నను=పంపుమనిపలుకఁగా, అఖండ=సంపూర్ణమైన, ప్రేమసామగ్రితోన్=అనురాగభరముచేత—దీనికి ముందరిపద్యముతో నన్వయము.

తేటపడంగాంచెద నన్నచోట తేటయనెడుపద మచేతనార్థకము గనుకను నచేతనార్థకముల మీఁది క చ ట త ప ల కు గ స డ ద వా దేశము వైకల్పికముగనుకను పకారమునకు వకారము కలుగం జెప్పఁడయ్యె. శ్లో. 'పరుషావాస్వరూపేణ ప్రథమాంతోపరిస్థితాః, కాకాసంబోధనేచాపి త్వవ్యయే కర్మధారయే, అచేతనార్థకేశబ్దఇతి శృంగారభూషణః' అనియు, గీ. 'సంధిగూర్పంగఁ బ్రథమాంతశబ్దవితతి, పై క చ ట త ప ల కు వికల్పముగఁ జెల్లుఁ, గాకు సంబోధనావ్యయ కర్మధార, యంబుల నచేతనంబులనబ్జనాభ' అని లక్షణము.

తా. అపుడు వేడుకచెలికాఁడగు మంత్రి రాజు సమీపించి రాజేంద్రా! కన్యకనుగాంచితివి గద, నేను చెప్పినది నిజమేగదా! ఇఁక నేను మునివేషముతో నాచెలువను డాయఁబోయి యామెజన్మప్రకారము తెలిసికొనివచ్చెదను. పంపుమా యన వసురాజనురాగాతిశయముగలవాఁడై.

తే. కుంభగతదీపశోభాని•గుంభలీలఁ, గుంభకుచమేనఁ జూడ్కులా•గుబ్బుకొనఁగఁ
గాంచువిభుఁ డంగనాప్రసం•గంబుకతన, మంత్రివరు నెట్టకేలకు • మఱలిచూచి.

కుంభగత=కుండలో నిమిడియున్న, దీప=దీపముయొక్క, శోభా=కాంతియొక్క, నిగుంభలీలన్=వ్యాపనమువలె, కుంభకుచమేనన్=కలశములవంటి స్తనములుగల యాస్త్రీయొక్క దేహమందు, క. 'కాయముపేళ్ళయిఁ వెలయును, మే యన నొడ లనఁగ మేను మెయినాన్' అని యాంధ్రనామసంగ్రహము. చూడ్కులు ఆగుబ్బుకొనఁగన్=చూపులు పిక్కటిల్లునట్టులుగా, కాంచు=చూచుచున్న, విభుఁడు=వసురాజు, అంగనా ప్రసంగంబుకతనన్ = ఆస్త్రీసంబంధమైన ప్రసంగమేయైనందున, మంత్రివరున్=మంత్రిశ్రేష్ఠుని, ఎట్టకేలకున్=కొంతసేపటికి, మఱలిచూచి=తిరిగిచూచినవాఁడై, ఈ పద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

రాజు పరధ్యానముననుంటచేత ఎట్టకేలకుఁగాని మంత్రివాక్యము వినఁజాలఁడయ్యెను. అంతటి మోహావస్థలోనుండియుఁ దెలివిపై మంత్రివాక్యము వినఁగలుగుట యతఁ డెఱుంగఁజేయునది లలనాప్రసంగమగుటచేతనే. అలం. ఉపమ.

తా. కుంభమునందున్న దీపపువెలుఁగు కుంభమునందంతటను సమగ్రముగా వ్యాపించునటుల రాజుచూపు లాచెలువపై, బిక్కటిల్లెను. మంత్రిచేయుప్రసంగ మాయంగనను గూర్చినదగుటచేఁ గడకు రాజు మంత్రిని చూచి.

ఉ. ఏగతి యోగిరూపము వ•హించెదో యేగతిఁ బ్రౌఢి మించెదో
యేగతి వేళఁ గాంచెదవొ • యేకత మున్నవధూజనంబు నీ

వేగతిఁ బల్కరించెదవొ • యిష్టసఖా భవదీయనీతికా
ర్యాగతి నేఁడు చూతము గదా యని యంపిన నాక్షణంబునన్. 78

ఏగతి యోగిరూపమువహించెదో=ఏప్రకారముగా మునివేషధారణము సేయుచున్నావో, ఏగతిఁ బ్రౌఢిమించెదో=ఏప్రకారముగాఁ జతురత్వముచేత నతిశయించుచున్నావో, ఏగతి వేళఁ గాంచెదవొ = ఏప్రకారముగా సమయముఁ గనిపెట్టుచున్నావో, ఏకతమున్నవధూజనంబుల్ = ఏకాంతముగానున్న స్త్రీసమూహమును, (ని. 'జన స్సమూహే లోకేపి' అని నా.) నీవేగతిఁబల్కరించెదవొ=నీవేప్రకారముగా మాటాడించుచున్నావో, ఇష్టసఖా = ఇష్టుఁడవైన చెలికాఁడా, భవదీయ నీతికార్యాగతి = నీసంబంధమైన నీతికార్యప్రచారము, నేఁడుచూతముగదా=ఈప్రొద్దు చూతాముగదా, అనియంపినన్=అనిపల్కిపంపఁగా, ఆక్షణంబునన్=తత్క్షణమందే, ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. ఏకతమనుపదము, ఏకాంతశబ్దతద్భవము.

ఇష్టసఖాయనుటచేఁగోరికల నొడఁగూర్పఁదలఁచువాఁడవనుట. వధూజనము, అందునేకతము. కావునఁ బరిచయమునకు వేళయుఁ బల్కరించుటకు వెరవు నవసరము. కావునఁ బ్రౌఢి వలయును. ఈకార్యము నిర్వహించితివేని నీనీతికౌశలము గణనీయమనుట.

తా. మిత్రమా! ఎటుల యోగివేషముదాల్చెదవో నేరుపు నెటులఁ బ్రచురించెదవో యెటు లవకాశము గలిగించుకొని యొంటరిగానున్న యాచెలువలఁ బలుకరింతువో నీనీతి నేఁడు చూతము. పోయిరమ్మని రాజు నర్మసఖుని బంపఁగా నతఁ డాక్షణముననే-

సీ. కనకవల్లిమతల్లి • కలపెంపు జడగుంపు పుష్పపరాగసం • భూతి భూతి
కమనీయశాఖాప్ర • కాండంబు దండంబు తరుణపల్లవకోటి • ధాతుశాటి
వల్కలఘట్టంబు • వరయోగపట్టంబు జాలకవిసరంబు • జపసరంబు
ఫలరసాసారంబు • పాత్రాంబుపూరంబు కింజల్కములచాలు • మౌంజినూలు
తే. సేయఁ జాలినయమ్మహా • శిఖరిశిఖర, రుచిరసురభూజరాజిచే • నుచితవేష
మెనసినరపాలనిరపాయ • హితవిహార, హారిగడిదేరి యొకజడ • దారి యయ్యె. 79

కనకవల్లిమతల్లికలపెంపు=సువర్ణమయములైన లతాశ్రేష్ఠములయొక్క సమృద్ధిని, జడగుంపు=జటాసమూహముగాను, పుష్పపరాగసంభూతి = పుష్పాడియొక్క సమ్యగ్భూతిని, అనఁగా లెస్సగాఁ గలిగియుండుటను, భూతి=భస్మముగాను, కమనీయ = రమ్యమైన, శాఖాప్రకాండంబు=శ్రేష్ఠమైయుండెడు కొమ్మను, దండంబు = యోగవేత్రముగాను, తరుణ = లేఁతయైన, పల్లవ=చిగురుటాకుల యొక్క, కోటి=సమూహమును, ధాతుశాటి=కాషాయవస్త్రముగాను, (ని. 'వసాదయస్సప్తకఫాద యస్త్రయో భూతానిపంచస్వగుణాశ్చ గైరికమ్, శిలావికారేంద్రియశబ్దయోనయో లోహంస్వభావ్యంకనకంచధాతవః' అని నానార్థరత్నమాల.) వల్కలఘట్టంబు = వల్కలమనఁగాఁ జెట్టుపైతోట, దానియొక్కబంధమును, వర=శ్రేష్ఠమైన, యోగపట్టంబు = యోగపట్టెడగాను, జాలక=మొగ్గల యొక్క, విసరంబు = పంక్తిని, జపసరంబు=జపమాలికగాను, ఫలరసాసారంబు=పండ్లరసముయొక్క ధారాపాతమును, పాత్రాంబుపూరంబు = కమండలుజల సమృద్ధిగాను, కింజల్కములచాలు=కేసరముల యొక్క పంక్తిని, మౌంజినూలు=దర్భమొలత్రాఁడును గాను,

చేయఁజాలిన=చేయుసామర్థ్యము గలిగిన, ఆ=పూర్వోక్తమైన, మహాశిఖరి = ఉన్నతమైన కోలాహలాద్రియొక్క, శిఖర=శృంగములయందు, రుచిర = ప్రకాశమానములగుచున్న, సురభూజ=కల్పవృక్షములయొక్క, రాజిచేన్=సమూహముచేత, ఉచితవేష మెనసి=యోగియనుటకుఁ దగిన వేషమును బొంది, నరపాల=వసురాజుయొక్క, నిరపాయ=ఎడతెగని, హితవిహార=ఇష్టవిహారమందు విహారి=విహరించుచున్న, నర్మసఖుఁడు, గడిదేరి=సంకోచములేనివాఁడై, ఒకజడదారియయ్యెన్=ఒకజటాధరుఁడైన యోగీశ్వరుఁడయ్యెను. జటాశబ్దతద్భవము జడ. అలం. సమాధి.

తా. కోలాహలపర్వతశిఖరమునందున్న వేల్పుమ్రాకుల మహిమచే రాజసఖుఁడు తీవియల జడగుంపుగను, బుప్పొడి విభూతిగను, శాఖను దండముగను, జివురుటాకులను గాషాయవస్త్రముగను, జెట్టుతాటను యోగపట్టముగను, మొగ్గలనుజపమాలికగను,ఫలరసము జలముగను, కేసరములు దర్భమొలత్రాడుగను గావించి తగినవేషము సంతరించికొని తెగువదారియగు జడదారియయ్యెను.

క. ఆమాయతపసి నియమ, స్థేమాయత నక్షసరముఁ ♦ ద్రిప్పుచు నెలమిన్
వామాయతనయనాజన, హైమాయతనంబుఁ జేర♦నరుగుచు నచటన్. 80

ఆమాయతపసి = ఆకృత్రిమపుయోగి, నియమస్థేమాయతన్ = నియమస్థైర్యమును బొందినవాఁడగుటచేత, 'నియమస్థేమానంఏతీతి నియమస్థేమాయః తస్యభావః నియమస్థేమాయతా' అక్షసరముఁద్రిప్పుచున్=స్ఫటికాక్షమాలికను వ్రేళ్ళమీఁదఁ ద్రిప్పుచును, ఎలమిన్=ఉత్సాహముచేత, వామ=సుందరమైన, (ని. 'వామా వధ్వాం సవ్య రమ్య ప్రతీపే ష్వేషవాచ్యవత్' అని నా.) ఆయత=విశాలములైన, నయనా=నేత్రములు గలస్త్రీలయొక్క, జన=సమూహముయొక్క, హైమాయతనంబున్ = సువర్ణమయమయిన గృహమును, చేరనరుగుచున్ = చేరునట్టులుగాఁ బోవుచు, అచటన్=ఆ ప్రదేశమునందు.

తా. ఆమాయాముని జపమాలికను నియమానుసారముగాఁ ద్రిప్పుచు సుందరులగువాల్గంటులున్న సువర్ణమందిరమునకుఁ జేరఁబోవుచుండ నచట-

తే. గంధగజయానగీతప్ర♦బంధకలన, నలరి యతి లియ్యమైవచ్చు ♦ నరిది మగువ
లార కనుఁగొంటిరేయను♦నాళివాక్య, మొకటివిననైనని దె వేళ♦ యొదవె ననుచు.

గంధగజయాన=గర్వితగజగమనమువంటి గమనముగల గిరికాదేవియొక్క, గీతప్రబంధకలనన్=గీతప్రబంధరచనయందు - అనఁగా గీతములు చెప్పుటయందు, అలరి = ఒప్పినదై, యతి=అనఁగా గణాదియైనవిశ్రమాక్షరము. (శ్లో. 'సంగీతకలనాయాంతు గణాదౌ యతిరుచ్యతే, ప్రాసోవా యతిసామీప్యే నాతిదూరే విధీయతే.' అని సంగీతశాస్త్రము.) లియ్యమయివచ్చున్=కూడఁగలిసికొని వచ్చుచుండును, అరిది = ఇది మిక్కిలివింత, మగువలార కనుఁగొంటిరేయను=చెలులారా చూచినారఁటే యనునట్టి, ఆళివాక్య మొకటివిననైనన్=చెలికత్తెయొక్క వాక్యమొకటి వినరాఁగానే, ఇదె వేళయొదవె ననుచున్ = ఇదిసమయము దొరకెనని, ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

ఇందులోఁ జెలికత్తె సంగీతవిషయమయిన వాక్యము పలుకఁగా నర్మసఖుఁడు తనకు నిదియ సమయమని తలఁచుట యెట్లనఁగా, గీతప్రబంధకలన నలరి యతి లియ్య మయివచ్చునరిదియనెడిచోట గీతప్రబంధాకర్ణనముచేత సంతోషించి యొకానొక యతీశ్వరుఁ డీపాటతోనే కలిసి

వచ్చునని చెలికత్తియ పలికినట్టులుగా నర్థనముచేసి తనకు నిదియ సమయమని తలఁచె నని యర్థాంతరము. (ని. 'యతి ర్భిక్షో పుమాన్ స్త్రీతు నియమే శ్లోక విశ్రమే' అని నానార్థరత్నమాలాకోశము.) ఇది పాత్రప్రవేశసూచక మనునాటకరీతి.

ఉ. మేలు లతాంగి నీపలుకు • మెచ్చితినే యతి వచ్చుజాడ యే
లీల నెఱింగి తమ్మ బహు•ళీకృతచాతురి మించునీవిపం
చీలలితారవామృతము • చిత్తము సోఁకినవార లీకళా
శాలినిఁ జూచి దీవెన లొ•సంగక పోవరు సుమ్ము నావుడున్. 82

మేలు=బాగుబాగు, లతాంగి=ఓచిన్నదానా, నీపలుకు = నివుపలికిన వాక్యము, నేన్=నేను, మెచ్చితిన్=మెచ్చుకొంటిని, యతివచ్చుజాడయేలీల నెఱింగితమ్మ=యతీశ్వరుఁడు వచ్చెదుసంజ్ఞ యేలాగున గుర్తెఱింగితివమ్మా, బహుళీకృత=అనేకవిధములుగాఁ జేయఁబడిన, చాతురిమించు=చమత్కారముచేత నతిశయించుచున్న, ఈవిపంచీలలితారవామృతము=ఈవీణయొక్క మనోహరమయిన నాదామృతము-అనఁగా సుధాప్రాయమయిన నాదము, చిత్తముసోఁకినవారలు=మనస్సునం దంటినవారు, ఈకళాశాలినిఁ జూచి=లావణ్యవతియైన యీచిన్నదానిని జూచినవారై, దీవెనలొసంగక పోవరుసుమ్ము=దీవెనలీయకపోరుసుమీ, నావుడున్=అని యాకపటయతి చాటుననుండి పలుకఁగా.

తా. "సుందరీ! మేలుమేలు నీమాటకు మెచ్చితిని. యతీశ్వరునిరాక నీవెటుల గ్రహించితివి. నేర్పుతో వీణవాయించు నీచెలువ మనోహర గానామృతము హృదయమునకు సోఁకినవారలీ విద్యావతినిగాంచి దీవింపకపోరు" అని విదూషకుఁడనఁగా-

ఉ. అచ్చట నున్నయిందుముఖు•లందఱు నాపలు కాలకించి తా
నెచ్చటనుండియో యొకయ•తీంద్రుఁడు వచ్చెఁ గదమ్మ యంచు లో
నచ్చెరుపాటు సంభ్రమము•నందుచు గద్దియ డిగ్గి రంతలో
వచ్చెఁ దపోధనుండు జన•వల్లభుఁడున్ మది మెచ్చె నెచ్చెలిన్. 83

అచ్చటనున్న యిందుముఖు లందఱున్=ఆగిరికాగృహమునందునున్న స్త్రీలందఱును, ఆపలుకులాలకించి = యతీశ్వరుండుపలికిన యావాక్యము విని, తా నెచ్చటనుండియో యొక యతీంద్రుఁడు వచ్చెఁగదమ్మ యంచున్=తా నేప్రదేశమునుండియో యొకమునిశ్రేష్ఠుఁడు వచ్చెఁగదమ్మా యని యనుకొని, లోన్=మనస్సులో, అచ్చెరుపాటు=ఆశ్చర్యమును, సంభ్రమమున్=తొందరయును, అందుచున్=పొందుచు, గద్దియడిగ్గిరి = కూర్చున్న గద్దెపీటలపయినుండి దిగినవారైరి, అంతలోన్=అనఁగా నాస్త్రీలు లేచునంతలోపల, వచ్చెఁ దపోధనుండు=యతీశ్వరుఁడును నాగృహములోనికి వచ్చెను, జనవల్లభుఁడున్=తీఁగెలచాటునుండి చూచుచున్న వసురాజును, నెచ్చెలిన్=తనయొక్క నర్మసఖుని, మదిమెచ్చెన్=మనస్సున మెచ్చుకొనెను.

తా. ఆమునీంద్రునిపలు కాలకించినంతన నచటనున్న పడంతుకలందఱు ఎచటనుండియో యతీశ్వరుఁడు వచ్చెనమ్మా యని హఠాదాగమనమున కాశ్చర్యము సంభ్రమమునొందుచుఁ బీఠముల నుండి దిగిరి. రాజు నర్మసఖుని నేర్పరితనమునకు మిగుల నానందించెను.

చ. ముని యటు రాఁ దటాలున స•ముున్నతపీఠము డిగ్గి నిల్చునం
గననిరుపేదకౌను కుచ•గౌరవ మోర్వక కంప మొందఁగా

జనపతి చూడ్కి తోడనె స । సంభ్రమసంభరితానుకంప మై
యెనసి వలగ్నముం బొదివె । నీశులు దీనదయాళుదర్శనుల్. 84

మునియటురాఁ = యతీశ్వరుఁ డాప్రకారమురాఁగా, తటాలునన్ = తెప్పున, సమున్నత పీఠముడిగ్గి=మిక్కిలి యెత్తుగానున్న గద్దెమీఁదినుండిదిగి, నిల్చు=నిలువఁబడిన, అంగన=గిరికాదేవి యొక్క, నిరుపేదకౌను=కేవలమును బీదతనముగలిగియున్న నడుము, కుచగౌరవమోర్వక=స్తన భారమును సహింపలేక, కంపమొందఁగాన్ = వడఁకఁగా, జనపతిచూడ్కి = వసురాజుయొక్క చూపు, తోడనే = ఆవెంబడిగానే, ససంభ్రమ సంభరితానుకంపమై=సంభ్రమమనఁగా నాదర మును సంవేగమును, (ని. 'సంభ్రమ స్సాధ్వసే పిస్యా త్సంవేగా దరయో రపి' అని మే.) ససం భ్రమ=ఆవేగముతోఁ గూడుకొన్నదియు, సంభరిత=లెస్సగాఁ బూర్ణీభవింపఁబడినదియు, అనుకం పమై=వణుకుగలదియునై, అని యర్థము. ఆదరముతోఁ గూడుకొన్నదియును భరింపఁబడిన దయ గలదియు నై యనియర్థాంతరము. (ని. 'కృపా దయానుకంపా స్యాత్' అని అ.) ఎనసి=మిళిత మయి, వలగ్నముంబొదివెన్=నడుమును బొదిగిపట్టుకొనెను. (ని. 'మధ్యమం చావలగ్నంచ మధ్యో స్త్రీద్వౌపరౌ ద్వయోః' అని అ.) 'వష్టివాగురిరల్లోప మవాప్యోరుపసర్గయోః' అను వచనమువలన అవలగ్నమను పదముమొదటనుండు అకారమునకు లోపము గలదు గనుక వలగ్నమని చెప్పఁబడెను. ఈశులు=ప్రభువులు, (ని. 'ఈశ శ్శంభౌ ప్రభౌ తుత్రి ష్వీశా లాఙ్గలదణ్డకే' అని నా.) దీన=బీద వాండ్రయందు, దయాళు=దయగలిగిన; దర్శనుల్=చూపుగలవారు అనఁగా యతిని గిరికాదేవి చూచినతోడనే గద్దెపీటదిగి నిలుచుండఁగా స్తనభారముచేత నడుము జవజవలాడుచుండఁగా నపుడు చాటుగానున్నవసురాజు తొందరపాటును జలంబును గల చూపులచేత నానడుముయొక్క విలాస మును జూచెనని భావము. నిరుపేదకౌనసుటచే మిగుల సన్నముగా నుండెనసుట. కావుననె రాజు చూపులు అనుకంపవహించినది. అనుకంపఁగూడ నిరుపేదలయెడఁ జూపవలసినదె గాన 'దుర్బలస్యబలం రాజా' యనుధర్మము ననుసరించి ససంభ్రమసంభరితమైనది. అలం. అర్థాంతరన్యాసము.

తా. మునివచ్చినంతన నంగన పీఠము తటాలునడిగి నిలిచినంతనఁ జనుగవబ్రేఁగుచే నిరుపేద నడుము వడఁకసాగెను. రాజుచూపులు తొందరపాటు దయగలవియై కౌనునకు నాధారభూతములై నిలిపెను. రాజులు దీనదయాళురుగదా!

తే. ఇంతియును నంత నంతంత । నెదిగి పొదలు
నిబ్బరపుగబ్బిగుబ్బల । యుబ్బుకతన
నోరగాఁ బాణికంజంబు । లూఁది మ్రొక్కె
మక్కువ సఖీమణులుఁ దాను । మానిమణికి. 85

ఇంతియును = గిరికాదేవియును, అంతన్=అంతట, అంతంతనెదిగిపొదలు = అంతకంతకు వృద్ధిఁబొంది యొప్పుచున్న, నిబ్బరపు=దృఢములైన, గబ్బి=కదలనట్టి, గుబ్బల=స్తనములయొక్క, ఉబ్బుకతనన్ = పొంగరింపువలన, అతిశయమువలన, నిబ్బరమనెడుపదము నిర్భరశబ్దముయొక్క తద్భవము, ఓరగాఁ బాణికంజంబులూఁది=ఒకవైపుగా హస్తకమలములు జోడించి, మక్కువన్= ప్రీతిచేత, సఖీమణులున్ = చెలికత్తియలును, తానున్=తానును, మానిమణికిన్=మునిశ్రేష్ఠునికి,

మ్రొక్కెన్=దండము సమర్పించెను. జవ్వనులగుబ్బ లంతంతకు ఉబ్బునిబ్బరముతో నొప్పారు ననుట కవిసమయసిద్ధము. చూడుఁడు. బిల్హణీయము-

శ్లో."ప్రతిక్షణవిజృంభణాదుభయబాహుకూలంకషత్
స్తనత్రుటితకంచుకం నమతయావనం యోషితాం."

గుబ్బలయుబ్బుతనము తెలుపుట యుపభోగయోగ్యము సూచించుట.

తా. మాటిమాటికిఁ బొంగుచున్న గబ్బిగుబ్బలయుబ్బుచే నెటులో యోరఁగాఁ గేలుదమ్ములను మోడ్చి యాచెలువ సఖీసహితయై మునికి నమస్కరించెను.

వ. అప్పు డప్ప్రతినవతపోనిధి యొప్పులకుప్ప యగు నప్పూఁబోఁడియనల్పవినయ కల్పనంబులకు నుప్పొంగి యో యనన్యకన్యాసామాన్యలావణ్యప్రభా వసువల్లభుం బెండ్లియాడు మని దీవించి తదీయవివిధపూజావిధానంబులం బ్రమోదమానమానసుం డై యాముద్దియలిడు పసిండిగద్దియ నధివసించె నయ్యెడం దొయ్యలులు నయ్యతిపనుపునం దమతమయుచితాసనంబుల నలంకరించి రంత నాకంజనయనయనుంగుంజెలులలో సమంజసవచనచాతురీరంజిత యగు మంజువాణి యంజలిపట్టి యతికుంజరునితో నిట్లనియె. 86

అప్పుడు=ఆగిరికాదేవి నమస్కరించిన సమయమందు, అప్ప్రతినవతపోనిధి=సాటిలేనినూతన యతీశ్వరుఁడు, ఒప్పులకుప్పయగు=సౌందర్యరాశియైన, అప్పూఁబోఁడి=ఆగిరికయొక్క, అనల్ప వినయ కల్పనంబులకున్=అధికమైన వినయోత్పాదనములకు, ఉప్పొంగి=సంతోషముచేతఁ బొంగినవాఁడై, అనన్యకన్యాసామాన్య=ఇతరకన్యలకు సాధారణముగాని, లావణ్యప్రభావ=లావణ్యమనఁగా ముత్యములలోఁ గనుపించెడు కాంతియొక్క బెళుకువలె నవయవములయందుఁ బ్రకాశించెడు కళకుఁ బేరు. అట్టి లావణ్యమహిమగల యోచిన్నదానా, సువల్లభుం బెండ్లియాడుమని దీవించి=మంచి ప్రియపురుషుని వివాహము గమ్మని యాశీర్వదించి యని యర్థము. అనన్యకన్యాసామాన్య లావణ్యప్రభా వసురాజుం బెండ్లియాడుమని దీవించి యనిభావము. తదీయవివిధపూజావిధానంబులన్=ఆ గిరికాదేవిసంబంధమైన యర్ఘ్యపాద్యాది పూజావిధులచేత, ప్రమోదమానమానసుండై=సంతోషించుచున్న మనస్సుగలవాఁడై, ఆముద్దియలిడు పసిండిగద్దియ నధివసించెన్=ఆ గిరికయొక్క చెలికత్తెలు తెచ్చియుంచిన బంగారు గద్దెపీటమీఁదఁ గూర్చుండెను. గీ. 'పసిఁడి బంగారు బంగరు పైఁడిహొన్ను, జాళువాపుత్తడి యనంగ స్వర్ణమగురు' అని ఆంధ్రనామసంగ్రహము. అయ్యెడం దొయ్యలులు నయ్యతిపనుపునన్=ఆసమయమం దక్కడి స్త్రీలందఱు నాయతీశ్వరుని యనుజ్ఞచేత, తమతమ యుచితాసనంబుల నలంకరించిరి=వారివారియొక్క యర్హపీఠములను శోభింపఁజేసిరి, అనఁగాఁ దమతమగద్దెలమీఁదఁ గూర్చుండిరనుట, ఆకంజనయన యనుఁగుంజెలులలోన్=ఆగిరికయొక్క ప్రియసఖులలో, సమంజస=చక్కనైన, వచనచాతురీ = వాక్యచమత్కృతిచేత, రంజితయగు=ప్రకాశింపఁబడుచున్నదైన, మంజువాణి=మంజువాణియనెడు చెలికత్తియ, అంజలి పట్టి=దోసిలిపట్టుకొన్నదై అనఁగాఁ గేలుమోడ్చి, యతికుంజరునకిట్లనియెన్ = యతిశ్రేష్ఠునితో నొక వాక్యము పలికెను.

ఉ. ఎచ్చటనుండి యెచ్చటికి • నేగుచు నిచ్చటి కద్భుతంబుగా
వచ్చితి రార్యసన్నుత భ•వచ్చరణాబ్జనఖేందుయుక్తిచే
నచ్చపుఁదెల్వి వచ్చెఁ దమ • మంతయు విచ్చెఁ గళాకలాపముల్
హెచ్చె మదాళిభాగ్య మిఁక • నింద్రపురంధ్రుల కైనఁ గల్గునే. 87

ఎచ్చటనుండి యెచ్చటికి నేగుచు నిచ్చటి కద్భుతంబుగా వచ్చితిరి=ఎక్కడనుండి యెక్కడికిఁ బోవుచు నిక్కడి కాశ్చర్యమగునట్టులుగా విజయముచేసితిరి, ఆర్యసన్నుత=పూజ్యులైనవారిచేత స్తోత్రముచేయఁబడిన మహాత్మా, భవత్=దేవరవారియొక్క, చరణాబ్జ = పాదపద్మములయొక్క, నఖ=గోరనెడు, ఇందు=చంద్రునియొక్క, యుక్తిచేన్=కూడుకొనుటచేత, అచ్చపుఁదెల్వివచ్చెన్= తెలివియనఁగా వికాసమును వెన్నెలయును గనుక, స్వచ్ఛమైన తెలివియనెడు వెన్నెల వచ్చెను, తమ మంతయువిచ్చెన్=తమమనఁగా నజ్ఞానంబును జీఁకటియును, అజ్ఞానమనెడు చీఁకటి విచ్చిపోయెను, కళాకలాపముల్ హెచ్చెన్=లావణ్యకళలనెడు షోడశకళాసమూహములతిశయించెను, మత్=నా యొక్క, ఆళి=చెలికత్తెయైన గిరికయొక్క, భాగ్యము=అదృష్టము, (ని. 'దైవం దిష్టం భాగధేయం భాగ్యమ్' అని అ.) ఇఁకన్=ఇఁకమీఁద, ఇంద్రపురంధ్రులకైనఁ గల్గునే=దేవతాస్త్రీలకైనఁ గలుగునా, అనఁగాఁ గలుగనేర దనుట. అలం. శిష్టరూపకము.

తా. మునీంద్రా! తా మెచటనుండి యెటకేగుచు నిచటి కేగుదెంచితిరి. మీరాక మిగుల నచ్చెరువు కలిగించుచున్నది. మీరు మామందిరమునఁ గాలూనుటచే మాకు నూతనవికాసము చేకూరెను. మాయజ్ఞానము నశించెను. మాచెలికత్తియ యదృష్టము వేలుపులచెలువలకేని కలుగునా?

ఉ. అంబురుహాప్తతేజ భవ•దంఘ్రిల వ్రాలఁగఁ గల్గునుత్తమాం
గం బది యుత్తమాంగము జ•గన్మహనీయ భవత్కథావిశే
షంబు నుతింపఁగాఁ గలర•సజ్ఞ రసజ్ఞ భవద్విభావనా
ప్తిం బరిపూర్ణ మై జరుగు•దిష్టము దిష్టము శిష్టకోటికిన్. 88

అంబురుహాప్తతేజ = సూర్యునితేజస్సువంటి తేజస్సుగలమహాత్మా, శిష్టకోటికిన్ = పెద్దలైన వారికి, భవత్=దేవరవారియొక్క, అంఘ్రిలవ్రాలఁగఁగల్గు=పాదములయందుఁ జేరఁగల్గిన, ఉత్తమాంగంబు=శిరమనునది యేదిగలదో, అది=అదియ, ఉత్తమాంగము = శిరస్సును నుత్తమమయిన యవయవంబును, (ని. 'ఉత్తమాఙ్గం శిర శ్శీర్షమ్' అని అ.) జగన్మహనీయ=జగత్తులయం దధికుఁడ వైనవాఁడా, భవత్కథావిశేషంబునుతింపఁగాఁగల=మీయొక్క చరిత్రాతిశయము గొనియాడఁ గలిగిన, రసజ్ఞ=నాలుకయేదిగలదో, రసజ్ఞ=అదియనాలుకయును, సమస్తరసములను గుర్తెఱిఁగినది యును, (ని. 'రసజ్ఞాం రసనా జిహ్వా' అని అ.) భవత్=దేవరవారియొక్క, విభావనాప్తిన్=ధ్యాన ప్రాప్తిచేత, పరిపూర్ణమైజరుగు = సంపూర్ణమై గతించునట్టి, దిష్టము=కాలమేదిగలదో, దిష్టము= అదియ కాలంబును శుభకరమయిన యదృష్టంబును, (ని. 'దిష్టం దైవేచ కాలే స్యాత్' అని నిఘంటువు.)

తా. మునీంద్రా! మీపాదములపైఁ జేర్చి మ్రొక్కఁగలిగిన తలయేతల, మీపావనచరిత్రవిశేషము గొనియాడఁగలుగు నాలుకయే నాలుక, మీధ్యానముచేతఁ బూతమైన సమయమే సమయము.

క. లలనాలలామవీణా, కలనాదము మెచ్చి కరుణఁ • గమనీయవరా
కలనాదరమున వచ్చిన, యలనాదప్రియుఁడవో మ•హాత్మ దెలుపవే. 89

లలనాలలామ=కాంతశిరోమణియైన మాచెలియొక్క, వీణాకలనాదము మెచ్చి=వీణాసంబంధమైన యవ్యక్తమధురధ్వని నంగీకరించి, కరుణన్=దయచేత, కమనీయవరాకలనాదరమునన్-కమనీయ=ఒప్పుచున్న, వరాకలన=వరములిచ్చుటయందలి, ఆదరమునన్=ఆదరముచేతనని యర్థము. సుందరుఁడైన పెనిమిటిని ఘటనపఱుచు నాదరముచేత నని యర్థాంతరము. (ని. 'దేవప్రసాదే వరణే జామాతరి వరః పుమాన్, క్లీబేతు కుంకుమే శ్రేష్ఠే త్రిష్విష్టే త్వవ్యయం పరమ్' నా.) వచ్చిన=విజయముచేసిన, అలనాదప్రియుఁడవో=ఆగానప్రియుఁడవైన నారదుఁడవేమో, మహాత్మ=మహానుభావా, తెలుపవే=ఆనతియ్యవే.

తా. ఈకాంతాశిరోమణి వీణాగానమునకు మెచ్చుకొని మనోహరవరములు (వరుని) సమకూర్చుటకు నేతెంచిన నారదమహామునివా? నీవు చెప్పుము.

ఉ. ఓయతులప్రభావయుత • యోాయతిలోకమణీ యనంతర
త్నాయతతేజ తావకశు•భాంకముఁ గన్న సువర్ణరేఖలం
బాయనికూర్మిఁ దెల్పి యన•పాయముగాఁగ మదీయకర్ణపా
ళీయుగళీపరిష్కరణ•లీల ఘటింపఁగదే ముదంబునన్. 90

ఈపద్యమందు యతిలోకమణీ, అన్నందున మునిపరముగాను మణిపరముగాను నర్థద్వయము విచారింపవలయును. ఏలాగనిన, ఓయతులప్రభావ=సమానరహితమయిన ప్రభావముగలవాఁడా యని మునిపరమైన యర్థము. (ని. 'తులా సాదృశ్య మానయోః' అని మే.) తులయనఁగా మానమును, అతుల=మానము నతిక్రమించినదియుం, ప్రభావ = ప్రభావయుతమయినదియు నని మణిపరమయిన యర్థము. ఓయతిలోకమణీ=ఓయతిజనశ్రేష్ఠుఁడా యని మునిపరమయిన యర్థము. అతిలోకమణీ=లోకాతిగమయిన మాణిక్యమని మణిపరమయిన యర్థము. అనంతరత్న=సూర్యునివలె, ఆయతతేజ=విస్తారమయిన తేజస్సుగలవాఁడా యని మునిపరమయిన యర్థము. అసంఖ్యములైన రత్నములయొక్క యాయతమైన తేజముగలదని మణిపరమయిన యర్థము. (ని. 'అనంతం గగనే క్లీబే పుమాన్ కేశవశేషయోః, అనంతా పూర్ణిమా దూర్వా విశల్యా శారిబా మహీ' అని నా.) తావకశుభాంకముఁ గన్న=నీయొక్క శుభమయిన నామముగా నేర్పడిన, సువర్ణరేఖలన్=యోగ్యమయిన యక్షరపంక్తుల నని మునిపరమయిన యర్థము. మాణిక్యాంకిత కాంచనరేఖలని అనఁగాఁ గర్ణాభరణవిశేషములని యర్థాంతరము. పాయనికూర్మిఁదెల్పి=ఎడతెగని ప్రేమచేత నానతిచ్చి, అనపాయముగాఁగన్=అపాయరహితమగునట్టులుగా, మదీయ=నా సంబంధమయిన, కర్ణపాళీయుగళీ=కర్ణద్వయమునకు, పరిష్కరణలీలన్=అనఁగాఁ గర్ణసంతుష్టిని, ముదంబునన్=సంతోషముచేత, ఘటింపఁగదే=ఘటనపఱుపఁగదే యని మునిపరమయిన యర్థము. కర్ణాలంకారమును జేయఁగదే యని మణిపరమయిన యర్థము. అనఁగా గిరికాదేవియొక్క ప్రియసఖియైన మంజువాణి యతిని స్తోత్రముచేసి మీ నామధేయ మానతిచ్చి శ్రవణానంద మగునట్టులుగాఁ జేయవే యని యడిగెనని తాత్పర్యము. ఇది ప్రకృతాప్రకృతశ్లేషాలంకారము.

చ. అన మునిరాజుపల్కు వని•తా జనతావినుతాభిధేయుఁ డై
యొనరినగౌతముౘ్ మునికు•లోత్తముఁ జెప్పఁగ విందువే కదా
యనఘుతదన్వవాయకల•శాంబుధిఁ బుట్టినవాఁడ గౌతమా
ఖ్య నెసఁగువాఁడ నేఁ బరమ•హాసరసప్రతిభానుభావుఁడన్. 91

అనౘ్=మంజువాణి యిట్లడుగఁగా, మునిరాజుపల్కుౘ్=మునిశ్రేష్ఠుఁడు పలుకుచున్నాఁడు. ఏమనియనిన, వనితా=ఓచిన్నదానా, జనతా=జనసమూహముచేత, వినుత=స్తోత్రముచేయఁబడిన, అభిధేయుఁడై=పేరుగలవాఁడై, ఒనరిన=ఒప్పిన, మునికులోత్తముౘ్=మునికులశ్రేష్ఠుఁడయిన, గౌతమున్=గౌతముని, చెప్పఁగవిందువేకదా=చెప్పుకొనఁగా వినియుందువేకదా, అనఘ = దోషరహితమైన, తత్=ఆగౌతమునియొక్క, అన్వవాయ=వంశమనెడు, కలశాంబుధిౘ్=క్షీరసముద్రమందు, పుట్టినవాఁడౘ్=సంభవించినవాఁడను, గౌతమాఖ్య నెసఁగువాఁడౘ్=గౌతముఁడనుపేరుచేత నొప్పుచున్నవాఁడను, నేౘ్=నేను, పర=పరమపురుషునియందు, మహాసరస=అధికస్వారస్యముగల, ప్రతిభా=అప్పటప్పటికి వికాసమును బొందుచుండెడు బుద్ధియొక్క, అనుభావుఁడౘ్ = ప్రభావము గలవాఁడను అని యర్థము. పరమ=ఉత్కృష్టమయిన, హాసరస = హాస్యరసమందలి, ప్రతిభా=ప్రభావముగలవాఁడనని యర్థాంతరము. (ని. 'ప్రజ్ఞాం నవనవోన్మేషశాలినీం ప్రతిభాంవిదుః') హాసరసము గలవాఁడనఁగా నాయికానుకూల్యమందు సహాయుఁడైన విదూషకుఁ డని తెలియవలయును. 'సంధానకుశల శ్చేటో హాస్యకారీ విదూషకః.' ఈపద్యపుమొదటిపాదమున తా అనునక్షరముమీఁది సంబోధనవిశిష్టమయిన యాకారము యతిగాఁ జెల్లినది. ఇది కాకుస్వరయతిగాని ప్లుతయతిగాని యనంబడును. దీనికి లక్షణము, ని.

క. 'పలుకులతలగలవ్రాలకు, పలనగుచోఁ బ్లుతము నిల్పి వానికి రెండుౘ్
వళులుగఁ జెప్పినఁ గావ్యం, బుల నది కాకుస్వరంబు ప్లుతవళియు నగుౘ్.' అని.

ఇదిమొదలుకొని నర్మసచివునివాక్యములు గుణీభూత వ్యంగ్యములుగ నున్నవి.

తల్లక్షణము:—

శ్లో. కావ్యం ధ్వనిర్గుణీభూత వ్యంగ్యం చేతి ద్విధామతం
వాచ్యాతిశయిని వ్యంగ్యే ధ్వని స్తత్కావ్యముత్తమం.
అపరంతు గుణీభూత వ్యంగ్యం వాచ్యా దనుత్తమే వ్యంగ్యే
తత్రస్యా దితరాంగం కాక్వాక్షిప్తంచ వాచ్యసిద్ధ్యంగం.
సందిగ్ధ ప్రాధాన్యం తుల్యప్రాధాన్య మస్ఫుటమగూఢం
వ్యంగ్యమ సుందరమేవం భేదా స్త స్యోదితా అష్టౌ. సాహిత్యదర్పణము.

తా. అని మంజువాణి పలుకఁగా మునిరాజు తనవృత్తాంతము నిటులఁ దెలిపెను. సుప్రసిద్ధుఁడగు గౌతముని వినియుందువుగదా! నే నాతనివంశమునఁ బుట్టినవాఁడను. నాపేరు గౌతముఁడు. (మహాప్రభావ సంపన్నుఁడను. హాస్యరస నిపుణుఁడనని యర్థాంతరము.)

ఉ. ఓవలమానమీనమిథు•నోపమలోలవిలోచనాంతకాం
తా వసునాథు నున్నతన•గాహితపాదసనాథు నాత్మసం

సేవకసేవధిం దగ భ♦జించి తదీయరహస్యమంత్రసం
భావనచే ననాదిముని♦మార్గముఁ గాంచితి నద్భుతంబుగాన్. 92

వలమాన=బెళకుచుండెడు,మీనమిథున=వాలుగ చేఁపలజోడుతోడ,ఉపమ=సామ్యముగల,లోల=చలించుచున్న, విలోచన=నేత్రములయొక్క, అంత=కొనలుగల, కాంతా = ఓసుందరీ, ఉన్నత=పొడవైన,నగ=వృక్షములయందు,ఆహిత=ప్రసరింపఁజేయఁబడిన, పాద=కిరణములతోడ, సనాథుణ్=కూడుకొన్నయని సూర్యపరమైన యర్థము. ఉన్నతనగ=మిక్కిలిపొడవైన కోలాహలపర్వతమునకు, (ని. 'శైలవృక్షౌ నగావగౌ' అని అ.) ఆహిత=ప్రతికూలమైన, పాదసనాథుణ్=పాదముతోఁ గూడుకొన్న యని రాజపరమైన యర్థము.(ని. 'పాదా రశ్మ్యఙ్ఘ్రితుర్యాంశాః'అని అ.)సంసేవక=లెస్సగా సేవించినవారికి, సేవధిణ్=నిధియైన, (ని. 'నిధి ర్నా సేవధిః' అని అ.) ఈవిశేషణ ముభయసామాన్యము. వసునాథుణ్ = సూర్యుని ననియర్థము. వసురాజునని యర్థాంతరము. ఆత్మణ్=మనస్సునందు, తగభజించి=యుక్తమగునట్టులుగాఁ గొలిచి, తదీయ = ఆసూర్యసంబంధమైన, రహస్యమంత్ర=గోప్యమైన మంత్రముయొక్క, సంభావనచేణ్=సమ్యగ్భావనచేత, అనఁగా ననుష్ఠానముచే ననియర్థము. ఆరాజుయొక్క రహస్య కార్యాలోచనమందలి యూహచేత నని యర్థాంతరము. (ని. 'మన్త్రో వేద భేదే స్యా ద్దేవాదీనాంచ సాధనే, గుప్తవాదే' అని అ.) అద్భుతంబుగాణ్=ఆశ్చర్యమగునట్టులుగా, అనాదిమునిమార్గముఁ గాంచితిణ్=అనఁగా ('నవిద్యతే ఆదిర్యస్యాత్సః అనాదిః ఆనాదిశ్చాసౌ మునిశ్చ అనాదిమునిః') అనెడువిగ్రహమువలనఁ బురాతనమునులయొక్క మార్గమును బొందితినని యర్థము. 'ఆదిశ్చాసౌమునిశ్చ ఆదిమునిః, ఆదిమునిరన్నభవతీత్యనాదిమునిః' అనెడు విగ్రహమువలన నూతన మునిమార్గముమ బొందితినని యర్థాంతరము. ఈపద్యపు రెండవపాదమునందును గాకుస్వరయతి యని గ్రహించునది.

తా. ఓబేడిసమీలవంటి చలియించు కడగంటి చూపులుగలపొలంతీ! వసునాథుని (సూర్యుని) సేవించి తన్మంత్రశక్తిచే నచ్చెరువు గలుగఁజేయు నీయనాది (ఆదినుండియులేని) మునిభావము గడించినాఁడను.

తే. నాఁతి విను మేను బిన్నట♦నాఁటనుండి
యును దదంఘ్రిసేవావృత్తి ♦ నున్నకతన
నిచ్చె నాకుఁ బ్రసన్నుఁడై ♦ యినుఁ డతండు
సకలపదముల నాత్మాను♦సరణ మహిమ. 93

నాఁతి=ఓమగువా, వినుము=ఆలకింపుము. ఏనుపిన్నటనాఁటనుండియును=నేను చిన్ననాఁటనుండియును, నేను చిన్ననాఁటంగోలె, తత్=ఆసూర్యునియొక్క, అంఘ్రిసేవావృత్తిణ్=అంఘ్రియనఁగాఁ గిరణము, కిరణాస్వాదనవృత్తిచేత, అనఁగాఁ గిరణపానతపోవృత్తిచేత, ఉన్నకతనణ్=ఉన్నందుచేతనని సూర్యపరమయిన యర్థము. తత్=ఆవసురాజుయొక్క, అంఘ్రిసేవావృత్తినున్నకతనణ్=పాదసేవావ్యాపారమున నున్నందుచేతనని రాజపరమయినయర్థము. ప్రసన్నుఁడై=ప్రత్యక్షమయినవాఁడై యనియును, అనుగ్రహించినవాఁడై యనియును నర్థద్వయము. ఇనుఁడతండు=ఇనుఁడనఁగా సూర్యుఁడును ప్రభువును, (ని. 'ఇనో భూపే రఘౌ పుంసి ధనిక స్వామినో స్త్రీషు' అని. నా.)

సూర్యుఁడైన యతఁడనియును ప్రభువైన యతఁడనియును నర్థద్వయము. సకలపదముల నాత్మానుసరణ మహిమన్ =పదమనఁగా స్థానము నధికారమును, అనుసరణమనఁగా ననుగమనంబును ననుకృతియును, మేరుకైలాసమందరాది స్థానములయందుఁ దనతోడ సంచరించు ప్రభావమునని సూర్యపరమయిన యర్థము. సకలాధికారములయందును స్వతంత్రప్రవర్తనముసేయుటనని రాజపరమయిన యర్థము. (ని. 'పదం వ్యవసిత త్రాణ స్థాన లక్ష్మాం ఘ్రి వస్తుషు' అని అ.) నాకునిచ్చెన్ = నాకు దయచేసెను.

తా. ఓపడంతీ! పసితనమునుండి యామహానుభావుని యంఘ్రిసేవ గావించుటవలన నాయెడఁ బ్రసన్నుఁడై యాయినుఁడు తన్ననుసరించు (చుఁదిరుగు) శక్తినొసంగెను.

సీ. కావున నుద్యానగతుఁడైన మత్స్వామితోన మేరుసమేధమానమంజు
లచ్ఛాయలఁ గరంబలరుచు నీలగ్రీవనిలయాభిరామసీమలఁ దెలియుచు [-చు
సుమనోమనోజ్ఞధామములు మెచ్చుచుఁ బుష్కరసరోవరోర్మిసంభ్రమముఁగను
రంభాదిలాస్యసంరంభము ల్దిలకించుకొనుచుఁ గిన్నరమృదుధ్వనులు వినుచు
తే. శిశిరశిఖరిస్థలంబు లీక్షించికొనుచుఁ, జంపకారణ్య మరయుచు జగతి నద్భు
తం బయినపుండరీకకేదారసేతు, వైఖరికి నిచ్చగించుచు వచ్చివచ్చి. 94

కావునన్ =అట్లగుటవలన, ఉద్యానగతుఁడైన మత్స్వామితోన=ఊర్ధ్వయానమునుబొందిన నాస్వామితోఁగూడ, అనఁగా సూర్యునితోఁగూడ, మేరు = మేరుపర్వతమందు, సమేధమాన=లెస్సగా వృద్ధిఁబొందుచున్న, మంజుల=మనోహరములయిన, ఛాయలన్ =కాంతులచేత, కరంబలరుచున్ = మిక్కిలియు సంతోషించుచును అని సూర్యపరమైనయర్థము. ఉద్యానగతుఁడైనమత్స్వామితోన్= ఉద్యానవనవిహారము నంగీకరించిన మాప్రభువుతోఁగూడ, నమేరు=పొన్నచెట్లయొక్క, సమేధమాన =వృద్ధిఁబొందుచున్న, మంజుల=చల్లఁదనముచేత సంతోషపఱుచుచున్న, ఛాయలన్ =నీడలయందు, కరంబలరుచున్ =మిక్కిలి సంతసమునొందుచున్న, అని రాజపరమైనయర్థము. ని. 'ఛాయా సూర్యప్రియా కాన్తిః ప్రతిబింబ మనాతపః' అని అ. నీలగ్రీవ=శివునికి, నిలయ=గృహమైన కైలాసమందు, అభిరామ=ఒప్పుచుండెడు, సీమలన్ =ప్రదేశములను, తెలియుచున్ =కనుపఱుచుకొంచు అని యర్థము. నీలగ్రీవములనఁగా నెమళ్లును, వానికి స్థానభూతములైన ప్రదేశములను జూచుచు అని యర్థాంతరము. సుమనః = దేవతలయొక్క , మనోజ్ఞ = సుందరములైన, ధామములు = మేడలు మొదలైన గృహములను, మెచ్చుచున్ =మెచ్చుకొనుచు అనియర్థము. సుమనః=పుష్పములచేత, మనోజ్ఞ=మనోహరములగుచున్న, ధామములు=గృహములను, అనఁగాఁబూఁబొదరిండ్లను-మెచ్చుకొనుచునని యర్థాంతరము. పుష్కరసరోవర=పుష్కరమనెడు తీర్థమందలి, ఊర్మిసంభ్రమము గనుచున్ =తరంగసంవేగమును జూచుచునని యర్థము. పుష్కరశబ్దము కమలమందును వర్తించును. పుష్కరసరోవర = తామరకొలఁకులయందలి తరంగసంచలనమునుజూచుచు నని యర్థాంతరము. రంభాది=రంభమొదలుగాఁగల అప్సరస్త్రీలయొక్క, లాస్యసంరంభములు = నాట్యవిజృంభణములను, తిలకించుకొనుచున్ = చూచుకొనుచు నని యర్థము. రంభాది=అరంట్లుమొదలైన వృక్షములయొక్క,లాస్యసంరంభములు=చలనసంరంభములను జూచుకొనుచునని యర్థాంతరము. కిన్నర=కిన్నరులనెడు దేవయోనులయొక్క, అనఁగాఁ

దురంగవక్త్రులయొక్క, మృదుధ్వనులువినుచున్=సౌమ్యములైన సంగీతనాదముల నాకర్ణించుచు నని అర్థము. కిన్నరపక్షినాదములను వించునని అర్థాంతరము.

శిశిరశిఖరిస్థలంబు లీక్షించికొనుచున్=హిమవత్పర్వతముయొక్క ప్రదేశంబులను జూచుకొనుచు నని యర్థము, శిశిరశిఖరిస్థలంబులు=చల్లనైన వృక్షప్రదేశములను, జూచుకొనుచునని యర్థాంతరము. (ని. 'తరుశైలౌ శిఖరిణౌ' అని అ.) చంపకారణ్య మరయుచున్=చంపకారణ్యమనెడు పుణ్యభూమిని జూచుచు నని యర్థము. సంపఁగితోఁటలు చూచుచు నని యర్థాంతరము. జగతినద్భుతంబయిన = లోకమందాశ్చర్యకరమైన, పుండరీక కేదార సేతువైఖరికి నిచ్చగించుచున్ = పుండరీక, కేదార, సేతువులనెడు పుణ్యక్షేత్రములయొక్కరీతికి నిష్టమునుబొందుచు, అనఁగా సేవించుచునని యర్థము. పుండరీకకేదార=పద్మములుగల మళ్ళపట్టులయొక్క, (ని. 'పుణ్డరీకం సితచ్ఛత్రే కుష్ఠభేదే సితాంబుజే, నా త్వామ్రే రజతే వ్యాఘ్రే దిగ్గజే కుఞ్జరే స్వరే' అని నా.) సేతువైఖరికిన్=కట్టలుండెడు పొందికకు, ఇచ్చగించుచున్=మెచ్చుకొనుచునని యర్థాంతరము. వచ్చివచ్చి=వచ్చుచువచ్చుచున్నవాఁడనై. అలం. శ్లేషాలంకారము.

తా. వనవిహారతత్పరుఁడగు మారాజుతోఁగూడ బయలుదేరి సురపొన్నలు సెమిల్లె పూలగుత్తులు సరోవరతరంగములు అరటిచెట్టులయందములు దిలకించుచుఁ గిన్నరపక్షులగానము లాలించుచుఁ జల్లనిచోటుల మెలఁగుచు సంపంగితోఁటలు తమ్మికొలఁకులుఁ జూచుచువచ్చి (అర్థాంతరము) ఆకాశయానముగావించు మాయజమానితోఁగలసి మేరుపర్వతభాగము కైలాసము మానససరోవరము రంభాద్యప్సరోనృత్యములు జూచుచుఁ గిన్నరగానము లాలించుచు, మంచుకొండ వేల్పులకూటములు గాంచుచుఁ జంపకారణ్యముఁజూచి సేతుకేదారాది క్షేత్రదర్శనమునకు వచ్చి.

చ. సరసదరీఝరీవికచసారససౌరభసారపూరితాం
బర మగునిమ్మహానగముపజ్జనె యానవపద్మినీమనో
హరుఁడు వెలుంగ నాయన కుపాయన మిచ్చుటఁ గూర్చువాఁడనై
యరయుదుఁ బద్మినీసముదయం బని వచ్చితి నమ్మ నెచ్చెలీ. 95

సరస=యోగ్యమయిన, దరీ=గుహాప్రాంతములయందలి, ఝరీ=ప్రవాహములయందు, వికచ=వికసించిన, సారస=కమలములయొక్క, సౌరభసార=శ్రేష్ఠమైన పరిమళముచేత, పూరిత=నిండింపఁబడిన, అంబరమగు=ఆకాశముగలదైన, ఇమ్మహానగముపజ్జనె=ఈమహత్తయిన కోలాహల పర్వతముయొక్క ప్రాంతమందే, ఆనవపద్మినీ మనోహరుఁడు వెలుంగన్=పద్మిని యనఁగాఁ బద్మలతయును బద్మినీజాతిస్త్రీయును, (ని. 'పద్మినీ కరిణీ శ్రీ స్త్రీ సరోజాబ్జ నళినీషు చ' అని నా.) ఆ, నవపద్మినీమనోహరుఁడు=నూతనమయిన పద్మలతకుఁ బ్రియుఁడైన సూర్యుఁడు, ప్రకాశింపఁగా ననియర్థము. నూతన పద్మినీజాతిస్త్రీలకుఁ బ్రియుఁడైన వసురాజు విలసిల్లఁగానని యర్థాంతరము. ఆయన కుపాయన మిచ్చుట గూర్చువాఁడనై=ఉపాయనమనఁగాఁ గానుక, ఆసూర్యునకుఁ గానుక సమర్పించుటకు ఘటనపఱుచువాఁడనై యనియును నావసురాజునకుఁ గానుక యియ్యఁదలఁచినవాఁడనై యనియును నర్థద్వయము. అరయుదుఁ బద్మినీసముదయంబనివచ్చితినమ్మ=పద్మలతాసమూహమును వెదకుదుఁగాక యని యేతెంచితినమ్మా యనియర్థము. పద్మినీజాతి స్త్రీసముదాయమును వెదకుదుఁగాక అని వచ్చితినమ్మా అని అర్థాంతరము. నెచ్చెలీ=సఖీమణీ అని సంబుద్ధి.

తా. ఇచటి సెలయేళ్లయందలి వచ్చిన తామరపూవు లాకాశమంతటను దావులొలయించుచుండ మాపద్మినీ మనోహరుఁడు (రాజు-సూర్యుఁడు) ఇట నిలిచెను. ఆతని కుపాయనముగఁ బద్మినీసముదయమును (తామరకాడలను-పద్మినీజాతిస్త్రీలను) సమకూర్చుట కరుగుదెంచితిని.

క. అని తెలిపి మఱియు నిట్లను, వనితా యీకన్య యనఘ • వైభవధన్యం
గనుఁగొన వాత్సల్యంబును, ననుకంపయు నద్భుతంబు • నయ్యెడుమాకున్. 96

అని తెలిపి=ఇట్లని తెలియఁజెప్పి, మఱియునిట్లనున్=మఱల నీలాగనెను. ఏమనిన, వనితా=ఓమగువా, అనఘ=దోషరహితమైన, వైభవ=విభవముచేత, ధన్యన్=కృతార్థురాలైన, ఈకన్యన్=ఈకన్నియను, కనుఁగొనన్=చూడఁగా, మాకున్=మాకు, వాత్సల్యంబును=ప్రేమయును, అనుకంపయున్=కరుణయును, (ని. 'కారుణ్యం కరుణా ఘృణా, కృపా దయా నుకంపా స్యాత్' అని అ.) అద్భుతంబున్=ఆశ్చర్యంబును, అయ్యెడున్=అవుచున్నది.

తా. చెలువా! విభవముచేఁ గృతార్థురాలుగనున్న యీకన్నియను జూచినంతన మాకుఁ గరుణ ప్రేమ ఆశ్చర్యము జనించుచున్నది.

చ. అనుపమభాగ్యలక్షణస • మన్విత యీరమణీలలామ యీ
మనసిజరాజరాజ్యరమ • మానసవీథిఁ దలంప సింధునం
దన యచలేంద్రనందన య • నంగన నయ్యెడి నీలతాంగిపా
వనకులగోత్రభూతి చెలు • వా చెలువారఁగఁ దెల్పవే యనన్. 97

అనుపమ భాగ్యలక్షణ సమన్విత = సమానరహితములయిన భాగ్యచిహ్నములతోఁ గూడిన, ఈరమణీలలామ=ఈసుందరీశిరోభూషణమైనదియు, ఈమనసిజరాజరాజ్యరమ=మన్మథరాజరాజ్యలక్ష్మియైనదియు నగు నీకన్య, మానసవీథిఁదలంపన్=మనస్సునందు విచారింపఁగా, సింధునందన=లక్ష్మీదేవియును, అచలేంద్రనందన=గౌరీదేవియును, అనంగన నయ్యెడిన్=అన్నట్టులుగాఁ జూడఁదగియున్నది అని అర్థము. (ని. 'సింధుస్తు వారిధౌ, దేశే నదే గజమదే నా నద్యాంతు స్త్రియా మయమ్.' అని నా.) సింధుశబ్దము నదియందును వర్తించుచున్నదిగనుక శుక్తిమతీనదీపుత్రిక యనియును నచలేంద్రనందన అనఁగాఁ బర్వతశ్రేష్ఠుఁడైన కోలాహలుని పుత్రిక అనియును గిరికాపరమైన ధ్వనితార్థము. ఇక్కడ నప్రకృతవాచకములయిన సింధునందనాదిపదములందు సూచనావ్యాపారమని గ్రహింపవలయును. చెలువా=ఓమగువా, ఈలతాంగి=ఈచిన్నదానియొక్క, పావనకులగోత్రభూతి=కులగోత్రములనఁగా వంశంబును, నామంబును పవిత్రకుల గోత్ర వైభవ మని అర్థము. పావనమనఁగా నుదకంబును, (ని. 'పావనం తు జలే కృచ్ఛ్రే' అని వి.) కులగోత్రమనఁగాఁ గోలాహలపర్వతంబును, వీనివలన సంభవమని అర్థాంతరము. చెలువారఁగఁ దెల్పవే అనన్=చక్కనగునట్టులుగాఁ దెలియఁజెప్పవే అని అడుగఁగా.

సాటిలేని భాగ్యలక్షణములు కలదిగావుననే లక్ష్మియనుకొనుట తటస్థించినది. మనసిజరాజరాజ్యరమ యనుటచేఁ జక్కదనములకు నెలవనుట. లచ్చియో గౌరియో కాదగును కావుననే యామె కులగోత్రములు పావనమైనవనుట. సింధునందనయనుటచే నదీపుత్రియని అచలేంద్రనందన యనుటచేఁ గోలాహలపుత్రియని యర్థశక్తిచే భావము సంతరించి పలికెననుట పొసఁగదు. ఇతఁడీకన్నె కాలము గోత్రము నెఱుంగఁడు. కావుననే యాదృచ్ఛికము మాటిపడెనని కవిచెప్పినాఁడు.

తా. సుందరియగు నీచెలువ సింధుపుత్రియో శైలపుత్రియో యైయుండును. ఈయమకుల గోత్రాదులను దెలుపుము.

మ. అతులప్రౌఢవచోనుభావముల ప్రోవై మించునాపంచనా
యతియాదృచ్ఛికసూక్తి సూటిపడ నన్యోన్యాననాలోకనా
యతనానాద్భుతలీలఁ దేలి మునిమాహాత్మ్యంబు వర్ణించి రా
శతపత్రేక్షణ లెల్ల నుల్లముల విశ్వాసంబు సంధిల్లఁగన్. 98

అతుల=అసమానములైన, ప్రౌఢవచః=ప్రగల్భవచనములయందలి, అనుభావముల = ప్రభావములకు, ప్రోవై = రాశియై, మించు=అతిశయించుచున్న, ఆపంచనాయతి = అకృత్రిమమునియొక్క, యాదృచ్ఛికసూక్తి = తనంతనేపలికిన గిరికాదేవి వృత్తాంతసూచకమయిన వాక్యము. (ని.'వ్యాహార ఉక్తిర్లపితం భాషితం వచనం వచః' అని అ) సూటిపడన్=వాస్తవముగఁ దార్కాణపడఁగా,అన్యోన్యాననాలోకన=పరస్పరముఖ వీక్షణముతోఁగూడిన, ఆయత=అతిశయమయిన, నానా=బహువిధములైన, అద్భుతలీలఁదేలి = ఆశ్చర్యమందు మునిఁగి తేలినవారై, ఆశతపత్రేక్షణలెల్లన్=అక్కడి స్త్రీలందఱును, విశ్వాసంబు సంధిల్లఁగన్=అప్రత్యక్షజ్ఞాని యనెడు నమ్మకముచిక్కఁగా, మునిమాహాత్మ్యంబు =ఆఋషియొక్క సామర్థ్యమును, వర్ణించిరి=స్తోత్రముచేసిరి. ఇచట రెండవపాదమం దన్యోన్యశబ్దముభయవళులలోనిదిగావున, 'య' అనుదానితోసంబంధించినది. ఇది యుభయయతి అన్య+అన్య, అనుచోసంధిగత మగునన్యోన్యశబ్దమునకుఁగల పూర్వరూపానుకూలముగ యతికూర్పఁబడినది. ''అన్యోన్యవిరుద్ధభాషణములాడిన తత్పల మాతఁడందెడిన్'' భారతము. మాట సూటిపడుట విశ్వాసము కలుగుటకు హేతువు. ఇది మునిమాహాత్మ్యమనుకొనుటయే యద్భుతలీలకు, ఒకరిమొగము నొకరు చూచుకొనుటకుఁ గారణము.

తా. మాటలాడుటలో నేర్పరియగు నామాయాతపసి పలికినపలుకు సూటిపడినంతన నీమునిమహత్వము గలవాఁడని కొనియాడి యాకాంతలందఱు మునియెడ నమ్మకము గలవారైరి.

ఉ. అయ్యెడ మంజువాణి వినయమ్మున నమ్మునిరాజుఁ బల్కు నో
యయ్య సమస్తలోకభరణాభరణాత్మమహామహోజ్జ్వలున్
నెయ్యము మీఱఁ గొల్చి మహనీయశుభోన్నతిఁ గాంచి యున్న నీ
కియ్యఖిలప్రపంచకథ లెల్ల నెఱుంగు తెఱంగు చోద్యమే. 99

అయ్యెడన్ = ఆసమయమందు, మంజువాణి = మంజువాణియనెడు చెలికత్తియ, వినయమ్మునన్=నమ్రభావముచేత, అమ్మునిరాజుఁ బల్కున్=ఆమునిశ్రేష్ఠునిఁగూర్చి పలుకుచున్నది-ఏమనిన, ఓయయ్య=ఓతండ్రీ, సమస్తలోక=సకలభువనములయొక్క, భరణ=భరించుటయే, ఆభరణ=భూషణముగాఁగల, ఆత్మ=స్వకీయమయిన,మహాత్=అధికమయిన, మహ=ఉత్సవములచేత, ని. 'మహ ఉద్ధవ ఉత్సవః' అని అ. ఉజ్జ్వలున్=వెలుఁగుచున్న సూర్యుని, నెయ్యముమీఱఁగొల్చి=ఆస్తభావమతిశయించునట్టులుగా సేవించి, మహనీయ శుభోన్నతిఁగాంచియున్ననీకున్ = ఒప్పిదమయిన శుభాతిశయమును బొందియున్న నీకు, ఇయ్యఖిలప్రపంచకథలెల్లన్=ఈసమస్తప్రపంచమందలి వృత్తాంతములన్నియును, ఎఱుంగు తెఱంగు చోద్యమే=గుర్తెఱిఁగియుండుట యాశ్చర్యమా?-

అనఁగా దేవరవారికి నీ ప్రపంచములోఁ గలవారివృత్తాంతములన్నియుఁ దెలిసియే యున్నవి గనుక నీ కన్యయొక్క వృత్తాంతంబును దెలిసియుండునని భావము. నాలవచరణమందు – ఇయ్యఖిల ప్రపంచకథ లన్నచోట, ఇదమ్ శబ్దార్థమయిన ఈశబ్దమునకు హ్రస్వంబును నుపర్యక్షరమునకు ద్విత్వంబును జేసి ద్విత్వవిశిష్టమయిన యుపర్యక్షరమును ప్రాసముగాఁ జెప్పినాఁడు – ఇందుకు, ని. 'ఇతపద సేతద్యత్తచ్ఛబ్దాశ్శబ్దాంతరాన్వయేబహుళమ్, హ్రస్వం ప్రపద్యదీర్ఘాద్ద్విత్వ ముపర్యక్షరస్యజనయంతి.' అని న. ని. 'ఊష్మరేఫాస్వినాద్విత్వ మయుక్తస్య హలోమతమ్' అను నథర్వణవచనము. ప్రథమచరణమందు తచ్ఛబ్దార్థమైన ఆశబ్దమునకు నిట్లె.

చ. అనుపమభాగ్యలక్షణస • మన్విత యీరమణీలలామ యీ
మనసిజరాజరాజ్యరమ • మానసవీథిఁ దలంప సింధునం
దన యచలేంద్రనందన య • నం గన నయ్యెడి నంచు నిట్లు పే
ర్కొనియును గ్రమ్మఱం దెలియఁ • గోరుట కూరిమిపెంపునం గదా. 100

అనుపమ=సరిలేని, భాగ్యలక్షణ=భాగ్యలక్షణములతో, సమన్విత=కూడిన=ఈరమణీలలామ=ఈ సుందరీ శిరోభూషణమును, ఈమనసిజ రాజ రాజ్యరమ=మన్మథరాజ రాజ్యలక్ష్మియు నైనయీకన్యక, మానసవీథిఁ దలంపన్=మనస్సునందు విచారింపఁగా, సింధునందన=శుక్తిమతీనదీపుత్రికయును, అచలేంద్రనందన=కోలాహలాద్రిపుత్రికయును, అనంగననయ్యెడినంచున్ = అనునట్టులుగాఁ గనుపడుచున్నదనుచు, ఇట్లు=ఈప్రకారముగా, పేర్కొనియును=పేరువాడినవారై యుండియును, క్రమ్మఱం దెలియఁ గోరుట=మరలఁ దెలిసికొనవలయు నని యిచ్ఛయించుట, కూరిమిపెంపునంగదా = ప్రేమాతిశయమ్ము చేతనే కదా. అనుపమయనెడు-97 డవ పద్యమందు మాయాముని వాక్యమున నర్థద్వయము గలుగు నట్టులుగాఁ జెప్పఁబడిన సింధునందన, అచలేంద్రనందన యనెడుపదములకు మంజువాణి శుక్తిమతీ నదీపుత్రియనియుఁ గోలాహలాద్రి పుత్రియనియును నర్థమున్గ్రహించి యీపద్యమందు నీరీతిగాఁ గపటమునితోఁ బలికెనని తెలియవలయును.

కూరిమి పెంపునకుఁ దార్కాణ తెలిసికొనినయంశము తెలియనటుల నటించిచెప్పుట, మీరు చెప్పినశుభలక్షణములతోఁ గూడిన యీచెలువమీరు నిశ్చయించినటుల సింధునందనయే (నదీపుత్రియే) అచలేంద్రపుత్రియే (కోలాహలుని తనూజాతయే) ఇది మీరలే పేర్కొనిన యంశమనిభావము.

క. కావున నీవనజానన, పావనజననక్రమంబు • భవదీయదయా
శ్రీవలన విన్నవించెద, నే వినుమని యవ్విలాసి • నీమణి పలికెన్. 101

కావునన్=కాఁబట్టి, ఈవనజానన=ఈకన్యకయొక్క, పావనజననక్రమంబు = అనఁగాపవిత్రమైన జన్మప్రకారమని యర్థము. వనజాననపావనజననక్రమంబు అనుచోటఁ దెనుఁగు షష్ఠీసమాసము గావున వనజాననాశబ్దమునకు హ్రస్వముగలిగినది. పావనమనఁగా నుదకంబును గనుక జలమయశుక్తిమతియందలి జననప్రకారమని యర్థాంతరము. భవదీయదయాశ్రీవలనన్=దేవరవారియొక్క కృపాసంపత్తిచేత, నేన్=నేను, విన్నవించెదన్=విన్నపము సేయుచున్నాను, వినుమని=చిత్తగింపుమని, అవ్విలాసినీమణి = ఆమంజువాణి, పలికెన్ = (వక్ష్యమాణప్రకారంబుగా) వచించెను. విజ్ఞాపనశబ్దమునకుఁ దద్భవము విన్నపము.

తా. సుగమము.

మ. కలఁ డుల్లోకమహోమహోగ్రహుతభుగ్జ్వాలావళీనిర్జల
స్థలదంభోనిధిలక్ష్యహైమవతపక్షక్షోదదక్షోరుది
గ్వలభీదుర్భరభేరికాభయదభాంకారైకసంప్రీణితా
చలవైరిస్తుతకీర్తిసాంద్రుఁడు వసుక్ష్మాపాలచంద్రుం డిలన్. 102

ఉల్లోక=లోకాతీతమైన, మహః=ప్రతాపమనెడు, మహోగ్ర = అత్యంతతీక్ష్ణమైన, హుతభుక్=అగ్నియొక్క, జ్వాలావళీ = జ్వాలాసమూహముచేత, నిర్జరస్థలత్ = జలశూన్యప్రదేశముగా నాచరించుచున్న, అంభోనిధి = సముద్రమందు, లక్ష్య=చూడఁదగినది, అనఁగాఁ గనఁబడుచున్న, హైమవత = హిమవత్పర్వత పుత్త్రుఁడైన మైనాకునియొక్క, పక్ష=ఱెక్కలయొక్క, క్షోద = చూర్ణీకరణమందు, దక్ష=సమర్థమైనదియు, ఉరు = అధికమయినదియు నగు, దిగ్వలభీదుర్భర=దిగంతములచేత భరింపశక్యముగానట్టి, భేరికా = రణభేరియొక్క, భయద=శత్రుభయప్రదమయిన, భాంకార=భాం అనునట్టి యనుకరణధ్వనిచేత, ఏక = ముఖ్యమగునట్టులుగా, సంప్రీణిత=సంతోషపెట్టఁబడిన, అచలవైరి=పర్వతద్వేషియైన యింద్రునిచేత, స్తుత=స్తోత్రముచేయఁబడిన, కీర్తి=యశస్సుచేత, సాంద్రుఁడు=పూర్ణుఁడైన, వసుక్ష్మాపాలచంద్రుండు=వసురాజశ్రేష్ఠుఁడు, ఇలన్=భూమియందు, కలఁడు=ఉన్నాఁడు. అనఁగాఁ దనయొక్క ప్రతాపాగ్నిజ్వాలలచేత సముద్రోదకము నింకింపఁ జేయఁజాలిన శౌర్యముగల వసురాజనెడు రాజశ్రేష్ఠుఁడు కలఁడని యర్థము. (హైమవతపక్షచ్ఛేదదక్షత్వస్య విశేషణగత్యా భేరీభాంకరణజనితసంప్రీణనే హేతుత్వాత్కావ్యలింగమలంకారః.) అలం-అతిశయోక్తి. కావ్యలింగము.

తా. వసురాజను నృపాలుఁడు కలఁడు. లోకాతీతమగు నాతని పరాక్రమాగ్నిచే సముద్రమంతయు నింకుటచే నందుఁ దలదాచుకొను మైనాకుఁడు బయటబడి భేరీభాంకారధ్వనిచేఁ బక్షశూన్యుఁడగుటవలన దేవేంద్రుఁడు శైలపక్షచ్ఛేదరూపమగు తనపని నెరవేర్చినందులకుఁ గొనియాడుచుండును.

శా. స్వారాజ్యంబునుబోలె నింద్రున కధిష్ఠానం బధిష్ఠానమై
యారాజన్యున కింపుసొం పెసఁగు నిత్యశ్రీలతావాలమై
యారామస్మయమానసూనమకరందాసారశైవాలినీ
ధారావర్ధితమాధురీగుణలసత్కాంతారకాంతారమై. 103

ఇంద్రునకున్=దేవేంద్రునికి, స్వారాజ్యంబునుబోలెన్=స్వర్గరాజ్యమువలె, అధిష్ఠానంబు=అధిష్ఠానమనెడు పట్టణము, అధిష్ఠానమై=నివాసస్థానమై, ని. 'అధిష్ఠానం పురః ప్రభావ చక్రేష్వధ్యాసనేపిచ' అని నా. నిత్య=శాశ్వతమైన, శ్రీ=సంపదయనెడు, లతా=తీఁగెకు, ఆవాలమై=పాదై, ఆరామ=ఉద్యానవనములందు, స్మయమాన=వికసించుచున్న, సూన=పుష్పములయొక్క, మకరంద=పూఁదేనెయొక్క, ఆసార = ధారాసంపాతమువలనఁ బుట్టిన, శైవాలినీ=నదియొక్క, (ని. 'తరఙ్గిణీ శైవలినీ తటినీహ్రాదినీ ధునీ' అని అ.) శైవలినీశబ్దము శైవాలినీశబ్దమునకు రూపాంతరము. ధారా=అల్పప్రవాహముచేత, వర్ధిత=వృద్ధిఁబొందింపఁబడుచున్న, మాధురీగుణ=మాధుర్యముచేత, లసత్=ఒప్పుచున్న, కాంతార=చెఱకుయొక్క, కాంతారమై=తోఁటలుగలదై, ఆరాజన్యునకున్ = ఆవసురాజునకు,

ఇంపుసొంపెసఁగుర్=మనోహరమయి యొప్పుచుండును. కాంతారశబ్దమునకు (ని. 'ఇక్షుదణ్డప్రభేదే స్యాత్కాన్తారః' అని వి.ని. 'కాన్తారో స్త్రీవనే దుర్గవర్త్మ న్యత్యాంతకేతునా' అని నానార్థరత్నమాల.) అలం. రూపకము.

తా. సమస్తసంపదల కాటపట్టయి సొంపలరు అధిష్ఠాననగర మతనిరాజధాని. స్వర్గము నింద్రుఁడేలినటుల నతఁడు భూచక్రమును బాలించును. అధిష్ఠానపురమందలి యారామములోని పూదేనియ సోనచే మధురరసావృతములగు చెఱకుదోటలు పెంపఁబడుచున్నవి.

తే. రత్నభూషిత యైనయా◆రాజధాని, యఱుత నురుతరముక్తాఫ◆లాభిరామ
దామకం బనఁ జాలి ని◆ర్గంపుఁజవులఁ, బరఁగు శుక్తిమతీనామ◆భవ్యతటిని. 104

రత్న=మణినిబద్ధమైన, భూ=భూమితోడ, ఉషితయైన = ఉండినదియు, రత్నాలంకృతయైనదియునగు, రాజధాని=ఇక్కడ స్త్రీలింగసారస్యముచే నొకానొక స్త్రీ స్ఫురించుచున్నది గనుక రాజధానియనెడు స్త్రీయొక్క, అఱుతన్ = కంఠమందలి, ఇది అఱుశబ్దపు సప్తమ్యంతము. ఉరుతర=మిక్కిలి గొప్పలైన, ముక్తాఫల=ముత్యములతోడ, అభిరామ = ఒప్పుచున్న, దామకంబనన్ = హారమోయనునట్లులుగా, చాలి=అర్హమై, శుక్తిమతీనామభవ్యతటిని=శుక్తిమతియనెడుదివ్యనది, నిర్గంపుఁజవులన్=స్నిగ్ధమయిన మధురరుచులచేతను, మౌక్తికములచేతను, పరఁగున్=ఒప్పుచుండును.

చవులనఁగా రుచులకును మౌక్తికములకును బేరు. ఇందుకుఁ బ్రమాణము. ని. క. 'చవులనఁగా నభిధానము, లవు సద్రుచులకును ముత్తియంబుల కభవా' అని యాంధ్రనామసంగ్రహము. అనఁగా నధిష్ఠానమనెడుపేరుగల రాజధానియనెడు స్త్రీయొక్క కంఠమందుఁ బ్రకాశించు ముత్యాలహారమో యన్నట్టులుగా జలమాధుర్యముచేతను ముత్యములచేతను నొప్పుచున్న శుక్తిమతీనదిపట్టణప్రాంతమందుఁ బ్రవహించుచుండునని తాత్పర్యము. శుక్తిమతియందు ముత్యపుచిప్పలుండుటయు, వానియందు ముత్తియములు పుట్టుటయుఁ బ్రకటంబకదా. దీనికిం బ్రమాణము.

క. 'ఒప్పెసఁగుఁ బలుదెఱంగులఁ, జిప్పలలో స్వాతివానచినుకులు మున్నే
చొప్పడఁబడు నప్పరుసున, నొప్పాదవును మౌక్తికంబు లొక్కొ కభంగిన్'

అని రత్నపరీక్షయందుఁ జెప్పంబడియున్నది.

"అఱుతన్" అనునది యఱుశబ్దమునకుఁ గలసప్తమ్యేకవచనరూపము. ఔపవిభక్తికము. "అఱుతన్" అనుటవలన శుక్తిమతి పట్టణమున కుపకంఠమునఁ బ్రవహించుచున్నదనుట.

అలం-రూపకోత్థాపితోత్ప్రేక్ష.

ఉ. జీవన మెల్ల సత్కవిని◆షేవిత మాశయ మెల్ల నచ్ఛతా
పావనతాగభీరతల◆పట్టు ప్రచారము లెల్ల విశ్వధా
త్రీవలయత్రికాలఫల◆దేశికము ల్నవకంబు లెల్ల ము
క్తావళివిభ్రమాస్పదము ◆ లానది పెంపు నుతింప శక్యమే 105

ఈపద్యమునందునందు శుక్తిమతీనది ధార్మికురాలగు స్త్రీగనునదిగను నర్థద్వయముచే వర్ణింపఁబడుచున్నది.

జీవనమెల్లసత్కవినిషేవితము = జీవనమనఁగా నుదకంబును బ్రతుకును, (ని. 'పనిలేపిన జీవనమ్' అని నా.) కవులనఁగా జలపక్షులును కవిజనులును, ఉదకమంతయును శ్రేష్ఠులగు జల

పక్షులచేత ననుభవింపఁబడుచున్నదని యర్థము. బ్రతుకంతయును శ్రేష్ఠులయిన కవిజనులచేత ననుభవింపఁబడుచున్నదని యర్థాంతరము. ఆశయమెల్ల నచ్ఛతాపావనతాగభీరతలపట్టు = ఆశయమనఁగా మడుగును మానసంబును, మడుగంతయును నిర్మలత్వముయొక్కయుఁ బావనత్వముయొక్కయు నగాధత్వముయొక్కయును స్థానమని యర్థము. మానసము నిష్కల్మషత్వముయొక్కయుఁ బవిత్రత్వముయొక్కయు గంభీరత్వముయొక్కయు స్థానమనియర్థాంతరము. ప్రచారములెల్ల విశ్వధాత్రీవలయత్రికాలఫలదేశికముల్ = ప్రచారములనఁగాజలప్రవాహములును బ్రవర్తనములును-జలప్రవాహములన్నియు, విశ్వధాత్రీవలయ=సమస్త భూవలయములకును, త్రికాలఫలదేశికముల్=ముక్కారుపంటలుగలుగఁ జేయుచున్నవని యర్థము. ప్రవర్తనములన్నియు సమస్తభూజనులకును గాలత్రయఫలంబులను దెలియఁ జేయునట్టి వని యర్థాంతరము. అనఁగా భూతకాలపుణ్యసూచకంబులును, భవిష్యత్కాలశుభహేతుకములును, వర్తమానకాల దురితభంజకములును నని యాశయము. నవకంబులెల్ల ముక్తావళివిభ్రమాస్పదములు, నవ=నూతనమయిన, కంబులెల్లన్=శంఖములన్నియు, ముక్తావళి=మౌక్తికసముదాయములకును, విభ్రమ=చుట్టురేఖలకును, ఆస్పదంబులు=ఆధారములనియర్థము. ఇక్కడ విభ్రమశబ్దము భ్రమణాశ్రయములయిన ఆరేఖలఁ జెప్పుచున్నది. నవకంబులు=కోమలత్వములు, అనఁగాఁ జక్కఁదనములు, నవకమనునది దేశ్యశబ్దము. ముక్తావళి=ముక్తులైనవారికిని, విభ్రమాస్పదములు=మోహాస్పదములని యర్థాంతరము. (ని. 'పరిత్యక్తేపి ముక్తస్స్యాన్ముక్తా ముక్తాఫలే స్త్రియామ్' అని నా.) ఆనదిపెంపు నుతింపశక్యమే = కాఁబట్టి యాశుక్తిమతీనదియొక్క ఘనత కొనియాడ నలవియగునా, అనఁగా నలవిగా దనుట. అలం-శ్లేషము.

శంఖములలోఁగూడ ముత్తెములు జనించును.

శ్లో. "కరీంద్రజీమూతవరాహశంఖ మత్స్యాహి శుక్త్యుద్భవవేణుజాని
ముక్తాఫలాని ప్రథితాని లోకే."

తా. ఆనదియందలి జలము నీటిపక్షులకు సేవాపాత్రము. అందలిమడుగులు నిర్మలములు. పవిత్రములు. లోతుగలవి. నదీగమనము భూచక్రమున సస్యరూపఫలప్రదములు. శంఖములు ముత్తెపుఁ బుట్టువుల కాటపట్టులు. నదిపెంపు కొనియాడ వశమా? (అర్థాంతరము) బ్రతుకు కవిసేవితము. హృదయము పరిశుద్ధము. పవిత్రము గంభీరము. గమనము భూతభవిష్యద్వర్తమానఫలబోధకము. చక్కదనము ముక్తులకుఁగూడ భ్రమాస్పదము.

సీ. అనుకూలఖేలనా♦యత్తజీవనమైత్రి నడరి నర్మద బోటి ♦ యై భజింప
నూర్మికాకంకణ♦ద్యుతికలాపము దోఁప బాహుద కైదండఁ ♦ బరిఢవింప
సముదితారావసం♦భ్రమసాంద్ర యై సారెసారె వేత్రవతి హె♦చ్చరికఁ దెల్ప
గంభీరరసగుంభ♦సంభృతప్రౌఢిమతో సరస్వతి పల్కుఁ♦దోడు గాఁగఁ
తే. గులములోఁ బెద్దయఁ నమూల్య♦గుణమణిప్ర
కాండపరిపూర్ణయును గాన ♦ గారవమున
నఖిలనదులునుఁ దనుఁ గొల్వ ♦ ననుదినంబు
నలువకొలువున కేగు నన్నది యతీంద్ర. 106

ఈపద్యమునందును నదీపరముగను స్త్రీపరముగను నర్థద్వయము చెప్పఁబడుచున్నది.

యతీంద్ర=ఓమునీంద్రుఁడా, అనుకూల=ఇష్టమైన, ఖేలన=క్రీడయందు, ఆయత్త=అధీనమయిన, జీవనమైత్రిన్=ప్రాణస్నేహముచేత, అడరి=ప్రకాశించి, నర్మద=నర్మదానదియనెడు నర్మప్రదయైన, చెలికత్తియ, భోటియై భజింపన్=పరిచారికయై కొలువఁగానని యర్థము. అనుకూలఖేలనాయత్త=కూలమనఁగాఁ దీరము, తీరములనానుకొని విహరించుటయందధీనమైన, జీవనమైత్రిన్=జలమైత్రి చేత, అడరి=ప్రకాశించి యనిభావము. బాహుద యనఁగా బాహుదానదియును కైదండయొసంగు స్త్రీయును, ఊర్మికా=ఉంగరములయొక్కయు, (శ్లో. 'అఙ్గుళీయకమూర్మికా' అని అ.) కంకణ=బంగారుగాజులయొక్కయు, (శ్లో. 'కంకణం కరభూషణమ్' అని అ.) ద్యుతికలాపము=కాంతిసముదాయము, తోఁపన్=ప్రకాశింపఁగా, బాహుద=బాహుదానదియనెడు కైదండయిచ్చెడు చెలికత్తియ, కైదండఁ బరిఢవింపన్=చేయూఁతయిచ్చుటయం దొప్పుచుండఁగాననియర్థము. ఊర్మికా=తరంగసంబంధములైన, కంకణ=జలబిందువులయొక్క, ద్యుతికలాపముదోఁపన్=కాంతిసమూహము విలసిల్లఁగా ననిభావము. వేత్రవతియనఁగా వేత్రవతీనదియును వెండిబెత్తము పట్టుకొని కొలువుచేసెడు స్త్రీయును గనుక వేత్రవతీనదియనెడు వేత్రహస్తురాలయిన స్త్రీ, సముదితారావ=యోగ్యమయిన వాక్యధ్వనులయొక్క, సంభ్రమ=తొట్రుపాటుచేత, సాంద్రయై=పూర్ణయై, సారెసారె=మాటిమాటికిని, హెచ్చరిక దెలుపన్=పరాకు దెలుపఁగాను అనియర్థము. ప్రవాహసముదితధ్వని సంభ్రమముగలదియని భావము. సరస్వతియనఁగా సరస్వతీనదియును, వాగ్వతియును, సరస్వతియనెడు మాటకారియగు చెలికత్తియ, గంభీర=నిగూఢమయిన, రస=శృంగారరసముయొక్క, గుంభ=పూర్తిచేత, సంభృత=భరింపఁబడిన, ప్రౌఢిమతోన్=ప్రాగల్భ్యముతోడ, పల్కుఁదోడుగాఁగన్=సహోక్తిప్రత్యుక్తులు జరిగించునదియగుచుండఁగానని యర్థము. గంభీర=అగాధమయిన, రస=ఉదకముయొక్క, గుంభసంభృతిప్రౌఢిమతోన్ = పూర్తిభరితప్రాగల్భ్యముతోనని భావము. నర్మదాదిపదములు నర్మప్రదానాది యోగ్యతాభిప్రాయగర్భితములయిన విశేష్యములు గనుకఁ బరికరాఙ్కురాలంకారము. (ని. 'సాభిప్రాయే విశేష్యేతు భవేత్పరికరాఙ్కురః' అని లక్షణము.)

కులములోఁ బెద్దయున్ = వంశశ్రేష్ఠురా లని యర్థము. స్వజాతిగణములో గొప్పది యనిభావము. అనఁగా బెద్దనదియనుట. అమూల్యగుణమణిప్రకాండపరిపూర్ణయునుగానన్=ప్రకాండశబ్దము శ్రేష్ఠవాచకంబును సమూహవాచకంబును, అమూల్య=విలువలేని, మణిప్రకాండ=మణిశ్రేష్ఠములవంటి, గుణ=గుణములచేత, పరిపూర్ణయునుగానన్=సంపూర్ణమయినదియును గాఁబట్టి యని యర్థము. అనర్ఘ్యగుణములుగల రత్నసమూహముచేతఁ బరిపూర్ణయని భావము. గారవమునన్=ప్రేమచేత, అఖిలనదులును దనుఁగొల్వన్=సమస్తనదులును దన్నుఁగొలిచిరాఁగా, అనుదినంబు=ప్రతిదినము, అన్నది=ఆశుక్తిమతీనది, నలువకొలువునకేగున్ = బ్రహ్మదేవునిసభకుఁ బోవుచుండును. అనఁగా నాశుక్తిమతీనది స్త్రీరూపధారణము చేసి నర్మదాదినదులును స్త్రీరూపముచేత మీఁదఁ జెప్పినప్రకారముగాఁ బరిచర్య సేయుచుఁ గొలిచి వెంటరాఁగాఁ బ్రతిదినంబును బ్రహ్మసభకుఁబోయి వచ్చుచుండు నని యర్థము.

ముగ్ధిమ ప్రౌఢిమ ఇత్యాదులకు ఇమనిచ్ప్రత్యయమువిచార్యమని వామనునిమతము. శబ్దరత్నాకరమున నీపదముగలదు. 'గంభీర వాక్ప్రౌఢిమన్' అని శ్రీనాథుఁడును, 'పాటలీచంపకోత్పల ప్రౌఢిమములు' అని ముక్కుతిమ్మనయుఁ బ్రయోగించియున్నారు. సాధుత్వమునకాధారములుమృగ్యములు.

క. ఆలీల నమ్మహానది, నాళీకజు గొల్చి యొక్క•నాఁడు ప్రియాళీ
కేళీసంభ్రమవినుతమ, రాళీగతు లడఁగ మరలి•రా నొకచోటన్. 107

ఆలీలన్ = ఆప్రకారముగా, అమ్మహానది=ఆగొప్పనదియైన శుక్తిమతి, నాళీకజుఁగొల్చి=కమలజుండైన బ్రహ్మదేవుని సేవించి, ఒక్కనాఁడు=ఒకానొకదినమందు, ప్రియాళీ = ప్రియసఖులతోడి, కేళీ=క్రీడయందలి, సంభ్రమ = తొట్రుపాటుతోఁగూడిన, వినుత=స్తోత్రముచేయఁబడిన, మరాళీగతులు=ఆఁడు హంసనడువులవంటి నడువులు, అడరన్=ప్రకాశింపఁగా, మరలిరాన్ = తిరిగివచ్చుచుండఁగా, ఒకచోటన్=ఒకస్థలమందు, ముందటిపద్యముతో నన్వయము.

తా. ఈవిధముగా శుక్తిమతీనది చెలికత్తియలుగొలువ విలాసగమనముతో బ్రహ్మకొలువునకరిగి తిరిగి వచ్చుచుండ నొకానొక ప్రదేశమునందు,

సీ. సుమనోధివాసభా•సురశిఖోన్నతివాఁడు ఘనసారతిలకవా•సనలవాఁడు
ఘనసంకుమదసాంద్ర•గండభాగమువాఁడు నవపద్మరాగదం•తములవాఁడు
కలితోపకంఠన•క్షత్రమాలికవాఁడు హరిచందనచ్ఛాయ • నమరువాఁడు
తపనీయమేఖలా•ధాళధళ్యమువాఁడు మణిపాదవలయధా•మంబువాఁడ

తే. నర్ఘ్యరత్నావళీవిచి•త్రాంబరాభి
రామశృంగారములవాఁడు • హైమగర్భ
గేహమున కేఁగువాఁడు కో•లాహలాఖ్యుఁ
డొకధరాధీశుఁ డెదు రయ్యె • నువిద కపుడు. 108

ఈపద్యమునందుఁ గోలాహలవర్ణనము పర్వతపరముగను పురుషపరముగను గావింపఁబడుచున్నది.

అధివాసమనఁగా గంధమాల్యాదులచేతఁ జేయఁబడు సంస్కారము. (ని. 'సంస్కారో గంధమాల్యాద్యై ర్యస్స్యా త్తదధివాసనమ్' అని అ.) సుమనోధివాస=పుష్పాధివాసముచేత, భాసుర=ప్రకాశించుచున్న, శిఖోన్నతివాఁడు=సిగముడియొక్క హెచ్చుగలవాఁడును అనియర్థము. సుమనోధివాస=దేవతానివాసముతోడ, (ని. 'సుమనాః పుష్పమాలత్యో స్త్రీదశే' అని వి.) భాసుర=ప్రకాశించుచున్న, శిఖోన్నతివాఁడు=అగ్రభాగముయొక్క యున్నతిగలవాఁడును అని భావము. ఘనసారతిలకవాసనలవాఁడు=కర్పూరతిలకముయొక్క పరిమళములు గలవాఁడును అనియర్థము. కర్పూరపరఁటులయొక్కయుఁ దిలకవృక్షములయొక్కయు సౌరభముగలవాఁడును అని భావము. ఘన=అధికమయిన, సంకుమద=జవ్వాదిచేత,సాంద్ర=దట్టమయిన, గండభాగమువాఁడు=చెక్కిళ్లుగలవాఁడునుఅని యర్థము. జవ్వాదిచేత నిండిన గండశిలలు గలవాఁడును అనిభావము. నవ=నూతనమయిన, పద్మరాగ=పద్మరాగమణులవంటి, దంతములవాఁడు=రదనములు గలవాఁడును అని యర్థము. పద్మరాగమణిమయములయిన సానువులు గలవాఁడును అని భావము.

పద్మరాగములవంటి దంతములనుటవలనఁ బెదవికెంజాయచే ముత్యములవంటి దంతములు కెంజాయచే నొప్పారె ననిభావము. దృష్టాంతము-

శ్లో. తామ్రోదరేషు పతితం ద్రుమపల్లవేషు నిర్ధౌతహారగుళికావిశదం హిమాంభః
ఆభాతి లబ్ధపరభాగతయాధరోష్ఠే లీలాస్మితం సదశనార్చి రివత్వదీయం. రఘు-వం-2 ౦ శ్లో.

(ని. 'దంతోద్రికటకే కుక్షౌ రదనే పుష్యన్నతోపలే' అని నా. 'దంత స్సానుని కథ్యతే' అని వి.) నక్షత్రమాలికయనఁగా నిరువదియేడు ముత్యాలుగూర్చిన హారము. (ని. 'సైవ నక్షత్రమాలాస్యాత్సప్తవింశతిమౌక్తికైః' అని అ.) కలిత=కూడుకొనఁబడిన, ఉపకంఠ = కంఠప్రాంతమందలి, నక్షత్రమాలికవాఁడు=నక్షత్రమాలిక కలవాఁడును అని యర్థము. సమీపమందలి నక్షత్రసమూహము గలవాఁడును అని భావము. (ని. 'ఉపకణ్ఠాన్తి కాభ్యర్ణా భ్యగ్రాః' అని అ.) హరిచందనచ్ఛాయ నమరువాఁడు=పీతవర్ణముగల చందనానులేపన కాంతిగలవాఁడు, అని అర్థము. హరిచందన వృక్షచ్ఛాయచేత నొప్పుచున్నవాఁడును అని భావము. (ని.'హరిచందన మాఖ్యాతం గోశీర్షే సురపాదపే' అని వి.) తపనీయ = సువర్ణమయమయిన, మేఖలా = మొలనూలుయొక్క, ధాళధళ్యమువాఁడు = ధళధళయను కాంతిగలవాఁడును అని యర్థము. కనకమయమయిన నితంబప్రదేశము గలవాఁడును అనిభావము. ఇక్కడ మేఖలాశబ్దము శైలనితంబపరము. (ని. 'మేఖలా ఖడ్గబంధేస్యాత్కాఞ్చ్యాం శైలనితంబయోః' అని వి.) మణి=రత్నఖచితములైన, పాదవలయ=కాళ్ళయందెలయొక్క, ధామంబువాఁడు=కాంతిగలవాఁడును అని యర్థము. రత్నమయమయిన ప్రత్యంతపర్వతావరణముగలవాఁడును అని భావము. (ని. 'పాదాః ప్రత్యంతపర్వతాః' అని అ.)

అనర్ఘ్య=విలువలేని, రత్నావళీ = రతనములసమూహముచేత, విచిత్ర=వింతగానున్న, అంబర=వస్త్రములవలన,అభిరామ=ఒప్పుచున్న,శృంగారములవాఁడు=సింగారములుగలవాఁడునుఅనియర్థము. అనర్ఘ్య=అమూల్యములైన, రత్నావళీ=నానావిధ రత్నకాంతులచేత, విచిత్ర=నానావర్ణమైన, అంబర=గగనభాగముగలిగిన,అభిరామ=సుందరములైన, శృంగ=శిఖరములయొక్క, అరములవాఁడు=అంచులుగలవాఁడునుఅనిభావము. హైమగర్భ=బ్రహ్మదేవుని సంబంధమైన,గేహమునకున్=సభామందిరమునకు, ఏగువాఁడు=పోవుచున్నవాఁడును, కోలాహలాఖ్యుఁడు = కోలాహలుఁ డనెడు పేరుగలవాఁడునగు, ఒకధరాధీశుఁడు=ఒకరాజు అని యర్థము. పర్వతాధీశ్వరుఁడు అనిభావము. ఉవిదకున్=స్త్రీరూపధారిణియయిన శుక్తిమతికి, అపుడు=ఆసమయమందు, ఎదురయ్యెన్ = ఎదురుపడెను.

అలం. శ్లేషము.

చ. అనుపమభాగ్యశాలి కచలాధిపమౌళికిఁ బుత్త్రుఁడై జగ
జ్జనని కనుంగుఁదమ్ముఁ డయి శంకరుముద్దుమఱందికుఱ్ఱయై
మను తనభాగధేయమహిమంబున మిన్నులు ముట్టి వచ్చుధ
న్యుని నతనిన్ భజించి నదియున్ వినయంబున నోరయై చనన్. 109

అనుపమ భాగ్యశాలికిన్=సమానరహితమయిన భాగ్యములచేత నొప్పుచున్న, అచలాధిపమౌళికిన్=పర్వతరాజశ్రేష్ఠునికి,అనఁగా హిమవంతునికి భూపతిశ్రేష్ఠునకనియును నర్థము గ్రహింపవచ్చును. పుత్త్రుఁడై=కుమారుఁడై, జగజ్జననికిన్=లోకమాతయైన పార్వతికి, అనుంగుఁదమ్ముఁడయి=ప్రేమాస్పదుఁడైన తమ్ముఁడై, శంకరుముద్దుమఱందికుఱ్ఱయై=శివునియొక్క ముద్దులపిన్నమఱఁదియై, మను = వృద్ధిఁ బొందుచున్న, తన=తనయొక్క, భాగధేయమహిమంబునన్=భాగ్యాతిశయ ప్రభావముచేత, మిన్నులుముట్టివచ్చు=ఉప్పొంగిమిన్నుముట్టివచ్చుచున్న, ధన్యునినతనిన్ భజించి=కృతార్థుఁడైనయాకోలాహలుని సేవించి, నదియున్=శుక్తిమతీనదియును,వినయంబునన్=నమ్రత్వముచేత, ఓరయైచనన్=ఓరగాఁ

దొలఁగి పోవఁగా, ఇందులో మిన్నులు ముట్టివచ్చుచున్నచోటఁ బర్వత మత్యున్నతమగుటచేత మిన్ను ముట్టుటయును, ఓరయయిచన నన్నచోట నది పర్వతప్రాంతముల నోరసిల్లి ప్రవహించుటయును స్వభావమని గ్రహింపవలయును. అలం. సమాసోక్తి.

తా. ఐశ్వర్యవంతుఁడును హిమవంతునకుఁ గుమారుఁడును, బార్వతీసహోదరుఁడును, శంకరుని బావమఱఁదియునగు కోలాహలుఁడు మిన్నుముట్టివచ్చుచుండ శుక్తిమతి యోరఁగాఁ దొలఁగెను. ఇట్లు తొలంగ-

సీ. బాలకూర్మవిలాస•పదములు కాంతరంభాప్రతిబింబోరు•భవ్యరుచులు
సరససైకతసార•జఘనసౌభాగ్యంబు నతనాభిరూపవ•నభ్రమంబు
బెడఁగారుదరులయొ•ప్పిదమును నామీఁదఁ జనుజక్కవలనిక్కు•చక్కఁదనము
కమలకోమలముఖ•కామనీయకము నుత్పలమంజులాలోక•విలసనంబు
తే. ఘనఘటానీలవేణియుఁ • గలతరంగి, ణీరమణి నిత్యనిర్మలా•కారకాంతి
ధార ధారున నెదిరినం•తనె నగేంద్రు, గాఢతరధైర్యము వ్వెత్తు•గా హరించె.

నదీపరముగ స్త్రీపరముగ నీపద్యమున కర్థద్వయము కలదు.

బాలకూర్మ=చిన్నతాఁబేళ్లయొక్క, విలాసపదములు = విలాసయుక్తములైన స్థానములును, బాలకూర్మవిలాసములవంటి విలాసములుగల మీఁగాళ్లును, కాంత=మనోహరములైన, రంభా=అరఁటిచెట్లయొక్క, ప్రతిబింబ=ప్రతిచ్ఛాయలయొక్క, ఉరు=అధికమయిన, భవ్య=యోగ్యమైన, రుచులు=కాంతులును, రంభాస్తంభప్రతిరూపములైన యూరువులయొక్క భవ్యకాంతులును, సరస=జలయుక్తములైన, సైకతసారజ=సారములైన అనఁగా శ్రేష్ఠములైన యిసుకదిన్నెలవలనఁ బుట్టిన, ఘన=అధికమైన, సౌభాగ్యంబు=సౌష్ఠవమును, శృంగారరసయుక్తమును సైకతసారసదృశమును నైన జఘనముయొక్క సౌభాగ్యంబును, (ని. 'సారో బలే స్థిరాంశే చ న్యాయ్యే క్లీబం వరే త్రిషు' అని అ.) నత=గంభీరమయిన, నాభిరూప=నాభిసదృశమయిన, వనభ్రమంబు = నీళ్లసుడిగుండమును లేక గంభీరమయినదియును, నాభిరూప=సుందరముగానిదియు, అనఁగా భయంకరమయిన నీళ్ళసుడిగుండమును గంభీరనాభ్యావర్తనమును, బెడఁగారు = మెఱుఁగారుచున్న, దరుల=తీరములయొక్క, ఒప్పిదమును= చక్కఁదనమును తరులనఁగావళులు, మెఱుఁగారుచున్న వళులయొక్క చక్కఁదనమును బెడఁగారు దరులన్నచోటఁ గర్మధారయసమాసమును గనుక వికల్పముచేత తకారమునకు దకారము వచ్చినది. ఆమీఁదన్=ఆతీరముమీఁద, చను = సంచరించుచున్న, జక్కవల=చక్రవాకములయొక్క, నిక్కు చక్కఁదనము=నిక్కడపు చక్కఁదనమును, ఆమీఁదన్=ఆవళుల మీఁదనున్న, చనుజక్కవల = చక్రవాకములవంటి కుచములయొక్క, నిక్కు చక్కఁదనము, నిక్కడపు సౌందర్యంబును, కమల= పద్మముయొక్క, కోమలముఖ=కోమలమైన యగ్రభాగములయొక్క, కామనీయకము=సౌందర్యమును, కమలమువలెఁ గోమలమైన వదనముయొక్క సౌందర్యమును, ఉత్పల = నల్లగలువలయొక్క, మంజుల = మనోహరమైన, ఆలోక = ప్రభయొక్క, విలసనంబు=విలాసంబును, ఉత్పలములవలె మనోహరములైన వీక్షణప్రభలయొక్క విలాసంబును, (ని. 'ఆలోకౌ దర్శనద్యోతౌ' అని అ.) వేణీ శబ్దము నదీప్రవాహమందును గచోచ్చయమందును వర్తించును. (ని. 'వేణీ నదీప్రవాహేచ కచోచ్చయే' అని వి.)

ఘనఘటా=జలపానాగత మేఘమాలికచేత, నీల=నల్లనైన, వేణియుఁ=ప్రవాహంబును, ఘన ఘటా=మేఘమాలికవలె, నీల=నల్లనైన, వేణియుఁ=జడయును, కల=కలిగియున్న, తరంగిణీరమణి= నదీకాంతయొక్క, నిత్యనిర్మలాకార కాంతిధార=నిరంతరనిర్మలస్వరూప కాంతిగల సలిలధారయును నిత్యనిర్మలమయిన యాకారముయొక్క కాంతిధారయును, ధారునఁనెదిరినంతనె=హఠాత్తుగా నెదురైనంతమాత్రముచేతనే, నగేంద్ర=పర్వతశ్రేష్ఠుఁడయిన కోలాహలునియొక్క, గాఢతరధైర్యము= మిక్కిలి దృఢమయిన ధైర్యమును, ఉన్మత్తుగా హరించెఁ = బొత్తిగా హరించెను. నదీప్రవాహ ధారలు, పర్వతములను దెగఁగోయుచున్నవని భావము.

శుక్తిమతీనది స్త్రీసహజములగు తనసుందరావయవములచేతఁ గోలాహలుని నిలుకడను దొలంగించి మోహితునిగావించెననియు, శుక్తిమతీ ప్రవాహధారలు కోలాహలపర్వతము దిట్టతనము చెడునటు లొరసి ప్రవహించెననియు భావము. అలం-శ్లేషోపమానుప్రాణితమగు క్యాలింగము.

క. ఆకరణిఁ దరంగిణి నగ, లోకేశ్వరుధైర్య మెల్ల ♦ లోఁగొనిరా నీ
రాకరగభీర! యాసు, శ్లోకుఁడు నాచెలువచెలువు ♦ లోఁగొని చనియెన్. 111

ఆకరణిఁ=ఆప్రకారముగా, తరంగిణి = శుక్తిమతీనది, నగలోకేశ్వరుధైర్యమెల్లఁ=పర్వతరాజైన కోలాహలుని ధైర్యమంతయును, లోఁగొనిరాఁ=తనలోఁ జేర్చుకొనిరాఁగా, నీరాకర గభీర=సముద్రునివలె గంభీరుఁడవైన యతీంద్రా, ఆసుశ్లోకుఁడును=యోగ్యమయిన కీర్తిగల యాకోలాహలుఁడును, (ని.'పద్యే యశసి చ శ్లోకః' అని అ.) ఆచెలువచెలువు లోఁగొనిచనియెఁ=ఆశుక్తిమతియొక్క చక్కఁదనమును దనలోఁ జేర్చుకొనిపోయెను. అనఁగాఁ గోలాహలుఁడు శుక్తిమతియొక్క సౌందర్యావలోకనమువలన ధైర్యహీనుఁడై యాసౌందర్యమును మనస్సునందు నిలుపుకొనిపోయె నని యర్థము. నదులు గట్లను దెగఁదీయుటయును గట్లు నదీజలము లోఁగొనుటయును స్వభావము లని గ్రహింపవలయును.

తా. మునీంద్రా! ఆశుక్తిమతి కోలాహలుని దిట్టతనమునంతయు లోఁగొనిపోవఁ గోలాహలుఁడా చెలువ చెలువులోనఁ దలంచుచుఁ జనెను.

మ. అలఘుశ్రీనిధి యానగేంద్రతనయుం ♦ డాసైకతశ్రోణియొ
ప్పులు తెప్పార్పక చూచి చన్న మొదలుం ♦ బొంగారి పైపై రసం
బులు జృంభించు భ్రమించు నాశయము కూర్మి ♦ ల్మించ దీపించు ను
త్కలికాచాపలము ల్మనోనిబిడచిం♦తాతన్మయత్వంబునన్. 112

అలఘు=అధికమైన, శ్రీ=ఐశ్వర్యమునకు, నిధి = స్థానమయినదని యర్థము. గురుత్వనిధియని భావము. ఆనగేంద్రతనయుఁండు=పర్వతరాజపుత్త్రుఁడైన యాకోలాహలుఁడు, ఆసైకతశ్రోణియొప్పులు=ఆయిసుకదిన్నెలవంటి పిఱుఁదులుగలవానియొక్క చక్కఁదనములని యర్థము. శ్రోణివంటిసైకతముగలదని భావము. తెప్పార్పకచూచి చన్నమొదలుఁ = తెప్పవాల్పక చూచిపోయినది మొదలుకొనియును, మనః=మనస్సునందు, నిబిడ=సాంద్రమయిన, చింతా=చింతచేతనైన, తన్మయత్వంబునఁ=శుక్తిమతీమయమయిన యంతఃకరణవృత్తి గలుగుటచేతననియును, శుక్తిమతీస్వరూపత్వముచేత ననియును నర్థద్వయము. అర్థద్వయమునకు నభేదాధ్యవసాయముచేసి శుక్తిమతీధర్మములైన

జలాశయములు మొదలైనవి పొడఁజూపినవని చెప్పవలయును. ఇక్కడఁ జింతయనెడు సంచారి భావము.('ఇష్టానధిగమాద్ధ్యానంచింతాశూన్యత్వతాపకృత్') పొంగారిపైపైరసంబులు జృంభించున్-ఇక్కడరసములనఁగా ననురాగములు, అతిశయద్యోతనార్థము బహువచనము. పొంగారి=ఉప్పొంగి, పైపైన్=మీఁదమీఁదను, రసంబులు=అనురాగములు, జృంభించున్=విజృంభించుననియును, ఉప్పొంగి మీఁదమీఁద రసములనఁగా జలములు వెల్లువవెట్టుననియును నర్థద్వయము. భ్రమించునాశయము= ఆశయమనఁగా మానసంబును, (ని. 'ఆశయ స్స్యా దభిప్రాయే మానసాధారయో రపి' అని మే.) మానసము, భ్రమించుననఁగా మోహితమగునని యర్థము. భ్రమణమనఁగా వైచిత్ర్యము గనుక మోహమనెడి సంచారిభావము. (ని. 'మోహస్తు మూర్ఛనం భీతి దుఃఖావేశానుచింతనైః' జలాధార స్థలము సుళ్ళఁబడుననియును నర్థము. కూర్మిల్మించున్ = ప్రేమలతిశయించును, ఇక్కడఁ జెప్పఁబడిన ప్రేమలకును లోపలఁ జెప్పఁబడిన యనురాగములకును నవస్థాభేదమువలన భేదమని తెలియవలెను. ఏలాగనిన, (శ్లో. 'రాగోఽనువృత్తోఽవిచ్ఛిన్నమనురాగముదాహృతమ్,సప్రేమాయన్మిథోయూనోర్నిరూఢంభావబంధనమ్.') ఉత్కలికాచాపలముల్ = ఔత్సుక్యంబును చాపల్యంబును, దీపించున్ = ప్రకాశించునని యర్థము. ఇక్కడ నౌత్సుక్యచాపల్యములనెడు సంచారిభావద్వయము, ('కాలాక్షమత్వమౌత్సుక్య మప్రాప్తేరిష్టవస్తునః, చాపల్యమనవస్థానం రాగద్వేషాదిసంభవమ్.')కూర్మిల్మించన్= ఆఁడుతాఁబేళ్లుల్లసిల్లఁగా, ఉత్కలికాచాపలముల్ = తరంగచాంచల్యములు, దీపించున్=ప్రకాశించు ననియుం నర్థము. (ని. 'కథితో త్కలికో త్కణ్ఠా హేలా సలిలవీచిషు' అని మే.) ఈపద్యమునఁ జింతామోహౌత్సుక్యచాపల్యము లనెడు నాలుగుసంచారిభావములు చెప్పఁబడినవి.

కోలాహలుఁడు తన్నుఁ గాంచి పోయినదాది శక్తిమతియుఁ జంచలము దాల్చెనని భావము. నిమేషశూన్యదర్శనము (ఱెప్పలార్పని చూపులు) లోకోత్తరవస్తుదర్శనమువలనఁ గలిగినవిస్మయమునకు సూచన. విస్మయలక్షణముల నాలంకారికు లిటుల నిర్వచించి యున్నారు-

శ్లో. లోకోత్తరపదార్థానా మపూర్వాలోకనాదిభిః
విస్తార శ్చేతసోయస్తు విస్మయ స్సనిగద్యతే.

తా. కోలాహలుఁడు వలపుచే ఱెప్పలార్పక తనను జూచినదాదిగ శక్తిమతియుఁ జింత మోహములోనగు మనోవికారములకు లోనయ్యెను.

సీ. తనకూటములఁ బ్రోదిఁ♦దాల్చురంభాదులు సరసభావముఁ దప్పి ♦ శిరము వంపఁ
దనలోలతలఁ బెంపుఁ ♦ గనుకలకంఠులు చేరి పై వ్రాలక ♦ చెదరి పలుకఁ
దనవంక నలరుప♦ద్మిను లెల్లఁ దమిఁగానకయవాడిమోముల♦గ్గలము ముడువఁ
దనమహాభోగంబు♦ల నెసంగుభోగినుల్ దెరలి నిట్టూరుపు♦దెరలు నెఱప
తే. నకటకట మంచుమలపట్టి ♦ యతనుతాప
వహ్నిపాలయ్యె ఝురబాష్ప♦వారి యగుచు
నిత్యశక్తిమతీధ్యాన♦నిశ్చలాత్మఁ
డగుచు నంచితగహనరో♦మాంచుఁ డగుచు. 113

ఈపద్యమునందు శైలములందుఁగల ధావాగ్నిపరముగ మోహాగ్నిపరముగను నర్థద్వయము గలదు,

కూటమియనఁగాఁ గలయిక, తనకూటములన్ = తనయొక్క కలయికలచేత, ప్రోదిఁదాల్చు=పెంపువహించుచున్న, రంభాదులు=రంభ మొదలయిన దేవకాంతలు, సరసభావముఁదప్పి=సరసత్వము మాని, శిరము వంపన్=తలవంచుకొనఁగానని యర్థము. కూటమనఁగా శిఖరము, తనశిఖరములయందుఁ బెంపువహించుచున్న రంభాదితరువు లార్ద్రత్వముదక్కి వాడుచూపిన యగ్రభాగములను వంపఁగా నని భావము. (ని. 'శిరోఽగ్రం శిఖరం వానా' అని అ.) తనలోలతలన్=తనయొక్క యాసక్తులచేత, పెంపుగను=ఘనతఁబొందుచున్న, కలకంఠులు==అవ్యక్తమధురమైన కంఠనాదముగల స్త్రీలు, (ని. 'కలకణ్ఠస్తు కోకిలే, హంసే పారావతే చాపి త్రిషు త్వేషకలస్వరే.' అని నా.) చేరి పైప్రాలక=దగ్గిరవచ్చి పైకొనక, చెదరిపలుకన్=తొలఁగి మాటాడఁగానని యర్థము. తనయందలి లతలయందుఁ బెంపుఁగను కోకిలలుచేరి తనపైప్రాలక తొలఁగి కూయఁగా నని భావము. తనవంకన్ = తనవలన, అలరు=సంతోషించునట్టి, పద్మినులెల్లన్ = పద్మినీజాతిస్త్రీలందఱును, (ని. 'పద్మినీ కరణీ శ్రీస్త్రీ సరోజ్జనళినీషు చ' అని నా.) తమిఁగానకయ=తనవలని తమకము నెంతమాత్రము గనుపఱుచు కొనలేకయే, వాడి=వికాసముదప్పి, మోము లగ్గలముముడువన్ = ముఖములు మిక్కిలి ముడిచిపెట్టు కొనఁగాను అని యర్థము. వంకయనఁగా నేఱు, తనవంకన్=తనసంబంధమయిన సెలయేటియందు, అలరు=వికసించియుండెడు,పద్మినులెల్లన్=పద్మలతలన్నియును, తమిఁగానకయ=రాత్రిని జూడకయే, అనఁగా రాత్రికాకమునుపే, (ని. 'రజనీ యామినీ తమీ' అని అ.) వాడిమోము లగ్గలము ముడువన్=వాడుదేరి యగ్రములు ముకుళింపఁగా నని భావము.తనమహాభోగంబులన్=తనయొక్క యధికమయిన సంభోగములచేత, ఎసంగు=ఒప్పుచున్న, భోగినులు=పట్టపుదేవిగాక యితరలైన రాజభార్యలు, (ని. 'కృతాభిషేకా మహిషీ భోగిన్యోఽన్యా నృపస్త్రియః' అని అ.) తెరలి=చంచలించి, నిట్టూరుపు దెరలు నెఱపన్=నిశ్వాస పరంపరల నింపఁగా నని యర్థము. తన=తనయొక్క, మహాత్=అధికములయిన, ఆభోగంబులన్=విస్తారములయందు, ఎసంగు = ఒప్పుచున్న, భోగినులు=ఆఁడుపాములు, తెరలి నిట్టూరుపుదెరలు నెఱపన్=సంచలించి ఫూత్కారములు నింపఁగా నని భావము.

అకటకట=అయ్యయ్యో,మంచుమలపట్టి=హిమవత్పర్వతపుత్త్రుఁడైనకోలాహలుఁడు, అతనుతాపవహ్నిపాలయ్యెన్=మన్మథతాపమనెడు నగ్నిపాలయ్యె ననియర్థము. అతనుశబ్దము అనంగశబ్దపర్యాయపదము. (ని. 'కందర్పో దర్పకోఽనఙ్గః కామః పంచశరః స్మరః' అని అ.) పర్వతముగనుక నధికతాపదావాగ్నిపాలగుచున్నదని భావము. ఇక్కడ మంచుమలపట్టి యయ్యును దాపముపాలయ్యె నని విరోధము గ్రహింపవలయును. ఝుర=జలప్రవాహమువలె నుల్బణించుచున్న, బాష్పవారియగుచున్=అశ్రుజలధారలు గలవాఁడగుచు ననియర్థము. బాష్పమనఁగా నూష్మంబు, ప్రవాహములయందలి యూష్మయుక్తజలములు గలవాఁ డగుచున్నాఁడనిభావము. (ని. 'బాష్పో నేత్రజలోష్మణోః' అని వి.) ఈపైఁజెప్పఁబడిన యతనుతాపవహ్నిపాలయ్యె ననెడిచోటనున్న భావార్థ మిప్పుడు చెప్పఁబడిన భావార్థమునందును మీఁదఁజెప్పఁబడిన భావార్థములయందును హేతువుగా గ్రహింపవలయును. నిత్య=ఎడతెగని, శక్తిమతీధ్యాన = శక్తిమతివిషయమయిన చింతచేత, నిశ్చల=క్రియారహితమయిన, ఆత్ముఁడగుచున్ = గాత్రము గలవాఁడగుచునని యర్థము. పర్వతుఁడుగనుకఁ జలింపఁడని భావము. అంచిత=ఒప్పుచున్న, గహన=విపినరూపమయిన, రోమాంచుఁ డగుచున్=గగురుపాటు గలవాఁడగుచు నని యర్థము.

(ని. 'రోమాఞ్చో రోమహర్షణమ్' అని అ.) ఈచెప్పఁబడిన వికారములు గలవాఁడగుచు మదనుతాపవహ్నిపాలయ్యెనని వెనుక నన్వయము. బాష్పవారియు, నిశ్చలాత్మత్వంబును, రోమాంచంబును నీమూఁడును సాత్త్వికభావములు.

శ్లో. 'అశ్రు నేత్రోద్భవం వారి దుఃఖ రోష ప్రహర్షజమ్,
స్తంభస్స్యా న్నిష్క్రియాఙ్గత్వం రాగభీత్యాదిసంభవమ్,
సుఖాద్యతిశయా జ్జాతో రోమాఞ్చో రోమవిక్రియా.' అని చెప్పఁబడియున్నది.

తా. కోలాహలుఁడు శక్తిమతిని గాంచినదాది వలపునకు లోనై మన్మథవహ్నిచేఁ గ్రాగుచుఁ గన్నీరు విడచుచు మాటిమాటికి శక్తిమతిని దలంచుకొనుచు గగురుపాటు గలవాఁడగుచుండెను.

అలం. శ్లేషానుప్రాణితరూపకము.

చ. కులగిరిరాజనందనుఁడు • కూరిమి నాభువనాభినందితం
దలఁపఁ దలంపులోపలనె • దర్పకకేతనవల్గనంబు లం
చలయెలగోలు నంబుజవి•శాలశిలీముఖతాండవంబు లు
త్పలదళమండలాగ్రములు • పైకొను నెట్టివొ తత్ప్రభావముల్. 114

కులగిరిరాజ నందనుఁడు=కులపర్వతశ్రేష్ఠుఁడైన హిమవంతుని కుమారుఁడగు కోలాహలుఁడు, కూరిమిన్=ప్రేమచేత, ఆభువనాభినందితన్=లోకసన్నుతయైన యాశక్తిమతి నని యర్థము. జలాభినందితయైన నదినని భావము. ('భువనం ఖాంబు లోకేషు' అని నా.) తలఁపన్=తలఁపఁగా, తలంపులోపలనె=తలఁచుకొన్నంతలోపలనె, దర్పక కేతన వల్గనంబులు=మన్మథునియొక్క ధ్వజచలనములని యర్థము. దర్పకకేతనము మీనముగనుక మత్స్యచలనములని భావము. అంచలయెలగోలున్=హంసరూపములైన మన్మథుని యెలగోలుమూఁకలని యర్థము. హంసలయొక్క కోలాహలములని భావము. అంబుజవిశాలశిలీముఖతాండవంబులు=అరవిందరూపబాణపతనములని యర్థము. (ని. 'అరవింద మశోకంచ చూతంచ నవమల్లికా, నీలోత్పలం చ పఞ్చైతే పఞ్చబాణస్య సాయకాః.' అమరశేషము.) అంబురుహవిహారి షట్పద నటనములని భావము. శిలీముఖశబ్ద మిక్కడ మధువ్రతపరము. (ని. 'అళి బాణౌ శిలీముఖౌ' అని అ.) ఉత్పలదళమండలాగ్రములు = ఉత్పలదళరూపఖడ్గములని యర్థము. ఉత్పలదళమండలముయొక్క యగ్రభాగములనిభావము. పైకొనున్=కమ్ముకొనును, ఎట్టివొ తత్ప్రభావముల్=ఆశక్తిమతిమహిమలెట్టివో అనఁగా విచిత్రాస్పదము లనుట. కోలాహలుఁడు శక్తిమతిని దలఁచుకొనినమాత్రముచేతనే మన్మథావిర్భావముగలవాఁడవు నని యర్థము. మీనవల్గనాది నదీధర్మములను మన్మథకేతనచలనాది ధర్మములుగా నధ్యవసించినాఁడు.

నాయకుఁడు కులగిరిరాజనందనుఁడు నాయిక భువనాభినందితయనుటవలన వీరిదాంపత్యమాను కూల్యమును ఆనురూప్యమునని భావము. మదనుతాపవహ్నిపాలయ్యెనని చెప్పఁబడుటచేఁ గోలాహలుని దిట విడివలికె తొలంగెననియుఁ గావుననె తలంపులోననే దర్పకబలముచుట్టుముట్ట నవకాశము చిక్కినదని యాశయము. తొలుత మన్మథుని టెక్కెము గనిపించెననియుఁ బిదపఁ బరివారకలకలము ఆవల ధనుష్టంకారములు ఆపిదప నాయుధహస్తులగుభటులు నాయకుని దరిసిరని భావము.

అలం. శ్లేషానుప్రాణితరూపకము.

తే. మరునినాళీకసాయకో • త్కరము కరము
ధరముఁ దరమిడి మెరము టే • యరిది సొరిది
నురిది నవి మెట్లు తెగఁ గో • యునురునదీఝు
రంబుల జనింపవో శతా • రములు గావొ. 115

మరుని=మన్మథునియొక్క, నాళీకసాయకోత్కరము = పద్మరూపబాణపరంపర, కరము= మిక్కిలి, ధరమున్ = కోలాహలపర్వతమును, తరమిడి మెరముట = అంటి మర్మభేదనముసేయుట, ఏయరిది=ఏమి యాశ్చర్యము, అనఁగా నాశ్చర్యము గాదనుట. ఏమనిన, సొరిదిన్=యుక్తమగునట్టులుగా, అవి=ఆపద్మబాణములు, ఉరిదిన్=ఉరువడిచేత, మెట్లు తెగఁగోయు నురునదీఝురంబుల జనింపవో=కొండలు తెగునట్టులుగాఁ బారునట్టి గొప్పనదీప్రవాహములయందుఁ బుట్టినవి కావా, శతారములుగావొ=పర్వతములను భేదించెడు నూఱంచులుగల వజ్రాయుధములు గావా, కాఁబట్టి కోలాహలపర్వతభేదనముసేయుట యాశ్చర్యముగాదని యర్థము. వజ్రాయుధము నూఱంచులది యనుటకు, (ని. 'శతకోటి స్స్వరు శ్శమ్బో దమ్భోళి రశని ర్ద్వయోః' అని అ.) శతారమనఁగాఁ బద్మము నూఱుఱేకులుగలదనుట. (శ్లో. 'సహస్రపత్రం కమలం శతపత్రం కుశేశయమ్' అని అ.) మరుని సాయకములనక సాయకోత్కరమనుటచే నసంఖ్యాకబాణములచే మర్మభేదనము కలిగి తీరు ననుట. బాణములు శతారములు గావుననే పర్వతక్షోభకారణములయ్యెను. బాణములె గాదు. బాణ జన్మస్థలములగు ఝురులు సైతము శైలములనొరయుచు మెట్లు తెగఁగోయుట సహజము. అలం. కావ్యలింగము. అర్థాపత్తి. శ్లేషము.

చ. కపురపుఁగమ్మతావిఁ జలి • గ్రమ్మెడుగొజ్జఁగిపువ్వునీట న
చ్చపు నెలఱాలవెల్లువలఁ • జందనవాసన నేమిఁట న్నగా
ధిపు నతితీవ్రతాపశిఖ • దీరకపోయె గతాగతక్రియా
నిపుణఘనాళినీతతటి • నీలలితామృతధారఁ దక్కఁగాన్. 116

కపురపుఁగమ్మతావిన్=కర్పూరముయొక్క మనోహరమైన పరిమళముచేతను, చలిగ్రమ్మెడు గొజ్జఁగిపువ్వునీటన్=చల్లఁదనము గ్రమ్ముచుండెడు గొజ్జంగిపూనీటిచేతను, అనఁగాఁ జల్లని పన్నీటిచేతను, అచ్చపు=స్వచ్ఛమైన, నెలఱాలవెల్లువలన్=చంద్రకాంతశిలలుగరఁగి ప్రవహించు ప్రవాహముచేతను, చందనవాసనన్=శ్రీచందనపువాసనచేతను, ఏమిటన్=వీనిలో దేనిచేతను, నగాధిపున్=కోలాహలపర్వతశ్రేష్ఠునియొక్క, అతితీవ్రతాపశిఖ=అత్యంతతీక్ష్ణమైన విరహతాప మనెడు నగ్ని, తీరకపోయెన్=శమింపకపోయెను. కర్పూరపరఁటులును, గొజ్జంగులును, జంద్రకాంతశిలలును, శ్రీచందనవృక్షములును నివి పర్వతమందుఁగల వస్తువులని గ్రహింపవలయును. ఇఁక నేమనిన, గతాగత=పోవుచువచ్చుచునుండెడు, క్రియానిపుణ=కార్యసఫలీకరణమందు నేర్పుగల, ఘనాళి=ప్రౌఢసఖిజనములచేత నని యర్థము. మేఘపంక్తిచేత నని భావము. నీత=పొందింపఁబడిన, తటినీ=శుక్తిమతీనదియొక్క, లలిత=మనోహరమైన, అమృతధారఁ దక్కఁగాన్=అమృతమనఁగా నుదకంబును గనుక నుదకధార యనెడు సుధాధారచేతఁదప్ప మఱియొకదానిచేత శమింపకపోయె నని సంబంధము. అనఁగా శుక్తిమతీనదీవిషయమైన కోలాహలపర్వతునియొక్క విరహతాపానలము

కేవల శైత్యప్రదములైన కర్పూరాదులచేత శమింపక మేఘము శుక్తిమతీజలములను గ్రోలివచ్చి యాజలములను గోలాహలునిపై వర్షింపఁగా నందువలనఁ గొంత యుపశమించుచుండె ననుట. కమ్మ తావి యన్నందుకు,

గీ. 'జగతిఁ జప్పనితూరకుఁ జప్పతూర, జనును జక్కనిచాయకుఁ జక్కచాయ
హెచ్చు పచ్చనితోటకుఁ బచ్చతోఁట, గరిమఁ గమ్మనితావికిఁ గమ్మతావి.' అని అప్పకవి.

విరహవేదనను తాపమనక అతితీవ్రతాపశిఖి యనుటచే దుర్భరముగ నుండెననియుఁ గావుననే సామాన్యశైత్యోత్పాదకములగు శిశిరోపచారములు తగ్గింపఁజాలవయ్యెననియు భావము. తొలుతఁ జలిగ్రమ్మ గొజ్జఁగిపూవునీరు పిదప చంద్రకాంతశిలాజలప్రవాహము చందనకర్దమము నిరుపయోగము లయ్యెననుటవలనఁ దాపాతిశయము సూచితము. సామాన్యప్రతిక్రియలవలనఁ దీఱనియాతాప మమృతసేవనమునఁ దీఱె ననుటవలన నమృతరూపిణియగు శుక్తిమతియే తాపనివారిణియనుట.

అలం. సమాసోక్తి. శ్లేషానుప్రాణితము.

ఉ. శైలకులేంద్రుఁ డిట్లు మదశాలిశుకాళిపికాళిశారికా
జాలకనీలకంఠరవసంగతిఁ దాలిమి నిల్పఁ జాల కు
ద్వేలకరాళకంతుశరవేదన దీర నదీరసోర్మికం
దేలక యేలకల్గు మహనీయసుఖం బని నిశ్చితాత్ముఁడై. 117

శైలకులేంద్రుఁడు=కోలాహలపర్వతశ్రేష్ఠుఁడు, ఇట్లు=ఈచెప్పఁబడిన ప్రకారముగా, మదశాలి=మదముచేత నొప్పుచున్న, శుక=చిలుకలయొక్క, అళి=తుమ్మెదలయొక్క, (ని. 'ద్విరేఫ పుష్పలిడ్భృంగ షట్పద భ్రమరాళయః' అని అ.) పిక=కోకిలలయొక్క, (ని. 'వనప్రియః పరభృతః కోకిలః పిక ఇత్యపి' అని అ.) ఆళి = సమూహములయొక్క, శారికాజాలక = గోరువంకపిట్టల గుంపులయొక్కయు, నీలకంఠ = నెమళ్ళయొక్కయు, (ని. 'నీలకణ్ఠౌ శిఖీశ్వరౌ' అని నా.) రవ=కలకలధ్వనులయొక్క, సంగతిన్ = కూడికచేత, తాలిమి నిల్పఁజాలక=ధైర్యము నిలుపలేక, ఉద్వేల=అతిశయించుచున్న, కరాళ=భయంకరమైన, కంతు శర=మన్మథబాణ సంబంధమయిన, వేదన=తాపము, తీరన్ = శమించునట్లుగా, నదీ=శుక్తిమతియొక్క, రసోర్మికన్=సంభోగశృంగార రసతరంగమందు ననియర్థము. సలిలతరంగమం దనిభావము. తేలక=ఓలలాడక పోయినపక్షమందు, మహనీయసుఖంబు=అతిశయమున సౌఖ్యము, ఏలకల్గున్=ఎట్లుగలుగుచున్నది, అని నిశ్చితాత్ముఁడయి=అనుకొని నిశ్చయింపఁబడిన యంతఃకరణముగలవాఁడై దీనికి ముందటిపద్యముతో నన్వయము.

తా. కోలాహలుఁడు మన్మథోద్దీపనకరములగు కోకిల గోరువంక నెమిలి లోనగు పక్షులకలకలమువలనఁ దమినిలుపఁజాలక మన్మథవేదనఁ దీఱుటకై నదీవతంసమగు శుక్తిమతిని గవయనిశ్చయించి-

క. రుచిరాజితమణిభూషా,రుచిరాజి వెలుంగ దివ్యరూపోజ్జ్వలుఁ డై
యచలాధీశ్వరుఁ డొకనాఁ, డచలామణిహార మగుమహానదిఁ జేరెన్. 118

రుచిర=ప్రకాశమానములైన, అజిత=విలువవలనోఁబడని, అనఁగా ననర్ఘ్యములైన, మణి=రత్నమయములైన, భూషా=ఆభరణములయొక్క, రుచిరాజి=కాంతిపుంజము, ని. 'రుచిస్తు కిరణే కాం

తా వభిషఙ్గా భిలాషయోః' అని నా. వెలుంగన్=ప్రకాశింపఁగా, దివ్య=సౌందర్యయోగ్యమైన, రూప=ఆకృతిచేత, ఉజ్జ్వలుఁడై=ప్రకాశమానుఁడై, అచలాధీశ్వరుఁడు = కోలాహలుఁడు, ఒకనాఁడు=ఒకానొకదినమందు, అచలా=భూమికి, మణిహారమగు=ముత్యాలహారమువలెనున్నట్టి, మహానదిన్=గొప్పనదియైన శుక్తిమతిని, చేరన్=సమీపించిపోయెను. శబ్దా. యమకము.

తా. వివిధభూషణముల నలంకరించుకొని కోలాహలుఁ డొకనాఁడు శుక్తిమతిని సమీపించెను.

శా. చేరన్ రా నదియుం దటోద్గతఝరీ♦సీమాధికోదగ్రసం
చారశ్రీ నెదు రేగి యూర్మిమయహా♦స్తన్యస్తరాజీవరా
జీరాజన్మణిభాజనంబుల రజ♦శ్శ్రీగంధకింజల్కరే
ఖారక్తాక్షతము ల్వహించి వరుసం♦ గావించెఁ బూజావిధుల్. 119

చేరన్ రాన్=కోలాహలుఁడు సమీపమునకు రాఁగా, నదియున్=శుక్తిమతీనదియును, తటోద్గత=తీరమునతిక్రమించి పైకివచ్చిన, ఝరీ=ప్రవాహముయొక్క, సీమాధిక+ఉదగ్రసంచారశ్రీన్=సీమయనఁగా నిక్కడిమర్యాద, (ని. 'సీమసీమే ఇమే క్షేత్రే కూల మర్యాదయో రపి' అని నా.) మితిమీఱి యుత్కటమగుచున్న సంచారసంపత్తిచేత, ఎదురేగి=ఎదురుగాఁ బోయియని యర్థము. సీమయనఁగాఁ బొలిమేర, పూజ్యులైనవారు తనయొద్దకు వచ్చుచుండఁగాఁ బొలిమేర దాఁటి యెదురుగాఁ బోవలసినది న్యాయమైనందున సీమాధికోదగ్రసంచార మనఁగాఁ బొలిమేర దాఁటిపోవుట యని యర్థాంతరము. అర్థద్వయమునకును నభేదాధ్యవసాయము. ఊర్మిమయ = తరంగరూపములైన, హస్త=చేతులయందు, న్యస్త=ఉంపఁబడిన, రాజీవరాజీ=పద్మసమూహమనెడు, రాజన్మణిభాజనంబులన్=ప్రకాశించుచున్న రత్నపాత్రములయందు, (ని. 'భాజనం యోగ్యపాత్రయోః' అని నా.) రజః=పుప్పొడియనెడు, శ్రీగంధ=శ్రీచందనమును, కింజల్కరేఖా=కేసరశ్రేణులనెడు, రక్తాక్షతములు=ఎఱ్ఱనియక్షతలను, అక్షతశబ్దము కుశాదిగణములోఁ జేరినదయ్యు, (ని. 'లుగ్వా వే తుక్శాదేర్ఘోః' న.) అను సూత్రముచే రావలయు మువర్ణలోపము. 'చరితాదికశబ్దానాం స్వరూపంచ యథా భవేత్' అని యథర్వణుఁడు చెప్పుటచేత హంసాక్షతాదిశబ్దములకు వికల్పముగాన నిచట అక్షతములని ప్రయోగింపఁ బడియెను. వహించి=ఉంచుకొని, వరుసన్=అర్ఘ్యపాద్యాదిక్రమముచేత, పూజావిధులు=అర్చావిధానములను, కావించెన్=చేసెను. అనఁగా లోకమందుఁ బూజ్యులైనవారు తన యింటికి వచ్చుచుండఁగాఁ దెలిసికొని పొలిమేరకవతలికి నెదురుగాఁబోయి వెంటఁబెట్టుకొని వచ్చి పళ్ళెరములయందు గంధాక్షతలుంచుకొని యర్ఘ్యపాద్యాదివిధులచేతఁ బూజచేయవలయునది మర్యాద గనుక నాప్రకారముగాఁ గోలాహలునికి శుక్తిమతీనది పూజచేసె నని యర్థము.

అలం. రూపకానుప్రాణితోత్ప్రేక్ష.

తే. గిరియునుదదంతికోత్తుంగ♦తరచిరత్న, రత్నతటపీఠిఁ జెందె గౌ♦రవము వఱల
వరలలితవాహినీవైభ♦వంబుఁ గాంచి, గాంచె బహుపద్మనిధిలాభ♦కౌతుకంబు.

గిరియును=కోలాహలాద్రియుఁను, తత్=ఆశుక్తిమతియొక్క, అంతిక=సమీపమందలి, ఉత్తుంగతర=ఉన్నతమైన, చిరత్నరత్న=ప్రాచీనరత్నమయమైన, తట=తీరమనెడు, పీఠిన్=పీఠమును, చెం

డెన్=అధిష్ఠించెను. ఏలాగుననగిన, గౌరవము వఱలన్=ఘనత మీఱునట్టులుగా ననియర్థము. దుర్భరత్వ మొప్పఁగా ననిభావము. వర=శ్రేష్ఠమును, లలిత=ఒప్పిదమును నైన, వాహినీవైభవంబు = శుక్తిమతీనదియొక్క వైభవమును, కాంచి=చూచి, కాంచెబహుపద్మనిధిలాభకౌతుకంబున్=అనేకములైన పద్మనిధులయొక్క ప్రాప్తివలని సంతోషమును బొందెనని యర్థము. అనేకపద్మాకరలాభకౌతుకమును బొందెననిభావము. ఈపద్యము ముక్తపాదాంత్యగ్రస్తముగాఁ జెప్పంబడియె.

లలితశబ్దము సౌకుమార్య సౌందర్యద్యోతకము. వర,వైభవములను విశేషములవలన సౌకుమార్య సౌందర్యముల యతిశయము సూచితము. రత్నమయమగు నొడ్డను సింహాసనమున గోలాహలుఁడు కూర్చుండి నదీసౌందర్యమునుగాంచి యానందించెనని భావము. లలితము నాలంకారికు లిటుల నిర్వచించిరి.

శ్లో. విన్యాసభంగిరంగానాం భ్రూవిలాసమనోహరా
సుకుమారాభవే ద్యత్ర లలితం తదుదీరితమ్. (రసార్ణవసుధాకరము.)

వ. అప్పు డప్పుణ్యతరంగిణి యన్నగాగ్రణితో ని ట్లనియె. 121

అప్పుడు=ఆసమయమునందు, అప్పుణ్యతరంగిణి=పుణ్యనదియైన యాశుక్తిమతి, అన్నగాగ్రణితో నిట్లనియెన్=పర్వతశ్రేష్ఠుఁడైన యాకోలాహలునితో నీరీతిగాఁ బలికెను. ఏమని యనిన,

సీ. అతులశైవలవతీ•శతములీ నెడుమీకు నాయిచ్చు విమలార్ఘ్య•తోయ మెంత
ప్రాలేయనిలయసం•భవముఁ గాంచినమీకుఁ బన్నీట నొనరించు•పాద్య మెంత
సరసమందార మం•జరుల రంజిలుమీకుఁ బెనఁచి పూదండ ల•ర్పించు టెంత
గోరత్నదోహన • గురులక్ష్మిగల మీకు నుపదగామణివర్గ • మొసఁగు టెంత
తే. యనఘ యెవ్వారలైనఁ గొం•డంతవారి,కవనిఁ గొండంతపూజ సే•యంగఁగలరె
భక్తినే నిచ్చునీపుష్ప•పత్రతోయ, మాత్రములు గైకొను ప్రకాశ•గోత్రతిలక.

ఈపద్యమునకు నున్నతవంశసంభవునిపరముగఁ గోలాహల పర్వతపరముగా నర్థద్వయము గలదు.

అతుల=సమానరహితమయిన, శైవలవతీశతములు=నదీశతములను, ఈనెడుమీకున్=ఉత్పాదనము చేయుచుండెడు మీకు, నాయిచ్చు=నేనుసమర్పించునట్టి, విమలార్ఘ్యతోయమెంత=నిర్మలమయిన యర్ఘ్యజల మెంతమాత్రము, అనఁగా నెక్కువలోనిది గాదనుట. ప్రాలేయనిలయ=హిమజలములకు నివాసమయిన పర్వతమువలన, అనఁగా హిమవంతునివలన, (ని. 'ప్రాలేయం మిహికా చాథ హిమానీ హిమసంహతిః' అని అ.) సంభవముః గాంచిన=జన్మించిన, మీకున్=మీకు, పన్నీటనొనరించు పాద్యమెంత=పరిమళయుక్తమయిన స్వల్ప హిమజలముచేత నిచ్చునట్టి పాద్య మెంతలోనిది, సరస=మకరందయుక్తమయిన, మందారమంజరులన్=కల్పవృక్ష సంబంధములైన పువ్వుగుత్తులచేత, రంజిలుమీకున్=రక్తిమఁ జెందుచుండెడుమీకు, పెనఁచి పూదండ లర్పించుటెంత=కలియఁబెనఁచి పుష్పమాలికలర్పించుట యెంతలోనిది, గోరత్నదోహనగురులక్ష్మిగలమీకున్=గోశబ్దము గోవునందును భూమియందునువర్తించును. ని. 'స్వర్గేషు పశువాగ్వజ్రదిఙ్నేత్ర ఘృణిభూజలే, లక్ష్యదృష్ట్యా స్త్రియాం పుంసి గౌః' అని అ. గో=గోరూపమైన భూమివలన, రత్నదోహన=రత్నములను బితుకుట

గలిగిన, గురు=తండ్రియైన హిమవంతునియొక్క, లక్ష్మిగలమీకుఁ=సంపదగలమీకు, ఉపదగా మణి వర్గ మొసఁగు టెంత=కానుకగా రత్నసమూహము నిచ్చుట యెంతలోనిది. 'ని. 'ఉపాయన ముపగ్రాహ్య ముపహార స్తథోపదా' అని అ. భూదేవి గోరూపిణియైనదనియు, హిమవత్పర్వతము వత్సరూపం బయినదనియు, రత్నాదులు పితుకఁబడినవనియును బ్రసిద్ధము.

అనఘ=నిష్కల్మషుఁడవైన యో కోలాహలాద్రీ, ఎవ్వారలైనన్=లోకములో నెవ్వారైనప్పటికిని, కొండంతవారికిన్=కొండపొడుగు ఘనతగలవారి కని యర్థము. పర్వతమున కని భావము. అవనిన్=భూమియందు, కొండంతపూజ సేయంగఁ గలరె=కొండపొడుగుపూజ సేయఁగలరా, అనఁగాఁ జేయలేరుగదా యనుట. ఇంక నేమనిన, భక్తినేనిచ్చు=భక్తిచేత నేనిచ్చునట్టి, ఈ పుష్ప పత్ర తోయమాత్రములు=ఈపుష్పము పత్రము ఉదకము ఇంతమాత్రములు, కైకొనుటె కాక=గ్రహింపవలయు నదియన్యాయముకాక, నే సమర్పించినవి మీ కెంతమాత్రమని యర్థము. గోత్రతిలక=వంశశ్రేష్ఠుఁడా యని యర్థము. పర్వతశ్రేష్ఠుఁడా యని భావము. ఈపద్యమునఁ గోలాహలపర్వత పరిహాస పరముగను నొక యర్థము. స్ఫురించుచున్నది. అలం. విభావన.

తా. ఓకోలాహలేంద్రా! నీవు మిగుల గొప్పవాఁడవు. నేనొసంగు పాద్యము అర్ఘ్యము పుష్పము కానుకలు ప్రీతితో స్వీకరింపుము. కొండంతవారి కెవ్వరు కొండంతపత్రి పెట్టఁజాలరు గావున భక్తిసూచకముగ నేనొసంగు నీస్వల్పములగు పుష్పములు పత్రములు తోయము పరిగ్రహింపుము.

చ. విలసితరత్నకూటములు • వేలుపుకన్నెలకూటము ల్సుధా
కలితసరఃకృపీటములు • కామితనూతనవస్తుజాలదో
హలసురభూజవాటము లొ•కప్పుడు వాయక కల్గునీకు న
వ్వల నొకయర్థనీయ మగు•వస్తువు గల్గునె ముజ్జగంబులన్. 123

విలసిత=మిక్కిలియు నొప్పుచున్న, రత్నకూటములు=మణిమయములైన శిఖరములును, ని. 'కూటో స్త్రీ శిఖరం శృఙ్గమ్' అని అ. వేలుపుకన్నెల కూటముల్=దేవతాస్త్రీలయొక్క సాంగత్యములును, సుధా=అమృతమువలె, కలిత=మాధుర్యముచేత నొప్పుచున్న, సరఃకృపీటములు=సరోవర జలములును, (ని. 'వాతూలే విషవైద్యేచ కృపీట ముదరే జలే' అని నా.) కామిత=కోరఁబడిన, నూతనవస్తుజాల=అభినవ పదార్థసందోహములను, దోహల=ఇచ్చునట్టి, సురభూజవాటములు=కల్పవృక్ష సమూహములును, ఒకప్పుడు వాయకకల్గునీకున్=ఏకాలమందును నెడఁబాయక కలిగియుండెడు నీకు, అనఁగా నీచెప్పఁబడిన వస్తువులుగలవాఁడు దేవేంద్రుఁడు గనుక నింద్రవైభవముగల నీకు, అవ్వల=ఆవతల, ముజ్జగంబులన్=మూఁడులోకములయందును, ఒకయర్థనీయమగు వస్తువు గల్గునె=ఒకకోరఁదగిన పదార్థము గలుగనేర్చునా, అనఁగాఁ గలుగనేరదనుట, ఇక్కడఁ గోలాహలపర్వతమందు నింద్ర వ్యవహార సమారోపణమువలన సమాసోక్త్యలంకారము.

తా. నీకు మణిమయములగు శిఖరములుగలవు గావున సంపన్నుఁడవు, దేవకాంతల చెలిమిగల వాఁడవుగావున భోగపూరుషుఁడవు, కోరినవస్తువులొసంగు కల్పవృక్షములు నీకుఁ గలవు గాన నిష్కామివి. ఇట్టి నీకుఁ బరులను యాచింపఁదగిన వస్తువు లీమూఁడులోకములలో లేదు.

క. ఏతాదృశగుణగరిమస, మేతాత్ములు మీరలిచటి • కేతెంచుట యో
శీతాద్రితనయ మదుపరి, జాతాభినవానురాగ•సంపత్తిఁ గదా. 124

ఏతాదృశ=ఇటువంటి, గుణ గరిమ సమేతాత్ములు=గుణశ్రేష్ఠత్వముతోఁగూడిన యంతఃకరణము గలవారని యర్థము. దుర్భరత్వముతోఁ గూడిన మూర్తిగలవారని భావము. మీరలు=మీరు, పూజ్యార్థమందు బహువచనము ప్రయోగార్హము. ఇచటికేతెంచుట=ఇక్కడికివచ్చుట, ఓశీతాద్రితనయ=ఓహిమత్పర్వతకుమారా, మదుపరి=నామీఁద, జాత=పుట్టిన, అభినవ=నూతనమయిన, అనురాగసంపత్తిఁగదా=వాత్సల్యసమృద్ధిచేతఁగదా యని యర్థము. నామీఁద నుదయించిన స్త్రీవిషయానురాగ సమృద్ధిచేతఁగదా యని భావము.

మదుపరిజాతాభినవానురాగ సంపత్తి యనుచోఁ గొందఱు వ్యాఖ్యాతలు నాపయిగల నీళ్లమీఁదఁదేలు కోరికయని యర్థము. శక్తిమతీవాక్యమునుండి యబుద్ధిపూర్వకార్థము జెప్పియున్నారు. "నిజంబ పల్కితి వవుర్" అను పద్యభాగముచే నీయంశము నిర్ధారణ చేయుచున్నారు. ఇందు భావము క్లిష్టముగనుంటచే నెంతవఱకుఁ గవ్యభిప్రాయము నిర్ణయింప వీలుగాదు. అనురాగ మన స్త్రీవిషయికమగు ప్రేమయు వాత్సల్యముగాన నిట శక్తిమతి యబుద్ధికృతముగ భాషించెను.

చ. అన విని గట్టురాకొమరుఁ • డాననగహ్వరరోచమాననూ
తనతరదంతహీరరుచి•ధారలు వెల్వడ నొక్కలేఁతన
వ్వ నగి నిజంబ పల్కితి వ•వుర్ భువనాశయసన్నివేశవే
దిని సరసాగ్రగణ్యవు గ•దే యని యన్నదిఁ బల్కె వెంబడిన్. 125

అనవిని=శక్తిమతి యీలాగునఁ బలుకఁగా నాలకించి, గట్టురాకొమరుఁడు=పర్వతరాజనందనుఁడైన కోలాహలుఁడు, (గీ. 'ఒప్పు గిరి పేళ్ళు మల గట్టు తిప్ప మెట్ట, కొండగుబ్బలి నామేరు కుధర చాప' అని యాంధ్రనామసంగ్రహము.) ఆననగహ్వర=గుహావంటిముఖమందు, రోచమాన=ప్రకాశమాన మగుచున్న, నూతనతర=మిక్కిలి నూతనమైన, దంతహీర=వజ్రమణులవంటి దంతములయొక్క, రుచి=కాంతియొక్క, ధారలు=అల్పప్రవాహములు, (ని. 'ధారా పూగకాపి సేనాగ్రం పతదంబ్వాది సంతతిః, ఖడ్గాదినిశితప్రాంతే తురఙ్గగతిపఞ్చకే.' అని నా.) వెల్వడఁగా=బయలుదేరఁగా ననియర్థము. ఆననగహ్వర=ముఖసదృశమయిన గుహాయందు, (ని. 'గుహా దంభ గహనేషు తు, గహ్వరమ్' అని నా.) రోచమాన=ప్రకాశించుచున్నవియు, నూతనతర=మిక్కిలి నూతనమయినవియునగు, దంత శబ్దమిక్కడ సానువునందు వర్తించుచున్నది. (ని. 'దంతస్సానుని కథ్యతే' అని వి.) దంతహీర=సాను సముత్పన్నములైన వజ్రమణులయొక్క, కాంతిధారలు వెల్వడఁగానని భావము. ఒక్క లేఁతనవ్వ నగి=ఒక చిఱునవ్వునవ్వి, నిజంబపల్కితివవుర్=అగును యథార్థమేపలికినదానవు, భువన=జగత్తులయొక్క, ఆశయసన్నివేశ=అభిప్రాయస్థితిని, వేదిని = గుర్తెఱిఁగినదానాయని యర్థము. భువనాశయ=జలాశయమందలి, సన్నివేశ=సత్పురుష ప్రవేశమును, వేదిని = గుర్తెఱిఁగినదానా యనిభావము. సారసాగ్ర గణ్యవుగదే యని=సరసమయిన హృదయముగలవారిలో శ్రేష్ఠురాలవుగదే యనియర్థము. సరసా = జలసహితలైననదులలో, సగ్రగణ్యవుగదే = ముందుగా స్తుతిసేయఁ దగినదానవుగదే యని

భావము. అని=ఇట్లువచించినవాఁడై, అన్నదిఁ బల్కు- వెండియుఁ = ఆనదినిగూర్చి మరల నొక వాక్యమును బలికెను. అలం. శ్లేషము.

అనురాగము స్త్రీవిషయికరాగము వాత్సల్యముగావున స్త్రీవిషయిక రాగముగనే యర్థము జేసికొని కోలాహలుఁడు శుక్తిమతిని భువనాశయ సన్నివేశినివి సరసాగ్రగణ్యవనెను. అనఁగాఁ బరేం గితగ్రాహిణివి రసికురాలవనుట. లేఁతనవ్వు ఉత్తమత్వసూచకము. గట్టురాకొమరుఁడు గాన నాయకుఁ డుత్తముఁడు.

శ్లో. శ్రేష్ఠానాం స్మితహసితే మధ్యానాం విహసితా వహసితేచ
నీచానా మపహసితం తథాతిహసితంచ షడ్భేదాః. (సాహిత్యదర్పణము.)

మ. పరమామోదముతో విశేషతటినీ•పద్మాస్యలం గూడి నీ
వరవిందోద్భవుఁ గొల్చి యేగుతఱి నీ•యచ్ఛాచ్ఛభావంబు నీ
సరసత్వంబును నీగభీరతయు నీ•సర్వంకషప్రౌఢి నీ
పరిపూర్ణత్వము గాంచి మెచ్చి మదిలో ♦ భావింతు నిన్నెప్పుడున్. 126

పరమామోదముతోఁ = ఉత్కృష్టమయిన సంతోషముతోడ, అశేష తటినీ పద్మాస్యలం గూడి=సమస్త నదీకాంతలను గూడుకొని, నీవు=ఈవు, అరవిందోద్భవుఁగొల్చి=బ్రహ్మదేవుని సేవించి, ఏగుతఱిఁ=పోవుచుండెడు సమయమందు, నీయచ్ఛాచ్ఛభావంబుఁ = నీయొక్క యత్యంతస్వచ్ఛమయిన హృదయము నని యర్థము. నిర్మలత్వమునని భావము. (ని. 'భావః పదార్థే సత్తాయాం క్రియా చేష్టాత్మయోనిషు, విద్వల్లీలా సభావేషు భూత్యభిప్రాయ జంతుషు' అని నా.) నీసరసత్వంబును= నీయొక్కరసికత్వమునని యర్థము. జలసహితత్వము నని భావము. నీగభీరతయుఁ = నీయొక్క గాంభీర్యగుణము ననియర్థము. లోఁతు నని భావము. నీసర్వంకషప్రౌఢిఁ = నీయొక్క సర్వసంగ్రహప్రౌఢిమ నని యర్థము. సర్వవ్యాపక సామర్థ్యము నని భావము. నీపరిపూర్ణత్వముఁ =నీయొక్క సంపూర్ణభావమునని యర్థము. ప్రవాహపరిపూర్ణత్వమునని భావము. కాంచి=చూచి, మెచ్చి =మెచ్చుకొని, మదిలోఁ = మానసమందు, భావింతునిన్నెప్పుడుఁ = ఎల్లప్పుడును నిన్ను ధ్యానము సేయుచుందును, భావింతునిన్నెంతయుఁ -అని పాఠాంతరము. నిన్నుఁ =నిన్ను, ఎంతయుఁ, మిక్కిలి భావింతుఁ =తలంతును, అనియర్థము.

అచ్ఛభావము సరసత్వము గభీరత సర్వంకషప్రౌఢి, పరిపూర్ణత్వము ఉత్తమస్త్రీధర్మములు. నదీధర్మములు. అశేషతటినీసహితముగా నేగుచుంటి వనుటచే నదీగణమునందుఁ బ్రధానత్వము సూచితము. మదిలో భావింతుననుటచే నీగొప్పతనమును జిరకాలమునుండి యెన్నుచుంటిననియు నీపది యింతవఱ కెఱుంగవనియు భావము. అలం. శ్లేషము.

శా. ఆపద్మోద్భవునోలగంబునకు ది•వ్యద్వీపినుల్వచ్చు రా
త్రో పోరో మఱి యెందఱేనియును వా•రుఁ మేము సంధింపమో
యేపద్మాననఁ జూచినం దెలియ ని•న్వీక్షించిన ట్లుండ దే
ల్లా పల్మాటలు పూర్వజన్మకృతము ♦ ల్గాఁబోలు నీనెయ్యముల్. 127

ఆపద్మోద్భవు=ఆ బ్రహ్మదేవునియొక్క, ఓలగంబునకున్=కొల్వునకు, దివ్యద్వీపినుల్ = దివ్యనదులు, (ని. 'స్రోతస్వినీ ద్వీపవతీ' అని అ.) నిచ్చ=నిరంతరమును, (గీ. 'ఎపుడు నెడపక యుండుగక యెల్లపు డన, నిచ్చ యనయంబు నాఁగను నిచ్చ లనఁగఁ, దనరు నాఖ్యలు సంతతం బనుట కభవ' అని యాంధ్రనామసంగ్రహము.) మఱియెందఱేనియును=ఇంక నెందఱైనను, రారో పోరో=వచ్చుచుండలేదా పోవుచుండలేదా, వారు న్నేముసంధింపమో=వారును మేమును నెదురుకొనలేదా, ఏపద్మాననఁజూచినన్ = పద్మమువంటి ముఖముగల యేస్త్రీని జూచినప్పటికి నని యర్థము. ఆననమువంటి పద్మములుగల యేనదిని జూచినప్పటికిని భావము. నిన్నీక్షించినట్లుండదు = నిన్నుఁజూచినట్లుగానుండదు, ఏలాపల్మాటలు=బహుభాషలెందుకు, ఈనెయ్యములు=ఈమక్కువలు, పూర్వజన్మకృతములుగాఁబోలున్=క్రిందటిజన్మమందుఁ జేయఁబడినవి కాఁబోలును. మేము అనుపదము పూజ్యార్థమందుఁ బ్రయోగింపఁబడియెను.

పైఁబద్యమున సమస్తనదీకాంతలు బ్రహ్మదర్శనమునకు వత్తురని చెప్పఁబడెను. ఇపుడు దివ్యనదీకాంతలుగూడ వత్తురని చెప్పుచున్నాఁడు. వారలఁ గోలాహలుఁ డెదుర్కొనుచున్నాఁడు. సౌందర్యాతిశయము లటుండ నెవ్వరినిజూచినను శుక్తిమతినిగాంచినటు లుండకపోవుటకు హేతువు ఈనెయ్యము పూర్వజన్మకృతమగుటయే. పూర్వజన్మవాసనావాసితమగు నెయ్యము తొలంగించుట యసాధ్యమనియు దాని బలిమితెలుపుట యసాధ్యముగాన పలుమాటలేల యనియు భావము.

ఉ. నావలనం బ్రియం బెఱిఁగి ♦ నన్నొకమాఱును బల్కరింప కీ
వే వెస నోరఁ జేసికొని ♦ యేగుదు గాని సరిల్లలామ ని
న్నేవగఁ జేర వత్తు మది ♦ కింపగునీదునవోదితామృతం
బేవగఁ గ్రోలఁ గాంతు నని ♦ యే నెపుడుం దలపోయుచుండుదున్. 128

నావలనంబ్రియంబెఱిఁగి=నావలననుండెడు నీవిషయమైన ప్రేమను దెలిసికొని, నన్నొకమాఱును బల్కరింపక = నన్నొకసారియైనను మాటాడక, ఈవే వెసనోరఁజేసికొని యేగుదుగాని=నీవే త్వరితముగాఁ దొలఁగుపాటుచేసికొనిపోదువుగాని - ఇంతపర్యంతము నదీస్వభావపరముగాను జెప్పవలయును. సరిల్లలామ=నదులకు భూషణమవైన శుక్తిమతీ, నిన్నేవగఁజేరవత్తున్=నిన్ను నేవిధముచేత సమీపించివత్తును, మదికింపగు = మనస్సునకు హితమగుచున్న, నీదు=నీసంబంధమైన, నవ=నూతనమైన, ఉదితామృతంబు=వచోమృతమును అనియర్థము. అభినవోదితమైన సలిలము నని భావము. ఏవగఁ గ్రోలఁ గాంతున్=ఏవిధముగాఁ బానముచేతును, అని = అనుకొని, ఏనెపుడుం దలపోయుచుండుదున్=నేనెల్లప్పుడును విచారించుచుందును. అనఁగా నామీఁద నీకుమాత్రమే మక్కువలేదు కాని నాకెల్లప్పుడును నీమీఁదనే మక్కువ గలిగియున్నదని యర్థము. ఏగుదు, చేరవత్తున్ అను పదములు క్రమముగా మధ్యమోత్తమపురుషైకవచనంబులు కాన, (ని. 'ఉత్వయుతౌ వనకారౌ స్యాతాం మధ్యోత్తమైకవచనానామ్' న. అనుసూత్రముచే వువర్ణక నువర్ణకములు కలుగఁ బ్రయోగింపవలసియుండియుం, ని. 'భూతేతరయోర్వికల్పత్వ మితి కేచిద్బభాషిరే' అనునథర్వణవచనము ననుసరించి యీపదములును భూతార్థకద్యోతకములు గాన వువర్ణక నువర్ణక విరహితములుగా గ్రంథకర్త ప్రయోగించెను.) అలం. శ్లేషము.

తా. ఓనదీమణీ! నేను నీపయి వలపుఁగొనియుండుట నీవెఱింగియు నన్నెపుడు పలుకరింపక తొలఁగి పోవుచుంటివి. నిన్నెటులఁ జేరనగును. నీమాటతేనియలు (నీజలము) ఎటులఁ గ్రోలఁ గలుగు నని చిరకాలమునుండి యువ్విళులూరుచుంటిని.

తే. విమలమధురమనోహర•వృత్తి వెలయు
వారిఁ గొనియాడ బుధు లెంత•దూర మైనఁ
బోవుదురు గాన నేను నీ•పొందుఁ గోరి
ద వ్వనక వచ్చితి నశేష•తాపశమని. 129

విమల=నిర్దోషమును, మధుర=ప్రియమును, మనోహర=చక్కనిదియునయిన, వృత్తిఁ=వర్తనముచేత, వెలయువారిఁ = ప్రకాశించెడువారిని అని యర్థము. నిష్కలుషంబును మాధుర్యయుక్తంబును మనోహరంబును నైనస్థితిగలవారి ననఁగా నుదకమననిభావము. (ని. 'స్వాదు ప్రియాచ మధురా' అని అ.) కొనియాడఁ=వర్ణించుకొఱకని యర్థము. కొని=గ్రహించి, ఆడఁ=స్నానము సేయుకొఱకనిభావము. బుధులు=తెలిసినవారు, అనఁగాఁ బెద్దలు, ఎంతదూరమయినఁ బోదురుగానఁ= ఎంతదూరమయిన నరుగుదురు గనుక, నేను నీపొందుఁగోరి=నేనును నీయొక్క సాంగత్య మభిలషించి, దవ్వనకవచ్చితిఁ = దూరమని విచారింపక వచ్చినవాఁడనయితిని, అశేష = నిశ్శేషమగునట్టులుగా, తాప=మన్మథతాపమును, శమని=శమింపఁజేయఁగలదానా అని అర్థము. దాహము మొదలయిన తాపములను శమింపఁజేయఁగలదానా అని భావము.

తాపమన దప్పియని మోహతాపమని యర్థము గావున నీసమస్తతాపములు శమింపఁజేయఁదగినదానవు నీవు. కాననే నీవృత్తి విమలము, మధురము, మనోహరమును,—విమలమనుట జలపరముగ నిర్మలమనియు నదీపరముగఁ బుణ్యశీలము గలదానవనియు మధురమనుటచే నీజలము మాధుర్యమనియు నీనడవడి ప్రియము గూర్చునదియనియు మనోహరమనుటచేఁ జక్కనిదానవనియు నెదటివారి మనసు లోఁగొనెదవనియు భావము. అలం. కావ్యలింగము. శ్లేషానుప్రాణితము.

ఉ. చెప్పెడి దేమి నాకుఁ గల•జీవన మంతయు నీకుఁ గూర్చి యె
ల్లప్పుడు నిన్నుఁ బాయక ప్రి•యాచరణం బొనరింప నేర్తు నీ
చొప్పున కీవు నియ్యకొని • చొక్కపుజక్కవగుబ్బలాఁడి మేల్
దప్పక యంతరంగమునఁ • దారిచి నన్ను నదీనుఁ జేయవే. 130

చెప్పెడిదేమి=ఇఁకమీఁదఁ జెప్పఁగలదియేమియున్నది. అనఁగా వేఱొకమాట లేదనుట. నాకుఁ గలజీవనమంతయు నీకుఁగూర్చి=జీవనమనఁగా బ్రతుకు, ఉదకమును, నాకుండెడు బ్రతుకుబండాలను యావత్తును నీకేయొప్పగించి అని అర్థము. నాయందుండెడు నిర్ఝరోదకముల నీయందచేర్చి యనిభావము. ఎల్లప్పుడు నిన్నుఁబాయక =ఎల్లకాలమును నిన్నెడఁబాయక, ప్రియాచరణంబొనరింప నేర్తుఁ =ప్రియ మాచరింపనేర్తునని యర్థము. ప్రియుఁడుచేయుకార్యముఁ జేయనేర్తునని భావము. ఈచొప్పున కీవునియ్యకొని=ఈ మార్గమునకు నీవును సమ్మతించి, చొక్కపుజక్కపగుబ్బలాఁడి=చక్కని చక్రవాకములవంటి కుచములుగలదానా యని యర్థము. చక్కనికుచములవంటి చక్రవాకములు గలదానా యనిభావము. మేల్దప్పక=మేలు చెఱుపకయని యర్థము. మోహమునివిడువక యని భావము. (గీ. 'వ

లపు కూరిమి మేలు నా నలరుఁ బేర్చ్లు, మోహమునకును శారదాంబుదనిభాంగ' అని యాంధ్రనామసంగ్రహము.) అంతరంగమునఁ దారిచి = హృదయమందుఁ జేర్చి, నన్నునదీనుఁజేయవే=నన్ను దీనుఁడు గానివానిఁగాఁ జేయవేయని యర్థము. నదీనాథునిఁగాఁ జేయవేయనిభావము. అనఁగా నన్నువరించి శుక్తిమతీనదీనాథుఁ డనునట్టులుగాఁ జేయవే యనుట. నాయకుఁడు నాయికకుఁ బ్రియాచరణ మొనరించుట సహజముగావున నాజీవనమునే నీకిత్తునని కోలాహలుఁడనెను. అనఁగా శైలజలాధారము ననే నదులుల్లసిల్లుననుట. కాననే నదీనునిగాఁ జేయఁగోరెను. నదీజననమునకుఁ గొంతవఱకు శైలములె కారణముగాన నదీనాయకత్వము సార్థకముజేయ శుక్తిమతిని గోలాహలుఁడు కోరెను. అలం. శ్లేషము.

క. అన విని నగరాజుఘన, ధ్వనిగరిమకుఁ గలఁగి ముకుళి•తకరాంబుజ యై
వినయమునయంబుభయమును, మనమునఁబెనఁగొనఁగశు క్తి•మతియిట్లని యెన్.

అన విని=ఈలాగనిపలుకఁగా, నాలకించి, నగరాజు=కోలాహలపర్వతునియొక్క, ఘన=అధికమైన, ధ్వని=వాక్యధ్వనియొక్క, గరిమకున్=అతిశయత్వమునకు, కలఁగి=వ్యాకులపడియనియర్థము. మేఘధ్వనియొక్క గరిమకుఁ గలుషితమయిన జలములుకలదై యనిభావము. వినయము=నమ్రభావంబును, నయంబు=నీతియును, భయమును=భీతియును, మనమునఁ బెనఁగొనఁగన్=మనస్సునందు సంకలితము కాఁగా, శుక్తిమతి యిట్లనియెన్=శుక్తిమతీనది యొకవాక్యముఁ బలికెను.

శుక్తిమతి తొలుతఁ గోలాహలుని నతిథియని పూజించెనుగాని వానివాక్యములు ధ్వనిరూపములై వలపునెఱింగింప వెఱపుజనించెను. తప్పుకొన నుపాయముగానరామి తనజీవితము మిగులహేయమైనదనియు నీవు మహానుభావుఁడవుగాన నన్నుఁగలిసి కలుషమతివి గాకుమని ప్రార్థింపఁదొడఁగెను.

సీ. నిలు వెల్ల నీచాతి•నీచోపసరణంబు ప్రకృతి యెల్లను జాడ్య•పరిణతంబు
పెం పెల్ల నియతగాం•భీర్యమానవిహీన మంతరం బెల్లఁ బం•కావిలంబు
జీవనం బెల్ల నం•చితబుద్బుదప్రాయ ముదయ మెల్లను దుర్ది•నోన్ముఖంబు
గతు లెల్లఁ గుటిలప్ర•కారకారణము లుత్సేకంబు లెల్ల భం•గాకులములు
తే. నిలుకడ హుళిక్కి తావులు • పాలసు వల్చు
నిట్టిమాబోంట్లతోఁ జెల్మి • యెట్లు పొసఁగు
నచలితోత్తుంగధైర్యన • కలఘుమతికి
ననఘగతికి నభంగశీ•లునకు నీకు 132

నిలువెల్లన్=స్వరూప మంతయును, నీచాతినీచోపసరణంబు = హీనాతిహీన ప్రవర్తనముగలది అని యర్థము. నిమ్నాతినిమ్నస్థలసరణముగలది, అనఁగాఁ బల్లమునకంటెఁ బల్లముగా నుండుచోటికిఁ బారునది యని భావము. ప్రకృతియెల్లను=స్వభావమంతయు, జాడ్యపరిణతంబు = మాంద్యముచేతఁ బరిపక్వమయినదని యర్థము. శైత్యముచేతఁ బక్వమయినదని భావము. (ని. 'జడో మూర్ఖే హిమగ్రస్తే' అని అ.) పెంపెల్లన్=అభివృద్ధియంతయు, నియత = నియమయుక్తమయిన, గాంభీర్య=గంభీరభావముతోడను, మాన=చిత్తసమున్నతితోడను, విహీనము = తక్కువదైనది, అనఁగా గాంభీర్యమానములు లేనిదనియర్థము. పెంపెల్లన్=జలాధిక్యమంతయు, నియత=నియతమైన, గాంభీర్య=

లోఁతుయొక్క, మానవిహీనము=ప్రమాణములేనిదని భావము. అంతరంబెల్లన్=హృదయమంతయు, పంకావిలంబు = పాపముచేతఁ గలుషితమయినదని యర్థము. జలాంతరభూమి యంతయును బురదతో సంకలిత మగుచున్నదని భావము. జీవనంబెల్లన్=బ్రతుకంతయు, అంచితబుద్బుదప్రాయము=నీరుబుగ్గవంటిది, అనఁగా క్షణభంగురమని యర్థము. జీవనమనఁగా నుదకము, అది బుద్బుదబాహుళ్యమైనదనిభావము. ఇక్కడఁ బ్రాయశబ్దము తుల్యార్థమందును వర్తించుచున్నది. ని. 'ప్రాయ స్త్వనశనే మృత్యౌ తుల్య బాహుళ్యయో రపి' అని వి. ఉదయమెల్లను=అభ్యుదయమంతయు, దుర్దినోన్ముఖంబు =దుష్టదినమునకు మీఁదు చూచునదియని యర్థము. ఉదయమెల్లను=ఉత్పత్తియంతయు, దుర్దిన=మేఘచ్ఛన్నదినమునకు, ఉన్ముఖంబు=మీఁదుచూచుచున్నదని భావము. (ని. 'మేఘచ్ఛన్నే ఒహ్ని దుర్దినమ్' అని అ.) అనఁగా సూర్యుండు గనుపడకుండ మేఘముపట్టి వర్షించుటచేత నదులు జలపూరితము లగుచున్నవనుట. గతులెల్లన్ = నడకలంతయు, కుటిలప్రకార=కుటిలభావమునకు, కారణములు = హేతువులైనవని యర్థము. గమనములు వక్రములై యుండుననిభావము. అనఁగా నదులు వంకవంకలుగాఁ బ్రవహించుననుట. ఉత్సేకంబులెల్లన్=ఉద్రేకములన్నియు, భంగాకులములు=అపజయసంకులములని భావము. (ని. 'భఙ్గ స్తరఙ్గే రుగ్భేదే భేదే జయవిపర్యయే' అని వి.)

నిలుకడహుళిక్కి=మతి స్థిరత్వములేదని యర్థము. నిలిచియుండుట యెన్నటికినిలేదని భావము. (గీ. 'బద్దునా బొంకు నాఁగ దబ్బర యనంగఁ, గల్ల నాఁగ హుళిక్కి నాఁ జెల్లుఁ బేళ్ళు, ధర నసత్యంబునకును' అని యాంధ్రనామసంగ్రహము.) తావులు=దేహవాసనలు, పొలసువల్చున్=నీచువాసన వాసించునని యర్థము. స్థానములు నీచువాసించునని భావము. (క. 'తావులన స్థలములొప్పును, దావులు నా వాసనలకుఁ దగుఁబేరు శివా' అని యాంధ్రనామసంగ్రహము.) ఇట్టిమాబోట్లంతోన్=ఇట్లుండెడు మావంటివాండ్రతోడ, అచలిత=చలింపని, ఉత్తుంగ=ఉన్నతమైన, ధైర్యునకున్=ధైర్యముగలిగిన, అలఘుమతికిన్=ఘనమైన మనస్సుగలిగిన, అనఘగతికిన్ = పాపరహితమైన నడవడికగలిగిన, అభంగశీలునకున్ = భంగములేని సద్వృత్తిగలిగిన, నీకున్=నీకు, చెల్మియెట్లుపొసఁగున్=సహవాసమేరీతిగా యుక్తపడును. అనఁగా యుక్తపడదనుట. ఇక్కడఁ గ్రమాలంకారము ప్రథమచరణమునకును జతుర్థచరణమునకును బ్రతిద్వంద్విగాఁ జెప్పిన అచలితోత్తుంగధైర్యాదికము గాంభీర్యాదులకుఁ బ్రతిద్వంద్విగాఁ జెప్పఁదగినవానికి నుపలక్షణమని గ్రహింపవలయును.

తా. ఓ యచలేంద్రా! మేము చలించువాండ్రము, నీవు చలింపనివాఁడవు. మేము మహానీచులము, నీవు గొప్పవాఁడవు. మేము పారిపోవువాండ్రము, నీవు ధైర్యముచెడనివాఁడవు. మేము మందబుద్ధులము, నీవు గొప్పబుద్ధిగలవాఁడవు. మేము కుటిలప్రవర్తనముగలవాండ్రము, నీవు కుటిలప్రవర్తనము లేనివాఁడవు. మేముభంగముతోఁగూడిన శీలముగలవాండ్రము, నీవు భంగములేని శీలము గలవాఁడవు. కాఁబట్టి యీలాటి దుర్గుణములుగల మాతోడ నిట్టిసుగుణగరిష్ఠుఁడవైన నీకేలాగున సాంగత్యము పొసఁగును, అనఁగాఁ బొసఁగ నేరదని శుక్తిమతి చెప్పెను.

క. పుడమి నచలేంద్రు లెచ్చట, జడవాహిను లెచట నెచటి సఖ్యము వినఁ జో
ప్పడదు ఖోడ వడదుమీయెడ, నెడపక మారసము లెచటి కెక్కు మహాత్మా.

పుడమిన్=భూమియందు, అచలేంద్రులెచ్చట=పర్వతశ్రేష్ఠులెక్కడ, జడవాహినులెచట=జనీమయములైన నదులెక్కడనని యర్థము. భూదేవేంద్రులైన రాజులెక్కడ నీళ్ళకడవలు మోయు దాలజనము లెక్కడ నని యర్థాంతరము. ఎచటిసఖ్యము=ఎక్కడిస్నేహము, వినఁజొప్పడదు = వినుటకే యుక్తముకాదు, పొడవడరు మీయెడన్ = అతిశయత్వముచేత నొప్పుచున్న మీవిషయమై, ఎడపక= ఎడపడక, మారసములు=మాయనురాగములు, ఎచటికెక్కున్=ఎక్కడికందుచున్నవి అనియును బొడవుచేత నొప్పుచుండెడు మీయందుఁ గ్రిందనుండెడు మాజలము లెక్కడికెక్కుఁ గలవనియును నర్థము. మహాత్మా=పూజ్యుఁడవైనవాఁడా యని యర్థము. పృథులమయిన దేహముగల కోలాహలుఁడా యని భావము.

సమానులయెడ నెయ్యము బొసఁగునుగాని యసమానులయెడఁ బొసఁగదు. మీరచలేంద్రులు, పొడవడరువారు. మేము జడవాహినులము. మన నెయ్యము వినఁదగినది కాదు. మీయెడ మా కనురాగము కలుగదని శుక్తిమతి కోలాహలునితో ననెను. అలం. విషమము.

ఉ. నా విని గట్టుఱేఁడు వదనంబున విన్నఁదనంబు దోఁప నో
శైవలినీశిఖామణి నిజంబు భవత్కమనీయకాంతిధా
రావళిలో మునింగితి దయామతిఁ బ్రోవక సుళ్ళఁ బెట్టెదో
నీవికఁ గ్రుచ్చి యెత్తి ఘననిర్వృతిఁ దెప్పలఁ దేల్చెదో యనన్. 134

నావిని=శుక్తిమతి యీలాగని పలుకఁగా నాలించి, గట్టుఱేఁడు=పర్వతనాథుఁడైన కోలాహలుఁడు, వదనంబున విన్నఁదనంబుదోఁపన్=ముఖమందు దీనత్వము గనుపడఁగా, ఓశైవలినీశిఖామణి =నదీశిరోమణివైన యోశుక్తిమతీ, నిజంబు = నీమాటసత్యమే, అయినను, భవత్=నీసంబంధమయిన, కమనీయ=ఒప్పుచున్న, కాంతిధారావళిలో మునింగితిన్=కాంతియొక్క ధారాప్రవాహపరంపరయందు మునిఁగితినని భావము. దయామతిఁ బ్రోవక=కృపామతిచేత రక్షింపక, సుళ్లఁబెట్టెదో = నడుసుళ్ళలోఁ బెట్టుచున్నావో, లేక, నీవికఁ గ్రుచ్చియెత్తి=నీవికమీఁదఁ గ్రుచ్చి కౌఁగిలించుకొని, ఘననిర్వృతిన్=అధికమయిన సౌఖ్యమందు, తెప్పలఁదేల్చెదో=తెప్పఁదేలునట్టులుగాఁ జేయుచున్నావో, అనన్=అని కోలాహలుఁడు పలుకఁగా నని యర్థము. సుళ్ళఁబెట్టెదో అన్నచోట సుడిగుండములలోఁ బడవైచుచున్నావో అనియు, తెప్పలఁదేల్చెదో అన్నచోట తెప్పలమీఁదఁ దేలునట్టులుగాఁ దేలఁ జేయుచున్నావో అనియును సారస్యము గ్రహింపవలయును. అనఁగా నీయొక్క ధారాప్రవాహరూప మయిన లావణ్యమునకు మోహితుఁడనై యున్నాను గనుక నన్నవలంబించి సుఖింపఁజేయుచున్నావో లేక నిరసించి వ్యాకులపడఁ జేయుచున్నావో నీకే తెలియు నని కోలాహలుఁడు శుక్తిమతినిగూర్చి పలికె నని భావము.

కాంతిధారావళిలోఁ దెలిసియో తెలియకయో మునింగితిని. ఇది నిజము. నాకై నేనిక నుత్తీర్ణుఁడ గాఁజాలను. రక్షింప నెంచ నేని సుడిగుండములలోఁ బడవేయుము. లేదా తెప్పలఁదేల్చి యుద్ధరింపుము. అనఁగా ముంచినను దేల్చినను నీవెదిక్కు. కర్తవ్యము నిశ్చయింపఁదగినది నీవే యనుట.

చ. వెలవెలఁబారి శుక్తిమతి వెండియుఁ గొండలఱేనిఁ బల్కు న
గ్గల మగుపంచసాయకవికారమునన్ నిజగౌరవోన్నతు

ద్ధలఁపవు గాని మాదృశజడస్థితిఁ దెప్పలఁ దేలుచున్న మీ
కులగిరికోటిలోఁ గడులఘుత్వము గాదె తలంచి చూడుమా. 135

వెలవెలఁ బారి=వెలవెలపోయి, అనఁగా వివర్ణతనుబొంది, శుక్తిమతి వెండియుఁ గొండలఱేనిఁ బల్కున్=శుక్తిమతీనది తిరుగాఁ బర్వతనాథుఁడైన కోలాహలునిఁగూర్చి పలుకుచున్నది ఏమనియనిన, అగ్గలమగు=మిక్కుటమయిన, పంచసాయకవికారమునన్=మన్మథవికారముచేత, నిజ=స్వకీయమయిన, గౌరవోన్నతుల్ = గౌరవంబును నౌన్నత్యంబును, తలఁపవు గాని=విచారించుకొనవుగాని, మాదృశజడస్థితిఁ దెప్పలఁ దేలుచున్న మీకులగిరికోటిలోఁ గడులఘుత్వముగాదె తలంచి చూడుమా=మావంటిజడులచేత నుద్ధరింపఁబడుట మహోత్కృష్టకులపర్వతసమూహములో మిక్కిలి లాఘవము గాదా విచారించిచూడుమా యనియును నీయొక్క గౌరవోన్నతులనఁగాఁ బృథులత్వమును బొడవును విచారించుకొనక మాదృశజలస్థితిచేతఁ దెప్పలమీఁదఁ దేలుచు నుండుట పర్వతశ్రేణిలోఁ జులకఁదనముగాదా విచారింపుమా యనియును నర్థము.

నిన్ను సుళ్ళబెట్టనుగాని యెటులనో తెప్పలఁ దేల్చెదననుకొమ్ము. దాన నీకుఁ దేలికతనము వచ్చును. నలుగురిలో నీకుఁ జిన్నతనమగును. మేము జడాత్ములము. మాకలయిక తెప్పలఁ దేలుట నీగౌరవోన్నతులకు భంగము. 'కామాంధో నైవ పశ్యతి' యనునటులఁ బంచసాయకవికారమున నీవు హితాహితము లెఱుంగకున్నాఁడవని కోలాహలునితో శుక్తిమతి యనెను. అలం. శ్లేషమూలాభేదాధ్యవసాయము.

మ. మతిఁ గ్రీడారతి గల్గెనేని సకలక్ష్మాపుణ్యదేశాళిఁ గాం
చి తపస్స్ఫూర్తిమెయిం గృశించి వనరాశిం జెందుమాబోంట్ల ను
ద్ధతిచేఁ గ్రమ్మగ నేల నీకుఁ గఱవే తారుణ్యలావణ్యజృం
భితరంభాదినిలింపభామ లన భూభృన్మౌళి రాగాంధుఁడై. 136

మతిన్=బుద్ధియందు, క్రీడారతిగల్గెనేని = సంభోగక్రీడలయందలి యాసక్తిగలిగినట్లులాయెనేని, సకలక్ష్మాపుణ్యదేశాళిఁ గాంచి = సమస్తపుణ్యక్షేత్రసమూహమును జూచి యని తపస్వినీపరమయిన యర్థము. సమస్తపుణ్యభూమిప్రదేశములయందు వ్యాపించి యని నదీపరమయిన భావము. తపస్స్ఫూర్తిమెయిం గృశించి=తపస్సుయొక్కస్ఫురణముచేత సన్నగించి యని యర్థము. గ్రీష్మర్తువుయొక్క విజృంభణముచేత శుష్కించి యనిభావము. వనరాశిం జెందు=అరణ్యసమూహమును బొందుచున్న యని యర్థము. జలరాశిని బొందుచున్న యని భావము. (ని. 'వనే సలిల కాననే' అని అ.) మాబోంట్లన్=మావంటి తపస్వినులనని యర్థము. మావంటి నదులనని భావము. ఉద్ధతిచేఁ గ్రమ్మఁగ నేల=ఔద్ధత్యముచేతఁ బైకొననేల, తారుణ్య=యౌవనముచేతను, లావణ్య=ముత్యపునీరువలెఁ బ్రకాశించెడు దేహకాంతిచేతను, జృంభిత = విజృంభించుచున్న, రంభాది నిలింపభామలు = రంభ మొదలయిన దేవతాస్త్రీలు, నీకుఁగఱవా=నీకు లేకయున్నారా, అనఁగా నున్నారుగదా, అనన్ = అని శుక్తిమతి పలుకఁగా, భూభృన్మౌళి=పర్వతశేఖరుఁడైన కోలాహలుఁడు, రాగాంధుఁడై=కామాతురత్వముచేతఁ గన్ను గాననివాఁడై. అలం. శ్లేషమూలాభేదాధ్యవసాయము.

మేము తపస్వినులము. మన్మథతిచేఁ గ్రమ్ముట సాహసము. క్రీడారతి నీకున్న వయసుపొంకము చేఁ జక్కఁదనముచే విఱ్ఱవీగురంభాద్యప్సరఃకాంతలు లేరా? తపోనియమములతోఁ గృశించు తపస్వినులకంటెఁ గ్రీడారతులకు వయసుపొంకములతో నలరు వేల్పువెలయాండ్రే తగినవారు. సౌందర్య తారుణ్యాదులచే శోభించు నీ కారంభాదులు కఱవుకారు!

సీ. అతనుభూతి ఘటింపఁ • దయ్యెనే చదలేఱు సికఁ దాల్చునింధాన • చిత్రకునకు
వరవంశవైఖరి • వదలెనే రవిసుతాపతి యైనదైతేయ • భంజనునకు
వసులాభసంపత్తి • మసలెనే జాహ్నవిఁ జేకొన్న శంతను • క్షితిపమణికిఁ
గమలోదయఖ్యాతి • దెమలెనే నానానదీకాంతుఁ డైనర • త్నాకరునకు
తే. వారికేలాఘువమువచ్చెఁ • వనిత యెంత, మారుమసలెదు వట్టినే • మములు చాలు
నేలు నన్నని సతికమ • లాలిపట్టు, ప్రబలతరదీర్ఘభుజశాఖఁ • బట్టుటయును. 137

చదలేఱుసికఁ దాల్చు=ఆకాశగంగను జటాజూటమందు ధరించి, ఇంధానచిత్రకునకున్=అగ్నియే తిలకముగాఁగల శివునకు, (ని. 'తమాలపత్ర తిలకచిత్రకాణి విశేషకం' అని అ.) అతను=అధికమైన, భూతి=ఐశ్వర్యము, ఘటింపదయ్యెనే = కూడకపోయెనా, అనఁగాఁ గూడినదిగదాయని యర్థము. అతను=మన్మథునియొక్క, భూతి=భస్మము, ఘటింపదయ్యెనే=ఘటింపకపోయెనా, అనఁగా ఘటించినదని భావము. రవిసుతాపతియైన = సూర్యునికొమార్తయైన కాళిందికి భర్తయగు, దైతేయభంజనునకున్=శ్రీకృష్ణమూర్తికి, వర=శ్రేష్ఠమయిన, వంశవైఖరి = వంశవిస్ఫూర్తి, వదలెనే=వదలిపోయెనా, అనఁగా వదలిపోలేదుగదా యనియర్థము. శ్రేష్ఠవేణుగాన వైఖరిగలవాఁడని భావము. జాహ్నవిఁజేకొన్న=జహ్నుకన్యకయైన భాగీరథిని బరిగ్రహించిన, శంతనుక్షితిపమణికిన్=శంతనుఁడనెడు భూపతిశ్రేష్ఠునకు, వసులాభసంపత్తిమసలెనే = ధనలాభసంపత్తి గలుగకపోయెనా, అనఁగాఁ గలిగినదికదా యని యర్థము. అష్టమవసువైనభీష్ముఁడు గలిగినాఁడనిభావము. నానానదీకాంతుఁడైన = సమస్తనదులకును బెనిమిటియైన, రత్నాకరునకున్=సముద్రునకు, కమలోదయఖ్యాతిదెమలెనే=సంపదుదయప్రఖ్యాతి చలించెనా, అనఁగాఁ జలించిపోలేదుగదా యని యర్థము. లక్ష్మీదేవి పుట్టినదనెడు ఖ్యాతి యని కాక లేక కమలమనఁగా జలముగనుక జలపూరితోదయఖ్యాతి యున్నదనిగాని భావము.

వారికేలాఘువమువచ్చెన్=అనఁగా నదులైన యాకాశగంగను గాళిందిని భాగీరథిని ఇది యది యనక నమస్తనదులను బరిగ్రహించిన శివుఁడు శ్రీకృష్ణుఁడు శంతనుఁడు సముద్రుఁడు వీరి కేచిన్నతనమువచ్చినది, అనఁగాఁ జులకందనమురాలేదుగదా యనుట. వనిత=ఓశుక్తిమతీ, ఎంతమారుమసలెదు=ఎంతగాఁ బ్రతికూలభావము వహించుచున్నావు, వట్టినేమములుచాలున్=పనికిమాలిన నియమములింతటితోఁ జాలును, ఏలునన్నని=నన్నేలుకొమ్మని, సతి=శుక్తిమతియొక్క, కమలాళి=పద్మసమూహమనెడు, పట్టు=పట్టువస్త్రమును, ప్రబలతర=మిక్కిలియు బలిష్ఠమయిన, దీర్ఘభుజశాఖన్ = శాఖాసదృశమైన దీర్ఘబాహువుచేత, పట్టుటయును=పట్టఁగా అని యర్థము. శుక్తిమతీనదియొక్క కమలములేటి స్థానము గలవి యనియును కోలాహలపర్వతము ప్రబలతరదీర్ఘబాహుసదృశశాఖలు గలదని యును భావము.

జడస్థితిఁ దెప్పలఁ దేలు నదీకాంతలఁ దొల్లి పలువురు పెండ్లాడిరి. వారి కేలాఘవము రాలేదు. శివుఁడు గంగను, విష్ణువు కాళిందిని శంతనుఁడు జాహ్నవిని సముద్రుఁడు సమస్తనదులను బెండ్లా

డిరి గాన లాఘవము కల్గ. తపస్విని గా నుంటిననుట వట్టి నేమములు. ఇట్లు పరిహారముఁ జెప్పి కోలాహలుఁడు శుక్తిమతిఁ గొంగు పట్టుకొనెను. భుజశాఖన్ అనుచో తృతీయకు ద్వితీయ వికల్పము. అలం. శ్లేషమూలకమగు విశేషోక్తి.

ఉ. వేణి చలింపఁ గంపితన • వీనమృణాళభుజాగ్రకంకణ
శ్రేణి నటింప లోలశఫ • రీనిబిరీసకటాక్షకాంతి వి
న్నాణము చూప హంసకగ • ణక్వణనంబులు మీఱ సైకత
శ్రోణి వివర్తితాబ్జముఖ • శోభిత యై కడు సంభ్రమించినన్- 138

వేణినటింపన్=వేణియనఁగా నేటిపాయకును సర్పాకారముగా నల్లిన స్త్రీలయొక్క జడకును పేరు. (ని. 'వేణీప్రవాహే సరితాం మేళనే కేశబంధనే, దేవశాఖ్యే' అని నా.) జడ కదలియాడఁగా, కంపిత=చలించుచున్నదియు, నవీన = నూతనమయినదియునగు, మృణాళ = తామరతూఁడు లనెడు, భుజ=బాహువులయొక్క, అగ్ర=కొనలయందు, కంకణ = జలబిందువు లనెడు, కంకణ= హస్తాభరణములయొక్క, (ని. 'స్యాత్కంకణం హస్తసూత్రే శిఖరే కటకే జలే' అని నా.) శ్రేణి= పంక్తి, నటింపన్=వర్తింపఁగా, లోల=కదలుచున్న, శఫరీ=మత్స్యవిశేషములనెడు, (ని. 'ప్రోష్ఠీ తు శఫరీ ద్వయోః' అని అ.) నిబిరీస=నిబిడమయిన, (ని. 'నిబిడం నిబిరీసం చ దృఢం గాఢం ప్రచక్షతే' అని వై.) కటాక్ష=క్రేఁగంటిచూపులయొక్క, కాంతి=ప్రకాశము, విన్నాణము చూపన్=ఒప్పిదము గనుపఱుపఁగా, హంసకములనఁగా హంసలును గాళ్ళయందెలును, (ని. 'హంసకః పాదకటకః' అని అ.) హంసక = హంసలనెడు, కాళ్ళయందెలయొక్క, గణ=స్తోమముయొక్క, క్వణనంబులు=అనుకరణధ్వనులు, మీఱన్=అతిశయింపఁగా, సైకతశ్రోణి= ఇసుకదిన్నెలనెడు నిసుకదిన్నెలవంటి పిఱుఁదులుగల శుక్తిమతి, వివర్తిత=త్రిప్పఁబడిన, అబ్జ = కమలమువంటి, ముఖ=మొగముచేత, శోభిత యై=ఒప్పుచున్నదై, కడుసంభ్రమించినన్=మిక్కిలి తొందరపాటు నొందఁగా, ఈపద్యమునకు ముందఱి పద్యముతో నన్వయము. విన్నాణమనునది విజ్ఞానశబ్దమునకుఁ దద్భవము. ఇందుకుఁ బ్రమాణము. సీ. 'విజ్ఞానమునకు భావింప విన్నాణంబు విజ్ఞాపనమునకు విన్నపంబు, సంజ్ఞకు సన్న యజ్ఞమునకు జన్నంబు నాజ్ఞప్తి కానతి యాజ్ఞ కాన' అని అప్పకవి.

కోలాహలపర్వతము నది నడ్డగించుటచే నీటిపాయ చెదరె ననియుఁ దామరతూండ్లు గలఁగెననియు జలకణములు చిందెననియు జేడిసమీ లెగిరిపడెననియు అంచలు ధ్వనిచేసెననియుఁ దామరపూవులు కలఁతనొందెననియు శుక్తిమతిఁ గొంగు కోలాహలుఁడు పట్టుకొన జడ కదిలెననియుం భుజములు వణఁకుటచేఁ గంకణములు మ్రోగెననియు ఓరగంటిచూపు లొప్పారెననియుఁ గాలి యందెలు మ్రోసెననియుఁ దొట్రుపాటుచే మోము ద్రిప్పెననియు భావము.

అలం. శ్లిష్టరూపకము. స్వభావోక్తి.

మ నిలువెల్లన్ నిరపాయశంబరమయో • న్మేషంబునం బొంగురాఁ
గలకూలంకషగాఢగర్వనిధులం • గాంతానుకూల్యంబుచేఁ
దలమే నిల్పఁగ బ్రాతికూల్యపరుషో • ద్యత్ప్రౌఢిఁ గా కంచు న
య్యలఘుం డాస్యము జేవురింప నిజరూ • పాటోపసంరంభి యై. 139

నిలువెల్లన్ = స్వరూపమంతయును, నిరపాయశంబరమయోన్మేషంబునన్ - శంబరమనఁగా మాయయును జలమును గనుక, నిరపాయ=అపాయములేని, శంబరమయ=శంబరాసురునియొక్కయుం

మయూరియొక్కయుదయూ, ఉన్మేషంబునన్ = వికాసముచేత, అనఁగా వాంద్రమాయవంటి మాయ చేత, పొంగురాఁగల=ఉద్రేకించెను, కూలంకష=ప్రవాహ...ముకు, గాఢ=సాంద్రమునయిన, గర్వ= దర్పమునకు, అనఁగా నిర్లజ్జ్యభావమునకు, నిధులన్=స్థానభూతలయిన, ధూర్తస్త్రీలను, కాంత= పురుషులయొక్క, అనుకూల్యంబుచేన్=అనుకూలభావముచేత, నిల్పఁగన్=అతిక్రమించిపోక నిలు పుటకు, కలమే = శక్యమగునా, అనఁగా గాదనుట. ఇఁక నేమన్నను, ప్రాతికూల్య=ప్రతికూల భావముతోడ, పరుష=కఠినములైన, ఉద్వృత్తిఁ గాంచ=ప్రకాశమానమయిన ప్రాగల్భ్యముచేత శక్యమగునుగాక, అంచున్=అని విచారించుచు నని యర్థము. నిలువెల్ల=స్వరూపమంతయు, నిరపాయ =నిష్ప్రతిబంధకమయిన, శంబరమయ=జలమయమయిన, ఉన్మేషంబునన్=వికాసముచేత, పొంగురాఁ గల=వెల్లువపెట్టఁజాలిన, కూలంకష=తీరారాచికొను ప్రవాహముయొక్క, గాఢ = దృఢమయిన, గర్వ=ఉద్రేకమునకు, నిధులన్=స్థానములయిన నదిని, అనఁగా వేగాతిశయముగల నదులను, కాంత=సముద్రుఁడయిన, అనుకూల్యంబుచేన్=అనుకూలానుసరణముచేత, నిల్పఁగన్=నిలుపఁబట్టుటకు, కల మే=శక్యమగునా, ఇఁక నేమన్నను, ప్రాతికూల్యపరుషోద్వృత్తిఁ గాంచుచున్ = అడ్డగట్టుటయం దుఁ గఠినమయిన యతిశయప్రవాహముచేతనే శక్యమగునుగాక యని విచారించుచును, అని నదీపర మయిన యర్థము. అద్భుతఘుంఘుమ=అద్భుతమై పనియుఁను అస్పష్టమయిన శబ్దముగల కోలాహలుఁ డనియును నర్థము. అస్త్రముచేత నంపన్=ముఖము వ్రాయుచున్న దగుచుండఁగా, నిజ=స్వకీయమయిన, రూప=స్వరూపమునకు గమ్యమయిన, ఆటోప=ఉద్రేకప్రవాహప్రవృత్తముండగ, సంరంభిస్తు=త్వరి తముగఁ బారెను.

"కలా గలన్ కూలంకష" యనుచో ధూర్తస్త్రీలని శకటరేఫరూపముగను, రాఁగల=వెల్లువ రాఁగలయని వకారరూపముగను, నర్థద్వయము చెప్పుచున్నారు. వ్యర్థకవిశ్లేష నిరేఫశకటరేఫనియ మము ప్రాచీనమగుటను గానన విభిన్నరూపము పొసఁగదు గనుక. పొంగురాఁగలన్ కూలంకషగాఢ గర్వనిధులన్ అనుచో స్త్రీపక్షమున పొంగుగలయాండ్రనను నర్థమును, పొంగు రాఁగల కూలంకషగాఢగర్వనిధులన్ అనుచో నదీపక్షమున వెల్లువరాఁగల యొడ్డులరాచికొను ప్రవాహగర్వనిధులు నను నర్థమును కొందఱు వ్యాఖ్యాతలు చెప్పుచున్నారు. రాఁగల కూలం కషయనుచో కొందఱు పాఠాంతరముఁ బొంగురాఁగలవని యను నర్థమువ్రాసెను. శ్లేష మునకు రేఫసాంకర్యము చేసి కూలంకషయనుపాఠము ప్రాచీనమని కొందఱు నూతనవ్యాఖ్యాత లందురు. వ్యర్థమగు శ్లేషకల్పనాది వ్యాకరణవిరోధములను రామరాజభూషణుఁడు సేలంగించె వనుటయు గాక ప్రకృతపాఠమె గ్రాహ్యము.

వ. పట్టిన నాగస్తునకు దవట్టి మృత్తికేలను నట్టువిరాఁగి గుట్టునం బట్టి వానిత్రవుకం బునం బట్టువడి కట్టలుకం గట్టలు వడి చేసినట్టుడివదునియుంచ నలకట్టియల బెట్టునం బుట్టుబెట్టిగప్పునొప్ప నట్టి నట్టిగపునప్పు నేఁపుపొంగలు విగుడునొంగ సునం బగులుముగులుతెగఁ దప్పుల నప్పుటం బెడ్డుపడఁగుజాంబూన దాంబుజగంధబకాంబకాంబరాంబుజాంబులు వాఱించుచు దానాకలం బై కొనుకోకాకవకపోతకులం బగ్గీరవరాకరాంబుజాంబువలున్నయం జలు లలుకలునవాఁ చలునప్పల నెలకొన్న వెన్నెలవెన్నవల నుత్తాలకల్లోలమాలికా

డోలికాకేళికాచతురచక్రబాలికాజాలంబుల మేలంబులఁ దూలించుచుం దమిఁ గోలుపునగ్గలపువలపునం గలయలపునం బోడముడగ్గుత్తికఁ దడఁబడ నుడుపు నుడుపులపడుపున మెఱయుసరయచంక్రమణచలదుపలఫలక మిళదలఘుతర ఘుమఘుమార్భటి నికటతటవిట పివిటపచ్ఛటారటదపారకీరకిన్నరమిథునాదులం జదల మెదలం జేయుచుఁ దనయహార్యభావగౌరవంబు కల్లోలినీరయనివారణంబునుం గామోపభోగసమయసముచితవిజనతాకారణంబునుం గందర్పబలసంబాధబాధావధీరణంబునుం గాఁగ మాటిమాటికిం గూటములం బాటింపు మని యబ్బోటిపదంబులం బడినవడుపున నడుగున వ్రాలి యడ్డగించి యలముకొని చెంగల్వతావులు చెదర వేణిఁ దెమలించుచు మకరికలు నులియ గండపాళి నొక్కుచు మధురామృతంబులు వడయం బలుదెరసొబగు లానుచు మౌక్తికంబులు జడియం బయోధరంబులం బట్టుచు విశదాంశుకాంతస్థితి దొరలంగ నతి విపులపులినజఘనారోహంబుల నుత్పలపత్రంబుల నెరపుచుం దనివి లేక దద్దయు నాగద్దరి యమ్ముద్దరాలిం బెద్దయుం బ్రొద్దు నిరోధించుసమయంబున.

నెట్టనన్ = త్వరితముగా, ఆగట్టుదొరపట్టి = పర్వతరాజకొమారుఁడయిన కోలాహలుఁడు, ఎట్టకేలకున్=కొంతసేపటికి, మట్టుమీఱి=మితిమించినదయి, గుట్టునంబట్టరాని=గోప్యముగా నిలువఁబట్టఁ గూడకయున్న, తమకంబునన్ = అభిలాషయందలి తొందరచేత, తట్టువడి=తిరస్కరింపఁబడి, కట్టలుకం గట్టలువడనేయుం=అతిశయక్రోధముచేత మోపులయి పడునట్టులుగా చేయుచున్న కడు+అలుక, కట్టలుక అనిసంధి. కట్టడిమరుని=కఠినుఁడయిన మన్మథునియొక్క, అంపసెలకట్టియల =అంపకోలలయొక్క, అనఁగా శరకాండములయొక్క, బెట్టునంబుట్టు = పటిమచేత సంభవించుచున్న, జెట్టిదపునొప్పిదట్టి=మిక్కుటమయిన వ్యథ సంప్రాప్తించి, దట్టంపునిట్టూరుపు పొగలునిగుడు సొగసునందగు=సాంద్రమయిన నిశ్వాసధూమములు వ్యాపించినవో యన్నట్టులుగానున్న, మొగులు తెగలరచ్చల = తనయందలి మేఘసమూహములయొక్క సమ్మర్దములచేత, అచ్చటం బెచ్చుపెరుఁగు=అక్కడ అనఁగా శుక్తిమతియం దతిశయించుచున్న, జాంబూనదాంబుజ=సువర్ణకమలములయొక్క, కదంబక=సమూహమందు, ఆలంబ=అవలంబముగలిగిన, కాదంబక=కలహంసలయొక్క, ఆడంబరంబులు=విజృంభణములను, వారించుచున్=నివారించుచును, అనఁగా గోలాహలుఁడు తనకు విరహోద్రేకమును జేయుచున్న శుక్తిమతీ సువర్ణకమల విహారమాణ హంసాడంబరములను దననిశ్వాసధూమములో యన్నట్టులుగానున్న తనయందలి మేఘమాలికలచేత నివారించినాఁడనుట. ఇక్కడ మేఘములకును హంసలకును విరోధమని తెలియవలయును. అలం. ఉత్ప్రేక్ష.

రాకరాకలం బైకొను=రాకయనఁగాఁ బున్నమ, (ని. 'రాకస్తు వృషణే, రాకా నవరజో నార్యాం పూర్ణచన్ద్రతిథా వపి' అని నా.) పున్నమనాఁటి వచ్చుటలచేతను గ్రమ్ముచున్న, కోకారి=చంద్రునియొక్క, సెక=సెగయొక్క, సోఁకులంబ్రాఁకిన=అంటుకొనుటవలన వ్యాపించిన, ఆకార పాండిమంబు నలువునం జెలువలరు=విరహతాపసంజనిత శరీరపాండిమయో యన్నట్టులుగా నొప్పుచున్న, కలువచెలిచలువ=చంద్రకాంతశిలలయొక్క, వన్నెలన్=కాంతులచేత, నెలకొన్న=సంభవిం

చిన, వెన్నెలవెల్లువలన్=చంద్రికాప్రవాహములచేత, ఉల్లోల=ఉప్పొంగుచున్న, కల్లోలమాలికా=శుక్తిమతీతరంగశ్రేణులనెడు, డోలికా=తొట్లయందలి, కేళికా=క్రీడయందు,చతుర=ప్రవీణలయిన, చక్రబాలికా=చక్రవాకస్త్రీలయొక్క, జాలంబుల=సమూహములయొక్క, మేలంబులన్=పరిహాసములను, తూలించుచున్=భంగపఱుచుచు, అనఁగా శుక్తిమతీ జలతరంగమాలికలయందుఁ దూఁగుచున్నవై, తనకు విరహోద్రేకమును జేయుచున్న చక్రవాకస్త్రీలను, పూర్ణిమాచంద్రునియొక్క కాఁకలు సోఁకుటచేత వ్యాపించిన తనయొక్కవిరహపాండిమ మోయన్నట్టులుగా నున్నచంద్రకాంతశిలా కాంతులనెడు వెన్నెలలచేతఁ దిరస్కరించినాఁడనుట. ఇక్కడ వెన్నెలకును జక్రవాకములకును విరోధమని తెలియవలయును. అలం. ఉత్ప్రేక్ష.

తమిగొలుపు=అభిలాషపుట్టించుచున్న, అగ్గలపువలపునంగల=మిక్కుటమయిన మోహమువలన సంభవించిన, అలపునంబోడము=ఆయాసముచేతఁబుట్టిన, డగ్గుత్తికన్=గద్గదస్వరముచేత, తడఁబడనుడువు=వ్యత్యయముగాఁ బలికెడు, నుడువులవడువునన్=పలుకులోయన్నట్టులుగా, మెఱయు=ప్రకాశించుచున్న, సరయ=వేగముతోఁ గూడుకొన్నట్టులుగా, చంక్రమణ=చెంగలింపులచేత, చలత్=దొరలుచున్న, ఉపలఫలక=ఫలకలవంటి రాళ్ళతోఁడ, (ని. 'పాషాణ ప్రస్తర గ్రావో పలాశ్మావ శ్శిలా దృషత్' అని అ.) మిళత్=కూడుకొనుచున్న, అలఘుతర=అధికమయిన, ఘుమఘుమార్భటి=ఘుమఘుమయనెడు ననుకరణధ్వనిచేత, నికట=సమీపమందలి, తటవిటపి=శుక్తిమతీ తీరస్థిత వృక్షములయొక్క, విటపచ్ఛటా=తరువిస్తారసముదాయమందు, (ని. 'వృక్షో మహీరుహ శ్శాఖీ విటపీ పాదప స్తరుః' అని అ.) అనఁగా శాఖామండలమందు, రటత్=రొదసేయుచున్న, అపార=అంతములేని, కీరకిన్నరమిథునాదులన్=శుకదంపతులు కిన్నరపక్షిదంపతులు మొదలయినవాని, చదలమెదలంజేయుచున్=మింటికెగసి తిరుగునట్టులుగాఁ జేయుచు, అనఁగా శుక్తిమతీతీర వృక్షశాఖలయందు రొదసేయుచును విరహోద్రేకమును జేయుచున్న కీరకిన్నరపక్షిమిథునము మొదలయినవాని, శుక్తిమతియందలి మోహాతిరేకముచేత డగ్గుత్తికపడి పలికెడు తనపలుకులోయన్నట్టులుగానున్న దొర్లిపడు రాళ్ళచప్పుడులచేత బెదురుకొని పైకెగిరిపోవునట్లు చేసినాఁడనుట. ఇక్కడ శిలాపతనజాత ఘుమఘుమార్భటికిని బక్షులకును బ్రతికూలమని తెలియవలయును. అలం. ఉత్ప్రేక్ష.

తనయహార్యభావగౌరవంబు=తనయొక్క పర్వతభావముచేతనైన దుర్భరత్వము నని యర్థము. (ని. 'అహా ర్యధర పర్వతాః' అని అ.) హరింపఁదగినది హార్యము, హార్యముగానిది యహార్యము. అనఁగా సజాతీయములచేతఁ దిరస్కరింపఁబడని దనుట. ఈవిధమయినదని భావము. దానియొక్క గౌరవ మనఁగా నతిశయము. (ని. 'సజాతీయై ర్విజాతీయై రతిరస్కృతమూర్తిమాన్, యావద్రసం వర్తమాన స్థాయీభావ ఉదాహృతః.' అని యున్నది గనుక స్థాయిభావమని యర్థాంతరము.) కల్లోలినీ=శుక్తిమతీనదియొక్క, రయ=ప్రవాహవేగముయొక్క, నివారణంబును=నివారకమయినదియును, కామోపభోగసమయ=సంభోగకాలమునకు, సముచిత=అర్హమయిన, విజనతాకారణంబును=ఏకాంతస్థితికి హేతువైనదియును,కందర్పబల=మన్మథబలముయొక్క, సంబాధ=సమ్మర్దమువలననైన, బాధా=వ్యథకు, అపధీరణంబును=తిరస్కారకమయినదియును, కాఁగన్=అవుచుండఁగా, మాటిమాటికిన్=సారెసారెకును, కూటములంబాటింపుమని=కలయికలయందు మన్నింపుమని, అబ్భోటిపదంబులం బడినవడువునన్=ఆశుక్తిమతియొక్క పాదములయందుఁ బడినటులుగా, అడుగునవ్రాలి=జలాధఃప్రదేశము

నందువాఁలి, అడుగనఁగాఁ బాదంబు గనుక నిక్కడ చమత్కారము గ్రహింపవలయును. అడ్డగించి యలముకొని=నిరోధించికౌఁగిలించుకొని, చెంగల్వతావులుచెదర వేణిఁ దెమలించుచున్ =చెంగల్వపువ్వుల వాసనలు చెదరిపోవునట్లుగాఁ జడఁబట్టి కదలించి యని యర్థము. (గీ. 'ఎసఁగుఁ జెందొగ చెంగల్వ యెఱ్ఱకలువ, యనఁగ రక్తోత్పలంబు' అని యాంధ్రనామసంగ్రహము.) చెంగల్వలుండెడు స్థలములున లిగిపోవునటులుగాఁ బ్రవాహము పొరలఁ జేసినాఁడని యర్థాంతరము. అలం. శ్లేషానుప్రాణితరూపకము.

మకరికలఁనులియన్ =మకరికాపత్రరచనలు చెదరిపోవునటులుగా, గండపాళికలనొక్కుచున్ = చెక్కులు నొక్కుచు నని యర్థము. మొసళ్లు లొత్తుడుపడునటులుగా గండశిలల నొక్కినాఁడని యర్థాంతరము. మధురామృతంబుపడయం బలుదెరసొబగులానుచున్ =అనఁగా మధురమయిన సుధారసప్రాప్తికొఱకు నధరపానముచేయుఁచును అని యర్థము. పలుతెరయనఁగా దంతాంశుక శబ్దార్థము. ఇక్కడఁ దత్పురుషసమాసము. మధురామృతమనఁగా మధురజలంబును, ఆజలము లభింపఁజేసికొను కొఱకుఁ బలుదెరసొబగులానుచు ననఁగా బహుప్రకారములైన తరంగములయొక్క సౌష్ఠవములను గ్రహించినాఁ డని యర్థాంతరము. ఇక్కడఁ గర్మధారయసమాసము. మౌక్తికంబులుజడియఁ బయోధరస్థలులటంచున్ =ముత్యములు చిట్లిపడునటులుగాఁ గుచప్రదేశములంటుచు నని యర్థము. శుక్తిమతీ మౌక్తికంబులు చెదరునటులుగా జలధరస్థలములంటెనాఁడని యర్థాంతరము.

అలం. శ్లేషమూలరూపకము.

విశదాంశుకాంతస్థితిదొరలంగ నతివిపులపులిన జఘనారోహంబుల నుత్పలపత్రంబులు నెరపుచున్-విశద=శుభ్రమయిన, అంశుక=వస్త్రముయొక్క, అంతస్థితి=లోపలనునికి, తొరలంగన్ = కలుగునటులుగా, అతివిపుల=అత్యంతవిశాలమయిన, పులిన=ఇసుకదిన్నెలవంటి, జఘన=కటిస్థలమందలి, ఆరోహంబులన్ =ఆరోహణములతోడ, ఉత్పలపత్రంబులు నెరపుచున్ =ఉత్పలపత్రములనెడు నఖక్షతవిశేషములను సంఘటించుచు అని యర్థము.

ఉత్పలపత్రములనఁగా సంభోగకాలమున నితంబముపైఁ గూర్చునఖక్షతములు. 'భవే దుత్పలపత్రం తద్దళే స్త్రీనఖక్షతే' యని విశ్వము. 'కంఠేతు మణిమాలాస్యాత్ కపోలే చంద్రరేఖికా, నితంబేచోత్పలంపత్రం స్థానే శంఖపదం స్మృతం' అని రతిరహస్యము.

విశదాంశు=శుభ్రాంశుఁడైన చంద్రునియొక్కవలె, ని. 'విధు స్సుధాంశు శ్శుభ్రాంశురోషధీశో నిశాపతిః' అని అ. కాంత=రమ్యమయిన, స్థితి=ఉనికి, తొరలంగన్ =కలుగునటులుగా, అతివిపుల=అతి విస్తృతమైన, పులినజఘన=జఘనసదృశమైన యిసుకదిన్నెలయందలి, ఆరోహంబులన్ =ఎక్కుటల చేత, ఉత్పలపత్రంబులనెరపుచున్ ==నల్లగలువ రేకులను వ్యాపింపఁజేయుచుననియర్థాంతరము. తనివిలేక=తృప్తిదీరక, తద్దయున్ =మిక్కిలియు, ఆగద్దరి=ధూర్తుఁడైన యా కోలాహలుఁడు, ఆముద్దరాలిన్ =ఆశుక్తిమతిని, పెద్దయుంబ్రొద్దు = తడవుసేపు, నిరోధించుసమయంబునన్ =అడ్డగించియున్న సమయమందు, ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. అలం. పైని చే.

తిర్యగాదిరతియు ననుభయనిష్ఠరతియునగు శుక్తిమతీకోలాహలుల సమాగమవర్ణనము రసాభాసమనియుఁ గావ్యముల వర్ణింపఁదగదనియుఁ జెప్పుచున్నారు. శృంగారానౌచిత్యలక్షణము-

శ్లో. ''అనౌచిత్య ప్రబంధత్వే అభాసో రసభావయోః
ఉపనాయకసంస్థాయాం మునిగురుపత్నీ గతాయాంచ
బహునాయక విషయాయాం రతౌ తథానుభయనిష్టాయాం
ప్రతినాయకనిష్టత్వే తద్వదధమపాత్రతిర్యగాదిరతే
శృంగారేఽనౌచిత్యం...'' సాహిత్యదర్పణము.

ఇది కథానాయక విషయికమైనదుష్టము. మూలకథలోని దగుటవలనను కథానాయకేతర మగుటవలనను గ్రాహ్యము.

ఉ. ఓవసుధామహేంద్ర కరుణోదధి యీతఱి వేల ప్రోవ రా
వే వసుభూప యంచు నెలుఁగెత్తి వెసన్ మొఱ వెట్టుచాడ్పునన్
శైవలినీరవం బెసఁగె శైవలినీనినదంబుకన్న ము
న్నావిలభూరివారివిహగారవగౌరవ మెచ్చె నెల్లెడన్. 141

ఓవసుధామహేంద్ర=భూమిలోనింద్రునివంటివాఁడవును, కరుణోదధి=దయాసముద్రుఁడవును నయినట్టి, వసుభూప=ఓవసుమహారాజా, ఇందులో వసుధామహేంద్ర యనెడు వసురాజవిశేషణము కోలాహలపర్వతభంజనము కర్తవ్యమును నభిప్రాయగర్భము. ఈతఱివేల = ఈయాలస్యమెందుకు, ప్రోవరావే=రక్షించుటకొఱకు నరుగుదేవే, అంచున్=అని పలుకుచు, ఎలుఁగెత్తి=పెద్దగొంతుఁ జేసికొని) వెసన్మొఱవెట్టుచాడ్పునన్=శీఘ్రముగా మొఱపెట్టుచున్నట్టులుగా, శైవలినీరవంబెసఁగెన్=శుక్తిమతీ నదియొక్కధ్వని యతిశయించెను, శైవలినీనినదంబుకన్న మున్ను=నదియొక్క ధ్వనికంటె ముందుగా, ఆవిల=కలఁకనొందిన, భూరి=అనేకములైన, వారివిహగ=జలపక్షులయొక్క, ఆరవ=ధ్వనులయొక్క, గౌరవము = అతిశయము, ఎల్లెడన్=అన్నిదిక్కులయందును, ఎచ్చెన్=అధికమాయెను. అలం. ఉత్ప్రేక్ష.

తా. ఓరాజేంద్రా! వసుభూపాలకా! ఆలస్యముచేయక నన్నురక్షింపుము. అని మొఱవెట్టు నటుల నదీఘోషము మిన్నుముట్టెను. అంతకుమున్నె జలపక్షులు సైతము కలఁతనొంది రొదచేయుచుండెను.

మ. కలగుండై నెల వేది యిట్లు వరటాకారండవాదిద్విజా
వళి ఘోషించుటకన్న మున్న గిరిరాడ్వ్యావిద్ధకల్లోలినీ
సలిలోపప్లుతభూజను ల్నిజనివాసస్థేమసంశూన్యులై
కలఁకన్ ఘూర్ణిలుఘోష మొక్క మొగి దిక్చక్రంబులం గ్రమ్మినన్. 142

కలగుండై=గజిబిజిపడి, నెలవేది=నివాసస్థలమువిడిచి, ఇట్లు=ఈప్రకారముగా, వరటా=ఆఁడుహంసలును, (ని. 'హంసస్యయోషి ద్వరటా' అని అ.) కారండవ = కన్నెరేడుపక్షులును, ఆది= మొదలుగాఁగల, ద్విజ=పక్షులయొక్క, (ని. 'శకున్తి పక్షి శకుని శకున్త శకున ద్విజాః' అని అ.) ఆవళి=సమూహము, ఘోషించుటకన్న మున్న=రొదసేయుటకంటె ముందురా, గిరిరాట్ = పర్వతాధీశ్వరుఁడైన కోలాహలునిచేత, వ్యావిద్ధ=మళ్ళింపఁబడిన, కల్లోలినీ=శుక్తిమతియొక్క, సలిల=ఉదకముచేత, ఉపప్లుత=ముంపఁబడిన, భూజనులు=భూమియందలి మనుజులు, నిజ=స్వకీయమైన, నివాస=

గృహములయందలి, స్థేమసంశూన్యులై = ఉనికిలేనివారై, కలఁకన్ = భయవిహ్వలత్వముచేత, ఘూర్ణిలు=గుబ్బటిల్లునట్టి, ఘోషము=కోలాహలధ్వని, ఒక్కమొగిన్=ఒక్కసారిగా, దిక్చక్రంబులం గ్రమ్మినన్=దిగ్వలయములయందు వ్యాపింపఁగా ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. అలం. శ్లేషమూలరూపకము.

శుక్తిమతీఘోషము వసురాజు వినినటులఁ జెప్పమికిఁ గారణము స్త్రీస్వరముగావున స్ఫుటముగా లేమియో అంతకెన్నియోరెట్లుగొప్పదియగు పక్షిసంఘఘోషము వినఁబడవలసినదెగాని నివాసశూన్యులగు జనులఘోషము దిక్చక్రము లాక్రమించుటచే వినరాదయ్యెను. సలిలోపప్లుతి జనక్షోభ గూర్చుటచే నన్నిటికంటె జనక్షోభమె మెండయ్యెననిభావము. ఒక్కమొగి దిక్చక్రంబులన్ జనఘోషము పర్వె ననుటవలనఁ బ్రవాహ మన్నిదెసల వెల్లిగొనెనని యాశయము.

మ. విని యాఱంతు దురంతశైలమథనా♦విర్భూతసింధూద్ధత
ధ్వనియో కాక మహోదకప్రళయసం♦త్రాసంబు లోకాళిఁ బై
కొని కారించెనొ యీసుదుస్సహమహా♦కోలాహలోద్వృత్తి కే
మి నిమిత్తం బని భర్త లోకభరణో♦న్మేషంబు వాటింపఁగాన్. 143

విని=విన్నవాఁడై, ఆఱంతు = ఆరొద, దురంత = అంతములేని, శైల = మందరపర్వతముచేత, మథన=మథించుటవలన, ఆవిర్భూత=సంభవించిన, సింధు = సముద్రముయొక్క, ఉద్ధత = అతిశయమైన, ధ్వనియో = ఘోషమో, అని యర్థము. కోలాహలుని బాధవలన నావిర్భవించిన శుక్తిమతీ ధ్వనియని యర్థాంతరము. కాక = లేక, మహోదక=మహాజలమందలి, ప్రళయ=నాశవమునుగూర్చి వచ్చిన, సంత్రాసంబు=మహత్తరమయినభయము, లోకాళిన్=జగజ్జాలమును, పైకొని = ఆక్రమించి, కారించెనొ=బాధించెనో యని యర్థము. శుక్తిమతియొక్క మహోదకముచేయు ప్రళయమువలన వచ్చిన భయము జనసమూహము నాక్రమించి బాధించెనేమో యని యర్థాంతరము. సుదుస్సహ= మిక్కిలి సహింపనలవిగాని, మహత్=అత్యధికమైన, కోలాహల=కలకలధ్వనియొక్క, ఉద్వృత్తికిన్=ఉద్రేకమునకు, ఏనిమిత్తంబు = ఏమిహేతువు అని యర్థము. కోలాహలుని యుద్వృత్తి కేమినిమిత్తమని యర్థాంతరము. అని=ఈలాగనివిచారించి, భర్త = ఆవసురాజు, లోకభరణోన్మేషంబువాటింపఁగన్ = జనసంరక్షణమందలి యుల్లాసముదయింపఁగా, ఇక్కడఁ గోలాహలపర్వతవృత్తాంతము దెలియని వసురాజుయొక్క వచనమందు శ్లేషభంగిచేతఁ దద్వృత్తాంతద్యోతకమైన సత్యవాక్యత్వము స్ఫురించుచున్నది. అలం. సమాసోక్తి.

తా. మందరపర్వతముతోఁ దఱచునాటి సముద్రధ్వనియో ప్రళయసంబంధమగు జనులయాక్రందనమో కాకున్న యీసహింపరాని కోలాహల విజృంభణమునకుఁ గారణమేమైయుండునని వసురాజు లోకసంరక్షణోత్సాహియై యుండ—

క. నానాజనపదకటక, స్థానాశ్రయు లాతూర్ణంబ♦చనుదెంచి వసు
క్ష్మానాథుఁ గాంచి పలికిరి, దీనానూనానులాప♦దీపితభయులై. 144

నానా=సమస్తమైన, జనపద=గ్రామములయొక్కయు, ని. 'జనే గ్రామే జనపదః' అని నా. కటక = పట్టణములయొక్కయు, స్థానాశ్రయులు = స్థలముల నాశ్రయించియున్నవారు, అనఁగాఁ

గాపురమున్నవారు, ఆక్షణంబ=అప్పుడే, చనుదెంచి=వచ్చి, వసుమ్మానాథుఁగాంచి=వసురాజునుజూచి, దీన=దైన్యముతోఁగూడిన, అనూన=అధికమయిన, అనులాప=ముహుర్భాషణములచేత, అనఁగా నాడిన మాటలే యాడుటలచేత, దీపిత=ప్రకాశితమగుచున్న, భయయుతులై=భయముగలవారై, పలికిరి=ఈప్రకారముగా వచించిరి. ఏమని యనిన, పల్లెలనుండియుఁ బట్టణములనుండియు వచ్చిన ప్రజలు వసురాజును గాంచి దీనాలాపములతో నిటులఁ బలికిరి.

సీ. ఇష్టకృత్యము నిర్వ•హించుఁ గాని దినంబు శుచిమలీమసగతుల్ • జూపవెఱచు
దాక్షిణ్యము వహించి • తనరుఁగాని సదాగతి రజోభరభ్రాంతిఁ•దిరుగ వెఱచు
జగతికిఁ దేజంబు•సమకూర్చుఁగాని మిత్రుఁడు చండకరశక్తిఁ • దొడర వెఱచుఁ
గొలుచునాయమె చూపి • నిలుచుఁ గాని ధరిత్రి జీవనదంబు గ•ర్జింప వెఱచు
తే. దేవ తావకకరుణాసు•ధావిశేష, పోషితాశేషసద్వీప•భూతలమున
నేఁటితుదకీక్షణంబున • నాటుకొనిన, పాటుమదిఁ జిత్తగింపవే•పార్థివేంద్ర. 145

దేవ=దేవరా, తావక=నీ సంబంధమైన, కరుణాసుధావిశేష=కృపయనెడు నమృతవిశేషముచేత, పోషిత=పోషింపఁబడిన, అశేష=సమస్తమయిన, సద్వీప=ద్వీపములతోఁ గూడుకొన్న, భూతలమునన్ = భూమియందు, అనఁగా నీవు పాలించుచున్న సప్తద్వీపములతోఁగూడిన ధరాతలమందనుట. శుచి=అగ్నిహోత్రుఁడని యర్థము. పరిశుద్ధుఁడని యర్థాంతరము. (ని. 'శుచి ర్గ్రీష్మాగ్ని శృఙ్గారే ష్వాషాఢే శుద్ధమన్త్రిణి, జ్యేష్ఠే చ పుంసి ధవళే శుద్ధే నుపహతే త్రిషు' అని మే.) దినంబున్ = ప్రతిదినమును, ఇష్టకృత్యమునిర్వహించుఁగాని = హితమయినకార్యమే చేయునుగాని, మలీమసగతుల్సూపవెఱచున్ = కుత్సితమార్గములను జూపవెఱచునని యర్థము. యజ్ఞకార్యమేనిర్వర్తించునుగాని గృహారణ్యాదుల కుపద్రవము సేయఁడని భావము. అనఁగాఁదా నిష్టకార్యనిర్వాహకుఁడునుగృష్ణవర్త్మఁడును గనుక గుణమవలంబించి దుర్గుణము విడిచినాఁడనుట. (ని.'ఇష్టమాశంసితే పిస్యా త్పూజితే ప్రేయసి త్రిషు, సప్తతన్తౌ పుమాన్ క్లీబే సంస్కారే క్రతుకర్మణి' అని మే.) సదాగతి=వాయువు అని యర్థము. శుభాగమనము గలవాఁడని యర్థాంతరము. దాక్షిణ్యమెవహించి=మోమోటమేవహించి, తనరుఁగాని=ఒప్పునుగాని, రజోభరభ్రాంతిఁ దిరుగవెఱచున్=రజోగుణప్రయుక్తమైన చాంచల్యముచేతఁ దిరుగఁడని యర్థము. దక్షిణదిగ్భవత్వమును బొందియుండునుగాని, అనఁగా మలయమారుతమైయుండునుగాని సుడిగాలియై తిరుగఁడని భావము. మిత్రుఁడు=సూర్యుఁడని యర్థము. స్నేహితుఁడని యర్థాంతరము. (ని. 'మిత్రం సుహృది మిత్రోర్కః' అని అ.) జగతికిన్=జగజ్జనులకు, తేజంబుసమకూర్చుఁగాని=జయప్రయుక్తమైన తేజమునే యిచ్చునుగాని, చండకరశక్తిఁ దొడరవెఱచున్=దీక్ష్ణమైన భుజశక్తిఁ జూపి నిర్జితులఁజేయఁడని యర్థము. అంధకారనివారణముచేసి ప్రకాశింపఁ జేయును గాని కిరణములవేడిమి చూపఁడని భావము.

జీవనదంబు=జలదమని యర్థము. జీవనప్రదాయకమని యర్థాంతరము. ని. 'జీవనం వర్తనే నీర ప్రాణ ధారణయోరపి' అని మే. ధరిత్రిన్=భూమియందు, కొలుచునాయమెచూపి నిలుచుఁగాని=కొలువుగొలిచెడుమర్యాదనే కనుపఱిచి నిలుచునుగాని, గర్జింపవెఱచున్ = ప్రతిభటత్వముచేత ధిక్కరించి పలుకవెఱచునని యర్థము. కొలుచనఁగా ధాన్యము - ధాన్యసంపద గనుపడఁజేయుఁగాని వ్యర్థ

ముగానుండుమదని భావము. గుణావలంబనమును దోషత్యాగమును నంతటను జెప్పవలయును. అనఁగా నగ్నిప్రభృతులు నీయొక్క రాజ్యములో స్వకీయశచ్యాది సామానుగుణ్యముగా వర్తించినారనుట. ఈలాగుననుండఁగా, నేఁటితుదకున్=ఈదినమువఱకు వెలసినవని యన్వయము. ఈక్షణంబునన్=ఈ సమయమునందు, నాటుకొనినపాటు=తగులుకొన్న యుపద్రవము, పార్థివేంద్ర = రాజాగ్రణి, మదిఁ జిత్తగింపవే=మనస్సున నవధరింపుము. (ని. 'అత్ర గుణావలమ్బనేన దోషపరిత్యాగేనచాగ్న్యాదే స్స్వకీయనామానుగుణ్య ప్రవృత్త్యానువర్ణనీయరాజప్రతాపాతిశయస్యగమ్యత్వా త్ప్రస్తుతాంకురాలంకారః' శ్లో. 'ప్రస్తుతే నా ప్రస్తుతస్య ద్యోతనే ప్రస్తుతాంకుర' ఇతి లక్షణాత్.)

అలం. ప్రస్తుతాలంకారము.

తా. రాజా! నేఁటివఱకు నీపరిపాలనమున నెట్టికష్టము నెఱుంగక సురక్షితముగానుంటిమి నేటికొకశ్రమ సంభవించెను. చిత్తగింపుము.

ఉ. అక్కట మిక్కుటం బగురయంబున నెక్కడనుండి వచ్చెనో
యొక్కనగంబు వచ్చి నినదోద్ధతి నొక్కట దిక్కటాహము
ల్పిక్కటిలంగఁ బెల్లున గుభిల్లున శుక్తిమతీస్రవంతి పే
రక్కున వ్రాలి యాఁగె భువనావళి నుద్భటవింధ్యవైఖరిన్. 146

అక్కట=అయ్యయో, మిక్కుటంబగు=అతిశయమైన, రయంబునన్=వేగముచేత, ఎక్కడనుండివచ్చెనో=ఏస్థలమునుండి ఏతెంచెనో, ఒక్కనగంబువచ్చి = ఒకపర్వతమువచ్చి, నినదోద్ధతిన్=ధ్వనితోఁగూడుకొన్న యెగుపుచేత, (ని. 'శబ్దే నినాద నినద ధ్వని ధ్వాన రవ స్వనాః' అని అ.) ఒక్కటన్=ఏకకాలమందు, దిక్కటాహముల్పిక్కటిలంగన్=కటాహమనఁగాఁ గర్పరము, అనఁగా ముండబొచ్చె, అట్టిదిక్కులు పూర్ణీభవించునట్టులుగా, పెల్లునన్=ఉద్రేకముచేత, గుభిల్లునన్=గుభిల్లుమనునట్లుగా, శుక్తిమతీస్రవంతి = శుక్తిమతీనదియొక్క, (ని. 'స్రవంతీ నిమ్నగాపగా' అని అ.) పేరక్కునవ్రాలి = విశాలమయిన ఱొమ్మమీఁదవ్రాలి, భువనావళిన్=లోకసమూహమునని వింధ్యగిరిపరమైన యర్థము. ఉద్భట=హెచ్చైన, వింధ్యవైఖరిన్=వింధ్యపర్వతమువలె, భువనావళిన్=జలసమూహమునని కోలాహలపర్వతపరమైన యర్థము. ఆఁగెన్=అడ్డగించెను.

శైలము ఒక్కటన్ వ్రాలెననుటచే హఠాత్సంభవమగుటచేఁ గుఱితింపఁజాలమైతిమనియుఁ గావుననే యాయాపదఁ దొలఁగించుకొనలేకపోతిమనియు భావము. శుక్తిమతి పేరక్కున వ్రాలెననుటచే నదియందలి విశాలమగుప్రవాహభాగము నదియడ్డగింపుచే సర్వతోముఖముగ వెల్లువఁగొనెననుట.

క. గోత్రాజనవిత్రాసద, గోత్రార్భటి కోర్వ లేక ఘూర్ణిలి నదియున్
మాత్రాతీతభయభ్రమ, పాత్రాశయ యగుచు ధాత్రిఁ బదపడి యలమెన్.

గోత్రాశబ్దము భూమియందును గోత్రశబ్దము పర్వతమందును వర్తించును. (ని. 'గోత్రం నామ్ని కులే క్షేత్రే గోత్రా భువి గవాఙ్గణే, గోత్ర శ్శైలే' అని నా.) గోత్రాజన=భూజనులకు, విత్రాసద=మిక్కిలి భయప్రదమైన, గోత్ర=కోలాహలాద్రియొక్క, ఆర్భటికిన్=ఆర్భాటమునకు, ఓర్వలేక=సహించలేక, ఘూర్ణిలి = గిరఁగిరదిరిగి, నదియున్ = శుక్తిమతీనదియును, మాత్రాతీత=మితిమీంచిన, భయ=భయంకరమగుచున్న, భ్రమ=సుడిగుండములకు, పాత్ర=భోజనమయిన, ఆశయ

యుగుచున్ = జఘనోదరప్రదేశములుగలిగినదై అని అర్థము. అతిమాత్రమైన భయభ్రమములకు భాజనమగుచున మానసముగలదై అని అర్థాంతరము. ధాత్రిం బదపడి అలమెన్ = ధాత్రి యనఁగా భూమియును నర్సయును, భూమిని బ్రత్యాసక్తిచేత నప్పళించెనని అర్థము. తల్లిని కౌఁగిలించుకొనెనని యర్థాంతరము. (ని. 'ధాత్రీ జనన్యామలకీ వసుమ త్యుపమాతృషు' అని వి.)

ఇక్కడ శుక్తిమతీనదియందు, భయగ్రస్తబాలికావ్యవహారారోపముచేసినాఁడని గ్రహింపవలయును. అనఁగా భూజనులకు భయప్రదమయిన కోలాహలపర్వతముయొక్క వశనవేగమును సహింపఁజాలక శుక్తిమతీనది తిరుగుడుపడి వెల్లువపెట్టి భూమి నాచ్ఛాదించినదని అర్థము. తరుణియగు బాలిక బలవంతముగఁ బైకొనుటచేఁ దొట్రుపాటున శుక్తిమతి తల్లిని కౌఁగిలించుకొనెనని భావము. అలం. సమాసోక్తి.

ఉ. ఏ మని చెప్ప వచ్చు ధర•ణీశ్వర యాబలుసేగి తన్మహా
భూమిధరోపరోధమునఁ • బొంగునభంగసరిజ్ఝరంబు పై
పై మహి యెల్ల నల్లుకొనఁ • బర్విడి నం దనుబింబితాభ్రరే
ఖా మహిమంబు గాన నగు • గ్రక్కున మిన్నులు వ్రస్సి పడెన్. 148

ధరణీశ్వర = వసుమతీరాజా, ఆబలుసేగి = ప్రబలమైన యాతీవ్రము, ఏమనిచెప్పవచ్చున్ = ఎంతని చెప్పఁగలను, అనఁగాఁ జెప్పనలవిగాదనుట. ఏమనిన, తన్మహాభూమిధర = మహత్తరమయిన యా కోలాహలాద్రియొక్క, ఉపరోధమునన్ = అడ్డగింపుచేత, పొంగు = ఉప్పొంగిన, అభంగ = నిర్భంగమయిన, సరిజ్ఝరంబు = నదీప్రవాహము, పైపైన్ = మీఁదమీఁద, మహియెల్లనల్లుకొనన్ = భూమినంతయును వ్యాపింపఁగా, బర్విడిన్ = త్వరితముగా, అందున్ = ఆ వెల్లువయందు, అనుబింబిత = ప్రతిఫలించిన, అభ్రరేఖా = ఆకాశస్వరూపముయొక్క, (ని. 'నభ స్స్వర్గాంబుదే ష్వభ్రమ్' అని వా.) మహిమంబు = అతిశయము, మిన్నులువ్రస్సిపడెన్ = ఆకాశమువచ్చి దానిలోఁ బడినట్టులుగా, గానన్ అగున్ = చూడఁగొప్పును. అనఁగా భూమియు నాకాశము నేకమైనట్టుగా వెల్లివిరదపెట్టినది గనుక నందువలన సంభవించిన యుపద్రవము చెప్ప నలవిగాదనుట. అలం. ఉత్ప్రేక్ష.

తా. రాజా! ఆమహాపర్వతమువలనఁ గలిగిన మహాపాయము నేమనివర్ణింపఁగలము. శైలోపరోధమున ప్రవాహజలము భూమండలమునిండ నాక్రమించుటచే నందుఁ బ్రతిబింబితమగు నాకాశము మిన్నులు విరిగి జలములోఁ బడినటులఁ గనఁబడుచున్నవి.

సీ. సర్వసర్వంసహా•చక్రంబు జడ మయ్యె గ్రామముల్ భంగసం•గతము లయ్యె
నానాక్షేత్రాంతంబు•లపనతసస్యము లయ్యె సాలము ల్ఖండశో•షంబు లయ్యె
వివిధజగత్సువి•తానవిహృతి వారిత మయ్యె వస్తుజాతము లెల్ల • వంక లయ్యె
నరలోక మెల్లఁ గం•పగతజీవన మయ్యెఁ గలవంబు లప్రాప్త•కలము లయ్యెఁ
తే. దోఁటలనుకొటానంబు•దొడ్డియనెడు, నాసఁ జిన్నయు నినుమంత•లయ్య స్వామి
పాదపద్మంబు లీక్షించు•భాగ్యమునకుఁ, దప్పివచ్చితి మేము గో•త్రాతలేంద్ర.

సర్వ = సమస్తమయిన, సర్వంసహాచక్రంబు = భూవలయము, జడమయ్యెన్ = జలమయ్యెను, అనఁగా నడఁగియున్నదాయెనని యర్థము. ఉదకమాయెనని యర్థాంతరము. గ్రామముల్భంగసం

గతములయ్యెన్=ఊళ్ళన్నియు నై శల్యములతోఁ గూడినవాయెనని యర్థము. తరంగసహితములాయెనని యర్థాంతరము. ఆలయవ్రాతంబులు=గృహసమూహములన్నియు, అవనశూన్యములయ్యెన్=అవన మనఁగా రక్షణము. రక్షాశూన్యము లాయెనని యర్థము. వనమనఁగా నుదకము. వనశూన్యములు గానిది యవనశూన్యములు. అనఁగా జలయుక్తములాయె నని యర్థాంతరము. సాలముల్=వృక్షములు, ని. 'అనోకహాః కుట స్సాలః' అని అ. కాండశేషంబులయ్యెన్=స్కంధశేషములాయెను. అనఁగాఁ గొమ్మలువిరిగి మోళ్ళయ్యెనని అర్థము. జలశేషములాయె నని అర్థాంతరము. వివిధ=నానా విధములయిన, జంతువితాన = ప్రాణిసమూహముయొక్క, విహృత=విహారము, వారితమయ్యెన్= నివారింపఁబడిన దాయెనని అర్థము. సంజాతవారియయ్యె నని అర్థాంతరము. వస్తుజాలములెల్లన్= సమస్తవస్తువులును, వంకలయ్యెన్=నానానదీగతములాయెనని యర్థము. వంకరయనఁగా నదికిఁ బేరు గనుక వస్తువులన్నియు నదులై ప్రవహించెనని యర్థాంతరము. నరలోకమెల్లన్=జనసమూహమంతయు, కంఠగతజీవనమయ్యెన్=కంఠగతప్రాణమాయె నని యర్థము. జీవనమనఁగాఁ జలము గనుకఁ గుత్తుకబంటినీరుగలదయ్యెనని యర్థాంతరము. కలమంబులు = వరిపైరులు, అప్రాప్తఫలములయ్యెన్ =నష్టమయిన ఫలముగలవయ్యె నని యర్థము. అప్పులనఁగాఁ జలములు, జలప్రాప్తఫలములయ్యెను. అనఁగా జలప్రాప్తిచే మునిఁగిపోయెనని యర్థాంతరము. అ+ప్రాప్తము, అప్+ప్రాప్తము, అను రెండు విగ్రహములు అప్రాప్త యను శబ్దమునుండి గ్రహింపవలయును. (అచః పరస్యయరో ద్వేవాస్తోనత్వచి) యను పాణిని సూత్రమువలన అప్ప్రాప్తయనురూపము సిద్ధించినను శ్లేషకార్యమునం దాద్విత్వము వికల్పమగును.

తోఁట చేను కోటారంబు దొడ్డి యనెడు=ఇదితోఁట ఇదిచేను ఇదికొటారు ఇదిదొడ్డి అను నట్టి, ఆసలన్నియున్=ఆశలన్నియు, ఇసుమంతలయ్యెన్=కించిన్మాత్రములయ్యె నని యర్థము. స్వామి పాదపద్మంబు లీక్షించుభాగ్య మునికిన్=దేవరవారి పాదారవిందదర్శనముచేసెడు భాగ్యముగలిగియున్నందున, గోత్రాతలేంద్ర=భూలోకదేవేంద్రుఁడవైన వసురాజాగ్రణీ, తప్పివచ్చితి మేము=మేమా యాపదకుఁదప్పి జీవముతో వచ్చినారము. ఇక్కడ రెండర్థములును ప్రకృతము లగుటవలనఁ బ్రకృతశ్లేషాలంకారము.

కోలాహలావరోధమున నది వెల్లివిరిసెను. మాసర్వస్వము నాశనమైనది. మీపదముల దర్శింప వలసిన ప్రాప్తముంటచే నెటులో బ్రతికివచ్చితిమని పౌరులు రాజున కెఱింగించిరి.

మ. అనుచున్ వారలు విన్నవించుటయు లోకానీకరక్షాకళా
కనదుత్సాహరసచ్ఛవిస్ఫురణమై కన్దోయిఁ గట్టెఱ్ఱ దా
ర్కొన నుర్వీజనదైన్యభంజనఘనభ్రూభంగభంగీవినూ
తనశక్రధ్వజ ముద్భవిల్ల ఖలగోత్రధ్వంసనోదగ్రుఁడై. 150

అనుచున్వారలు విన్నవించుటయున్ = పైఁ జెప్పినప్రకారము వారు విన్నపముసేయఁగా, లోకానీక = జనసమూహముయొక్క, రక్షాకళా = సంరక్షణమందు, కనత్ = ప్రకాశించుచున్న, ఉత్సాహరస=వీరరసస్థాయిభావమయిన యుత్సాహరసముయొక్క, ఛవి = అరుణవర్ణముయొక్క, స్ఫురణమై = స్ఫూర్తియో యన్నట్టులుగా, ఇక్కడ నుత్సాహము వీరరసమునకు స్థాయిభావము

గనుక వీరరసముయొక్క యరుణవర్ణమే యుత్సాహవర్ణమని తెలియవలయును. కన్దోయిఁ=నేత్రయుగళమందు, కట్టెఱ్ఱ దారాఁ=కేవలరక్తిమ వ్యాపింపఁగా, ఉర్వీజన=భూజనముయొక్క, దైన్యభంజన=దీనత్వమును బోఁగొట్టుటయందు, ఘన = సాంద్రమయిన, భూ)భంగభంగీ=బొమముడియొక్క రీతియనెడు, నూతనశక్రధ్వజము=శక్రధ్వజమనఁగా నుత్సవకాలమందు వస్త్రముకట్టి నిలుపునట్టి ధ్వజముపేరు-అట్టి యభినవశక్రధ్వజము, ఉద్భవిల్లఁ = ఆవిర్భవింపఁగా-ఇందుకు రఘువంశమందుఁ జెప్పఁబడినది.

శ్లో. 'పురుహూత ధ్వజస్యేవ తస్యో న్నయనపఙ్క్తయః,
నవాభ్యుత్థాన దర్శిన్యో ననందు స్సప్రజాః ప్రజాః.'

ఖల=దుర్మార్గుఁడైన, గోత్ర=కోలాహలునియొక్క, ధ్వంసన=నశింపఁజేయుటయందు, ఉదగ్రుఁడై=ఉద్యుక్తుఁడై, ముందరిపద్యముతో నన్వయము.

కనులు కట్టెఱ్ఱదనమువహించి ధ్వజపటమువలెనున్నవనియుఁ గనుబొమలు ధ్వజదండములవలెనున్నవనియు భావము. ఇంద్రధ్వజము నెత్తునపుడు ప్రజలు ఈతిబాధాదినివృత్తికిని శుభప్రాప్తికిని నిరీక్షించునటుల రాజు కనుబొమ్మలఁ ముడివైచి కనులెఱ్ఱఁజేయఁగాఁ గోలాహలబాధానివారణరూపమగు సంతోషము ననుభవించిరని భావము.

వీరరసము ఎఱ్ఱఁగానుండుననుట కవిసమయసిద్ధము గాన వీరరసస్థాయిభావమగు నుత్సాహము సైతము కట్టెఱ్ఱగాఁ జెప్పఁబడెను. వీరరస మెఱుపనుటకు-

అసతోపి నిబంధేనా నిబంధేనసతోపిచ,
నియమేనచ జాత్యాదేః కవీనాం సమయస్త్రిధా.
అసతోపి నిబంధోయథా—
రత్నాని యత్ర తత్రాద్రౌ హంసాస్స్వల్పజలాశయే,
... ...
శుక్లత్వం కీర్తిహాసాదౌ కార్ష్ణ్యంచాకీర్త్యఘాదిషు,
ప్రతాపే రక్తతోష్ణత్వే రక్తత్వం క్రోధరాగయోః. కవికల్పలత.

క. నరవరుఁ డభయం బొసఁగుచు, హరిరథనిరసనమనోరయంబున నరిగెం
గరిభరణకరణపరిణత, కరుణాపరిణాహి యగుజగత్పతిలీలన్. 151

నరవరుఁడు = వసురాజు, అభయంబొసఁగుచుఁ=ప్రజలకభయప్రదానముచేయుచు, హరిరథ=విష్ణుదేవునిరథమైన గరుత్మంతుననిగాని లేక హరియనఁగా నింద్రుఁడు గనుక నింద్రరథమైన మేఘముననిగాని లేక హరియనఁగాఁ దురంగముగనుకఁ దురంగమే తురంగముగాఁగల వాయువుననిగాని లేక హరియనఁగా సూర్యుఁడు గనుక సూర్యరథముననిగాని నాలుగర్థములు చెప్పవచ్చును. (ని. 'హరి ర్యమానిలేన్ద్రేందు విష్ణ్వంద్రాంశుశుకేషునా, వాయుభేకాహి సింహేషు కపౌచ కపిలే త్రిషు.' నానా.) నిరసన=తిరస్కరించునట్టి, మనోరయంబునఁ=మనోవేగముచేత, అరిగెఁ=కోలాహలపర్వతోత్పాటనార్థమై పోయెను. ఎటులనిన, కరి=గజేంద్రునియొక్క, భరణకరణ=రక్షణసేయు

టయందు, పరిణత=సిద్ధమయిన, కరుణా=కృపయొక్క, పరిణాహి=విశాలతగలవాఁడు, అగు=అయినట్టి, జగత్పతిలీలన్=నారాయణమూర్తివలె అరిగెనని యన్వయము. జగత్పతియన రాజునకు విష్ణువునకును నర్థమగును. కరిరక్షణమున విష్ణువు త్వరితగతి వెడలినటులఁ బ్రజారక్షణమున వసురాజు త్వరితగతి నేఁగెను. ఆ రక్షాణపరాయణత్వమున వసురాజు శ్రీవిష్ణువువలె నప్రమత్తుఁడని భావము. మనోరయమున వసురాజేఁగెననుటచేఁ బ్రజాబాధానివారణరూపమగు క్రియాచరణమునకుఁ జూపు నుత్సాహము సూచితము. అలం. ఉపమ. శబ్దా. యమకము.

సీ. దశనశంబముల దు•ర్ధరమహీధరకూటకోటి నుగ్గులు సేయు•కుంజరములు
ఖురధూతగురుధూళి•శరధిలీననగాళి గుట్టు ఘట్టించునా•రట్టజములు
పటుచక్రచంక్రమా•ర్భటిఁగొండ లవియించు సమిదభంగశతాం•గశతశతంబు
లెత్తు వడ్డమహాకు•భృత్తుల నతులితధృతిఁ జీరికిఁ గొనని•ధీరభటులు
తే. తడయ కప్పుడు పతివెంటఁ • దవిలి నడువ
నమరుబృంహిత హేషిత•ఘుమఘుమితఘు
జాసమాస్ఫాలితంబుల•జడికి నడికి
కులకుధరమండలము గల•గుండువడియె. 152

దశన=దంతములనెడు, (ని. 'రదనా దశనా దంతాః' అని అ.) శంబములన్ = వజ్రాయుధములచేత, (ని. 'శతకోటి స్స్వరు శ్శంబో దంభోళి రశని ర్ద్వయోః' అని అ.) దుర్ధర=ధరింపశక్యముగాని, మహీధర=పర్వతములయొక్క, కూటకోటిన్=శిఖరసమూహములను, నుగ్గులుసేయు = పొడిపొడిగాఁ జేయఁజాలిన, కుంజరములు=ఏనుఁగులును, ఏనుఁగులు శైలములదరిసి కోరాడుట సహజము. ఏనుఁగులదంతములు వజ్రాయుధములవలె నుంటచే శైలభేదనసమర్థములై యుండెనని భావము. (ని. 'మతఙ్గజో గజో నాగః కుఞ్జరో వారణః కరీ' అని అ.) ఖుర=గిట్టలచేత, (ని. 'శఫం క్లీబే ఖురః పుమాన్' అని అ.) ధూత=ఎగురఁగొట్టఁబడిన, గురు=అతిశయమయిన, ధూళిన్=పరాగముచేత, శరధి=సముద్రమందు, లీన=డాగియున్న, నగాళి=పర్వతసముదాయముయొక్క, గుట్టుఘట్టించు=మర్మము భేదించునట్టి, ఆరట్టజములు=ఆరట్టదేశసంభవములయిన గుఱ్ఱములును, అనఁగా నాగుఱ్ఱములగిట్టలవలన సెగసిన ధూళి సముద్రములోఁబడి నీళ్లనింకింపఁగా నీళ్ళలో డాగియున్న పర్వతములన్నియు బయటఁబడుచున్నవని తాత్పర్యము. పటు=సమర్థమయిన, చక్ర=బండికండ్లయొక్క, చంక్రమార్భటిన్=దొఁకుడువలనబుట్టిన ధ్వనిచేత, కొండలవియించు=పర్వతములను బ్రద్దలుసేయఁజాలిన, సమిత్=యుద్ధమందు, అభంగ=పరాజయములేని, శతాంగ = రథములయొక్క, శతశతంబులు = శతసహస్రములును అనఁగా నసంఖ్యములును, రథములు యుద్ధమునందు నభంగములనుటచే మిగుల దృఢతరముగా నిర్మింపఁబడినవనుట. కావుననే చంక్రమణములలోఁ జెడక కొండలనుగూడఁ బ్రతిధ్వనిరూపమున నవియించుచున్నవని భావము. శతశతములనుటచే రథము లసంఖ్యాకము లనియుఁ గోలాహల గర్వభంగసూచనముగఁ దొలుతఁ దామె కొండలనవయించుచుంటవలన వసురాజురథబలసంపత్తియనుపమానము నసంఖ్యమునని యాశయము. ఎత్తువడ్డమహాకుభృత్తులన్=లేవలేక యెత్తువడిన మహాపర్వతములను, అతులిత

ధృతిన్ = నిరుపమానమయిన ధైర్యముచేత, చీరికిఁగొనని = గణనసేయని, ధీరభటులు=ధైర్యవంతులయిన కాలిబంట్లును,ఎత్తువడ్డమహాకుభృత్తులన్నచోట పర్వతములునగములు గనుక నున్నచోటనుండి లేవనేరవని భావము.

తడయక=జాగుసేయక, అప్పుడు=ఆసమయమందు, పతివెంటన్ = వసురాజువెంబడిగా, తవిలి నడువన్=అంటినడువఁగా, అమరు=ఒప్పుచున్న, బృంహిత=ఘీంకారముల యొక్కయు, హేషిత=సకిలింపులయొక్కయు, (ని. 'అశ్వానాం హేషా హ్రేషా చ నిస్వనే' అని అ.) ఘుమఘుమిత = ఘుమఘుమధ్వనులయొక్క,భుజాసమాస్ఫాలితంబుల=భుజములయందుఁ జేసెడు మల్లచరుపులయొక్కయుం నని క్రమాలంకారము. జడిసిన్=అంతునకు, అడికి=భయపడి, కులకుధరమండలము=కులపర్వతసమూహము, కలగుండువడియెన్=ఆకులత్వమును బొందెను. ఇందులో, (ని. 'హస్త్యశ్వరథ పాదాతం సేనాఙ్గంస్యా చ్చతుష్టయమ్' అని అ.)చెప్పఁబడిన చతురంగబలమును జెప్పి చతురంగబలమునకును పర్వత నిర్భేదన నిపుణత్వము గలుగఁజెప్పినాఁడు గనుక ముందరఁజెప్పఁగల కోలాహలపర్వత నిర్భేదనము సూచింపఁబడినదని తెలియవలయును. ఇది ముద్రాలంకారము. (శ్లో. 'సూచ్యార్థ సూచనం ముద్రా ప్రకృతార్థపరైః పదైః' అని లక్షణము.)

తా. వసురాజు కోలాహలుని దర్పమడంచుటకుఁ జతురంగబలసహితుఁడై బయలువెడల సైన్యకలకలమునకుఁ గులశైలములు కలఁతనొందెను.

ఉ. అంత ననంతవేగభుజ • గాంతకుఁ డమ్మహీకాంతుఁ డాశ్రిత
స్వాంతము సంతసిల్ల సుర • చారణసన్నుతి పర్వ నవ్వనా
భ్యంతరరోధకం బగుమ • హాద్రి నఖంబున మీటె నభ్రవి
భ్రాంతముగాఁగ దుందుభిక • బంధము మీటినరాముకైవడిన్. 153

అంతన్=అంతట, అనంత=అపరిమితమయిన, వేగ=గమనత్వరయందు, భుజగాంతకుఁడు=గరుత్మంతుఁడైన యని రాజపరమయిన యర్థము. అనంతవేగముగల్గిన వాహనభుజగాంతకుఁడు గలవాఁడని శ్రీరామపరమయిన యర్థము. అమ్మహీకాంతుఁడు=ఆవసురాజని యర్థము. విష్ణుదేవుఁడని యర్థాంతరము. ఆశ్రితస్వాంతము సంతసిల్లన్ = ఆశ్రితజనహృదయములు సంతోషింపఁగా నని యర్థము. ఆశ్రయించిన సుగ్రీవుని హృదయము సంతోషింపఁగా నని యర్థాంతరము.సురచారణసన్నుతిపర్వన్=దేవతలయొక్కయుఁ జారణులయొక్కయు స్తోత్రము వ్యాపింపఁగా, అవ్వనాభ్యంతరరోధకం బగు=వనమనఁగా నుదకంబును నరణ్యంబును, (ని. 'వనే సలిల కాననే'అని అ.) అశుక్తిమతీజలాభ్యంతరమున కవరోధకమయిన, అనఁగా జలముల కడ్డకట్టయిన యని యర్థము. అరణ్యమున కడ్డకట్టయిన యని యర్థాంతరము. మహాద్రిన్=మహత్తయిన కోలాహలపర్వతమును, అభ్రవిభ్రాంతముగాఁగన్=మింటికెగసి తిరుగునట్టులుగా, దుందుభియనెడు రాక్షసునియొక్క, కబంధమున్ = మొండెమును, మీటిన=చిమ్మిన, రాముకైవడిన్=రఘురాముని వలె, నఖంబునమీటెన్=కాలిబొటనవ్రేలిగోటిచేతఁ జిమ్మినవాఁ డాయెను. అలం. శ్లేషానుప్రాణితమగు నుపమ.

తా. వనాంతరసంచారమున కాటంకముఁ గలుగఁజేయు దుందుభికాయమును శ్రీరాముఁడు బొటనవ్రేలుతో దూరముచిమ్మినటుల నదీజలమునకు నిరోధము కలిగించిన కోలాహలపర్వతమును

వసురాజు మింటికి నెగిరి తిరుగునటుల నెగఁజిమ్మెను. సురలు సంతోషించిరి. ప్రజలందఱు వసురాజు చేసిన పనికి మిగుల నానందించిరి.

క. వసురాజ మ్మెయ్యెడ బలవ, ద్విసృమరపాదప్రసార • దీర్ణాచలుఁడై
యెసఁగఁగ వసుధాపరికీ, ర్ణసరిన్నిర్ఝరము తత్క్ష • ణంబునఁ దిగిచెన్. 154

వసురాజు=వసుభూపాలుఁడని యర్థము. రశ్మిపటలమునకు రాజైన సూర్యుఁడని యర్థాంతరము. అయ్యెడన్=ఆసమయమందు, బలవత్=బలిష్ఠమయిన, విసృమర=వ్యాపనశీలమయిన, పాద=చరణము యొక్క, ప్రసార=విక్షేపణముచేత, అనఁగాఁ జిమ్ముటచేత, దీర్ణ=బ్రద్దలుగాఁజేయఁబడిన, అచలుఁడై=కోలాహలపర్వతముగలవాఁడయి యని రాజపరమయిన యర్థము. బలవత్=బలిష్ఠమయిన, విసృమర=వ్యాపనశీలమయిన, పాదప్రసార=కిరణప్రసారణముచేత, (ని. 'పాదారశ్మ్యఙ్ఘ్రి తుర్యాంశాః' అని అ.) దీర్ణ=నెరియలు విచ్చునట్టులుగాఁ జేయఁబడిన, అచలుఁడయి=అచలయనఁగా భూమి, భూమిగలవాఁడై యని సూర్యపరమయిన యర్థము. ఎసఁగఁగన్ = ఒప్పుచుండఁగా, వసుధా=భూభాగమందు, పరికీర్ణ = వ్యాపించిన, సరిత్ = శుక్తిమతీనదియొక్క, నిర్ఝరము=ప్రవాహము, తత్క్షణంబునన్=ఆక్షణమందే, తిగిచెన్=తీసిపోయెనని యర్థము. భూచక్రవ్యాపియైన నానానదీప్రవాహము తీసిపోయెనని యర్థాంతరము. ఇక్కడఁ బ్రాచీనులు శబ్దశక్తిమూలధ్వనియనియు నవీనులు ప్రకృతాప్రకృత శ్లేషాలంకార మనియును జెప్పినారు.

వసురాజు పాదప్రసారమువలనఁ గోలాహలుని యవయవములు నలినలియయ్యెననియు భూమియంతయు వెల్లివిరిసిన శుక్తిమతీప్రవాహము వెంటనే తీసెననియుఁ బ్రకృతార్థము. సూర్యుఁడు తన వేఁడికిరణములఁ బ్రసరింపఁజేయ భూమి నెఱియలు బాఱెననియు నదీప్రవాహములన్నియుఁ దీసెననియు నర్థాంతరము.

శా. మొక్కల్ వోయినతెక్కమొక్కగమితో • మూర్ఛాలసత్వంబుతోఁ
జిక్కుల్ వడ్డలతాద్రుమావళులతో • శీర్ణోపలశ్రేణితో
నక్కోలాహల ముర్విఁ ౙ్రాలియును నె•య్యం బొప్ప నయ్యేటికే
గ్రుక్కిళ్ళింగుచు నుండె నండనె వసు•క్షోణీధవత్రస్తమై. 155

మొక్కల్వోయిన = తునుకలయిన, తెక్క మొక్కగమితోన్ = మొలకలవంటి తెక్కల గుంపులతోడను, మూర్ఛాలసత్వంబుతోన్ = మూర్ఛవలనఁబుట్టిన దుర్బలత్వముతోడను, చిక్కుల్వడ్డలతాద్రుమావళులతోన్=వ్యత్యాసముగాఁ బెనుచుకొన్న తీఁగెలయొక్కయుఁ జెట్లయొక్కయు సమూహములతోడను, శీర్ణ=జారిన, ఉపల = పాషాణములయొక్క, శ్రేణితోన్ = సమూహముతోడను, ఆకోలాహలము=అక్కోలాహలపర్వతము, ఉర్విఁ ౙ్రాలియును=భూమిమీఁద నొరఁగియును, నెయ్యంబొప్పన్=ప్రేమయొప్పఁగా, అయ్యేటికే = ఆశుక్తిమతినిమిత్తమే. గ్రుక్కిళ్ళింగుచున్=గుటకలు మ్రింగుచు, వసుక్షోణీధవత్రస్తమై=వసురాజుచేత భయపెట్టఁబడినదై, అండనె= సమీపమందే, ఉండెన్=నిలిచియుండెను.

బహువచనంబు పరంబగునపుడాదేశంబగు ద్విత్వరూపక ళవర్ణోకారము క్రియాపదములు పరంబగునపుడు ఉకారలోపము నొందుట కవిప్రయోగములందు దఱచుగాఁ గానవచ్చెడిని. 'అసి భూళ్ళాడుచువచ్చుచున్నయది కర్ణాటాంగనంగంటిరే' వీధినాటకము. ఇటులె గ్రుక్కిళ్లు+మ్రింగు

అనుచో గ్రుక్కిళ్+మ్రింగుననురూపమును రామరాజభూషణుఁడు గ్రహించెను. ప్రయోగములను బట్టిచూడ నీరూపము సాధువు.

తా. వసురాజుకాలితో నెగఁజిమ్మబిట్టెగసిపడుటవలన కోలాహలుని కెక్కలుతునుకలయ్యెను. మూర్ఛజనించెను. తీఁగలు వృక్షములు తలక్రిందయ్యెను. జాల్లజాఱెను. ఇటులాగిరిపడియుఁ బ్రేమ వశమున శుక్తిమతికొఱకై గ్రుక్కలుమ్రింగుచు వసుభూపతికి భయపడి పడియుండెను.

ఉ. పోటనబంతి మీటుగతి ♦ భూవరుఁ డంఘ్రినఖాంచలంబునన్
మీటిన గట్టు బిట్టెగసి ♦ మేదిని వ్రాలుఘనస్వనంబునన్
హాటకశైలకూటకట♦కాళిఁ బ్రతిధ్వని పర్వె నా నభో
వాటి నెసంగె నంత సుర♦వారవధూమురవారవార్భటుల్. 156

పోటనబంతిమీటుగతిన్ = పూలచెండు నెగమీటినట్టులుగా, భూవరుఁడు = వసురాజు, అంఘ్రినఖాంచలంబునన్ = కాలిగోటికొనచేత, మీటినన్ = ఎగమీటఁగా, గట్టు=కోలాహలాద్రి, బిట్టెగసి=మిక్కిలియుఁ నెగసినదై, మేదినిన్ వ్రాలుఘనస్వనంబునన్ = భూమిమీఁదఁబడెడుసమయమందైన గొప్పధ్వనిచేత, హాటకశైల=మేరుపర్వతముయొక్క, కూట=శిఖరములయొక్క, కటక=చరులయొక్కయు, (ని. 'కటకో స్త్రీ నితంబోద్రేః' అని అ.) ఆళి=సమూహమందు, ప్రతిధ్వనిపర్వెనాన్=మాఱుమ్రోఁత పుట్టినదో యన్నట్టులుగా, అంతన్ = ఆమీఁదట, సురవారవధూ = దేవతావేశ్యలయొక్క, అనఁగా రంభాదులయొక్క, మురవ = మృదంగములయొక్క, ఆరవ=ధ్వనియొక్క, (ని. 'ఆరవా రావ సంరావ విరావాః' అని అ.) ఆర్భటులు=ఆర్భాటములు, నభోవాటినెసంగెన్=గగనావరణమందు నతిశయించెను. అలం. ఉత్ప్రేక్ష.

వసురాజు నఖాంచలమున బంతినిమీటినటుల శైలమును మీటుటవలన వసురాజుబలాతిశయము సూచితము. సామాన్యపర్వతము కాదుకావున ఘనస్వనముకలుగుటయు నాధ్వని మేరుపర్వతపు గుహలయందు మాఱుమ్రోఁగుటయు జరిగెను. దీనిచే శైలోన్నతి వైశాల్యము సూచితము. దేవకాంతలానందించిమంగళవాద్యములు మ్రోఁగించిరనుటవలన మేరుశైలవిహారిణులగునచ్చరలాధ్వని నాలించిరనిభావము. మేరువు సురాలయముగావున శైలపతనధ్వని శిఖరముల చరియలలోనుండి యాలించిరని భావము.

క. నా విని పరమాద్భుతకల, నావినివేశమున మించి ♦ నవముని యవధా
నావళితనేత్రుఁ డై చెలి, నావలికథఁ దెలుపు మనియె ♦ నధికప్రీతిన్. 157

నా విని=ఇట్లుమంజువాణిచెప్పఁగా నాలకించి, పరమ=ఉత్కృష్టమయిన, అద్భుతకలనా=ఆశ్చర్యసంపదయొక్క, వినివేశమునన్=ఆవేశముచేత, మించి=అతిశయించి, నవముని=వేషధారియైన నూతనయతి, అవధాన=అప్రమత్తతచేత, ఆవళిత=వికసితములైన, నేత్రుఁడయి=కన్నులుగలవాఁడయి-అనఁగా వినుటయందలి యత్యాదరముచేతఁ గన్నులు లెస్సగా దెఱచి చూచుచున్నవాఁడయి యనుట. చెలిన్=మంజువాణిని, అధికప్రీతిన్=అత్యంతప్రేమచేత, ఆవలికథఁ దెలుపుమనియెన్=తరువాతికథ చెప్పు మని యడిగినవాఁ డాయెను.

ఆశ్వాసాంతము.

శా. వర్ధిష్ణుప్రతిభాపరాశర శర•స్వర్ధేనువాణీసుధా
వార్ధిస్పర్ధియశోధురంధర ధర•ధ్వంసిస్వరుశ్రీమహా
దోర్ధామర్ధివిశేషభాసుర సుర•స్తోమస్తుతాజిక్షమా
దుర్ధర్షధ్వజినీసముత్కర కరా•ధూతేందుధారాధరా 158

వర్ధిష్ణు=వర్ధనశీలమయిన, ప్రతిభా = అప్పటప్పటికి వికాసముచేత నొప్పెడుబుద్ధియందు, పరాశర=పరాశరముని వైనవాఁడా, శర=జెల్లుతోడను, స్వర్ధేను=కామధేనువుతోడను, వాణీ=సరస్వతితోడను, సుధావార్ధి=క్షీరసముద్రముతోడను, స్పర్ధి=వివాదము గలిగియుండెడు, యశోధురంధర=కీర్తిభారమును వహించినవాఁడా యనియర్థము. ధరధ్వంసి=పర్వతగర్వహరుఁడైన మహేంద్రునియొక్క, స్వరు=వజ్రాయుధసమానమయిన, (ని. 'శతకోటిస్స్వరుశ్శంబః' అని అ.) శ్రీ=శోభాయుక్తమయిన, మహత్=అత్యధికమయిన, దోర్ధామ=బాహుప్రతాపముయొక్క, బుద్ధివిశేష=సమృద్ధివిశేషముచేత, భాసుర=ప్రకాశించుచున్నవాఁడా, సురస్తోమ=దేవతాసమూహముచేత, స్తుత=స్తోత్రముచేయఁబడిన, ఆజిక్షమా=యుద్ధభూమియందు, దుర్ధర్ష=జయింపఁగూడని, ధ్వజినీ = సేనలయొక్క, (ని. 'ధ్వజినీ వాహినీ సేనా' అని అ.) సముత్కర=సమూహము గలవాఁడా, కరాధూత=కరాగ్రదానమహిమచేత నిరసింపఁబడిన, ఇందు=చంద్రుఁడును, ధారాధర=మేఘములును గలవాఁడా, అని కృతినాయకునిఁ గూర్చి సంబోధనము.

క. లజ్జావతీమనోజ దళజ్జాతిసుగంధిగుణ క•ళానళినీఖే
లజ్జాలపాద సమరమి, ళజ్జాంగలఖానహాలహా•లత్రిపురహరా. 159

లజ్జావతీ=స్త్రీలకు, మనోజ=మన్మథుఁడ వైనవాఁడా, దళత్ = వికసించుచున్న, జాతి=జాజిపువ్వులవలె, సుగంధి=పరిమళించుచున్న, గుణ=సుగుణములు గలవాఁడా, కళా=విద్యలనెడు, నళినీ=తామరతీఁగెలయందు, ఖేలత్=క్రీడించుచున్న, జాలపాద = రాజహంసవైనవాఁడా, సమర=యుద్ధమందు, మిళత్=తారసించిన, జాంగలఖాన=జాంగలదేశాధిపుఁడైన మ్లేచ్ఛులనెడు, హాలహాల=కాలకూటమునకు, త్రిపురహరా=రుద్రుండవైనవాఁడా, అనఁగా రుద్రుఁడు కాలకూటమును హరించినట్టుగా జాంగలప్రభువును సంహరించినవాఁడా యనుట.

పంచచామరము.

వరాహవావదాతవాహ • వాహరాజగర్వశా
ర్వరాహరీశ దోర్విటంక•వజ్రపీఠలాలితో
ర్వరా హరీశవైభవాభి•రామభూమ భూమహా
వరాహ వారణాధిరాజ•వారిరాశిమందరా. 160

వర=శ్రేష్ఠమైన, ఆవహ=యుద్ధమందు, అవదాతవాహ=శ్వేతవాహనుఁడవైనవాఁడా, అనఁగా అర్జునుఁడవైనవాఁడాయనుట. వాహరాజ=అశ్వపతియొక్క, గర్వ=దర్పమనెడు, శార్వర=అంధకారమునకు, అహరీశ=సూర్యుఁడ వైనవాఁడా యనుట, దోర్విటంక=భుజప్రదేశమనెడు, వజ్రపీఠ=వజ్ర

౦దు, లాలిత=లాలనముచేయఁబడిన, ఉర్వరా=భూమిగలవాఁడా, హారీశ=హరిహరులయొక్క, వ=ఐశ్వర్యమువంటి ఐశ్వర్యముచేత, అభిరామ=ఒప్పుచున్న, భూమ=మహత్త్వము కలవాఁడా, = భూచక్రమునకు, మహావరాహ = ఆదివరాహమవైనవాఁడా, అనఁగా ఉద్ధారకుఁడవైనవాఁడా టు. వారణాధిరాజ=గజపతియనెడు, వారిరాశి=సముద్రమునకు, మందరా=మందరపర్వతమవైన వా, అనఁగా గజపతిని మథించినవాఁడా యనుట.

ము. ఇది శ్రీరామచంద్రచరణారవిందవందనపవననందన ప్రసాదసమాసాదిత ంస్కృతాంధ్రభాషాసామ్రాజ్యసర్వంకష చతుర్విధకవితానిర్వాహకసాహిత్య సపోషణరామరాజభూషణప్రణీతం బైనవసుచరిత్రం బనుమహాప్రబంధంబు ందు ద్వితీయాశ్వాసము.

ఇది శ్రీమదాత్రేయకులకలశాంభోనిధిసంపూర్ణసోమసోమాభిధానమంత్రివరపౌత్త్రుండునుసోమ నేశ్వరమంత్రీశ్వరపుత్త్రుండును శ్రీమత్పార్వతీరాజేశ్వరవరప్రసాదసమాసాదితవ్యాఖ్యానవద్యనిఖిల విశారదుండును నగుసోమకవిచేత విరచితం బయినవిద్వజ్జనరంజనీనామకప్రతిపదటీకారూపం బగు రిత్రనామకాంధ్రకావ్యరత్నవ్యాఖ్యానమునందలి ద్వితీయాశ్వాసము.

శ్రీ ర స్తు.

వసుచరిత్రము, సవ్యాఖ్యానము.

తృతీయాశ్వాసము.

శ్రీక్షితిరక్షాదక్షణ
వీక్షాదక్షిణభుజాగ్ర•వివిధారిపురీ
శిక్షణఫాలేక్షణ శుభ
లక్షణధౌరేయ తిరుమ•లమహారాయా. 1

శ్రీ=లక్ష్మీదేవియొక్కయు, క్షితి=భూదేవియొక్కయు, రక్షా=రక్షణమందు, దక్షణ=సమర్థమైన, వీక్షా=వీక్షణంబును, దక్షిణభుజాగ్ర=కుడిభుజముయొక్క యగ్రభాగంబునుగలవాఁడా, యథాసంఖ్యాలంకారము. అనఁగాఁ జూపులయందు మహాలక్ష్మియును భుజాగ్రమందు భూమియును గలవాఁడాయనుట. వివిధారిపురీ=సమస్త శత్రురాజ పట్టణములనెడి త్రిపురములయొక్క, శిక్షణ=శిక్షించుటయందు ఫాలేక్షణ = లలాటేక్షణముగల రుద్రుఁడవైనవాఁడా, విరోధిపురములను దహనముగావించినవాఁడాయనుట. శుభలక్షణధౌరేయ = శుభప్రదములయిన సాముద్రికలక్షణములను ధరించినవాఁడా, తిరుమలమహారాయా=తిరుమలమహారాయరాజాగ్రణీ-అని కృతిపతింగూర్చి సంబోధనము. దీనఁ బద్యపాదాంత్యానుప్రాసము చెప్పంబడియెను.

తే. అవధరింపుము శౌనకా•ద్యఖిలసన్ము
నీంద్రులకు రౌమహర్షణి • యిట్లు వలుకు
మఱియు నమ్మాయతపసితో • మంజువాణి
మంజువాణీవిలాససం•పదల ననియె. 2

అవధరింపుము=చిత్తగింపుము, శౌనకాద్యఖిలసన్మునీంద్రులకున్ = శౌనకుఁడు మొదలుగాఁగల సమస్తమునిశ్రేష్ఠులకును, రౌమహర్షణి=రోమహర్షణపుత్రుఁడయిన సూతుఁడు, ఇట్లువలుకున్=ఈ వక్ష్యమాణప్రకారముగా వచించెను. ఏమనియనిన, మఱియున్=మరల, అమ్మాయతపసితోన్=ఆకపటసన్యాసితోడ, మంజువాణి=మంజువాణియనెడు గిరికాదేవియొక్క చెలికత్తియ, మంజు=మనోహరమయిన, వాణీవిలాస=వాగ్విలాసముయొక్క, సంపదలన్=సమృద్ధులచేత, అనియెన్=పలికెను. మంజువాణిగావుననే మనోహరములగు వాగ్విలాససంపదలొప్ప భాషింపఁగల్గెనని భావము.

క. మందారవర్షవర్ధన, బృందారకబృందదుందు•భిధ్వని గర్జా
సందోహ మపుడు నృపజయ, నందితశక్రోపసర్ప•ణం బెఱఁగించెన్. 3

మందారవర్షవర్ధన=పారిజాతకుసుమవర్షమును వృద్ధిఁబొందించునట్టి, బృందారకబృందదుందుభిధ్వని - బృందారకబృంద = దేవసమూహములయొక్క, దుందుభి = దుందుభులయొక్క, ధ్వని =

చప్పుడు, నృప=వసురాజుయొక్క, జయ=కోలాహలపర్వత భంజనరూపమయిన విజయముచేత, నం దిత=సంతోషపెట్టఁబడిన, శక్ర = ఇంద్రునియొక్క, ఉపసర్పణం బెఱింగించెన్=రాకను దెలియఁ జేసెను. అనఁగా వసురాజు కోలాహలపర్వతమును గోటమీటినసమయమందుఁ బారిజాత పుష్ప వర్షము గురిసెననియును దేవదుందుభులు మ్రోసె ననియును అవి యింద్రుఁ డక్కడికివచ్చుట సూ చించె ననియును భావము.

వర్షము నభివృద్ధినొందించునవి యుఱుములె కాన దేవతలు కురియు పూవులవానకు దేవతలు మ్రోఁగించు భేరులమ్రోఁతయే యుఱుములుగనుండెను. వర్షసమయమున నుఱుములమ్రోఁత విశేషముగ నుండుగావున భేరులుమ్రోఁగించువారు బృందారకులు కారు బృందారకబృందమని చెప్పఁబడెను. ఇది పాత్రప్రవేశ సూచనము. ఇంద్రుఁడు పర్వతగర్వభంజనుఁడు గానఁ దనవలెఁ బర్వతభంజన మాచరిం చిన వసురాజును గౌరవింప నరుగుదెంచెనని భావము.

సీ. గోత్రవర్గము పాదు♦కొల్పిననయశాలి కరమున శతకోటి♦గలుగుమేటి
కల్యాణమయధామ♦గరిమఁ గాంచినధన్యుఁ డహితబలచ్ఛేది ♦ యైనజోదు
భూరిసంపదఁ దల♦పువ్వు వాడనిభోగి వరసుధర్మావాప్తిఁ ♦ బరగుసుకృతి
సకలభారము పూను♦సైదోడు గలపెద్ద విద్యాధరుల నేలు♦వినుతకీర్తి
తే. వేయికన్నులవేల్పు భూ♦విభునిమెచ్చి
యుచిత మగుపారితోషికం ♦ బొసఁగ వచ్చె
ననలుఁ డర్కుఁ డసురేశుఁ ♦ డబ్ధిరాజు
ననిలుఁ డర్థేశుఁ డలికలో♦చనుఁడు గొలువ. 4

ఈపద్యమునందు రాజపరముగను దేవేంద్రపరముగను అర్థద్వయము గలదు.

గోత్రమనఁగాఁ గులంబును పర్వతంబును, (ని. 'గోత్రం కులే బలేనామ్ని గోత్రస్తు ధరణీధరే' అని వి.) గోత్రవర్గము = బ్రాహ్మణక్షత్రియాదికులసమూహమును, పాదుకొల్పిన=సంకరము కాకుండ స్వస్థానములయందు నిలిపిన, నయశాలి = నీతిశాలియనియర్థము, పర్వతసమూహమును ఱెక్కలు తెగఁగొట్టి స్వస్థానములయందు నిలిపినవాఁడని భావము. కరమున శతకోటి గలుగుమేటి=చేత ననేక కోట్లధనముగల గొప్పవాఁడని యర్థము, హస్తమందు వజ్రాయుధము గలవాఁడని భావము. కల్యాణ మనఁగా మంగళంబును - బంగారంబును, కల్యాణమయ=సకల మంగళరూపమైన, ధామ=గృహము యొక్క, గరిమఁగాంచిన ధన్యుఁడు = గౌరవమునుబొందిన కృతార్థుఁడని యర్థము. కల్యాణమయ= సువర్ణమయమైన మేరుపర్వతమే, ధామగరిమ గాంచినవాఁడు = గృహముగాఁగలవాఁడని గౌరవ ముఁ బొందినవాఁడని భావము. అహితబలచ్ఛేదియైనజోదు=శత్రుసైన్యచ్ఛేదియైన శూరుఁడని యర్థ ము, అహితుఁడైన బలాసురునిఖండించినవాఁడని భావము. భూరిసంపదన్ = అధికసంపదచేత, తల పువ్వువాడనిభోగి=తలనున్నపువ్వు వాడునంతమాత్రపు శ్రమయైనను లేనిభోగము గలవాఁడని యర్థ ము, అధికైశ్వర్యముతోడ నెప్పుడును వాడకుండెడు పారిజాతపుష్పము తలను ధరించినవాఁడని భావము. వర=శ్రేష్ఠమైన, సుధర్మావాప్తిన్=శోభనమైన ధర్మప్రాప్తిచేత, పరగుసుకృతి=ప్రవర్తించెడు పుణ్యాత్ముఁడని యర్థము, శ్రేష్ఠమైన సుధర్మయను పేరిటి సభయొక్క ప్రాప్తిగలవాఁడని భావము.

సకలభారముపూను నైదోడుగల పెద్ద=సకలరాజ్యభారమువహించునట్టి తమ్ముఁడుగలవాఁడని యర్థము, సమస్తభువనభారధురంధరుఁడైన యుపేంద్రుఁడు అనఁగా విష్ణుదేవుఁడు తమ్ముఁడుగాఁ గలవాఁడని భావము. విష్ణుదేవుఁడు దేవేంద్రునకుఁ దమ్ముఁడౌనట్టులుగా నదితిగర్భమందు వామనుఁడై పుట్టుట ప్రసిద్ధము. విద్యాధరులనేలు వినుతకీర్తి=విద్యావంతుల నేలెడు నెన్నికకెక్కిన కీర్తిగలవాఁడని యర్థము. విద్యాధరులనెడు దేవయోనుల నేలుచున్నవాఁడని భావము. అత్ర తావదభేదాధ్యవసాయం వినా నఘటత ఇత్యతిశయోక్త్యనుప్రాణితః కావ్యలింగాలంకారః.

వేయికన్నులవేల్పు=సహస్రాక్షుఁడైన యింద్రుఁడు, భూవిభుని మెచ్చి=వసురాజును మెచ్చుకొన్నవాఁడై, ఉచితమగు=అర్హమైన, పారితోషికంబు=బహుమానమును; ఒసఁగవచ్చెన్ = ఇచ్చు నిమిత్తముగా వచ్చెను. ఏలాగునననిన, అనలుఁడు=అగ్నిహోత్రుఁడును, అర్కజుఁడు=యముఁడును; అసురేశుఁడు=నిరృతియును, అబ్ధిరాజు=వరుణుఁడును, అనిలుఁడు=వాయువును, అర్థేశుఁడు=కుబేరుఁడును, అలికలోచనుఁడు=ఈశానుఁడును, కొలువన్=పరివేష్టించికొలిచిరాఁగా-వచ్చెనని సంబంధము.

తా. వర్ణాశ్రమధర్మపాలకుఁడును వజ్రధారియు మేరుశైలవిహారియు బలాసురుని జంపినవాఁడును కల్పకుసుమముల దాల్చువాఁడును సుధర్మసభయందు మెలంగువాఁడును ఉపేంద్రున కగ్రజుఁడును విద్యాధరాదిదేవతలకు ఱేఁడునగు నింద్రుఁడు తక్కినదిక్పాలకులుగొలువ వసురాజుదర్శనమునకు వచ్చెను.

తే. వచ్చి యభివాదన మొనర్చు•వసునృపాలుఁ
గరము లాలించి కన్నులఁ • గప్పికొని య
మందమందారమకరంద•మధురవచన
రచన లిరవొంపఁ బలికెఁ బు•రందరుండు. ౫

పురందరుండు=దేవేంద్రుఁడు, వచ్చి=విచ్చేసినవాఁడై, అభివాదనమొనర్చువసునృపాలున్=తనకు నమస్కరించుచున్న వసురాజును, కరములాలించి=మిక్కిలిగారవించి, కన్నులఁగప్పికొని=ఇక్కడఁ గన్నులఁ బెట్టికొనియె ననెడి లోకోక్తి ననుసరించి కన్నులఁ గప్పుకొని యని యర్థము, వేయికన్నులు గలవాఁడుగనుక నాలింగన వ్యాజముచేతఁ గన్నుల నలముకొని యని యర్థాంతరము. ఒడలినిండఁ గనులుకలవాఁడు గావున వసురాజుప్రశస్తి విని సాదరముమెయి కాంచవచ్చినవాఁడగుటచే వేయికనులు విప్పిచూచెనని భావము.

అమంద=అతిశయమైన, మందారమకరంద = పారిజాతపుష్పరసమువలె, మధుర=మనోహరమైన, వచనరచనలు=వాక్యగుభనంములు, ఇరవొందన్=ఒప్పఁగా, పలికెన్=సంభాషించెను. ఏమని యనినఁ జెప్పుచున్నాఁడు.

కనులు విప్పుట నెదటివానిని జూచుట యుత్సాహమునకు సూచనము. ఇటులె శృంగారనైషధమునఁ జెప్పఁబడెను.

తే-గీ. ఇందుబింబాస్య నారాక కెదురుచూచు, నయనములు వేయు విఠియించి నాకభర్త.

శృంగారనైషధము.

అలం. ఛేకోక్తి.

మ. వివిధోర్వీపతులన్ జగన్నుతుల మున్ • వీక్షింపమో వారిపెం
పు పరీక్షింపమొ నింపమో చెలిమి యే•భూపాలునం దైన నీ
భువనత్రాణపరాయణోద్భటభుజా•భూరిప్రభావంబు నీ
జవనాక్షీణబలంబుఁ గంటిమె వసు•క్ష్మామండలాఖండలా. 6

వసుక్ష్మామండలాఖండలా = భూమండలమున కింద్రుఁడవైన వసురాజా, జగన్నుతులన్= జగజ్జనులచేత స్తోత్రము చేయఁబడిన, వివిధోర్వీపతులన్ = సమస్తభూపతులను, మున్వీక్షింపమో= ముందు చూచినవారము గామా, వారిపెంపుపరీక్షింపమొ=ఆరాజులయొక్క మాహాత్మ్యము విచారించినవారముగామా, నింపమోచెలిమి=వారియందు మైత్రి నిండించినాము గామా, అనఁగా వారియందు స్నేహభావ ముంచినా మనుట. ఏభూపాలునందైనన్=ఏరాజునందైనను, ఈ=ఇటువంటి, భువనత్రాణ=భువనమనఁగా లోకంబును జలంబును గనుక లోకరక్షణమందనియర్థము, శుక్తిమతీజలరక్షణమందని యర్థాంతరము. పరాయణ=ఆసక్తి గలిగిన, ఉద్భట=ఉద్దండమయిన, భుజా=భుజసంబంధమయిన, భూరి=అతిశయమయిన, ప్రభావంబున్=సామర్థ్యమును, ఈ=ఈలాటి, జవన=వేగముతోఁగూడుకొన్న, అక్షీణ=తక్కువగాని, బలంబున్=పర్వతము నెగమీటుటయందలిశరీరబలమును, కంటిమె=చూచినామా, అనఁగాఁ జూడలేదనుట.

పెంపుపరీక్షింపమొ యన్నచోట పెంపనెడుపదము జడవాచకము గనుక,

క. 'జంగమపదములు దక్క ధ,రం గలపదములు ద్వితీయప్రథమయౌనగు రా
జంగదము లూడ్చెఁ బతినా, త్సాంగదములు దాల్చె నా నుదాహరణంబుల్.'

అను లక్షణోక్తిచే నీద్వితీయకుఁ బ్రథమ వచ్చినది. దీనికిఁ బ్రమాణము. 'ఇతరత్రచద్వితీయాతస్యాః ప్రథమాచజడపదానాంస్యాత్' అని న.

క. 'పొసఁగఁగఁ బల్కెడు నెడఁ బెం, పెసఁగిన ప్రథమాంతములపయిం గలసి కడుం
బసమీఱు క చ ట త ప లకు, గ స డ ద వ ల్దోచి వచ్చుఁ గవిజనమిత్రా.'

అన్నందుచేతఁ బెంపనెడుపదముపైనున్న పరీక్షాశబ్దాదిమ పకారమునకు వకారము వచ్చినది. 'నవికృతిశబ్దాత్పరతస్సాంస్కృతికానాంభవంతి గ స డ ద వాః' న. అనుసూత్రముచేతఁ బెంపనెడు వికృతిశబ్దమునకంటెఁ బరమయిన సంస్కృతసమమయిన పరీక్షాశబ్దముయొక్క పకారమునకు వకారాదేశము రాదని విచారింపవలదు. ఎందువల్లననఁగా,

'గీ. 'సంధిగూర్పంగఁ బ్రథమాంతశబ్దవితతి, పైఁ గ చ ట త ప లకు వికల్పంబు సెల్లుఁ
గాకు సంబోధనావ్యయకర్మధార, యంబుల నచేతనంబులనబ్జనాభ.'

అని యీ యర్థవిశేషములయందు సంస్కృతాసంస్కృత సాధారణ్యముచేతఁ జెప్పఁబడియున్నది గనుక నచేతనార్థకమైన పెంపనెడు పదముపైనున్న పకారమునకు వకారాదేశము వచ్చినది. ఉక్తార్థవిశేషములయందు వికల్పము చెప్పుటచేతఁ దక్కినస్థలములయందు నిత్యముగా రావలసినప్పటికిని సర్వత్ర యతిస్థానమునందు రాదనియుఁ బ్రాసస్థానమందు వచ్చుననియును గ్రహింపవలయును.

క. 'భిన్నపదప్రథమలపై, నున్నపకారంబు వత్వమొందును వళులన్

మున్నిజరూపము ప్రాసము, నన్నవరూపంబుఁ దాల్చు నాళీకాక్షా.' అని

ఆంధ్రభాషాభూషణము.

అని తెనుఁగులమీఁది సాంస్కృతికపరుషములకు గ స డ వాదేశము వైకల్పికమని సాధించి యున్నాఁడు. సోమకవి తనవ్యాఖ్యలో పెంపు వితర్కింపమొ యనుపాఠమును జూపియున్నాఁడు. బహుగ్రంథములందుఁ బెంపు పరీక్షింపమొ యనుపాఠ మంటవలన దానినే గ్రహించితిమి. ద్వితీయాశ్వాసములోని 25-వ పద్యముచెంత ఒకదన్వి యను పాఠసాధుత్వము విచారించుచుఁ దెనుఁగుల మీఁది సాంస్కృతికపరుషములకువచ్చు గ స డ ద వాదేశమునకుఁ బ్రయోగములిచ్చియుంటిమి. మహాకవిప్రయోగములందుఁ బ్రాసములందుమాత్ర మీప్రయోగము గనవచ్చెడిని. ప్రయోగాధారమును బట్టి యిది సాధువు. చిన్నయసూరి దీనిని నిషేధించెను.

ప్రపంచమున జగన్నుతులగురాజులు లేకపోలేదు. వారు మాకుఁ జెలికాండ్రే గాని లోకములను గాపాడఁదగిన మహాప్రభావముగాని అక్షీణమగు జవనబలముగాని వారికిలేదు. నీవు భూలోకదేవేంద్రుఁడవు గావున నీయం దీరెండుసుగుణములుగలవు. కావున నీతో స్నేహముం గోరి వచ్చితినని భావము.

చ. సరయనఖాపసారితర•సాధర యీధరణీంద్రకోటిలో
నరయుదుఁ బెద్దగాఁ బృథునఽరాధిపుఁ గొంత తదీయశక్తి నీ
చరణనఖాంచలంబునకు • సాటియె వేయును నేల మద్భుజాం
తరపవిరేఖ నీయడుగు•నం బడదే శుభలక్షణాకృతిన్. 7

సరయ=వేగముతోఁ గూడుకొన్నట్టులుగా, నఖ = కాలిబొటనవ్రేలిగోటిచేత, అపసారిత= చిమ్మఁబడిన, రసాధర=కోలాహలపర్వతముగల వసురాజా, ఈధరణీంద్రకోటిలోన్=భూమియందు నింద్రులనిపించుకొన్న యీరాజసమూహములో, పృథునరాధిపున్=పృథుమహారాజును, కొంత= ఒకమాత్రముగా, పెద్దగాన్=గొప్పవాఁడనునట్టులుగా, అరయుదున్=విచారింతును, ఇక్కడఁ బెద్దయనెడు పదము పృథుశబ్దార్థకమనియును విచారింపవలయును. ('పృథు స్సా వి న్మహతి త్రిషు, త్వ కృష్ణాయాం కృష్ణజీరే స్త్రీ పుమా నగ్నౌ నృపాంతరే' అని మే.) తదీయశక్తి=ఆ పృథుమహారాజు యొక్క సామర్థ్యము, నీచరణనఖాంచలంబునకు సాటియె=నీకాలిగోటికొనకు సమానమగునా, అనఁగా గాదనుట. వేయును నేల=బహుభాషలెందులకు, మత్=నాసంబంధమయిన, భుజాంతర= బాహుమధ్యమందలి, పవిరేఖ=రేఖాకృతిగల వజ్రాయుధము, శుభలక్షణాకృతిన్ = మహారాజపురుషలక్షణమయిన వజ్రరేఖరూపముచేత, నీయడుగునం బడదే=నీపాదమునందుఁ బ్రవేశించినదిగాదా, నీకాలికి నమస్కరించలేదా యనియు భావము.

గీ. 'చరణమునకు నఖగప్రదేశమునకును స,మాఖ్యయై యొప్పు నడుగు నా నలికనేత్ర' అని యాంధ్రనామసంగ్రహము. దీనికి శ్లో. 'చక్రాసి చాప వజ్రాభా రేఖాః కుర్వంతి భూపతిమ్' అని సాముద్రికశాస్త్రము. అనఁగా నావజ్రాయుధముసేయునట్టి పర్వతభంజనక్రియను నీయడుగు చేసినది గదా యని భావము.

పర్వతభంజనవిద్య నాహస్తమునందలి వజ్రాయుధమునకంటె నీచరణనఖాంచలమునకు బాగుగాఁ దెలియును గావున శుభలక్షణాకృతిచే నడుగునఁ బడుచున్నది. అనఁగా నున్నతవిద్యాభ్యసనము పాదసేవయొనర్చిచేయుట ప్రసిద్ధముగాన పర్వతగర్వభంజనశక్తి నీనఖాంచలమువద్ద నావజ్రాయుధము నేర్వఁదగియున్నదని భావము.

తే. ప్రబలఖలగోత్రహృతికి నీ•పదనఖంబె
చాలు శతకోటిసాధనం • బేల మాకు
నేఁడుగా సౌమనస్యంబు • నివ్వటిల్లె
నెల్లసురలకు నీయంత•హితుఁడు గలుగ. 8

ప్రబల = మిక్కిలియు బలవంతులును, ఖల = దురాత్ములునయిన, గోత్ర =పర్వతాధిపతులయొక్క, హృతికిన్ =గర్వాపహరణమునకు, నీపదనఖంబెచాలున్ =నీకాలిగోరేచాలును, శతకోటిసాధనం బేలమాకున్ =మాకువజ్రాయుధమెందుకు, అనఁగా దానితోనిమిత్తములేదనియర్థము. ప్రబలులయిన దుర్జనులయొక్క వంశనిర్మూలనము సేయుటకు నీయొక్క యల్పావయవమైన కాలిగోరే చాలును. శతకోటిసంఖ్యాకములయిన సాధనము లెందులకు మాకని యర్థాంతరము. ఇక్కడ సాధనశబ్దముచేత సాధనసముదాయము గ్రహింపఁబడుచున్నది. శతకోట్యవయవ సాధనసముదాయమనుట. ఎల్లసురలకున్ =సమస్తమయినదేవతలకును, ('స్త్రీత్వబహుత్వే సురాదేరసమాసే' న.) అను సూత్రముచే నీ సురశబ్దమునకు స్త్రీత్వమును బహుత్వమును వచ్చినది. నీయంతహితుఁడుగలుగన్ =నీవంటి గొప్పవాఁడయిన యిష్టుఁడుగలుగుటచేత, నేఁడుగా=నేఁటికిఁగదా, సౌమనస్యంబు నివ్వటిల్లెన్= చిత్తస్వాస్థ్యముగలిగెనని యర్థము. దేవత్వముగలిగెనని భావము. ('సుమనసాంభావః సౌమనస్యం.') నేఁడుగా అనుశబ్దమందలి 'గా' అవధారణార్థము.

తా. దుష్టుల దండించుటకు (శైలదండనమునకు) నీకాలిగోరె చాలును. ఇఁక శతకోటితోఁ (లెక్కసాధనములతోఁ) బనిలేదు. నేఁడు నీయంతహితుఁడు కలుగుటవలన దేవతలకు దేవత్వము (మనసుకుదురుబాటు) చేకూరెను.

చ. హితసుమనోమనోరథము • లెల్ల ఘటింపఁగఁ జాలులోకస
న్నుతునకు నీకు నిత్తు సుమ•నోరథ మొక్కటి గొ మ్మటంచు దై
వతపతి రాజవర్యున క•వార్యమహార్యమహార్యభీశుసం
యుతమణిశ్లాసమాన మగు•నొక్కవిమానము చూపి యిట్లనున్. 9

హిత=ఇష్టులయిన, సుమనః=దేవతలయొక్క, మనోరథములెల్లన్ =కోరికలనన్నిటిని, ఘటింపఁగఁజాలు=సమకూర్పఁగలిగినట్టి యని యర్థము. హిత=హితులయినరాజులయొక్కయు, సుమనః= పండితులయొక్కయు, మనోరథములెల్ల ఘటింపఁగఁజాలు=కోరికలను సమకూర్పఁగలిగినట్టి యని యర్థాంతరము. (ని. 'సుమనాః పుష్పమాలత్యో స్త్రీస్యాం నా ధీరదేవయోః' అని మే.) లోకసన్నుతునకునీకున్ =లోకములవారిచేత స్తుతిచేయఁబడిన నీకు, సుమనోరథమొక్కటియిత్తున్, గొమ్మంచున్ =సుమనోరథమనఁగా మంచికోరికయును దేవతావిమానంబును గనుక, ఒకమంచి కోరిక నిచ్చెద గ్రహింపుమనియును ఒకదివ్యవిమానమును ఇచ్చెదను గ్రహింపుమనియును నర్థద్వయము. ఇక్కడ

సూచ్యార్థమని గ్రహింపవలయును. లేనియెడల నర్థద్వయమునకును నభేదాధ్యవసాయము సేయవలయును. దైవతపతి=దేవేంద్రుఁడు, రాజవర్యునకున్=రాజశ్రేష్ఠునకు, అవార్య=నివారింపశక్యముగాని, మహత్=ఉత్కృష్టమయిన, అర్యమ=సూర్యునివలె, (ని. 'సూరసూర్యార్యమాదిత్య ద్వాదశాత్మ దివాకరాః' అని అ.) హారి=మనోహరములైన, అభీశు=కిరణములతోడ, ('అభీశుః ప్రగ్రహే రశ్మౌ' అని నానార్థము.) సంయుత=కూడుకొన్న, మణి=రత్నములచేత, భాసమానమగు=ప్రకాశమానమగుచున్న, ఒక్కవిమానముచూపి=ఒక దివ్యవిమానమును గనుపఱచి, ఇట్లనున్=ఈప్రకారముగాఁ జెప్పెను.

సుమనోమనోరథములు దీర్చుట సామాన్యకార్యముగాదు. అది లోకసన్నుతులపని. అట్టివానికిఁ బ్రతిఫలముగా నీయఁదగినది సుమనోరథమె. ఇది యొసంగఁదగినవాఁడు సుమనఃపతియె! సుమనోరథము మణిభాసమానమైనది. ఆమణికాంతులు సూర్యకిరణములవలెఁ బ్రకాశించునవి. రాజవర్యుఁడు గాన వసురాజు పరిగ్రహణయోగ్యుఁడు.

చ. జలనిధిసార్వభౌమతనుజా దనుజారులయేగుపెండ్లినాఁ
డలఘుఁడు విశ్వకర్మ యభవాబ్జభవాదులు మెచ్చఁ జేసెఁ గౌ
శలమున దీని దీనిపయిఁ జారురమాపరమానుషంగుఁడై
యలరెఁ గదా గదాధరుఁ డహస్కరుపై నొఱపైనకైవడిన్. 10

జలనిధి=సముద్రములకు, సార్వభౌమ=చక్రవర్తియయిన క్షీరసముద్రునియొక్క, తనుజా=కొమార్తెయయిన లక్ష్మీదేవియొక్కయు, దనుజారుల=రాక్షసవిరోధియైన విష్ణుదేవునియొక్కయు, అనఁగా లక్ష్మీనారాయణులయొక్క, ఏగుపెండ్లినాఁడు=పెండ్లియూరేగింపునాఁడు, అలఘుఁడు=మహాత్ముఁడైన, విశ్వకర్మ=విశ్వకర్మయనెడు దేవశిల్పి, అభవాబ్జభవాదులు, మెచ్చన్=శివబ్రహ్మాదులు మెచ్చుకొనునట్టులుగా, దీనిన్=ఈవిమానమును, కౌశలమునన్=శిల్పమందలి ప్రవీణతచేత, చేసెన్=నిర్మించెను. దీనిపైన్ = ఈవిమానముమీఁద, చారు = మనోహరమయిన, రమా=లక్ష్మీదేవియొక్క, పరమ=ఉత్కృష్టమయిన, అనుషంగుఁడయి=సాంగత్యముగలవాఁడయి, అనఁగా లక్ష్మీదేవితోఁ గూడియున్నవాఁడయి, గదాధరుఁడు=శ్రీమహావిష్ణువు, అహస్కరుపైన్ = సూర్యమండలముమీఁద, (ని. 'భాస్కరాహస్కర బ్రధ్న ప్రభాకర విభాకరాః' అని అ.) ఒఱపైనకైవడిన్=ప్రకాశించునట్టులుగా, అలరెఁగదా=ఒప్పుచుండెనుగదా.

'ధ్యేయస్సదాసవితృమండలమధ్యవర్తీనారాయణః' అనియున్నది గనుక విష్ణుదేవుఁడు సూర్యమండలమధ్యవర్తి యగుట ప్రకటంబకదా! ఈవిమానము లక్ష్మీనారాయణుల పెండ్లినిమిత్తము సృజింపఁబడినదని చెప్పుటచేత గిరికావసురాజవివాహహేతుత్వము స్ఫురించుచున్నది. (వృత్త్యనుప్రాసాలంకారము.)

విమానము అవార్యసూర్యమనోహరకిరణసంయుతమణిభాసమానము గావున సూర్యబింబమువలె నుండెను. విమానమునెక్కిన విష్ణువు సూర్యమండలమందున్నటులఁ దోఁచెను. చేసినవాఁడు కౌశలియగు విశ్వకర్మ. పనితనమునకు మెచ్చినవారు శిల్పనిపుణులగు బ్రహ్మాదులు గాన విమానయానమమానుషలభ్యమనుట.

ఉ. శ్రీసతిఁ బ్రేమ మించఁగ వరించి విరించిగురుండు కౌతుకా
వాసములో సురాళి గొలువం గొలువై రవికోటిబింబసం
భాసిత మైనయాశుభవిమానముఁ దప్పక చూచునాదుపే
రాస యెఱింగి సైంధవగజాదులతో నొసఁగెం బ్రియంబునన్. 11

శ్రీసతిన్=లక్ష్మీకాంతను, ప్రేమమించఁగవరించి=అనురాగ మతిశయించునట్లుగాఁ బరిగ్రహించి, విరించిగురుండు=బ్రహ్మకుఁ దండ్రియైన విష్ణుదేవుఁడు, కౌతుకావాసములోన్=కల్యాణమండపమందు, సురాళిగొలువంగొలువై=దేవతాసమూహము సేవింపఁగాఁగొలువుదీరికూర్చున్నవాఁడై, రవికోటిబింబ=అనేకసూర్యబింబములవలె, సంభాసితమయిన = మిక్కిలిప్రకాశించుచున్న, ఈశుభవిమానమున్ = శుభాస్పదమయిన యీవిమానమును, తప్పకచూచు = విడువక చూచుచున్న, నాదు=నాయొక్క, పేరాసయెఱింగి=అధికమైన యభిలాషమును దెలిసికొని, సైంధవగజాదులతోన్ = సైంధవములనఁగా సింధుదేశమందుఁ బుట్టినగుఱ్ఱములు - అట్టిసైంధవములు, ఏనుఁగులు మొదలయినవానితోఁగూడ, ప్రియంబునన్=నాయందలిప్రీతిచేత, ఒసఁగెన్=ఈవిమానము నాకిచ్చెను.

ఈపద్యపు మూఁడవపాదమున మొదటియక్షరంబగు బిందుపూర్వక భాకారంబునకుఁబదియవ వర్ణమయిన మాకారము యతిగాఁ జెల్లినది. ఇది బిందుయతి యనంబడును. దీనికిం బ్రమాణము.

క. 'పంచమవర్గాక్షరములు, పంచమవర్ణములఁగూడి పరఁగ నటించుం
బంచశరజనక పెఱనా, ల్గంచితముగఁ బిఱుఁద సున్నలంటినచోటన్.'

అని యనంతునిఛందంబునందు.

శుభవిమానమని చెప్పుటవలన గిరికా కళ్యాణరూపమగు శుభప్రాప్తికిది సాధనమని యాశయము. తప్పక (ఱెప్పయార్పక) చూచుట యత్యంతాభిలాషమునకు సూచకమనుటకు.

ఉ. ఱెప్పలువాల్ప కప్పుడమిఱేని మనోహరమూర్తినిచ్చలున్
దప్పకచూచిజూచి విబుధప్రమదల్. శృంగారనైషధము. ప్రథ.

క. భూనాయక యీదివ్యవిమానం బసమానదివ్యమణిశకలశలా
కానీకనిర్మితం బిది, నానాఁటి కనంతకాంచనంబులు గురియున్. 12

భూనాయక=ఓరాజా, ఈదివ్యవిమానంబు=దేవతాసంబంధమయిన యీవిమానము, అసమాన=సమానములేని, దివ్యమణి=చింతామణిరత్నముయొక్క, శకల=తునుకలయొక్కయు, (ని. 'భిత్తం శకల ఖణ్డే వా' అని అ.) శలాకా=కమ్ములయొక్కయు, అనీక=సమూహముచేత, నిర్మితంబు=నిర్మింపఁ బడినది. కాఁబట్టి, ఇది=ఈవిమానము, నానాఁటికిన్=ప్రతిదినమును, అనంతకాంచనంబులు గురియున్=అపరిమిత సువర్ణములను వర్షించును.

ఈవిమానము దివ్యము. ఇందుఁ జెక్కినమణులు దివ్యములు గావున విమానము యజమానికి మితములేని సువర్ణప్రాప్తి కలుగఁజేయును.

మణులను జెప్పక మణిశకలములను జెప్పుట కాంత్యతిశయము దెలుపుట. మణిశకలములె మణులకంటె బాగుఁగాఁ బ్రకాశించుననుటకు,

శ్లో. ప్రభిన్నవైదూర్యనిభైస్తృణాంకురైః,
సమంచితాప్రోత్థితకందళీదళైః. ఋతుసంహారము.

సీ. పటుగాత్ర యీచిత్ర♦భానూజ్జ్వలమఖర్వ సర్వలోకాలోక♦సౌఖ్య మొసఁగు
ధాత్రీశ యీదివ్య♦ధామోన్నత మనంత వాహినీవిభవంబు ♦ వరలఁ జేయు
నరవరోత్తమ యీఘ♦నప్రకాశ మభంగ మణిచాపశరపరం♦పరలు గురియు
సురమిత్ర యీశర♦జ్జ్యోతిర్వదాకృతి శార్వరగర్వభం♦జన మొనర్చు
తే. నిది యశేషదోషాంతకం♦బిది నితాంత, కాంతకల్యాణనిధి యిది♦కామరూప
రమ్యమిది యమృతాన్న సా♦రప్రదంబు, దీనిఁ గొనియాడఁదరమె వా♦గ్జానికైన.

పటుగాత్ర=ఆరోగదృఢగాత్రుఁడవైన వసురాజా, ఈచిత్రభానూజ్జ్వలము = చిత్రభానూజ్జ్వలమయిన యీచిత్రభానూజ్జ్వల మని యన్వయము. అంతటను నీరీతిగానే యన్వయింపవలయును-అనఁగా, చిత్రభాను=సూర్యునివలె, (ని. 'చిత్రభాను ర్విరోచనః విభావసు ర్గ్రహపతిః' అని అ.) ఉజ్జ్వలము=ప్రకాశమానమగుచున్న, చిత్రభాను=విచిత్రమణికిరణములచేత, (ని. 'భానుః కరో మరీచిః స్త్రీ పుంసయో ర్దీధితిః స్త్రియాం' అని అ.) ఉజ్జ్వలము=ప్రకాశించుచున్న యీ విమానము, అఖర్వ=అధికమయిన, సర్వలోక=సమస్తజనులయొక్క, (ని. 'లోకస్తు భువనేజనే' అని అ.) ఆలోకసౌఖ్య మొసఁగుఁ=అక్షిసాఫల్యము నిచ్చునని యర్థము. (ని. 'ఆలోకౌ దర్శనోద్యోతౌ' అని అ.) అఖర్వమయిన సర్వభువనవిలోకనసౌఖ్యము నిచ్చునని భావము. గీతమునందలి నాలుగువిశేషణములు వరుసగా నాలుగుపాదములకుఁ దీసికొనవలయును. అశేషదోషాంతకమనుటవలనఁ జిత్రకిరణకాంతులచే సమస్తరాత్రులను నాశనముచేయుననియు సమస్తపాపములు తొలంగఁజేయునని భావము.

ధాత్రీశ=భూమీశ్వరా, ఈదివ్యధామోన్నతము=దివ్యధామోన్నతమయిన యీదివ్యధామోన్నతము, అనఁగా, దివ్య=దేవతలకు, ధామ=ఆలయమయిన మేరుపర్వతమువలె, ఉన్నతము=పొడవైన, దివ్యధామ=దివ్యమయినప్రభచేత, ఉన్నతము=అధికమయిన యీవిమానము (ని. 'ధామ జన్మప్రభాస్థాన ప్రభావసుఖ పద్మసు' అని నా.) అనంతవాహినీవిభవంబు వరలఁ జేయుఁ=అనంతవాహిని యనఁగా నాకాశగంగ-ఆకాశగంగయొక్క విభవముఁ బొందునట్టులుగాఁ జేయునని యర్థము. అనంత=అపరిమితమయిన, (ని. 'అనంతం గగనే క్లీబే పుమాన్ కేశవ శేషయోః, అనంతా పూర్ణిమా దూర్వా విశల్యా శారిభా మహీ.' అని నా.) వాహినీ=సేనయొక్క విభవము పొందునట్టులు చేయునని భావము. (ని. 'వాహినీ స్యాత్తరఙ్గిణ్యాం సేనా సైన్య ప్రభేదయోః' అని వి.) విమానము దివ్యధామము గావున మేరువు. మేరువును సురాలయమనుట సుప్రసిద్ధము. కావున నిది నితాంతకళ్యాణనిధి అనఁగా శుభములకునికిపట్టనియు బంగారమును నొసంగుననియు భావము. ఈవిమానము సువర్ణము వర్షించుననుట పూర్వోక్తమె!

నరవరోత్తమ=రాజోత్తమా, ఈఘనప్రకాశము=ఘనమనఁగా మేఘము, మేఘప్రకాశము వంటి ప్రకాశముగల ఘనప్రకాశమయిన యీవిమానము, అభంగ=అఖండమయిన, మణిచాప=ఇంద్రధనుస్సును, శరపరంపరలు=జలసందోహములను, కురియుఁ=వర్షించునని యర్థము. అభంగములయిన రత్నమయధనుస్సులను బాణసమూహములను నుత్పాదించునని భావము. విమానము ఘనప్రకాశము గావున మేఘము. కావునఁ గామరూపరమ్యము. విమానముపైఁ గామరూపమున సంచరింప

వచ్చుననియు మేఘము శరత్తునందు వసంతమున వర్షర్తువున నిచ్చవచ్చినటుల వన్నెలచే మనోహరముగఁ గనవచ్చునటుల రత్నఖచితమగు నీవిమానమును రమ్యముగ నుండునని భావము.

సురమిత్ర=దేవసఖుఁడవయిన వసురాజా, ఈశరజ్జ్యోతిర్వరాకృతి=జ్యోతిర్వరుఁ డనఁగాఁ దారాధిపతియయిన చంద్రుఁడు ఈరశ్చంద్రాకృతియైనవిమానము, శార్వరగర్వభంజన మొనర్చుక్=అంధకార నివారణ సేయునని యర్థము, ఘాతుకభంజనము సేయుననిభావము. (ని. 'శార్వరం త్వంధతమసే ఘాతుకే భేద్యలిఙ్గకమ్' అని అ.) విమానము జ్యోతిర్వరాకృతియనుటవలనఁ జంద్రునివలెఁ బ్రకాశించి యంధకారమును బోనాఁడుననియు దుష్టశిక్షణమున కుపయోగించుననియు భావము.అమృతాన్నసారప్రదమనుటవలన దేవతలకుఁ గళల ప్రసాదించుననియుఁ దేవతలబలమువంటి బలము నొసంగుననియుఁ భావము

ఇది యశేషదోషాంతకంబు, అనఁగా నీవిమానము సర్వరాత్రి నిరాసకమని యర్థము. సకల దోషాపహారి యని భావము. ఇది=ఈవిమానము, నితాంత=ఎల్లప్పుడును, కాంత=మనోహరమైన, కల్యాణ=కాంచనమునకు, నిధి=స్థానమైనదని యర్థము. శుభాస్పదమని భావము. ఇది కామరూపరమ్యము=ఈవిమానమనేకరూపములచేత మనోజ్ఞమైనదని యర్థము ఇది=ఈవిమానము, అమృతాన్న=అమృత మశనము గాఁగల దేవతలకు, సారప్రదంబు=బలప్రదాయక మని యర్థము. ఇవి రెండును సాధారణ విశేషణములు. కాఁబట్టి, దీనిక్=ఈ విమానమును, కొనియాడక్=స్తుతిచేయుటకు, వాగ్జానికైనక్=బ్రహ్మకైనను, తరమె=శక్యమగునా-అనఁగా శక్యముగాదనుట. అలంకారము. శ్లేషము. పరికరము.

తే. ప్రకటితామోదదివ్యపు•ష్పకసహస్ర, మాలికాధార మైనయీ•మణివిమాన
రాజమున కెట్లు సరి వసు•రాజు సారె, పుణ్యజనభర్తఁ బాసిన•పుష్పకంబు. 14

ప్రకటిత=ప్రసిద్ధమైన, ఆమోద=ఆనందముగల, (ని. 'సౌగన్ధ్య హర్షా వామోదౌ' అనినా.) దివ్య=యోగ్యమైన, పుష్పక=పుష్పకమనెడు పేరుగలవిమానములయొక్క, సహస్ర మాలికా=సహస్రశ్రేణులకు, ఆధారమైన=ఆకరమైన యని యర్థము. ప్రకటిత=ప్రసిద్ధమగుచున్న, ఆమోద=సౌరభముగలిగిన, దివ్యపుష్పక=పారిజాతపుష్పములుగల, సహస్రమాలికా=అనేకమాలికలకు స్థానమయినదని భావము. ఈమణివిమానరాజమునకుక్=ఈరత్నమయమయిన విమానశ్రేష్ఠమునకు, వసురాజ=ఓ వసురాజ, సారె=మాటిమాటికిని, పుణ్యజనభర్తఁ బాసిన=కుబేరునెడఁబాసిన, పుష్పకంబు=పుష్పకాఖ్యవిమానము, ఎట్లుసరి=ఏరీతిగా సమానమగును-అనఁగాఁ గాదనియర్థము. పుణ్యజనభర్తఁ బాసిన పుష్పకము=పుణ్యుఁడవును జనభర్తవు నైననిన్నుఁ బొందుచున్న యీవిమానముతో సరిగాదనియు నర్థము స్ఫురించుచున్నది. (ని. 'పుణ్యజన స్సుజనే స్యా ద్రక్షసి యక్షే' అని నానార్థరత్నమాల.) పుష్పకసహస్రములమాలికలుగాఁ దాల్చిన యీవిమానమునకుఁ బుష్పకము సాటిగాదు. పుణ్యజనభర్తను పొందిన యీవిమానము పుణ్యజనభర్తను బాసి పుష్పకముకంటెఁ బెక్కువిధములఁ బ్రశస్తమైనది. పుష్పకమును రావణుఁడు గైకొనెను. అదియు నొకమాఱె గాన సారె యనువిశేషణములో సారస్యములేదనియుఁ బలుమారు కుమారుఁడు పుష్పకమును గొనిపోయినటుల హేతుదృష్టాంతములు దృగ్గ్యములందురు. అలం. శ్లేషమూలకావ్యలింగము.

సీ. మాననీయానంత•మణికాంతధామ మై యిది హిమానీవేళ • నింపునింపు
శోణప్రవాళమం•జులతానిశాంత మై యలరించు నిది వసం•తాగమమునఁ
దరళముక్తాదీప్తి•ధారాధివాస మై వేసవి నిది మహో•ల్లాస మొసఁగుఁ
బ్రబలవజ్రోపల•ప్రాసాదభాస మై తొలుకరి నిది కుతూ•హలము నిలుపు
తే. జనవరోత్తమ యిది సర్వ•సమయసౌఖ్య, జనకమిందలియాలేఖ్య•సాధ్యసిద్ధ
కిన్నరాంగనలవిగీత•గీతనృత్య, వాద్యములు సూపి నిలుతురు•వలయునెడల. 15

మాననీయ=మన్నింపఁదగిన, అనంతమణి=సూర్యునియొక్క, కాంత=మనోహరమైన, ధామ మయి=కాంతివంటి కాంతిగలదై యని యర్థము. మాననీయ=అంగీకరింపఁదగిన, అనంత=అపరిమితము లైన, మణి=పద్మరాగమణులచేత, కాంత=సుందరములగుచున్న, ధామమై=గృహములుగలదై యని భావము. (ని. 'ధామదేహేగృహేరశ్మౌ' అని హలాయుధము.) ఇది=ఈవిమానము, హిమానీవేళన్=శిశిరర్తువునందు, (ని. 'హిమానీ హిమసంహతిః' అని అ.) ఇంపునింపున్=ఇష్టపరిపూర్తినిజేయును.

శోణప్రవాళ=అరుణపల్లవములచేత, మంజు=మనోహర మగుచున్న, లతానిశాంతమై=లతాగృహములుగలదై యని యర్థము. శోణప్రవాళ=ఎఱ్ఱనిపగడములయొక్క, మంజులతా=మనోహరత్వమునకు, నిశాంతమై=ఆస్పదమైనదై యనిభావము. (ని. 'ప్రవాళో వల్లకీదణ్డే విద్రుమే నవపల్లవే' అని వి.) ఇది=ఈవిమానము, వసంతాగమమునన్=వసంతర్తువునందు, అలరించున్=సంతోషింపఁజేయును. శోణప్రవాళములనుటవలన మిక్కిలి లేఁజివురాకులని తెలియును. కెంజివుళ్లతోనుండు పొదరిండ్లు వసంతర్తువున నుపభోగయోగ్యములు. వసంతర్తువున వనవిహారమునకు బదులీమానసంచారము చాలును. సుఖదాయకముగ నుండుననుట.

తరళ=భాసురమయిన, ముక్తా=మౌక్తికములయొక్క, దీప్తిధారా=కాంతిధారలనెడు, ధారా=జలధారలకు, అధివాసమై=స్థానమై, ఇది=ఈ విమానము, వేసవిన్=గ్రీష్మర్తువునందు, మహోల్లాస మొసఁగున్=మహత్తరమైన యుత్సాహము నిచ్చును. వేసవిని ధారాగృహములు సౌఖ్యదాయకములు. తుంపురులు ధారాగృహమునుండి పడుచుండునపుడు వేసవితాపముతీరును ధారాగృహములు గ్రీష్మతాపహరములనుటకు,

శ్లో. నిశాశ్శశాంకక్షతనీలరాజయః క్వచిద్విచిత్రం జలయంత్రమందిరం,
మణిప్రకారాః సరసంచచందనం శుచౌప్రియేయాంతి జనస్యసేవ్యతాం.

ఋతుసంహారము, గ్రీష్మర్తువు.

ప్రబల=బలిష్ఠములైన, వజ్రోపల=వజ్రమణిమయములైన, ప్రాసాద=మేడలతోడ, భాసమై=ప్రకాశమానమయి, ఇది=ఈవిమానము, తొలుకరిన్=వర్షర్తువునందు, కుతూహలము నిలుపున్=సంతోషమును బొందించును. తొలుకరిమెఱపులు మనోహరముగఁ బ్రకాశించుచుండును. ఆప్రకాశమున కనుబింబములుగనుండు వజ్రోపలప్రాసాదములు తొలుకరితఱి నివాసయోగ్యములు.

జనవరోత్తమ=రాజోత్తమా, ఇది=ఈ విమానము, సర్వసౌఖ్యజనకము=అనఁగా నుక్తావశిష్టములైన హేమంత శరదృతువులయందు యథాయోగ్యమయిన సౌఖ్యసముత్పాదకమని యర్థము. ఇందలి=ఈవిమానమందున్న, ఆలేఖ్య=చిత్తరువునందలి, సాధ్యసిద్ధకిన్నరాంగనలు=సాధ్యసిద్ధకిన్నరస్త్రీలు,

లయు నెడలన్ = కావలసినసమయములందు, అవిగీత=అనిందితమయిన, గీత నృత్య వాద్యములు జూపి=గానము నాట్యము వాద్యము వీనిఁగనుపఱిచి, నిలుతురు = నివసించియుందురు-అనఁగా నీ మానప్రభావముచేత నిందలి చిత్రప్రతిమలు సచేతనములయి నృత్త గీత వాద్య క్రియలను జరిగించు నని భావము.

శ్లో. 'హిమ శిశిర వసంత గ్రీష్మ వర్షా శరత్సు స్తన తపన వనాం భో హార్మ్యగోష్ఠీరసానైః
సుఖ మనుభవరాజన్ త్వద్ద్విషో యాంతినాశం దివసకమలలజ్జా శర్వరీరేణుపంక్తైః.'

అను నీశ్లోకార్థము ననుసంధించి గ్రంథకర్త చెప్పినాఁడు.

రాజా! ఈవిమానము అన్నిఋతువులయందును దత్కాలానుకూలసుఖములకు నెలవుగ నలరారు చున్నది. కావున సర్వసమయసౌఖ్యజనకము. ఇందలి విచిత్రగ్రహములందలి వేల్పుచెలువలు గీతాదిక ములచే జనుల నానందపఱచెదరు.

చ. అరుదుగ నీవిమానము ప్రజాధిపుఁడుం బురుషోత్తముండు శం
కరుఁడును దక్క నన్యులకుఁ గా దధిరోహ మొనర్ప వారిసు
స్థిరకరుణావిశేషమునఁ జిష్ణుఁడ వై కయికొంటి దీని నే
నరవర సర్వసద్గుణగణంబుల ప్రోవగు నీకొసంగితిన్. 16

అరుదుగన్=అద్భుతమగునట్లుగా, ఈవిమానము = ఈవ్యోమయానమును, ప్రజాధిపుఁడున్ బ్రహ్మయును, పురుషోత్తముండున్=విష్ణువును, శంకరుఁడును=మహేశ్వరుఁడును, తక్కన్=వినా, అన్యులకున్=ఇతరులకు, కాదధిరోహమొనర్పన్=ఎక్కుటకుఁ దగదు, వారి సుస్థిరకరుణావిశేష మునన్=ఆ బ్రహ్మ విష్ణు మహేశ్వరులయొక్క, శాశ్వతమయిన కరుణాతిశయముచేత, జిష్ణుఁడవై= జయశీలుఁడవై యని యర్థము. జిష్ణునామము గలవాఁడవై యని భావము. (ని. 'జిష్ణు శ్శక్రే ధన ఞ్జయే జిత్వరే చ' అని అ. దీనిం గైకొంటివి=ఈ విమానమును సంగ్రహించుకొంటివని, నేన్=నేను, నరవర=వసురాజా, సర్వసద్గుణగణంబుల ప్రోవగునీకున్=సకలసద్గుణసమూహములకు రాశివైననీకు, (గీ. 'ప్రోగు కుప్ప వామి ప్రోవు తిట్ట యనంగ, రాశి కాఖ్య లగు ధరాశతాఙ్గ' అని యాంధ్రనామ సంగ్రహము.) ఒసంగితిన్=ఇచ్చినవాఁడనైతిని.

ఇందులో వసురాజును సర్వసద్గుణగణంబుల ప్రోవనిచెప్పుటచేత నావసురాజును ప్రజాధిప పురు షోత్తమ శంకర జిష్ణుత్వములుగలవాఁడని గ్రహింపలయును. ప్రజల కధిపతిగావున ప్రజాధిపుడు. (ప్రజానామధిపః) పురుషులయం దుత్తముఁడుగావునఁ బురుషోత్తముఁడు, పురుషాణాముత్తమః, పురు షోత్తమః.) సుఖమును జేయువాఁడుగావున శంకరుఁడు, (శం సుఖం కరోతీతి శంకరః.) జయశీలుఁడు గావున జిష్ణుఁడును అనిభావము. (జయశీలో జిష్ణుః.) ఇందఱియందున్న యిన్నిగుణములు నీయొక్కని యందుంటచే నీవందఱను మించినవాఁడవనుట. కావుననే నీవుసర్వసద్గుణంబుల ప్రోవుగఁ జెప్పఁబడెను. విమాన గ్రహణమువలన నీవును విష్ణువు బ్రహ్మశంకరుఁడు నింద్రుఁడువలె సమస్తగుణపూర్ణవని స్పష్ట పడెననిభావము. అలం-తుల్యయోగితాలంకారము.

మ. నలినీబాంధవతేజ యీశుభవిమానం బెక్కి వేడ్కన్ విని
ర్మలసన్మార్గవిహారహారి వగుచున్ మాపీటికిన్ రాకపో

కలు గావింపు మ టంచు నిచ్చిన వసుక్ష్మాజాని యావ్యోమయా
నలలామంబుఁ బరిగ్రహించె భువనానందం బమందంబు గాన్. 17

నలినీబాంధవతేజ=సూర్యుని తేజస్సువంటి తేజస్సుగలవసురాజా, ఈశుభవిమానం బెక్కి = శుభాస్పదమయిన యీవిమానముపై నెక్కి, వేడ్కన్ = వేడుకచేత, వినిర్మల=మిక్కిలియు స్వచ్ఛమయిన సన్మార్గ=ఆకాశమండలి, ('సతాంనక్షత్రాణాంమార్గస్సన్మార్గః') విహార = సంచారముచేత, హారివగుచున్ = ఒప్పినవాఁడవై, సన్మార్గ మనఁగా సజ్జనమార్గం బనియును గ్రహింపవలయును. ఇక్కడ నలినీబాంధవతేజునకు నాకాశవిహారము యుక్తంబ యని తెలియవలయును. మావీటికిన్ = మాపట్టణమయిన స్వర్గమునకు, రాకపోకలుగావింపుమటంచున్ = వచ్చుటలనుబోవుటలను జరిగించుచుండుమని, ఇచ్చినన్ = ఇంద్రుఁడియ్యఁగా, వసుక్ష్మాజాని=వసురాజు, ('క్ష్మాభూమిఃజాయాభార్యాయస్యసః క్ష్మాజానిః') ఆవ్యోమయానలలామంబున్=ఆవిమానశ్రేష్ఠమును, (ని. 'వ్యోమయానం విమానో స్త్రీ' అని అ.) భువనానందం బమందంబుగాన్ = జగజ్జనానందమతిశయించునట్లుగా, పరిగ్రహించెన్ = పుచ్చుకొన్నవాఁడాయెను.

నలినీబాంధవతేజ యనుటచే సూర్యునివలెఁ బ్రకాశవంతమగు నీవిమానము నీకుఁదగియున్న దనుట. సన్మార్గసంచారులకు స్వర్గగమనము పలుమాఱుసలుప నవకాశము కలుగుఁగాన సన్మార్గసంచారివి కమ్మనిభావము. వసురాజు కోలాహలగర్వ భంజనరూపమున భువనక్షేమము సంతరించెఁగావున విమానప్రాప్తికి భువనమంతయు నపరిమితానంద మొందెను.

వ. ఇట్లు జంభారి కుంభినీపతి కప్రతిమానవిమానంబు సమర్పించి సుఖం బుండుమని చనుటయు నపరిమితకుతూహలంబున నచటితపసు లానృపతి కపుడు పరిచరనామధేయం బంకించి సంకీర్తనంబు గావించి రనంతరంబ యనంత విజయకీర్తిలాభసౌభాగ్యధన్యుం డగునారాజన్యుం డనన్యాదృశప్రమోదభరంబునఁ బురంబునకు మరలి వచ్చి యఖిలజగజ్జేగీయమానవిమానమహిమంబునం బ్రతిదివసజాయమానంబు లగుజాతరూపమణికలాపంబుల భూదేవదేవతావరులకు సపర్యలు గావించుచు నిష్టాపూర్తంబులు నిర్వర్తించుచు నొక్కొక్కయెడ నవ్విమానంబు నెక్కి నాకలోకాదిలోకంబులు నానానగవనానీకంబులు ననవద్యద్వీపసాగరంబులు నదీనదప్రచారంబులు నీక్షించుచు శుక్తిమతీమహానది విహారదీర్ఘికయును గోలాహలంబు లీలాచలంబునుంగా మెలంగుచు నుండె నంత నిచ్చట. 18

ఇట్లు=ఈప్రకారముగా, జంభారి=ఇంద్రుఁడు, కుంభినీపతికిన్=వసురాజునకు, అప్రతిమానవిమానంబు సమర్పించి=సమానరహితమైన విమానమునిచ్చి, సుఖంబుండుమని చనుటయున్=సుఖముగానుండుమనిపలికిపోఁగా, ఇచట సుఖశబ్దమునకు సుఖముకలది యని యర్థము. అపరిమితకుతూహలంబునన్ = మితములేనిసంతోషముచేత, అచటితపసులు = ఆశుక్తిమతీ తీరవాసులైనమునులు, ఆనృపతికిన్=ఆవసురాజునకు, అపుడు=ఆసమయమందు, ఉపరిచరనామధేయంబంకించి = ఉపరిచరుఁడనెడు నామముగుఱుతుచేసి, (ని. 'అఙ్కో నాటకవిచ్ఛేదే సంఖ్యాయాం యుధిభూషణే, సమీపే రూపకే స్థానే మతా పుత్సఙ్గ చిహ్నయోః' అని నా.) అనఁగా నుపరిచరుఁడను పేరుపెట్టి, సంకీర్త

నంబుగావించిరి=స్తోత్రముచేసిరి. అనంతరంబ=ఆతరువాత, అనంత=అంతములేని, విజయ=జయప్రయుక్తమయిన, కీర్తి=యశస్సుయొక్క, లాభ = ప్రాప్తియొక్క, సౌభాగ్య=సౌష్ఠవముచేత, ధన్యుండగు = కృతార్థుఁడైన, ఆరాజన్యుండు = ఆవసురాజు, అనన్యాదృశ = నిరుపమానమయిన, ప్రమోదభరంబునన్ = సంతోషాతిశయముచేత, పురంబునకు మఱచివచ్చి=పట్టణమునకుఁ దిరిగివచ్చినవాఁడై, అఖిలజగజ్జేగీయమాన విమానమహిమంబునన్ = సమస్తజగత్తులచేతను మిక్కిలి కొనియాడఁబడుచున్న విమానముయొక్క ప్రభావముచేత, ప్రతిదివసజాయమానంబులగు = అనుదినమును సంభవించుచున్న, జాతరూప మణి కలాపంబులన్ = సువర్ణ రత్న సముదాయములచేత, (ని. 'చామీకరం జాతరూపం మహారజత కాఞ్చనే.' అని అ.) భూదేవ దేవతావరులకున్ = బ్రాహ్మణశ్రేష్ఠులకును, దేవతాశ్రేష్ఠులకును, సపర్యలుగావించుచున్=పూజలు సలుపుచు, (ని. 'సపర్యా ర్చార్హణాస్సమాః' అని అ.) ఇష్టాపూర్తంబులు నిర్వర్తించుచున్=ఇష్టాపూర్తములనఁగా, (శ్లో. 'అగ్నిహోత్రం తప స్సత్యం వేదానాం చానుపాలనమ్, ఆతిథ్యం వైశ్వదేవంచ ఇష్టమిత్యభిధీయతే. వాపీ కూప తటాకాది దేవతాయతనాని చ, అన్నప్రదానమారామః పూర్తమిత్యభిధీయతే.') అని యున్నదిగనుక నట్టియిష్టాపూర్తములనాచరించుచు, ఒక్కొక్కయెడ నవ్విమానం బెక్కి=ఒక్కొక్కసమయమందు నింద్రుఁడిచ్చిన యావిమానము నెక్కి, నాకలోకాదిలోకంబులు=స్వర్గలోకము మొదలైన లోకములను, నానానగవనానీకంబులు=సకలపర్వతారణ్యసమూహములను, నవద్వయద్వీపసాగరంబులు=అష్టాదశద్వీపములను సముద్రములను, నదీనదప్రచారంబులున్=నదులనఁగాఁ దూర్పుసముద్రములోఁ బ్రవేశించునట్టి యేఱులు, నదములనఁగాఁ బశ్చిమసముద్రములోఁ బ్రవేశించునట్టి యేఱులు, అట్టి నదీనదములయొక్క గమనవిశేషములను, ఈక్షించుచున్=చూచుచు, శుక్తిమతీమహానది=శుక్తిమతీనది, విహారదీర్ఘికయును=క్రీడాసరోవరంబును, కోలాహలంబు=కోలాహలపర్వతము, లీలాచలంబునుంగాన్=క్రీడాపర్వతంబును నగునట్టులుగా, మెలంగుచునుండెన్=ప్రవర్తించుచుండెను. అంతన్=అంతట, ఇచ్చటన్=ఇక్కడ, ఈ పద్యమునకు ముందరిపద్యములో నన్వయము. ద్వీపములకు సప్తసంఖ్యవలెనే యష్టాదశసంఖ్యయు సుప్రసిద్ధము. ఇందులకు-

సీ. వితతనవ ద్వయద్వీపనానాజయ శ్రీపఘూటీ సమాశ్లిష్ట భుజుఁడు. శృంగారనైషధము.
సంగ్రామ నిర్విష్ట సహస్రబాహుః, అష్టాదశ ద్వీపనిఖాత యూపః
అనన్య సాధారణరాజశబ్దో, బభూవ యోగీకిల కార్తవీర్యః. రఘువంశము.

వసుచరిత్రమునందు వసురాజునకు ఉపరిచరవసువను నామము మునులు పెట్టినటులున్నది. భారతమున నటులగాక దేవేంద్రుఁడే యాతని నుపరిచరవసువనినటులున్నది చూడుఁడు.

శ్లో. దైవోపభోగ్యం దివ్యంత్వ మాకాశేస్ఫాటికం మహత్
ఆకాశగంత్వాం మద్దత్తం విమాన ముపపత్స్యతే
త్వమేకః సర్వమర్త్యేషు విమానవరమాస్థితః
చరిష్యస్యుపరిస్థోహి దేవో విగ్రహవానివ. మహాభారతము.

తే. అఖిలభువననిరోధకాహార్యరాజ, గంధనిర్గంధనునిరాకకలిమి నలమి
కొన్నయలజడియుడుగఁ బ్రసన్న యైన, యేటికొయ్యనగర్భంబు దేటపడియె.

అఖిల=సమస్తమైన, భువన=ఉదకములకు, నిరోధక=నిర్బంధకుఁడైన అనఁగా నుదకములనడ్డఁగట్టిన, అహార్యరాజ=కోలాహలపర్వతాధిపునియొక్క, గంధ=గర్వమునకు, నిర్గంధనుని=పరిహారకుఁడైన

వసురాజుయొక్క,రాకకలిమిన్=వచ్చుటచేతననియర్థము. సమస్తలోక నిరోధక వింధ్యాచలగర్వపరిహారకుఁడైన యగస్త్యునియొక్క యుదయముచేత నని యర్థాంతరము. అలమికొన్న యలజడియుడుగన్=అనఁగాఁ బొందిన యాదుఃఖము దీరఁగా నని యర్థము. (క. 'అలజడి నెంజిలి బిమ్మటి, సిలుగుత్తలపాటు వంత నేగి నెగు ల్కాం, దల మల మటడరు గోడు, మ్మలిక మనఁగఁ గుందు నా నమరు దుఃఖాఖ్యల్.' అని యాంధ్రనామశేషము.) అలమికొన్న=వ్యాపించిన, అలజడియుడుగన్ = ఆజడివాన యుడుగఁగా నని యర్థాంతరము. ప్రసన్నయైనయేటికిన్=కలఁకదేఱిన శుక్తిమతీనదికి, ఒయ్యనన్=తిన్నఁగా, గర్భంబు తేటపడియెన్=గర్భమేర్పడెననియర్థము. నడియేఱు గానవచ్చెనని యర్థాంతరము. అగస్త్యోదయము చెప్పుటచేత శరత్కాలముచెప్పఁబడుచున్నది. అనఁగా శుక్తిమతీనదికిఁ గోలాహలపర్వత సంయోగముచేత గర్భమేర్పడెననియు నప్పుడు శరత్కాలసమాగమమైనందుననిర్మలభావంబును జలశోషణంబును సంభవించెననియుఁ దాత్పర్యము.

అగస్త్యోదయము శరత్కాల సూచకమనుటకు-

తే. మలయ దుర్ధరగిరి గుహామందిరుండు, తామ్రపర్ణీజల స్నానధౌతమలుఁడు
కలుషితాంభఃప్రవాహైకకతకఫలము, కోమలియుఁ దాను నేతెంచెఁ గుంభభవుఁడు.

భీమఖండము.

మ. స్ఫుటభూయోహృతిశంక వార్ధినిసరశ్శ్మల్ మిన్నుఁజేర్పం దటి
చ్ఛట లార్వంబుగఁ గారుగొంచు ఘనమై క్ష్మా దీర వర్షింప న
చ్చోటనుండోఁచి గ్రసింపఁ బోలుకలశీసూనుండు గాకున్న నో
క్కోటఁ దారాగ్రహ భాస్కరేందు మణిశుక్తుల్ వ్యక్తమై తోఁచునే.

విష్ణుచిత్తీయము ఆశ్వా ౪. ౧౪౫

సీ. నాళీకముఖికి నెన్నడుము గానఁగ నయ్యెఁ దనరునెత్తులబిత్తరము దరలె
శఫరాక్షి కున్నతస్థలు లగమ్యము లయ్యె బడిబడి నడ లెల్ల జడనుపడియెఁ
జారువేణికి వింతచవుల నింపులుమీఱెఁ గనుపట్టె విశద మై గండరేఖ
కంబుకంఠికి సాంద్రకంకణంబులు జాఱె నాదంబు మందమందత వహించె
తే. హంసయానకు నలిమేచకాంచలముల
గుబ్బపొందమ్మిమొగ్గలు కొమరు మిగిలెఁ
బ్రకటితావర్తనాభి కేర్పడియె నంత
రుచిరతరశైవలశ్యామరోమరాజి. 20

ఈపద్యమందు గర్భిణీస్త్రీపరముగాను శరత్కాలనదీపరముగాను నర్థద్వయముఁ గలుగఁ జెప్పినాఁడు. ఏలాగనిన, నాళీకముఖికిన్ = పద్మమువంటిముఖముగలదానికి, నెన్నఁడుముగానఁగనయ్యెన్=నెఱి+నడుము నెన్నడుము అని సంధివచ్చినది. నడుము దొడ్డుపారి కనఁబడియెనని గర్భిణీపరమయిన యర్థము. ముఖమువంటి పద్మముగలదానికి నడియేఱు గానవచ్చెనని శరత్కాలనదీపరమయిన యర్థాంతరము. తనరునెత్తులబిత్తరముదరలెన్ = తఱులనఁగా వళులు వళిత్రయవిలాసము వదలెనని యర్థము. వళీసదృశతరంగవిలాసము వదలెనని యర్థాంతరము. శఫరాక్షికిన్ =

శఫరమనఁగా మీనము - మీనములవంటి కన్నులుగలదానికి, ఉన్నతస్థలులు = ఉన్నతసౌధాదులు, అగమ్యములయ్యెన్ = పొందశక్యముగాని వాయెనని యర్థము. కన్నులవంటి మీనములుగలదానికి నున్నతప్రదేశము లగమ్యములాయెనని యర్థాంతరము. బడిబడి నడలెల్ల జడనుపడియె = క్రమక్రమముగా నడకలు మందగించె నని యర్థము. ప్రవాహవేగము మందగించెనని యర్థాంతరము. చారువేణికిన్=సుందరమయిన జడలగలదానికి, వింతచవుల నింపులుమీఱెన్ = ఆహారద్రవ్యములయందలి క్రొత్తరుచులయం దిష్టము లతిశయించెనని యర్థము. సుందరమయిన ప్రవాహముగలదానికి మాధుర్యరుచులచేత నింపులుమీఱె నని యర్థాంతరము. కనుపట్టె విశదమై గండరేఖ = కపోలపాళిక తెల్లనై కనుపించె నని యర్థము. గండశిలలయొక్క సమూహము ప్రకటమయి కనుపడియె నని యర్థాంతరము. (ని, 'గణ్డో వ్రణే కపోలే పిటకే గర్వే మృగాంతరే యోగే, మూలాదిదుష్టభాగే హయభూషణే బుద్బుదే ప్యుపాయే చ.' అని నా.) కంబుకంఠికిన్=శంఖమువంటి కంఠముగలదానికి, సాంద్రకంకణంబులుజారెన్=బిగువైన హస్తకంకణములు పదులై జారెనని యర్థము. కంఠమువంటి శంఖముగలదానికి సాంద్రజలబిందువు లుడిగిపోయెనని యర్థాంతరము. (ని. 'స్యాత్కంకణం హస్తసూత్రే శిఖరే కటకే జలే' అని నా.) నాదంబు మందమందతనహించెన్ = సస్వరము గద్గదికనహించె నని యర్థము. ప్రవాహధ్వని సన్నగించెనని యర్థాంతరము.

హంసయానకున్ = హంసనడకలవంటినడకలుగలదానికి, అలి=తుమ్మెదలవలె, మేచక=నల్లనైన, అంచలములన్=అగ్రములచేత, గుబ్బపొందమ్మిమొగ్గలు = బంగారుతామర మొగ్గలవంటి గుబ్బచన్నులు, కొమరుమిగిలెన్=ఒప్పెననియర్థము. హంససంచారములు గలదానికిఁ దుమ్మెదలచేత నల్లనైన యగ్రములచేత గుబ్బలవంటి బంగారుతామరమొగ్గలు కొమరుమీఱె నని యర్థాంతరము. ప్రకటితావర్తనాభికిన్ = ప్రసిద్ధమయిన యావర్తముతోఁగూడిన నాభిగలదానికి, అంతన్=ఆమీఁదట, రుచిరతర = మిక్కిలిప్రకాశమానమైన, శైవల = నాఁచుతీఁగెవలె, 'జలనీలీతు శైవాల శ్శైవలే' అని అ.) శ్యామ=నల్లనైన, రోమరాజి=నూఁగారు, ఏర్పడియెన్ = స్ఫుటముగాఁ గనుపడియెనని యర్థము. స్త్రీలకు నాభియొక్క బిలమావర్తయుక్తమై యుండవలయునని శాస్త్రము. (శ్లో. 'గంభీరా దక్షిణావర్తనాభి స్స్యా త్సుఖసంపదే' అని సాముద్రికశాస్త్రము.) నాభి యనఁగా మధ్యప్రదేశంబును ప్రకటితమయిన యావర్తయుక్తమధ్యప్రదేశముగలదానికి శ్యామరోమరాజివంటి రుచిరతరశైవల మేర్పడియె నని యర్థాంతరము. (ని. 'నాభి ర్మ ధ్యే ప్రధానాఙ్గే కస్తూర్యాం క్షత్రియే నృపే' అని నా.)

గుబ్బపొందమ్ములన్నచోట స్త్రీపరమయిన యర్థమం దుపమిత సమాసమును, నదీపరమయిన యర్థమందు మధ్యమపదలోప సమాసంబును జెప్పవలయును. ఆంధ్రభాషయందు సకలసమాసములు గలవు. 'ద్విగుకర్మధారయాతత్పురుషద్వంద్వౌబహువ్రీహిః, అన్యేకకేచిదుపమానోత్తరపదలోపరూపకాఖ్యాద్యాః. పరిదృశ్యాఇహ' అని నన్నయభట్టీయము. నాళీకముఖి, శఫరాక్షి, చారువేణి, కంబుకంఠి,హంసయాన ఆవర్తనాభియను నామములు నదీపరముగ స్త్రీపరముగ వ్యవహృతములు. అలం. శ్లేషము.

క. ఆపన్నసత్త్వ యాపగ, యాపగిదిన్ నీరుమోసి • యధిగతసేవా
వ్యాపారద్విజమహిళ, ల్గాపాడఁగ నొక్కపుణ్యకాలగ్నమునందున్. 21

సత్త్వమనఁగా జీవుఁడు (శుద్ధేశుక్లార్తవేసత్త్వస్స్వకర్మక్లేశచోదితః, గర్భస్సంపద్యతేయుక్తి వశాదగ్నిర్వివారణౌ.' అనియున్నది.) ఆపన్నసత్త్వ యనఁగా గర్భిణియని యర్థము. (ని.'ఆపన్నసత్త్వా స్యాద్గుర్వి ణ్యంతర్వత్నీ తు గర్భిణీ' అని అ.) సత్త్వములనఁగా జంతువులుగనుక నాపత్ప్రాప్తమైన జల జంతువులు గలదని యర్థాంతరము. (ని. 'ఆపన్న ఆపత్ప్రాప్త స్స్యాత్' అని అ. 'సత్త్వమస్త్రీ తు జంతుషు' అని అ.) ఆపగ యనఁగా నది, (ని. 'స్రోతస్వినీ ద్వీపవతీ స్రవంతీ నిమ్నగా పగా' అని అ.) అనఁగా గర్భిణియైనశుక్తిమతీనది, ఆపగిదిన్నీరు మోసి=అప్రకారముగా నీరువట్టియని యర్థము. జలస్వరూపమువహించి యని యర్థాంతరము. అధిగత=పొందఁబడిన, సేవావ్యాపార=పరిచర్యావృత్తి గల, ద్విజమహిళలు=బ్రాహ్మణస్త్రీలు, కాపాడఁగన్ = రక్షణముసేయఁగా ననియర్థము. ద్విజమహిళ లనఁగా హంసాంగనలు గనుకఁ బొందఁబడిన యనుసరణవృత్తిగల హంస లనుద్విజాంగనలు కాచు కొనియుండఁగా నని యర్థాంతరము. (ని. 'అథద్విజో విప్రే ఖగే రదే ద్విజా భార్గీ రేణుకయోః' అని నా.) ఒకపుణ్యలగ్నము నందున్=ఒకయోగ్యమైన ముహూర్తమునందు ఈపద్యమునకు ముందరి పద్యముతో నన్వయము. అఖిలభువననిరోధకాదిపదత్రయమునందును నభేదాధ్యవసాయమని గ్రహిం పవలయును.

చ గురుతరనవ్యవేతసని•కుంజము రంజిలుచోట హల్లకో
త్కరకరదీపదీధితులు • గ్రమ్మెడుచోట నవారవిందబం
ధురమకరందతైలములు•నూల్కొనుచోటఁ బరాగరక్షచేఁ
గర మరుదైనచోట నది•గాంచెఁ గుమారుఁ గుమారికామణిన్. 22

గురుతర=అధికతరమును, నవ్య=నూతనమునునైన, వేతసనికుంజము రంజిలుచోటన్=ప్రబ్బలిపొద యొప్పుచుండునదియు, (ని. 'ద్వౌ పరివ్యాథ విదులౌ నాదేయీ చాంబువేతసే' అని అ.) హల్లక=ఎఱ్ఱగలువలయొక్క, (ని. 'హల్లకం రక్తసంధ్యకమ్' అని అ.) ఉత్కర = సమూహమనెడు, కరదీప=దివిటీలయొక్క, దీధితులు=కాంతులు, క్రమ్మెడుచోటన్=వ్యాపించుచుండు నదియు, నవార వింద=నూతనమైన కమలములయందు, బంధుర=రమ్యమగుచున్న, మకరంద=పూఁదేనెయనెడు, (ని. 'మకరందః పుష్పరసః' అని అ.) తైలములు=చమురులు, నూల్కొనుచోటన్=సంఘటితమైయుండు నదియు, పరాగ=పుప్పొడియనెడు, రక్షచేన్=విభూతిచేత, (ని. 'భూతిర్భసిత భస్మని, క్షారో రక్షా చ' అని అ.) కరమరుదైనచోటన్=మిక్కిలి వింతగానుండునదియునగు నొకానొకస్థలమందు, నది= శుక్తిమతి, కుమారున్ = ఒకకుమారుని, కుమారికామణిన్ = ఒకచక్కని కొమార్తెను, కాంచెన్ = కనియెను.

నదీగర్భమునఁ బ్రబ్బలిదుబ్బులు విశేషముగానుండును; గాన వేతసనికుంజము ప్రసూతిగృహ ముగఁ జెప్పఁబడెను, గురుతరము, నవ్యము అను విశేషణములవలనఁ బొదరిల్లు దట్టముగఁ గ్రొంజి వుళ్లచే నలరారుచుండెననుట. దీపములు ఎఱ్ఱకలువమొగ్గలు. తైలము క్రొత్తగావిచ్చినతమ్మిపూఁదేనియ. రక్షాద్రవ్యము పరాగము. ప్రకృతిసహజములగువస్తువుల ప్రయత్నముగా సూతికాగృహముగ నుప యుక్తమగుటవలననే యాచోటు కరుదైనదని చెప్పఁబడెను,

తే. ఆనదీనందన జనించు♦ నసఘువేళ, నిందుతారాప్రసాదంబు ♦ లెన్నఁదరమె
తారకాభర్తసుముఖత♦ దాల్చెఁదార, కలు శుభాంఘ్రులనఖరవై ♦ఖరివహించె.

ఆనదీనందన=ఆశక్తిమతి కొమార్తె, జనించు నసఘువేళన్=పుట్టిన పుణ్యసమయమందు, ఇందు తారాప్రసాదంబు లెన్నఁదరమె=చంద్ర తారా నుగ్రహముల నెంచశక్యమా, అనఁగా శక్యముగా దనుట. అదేమనిన, తారకాభర్త చంద్రుఁడు. సుముఖతఁదాల్చెన్ = సుముఖత్వమును వహించెనని యర్థము. ముఖాకృతిని వహించినాఁడనిభావము. తారకలు=నక్షత్రములు, (ని. 'నక్షత్రమృక్షంభం తారా తారకా ప్యుడు వాస్త్రియామ్' అని అ.) శుభాంఘ్రులన్=శుభకరమైనపాదములచేత, అఖరవై ఖరివహించెన్=ఖరమనఁగాఁ దీక్ష్ణము, (ని. 'తిగ్మం తీక్ష్ణం ఖరం తద్వత్' అని. అ.) అదిగానిది యఖరము అనఁగా ననుగ్రహము, అనుగ్రహవైఖరిని వహించెనని యర్థము. శుభలక్షణాస్పదములైన పాదములయందలి నఖాకృతిని వహించినవని భావము. ముఖము చంద్రునివలెనుండుటయు నఖములు తారకలవలెనుండుటయు సౌభాగ్యాతిశయమునకు సూచనము. బాలజన్మకాలమునందు నక్షత్రములు చంద్రుఁడు ననుకూలస్థానములందుండి శుభదాయకులుగ నొప్పిరని తాత్పర్యము. అలం. శ్లేషము.

ఉ. అయ్యెడ శీతశైలతన♦యాగ్రణియున్ ముద మంది నెయ్యపుం
దొయ్యలియందుఁ గల్గినత♦నూభవసంపద పేర్మిఁ బావనం
బయ్యె మదన్వయంబు కృతి ♦ నైతి నటంచు వసుక్షితీంద్రుచే
ప్రయ్యలు వడ్డ నెవ్వగ ల♦వంబుఁ దలంపక యుండె నెమ్మదిన్. 24

అయ్యెడన్ = ఆసమయమందు, శీతశైలతనయాగ్రణియున్ = హిమవత్పర్వత పుత్రులలో శ్రేష్ఠుఁడైన కోలాహలుఁడును, ముదమంది = సంతోషమునుబొంది, నెయ్యపుందొయ్యలి యందున్= ప్రేమాస్పదురాలైన శుక్తిమతియందు, కల్గినతనూభవసంపద పేర్మిన్=సంభవించిన సంతానసంపత్తి యొక్క ఘనతచేత, మదన్వయంబు=నాయొక్క వంశంబు, పావనంబయ్యెన్=పవిత్రమాయెను, కృతి నైతిన్=కృతార్థుఁడనైతిని, అటంచున్=అనితలంచుచు, వసుక్షితీంద్రుచేన్=వసురాజుచేత, ప్రయ్యలువడ్డ నెవ్వగ=బ్రద్దలుచేయఁబడిన మహావ్యథ-బ్రద్దలగుటచేతనైన మహావ్యథయనుట. ఇట్టిప్రయోగము లాంధ్రమునంగలవు. నెఱ+వగ=నెవ్వగ అని సంధి. లవంబు దలంపక=లేశమాత్రమయినను దలఁచుకొనక, నెమ్మదిన్ = స్వస్థచిత్తతచేత, నెఱ+మది నెమ్మది, ఉండెన్ = ఉన్నవాఁడాయెను. అనఁగా నీ సంతానలాభజనిత మయిన సంతోష మావ్యథను బోఁగొట్టె నని భావము.

శీతశైలతనయాగ్రణియనుటచేఁ గోలాహలుఁడుత్తమ పురుషుడనుట సువ్యక్తము. ఉత్తముఁడవమానము సహింపఁజాలకపోయినను అన్వయపావనత విచారమును బోఁదోలినది. ప్రయ్యలువడ్డ నెవ్వగలవంబు దలంపకయుండెననుటచే మేనిగాయములుమానకున్నను సంతోషాతిశయమున బాధారూపమగు విచారముమఱపునకు వచ్చెనని భావము. నెయ్యపుందొయ్యలి యని శుక్తిమతినిగోలాహలుఁడు తలంచుట యసమంజసమని కొందఱందురు. శుక్తిమతిప్రేమింపకున్నను శైలరాజు ప్రేమించెఁగాన శైలరాజునకు శుక్తిమతినెయ్యపుం దొయ్యలియనుట యుక్తమె.

మ. అమితానందరసద్విజారవము చె♦న్నారం గుమారోదయ
ప్రమదారంభవిజృంభమాణ యగుచుం ♦ బద్మాస్య శైలావరో

ధము వారించి తనున్ ధరించె వసుపాదం బంచు నూహించి నె
య్యము దైవార నొనర్చెఁ దద్వసుపదాఖ్యానంబు తొల్చూలికిన్. 25

అమిత=మితములేని, ఆనందరస=సంతోషముగలిగిన, ద్విజారవము=బ్రాహ్మణాశీర్వాదనాదము, చెన్నారన్=ఒప్పఁగా నని యర్థము. అమితానంద=అధికానందముగలిగిన, రసద్విజారవము చెన్నారన్=జలపక్షి కోలాహల మొప్పఁగానని యర్థాంతరము. కుమారోదయ = పుత్త్రజననమువలనఁబుట్టిన, ప్రమదారంభ=సంతోషప్రారంభముచేత, విజృంభమాణయగుచున్=విజృంభించుచున్నదై అని యర్థము. ఉప్పొంగినదై యని యర్థాంతరము. పద్మాస్య=పద్మమువంటి ముఖము గలిగినదని యర్థము. ఆస్యము వంటి పద్మముగల దని యర్థాంతరము. శైలావరోధమువారించి=పర్వతమువలననైన నిర్బంధమును బోఁగొట్టి, (ని. 'అవరోధో రాజగృహే శుద్ధాంతే ప్యవరోధనే' అని నా.) వసుపాదంబు=వసుమము రాజుయొక్క కాలు, తనున్ ధరించెన్=తన్ను రక్షించెను, అంచునూహించి=అని విచారించి, నెయ్యపు దైవారన్=భక్తిస్నేహ మతిశయింపఁగా, తొల్చూలికిన్ = తొలుతఁబుట్టినకుమారునికి, తద్వసుపదాఖ్యానంబు=ఆవసుపద నామకరణమును, ఒనర్చెన్ = చేసెను. అనఁగా వసుపదుఁడని పేరువెట్టెనని భావము.

బ్రాహ్మణాశీర్వాదసహితముగ నామకరణముగావించుట యాచారముగావున శుక్తిమతిపుత్త్రోదయానందమునఁ గృతజ్ఞతాసూచకముగ వసుపదుఁడని పేరిడెను.

క. గిరిరాజతనయకైవడి, సిరి రాజిల వెలయు నీసుశీల యనుచు నా
గిరికన్య కచటిమౌనులు, గిరికాశుభనామ మిడి రకిల్బిషఫణితిన్. 26

గిరిరాజ తనయకైవడిన్ = హిమవత్పర్వతరాజ పుత్త్రియైన పార్వతివలె, సిరిరాజిలన్=ఐశ్వర్యము ప్రకాశింపఁగా, ఈ సుశీల=మంచిస్వభావముగల యీచిన్నది, వెలయున్=ప్రసిద్ధురాలగును, అనుచున్=అనిపలుకుచు, ఆగిరికన్యకున్=కోలాహలపర్వతుని కూఁతురైన యీచిన్నదానికి, అచటిమౌనులు=శుక్తిమతీ తీరవాసులైన మునీశ్వరులు, అకిల్బిషఫణితిన్=నిర్దోషవాక్యముచేత, (ని. 'కిల్బిషం త్వఘే, అపరాధేపి' అని నా.) గిరికాశుభనామ మిడిరి=గిరికయనెడు శుభయుక్తమయిన పేరు పెట్టిరి. ఈయమయు గిరిరాజతనయగావున గిరికానామ మొప్పి యున్నదని భావము. శివుఁడణిమాద్యష్టైశ్వర్యశోభితుఁడు గావున గిరితనయ భర్తృసాహచర్యమున సిరిచే భాసిల్లునటుల నైశ్వర్యశోభితుఁడగు ననుకూలవరప్రాప్తిచే గిరికశోభిల్లఁగలదని భావము.

చ. జలకము లార్చి పాండుజలజచ్ఛదపాళికఁ గప్పి తమ్మిసం
కులఁ దెలిదేనె లుగ్గు లిడి క్రొందరఁగల్ గదలించుకల్వతొ
ట్టెలలఁ గుమారుఁ గూఁతును ఘటించి భజించు నదీలలామ కో
మలకుముదాగతాళికులమంజురవంబున జోల పాడుచున్. 27

జలకములార్చి=స్నానములు సేయించి, పాండుజలజ=తెల్లతామర పువ్వులయొక్క, ఛదపాళికఁ గప్పి=పత్త్రశ్రేణి యనెడువస్త్రశ్రేణిని గప్పి, (ని. 'పత్త్రం పలాశం ఛదనం దళం పర్ణం ఛదః పుమాన్' అని అ.) తమ్మి=కమలములనెడి, సంకులన్ = శంఖపాత్త్రలచేత, తెలిదేనెలు=స్వచ్ఛమయిన

కరందములనెడు తెల్లదేనియలు, ఉగ్గులిడి = ఉగ్గులుపెట్టి, క్రొందరఁగల్ గదలించు=క్రొందరఁగ ఁగాఁ క్రొత్తతరంగములుగాన నవియనెడుదాదు లూచుచున్న, కల్వతొట్టెలలన్=కలువపువ్వులనె నుయ్యేలలయందు, కుమారుఁ గూఁతును ఘటించి=కొడుకును గూతుంబరుండఁబెట్టి, నదీలలామ= భూషణమయిన శుక్తిమతి, కోమల=లేఁతలయిన, కుముద=తెల్లగలువలనుఁ గూర్చి. (ని. 'సితేకు వ కైరవే' అని అ.) ఆగతాళికుల-ఆగత=వచ్చిన, అళికుల = తుమ్మెదగుంపులనెడు, ఆళికుల=సఖీ సమూహముయొక్క--ఇచట అకారము ఆకారమును సవర్ణదీర్ఘమువలనం బ్రశ్లేషించినవి. మంజురవం బున్=మధురమయిన ఝుంకారధ్వని యనెడు లాలిపాటచేత, (ని. 'సుందరం రుచిరం చారు సుష సాధుశోభనమ్' వల్గు వామం హారి శాలి రమణీయం మనోహరమ్, కాంతం మనోహరం రుచ్యం మ్ఞ ం మఞ్జుమఞ్జులమ్' అని అ.) జోలవాడుచున్=జోలలుపాడుచును,భజించున్=ఎడఁబాయక పాడుచుండును. ఈపద్యమందు శ్లిష్టాశ్లిష్టవ్యపధికరణైక దేశవర్తిరూపకములు తెలియఁదగినది.

శుక్తిమతి తనకూతును గొమరుని తెలిదమ్మి ఊక పొత్తులలోనుంచి తెలిదేనియనుగ్గుబెట్టి తర చేఁ గదలుకలువపూవు టుయ్యేలలనూపుచుఁ దేటిపాటలతో జోలబాడుచుండెను.

మందయానము నేర్పు • నిందిందిరాజీవ రాజీవరాజ న్మరాళరాజ
కలికిపల్కులు నేర్పు • లలితనానావాస నావాసనికట కాననశుకాళి
గానబుపాటలు నేర్పుఁ•గుముదరసామోద సామోదమధుప శుద్ధాంతసమితి
నటనలీలలు నేర్పుఁ • దటరూఢకల్పాగ కల్పాగచర నీలకంఠవితతి
యన్నదీకన్య కఖిలభాగ్యములు గలుగ, మునిపురంధ్రీజనంబు దీవనలొసంగు
నతివసైరంధ్రులై దాదులై వయస్యలై విపినదేవతలు ప్రోతురనుదినంబు.

అన్నదీకన్యకున్=శుక్తిమతీనదీ పుత్రికయైన యాగిరికాదేవికి, ఇందిందిర=తుమ్మెదలయొక్క, వ = జీవికలైన అనఁగా జీవనోపాయములైన, ని. 'ఆజీవో జీవికావార్తా' అని అ. రాజీవ= లములయందు, రాజత్=ప్రకాశించుచున్న, మరాళరాజ=హంసశ్రేణి, మందయానము నేర్పున్= ని నడకనేర్పును, లలిత = మనోహరమయిన, నానావాసనా=సమస్త పరిమళములకును, వాస= మయిన, నికటకానన=సమీపవనమందలి, శుకాళి=శుకశ్రేణి, కలికిపలుకులు నేర్పున్=ముద్దు లు నేర్పును, కుముద=కలువపువ్వులయందలి, రస=మకరందమందును, ఆమోద = పరిమళమం , సామోద = సంతోషయుక్తము లగుచున్న, మధుపశుద్ధాంత = ఆఁడుతుమ్మెదలయొక్క, తి=సమూహము, ఇక్కడశుద్ధాంతశబ్ద మంతఃపురస్త్రీలయందు వర్తించుచున్నది. గానబుపాట ర్పున్=ఒప్పిదమయిన పాటలను నేర్పును, తట=శుక్తిమతీతీరమందు, రూఢ=మొలిచిన, కల్పాగ = కల్పవృక్షసమానములైన, అగ = వృక్షములయందు, చర = సంచరించునట్టి, నీలకంఠవితతి= మూరశ్రేణి, (ని. 'మయూరో బర్హిణో బర్హీ నీలకణ్ఠో భుజఙ్గభుక్' అని అ.) నటనలీలలు నే =నాట్యవిలాసములు నేర్పును, మునిపురంధ్రీజనంబు = తాపసస్త్రీజనము, (ని. 'స్యాత్తు కుటుం పురంధ్రీ' అని అ.)

అఖిలభాగ్యములు గలుగన్ = సమస్తైశ్వర్యములును గలుగునట్టులుగా, దీవనలొసంగున్ = ర్వాదములనిచ్చును అనఁగా దీవించుననుట. విపినదేవతలు = వనదేవతలు, సైరంధ్రులై, (ని.

సైరంధ్రీ పరవేశ్మస్థా స్వవశా శిల్పకారికా') అని యున్నదిగనుక, సైరంధ్రియనఁగాఁ బాతివ్రత్య ధర్మముచేతఁ బరగృహమందుంచి రాజకన్యల కలంకారము చేసెడుస్త్రీకిఁ బేరుగనుక నట్టిసైరంధ్రులు కొందఱగుచును, దాదులై=కొందఱు పెంపుడుతల్లులగుచును, వయస్యలై=కొందఱుచెలికత్తెలగుచును, ని. 'ఆళి స్సఖీ వయస్యా చ' అని అ.) అతివన్=గిరికాదేవిని, ప్రొతురనుదినంబున్=ప్రతిదినమును సంరక్షణము చేయుచుందురు.

ఈ చెప్పుటవలన గిరికాదేవి, హంసనడకలవంటినడకలుగలదియును జిలుకపలుకులవంటి పలుకులుగలదియును దుమ్మెదలయొక్క గానమువంటి గానముగలదియును నెమిళ్లయొక్క నాట్యముగలదియును నాయెనని భావము. ఈపద్యపు పెద్దపాదములన్నియుం బాదార్థముక్తపదగ్రస్తములు గలవిగాఁ జెప్పఁబడెను. శుద్ధాంతమనభార్యయని వ్యవహరించుట కలదు.

ఉ. సంతసమొందినే నపుడు శాపజలంబులు పారఁజల్లివే
దాంతవచో మహోపనిషదర్థమయిన్ శుభరూపవృద్ధసీ
మంతిని కాశికానగరమధ్యనివాసిని విశ్వనాథుశు
ద్ధాంతము డాయఁబోయితిఁ బ్రియంబును భక్తియునుం దలిర్పఁగన్. భీమఖండము-ద్వితీ. ఆ.
సిద్ధాంతంశూలపాణి శుద్ధాంతం-ఆర్యాశతకము.

మ. వెలఁదుల్ దానును గూఢరత్నసికతా◆న్వేషంబుఁ గావించుచుం
జెలి బాల్యంబున నిక్కువల్ గనకయుం◆ జే సాచి యాత్మప్రసూ
పులినోర్విన్ మణు లెందు నేనిఁ గొని రా◆ బోటుల్ భళీ తల్లి ని
న్గెలిపించెన్ సిరికల్మి నంచు నగుచుం◆ గ్రీడింతు రబ్బాలతోన్. 29

వెలఁదుల్దానును = చెలికత్తెయలును దానును, గూఢరత్నసికతాన్వేషంబుగావించుచున్ = గూఢరత్నమనఁగా బాలికలయొక్క క్రీడావిశేషము. అనఁగా నొకవిధమయిన యాట.

(ఇందుకు శ్లో. 'రత్నాదిభిర్వాలుకాదౌ గుప్తైర్ద్రష్టవ్యకర్మభిః, బాలికాభిఃకృతా క్రీడానామ్నా గూఢమణిస్మృతా' అనియున్నది గనుక నిసుక కుప్పలుచేసి యందొక కుప్పయందుఁ జెలికత్తెలు గిరికాదేవికిఁ దెలియకుండునట్టు లొకరత్నము లోఁగా నుంచుటయును గిరికాదేవి యెద్దియేనియును నొకకుప్ప పట్టుకొని యందు వెదకిన నందురత్న మెప్పుడు కనుపడుచున్నదో యప్పుడు గిరికాదేవి గెలిచినట్లును నంతపర్యంతము గెలుపు లేనట్టును నీప్రకారముగా నొకయాట యాడుచు.)

చెలి=గిరికాదేవి, బాల్యంబునన్=చిన్నతనంబుచేత, ఇక్కువల్గనకయున్ = దాఁచినచోట్లు కనుపఱచుకొనఁజాలక పోయినప్పటికిని, చేసాచి = చెయ్యిచాపి, ఆత్మ = స్వకీయమయిన, ప్రసూ= తల్లియైన శుక్తిమతియొక్క, (ని. 'జనయిత్రీ ప్రసూర్మాతా జననీ' అని అ.) పులినోర్విన్=ఇసుకతిన్నెలుగలచోట, మణులెందునేనిఁ గొనిరాన్ = రత్నములెక్కడఁబట్టిన నక్కడనుండి తీసికొనిరాఁగా, బోటులు=చెలికత్తెలు, భళీ = సెబాసు, తల్లి=నీతల్లియైన శుక్తిమతి, సిరికల్మిన్=రత్నసంపదలు గలుగుటచేత, నిన్గెలిపించెన్=నిన్ను గెలిపించెను, అంచు నగుచున్=అనిపలికి నవ్వుచు, అబ్బాలతోన్= ఆగిరికతోడ, క్రీడింతురు=ఆటలాడుచుందురు. అనఁగా నీచెప్పుటచేత శుక్తిమతీనదియందలి యిసుకలో నెక్కడఁజూచిన నక్కడనెల్లను నానావిధ రత్నము లుండునని తాత్పర్యము. ఆటయందు గిరిక

నైపుణ్యముఁ జూపఁజాలకపోవుట బాల్యమువలననే; చేయిచాచుట బాలికాసహజమగు ముగ్ధభావము నకు సూచన. మాతృసహాయమున గిరిక గెలుచుటఁ జూచి తల్లిగెలిపించెననియు నదృష్టవంతురాలవు గావున విజయము సాధ్యమయ్యెనని చెలిమికత్తెలు పలుకుచు నింకను నాయమతో నాడు చుండుదురు. గిరికాక్రీడనము సవయస్యల కుత్సాహకరముగ నుండెనుట.

వరుసగ నామకరణము శిశురక్షణము తప్పటడుగులు వేయుట యాటలాడుట లోనగు బాల్య విశేషములు వరుసఁగఁ జెప్పఁబడెను.

చ. గురుసవిధప్రదేశమునఁ • గోమలకల్పకపుష్పధూళిచే
ధరసుత బొమ్మరిల్లిలిపి • తన్మృదుపల్లవపాత్రపంక్తిఁ గే
సరములు ఖాద్యము ల్మధుర•సంబు ఘృతంబు ప్రసూనపుంజ మో
గిర మని పెట్టి నన్నియు స•ఖీతతి కట్టివ యాఁ బ్రియంబునన్. 30

గురు=తండ్రియైన కోలాహల పర్వతునియొక్క, సవిధప్రదేశమునన్=సమీపస్థలమందు, (ని. 'సదేశాభ్యాస సవిధ సమర్యాద సవేశవత్' అని అ.) కోమల = మృదువైన, కల్పక = కల్పవృక్ష సంబంధమయిన, పుష్పధూళిచేన్=పుష్పాడిచేత, ధరసుత=పర్వతపుత్రియైన గిరికాదేవి, బొమ్మరిల్లిలిపి= బొమ్మరిల్లుగట్టి, తత్=ఆ కల్పకవృక్షముయొక్క. మృదు=కోమలమయిన, పల్లవ=చిగురుటాకుల నెడు, పాత్రపంక్తిన్ = పళ్లెరములయొక్క బంతియందు, కేసరములు ఖాద్యములు = కింజల్కములను భక్ష్యములనియు, మధురసంబుఘృతంబు=మకరందమును నెయ్యి యనియును, ప్రసూనపుంజమోగిర మని = పుష్పసముదాయము నన్నమనియు, పెట్టన్=వడ్డింపఁగా, సఖీతతికిన్=చెలికత్తియలయొక్క సమూహమునకు, అన్నియున్=ఆ వడ్డించినవన్నియును, ప్రియంబునన్=ప్రీతిచేత, అట్టివయాన్ = భక్ష్య ఘృతాన్నములే యవును. అనఁగాఁ గలవృక్ష ప్రభావముచే నారీతిగా నవుననుట. ఇందుగుజ్జ నగూడులు వండుటయను క్రీడావిశేషము చెప్పఁబడినది. ఈక్రీడావిశేషమునుబట్టి గిరిక కించుక ప్రాయమువచ్చినదని తెలియును. గిరిక నదీపులినములనువదలి సమీపస్థమగు శైలముల చెంతకాట లాడఁ బోవసాగెనని భావము వయోనుకూలములగు క్రీడావిశేషములు వరుసగాఁ జెప్పఁబడు చున్నవి.

ఉ. పంకజపాణిశంఖపరి•భావకకంధరఁ దల్లి యేలకో
సంకులు గట్టె నంచుఁ గులశైలసుతాగ్రణి పాయఁ ద్రోచి ర
త్నాంకితహార ముంప బరు • వానునా బిడ్డ కి వేల కర్కశా
లంకృతు లంచు హాల్లకక•లాపము లుంచు నదీలలామయున్. 31

పంకజపాణి = పద్మములవంటి హస్తములుగల గిరికాదేవియొక్క, శంఖపరిభావక కంధరన్= శంఖ తిరస్కారకమైన కంఠమందు, (ని. 'అనాదరః పరిభవః పరిభావస్తిరస్క్రియా, రీఢా వమాన నావజ్ఞావహేళనమసూర్క్షణమ్' అని అ.) తల్లి=తల్లియైన శుక్తిమతి, ఏలకో సంకులు గట్టెనంచున్= ఎందుకో ఆకో శంఖముల గట్టినదియని, అనఁగా శంఖమును దిరస్కరించిన కంఠమందు శంఖములను భూషణార్థముగాఁ గట్టుట యయుక్తమనిభావము. కులశైలసుతాగ్రణి=కులపర్వత కుమారశ్రేష్ఠుఁ డైన కోలాహలుఁడు, పాయఁద్రోచి = ఆశంఖములను దీసివైచి, రత్నాంకితహారముంపన్ = రత్న

చిహ్నితమయిన హారము వేయఁగా, బిడ్డకున్ = కూఁతునకు, బరువానునో=భారమగునేమో, ఇవేల కర్కశాలంకృతులంచున్=ఇవెందుకుఁ గఠినపుసొమ్ములని పలుకుచు, నదీలలామయున్ = శుక్తిమతియును, హల్లక=ఎఱ్ఱగలువలయొక్క, (ని. హల్లకంరక్తసంధ్యకమ్' అని అ.) కలాపములు=సొమ్ములను, ఉంచున్ = అలంకరించును. గిరికతండ్రి శైలకులాగ్రణియుఁ దల్లి నదీలలామయు ననుటచే నాభిజాత్యము సూచితము. కర్కశాలంకృతులఁ దొలఁగుట సౌకుమార్యాతిశయము సూచితము. హల్లక కలాపము లలంకరించుటవలనఁ బుష్పకోమలావయవములకుఁ బూవులే యలంకారములగు నని భావము.

మ. అనుఁగుంగ్రీడల నెల్లవారలకు ని ♦ ట్లల్లారుముద్దైనకూఁ
తునకున్ వాహిని వాణిఁ దాల్చుసుకవి♦స్తోమంబు రప్పించి త
ద్ఘనవిద్యామహిమ ల్కరామలకము ♦ ల్గావించె నాత్మీయనూ
తనపద్మోపచయం బశేషమును ద♦త్పాత్రంబు గావించుచున్. 32

అనుఁగుంగ్రీడలన్ = ప్రియకరమైన యాటలచేత, ఎల్లవారలకు=సమస్తులకును, ఇట్లు=ఈ ప్రకారముగా, అల్లారుముద్దైన = గారాబముగానున్న, కూఁతునకు = కూఁతురైన గిరికాదేవికి, కూఁతుశబ్దపు ప్రథమయందుఁదప్ప రువర్ణకము తక్కిన విభక్తులయందు రాదు. కూఁతురులు; కూఁతుళ్లు, కూఁతురునకున్, కూఁతుళ్లకున్, మొదలగు ప్రయోగంబులు సత్ప్రబంధములయందు మృగ్యంబులు. వాహిని = శుక్తిమతి, వాణిఁదాల్చు = సరస్వతిని వహించుచున్న అనఁగా విద్వాంసులైన, సుకవిస్తోమంబున్ = సత్కవులయొక్క సమూహమును, రప్పించి=పిల్వనంపించి అనియర్థము. వాణిఁదాల్చు = మధురవాక్యములను వహించుచున్న యనియైనను, సరస్వతీదేవిని వాహనములై వహించుచున్న యని యైనను జెప్పవలయును. సుకవిస్తోమంబున్=కవులనఁగా నిక్కడ జలపక్షులు, సుకవులనఁగా జలపక్షిశ్రేష్ఠములైన రాజహంసలు, వానియొక్క సమూహమును, రప్పించి యని యర్థాంతరము. తత్=ఆవిద్వత్కవులయొక్క, ఘనవిద్యామహిమలు=ఘనమయిన విద్యా ప్రభావములను, కరామలకముల్గావించెన్=కరతలామలకము లగునట్టులుగా అనఁగా సర్వము బోధపడునట్టులుగాఁ జెప్పించెనని యర్థము. ఆరాజహంసలయొక్క మధురవాక్యరూపములైన విద్యాప్రభావములను నేర్పించెనని యర్థాంతరము. గిరికాదేవి పద్మినీజాతిస్త్రీ గనుకఁ బద్మినికి హంసపలుకు లర్హములని విచారింపవలయును.

పద్మినీజాతి లక్షణము.

శ్లో. 'వ్రజతిమృదుసలీలా రాజహంసీవతన్వీ త్రివళిలళితమధ్యా హంసవాణీసువేషా,
మృదుశుచిలఘుభుక్తే మానినీగాఢలజ్జా ధవళకుసుమవాసావల్లభా పద్మినీస్యాత్'

అనియున్నది. మఱియుం గళాశాస్త్రమున సీసభాగము.

'రాజీవగంధి సద్రాంకేందుబింబాస్య నీలోత్పలశ్యామ నిర్మలాంగి,
సద్గుణచారిత్ర సత్యవ్రతాచార తరుణ కురంగాబ్జధవళనేత్ర,
పాటలాధరరక్తపల్లవమృదుపాణి గానవిద్యాలోలదానవిభవ,

హంసభాషిణిమణిహార విభూషితమదమదావళయానమధురభుక్తి,
విమలవస్త్రంబుఁ బద్మినివేడ్కఁబట్టు'

అని చెప్పంబడియున్నది. ఆత్మీయ=తనసంబంధమైన, నూతన=అభినవమైన, పద్మోపచయంబు=పద్మయనఁగా లక్ష్మి, (ని. 'క్రమాత్సఙ్ఖ్యాహస్తిబిన్ద్వోః ర్నిధి వ్యూహాన్తరాహిషు, అబ్జే శార్ఙ్గి శ్రియోః పద్మః క్లీబే పుంస్యస్త్రియాం స్త్రియామ్.' అని అ.) లక్ష్మీసమృద్ధిని – అనఁగా సంపత్సమృద్ధిని, అశేషము=సమస్తంబును, తత్ప్రాప్తంబు గావించుచున్ = ఆసత్కవిప్రాప్తముగాఁ జేయుచును అని యర్థము. తన సంబంధమైన నూతనకమలస్తోమమును రాజహంసప్రాప్తముగాఁ జేయుచునని యర్థాంతరము. తద్ఘనవిద్యామహిమ లక్ష్మీరామలకము ల్గావించెనని సంబంధము. వాణిదాల్పు సుక విస్తోమము గిరిక కుపాధ్యాయులగుటచే వివిధవిద్యలను బోధించుటకు, బెక్కండ్రుకవులను శక్తిమతి నియోగించెనని భావము. కావుననే సర్వవిద్యలు అరచేతియుసిరికపండువలె సాధ్యమయ్యెననుట. రప్పించెనుటచే విద్యాబోధమునకు శక్తిమతి యుత్తమోత్తములను వారివారి ప్రఖ్యాతులవిని రావించెనని యాశయము. వారిశ్రమకుఁదగినట్లు సంపదనంతయు వారికి స్వాధీనపఱచుచుండెననుటచే స్వయముగఁ గుమారివిద్యాపరీక్షజేసి యెప్పటికప్పుడె సత్కరించుచుండెనని భావము. నదియంచల రప్పించి వానికిఁ దనయందలి తమ్మిసిరి కైవసముచేసి నడబెడంగు నేర్పించెనని యర్థాంతరము.

సోమకవిమతమున అలంకారము. అభేదాతిశయోక్తి.

శబ్దశక్తిమూలధ్వని యనియుఁ బ్రకృతాప్రకృతాశ్లేషమని కొందఱు.

ఉ. అన్నగశేఖరుండును మహామణికూటసమర్పణంబుచేఁ
గిన్నరకోటుల న్నిలిపి గేయవిశారదఁ జేసెఁ గూఁతునుం
గిన్నర మీటు వీణఁ బలికింపఁగ గీతములుం బ్రబంధము
ల్వన్నియఁ బాడఁ జెప్ప ననివారితచాతురి గల్గునట్లుగాన్. 33

అన్నగశేఖరుండును=పర్వతశిఖామణియైన యాకోలాహలుఁడును, మహామణికూట సమర్పణంబుచేన్=కూటశబ్దము రాశియందును బర్వతశృంగమందును వర్తించుచున్నది గనుక, మహత్=అధికములయిన, మణికూట=రత్నరాసులయొక్క, సమర్పణంబుచేన్=ఈవిచేత నని యర్థము. మహత్తరములయిన మణిమయ శృంగములయొక్క సమర్పణంబుచేతనని యర్థాంతరము. కిన్నరకోటులన్నిలిపి=కిన్నరులనఁగా దేవయోనివిశేషులు వారిని గొలువుంచి, కూఁతునున్=కొమార్తెయైన గిరికాదేవిని, కిన్నరమీఁటన్=రెండుతీఁగెలుగట్టి వాయించునట్టి కిన్నరమీటుటకును, వీణఁ బలికింపఁగన్=వీణను వాయించుటకును, గీతములుం బ్రబంధము ల్వన్నియఁ బాడన్=గీతప్రబంధములు శృంగారముగాఁ బాడుటకును, చెప్పన్=మఱియొకరికి శిక్ష చెప్పుటకును, అనివారితచాతురి గల్గునట్లుగాన్=అడ్డములేని చాతుర్యము గలుగునట్లుగా, గేయ=సంగీతవిద్యయందు, విశారదఁ జేసెన్=ప్రగల్భ యగునట్లుగాఁ జేసెను.

అనఁగా గిరికాదేవిని పూర్వపద్యములోఁ దల్లి సాహిత్యకవిత్వ విద్యాప్రవీణురాలిగాఁ జేయించెననియును నీపద్యములోఁ దండ్రి సంగీతవిద్యాప్రవీణురాలిఁగా జేయించెననియును దాత్పర్యము. ఈరెంటుపద్యములయందును నభేదరూపాతిశయోక్త్యలంకారము.

ప్రబంధలక్షణము సంగీతచూడామణియందిట్లు చెప్పఁబడెను.

శ్లో. చతుర్భి ర్ధాతుభి ష్షడ్భి శ్చాంగైర్యస్మాత్ప్రయుజ్యతే
తస్మాత్ ప్రబంధః కథితః.

తల్లి పద్మోపచయము సమర్పించి సాహిత్యవిద్యచెప్పింపఁ దండ్రి మణిసమూహములు సమర్పించి కిన్నరులచే సంగీతము నేర్పించెను. శిఖరములు కిన్నరనివాసయోగ్యములగుటచేఁ గిన్నరకోటులు బోధకులగు నవకాశము చిక్కినది. సాహిత్యము కరతలామలకమైనట్లుగిరికకు సంగీతమున ననివారితచాతురి కలిగెను. దీనిచే గిరికసంగీతసాహిత్యములలో నేర్పరియని తెలియును.

శా. వీణావాదనవేళలన్ ఘుమఘుమా•విర్భూతి నింపన్ జగ
త్ప్రాణాచంచలతైలశూన్యనవదీ•పశ్రేణి కాపాదియై
రాణింపన్ ముఖలక్ష్మికిన్ ముకురమై • రంజిల్ల లేఁబట్టికిన్
మాణిక్యాయతనం బొనర్చె గిరి యా•త్మశ్రీప్రభావంబునన్. 34

వీణావాదనవేళలన్=వీణవాయించు సమయములయందు, ఘుమఘుమావిర్భూతి నింపన్=ఘుమఘుమయనెడు ఘుంకారముయొక్క యావిర్భావమును నిండించుకొఱకును, జగత్ప్రాణ=వాయువువలన, అచంచల=చంచలములుగాని, తైలశూన్య=తైలాపేక్షలేని, నవ=నూతనములయిన, దీప=దీపములయొక్క, శ్రేణికిన్=పంక్తికి, ఆపాదియయి=సంపాదకమయినదై, రాణింపన్=ప్రకాశించుటకొఱకును, ముఖలక్ష్మికి ముకురమయి రంజిల్లన్=ముఖశోభకు అనఁగా ముఖము గనుపడుటకు నద్దమయి యొప్పుచుండెడు కొఱకును, లేఁబట్టికిన్=లేఁతప్రాయముగల ముద్దుకూఁతునకు, గిరి=కోలాహలుఁడు, ఆత్మశ్రీప్రభావంబునన్=తనయొక్క సంపత్ప్రభావముచేత, మాణిక్యాయతనంబొనర్చెన్=పద్మరాగమణి మయమయిన గృహమును గల్పించెను.

గిరిక వీణాదికములతో గానము చేయుచుంటకుఁ దండ్రి తనసంపత్ప్రభావమున మణిగృహము నిర్మించెను. అందుఁ జెక్కఁబడిన పద్మరాగములు గాలికారిపోని దీపములుగనున్నవి. ఆమందిరము గిరికముఖలక్ష్మికి దర్పణముగానున్నది. రత్నములు పాషాణజాతులగుటచేఁ బ్రతిధ్వనించుటవలన గానము ఘుమాఘుమావిర్భూతి నించుచుండె నని భావము. ముఖలక్ష్మియనుటచే ముఖసౌందర్యాతిశయము సూచితము.

ఉ. ఆనగజాత యీతరుణి • యావనదేవత లీవయస్యలా
మానవనాథపాదనఖ•మర్దితభూధర మీనగోత్తమం
బీనగమౌళిపై నెసఁగు • నీమణిధామము లీకొలంకు లీ
కోనలు నీనికుంజములు• కుంజరయానవిహారరంగముల్. 35

ఆనగజాత యీతరుణి=ఆకోలాహలాద్రివలన జన్మించినదియ యీచిన్నది. ఆవనదేవత లీవయస్యలు=ఆవనదేవతలే యీచెలికత్తియలు, ఆమానవనాథ=ఆవసురాజుయొక్క, పాదనఖ=కాలిగోటిచేత, మర్దిత=పీడింపఁబడిన, భూధరము=పర్వతమే, ఈనగోత్తమంబు=ఈపర్వతశ్రేష్ఠము, ఈనగమౌళిపైనెసఁగు=ఈపర్వతశ్రేష్ఠముపై నొప్పుచున్న, ఈమణిధామములు = ఈపద్మరాగమణిమయములయిన గృహములును, ఈకొలంకులు=ఈతామరగుంటలును, ఈకోనలు=ఈలోయలలోనున్న వనప్రదేశ

ములును, ఈనికుంజములు=ఈపొదరిండ్లును, (ని. 'నికుఞ్జ కుఞ్జౌ వాక్లీబే లతాదిపిహితోదరే' అని అ.) కుంజరయానవిహారరంగములు=ఏనుఁగు నడుపులవంటి నడుపులుగల గిరికాదేవియొక్క విహారస్థలములు. (ని. 'మతఙ్గజో గజో నాగః కుఞ్జరో వారణః కరీ' అని అ.)

తరుణికుంజరయానయనువిశేషణమువలన గిరికా ద్వితీయయౌవనము సూచితము. ద్వితీయ యౌవన ముపభోగ్యార్హము. ద్వితీయ యౌవనలక్షణము చనుగవయొక్కయుఁ బిరుదులయొక్కయు బ్రేగుచే మందముగ నడుచుటయుఁ దరుణీపదప్రయోగము సూచించును.

క. అని వనిత యుపరిచరవసు, జననాయకుకథయుఁ గన్యజననాగతియున్
వినయంబున వినుపింపఁగ, విని యమ్ముని సమ్మదాబ్ధివీచికఁ దేలెన్. 36

అని=ఈప్రకారముగా, వనిత=మంజువాణి, ఉపరిచరవసు జననాయకు కథయున్=ఉపరిచర నామముగల వసురాజుయొక్క వృత్తాంతమును, కన్యజననాగతియున్ = గిరికాదేవియొక్క జన్మపు రాకయు, వినయంబున వినిపింపఁగన్=నమ్రభావముచేత వినుపింపఁగా, అమ్ముని=ఆకపటయతి, విని= ఆలకించినవాఁడై, సమ్మదాబ్ధి=సంతోషసాగరముయొక్క, (ని. 'ముత్ప్రీతిః ప్రమదోహర్షః ప్రమోదా మోద సమ్మదాః' అని అ.) వీచికన్=తరంగమందు, (ని. 'భంగ స్తరంగ ఊర్మిర్వా స్త్రియాం వీచిః' అని అ.) తేలెన్=ఓలలాడెను.

తనకథయుఁ గన్యకాజననకథ విని వసురాజు మిగుల నానందించెనని భావము.

మ. లతికాసంవృతగాత్రుఁడై నిజకథాలాపంబు లాలించుభూ
పతి యచ్చో హితునేర్పు బోటివచనప్రాగల్భ్యముం గన్యయు
న్నతగోత్రోద్భవవైభవంబును మదిన్ వర్ణించి యూహించె ధ
న్యత నాశుక్తిమతీఝరీజనితరత్నం బాత్మవిత్తంబుగాన్. 37

లతికా=తీఁగెలచేత, సంవృత=లెస్సగా నావరింపఁబడిన, గాత్రుఁడై=దేహముగలవాఁడై- అనఁగాఁ దీఁగెలచాటునఁ గనుపడక యున్నవాఁడై, నిజకథాలాపంబు లాలించు=తనయొక్క వృత్తాంతవాక్యములను వినుచున్న, భూపతి=వసుమహారాజు, అచ్చోహితునేర్పు=అక్కడ నర్మసఖునియొక్క చాతుర్యమును, బోటి వచనప్రాగల్భ్యమున్=మంజువాణియొక్క వాక్ప్రౌఢిమయును, కన్యయున్నత గోత్రోద్భవ వైభవంబును=గోత్రమనఁగా పంశంబును బర్వతంబును గనుక ఆచిన్నదాని యుత్తమ వంశసంభవముయొక్క విభవమునని యర్థము. ఉత్తుంగపర్వతమువలని సంభవమని యర్థాంతరము. మదిన్వర్ణించి = తనమనస్సునందు మెచ్చుకొని కొనియాడి, ధన్యతన్ = కృతార్థతచేత, ఆశుక్తిమతీ ఝరీ జనితరత్నంబు = ఆ శుక్తిమతీనదివలన జన్మించిన కన్యారత్నమును, ఆత్మవిత్తంబుగాన్=తన సొమ్ముగా, ఊహించెన్=భావించెను. అనఁగా శుక్తిమతీనది తనయధీనమయి యుండినదిగనుక దాని యందుఁ బుట్టిన యోగ్యవస్తువు లన్నియును దనసొమ్ములగుటచేత గిరికాదేవియును దనసొమ్మని యూహించెనని తాత్పర్యము.

కన్యయున్నతగోత్రజననము చెలిమికత్తె మాటలనేర్పు మిత్రునినైపుణ్యము తలంచినంత గిరికను తనధనముగా వసురాజు భావించెనని భావము. హితుఁడు నేర్పుచే గిరికను సమకూర్పఁగలఁడు. చెలికత్తె నేర్పరిగాన నెటులేని యనుకూలపఱుపఁగలదు. గిరికయాభిజాత్యము పరిణయయోగ్య

ముగాన వసురాజు గిరిక నాత్మవిత్తముగ భావించెను. తనరాజ్యములోనున్న శుక్తిమతీజనితరత్నములు తనవిత్తములె. "రత్నహారీతు పార్థివః" యన్నట్లు ప్రశస్తవస్తువులన్నియు రాజువెగాన తనవిత్తమని రాజూహించెను.

శా. మాయామౌనియు నంతఁ గొంతతడ వాత్మధ్యానవిజ్ఞానము
ద్రాయత్తంబున నున్నయట్లలరి కాంతారత్నముం బల్కు లే
మా యే మాంతరదృష్టిఁ జూచితిమి భామాభావిభాగ్యోదయం
బీయబ్జాననఁ బెండ్లియాడు వసురాజేంద్రుండు వాలాయమున్. 92

మాయామౌనియున్=కపటమునీశ్వరుఁడును, అంతన్=ఆమీఁదట, కొంతదడవు=కొంతసేపు, ఆత్మధ్యాన=పరమాత్మధ్యానమందలి, విజ్ఞానముద్రా=చిన్ముద్రయొక్క, ఆయత్తంబునన్=అధీనతచేత, ఇది భావప్రధాననిర్దేశము. ఉన్నయట్లు=ఉన్నవానివలె, అలరి=ఒప్పినవాఁడై-అనఁగాఁ జిన్ముద్రపట్టి యోగసమాధియందు నున్నవానివలె నుండి యనుట. కాంతారత్నముంబల్కున్=మంజువాణినిగూర్చి పలికెను. ఏమనియనిన, లేమా=ఓమంజువాణీ, భామా=గిరికయొక్క, భావి=భవిష్యత్కాలమందలి భాగ్యోదయంబు=అదృష్టముయొక్క యున్నతిని, ఏమాంతరదృష్టిఁ జూచితిమి=మేము జ్ఞానదృష్టిచేతఁ జూచితిమి. అస్మచ్ఛబ్దమునకు బహువచనమున 'ఏతయోర్బహుత్వేమః' న. అనుసూత్రముచే మువర్ణకము రావలసియుండియు, ('ప్రథమాయామేదస్మదః' న.) అనుసూత్రముచేఁ బ్రాతిపదికమయిన నా అను నక్షరమునకు సర్వాదేశముగా ఏకారమువచ్చినది. గాన ఏము అని యయినది. వసురాజేంద్రుండు=వసురాజశ్రేష్ఠుఁడు, వాలాయమున్=సిద్ధముగా, ఈ యబ్జాననఁ బెండ్లియాడున్=ఈగిరికాదేవిని వివాహము చేసికొనఁగలఁడు అని పలికెనని సంబంధము.

మునికొంచెము సేపు ధ్యానముద్రతో నున్నటులనటించి నేనంతరంగదృష్టితోఁ గాంచితిని. ఈ బాలికను వసురాజేంద్రుఁడు పెండ్లియాడునని చెలికత్తెలకుఁ దెలిపెను.

తే. రమణి యిట్టి కాంతాలోకరత్న మమరఁ, జేసినవిధాత వసువుతోఁ జేర్పఁడేని
నాతనినిసర్గమధురసర్గానుభావ, మఖిలభువనప్రసాధనం బగుట యెట్లు. 93

రమణీ=ఓమంజువాణీ, ఇట్టి=ఇటువంటి, కాంతాలోకరత్న మమరఁజేసినవిధాత = స్త్రీజనరత్నమయిన గిరికాదేవిని నొప్పిదమగునట్టులుగా సృజించిన బ్రహ్మ, వసువుతోఁ జేర్పఁడేనిన్=వసురాజుతోఁ గూర్పకపోయినట్టు లాయెనేని అని యర్థము. కాంత=మనోహరమయిన, ఆలోక=ప్రకాశముగల, రత్న మమరఁజేసిన విధాత=మాణిక్యము నొప్పిదమగునట్టులుగాఁ బుట్టించిన బ్రహ్మ, వసువుతోఁ జేర్పఁడేనిన్=కాంచనముతోఁ గూర్పకపోయినట్టు లాయెనేని అని యర్థాంతరము. అతని=ఆబ్రహ్మయొక్క, నిసర్గ=స్వభావముచేత, మధుర సర్గానుభావము=మంజులమైనసృష్టి ప్రభావము. అఖిల భువనప్రసాధనం బగుట యెట్లు=సకల జగదలంకార మగుట యేరీతిగానని యర్థము. అనఁగాఁ గాసేరదని భావము.

ని. 'అనర్ఘ్యమపి మాణిక్యం హేమాశ్రయ మపేక్షతే' అని యున్నది గనుక మాణిక్యము బంగారముతోఁ జేరక యలంకారము కాదని చెప్పినాఁడు. కావున నీకాంతా(లోకరత్నము) వసువుతో (బంగారముతో) బ్రహ్మ చేర్పఁడేని స్వభావమధురమగు బ్రహ్మసర్గప్రతిభ వ్యర్థమగును. ఉత్తమవస్తు

వును ఉత్తమవస్తువుతోఁ గూర్చుటయే సమస్తజగదలంకారము. నేర్పరియగు బ్రహ్మ గిరికను వసురాజుతోఁ జేర్చుననుటకు వేఱు తార్కాణలవసరములేదు. తనశక్తి జగదలంకారము గావించుకొనుటకేని యిరవురసమకూర్చునని భావము. ఆతని నిసర్గ అను-చో 'లోపశ్చవిభక్త్యాదే శ్శబ్దేషుస్యా త్సమాసకాక్షేషు' న. అనుసూత్రముచే యొక్క యనువిభక్తికి లోపమువచ్చినది.

చ నెలఁతలలోఁ ద్రిలోకనుత నిర్మలరూపకలాపధన్య యీ
కులగిరిరాజకన్య నృపకోటులలో వసురాజు మేటి య
య్యలఘుఁడు నీలతాంగియు లతాంతముఁ దావియుఁ బోలి యేకమై
వెలయఁగఁ గన్నులారఁ గను వేడుక వేగమ మీఱు గల్గెడిన్. 40

నెలఁతలలోన్=స్త్రీలలోపల, ఈకులగిరిరాజకన్య = ఈకోలాహలపర్వత రాజపుత్రియయిన గిరికాదేవి, త్రిలోకనుత=లోకత్రయముచేతను కొనియాడఁబడిన, నిర్మల = కళంకరహితమయిన, రూప=రూపమనఁగా, (శ్లో. 'ఆలేప్యారోప్య నిక్షేప్య బంధనీయై రభూషితమ్, యద్భూషిత మివా భాతి తద్రూప మితికథ్యతే.') అని యున్నదిగనుక నాప్రకారముగా వస్త్రాభరణ గంధమాల్యములచేత నలంకరింపఁబడక యలంకరింపఁ బడినట్లుండుట-అట్టిరూపమనెడు, కలాప=భూషణముచేత, ధన్య= కృతార్థురాలైనది. ఇక్కడ రూపంబ యలంకారము గాఁగలది గనుక నలంకారాపేక్ష లేనిదని స్ఫురించుచున్నది. నృపకోటులలోన్=రాజసమూహములలో, వసురాజుమేటి=వసురాజు సర్వోత్తముఁడుకాఁబట్టి, అయ్యలఘుఁడున్=ఘనుండైన యావసురాజును, ఈలతాంగియున్=ఈగిరికాదేవి యును, లతాంతముఁ దావియుఁబోలి=పుష్పంబును బరిమళంబును నేలాగున నుండునో యాలాగున, ఏకమయి=భేదములేక, వెలయఁగన్=ప్రకాశింపఁగా, కన్నులారఁగను వేడుక=కన్నులనిండఁ జూచెడు వేడుక, వేగమమీఱుఁ గల్గెడిన్=మీఱు శీఘ్రముగాఁ గలుగఁబోవుచున్నది. (వ్యా. 'నెలఁతలలోన్, నృపకోటులలోన్') అను నీరెండుపదములను నిర్ధారణోద్భవషష్ఠీవిభక్త్యంతరూపములు. దీనికిం బ్రమాణము. 'లోపల నిర్ధారణోద్భవాషష్ఠీ'అని నన్నయభట్టీయము. లోపలపర్ణకము లోవర్ణకమున కుప లక్షణము.

గిరిక ద్రిలోకనుతనిర్మలరూపకలాపధన్యగాన స్త్రీలలో నుత్తమురాలు, వసురాజుమేటి, అల ఘుఁడు గాన నతఁడు పురుషులలో నుత్తముఁడు. తావిచేఁ బూవువన్నె కెక్కినట్లు వసురాజును జెట్టఁ బట్టి గిరికయుఁ బూవిచేఁదావి వన్నె కెక్కినట్లు గిరికను జెట్టఁబట్టి వసురాజు నేకీభావముగఁ దావినిబూ వును విడదీయరానటు లేకాభిప్రాయముతో నలరగలరనిభావము. వేగముగ యీవేడుక చేకురుననుట వసురాజుసమీపమున నుండెనని సూచించుట. అలం. ఉపమ. సమము.

వ. అనిన నమ్మందయాన సందియంబున ని ట్లనియె. 41

అనినన్=కపటయతి యీలాగని పలుకఁగా, అమ్మందయాన=ఆమంజువాణి, సందియంబునన్=సందేహముచేత, ఇట్లనియెన్=ఈలాగనిపలికెను.

ఉ. ఇన్నగరంబుఁ జూడ వసుధేశ్వరుఁ డెన్నఁడు వచ్చు వచ్చి యీ
క్రొన్ననతీవజొంపములకోనకు నెన్నఁడు డిగ్గు డిగ్గి యీ
కన్నియఁ గన్నులారఁ గుతుకంబున నెన్నఁడు గాంచుఁ గాంచి తా
నెన్నఁడు గారవించుఁ జెలు లెన్నఁడు గాంతు రభీష్టసంపదల్. 42

ఇన్నగరాజుఁ జూడన్=పర్వతశ్రేష్ఠుఁడయిన యీకోలాహలునిఁ జూచుటకు, వసుధేశ్వరుఁ డెన్నఁడు వచ్చున్=వసురా జెన్నఁడు విచ్చేయును, వచ్చి=విచ్చేసినవాఁడయి, ఈ క్రొన్ననతీవ జొంపముల కోనకు నెన్నఁడు డిగ్గున్=క్రొత్తపూఁదీఁగె గుంపులుగల యీకోనకు నెన్నడు దిగును. తే. 'తీఁగె తీవియ లత కూన తీవ యనఁగఁ, దనరులతపేళ్లు పూవులు ననలు విరులు, పువ్వులలరులు నాసుమంబులగు సొంబ' అని సాంబనిఘంటువు. డిగ్గి=దిగినవాఁడయి, ఈకన్నియన్=ఈగిరికాదేవిని, కన్నులారన్=నేత్రానంద మగునట్లుగా, కుతుకంబున నెన్నఁడు గాంచున్=హర్షముచేత నెన్నఁడు చూచును. కాంచి=చూచినవాఁడయి, తా నెన్నఁడు గారవించున్=తా నెన్నఁడు మన్నించును. చెలు లెన్నఁడు గాంతు రభీష్టసంపదలు=చెలికత్తియ లిష్టప్రాప్తి నెన్నటికిఁ బొందుచున్నారు. అనఁగా నిది యలభ్యమయిన కార్యముగదా యని భావము. మహారాజగు వసువు పెక్కుక్రీడాశైలములుగలవాఁడు. వన్నిఁటిని వీడి యిట కెప్పుడు వచ్చును. వచ్చెఁగాక యీమహాశైలముననున్న యీ సోదరింటికి అచ్చినఁగదా దర్శనప్రాప్తి. వివిధములగు గిరివిశేషములవదలి యీకన్నెను జూచుట యెటుల సమకూరును. శుభదర్శనోత్సుకలగు చెలిమికత్తెలకోర్కులు తీరుట యెపుడు.

చ. అని జవరాలు వెండియుఁ బ్రి•యమ్మున నమ్మునిఁ జూచి యోతపో
ధనమణి యీలతాంగి వసు•ధావరు నెన్నఁడు చెట్ట వట్టునో
యని యనురక్తిపెంపుమెయి • నాడితిఁ గాక శుభప్రసంగ మం
గనకు నొసంగఁ గొంగుముడి • గాదె భవద్వచనంబు నావుడున్. 43

అని=యిట్లని, జవరాలు=మంజువాణి, వెండియున్ = తిరుగా, ప్రియమ్మునన్=ప్రీతిచేత, అమ్మునిఁజూచి=ఆకపటయతిని వీక్షించి, ఓతపోధనమణి=ఓమునిశ్రేష్ఠుఁడా, ఈలతాంగి=ఈగిరికాదేవి, వసుధావరున్=భూనాయకుఁడయిన వసురాజును, ఎన్నఁడు చెట్టవట్టునోయని=ఎన్నఁడు పాణిగ్రహణము సేయునో కదా యని, అనురక్తిపెంపు మెయినాడితిఁ గాక=అనురాగాతిశయముచేత నంటినిగాని, భవద్వచనంబు=దేవరవారియొక్క వాక్యము, అంగనకున్=గిరికాదేవికి, శుభప్రసంగము=శుభసంగతిని, ఒసంగన్=ఇచ్చుటకొఱకు, కొంగుముడిగాదె=కొంగుముళ్లెగాదా. అనఁగా సిద్ధమయియున్నదియ కాదా యనుట. నావుడున్=అనిపలుకఁగా, ఈపద్యమున వసుధావరుఁ డెన్నఁడు అనుపాఠముఁ జేసి లతాంగిన్ అని ద్వితీయ చేసినచో స్త్రీ, పురుషునిఁ జేపట్టుట యనువ్యుత్క్రమము పోవును. తపోధనమణివాక్యము కొంగుముడి. అనినంతన సాధ్యమగునదనుట. కాని యెన్నఁడు జరుగునో యనుట మునిపైన విశ్వాసమునఁ గాదు. అనురక్తి పెంపుగ 'అతిస్నేహః పాపశంకీ' యన్నటుల స్నేహాతిశయము సంశయములచేటు గావున నిటులంటిని. చెలికత్తియ మునికి క్షమార్పణము చెప్పినది.

Familiarity breeds contempt.

మ. లలనా యీయెలనాఁగఁ బెండ్లి యగు వా•లాయంబు చేదిక్షమా
తలనాథుం డిది నమ్మవేని నిజమం•త్రప్రౌఢి రప్పింతు నా
నల నాసత్యసమానుఁ జూడు మని పం•తం బొప్ప మాయాజపా
కలనాదంభము పూని మౌని దిశ లా•కర్ణించి మజ్ఝా యనన్. 44

లలనా=ఓమంజువాణీ, ఈయెలనాఁగన్=ఈగిరికాదేవిని, చేదిక్షమాతలనాథుండు=చేదిభూమీశ్వరుఁడయిన వసురాజు, వాలాయంబు=సిద్ధముగా, పెండ్లియగున్=వివాహముగాఁగలఁడు. ఇది

నమ్మవేనిన్=ఈమాట నమ్మకపోయినట్టులాయెనేని, నల=నలచక్రవర్తితోడను, నాసత్య=అశ్వినీదేవతలతోడను, (ని. 'స్వర్వైద్యా వశ్వినీసుతౌ, నాసత్యా వశ్వినౌ దస్రా, వాశ్వినేయౌ చ తావుభౌ' అని అ.) సమానున్=సౌందర్యమందు సమానుఁడయిన యీవసురాజును, నిజమంత్రప్రౌఢిరక్షింతున్=నాయొక్క మంత్రప్రభావముచేత రక్షించుచున్నానని యర్థము. రహస్యాలోచన ప్రౌఢిచే రక్షించుచున్నానని యర్థాంతరము. చూఁడుమని=నాసామర్థ్యముచూఁడుమనిపలికి, పంతంబొప్పన్=శపథమొప్పునట్టులుగా, మాయాజప=అబద్ధపుజపముయొక్క, ఆకలనా=చేయుటయనెడు, దంభము పూని=వ్యాజముపెట్టుకొని, (ని. 'కపటో స్త్రీ వ్యాజ దమ్భో పధయ శ్ఛద్మకైతవే, కుసృతి ర్నికృతి శ్శాఠ్యమ్' అని అ.) మౌని=ఆమునీశ్వరుఁడు, దిశలాకర్ణించి=దిక్కులాలించి, మజ్ఝాయనన్=మజ్ఝాయనెడు నాకర్షణోపయోగియయిన శబ్దమును బలుకఁగా.

ఇక్కడ శ్లో. 'సంధానకుశలశ్చేటః' అని యున్నది గనుక సంధానకుశలత్వముచేతఁ గ్రీడాసఖునికిఁ జేటత్వము సిద్ధించుచున్నది.

మ. ఇది సంధింపఁగ వేళ యంచు వసురాజేంద్రుండు నీరంధ్రనీ
రదవారప్రతిసీర వెల్వడినతారాభర్తలీలన్ లతా
చ్ఛదసంఛాదికఁ బాసి నిల్చె నెదుటన్ సారంగరాగభ్రమ
న్మదభృంగీరుతివందిమాగధకథామాధుర్యముం దెల్పఁగన్. 45

ఇది సంధింపఁగవేళయంచున్=ఇది కలియుటకు సమయమని విచారించి, వసురాజేంద్రుండు=వసురాజశ్రేష్ఠుఁడు, నీరంధ్ర=దట్టమయిన, నీరదవార=మేఘసముదాయమనెడు, (ని. 'స్తోమౌఘ నికర వ్రాత వార సఙ్ఘాత సఞ్చయాః' అని అ.) ప్రతిసీర=తెరనుండి, (ని. 'ప్రతిసీరాయ వనికా స్యాత్తిరస్కరణీ చసా' అని అ.) వెల్వడిన=నిర్గమించిన, తారాభర్తలీలన్=చంద్రునివలె, లతాచ్ఛద=తీఁగెలయొక్క యాకులవలన నయిన, సంఛాదికన్=ఆవరణమును, పాసి=వదలి - అనఁగా ముసుకును విడిచిపెట్టి, నిల్చె నెదుటన్ = స్త్రీలయొక్కయెదుట వచ్చి నిలిచెను. ఏలాగుననిన, సారంగ=మగతుమ్మెదలవిషయమయిన, రాగ=అనురాగముచేత, భ్రమత్=తిరుగుచున్న, మద=మత్తుగొనియున్న, భృంగీ=ఆఁడుతుమ్మెదలయొక్క, రుతి = ఝుంకారమే, సారంగరాగ = సారంగనామక రాగమందు, భ్రమత్=సంచారముచేయుచున్న, మదభృంగీరుతి=మదించిన యాఁడుతుమ్మెదలయొక్క నాదమువంటినాదముగలిగిన - ఈరెండర్థములకు నభేదాధ్యవసాయము. వందిమాగధ=గేయములయిన, కథా=చరిత్రలయొక్క, మాధుర్యముం దెల్పఁగన్=మధురభావమును దెలియఁజేయుచుండఁగా నిలిచెనని సంబంధము.

సంధింపఁదగిన వేళయని వసురాజు మాయాముని పంతముచేయఁగనే నిశ్చయించెను. అంతకుమున్ను చివురులతోఁ బెనఁగొన్న తీవగుంపుచాటున వసురాజుండెను. సమయముగనిపట్టి తీవలనిటునటు త్రోసిముందునకువచ్చెను. మేఘములమరుగునుండి బయటికివచ్చినచంద్రునివలె రాజు ప్రకాశించెను. రాజు తీవలఁగదల్చుటచేఁ గోడెతుమ్మెదలపై మరులుకొనియున్న మదించినయాఁడుతుమ్మెదలు ధ్వని చేయసాగెను. ఈధ్వని రాజునకప్రయత్నముగ వంధిమాగధస్తోత్రములయ్యెను.

సీ. తలిరుఁబ్రాయమువాని వలరాజు నలరాజు నలరాజుఁ దెగడుసోయగమువానిఁ
భసిఁడిఛాయలవానిఁ బగడంబుజగడంబు జగడంబు గలమోవిసొగసువానిఁ

దళుకుఁజెక్కులవానిఁ దులకింపుపలుకెంపుపలుకెంపులొలయు నవ్వొలుకువానిఁ
జికిలిచూపులవాని సిరిమించుదొరయించుదొరయించుకాంచనాంబరమువాని
తే. నొఱపుగలవాని మకుటకేయూరహార, కటకకుండలచాకచక్యములవాని
నమ్మహీజానిఁగని లేచి యమితవినయ, సంభ్రమముదోఁప నిలిచి రబ్జాతముఖులు.

తలిరుఁబ్రాయమువానిన్=లేఁతవయస్సుగలిగినవాఁడును, వలరాజున్=మన్మథుని. (గీ. 'మీను మొసలిసిడంబులమేటిచంద, మామయల్లుఁడువలరాజు మరుఁడుఁబచ్చి, కొమరుఁడను పేళ్ళవిలసిల్లుఁగుసుమధన్వి, విగతభవపాశ కాశీనివేశయీశ.' అని యాంధ్రనామసంగ్రహము.) నలరాజున్=నలచక్రవర్తిని, అలరాజున్=ఆచంద్రుని, తెగడు=తిరస్కరించునట్టి, సోయగమువానిన్=చక్కఁదనము గలిగినవాఁడును, పసిఁడిచాయలవానిన్=బంగారపుకాంతివంటి కాంతులు గలిగినవాఁడును, పగడంబు=పగడముయొక్క, జగ=శ్రేష్ఠమైన, డంబు=కాంతితోడ, జగడంబుగల=స్పర్ధకలిగిన, మోవిసొగసువానిన్ = అధరోష్ఠముయొక్క సొగసుగలిగినవాఁడును, జగమనుపదమునకుఁ బ్రయోగము. (గీ. 'జగమెఱుంగుదాని జగమెఱుంగు' అని విజయవిలాసము ప్రథమాశ్వాసమందు ౨౨ వ పద్యము.) తళుకుఁజెక్కులవానిన్ = తళతళమని మెఱయు చెక్కిళ్ళుగలిగినవాఁడును, తులకింపు = సొగసైన, పలుకెంపు=దంతకురువిందములయొక్క, పలు=అపరిమితములైన, కెంపులు=అరుణకాంతులు, (గీ. 'కెంపుతొగరు తొవరు కెంజాయ యెఱుపెట్టి, యనఁగ నరుణకాంతి కాఖ్యలయ్యె'అని యాంధ్రనామసంగ్రహము.) ఒలయు=వ్యాపించుచున్న, నవ్వొలుకువానిన్=నవ్వుచిందుచుండువాఁడును, చికిలిచూపులవానిన్=తేటగలచూపులుగలిగినవాఁడును, సిరిమించుదొర అనఁగా లక్ష్మీదేవిచే నతిశయించుచున్న శ్రీమహావిష్ణువు, ఆయనయొక్క, ఇంచు=న్యూనత్వమును, దొరయించు=పొసఁగఁజేయుచున్న, కాంచనాంబరమువానిన్=బంగారపువస్త్రము గలిగినవాఁడును, అనఁగా విష్ణుదేవుని పీతాంబరమువంటి కాంచనాంబరము గలిగినవాఁడును ననియర్థము.

ఒఱపుగలవానిన్=తేజస్సుగలిగినవాఁడును, మకుట=కిరీటముయొక్కయు, (ని. 'అథమకుటం కిరీటం పున్నపుంసకమ్' అని అ.) కేయూర=భుజకీర్తులయొక్కయు, (ని. 'కేయూర మఙ్గదం తుల్యే' అని అ.) హార=ముత్యాలహారముయొక్కయు, (ని. 'హారో ముక్తావళీ దేవచ్ఛందో సౌ శతయష్టికః' అని అ.) కటక=కడియములయొక్కయు, (ని. 'కటకం కరభూషణమ్' అని అ.) కుండల=కర్ణాభరణములయొక్కయు, (ని. 'కుణ్డలం కర్ణవేష్టనమ్' అని అ.) చాకచక్యములవానిన్=చకచకాయమానములైన కాంతులుగలిగినవాఁడును, అమ్మహీజానిన్=ఆవసురాజును, కని=చూచి, లేచి=కూర్చున్నచోటనుండి లేచినవారై, అబ్జాతముఖులు=స్త్రీలు, అమిత వినయ సంభ్రమముదోఁపన్=అపరిమితమైన వినయమును దొందరపాటును గనుపింపఁగా, నిలిచిరి=నిలుచుండిరి.

ఈపద్యమునఁ బెద్దపాదములయందు వాని యనుపదము నంత్యప్రాసముగా నుంపంబడియెను. ఆ పాదములు పాదార్థముక్తపదగ్రస్తములుగాఁ జెప్పంబడియెను. అలం. ఉపమ.

మ. క్షితిపాలోత్తముఁ డంత సంతసమునం జేరంగ నేతెంచి 'చిం
తితకల్యాణసమృద్ధి రస్తు'నుచు సన్మిత్రుండు దీవింపఁగాఁ
గుతుకస్మేరముఖారవిందుఁ డయి కోర్కుల్మీఱ నారీజనా
ర్పితజాంబూనదపీఠిఁ బొల్చె జలజప్రేంఖన్మరాళం బనన్. 47

క్షితిపాలోత్తముఁడు=వసురాజు, అంతర్ = ఆమీఁదట, సంతసమునం జేరంగ నేతెంచి = సంతోషముచేత దగ్గరకువచ్చి, చింతితకల్యాణసమృద్ధిరస్తనుచున్ - చింతిత=తలఁచుకొనఁబడిన, కల్యాణ=శుభములయొక్క, సమృద్ధిః=పరిపూర్తి, అస్తు=అవుఁగాక అని అర్థము. తలఁపఁబడిన వివాహసమృద్ధి యగుఁగాక యని భావము. అనుచున్=ఈలాగనిపలుకుచు, ('అనుకృతేస్తివాక్యంతు' న. అనియుండుటచేత ననుకరణమందు సంస్కృతవాక్యము ప్రయోగింపఁబడియె.) సన్మిత్రుండుదీవింపఁగాన్=మునివేషధారణము చేసియున్న ప్రియసఖుఁ డాశీర్వదింపఁగా, కుతుక=సంతోషయుక్తమైన, స్మేర = నవ్వుచున్న, ముఖారవిందుఁడై = కమలసదృశమైన ముఖముగలవాఁడై, శోభాలక్ష్మి అర్ = శోభికలతిశయించుచుండఁగా, నారీజన=గిరికాదేవి చెలికత్తెలచేత, అర్పిత=సమర్పింపఁబడిన, జాంబూనదపీఠిన్ =సువర్ణమయమైన పీఠమందు, (ని. 'రుక్మం కార్తస్వరం జాంబూనదమష్టాపదోస్త్రియామ్.అని అ.) జలజ=తామరపువ్వుమీఁద, ప్రేంఖత్ =తూఁగియాడుచున్న, మరాళంబనన్ =రాజహంసయో యనునట్టులుగా, పొల్చెన్ = ప్రకాశించెను. అనఁగా సువర్ణపీఠముమీఁద సుఖాసీనుఁడైయుండెననుట.

రాజుతనమిత్రుని నైపుణ్యమునకుమెచ్చి సంతోషముతోఁజేరవచ్చెను. మిత్రుఁడు "చింతితకళ్యాణ సమృద్ధిరస్తు" అని దీవించెను. తలంచినవివాహము నెరవేరుగాక యనియుఁ దలంచినశుభము నెరవేరుగాకయనియు నర్థమొసంగుదీవన పద్మమువలె సుందరమగు రాజు ముఖమునఁ జిఱునవ్వును జనింపఁజేసెను.

చ. అనుపమకాంతివైభవసమన్వితు నావసురాజుఁ గాంచుప
ద్మిని సరసాంతరంగమున మించె వినూతనరాగకందళం
బొనరె నఖండవాసనలు నుత్కలికల్వెలసిల్లె నల్లన
ల్లన నిగిడెం బ్రమోదతరళస్థితులై తమిఁజూపుతుమ్మెదల్. 48

అనుపమకాంతివైభవసమన్వితున్ = కాంతి యనఁగా లావణ్యంబును బ్రకాశంబును, (ని. కాంతి శ్శోభా వరేణ్యయోః' అని అ.) ముత్యములోఁ దిరిగెడు నీరువలె నవయవములందుఁ బ్రకాంచునది లావణ్య మనిపించుకొనును, అనుపమ = సమానరహితమైన, కాంతివైభవ = లావణ్యసంపదతోడ, సమన్వితున్ = కూడుకొనిన, ఆవసురాజున్ = ఆ వసురాజనెడు అనుపమప్రకాశసంపదతోఁ గూడిన యా వసురాజు ననఁగా సూర్యుని ఇక్కడ వసువు లనఁగాఁ గిరణములు. (ని. 'వసుర్నా దేవభేదేషు యోక్త్రాగ్ని ధనదాం శుషు,మధురే తు త్రిషుక్లీబే సలిలే ధనరత్నయోః.' అని నా.) వానికి రాజుగావున వసురాజని సూర్యపరముగా విచారింపవలయును. కాంచు=చూచుచున్న, పద్మిని=పద్మినీజాతిస్త్రీ యయిన గిరికాదేవియనెడు పద్మలతయొక్క, సరసాంతరంగమునన్ = సరసమయినహృదయమనెడి జలయుక్తమయిన యంతఃస్థిత కందమందు అనఁగా మూలదుంపయందు, వినూతన = నూతనమయిన, రాగకందళంబు = అనురాగాంకురమనెడు నభినవారుణాంకురము, మించెన్ =అతిశయించెను. అఖండ=సంపూర్ణములయిన వాసనలు-అనఁగా సాత్త్వికభావములైన రోమాంచకంపస్వేదాదికములనెడు నఖండసౌరభములు, ఒనరెన్ = ఒప్పెను. ఇక్కడ నఖండవాసనా జన్యములైన సాత్త్వికభావముల నఖండవాసనలని చెప్పినాఁడుగనుక జన్యజనకముల కభేదోపచారమని తెలియ

వలయును. ఉత్కళికల్వెలసిల్లెన్ = ఉత్కళికలనఁగా శంకాసూయాది సంచారిభావములని చెప్పవలయును.

ఉత్కళిక యనఁగా నౌత్సుక్యమనెడి సంచారిభావము గనుక బహువచనమువలన శృంగార రసమందుఁ బ్రయోగింపఁదగిన సంచారిభావములు తెలియఁబడుచున్నవి.

శ్లో. 'శఙ్కాసూయా భయంగ్లాని ర్వ్యాధి శ్చింతా స్మృతిర్ధృతిః
ఔత్సుక్యవిస్మయా వేగా వ్రీడో న్మాదో న్మదా స్తథా.
విషాదో జడతా విద్రా వహిత్థా చాపలం మృతిః
ఇతిభావాఃప్రయోక్తవ్యా శృఙ్గారేవ్యభిచారిణః'

అనునివి భావములు లేక ఉత్కళికలనఁగాఁ దరంగములుగనుకఁ దరంగసదృశములైన సంచారిభావములు నుత్కళిక లనఁబడుచున్నవని విచారింపవలయును. అట్టి యుత్కళికలనెడు నుత్కళికలు అనఁగా నుద్గతములైనమొగ్గలు విలసిల్లెను. ఇక్కడ నుత్కళికలవలెనే యుత్కళికలు అనఁగాఁ దరంగములవలెనే సంచారిభావములు చూడఁబడుచున్నవి. ఏలాగుననినిన, సముద్రమందుఁ దరంగము లుద్గమించుచు లీనమగుచుండినవై యాసముద్రమునకు నుత్కర్షమును జేయుచును మఱలఁ దత్స్వరూపత్వమును బొందుచు నేప్రకారముగా వర్తించునో యాకారముగానే స్థాయిభావమైన రతియందు సంచారిభావములైన శంకాసూయాదులు వర్తించుచును ఆస్థాయిభావమును దమ్మును బోషించుచున్నవై రసాత్మకత్వమును బొందుచున్న వని విచారింపవలయును· ఇందుకు,

శ్లో. 'మజ్జంతశ్చనిమజ్జంతఃకల్లోలాస్తేయథార్ణవే
తస్యోత్కర్షం వితన్వంతి యాంతి తద్రూపతామపి.
తథాస్థాయినినిర్మగ్నా ఉన్మగ్నా వ్యభిచారిణః
పుష్యంతి స్థాయినం స్వాంశ్చ తత్రయాంతి రసాత్మతామ్.'

అని చెప్పఁబడియున్నది. అల్లనల్లన నిగిడెం బ్రమోదతరళస్థితులైతమిఁ జూపుతుమ్మెదలు-ప్రమోదతరళస్థితులై-ప్రమోదమనఁగా హర్షమనెడు సంచారిభావము. శ్లో. 'హర్షోమనస్సముల్లాసో దేవీగురుమహీభుజామ్, ప్రసాదాత్ప్రియసంగాచ్చ భవేదిష్టార్థలాభకః' అనియున్నదిగనుక హర్షముచేతఁ జంచలస్థితి కలిగినవై, తమిన్=తమకముచేత, చూపుతుమ్మెదలు=వీక్షణములనెడు భ్రమరములు, అల్లనల్లననిగిడెన్=అంతటంతటఁ బ్రసరించెను. నల్లనల్లన యనఁగానీలప్రకారమని చెప్పవచ్చును. 'ప్రకారేగుణవచనస్య) యనెడు పాణినీయసూత్రముచేత ద్విర్భావము. 'ప్రకృతివద్వికృతిః'అని నన్నయ భట్టారకుఁడు.

తా. మనోహరస్వరూపుఁడగు నావసురాజునుగాంచినంతనఁ బద్మినీజాతి చెలువయగు గిరికాదేవి కనురాగము హృదయమునజనించెను. పిదప రోమాంచాదులగు సాత్త్వికభావములు శంకాది సంచారిభావములు కలిగెను. చూపులువసురాజుపైఁ బ్రమోదతరళస్థితిమైయొప్పెను. సూర్యుఁడుదయింపఁ దమ్మిదీవియ దుంపయందు నెట్టినిమొలకక్రొత్తగాఁబుట్టెను. తావులచేనల్లరి యందు మొగ్గలుతలసూపఁ దుమ్మెదలు సంతసముతోఁ బైప్రాలుచుండెనని యర్థాంతరము.

అలం. శ్లిష్టావయవరూపకము.

రసవిచారము

ఇక్కడ రసవిచారము చేయఁబడుచున్నది. భావమనఁగా మనోవికారము. (ని. 'వికారో మానసో భావః' అని అ. భావము.) సజాతీయమైన నాయకాంతరాసక్తిచేతను, విజాతీయమైన భీత్యాదికముచేతను గొట్టఁబడక సజాతీయవిజాతీయముల స్వస్వరూపముగాఁ జేయుచు ననుభవపర్యంతము నిలిచియుండెనేని స్థాయిభావ మనిపించుకొనును.

శ్లో. 'సజాతీయై ర్విజాతీయై రతిరస్కృతమూర్తిమాన్
యావద్రసం వర్తమానస్థాయీభావ ఉదాహృతః.
విరుద్ధైరవిరుద్ధైర్వా భావైర్విచ్ఛిద్యతేనయః
ఆత్మభావంనయత్యన్యాన్ స్థాయీపలవణాకరః.'

రతియనఁగా సంభోగవిషయమైన యిచ్ఛావిశేషము. ఇందుకుఁబద్యము,

క. 'తరుణులుఁ బురుషులు నితరేతరసంబంధేచ్ఛ నెలమిఁ దలకొనఁగాఁద
త్పరమతిఁ దివురుట శృంగార రసజ్ఞులమతమునందు రతియనఁబరగున్'

రతియనెడుస్థాయిభావమునకు నుత్పత్తికారణము విభావమనిపించుకొనును. శ్లో. 'విభావఃకథ్యతేతత్ర రసోత్పాదనకారణమ్' రసమనఁగా రతియని తెలియవలెను. ఆవిభావ మాలంబనమనియు, నుద్దీపనమనియు రెండుతెఱంగులై యుండును. ఆలంబనమనఁగా రత్యాదులకు విషయీభూతులైన నాయికానాయకులు.

ఉద్దీపన కారణములు మలయానిల చంద్రాదులు
తత్ప్రబోధాయ మాల్యర్తుచందనేం దూదయాదయః
ఉద్దీపన విభావాస్తే సత్తైస్మరతిగచ్ఛతి
మాల్యవస్త్రవిభూషణాదయో మాల్యాదయః
ఋతువయోమదాదయో ఋత్వాదయః
చందనస్నాన రూపాదయ శ్చందనాదయః
చంద్రోదయో ఘనధ్వని రుపకోస్మరణ
మిత్యాద్యా శ్చంద్రోదయాదయః. భోజుని సరస్వతీకంఠాభరణము.

ఉద్దీపనమనఁగా రూప యౌవన లావణ్యాది గుణములును హావభావాదిచేష్టలును నూపురాంగదాద్యలంకారములును మలయానిలచంద్రచందనాది తటస్థములును నిట్లు నాలుగువిధములుగలదై యుండును. శ్లో. 'ఆలంబనంతురత్యాదేర్విషయానాయకావిహ,ఉద్దీపనంతదుత్కర్షహేతుస్తచ్చ చతుర్విధమ్. ఆలంబనగుణాశ్చైవ తచ్చేష్టాతదలంకృతిః, తటస్థాశ్చేతివిజ్ఞేయా శ్చతుర్థోద్దీపనక్రమః. ఆలంబనగుణోరూపయౌవనాదిరుదాహృతః, తచ్చేష్టాయౌవనోద్భూత హావభావాదికామతాః.' శృంగారచేష్టలు పదునెనిమిదివిధములైయుండును.

శ్లో. 'హావోభావశ్చ హేలాచ మాధుర్యం ధైర్య మిత్యపి
లీలా విలాసో విచ్ఛిత్తి ర్విభ్రమః కిలికించితమ్.
మోట్టాయితం కుట్టమితం బిబ్బోకో లలితం తథా,

కుతూహలంచ చకితం విహృతిర్హావ ఇత్యపి.
ఏవంశృంగారచేష్టాస్స్యురష్టాదశవిధామతాః'

హృదయస్థితమైనరతి నభివ్యక్తముసేయుచున్న భ్రూవిక్షేపకటాక్షాదిక మనుభావ మనిపించు కొనును. శ్లో. 'భ్రూవిక్షేపకటాక్షాది వికారో హృదయస్థితమ్, భావంవ్యనక్తి యస్సోయ మనుభావ ఇతీరితః' పరగతములయినసుఖదుఃఖములయొక్క భావనచేతనయిన యంతఃకరణముయొక్క తన్మ యీ భావము సత్త్వమనిపించుకొనును. 'సత్త్వేననివృత్తా స్సాత్వికాః'

క. 'పరగతసుఖదుఃఖాదుల, నరయగ భావించి యట్టులలరుట సత్త్వ
స్ఫురణము తద్భవభావము, లరయఁగ సాత్త్వికము లయ్యె నది యెట్లన్నన్.'

శ్లో. 'స్తంభ ప్రళయ రోమాంచా స్స్వేదో వైవర్ణ్య వేపథూ
అశ్రు వైస్వర్య మిత్యష్టౌ సాత్త్వికాః పరికీర్తితాః.'

రతికి సహకారులయిన నిర్వేదగ్లాని శంకాదులు వ్యభిచారిభావము లనిపించుకొనును.

శ్లో. 'ఏకత్రనియతాభావా రజ్యంతే వ్యభిచారికాః
తఏవాన్యత్ర సంచారా త్సంచారిణ ఇతిస్మృతాః.'

క. 'అహరహము రసోత్పత్తికి, సహాయభావంబు లెలమి సంచారులగున్
మహి నవి ముప్పదిమూఁడై, మహితములగు వీనికిం గ్రమము లేర్పఱతున్.'

నిర్వేద శ్రమ దైన్య జాడ్య నిద్రా శంకా త్రిరుగ్గర్వాసంగ చపలతాదులైన సంచారిభావములు ముప్పదిమూఁడని తెలియవలయును. ఇది స్థాయిభావవిభావాదుల నిరూపణము. రతియనెడు స్థాయి భావము కారణములైన యాలంబనోద్దీపన విభావములచేత నుత్పత్తినొందినదయి కార్యములయిన యనుభావములచేతను సాత్త్వికభావములచేతను నభివ్యక్తినొందినదయి సహకారులయిన సంచారిభావ ములచేతఁ బుష్టినొందినదయి యాస్వాద్యమానమగుచున్న శృంగార మనిపించుకొనును. భరతసూత్రము,

'విభావానుభావ వ్యభిచారి సంయోగా ద్రసనిష్పత్తిః
విభావానాం రసస్యచ కార్యకారణ భావలక్షణ సంబంధః,
తథానుభావానాం రసస్యచ జ్ఞాప్యజ్ఞాపక భావలక్షణసంబంధః
ఏవం చైతాదృ శాత్యంత యోగాద్యథాక్రమ ముత్పత్తిర్వ్యక్తిః పుష్టిశ్చభవతీతితదర్థః'

శ్లో. 'విభావై రనుభావైశ్చ సాత్త్వికైర్వ్యభిచారిభిః
ఆనీయమాన స్స్వాదుత్వం స్థాయిభావో రసస్స్మృతః.'

క. పులకండంబులు గలిపిన, నలువగుసలిలము రసాయనం బగుపగిదిన్
లలిత విభావాదులచే, నలఘుతరస్థాయిభావ మమరున్ రసమై.

విభావము అనుభావము సాత్వికము వ్యభిచారులచే నిర్భరానందరూపము నొందింపఁబడునది యగుస్థాయిభావమెరసము. కలకండ కలిపినతీయనినీరు మధురమగు పానకమగునటుల స్థాయిభావ ములు రసములగును. (రతిశృంగారముగను, హాసముహాస్యముగను, శోకముకరుణముగను, క్రోధము రౌద్రముగను ఉత్సాహము వీరముగను, భయము భయానకముగను, జుగుప్స భీభత్సముగను, విస్మయ మద్భుతముగను శమము శాంతముగను మాఱును)

శ్లో. 'యథాహి తంతవో వేమ తురీయాదిభి రన్వితః
పటాత్మనా పరిణతాః పటవాచ్యా భవంతితే.
తథైవ స్థాయినోభావా విభావాదిభి రన్వితాః
రసాత్మనా పరిణతా రసవాచ్యాభవంతి తే'

ఇక్కడ అనుపమకాంతియను నీపద్యములో గిరికాపరమయిన యర్థమందు సంపూర్ణమయిన శృంగారరసమును జెప్పినాఁడు. కాంతియుద్దీపనభావము. వసురాజాలంబనవిభావము. సరసాంతరంగమున మించె వినూతనరాగకందళం బనఁగా ననురాగయుక్తమయిన యంతరంగమునం దాయనురాగము పూర్ణమయ్యెననుట. అనురాగమనఁగా రతియనెడు స్థాయిభావము. కందళపదంబు బరిపూర్ణత్వమును దెలుపుచున్నది. వినూతనపదము స్పష్టార్థము. మించె ననెడిపదము పూర్ణత్వమును జెప్పుచున్నది. అపరిపూర్ణమయిన స్థాయిభావమనియుఁ బరిపూర్ణమయిన రసమనియును గ్రహింపవలయును. అఖండవాసన లనఁగా సాత్త్వికభావములు. ఉత్కళిక లనఁగా సంచారిభావములు. చూపులనఁగాననుభావములు. ఈరీతిగా విభావానుభావ సాత్త్వికసంచారి సముల్లసితమయి స్థాయిభావమయిన యనురాగకందళము సంపూర్ణమయిన శృంగారరసమని గ్రహింపవలయును. ఇక్కడ రసవిచారముఁ దెలియఁ జేయనియెడలఁ బద్యార్థము స్పష్టముగాఁ దెలియదుగనుక గ్రంథవిస్తరమగునని తలంపక విపులముగా వ్రాయఁబడెను.

చ. తొలుదొలుతన్ విలోలగతిఁ • దొంగలిఱెప్పల నాని కర్ణకుం
డలరుచిధాళధళ్యముల • డాపున నల్లనఁ బొంచి మించులై
వెలువడి పూర్ణచంద్రుపయి • వెన్నెలపుల్గులచాలు వ్రాలులీ
లల విభుమీఁద వ్రాలె నవ•లానవలాలితదృష్టిజాలముల్. 49

నవలా=గిరికాదేవియొక్క, నవలాలితదృష్టిజాలములు=నూతన విలాసముగల వీక్షణసమూహములు, తొలుదొలుతన్=ముందుముందుగా, విలోలగతిన్=ఆసక్తిచేతను చపలత్వముచేతను అని యర్థము. (వి, 'లోల శ్చలస తృష్ణయోః' అని వి.) తొంగలిఱెప్పలనాని=విప్పుగలకనుఱెప్పలయందుఁ గొంచెముసేపునిలిచి, కర్ణకుండల=చెవులకమ్మలయొక్క, రుచిధాళధళ్యముల = ధళధళయను కాంతులయొక్క, డాపున నల్లనఁబొంచి = చెంతను దిన్నఁగాఁ గొంతసేపునిలిచి, ఈచెప్పుటచేతఁ గర్ణాంతవిశ్రాంతనేత్రాంతత్వము స్ఫురించుచున్నది. మించులయి = అతిక్రమించినవయియనియును మెఱుపుతీఁగెలవంటివయి యనియును అర్థము. వెలువడి = బయలుదేరి, పూర్ణచంద్రుపయి వెన్నెలపుల్గుల చాలు వ్రాలులీలన్=సంపూర్ణ చంద్రునిమీఁదఁ జకోరపక్షిశ్రేణి వ్రాలినట్టులుగా, విభుమీఁద వ్రాలెన్ = వసురాజుమీఁదఁ బ్రవేశించెను.

ఈ పద్యార్థమందు లజ్జాతిశయము స్ఫురించుచున్నదిగనుక నాయిక ముగ్ధయని తెలియవలయును. శ్లో. 'ఉపయవ్యోపనాముగ్ధాలజ్జావిజితమన్మథా' లజ్జయనునది సంచారిభావము. శ్లో. 'చేతస్సంకోచనంవ్రీడా నజ్ఞరాగ స్తదాదిభిః' అని చెప్పఁబడియున్నది. డాఁపుశబ్దమునకు డత్వమువచ్చుటకుం బ్రమాణము.

తే. 'డంభడిండీర డోలికా డాడిమాది, శబ్దముల కాదివర్ణము ల్సంస్కృతమున

నుపరివర్గతృతీయమై యొప్పునట్లు, డెనుఁగున దకారముడవర్ణ మొనరుచుండు.'

తే. 'దాక దగ్గరి దిగ్గియ దాయఁబోయి, దాఁపలను దిగ్గుమను వైకృతముల మొదల
డాక డగ్గరి డిగ్గియ డాయఁబోయి, డాపలను డిగ్గుమని డాకడంగి నిల్చు.'
అప్పకవీయము.

నవలాశబ్దము దేశ్యమగుటవలన 'దీర్ఘాణాంహ్రస్వంస్యాత్'అనుసూత్రము వర్తింపదు. 'నచదేశ్యపదే'యని చెప్పఁబడెనుగాన నీనియమము దేశ్యములందు వర్తింపదని భావము.

ప్రమోదతరళస్థితులైన గిరికచూపులు విప్పుగల రెప్పలలోఁ జలించుచుఁ గొంచెమునేపుండి యాకర్ణాంతములగు కనుల కొనలకుఁజేరి కర్ణకుండల ధవళకాంతుల దరిపొంచి వెన్నెలపులుగులు చంద్రునిపయి వ్రాలునటుల రాజువ్రాలెను.

వెన్నెలపుల్గులును జూపులును శ్వేతగణములోనివి. (చూపులను నలుపుగఁ జెప్పుపక్షముగూడఁ గలదు. దాని నన్యత్రచూడనగును) చూపులు తెల్లగా నుండునను టకు.

శ్లో. శుభ్రాణి భారతీధర్మ శేషేశతరుణేందవః
రేణుః కేతక ఖర్జూర్యోః కటాక్షాహాసభస్మనీ. కావ్యకల్పలత.

చంద్రికల్, దనుకంజూచెలతాంగి భూసురుప్రఫుల్లనేత్రపద్మంబులన్. మనుచరిత్రము.

క. వసుధాసుధాంశుఁ బొడవుచు, వెస మఱలుచు మరలి మగుడ♦వెడలుచు లలనా
లసమానదృష్టిజాతము, లసమాంబకు చిత్రశరము♦లై విలసిల్లెన్. 50

వసుధాసుధాంశుఁబొడవుచున్ = భూలోకచంద్రుఁడయిన వసురాజును గ్రమ్ముచును, వెస మఱలుచున్=వెంటనే మళ్ళుచును, మరలి=మళ్లినవయి, మగుడవెడలుచున్=తిరుగాఁ రాజుమీఁదికిఁ బోవుచును, లలనా=గిరికయొక్క, లసమాన = ఒప్పుచున్న, దృష్టిజాతములు = వీక్షణసమూహములు, అసమాంబకు=మన్మథునియొక్క, చిత్రశరములయి విలసిల్లెన్=గమనాగమనములు సేయు బాణములయి ప్రకాశించెను.

చ. వనజదళాయతాక్షినిడు♦వాలికచూ పనిమేషవృత్తి నా
ఘనునవకంబుపైఁ బొలసి♦కాంతతదీక్షణజాలకంబు పై
కొనినఁ ద్రపాబ్ధిఁ గ్రుంకియును♦గోరికఁ గ్రమ్మఱఁ గూడఁ బారు మో
హనగుణశక్తి నివ్వటిలు♦నవ్వలరాయని నేర్పు పెంపునన్. 51

వనజదళాయతాక్షి=తామరరేకులవలె విశాలములయిన నేత్రములుగల గిరికాదేవియొక్క, నిడువాలికచూపు=మిక్కిలియు సొగయయిన వీక్షణము, అనిమేషవృత్తిన్ = రెప్పపాటులేని వృత్తిచేత ననియును, అనిమేష మనఁగా మీనముగనుక మీనవృత్తిచేననియు నర్థము. ఆఘనునవకంబుపైఁబొలసి=ఆవసురాజుయొక్క చక్కఁదనముమీఁదఁ బ్రసరించియనియును, ఘనుఁడనఁగా మేఘుఁడును, కం = అనఁగా నుదకంబును గనుక నామేఘునియొక్క యభినవోదకముమీఁద వ్యాపించి యనియును నర్థము. కాంత=మనోహరమయిన, తత్ = ఆవసురాజుయొక్క, ఈక్షణజాలకంబు-ఈక్షణ=వీక్షణము లనెడు, జాలకంబు=వల, (ని. 'జాలం సమూహ ఆనాయో గవాక్షక్షారకా వపి' అని అ.) జాలజాలకశబ్దములు సమానములు, పైకొనినన్ = మీఁద నావరింపఁగా

అని యర్థము. త్రపాబ్ధిం గ్రుంకియును=లజ్జయనెడు సముద్రమందు మునిఁగినదయ్యును, మోహన గుణశక్తిన్ = సమ్మోహనగుణసామర్థ్యముచేత, నివ్వటిలు = అతిశయించుచున్న, అవ్వలరాయని = ఆమన్మథునియొక్క, నేర్పు పెంపునన్ = నిపుణత్వాతిశయముచేతననియును, మోహనగుణశక్తినివ్వటిలు=గుణమనఁగాఁ ద్రాఁడుగనుక మోసపుచ్చునట్టి వలత్రాఁటియొక్క సామర్థ్యముతోడ నతిశయించుచున్న, అవ్వలరాయని=వలకు రాయఁడయిన యా బెస్తవానియొక్క, నేర్పు పెంపునన్ = నిపుణత్వముచేత ననియును నర్థము. కోరికగ్రమ్మఁ గూడఁబారున్=అభిలాషచేతఁ దిరుగఁ బురికొనునని యర్థము.

గిరికాదేవియొక్క చూపు వసురాజు చక్కఁదనముమీఁద వ్యాపించుచుండఁగా వసురాజు చూచునప్పుడు గిరికాదేవి సిగ్గుపడి చూపుద్రిప్పినదయి మన్మథోద్దీపనముచేతఁ దిరుగఁ జూచెనని భావము. ఇందులో గిరికాదేవియందు లజ్జయును మదనవికారంబును సమానంబులుగాఁ జెప్పుటవలన మధ్యాత్వము స్ఫురించుచున్నది. శ్లో. 'సమాన లజ్జా మదనామధ్యా' అని లక్షణము. గిరిక తొలుత వసురాజును నిడువాలు చూపులతోఁ జూచెను. వసురాజాయమను జూచెను. అపుడు గిరికచూపులు లజ్జగొని వెనుదిరిగియుఁ మన్మథుని నేర్పు పెంపుచేఁ వలపుఁగొని వసురాజుముఖము పైకిఁగూడఁ బాఱెనని భావము. అలం. శ్లేషము.

తే. కౌతుకము పూని యొండొరుఁ గాంచఁ దివురు
చంచలాక్షికిఁ బతికి నేత్రాంచలములు
గూర్చె వలరాచయొజ్జ కోర్కులు దలిర్ప
నది గదా భావిశోభనవ్యంజకంబు. 52

కౌతుకముపూని=అభిలాషపడి, ఒండొరుఁగాంచఁ దివురు = పరస్పర విలోకనముసేయుట కుద్యుక్తులగుచున్న, చంచలాక్షికిన్=గిరికాదేవికిని, పతికిన్ = వసురాజునకును, వలరాచయొజ్జ= మన్మథుఁడనెడు నుపాధ్యాయుఁడు, కోర్కులుదలిర్పన్=కోరికలు చేకూరునట్లుగా, నేత్రాంచలములు గూర్చెన్ = క్రేఁగంటిచూపులను జతకూర్చెను, అదిగదా=అదియకదా, భావిశోభనవ్యంజకంబు=భావికాల శుభసూచనము.

నేత్రశబ్దము వస్త్రమందును వర్తించుచున్నది గనుక నేత్రాంచలమును గూర్చుట యన్నది వస్త్రాంచల సంయోజనరూపమయిన భావికాలశుభసూచకమని గ్రహింపవలయును. ని. 'నేత్రం వస్త్రే ద్రుమే శాఖా గుణ భూరుహ మూలయోః' అని నా. వస్త్రాంచల సంయోగమనఁగాఁ బెండ్లికాలమందు వధూవరుల యుత్తరీయపు చెఱఁగులు రెండునుగూర్చి వేయు బ్రహ్మముడి.-అనుపమ కాంతి యనెడి పద్యము మొదలుకొని యీపద్యము తుదిగాఁగల యయిదుపద్యములలోఁ గిరికాదేవికిఁ బ్రథమావస్థయయిన నయనోత్సవమును జెప్పినాఁడు. అలం. రూపకము.

సీ. కను గలవింటఁ జొక్కపుచవు లుప్పతిల్లించి, నారిచేవిభ్రమోన్నతలు పెనచి
తమ్మితూఁపున రసోదగ్రత సవరించి, కంకేళిఁ బ్రబలరాగంబు నించి
యెలమావిఁ గేలంటి యెలమి మీఁఱఁగఁ జేసి, విరవాది నూష్మాభివృద్ధి నెఱపి
కలువ చేఁదమి పెంపు వెలయించిచిగురాకు, మొనలనాకుపాటు మొనయఁజేసి

తే. యసమశరవీరపుంగవుఁ • డాత్మసాధ • నముల నన్నింటిచేఁ జూపి • కమిచి పోటు
గంటి దూరినరీతి వా • ల్గంటిమనము, నవనిపతిచిత్తమును దూరె • నాక్షణమున.

కనుగలవింటఁ జొక్కుపుచవుల్వుట్టించి = కనుగలవిల్లనఁగాఁ గణుపులయొద్దనుండెడు గుంటలకుఁ గన్నులనిపేరుగనుక నవిగల చెఱుకువిల్లు ఆచెఱకువింటిచేతను చవుల్పుట్టించి యనఁగాఁ బ్రేమఁ బుట్టించియని యర్థము. ప్రేమలక్షణము. (శ్లో. 'సప్రేమాయన్మిథోయూనోర్నిరూఢంభావబంధనమ్.') అని బహువచన మతిశయద్యోతనార్థము. అనఁగాఁ జవులకాస్పదమైన సాధనముచేతఁ జవులు పుట్టించినాఁ డనుట. చెఱకుతుంటలు తీపిగలవని భావము. కనుగలవిల్లనఁగా జాగరూకమైన విల్లనియును విచారింపవలయును. వారిచే విభ్రమోన్నతులు పెనచి=తుమ్మెదనారిచేత భ్రాంత్యతిశయములను బెనఁగొనఁజేసి యని యర్థము, భ్రాంతియనునది మోహమను సంచారిభావమున కనుభావము. (శ్లో. 'మోహస్తు మూర్ఛనం భీతి ర్దుఃఖలేశా నుచింతనైః') విభ్రమోన్నతులుగల సాధనముచేత విభ్రమోన్నతులు పుట్టించినాఁడనుట. తుమ్మెదలు భ్రమణముగలవనిభావము. తమ్మితూఁపున రసోదగ్రత సవరించి, రసమనఁగా ననురాగము, అరవిందబాణముచేత ననురాగాతిశయము గలుగఁజేసి యనియర్థము. రసోదగ్రతగల సాధనముచేత రసోదగ్రత్వముఁ గలుగఁజేసినాఁ డనుట. అరవిందము మకరందరసముగలదని భావము. కంకేళిఁ బ్రబలరాగంబు నించి=కంకేళి యనఁగా నశోకము. అశోకపుష్పబాణముచేత రాగాతిశయమును బూరించి యని యర్థము. ప్రబలరాగముగల సాధనముచేతఁ బ్రబలరాగమును నిండించినాఁడనుట. రక్తాశోకపుష్పము మిక్కిలి రక్తిమగలదని భావము. రక్తాశోకము మన్మథవృద్ధికరమని శాస్త్రము. (శ్లో. 'ప్రసూనైరశోకస్తుశ్వేతోరక్త ఇతిద్విధా, బహుసిద్ధికరశ్శ్వేతో రక్తస్తు స్మరవర్ధనః.' అని.) ఎలమావిగేలంటి యెలమిమీఱఁగఁ జేసి = చూతకుసుమబాణముచేత హస్తమును స్పృశించి యుత్సాహ మతిశయించునట్లుగాఁ జేసి యని యర్థము. కేలంటి యెలమిమీఱఁజేయు సాధనముచేత గేలంటి యెలమిమీఱఁ జేసినాఁడనుట. చూతము కేలనంటిన పుష్పించుచున్నదని భావము. విరవాది నూష్మాభివృద్ధి నెఱపి=విరవాదియనఁగా నవమల్లిక నవమల్లికబాణముచేత సంతాపాతిశయము ఘటింపఁజేసి యనియర్థము. సంతాపమనునది చింతయను సంచారిభావమున కనుభావము. ('ఇష్టానభిగమాద్ధ్యానంచింతాశూన్యశ్వతాపకృత్') ఊష్మాభివృద్ధిగల సాధనముచేత నూష్మాభివృద్ధిని ఘటింపఁజేసినాఁ డనుట. (ని. 'గ్రీష్మ ఊష్మకః' అని అ.) విరవాదులు గ్రీష్మర్తువందు వృద్ధిఁబొందుచున్నవని భావము. కలువచేఁ దమిపెంపు వెలయించి=తమియనఁగా నౌత్సుక్యము నీలోత్పలబాణముచేత నౌత్సుక్యాతిశయమును బ్రకటముచేసి యని యర్థము. ఇది యాంధ్రసమాసము. ఇక్కడ నౌత్సుక్యమనునది సంచారిభావము. (శ్లో. 'కాలాక్షమత్వమౌత్సుక్యం మనస్తాపత్వరాదికృత్.') తమిపెంపుగల సాధనముచేతఁ దమిపెంపు వెలయించినాఁడనుట. తమియనఁగా రాత్రి, (ని. 'రజనీ యామినీ తమీ' అని అ.) కలువలు రాత్రియందు వికసించునట్టి వని భావము. ఇక్కడ మిశ్రసమాసము. చిగురాకు మొనల నాకులపాటు మొనయఁ జేసి=చిగురాకులనెడి మొనలుగల యాయుధములయొక్క మొనలచేత నాకులపాటనఁగా వ్యాకులత్వమును బొందించి యని యర్థము. వ్యాకులత్వ మనఁగాఁ జాపల్యమనెడి సంచారిభావము. (శ్లో. 'చాపలంత్వనవస్థానం రాగద్వేషాదిసంభవమ్') ఆకులపాటునకు హేతువైన సాధనముచేత నాకులపాటు నొందించినాఁ డనుట. చిగురాకులు మొనలుచూపువేళఁ బండుటాకులు రాలుచున్నవని భావము.

అసమశర వీరపుంగవుఁడు=మన్మథుఁడనెడు వీరపురుషశ్రేష్ఠుఁడు, ఆత్మసాధనముల నన్నింటిచేఁ జూపి=తనయాయుధము లెన్నికలవో యన్నిటిచేతను శూరత్వము గనుపఱచి, కమిచి=ఆక్రమించి, పోటుగంటి దూరినరీతిక్=పొడిచితీసి పోటుగంటిలో దూరినట్టులుగా, వాల్గంటిమనము = గిరికాదేవి యొక్క మనస్సును, అవనిపతి చిత్తమును = వసురాజుయొక్క మనస్సును, దూరె నాక్షణమునక్= తత్క్షణమునందే ప్రవేశించెను.

అనఁగా గిరికాదేవియును వసురాజును నొకరినొకరు జూడఁగానే మన్మథుఁడు తనసాధనముచేత నుద్దీపనమును బుట్టించి వెంటనే తానును వారిహృదయములయందుఁ బ్రవేశించెనని ఫలితార్థము. మదనవీరుఁడు తనబలమును బూర్తిగ నుపయోగించి తొలుత ప్రేమ పిదప మోహము ఆవలననురాగము తరువాత ననురాగాతిశయము ఆపైని ఉత్సాహము సంతాపము ఔత్సుక్యాతిశయము వ్యాకులభావము గిరికకు వసురాజునకుఁ గలిగించెను. తనయలరు బాణములచే నాయికానాయకులకు గంట్లు గూర్చి యిరువురి హృదయము లందును బ్రవేశించెను. అలం - అతిశయోక్తి - సమము.

క. ఆరాజవదన హృదయము, నా రాజవరేణ్యు తలఁపు ♦ నారసి మృదుగం
భీరతర వచనరచనా, పారీణత మంజువాణి ♦ పలికెం బ్రేమన్.		54

ఆరాజవదన హృదయము=ఆ చంద్రముఖియగు గిరికయొక్క మానసంబును, ఆరాజవరేణ్యు తలఁపున్=ఆ వసురాజుయొక్క సంకల్పంబును, ఆరసి=విచారించి, మృదు=చల్లనైన, గంభీరతర = గూఢార్థయుక్తమైన, వచనరచనా పారీణతన్ = వాక్యరచనయందలి సామర్థ్యముచేత, మంజువాణి=మంజువాణియనెడు గిరికాదేవిచెలికత్తియ, ప్రేమన్=ప్రీతిచేత; పలికెన్=వచించెను. ఏమనియనిన- చిరకాల పరిచయమువలన గిరికహృదయము మంజువాణి యెఱుంగును. ముఖలక్షణాదులచే వసురాజు తలంపు నెఱుంగును. గావున పరస్పరదాంపత్యసంఘటనమునకు గంభీరతరవాక్యరచనా పారీణతమై పలికెను.

సీ. నేఁడు గా మాకనిం♦దితపర్వసామగ్రి సవరించె నీరాక ♦ కువలయేశ
నేఁడు గా మాతమో♦నివహంబు లడఁచె నీ యాలోకమహిమ లో♦కైకమిత్ర
నేఁడు గా మాకు నం♦న్నియుఁ గూర్చు నభిమతార్థములు నీసన్ని ధి♦రాజరాజ
నేఁడు గా మాకు మా♦నితసౌమనస్యంబు లొసఁగె నీపాదాప్తి ♦ వసుధరేంద్ర
తే. సురభిచరితుని నిన్ను నిం♦చో్ప భజింపఁ
గాఁ గలిగెఁ గాన సఫలతా♦కలిత యై వె
లసె మదీయకాంతా రాగ♦లక్ష్మి యింకఁ
దరమె మానాతిచిరభాగ్య♦గరిమఁ బొగడ.		55

కువలయేశ = కువలయమనఁగా భూవలయము, భూవలయమున కీశుఁడైనవాఁడా, నీరాక=నీయొక్క యాగమనము, నేఁడుగా మాకున్ = నేఁడుగదా మాకు, అనిందిత పర్వసామగ్రి=నిందితముగాని యుత్సవసామగ్రిని, సవరించెన్=చక్కపఱిచె నని యర్థము. అనఁగా నీరాక మాకు యోగ్యమైనపండుగయగునట్టులుగాఁ జేసెననుట. కువలయ మనఁగాఁ గలువ, కలువలకు రాజైన చంద్రుఁడా నీరాకయనఁగాఁ బున్నమ. మాకు ననిందితమయిన పర్వకాలమును ఘటింపఁజేసె నని యర్థాంత

రము. లోకైకమిత్ర=ఓయి సర్వజనముఖ్యాప్తుఁడా, నీ యాలోకమహిమ=నీయొక్క దర్శనప్రభావము, నేఁడుగా=నేఁడుగదా, మా తమోనివహంబు లడఁగించెన్=మాయొక్క యజ్ఞాన సమూహములను బోఁగొట్టెనని యర్థము. లోకైకమిత్ర యనఁగా లోకబాంధవుఁడవైన యో సూర్యుఁడా నీయాలోకమహిమ యనఁగా నీప్రకాశమహత్త్వము అంధకారపటలము నణఁచెనని యర్థాంతరము. రాజరాజ = ఓరాజాధిరాజ, నీసన్నిధి=నీసన్నిధానము, నేఁడుగా మాకున్ = నేఁడుగదా మాకు, అన్నియుఁ గూర్చె నభిమతార్థములు=అభీష్టవస్తువుల నన్నిఁటిని సమకూర్చెనని యర్థము. రాజరాజ నఁగాఁ గుబేరుఁడు. (ని. రాజరాజో ధనాధిపః' అని అ.) ఓయి కుబేరుఁడా నీ సన్నిధి యనఁగా శ్రేష్ఠమయిన నిధి కనకాద్యర్థముల నన్నిటిని సమకూర్చెనని యర్థాంతరము. (ని. 'అర్థో భిధేయ రై వస్తు ప్రయోజన నివృత్తిషు' అని అ.) వసుధరేంద్ర = వసునామధేయుఁడవైన-భూమీంద్రుఁడా, నీపాదాప్తి=నీచరణప్రాప్తి, నేఁడుగామాకున్=నేఁడుగదామాకు, మానితసౌమనస్యంబు లొసగెన్= కొనియాడఁబడిన స్వస్థచిత్తతల నిచ్చెనని యర్థము. వసు ధరేంద్ర మనఁగాఁ గాంచన గిరీంద్రము. ఇక్కడ వసువనఁగాఁ గాంచనంబును ధరేంద్ర మనఁగాఁ బర్వతేంద్రంబునని తెలియవలయును. (ని. 'మహీధ్ర శిఖరి క్ష్మాభృదహార్య ధర పర్వతాః' అని అ.) ఓయి కాంచనగిరీంద్రుఁడా, నీపాదాప్తి యనఁగా నీప్రత్యంతపర్వతప్రాప్తి, (ని. 'పాదాః ప్రత్యంతపర్వతాః' అని అ.) మానితసౌమనస్యంబు లొసఁగె ననఁగా పూజితమయిన దేవత్వముల నిచ్చెనని యర్థాంతరము. ఇంతమట్టునకు నాలుగు పాదములయందును ప్రకృతా ప్రకృతశ్లేషము.

సురభిచరితుని నిన్ను నిచ్చోఁ భజింపఁగాఁ గలిగెఁ గానన్=పరిమళించుచున్న చరిత్రములు గల నిన్ను నిక్కడను సేవింపఁగలిగెను గనుక, (ని. 'సురభి ర్ఘ్రాణతర్పణః' అని అ.) మదీయ కాంతారాగలక్ష్మి=మాగిరికాదేవియొక్క రాగలక్ష్మియనఁగా ననురాగసంపద. సఫలతాకలితయయి వెలసెన్ = సఫలమయినదై ప్రకాశించె నని యర్థము. సురభిత యనఁగా వసంతర్తువు, (ని. 'వసంతే పుష్పసమయ స్సురభిః' అని అ.) వసంతసమయచరితము గలవాఁడవయిన నిన్ను భజింపఁ గలుగుటచేత మాయొక్క కాంతారమందలి యగలక్ష్మియనఁగా వృక్షసమృద్ధి ఫలసహితమాయెనని యర్థాంతరము. కాంతార మనఁగా వనము. ఇఁకఁదరమె మానాతి చిరభాగ్యగరిమబొగడన్ = ఇఁకమీఁద మాగిరిక యొక్క శాశ్వతమయిన భాగ్యాతిశయమును గొనియాడ శక్యమా. మాన+అతిచిర=మిక్కిలిత్వరలో సమకూరనున్న యనియర్థాంతరము. రాజా! నీరాకమాకుఁబండు వెన్నెలరాకవలె హృదయమున కానందకరమయ్యెను. నీవుదయతోఁ జూచుటచే మమ్మావరించిన తమోనివహము తొలంగెను. నీసన్నిధాన ప్రభావమువలన మాకభిమతార్థములు సమకూరెను. నీపాదప్రాప్తి మామనస్సులకు నిలుకడఁగూర్చెను. నిన్నుఁజూచుటచే మాచెలిరాగము సఫలమయ్యెను. నీసందర్శనమువలన మేము గడించి భాగ్యగరిమ బొడఁజాలము.

చ. అనయము నీమహావనము ♦ నందినవారము గాని సజ్జనా
వనగుణధుర్య యేము కడ♦వారము గాము సుమయ్యు నీవినూ
తనవిజయాంకగేయములఁ ♦ దావక చాటుకథా సుధారసం
బున నలరింతు మీభువన♦మోహినిఁ బిన్నటనాఁటనుండియున్, 56

సజ్జనావన గుణధుర్య = సుజనసంరక్షణరూపమైన గుణముయొక్క భారమువహించిన రాజా, అనయమున్=నిరంతరమును, నీ మహావనము నందినవారముగాని = నీయొక్క మహత్తరమైన యవనమును, అనఁగా సంరక్షణమును బొందియున్నవారమేకాని, ఏము = మేము, కడవారముగాము సుమయ్యా=దూరమున నున్నవారము గాము సుమా స్వామీయని యర్థము. ఈగొప్పదియగు పదమును బొంది యున్నవారమేకాని మఱియొకచోట నున్నవారముగామని యర్థాంతరము. ఇదియునుంగాక, నీవినూతన విజయాంకగేయములన్=నీయొక్క యభినవ జయచిహ్నములతోఁ గూడిన గానములచేతను, తావక=నీసంబంధమయిన, చాటుకథా=స్తుతియోగ్యమయిన చరిత్రమనెడు, సుధారసంబునన్=అమృతరసముచేతను, ఈభువనమోహినిన్=జగన్మోహినియయిన యీగిరికాదేవిని, పిన్నటనాఁటనుండియున్=చిన్ననాఁటినుండి, అలరింతుము=సంతోషింపఁజేయుచుందుము, ఇక్కడ గానంబును గథాకథనంబును దటస్థోద్దీపనవిభావములని తెలియవలయును. గిరిక చిన్నతనమునుండి నీవిజయాంకగీతములుపాడ నేర్చినది. మేముగూడ నీమనోహర కథాసుధాధారలఁ జవిజూపినారము కాన ననురక్తురాలగు గిరిక నీకుఁ దగియున్నది. భువనమోహినిగావున రూపవైభవసమృద్ధితో వెలయునీపొలఁతి పరిగ్రహణయోగ్యురాలు. మేము గిరికకు నీపైవలపుఁ జనింపఁజేయుట నీసంరక్షణమునందున్నందులకుఁ గృతజ్ఞసూచకముగాననుట-

మ. అనఘామూల్యమణిప్రరోహముల నీకర్పించు నేదివ్యవా
హిని గౌరీపతికిన్ హిమాచలమునట్లేగట్టు నీకున్ విహా
రనగం బై తగు నట్టిశుక్తిమతియుం బ్రాలేయశైలేంద్రనం
దనుఁడుం గాంచిన కన్యఁగా నధిప యీతన్వంగి నెన్నం దగున్. 57

అనఘ=నిర్దోషములయిన, అమూల్య=విలువలేని, మణిప్రరోహములన్ = రత్నాంకురములను-అనఁగా మొలక ముత్తియములను, నీకర్పించు నేదివ్యవాహిని=ఏదివ్యనది నీకు సమర్పించుచుండునో-ఈయర్థమందు శుక్తిమతియనెడు పదము సాభిప్రాయము. ఇక్కడ రత్నాంకుర సమర్పణ యని శుక్తిమతికిఁ జెప్పుటచేతఁ దజ్జన్యయయిన గిరికాదేవిని రత్నాంకురముగా నధ్యవసించి యుత్తరత్ర రత్నాంకురసమర్పణిగాఁ గలవనెడి యభిప్రాయము సఖీవాక్యమున నభివ్యక్తమగుచున్నదని గ్రహింపవలయును. గౌరీపతికిన్ = పార్వతీనాథుఁడయిన శివునకు, హిమాచలమునట్లు=హిమవత్పర్వతమువలెనే, ఏగట్టు=ఏపర్వతము, నీకు న్విహారనగంబైతగున్=నీకుఁ గ్రీడాపర్వతమయి యొప్పుచుండునో-ఇక్కడ గౌరీపతితో వసురాజునకును హిమవత్పర్వతముతోఁ గోలాహలపర్వతమునకును సాదృశ్యము చెప్పినాఁడు గనుక నీసాదృశ్యముచేత వసురాజునకు గౌరీసమానురాలయిన గిరికాదేవి పరిగ్రహణయోగ్యురా లని స్ఫురించుచున్నది. అట్టిశుక్తిమతియున్=అట్టి శుక్తిమతీనదియును, ప్రాలేయశైలేంద్రనందనుఁడుంగాంచిన=హిమవత్పర్వత రాజపుత్రుఁడయిన కోలాహలుఁడును గన్నట్టి, కన్యఁగాన్=కొమార్తెనుగా, అధిప = రాజాగ్రణీ, ఈతన్వంగిన్ = ఈచిన్నదాని, ఎన్నం దగున్ = విచారింపఁ దగును.

అనఁగా నీకు ముక్తామణుల నిచ్చుచుండెడు శుక్తిమతీనదియును నీకుఁ గ్రీడాపర్వతమయి యున్న కోలాహలుఁడును గన్నకొమార్తె యగుటచేత నీచిన్నది నీకు స్వకీయయయిన దేకాని యన్యా

రాలు కావని భావము. మంచుమలపట్టియు దివ్యవాహినియగు శుక్తిమతియుఁ గన్నకొడు వీగిరిక. జననీజనకులాభిజాత్యులు. తనయందలి యమూల్యరత్నముల నీకర్పించు శుక్తిమతి నీకీ కన్యారత్నము నర్పింపఁగలదు. గౌరీపతికి హిమాద్రి విహారశైలమైనటులనీకు కోలాహలశైలము విహారనగమై యున్నది. గావునఁ గోలాహలుఁడు పుత్రినీకొసంగి బాంధవ్యము నెఱపుననిభావము. అలంకారము. వస్తుధ్వని.

సీ. అడుగు వెట్టదు నవ్య♦హరిచందనలతాంత సరణిపైఁ గాని యీ♦యరుణచరణ
కేల నంటదు కోర♦కితపారిజాతవల్లరిఁ గాని యీయతి♦లలితబాహ
తనువుఁ జేర్పదు నవో♦దారమందారమంజులశయ్యఁ గాని యీ♦సురభిళాంగి
పెదవిఁ జేర్పదు కల్ప♦పృథివీజఫలసంతతియె కాని యీమోవి♦తీపులాడి
తే. గురుకులక్రమాయాత మీ♦గిరిజచల్లఁ, దనము జనన్మైకరూఢ మీ♦తటినిపట్టి
సరసగంభీరభావంబు ♦ సహజసిద్ధ, మీనలినసోదరీమణి♦మేనితావి. 58

ఈయరుణ చరణ=ఎఱ్ఱనైన పాదములుగల యీచిన్నది, నవ్య=నూతనమయిన, హరిచందన = హరిచందనమనెడు పేరుగల దేవతా వృక్షములయొక్క, లతాంత=చిగురుటాకులతోఁగూడిన, సరణిపైఁగాని=మార్గముమీఁదనే కాని, అడుగు వెట్టదు=అడుగు మోపదు-అనఁగాఁ జిగురుటాకులకంటెనతిసుకుమారము లయిన పాదములు గలది గనుకఁ జిగురుటాకులమీఁదనే కాని నడువఁ జాలదనితాత్పర్యము. లతాంతశబ్దము పల్లవపరమయినందుకు,

శ్లో. 'నవపలాశపలాశ వనంపురస్స్ఫుట పరాగపరాగత పఙ్కజమ్
మృదులతాంత లతాంత మలోకయత్'

అని మాఘకావ్య షష్ఠసర్గమునందుఁ బ్రయోగము.

ఈయతిలలితబాహ=అత్యంతసుందరములయిన భుజములుగల యీచిన్నది, కోరకిత=మొగ్గయెత్తిన, పారిజాతమనెడు దేవవృక్షముయొక్క, వల్లరిఁగాని = తీఁగెనేకాని, కేలనంటదు=చేతముట్టదు, ఈసురభిళాంగి=పరిమళించుచున్న దేహముగల యీచిన్నది, నవోదార=నూతనాతిశయముతోఁ గూడిన, మందార=మందారమనెడు దేవతరుపుష్పమయమైన, మంజులశయ్యఁగాని=మృదువయినపానుపునందేకాని, తనువుఁజేర్పదు=పవ్వళింపదు, ఈమోవితీపులాడి=అధరమాధుర్యముగలయీచిన్నది, కల్పపృథివీజ=కల్పవృక్షముయొక్క, ఫలసంతతియెకాని=ఫలసమూహము నేకాని, పెదవిఁజేర్పదు=పెదవిమీఁదఁబెట్టుకొనదు. అనఁగా మఱియొకఫలముల ననుభవింపఁ దనుట. నాలుగుపాదములయందును సమృద్ధిముద్వర్ణన చేసినాఁడుగనుక నుదాత్తాలంకారము.

ఈనాల్గుచరణములలో హరిచందనాది దేవతరువులయొక్క-పల్లవకోరకిత వల్లరీ పుష్పఫలములకును గిరికాదేవియొక్క-పాద బాహు గాత్రా ధరోష్ఠములకును సంబంధము సాదృశ్య పర్యవసాయి యగుచున్నది గనుక నుపమాలంకారము-సాదృశ్యమునందు అరుణచరణాంకుర, అతిలలితబాహ, సురభిళాంగి, మోవితీపులాడి యనెడు గిరికానామము సాభిప్రాయము లగుచున్నవి గనుకఁ బరికరాంకురాలంకారము. (శ్లో. 'సాభిప్రాయే విశేష్యేతు భవే త్పరికరాఙ్కురః' అని లక్షణము.) పల్లవిత కోరకిత పుష్పిత ఫలితత్వరూపములయిన నాలుగవస్థలను గ్రహించి నాలుగు దేవతరువులనే చెప్పినాఁడు.

ఈగిరిజ=పర్వతపుత్రియయిన యీచిన్నదానియొక్క, చల్లఁదనము=సౌమ్యభావము, గురుకుల క్రమాయాతము=శ్రేష్ఠమయిన వంశక్రమమువలన వచ్చినదని యర్థము. చల్లఁదనము = శైత్యము, గురు=తండ్రియయిన కోలాహలునియొక్క, కులక్రమ=వంశపరంపరవలన, ఆయాతము = వచ్చినదని యర్థాంతరము. హిమవంతుని నాఁటనుండివచ్చినదనుట. ఈతటినిపట్టి=శుక్తిమతీనదీ పుత్రికయయిన యీచిన్నదానియొక్క, సరసగంభీరభావంబు=సరసత్వంబును గాంభీర్యంబునుబుట్టఁగానే పుట్టినవనియర్థము. సజలత్వంబును లోఁతును దల్లియయిన శుక్తిమతీనదివలన జన్మించుటచేత వచ్చినవని యర్థాంతరము. ఈనలినసోదరీమణి = పద్మములకుఁ దోడఁబుట్టినదయిన యీచిన్నదానియొక్క, మేనితావి=శరీరసువాసన, సహజసిద్ధము=స్వభావసిద్ధమయినదని యర్థము. సహజములయిన-అనఁగాఁ దోడఁబుట్టినపద్మములవలన సిద్ధమయినదని యర్థాంతరము. అర్థాంతరములయందు గిరిజ-తటినిపట్టి-నలినసోదరీమణి యనెడి గిరికాదేవి నామములు సాభిప్రాయములని తెలియవలయును.

చరణము లరుణములనియు మేను సురభిళమనియు బాహువులు మృదువులనియుఁ జెప్పుట వలన గిరిక పద్మినీజాతిస్త్రీ రత్నమని యెఱుంగనగును. మోవితీపులాడి యనుటచే నధరము చుంబనయోగ్యమనియు సురభిళాంగియనుటచే మేను పరిరంభణయోగ్యమనియు భావము. ఇటులె పదప్రయోజనము గుర్తించునది.

నడచినహరిచందన ప్రవాళములపైననే! కోసినఁబారిజాతకోరకములనే! పరుండినమందారశయ్యయందే! రుచిచూచిన కల్పతరుఫలములనే! ఇవియాభిజాత్యసూచనములు.

అరుణచరణ, లలితబాహ, సురభిళాంగియను విశేషణములవలన గిరికాద్వితీయయౌవనము సువ్యక్తనము. తల్లక్షము.

శ్లో. స్తనాపీనా తనుర్మధ్యః పాణౌ పాదే చరక్తిమా
ఊరూకరికరాకారా వజ్ఞంవ్యక్తాంగసంధికం
నితంబో విపులో నాభిర్గభీరా జఘనంఘనం
వ్యక్తారోమావళీ స్నిగ్ధ మంగకే లలితాక్షిణి
ద్వితీయే యౌవనే. రసార్ణవసుధాకరము.

మ. పద మెత్తం గలహంసలీల యధరస్పందంబు సేయన్ శుభా
స్పద మారాగకదంబకంబు శ్రుతి చూపన్ శ్రీవిలాసంబు కే
ల్గదలింపన్ సుకుమారపల్లవనవైలాలక్ష్మి వీక్షింప ష
ట్పదియుం బోల్చుఁ దరంబె కన్నెఁ గొనియాడన్ గేయవాక్ప్రౌఢిమన్. 59

పదమెత్తన్ = పదసంజ్ఞగల గీత మారంభింపఁగానే, కలహంసలీల=రాగవిశేషవిలాసమునడువఁగానే రాజహంసవిలాసము అని యర్థాంతరము. అధరస్పందంబు సేయన్=పలుకఁగానే, శుభాస్పదమా=శుభముల కాధారమైన, రాగకదంబకంబు=స్వరసమూహము, పెదవి గదపఁగానే యెఱుపు గాన్పించు నని యర్థాంతరము. పోల్చున్ = ప్రకటమగును. ఈపోల్చు ననెడిపదము సర్వత్ర సంగతము సేయఁబడుచున్నది. హంసలీల యన్నచోట నిదర్శనాలంకారము. చరణాధరోష్ఠరక్తిమ పోలుచునని భావము. శ్రుతిచూపన్ శ్రీవిలాసంబు=శ్రుతియనెడు స్వరావయవము గనుపఱుపఁగానే శ్రీరాగము పోలుచుననియర్థము. చెవిచూపఁగానే శ్రీకారవిలాసము పోలుచుననిభావము. కేల్గదలింపన్=

చెయి కదలింపఁగానే, సుకుమార=కోమలమైన,పల్లవ=పల్లవమను గీతావయవముగల, నవ=నూతనమైన, విలాలక్ష్మి=విలానామకగీతసమృద్ధి పొలుచునని యర్థము. విలకితీఁగెలయొక్క శోభ పొలుచునని భావము. ఇక్కడ నుభయత్ర భావములయందు నిదర్శనాలంకారము. వీక్షింపన్=చూడఁగానే, షట్పదియుంబొల్చున్=షట్పది యనెడి గీతవిశేషము పొల్చుననియర్థము. ఆఁడుతుమ్మెద స్ఫురించునని భావము. ఇక్కడ దృష్టిప్రభను భ్రమరీరూపముచేత నధ్యవసించినాఁడుగనుక రూపకాతిశయోక్త్యలంకారము. తరంబె కన్నెఁ గొనియాడన్ గేయవాక్ప్రౌఢిమన్=గేయవాక్ప్రౌఢిమ యనఁగా సంగీతవాక్ప్రౌఢిమ, దానియందు, కన్నెఁగొనియాడన్=ఈచిన్నదానివర్ణించుటకు, తరంబె=శక్యమగునా-అనఁగా శక్యముగాదనుట. ఇచటఁ బాదన్యాసాదులవలననే గానసమృద్ధి గాన్పించుచున్నది యని యాశ్చర్యము ధ్వనించుచున్నది.

పదము పాడమొదలిడెనేని కలహంసరాగవిశేషము, పెదవికదలించినంతన స్వరసమూహము, శ్రుతిజూచినంత శ్రీరాగసంపద, హస్తముగదలింపఁ బల్లవి చూచినంత షట్పదీగీతావిశేషము పొసఁగును. ఇదిగిరికా సంగీతవిద్యాప్రౌఢికిఁ దార్కాణములు. గిరికగమనము మరాళయానము. పెదవి కెంపు వలెనున్నది. కేలు చివురు, చూపులు తుమ్మెదలు. ఈయమరూప పొగడ నెంతవారికేని దరముగాదని యర్థాంతరము.

క. శ్రీనిధి భవదభినివిశ,న్మానస యీసింధుతనయ • మహనీయగుణ
శ్రీనుతికి నెక్కె నేఁడీ, మౌనిదయామందరాగ•మహిమము కలిమిన్. 60

శ్రీనిధి=సంపదలకు నాస్పదమైనవాఁడా యనియును, లక్ష్మీదేవికి స్థానమైనవిష్ణుమూర్తియనియును, అర్థము. భవత్=నీయందు, అభినివిశత్=అభినివేశముగలది యగుచున్న, మానస=మనస్సు గలిగిన, ఈసింధుతనయ=సింధుశబ్దము నదియందును సముద్రమందును వర్తించునుగనుక నదీనందనయైన యీగిరికాదేవి యనియును సముద్రనందనయైన లక్ష్మీదేవియనియును నర్థము. నేఁడు=ఈప్రొద్దు, ఈమౌని=మునీశ్వరుఁడైన యీయనయొక్క, దయా=కృపయనెడు, మందరాగ=మందరగిరియొక్క, మహిమముకలిమిన్=ప్రభావము గలుగుటవలన, మహనీయ = అతిశయమైన, గుణశ్రీ=గుణసంపదచేత, నుతికెక్కెన్=ఎన్నికకెక్కెను.

గుణమనఁగాఁ ద్రాడునుగనుక వాసుకిరూపమైన యాఁకత్రాటియొక్కకలిమిచేతఁ బ్రసిద్ధికెక్కెననియును నర్థము. ఈపద్యము మొదటి చరణమందు భవధభినివసన్మానసయని కొన్ని ప్రతులలోను భవదభినవసన్మానసయని కొన్ని ప్రతులలోనునున్నది. అయిన నిందుకు సోమనకవిచేసిన విద్వజ్జనరంజనీవ్యాఖ్యయందు, భవదభినివిశన్మానసయనఁగా-నీయం దభినివేశము గలమనస్సుగలదని యర్థము వ్రాసినాఁడు గనుక నావ్యాఖ్యానప్రకారముగానే టీకరంచియింపఁబడినది. నీవు శ్రీనిధివిగావున సింధుతనయయగు నీశ్రీతగును. భవదభినివసన్మానసగావునఁ బరిగ్రహణయోగ్యురాలు. కావునఁ బరిగ్రహింపుమని భావము.

అలం. శ్లిష్టరూపకము,

చ. అన జనభర్త వల్కు ముది•తా విదితాతనుమంత్రజాలు ని
మ్మునిఁ గొనియాడ శక్యమె స•ముజ్జ్వలరూపకలాప యైనమీా

యనుఁగువయస్యఁ గాంచుసుకృతాతిశయం బవలీలఁ గూర్చె నీ
యనఘుఁ డితండు మాకుఁ బరమాప్తుఁడు గాక మునీంద్రమాత్రుఁడే. 61

అనన్=మంజువాణి యిట్లనిపలుకగా, జనభర్తవల్కెన్ = వసురాజు పలికెను. ఏమనియనిన, ముదితా=ఓమంజువాణీ, విదిత=తెలియఁబడిన, అతను=అధికమైన, మంత్రజాలున్=మంత్రసముదాయము గలిగినవాఁడని యర్థము. విదితమైన యతనుమంత్రజాలమనఁగా మన్మథమంత్రకలాపము గలవాఁడని యర్థాంతరము. ఇమ్మునిఁ గొనియాడశక్యమె = ఈమునీశ్వరునిస్తోత్రముసేయ నలవియగునా-అనఁగా నలవిగాదనుట. ఏమనిన, ఈయనఘుఁడు=ఈపుణ్యాత్ముఁడు, సముజ్జ్వలరూపకలాపయైన-సముజ్జ్వల=మిక్కిలి ప్రకాశించుచున్న, రూప=ఆకృతియే, కలాపయైన = భూషణముగాఁ గలదైన, మీయనుఁగువయస్యఁ గాంచు=మీయొక్క ప్రియసఖియైన యాచిన్నదానిని జూచునట్టి, సుకృతాతిశయంబు=పుణ్యాతిశయమును, కూర్చెన్=మాకు ఘటనపడునట్టులు చేసెను. కాఁబట్టి, ఇతండు = ఈమహానుభావుఁడు, మాకుఁ బరమాప్తుఁడుగాక మునీంద్రమాత్రుఁడే = మాకుఁగేవలము, నిష్టుఁడును మునీంద్రుఁడును నేకాక సాధారణపు మునీంద్రుఁడా యని యర్థము. మాకు విశ్వసనీయుఁడైన స్నేహితుఁడేకాక మునీంద్రమాత్రుఁడా-అనఁగా మునీంద్రుఁడు గాఁడని యర్థాంతరము.

వసురాజు సత్యసంధుఁడగుటచే నబద్ధము చెప్పఁగూడదుగనుక నాతనియుక్తియగు నీపద్యము న యథార్థవిషయముగ నొకయర్థమును పరభావానుకూలముగ దొకయర్థమును స్ఫురించుచున్నది. సముజ్జ్వలరూపకలాపయగు కాంతనుగాంచుట సుకృతాతిశయము. అట్టి సుకృతము సామాన్యప్రయత్నలభ్యముకాదు. దానినవలీలఁగాఁ గూర్చుటకు అధికమంత్రశక్తికావలయును. (మన్మథతంత్రము లెఱుంగవలయును) ఇట్టి మాహాత్మ్యముగలవాఁడ నిమ్మౌని నాకుఁ బరమాప్తుఁడని భావము.

వ. మఱియు నీతనిమంత్రప్రభావంబున భవాదృశ దివ్యభామినీ మృదుమధురకోమ
లాలాపంబు లాలింపం గలిగె నని మనుజపతి బహూకరించుటయు నమ్మౌని
సమ్మదమ్మునఁ గొమ్మనెమ్మోముఁ జూచి తమ్మికంటి యకుంఠిత భువన నిర్మాణచా
తురీధురీణుం డగుపితామహుం డేతాదృశయోగ్యవస్తుయోజనంబునం బొగడు
వడసి యపారపరీవాదపారావారభంగంబుల మునుంగఁడు సుమీ యదియు
నుంగాక తదీయఘటనావైభవాభంగరంగప్రసంగంబునకుం బూర్వరంగంబు
రసోత్తరంగం బగుట యెఱింగితివి గదా యింక సందియంబు వలవ దని
వీడ్కొని యవ్వసుంధరాధరునకు నవ్వారారోహకు నమూల్యకల్యాణకౌతుక
సమృద్ధియుం గావలయు నని దీవించి వారలవినయసంవిధానంబుల నానంద
మొందుచు మణిమందిరంబు వెడలి చని యనతిదూరంబునం దోరంబు లగు
మందారతరువారంబులయాలంబులలో సారం బగుతపోధనాకారంబు డించి
యథాపూర్వవేషంబుతో రాజు నన్వేషించుక్రమంబునం గ్రమ్మఱ నేతెంచి
యమ్మహీమండలాఖండలుం గాంచి యద్భుతంబు నటించి పరిసరంబున నిల్చు
నవసరంబున.

మఱియును=వెండియును, ఈతని మంత్రప్రభావంబునన్=ఈమునియొక్కమంత్రసామర్థ్యము చేత నని యర్థము. రహస్యాలోచనముచేత నని యర్థాంతరము. భవాదృశ=నీవంటి, దివ్యభామినీ =

దేవతాస్త్రీలయొక్క, మృదు=పరుషాక్షరవిరహితములును, మధుర=గంభీరార్థయుక్తములును, కోమల=సౌకుమార్యములతోఁ గూడుకొనినవియు నగు, ఆలాపంబులు=వాక్యములు, ఆలింపఁగలిగెనని=వినఁగలిగెనని, మనుజపతి = వసురాజు, బహూకరించుటయున్ = మన్ననసేయఁగా, అమ్మౌని=ఆకపటమునీశ్వరుఁడు, సమ్మదమునన్ = సంతోషముచేత, కొమ్మనెమ్మోముఁ జూచి=మంజువాణియొక్క మొగమువంకఁజూచి, తమ్మికంటీ=పద్మములవంటి కన్నులుగల యోమంజువాణీ, అకుంఠిత=మొక్కవోని, భువననిర్మాణచాతురీ=జగత్తులయొక్క కల్పనమందలి కుశలత్వమునందు, ధురీణుండగు=ధురంధరుఁడయిన, పితామహుండు=బ్రహ్మదేవుఁడు, ఏతాదృశ = ఇటువంటి, యోగ్యవస్తు=శ్రేష్ఠద్రవ్యయుగళముయొక్క, యోజనంబునన్=కూర్పుటచేత, పొగడువడిసీ, మెప్పువడసీ, అనఁగా నీగిరికా వసురాజులవంటి యుత్తమ స్త్రీపురుషులను గూర్చి పొగడికఁ గనినవాఁడయి, అపార = అంతములేని, పరీవాద=నిందయనెడు, పారావార=సముద్రముయొక్క, భంగంబులన్=తరంగములయందు, మునుంగఁడు సుమీ=మునిఁగిపోఁడు సుమా. అనఁగా నుత్తమస్త్రీపురుషులయిన యీగిరికావసురాజులను దంపతులనుగాఁ గూర్చి లోకమందు స్తోత్రమునే పొందుచున్నాఁడు సుమా యనిభావము. అదియునుంగాక=అంతియకాక, తదీయ ఘటనావైభవ=ఆబ్రహ్మకూర్పుటయొక్క సంపత్తియనెడు, అభంగరంగప్రసంగంబునకున్ = వైకల్యరహితమయిన నాట్యప్రస్తావమునకు, పూర్వరంగంబు=పూర్వరంగమనఁగా నాట్యమునకుఁ బూర్వమందు విఘ్నోపశాంతికొఱకుఁ జేసెడు వినాయకతాళము. అనఁగా బ్రథమకార్యమనుట. ఇందుకు,

> శ్లో. 'యన్నాట్యవస్తునఃపూర్వం రఙ్గవిఘ్నోపశాన్తయే,
> కుశీలవాః ప్రకుర్వంతి పూర్వరఙ్గ స్సకీర్త్యతే.'

అని చెప్పఁబడియున్నది. రసోత్తరంగంబగుట = భావసూచకమగుట, ఎఱిఁగితివికదా=తెలిసికొన్నదానవైతివిగదా, ఇంకసందియంబు వలదని=ఇఁకమీఁద సందేహింపఁబనిలేదని, వీడ్కొని=సెలవుదీసికొని, అవ్వసుంధరాధరునకున్=ఆవసురాజునకు, అవ్వరారోహకున్=ఆగిరికాదేవికిని, అమూల్యకల్యాణ=అనర్ఘమయిన శుభముయొక్కయు, కౌతుక=సంతోషముయొక్కయు, సమృద్ధియుంగావలయు నని=పరిపూర్తిగావలయునని, దీవించి=ఆశీర్వదించి యని యర్థము. కల్యాణమనఁగా వివాహంబును గౌతుకమనఁగాఁ గంకణంబుగనుక వివాహదీక్షా కంకణసంపత్తి గలుగుఁగాక యని దీవించి యనియర్థాంతరము. వారల=ఆగిరికావసురాజుల, వినయసంవిధానంబునన్ = వినయాచరణమువలన, ఆనందమొందుచున్=సంతోషించుచును, మణిమందిరంబు వెడలిచని=మణిమయమయిన గిరికాగృహము బయలుదేరిపోయి, అనతిదూరంబునన్=కొంచెమయినదూరమందు, తోరంబులగు=విస్తారములైన, మందారతరు వారంబుల యీరంబులలోన్ = మందారములనెడు దేవతావృక్షసమూహములయొక్క పొదలలోపల, సారంబగు=శ్రేష్ఠమయిన, తపోధనాకారంబు=మునివేషము, డించి=సడలించి,అనఁగాఁ దీసివైచి, యథాపూర్వవేషంబుతోన్=పూర్వపుమంత్రివేషముతోడ, రాజునన్వేషించు క్రమంబునఁ గ్రమ్మఱనేతెంచి=రాజును వెదకుచు వచ్చినరీతిగా మరలవచ్చి, అమ్మహీమండలాఖండలుంగాంచి=భూమండలమునకింద్రుఁడైన యావసురాజునుజూచి, అద్భుతంబునటించి = ఆశ్చర్యపడినవానివలెఁ జేష్టలు గనుబఱచి, పరిసరంబుననిల్చునవసరంబునన్=పార్శ్వభాగమందు నిలుచున్నసమయమునందు, ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

తే. పడఁతు లారాజసచివుని • పలుకుఁబడియు
మోముచాయయుఁ గని తొంటి • మునియె కాఁగ
నరసి మందాక్షమందమం • దాక్షు లగుచు
నగుచు భావించి రతని వా • గ్నైపుణములు. 63

పడఁతులు=గిరికాదేవిచెలికత్తెలు, ఆరాజసచివుని=ఆరాజమంత్రియొక్క, పలుకుఁబడియున్=మాటకవళికయుఁను, మోముచాయయున్=ముఖముకవళికయును, కని=చూచి, తొంటిమునియె కాఁగన్ నరసి=మునుపువచ్చిన మునీశ్వరునిఁగానే విచారించి, మందాక్ష=సిగ్గుచేత, ని. ('మందాక్షం హ్రీ స్త్రపా వ్రీడా' అని అ.) మందమంద=సూక్ష్మప్రకారమయిన, అక్షులగుచున్=ఇంద్రియములుగలవారగుచును, ('మందాని అక్షాణియాసాంతాః' అని విగ్రహము.) చూపులని యర్థము చెప్పినట్లైన, (మందాని అక్షీణియాసాంతాః = మందాక్ష్యః - దీనికిఁ దత్సమరూపము) మందాక్షులు అని యగును. నగుచున్=నవ్వుచును, అతని వాగ్నైపుణములు = అతనియొక్క వాక్యనిపుణత్వములను, భావించిరి=ఊహించినవారైరి.

తొలుత పలుకుఁబడియుఁ బిదప మోముచాయయుఁ జూచి రాజసచివుని తొల్లిటిమునియను కొనిరి. తమపొరపాటు గుర్తెఱింగి లజ్జనొందిరి. మాయామునిగవచ్చి భాషించిన మాటలయందలి నేర్పరితనమునకు నందఱు నవ్వుకొనిరి.

క. కోలాహలశైలాధిప, లీలాగతుఁ డైనపతి య • లీకయతీంద్రున్
నీలాలకావలోకక • ళాలోలత ననిపె నని త • లంచిరి ముదితల్. 64

కోలాహలశైలాధిప=కోలాహలపర్వతశ్రేష్ఠమందలి, లీలా=విహారార్థముగా, ఆగతుఁడైన=వచ్చిన, పతి=ఈరాజు, నీలాలకా=ఈగిరికాదేవియొక్క, అవలోకకళా=దర్శనక్రియయందలి, లోలతన్=ఆసక్తిచేత, అళీకయతీంద్రున్=కపటమునీశ్వరుని, అనిపెనని=పంపించినాఁడని, ముదితలు=ఆస్త్రీలు, తలంచిరి=భావించినవారైరి. చూపులు నలుపుగను తెలుపుగను వర్ణించుటగలదు. చూపులు తెలుపనుటకు నుదాహరణము లీయఁబడెను. నలుపనుటకు.

సీ. ఇందీవరంబుల నీనుక్రాల్గన్నుల శరదిందుముఖులు చామరలువీవ. (మనుచరిత్రము)

చ. అపు డొకబాల మేలమున • నల్లనఁ బల్కుచు నింతులార యీ
నృపమణిరాకచే నలరి • యీగిరికానన మిప్పు డెంత చొ
క్కపుసిరిఁ దాల్చెఁ జూడుఁ డనఁ • గన్నియ మోమెదఁ జేర్చి సిగ్గు రా
గపుఁదమియుం బెనంగఁ బ్రియుఁ • గాంచెఁ గుచాంచలహారధారలన్. 65

అపుడొకబాల=ఆసమయమం దొకచిన్నది, మేలమునన్=కోడిగముచేత, అల్లనఁ బల్కుచున్=తిన్నఁగాఁ జతురోక్తులు పల్కుచును, ఇంతులార = ఓచెలులారా, ఈనృపమణిరాకచే నలరి=ఈరాజశ్రేష్ఠునియొక్క యాగమనముచేత వికాసమును బొంది, ఈగిరికాననమిప్పు డెంతచొక్కపుసిరిఁ దాల్చెఁజూడుఁడు=ఈకోలాహలపర్వతారణ్య మిప్పుడెంతచక్కని శోభవహించినదో చూడుఁడు అని యర్థము. ఈగిరికాదేవియొక్క ముఖ మిప్పుడెంత చక్కని కళవహించినదో చూడుఁడు అని యర్థాంతరము. గిరి+కాననమని అరణ్యపరముగను గిరికా+ఆననమని కథానాయిక పరముగను బదవిభాగము చేయవలయును.

అనన్=ఇట్లుపలుకఁగా, కన్నియ=గిరికాదేవి, మోమొదఁజేర్చి=ముఖము లొమ్ముపైఁ జేర్చుకొని - అనఁగాఁ దలవంచుకొని, సిగ్గు రాగపుఁదమియుం బెనంగన్ = లజ్జయును ననురాగము యొక్క తమకంబును బెనఁగులాడఁగా, కుచాంచల = స్తనపార్శ్వములయందలి, హారధారలోన్= ముత్యాలహారముయొక్క కాంతిపూరమందు, ప్రియుఁగాంచెన్ = మనోహరుఁడైన వసురాజును జూచెను. అనఁగా హారమౌక్తికకాంతియందుఁ బ్రతిబింబించిన రాజుయొక్క రూపమును జూచెనని భావము.

సిగ్గు రాగపుఁదమియుం బెనంగ నని చెప్పినందున గిరికాదేవి లజ్జామన్మథమధ్యస్థురాలైన మధ్యమ నాయికయని తెలియవలయును. శ్లో. 'లజ్జామన్మథమధ్యస్థామధ్యమా' అని లక్షణము. గిరిక మొకమెత్తిన యెడలఁదాల్చిన చొక్కపుసిరి రాజునకుఁగానవచ్చును. లజ్జాహేతువుగాననటులఁ జూడఁజాలదు. రాగపుఁదమి యూఱకుండనీయదు. కానఁదలవంచెను. బాహుకూలంకషములగు నుబ్బుచనుల ప్రక్కనున్న ముక్తాహారకాంతియందు గిరిక వసురాజునుగాంచి రాగపుఁదమినడంచుకొనెను. అలం. సూక్ష్మ.

తా. గిరికచెంతనున్న యొకబాలిక పరిహాసమునకుఁ జెలిమికత్తెలగాంచి చెలులారా? రాజు రాకచే గిరికాననము (గిరికముఖము. అటవీప్రదేశము) మిగులశోభవహించెననెను. గిరికలజ్జనొంది తలవంపఁగాఁ గుచాంచలహారమునందుఁ బ్రియునిప్రతిబింబముగానవచ్చుటచే రాగపుఁదమి తీఱెను.

చ. అలికులవేణి కీలెఱిఁగి • యాచెలి వెండియు నేకతంబునం
బొలఁతుకలార యీచిగురుఁ•బోఁడికుచార్పిత హారనాయకో
జ్జ్వలరుచిఁ గంటిరే యనినఁ • జంద్రముఖుల్ చిఱునవ్వుఁ బూని రా
లలనలఁ జూచి కిన్కయుఁ గలంకయుఁ గొంకులు నంకురింపఁగన్. 66

అలికులవేణి=గిరికాదేవియొక్క, కీలెఱిఁగి=మర్మము తెలిసికొని, ఆచెలి=మేలమాడుచున్న యా చెలికత్తియ, వెండియున్=తిరుగ, ఏకతంబునన్ = ఏకాంతముగా, పొలఁతుకలార = చెలియలారా, ఈచిగురుఁబోఁడి=ఈగిరికయొక్క, కుచార్పిత= స్తనములయందుఁబూన్పఁబడిన, హార=ముత్యాలహారము నందలి, నాయక=నాయకమణియొక్క, ఉజ్జ్వలరుచిన్=విస్ఫుటమయినకాంతిని, కంటిరే=చూచినా రటే యనియర్థము. కుచార్పిత రత్నహారమందుఁ బ్రతిఫలించిన వసురాజుయొక్క యుజ్జ్వలమయిన లావణ్యమును జూచినారటే యని యర్థాంతరము. నాయకశబ్దము హారమధ్యమణి యందును నధిపతి యందును వర్తించును. (ని.'నాయకో నేతరిశ్రేష్ఠే హారమధ్యమణావపి,అని వి.)అనినన్=అనిపలుకఁగా, చంద్రముఖుల్ చిఱునవ్వుఁ బూనిరి=తక్కిన స్త్రీలందఱును ముసిముసినవ్వును వహించిరి, ఆలలనలఁజూచి =ఆరీతిగాఁ బరిహాసభావము వహించిన స్త్రీలనుజూచి, కిన్కయున్-అనఁగా నమర్షమనెడు సంచారి భావంబును, (ని.'అమర్షస్స్యాత్పరార్థేషుచేతఃప్రజ్వలనమ్' అని అ.) కలంకయున్=తదనుభావమయిన మనఃకాలుష్యమును వ్రీడయనెడు సంచారిభావమును, (ని. 'చేత స్సంకోచనంవ్రీడా' అని అ.) అంకురింపఁగన్=పొటమరింపఁగా, ఇందుకు ముందుపద్యముతో నన్వయము.

పొలఁతుకలార యన్నచోటఁ బొలఁతియనెడునామమునకు స్వార్థమందుఁ గప్రత్యమును నాక ప్రత్యయము పరమగుచుండఁగా నుకారంబును వచ్చినది. ఇందులకు 'నామ్నఃకవర్ణకస్స్యాత్స్వార్థే స్యాదుత్వ మపిపరేతస్మిన్' అని నన్నయభట్టీయము.

గిరిక అమర్షాది భావములొందుట శృంగారమగ్నతను మరుగుపఱచుటకుఁ జెలికత్తెయేకాంతముగ నన్నమాటగావునఁ జెలులందఱు చిఱునవ్వునవ్విరి. ఇదిగిరిక కోపమునకుఁ గలఁతకుఁ గొంతనకుఁ గారణమయ్యెను.

చ. సొలసి తటిల్లతాంగి జిగి•సూపువెలుంగులచేఁ గలధ్వను
ల్గలకలకంఠులం గదిమి•గాటపునెమ్మి నటింప హంసకం
బులు జడియం బయోధరస•మున్నతి భంగురమధ్యపుష్కరాం
చల మరదోఁపఁగా నరిగెఁ•జారు ఘనప్రతిసీర చెంతకున్. 67

ఇక్కడ గిరికను దటిల్లతాంగియనుటవలన నిటనాయికాపరముగను దటిల్లతాపరముగను నర్థద్వయము చెప్పవలయును.

సొలసి=కస్తిపడి, తటిల్లతాంగి=మెఱుపుతీఁగెవంటిదేహముగల గిరికాదేవి-జిగి = కాంతిగలిగిన, చూపువెలుంగులచేన్=దృష్టిప్రభలచేత, కలధ్వనుల్గల = కంఠధ్వనులుగలిగిన-అనఁగా గొణగొణలాడుచున్న, కలకంఠులన్=సఖులను, కదిమి=అదలించినదై యని గిరికాపరమయిన యర్థము. జిగిసూపువెలుంగులచేన్=కాంతిని గనుపఱుచుచున్న ప్రకాశముచేత, కలధ్వనుల్గల=అవ్యక్త మధురధ్వనులుగల, కలకంఠులన్=ఆఁడుకోయిలలను, కదిమి=పోఁదోలి యని తటిత్పరమయిన యర్థము. గాటపు నెమ్మి నటింపన్=గాఢమయిన ప్రీతి విజృంభింపఁగా నని యర్థము. మయూరమునటింపఁగా నని యర్థాంతరము. హంసకంబులు జడియన్ = కాళ్ళయందెలు మ్రోయఁగా నని యర్థము. హంసలు భీతినొందఁగానని, యర్థాంతరము. పయోధరసమున్నతిన్ = కుచభారముచేత, భంగుర = కృశీభూతమగుచున్న, మధ్యపుష్కరాంచలము = పుష్కరమనఁగా నాకాశము గనుక నాకాశ సదృశమయిన నడుముయొక్క యగ్రభాగము, అరదోఁపన్ = సగముగనుపింపఁగా నని యర్థము. పయోధరసమున్నతిన్ = మేఘావరణముచేత, భంగుర=కనుపడకయున్న, మధ్య=నడిమిభాగము గలిగిన, పుష్కర=ఆకాశముయొక్క, అంచలము=అగ్రభాగము, అరదోఁపన్ = సగముగనుపడఁగానని యర్థాంతరము. చారు = సుందరమయిన, ఘన=గొప్పదైన, ప్రతిసీర=తెరయొక్క, చెంతకు = దాపునకు, అరిగెన్=పోయెనని యర్థము. (చారుఘన మనఁగా వర్షాకాలము గనుకఁ దెరవలెనున్న నీలమేఘము చెంతకుఁ బోయెనని యర్థాంతరము.)

గిరికాదేవిసఖులు సేయుచున్న పరిహాసములను సహింపక తెరచాటునకుఁ బోయెననుట. ఇక్కడశ్లేషకృత సాధర్మ్యమూలమయిన యుపమాలంకారము. జిగిసూపు వెలుంగులన్నచోటఁ జూపనెడు పదము మొదటిచకారమునకు రెండర్థములయందును సకారాదేశము వచ్చినది. గిరికాపరమయిన యర్థమందు జిగిగలచూపులని కర్మధారయసమాసము గనుకను దటిత్పరమయిన యర్థమందు 'తస్యాః ప్రథమాచజడపదానాంస్యాత్' న. అనెడు సూత్రముచేత జిగినెడు పదమందుద్వితీయకుఁ బ్రథమ వచ్చినది గనుకను సకారాదేశమువచ్చినది. వెలుంగులచేఁ గలధనులన్నచోట వెలుంగులచే ననెడుపదము కొననున్ననకారము గిరికాపరమయిన యర్థమందు గకారము పరమగుచుండఁగా లోపమును బొందినది-తటిత్పరమయిన యర్థమందుఁ గకారము పరమగుచుండఁగా నర్థబిందు వగుచున్నది. సఖండనిర్బిందువులకు శ్లేషయందు మేళనముగలదు. ఇందుకుఁ బ్రమాణము. 'శ్లేషేసఖండనిర్బిందోర్మేళనంకుత్రచిన్మతమ్' అని యథర్వణవచనము.

వర్షాకాలమున మెఱపులఁ గాంచి కోకిలములు బెదరికూయుటమానుటయు నెమిళ్లునాట్యము చేయుటయు అంచలు బెదరి మానసమునకేగుటయు మేఘములవ్యాప్తిచే నాకాశము సగము కానవచ్చుటయుఁ బ్రసిద్ధములు.

తా. చెలులుగావించు పరిహాసములకు గిరిక కోపగించి వారలనందఱను జూపులచే బెదరించి రాజుపైమక్కువ పిక్కటిల్ల నంచెలు మ్రోయుచుండ గుబ్బలవ్రేగుచే నడుము జవ్వాడఁ దెఱమాటున కేగెను.

తటిల్లత నిజప్రకాశముచేఁ గలకంఠములబెదరించి నెమిళ్లునటన మొనరించుచుండ నంచలు వెఱపునొంద మేఘవ్యాప్తిచే నాకాశము సగముగాన్పింప నీలమేఘమును దరియనేగెనని యర్థాంతరము.

క. పరమాణుమధ్య యీగతిఁ, దెరమాటున కరుగఁ దనివిదీరనిచూడ్కిం
బరమానురాగసూచన, పరమానసుఁ డగుచు ధరణిపాలకుఁ డంతన్. 68

పరమాణుమధ్య=(పరమాణు వనఁగా నున్నదనెడిప్రతీతి గలదై దృష్టిగోచరముగాక యుండెడు రేణువు.) నలుసువంటి నడుముగల గిరికాదేవి, ఈగతిన్=పైనిఁజెప్పఁబడిన ప్రకారము, తెరమాటున కరుగన్=తెరచాటునఁ బోవఁగా, తనివిదీరని చూడ్కిన్ = తృప్తిఁబొందనిచూపుచేత; పరమానురాగ=ఉత్కటమైన ప్రేమయొక్క, సూచన=కనుపఱుచుటయందు, పర=ఆసక్తమైన, మానసుఁడగుచున్=మనస్సుగలవాఁడై, ధరణిపాలకుఁడు=వసురాజు, అంతన్=ఆమీఁదట-ఈపద్యమునకు ముందరిపద్యముతో, నన్వయము. ఈపద్యము ద్విప్రాసముగలదిగాఁ జెప్పంబడియెను.

సీ. మెఱుఁగొప్పునెఱిఁగొప్పు నెఱిగప్పు తఱిగప్పు జలదమాలికచొప్పు దెలుప లేదొ
బలువాలుగల నేలు తెలివాలుగనుడాలు కలువపూదెరమేలు దెలుప లేదొ
నలు వైనకళ లీనఁగలలేనగవుసోనకలశాబ్ధి తెరమేన నిలుప లేదొ
కనకంపునసొంపుకడ నుంపురుచిపెంపు పసిఁడితీఁగలగుంపు మెసఁగ లేదొ
తే. ప్రాణసఖులార నెయ్యంపుఁ బలుకఁబూని, యేల యీబాలయీవేళ నీవిశాల
యవని కాభ్యంతరంబునఁ గరిగెననఁగ, ననుఁగు నెచ్చెలి మఱియు నెయ్యమునఁ జేరి.

మెఱుఁగొప్పు=(అనఁగాఁగొప్పుపక్షమందు నైగనిగ్యముచేతనొప్పుటయును, జలదమాలికాపక్షమందు మెఱుపుతీఁగెచేత నొప్పుటయును గనుక నుభయత్రసమానధర్మము.) నైగనిగ్యముచేత నొప్పుచున్న, నెఱిగొప్ప=గొప్పయయిన కొప్పుయొక్క; నెఱిగప్పు=సంపూర్ణమైన నీలకాంతి, తఱిగప్పు=తఱియనఁగా వర్షాకాలము – దానియందు నావరించునట్టి, జలదమాలికచొప్పు = మేఘపంక్తియొక్క రీతిని, తెలుపలేదొ=కనుపఱుపలేదా-అనఁగాఁ గొప్పుయొక్క నీలకాంతి కాలమేఘము గ్రమ్మినట్టులు గ్రమ్మి తన్నుఁగనుపడకుండఁజేయుచుండ జెలువతనంతటఁ దానె కానరాకున్నది. ఇట్టిచోఁ జాటునకేల పోవలసివచ్చెనో యనిభావము.

బలువాలుగలనేలు=వాలుగలనఁగా మీనవిశేషములు-వాని నేలుటయనఁగా నేత్రపక్షమందుఁ దిరస్కరించుటయుఁ గుముదపక్షమందుఁ గ్రిందుపడఁ జేయుటయును గనుక నుభయత్ర సమానధర్మము. గొప్పలైన వాలుగచేఁపలను దిరస్కరించుచున్న, తెలి=ధవళకాంతిగలిగిన, వాలు = సోగలైన, కను=

నేత్రములయొక్క, డాలు=ప్రభ, కలువపూదెరమేలు దెలుపలేదో=కలువపువ్వుల తెరయొక్క సొగసును బొందింపలేదా-లేదా అనఁగా నేత్రప్రభలు కలువపువ్వుల తెర గ్రమ్మినట్టులు గ్రమ్మి తన్నుఁ గనుపడకుండఁ జేయుచుండలేదా యనుట. కనులు తెల్లఁగానుంటచేఁ దెల్లకలువపూ తెరవలె నుండెనని భావము. చూపులను దెలుపుగా వర్ణించుటగూడఁ గవిసమయమై యున్నది. చూడుఁడు.

ఉ. నీకనుదోయివెన్నెలలు నిండక కోర్కులు నాకు నిండునే. హరివంశము. ఆ. ౧

చ. పతిగని లజ్జ నాననము పాయఁగ నల్లన వాంచి సమ్మదా
మృతరసపూరితార్థ వినిమీలితలోల కటాక్షవీక్షణా
యతసితదీధితుల్ గలయ నద్రిజ విచ్చె మహేశుమీఁద రా
జతగిరి మీఁదనున్నతి నిశాకర దీప్తులు గప్పునొప్పుగన్.

నన్నెచోడుని కుమారసంభవము, షష్ఠాశ్వాసము.

క. వాలికలై వెలిదమ్ముల, పోలికలై చందమామ పులుఁగులకుందా
మేలికలై నరసభూపాలీయము.

నలువైన కళలీనఁగల లేనగవుసోన=(కళలీనుటయనఁగా మందహాసపక్షమందుఁ దళతళయను కాంతుల నుత్పాదించుటయును, క్షీరసముద్రపక్షమందుఁ జంద్రకళల నుత్పాదించుటయును గనుక నుభయత్ర సమానధర్మము.) ఒప్పిదమయిన తళతళ కాంతుల నుత్పాదింపఁ జాలిన మందహాసమనెడు సోనవాన, కలశాబ్ధి తెర=క్షీరసముద్ర తరంగమనెడు తెరను, మేననిలుపలేదో=శరీరమందు వ్యాపింపఁ జేయలేదా. అనఁగాఁ జిఱునగవు సోనవాన క్షీరసముద్రతరంగము గ్రమ్మినట్టులు గ్రమ్మి నన్నుఁ గనుపడకుండఁ జేయలేదా యనుట. చిఱునగవు తరంగములకు నేనావలనుంటిని గావున నాయమను నేను జూడఁజాలకుంటిని గదా! చాటునకేల యేగవలసివచ్చెనని భావము.

కనకంపు ననసొంపు కడనుంపు రుచి పెంపు=కనకమనఁగా సంపఁగిచెట్టు ననయనఁగా బువ్వు గనుక సంపఁగిపువ్వుయొక్క సాదృశ్యము శరీరలావణ్యమునకును బంగారుతీఁగెలకును సమానధర్మము. సంపఁగిపువ్వుయొక్క సౌష్ఠవమును దిరస్కరించుచున్న శరీరలావణ్యాతిశయము. పసిఁడితీఁగెలగుంపు మెసఁగలేదో=బంగారుతీఁగెలగుంపు తెరను గలుగఁ జేయలేదా-అనఁగా శరీరలావణ్యాతిశయము బంగారుతీఁగెలగుంపు గ్రమ్మినట్టులు గ్రమ్మి తన్నుఁ గనుపడకుండునట్లు చేయుచుండలేదా యనుట.

ప్రాణసఖులార = గిరికయొక్క ప్రాణపదమైన చెలికత్తియలారా, నెయ్యంపుటలుకఁబూని = ప్రణయకోపమును వహించి, ఏల = ఎందునిమిత్తము, ఈబాల=ఈగిరికాదేవి, ఈవేళన్=ఈసమయమందు, ఈవిశాల యవనికాభ్యంతరంబున కరిగెన్=విస్తారమయిన యీ తెరలోపలికిఁ బోయెను. (ని. 'ప్రతిసీరా యవనికా స్యాత్తిరస్కరణీ చసా' అని అ. అనఁగన్=అనివసురాజు పలుకఁగా అనుఁగునెచ్చెలి=ప్రియసఖియైన మంజువాణి, నెఱచెలి-నెచ్చెలి-అని సంధివచ్చినది. మఱియు, నెయ్యమునఁ జేరి=మిక్కిలి మైత్రిచేత గిరికాసమీపమునకుఁ బోయినదై, కనకమనఁగా సంపఁగిచెట్టు, (ని. కనకం కాఞ్చనే నాతు దుత్తూరే నాగకేసరే, చంపకే కాఞ్చనాగేచ' అని నా.) ముందరిపద్యముతో నన్వయము.

అలంకారము, ఉపమాధ్వని, సమాధి.

గిరిక నెఱిగుంపు జలదమాలికవలెను, డెలిచూపులు కలువపూవుఁదెరవలెను, లేనగవుక్షీరసముద్రతరంగములవలెను మేనుదీవ బంగారుతీవలవలెను నుండెననిభావము. ఆయాయవయవములే ప్రతిసీరవలెనుండఁ జాటునకుఁ బోనేలనని వసురాజు చెలికత్తియలనడుగుచున్నాఁడు.

తే. అభినవాలోకనోత్కంఠ♦నధిపుఁ డలర
నలరుఁబోఁడి సమగ్రల♦జ్జానుభావ
భావ యై తెరమాటునఁ ♦ బగటు చూపఁ
జూపఱకుఁ దోఁచెఁ బరిణయ♦స్ఫూర్తి యనుడు. 70

అభినవాలోక నోత్కంఠన్=తిరిగిచూచుట యందలి యాతుర్యముచేత ననియర్థము. (క్రొత్తగాఁ జూచుట యందలియుల్లాసముచేత నని యర్థాంతరము.) అధిపుఁడలరన్ = అధిపుఁ డనఁగా రాజని యర్థము. (పెండ్లికుమారుఁడని యర్థాంతరము.) అలరన్ = ఒప్పుచుండఁగా, అలరుఁబోఁడి= ఈగిరికాదేవి, సమగ్ర=పరిపూర్ణమైన, లజ్జానుభావ = ముఖము వంచుకొనుట యనెడు లజ్జయొక్కయనుభావముతోఁగూడిన, భావయై=రతియనెడు స్థాయిభావముగలదై, తెరమాటునఁ బగటుచూపన్ = తెరచాటున మురిపెముగనుపఱుపఁగా, చూపఱకున్=చూచువారికి, పరిణయస్ఫూర్తి = వివాహస్ఫురణము, తోఁచెన్=కనుపడెను, అనుడున్=అని యాదృచ్ఛికముగాఁ బలుకఁగా. అలం—స్మరణము.

తా. మరలమరల గిరికను గాంచుటకు వసురాజుత్సాహపడుటయు గిరిక లజ్జాభావముతోఁ డెరచాటున కేగుటయు వివాహ స్ఫురణమును గలుగఁ జేయుచున్నదని చెలిపలుకఁగా (ముందటిపద్యముతో నన్వయము)

చ. విని కలకాకుఘోష మొద♦వించుమదాళిని బక్షగౌరవం
బెనయ నదల్చి మంజుగతి ♦ నీవనజాతములో మదీయఖే
లనముల కెల్లఁ దోడయి మె♦లంగఁగ నాకలహంసి రాదొకో
జననిపయస్య యంచు నగ♦జాత మదిం దలపోయు చున్నెడన్. 71

విని=ఆలకించి, కల=అవ్యక్తమధురమయిన, కాకు = వికారస్వరముగలిగిన, ఘోష మొదవించు=అంతుసేయుచున్న, మదాళినిన్=మదయుక్తమైన తుమ్మెదను, పక్షగౌరవం బెనయనదల్చి=తనఱెక్కలయొక్క యతిశయము ప్రకాశించునట్లుగా నదలించి యని యర్థము. మదాళిని=నాచెలికత్తెను-అనఁగా మంజువాణిని, పక్షగౌరవంబెనయన్=సహాయగురుత్వ మొప్పునట్లుగా - కసరుకొని యని యర్థాంతరము. (ని. 'పక్ష స్సహాయేపి' అని అ.) అదల్చుటకుఁ గలహంసికర్త్రి యని గ్రహింపవలయును. మంజుగతిన్=మృదుగతిని, ఈవనజాతములోన్=ఈవనసమూహములో, ఈ తామర యందని యర్థాంతరము.

మదీయ ఖేలనముల కెల్లన్ = నాయొక్క యాటలకన్నిటికిని, తోడయి=సహాయమై, మెలఁగఁగన్=సంచరించుటకు, జననిపయస్య=మాతల్లియైన శుక్తిమతియొక్క సఖియయిన, ఆకలహంసి= ఆకలహంసస్త్రీ, రాదొకో=రాదాయేమి, అంచున్=అనుకొనుచు, నగజాత=గిరికాదేవి, మదిం దలపోయుచున్నెడన్=మనస్సున విచారించుచున్న సమయమునందు-జననిపయస్య యనుపదమునకు జననపయస్య యనుపాఠాంతరము గలదు. ఆపదమునకుఁబుట్టిన నాఁటనుండి సఖియయిన యాకలహంసి యని యర్థము. ఈయర్థమే విద్వజ్జనరంజనీవ్యాఖ్యాత యగుసోమకవిహృదయము.

కలహంసినాజనని చెలికత్తె, ఆయమవచ్చెనేని నాపక్షమూని చెలినదలించి నావనవిహారమును సార్థకమొనరించును గదాయని గిరికాదేవి దలంచెననుట ప్రకృతార్థము.

కలహంసినాజననియగు శక్తిమతికిఁ జెలికత్తె. అదియిటనున్న వికృతస్వరముఁజేయు తుమ్మెదలనదలించి యీతమ్మికొలఁకులలో విహరించుటలో సాయపడుఁగదా యని యర్థాంతరము.

చ. ఆకలహంసి వచ్చి యచలాత్మజఁ గాంచి కుమారి తాపసా
నీకము నీ కమూల్యశుభనిర్వహణంబు ఘటిల్లఁ గల్పకా
నోకహసూనరాజము లనూనమనూక్తులతో నొసంగినం
గైకొని తల్లి నిన్బిలువఁ గాఁ బనిచెన్ విరులిచ్చు వేడుకన్. 72

ఆకలహంసివచ్చి = గిరికాదేవి యేకలహంసిని గూర్చి రాకపోయె నని విచారించుచుండెనో యాకలహంసి వచ్చినదై, అచలాత్మజఁ గాంచి = గిరికాదేవినిజూచి, కుమారి=ఓచిన్నదానా, తాపసానీకము=మునిసమూహము, నీకున్ = నీకొఱకు, అమూల్యశుభనిర్వహణంబుఘటిల్లన్ = అనర్ఘమైన కల్యాణకార్యసిద్ధి సమకూడునట్టులుగా, కల్పకానోకహ సూనరాజములు = కల్పతరుపుష్పశ్రేష్ఠములు, అనూన=పరిపూర్ణమయిన, మనూక్తులతోన్=ఆశీర్మంత్రవాక్యములతోఁ గూడ, ఒసంగినన్ =ఇయ్యఁగా, కైకొని=గ్రహించి, తల్లి=మీతల్లియైన శక్తిమతి, విరులిచ్చువేడుకన్ = ఆపుష్పములు నీకియ్యవలెనను సంతోషముచేత, నిన్బిలువఁగాఁ బనిచెన్=నిన్నుఁబిల్వ నంపించెను-ఇచ్చట సంశ్లేషమువచ్చినది. ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. అలం-శ్లేషము.

అమూల్యశుభ నిర్వహణము కళ్యాణము. మంజువాణియనిన పరిణయస్ఫూర్తి క్రియరూపముఁ దాల్చెను. మునిబృందము ఆశీఃపురస్సరముగాఁ గల్ప ప్రసూనరాజములను శుభ నిర్వహణము ఘటిల్లుట కొసంగిరి. కాన శుభప్రాప్తి యచిరమున నుండెను. కావునఁ బిలువఁబంచెనని భావము.

క. రా రమ్మనఁ గోమలి కుచ,భారమ్మున నడుము వడఁకఁ బదకటకఝణ
త్కారమ్ము లెసఁగఁ గుసుమా,సారమ్ములు కబరిఁ దొరఁగఁ జనఁదివురుటయున్.

రారమ్మనన్=రమ్మురమ్మని పిలువఁగా, కోమలి=గిరికాదేవి, కుచభారమ్మున నడుమువడఁకన్=స్తనగౌరవముచేత నడుము జవజవలాడఁగా, పదకటక = కాళ్ళయందెలయొక్క, ఝణత్కారమ్ములు = ఝణఝణధ్వనులు, ఎసఁగన్ = అతిశయింపఁగా, కుసుమాసారమ్ములు = పువ్వులవానలు, కబరిఁదొరఁగన్=కొప్పునుండి విడివడి కురియఁగా-అనఁగా కొప్పులోఁ దురిమిన పూవులు రాలఁగా ననుట. చనఁ దివురుటయున్=పోవ నుద్యోగింపఁగా అనఁగాఁ బోఁజూడఁగాననుట. ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. ఈపద్యము ద్విప్రాసముగలదిగాఁ జెప్పఁబడియెను. పదకటకములనఁగాఁ గాళ్ళయందెలు (ని. 'హంసకః పాదకటకః' అని యమరము.

చ. నెనరునఁ జెయ్యి వట్టి తరుణీ ధరణీసరణీపురందరుం
డనుపక పోవు టెట్లు తగవా నగ వారడి వెట్టనేంచు జ
వ్వనిఁ జెలు లెల్ల నిల్పి మహివల్లభ మాచెలిమీఁదిప్రేమ నీ
మనమునఁ బాయ కుండు మని మానినిఁ దోడ్కొని పోవునంతటన్. 74

నెనరునఁ జెయ్యివట్టి=ప్రేమచేత హస్తమును బట్టుకొని, తరుణీ=ఓగిరికాదేవీ, ధరణీ సరణీ పురందరుండు=భూమార్గగతుఁడైన భూదేవేంద్రుఁడయిన వసురాజు, రాజనక పురందరుఁడనుటవలన వసురాజన్యసామాన్యుఁడనియు నతనిని బోలువారు వేల్పులెగాని నరులు గారనుట.

అనుపక=సెలవిచ్చి పంపకయుండఁగా, పోవుటెట్లు=పోవుటయెట్టిది, తగవా నగ వారడివెట్టన్=హాస్యాపకీర్తులఁ బెట్టుట మర్యాదయే, అంచున్=అనిపలుకుచు, జవ్వనిఁ జెలువెల్లనిల్పి=గిరికాదేవిని జెలికత్తియలందఱును బోనీయక నిరోధించి, మహివల్లభ=రాజా, మాచెలిమీఁది ప్రేమ నీమనమునఁ బాయకుండుమని=మాచిన్నదానిమీఁది యనురాగము నీమనస్సునందు వదలకయుండుమని పల్కి, మానినిఁ దోడ్కొనిపోవునంతటన్ = గిరికాదేవిని వెంటఁబెట్టుకొని పోయినమీఁదట, నెనరనఁగాఁ బ్రియము.

తే. ‘పేర్మి యర్మిలి మక్కువ కూర్మి నెమ్మి, నెనరు గాదిలి గారము నెయ్య మింపు,
ప్రేముడి యనుంగు ముద్దనఁ బ్రియములకును, నామధేయంబులయ్యెఁ బినాకపాణి.’
అని యాంధ్రనామశేషము.

ఈ పద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

చ. శతపత్త్రేక్షణ వెంట నంటినవసు♦క్ష్మాపాలకాలోకముం
బ్రతిరోధింపఁగఁ జాల దయ్యె భవన♦ప్రాంతోరుకాంతారవే
ల్లిత వల్లీవలయంబు తచ్చికురపా♦ళీనీరదాళీమిళ
న్నృతికేళీరసకేకిలోకగరుదు♦న్మీలన్మరుల్లోల మై. 75

శతపత్త్రేక్షణ వెంటనంటిన = తామరరేకులవంటి కన్నులు గలగిరికాదేవిని వెనుతగిలిన, వసుక్ష్మాపాల కాలోకమున్ = వసురాజు దృష్టిని, భవన = గిరికామణి మందిరముయొక్క, ప్రాంత=సమీపమందలి, ఉరు=అధికమైన, కాంతార=అరణ్యమందు, వేల్లిత=వక్రములైన. (ని. ‘వేల్లితంవక్ర మిత్యపి)’ అని అ.) వల్లీవలయంబు=తీఁగెలగుంపు, తత్=గిరికాదేవియొక్క, చికురపాళీ=తలవెండ్రుకలయొక్క గుంపనెడు, నీరదాళీ=మేఘపంక్తితోడ, మిళత్=కూడుకొనుచున్న, నృతికేళీరస=నాట్యక్రీడారతిగల, కేకిలోక=మయూర సమూహముయొక్క, గరుత్=ఱెక్కలవల్లనుండి, ఉన్మీలత్=ప్రసరించుచున్న, మరుత్=వాయువుచేత, లోలమై=చలించుచున్నదై, ప్రతిరోధింపఁగఁ జాల దయ్యెన్=అడ్డగింప లేదాయెను.

తా. గిరికాదేవిని హంసాంగన వెంటఁ బెట్టుకొనిపోఁగా మిక్కిలి ప్రేమచేత గిరికాదేవిపైఁ జూచుచున్న వసురాజు దృష్టికి నాగిరికామందిర సమీపమందలి వృక్షముల నవలంబించియున్న తీఁగెలగుంపు లడ్డముగానుండిన వయినను గిరికాదేవియొక్క తలవెండ్రుకలవలన మేఘభ్రాంతిజనియించి నాట్యము నేయుచున్న నెమలిగుంపులయొక్క ఱెక్కలగాడ్పులచేతఁ జెదరిపోవుచు సందిచ్చుచునుండుటచేత వసురాజుయొక్క దృష్టి నివారింపఁ బడనిదై, గిరికాదేవి వెంటనే సాగిపోయెను.

అలంకారము-సమాధి. భ్రాంతిమతము. వ్యంగ్యము.

చ. వనతరువల్లికాకుసుమ♦వాసన లొల్లక శైలకన్యకా
ఘనఘనవేణి కాభరము♦కమ్మని తావికిఁ జిక్కి మ్రొయ్యుచున్

వెనుచనియెఁ ద్విరేఫములు • వేమఱు భావివియోగచింతచే
వనరుచు వెంటఁ బోవుమహి•వల్లభుచూపులప్రోవులో యనన్. 76

వన=అరణ్యమందలి, తరు=వృక్షములయొక్కయు, వల్లికా=తీఁగెలయొక్కయు, కుసుమ=పుష్పములయందలి, వాసనలొల్లక=పరిమళములయం దిష్టములేక, శైలకన్యకా = గిరికాదేవియొక్క, ఘన=మేఘసమానమును, ఘన=గొప్పదియు నయిన, వేణికాభరము=జడయొక్క, కమ్మనితావికిఁజిక్కి=మనోహరమయిన పరిమళమునకు లోఁబడి, మ్రోయుచున్ = ఝుంకారము సేయుచు, ద్విరేఫములు=తుమ్మెదలు, వెనుచనియెన్ = వెంటనంటి పోయెను. ఏలాగుననినిన, వేమఱున్ = మాటిమాటికిని, భావి వియోగ చింతచేన్=ముందు సంభవింపఁబోవు నెడబాటువలని విచారముచేత, వనరుచున్=విలపించుచు, వెంటఁబోవు = గిరికాదేవివెంబడిగాఁ బోవుచున్న, మహివల్లభు చూపుల ప్రోవులో యనన్ = వసురాజుయొక్క దృష్టిసమూహములో యనునట్టులుగాఁ దుమ్మెదలు వెనుచనియెనని సంబంధము.

ఇందులో భావివియోగమనఁగా నభిలాషనామక మయిన విప్రలంభ శృంగారము. ఇందుకు-

చ. 'కలయకమున్న రాగ మధికంబగునే నభిలాష యిద్దఱుం
గలసినమీఁదఁ బాయుట తగ స్విరహంబు నిజేశుఁ డొండుతో
య్యలిఁ గవయంగ నవ్వనిత యల్గుట యీర్ష్య విదేశవాసులై
నిలుచుట దాఁ బ్రవాసము గణింపఁగ నిన్నియు విప్రలంభముల్.
నరసభూపాలీయము.

అలంకారము. ఉత్ప్రేక్ష.

వనమునందలితరువులు. లతలు విరియఁబూచినను దుమ్మెదలు వానితావులొల్లక వేణికాభరమును ముసరియుండుటకుఁగారణము వేణికాభరమునఁ గమ్మనితావు లొలయుటయే, ఘనవేణిగావునఁ దుమ్మెదలగుంపులకు సేవనీయమయ్యెను. తావికిఁ జిక్కినతేటులు మ్రోయుచుఁ బెన్నేరివెంట నేగిన టుల రాజుచూపులు భావివియోగచింతచే వనరుచు గిరికవెంట నేగెను.

తే. ఆళిహస్తావలంబనం • బడర నడుచు, కన్యఁ దదధీనవృత్తి యై • కాంచునట్టి
వసుపతినిరంతరాలోక•వైభవంబు, సాగనీ దయ్యెఁ గన్నీటి•జడి గడంగి. 77

ఆళి=చెలికత్తియయొక్క, హస్తావలంబనంబడరన్ = కైదండయొప్పఁగా, నడుచు = నడిచి పోవుచున్న, కన్య=గిరికాదేవిని అనియర్థము. ('ఉత్తరాయాంత్రయః పాదాః హస్తచిత్రార్ధం కన్యా') అనియున్నది గనుక హస్తానక్షత్రముయొక్క యవలంబన మొప్పఁగా వర్ణించు కన్యారాశినని యర్థాంతరము. తదధీనవృత్తియై = గిరికావశమయిన మనోవ్యాపారము గలవాఁడై, కాంచునట్టి = చూచుచున్న, వసుపతి=వసురాజుయొక్క, నిరంతరాలోక వైభవంబున్=ఎడతెగని దృష్టిసంపద నని యర్థము. కన్యారాశి కధీనమయిన వ్యాపారముగలవాఁడై ప్రాపించుచున్న సూర్యునియొక్క యెడతెగని తేజస్సంపదనని యర్థాంతరము. సాగనీదయ్యెఁ గన్నీటిజడి గడంగి=కన్నీటిజడియనఁగాఁ గన్నీరనెడు ముసురువాన, కడంగి=ఉద్రేకించి, సాగనీదయ్యెన్=ప్రసరింపనీయదాయె ననివసురాజు దృష్టిఫరమయిన యర్థము.

ముసురువాన బ్రసరింప నీయదాయె నని సూర్యతేజః పరమయిన యర్థాంతరము.

సూర్యుఁడు కన్యారాశియందు హస్తానక్షత్రగతుఁడైన ముసురుపట్టి వానగురియుట ప్రసిద్ధము గదా? ఇక్కడ వసురాజున కశ్రుసముద్గమముఁ జెప్పినాఁడు గనుక నిది సాత్త్వికభావోదయ మని విచారింపవలయును. ఇందుకులక్షణము,

క. 'సంతోషరోషదుఃఖా, క్రాంతస్వాంతులకుఁ బొడముకన్నులనీళ్ళం
జింతింప నశ్రులని వర్ణింతురు భావవిదులగు మనీషులు కృతులన్.'

అలంకారము. శ్లేషము.

భావివియోగచింతచేఁ జూచుటయే తదధీనవృత్తిగాంచుట, కావుననే యాలోకనములు నిరంతరముగనుండుట, గిరికాసందర్శనలాలసములగు చూపులను నిఁక యేదియు నాపఁజాలదయ్యెను. అని వార్యమగుకన్నీటి జడిచేఁ జూపులు సాగవయ్యెను.

చ. కలికియు నానృపాలకునిఁ • గ్రమ్మఱఁ జూచుచు నేగె నేర్పుతో
నలఘుపదాంగదధ్వనికి • నంచలు మూఁగిన నిల్చి నెయ్యపుం
జెలువలఁ గూడఁ బిల్చుగతిఁ • జిల్కలకుఁ బార్శ్వలతాంచలంబులన్
ఫలము దెమల్చురీతి నళి•పంక్తికి మోము మలంచుకైవడిన్. 78

కలికియున్=గిరికాదేవియును, నేర్పుతోన్=ఉపాయముతోడ, ఆనృపాలకునిన్=ఆవసురాజును, క్రమ్మఱఁజూచుచు నేగెన్=తిరిగి చూచుచుఁ బోయెను. ఏలాగునననిన, అలఘు పదాంగదధ్వనికి నంచలు మూఁగిన నిల్చి=అతిశయమయిన కాళ్ల యందెల మ్రోఁతకు స్వజాతి పక్షుల కలధ్వని భ్రాంతిచేత హంసలు కాళ్లుఁ జుట్టుకోఁగా నిలిచినదై, నెయ్యపుంజెలువలఁ గూడఁబిల్చుగతిన్=ప్రియసఖులను గూడరమ్మని తిరిగిచూచి పిలుచునట్టులుగాను, చిల్కలకుఁ బార్శ్వలతాంచలంబులన్ ఫలము దెమల్చురీతిన్=చేతప్రాలియున్న చిలుకకుఁ దనపార్శ్వభాగములనున్న శాఖాగ్రములయందలి పండును దిరిగి కోయునట్టులుగను, అళిపంక్తికి మోము మలంచుకైవడిన్=కమల భ్రాంతిచేత ప్రాలవచ్చెడు తుమ్మెదచాలునకు ముఖము ద్రిప్పినట్టులుగను-అనఁగా నీచెప్పఁబడిన మిషలచేత వసురాజును దిరిగి చూచుచుఁబోయె నని సంబంధము. గిరిక వసురాజును దిలకించుటకు మెలకువమెయి మెలఁగెను. కాలియందెలు మిగుల మ్రోయుచుండ నంచలడ్డమువచ్చెను. వానిని వారించునట్లును, వెనుకనున్నచెలిమికత్తెలను గలుపుకొనుటకుఁ బిలుచునట్లును, ప్రక్కకొమ్మనున్న ఫలముగోసి చిలుకనోటి కందించునట్లును నటించితిరిగిచూచుచు నేగెను. చూచిపోవుటకాక చూచుచుఁబోవుట యనురాగాతిశయమునకు హేతువు.

ఉ. ఆనగరాజభేదియును • నానఁగ రానిమనోరథంబుతో
మానిని నాత్మ నిల్పి ధృతి • మాని నిరంతరబాష్పవారిఁ గ
న్గోనల నాని మానికపు • గోనలలో నెలమావికానలో
నాననవిల్తుఁ డేప నలి•నానన యేగినజాడ నేగుచున్. 79

ఆనగరాజ భేదియునున్=కోలాహలపర్వత రాజభంజనుఁడైన యావసురాజును, ఆనఁగరాని మనోరథంబుతోన్=ఆపఁగూడని యభిలాషముతోడ, మానిని నాత్మనిల్పి=గిరికాదేవిని హృదయమం

దుఁ బాదుకొల్పి, ధృతిమాని = ధైర్యమువిడిచి, నిరంతర = ఎడతెగక క్రమ్ముచున్న, బాష్పవారిన్ = కన్నీటిని, కన్గొనలనాని=నేత్రకోణములయందు నాఁగఁబట్టి, మానికపుఁగోనలలోను=మణిమయములైన చరియలలోను, ఎలమావికానలోన్=లేఁతమామిడి యడవిలోను, ఆ ననవిల్తుఁడేపన్ = ఆమన్మథుఁడు వేధింపఁగా, నలినానన యేగినజాడ నేగుచున్ = పద్మమువంటిముఖము గల గిరికాదేవిపోయిన త్రోవ వెంటనే పోవుచు, ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. ఇందులో మానిని నాత్మనిల్పి యని చెప్పినందున వసురాజునకు ద్వితీయావస్థ యైనమనస్సంగ మారబ్ధమాయెనని తెలియవలెను. నగరాజభేదిగావున వసురాజు ధైర్యశాలి. అట్టిరాజు ధృతిమానుట మానిని నాత్మనిల్పుటవలననే. అతఁడు దిట్టగావున వలపుచే వాపోవక దట్టమైనకన్నీటిని గన్గొనలలోనాపఁగలిగెను. ననవిల్తుఁడేచుటచే మనసుచెదరి చెంతనున్న మానికపుఁగోనలకు నెలమావి తోఁటలకు నేగెను. అవియు మన్మథోద్దీపనములయ్యెను.

నెత్తము లుపభోగయోగ్యములనుటకు-

శ్లో. ఆమేఘులం సంచరతం ఘనానాం, ఛాయా మధస్సానుమతాం నిషేవ్య
ఉద్వేజితావృష్టిభిరాశ్రయంతే, శృంగాణియస్యాతప వంతిసిద్ధాః.

ఎలమావికాన శృంగారోద్దీపనమనుటకు-

శ్లో. పాంథస్త్రీ విరహానలాహుతి కలా మాతన్వతీ మంజరీ
మాకందేషు పికాంగనాభిరధునా సోత్కంఠమాలోక్యతే. భర్తృహరిసుభాషితము.

సీ. కాఁబోలు నివి బాల • కమనీయపదలీల లిచటఁ బల్లవజాల • మినుమడించెఁ
గాఁబోలునిది బోఁటి • గనుఁగొన్న వనవాటి యిచటభృంగీకోటి • రుచుల నెఱసెఁ
గాఁబోలు నీవంక • కలికి పల్కినపొంక మిచటఁ దేనియవంక • లింక కొదవెఁ
గాఁబోలునీచాయ • కాంత నవ్వినచాయ లిచట సూననికాయ • మింపు మెఱసెఁ
తే. జూచితె వయస్య యనుచు న • శోక తిలక, కర్ణికార నమేరు సం • ఘాతలతల
నలరునారామసరణిలో • నరసి యరసి, సరసిజాననఁ గానక • సంభ్రమించి. 80

ఇవి=ఈకనుపడునట్టివి, బాల కమనీయ పదలీలలు=గిరికాదేవియొక్క సుందరమైన పాదవిన్యాసములు, కాఁబోలున్=అయి యుండవచ్చును. ఎందువల్లననిన, ఇచటఁ బల్లవజాల మినుమడించెన్= ఇక్కడఁ జిగురుటాకులగుంపు రెట్టింపైనది - అనఁగా గిరికాదేవి పాదములునుఁ జిగురుటాకులవంటివి యయినందునఁ జిగుళ్లినుమడించిన వని భావము. ఇంతియకాక యీపద్యగీతిలో నశోకతిలక కర్ణికార నమేరు సంఘాతలతల నలరు నారామసరణిలో నని చెప్పుటచేతఁ గ్రమానుసారముగా నీచరణమందుఁ బాదవిన్యాసరూప దోహదవిశేషముచేత నశోకము చిగిరించుటవలనఁ బల్లవసముదాయ మినుమడించె నని చెప్పినాఁ డనియును భావము. ఇది=ఈకనుపడునట్టిది, బోఁటికనుఁగొన్నవనవాటి=గిరికాదేవిచూచిన వనశ్రేణి, కాఁబోలున్ = అయియుండవచ్చును. ఎందువల్లననిన, ఇచట భృంగీకోటిరుచులు నెఱసెన్=ఇక్కడ నాఁడుతుమ్మెదగుంపులయొక్క కాంతులు వ్యాపించెను. అనఁగా గిరికాదేవిచూపులు తుమ్మెదలవంటివి గనుక వానియొక్క వ్యాప్తి తుమ్మెదలుగాఁ గనుపడు చున్నదని భావము. ఇదిగాక యీచరణమందు వీక్షణరూప దోహదవిశేషముచేతఁ దిలకవృక్షము పుష్పించినదని చెప్పినాఁడనియును భావము.

ఈవంకన్=ఈపార్శ్వమందు,కలికి వల్కు-నపొంకము=గిరికాదేవి సల్లాపము జరిగించిన సంగతి, కాఁబోలున్=అయి యుండవచ్చును. ఎందువల్లననిన, ఇచటఁ దేనియవంకలింకకొదవెన్=ఇక్కడఁ బూఁదేనెకాలువ లిగిరిపోకయొప్పుచున్నవి. అనఁగా గిరికాదేవి పలుకులును దేనియలవంటివి గనుక వానివలనఁ బూఁదేనెకాలువలు మకరందసమృద్ధిని బొందిన వనిభావము. ఇంతియకాక యీచరణ మందు సల్లాపరూప దోహదవిశేషముచేతఁ గొండగోఁగుచెట్టు పుష్పించి మకరందము గురియించిన దని చెప్పినాఁడనియును భావము. ఈచాయన్=ఈవైపున, కాంతనవ్వినచాయలు=గిరికాదేవి నవ్విన జాడలు, కాఁబోలున్ = అయియుండవచ్చును. ఎందువల్లననిన, ఇచట సూననికాయ మింపుమెఱ సెన్ = ఇక్కడఁ బుష్పసముదాయముచూడ నింపుగానున్నది. అనఁగా గిరికాదేవి నవ్వులును బుష్ప ములవంటివి గనుక వానివాలన నిక్కడిపుష్పసముదాయ మింపగుచున్నదని భావము. పుష్పసామాన్య మును శ్వేతగణములోఁ జేర్చుటకవిసమయసిద్ధము.

శ్లో. సామాన్య గ్రహణేవారి ముచాంకృష్ణత్వమేవహి
రక్తత్వమేవ రత్నానాం పుష్పాణాం శౌక్లమేవచ. కావ్యకల్పలత.

దోహదవిధులు-

శ్లో. ఆలింగ నాత్కురువక శ్చంపకో ముఖదర్శనాత్
చూతో యోషిత్కరస్పర్శాత్ తిలకో దృక్ప్రసారణాత్
ఆకర్ణనాత్కర్ణి కారస్త్వశోకః పాదతాడనాత్
దాడిమీధూమసందోహాత్ ప్రియాళుర్గాన దర్శనః.

ఇంతియకాక యీచరణమందు హాసనరూప దోహదవిశేషముచేతఁ బొన్నచెట్టు పుష్పించినదని చెప్పినాఁడనియును భావము.

చూచితె వయస్య యనుచున్=చూచినావా స్నేహితుఁడా యని పలుకుచు, అశోకతిలకకర్ణి కార నమేరు సంఘాతలతల నలరు=అశోకము, బొట్టుగు, కొండగోఁగు, సురపొన్న అనువాని సమూ హములయొక్క శాఖలచేత నొప్పుచున్న, ఆరామసరణిలోన్=వనమార్గమందు. అరసియరసి=మాటి మాటికివెదకి, సరసిజాననఁ గానక=గిరికాదేవిని జూడక-అనఁగా నామె కాన్పించక, సంభ్రమించి= తొందరపడినవాఁడై, ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. ఈపద్యము పెద్దపాదములు త్రి ప్రాసముగలవిగను ననుప్రాసముగలవిగను జెప్పంబడియెను.

చ. కళికలు లేఁజిగుళ్లు నవ♦కంపుటనంటులు కప్పురంపుది
ప్పలు ననగుత్తులున్ లతలు ♦ పద్మములు న్సమదాళిజాలము
ల్వెలయ మనోజరాజభుజ♦వీర్య మవార్య మొనర్చుకానలోఁ
గలయఁ జరించుభూపతికిఁ ♦ గన్నియరూపమె తోఁచు నెల్లెడన్. 81

కళికలు=పూమొగ్గలును, లేఁజిగుళ్ళు=లేఁతచిగురుటాకులును, కనకంపుటనంటులు = కోమల మయిన యరఁటులును, కప్పురంపుదిప్పలు=కర్పూరపుఁ దిన్నెలును, ననగుత్తులున్=పుష్పగుచ్ఛములును, లతలు=తీఁగలును, పద్మములున్=కమలములును, సమదాళిజాలములు=మదయుక్తములయినతుమ్మెదగుం పులును, వెలయన్=ఒప్పుచుండఁగా, మనోజరాజభుజవీర్యము=మన్మథుఁడనెడురాజుయొక్క బాహు పరాక్రమమును, అవార్యమొనర్చు = నివారింప నలవిగానిదానిఁగాఁ జేయుచున్న, కానలోన్=వన

ములోపల, కలయఁ జరించు=అంతటఁ గలయఁదిరుగుచున్న, భూపతికిన్=ఏసురాజునకు, ఎల్లెడన్=ఏ స్థలమందును, కన్నియరూపమె తోఁచున్=గిరికాదేవియొక్కరూపమే కనుపడును. ఇక్కడ వనమందలి కోరక పల్లవాద్యుపమానములచేత గిరికాదేవియొక్క నఖపాదాద్యుపమేయములు స్ఫురించుచున్నవి గనుకఁ గన్నియరూపమైతోఁచు నెల్లెడన్-అని గ్రంథకర్త చెప్పినాఁడు. ఇందు గిరికాదేవి నఖాది కేశ పర్యంతావయవములకు నుపమానములు చెప్పఁబడెను. రాజువనములోఁ గలయఁ జరింపసాగెను. పూర్వోక్తములగు నుపమానవస్తువులు కన్నియరూపమునె స్ఫురింపఁ జేయుచుండెను. కానన మసామాన్యమయినది. మన్మథుని భుజవీర్య మవార్యమొనర్చునది. గావున నెల్లెడ సతిరూపు కన్పించెను.

సీ. కనుఁగొంటి లతకూన • నని డాయుఁ గాకున్న నభినవతరలతా • వాప్తిదెలుపుఁ
గంటిఁ బద్మిని నని • గమకించుఁ గాకున్నఁ బరితాపగరిమఁ దా • మరలఁజూచుఁ
జూచితిఁ గొమ్మ నం • చు నటించుఁ గాకున్న నలయు శాఖోపశా • ఖానురక్తిఁ
దమిఁ జూడఁ గంటి నూ • తనరంభ ననియేగుఁగాకున్నఁగదళిచెం • గట భ్రమించు

తే. నయ్యెడ ననంగశరశర • వ్యాంతరంగ
కలితభావతరంగము • లప్పికొనఁగ
విభుఁడు చెలిమోవిల నాత్మీయ • విభ్రమములు
దేటపడకుండ నేర్పున • మాటుపఱుచు. 82

కనుఁగొంటి లతకూనని డాయున్=లతకూన యనఁగాఁ గన్నెపడుచును, లేఁతతీఁగెయును= లేఁతతీఁగెను జూచి గిరికాదేవి పొడకట్టినట్లుండఁగాఁ జూచితినని దగ్గరకుఁ బోవును, కాకున్నన్= గిరికాదేవి కాకపోఁగా-సఖునికిఁ దనవిభ్రాంతి దెలియకుండునట్లుగా, అభినవతరలతావాప్తిఁ దెలుపున్=అత్యంతనూతనమైన లతాప్రాప్తిని గనుపఱుచును. అనఁగా నొక లేఁతతీఁగెను గ్రహించినవానివలెఁ దెలియఁజేయునని యర్థము. అభినవమైన తరళత్వముయొక్క యనఁగా జాంచల్యముయొక్క ప్రాప్తిని దెలియఁజేయునని యర్థాంతరము. కంటిఁబద్మినినని గమకించున్=పద్మిని యనఁగాఁ బద్మినీ జాతిస్త్రీయును బద్మలతయును గనుకఁ బద్మలతను జూచి పద్మినీజాతిస్త్రీయైన గిరికాదేవిని జూచితినని యుత్సహించును. కాకున్నన్ = గిరికాదేవిగాకపోఁగా, పరితాపగరిమఁ దామరలఁజూచున్= వేదనాతిశయముచేతఁ బద్మములఁజూచును. అనఁగాఁ బద్మములకై బూచినవానివలెఁ గనుపడునని యర్థము-పరితాపాతిశయముచేతఁ దాను దిరిగి చూచునని యర్థాంతరము.

చూచితిఁ గొమ్మనంచునటించున్=కొమ్మయనఁగా స్త్రీయును శాఖయును గనుకఁ బుష్పశాఖనుజూచి గిరికాదేవిని జూచితినని నటనముసలుపును, కాకున్నన్=గిరికాదేవిగాకపోఁగా, శాఖ= కొమ్మలయొక్కయు, ఉపశాఖా=చేరువకొమ్మలయొక్కయు, అనురక్తిన్=అనురంజనముచేత, అలయున్=అలఁతనొందును. అనఁగాఁ గొమ్మలనుబట్టి విడుచుటయందలి యుల్లాసముచేత నలసినవానివలెఁ గనుపడునని యర్థము. బహువిధజాతానురాగముచేత నలయునని యర్థాంతరము. తమిఁజూడఁ గంటి నూతనరంభ ననియేగున్=నూతనరంభయనఁగా రంభాసమానయైన స్త్రీయును నభినవకదళికావృక్షమును గనుక నభినవకదళికావృక్షమును జూచి యాసక్తిచేత గిరికాదేవిని జూచితినని పోవును, కాకున్నన్=గిరికాదేవి గాకపోఁగా, కదలిచెంగట భ్రమించున్=కదలి కాతరు సమీపమందు సంచ

రించును. అనఁగా వినోదార్థమయిన కదళీవృక్షసమీపమందుఁ దిరుగుచున్న వానివలెఁ గనుపడునని యర్థము. చలించిచెంగట భ్రమనొందునని యర్థాంతరము.

అయ్యెడన్=గిరికాదేవి గనుపడకయున్న యాసమయమందు, అనంగశర=మన్మథబాణములకు, శరవ్య=గుఱియైన, అంతరంగ=అనఁగా రతియనెడి స్థాయిభావమందు, కలిత=కూడుకొన్న, భావతరంగములు=సంచారిభావపరంపరలు (అని యయినను భావములనఁగా సంచారిభావము లనెడు తరంగములని రూపకము చెప్పి యీరూపకమున కనుగుణముగా నంతరంగమనెడి సముద్రమని రూపకాంతరముగా నైనను జెప్పవచ్చును. ఏలాగనిన).

శ్లో. 'మజ్జంతశ్చ నిమజ్జంతః కల్లోలాశ్చ యథార్ణవే,
తస్యోత్కర్షంవితన్వంతి యాంతితద్రూపతామపి.
తథాస్థాయినినిర్మగ్నా ఉన్మగ్నా వ్యభిచారిణః,
పుష్యంతి స్థాయిసంస్థాశ్చ తత్రయాంతి రసాత్మతామ్.'

అని స్థాయిభావమునకు సముద్రసామ్యమును సంచారిభావమునకుఁ దరంగసామ్యమును జెప్పఁబడినది గనుక నీపద్యమందు మూఁడుసంచారిభావములు చెప్పినాఁడు. అవియెవ్వియనిన, గిరికాదేవిని జూచితినని డాయఁబోవుట యున్మాదమనెడి సంచారిభావము.

శ్లో. 'ఉన్మాదస్తుల్యవృత్తిత్వం చేతనాచేతనేష్వపి' అనిలక్షణము.
భ్రాంతిగోపనముసేయుట యవహిత్థయనెడి సంచారిభావము.
'శ్లో. హర్షాద్యాకారసంగుప్తిరవహిత్థేతికథ్యతే'' అనిలక్షణము.
తరళత్వాది చతుష్టయము చాపల్యమనెడి సంచారిభావము.
శ్లో. 'చాపలంత్వనవస్థానంరాగద్వేషాదిసంభవమ్' అనిలక్షణము.

ఈసంచారిభావములు, కప్పికొనఁగన్=ఆవరించుకొనఁగా, విభుఁడు=వసురాజు, చెలిమ్రోలన్=నర్మసఖునియెదుట, ఆత్మీయవిభ్రమములు=తనయొక్క విభ్రాంతివికారములు, తేటపడకుండన్=తెలియఁబడకుండునటులుగా, నేర్పునమాటుపఱుచున్=ఉపాయముచేత మఱుఁగుపఱుచును.

అలంకారము-శ్లేషము.

వసురాజు లతకూనను, పద్మినిని, పూఁగొమ్మను, అరఁటిచెట్టునుగాంచి మదనతాపవశంబున గిరికయని తలంచి సమీపించి తనభ్రాంతిని దానే మాటుపఱచి కొనసాగెను. రాజు ప్రమాదమును నేర్పున మాటుపఱచి కొన్నవిధము కవి యపూర్వార్థఘటనారూపమగు శ్లేషముచే సమర్థించిన విధము మనోహరముగ నున్నది.

శా. ఆరామామణిమీఁదిప్రేమమున ని♦ ట్లారామసీమాసరో
వారంబు ల్దిలకించి యందు నతి♦దుర్వారంబు లై మీఱుభృం
గారావంబుఁ చే ననంగరుజ వాం♦గారం గురంగాక్షీశ్వ్రుం
గారాగారముఁ జేసి తాల్మి నిలుపం♦గా రాక గారామునన్. 83

ఆరామామణిమీఁది ప్రేమమునన్=ఆగిరికాదేవిమీఁది యనురాగముచేత, ఇట్లు=పూర్వోక్తప్రకారముగా, ఆరామసీమా = ఉద్యానవన ప్రదేశములయొక్కయు, సరః=కొలఁకులయొక్క

యు, వారంబులు=సమూహములను, లిలకించి=విమర్శించిచూచి, అందుఁ = ఆయాస్థలములయందు, అతిదుర్వారంబులై=మిక్కిలియు నివారింపఁబడనివై, మీఱు = అతిశయించుచున్న, భృంగారావంబులచేఁ=తుమ్మెదలయొక్క ఝంకారధ్వనులచేత, అనంగరుజపొంగారఁ = మన్మథవ్యాధి పరిపూర్ణమగుచుండఁగా, కురంగాక్షీ శృంగారాగారముఁ జేరి=గిరికాదేవియొక్క శృంగారగృహమునఁ దిరుగాఁ బ్రవేశించి, తాల్మి నిలుపంగారాక=ధైర్యము నిలుపఁగూడక, గారామునఁ = ప్రేమచేత-ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

ఈపద్యములో ననంగరుజ యనఁగా వ్యాధి యనెడి సంచారిభావము.

శ్లో. 'మనస్తాపాద్యభిభవో జ్వరాది ర్వ్యాధిరిష్యతే' అని లక్షణము.

రాజు వనమం దెల్లెడఁదిరిగి గిరికమీఁదిప్రేమచే నామె సంచరించిన సరోవరప్రాంతము, ఆరామము చూచెను. తుమ్మెదలద్ద మాకలేక రొదలొనర్చెను. దాననసంగరుజ రేకెత్తెను. ఏకాంత ప్రదేశమున విశ్రమింత మనిరాజు గిరికాశృంగారమందిరమున కేగెను. ప్రియాసదనము తాల్మిని భేదించెను.

మ. అవనీనాథుఁడు వల్కుఁ జూచితె వయస్యా యీమణీధామ మా
ధవళాక్షీమణి యేగ శూన్యగతి నై యే తద్రూపచిత్రాహితో
త్సవ మేతన్మృదుగాన గుంభిత రసార్ద్రం బై తదీయాంగరా
గ వరామోదము పూని మామకమనఃకంజాతముం బోలెడిన్. 84

ఈపద్యములో మణీధామము మామకమనఃకంజాతముంబోలెడిఁ అనిచెప్పుటచేత మణి ధామపరముగాను వసురాజు మానసపరముగాను నర్థద్వయమును విచారింపవలయును. ఏలాగుననగిన, అవనీనాథుఁడు వల్కుఁ = వసురాజీలాగనిపలుకుచున్నాఁడు. చూచితెవయస్యా=ఓయిస్నేహితుఁడా చూచినావా, ఈమణిధామము = ఈ రత్నమయమందిరము, ఆధవళాక్షీమణియేగఁ=ఆగిరికాదేవి పోఁగానే, శూన్యగతియై = పాడుపడిన రీతిగలదై, తద్రూప చిత్రాహితోత్సవమై-తత్ = ఆగిరికయొక్క, రూప=ఆకృతిగా వ్రాయఁబడిన, చిత్ర=చిత్తరువుచేత, ఆహిత=పొందింపఁబడిన, ఉత్సవమై = కనులపండువుగలదై యని మణిధామపరమైన యర్థము. తత్=ఆగిరికయొక్క, రూప చిత్ర=చిత్తరువుబొమ్మవలె నిశ్చలముగా నిలిచియున్న రూపముచేత, ఆహితోత్సవమై=కూర్పఁబడిన వేడుక గలదయియని మానసపరమయిన యర్థము. తన్మృదుగానగుంభితరసార్ద్రంబై=తత్ = ఆగిరికయొక్క, మృదుగాన=సవురైన సంగీతముచేత, గుంభిత = రచింపఁబడిన, రస=జలముచేత, అనఁగా సంగీతరసముచేతఁ గరఁగిన రత్నకందళజలముచేత ననుట. ఆర్ద్రంబై=తడుపబడినదై యని మణిధామపరమయినయర్థము. ఆగిరికయొక్క మృదుగానముచేతఁ బూరింపఁబడిన శృంగారరసముచేత స్తిమితమయిన దని మానసపరమయిన యర్థము. తదీయాంగరాగవరామోదముపూని - తదీయ = ఆగిరికా సంబంధమై, అంగరాగ=మైపూఁతయైన, వర=కుంకుమపువ్వుయొక్క, (ని. వరం కాశ్మీరజంమతమ్' అని వి.) ఆమోదము=పరిమళమును, పూని=వహించియని గృహపరమయిన యర్థము. తదీయ=ఆగిరికాసంబంధమయిన, అంగ=అవయవ విషయమయిన, రాగ = అనురాగజనితమయిన, ఆమోదము = సంతోషమును, పూని=వహించి యని మానసపరమయిన యర్థము. మామకమనఃకంజాతముంబోలెడిఁ=నాయొక్క హృదయకమలమును బోలుచున్నది-చూచితె వయస్యా యని వెనుకకన్వయము,

ఇక్కడ మానసపరమయిన యర్థమందు శూన్యగతియైనదనఁగాఁ జింతయనెడు సంచారిభావమున కనుభావము. గిరికాస్వరూపము నిశ్చలముగా నిలిపియుండుట చింతాఖ్యసంచారిభావము. గానముద్దీపనవిభావము. రసమనఁగాఁ బూర్ణమయిన శృంగారరసము. అంగ మాలంబనవిభావము. రాగము రతియనెడి స్థాయీభావము, ఆమోదమనఁగా శృంగారరసానుభావ మయిన ప్రమోదము. వీనికి లక్షణములు అనుపమకాంతివైభవసమన్విత యనెడు పద్యముయొక్క వ్యాఖ్యయందుఁ దెలియఁ జేయఁ బడియున్నవి. మఱియు విశేషముగాఁ బ్రతాపరుద్రీయాదులయందుఁ జెప్పఁబడియున్న యవి. అలంకారము-శ్లేషాను ప్రాణితమైన యుపమ.

సీ. శుచివృత్తి నెన్నాళ్లొ • పచరించెనోతీర్థ సంవాస మిచటిహం•సవ్రజంబు
సురసాలముల నెన్ని•వరఫలంబులఁ జెంది నిలిచెనో యిచటి రా•చిలుకచాలు
సుమనోనురక్తి నె•ట్టిమహాసవంబుల నందెనో యిచటిమ•త్తాళిసమితి
యదన నెంతతపంబు • తుదిమీఱ నోచెనో యిచటిగంధాంధబ•ర్హిణగణంబు
తే. లతివ వెనువెంటఁదిరుగఁ•బ్రాఁతిముద్దు, మోవిచవిగొనసతిమోము•దావిగొనరఁ
గన్యఘనకంకణనినాద•గర్జనలరఁ, గాంచెనని యుస్సురను మహీ•కాంతుఁడపుడు.

ఇచటి హంసవ్రజంబు=ఇక్కడి మరాళసమూహము, శుచివృత్తి నెన్నాళ్లు పచరించెనో తీర్థసంవాసము=శుచియనఁగా బరిశుద్ధంబును, గ్రీష్మర్తువును, (ని. 'శుచి శ్శుద్ధే నుపహతే శృఙ్గారాషాఢయో స్సితే, గ్రీష్మే హుతవహేపి స్యా దుపధా శుద్ధమంత్రిణి' అని వి.) తీర్థమనఁగాఁబుణ్యక్షేత్రంబును జలంబును గనుకఁ బరిశుద్ధవ్యాపారముతోడ బుణ్యక్షేత్రనివాస మెన్నాళ్లుచేసెనో యని యర్థము. గ్రీష్మసమయ ప్రవర్తనముచేతఁ గాసారజలసంవాసము సేయుచున్నదని భావము.

ఇచటిరాచిలుకచాలు=ఇక్కడిరాజకీరశ్రేణి, సురసాలముల నెన్ని వరఫలంబులఁ జెంది నిలిచెనో=సురసాలము లనఁగా దేవతావృక్షములు. అనఁగాఁ గల్పవృక్షములు. మంచివైన రసాలములు. అనఁగా దివ్యమామిడిచెట్లు. దేవతావృక్షములవలన నెన్ని వరరూపములైన లాభములఁ బొంది యుండెనో యని యర్థము. మంచితీయమామిడిచెట్లవలన శ్రేష్ఠమైన పండ్లను గ్రహించియుంచున్నదని భావము. (సు+రసాలమనుచో మంచితీయమావియని యొకయెడను సుర+సాలమనుచో వేల్పుమ్రానని యొకయెడను నర్థద్వయము గ్రహించునది.)

ఇచటి మత్తాళిసమితి=ఇక్కడి మదయుక్తమైన తుమ్మెదలగుంపు, సుమనోనురక్తి నెట్టిమహాసవము నందెనో సుమనశ్శబ్దము దేవతలయందును బుష్పములయందును వర్తించును. సవమనఁగా యజ్ఞమును ఆసవమనఁగా మకరందమునుగనుక దేవతలయందలి యనురాగముచేత నెట్టి మహాయజ్ఞము నాచరించెనో యని యర్థము. (ని. (యజ్ఞ స్సవో ధ్వరో యాగః' అని అ.) పుష్పానురక్తిచేత మకరందాస్వాదనము సేయుచున్నదని భావము.

ఇచటి గంధాంధ బర్హిణగణంబులు=ఇక్కడి గర్వగ్రస్తమయూర సముదాయములు, అదనన్=కాలమందు, ఎంతతపంబు తుదిమీఱనోచెనో=తపమనఁగాఁ దపస్సును గ్రీష్మర్తువును-ఎంతతపస్సు తుదిముట్టునట్టులుగాఁ జేసెనోయని యర్థము, తపంబు తుదిన్ = గ్రీష్మర్తువుయొక్క చివరయైన వర్షర్తువునందు, మీఱనోచెనో = అతిశయముగా నోచినవని భావము. (ఈలాగునఁ జెప్పుటయొందు కనిన),

అతివ వెనువెంటఁ దిరుగను=గిరికయొక్క వెంటవెంట దిరుగుటకును, అబ్జాక్షిముద్దుమోవి చవి గొనన్=గిరికయొక్క మనోహరమయిన యధరోష్ఠము రుచిఁ జూచుటకును, చవిన్=కాంతిని, గొనన్=పొందుటకు అనియైనను చెప్పవచ్చును. సతిమోముతావిఁ గొసరన్ = గిరికయొక్క ముఖవాసనను మాటిమాటి కాస్వాదించుటకును, కన్యఘనకంకణనినాద గర్జనలరన్=గిరికయొక్క యధికమయిన కంకణధ్వనియనెడు నురుమువలన సంతోషించుటకును, కాంచెనని=అర్థ్యాతవహించెనని, మహీకాంతుఁడు=వసురాజు, అపుడు=ఆసమయమందు, ఉస్సురనన్=ఉస్సురనెడు ననుకరణముతోడ నిట్టూర్పువుచ్చును.

ఇక్కడ గిరికాదేవియొక్క గమనాధర ముఖామోద కంకణధ్వనులయందలి సజాతీయ గమనారుణ ఫలకమ లామోద గర్జా భ్రాంతిచేతఁ దదనుసరణాదికమును జేయుచున్న హంసలు మొదలైనవానికి నభేదాధ్యవసాయముచేత లభింపఁబడిన తపశ్శాలిత్వరూప స్తుతిచేత హంసాదులు ధన్యములైనవి యనిస్తుతియును దదనుసరణాద్యభావమువలన నేనుధన్యుఁడఁ గాకపోతి ననెడు నిందయును దోఁచుచున్నదిగనుక వ్యాజస్తుత్యలంకారము. శ్లో. 'ఉక్తిర్వ్యాజస్తుతిర్నిందాస్తుతిభ్యాం స్తుతినిందయోః) అని లక్షణము.

ఉ. మించినవేడ్కతో నచట • మీనవిలోచన మున్ను వీణవా
యించినచోటు బోటు లల•యింపఁగ మాటున నున్నచోటు న
య్యంచితగాత్రి యేగఁ జెలు • లాఁగినచోటును గాంచి రాగముల్
గాంచు దమోమయావృతులు • గాంచు భజించుఁ జలాచలత్వముల్. 86

మించిన వేడ్కతోన్ = అతిశయించిన వేడుకతోడ, అచటన్ = ఆమణిమందిరమందు; మీనవిలోచన = గిరికాదేవి, మున్ను వీణవాయించిన చోటు=మునుపు వీణవాయించిన స్థలమును, బోటు లలయింపఁగ మాటున నున్నచోటున్=చెలికత్తియలు కోడిగములాడి వేసటఁ బొందింపఁగాఁ జెరచాటునకుఁ బోయియున్న స్థలమును, అయ్యంచితగాత్రియేగన్=ఆగిరికాదేవి పోఁజూడఁగా, చెలులాఁగినచోటును=సఖులడ్డగించిన స్థలమును, కాంచి=చూచినవాఁడై, రాగముల్గాంచున్=శ్రీరాగాది రాగములను స్మృతికిఁ దెచ్చుకొనునని యర్థము. అనురాగాతిశయమును బొందుననియర్థాంతరము. ఇక్కడ బహువచన మతిశయద్యోతనార్థమని తెలియవలయును. తమోమయావృతులు గాంచున్= అనఁగాఁ దిమిరప్రచురావరణములను గాంచుననియర్థము. మోహరూపములైనయావరణములను గాంచునని యర్థాంతరము.

ఇక్కడఁ దమస్సదృశ మగుటవల్ల మోహమునకుఁదమోవ్యపదేశము, భజించుఁ జలాచలత్వములు వట్టిమల్లాడుట నూహించుననియర్థము. చాంచల్యమును బొందునని యర్థాంతరము. ఇక్కడ వీణావాదనాదిస్మృతిని చెప్పినాఁడు గనుక స్మృతియనెడు సంచారిభావము. చలాచలత్వమనఁగాఁ జాపల్యమనెడిసంచారిభావము. అర్థద్వయములకు నభేదాధ్యవసాయము. గానాదినిష్పత్తిస్థానమందు రాగాదినిష్పత్తి యుపయుక్తమని తెలియవలయును.

అలంకారము. శ్లేషము.

గిరిక వీణవాయించినచోటఁ జేరి వసురాజు రాగములు (అనురాగలీలలు శ్రీరాగాదిరాగములు) తలంచుకొనియు, బోటులు వేసటఁగూర్పగిరిక మాటునకేగినచోట తమోమయావృతులు (చీకటితో

నిండిన యావరణములు మోహావరణములు) పొంది గిరికయేగుచుండఁ జెలికత్తెల యాపినచోట చలా చలభావము (చాంచల్యము చపలమనుసంచారిభావము) నొంది పరితపించెను.

చ. జనపతి యిట్లు పంచశర♦శాతశరాహతిఁ జంచలింపఁగాఁ
గని హితమంత్రి వల్కు మహీ♦కాంత నిరంతరచింత నింతవిం
తనెగులు పూన నేల లల♦నానలినాస్త్రుఁడ నీవు నిన్నుఁ గ
న్గొనినలతాంగియీలువు మనో♦భవుఁ డింతకుఁ గొల్లలాడఁడే. 87

జనపతి=వసురాజు, ఇట్లు = ఈప్రకారముగా, పంచశర=మన్మథునియొక్క, శాత=వాడిగలిగిన, శర=బాణములయొక్క, ఆహతిన్=దెబ్బ తాఁకుడుచేత, చంచలింపఁగాన్=కంపింపఁగా, కని=చూచి, హితమంత్రి వల్కన్=ఇష్టసచివుఁడు పలికెను. ఏమనియనిన, మహీకాంత=భూమీశ్వరా, నిరంతరచింతన్=ఎడతెగనివిచారముచేత, ఇంతవింత నెగులుపూననేల=ఇటువంటి యద్భుతవ్యధను బొందనేటికి, ఈవు=నీవు, లలనానలినాస్త్రుఁడవు=రమణీమన్మథుఁడవు, నిన్నుఁ గన్గొనినలతాంగియీలువు=నిన్నుఁజూచిన మగువయొక్క ధైర్యమును, మనోభవుఁ డింతకుఁ గొల్లలాడఁడే=మన్మథుఁడు ముఖ్యముగాఁ జూఱఁగొనఁడా-అనఁగా నభిమానముఁ దక్కనియ్యఁడనుట.

మన్మథుపర్యాయపదములు చెప్పక పంచశరుఁడనుటచే నాతనిబాణములతాఁకిడి గాటమైనదనియుభావము. నీవు లలనానలినాస్త్రుఁడవుగాన నీరూపము స్త్రీలకు మోహజనకము. అట్టిచో నన్యోన్యసంధాతయగు మనోభవుఁడు సంకల్పసంభవుఁడుగానఁ జెలువయభిమానమును గూడఁగొల్లలాడుచుండును. తుల్యావస్థలోనున్న మీరిరువుర కామనోభవుఁడె దాంపత్యము సమకూర్పఁగలఁడని యాశయము.

చ. అతివగురుండు తావకప♦దానతుఁ డంగనఁ గన్నతల్లి య
ద్భుతభవదీయశౌర్యరస♦పోషితజీవన కొమ్మనెచ్చెలు
ల్సతతము నీకథ ల్పొగడ♦ జాణలు బాల భవద్విలాసమో
హిత హితకార్యసంగతికి♦ నియ్యెడ సందియ మంద నేటికిన్. 88

అతివగురుండు=గిరికాదేవితండ్రియయిన కోలాహలుఁడు, తావకపదానతుఁడు=నీయొక్కపాదాక్రాంతుఁడని యర్థము. నీయొక్క పాదాహతి నొందినవాఁడని యర్థాంతరము. అంగనఁగన్నతల్లి=గిరికాదేవిని గన్నతల్లియైన శుక్తిమతి, అద్భుత=ఆశ్చర్యకరమయిన, భవదీయ=నీసంబంధమైన, శౌర్యరస=శూరత్వముచేత, పోషిత=వృద్ధిఁబొందింపఁబడిన, జీవన=బ్రతుకుఁగలిగినదనియర్థము. జలములకు జలములవలనఁ బ్రాబల్యము గనుక శౌర్యరసమనెడి రసముచేతఁ బోషింపఁబడిన రసముగలదని చమత్కారాతిశయమును గ్రహింపవలయును. రసజీవనశబ్దములకు జలమర్థము. కొమ్మనెచ్చెలులు=గిరికాదేవియొక్క ప్రియసఖులు, సతతము=ఎల్లప్పుడును, నీకథల్పొగడజాణలు=నీయొక్కగుణకథనము సేయుటకుఁ బ్రౌఢలు, బాల=గిరికాదేవి, భవద్విలాసమోహిత=నీయొక్కవిలాసములచేత మోహింపఁబడినది కాఁబట్టి, హితకార్యసంగతికిన్=అభీష్టకార్యసిద్ధియాటకు, ఇయ్యెడన్ = ఈసమయమందు, సందియమందనేటికిన్=సంశయింపనేటికి, అనఁగా నెవరిసంగతివిచారించినను గేవలము స్వాధీనమయియున్నది గనుక గిరికాదేవిని నీవు పరిగ్రహించుటకు సందేహమెంతమాత్రమును లేదని తాత్పర్యము,

గిరికాజనకుఁడు నీకుఁబాదానతుఁడు. ఆయమతల్లి నీపరాక్రమముచే నుసురుదాల్చినది. కొమ్మ చెలికత్తెలు నీగుణప్రశంసగావించునేర్పరులు. గిరిక నీసొంపుఁజూచి వలచినది. కావున ననుకూలకార్యమునకుఁ గొంకుగొననేలయని భావము. అలం. అర్థాపత్తి.

క. బాలాపాణిగ్రహశుభ, వేళానిర్ణీతి కిపుడ • విచ్ఛేయము భూ
పాలావతంస యన విని, శైలారి యళీకధైర్య•చాతుర్యమునన్. 89

బాలా=గిరికాదేవియొక్క, పాణిగ్రహ=వివాహనిమిత్తమయిన, శుభవేళా=శుభముహూర్తముయొక్క, నిర్ణీతికిన్=నిశ్చయమునకు, ఇపుడ=ఇప్పుడే, విచ్ఛేయము=పట్టణమునకు విజయముసేయుము, భూపాలావతంస=రాజశిఖామణీ, అనన్ = అని నర్మసఖుఁడు పలుకఁగా, విని=విన్నవాఁడయి, శైలారి = కోలాహలపర్వత భంజకుఁడయిన వసురాజు, అళీక ధైర్యచాతుర్యమునన్ = లేనిధైర్యముయొక్క-అనఁగాఁ దెచ్చుకోలుధైర్యముయొక్క చతురత్వముచేత, ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. (ని. 'అళీకం త్వప్రియే నృతే' అని అమరము.)

మనము యత్నింపవలసినదింక వివాహముహూర్తమునకె. ఆలస్యమునకెడములేదు. రాఁదగినం దిందుల కిప్పుడ! అని యిష్టసఖుఁడు చెప్పఁగా నేరుపుగఁదెచ్చికోలుధైర్యముతో నుండెను.

మ. అగకూటాగ్రము డిగ్గి సంభ్రమసమ•గ్రాధోరణానీతగం
ధగజోత్తంసము నెక్కి చూడ్కి కెలమిం • దత్కుంభహస్తద్యుతు
ల్నగజాచారుకుచోరువైఖరులు దె•ల్పం బుట్టుఘర్మంబు నే
ర్పుగఁ దత్కర్ణవిశీర్ణ చామరమరు•త్పోతంబులం దీర్చుచున్. 90

అగ=కోలాహలపర్వతముయొక్క, కూట=శిఖరముయొక్క, అగ్రము=అగ్రభాగమును, డిగ్గి=దిగినవాఁడై, సంభ్రమ సమగ్ర=సంపూర్ణమైన త్వరతోఁగూడుకొన్న, ఆధోరణము మావటీనిచేత, (ని. 'ఆధోరణా హస్తిపకాః' అని అ.) ఆనీత=తేఁబడిన, గంధగజోత్తంసమున్=గర్వితగజశ్రేష్ఠమును, ఎక్కి=ఆరోహణముచేసి, చూడ్కి కెలమిన్=నేత్రముల కానందమగునట్టులుగా, తత్=ఆగజశ్రేష్ఠముయొక్క, కుంభ = కుంభములయొక్కయు, హస్త=తుండముయొక్కయు, ద్యుతులు = శోభలు, నగజా=గిరికాదేవియొక్క, చారు=సుందరములైన, కుచ=స్తనములయొక్కయు, ఊరు=తొడలయొక్కయు, వైఖరులు=రీతులను, తెల్పన్=తెలియఁజేయఁగా, పుట్టు=ఉద్భవించుచున్న, ఘర్మంబు=సాత్త్వికభావజనితమయిన చెమటను, ఇందుకు-

క. 'సమరతిఘర్మాదులచే, విమలశరీరములయందు విస్ఫుటమగు న
చ్చెమటను నభిదానము స్వేదముఁగాఁ బలుకుదురు సమ్మదమున నభిజ్ఞుల్.'

అనిలక్షణము.

నేర్పుగన్ = ఉపాయముగా, తత్ = ఆగజశ్రేష్ఠముయొక్క, కర్ణ=చెవులనెడు, విశీర్ణచామర=అక్షీణ చామరములయొక్క, మరుత్పోతంబులన్=పవనాంకురములచేత-అనఁగాఁ బిల్లవాయువులచేత, తీర్చున్ = పోఁజేసికొంచును-ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. ఈపద్యములో శరీరమందుఁబుట్టిన స్వేదమును నేర్పుగా గజకర్ణచామర వాయువుచేతఁ బోఁగొట్టుకొన్నాఁడు గాని

వ్యజనాదులచేతఁ బ్రకటముచేసినవాఁడు గాఁడు. కనుక ఘర్మాకార గోపనరూపమయిన యవహిత్థ యనెడి సంచారిభావము చెప్పఁబడినది.

వనమంతయుఁ గాంతారూపముగాఁ గనిపించిన కామార్తునకు నుపమేయవస్తువులన్నియుఁగాం తావయవములను స్ఫురింపఁజేయుటలో వింతలేదు. కావున సామాన్యగజము కాని తానెక్కిన గంధగజోత్తంసము కుంభములద్యుతులచేఁ జెలువగుబ్బలను తొండపుఁగాంతులచేఁ బోలఁతి యూరువులను దలఁపించెను. దానసాత్త్వికభావజనితమగు చెమటజనించెను. గజములకుఁ గర్ణచాలనము సహజముగానఁదానజనించు చిఱుగాడ్పులు చెమటఁబోకార్చెను. అలం. వ్యాజోక్తి.

మ. అవనీభర్తవినూతనాతనుపతాకాలోకసంప్రేక్షణీ
యవిలాసంబు గజాధిరాజగమనోదారంబుఁ గాశ్మీరప
త్రవిచిత్రంబుఁ దటిద్విభాసిరుచి యాతద్వాహినీజాతవై
భవముల్ లో వెలిఁ గాంచుచుం జనియె సంపత్పేటికిన్ వీటికిన్. 91

ఈపద్యమునందు వాహిని జాతవైభవమనుటచే నదీజాతయగు గిరికాపరముగను నర్థద్వయము గలదు.

అవనీభర్త=వసురాజు, వినూతన=అభినవమైన, అతనుపతాకా=మన్మథాంకములైనమీనముల వంటి, ఆలోక = చూపులయొక్క, ప్రేక్షణీయ = చూడఁదగిన, విలాసంబు = విలాసముగలిగినట్టిదియును-అని గిరికావైభవపరమైన యర్థము. వినూతన = మిక్కిలినూతనమయిన, అతను = అస్తోకములయిన, పతాకా=ధ్వజములయొక్క, ఆలోక = కాంతులయొక్క, సంప్రేక్షణీయవిలాసంబు = చూడఁదగిన విలాసము గలిగినట్టిదియును-అని సేనావైభవపరమయినయర్థము. (ని.'పతాకావైజయంత్యాం చ సౌభాగ్యేంకే ధ్వజే పిచ' అని వి.) ('ఆలోకా దర్శనోద్యోతౌ' అని అ.) గజాధిరాజ=గజశ్రేష్ఠము యొక్క, గమన = నడకవంటినడకచేత, ఉదారంబున్ = అతిశయమయినదియు అనియర్థము. మత్త గజేంద్ర గతులచేత నతిశయమయినదియు అని యర్థాంతరము. కాశ్మీరపత్రవిచిత్రంబు=పత్రశబ్దము మకరికాపత్రములయందును అశ్వములయందును వర్తించుచున్నది. (ని. 'పత్రం స్యా ద్వాహనే పర్ణే పక్షేచ శర పక్షిణోః' అని వి.) కుంకుమపత్రరచనలచేత విచిత్రమయినదియును అని యర్థము. కాశ్మీర దేశతురంగములచే విచిత్రమైనదియును అని యర్థాంతరము. తటిత్ = మెఱుపుతీఁగెవలె, విభాసి= ప్రకాశించుచున్న, రుచి=లావణ్యము గలదియును అని యర్థము. తటిద్విభా = మెఱుపుతీఁగెయొక్క కాంతివంటి కాంతిగల, అసి=కత్తులయొక్క, రుచి = దాగధగ్యముగలదియును అని యర్థాంతరము. ఔ=అయినట్టి, తద్వాహినీ జాతవైభవముల్ = శుక్తిమతీ నదీసంభవయైన యాగిరికాదేవియొక్క వైభవము నని యర్థము. సేనాసమూహ వైభవమునని యర్థాంతరము. లోవెలిఁ జూచుచున్ = లోపలను వెలపలనుం జూచుచును - అనఁగా గిరికావైభవమును హృదయమందును సేనావైభవమును బాహ్యమందును జూచుచు, సంపత్పేటికిన్ = సంపదలకుఁ బెద్దమందసపుపెట్టెయైన, వీటికిన్ = పట్టణమునకు, చనియెన్=పోయెను.

వసురాజు మీలవంటి చూపులసొంపు, మదపుటేనుంగువంటి నడకపెంపు, మకరికాదిపత్ర సౌభాగ్యము, మెఱుపుఁదీఁగవంటి మేనినిగ్గుగల గిరికాసౌందర్యము హృదయమునందును బతాకముల

విలాసము, మదపుటేనుంగుల పొలుపు, తురంగముల యెఱపుఁగత్తుల మెఱుపులు, సైన్యవిభవము బాహ్యదృష్టిని దిలకించుచుఁ దన నగరమున కేగెను. అలం. శ్లేషము.

తే. నగరిపుసమానుఁ డీరీతి ♦ నగరి కరిగి,సింధురము డిగ్గిగాంధార♦సింధు కుకుర
కాశ ముఖ్యుల ననిపి ప్ర♦కాశవృతదిశాంత మగునాత్మకేళీని♦శాంత మొంది.

నగరిపుసమానుఁడు=ఇంద్రసమానుఁడైన వసురాజు-ఇక్కడ నగరిపుశబ్దము సాభిప్రాయము. ఈరీతి నగరికరిగి=ఈచెప్పఁబడిన ప్రకారముగాఁ బట్టణమునకుఁబోయి, సింధురము డిగ్గి=ఏనుఁగును దిగి, గాంధార సింధు కుకుర కాశ ముఖ్యులననిపి = గాంధార సింధు కుకుర కాశ అనెడు దేశాధిపతులను సెలవిచ్చి పంపించి, ప్రకాశవృతదిశాంతమగు = మణికాంతులచేత నావరింపఁబడిన దిగంతములుగలదైన, ఆత్మకేళీ నిశాంత మొంది=తనయొక్క, క్రీడామందిరమును బొందినవాఁడై.

చ. అతివలు ద్రిప్పునారతుల♦యట్ల మనంబు భ్రమింపఁ గుంభినీ
పతి జలకంబువేళ యని ♦ భామలు దెల్పఁగఁ బళ్లెరంబు వె
ట్టితి మని తొయ్యలు ల్బడిబ♦డిఁ నడతేర ననాస్థతో యథో
చితవిధు లాచరించి పువు♦సెజ్జకు నొయ్యన మేను దార్చుచున్. 93

అతివలు ద్రిప్పునారతులయట్ల మనంబు భ్రమింపన్=స్త్రీలిచ్చుచున్న నీరాజనము లేతీరుగాఁ దిరుగునో యాతీరుగా మనస్సు తిరుగుడు పడుచుండఁగా, కుంభినీపతి=వసురాజు జలకంబువేళయని, భామలుదెల్పఁగన్=స్నానసమయ మని కొందఱు స్త్రీలు విన్నపము సేయఁగాను, పళ్లెరంబు వెట్టితి మని తొయ్యలు ల్బడిబడి న్నడతేరన్=భోజనపాత్రము సిద్ధపఱిచినామని కొందఱు స్త్రీలు వెంబడి వెంబడిగావచ్చి మనవి చేయఁగాను, అనాస్థతోన్ = దేనియందును నాసక్తిలేక, యథోచితవిధు లాచరించి=అప్పటికిఁ దగినకృత్యములు నిర్వర్తించి - అనఁగా నొకమాత్రముగా మజ్జన భోజనాదులు జరిగించినవాఁడై, పువుసెజ్జకు నొయ్యన మేనుదార్చుచున్=పుష్పశయ్యకుఁ దిన్నఁగాశరీరము హత్తించుచును-అనఁగాఁ బూఁబాన్పుమీఁద నొరుగుచును. ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. ఇందులో ననాస్థతో నన్నచోట నాలస్యమనెడి సంచారిభావము. ఇందుకు లక్షణము. (శ్లో. 'మందోద్యమత్యమాలస్యం కర్తవ్యేషు ప్రకీర్త్యతే') అని ఇంతపర్యంతము వసురాజునకుఁ జింతాసంగమును జెప్పినాఁడు. జలకంబు వేళయనియుఁ బళ్లెముపెట్టితిమనియుఁ గాంతలెఱింగించినను దేనియందును నాసక్తిలేమిచే రాజు చాలసేపూఱకుండెను. వెంటవెంటనే రాఁదొడంగిరి. మనస్సు చెలులు త్రిప్పుచున్న యారతిపళ్లెరమువలె మదనసంతాపజ్వాలాకులముగ నున్నను, అనాస్థపీడించుచున్నను యథోచితవిధులనాచరింపక తప్పినదికాదు. భోజనానంతరము జరుగవలసిన తాంబూల చర్వణాదులమాని బూలసెజ్జపైమేను మెల్లగాఁజేర్చుటయు నీరసమునకుఁ జిహ్నము.

సీ. గిరికన్యమేన నే♦కీభవించినఁగాని, తయ్యపిల్తుని నిరో♦ధింప రాదు
సింధుజ నెద నుంచి♦సిరులమించినఁగాని, మిహికాంశుఁగనుసన్న♦మెలప రాదు
శుభవాణియభిముఖ♦స్ఫురణఁజూపినఁగాని,పఱచుటంచలఁగ్రిందు♦పఱుపరాదు
పద్మినిఁ గరముఖ♦ప్రౌఢిఁ దేల్చినఁ గాని, రేల ముమ్మరము వారింప రాదు

తే. నేర్పున నటంచు నృపతి యా౽నెలతఁ దలఁచి
తలఁచి సగ మగు సాత్త్వికో౽దయదశాను
భావములఁ జెందు నున్మద౽ప్రసవబాణ
బాణమగ్నతఁ గాంచుఁ దా౽పము వహించు. 94

నేర్పునన్=ఉపాయముచేత, గిరికన్యమేన నేకీభవించినఁగాని = గిరికాదేవియొక్క శరీరమం దొక్కటిగా మిళితమైనఁగాని యని యర్థము. ఇక్కడషష్ఠీతత్పురుషసమాసము, పార్వతీదేవి తనశరీరమం దేకీభవించినఁగాని - అనఁగా హరుఁడనైనగాని యని యర్థాంతరము. ఇక్కడ గిరికన్య యనునది కర్తృపదము. తియ్యవిల్తుని నిరోధింపరాదు=మన్మథోద్రేకనివారణము సేయనలవి గాదని రాజపరమయిన యర్థము. మన్మథసంహారము సేయఁ బొసఁగదని శివపరమైన యర్థము.

సింధుజ నెదనుంచి సిరుల మించినఁ గాని=నదీసంభవయైన గిరికాదేవిని ఱొమ్మునఁ జేర్చుకొని వైభవములచేత నతిశయించినఁగాని యని యర్థము. క్షీరాబ్ధిసంభవయైన లక్ష్మిని వక్షఃస్థలమందు నిలిపినఁ గాని-అనఁగా విష్ణుఁడనైనఁగాని యని యర్థాంతరము. మిహికాంశుఁగనుసన్న మెలపరాదు=చంద్రుని వశవర్తిఁగాఁజేసికొన నలవి గాదని రాజపరము. చంద్రుని నేత్రరూపముగాఁ బ్రవర్తింపఁ జేయఁ గూడదని విష్ణుపరము. చంద్రసూర్యులు విష్ణుదేవునికి నేత్రములౌట ప్రకటము.

శుభవాణి యభిముఖస్ఫురణఁ జూపినఁగాని=శుభవాక్కులుగల గిరికాదేవిముఖమిచ్చి మాట్లాడుటను గనుపఱిచినఁ గాని యని యర్థము. శుభాస్పదురాలైన వాణీదేవి ముఖమందు నిలిచినఁగాని అనఁగా బ్రహ్మనైనఁ గాని యని యర్థాంతరము. పఱచుటంచలఁ గ్రిందుపఱుప రాదు=ధూర్తమరాళముల యొక్క యుద్రేక మణఁప నలవికాదని రాజపరము. హంసలను వాహనములుగాఁ జేసికొని క్రిందు పఱుపఁ గూడదని బ్రహ్మపరము.

పద్మినిఁ గరముఖప్రౌఢిఁ దేల్చినఁ గాని = పద్మినీజాతిస్త్రీయైన గిరికాఁదేవిని గరనఖరనైపుణ్యముచేత నుల్లసింపఁ జేసినఁగాని - అనఁగా స్తనజఘనాదులయందు నఖక్షతములు చేసినఁగాని యని యర్థము. పద్మలతను గిరణప్రసారణముచేత నుల్లసింపఁ జేసినఁ గాని-అనఁగా సూర్యుఁడు నైనఁగాని యని యర్థాంతరము. రేలమున్నరము వారింపరాదు=రాత్రులసముద్రేకమును నివారింప నలవిగాదని రాజపరము. రాత్రులను నిరసింపఁ గూడదని సూర్యపరము.

అటంచున్=ఈలాగని పలుకుచును, నృపతి=వసురాజు, ఆనెలఁతఁ దలఁచి తలఁచి==ఆగిరికాదేవిని బలుమాఱు దలఁచుకొని, సగమగున్=కృశత్వమును బొందునని రాజపరమయిన యర్థము. అర్థనారీశ్వరత్వమును వహించినాఁడని శివపరమయిన యర్థము. సాత్త్వికోదయదశానుభావములఁ జెందున్=కంప స్వేదాది సాత్త్వికోదయభావములను మన్మథావస్థలఁ బదింటిని బొందునని రాజపరము. సత్త్వగుణోదయ దశాప్రభావములనుగాని, లేక సత్త్వగుణోదయమును, దశానుభావము లనఁగా దశావతారములనుగాని పొందునని విష్ణుపరము. ఉన్మద ప్రసవబాణ బాణ మగ్నతఁగాంచున్=మదోద్ధతుఁడైన మన్మథునియొక్కబాణములయందు మునిఁగిపోవుటఁ గాంచునని రాజపరము. ఉన్మదప్రసవ మనఁగాఁ బద్మము. అది బాణముగాఁగలవాఁడు గనుక ఉన్మదప్రసవబాణుఁడు, మన్మథుఁడు అతని బాణ మున్మదప్రసవము. అనఁగాఁ బద్మము. దానియందు నిరంతరనివాసము సేయునని బ్రహ్మపరము

గాఁ జెప్పవలయును. తాపమువహించున్ = చింతాదికమువలనఁబుట్టిన వేదనను వహించునని రాజపరము. ఆతపతాపమును వహించునని సూర్యపరము. ఇందులో వసురాజునకు మొదటి నాల్గుచరణముల యందును సంకల్పావస్థయును గీతి మొదటిచరణమందుఁ గృశత్వావస్థయును జెప్పఁబడియె.

గిరికన్య, సింధుజ, శుభవాణి, పద్మినియను విశేషణములందలి యర్థాంతరములచే నాయిక లోకోత్తరభావము ద్యోతకమగును. వసురాజుగిరికను శివుఁడుగౌరినివలెనే మేననేకీభవింపఁజేసి కొనవలయుననియు విష్ణువు లక్ష్మినివలె నెదనుంచుకొనవలయుననియు బ్రహ్మ సరస్వతినివలె ముఖమందుంచుకొనవలయుననియు లేదా యాత్రిమూర్త్యాత్మకుఁడగు కరములచే నలరింపవలయునని తలంచుట మన్మథచంద్రాదులవలని బాధమాన్పుటకని యెఱుంగునది. తొలినాలుగు పాదములలో వసురాజుసంకల్పావస్థయు గీతమునఁ గృశత్వావస్థయుఁ జెప్పఁబడెను. అలం. శ్లేషము.

మ. అనిశధ్యాతనదీసుతావయవుఁ డై • యమ్మేటి యయ్యేటిశో
భనముక్తావళులన్న నన్నదినవా•బ్జం బన్న గోరంతనం
టును నొక్కింతముఖానురాగమును బూ•నుం గాని యేసొమ్ముఁ గై
కొనఁ డేకానుక లిచ్చినం గొనఁడు గో•ర్కుల్నిండి దైవారఁగాన్. 95

అనిశ=ఎల్లప్పుడును, ధ్యాత=ధ్యానముసేయఁబడుచున్న, నదీసుతావయవుఁడై = నదీసుతయైన గిరికాదేవియొక్క సకలావయవములు గలవాఁడై, అమ్మేటి=ఆవసురాజు, అయ్యేటి=ఆశుక్తిమతీసంబంధమయిన, శోభనముక్తావళులన్=మనోహరములైన మౌక్తిక సమూహములని చెప్పినను, అన్నదినవాబ్జంబన్న=ఆశుక్తిమతీనదీసంబంధమయిన పద్మమనిచెప్పినను, గోరంతనంటును=ఇసుమంత స్నేహమును, ఒక్కింతముఖానురాగమును=ఇంచుకంత ముఖప్రసాదమును, పూనుంగాని = వహించునేకాని అనఁగా ధ్యానము సేయఁబడుచున్న గిరికాదేవియొక్క యవయవముల యందలి నఖవదనసాదృశ్యముచేత గిరికామాతయైన శుక్తిమతియందుఁ బుట్టిన మౌక్తికాబ్జముల నర్థాంగీకార మయినప్పటికిని జేయునుగాని అని యర్థము. అక్కడ గిరికానఖవదన సాదృశ్యమును గిరికామాతృ సంబంధమును మౌక్తికాబ్జాంగీకరణమందు హేతువులని తెలియవలయును. గోరంతయన్నపదములోను ముఖానురాగ మన్నపదములోను జెప్పఁబడిన గోరు, ముఖము అనెడి పదములు మౌక్తికాబ్జోపమేయ భూత నదీసుతావయవస్ఫూర్తిని జేయుచున్నవని గ్రహింపవలయును. ఏసొమ్ముఁగైకొనఁడు = పైనఁజెప్పఁబడిన మౌక్తికములుగాక మఱియేభూషణమును గ్రహింపఁడు. ఏకానుకలిచ్చినం గొనఁడు=పైనఁ జెప్పఁబడిన యబ్జముగాక యేకానుకలిచ్చినం బుచ్చుకొనఁడు. ఎందువలన ననిన, కోర్కుల్నిండి దైవారఁగాన్=గిరికా విషయమయిన యభిలాషములు పూర్ణీభవించుచుండఁగా ననిసంబంధము.

ఇందులో అనిశధ్యాతనదీసుతావయవుఁడై యని చెప్పినాఁడు గనుకఁ జింతయనెడి సంచారిభావము. ఏసొమ్ముఁగైకొనక పోవుటయును, నేకానుకలిచ్చినం బుచ్చుకొనక పోవుటయును అరతియనెడు నవస్థయని తెలియవలయును. ఇందుకు, శ్లో. 'అన్యత్రాప్రీతి రరత్యై' అని లక్షణము.

గిరికపై వసురాజునకుఁ గోర్కులునిండి నిబిడీకృతములు కాఁదొడఁగెను. కావుననే నదీసుతావయవముల ననిశముధ్యానము చేయుచుండెను. ఆవయవచింత దప్ప నితరము లేమియును రాగాతిశయసూచితము, వసురాజు నానందపఱచు వస్తువులులేవు. గిరికాజన్మభూమి యగు శుక్తిమతియందు జనిం

చిన మౌక్తికములు తామరపూవులనుమాత్రము సొమ్ముగాఁ గానుకగాఁ గైకొనుచున్నాఁడు. నవాబ్జములనుటచే నపుడుగోసి తెచ్చిన తమ్మిపూవులనుట. మౌక్తికములను గిరికానఖసాదృశ్యమును బట్టియుఁ దామరపూవులను ముఖసాదృశ్యమునుబట్టియుఁ గ్రహించుచున్నాఁడు. గిరికావయవధ్యానమునఁ గోర్కులునిండిదై వారు వానికిఁగావలసినవి యవయవోపమానవస్తువులేగదా! అవియుఁ సొమ్ముగాఁ గానుకగా వచ్చినవగుటచేఁ బరిగ్రహింపఁగలిగెను. నదీసుతావయవస్మరణగల వసురాజునకు గిరికాసహజములగుట వలనను ఉపమానములగుటవలనను మౌక్తికములపై గోరంతనెయ్యము. తమ్ములపై మొగమోటము చూపుచున్నాఁడని భావము.

తే. కన్యలావణ్యరససుధా♦గాహనమున
విభునినయనము లస్వప్న♦వృత్తిఁ జెంద
మనసు తదురోజహేమాద్రి♦మనికి మరగి
మహితసురతానుభూతికై♦మలయుచుండు. 96

కన్య=గిరికాదేవియొక్క, లావణ్యరస సుధాగాహనమునన్ = కాంతియనెడు నమృతమందలి స్నానముచేత, విభునినయనములు=వసురాజుయొక్క నేత్రములు, అస్వప్నవృత్తిఁ జెందన్ = దేవత్వమును బొందగాఁ నని యర్థము. నిద్రలేకుండుటకుఁ బొందఁగాఁ నని భావము. మనసు=మానసము, తత్-ఆగిరికాదేవియొక్క, ఉరోజ=కుచభారమనెడు, హేమాద్రి=కాంచనాచలమందలి - అనఁగా మేరుపర్వతమందలి, మనికిన్=ఉనికి, మరగి=అభ్యాసము చేసికొని, మహిత = ఒప్పుచున్న, సురతా=దేవత్వముయొక్క, అనుభూతికై=అనుభవమునకుఁగాను, మలయుచుండున్=యత్నము సేయుచుండునని యర్థము. సంభోగానుభవమునకై యుద్రేకించునని యర్థాంతరము. ఇక్కడ వసురాజునకుఁ జతుర్థావస్థయైన జాగరమును జెప్పినాఁడు.

వసురాజు హృదయమున గిరికారూపము జూడఁదొడఁగెనుగాన నయనములు ఆయమలావణ్యాతిశయసుధారముల నాప్లావము గావింపసాగెను. దేవత్వసిద్ధి అమృతమువలనఁ జేకూరుటచే నస్వప్నభావముకూడ గలిగెను. అనఁగా వసురాజు గిరికను దలంచుచుఁ గనుకూర్కుమానెను. మనసుకూడ సురతానుభావము వలచి గుబ్బలను బంగరుకొండను మరగెను. దేవతలకు హేమాద్రివాసము సుప్రసిద్ధము. అనఁగా వసురాజుమనసు గిరికగుబ్బలపై నిలిచి సురతసౌఖ్యమునకై యుద్రేకింప సాగెనని భావము. అలం. రూపకము.

సీ. శ్రమమునొందింపఁడో♦జగదద్భుతాఖండ, కాండప్రయోగలా♦ఘవముఁదెలిపి
సాత్త్వికగుణసార♦సామగ్రి సవరింపఁ డో సుమనోధర్మ♦మొనరఁ దాల్చి
సంకల్పసిద్ధియో♦సంగఁడో తగువేళ నమితప్రతాపసా♦హాయ్య మొంది
సవ్యసాహిత్యచిం♦త వహింపఁ జేయఁడో నవరసభావవై♦భవముఁ జూపి
తే. యతనుఁ డతనికి సహృదయుఁ♦డై యమేయ
శక్తినేమేమి గావింపఁ♦జాలఁ డయ్యెఁ
బతియు నితరప్రసంగసం♦భావనమునఁ
దవులక తదేకపరవశుఁ♦డవుట యరుదె. 97

ఈపద్యమున వసురాజునకు మన్మథుఁ డుపకారములఁ జేసినటుల శ్లేషముచేఁ జెప్పి రాజునకుఁ గల తదేకపరతంత్రభావము సమర్థించుచున్నాఁడు.

జగదద్భుత=జగదాశ్చర్యకరమును, అఖండ=అప్రతిహతమునైన, కాండప్రయోగ=బాణప్రయోగమందలి, లాఘవమున్=కుశలత్వమును, తెలిపి=తెలియ నుపదేశించి, శ్రమము నొందింపఁడో=పరిశ్రమమును బొందించినాఁడు కాఁడా, అనఁగా నభ్యాసమును బొందించినాఁడు కాఁడాయనియర్థము. జగదాశ్చర్య కరములయిన యఖండబాణము లనఁగాఁ బుష్పబాణములు, వానియొక్క ప్రయోగనై పుణ్యమును గనుపఱిచి, అనఁగాఁ బ్రయోగించి వ్యథనొందించినాఁడని భావము.

సుమనోధర్మ మొనరఁదాల్చి = విద్వద్ధర్మము నొప్పిదమగునట్టులుగా వహించి, సాత్త్వికగుణ సారసామగ్రిన్=శమదమాది గుణములయొక్క యోగ్యమైన సంపూర్ణత్వమును, సవరింపఁడో=చక్కపఱచినాఁడు కాఁడా యని యర్థము. పుష్పకోదండము ధరించి సాత్త్వికభావసామగ్రిని సవరించినాఁడనిభావము. సాత్వికభావ సామాన్యలక్షణము.

క. పరగత సుఖదుఃఖాదుల, నరయఁగభావించి యట్ల యలరుట సత్త్వ
స్ఫురణము తద్భవభావము, లరయఁగ సాత్వికములయ్యె నవియెట్లన్నన్.

కావ్యాలంకారసంగ్రహము.

అమిత=మితములేని, ప్రతాప=పరాక్రమముయొక్క, సాహాయ్యమొంది = సహాయతనుబొందినవాఁడై, తగువేళన్=యుక్తకాలమందు, సంకల్పసిద్ధి యొసంగఁడో=మనోరథసిద్ధిగలుగఁజేసినాఁడు కాఁడాయని యర్థము. అమితప్రతాపుఁ డనఁగా వసంతుఁ డనిచెప్పవలయును. వసంతసాహాయ్యమును బొంది విరహకాలమందు సంకల్పాఖ్య మన్మథావస్థను బుట్టించినాఁడని భావము. మన్మథదశావస్థలలో సంకల్పము గూడనొకటియనుటకు,

శ్లో. చక్షుః ప్రీతిః ప్రథమంచింతాసంగ స్తతోథ సంకల్పః
నిద్రాచ్ఛేదస్తనుతా విషయనివృత్తి స్త్రపానాశః
ఉన్మాదోమూర్ఛామృతి రిత్యేతే స్మరదశాదశైవస్యు
దృష్టిమనస్సంగసంకల్పా జాగరః కృశతారతిః
హ్రీత్యాగోన్మాద మూర్ఛాన్తా ఇత్యనంగదశాదశ
అభిలాషచింతనాను స్మృతిగుణ సఙ్కీర్తనోద్వేగాః.

నవరసభావవైభవముచూపి=శృంగారాది నవరసములయొక్కయుం వాని భావములయొక్కయుం వైభవమును దెలియఁజెప్పి, నవ్య సాహిత్యచింత వహింపఁజేయఁడో=నూతనమైన సాహిత్య విద్యాచింతను వహింపఁజేసినాఁడు కాఁడాయని యర్థము. నవరస=అనురాగమనెడి స్థాయిభావముయొక్కయుం, భావ=నిర్వేదగ్లానిశంకాది సంచారిభావములయొక్కయుం, వైభవముఁ జూపి=అనఁగా వైభవము నుదయింపఁజేసి; నవ్యసాహిత్యచింతయనఁగా నూతనసంభోగచింతను వహింపఁజేసినాఁడనిభావము. సంచారిక్రమభావములు.

శా. నిర్వేద క్రమదైన్యజాడ్యములు గ్లానిత్రాసశంకార్తి రు
గ్గర్వావేగ ధృతిస్మృతుల్ చపలతోగ్రత్వావహిత్థా త్రపాం
తర్వైక్లబ్యమదోత్సుకత్వ మతినిద్రా మోహబోధాంతము

త్సర్వాలస్య వితర్కాసుప్త్యహతాధ్యానభ్రమాపస్మృతుల్. కావ్యాలంకారసంగ్రహము.

ఎవఁడనిన, అతనుఁడు=మన్మథుఁడు, అతనికిన్=ఆవసురాజునకు, సహృదయుఁడై = అనఁగా నాప్తుఁడై యనియర్థము. హృదయసంగతుఁడై యనిభావము. అమేయశక్తిన్=ఎన్నశక్యముగాని సామర్థ్యముచేత, ఏమేమి కావింపఁ జాలఁడయ్యెన్=ఏమిచేయుటకుఁ జాలకపోయినాఁడు-అనఁగా నన్నికార్యములు చేయఁజాలినవాఁడైనాఁ డనుట. కాఁబట్టి, పతియును వసురాజును ఇతరప్రసంగసంభావమునఁ దవులక = మన్మథేతరప్రసంగాదరమునందుఁ దగులుకొనక, తదేకపరవశుఁడవుట=మన్మథైకపరాధీనుఁ డగుట, అరుదె=ఆశ్చర్యమా-అనఁగా నాశ్చర్యముగాదనుట.

అలంకారము. ఉభయశ్లేషము.

క. సుమనోమార్గణవశుఁడై, క్షమ యెల్లను దద్గతంబుఁ ♦ గావించిన భూ
రమణునిసాంగయశోజా,లములీలం బాండిమం బ♦లరె నెమ్మేనన్. 98

సుమనః=మంచిమనస్సుగల, మార్గణ=యాచకులకు, వశుఁడై=స్వాధీనుఁడై, క్షమయెల్లను=భూభాగమంతయును; తద్గతంబుఁ గావించిన=వారలకు సమర్పించిన, భూరమణుని=వసురాజుయొక్క యని యర్థము. సుమనోమార్గణుఁ డనఁగాఁ బుష్పములు బాణములు గాఁగల మన్మథుఁడు, అతనికి, వశుఁడై=ఓర్పుగుణము నంతయు నతనిపాలు చేసినవాఁడనిభావము. (ని. 'మార్గణో యాచకేశరే' అని వి.) ('క్షితిక్షాంత్యోః క్షమా ప్రోక్తా' అని వి.) సాంగయశోజాలములీలన్=సాకారమైనకీర్తిసముదాయమో యన్నట్టులుగా, నెమ్మేనన్=శరీరమందు, పాండిమం బలరెన్ = ధావళ్యమొప్పుచుండెను. ఇక్కడ సాత్త్వికభావమైన వైవర్ణ్యమును జెప్పినాఁడు. యాచకులు సామాన్యులుగాక పండితులగుటవలనను దానము గూడకటులె సామాన్యముగాక క్షమయంతయు నొసంగుటగావున భూరమణుని కీర్తిసాంగమయినది. మఱియును యశస్సు విస్తృతముగానజాలము. కావుననె మేనినిండఁ బాండుభావముకీర్తివలె నిండారెను. వసురాజు పూవుబాణములకు లోనై యోర్పుకోలుపోయి తెల్లబారెనని భావము. అలంకారము. శ్లేషమూలకోత్ప్రేక్ష.

సీ. పెనుగట్టు గోటమీ♦టినమేటి కిపు డెంత యరు దయ్యెఁ గన్యాకు♦చాద్రిగరిమ
గగనఘంటాపథ♦క్రమణశీలున కెంత గగన మయ్యె లతాంగి♦కౌనుచదలు
బలుజెల్లి కిల యెల్ల ♦ నిలిపినఘను నెంత సుడివెట్టు సతిదృగం♦శుస్రవంతి
యనుదినవ్యయితన♦వ్యసువర్ణరాశి నెం తాసఁ గొల్పె వధూవి♦భాసువర్ణ
తే. మనుచు విస్మితహృదయుఁడై♦కనికరించి,యవనిపతి కాంతరంగికుఁ♦డగుఁ ననంగుఁ
డనుపమోజ్జ్వలగాత్రిన♦య్యచలరాజ, పుత్త్రిఁ దదధీనమానసాం♦బుజనొనర్చె.

పెనుగట్టు గోటమీటిన మేటికిన్ = మహత్తయిన కోలాహల పర్వతమును బదనఖముచేత జెగమీటిన పురుషశ్రేష్ఠునికి, కన్యాకుచాద్రిగరిమ = గిరికాదేవి చనుగొండలయొక్క గౌరవము, ఇపుడు = ఈసమయమందు, ఎంతయరుదయ్యెన్ = ఎంతఆశ్చర్యమాయెను - అనఁగా గిరికాస్తనపర్వతములు గోటమీటశక్యముగాని వాయెననుట. గగన = ఆకాశమనెడు, ఘంటాపథ = రాజమార్గమందలి, క్రమణ = సంచారమే, శీలునకున్ = స్వభావముగాఁ గలవానికి-అనఁగా దివ్యవిమానారూఢుఁడై యాకాశమార్గమందు సంచరించువాని కనుట, లతాంగి కౌను చదలు=గిరికాదేవియొక్కమధ్య

ప్రదేశాకాశము, ఎంత గగనమయ్యెన్=ఎంతదుర్లభమాయెను, ఆకాశము గగననామముగలదౌటస్వభావమే.

బలువెల్లికిన్=బలిష్ఠమైన శుక్తిమతీనదియొక్క వరదకు, ఇలయెల్లనిలిపినఘనున్ = భూమినంతయుఁ జెడకుండనిలిపిన మహాత్ముని, సతి = గిరికాదేవియొక్క, దృగంశు = చూపులయొక్క కాంతియనెడు, ప్రవంతి=నది, ఎంతసుడివెట్టెన్=ఎంతసుళ్ళఁబెట్టెను, అనుదిన=ప్రతిదినమందును, వ్యయిత=వ్యయముచేయఁబడిన, నవ్య = నూతనమైన, సువర్ణరాశిన్=బంగారపు రాసులుగలవానిని, వధూ=గిరికాదేవియొక్క, విభా=కాంతియనెడు, సువర్ణము=బంగారము, ఎంతాసఁగొల్పెన్ = ఎంతయాశపెట్టెను.

అనుచున్=ఈలాగనిపలుకుచు, విస్మిత హృదయుఁడై=ఆశ్చర్యావిష్టమానసుఁడై, కనికరించి=దయదలఁచినవాఁడై, అవనిపతికిన్=వసురాజునకు, అంతరంగికుఁడగు = మనస్సుగలిసినవాఁడైన యని యర్థము. అంతరంగమందుఁ బుట్టినవాఁడనిభావము. అనంగుఁడు=మన్మథుఁడు, అనుపమోజ్జ్వలగాత్రిన్=ఉపమానరహితమై ప్రకాశమానమయిన దేహముగలిగిన, అయ్యచలరాజపుత్రిన్=కోలాహల పర్వత రాజపుత్రికయయిన యాగిరికాదేవిని, తదధీన మానసాంబుజ నొనర్చెన్=వసురాజున కధీనమైన మనస్సుగలదానిఁగాఁ జేసెను-అనఁగా వసురాజునందు గిరికాదేవికిద్వితీయావస్థయయిన చిత్తసంగమమును బుట్టించెనని యర్థము.

వసురాజు సామాన్యుఁడుకాఁడు. గట్టుగోట మీటినవాఁడు, ఆకాశయానముగలవాఁడు, నదీవ్యాప్తినిర్వహించినవాఁడు. దాత, ఇట్టివాఁడు, మోహముచెలిని గలసికొనుటకె యశక్తుఁడయ్యెను. ఇదియె అంతరంగికుఁడగు ననుగున కాశ్చర్యహేతువు. కావున నింతగొప్పవాని కిట్టినేలఁగువాటిల్లెనేయని కనికరము. అంతరంగికునకుఁ గనికరము కలుగుటలో నచ్చెరువులేదు. అనంగుఁడిపుడు తనయపూర్వశక్తినుపయోగించి గిరికను వసురాజు పైవలపుగలదానినిగాఁ జేయవలయునుగాన నామెను దదధీనమానసను జేసెను.

మ. లలనారత్నము నొయ్యనొయ్య మొనవ్రేలన్నేల వ్రాయించి ని
  శ్చలవృత్తిన్ వరవర్ణపూర్ణఫలకాసంగంబు నొందించి మి
  న్కులు వేమాఱుఁ దదర్థచింతనలతో నూల్కొల్పి నెయ్యంపుటూ
  జ్జలు పై పై నెనయింప సాగెఁ బటుశాస్త్రశ్రేణికాభ్యాసమున్. 100

ఈపద్యమునందు గిరికను విద్యార్థినిగను మన్మథుని దేశికునిగను రూపించి చింతావేగముమొదలుపారవశ్యము వఱకుగల యవస్థలు అక్షరాభ్యాసము మొదలు కొన్నిగల శిక్షాక్రమముగా నిరూపించి చెప్పుచున్నాఁడు.

లలనారత్నమున్=స్త్రీరత్నమైన గిరికాదేవిని, ఒయ్యనొయ్యన్ = తిన్నతిన్నఁగా, మొనవ్రేలన్నేల వ్రాయించి=పాదాంగుష్ఠముయొక్క యగ్రముచేత భూతలముమీఁద వ్రాయించి యని యర్థము. అనఁగాఁ జింతపుట్టించి కొనవ్రేలిచేత నేలవ్రాఁతలు వ్రాయించియని యర్థాంతరము. నిశ్చలవృత్తిన్=చేష్టారహిత వృత్తిచేత నని యర్థము. స్థిరవృత్తిచేతనని యర్థాంతరము. వర్ణశబ్దము రూపమందును నక్షరమందును వర్తించుచున్నది. (ని. 'వర్ణో ద్విజాదౌ శుక్లాదౌ స్తుతౌ రూపయుతాక్షరే' అని వి.)

వర=వరుఁడైనవసురాజుయొక్క, వర్ణ = రూపముచేత, పూర్ణ = నిండింపఁబడిన, ఫలకా = చిత్తరువు పలకయొక్క, సంగంబునొందించి=సాంగత్యమును బొందించి యనియర్థము. వర=గొప్పలైన, వర్ణ= అక్షరములచేత, పూర్ణ=నిండింపఁబడిన, ఫలకా=పలకలయొక్క, సంగంబునొందించి=సాంగత్యమును బొందించి అనఁగాఁ బలకలుపట్టించి యని యర్థాంతరము. మిన్కులు=పలుకులు, వేమాఱు=పల్మాఱును, తదర్థచింతనలతోన్ = రాజప్రాప్త్యర్థమైన యాలోచనలతోడ, నూల్కొల్పి = సందర్భపఱిచి యని యర్థము. మిన్కులనఁగాఁ జదువులును గనుక, చదువులు పలుమాఱును దదర్థచింతనలతో నూల్కొల్పి యనఁగా నాశబ్దార్థములయొక్క వల్లనలతో సందర్భపఱిచి యనియర్థాంతరము. నెయ్యంపుటొజ్జలు= ప్రణయోపాధ్యాయులైన మన్మథుఁ డనియర్థము. ప్రేమగల యుపాధ్యాయులనియర్థాంతరము. పటు =సమర్థమైన, శాస్త్రశ్రేణికా=శాస్త్రమనఁగా నిక్కడ నాదేశము. అనఁగా నాజ్ఞ. (ని. 'నిదేశ గ్రంథయోః శ్శాస్త్రమ్' అని అ. (స్వకీయమైన యాజ్ఞాపరంపరయొక్క, అభ్యాసమున్=పరిచయము ననియర్థము. వ్యాకరణాది శాస్త్రాభ్యాసమునని యర్థాంతరము. పైపై నెనయింప సాగెన్=అంతకంతకుఁ బొందింప సాగెను. ఇందులో నిశ్చలవృత్తియనఁగా స్తంభమనెడి సాత్త్వికభావము.

ఇందుకు,

క. 'తలకొనినరాగభీత్యా, దులకతమునఁ జేష్టలెల్లఁదొరఁగి శిలాదా
రులఁ జేసినయట్లుండిన, కలిత స్తంభాఖ్యసాత్త్వికంబై వెలయున్.' అని లక్షణము.

గిరికాదేవిని మన్మథుఁడు లోఁగొని చింతాపరవశము వ్రేలునేల వ్రాయునట్లును, ప్రాన్పాటు నొందునట్లును బ్రియునిచిత్తరువు వ్రాయునట్లును, బ్రియచింతనము పలుమాఱుచేయునట్లును నొనరించి పలు త్రిప్పలఁబెట్టసాగెనని ప్రకృతార్థము.

గురువుతోలుత దిద్దఁబెట్టి అక్షరములు వ్రాయించి చదువునేర్చినపిదప శబ్దార్థములు మాటిమాటి కనుకొని పఠించునట్లుచేసి యర్థగ్రహణానంతరము శాస్త్రాభ్యాసము చేయించునని శ్లేషార్థము.

అలం. శ్లేషము.

శా. ఆతన్వంగి యనంగఝాంకరణవజ్జ్యాముక్తచూతాస్త్రని
ర్ఘాతం బోర్వక తమ్ము లంచుఁ దటినీగర్భైకసంజాతకం
జాతవ్రాతముమాటుఁ జెంద నవి యేఁచన్ సాగె మున్మున్నుగా
'జ్ఞాతి శ్చే దనలేన కిం' మ్మనెడివాచారూఢి సత్యంబుగన్. 101

ఆతన్వంగి=ఆగిరికాదేవి, అనంగ=మన్మథునియొక్క, ఝాంకరణవత్ =ఝాం అనెడిధ్వని తోఁగూడిన, జ్యా=నారివలన అనఁగా దుమ్మెదనారి వల్లనుండి, ముక్త=విడువఁబడిన, చూతాస్త్ర =చూతపుష్పాస్త్రముయొక్క, నిర్ఘాతంబు=ప్రహారమును, అనఁగా దెబ్బతాఁకుడును, ఓర్వక=సహింప లేక, తమ్ములంచున్=తమ్ములనఁగాఁ దోడఁబుట్టినవారును బద్మములును, తోడఁబుట్టినవారిని, తటినీ= తనతల్లియైన శుక్తిమతియొక్క, గర్భ=గర్భమువలన,ఏక=ముఖ్యమగునట్టులుగా, సంజాత=పుట్టిన, కం జాతవ్రాతము=పద్మసముదాయముయొక్క, మాటుఁ జెందన్ = చాటునకుఁబోఁగా, అవి=పద్మములు, మున్మున్నుగా=ముందుముందుగా, ఏఁచన్ సాగెన్ =వేధింపసాగెను. ఏలాగనిన, 'జ్ఞాతి శ్చే దనలేవ కిమ్' మ్మనెడి వాచారూఢి సత్యంబుగన్=జ్ఞాతియయిన పక్షమందు-అనఁగా దాయాది యున్న పక్షమందు నగ్నితో నేమి ప్రయోజనము అనునట్టి యనఁగా నగ్ని చేసెడుకార్యము జ్ఞాతివలన నగుచున్నదని భా

వము, వాచారూఢి=వాక్యనిరూఢి, సత్యంబుగన్ = యథార్థమగునటులుగా, గిరికాదేవిని బద్మములు వేధింపసాగె నని సంబంధము. ఇక్కడఁ గన్యకు వివాహమగుటకుఁ బూర్వము జ్ఞాతిత్వముగలదని శాస్త్రసిద్ధము గనుక శుక్తిమతియందు గిరికాదేవితోఁ గూడఁబుట్టిన హేతువువలన సంప్రాప్తమైన జ్ఞాతిద్వేషముచేతఁ బద్మములు గిరికాదేవిని వేధింపసాగె నని యర్థము.

"ఝాం" అని నారిమ్రోగుట బాణనిర్ఘాతాతిశయమును సూచించును. తన్వంగి (కృశించిన మేనుగలది) గావున నాగాటపు దెబ్బకోరువలేక తాపశాంతికిఁ దమ్ములను గప్పుకొనెను. తమ్ములు తనవలెనె తటినీగర్భజాతములుగాన శ్రమలోఁ బాలుపంచుకొందు రనుకొనెను. పెండ్లికిముందు స్త్రీలకు సోదరులతో జ్ఞాతిత్వముండును గాన జ్ఞాతివైరముచేఁ దమ్ములుమఱియుఁ దాపము గూర్చెను.

మన్మథబాధావారణార్థము గిరికతమ్ములఁజేరుట యనౌచిత్యమని కొందఱందురు. తమ్ములనునది శ్లేషమాత్రమెగావున నట్టిదోషమున కవకాశములేదు. మఱియుఁ దమ్ములచేతనములగుటచే నట్టిదోషావకాశము లేదు.

చ. ఎరువుగఁ జూడ సాగె హరి♦ణేక్షణ పిన్నటనాఁటనుండియుం
బరిచితిఁ బూని మంజుగతి♦మాధురియున్ మృదువాగ్విభూతియు
న్వరుసనె తెల్పి తల్లికడ♦వారును దండ్రిభజించువారు నై
గరిమముఁ గన్న సద్ద్విజశి♦ఖామణులన్ వసులుబ్ధచిత్త యై. 102

హరిణేక్షణ=గిరికాదేవి, పిన్నటనాఁటనుండియున్=చిన్నప్పటినుండి, పరిచితిఁబూని = మచ్చికపడి, మంజు=మనోహరమయిన, గతిమాధురియున్=నడకలయొక్క మురిపెమును, మృదువాగ్విభూతియున్=మృదువాక్యసంపదను, వరుసనె తెల్పి = వెంబడివెంబడిగా నేర్పి యని హంస శుకపరమయిన యర్థము. సత్ప్రవర్తనమును దిన్ననివాక్యములను నేర్పినవారని విప్రపరమయిన యర్థము. తల్లికడవారును దండ్రిభజించువారునై గరిమముఁ గన్న సద్ద్విజశిఖామణులన్ = ద్విజశబ్దము పక్షులయందును విప్రులయందును వర్తించుచున్నది. తల్లియైన శుక్తిమతీనదియొక్క యుభయతీరములయందును నివసించినవియును దండ్రియైన కోలాహలపర్వతుని సేవించినవియును నై గౌరవమును బొందిన పక్షిశ్రేష్ఠములయిన హంసకీరములని యర్థము. తల్లివంకవారును దండ్రియొక్క పోష్యవర్గములోనివారును నై పెద్దరికమువహించిన విప్రశ్రేష్ఠు లని యర్థాంతరము. (ని. 'దంత విప్రాణ్డజాద్విజాః' అని అ.) వసులుబ్ధచిత్తయై=వసురాజునం దభిలాషగల మనస్సుగలదై యని యర్థము. ధనలుబ్ధచిత్తయై యని యర్థాంతరము. ఎరువుగఁ జూడసాగెన్=అన్యథా బుద్ధిచేతఁ జూడసాగెను. ఉద్దీపనవిభావములైన హంసకీరములు గాఢానురాగజనకములై యసహ్యములాయెను. గనుక నెరువుగఁ జూడసాగె ననుట.

వసులుబ్ధచిత్త(వసురాజునందాసగలది) గావున గిరికకు సద్ద్విజశిఖామణుల (అంచల చిలుకల)ను వెగటుగాఁ జూడసాగెను. మోహతాపవశమున నుంటచేఁ జిరపరిచితములైనను హంసలనడలు చిలుకలపలుకులు సంతాపకరములయ్యెనని భావము. ద్విజశిఖామణులెంతవారైనను (లోభులు) వసులుబ్ధులనాదరముగఁ గాంచుట సహజమని శ్లేషార్థము అలం. శ్లేషమూలక కావ్యలింగమని కొందఱు. శ్లేషోత్థాపిత సమాసోక్తియని కొందఱు.

తే. ఆకులాహార్యనందన • యలసపవన
జాలములఁ దూలగతిఁ జాలఁ • దూలఁ దొడఁగె
గరిమఁ దా నెంతయచలేంద్ర • కన్యయైనఁ
బలచ నగుఁ గాదె ఘనవసు • ప్రార్థనమున. 103

ఆకులాహార్యనందన = కులపర్వతపుత్త్రియైన యాగిరికాదేవి, అలసపవనజాలములన్ = మంద మారుత సముదాయములచేత, తూలగతిన్=దూదివలె, చాలఁదూలఁదొడఁగెన్ = మిక్కిలి తూలిపోసాగెను. అదియుక్తమే. ఎట్లనిన, గరిమన్=శ్రేష్ఠత్వముచేత, తానెంత యచలేంద్రకన్యయైనన్= అచలేంద్రుఁడనఁగా రాజుగనుకఁ దా నెంత రాజకన్య యైనప్పటిని, ఘనవసుప్రార్థనమునన్ - ఘన= అధికమయిన, వసు=అర్థవిషయమయిన, ప్రార్థనమునన్=యాచనచేత, పలచనగుఁగాదె = చులకఁదనము బొందుచున్నదేకదా యని యర్థము. గరిమన్=దుర్భరత్వముచేత, తానెంత యచలేంద్రకన్యయైనన్=తానెంత పర్వతరాజనందన యైనప్పటికిని, ఘనవసుప్రార్థనమునన్=ఘనుఁడైన వసురాజువిషయమయిన యాచనచేత, పలచనగుఁగాదె=కృశత్వము నొందుచున్నదేకదా యని యర్థాంతరము.

ఈపద్యమందు నర్థాంతర న్యాసాలంకారము. ఇదియునుంగాక, పూర్వమందుఁ గులాహార్య నందనకు నలస పవనజాలములచేతఁ జలన మయుక్తమని విరోధము కనుపడుచున్నది యగుచుండఁగా ఆకులయైన యహార్యనందనయనెడు సమాసాంతరాశ్రయముచేతఁ దత్పరిహార మగుటవలన విరోధాభాసాలంకారమును జెప్పఁదగినది. తానచలేంద్రకన్యగదా! కొండకూతున కించుకేని తండ్రిగుణ ముండకపోదు. ఇట్టిచోఁ దూలగతియెటులగలిగిన దన వసుప్రార్థనమునఁ (అర్థవిషయిక ప్రార్థనముచే) బలుచనయ్యెను. ఆప్రార్థనము ఘనముగాన మఱింతపలుచనయయ్యెను. యాచకుఁడు దూదికంటెఁ దేలికయందురు.

శ్లో. తృణాదపిలఘుస్తూలః, తూలాదపిచయాచకః
వాయునాకింననీతోసౌ, మామయం యాచయేదితి.

అలంకారము. అర్థాంతరన్యాసము.

చ. చెలితెలిఱెప్పముత్తియపు • చిప్పల నొప్పుగుబాష్పవారి చి
ప్పిలి చనుగట్టుపైఁ దొరఁగు • పెంపు నుతింపఁగ నయ్యె నయ్యెడ
న్వెలదిమనోగతం బరసి • వెల్వడి శుక్తిమతీప్రవంతి యా
యలికులవేణిఁ గాంచినమ • హాద్రికిఁ దెల్పఁగ నేగుకైవడిన్. 104

చెలి=గిరికాదేవియొక్క, తెలిఱెప్ప=తేటగల కనుఱెప్పలనెడు, ముత్తెపుచిప్పలన్ = ముత్తెపుచిప్పలచేత, ఒప్పగు=ఒప్పుచున్న, బాష్పవారి=కన్నీరు, చిప్పిలి=వెల్లివిరిసి చనుగట్టుపై, దొరఁగుపెంపు =స్తనశైలముమీఁదఁ బ్రవహించునట్టి యతిశయము,అయ్యెడన్=ఆసమయమందు,నుతింపగనయ్యెన్ =కొనియాడఁదగి యుండెను. ఏలాగనిన, శుక్తిమతీప్రవంతి=శుక్తిమతీనది, వెలఁది మనోగతం బరసివెల్వడి=కొమార్తెయైన గిరికాదేవియొక్క యాంతర్యమును దెలిసికొని వెడలివచ్చి, ఆయలికులవేణిఁ గాంచిన మహాద్రికిఁ దెల్పఁగ నేగుకైవడిన్ = ఆగిరికాదేవిని గన్న కోలాహల పర్వతునికిఁ దెలియఁజెప్పెడి కొఱకుఁ బోవుచున్నదో యన్నట్టులుగా, నుతింపఁగనయ్యెనని సంబంధము. కనుఱెప్పల

నెడు ముత్తెపుచిప్పలచేత నొప్పుచున్న బాష్పవారి పూరమును ముత్తెపుచిప్పలుగల శుక్తిమతీ నదీజలపూరమునుగా నుత్ప్రేక్షించినాఁడు.

బాష్పవారి చిప్పిలుటచేఁ గన్నీరవ్వారిగాఁ గారసాగెననుట. కన్నీటిధారను శుక్తిమతీప్రవంతిగ నుత్ప్రేక్షించుటచే బాష్పధారాతిశయము సూచితము. ఉబ్బుచన్నులు కోలాహలునకు సాటిగఁ జెప్పుటచేఁ బటువుగను గట్టిగనుండెననుట. కావుననే అశ్రుపులటనుండి తొరఁగుట అలం. ఉత్ప్రేక్ష.

చ. కొమరె మనోవ్యథం బొగులఁ ♦ గ్రుచ్చి కవుంగిటఁ జేర్చి తల్లి శు
క్తిమతి తదీయతాపశిఖి ♦ కీలల నింకఁగఁ బోలుఁ గానిచో
రమణి మెయిం బిసాంకురప ♦ రంపరలున్ ఘనసారవాలుకా
సముదయమున్ సుజాతజల ♦ జాతదళంబులు నుల్లసిల్లునే. 105

కొమరె=కూఁతురైనగిరికాదేవి, మనోవ్యథంబొగులన్ = హృదయవేదనచేతఁ బరితపింపఁగా, గ్రుచ్చి కవుంగిటఁ జేర్చి=గట్టిగాఁ గౌఁగిలించుకొని, తల్లి శుక్తిమతి=జననియైన శుక్తిమతీనది, తదీయ=ఆగిరికాసంబంధమయిన, తాప=విరహవేదనమనెడు, శిఖి=అగ్నియొక్క, కీలలన్=జ్వాలలచేత, ఇంకఁగఁబోలున్=ఇగిరిపోయియుండవచ్చును, కానిచోన్=ఆలాగునఁ గాకపోయినట్లులయిన, రమణి మెయిన్=గిరికాదేవిదేహమందు, బిసాంకుర పరంపరలున్=లేఁతతామర తూఁడులయొక్క సమూహములును, ఘనసార=కర్పూరమనెడు, వాలుకాసముదయమున్ = ఇసుకతెరయును, సుజాత=లెస్సగా సంభవించిన, జలజాత=కమలములయొక్క, దళంబులున్ = ఆకులును అనఁగా సుకుమారములయిన కమల గర్భదళములనుట, ఉల్లసిల్లునే=ఒప్పుచుండునా.

ఇక్కడ గిరికాదేవికి శైత్యోపచారార్థముగా శరీరమందు నిల్పిన బిసాంకుర కర్పూరపరాగ పద్మదళములను గిరికాలింగనమందుఁ దద్విరహ తాపానల జ్వాలచేత శోషించిన శుక్తి సంబంధములయిన బిసాంకురవాలుకా పద్మదళములనుగా నుత్ప్రేక్షించినాఁడు. ఈచెప్పుటచేత గిరికాదేవి విరహతాపాతిశయము ప్రకటమగుచున్నది. ఇచ్చట బిసాంకురాదులవలన శక్తిమతి శోషము నూహించుటవలన ననుమానాలంకారము.

చ ప్రసవశరాఖ్యయోగి బహు ♦ భంగుల భావన లిచ్చి మర్దనం
బెసఁగఁగ ధాతు వేర్చి బలి ♦ యించి రసంబు నిశాంత మంతయు
న్వసువుగఁ జేయ మైమఱచి ♦ చాతి దళన్మణిభూష లెన్న దా
ప్తసఖులు చేరి పల్కినను ♦ బల్కదు చూచియుఁ జూడ దెంతయున్. 106

ఈపద్యమునందు మన్మథపరముగను యోగిపరముగను నర్థద్వయము చెప్పఁబడుచున్నది.

ప్రసవశరాఖ్య యోగి=మన్మథుఁడనెడు రసవాదముసేయు యోగీశ్వరుఁడు, బహుభంగుల భావన లిచ్చి=అనేకవిధములుగా సంకల్పమును బుట్టించి యని మన్మథపరమయిన యర్థము. వృక్షరసములచేత భావనలుచేసి యని యోగిపరమయిన యర్థాంతరము. మర్దనం బెసఁగఁగ ధాతువేర్చి=పీడన మొప్పుచుండఁగా నింద్రియ మూర్ఛనమును బుట్టించియని యర్థము. నూరుటయతిశయించుచుండఁగా నభ్రకాది గైరికధాతుయోగముచేసి యని యర్థాంతరము. (ని. 'ధాతు ర్నేంద్రియేషుచ, శబ్దయోని మహాభూత తద్గుణేషు రసాదిషు, మనశ్శిలాదౌ శ్లేష్మాదౌ విశేషాద్గైరికే స్థ్నిచ.' అని మే.) బలియిం

చిరసంబు=అనురాగమును సుస్థిరముగా నిలిపియని యర్థము. పాదరసమును బద్ధముచేసి యని యర్థాంతరము. (ని. 'రసో గంధరసే జలే, శృఙ్గారాదౌ విషే వీర్యే తిక్తాదౌ ద్రవరాగయోః, దేహధాతు ప్రభేదేచ పారదస్వాదయోఃపుమాన్.' అని మే.) నిశాంతమంతయు న్వసువుగఁ జేయన్=గృహమందంతట వసురాజు పొడకట్టినట్టులు చేయఁగానని యర్థము. గృహమంతయును బంగారమగునట్టులు చేయఁగానని యర్థాంతరము. మైమఱచి=శరీరస్థితి యెఱుఁగనిదైయని యర్థము. మదముచేత శరీరస్మరణ లేనిదైయని యర్థాంతరము. నాతి = గిరికాదేవి, గళన్మణిభూషలెన్నదు= జారిపోవుచున్న రత్నాభరణములను సవరింపదని యర్థము. ఆప్తసఖులు చేరి పల్కినను బల్కదు= ఇష్టసఖులు దగ్గరఁ జేరి మాటలాడినను బల్కదని యర్థము. ఇష్టసఖులు పల్కరించిన మారుత్తరమిచ్చి యాదరింపదని యర్థాంతరము. చూచియుఁ జూడదెంతయున్=సన్నిహితవస్తువులనుగూడఁ జూడదని యర్థము. కన్నుమిన్నుగానదని యర్థాంతరము.

ఈపద్యములో బహుభంగుల భావనలనఁగా సంకల్పమనెడి యవస్థావిశేషము. మర్దనమనఁగా నంతఃకరణ ద్రవీభవనము, ధాతు వేర్చుటయనఁగాఁ బ్రళయమనెడి సాత్త్వికభావము. శ్లో. 'ప్రళయస్సుఖదుఃఖాద్యై ర్గాఢమింద్రియమూర్ఛనమ్' అని లక్షణము. బలియించిన రసమనఁగా రతియనెడి స్థాయిభావము. వసురాజును సర్వత్ర చూచుట యున్మాదమనెడి సంచారిభావము. ని. 'ఉన్మాదశ్చిత్తవిభ్రమః' అని. అ. మైమఱచుటయును గళద్భూషణము సవరింపకపోవుటయును సఖులకు మారుత్తర మియ్యకపోవుటయును మోహమనెడి సంచారిభావము. వీనికి లక్షణములు, అనుపమకాంతి యనెడు పద్యపు వాఖ్యయందు వ్రాయఁబడినవి. అలం. శ్లేషానుప్రాణితమగురూపకము.

ఉ. కొంచక యంబుధిం బడిన♦కొండల పత్త్రము లూడ్చ దయ్యె నూ
ఱంచులకత్తి దానియుదు♦టంతయు నెంత ని కంతుచేతినూ
ఱంచులకత్తి హత్తి జవ♦రాలికుచాద్రుల ముంచెఁ బత్త్రరే
ఖాంచితవైభవం బెడల♦నాతతబాష్పమహాపయోనిధిన్. 107

నూఱంచులకత్తి=అనఁగా శతకోటియైన వజ్రాయుధము, కొంచక=భయపడక, అంబుధిం బడిన=సముద్రమందుఁబడిన, కొండల=పర్వతములయొక్క, పత్త్రములూడ్చదయ్యెన్ = ఱెక్కలు గొట్టివైవ దాయెను, దాని యుదుటంతయు నెంతని=ఆశతకోటియొక్క పొగరెల్లయు నెంతలోనిది యని, కంతుచేతి నూఱంచులకత్తి=అనఁగా మన్మథునిచేతనుండెడు శతకోటియని యర్థము. శతపత్త్రమని భావము. హత్తి=తగిలినదై, పత్త్రరేఖాంచితవైభవం బెడలన్=ఱెక్కలయొక్క చక్కఁదనము వీడిపోవునట్టులుగా నని యర్థము. మకరికాపత్త్ర రచనలయొక్క సొగసు చెడిపోవునట్టులుగా నని భావము. జవరాలి కుచాద్రులన్=గిరికాదేవియొక్క చన్నులనెడు కొండలను, ఆతత=విస్తారమైన, బాష్ప=కన్నీరనెడు, మహాపయోనిధిన్=మహాసముద్రమందు, ముంచెన్ = ముంచివైచెను.

అనఁగాఁ బత్త్రములూడ్చక మైనాకాది పర్వతములను సముద్రమాత్రమందు మునుఁగునట్టులు చేసిన యింద్రునిచేతి నూఱంచులకత్తికంటెఁ బత్త్రములు వీడిపోవునట్లుగా గిరికాకుచ పర్వతములను బాష్ప మహాసముద్రమందు ముంచిన కంతుచేతి నూఱంచులకత్తి యెక్కువదియని యర్థము. అతిశ

యోక్తి రూపకానుప్రాణితమైన వ్యతిరేకాలంకారము. ఇక్కడ మూఁడవచరణమందు జవరాలన్న చోటనుండు ఆలనెడు పదముమొదట రేఫాగమము వచ్చినది గనుక విశ్రమము చెప్పినాఁడు. ఇందుకు,

తే. 'ఆలనుపదంబు మొదలనురాగమంబు, వచ్చుసంధికి నుభయంబు వడికిఁ జెల్లు
నలివ జవరాలు బాలింతరాలు ముద్ద,రాలు ధర్మాత్మురా లన రాక్షసారి.'

అని యప్పకవీయపు లక్షణము. ప్రయోగము 'ఏకాంతమునందున్న జవరాండ్ర' మనుచరిత్రము.

బాష్పమాతతమగుటవలన మహోదధియని చెప్పఁబడెను. సముద్రమునందున్న యొక కొండ ఱెక్కల నూఱంచుల కత్తితో నింద్రుఁడు నఱుకఁజాలఁడయ్యెను. వీరాధివీరుఁడగు మన్మథుఁడో యట్టి నూఱంచుల కత్తితోనే కన్నీటిసముద్రమునందు మునుఁగునట్టి కుచాద్రులను రెంటిని బత్త్రచ్ఛేదన మొనరించి ముంచెను.

క. కంజనయనావిలోకన, ఖంజనయుగ మెదకు వ్రాలఁ ♦ గని వసు వాలో
రంజిలుట దెలిసి శంబర, భంజనుఁ డతినిశితవిశిఖ♦పంక్తి నగల్చెన్. 108

కంజనయనా=గిరికాదేవియొక్క, విలోకన=వీక్షణములనెడు, ఖంజనయుగము=కాటుకపిట్టల యొక్క జోడు, (ని. 'ఖఞ్జరీటస్తు ఖఞ్జనః' అని అ.) ఎదకువ్రాలన్=హృదయప్రదేశమందు వ్రాలఁగా నని విలోకనపరమైన యర్థము. సంభోగార్థమై వ్రాలఁగా నని ఖంజనపరమైన యర్థము. కని=చూచి, వసువాలో రంజిలుటఁ దెలిసి=వసువనఁగా వసురాజును ధనంబును గనుక వసురాజు గిరికాహృదయములోఁ బ్రకాశించుట దెలిసినవాఁడై యని మన్మథపరమైన యర్థము. ధనము కాటుకపిట్టలు సంభోగార్థమై వ్రాలినభూమిలో నుండుట దెలిసినవాఁడై యని కిరాతపరమైన యర్థము. శంబర భంజనుఁడు=శంబరశబ్దము శంబరాసురునియందును లేడియందును వర్తించుచున్నది గనుక శంబరాసుర భంజకుఁడైన మన్మథుఁడని యర్థము. మృగభంజకుఁడైన కిరాతుఁడని యర్థాంతరము. (ని. 'శంబరో దైత్య హరిణ మత్స్య శైల జలాంతరే' అని వి.) అతినిశితవిశిఖపంక్తినగల్చెన్=మిక్కిలి వాఁడిగలిగిన బాణపంక్తిచేత భేదించెనని యుభయత్ర నన్వయము.

కాటుకపిట్టలు సంభోగార్థమై వ్రాలినచోట ధనముండునని చెప్పినందులకు, గద్య. 'ఖంజరీటమిథుననిధువనసంచారోపజ్ఞాతనిధిగ్రహణ కౌతుకితమతికిరాతఖన్యమానస్థపుటితాభ్యాశజలాశయా తస్మిన్నిధిర్భవతి మైథునమేతియస్మిన్' (బృహత్సంహిత)

గిరికాదేవి విచారాతిశయముచేఁ దలవ్రాల్పనాయమదృక్ఖంజనములు వక్షస్థ్సలమున నలరెను. కాటుకపిట్టల జంటయున్నచో నిధులుండును. గిరికాహృదయము వసువుంటయెఱింగి మన్మథుఁడు బొమ్మగాడ ములుకు లేసెను. వసువన సువర్ణమని నిధిపరమగునర్థము.

అలం. శ్లేషమూలకరూపకము.

తే. పూఁటపూఁట శరత్కోటి ♦ పొడముకతన, విన్ననై యున్నదీకన్య♦ వేణి దూల
సన్నగిలియున్నగతి నెన్న♦జనునె యకట, యూర్మికలుకంకణాకృతి♦నొనరె నపుడు.

పూటపూట శరత్కోటి పొడముకతనన్=ప్రతిదినమందును సంవత్సర కోటి యుద్భవించుచున్న హేతువువలన, అనఁగా నొకదినము కోటి సంవత్సరములుగా నుండుటవల్ల ననుట. శరత్కాల

కోటి పుట్టుటవల్ల=ఇక్కడఁ గోటియనఁగా భాగమని తెలియవలయును. విన్ననైయన్నదీకన్య=చిన్నపోయినదై యాగిరికాదేవి, వేణిదూలన్=జడతూలి పోఁగాననియుఁ బ్రవాహము తీసిపోఁగా ననియు నర్థము. సన్నగిలియున్నగతిన్=కృశించియున్న విధమును, ఎన్నఁజనునె=తలంపఁగూడునా, అనఁగా నెన్నశక్యము గాదనుట. అకట=అయ్యయో, అపుడు=ఆసమయమందు, ఊర్మికలు కంకణాకృతి నొనరెన్=ఉంగరములు కంకణములాయె ననియు, తరంగములు జలబిందుప్రాయము లయ్యె ననియు నర్థము. ఇందులోఁ గార్శ్యావస్థను జెప్పినాఁడు. ఇది సమాసోక్త్యలంకారము. శ్లేషానుప్రాణితము.

గిరికకుఁబూఁట కోటి సంవత్సరములగుటచేఁ జిన్నఁబోయి పెన్నెఱిసవరింపక కృశించి యుండెను. ఆయమసంతాపస్థితి తెలుపఁ దరముగాదు. చిక్కుటచే నుంగరములు కంకణములయ్యెను. ఇట్లనుటకు "చ. చిటికెనవ్రేలియుంగరము సీతకుఁ గంకణమాయె రాఘవా" యను ఆంజనేయుని వాక్యము సరిచూచునది. శరదాగమముచే నదీప్రవాహము సన్నగిలుటచేఁ దరంగములు జలబిందువులుగా నుండెనని శ్లేషార్థము.

సీ. మదినున్నమరుఁడు వం•పమహోగ్రగతివచ్చు కమ్మఁదెమ్మెరలనఁ•గదసెనూర్పు
లూర్పుగాడ్పులరాక•కులికి పాండుమృణాళకుండలిపైఁ బూనెఁ • గుచసురాద్రి
కుచసురాద్రిగరంగె•ఘోరతాపార్చినాఁ బడసెఁ బుప్పొడితోడి•వలపుఁజెమట
చెమటవెల్లువకు ఫే•నము లయ్యెఁ బెనుగాక నవసి నీరుగఁ బొంగు•హారమణులు
తే. హారమణివారతారాప•సారమును గ
ఠోరమూర్ఛాంధకారవి•స్తారమును న
పారమై రేయుఁ బగలు నే•ర్పఱుపకునికి
మగువకనుదమ్ములరమోడ్పు • మరువవయ్యె. 110

మదినున్న మరుఁడు వంపన్=మనస్సునందున్న మన్మథుఁడు వంపఁగా, మహోగ్రగతివచ్చు=మహారౌద్రముగా వచ్చుచున్న, కమ్మదెమ్మెర లనన్=మలయమారుతములో యన్నట్టులుగా, కదసెనూర్పులు=నిట్టూర్పులు తటస్థములాయెను. ఊర్పుగాడ్పుల రాక కులికి=ఆనిట్టూర్పులనెడు వాయువులయొక్క యాగమనమునకు భయపడి, కుచసురాద్రి=స్తనమనెడు సురాద్రియనఁగాఁ గాంచనాచలము, పాండుమృణాళ=తెల్లని తామరతూఁడనెడు, కుండలి=శేషాహిని, పైఁబూనెన్=తనపై ధరించెను. తొల్లివాయువు ఆదిశేషువు నేను బలాధికుఁడను నేను బలాధికుఁడనని వివాదించిరి. ఆదిశేషువు పడగవిప్పి మేరుపర్వతముపైనుండి కదలింపుమని వాయుదేవుఁడు తనసర్వశక్తులు వినియోగించి యోడిపోయిన పురాణకథ నిట ననుసంధించునది.

ఊర్పులు తెమ్మెరలుగా గాడ్పులుగాఁ జెప్పుటచేతను మహోగ్రగతి వచ్చుచున్నవనుటచేతను దట్టము తెంపులేమి సూచితము. సర్పము వాయువును భుజించును గావునఁ జనుగట్టులు మృణాళకుండలిని ధరించెను. విరహతాపము ఘోరతాపాగ్ని కావుననే చమగట్టులు కరగి నీరయ్యెను. ఈపద్యమునందు గిరికావిరహతాపాతిశయము చెప్పఁబడినది.

అలం. ఉత్ప్రేక్షాలంకారము. రూపకానుప్రాణితకావ్యలింగము.

ఘోర=భయంకరమయిన, తాప=విరహతాపమనెడు, అర్చిన్=అగ్నిజ్వాలచేత, కుచసురాద్రి=స్తనమనెడు కాంచనాచలము, కరంగెనాన్=కరిగినదో యనునట్టులుగా, పడసెఁ బుప్పొడితోడి వలపుఁ జెమట, పుప్పొడితోడి=పుష్పపిశంగపరాగముతోడ, వలపుఁజెమట = పరిమళయుక్తమయిన శ్రమజలము, పడసెన్=స్రవించెను. చెమటవెల్లువకున్=అశ్రమజలముయొక్క వెల్లివరదకు, పెను కాకన్=మహత్తరమైన విరహతాపముచేత, ఆవిసి=కుమిలి, నీరుగఁబొంగు=నీళ్లుగాఁ బొంగుచున్న, హారమణులు=హారమౌక్తికములు, ఫేనములయ్యెన్=నురుగులుగా నేర్పడియెను.

హారమణివార=హారమౌక్తిక సమూహమనెడు, తారా=నక్షత్రములయొక్క, అపసారమును=పోవుటయును, కఠోర=కఠినమయిన, మూర్ఛా=పరవశత్వమనెడు, అంధకార=కాఱుచీఁకటియొక్క, విస్తారమును=ఆధిక్యంబును, అపారమై=దరిముట్టనిదై, రేయుఁ బగలు నేర్పఱుపకునికిన్ = రాత్రి యగుటయుఁ బగలగుటయు నేర్పాటుగాకయున్నందున, మగువకనుదమ్ములు = గిరికాదేవియొక్క నేత్రములనెడు కమలములు, అరమోడ్పు మరుపవయ్యెన్=అర్ధనిమీలనమును మానకయుండెను.

గిరికాదేవికి వసురాజవిషయమైన విరహాతిశయముచేత నిట్టూర్పు లుదయించెను; స్తనములు తామరతూండ్లచేతఁ గప్పఁబడియెను; శరీరమంతయుఁ జెమటపట్టెను; తాపముచేత హారసంబంధములైన ముత్యములు పెటిలిపోయెను; మూర్ఛగ్రమ్మి కన్ను లరగన్నులు పడియెను అని యర్థము. ఈపద్యపు పాదములు ముక్తాంత్యపదగ్రస్తములుగాఁ జెప్పంబడియెను.

సీ. వరగుణజాలసం•వననసామగ్రితోఁ బాశంబు లాశలఁ • బాదుకొల్పి
చటులతాపానల•జ్వాలిక ల్నెఱపి జీవన మంతయుఁ గలంచి • వనచరాళి
నిస్వనంబులు రేచి • నిగుడుకాతరనేత్ర శంబరంబులు వాడు•శరభగండ
కములుదూలెడుచిత్ర•కాయలీలలఁబోయగములువీడ్కొనుభద్ర•గతులుజడియు
తే. నాతతస్తబ్ధరోమంబు•లలసి వ్రాలు, ఘనసితాపాంగములుగాఁగఁ•గాండవృష్టిఁ
బఱపివేఁటాడఁదొడఁగెశం•బరవిరోధి, కాంతయౌవనరేఖలోఁ•గలయమెలఁగి.

ఈపద్యగీతియందుఁ జెప్పఁబడిన శంబరవిరోధి యనెడువిశేష్యపదమునకు మన్మథుఁడనియును కిరాతుఁడనియును బ్రకృతాప్రకృతశ్లేషఁ గల్పించి యంతట నర్థద్వయము గలుగఁ జెప్పినాఁడు. ఏలాగనిన, వర=వరుఁడైన వసురాజుయొక్క, గుణజాల=రూపయౌవనాది గుణ సముదాయ రూపమయిన, సంవననసామగ్రితోన్=వశక్రియాసామగ్రితోడ నని మన్మథ పరమయిన యర్థము. వర=దృఢతరమైన, గుణ=ఉరిత్రాళ్లయొక్కయు, జాల=వలలయొక్కయు, సంవనన=వశక్రియలయొక్క, సామగ్రితోన్=సాధనములతోడనని కిరాతపరమైన యర్థము. (ని. 'వశక్రియా సంవననమ్' అని అ.) పాశంబులాశలఁ బాదుకొల్పి=పాశము లనఁగా నిక్కడ బంధనములు, వానినాశలచేత నాపాదించి, అనఁగా నాశాబంధములు గలుగఁజేసియని యర్థము. ఉరిత్రాళ్లు నానాదిక్కులమో టించి యని యర్థాంతరము.

చటుల=తీవ్రమైన, తాప=సంతాపరూపమైన, అనలజ్వాలికలు=అగ్నిజ్వాలలను, నెఱపి=వ్యాపింపఁ జేసియని యర్థము. తీవ్రతాపములైన యగ్నిజ్వాలలను నెఱపియని యర్థాంతరము. జీవనమంతయుఁ గలంచి=బ్రతుకంతయును గలఁతఁబొందించి యని యర్థము. జీవనమనఁగా నుదకముగనుక

సరోవరోదకములను దుష్టవస్తువులు గలిపి కలుషితములుగాఁ జేసియని యర్థాంతరము. వనచరాళీని స్వనంబులురేచి=వనచరము లనఁగా శుకపికాదులును వనచరులనఁగా నెఱుకువాండ్రును, శుకపికాది పక్షిసమూహముయొక్క కలకలధ్వనులు మీఱునట్టులుగాఁజేసి యనియర్థము. ఎఱుకువాండ్రయొక్క కూకలు బొబ్బలు నతిశయించునట్లు చేసి యని యర్థాంతరము.

నిగుడుకాతరనేత్ర శంబరంబులు=ఉల్బణించుచున్న చంచలనేత్ర జలములును అని యర్థము. బయలుదేరుచున్న దీనదృష్టులైన యెఱ్ఱజింకలును అని యర్థాంతరము. వాడు=వదలిపోవుచున్న, శరభ =శరమనఁగా తెల్లువెన్ను గనుక దానియొక్క, భ=కాంతివంటికాంతితోఁగూడుకొన్న-అనఁగా విరహపాండురములైన, గండకములు=కపోలములును అని యర్థము. అలయుచున్న శరభగండక నామమృగములని యర్థాంతరము. శరభమనఁగా నెనిమిదికాళ్ళుగల మృగంబును గండకమనఁగా గెండామృగంబును, తూలెడుచిత్రకాయలీలలు=తూలిపోవుచున్న చిత్రములైన గాత్రవిలాసములును అని యర్థము. తూలియాడుచున్న వ్యాఘ్రలీలలును అని యర్థాంతరము. (ని. 'ద్వీపీ వ్యాఘ్రశ్చిత్రకాయః' అని యమరశేషము.) సోయగమువీడ్కొను భద్రగతులు=సొంపుచెడిన శుభయానములును అని యర్థము. మందత్వమువిడిచిన వనగజవిశేషములయొక్క సంచారములును అని యర్థాంతరము. (ని. 'భద్రో మంద్రో మృగ శ్చేతి విజ్ఞేయా స్త్రివిధా గజాః' అని యమరశేషము.

జడియు=సమయుచున్న, ఆతత=విస్తారములైన, స్తబ్ధ = నిట్టపొడిచిన రోమములును అని యర్థము. భయపడుచున్న యాతతములైన వరాహములును అని యర్థాంతరము. (ని. 'దంష్ట్రి ఘోణీ స్తబ్ధరోమా' అని అ.) ఆలసి వ్రాలు ఘనసితాపాంగములు=అలసతచేత వ్రాలుచున్న యధికధవళములైన క్రేగంటిచూపులును అని యర్థము. గమన పటుత్వము లేక వ్రాలుచున్న గొప్ప నెమళ్ళను అని యర్థాంతరము. సితాపాంగములనఁగా శుక్లాపాంగములని గ్రహింపవలయును. కాఁగన్=అగునట్టులుగా, కాండవృష్టిఁబఱపి=బాణవర్షము గురుపించి, శంబరవిరోధి=మన్మథుఁడని యర్థము. కిరాతుఁడని యర్థాంతరము. కాంత యౌవనరేఖలోఁ గలయ మెలఁగి=గిరికాదేవియొక్క యౌవన సౌష్ఠవములోఁ గలయ దిరిగి యని యర్థము. కాంతయౌ=రమ్యమయిన, వనరేఖలోన్ = అరణ్యశ్రేణిలో, కలయమెలఁగి=కలయదిరిగి యని యర్థాంతరము. వేఁటాడఁ దొడఁగెన్=వేఁటాడఁజొచ్చెను.

మన్మథుఁడు గిరికాదేవిని విరహపరితాపాప్తిని బొందించె నని ఫలితార్థము, ఈపద్యములో నాలంబనోద్దీపన విభావ సాత్త్వికసంచారిభావములు గ్రంథవిస్తార భయమువలనవ్రాయలేదు.

మన్మథుఁడు వసురాజు గుణాదిసామగ్రినాధారముఁ జేసికొని గిరికామనోహరయౌవనరేఖలోఁ గలయఁదిరుగుచు నాయమకుఁదాపముగూర్చి శుకశారికాది ధ్వనులచే వలపు నినుమడింపఁ జేసి కలఁత పఱచికనులనీరూరఁ, జెక్కులు తెల్లఁబాఱ, మేనిజిగితొలంగ నడలమురువుచెడ, గగుర్పాటు తలసూపఁ దెల్లనికడగంటి చూపులొలయ ములుకులు నాటవేసి వేటాడఁ దొడంగెనని ప్రకృతార్థము.

అలం. ప్రకృతా ప్రకృత శ్లేషయని సోమకవి. శబ్దశక్తిమూలధ్వని యని యాధునికులు.

చ. అలికులవేణి యిట్లు వలఁ•యాంకబిసాంకురపన్నగాళికిం
జలమరిచల్లగాలికిని•జక్కొరఖాణపు తేజిఁ దోలుపూ

పిలుతువయాళికిం జిగురుఁబిందులనీలిగయాళికిన్ హాలా
హలగుళికాభదుర్మదఘనాళికి నాళికి లోఁగి యాత్మలోన్. 112

అలికులవేణి=గిరికాదేవి, ఇట్లు=ఈచెప్పఁబడినప్రకారముగా, వలయాంక = కుండలాకారమే చిహ్నముగాఁగల, బిసాంకుర=తామరతూఁడులనెడు, పన్నగాళికిన్ = సర్పశ్రేణికిని, చలమరి చల్ల గాలికిని=చలపాదియైన మలయమారుతమునకును, చక్కెరఖాణపు తేజీఁదోలు పూవిలుతు వయాళికిన్ = చక్కెరఖాణపు తేజియనఁగాఁ బంచదారయే దాణాగాఁగల గుఱ్ఱము - అనఁగాఁ జిలుక. దానినడిపించునట్టి మన్మథునియొక్క, వయాళికిన్=అనఁగా వాహ్యాళికిని, వయాళియనెడు పదము వాహ్యాళిశబ్దమునకుఁ దద్భవము. వాహ్యాళియనఁగా వినోదార్థమయిన సపరివార బలవిహారము. ఇందుకు,

తే. 'ప్రమదనిష్యందతరనేత్రపద్ము లగుచుఁ, బౌరజనులు విలోకింపఁ బ్రమదలీల
సముచితానల్పపరివారసహితుఁ డగుచు, నవని నాథసుతుండు వాహ్యాళి వెడలె.'

అని శృంగారనైషధమందును,

ఉ. 'సాలును నీరు నేఉపఉపంగల మావుల వేదవీథివా
హ్యాళి యొనర్చునేయలికులాలకతాసితవర్ణయయ్యునే
బాలసువర్ణదేహమున భాసిలు నానలు మోము వేల్పు ప్రో
యాలు ప్రవీణమామక మహాకృతినాథుఁ గృతార్థుఁ జేయుతన్.'

అని రామాభ్యుదయమునందును బ్రయోగింపంబడియెను.

చిగురువిందులనీలి గయాళికిన్=చిగురే విందుభోజనముగాఁగల నల్లనిగయ్యాళికి, అనఁగాఁగోకిలకును, హాలాహలగుళికాభ=కాలకూటపుముద్దతో సమానమయిన, దుర్మద=దుష్టమయిన మదముగల, ఘన=గొప్పదైన, అళికిన్=తుమ్మెదకును, ఆళికిన్=చెలికత్తియకును, లోఁగి=జడిసినదై, ఆత్మలోన్= తనమనములో ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

దేశ్యమయిన తేజీయనెడిపదమునకు, 'దీర్ఘాణాం హ్రస్వస్స్యాత్' న. అను సూత్రముచే హ్రస్వముప్రాప్తించి, 'నచదేశ్యపదే' న. అనెడుసూత్రముచే హ్రస్వప్రాప్తి లేకున్నను, 'నైకవర్ణే న దేశ్యేపి హ్రస్వో దేశ్యేతు వా క్వచిత్' అనెడు నథర్వణవచనమువలన హ్రస్వమువచ్చినదని తెలియవలయును. గయ్యాళి, గయాళి అని ద్విత్వాదిత్వ రూపభేదముచేత రెండువిధములుగను గలదు. ఇందుకుఁ బ్రమాణము. 'అద్విత్వంచ భవేద్ద్విత్వం దీర్ఘోహ్రస్వశ్చ కేషుచిత్' అని యథర్వణ వచనము. ఈపద్యములోఁ దటస్థోద్దీపనములను జెప్పినాఁడు. తామర తూండ్లను సర్పములతోఁ బోల్చుటకవుల కాచారము.

తాపోపశమనార్థము చేతికిఁగట్టఁబడిన కంకణరూపములగు తమ్మితూడుమొలకలు సర్పసదృ ములయ్యెను. చల్లగాలిచలపాది. దానిసంగతి తెలుపఁబనిలేదు. పూవిలుతుఁడే తాపముగూర్చువాఁడు. వానివారువము చెక్కెరదాణాగల చిలుక. దానిపలుకులు చెవికిములుకులె. కోయిలగయ్యాళి, చెవులు చిందరఁబోవఁ జివురులమేసి కూయఁదొడఁగును. తుమ్మెదవిసపుగుళిక. చెవిగుట్టు గ్రహించుటచే లజ్జమెం డగునుగానఁ జెవియులోఁగఁదగినదే! అన్నియుం మోహోద్దీపనములే.

ఉ. అమ్మకచెల్ల ధైర్యవిభవాతిశయంబునఁ దండ్రిపెంపు లే
శమ్మును గాననైతి జడజన్మమునన్ జనయిత్రిఁ బోలి పైఁ
గ్రమ్మునిదాఘతాపహతిఁ గ్రాఁగుచుఁ జిక్కితి లోఁతు దక్కి ని
క్కమ్ముగఁ దండ్రిచాయ గలకన్యలు ధన్యలుగా వసుంధరన్. 113

అమ్మకచెల్ల=అనఁగా నేనేమిసేతుననుట. ఇది సంతాపవాక్యము. ధైర్య విభవాతిశయంబునన్=నిశ్చలత్వాతిశయముచేత, తండ్రిపెంపు లేశమ్మును గాననైతిన్=తండ్రియైన కోలాహలపర్వతుని యొక్క యతిశయమును లేశమాత్రమయినను బొందఁజాలనైతిని. అనఁగా నెంతమాత్రమును దండ్రిని బోలనైతిననుట. జడజన్మమునం జనయిత్రిఁ బోలిపైఁ గ్రమ్మునిదాఘతాపహతిఁ గ్రాఁగుచుఁ జిక్కితి లోఁతుదక్కి=జడమనఁగా స్తబ్ధత్వంబును జలంబును, ఇచట ల డ ల క భేదము. నిదాఘమనఁగా నుష్ణంబును గ్రీష్మంబును, లోఁతనఁగా గాంభీర్యమును నిమ్నత్వంబును, జడజన్మమునన్=జడమయిన జన్మముచేత, జనయిత్రిఁ బోలి=తల్లియైన శుక్తిమతినిబోలి, పైఁగ్రమ్ము=పైని, వ్యాపించుచున్న, నిదాఘతాపహతిన్=ఉష్ణమయిన విరహతాపముయొక్క తాఁకుడుచేత, క్రాఁగుచున్ = తపించుచు, లోఁతు దక్కి=గాంభీర్యముచెడి, చిక్కితిన్=కృశించితినని యర్థము. తల్లనిబోలియన్నందునఁ దల్లి నదిగనుక జలజన్మమును బైఁగ్రమ్ముచున్న గ్రీష్మకాలాతపహతిచేతఁ గ్రాఁగుచును, నిమ్నత్వముమాని సన్నగిలుట యును నదీధర్మములని గ్రహింపవలయును. (ని. 'నిదాఘో గ్రీష్మకాలేస్యా త్తృష్ణా స్వేదాంబునో రపి' అని వి.) వసుంధరన్ = భూమియందు, నిక్కమ్ముగన్=యథార్థముగా, తండ్రిచాయగలకన్యలు =తండ్రిపోలికగల కన్యలు, ధన్యలుగా = కృతార్థలుగదా. ని. 'ధన్యాపితృముఖీకన్యా ధన్యామాతృముఖ స్సుతః' అనఁగాఁ దండ్రినిబోలిన కొమార్తె ధన్యురాలనియును దల్లిని బోలినకుమారుఁడు ధన్యుఁడనియును నున్నదికనుక నేను దండ్రిని బోలక తల్లినిబోలినందున నింత వ్యథపాలైతి నని యర్థము. అలం. అర్థాంతరన్యాసము.

మ. సయిదోడైనసువృత్తపాండురమణీజాలంబు మున్మున్నుగా
భయకృత్పల్లవసూచికాస్థితిఁ దపఃప్రౌఢిఁ జేరై నృపా
న్వయచూడామణిపేరురం బెనసె నే నట్లయ్యుఁ బ్రాపింపలే
నయితిం దాదృశవైభవం బకట భాగ్యాయత్తము ల్గా సిరుల్. 114

పాండురమణీజాలము అనుపదమువలన రమణీజాలమునకు మణీజాలమునకు నర్థద్వయము కవి సంఘటింపఁజేసెను.

సయిదోడైన=తోడఁబుట్టిన, సువృత్త=మంచివర్తులములైన అని యర్థము. సద్వృత్తిగల అని యర్థాంతరము. పాండురమణీజాలంబు=శ్వేతమణిసమూహము, అనఁగా ముత్తియములు అనియర్థము. సువృత్త=మంచివృత్తిచేత, పాండు=నిర్మలమైన, రమణీజాలంబు=స్త్రీసమూహము అనియర్థాంతరము. మున్మున్నుగన్=ముందుముందుగా, భయకృత్=భయమును జేసెడు, పల్లవ=చిగురువంటి, సూచికా=సూదియందలి యని యర్థము. సూదులవంటి మన్మథ బాణములయందని యర్థాంతరము. స్థితిన్=ఉనికిచేత సాధ్యమయిన, తపః=తపస్సుయొక్క, ప్రౌఢిన్=నిశ్చయభావముచేత-ఇక్కడ ముక్తాఫలములు సూదులచేతఁ గ్రుచ్చఁబడుఁ గనుక ముత్యములకు సూచికాగ్రస్థితి సంభవించుచున్నది. పేరై=

హారమ్మై యని యర్థము. ప్రసిద్ధికెక్కి యని యర్థాంతరము. నృపాన్వయ=రాజకులమునకు, చూడామణి=శిరోరత్నమయిన వసురాజుయొక్క, పేరురంబు=విశాలవక్షస్థ్సలమును, ఎనసెన్=పొందినదాయెను, ఏను=నేను, అట్లయ్యున్=ఆముత్యములకుఁ గలిగినసువృత్తాదిలక్షణములు గలదాన నయ్యును, తాదృశ=అటువంటి, అనఁగా ముత్యములుగలుగఁజేసికొన్న, వైభవంబు = విభవాతిశయమును, ప్రాపింపలేనయితిన్=పొందలేకపోతిని, అకట=అయ్యో, సిరులు=సంపదలు, భాగ్యాయత్తముల్గా=పుణ్యస్వాధీనములైనవి గదా, అనఁగాఁ బూర్వజన్మసంబంధమయిన సుకృతరూప భాగ్యానుగుణముగా సంపత్తులుగలుగుచున్నవి.

మణిహారములు ముక్తాహారములు గ్రీష్మతాపోపశమనము లనుటకుఁ బ్రయోగము.

శ్లో. నిశాశ్శశాంక క్షతనీలరాజయః, క్వచిద్విచిత్రం జలయంత్రమందిరం
మణిప్రకారాః సరసంచచందనం, శుచౌ ప్రియా యాంతిజనస్యసేవ్యతాం.

శ్లో. నితంబ బింబైస్సుదుకూల మేఖలైః, స్తనైస్సహారా భరణైః సచందనైః
శిరోరుహైః స్నానకషాయవాసితైః, స్త్రియోనిదాఘం శమయంతికామినాం.

ఋతుసంహారము.

అలంకారము. వ్యతిరేకము. శ్లేషోత్థాపితము.

ఉ. తల్లియుఁ దండ్రియున్ బహువి♦ధంబులఁ గామితము ల్ఘటింపఁగా
నుల్లము చల్లనై సిరుల♦ నొందుసుపర్వనరాహిరాట్పురీ
హల్లకపాణులం దొకతె♦నై జనియింపక నొడ్ల నొంచుపె
న్వెల్లికి రాతికిం బొడమి♦ వేఁడి నైతిఁ దలంపు లేటికిన్. 115

తల్లియుఁ దండ్రియున్=తల్లిదండ్రులు, బహువిధంబులన్=అనేక విధములచేత, కామితముల్ఘటింపఁగాన్=కోరికలను సమకూర్చుచుండఁగా, ఉల్లముచల్లనై=మనస్సు చల్లఁబడిన, సిరులనొందు=సంపదలను బొందుచున్న, సుపర్వ=దేవతలయొక్కయు, నర=మనుష్యులయొక్కయు, అహిరాట్=సర్పశ్రేష్ఠులయొక్కయు, పురీ=పట్టణములయందలి, అనఁగా స్వర్గమర్త్య పాతాళలోకమునందలి, హల్లక పాణులందున్=స్త్రీలయందు, ఒకతెనై జనియింపక=ఒకదాననైపుట్టక, ఒడ్లనొంచు=పరులను వంచన సేయుచుండెడు అని యర్థము. తీరముల నురలఁ దీయుచుండు నదియని భావము. పెన్వెల్లికిన్=పెద్దవెల్లి వరదపెట్టెడు నదికిని, రాతికిన్=పాషాణ మయమయినకొండకును, పొడమి=జన్మించి, వేఁడినైతిన్=కొఱమాలిన దాననైతిని, తలంపులేటికిన్=నాయొక్క తలంపులతో నేమి నిమిత్తము.

తా. స్వర్గమర్త్య పాతాళములయందు సాధారణముగాజన్మించెడు స్త్రీలలో నొకదాననై జన్మించి నట్టయిన వసురాజ విషయమైన నాకోర్కెను దల్లిదండ్రులు ఫలింపఁ జేయుదురుగదా! ఆలాగునఁగాక యేటికిని గొండకును జన్మించినందున నాకోర్కిసఫలముచేయువారు కనుపడరుగనుక నెందుకును గొఱగాని జన్మముగలదాన నైతిని.

తల్లియొడ్ల నొంచునది. తండ్రి ఱాయి. ఈయిరువురకుఁబుట్టిన వారు వేఱఁడి యగుటలోనచ్చెరువులేదు. కానసే తలంచిలాభములేదు. సుపర్వనరాహిరాట్పురీసతులు తల్లిదండ్రుల తోడ్పాటుగల

వారుగాననే వారియుల్లము చల్లనగుట, సిరులొందుట తటస్థించినది. అలం. శ్లేషమూలక కావ్యలింగము.

వీటఁడి రూపాంతరము వేటఁడి. ఇందులకుఁ బ్రయోగము భారతోద్యోగపర్వతృతీయాశ్వాసమునుండి.

''వేటఁడియైన మానిసికివెండి వివేకము గల్గనేర్చునే''

సీ. సోయగంబున వీణ•వాయింప మాయంపు జటిలుఁ డచ్చటికి నే•మిటికి వచ్చె
వచ్చుఁగా కేమి య•వ్వసుమహీపాలు బాలామనోభవువి నే•లా తలంచెఁ
దలఁచుగా కేమి మి•థ్యాజపప్రౌఢి నా పృథివీశు నేల ర•ప్పించి చూపెఁ
జూపుఁగా కేమి మా•యాపారికాంక్షిద ర్శితవసుభ్రాంతిఁ జెం•దితి ని దేల

తే. తల్లికౌటిల్య మెన్నఁడు • దఱుగుఁ దండ్రి
హృదయ మెన్నఁటికిఁ గరంగు • నీవియోగ
నీరనిధి నెట్లు గడతు శృం•గారవనికి
నరుగ నన్నియుఁ జక్కనౌ • నచట ననుచు. 116

సోయగంబునన్=విలాసముచేత, వీణవాయింపన్=వీణవాయించుచుండఁగా, మాయంపుజటిలుఁడు=కృత్రిమపు మునీశ్వరుఁడు; అచ్చటికి నేమిటికి వచ్చెన్ = ఆమణిమందిరమునకు నేలవచ్చెను. వచ్చుఁగాకేమి=వచ్చిన నేమాయెను,బాలామనోభవునిన్=రమణీ మన్మథుఁడైన, అవ్వసుమహీపాలున్=ఆవసురాజును, ఏలాతలంచెన్ = ఎందుకుఁ దలఁచెను, తలఁచుఁగా కేమి = తలఁచిననేమాయెను, మిథ్యాజప ప్రౌఢిన్=అబద్ధపు జపసామర్థ్యముచేత, ఆపృథివీశున్=ఆవసురాజును, ఏలరప్పించిచూపెన్=ఎందుకు రప్పించి కనుపఱిచెను, చూపుఁగాకేమి=చూపించిన నేమాయెను, మాయాపారికాంక్షి=కపటమునీశ్వరునిచేత, (ని. 'తపస్వీ తాపసః పారికాంక్షీ వాచంయమో మునిః' అని అ.) దర్శిత=చూపఁబడిన, వసు=బంగారమందలి,భ్రాంతిన్=భ్రమను, చెందితి నిదేల=ఈతీరుగా నెందుకుఁ జెందితిని అని యర్థము. వసురాజునందలి భ్రాంతి నెందుకుఁ జెందితినినని భావము.

తల్లికౌటిల్య మెన్నఁడు దఱుగున్=తల్లియైన శుక్తిమతియొక్క కుటిలబుద్ధి యెన్నఁటికి నశింపఁగలదు అని యర్థము. కుటిలప్రచార మని భావము. అనఁగా నదిగనుక వంకవంకలుగాఁ బ్రవహించుటయనుట. తండ్రిహృదయ మెన్నఁటికిఁ గరంగున్=తండ్రియైన కోలాహలునియొక్క నిర్దయహృదయ మెన్నఁటికిఁ గరఁగుచున్నది అని యర్థము. పాషాణమయహృదయ మనిభావము. ఈవియోగ నీరనిధి నెట్లుగడతున్ = ఈవిరహ సముద్రము నేలాగు దాఁటుదును, శృంగార వనికి నరుగన్=శృంగార వనమునకుఁ బోయిన, అచటన్=అక్కడ, అన్నియుఁ జక్కనౌను = అన్నికార్యములును జక్కపడును, అనుచున్=అనితలంచినదై, ఈ పద్యమునకు ముందరి పద్యముతో నన్వయము.

వసురాజు బాలామనోభవుఁడు కూవుననే తనవలపుఁ జూఱఁగొనఁగలుగుట. తల్లి నది గాన సహజకుటిలగమనముగలది. తండ్రి కొండ గాన నెంతకుఁ గఱగనివాఁడు. విరహమో యంతులేని సముద్రము. శృంగారవనికేగి కాలక్షేపముచేయనగునని గిరికాదేవి యుపవనమున కేగెను.

అలం. శ్లేషము.

క. సకియఁ గను మొఱఁగి మధుకర, చికుర నిజారామవాటిఁ • జేరి ప్రసూనాం
బక ధాటీశుకఘోటీ,నికరాటీకనము మనము•నివ్వెఱపఱుపన్.

సకియఁ గను మొఱఁగి=చెలికత్తియను, వంచనచేసి, అనఁగాఁ దప్పించుకొని, మధుకరచికుర= తుమ్మెదలవంటి తలవెండ్రుకలు గల గిరికాదేవి, నిజారామవాటిఁ జేరి=తనయొక్క యుద్యానవనప్రదేశమందుఁ బ్రవేశించి, ప్రసూనాంబక = పుష్పములు బాణములుగాఁ గలమన్మథునియొక్క, ధాటీ= దవుడునందలి, శుక ఘోటీనికర=చిలుకగుఱ్ఱపు గుంపులయొక్క, ఆటీకనము = ఆగమనము, అనఁగా రాక, ('టీక్ళ్ గతౌ')మనము నివ్వెఱ పఱుపన్=మనస్సు నాశ్చర్యమును బొందింపఁగా, నిండువెఱ నివ్వెఱ, అని సంధివచ్చినది. ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. ధాటీలక్షణము.

శ్లో. 'శత్రుసేనావమర్దాయ సద్య స్సుభటఘోటకైః,
విజిగీషాప్రవృత్తి ర్యా సా ధాటీతి నిగద్యతే.' అని చెప్పఁబడియున్నది.

ఎటులో మన్మథునిబాణినుండి తొలంగి బ్రతుకవచ్చునని యుపవనమునకుఁ బోగా గిరికాదేవికి వనమంతయుఁ నుద్దీపనదాయకముగ నుండెను.

సీ. పవమానమానవ•ప్లవమానకైరవ చ్యవమానరజము మైఁ•నంటఁ దివురుఁ
గరసారసాగ్ర తా•మరసాతిసాంద్రసీ ధురసాప్తిఁ గన్నీరుఁ • దుడువఁగోరు
మదనానలప్రభా•సదనామ్రకోమల చ్ఛదనార్చిపైఁ జూపు • జరపఁ జూచు
సలయానహతల తాకి•సలయాగమలయాగనిలయానిలునకూర్పు • దెలుపఁదలఁచు

తే. గుంజత్పుటగుంజదళిపుంజ•శింజితంబు, వెగ్గలంబైనఁ జెవి యొగ్గి • వినఁ గడంగు
బంచశరభూతపరభూత•పంచభూత, ములఁ దదీయస్థలంబులఁ • గలుపుకరణి.

పవమానమానవ=వాతపోతముచేత-అనఁగా మందమారుతముచేత, ప్లవమాన=తూఁగియాడు చున్న, కైరవ=కలువల వల్లనుండి, చ్యవమాన=జారుచున్న, రజము=పుప్పొడిని, మైనంటఁదివుర్ = శరీరముచేత స్పృశింపవలయు నని యుద్యుక్తపడును. ఇందులో మానవ మనఁగా మాణవకము. నణల కభేదమాటవలన మానమయిన దని తెలియవలయును. (శ్లో. 'రలయో ర్లడయో స్తద్వ ల్లళయో శ్శసయో రపి, వబయో ర్నణయో శ్చాంతే సవిసర్గా విసర్గయోః, సబిందుకా బిందుకయో స్స్యా దభేదేనకల్పనమ్.' అని భోజరాజీయము. దేహము పృథ్వీభూతము గావునఁ బృథ్వీభూతజన్యమగు పరాగముతోఁ బృథ్వీభూతమగు మేనునుగలుపఁ జూచెనని భావము.

కరసారస=కమలమువంటి హస్తముయొక్క, అగ్ర=చివరయందలి, తామరస=లీలాపద్మమందు, అతిసాంద్ర=మిక్కిలి దట్టముగానున్న, సీధురస=మకరందముయొక్క, ఆప్తిన్=వ్యాప్తిచేత, కన్నీరుఁ దుడువఁ గోరున్=బాష్పజలములను గడుగఁగోరును, జలవికారమగు బాష్పములను జలవికారమగు పూవుదేనియ యందుఁ గలుపఁజూచెనని భావము. మదనానలప్రభా=మన్మథాగ్ని ప్రభలకు, సదన = ఆలయమైన, ఆమ్ర=మామిడియొక్క, కోమలచ్ఛదన = చిగురుటాకులనెడు, అర్చిపైన్=జ్వాలికమీఁద, చూపుజరపఁ జూచున్=వీక్షణమును బ్రసరింపఁజేయఁ జూచును, మదనానల ప్రభాసదన మని చెప్పుటచేత నామ్రకోమలచ్ఛదనమందు నగ్నిత్వము తెలియఁబడుచున్నది. లయమనఁగా న్యూనాధికత్వ రహిత తాళసామ్యము (ని. 'తాళః కాలక్రియామానం లయ స్సామ్యమ్' అని అ. మావి చివుళ్ల

మండుచున్నయగ్నివలెఁ బ్రజ్వరిల్లును గావున మామిడిచివురు మదనానలప్రభాసదనము. చూపుకాంతుల కునికి పట్టుగాన తేజోవికారము. చూపులు తేజశ్శ ప్రకృతిగానఁ బ్రవాళకాంతి యను తేజస్సుతోఁ గలుపఁజూచెనని భావము.

సలయ=లయతోఁ గూడుకొన్నట్టులుగా, ఆహత=కొట్టఁబడుచున్న, లతాకిసలయ=శాఖాపల్లవముగల, అగ=వృక్షముగలిగిన, మలయాగనిలయ=మలయాచలమే నివాసముగాఁగల, అనిలునకున్=వాయువునకు-అనగా మలయమారుతమునకు, ఊర్పుఁదెలుపఁ దలచున్=నిట్టూర్పును గనుపఱుపఁ దలఁచును, ఊర్పు వాయువికారముగాన మందమారుతముతోఁ గలుపఁజూచునని భావము. కుంజపుట=పొదరిండ్లయందు, గుంజత్=మ్రోయుచున్న, అళిపుంజ=తుమ్మెదగుంపులయొక్క, శింజితంబు=ఝుంకారధ్వని, వెగ్గలంబైనన్=మిక్కుటముగాఁగా, చెవియొగ్గివినఁగడంగున్=చెవినోరగిలఁ బెట్టుకొని వినఁజూచును, తుమ్మెదలరవళిశబ్దముగాన నాకాశవికారము. చెవి శబ్దేంద్రియముగాన నాకాశవికారము. రెంటెనిగలిపెనని భావము.

ఎట్లన్న, పంచశర=మన్మథుఁడనెడు, భూత=పెనుభూతముచేత, పరిభూత=పరాభవమొందిన, పంచభూతములన్=నిజదేహస్థిత పంచభూతాంశములను, తదీయస్థలంబులన్=పంచభూతములయందు, కలుపుకరణిన్=కలుపురీతిగా అని సంబంధము.

ఇక్కడఁ బుష్పపరాగము పృథివీతత్త్వము, మకరందరసము జలతత్త్వము, 'మదనానలప్రభా సదనామ్రకోమల చ్ఛదనార్చి' తేజస్తత్త్వము, మలయానిలము వాయుతత్త్వము, శబ్దగుణకమాకాశమని యున్నది గనుక మధుకర ఝుంకారధ్వను లాకాశతత్త్వము వీనియందుఁ దనయందున్న పంచమహాభూతాంశములను గలుపుకరణినని యర్థము. ఇక్కడ మరణమనెడి వ్యభిచారిభావము. 'మరణం మరణార్థస్తు ప్రయత్నః పరికీర్తితః' అని యున్నది. అలం. సమము. ఉత్ప్రేక్ష. రెంటి సంకరము.

క. ఈరీతిఁ బొదల మెదలుచు, నారీతిలకంబు మేనినచ్చిక యిచ్చం
గోరక నవసహకారక, కోరక మూరుకొని వడి నిగుడ గమకించెన్. 119

ఈరీతిన్=పైనిఁ జెప్పఁబడినప్రకారము, పొదల మెదలుచున్ = పొదరిండ్లయందుఁ దిరుగుచు, నారీతిలకంబు=గిరికాదేవి, మేనినచ్చిక=శరీరపునమ్మకమును, ఇచ్చంగోరక=మనస్సునం దభిలషింపక, అనఁగా దేహధారణమం దాసక్తిలేకయనుట, నవ=నూతనమైన, సహకార=తియ్యమామిడి చెట్లయొక్క, కోరకము = మొగ్గను, ఊరుకొని = ఆఘ్రాణించి, వడి నిగుడగమకించెన్=శీఘ్రముగా నంతమును బొందుట కుద్యోగించెను. ఈపద్యమందును గ్రంథకర్త మరణాఖ్యభావమునే చెప్పినాఁడు. సహకారకుసుమగంధము విరహిణులకపాయదాయకమనుటకు.

శ్లో. సహకారకుసుమకేసర నికరభరామోదమూర్ఛితదిగంతే. భర్తృహరి శృంగారశతకము.

ఉ. అత్తఱి బిత్తరిన్ మణిగృహంబునఁ గానక బోటికత్తియ
లుత్తర మంది హా గిరిసుతామణి యెచ్చటి కేగితే కదుం
గ్రొత్త యటంచుఁ గేలివనకుంజము లారయ వచ్చి యచ్చటం
జిత్తజభల్లభగ్న యగుచెల్వఁ గనుంగొని సంభ్రమంబునన్. 120

అత్తఱిన్=అసమయమందు, చిత్తరిన్=గిరికాదేవిని, మణిగృహంబునఁ గానక=మణిమందిర మందుఁ గానక, బోటికత్తియలు=చెలికత్తియలు, తత్తరమంది = తొందరపడి, హాగిరిసుతామణీ= అయ్యయో గిరికాదేవి, ఎచ్చటికేగితే=ఎక్కడికిఁబోతివే, కడుంగ్రొత్త=మిక్కిలి వింతగా నున్నది, అటంచున్=అనిపలుకుచు, కేలివనకుంజము లారయవచ్చి=ఉద్యానవనమందలి పొదరిండ్లయందు వెదకునిమిత్తముగా వచ్చి, అచ్చటన్=అక్కడక్కడ, చిత్తజభల్లభగ్నయగు = మన్మథబాణముల చేత భంగపడిన, చెల్వఁ గనుంగొని=గిరికాదేవినిజూచి, సంభ్రమంబునన్ = తొట్రుపాటుచేత, ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. ములుకులు నాటుచున్న మన్మథుని వారింతమన్న నతఁడు చిత్తజుఁడు. అందు గిరికబాణభగ్నయై యున్నది. కానసే సంభ్రమము. చెలువయనుటచే గిరికాలోకోత్తరసౌందర్యము ద్యోతకము.

చ. కటకట మమ్ము నొక్కత్రుటి♦కాలముఁ బాయనిదాన వొంటివై
నెటువలె వచ్చి తమ్మ చెలి♦యచ్చటిప్రేఁకపుఁ దేనెవాఁక లీ
వెటువలె నీదు తమ్మ తెరు♦వెల్లను బుప్పొడి నీపదాంబుజం
బెటువలె నోర్చె నమ్మ తరు♦ణీ తగు నమ్మ కడింది చెయ్దముల్. 121

కటకట=అయ్యయో, మమ్ము నొక్కత్రుటికాలముఁ బాయనిదానవు=మమ్ము నొకత్రుటిమాత్రకాలమయిన నెడఁబాయనిదానవు, ఒంటివైన్=ఒంటిగా, ఎటువలెవచ్చితమ్మ = ఓగిరికాదేవీ, ఏలాగువచ్చితివమ్మ, చెలి=ఓగిరికాదేవీ, ఇచ్చటి = ఇక్కడనున్న, ప్రేఁకపుఁదేనెవాఁకలు=అశక్యమయిన పూఁదేనెయేఱులను, ఈవెటువలె నీదితమ్మ=నీవేలాగున నీది దాఁటితివమ్మా, తెరువెల్లను బుప్పొడి=మార్గమంతయుఁ బుష్పరాగమయము, నీపదాంబుజం బెటువలెనోర్చెనమ్మ=కమలమువంటి నీపాదమేలాగున సహించెనమ్మ, తరుణీ=ఓచిన్నదానా, తగునమ్మ కడింది చెయ్దములు = తగునటమ్మా యిట్టిసాహసపుచేష్టలు-అనఁగాఁ గూడవుగదా యనుట.

ఎపుడు నెడబాయని చెలువ యొంటిగావచ్చుటయే కడిందిచెయిదము. త్రోవకడ్డముగాఁ దేనెవాఁకలున్నవి. అవియో ప్రేఁకమైనవి. పుప్పొడియో తెరువంతయు నావరించినది. కాన నీ కంటిని దాటివచ్చుట సాహసముగాన గిరికను జెలులు తగునమ్మా యని మందలించిరి.

ఉ. ఇచ్చ హితాహితంబు గణి♦యింపనిగోలవు గానఁ గానకున్
వచ్చితి గా కయో పథిక♦వర్గము నొంటిఁ జరింప నిచ్చునే
యిచ్చటి యన్యపుష్టచయ ♦ మిచ్చటిమత్తమధువ్రతవ్రజం
బిచ్చటిపల్లవోత్కరము ♦ లిచ్చటిపాంసులపంకజావళుల్. 122

ఇచ్చన్=మానసమందు, హితాహితంబు గణియింపని=ఇష్టమును ననిష్టమును నెంచుకొనలేని, గోలవుగానన్=ముద్దరాలవుగనుక, కానకున్ వచ్చితిగాక=వనమునకు వచ్చినావే కాక, అయో= అయ్యయ్యో, ఇచ్చటి యన్యపుష్టచయము=ఈవనమందలి కోకిలసమూహమును అని యర్థము. ధూర్తసమూహ మని యర్థాంతరము. అనఁగాఁ దలిదండ్రులకంటె నన్యులైనవారిచేతఁ బోషింపఁబడిన దిక్కుకాయలనుట, ఇచ్చటి మత్తమధువ్రతవ్రజంబు=ఈవనమందలి మకరందపాన మత్తమధుకర సమూహమును అని యర్థము. మత్తులైన మద్యపాన పరాయణులయొక్క సమూహమని యర్థాం

తరము. ఇచ్చటి పల్లవోత్కరములు=ఈవనమందలి చిగురుటాకుల గుంపులును అని యర్థము. విట సమూహము లని యర్థాంతరము. (ని. 'పల్లవో స్త్రీకిసలయే షిద్గే' అని వి.) ఇచ్చటి పాంసుల పంకజావళులు=ఈవనమందలి పరాగభరిత పద్మపంక్తులని యర్థము. పాంసుల=జారులయొక్కయు, ని. (పాంసులః పుంశ్చలే' అని వి.) పంకజ=పాపసంభవులయొక్కయు, (ని. 'అస్త్రీ పంకం పుమాన్ పాప్మా' అని అ.) ఆవళులు=సమూహములని యర్థాంతరము. పథికవర్గమున్=వియోగి జనసమూహము నని యర్థము. మార్గస్థులనని యర్థాంతరము. ఒంటిఁ జరింపనిచ్చునే = ఒంటిగా సంచరింపనిచ్చునా-అనఁగా సంచరించిన బ్రతుకనీయవనుట.

బాటసారులకు ధూర్తులవలనను బానరతులవలనను జారులవలనను బాపాత్ములవలనను సిలుగులు గలుగును గాన నొంటిఁబోఁజనదని శ్లేషార్థము. వియోగినికిఁ గోయిలలు, తుమ్మెదలు, చివురులు, తమ్మికొలఁకులు నుద్దీపనహేతువులు గాన నొంటి రాఁజనదని ప్రకృతార్థము.

సీ. ఫలభంగములు సేయు♦చిలుకకు సాంగమై క్రోధరసంబు ము♦క్కునెయుండుఁ
గాలభేదికి మహా♦కాలమూర్తికి దంటకోయిల♦కెఱమంట ♦ గురియుఁ గంట
మదమరాళికి సదం♦భస్థితి యుడి వోదు ముఖరాగమును గళంబున విసంబు
నలరుఁగొమ్మలతావు♦లార్చి యాసవపూర్తి నెడలించునళికి మే♦నెల్ల మలిన
తే. మట్టియిట కేల వచ్చి తీ♦యధరబింబ, మీతలిరుఁ గేలునీభుజా♦మృదుమృణాళి
కలును నీపుష్పకోమలాం♦గములుపూని, గట్టుదొరపట్టి వగుటల్లఁ♦గంటిమబల.

ఫలభంగములుసేయు చిలుకకున్=ఫలమనఁగా లాభంబును, రసాలాదిఫలంబును, (ని. 'ఫలం జాతఫలే సస్యే హేతూత్థే వ్యుష్టి లాభయోః' అని మే.) లాభవైకల్యములను జేయు చిలుకకని యర్థము. రసాలాది ఫలభంగంబులును జేయు నని భావము. సాంగమయి క్రోధరసంబు ముక్కునసె యుండున్=సంపూర్ణమయిన కోపము ముక్కునసె యుండునని యర్థము. ఇక్కడ లోకోక్తి నను సంధించి క్రోధరసంబు ముక్కునసె యుండునని చెప్పినాఁడు, చంచుగతారుణిమను నిగీర్ణముచేసి సాంగ క్రోధరసరూపముచేత నధ్యవసించినాఁడు, క్రోధరసమునకు ఫలభంగమును భావమని తెలియ వలయును.

కాలభేదికిన్=ఇక్కడఁ గాలశబ్దము మృత్యుభేదియైనదియు, మహాకాలమూర్తికిన్=మహాకాలుఁడనఁగా రుద్రుఁడుగనుక రుద్రమూర్తియైనదియునగు, దంటకోయిలకున్ = ప్రౌఢకోకిలమునకని యర్థము. వసంతకాలభేదియును మహానీలమూర్తియును అని భావము. (ని. 'కాలో మృత్యౌమహాకాలే సమరే యమ కృష్ణయోః' అని వి.) ఎఱమంటగురియుఁగంటన్ = కంటియందు దెట్టియైన వహ్నిజ్వాలను వర్షించుచుండునని యర్థము. ఇక్కడఁ గోకిలయొక్క నేత్రారుణకాంతిని నిగీర్ణముచేసి వహ్నిజ్వాలా రూపముచేత నధ్యవసించినాఁడు.

మదమరాళికిన్=మదించినయాఁడుహంసకు, సదంభస్థితి=కపటయుక్తమయినయునికి, ఊడివోదు=మానదు. ఇదియునుంగాక, ముఖరాగమును గళంబున విసంబు=ముఖమందుఁ గోపప్రయుక్తారుణిమయును గంఠమందుఁ బరుషవాక్యరూపమయినవిషమును, ఇక్కడఁ బరుషవాక్యమును విషరూపముచేత నధ్యవసించినాఁడు। విసమనునది విషశబ్దతద్భవము, అనఁగా మొగ మెఱ్ఱచేసికొని విషము గ్ర

క్కుచుండుననుట. హంసలకు శ్రేష్ఠమయినయంభస్సులయందలి అనఁగా జలములయందలి యునికి యును ముక్కులయందు రక్తిమయును గంతమందు బిసఖండమును గలదని భావము. వబలక భేదమనియున్నది గనుక బిసమును విసమని చెప్పినాఁడు. బిసమనఁగాఁ దామరతూఁడు, (ని. 'మృణాళం బిస మబ్జాది కదంబే' అని అ.)

అలరుఁగొమ్మలతావులార్చి యాసవపూర్తి నెడలించునళికిన్=కొమ్మలనఁగా స్త్రీలును శాఖలును, తావులనఁగా నివాసములును బరిమళములును ఆసవపూర్తి యనఁగాఁ బ్రాణసంబంధిపూర్తియును మకరందపూర్ణత్వమును, అలరుఁగొమ్మల=సంతోషించుచున్న స్త్రీలయొక్క, తావులార్చి = కొంపలు గూల్చి, ఆసవపూర్తి నెడలించు=ప్రాణపూర్తిని వదలించుచున్న, అళికిన్=తుమ్మెదకు, మేనెల్లమలినము =శరీరమంతయు నపవిత్రమని యర్థము. పుష్పశాఖలయొక్క పరిమళములనుబోఁగొట్టి మకరందపూర్ణత్వమును దొలఁగఁజేయుచున్న దనియును భావము.

అట్టి=అనఁగా నట్టిశుక పిక హంసికా మధుపము లుండునట్టి, ఇటకున్=ఈవనమునకు, ఈయధరబింబము=దొండపండువంటి యీమోవియును, ఈతలిరుఁగేలును=చిగురువంటి యీహస్తంబును, ఈభుజా మృదుమృణాళికలును = మృదుమృణాళికలవంటి యీభుజములును, ఈపుష్పకోమలాంగములు =పుష్పములవలెఁ గోమలములయిన యీయవయవములును, పూని=ధరించి యని క్రమాలంకారము. ఏలవచ్చితివి=ఎందుకువచ్చితివి, అబల=ముగ్ధవైన యోగిరికాదేవీ, గట్టుదొరపట్టివగుటెల్లఁ గంటిమి = నీవు శైలరాజపుత్త్రివైన లక్షణమంతయుఁదెలిసికొంటిమి-

అనఁగాఁ గొండకు జన్మించినదానవు గనుక నింత గట్టి గుండె గలదానవైనా వనిభావము. తలిరుఁగేలు అన్నచోట, 'స్తనాదౌ ద్విత్వవిశిష్టాజాతిః' అనెడువామనవచనమువలనఁ గేలుశబ్దమునకు ద్విత్వమే చెప్పవలయునని శంకింపఁగూడదు. ఎందువల్లననిన నిది నిత్యైకవచనాంతశబ్దము. దీనికిం బ్రమాణము. ('బహుత్వం క్వచిదేకత్వం బహుత్వం ప్రత్యయేక్వచిత్' అని యాథర్వణోక్తి.)

మొదటిపాదము అతిశయోక్త్యనుప్రాణితలోకోక్తియనియుఁ గడమమూఁడుపాదములు అతిశయోక్త్యలంకారమునని యెఱుంగునది.

చిలుకలు ఫలభంగముచేయునవి; నీపెదవి దొండపండని గంటుపెట్టునవియే. కోయిలలు కాలభేదులు; నీకేలుచివురని తినునవియే. మరాళిసదంభస్థితిగలది; నీభుజములు తమ్మితూండ్లని మెసవునదె. అళికొమ్మల తావులార్చునది; నీకోమలాంగముల గుట్టునదియే. ఇట్టియెడకు నొంటిగారానగునా? మఱచితిమి, నీవుగట్టుబిడ్డవుగాన నింతకుఁ దెగించితివని గిరికతోఁ జెలులుభాషించిరి.

మ. గురువిద్వేషికి విప్రయోగిహరణ♦క్రూరుండు మారుండు దాఁ
బరమాప్తుండు తదీయభృత్యులు దలం♦పం గాంచన స్తేయత
త్పరగంధానిలము ల్మహామధుపము ♦ ల్దస్యుత్రిఁ గాంచెం బిక
స్వరముం బంచమశబ్ద మిందుకు సుదృ♦గ్జాలంబు రాఁ జెల్లునే. 124

గురు విద్వేషికిన్=గురుతల్పగుఁడయిన చంద్రునకు, విప్రయోగి=విప్రుఁడైన యోగియొక్క-అనఁగా బ్రాహ్మణజాతియైన మానియొక్క, హరణ=సంహరణముచేత, క్రూరుండు=కఠినుఁడైన, మారుండు=మన్మథుఁడు, తాఁ బరమాప్తుండు=తాను ముఖ్యస్నేహితుఁడు అని యర్థము, విప్రయోగమ

నఁగా విరహముగాన నడిగలవాఁడు విప్రయోగి. తదీయహరణమందుఁ గ్రూరుఁడైనవాఁడనిభావము. తదీయభృత్యులు దలంపక్=ఆమన్మథుని కొలువుడుగాంద్రను విచారింపఁగా, కాంచనస్తేయ తత్పర గంధానిలములు=స్వర్ణస్తేయమం దాసక్తిగల మలయమారుతములును, మహామధుపములు=అత్యంత సురాపానతత్పరములయిన తుమ్మెదలును అని యర్థము. కాంచనమనఁగా సంపంగియును గనుక మలయమారుతములు సంపంగిపువ్వులను రాల్చుచున్నవనియును దుమ్మెదలు తేనెలుగ్రోలుచున్న వనియును భావము. (ని. 'మధు మద్యే పుష్పరసే క్షౌద్రే' అని అ.) పికస్వరముక్ = కోకిల స్వరమును, తన్మైత్రిక్ = ఆపంచమహాపాతకి సంయోగముచేత, పంచమశబ్దము = అయిదవదియైన మహాపాతకిశబ్దమును, కాంచెక్=పొందెను అని యర్థము.

> శ్లో. 'బ్రహ్మహా చ సురాపశ్చ స్తేయీచ గురుతల్పగః
> మహాపాతకిన స్త్వేతే తత్సంయోగీచ పఞ్చమః'

పికస్వర మీచెప్పిన నాల్గింటికి నయిదవదాయెనని భావము. పంచమస్వర రూఢిని గాంచెననియునుభావము. (ని. 'పికఃకూజతిపఞ్చమమ్' అని అ.) ఇందుకు—అనఁగా నీపంచమహాపాతకు లున్నచోటికి సుదృగ్జాలంబు రాఁజెల్లునే=వివేకి జనము రాఁజెల్లునా యని యర్థము. సు=శ్రేష్ఠములయిన, దృక్ = కన్నులుగల స్త్రీలయొక్క, జాలం=సమూహము, రాఁజెల్లునే=రావచ్చునా.—అనఁగా స్త్రీజన సమూహమురావచ్చునాయని భావము.

ఇందుకు—

చంద్రుఁడు, మారుఁడు, మలయమారుతము, తుమ్మెదలు పికము ఇవి పంచమహాపాతకులు, వీరి చెలిమి యుక్తాయుక్త వివేచనగలవారికిఁ (స్త్రీలకు) దగదు. కాననిటకొంటిమై రాఁజెల్లదని భావము.

అలం. శ్లేషమూలక కావ్యలింగము.

చ. అని చెలు లెల్ల దూరి ధవ♦ళాంబుజభాజనరాజి నావటిం
చినకుసుమాన్న రాశిపయిఁ ♦ జక్కని చెందొవజోతి నిల్పి య
వ్వనితకుఁ జుట్టు రాఁ బడసి♦వైచి సగంధపలాశవాటిఁ బా
యనియశరీరిబంటులకు ♦ నామితఁ జేసి రనేకభంగులన్. 125

అని=ఈలాగని, చెలులెల్ల దూరి=సఖులందఱును నిందించి, ధవళాంబుజ=తెల్లతామరపువ్వులనెడు, భాజన=పళ్లెరములయొక్క, రాజిక్=సమూహమందు, ఆవటించిన = వడ్డించిన, కుసుమాన్నరాశి పయిక్=పువ్వులనెడు నన్నపురాశిమీఁద, చక్కని చెందొవ జోతినిల్పి=చక్కనైన యెఱ్ఱకలువపువ్వనెడు జ్యోతి నునిచి, అవ్వనితకుక్=ఆగిరికాదేవికి, చుట్టురాక్=చుట్టుతిరిగి వచ్చునట్టులుగా, బడసివైచి=దిగఁదుడిచివైచి, సగంధ పలాశవాటిఁబాయని యశరీరిబంటులకుక్=అనఁగా సౌరభయుక్త వృక్షవాటిఁ బాయని శుక పికాది మన్మథభృత్యు లనెడు గర్వయుక్తమాంసాశివీధి నెడఁ బాయని బేతాళభృత్యులకు అనఁగాఁ బిశాచములకు, (ని. 'పలాశీ వృక్ష రక్షసోః' అని వి.) అనేకభంగులక్=బహువిధములుగా, ఆమితఁ జేసిరి=ఆహారము నొనర్చిరి.

పిశాచాదులావేశించినవారికిఁ దెల్లనిపాత్రలో నన్నముంచినడుమ దివ్వెబెట్టి దిగదుడుచుటయుం నావలసాయాహారము దూరముగభూతములకుఁ బాఱవైచుటయు నాచారము. అటులెచెలులు గిరికకు

తెలితమ్మియాకులోఁ బూవుల నన్నముగానుంచి చెంగలుజోతిచేర్చి దిగదుడిచి యశరీరి (మన్మథబేతాళాది) దళములకుఁ బాఱవైచిరనిభావము.

అలంకారము. రూపకము. శ్లిష్టము.

క. ఆవేళ మంజువాణి య,నావిలగతిఁ జేరి దుస్సహామిళిందపుళిం
దావలి కావలికరువలి, యావలి కావలితహృదయ యగుసతిఁ బలికెన్. 127

ఆవేళన్=ఆసమయమందు, మంజువాణి=మంజువాణియనెడు ప్రియసఖి, అనావిలగతిఁ జేరి =నిష్కలుషగతిచేత సమీపమునకుఁబోయి, దుస్సహ=సహింప నలవిగాని, మిళింద = తుమ్మెదలనెడు, పుళింద = బోయలయొక్క, ఆవలికిన్=సమూహమునకును, పుళిందులనఁగా నిషాదజాతిభేదము గలవారు, (ని. 'భేదాః కిరాత శబర పుళిందా మ్లేచ్ఛజాతయః' అని అ.) ఆ వలికరువలి = ఆచల్లగాలియొక్క, ఆవలికిన్=బాధకును, ఆవలితహృదయ యగు=వ్యాకులచిత్తురాలైన, సతిన్=గిరికాదేవిని గూర్చి, పలికెన్=ఒకవాక్యము పలికెను. ఏమనియనిన,

తే. కలికియలికీరమండలి కలికి చూడ, వేల యీ వేళఁ బలుకవే వేలగోల
నీకటాక్షోర్మివాక్సుధానీకమునకు, జాలిఁబడిగాదె యివియీకుజాలిఁబడియె.

కలికి యలి కీర మండలికిన్ = సుందరమైన తుమ్మెదలకును శుకబృందమునకును, అలికి = భయపడి, చూడవేల = ఎందుకుఁ జూడవు, ఈవేళఁ బలుకవేవేల = నీవెందుకు నీసమయమందుఁ బలుకకున్నావు, గోల = ముగ్ధయైన గిరికాదేవీ, నీకటాక్షోర్మి వాక్సుధానీకములకున్ = నీయొక్క కటాక్షవీక్షణ పరంపరలకును వాగమృత స్తోమమునకును, జాలిఁ బడిగాదె = భంగపడియేకదా, ఇవి=అనఁగా నీతుమ్మెదలును నీచిలుకలును అని క్రమాలంకారము. ఈకుజాలిఁ బడియెన్=ఈవృక్షపంక్తియందుఁ బడెను. నీవుగోలవుగానఁ బ్రకృతమెఱుంగఁజాలకున్నదానవు. చూచినంతమాత్రమునఁ దుమ్మెదలుపలికినంతమాత్రమునఁ జిలుకలు చెట్లపాలుగానుండనులుకుట గోలతనము దెలుపుచున్నది. కీరములు తుమ్మెదలు మండలియను కొందువేమో?నీపలుకులుసుధానీకము కటాక్షములూర్ములుగానజయింపవచ్చును. వచ్చుననసేల యవిభంగపడియెనని భావము.

అలం. వ్యతిరేకము. హేతూత్ప్రేక్ష.

సీ. సకలాగమాంతవాసనలు గాంచి విముక్త కాంచనం బగుమాధుకరకులంబు
వర్ణిత్వమున దృఢావాప్తిసంయమములై శౌరిఁ బేర్కొనుశుకసంతతులును
గన్న పెంచినవారిఁ గలయక మాధవా ర్పితసూక్తి మనువన ప్రియచయంబు
పద్మాసనాభ్యాస పారవశ్యమున బ్రహ్మాధీనగతులైన హంసతతులు
తే. పుష్పఫలపత్రజలమాత్రముల శరీర, యాత్ర గడపుచు సన్మార్గ మధిగమించి
యొసఁగునివి యెల్లనీ కేలయె గ్గొనర్చు, వనితయీవంతయావంత వలవదమ్మ.

సకల = సమస్తమయిన, ఆగమాంత = వేదాంతములయొక్క, వాసనలుగాంచి = జ్ఞానములను బొంది, విముక్త=విడిచిపెట్టఁబడిన, కాంచనంబగు=సువర్ణముగలదైన, మాధుకరకులంబు = భిక్షుకకులంబును అని యర్థము. సకలాగమాంతవాసనలు గాంచి=సమస్తములైన యగమాంతములనఁగా లతాంతములు-అనఁగాఁ బుష్పములు వానియొక్క పరిమళములను బొంది, విముక్తకాంచనంబగు=కాంచన

మనఁగా సంపఁగిపువ్వు, విడిచిపెట్టఁబడిన సంపఁగిపువ్వుగలదైన, మాధుకరకులంబు=భృంగసముదాయ మని భావము.

వర్ణిత్వమునన్=బ్రహ్మచారిత్వముచేత, (ని. 'వర్ణీ స్యా ల్లేఖకే చిత్రకారేపి బ్రహ్మచారిణి' అని వి.) దృఢావాప్తి=దృఢమగునట్టులుగా, సంయమముతై=జోడుగూడినవై, శౌరిఁబేర్కొను = రామ రామ యని పలుకుచుండెడు, శుకసంతతులును, చిలుకగుంపులని భావము. ఈయర్థమందు, ('ప్రశస్తా వర్ణా హరితారుణావేషాం స్త ఇతివర్ణినః') అని మతుబర్థమందు ఇనిప్రత్యయము. (శ్లో. 'భూమనిందా ప్రశంసాసు నిత్యయోగేతిశాయినే, సంబంధేస్తి వివక్షాయాం భవంతిమతుబాదయః' అని వచనము.) కన్న పెంచినవారిఁ గలయక=కన్నవారిని బెంచినవారిని - అనఁగాఁదల్లిదండ్రులు మొదలైనవారిలోఁ గలసియుండక, మాధవార్పితసూక్తిమను = వాసుదేవునియందుసమర్పింపఁబడిన సద్భాషణములచేత జీవించుచున్న, వనప్రియచయంబు = వనవాసప్రియసమూహములును, అనఁగా వానప్రస్థులును అని యర్థము. కన్నకోయిలలను బెంచినకాకులను గలయక, మాధవార్పితసూక్తి ననఁగా వసంతర్తువు నందు వినియోగపఱుపఁబడిన మధురవాక్కులచేత మనుచున్నకోకిలసమూహ మని భావము. (వి. 'మాధవస్తు వసంతే స్యా ద్వైశాఖే గరుడధ్వజే' అని వి.) ('వనప్రియః పరభృతః కోకిలః పిక ఇత్యపి' అని అ.)

పద్మాసనాభ్యాస పారవశ్యమునన్=యోగవిహితమయిన పద్మాసనముయొక్క యభ్యాసపరవశత్వముచేత, బ్రహ్మాధీనగతులైన=బ్రహ్మాధీనములైనచిత్తవృత్తులుగలిగిన, హంసతతులు=యోగులును అని యర్థము. పద్మముల యందుఁ గూర్చుండెడునభ్యాసమువలని పరవశత్వముచేత బ్రహ్మాధీనమయిన గమనములు గలవైన, అనఁగా బ్రహ్మకు వాహనములయిన రాయంచలనిభావము. పుష్పఫలపత్ర జలమాత్రములన్=పువ్వులు పండ్లు చిగురుటాకులు ఉదకము, ఇంతమాత్రపు స్వల్పాహారముచేత, ఇక్కడఁ గ్రమాలంకారము. శరీరయాత్ర గడపుచున్=శరీరవర్తనమును జరిగించుచు, సన్మార్గమధిగమించి=సద్వృత్తిని బొంది యనియర్థము, ఆకాశము నవలంబించి యని భావము. ఎసఁగు=ఒప్పుచుండునట్టి, ఇవియెల్లన్ = ఈచెప్పఁబడినవి యన్నియును, నీకేల యొగ్గొనర్చున్ = నీకెందుకుఁ గిట్టమిసేయును. కాఁబట్టి, వనిత=ఓగిరికాదేవీ, ఆవంత = అవిచారము, ఆవంత=ఆవగింజంతయయినను, వలవదమ్మ = అక్కఱలేదమ్మా-అనఁగా మన్మథ భృత్యులగు తుమ్మెదలు చిలుకలు కోకిలలు హంసలు నీచెప్పఁబడిన సన్మార్గావలంబకు లనుట.

తుమ్మెదలు భిక్షుకత్వమవలంబించి ఫలమాత్రముచేతను, చిలుకలు బ్రహ్మచర్యమునూని ఫలమాత్రమునను, గోయిలలు వానప్రస్థముననుండి పత్రమాత్రమునను, హంసములు యతిత్వము నొందిజల మాత్రముచేతను దృప్తినొందుచున్నవి కాన నివి సన్మార్గమునొందినవి. ఇవినీకు ఆవగింజంతయేని యొగ్గు చేయఁజాలవు. కాన వీనివలనిభయము మానఁదగినది. అలం. కావ్యలింగము. రత్నావళియు.

ఉ. సారసకైరవంబులకుఁ ♦ జంద్రదినేంద్రవిరోధ మంచకుం
బారము లేనిమందగతి ♦ భారము దెమ్మరకున్ ఫణిగ్రహా
కూరవిఘాత మంగజున ♦ కుం గడ తేరనిభీమవీక్షణాం
గారకవైర మింత తలఁ ♦ కం బని లేదు మనోజ్ఞఘాటికిన్. 129

సారస కైరవంబులకున్=పద్మములకును గలువలకును, చంద్రదినేంద్ర విరోధము=చంద్రసూర్యులయొక్క ప్రాతికూల్యము-అనఁగాఁ బద్మములకుఁ జంద్రుఁడును గలువలకు సూర్యుఁడును వైరులని యర్థము. పద్మములు రాత్రియందు ముకుళించుచున్నవనియును గలువలు దివాభాగమందు ముకుళించుచున్నవనియును భావము. అంచకున్=హంసకు, పారము లేని మందగతిభారము = ఎన్నటికిని గడముట్టని శనిగ్రహగతియొక్క భారము-అనఁగా హంసకు శని చాలఁడని యర్థము. ఎప్పటికిని మందయానముయొక్క యతిశయము గలదని భావము. తెమ్మెరకున్=మలయమారుతమునకు, ఫణిగ్రహక్రూరవిఘాతము=రాహుగ్రహముయొక్క కఠినమయిన విరోధము-అనఁగా మలయమారుతమునకు రాహువు చాలఁడని యర్థము. వాయువు సర్పములచేత భక్షింపఁబడుచున్నదని భావము. అంగజునకున్=మన్మథునకు, కడతేరని = అంతముచిక్కని, భీమవీక్షణ = ఉగ్రదృష్టిగలిగిన, అంగారక వైరము=అంగారకవిరోధము-అనఁగా మన్మథున కంగారకుండు చాలఁడని యర్థము. భీమశబ్దము హరునియందును వర్తించుచున్నది గనుక హరనేత్రానల భస్మీకృతుఁడని భావము. కాఁబట్టి, వనిత= ఓగిరికాదేవీ, మనోజుధాటికిన్=మన్మథునియొక్క దాడికి, తలకంబనిలేదు=భయపడ నక్కఱలేదు-అనఁగా గ్రహచారబలము చాలకయున్న మన్మథునివలనను నతని పరివారమువలనను నీకు భయము లేదని తాత్పర్యము.

మన్మథుని బలగమంతయుఁ గడలేని యాపదలలో మునిఁగియున్నది. తమ్ములకుఁ జంద్రుఁడు కలువలకు దినకరుఁడు వైరులు. అంచలు నడువఁ జేతగానివి. తెమ్మెరకుఁ బాములవలనిభయము. ఇది కాక మన్మథుఁడు శివునికంటి చిచ్చునకు బూదియైనవాఁడు గాన భయమున కెడమేలేదు. అలం. విరోధాభాసము.

ఉ. నమ్మిక మీఱ నెత్తు వదన న్మిఁక నెమ్మది కోర్కి నెమ్మితో
నిమ్మని యేము నీదయకు నిమ్మని కమ్మనివింటిజోదుపా
దమ్ములు మెట్టకెంపుపిరిదమ్ములు చేర్చి భజింతు మమ్మరో
రమ్మని బోటి కోమలికరమ్మనివార్యగతిం దెమల్పఁగన్. 180

నమ్మికమీఱన్=నమ్మక మతిశయ మగునట్టులుగా, ఎత్తువదనమ్ము = వంచిన ముఖమెత్తుము, ఇఁకన్=ఇఁకమీఁద, నెమ్మదికోర్కిన్=మనస్సునఁ గలవాంఛితమును-అనఁగా వసురాజు పరిగ్రహమును, నెమ్మితోనిమ్మని=ప్రేమతోడఁ గలుగఁ జేయుమనియును, ఏము నీదయకునిమ్మని=మేము నీకృపకు స్థానమనియును-అనఁగా నీకృపకుఁ బాత్రులమనియును, కమ్మనివింటి జోదుపాదమ్ములు=మన్మథుని చరణములు, మెట్టకెంపువిరిదమ్ములు చేర్చి=మెట్ట కెందామరపువ్వులర్పించి, భజింతుము=సేవించుచున్నాము, అమ్మరో రమ్మని=ఓతల్లి రావేయని, బోటి=చెలికత్తియయైన మంజువాణి, కోమలి = గిరికాదేవియొక్క, కరమ్ము=హస్తమును, అనివార్యగతిన్=విడిపించుకొనఁ గూడనట్టులుగా, తెమల్పఁగన్= పట్టితీయఁగా, ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

విరిదమ్ము లన్నచోటఁ గర్మధారయ సమాసముగనుక వర్గతృతీయ వర్ణమును జెప్పినాఁడు. ఎత్తు వదనమ్ము అనుచో, 'ప్రార్థనార్థే మురేకత్వే కథ్యతే మధ్యమార్థకః, విభాషాతంపదస్త్యైకే నప్రాణేతు కదాచన' అని మువర్ణకమునకు వికల్పత్వము చెప్పంబడియెఁ గాన నిక్కడ ఎత్తుము అని మువర్ణము గలుగఁ బ్రయోగింపఁడయ్యె.

మన్మథుని పరివారము సన్మార్గసంగతము. ఇంక నాపదలో మునిఁగియున్నదిగాన నీకు మరుఁడు కీడుతలంపఁడు. మేము మన్మథునిపూజించి సుముఖుని గావింతుము.' సంశయము మానుమని మధుర వాణి గిరికాదేవి హస్తమును బట్టుకొనెను. అలం. పర్యాయోక్తము.

క. సోలుచుఁ జెలి కెదురాడక, తూలుచుఁ గైదండ యొసఁగు•తొయ్యలిమేనన్
వ్రాలుచుఁ జింతాజలనిధిఁ, దేలుచుఁ గైసేయుసఖులఁ • దెగడుచుఁ గంటన్.

సోలుచున్ = సొటసొటలాడుచును, చెలికెదురాడక = చెలికత్తియకు నడ్డుమాటచెప్పక, తూలుచున్=తూలితూలిపడుచును, కైదండయొసఁగు తొయ్యలిమేనన్ వ్రాలుచున్ = చేయూఁత యిచ్చుచున్న చెలికత్తెయొక్క దేహముమీఁద నొరఁగుచును, చింతాజలనిధిఁ దేలుచున్ = విచార మనెడు సముద్రమందుఁ దేలియాడుచును, కైసేయుసఖులన్ = అలంకరింపవచ్చునట్టి చెలికత్తియలను, కంటన్=కనుసంజ్ఞచేత, తెగడుచున్ = అదలించుచును. ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

ఇందులో సోలుటయును దొయ్యలి మేనవ్రాలుటయును గ్లానియనెడి సంచారి భావమున కును భావము. 'గ్లానిర్బలస్యాపచయో వైవర్ణ్యారతి కారణమ్' అని లక్షణము. చెలికెదురాడక పోవుట ముగ్ధాలక్షణము. తూలుట యున్మాదానుభావము. శ్లో. 'వినావిచారమాచార ఉన్మాద ఇతి లక్షణమ్' కంటఁదెగడుట యమర్షానుభావము. శ్లో. 'అమర్ష స్స్వపరాధేషు మనః ప్రజ్వలనం మతమ్' అని లక్షణము.

సీ. నిబిడదుస్సహదీర్ఘ•నిశ్వాసపవనంబు పఱచు తేఁటుల బరా•బరులు సేయ
నుజ్జ్వలావయవతా•పజ్వాలికల వేఁడి చివురుజొంపములపై • నవఘళింప
లలితాననేందుమం•డలపాండురచ్ఛాయ వనరుహావళివళా•వళి యడంప
శ్రమజలాభివ్యక్త•సహజ సాంకవముదా మోదంబు చిలుకల•మూల కొత్త
ఆ. నెసఁగుభసలములను • గిసలములను నీర, జాతములను గీర•జాతములను
విగ్రహింపనీని•విరహాంబె తోడుగా, వెలఁది వెడలె విపిన•వీధులకును. 132

నిబిడ=దట్టమును, దుస్సహ=సహింప నలవిగానిదియు, దీర్ఘ=పొడవునైన, నిశ్వాసపవనంబు= నిట్టూర్పువాయువు, పఱచు తేఁటులన్=పరుగెత్తి పయికివచ్చెడు దుండగపు తుమ్మెదలను, బరాబరులు సేయన్=పార్శ్వములకుఁ దొలఁగఁ దోయఁగాను, ఉజ్జ్వల=ప్రజ్వరిల్లుచున్న, అవయవతాపజ్వాలికల వేఁడి=అవయవములయందలి విరహతాపాగ్ని జ్వాలలయొక్క వేఁడిమి, చివురుజొంపములపై నవఘ ళింపన్=చిగురుటాకుల గుత్తులమీఁద వ్యాపింపఁగాను, లలిత=ఒప్పుచున్న, ఆనన=ముఖమనెడు, ఇందు మండల=చంద్రమండలముయొక్క, పాండురచ్ఛాయ=విరహపాండిమయనెడు చంద్రిక, వనరుహావళి =పద్మసమూహముయొక్క, వళావళియడంపన్=ఆడావడి నడంపఁగాను, శ్రమజల=చెమటనీరువలన, అభివ్యక్త=ప్రకటమయిన, సహజ=స్వభావసిద్ధమయిన, సాంకవముదా మోదంబు=సాంకవమనఁగా జవ్వాదిగనుక జవ్వాదివాసన, చిలుకలమూలకొత్తన్=చిలుకలను బరాభవ మొందింపఁగాను, ఇక్కడ జవ్వాదిపిల్లికిఁ జిలుకలు భయపడుచున్నవని యాశయము. స్త్రీలశరీరమునందు సాంకవామోదము గల్గ దనుట ప్రసిద్ధము. ఇందుకుఁ బ్రయోగము.

సీ. 'బింబోష్ఠియని నీవు బెదరింపకు శుకంబ సాంకవామోద యాసన్నుతాంగి'

రసికజనమనోభిరామము.

ఎసఁగు భసలములను గిసలములను నీరజాతములను గీరజాతములను విగ్రహింపనీని = భసలము లనఁగాఁ దుమ్మెదలు, (ని. 'బంభరశ్చ మిళిందశ్చ హిందోళ భసలా సమా' అని) యాదవనిఘంటువు. కిసలము లనఁగాఁ జిగురుటాకులు, (ని. 'కిసాలయం కిసలయం కిసాలం కిసలం కిసమ్') అని ద్విరూపకోశము. ఇందుకుఁ బ్రయోగము,

సీ. 'జీర్ణపర్ణద్రు సంకీర్ణా హిమణి విభ్రామాయాకిసలవంచమానపికము'

అని ప్రయోగింపఁ బడియున్నది. ఎసఁగు=విజృంభించుచున్న, భసలములను=తుమ్మెదలను, కిసలములను=చిగురుటాకులను, నీరజాతములను=పద్మములను, కీరజాతములను=శుకసమూహములను, విగ్రహింపనీని=విరోధము సేయనియ్యని, విరహంబెతోడుగాన్=వియోగమే సహాయముగానని క్రమాలంకారము. వెలఁది వెడలె విపిన వీథులకును=గిరికాదేవి వనవాటికలకు బయలువెడలెను.

ఇందులో భసలములను గిసలములను, నీరజాతములను గీరజాతములను, విగ్రహింపనీని అని భసలాదులయం దనాదర భావద్యోతనము చేయునెడల విహితమయిన గిత్వము సూచితమయినదని స్వారస్యము గ్రహింపవలయును. ఇందుకు, శ్లో. 'కుత్రచి త్సర్వశబ్దానాం పునరుక్తిర్న దోషకృత్, తత్ర స్యాద్గిత్వ మాద్యస్యసమతా హ్రస్వదీర్ఘయోః.' అని యధర్వణవచనము. శ్రమజలమన్నచోట శ్రమమనఁగా సంచారిభావము. శ్లో. 'శ్రమః ఖేదోధ్వరత్యాదే ర్జాతస్వేదాతి భూమికృత్' ఇతర భావములన్నియు బుద్ధిమంతులచేత నూహ్యములు. అలం. కావ్యలింగము.

ప్రొద్దుగడుపుటకే దేని యుపాయము గావలయును గావున నుపవనమునందు విరియఁబూచి యున్న వివిధములగు పూవులసొంపులు దెలుపుచుండిరి.

క. లలనామణు లపు డుపవన, తలనానాసూనసంప♦దలు కలకంఠీ
కలనాదకుఁ దెలిపిరి త,త్కలనాదంభమునఁ బ్రొద్దు♦గడపుద మనుచున్. 143

లలనామణులు=చెలికత్తెలు, అపుడు=ఆసమయమందు, ఉపవనతల=ఉద్యానవనప్రదేశమందలి, నానా=సమస్తమైన, అనూన=తక్కువగాని, సంపదలు=వైభవములు, కలకంఠీ=ఆఁడుకోయిలయొక్కవలె, కలనాదకున్=అవ్యక్తమధుకరమయిన కంఠనాదముగల గిరికాదేవికి, తెలిపిరి=తెలుపఁ బూనిరి. ఎందుకొఱకనిన, తత్కలనాదంభమునన్=ఆతెలుపుట యనెడు మిషచేత, ప్రొద్దుగడపుద మనుచున్=ప్రొద్దు పుచ్చుదమని విచారించినవారై తెలిపిరని సంబంధము. ఈపద్యము ద్విప్రాసముగలదిగాఁ జెప్పంబడియెను.

సీ. కనకగంధము లెఱుం♦గనివాని కిష్టాప్తి కాయహీనునకును ♦ గరణపటిమ
పెక్కు కాలపుమూఁగ♦కెక్కుడువాక్ప్రౌఢి యతిచంచలాత్ముని ♦ కలఘువృత్తి
యిలఁ బుట్టుగ్రుడ్డకు♦హితదర్శనప్రీతి యగమకోటికిఁ బల్ల♦వాభివృద్ధి
జడజాతమునకు శా♦శ్వతబోధసామగ్రి కోపనావలికి భా♦వోపశమము
తే. నెరపునిరుపమమాధవ♦నిత్యసన్ని,ధానమునఁ బొల్చుభవదీయ♦తాతపాద
సన్నిహితసద్గుణారామ♦సరణియిదెల,తాంగిగనుఁగొనుమిచటిశో♦భాతిశయము.

కనకగంధములెఱుంగనివాని కిప్ప్రాప్తి=కనకమనఁగా సువర్ణంబును జంపకంబును, గంధమనఁగా లేశంబును సౌరభంబును, (ని. 'గంధో గంధక ఆమోదే లేశే సంబంధగర్వయోః' అని వి.) సువర్ణ లేశము నెఱుఁగనివాని కిష్టవస్తుప్రాప్తియును అని యర్థము. చంపక సౌరభములను గుర్తెఱుఁగని తుమ్మెదలకు మకరంద రసప్రాప్తియనిభావము. కాయహీనునకును గరణపటిమ=కరణశబ్దము గాత్రమందును సాధనమందును వర్తించుచున్నది. (ని. 'కరణం సాధకతమక్షేత్ర గాత్రేంద్రియేష్వపి' అని అ.) ఆశరీరికి గాత్రపటిమయును అని యర్థము, మన్మథునకుఁ బుష్పపల్లవరూప నానాసాధన పటిమయని భావము. పెక్కుకాలపు మూఁగ కెక్కుడువాక్ప్రౌఢి=బహుకాలమునుండి మాటలులేక యున్న మూఁగవానికి నతిశయమయిన వాక్ప్రౌఢిమయును అని యర్థము. పదినెలల పర్యంతమును బలుకుట లేని కోయిలకుఁ గల స్వర మనిభావము. అతి చంచలాత్మున కలఘువృత్తి = అత్యంతచపలస్వభావము గలవానికి స్థైర్యవృత్తియును అని యర్థము. వాయువునకు వేగరహితవృత్తి-అనఁగా మందవృత్తియని భావము. ఇలన్=భూమియందు, పుట్టుగ్రుడ్డులకున్=జాత్యంధులకు, హితదర్శనప్రీతి=హితజనదర్శనము వల్లనైన సంతోషమును అని యర్థము. ఇలఁబుట్టు గ్రుడ్లనఁగా భూమియందు మొదట గ్రుడ్లుగాఁ బుట్టునవి గనుక పక్షులని చెప్పవలయును. శుకపికాది పక్షులకు ఫలపల్లవా ద్యభీష్ట వస్తులాభజనిత ప్రీతి యనిభావము.) అగమకోటికిఁ బల్లవాభివృద్ధి=పల్లవమనఁగాఁ బాదవిలాసము-అనఁగా సంచారమనుట. (ని. 'లవో లేశే విలాసేచ' అని వి.) అగమకోటి యనఁగా గమనశక్తిలేని కుంటివాండ్రయొక్క సమూహములును వృక్షలతాదులయొక్క సమూహమును, కుంటివాండ్రకు సంచారసమృద్ధియును అని యర్థము. వృక్షలతాదులకుఁ గిసలయాభివృద్ధియని భావము.

జడజాతమునకు శాశ్వతబోధసామగ్రి=జడజాతమనఁగా నజ్ఞులయొక్క సమూహమును, జలజాతంబును అనఁగా బద్మంబును, లడల కభేదముగాన జలము జడము అని రెండు రూపములు గలవు. అజ్ఞ జనసమూహమునకు సంతత జ్ఞానసామగ్రియుం నని యర్థము. పద్మమునకు సమ్యగుత్పన్నవికాస సంపూర్ణత్వమని భావము. (ని. 'పున స్సదార్థయో శ్శశ్వత్' అని అ.) కోపనావళికి భావోపశమము =కోపశీలురైనవారికిఁ జిత్తశాంతియని యర్థము. కోపనలనఁగాఁ గోపముగల స్త్రీలుగనుక వారికిఁ గోపశాంతియని భావము. (ని. 'కోపనా సైవభామినీ' అని అ.) నెఱపు=ఘటనపఱుచుచున్న, నిరుపమ=సమానరహితుఁడయిన, మాధవ=విష్ణుమూర్తియొక్క, నిత్యసన్నిధానమునన్=ఎడతెగని సాన్నిధ్యముచేత, పొల్చు=ఒప్పుచున్నయని యర్థము. వసంతునియొక్క నిత్యసాన్నిధ్యముచేత నొప్పుచున్నయని భావము. (ని. 'మాధవస్తు వసంతే స్యా ద్వైశాఖే గరుడధ్వజే' అని వి.) భవదీయతాత=నీతండ్రియైన కోలాహలునియొక్క, పాదసన్నిహిత=చరణసన్నిహితులైన, సద్గుణారామ-సద్గుణ=మంచి గుణములచేత, ఆరామ=అంతట మనోహరులైనవారియొక్క, సరణియిదె=మార్గమిదే సుమా యని యర్థము. కోలాహలాద్రియొక్క ప్రత్యంతపర్వత సన్నిహితమును సద్గుణసంపన్నమయిన యారామసరణియుం నిదేసుమా యని భావము. లతాంగి=ఓగిరికాదేవీ, ఇచటి శోభాతిశయము=ఇక్కడనుండెడు వైలక్షణ్యాతిశయమును, కనుఁగొనుము=చూడుము.

ఈప్రదేశము మాధవసాన్నిధ్యమునఁ బొల్చు నీతండ్రి చెంతనుండు నుత్తమోత్తములకునికిపట్టు. ఈమాధవుఁడు సామాన్యుఁడుకాఁడు.దరిద్రులకుసువర్ణప్రాప్తి, దేహవిహీనునకు గాత్రపటిమ, మూగలకు

మాటలాడునేరుపు, చంచలులకు స్థిరభావము, గ్రుడ్డివారి కవలోకనశక్తి కుంటివారికిఁ బాదవిలాసము మందమతులకు జ్ఞానము, కోపశీలురకోర్పు ప్రసాదించును. ఈస్థలప్రభావము కంటివేయని భావము. తుమ్మెదలు మకరందపానము చేయుచున్నవి. మన్మథుఁడిట నవయవసంపన్నుఁడై యున్నాఁడు. కోయిలలు గూయుచున్నవి. మారుతము మందమందముగా వీచుచున్నది. చెట్లుచివురులతో నలరుచున్నవి. వసంతసౌభాగ్యము చూచితివాయని యర్థాంతరము అలం. శబ్దశక్తిమూలధ్వని.

చ. పరిమిళితప్రవాళనవ♦పట్టపటధ్వజచూతనూతన
స్మరరథరాజముల్ భ్రమర♦జాలగుణాంచితపాంసుచక్రము
లైరల మహాబలంబు దర♦లింప లతావనితాళి యువ్వలే
మరువపుబంతులట్ల శుక♦మండలి యాడెడిఁ గంటె పైపయిన్. 175

ఈపద్యమునందుఁ జూతవర్ణనమునందు రథోత్సవము సంపాదించి చెప్పుచున్నాఁడు.

పరిమిళిత=కూడుకోఁబడిన, ప్రవాళ=అరుణపల్లవములనెడు, నవపట్ట పటధ్వజ = నూతనమైన పట్టువస్త్రపు టెక్కెములుగల, చూత=మామిడిచెట్లనెడు, నూతన=క్రొత్తదైన, స్మరరథరాజముల్= మన్మథ దేవతయొక్క రథశ్రేష్ఠమును, భ్రమరజాల=తుమ్మెదబారులనెడు, గుణ = మోకు త్రాళ్ళచేత, అంచిత = ఒప్పుచున్న, పాంసుచక్రములు = సుళ్ళుసుళ్లుగాఁ దిరుగుచుండెడు పుష్పపరాగపటలము లనెడు రథచక్రములు, కెరలన్=దొర్లునట్టులుగా, మహాబలంబు దరలింపన్-మహాబలంబు = వాయు వనెడు జాతరకువచ్చిన ప్రజలు, తరలింపన్=తరలింపఁగాను, లతావనితాళియువ్వ-లీఁగలనెడు స్త్రీ సమూహము మీఁద యువ్వుచున్న, లేమరువపు బంతులట్ల=లేఁతమరువముచేతఁ గట్టఁబడిన బంతులోఁ యన్నట్టుగా, పైపయిన్=మీఁదమీఁద, శుకమండలి యాడెడిఁగంటె=చిలుకలగుంపు దిరుగుచున్నది చూచితివా. చివురుటాకులతో మావిచెట్లలరిపట్టువలువటెక్కెముగాఁగల క్రొత్తరథములై నుండెనని యుఁ, దుమ్మెదలబాఱు రథములాగు పగ్గములవలెను, సుళ్లుగా రాలుపుప్పొడులు రథచక్రముల రీతిగను, నలరి రథయానము సమకూర్చుచుండ లతలపైనుండిలేచి మానిపైవ్రాలు చిలుకలగుంపులు రథోత్సవసమయమున రథముపైనుండు మరువపుబంతులవలెనుండెనని భావము. అనఁగాఁ దీయమావులు చివిరింపనం దుఁ దుమ్మెదలువ్రాలుచున్నవనియుం, బరాగము రాలుచున్నదనియుం, గాలివీచుటచేఁ జెట్లు కదలుచున్న వనియుఁ జిలుకలు లతాదికములవీడి రసాలముపై కేగుచున్నవనియు ఫలితార్థము. అలం. ఉత్ప్రేక్ష.

చ. మరునకుఁ జైత్రమంత్రి వన♦మండలరాజ్యఫలైకకాంచనో
త్కరము కరంబొసంగుటయుఁ ♦ దావుల బచ్చులు చేరి తచ్ఛదా
వరణముఁ బాయ విప్పి పరు♦వంబుగ నెన్నిక కెక్కఁ జేయుచున్
దొరయఁగనీవు గంటె చెలి♦ధూర్తవతంసమలీమసాళులన్. 136

మరునకున్=మన్మథుఁడనెడు రాజునకు, చైత్రమంత్రి=వసంతుఁడనెడు మంత్రి, వనమండల రాజ్యఫలైక కాంచనోత్కరణము=వనమండలమనెడు రాజ్యమనియయినను, వనమనెడుమండలరాజ్య మనియయినం జెప్పవచ్చును. వనమండలరాజ్య=వనమండలరాజ్యముయొక్క, ఫలైక = ఫలములలో ముఖ్యఫలమయిన, (ని. 'ఏకేముఖ్యాన్య కేవలాః' అని అ.) కాంచనోత్కరము=సంపఁగిమొగ్గగుంప నెడు సువర్ణస్తోమమును, కరంబొసంగుటయున్=అప్పనమీయఁగా, (ని. 'భాగధేయః కరో బలిః' అని అ.) తావులబచ్చులుచేరి=తావులనఁగా వాసనలును స్థానములును, బచ్చులనఁగా నాణెగాండ్రును

సరాబులును, తావులబచ్చులనఁగా వాసనల నాణెము దెలిసిన వాయువులనెడు నాస్థానమందుండెడు సరాబులును, చేరి=వచ్చినవారై, తత్ = ఆసంపఁగులయొక్క. ఛదావరణము = పత్త్రారణ మనెడు వస్త్రావరణమును, పాయవిప్పి=తొలఁగఁదీసి-అనఁగా ముల్లెలువిప్పి యనుట. పరువంబుగ నెన్నిక కెక్కఁజేయుచున్ =అనఁగా వాయువులను పట్టునఁ బరువము కలుగునట్లుగా నతికెక్కఁ జేయుచు ననియును, బచ్చులపట్టున నుత్సుక మగునట్టులుగా లెక్కపెట్టుచుననియును నర్థము. ధూర్తమనఁగా నుమ్మెత్తపువ్వు, (ని. 'ఉన్మత్తః కితవో ధూర్తో ధత్తూరః కనకాహ్వయః' అని అ.) ధూర్తవతంస= ఉమ్మెత్తపువ్వులయొక్క యగ్రములయందుండునట్టి, మలీమస=మలినములయిన, అళులన్ =తుమ్మెదలనని యర్థము. ధూర్తాగ్రేసరులయిన మలినజనులను, అనఁగాఁ జోరులని యర్థాంతరము. దొరయఁగ నీవు =చేరనిచ్చునవిగావు, చెలి=ఓగిరికాదేవీ, కంటె=చూచితివా.

బచ్చనెడు పదమునకుఁ బ్రయోగము. తే. 'వసుధఁ జెల్లింపఁ దరమె యెవ్వారికైన, మెచ్చువాఁ డౌరవలరాచబచ్చువాఁడు, అనియున్నది. (దొరయఁగనీవు అనుచోట దొరయఁగనీరు అని పాఠముఁజేసిన బచ్చులను కర్తృపదమునకు మహదర్థకక్రియతో సంబంధము బాగుగనుండును.)

మన్మథరాజునకు వసంతసచివుఁడు కాంచనములరాశి కట్నమొసంగెను. అనఁగా వికసితములగు సంపంగి పూవులను వసంతుఁడు, మన్మథప్రీతికరముగా వికసింపఁ జేసెను. కాంచనము రాశి బాగోగులు పరిశీలించువారు బచ్చులు. వారాపరిశీలనము చేయుతఱి దుష్టులను జేరనీయక పోవుటసాజమెకదా! అనఁగా నాసంపంగి పూవులతావులరయునవి మారుతములు, సంపంగిపూవులపై మలయుగాడ్పులు తుమ్మెదల దరిచేరనీయమి సహజముగదా యని భావము. అలం. సమాసోక్తి.

సంపంగి పూవును దుమ్మెదమూర్కొనదనుటకు.

శ్లో. చరన్వనాంతే నవమంజరీషు నషట్పదీగంధ పలీమజిఘ్రత్,
సాకిన్నరమ్యా స చకిన్నరంతా బలీయసీకేవల మీశ్వరాజ్ఞా.

చ. రతిపతిధర్మకర్త ఋతు◆రాజబలావళి నొంచి యేగుదు
ర్మతుల మథించి కైకొనిన◆మానధనంబుల ముద్ర వెట్టుచోఁ
బ్రతినవదీపికాశిఖఁ గ◆రంగెఁడులక్కయుఁ బోలె వంజుల
స్థితమగు తేఁటి వెగ్గలపుఁ◆దేనియ గ్రాయుటఁ గంటివే చెలీ. 137

రతిపతిధర్మకర్త = మన్మథునియొక్క ధర్మస్థాపకుఁ డైన, ఋతురాజు = వసంతుఁడు అని యర్థము. వసంతుఁడు మన్మథునికి విల్లయిన పువ్వులకుఁ గర్తయని భావము. లేక మన్మథధర్మమైన రాగమును బోషించువాఁడని యయినను భావము. ఈయర్థమందు రతిపతియనెడు మన్మథనామము అనురాగపర్యాయమైన రతికిఁ బతియని యర్థాంతర క్రోడీకారముచేత నుపయుక్తమగుచున్నది. (ని. 'రతిస్స్మరప్రియాయాంచ రాగేపి సురతేఽపిచ' అని వి.) అబలావళినొంచి యేగుదుర్మతుల మథించి= స్త్రీజనమును విరహవ్యథ పాలుచేసి యెడఁబాసిపోవుచున్న పాంథులను మర్దించి, కైకొనిన మానధనంబులన్ =పుచ్చుకొన్న మానమనెడి ధనములను, అనఁగా వారిప్రణయకోపము లనెడు ధనములను, ముముద్రవెట్టుచోన్ = ముల్లెలుగట్టి సికాముద్ర చేసెడు సమయమందు, అబలాశబ్దము దౌర్బల్యాభిప్రాయ గర్భమనియును దుర్మతి శబ్దము దౌర్జన్యాభిప్రాయగర్భమనియును గ్రహింపవలయును. ప్రతినవదీపికాశిఖఁ గరంగెడులక్కయుఁ బోలెన్ = ప్రతిదీపపుకొడిమీఁదను గరఁగినదియుఁ గరఁగినదై

యించుకంత జారుచున్నదియనఁగు లక్కయోయన్నట్లు, వంజులమనఁగా నశోకము.రక్తాశోకమనుట. (ని. 'వంజులో శోకే' అని అ.) వంజులస్థితమయిన=అశోక పుష్పాగ్రమందు నిలిచి, తేఁటి=తుమ్మెద, వెగ్గలపుఁ దేనియగ్రాయుటన్=వెక్కసమైన తేనెవెడలఁ గ్రక్కుటను, చెలీ=ఓగిరికా, కంటివే=చూచితివా, ఇక్కడ దీపశిఖకిని రక్తాశోక పుష్పాగ్రమునకును, దుమ్మెదలకును కరఁగి జారుచున్న లక్కరసమునకు దుమ్మెద వెడలఁ గ్రక్కుచున్న తేనియకునునుపమానోపమేయభావమని విచారింపవలయును.

మన్మథుఁడు రతిపతి, స్త్రీపురుషులకు రతి గలిగించువాఁడు. ఆతని ధర్మములను నిర్వహించువాఁడు ఋతురాజు. కాననే రాజధర్మానుసారముగ దండ్యులను శిక్షింపఁబూనెను. అబలావళిని (చెలువలను, దుర్బలులను) వంచించిపోవు వంచకులు (బాటసారులును) శిక్షార్హులు. వారి మానమ ధనము హరించి బొక్కసమునఁ జేర్చి పైఋతురాజు లక్కతో ముద్రయిడుట నపుడు కఱిగినలక్కవలెఁ బూచిన యెఱ్ఱయశోకమునుండి తేనియవడియుచున్నదని భావము. రక్తాశోకములు పూచెననియు వానిపైఁదుమ్మెదలు చేరియుండెననియు నిది ప్రణయకోపపరవశులగు పాంథులకు విరహోద్దీపకముగను బ్రోషితభర్తృకలకు విచారకరముగను నుండెనని భావము.

ఉ. తుమ్మెదదిమ్మరీఁడు పయిఁ♦దోఁచుపిశంగిమపద్మినీనిశాం
కమ్మది తాఁ బరాగపటిఁ♦ గప్పి మధువ్రతిఁ జేరఁ బోవుచున్
నమ్మిక కంగజప్రహర♦ణమ్ముల ముట్టెడుఁ జూడవమ్మ ప
ల్లొమ్మలఁ జెందువారలు త♦గు ల్విరియాటలు నేరకుందురే. 138

తుమ్మెదదిమ్మరీఁడు=దిమ్మరీఁ డనఁగా మిక్కిలి సంచరించువాఁ డని యర్థము. ఇక్కడఁ దుమ్మెద యనెడు ననేక స్త్రీ విహారముగలవాఁడు, పయిఁదోఁచు పిశంగిమ = పైని గనుపించునట్టి పసపువర్ణమనెడు, పద్మినీనిశాంకమ్ము=పద్మినియనఁగాఁ బద్మలతయును స్త్రీవిశేషంబును, నిశాంకమనఁగా రాత్రిప్రాప్తమయిన చిహ్నమని యుభయత్ర చెప్పవలయును. పద్మలతాపక్షమందుఁ దుమ్మెదలు రాత్రి పద్మములయందుఁ జిక్కుపడుచున్నవి గనుక నిశాప్రాప్తమయిన పద్మపరాగాంక మని విచారింపవలయును. స్త్రీపరమయిన యర్థమందుఁ బరపురుషునికి రాత్రిసంభోగము గలుగుచున్నది గనుక నిశాప్రాప్తమయిన చిహ్నమని విచారింపవలయును. ఇక్కడ నిశాశబ్దము హారిద్రా వాచకంబును గనుక నిశాంకమనఁగా హారిద్రాసదృశాంకమును అని యుభయత్ర చెప్పవలయును. రాత్రి పేళ్లన్నియుఁ బసపునకుఁ జెల్లును. అది=ఆపద్మినీనిశాంకమును, తాన్ = తాను, పరాగపటిఁగప్పి = తెల్లని పుప్పొడియనెడు వస్త్రముచేతఁ గప్పి, మధువ్రతిఁ జేరఁబోవుచున్ = మధువ్రతి యనఁగా నాఁడు తుమ్మెద గనుక, మధువ్రతియనెడు నాయికను గలయఁ బోవుచును, నమ్మికకున్=ఆనాయికకు నమ్మికపుట్టెడుకొఱకు, అంగజ ప్రహరణమ్ముల ముట్టెడున్=మన్మథునియొక్క యాయుధములను ముట్టి బాసచేయుచున్నదియని యర్థము. మన్మథాయుధములు పుష్పములుగనుకఁ బుష్పముల నంటుచున్నదని భావము. చూడవమ్మ=వీక్షింపవమ్మ, అయిన నిది వింతగాదు. ఏమనిన, పల్లొమ్మలఁ జెందువారలు = అనేక స్త్రీలను బొందువారని విటపరమయిన యర్థము. అనేక తరుశాఖలను బొందువారని భృంగపరమయిన యర్థము. తగు ల్విరియాటలు నేరకుందురే =తగులును విరియాటలు అని పదవిభాగము. తగులన్నది యుభయత్ర సాధారణపదము. విరియాటలన్నది శ్లిష్టపదము. విరియాటలనఁగా స్వేచ్ఛావిహారములని విట

పరమయిన యర్థము. పుష్పక్రీడయని భృంగపరమయిన యర్థము. అనఁగా బహుస్త్రీలతోఁ బొందు నట్టి విటులు తగులాటమును స్వేచ్ఛావిహారములును నేరకుందురా యనియును ననేక తరుశాఖలను బొందెడు భృంగమును తగులాటమును బుష్పక్రీడలును నేరకుండునాయనియుఁను నర్థము.

తుమ్మెద త్రిమ్మరీడు కానసే పద్మినితోఁ రేయిగడుపుటచేఁ గలిగిన పచ్చనిచిన్నెలు పుప్పొడి పలువతోఁ గప్పుకొనెను. ఎందుల కింతయాయాసమన మధువ్రతిని గలయఁబోవలయు నని, మధువ్రతినమ్మనపుడు బాసచేయవలయునుగదా! అందులకె మన్మథాయుధములగు పూవులనంటుచున్నది. అదియె బాసచేయుట. మేలుబుద్ధిగలచెలువలయెడల విరియాటలుసాగును. పద్మపరాగము పసపు రంగుగా నుండును. ఇది పద్మినీ నిశాంకముగ మధువ్రతి యనుమానింపఁ దగియున్నది. సామాన్యపుష్ప రజము తెల్లగానుండుగానఁ బుప్పొడిపలువతోఁ గప్పెనని భావము.

చ. వెడలు మిళిందబృందములు వీపుపిశంగిని కైతవంబునన్. (మనుచరిత్రము)

అలం. రూపకము. అర్థాంతరన్యాసము.

చ. అనిలకుమారకుండు మరు♦దధ్వనిరోధిపలాశిమండలీ
ఘనవనరాశిలోఁ బుడమి♦కానుపుపద్మిని చిక్కి స్రుక్కఁగా
నినకరముద్రఁ జూపి వెల♦యించి తదంబుజరాగపాళిఁ గై
కొనుచుఁ బ్రవాళతేజమునఁ ♦ గూరిచెఁ గంటె పలాశవీథులన్. 139

ఈపద్యమునందు అనిలకుమారుఁడ నికర్తృపదముచెప్పఁబడుటచే నాంజనేయుని పరముగాను జిఱుగాడ్పుపరముగను నర్థద్వయము కలిగియున్నది.

అనిలకుమారకుండు=పిన్నవాయువని యర్థము. హనుమంతుఁడని యర్థాంతరము. మరుదధ్వనిరోధి=ఖేచరమార్గమునడ్డగించిన, పలాశిమండలి=వృక్షమండలముచేత, ఘన=అధికమగుచున్న, వనరాశిలోన్=ఉద్యానవన సమూహములోనని యర్థము, మరుదధ్వనిరోధి=దేవతామార్గ నిరోధకమయిన, పలాశిమండలీ=రాక్షసమండల మనెడి, ఘనవన రాశిలోన్=అధికమయిన సముద్రములోనని యర్థాంతరము. పుడమి కానుపు పద్మినిచిక్కి స్రుక్కఁగాన్=పుడమికానుపైన అనఁగా భూమియందుఁ బుట్టిన పద్మిని యనఁగా మెట్టతామరతీఁగ చిక్కుకొని వాడఁగా నని యర్థము. భూపుత్రియును బద్మినీజాతియు నయిన సీతాదేవి చిక్కుపడి వ్యథపడఁగా ననియర్థాంతరము. ఇనకరముద్రఁ జూపి వెలయించి=సూర్యకిరణ ప్రసారణమును గనుపఱిచి, వికసింపఁజేసి యని యర్థము. పెనిమిటియైన శ్రీరాముని చేతియుంగరము గనుపఱిచి సంతసింపఁజేసి యని యర్థాంతరము. తదంబుజ రాగపాళిఁ గైకొనుచున్=తదీయ కమలరాగపంక్తిని గ్రహించుచు నని యర్థము. ఇక్కడ రాగపదముచేత రాగాశ్రయమయిన పరాగమని చెప్పవలయును. సీతాదేవియొక్క పద్మరాగమణిపాళిని గ్రహించునని యర్థాంతరము. ఇక్కడఁ బాలియనఁగాఁ జిహ్నము అనఁగా నానవాలనుట. ప్రవాళతేజమునఁ గూరిచెఁ గంటె పలాశవీథులన్=వృక్షవాటికలను, ప్రవాళతేజమున గూరిచెఁగంటె=చిగురుటాకులయొక్క కాంతితోడఁ గూర్చను వీక్షించితివా యని యర్థము. పలాశవీథులన్ = రాక్షసవీథులను, ప్రవాళతేజమునఁ గూరిచె ననఁగాఁ బ్రకృష్టమయిన వాలగతివహ్నితోఁ గూర్చెఁ జూచితివా యని యర్థాంతరము. ('లళయో రభేదః') అనియున్నది గాన వాలము వాళము అని రెండురూపములు గలవు.

శా. అంచల్లీల హరించెఁ గొంచక యయుక్తౌఘక్షమాభోగముల్
పంచాస్త్రుం డని యాకు లెత్తఁ గని పైఁపైఁ గాంచనస్నాన మా
డించెన్ మాధవుఁ డీసదాగతిని గంటే కన్నెపున్నాగ మె
క్కించెం గోకిలకాహళుల్ మ్రోయ నేఁగించెన్ వనీవీధులన్. 140

పంచాస్త్రుండు = మన్మథుఁడు, అయుక్తలనఁగాఁ దనతోఁ గలియనివారు - అనఁగా శత్రులనుట. అయుక్తౌఘ=శత్రుసమూహముయొక్క, క్షమాభోగములు=భూమిని ధనాదులను, కొంచక=సంకోచింపక, అంచల్లీలన్ = ఒప్పిదమగునట్టులుగా, హరించెన్ = పుచ్చుకొనెను, అయుక్తులనఁగా విరహి విరహిణీజనులు, వారి క్షమయనఁగా సహనము, దానియొక్క యాభోగము లనఁగాఁ బరిపూర్ణతలు, వాని హరించినాఁడని భావము. అని యాకు లెత్తఁగని=ఈలాగని పత్త్రికలెత్తఁగాఁ జూచి అనియర్థము. పర్ణములు లేచునట్టులుగా వీచుటయని భావము. మాధవుఁడు = విష్ణుదేవుఁడు, ఈ సదాగతిని=ఈశుభాగమనము గలవానిని, కాంచనస్నాన మాడించెన్ = కనకస్నాన మాడించెనని యర్థము. ఇక్కడ సదాగతి యనఁగా, సత్=యోగ్యమయిన, ఆగతి=ఆగమనము గలవాఁడు, సదాగతి-అనఁగాఁ బుత్త్రవిజయ వార్తాహారి గనుక సదాగతియనుట. మాధవుఁడనఁగా వసంతుఁడును సదాగతియనఁగా వాయువును గాంచనమనఁగాఁ జంపకంబును గనుక వసంతుఁడు మలయవాయువును జంపకపుష్పవ్యాప్తము గావించె నని భావము. కన్నే=ఓ గిరికాదేవీ, పున్నాగ మెక్కించెన్ = పురుషగజము నెక్కించెను, కంటే=చూచితివా యని యర్థము, కన్నెపున్నాగ మెక్కించెన్ = లేఁతపొన్న చెట్టెక్కించెను చూచితివా యనిభావము. కన్నెపున్నాగమన్నది యిక్కడ సమాసపదము. 'సంస్కృతపదేన పరిమిత మాంధ్ర పదం కర్మధారయో భవతి' యని న. కోకిల కాహళుల్ మ్రోయ నేఁగించె న్వనీవీథులన్=కోకిలధ్వను లనెడు తుతారాలు మ్రోయఁగా వనవీధు లనెడువీధుల యందు నూరేగించెను, చూచితివా యని సంబంధము. తమ కుమారులు దిగ్విజయమున కేగినపుడు విజయవార్తదెచ్చినవానిని రాజులు మిగులగౌరవించుట ప్రసిద్ధము. మాధవుఁడు సదాగతునివలనఁ బంచాస్త్రుఁడు విరోధిబృందమును జయించివారి సమస్తైశ్వర్యములు లోఁగొనుట పత్త్రికారూపమునఁ గాంచి స్వర్ణాభిషేకము వాద్యములతోఁగూడిన గజోత్సవము సదాగతున కొనరించెనని శ్లేషార్థము.

వియోగినుల యోరిమిసంపదనంతయు వసంతమున మన్మథుఁడులోఁగొని వారికి వలపుఁగూర్చెననియుఁ బండుటాకులు రాలసాగెననియు, సంపంగి పూఁదావులచే మారుతము మనోహరముగ వీచుచున్నదనియు పున్నాగములు కోకిలకూతలు మనోహరములుగా నుండెనని ప్రకృతార్థము.

తే. కానఁ గడుమౌనినై యె పెద్దకాల ముండి, వాక్యసంసిద్ధి మాధవుఁవలనఁ గన్న
మత్తకోకిలకవివాక్సమాజ మెల్లఁ, బంచమశ్రుతి వింటివేఁ చంచలాక్షి. 141

కానన్ =అరణ్యమందు, కడుమౌనినై యె పెద్దకాలముండి=మిక్కిలి మౌనవ్రతముచేతఁ జిరకాలముండి యని యర్థము. పదినెలలమట్టుకుఁ బలుకుట లేక యుండియని భావము. వాక్యసంసిద్ధిమాధవువలనఁగన్న=వాక్యపరిపాకమును విష్ణుదేవునివలనఁ బొందిన యని యర్థము. పలుకుట వసంతునివలనఁ బొందఁ బడినదనిభావము. మత్తకోకిలకవి=మదించిన కోయిల యనెడు కవియొక్క, కోకిలక=చిన్న కోయిలయును, వి=పక్షియనియుం జెప్పవచ్చును. వాక్సమాజమెల్లన్ =వచస్సముదాయ మంతయుఁ,

పంచమశ్రుతి=పంచమవేదమయిన భారతమనియర్థము. పంచమ స్వరమని భావము. వింటివే చంచలాక్షీ=ఓగిరికాదేవీ వింటివా యని యర్థము.

పంచమస్వరమును గోయిలపలుకుచున్నదని శాస్త్రము. పంచమశ్రుతియనఁగా స్వరారంభకావయవమయిన శబ్దవిశేషము. శ్లో. 'ప్రథమశ్రవణాచ్ఛబ్దశ్శ్రూయతే హ్రస్వమాత్రకః, సాశ్రుతిస్సంపరిజ్ఞేయా స్వరావయవలక్షణా.' అని సంగీత శాస్త్రమునఁ జెప్పంబడియున్నది. చిరకాలము తపముచేయుటవలననే మాధవానుగ్రహమున వాక్యసంసిద్ధిచే కూరినది. కావునఁ బలికినపలుకులు ఐదవవేదములైనవనియు వసంతానుగ్రహమునఁ గోయిలలు పంచమశ్రుతితోఁ బలుకుచున్న వనియుభావము.

అలం. కావ్యలింగము.

మ. నునుగప్రంపుటనంటివిప్పుపొగ యం॥న్జో కెక్కి మాధ్వీమహా
వనధిం బుష్పాడిదీవికిఁ మధుకర॥వ్యాపారు లేతేరఁ ద
ద్ఘనకర్పూరపటంబు లందుకొని వే॥డ్కం గోరకవ్యూహమో
హనముక్తావళి దార్చె నీతరగుగా॥డ్పు బ్జాక్షీ వీక్షించితే. 142

నును గప్రంపుటనంటివిప్పుపొరయన్జో కెక్కి=జోకనఁగా దోనెగనుక నున్ననికర్పూరపరఁటి విచ్చు పొర యనెడుదోనెపై నెక్కి, మాధ్వీమహావనధిఁ=మకరందరస మనెడు గొప్పసముద్రమందు, పుష్పాడిదీవికిఁ=పుష్పాడి తిప్పయనెడి ద్వీపమునకు, మధుకరవ్యాపారు లేతేరఁ=తుమ్మెదలనెడు బేరగాండ్రు రాఁగా, తద్ఘనకర్పూరపటంబులందుకొని=వారలయొక్క కర్పూరములనెడి వస్త్రములను దీసికొని, ఈతరగుగాడ్పు=ఈతరగరివాయువు, వేడ్కఁ=వేడుకచేత, కోరకవ్యూహ=మొగ్గలయొక్క సమూహమనెడు, మోహనముక్తావళి = మనోహరములైన ముత్తియములను, తార్చెను=పొందించెను. అనఁగా వస్త్రములను దీసికొని వానికి బదులుగా ముత్యాలిచ్చెననుట. అబ్జాక్షీ=ఓగిరికాదేవీ, వీక్షించితే=చూచితివా. ఉపవనమునందు తేనియసముద్రమువలెనుండెను. పుష్పాడిద్వీపమువలెను గప్పురపుటనంటి విచ్చుపొరదోనెవలెను గాలి తరగరిగనుండెను. ఆదోనె నెక్కినతుమ్మెద బేరగాండ్రు కప్పురపుటనంటి వలువలనిచ్చి మొగ్గ లనుముత్తెములఁ బుచ్చికొని రనిభావము. తేనెసోరపైన నఁటిపొరలు దోనెలవలెఁ దేలియాడుచుండ నందు దుమ్మెదలు మెలంగుచున్న వనియు నఁటిపొన దోనెలు పుష్పాడితిన్నెకడకేగి యాగుచున్నవనియుఁ బుష్పాడిమఱుఁగున మొగ్గ లలరారుచున్న వనియుఁ దెలియవలెను.

అలం. రూపకము.

మ. అలినీలాలక కంటె చిల్క భవదీ॥యాలాపలీలాప్తి నిం
పలరం గోరి విపక్వ దాడిమ తరు॥వ్యాలంబి శాఖాఫల
జ్వలనావాఙ్ముఖ మై తపంబు సవరిం॥పఁ సాగె నేగె నే లబ్బెడిం
దలక్రిం దైన ననూనవాగ్గ్రహణమే॥ ధాశక్తి బింబాశికిన్. 143

అలినీలాలక=ఓగిరికాదేవీ, కంటె=చూచితివా, భవదీయ=నీసంబంధమైన, ఆలాపలీలాప్తిఁ=వాగ్విలాసప్రాప్తిచేత, ఇంపలరంగోరి=ఇంపొందవలెనని కోరి, అనఁగా నీయొక్క వాగ్విలాసము తనకు లభింపవలయు నని కోరినదై యనుట. విపక్వ = మిగులఁబండిపగిలిన, దాడిమతరు వ్యాలంబిశాఖా

ఫల=దానిమ్మచెట్టుయొక్క వ్రేలుడుగొమ్మయందలి ఫలమనునట్టి, జ్వలన=అగ్నికి, అవాఙ్ముఖమై = అధోముఖమై, తపంబు సవరింపన్ సాగెన్ = తపస్సుచేయసాగెను. అయినను, బింబాశికిన్=దొండపండ్లు దినుదానికి, తలక్రిందైనను=తలక్రిందుగా తపస్సు చేసినప్పటికిని, అనూన= సంపూర్ణమయిన, వాగ్గ్రహణ=వాక్యగ్రహణమందలి, మేధాశక్తి=బుద్ధిబలము, ఏలబ్బెడిన్=ఎందుకులభించును-అనఁగా లభింపదనుట.

శ్లో. 'సద్యోబుద్ధిహరంబింబం సద్యోబుద్ధికరీవచా' అని చెప్పఁబడియున్నది గనుక, దొండపండు తిన్నవారు బుద్ధిహీనులగుదు రనుట ప్రసిద్ధము. అందుచేఁ దలక్రిందుగాఁదపముగావించియు ఫలములేక పోయెను. ఘోరతపముచేయువారు తలక్రిందుగనుంట ప్రసిద్ధము. తపస్సనకు నగ్ని పగిలినదాడిమిలోని యెఱ్ఱనివిత్తులు. విపక్వఫలముగావున బీజములుకనుబడుచుండును. గాననే శుక మవాఙ్ముఖముగ రసాస్వాదనము చేయుచుండుట. వాగ్గ్రహణశక్తిదొండపండు దిన్నవారికిఁ గలుగదుగానఁ జిలుక కష్టము వృథాయయ్యెను. గిరికాదేవి పలుకులు చిలుకపలుకులకంటె శ్రుతిహితముగా నుండెననుట.

అలం. ఉత్ప్రేక్ష. పరిణామము.

మ. అసితాబ్జేక్షణ చూడు కేతకి శివత్యాగాపవాదంబు దీ
ర్ప సముద్ధూళితధూళికాధసిత యై బద్ధాళిరుద్రాక్ష యై
యసిపత్రాసికఁ బూని నిల్చుటయు నయ్యష్టాత్ముత్రైలోక్యజీ
వసముజ్జీవిక యైనమూర్తి దరియన్ వచ్చెన్ సదాక్షిణ్యతన్. 144

అసితాబ్జేక్షణ = నల్లకలువలవంటి నేత్రములుగల యోగిరికాదేవీ, చూడు = వీక్షింపుము. కేతకి = మొగలిపువ్వు, శివత్యాగాపవాదంబుఁ దీర్పన్ = సాంబమూర్తిచేతఁ బరిహరింపఁబడుటవల్ల సంభవించిననిందను బోఁగొట్టుకొనెడుకొఱకు, ('నకేతక్యా సదాశివం' అనియున్నది.) సముద్ధూళిత =లెస్సఁగాఁ బూయఁబడిన, ధూళికా ధసితయై=ధవళపరాగమనెడి భస్మముగలదై, బద్ధ=కట్టబడిన, అళి = తుమ్మెదబారులనెడు, రుద్రాక్షయై = రుద్రాక్షమాలికలుగలదై, అసిపత్రాసికఁబూని = అసిపత్రమనఁగా మొగలియాకుగనుక నదియనెడు ఖడ్గలతనుబూనుకొని, నిల్చుటయున్ = నిలువఁగా- అనఁగాఁ బ్రమాణము చేసికొనుటకు సిద్ధపడఁగా నని భావము. అయ్యష్టాత్ము = ఆష్టమూర్తియైన యాసదాశివునియొక్క త్రైలోక్య = మూఁడులోకములయందలి, జీవ = జంతువులకును, సముజ్జీవిక =ఉజ్జీవనకరమైన, మూర్తి=అనఁగా నష్టమూర్తులలో నొక మూర్తియైన వాయువు, సదాక్షిణ్యతన్ =మోమోటముతోడ నని యర్థము. దక్షిణుఁడనఁగా దక్షిణపుదిక్కునందుండెడువాఁడు, వానిభావము దాక్షిణ్యము. దాక్షిణ్యసహితుఁడు సదాక్షిణ్యుఁడు, వానిభావము సదాక్షిణ్యత, గనుక సదాక్షిణ్యతతోడ నని భావము. దరియన్వచ్చెన్=సమీప మగునట్టులుగా వచ్చెను. ప్రత్యక్షమాయె ననిభావము.

శివుఁడుతను బరిగ్రహింపలేదను వాదుఁబోఁగొట్టుకొనుటకై మొగలి పుప్పొడియను విభూతి మేనఁదాల్చి తుమ్మెదలను రుద్రాక్షలఁదాల్చి రేకనుకత్తిగొని ప్రాణత్యాగమునకు సిద్ధపడఁగా శివుఁ డనుగ్రహించి తనయష్టమూర్తులలో నొకటియగు దక్షిణానిలమును బైఁబోలయించెననిభావము. వసంతమునందు మొగలిరేకులు పుప్పొడిచే నలరి తుమ్మెదకదుపులతోనుండి దక్షిణానిలస్పర్శచే సుగంధము దెసలఁదోలుచున్నదనుట. అలం. హేతూత్ప్రేక్ష. పరికరము.

తే. కన్నె మరునకుఁ బూఁదూపు♦లెన్ని లేవు, కన్నె గేదంగి విరి కెన♦గావు గాక
సూనబాణాభియాతికి ♦ దీనిగాలి, సోఁకినను గాదు తలయేఁటు♦సోఁకు నెపుడు.

కన్నె=ఓగిరికా, మరునకున్=మన్మథునకు, పూఁదూపు లెన్నిలేవు=పుష్పబాణము లెన్నిలేవు, అనఁగా ననేకము లున్నవనుట. అవియన్నియుం, కన్నెగేదంగివిరి కెనగావుగాక=లేఁత మొగలిపువ్వునకు సమానముగావుగాక-అనఁగాఁ బుష్పబాణము లనేకములున్నను లేఁత మొగలిపువ్వుతో సరిగావనుట. అదేమనిన, సూనబాణాభియాతికిన్=మన్మథవిరోధియైన హరునికి, దీనిగాలి సోఁకినను గాదు=దీనిగాలి పొరినప్పటికిని గొఱకాదు-అనఁగా గాలియును విరోధించుచున్నదనుట. తలయేఁటు సోఁకు నెపుడు=దీనిగాలిసోఁకెనేని నెప్పుడును దలనొప్పి కనుపించునని యర్థము. శిరోగంగ యలముకొనునని భావము.

మన్మథునకుఁ బెక్కు-బాణములున్నను నందు నసమానమైనది చివురు మొగలిరేకు. శివుఁడు తక్కినములుకులను లెక్కింపఁడు. మొగలిగాలిసోఁకినంతన గంగయలముకొనునని భావము. శిరోబాధ కలుగుననుట. అలం. కావ్యలింగము.

చ. కనఁ బద మూనఁ బాడఁ బలు♦క న్మొగ మెత్తుకొన న్మదింపఁ జే
య నలమఁ జల్ల నూర్చ నగ♦నంటను జాలవు గాక కాకచే
ఘనకుచ పువ్వు లీవె తిల♦కంబు నశోకము ప్రేంకణంబు గోఁ
గును కనకంబు కేసరము ♦ క్రోవియు వావిలి పొన్న మావియున్. 146

ఘనకుచ=ఓగిరికాదేవీ, కాకచేన్=విరహతాపముచేత, కనన్=చూచుటకును, పదమూనన్=కాలు మోపుటకును, పాడన్=గానము సేయుటకును, పలుకన్=సంభాషించుటకును, మొగమెత్తుకొనన్=ముఖరాగముఁ గనుపఱచుటకును, మదింపఁజేయన్ = ముఖసీధువు నించుటకును, అలమన్=కౌఁగిలించుకొనుటకు, చల్లనూర్చన్=చల్లనిముఖవాయువును గూర్చుటకును, నగన్ = నవ్వుటకును, అంటన్=కరస్పర్శము సేయుటకును, చాలవుగాక=ఓపక యున్నావు గాని, తిలకంబున్=బొట్టుగు చెట్టును, అశోకము=అశోకవృక్షంబును, ప్రేంకణంబు=మంకెనఁతీఁగెయును, గోఁగును=కొండగోఁగు చెట్టును, కనకంబు=చంపకమును, కేసరము=పొగడచెట్టును, క్రోవియున్=కోవిదారమును, వావిలి=సింధువారమును, పొన్న=సురపొన్నయును, మావియున్ = తియ్యమామిడియును, పువ్వులీవె=పుష్పములను సమర్పింపవా-అనఁగా నీవు పైనిఁ జెప్పఁబడిన వీక్షణాది దశవిధ దోహదవిశేషములను జరిగించినట్టులయినఁ దిలకము మొదలైన వృక్షములు పుష్పింపవా యనియర్థము. దీనం గ్రమాలంకారము చెప్పంబడియెను. వృక్షదోహదములు కొంతవఱకు వెనుకఁ జెప్పఁబడెను.

సీ. కలికి నీచేపట్టు♦గలది మాకందంబు సతి నీవు గనునది ♦ సరసతిలక
మబల నీయెదఁజేరు♦నది తావిగ్రోవి తొయ్యలి నీవు పదముంచు♦నది యశోక
మతివ నీయిర వొందు♦నది దగుఁ బొగడ బిత్తరి నీవు నగునది ♦ దా నమేరు
వమలాంగి నీదురా♦గము గన్నది ప్రియాళు వగజ నీ వెదిరించు♦నది సువర్ణ
తే. మింతినీచేఁ గృతాశ్వాస♦మింద్రసురస, మళికచభవన్మృదూక్తిక♦ర్ణాభరణముఁ
గాంచునది కర్ణికారంబు♦గానఁ గాన, నెరవుసేయక చెలి వీని♦విరులు గొనుము.

కలికి = ఓగిరికా, నీచేపట్టుగలది మాకందంబు = నీయొక్క కరస్పర్శము గలది రసాలవృక్షమని యర్థము. నీయొక్క హస్తావలంబమైన వస్తువే మాకు నందమైనదని యర్థాంతరము. లేక మా యనఁగా లక్ష్మి గనుక లక్ష్మీస్థానమని యైనను జెప్పవచ్చును. (ని. 'ఇందిరా లోకమాతా మారమా మఙ్గళదేవతా' అని అ.) సతి=ఓగిరికా, నీవు గనునది సరసతిలకము = నీవుచూచునది తిలకవృక్షమని యర్థము, నీచేతఁ జూడఁబడువస్తువే సరసశ్రేష్ఠమని యర్థాంతరము. అబల = ఓగిరికా, నీయొద్దఁ జేరునది తావిగ్రోవి=నీయొమ్మునఁ జేరునట్టిది పరిమళయుక్తమైన కోవిదార వృక్షమని యర్థము. నీవక్షస్థలమందుఁ జేరి యాదరింపఁ దగుచున్న వస్తువే పరిమళములకు స్థానమని యర్థాంతరము. తొయ్యలి =ఓగిరికా, నీవు పదముంచునది యశోకము=నీవు పాదము తాకింపఁగలది యశోకవృక్షమని యర్థము. నీచేత నడుగు మోపఁబడిన వస్తువే శోకరహితమైన దని యర్థాంతరము.

అతివ=ఓగిరికా, నీయిరవొందునది దగుఁబొగడ=నీయొక్క సురాగండూషమును బొందునది యర్హమైన పొగడచెట్టని యర్థము. ఇక్కడ ఇరాశబ్దము సురయందు వర్తించుచున్నది. (ని. గంధోత్తమా ప్రసన్నేరాకాదంబర్యః పరిస్రుతా' అని అ.)

బిత్తరి=ఓగిరికా, నీవు నగునది దానమేరువు=నమేరువనఁగాఁ బొన్న, నీవు దరహాసము సేయఁ దగినది పొన్నచెట్టని యర్థము. నీచేత మందహాసమును గూర్పఁబడువస్తువు తానే మేరువు అని యర్థాంతరము. అమలాంగి=ఓగిరికా, నీదురాగము గన్నది ప్రియాళువు=నీయొక్కగానమును గన్నదియ ప్రేంకణమని యర్థము. నీయనురాగమును బొందినది హృదయంగమ మని యర్థాంతరము. ఇక్కడ 'ప్రియగతౌ' అనెడు ధాతువువలన హృదయమునుగూర్చి గమించునది గనుకఁ బ్రియాళువని విచారింపవలయును. అగజ=ఓగిరికా, నీవెదిరించునది సువర్ణము=నీవు ముఖరాగమును నించునది చంపకమని యర్థము. నీచేత నెదిరింపఁ బడువస్తువే బంగారమని యర్థాంతరము.

ఇంతి=ఓగిరికా, నీచేఁ గృతాశ్వాసము=నీచేతఁ జేయఁబడిన ముఖవాయువు గలది, ఇంద్రసురసము=వావిలి చెట్టని యర్థము. నీచేతఁ జేయఁబడిన యూఱడింపు గలవస్తు వింద్రప్రియ మని యర్థాంతరము. అళికచ=ఓగిరికా, భవన్మృదూక్తి=నీయొక్కమృదువైన సల్లాపముచేత, కర్ణాభరణము గాంచునది=కర్ణావతంసములై పుష్పముల నుత్పాదించునది, కర్ణికారంబు=కొండగోఁగుచెట్టని యర్థము. (ని. 'అథ ద్రుమోత్పలః, కర్ణికారః పరివ్యాధః' అని అ.) నీభాషణమను కర్ణభూషణము గాంచినవస్తువే కర్ణికాయుక్తమని యర్థాంతరము. అనఁగా నలంకృతములైన కర్ణముగలదనుట. 'కర్ణికాం కర్ణభూషణమియర్తీతి కర్ణికారః' అని సమాసము. 'ఋగతౌ' ని. 'కర్ణికా కర్ణభూషణే' అని అ. కాంచుటయనఁగా బ్రసూతియగుటయును బొందుటయును, కానక్=కాఁబట్టి, కానను=ఈవనమును, ఎరవుసేయక=భేదముగా విచారింపక, చెలి=ఓగిరికా, వీనివిరులు గొనుము=ఈవృక్షముల యొక్క పుష్పములను సంగ్రహింపుము. అనఁగాఁ గరస్పర్శాది దోహదక్రియలు జరిగించి రసాలాది వృక్షముల పుష్పములను గ్రహింపు మని భావము.

('ఇతరత్రచద్వితీయా తస్యాః ప్రథమా చ జడపదానాం స్యాత్' అనెడు శబ్దానుశాసనసూత్రముచేత నిరాశబ్దము జడవాచకము గనుక ద్వితీయకుఁ బ్రథమవచ్చినది. ప్రథమకంటెఁ బరమగుట చేత పొందు ననెడిపదము మొదటి పకారమునకు వకారాదేశము వచ్చినది. ఇరవనఁగా నెలవు

నీయొక్క నెలవును బొందుచున్నవస్తువే పొగడఁ దగినదని యర్థాంతరము. తగుఁబొగడ యనునది క్రియాజన్య విశేషణసమాసము. వకారము క్రియాపదావయవము గనుక నిక్కడ లుగ్విషయము గాదయ్యెను. కాఁబట్టి పరమందున్న వకారమునకుఁ బకారమువచ్చినది. మించు గ్రమ్మించు ఇత్యాది పదములయందు వలెనని గ్రహింపవలయును.

ఈవనమును వేఱుగాఁ దలంపకుము. నీయనుగ్రహపాత్రమైనది. కావున నుత్సాహము దీఱ విరులను గోసికొనుము. అనుచుఁ జెలులు గిరికకుఁ దెలిపిరి. అలం. శ్లేషానుప్రాణితకావ్య లింగము.

క. అని వనితలు జవ్వని క, వ్వనివిభవముఁ దెల్పి కమ్మ•వలపులు గొనుగా
డ్పెనయమికి ఫణులఁ బెనచిన, యనువున జడలడరఁ గుసుమ•హరణోత్సుకలై.

అని=ఈలాగని, వనితలు=స్త్రీలు, జవ్వనికిన్=గిరికాదేవికి, అవ్వనివిభవముఁ దెల్పి=ఆయుద్యానవన వైభవమును దెలియఁ జెప్పి, కమ్మవలపులు గొనుగాడ్పు=మనోహరమయిన పరిమళమును హరించునట్టి మలయమారుతము, ఎనయమికిన్=సోఁకక యుండుకొఱకు, ఫణులఁ బెనచిన యనువునన్=వాతాశనములయిన సర్పములను జత చేసికొన్నారో యన్నట్లులుగా, జడలడరన్=వేణీబంధములు ప్రకాశింపఁగా, కుసుమ హరణోత్సుకలై=పువ్వులు గోయుటయం దుద్యుక్తలై ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

వనము వసంతావృతమగుటచేఁ గమ్మువలపుగాడ్పు లవ్వారిగా వీవసాగెను. విరహిణికి సుగంధవాయుప్రసారము గ్రమాకరముగావున వాయునిరోధమునకుఁ దగినవి పాములు. కాన పాములవలె జడలువైచికొని పూలుగోయ నేగిరని భావము. అలం. ఉత్ప్రేక్ష.

వృ ష భ గ తి ర గ డ.

బాల బాలరసాల మిది పిక•పాలిపాలిటియమరసాలము
గేలిఁ గే లిడి గ్రుచ్చఁ గడు రా•గిల్లు గిల్లుము తత్ప్రవాళము
కొమ్మ కొమ్మఁ గదల్చి ననగై•కొనక కొన కదియేల విక్కెదు
ర మ్మురమ్మున మోపఁ గురువక•రాజి రాజిలు నెంత పొక్కెదు
నాతి నాతిచిరప్రసూత న•నంటి నంటి కదల్ప నేటికి
నీతి నీతిలకంబు వలపులు•నించు నించుక చూచుబోటికి
నోమి యోమితమధ్య నీపద•ముంచు ముంచు నశోకవాసన
లేమ లేమరువములు నీ కవ•లీల లీలల వీకలోఁ జన
రాము రా మన కొనరఁ గూర్చు స•రాలు రాలుతు ననలు వైళము
భామ భామహనీయ మగు నీ•పాట పాటవమునఁ బ్రియాళము
నింతు నింతులకంటఁ బుప్పొడి•నెరసు నెరసులు పల్క నింతయుఁ
గాంత కాంతముఖానురాగము • కనక కనకము పూయ దెంతయుఁ
గ్రొవ్వి క్రొవ్విరిమొగ్గ మరుబరి•గోల గోల యి దేల దాఁటితి
నవ్వ నవ్వనవాటిఁ బొన్నలు • ననుచు ననుచు నెఱుంగఁ జాటితి

ముదిత ముదితమనోజ్ఞ యై తెలి♦మొల్ల మొల్లము మెచ్చె మాటికి
మదిర మది రహిఁ బూని వకుళము♦మన్న మన్నన మధుపకోటికిఁ
జెలువ చెలువపుఁదావి యూరుపు♦సింధు సిందుర మింపు మీఱఁగ
పలదు వలదురుమధుమధువ్రత♦వాసవాసంతికలు దూరఁగ
వనిత వని తరు లతల యలరుల♦వాడి వాడితి కొప్పువ్రేఁగున
మనము మనమునఁ గోరి చెలులకు ♦ మాట మాటలు వచ్చుగోఁగున
వెలయ వెల యని చూపెదవు కురు♦వేరు వేరుగఁ బల్కుఁ దగుదునె
యలసి యల సిరిగంధ మడరెదు♦నాడ నాడ భుజంగి పగుదువె
వాసి వాసి తెమల్తురా విర♦వాది వా దిఢ వత్తు రింతులు
గాసిగా సిర మం టె నలపక♦కప్పు కప్పుర మేల యంతులు
లతిక లతికమనీయకరకిస♦లయములయమున నాడె నిత్తఱి
నతనునతనుయశోభరం బన ♦ నలరు నలరులు చూడ బిత్తరి
తావితా విది గంధవహకం♦దళము దళముగ వీచు నెప్పుడు
కావ కావలిజాజు లిపు డవి ♦ ఘనము ఘనముఁలు మించు నప్పుడు
మాలమాలల మల్లె లెంతటి♦మోహమో హరిణాక్షి దాఁచితి
యేల యేలకిపొదలు వెదకెద ♦ వింత వింతలె యెందుఁ జూఁచితి
గోర గోరఁట నించితివా కలి♦గొట్టు గొట్టుగఁ గోయఁ బోసఁగవు
నారి నారికడంపుబాలెలు ♦ నాకు నాకుఁవృత్తి నోసఁగవు
కలయ కలయకలంకకేతకి ♦ కళిక కళికచ పఱచెఁ బిల్తమె
యళిక యళికి వడంకె నీయిభ♦యాన మా నవవిల్తుఁ గొల్తమె 149

ఈరగడలో వనితలు పువ్వులు గోయు సమయమందుఁ బల్కువాక్యములు చెప్పఁబడి యున్నవి గనుకఁ బ్రత్యేకముగా నన్వయము. ఏలాగనిన, బాల=ఓచెలియా, బాలరసాలమిది=లేఁతదైన యీతియ్య మామిడిచెట్టు, పికపాలిపాలిటి యమరసాలము=కోకిలసమూహము పాలిటి కల్పవృక్షము-అనఁగాఁ జిగురుటాకులచేత నభీష్టసిద్ధి సేయుననని భావము. గేలిఁ గేలిడి గ్రుచ్చఁ గడురాజిల్లున్=క్రీడచేతఁ జెయిపెట్టి గ్రుచ్చఁగానే మిక్కిలి రంజిల్లును గనుక, తత్ప్రవాళము గిల్లుము=దానిపల్లవము ద్రుంచుమనియర్థము. (శ్లో. 'కరస్పర్శేనమాకందః') అని యున్నదిగనుక హస్తస్పర్శరూపమైన దోహదముచేత రసాలము రంజిల్లుచున్నదని భావము. ఇక్కడఁ జరణాంతమందున్న యమరసాలశబ్దము ప్రథమాంతముగనుకఁ దత్పరమందున్న కేళిశబ్దాది కకారమునకు గకారాదేశము వచ్చినది. నకారాంతపదమునకుఁ బరమందున్నదిగనుక రెండవ కకారమునకు గకారము వచ్చినది. కొమ్మ=ఓచెలియా, కొమ్మఁ గదల్చి=పువుగొమ్మను గదలించి, నన గైకొనక=పుష్పమును సంగ్రహింపక, కొన కదియేల నిక్కెదు=శాఖాగ్రమున కేల ప్రాఁకుచున్నా వని యర్థము. రమ్ము = ఇటురమ్ము. ఉరమ్మున మోపన్=వక్షస్థ్సలమందు నానించుకొనఁగానే, కురువకరాజ రాజిలున్=ఎఱ్ఱపువ్వులుగల పెద్ద గోరంటచెట్టు ప్రకాశించును, ఏలషాక్కెదు=ఎందుకుఁ జింతించుచున్నావు అని యర్థము. ('అలి

జ్ఞనాత్కురవకః' అని యున్నది గనుక నాలింగన రూపమైన దోహదముచేతఁ గురవకవృక్షములు ప్రకాశించుచున్నవని భావము.

కొమ్మ కొమ్మ ననుచోట వర్గప్రథమవర్ణములుగాని వర్గతృతీయవర్ణములుగాని రెండును జెప్ప వచ్చును. చరణాంత సంధియును సంబుద్ధ్యంతసంధియును వైకల్పికము. 'నస్యాద్వాక్యవిరామేతు సంధిర్వ్వానాపి దోషకృత్' అను వచనముచేత సంధిరాదయ్యె. ఇక్కడ వాక్యమనఁగాఁ బదంబు.

గీ. 'సంధిగూర్పంగఁ బ్రథమాంత శబ్దవితతి, పైకచటతపలకు వికల్పంబుసెల్లుఁ
గాకు సంబోధ నావ్యయ కర్మధార, యంబుల నచేతనంబుల నబ్జనాభ.' అనియున్నది.

నాతి=ఓచెలియా, నాతిచిరప్రసూతను=కొద్దిదినములనాఁడు గెలవేసిన, అనంటిన్=అరఁటి చెట్టును, అంటి కదల్పనేటికిన్=ముట్టి కదలింపనేల యని యర్థము. నీతిన్=నియమముతోడ, ఈతిల కంబు=ఈబొట్టుగుచెట్టు, ఇంచుకచూచుబోటికిన్=కొంచెముగాఁ దనవంకఁజూచిన స్త్రీకి, వలపులు నించున్=వాసనలను నిండించును అని యర్థము. (శ్లో. 'తిలకో వీక్షణేనచ') అనియున్నది గనుక వీక్షణరూపమైన దోహదముచేతఁ దిలకవృక్షము పుష్పించుచున్నదని భావము. ఓమితమధ్య=సూక్ష్మమైన మధ్య ప్రదేశముగల యో చెలియా, ఓమి=పోషించి, నీపదముంచు=నీయొక్క పాదప్రాప్తిఁ గలుగఁ జేయుము. అలాగునఁ జేయఁగానే, ముంచు నశోకవాసన=అశోకపువ్వు పరిమళము గ్రమ్ము చున్నదని యర్థము. (శ్లో. 'అశోకశ్చరణాహత్యా') అనియున్నది గనుకఁ బదతాడన రూపమయిన దోహదముచేత నశోకము పూయుచున్నదని భావము.

లేమ=ఓచెలియా, లేమరువములు=లేఁత మరువములు, లీలలవీఁకలోఁ జనన్=లీలావిహారము సేయుచెడల, నీకవలీల=నీకు సులభముగా లభింపఁబడునని యర్థము. రామ=ఓచెలియా, రా=రమ్ము, రాలుతునసలువైళము=శీఘ్రముగాఁ బువ్వులు రాల్పుచున్నాను, మనకొనరఁ గూర్పు సరాలు=మనకు సరిపోవునట్టులుగా దండలు గ్రుచ్చుము అనియర్థము. భామ=ఓచెలియా, నీపాట పాటవమునన్=నీయొక్క గాన నైపుణ్యముచేత, ప్రియాళము=ప్రేంకణము, భా మహనీయమగు=కాంతిచేత ఘనమ వును అనియర్థము. ('గీత్యాప్రియాళుః') అని యున్నది గనుక గానరూపమైన దోహదముచేతఁ బ్రేంకణము ప్రకాశించుచున్న దనిభావము. ప్రియాళుశబ్ద మకారాంతమును గలదన్నందుకు, ('చూతైః ప్రియాళైః పనసైః') అని శ్రీభాగవతమందుఁ బ్రయోగము. ఇంతుల కంటన్ = సఖులయొక్క కన్నులయందు, పుప్పొడినెరసు=పుష్పపరాగపు నెరసులు, నింతున్ = నిండించుచున్నాను, నెరసులు పల్క నింతయున్=ఇంతైనను దప్పులు పల్కనని యర్థము. కాంత=ఓచెలియా, కాంత ముఖాను రాగము కనక=గిరికాదేవియొక్క ముఖరక్తిమను గాంచక, కనకము=సంపఁగి, పూయదెంతయున్= ఎంతమాత్రమును బుష్పింపదు అనియర్థము. ('శ్లో. 'ముఖరాగేణ చంపకః') అనియున్నది గనుక ముఖరక్తిమ రూపమయిన దోహదముచేతఁ జంపకము పుష్పించుచున్నదని భావము. అనురాగపద మచేతనార్థకము గనుకఁ దత్పరమయిన కకారమునకు గకారాదేశము చెప్పినవాఁడు గాఁడు.

గోల=ముగ్ధయైన యో చెలియా, క్రొవ్వి=మదించి, ఇది=ఈకనుపడునట్టి, క్రొవ్విరి=క్రొత్తఁగా వికసించిన పుష్పము, మరు బరిగోల=మన్మథుని బాణముగదా, ఏలదాఁటితి=ఎందుకు దాటితివే యని యర్థము. ఇక్కడఁ జరణాంత సంధిసేయఁగూడదు. నవ్వన్=నవ్వఁగాను, అవ్వనవాటిన్=ఆవనవీధి

యందు, పొన్నలు=పొన్నచెట్లు, ననుచున్=పుష్పించును, అనుచు నెఱుంగఁ జాటితిన్=అని తెలియఁ జెప్పితినిగదా యని యర్థము. (శ్లో. 'నమేరు ర్హాసితేనచ') అనియున్నదిగనుక హాసనరూపమైన దోహదముచేతఁ బొన్నలు పూయునని భావము. ముదిత=ఇది ప్రథమైకవచనము-అనఁగా నాముదిత, ముదితమనోబ్జయై=సంతోషించినమనఃకమలము గలదై, తెలిమొల్లమొల్లము=తెల్లని మొల్లపువ్వుల యొక్క శృంగారమును, మాటికిన్=పలుమాఱును, మెచ్చెన్=మెచ్చుకొనెను అని యర్థము. వకుళము=పొగడచెట్టు, మదిర=మద్యముచేత, మదిరహింబూని=అనఁగా వికాసమును వహించి, మన్నెన్=ఉండినట్టియున, మధుపకోటికిన్=భృంగసమూహమునకు, మన్నన=బహుమతి యగునుఅని యర్థము. మధుపశబ్దము సాభిప్రాయమని విచారింపవలయును. (శ్లో. 'వకుళో ముఖసీధునా') అనియున్నది గనుక సురాగండూషరూప మయిన దోహదముచేతఁ బొగడచెట్టుల్లసిల్లుచున్నదని భావము.

చెలువ=ఓచెలియా, సిందురము=అనఁగా వావిలిచెట్టు, ఇంపుమీఱఁగన్=హితవుచేత నతిశయించునట్టులుగా, చెలువపుఁ దావియూరుపు=మనోహరమయిన సౌరభముగల ముఖవాయువును, చిందు=ప్రసరింపఁ జేయును అని యర్థము. ('సిందువారో ముఖానిలాత్') అని యున్నది గనుక ముఖవాయురూపమయిన దోహదమువలన వావిలిచెట్టు పల్లవించుచున్నదని భావము. ఇక్కడఁ జరణాంతసంధి సేయలేదు. సంబుద్ధ్యంత పదమునకంటెఁ బరంబైన రెండవ చకారమునకు సకారాదేశము రాలేదు. ఊరుపు ననెడిపదము జడవాచకము గనుక ద్వితీయకుఁ బ్రథమవచ్చి, ప్రథమాంత పదపరమయిన చిందనెడుపదము మొదటిచకారమునకు సకారాదేశము వచ్చినది. వలత్=సంచరించుచున్న, ఉరుమధు=అధికమరందము గలిగిన; మధువ్రత=తుమ్మెదలకు, వాస=నివాసములయిన, వాసంతికలు=బండిగురువింద తీఁగెలు, ('ని. వాసంతీ మాధవీలతా' అని అ.) దూరఁగన్=దూరిపోవఁగా, వలదు=వద్దు అని యర్థము. మధువ్రతశబ్దము సాభిప్రాయము. వనిత=ఓ చెలియా, వని=వనమందలి, తరులతల=వృక్షములయొక్కయుఁ దీఁగలయొక్కయు, అలరులన్ = పుష్పములను, వాడి=వ్యయపఱచి, అనఁగాఁ బుష్పాపచయము చేసి, కొప్పువ్రేఁగునన్=కబరికాభారముచేత, వాడితిన్=బడలిపోతి నని యర్థము. మనము మనమునఁ గోరి=మనము మానసమందాశపడి, చెలులకు మాటన్=తోడిచెలికత్తియల కియ్యక మాటితే, గోఁగునన్=ఈకొండగోఁగుమూలమున, మాటలు వచ్చున్=వివాదములు రాఁగలవు అని యర్థము. ('సల్లాపతః కర్ణికారః') అని యున్నది గనుక సల్లాపరూప మయిన దోహదమువలనఁ గొండగోఁగుచెట్టు పుష్పించునని భావము.

కురువేరు=అనఁగాఁ బరిమళపత్రవిశేషము, వెలయున్=శోభిల్లుచుండఁగా, వెలయని చూపెదవు=మిగుల విలువయని మాకుఁ గనుపఱుచుచున్నావు, వేరుగఁ బల్కఁదగుదువె=భేదముగా మాట్లాడఁదగుదువటే యనియర్థము. అలసి=శ్రమముఁ జెంది, అలసిరిగంద మడరెడునాడన్=ఆ శ్రీచందనవృక్షము ప్రకాశించుచుండెడుచోట, ఆడన్=క్రీడించుటకు, భుజంగివగుదువె=సర్పాంగనవాయేమే యని యర్థము. భుజంగియనఁగా విటస్త్రీకిని బేరుగనుకఁ బరిహాసగర్భవచన మనియును గ్రహింపవలయును. వాసివాసి=తారతమ్యమును బాసి, విరవాది=విరజాజిని, తెమల్తురా=కదలింతురా, ఇంతులు=తోడిచెలులు, వాదిడవత్తురు=జగడమాడ వత్తురుసుమీ యనియర్థము. వాసియనెడు పదము జడవాచకమైనందున ద్వితీయకుఁ బ్రథమవచ్చినది గనుకఁ బరమందున్న వకారమునకు వకారాదేశము

వచ్చినది. గాసిగా సిరమంటెన్=బాధకమగునట్టులుగాఁ దలకెక్కెను, కప్పురము=కర్పూరమును, నలపక=నలిపి పొడిచెయ్యక, కప్పు=కప్పిపెట్టు, ఏలఱంతులు=కోలాహలము లెందుకు అని యర్థము. ఇత్తఱిన్=ఈసమయమందు, లతికలు=పువ్వుఁదీఁగెలు, అతికమనీయ=అత్యంత సుందరమైన, కరకిసలయము=కరసదృశకిసలయముయొక్క, లయమునన్=లయప్రకారముచేత, ఆడెను=నర్తించెను అని యర్థము.

చిత్తరి=ఓచెలియా, అతను=మన్మథునియొక్క, అతను=అధికమైన,యశోభరంబునన్=కీర్త్యతిశయ మనునట్టులుగా, అలరులు=పుష్పములు, అలరున్=ఒప్పును, చూడన్=చూడఁగా నని యర్థము. 'షష్ఠ్యాఉతోచినుమ్సేచ' అనెడు శబ్దానుశాసన సూత్రముచేత మొదటిదైన యతను శబ్దాంతమందు నుమాగమమువచ్చినది, ఇది=ఈప్రదేశము, తావి=పరిమళముయొక్క, తావు=స్థానము, కాఁబట్టి, గంధవహాకందళము=పవనాంకురము-అనఁగా మందమారుతము, దళముగన్=తఱుచుగా, వీచు నెప్పుడు =ఎప్పుడును విసరుచుండును అని యర్థము. ఇక్కడఁ జరణాంతసంధిచేసి గసడదవాదేశము చెప్పఁగూడదు, ఆవలిజాజులు=ఆవలిజాజితీఁగలను, ఇపుడు=ఈసమయమందు, కావకు=కనిపెట్టకుము, ఘనములు మించున్నప్పుడు=మేఘములతిశయించెడు సమయమందు-అనఁగా వర్షకాలమందు, అవి=ఆజాజులు, ఘనము=అతిశయము-అనఁగా నావలిజాజితీఁగలు వర్షాకాలమందుఁ బూయుచున్నవి గాని యిప్పుడు పుష్పింపవు గనుక. వానిఁ గాచియున్నను వినియోగము లేదని యర్థము. జాజి వానకాలమునఁ బూయుననుట కవి సమయసిద్ధము.

ఓహరిణాక్షి=ఓచెలియా, ఎంతటిమోహాము=ఎంతమోహమో కాని, మల్లెలు=మల్లెపువ్వులను, మూలమూలలన్=కనుపడకయుండునట్లు చాటుచాటులను, దాచితి=దాచిపెట్టుకొంటివి అనియర్థము. ఏలయేలకిపొదలు వెదకెదవు=ఎందుకొఱకు నేలకి పొదలు వెదకుచున్నావు, ఇంతవింతలె=అనఁగా నీలాటివింత లెక్కడనైనను గలవా, ఎందుఁజూచితివి=ఎక్కడఁజూచి నేర్చితి వని యర్థము. గోరగోరఁట నించితివో=గోళ్ళను గోరంటాకు పెట్టుకొంటివా యేమి, గోరంటాకునూరి గోళ్ళకుఁబెట్టుకొనుట ప్రకటము, అయిన, కలిగొట్టు = పాటలీపుష్పములను, గొట్టుగన్=అశక్యమగునట్టులుగా, కోయఁబోసఁగవు=కోయఁజాలవు అని యర్థము. అనఁగా గోరంటాకుపెట్టుకొన్న గోళ్లెఱ్ఱగా నుండుట చేతను గలిగొట్టుపువ్వులు నెఱ్ఱగానే యుండుటచేతను భ్రాంత్యవరోధము కలుగును గానఁ గోయఁజాలవని భావము. నారి=ఓచెలియా, నారికడంపుఁబాళెలు=కొబ్బరిబొండ్లాలు, నాకు నాకులవృత్తి నొసఁగవు=నాకు వ్యాకులము నియ్యవని యర్థము. అనఁగా నవియెంతపొడవున నున్నప్పటికిని ననాయాసముగా నెక్కి కోయఁగలుగుదునని భావము. కలయక=నాతోఁగలయక, అల యకలంకకేత, కళికకున్=కలంకరహితమయిన యామొగలి పూమొగ్గయున్న దిక్కునకు, అళికచ=గిరికాదేవి, పఱచెన్=పరుగెత్తెను, పిల్తమె=ఆహ్వానముచేయుదమా యని యర్థము. అనఁగా మరణోద్యోగముచేసి యసిపత్రములుగల మొగలిపూమొగ్గకై పఱచెను గనుకఁ బిలుతమని యనుట.

ఈయిభయాన=ఈగిరికాదేవి, అళికి=భయపడి, అళికిన్=తుమ్మెదకు, వడంకెన్=కంపించెనుకి ఆననవిల్తుఁ గొల్తమె=ఆమన్మథునిఁ బూజింతమా యని యర్థము.

ఇది వృషభగతిరగడయనంబడు, దీనికి నిరువది యెనిమిది మాత్రలుండవలయు, లఘు వొక మాత్రగలదియు గురువు రెండుమాత్రలు గలదియుఁ గాన నట్టిమాత్ర లిరువది యెనిమిదియనుట, పద్ధి

యేనవమాత్ర మొదట యతియుండవలయును. రెండురెండుపాదంబు లాద్యంతప్రాసయుక్తంబులై యుండవలయును, ఇది సంఖ్యారహిత పాదవృత్తములలో నొకటి గనుక నిచ్చకువచ్చినన్ని పాద ద్వయములు గలుగఁజెప్పవచ్చును. ఈరగడయందుఁ గావ్యగుణములలో నొకటి యగు కాంతిగుణము చెప్పంబడియెను. కావ్యగుణములు పది, అవి యెవ్వియనఁగా శ్లేష, ప్రసాదము, మాధుర్యము, సౌకుమార్యము, సమతార్థము, దీపనము, ఔదార్యము, కాంతి, ఓజస్సు, సమాధి అనునవి. అందుఁ గాంతి యనఁగాఁ జిత్రవర్ణ క్రమస్థితులను మెండుగఁ గూర్చుట.

చ. అని వనకేళి సల్పి లలి•తాంగు లతాంతలతాంతకోటిలో
వనపవనానుషంగమున • వాసన వోవనివానిఁ దేనియ
ల్దోనుకనివానిఁ బుప్పొడులు • దూలనివాని మదాళిమాలిక
ల్చెనకనివాని భావభవు•సేవకు నేర్పున నేర్పరించుచున్. 150

అని=పైనిఁజెప్పినప్రకారముగా సల్లాపములుపల్కి, వనకేళిసల్పి=వనవిహారముచేసినవారై, లలితాంగులు=స్త్రీలు, అతాంత=వాడని, లతాంతకోటిలోన్=పుష్పసముదాయములో, వన పవ నానుషంగమునన్=వనవాయు సంపర్కముచేత, వాసన వోవనివానిన్ =పరిమళము పోకయున్న వియు, తేనియ ల్దొనుకనివానిన్=పూఁదేనియలు చిందిపోక యున్నవియు, పుప్పొడులు దూలని వానిన్=పుప్పొడులెగిరిపోకయున్నవియు, మదాళిమాలిక ల్చెనకనివానిన్=మదించిన తుమ్మెదగుంపులు ముట్టకయున్నవియు నైన పుష్పములను, భావభవుసేవకున్=మన్మథపూజార్థముగా, నేర్పున నేర్పరించుచున్=మెలకువచేత నేర్పఱిచి సంగ్రహించుచును. ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. తావిపోనివి, తేనియతొలంగనివి, పుప్పొడిరాలనివి, తుమ్మెదలంటనివియగు పూవులు మన్మథపూజ కుపయుక్తములు. అట్టివానిని సమకూర్చుటలో నేర్పుకావలయును. విరులఁగోయఁదగిన వేసము వేసికొని చెలువలు మెలకువతోఁ బూజాకుసుమములు సమకూర్చిరని భావము.

సీ. కుసుమవాసన లెల్లఁ•గొల్లలాడితిమింకఁ బఱచుటామని యెంత•పర్వు లిడునొ
చివురుజొంపము లెల్లఁ•జిదిమివైచితిమింకఁ బగఱకోయిల యెంత•యెగసిపడునొ
ఫలపరంపర లెల్ల•నులిచివైచితి మింకఁ గొదమచిల్క లవెంత•వదరుకొనునొ
కమ్మఁదేనియ లెల్లఁ•గ్రుమ్మరించితి మింకఁ గట్టలుక నళు లెంత•చుట్టుకొనునొ
తే. యెఱుఁగ రా దింతులార యీ•తెఱవ నిచట
మసలఁగానీక తోతెండు•మనము గొనిన
కుసుమ కిసలయ ఫల నవ•ప్రసవరసము
లసమశరునకు నర్పింత • మనుచు వెడలి. 151

కుసుమవాసనలెల్లఁ గొల్లలాడితిమి=పుష్పవాసనల నన్నిటిని జూఱపుచ్చితిమి, ఇంకన్=ఇఁక మీఁదట, పఱచుటామని=ప్రల్లదపు వసంతుఁడు-పఱచు అనునది యుకారాంతశబ్దము గనుక టుగాగమము వచ్చినది. ఎంత పర్వులిడునొ=ఎంత పరుగులెత్తునో యని యర్థము. చివురుజొంపములెల్లఁ జిదిమివైచితిమి=చిగురుటాకు గుత్తు లన్నిటిని ద్రుంచివైచితిమి. ఇంకన్=ఇఁకమీఁదట, పగఱకోయిల యెంత యెగిరిపడునొ=విరోధియై యున్న కోకిల యెంత యెగసిపడునో యని

యర్థము. ఫలపరంపరలెల్ల నులిచివైచితిమి=పండ్లగెలల నన్నిటిని నలిపితిమి, ఇంకఁ=ఇఁకమీఁదట, కొదమచిల్కలవెంత వదరుకొనునో=తరుణవయస్సుగల యాచిల్క లెంత తప్పుమాఁటలు కూయునో యని యర్థము. కమ్మఁదేనియలెల్లఁ గ్రమ్మరించితిమి=మధురమయిన మకరందములనన్నిటిని నొలకఁబోసితిమి. ఇంకఁ=ఇఁకమీఁద, కట్టల్క నళులెంత చుట్టుకొనునో=మిక్కిలి కోపముచేతఁ దుమ్మెద లెంత చుట్ట వేసికొనునో అని యర్థము. ఇక్కడ వసంతుఁడు సర్వత్ర వ్యాపించు ననియును గోయిల పక్షి గనుక నెగసివ్రాలుచున్న దనియును జిలుకలు పరిపరివిధములుగాఁ బలుకుచున్నవనియును దుమ్మెదలు గుంపుగట్టి ముసురుకొంచున్నవనియును భావము.

ఎఱుఁగరా దింతులార=ఓచెలియలారా తెలియ శక్యముగాదు, ఈతెఱవన్=ఈగిరికాదేవిని, ఇచట మసలఁగానీక=ఇక్కడ నాలస్యముగా నుండనియ్యక, తోతెండు=వెంటఁబెట్టుకొనిరండు, మనము గొనిన=మనము సంగ్రహించిన, కుసుమ=పువ్వులును, కిసలయ=చిగురుటాకులును, ఫల=పండ్లును, నవప్రసవరసములు=నూతనమైన పూఁదేనియలును, అసమశరునకు నర్పింత మనుచున్=మన్మథునకు సమర్పింతమని పలుకుచు, వెడలి=ఆవనములోనుండి బయలుదేరి, ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. ఈపద్యములో శంకయనెడి సంచారిభావము చెప్పంబడియె. శ్లో. 'అనిష్టాభ్యాగమోత్ప్రేక్షా శంకా రోషాదికారణమ్' అని లక్షణము.

క. మందారముకుళకుహాళీ, కందళితమరందతుందిలమిళిందవధూ
బృందాభినందితం బగు, మందానిల మొలయ విజితమార్గశ్రమలై. 152

మందార=దేవతావృక్షభేదములయొక్క, ముకుళ=మొగ్గలయొక్క, కుహాళీ=గుత్తులయందు, కందళిత=ఉత్పన్నమగుచున్న, మరంద=మకరందమువల్ల, తుందిల=బలిసిన, మిళిందవధూ=ఆఁడుతుమ్మెదలయొక్క, బృంద=సమూహముచేత, అభినందితంబు=మిక్కిలి స్తుతిచేయఁబడుచున్నది, అగు=అయినట్టి, మందానిలము=మందమారుతము, ఒలయన్=విసరఁగా, విజితమార్గశ్రమలై=జయింపఁబడిన మార్గాయాసముగలవారై, ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

కుహాళీశబ్దము పూఁగుత్తియందు వర్తించినందుకుఁ బ్రయోగము.

చ. 'ప్రతివనచారు కేసరపరాగశలాటు మిళింద బృందచి
త్రితకుహాళీయుగంబు గతిఁ గ్రేవలఁ గర్ణకలాపరత్నని
ర్గతరుచిమంజరు ల్దనరఁగాఁ గ్రముకద్రుమ కంఠలక్ష్మికిం
బ్రతిభటవృత్తిఁ జూపెడును భామిని కంఠము'

అని సూరపరాజు చెప్పినాఁడు.

చ. వనజముఖు ల్గనుంగొని రవారితవారితరంగరంగన
ర్తనసలిలభ్రమభ్రమణరంగదభంగరథాంగధామమున్
మనసిజహేమకుండనిభమంజులకంజగతాళిధామమున్
ధనదసరోజధామసమధామము నొక్కసరోలలామమున్. 153

వనజముఖులు = గిరికాదేవిచెలికత్తియలు, అవారిత=నివారింపఁబడని, వారితరంగ = జలతరంగములనెడు, రంగ=నాట్యస్థానమందలి, నర్తన=నాట్యమందు, సలిలభ్రమభ్రమణ=నీళ్లసుడి

యందలి తిరుగుటయనెడు సుడిపలెఁ దిరిగెడు చక్రనాట్యముచేత, రంగత్=రంజితములగుచున్న, అభంగ=భంగములేని, రథాంగ = చక్రవాకములకు, ధామముక్ = స్థానమయినదియుఁ, మనసిజ= మన్మథునియొక్క, హోమకుండ=హోమాగ్నికుండములతోడ, నిభ=సమానములైన, మంజుల కంజ =మనోహరములయిన యెఱ్ఱదామరలను, గత = పొందియున్న, అళి ధూమముక్ = పొగలవంటితుమ్మె దలు గలిగినదియు, ధనద=కుబేరునియొక్క, సరోజధామ=పద్మనిలయ మయిన మానససరోవరముతోడ, సమ=సమానమయిన, ధామముక్=ప్రభగలిగినదియునగు, ఒక్కసరోలలామముక్=ఒకసరోవరమును, కనుఁగొనిరి=చూచిరి. ఈపద్యము వృత్త్యనుప్రాసము గలదిగాఁ జెప్పెను.

వారితరంగము లవారితములు, అందలిసుడిగుండములు చక్రవాకములకు నాట్యరంగములవలె నుంటచే సరస్సుచక్రవాకముల కునికిపట్టైయందముగనున్నది. తామరపూవులు మన్మథుని హోమకుం డమువలెను దుమ్మెదలచాలు పొగవలెనున్నది. అనఁగా సరోవరము చక్రవాక క్రీడాయోగ్యము పద్మ గత భ్రమరవాసమునై మానససరస్సువలెనుండెను.

శబ్దాలంకారము. వృత్త్యనుప్రాసము.

వ. కనుంగొని కురంగట మెలంగువనదేవత లాత్మీయచిత్రపత్రలతాతిలకజాలకా లోకంబు లాలోకింపం గోరి గమలాకరముకురంబు వేమఱు మెఱుం గిడఁ గ్రేవ లం దొరఁగు రాపొడికైవడిం దటకటకరూఢప్రౌఢతరుపటలపరిపతిత పరాగబృందంబులు నెరయునంగంబున కానందంబు నొందుచు, నందనారామ సీమావిహారపరిశ్రాంత లగుతమకు నుపభోగ్యంబుగా వినమ్రశాఖాంచలప్ర వాళతాళవృంతంబుల విసరివిసరి మృదులపవనవలనగళితకుసుమసముదయంబులం బువ్వుగట్టి యబ్జాకరవారిపూరంబు నదీతుషారంబు నపారసౌరభోదారం బునుంజేయు శిశిరకిరణశిలాఫలపాళికాస్థాపిత సోపానోపాంత కల్పితాలవాల మూలల సలిలసేకసంవర్ధిత సేవంతికామల్లికాదివల్లికలయల్లికల కుల్లసిల్లుచుఁ బై తామహాశ్రమంబునం గిరణమాలిసాహాయ్యరంజితకింజల్కకీలికీలామధ్యంబు నం బెక్కుకాలంబు నిల్చినకతంబున నాత్మమాలిన్యంబు దొలంగి యభినవ సువర్ణతేజోవిరాజమానంబు లగుతెఱంగునఁ దరంగితతదీయరజోనుషంగ పిశంగితాంగంబు లగుభృంగంబులం గని యుప్పొంగుచుఁ దరుణతరణికిరణచ్ఛ దచ్ఛటాచ్ఛాదితంబును దపనీయవర్ణకర్ణికాధివాసంబును దామ్రకేసరవ్రాత జాతరూపస్తంభసంభార సంభృతంబును దటిద్రాగ పరాగ పరభాగ పరంపరిత పట్టాంబరవితానసందీపంబును నగునిందిరామహాదేవి యెక్కినశోణారవింద స్యందనంబుక్రిందటం బటికంపుటిరుసున సంఘటించినభర్మరథాంగయుగ్మంబుల భంగి నంగీకృతైకమృదుమృణాళకాండమండితతుండంబు లగురథచరణదంప తులసొంపున కింపు మీఱుచుఁ ద్రిభువనయువలోకమోహప్రపంచనిర్మాణచుం చుం డగుపంచశరవిరించునకుఁ బడివాగె పట్టినకలధౌతఖలీనసూత్ర సంకలిత కంఖాణరాజంబులై సంచలితచంచూపుటకోరకితసరసబిసఖండసంతాయ

మానతంతుసందానితాంసంబు లగుహంసంబులం బ్రశంసించుచుఁ దరళతరంగమాలికాస్ఫాలననటత్కమలకరపుటసరయసముత్పతనపతనబంధుర గంధాంధపుష్పంధయస్తనంధయదంభంబున జంభరిపుశిలాసంఘటితఘుటికావినోదంబులు సలుపుసరోవరలక్ష్మీజలభ్రమతాటంకచక్రంబులం దళుక్కురనుతిర్యక్ప్రసాదితకటాక్షచాకచక్యంబులపగిది నెగడుమగబేడిసమొత్తంబుల బిత్తరంబులు చిత్తగించుచు జలాధిదేవత తనకు నఖర్వసార్వకాలికసర్వతోముఖసమృద్ధికై వరలక్ష్మీ నావహింపం జేసి కింజల్కపుంజరక్తాక్షతంబులుం గీర్ణపరాగహరిచందనంబులుం గీలితాగ్రశైవలపలాశంబులుం గ్రీడదళితధూపధూమంబులుం బరిఢవిల్ల నోమినసుధాధౌతనూతనపూర్ణకలశంబులసొంపు సంపాదించు నమందమకరందపూరితోదరదర వికస్వరపుండరీకషండంబుల మెండునకు నిండు వేడుక నెరపుచుఁ జంచరీకకుటుంబినీఝుంకారమంగళసంగీతనాదంబులతోఁ జలాచల క్రౌంచకారండవమండలీపక్ష పటపటత్కార పటహారవంబులతోఁ జపలతరతరంగభుజోత్క్షిప్తశీకరాచారలాజంబులతో విహారదీర్ఘిక యనతి దూరమ్మున వచ్చుతమ్మునెదుర్కొనం గవ్యూత్యంతరంబులు గడచి యేతెంచు సొంపు దెలుపునిజవదనచంద్ర చంద్రికావృత ప్రతీర చంద్రకాంతజాతనూతన స్రోతోభరంబులయుబ్బునకు నబ్బురపాటు దొరయుచు మఱియుఁ దత్కాసారం బపరిమితపాండుపక్షవిశేషభూషితంబు గావునఁ బ్రదర్శితధార్తరాష్ట్రముఖశ్యామికం బై బహులహరివిలాసభాసురంబు గావునం బ్రథమానమీనకూర్మాద్యవతారధారకం బై యూర్మిలాభాసమానంబు గావున లక్ష్మణోపభోగభవనం బై మానసజయమహనీయంబు గావున నంతరున్మీలితనాళీకోపరివికస్వరకమలకర్ణికానిర్నిరోధబోధమాధురీధురీణం బై రాణించుట కుదంచిత రోమాంచకంచుకితదేహ లై యవ్వరారోహలు ముదంబునం దదంబుఖేలనాయత్తచిత్త లై. 154

కనుంగొని=చూచినవారై, కురంగటమెలంగు వనదేవతలు=సమీపమందు సంచరించు వనాధిదేవతలు, ఆత్మీయ = స్వకీయమయిన, చిత్ర=విచిత్రమయిన, పత్ర=ఆకులయొక్కయు, లతా=తీఁగలయొక్కయు, తిలక=తిలకవృక్షములయొక్కయు, జాలక=పూమొగ్గలయొక్కయు, ఆలోకంబులు =ప్రకాశములను, ఆలోకింపఁగోరి = చూడనిచ్ఛయించి యని వనపరమయిన యర్థము. స్వకీయమైన చిత్రిత మకరికాపత్ర లతారచనలయొక్కయుఁ గుంకుమాది రచిత తిలక జాలములయొక్కయుఁ బ్రకాశములను జూడఁగోరియని దేవతాస్త్రీపరమయిన యర్థము. కమలాకరముకురంబున్ = సరోవరమనెడి యద్దమును, వేమఱుమెఱుంగిడన్ = పలుమాఱును మెఱుఁగుపెట్టఁగా, క్రేవలందొరఁగురాపొడికైవడిన్=పార్శ్వమునయందు రాలిన రాపొడియో యన్నట్టులుఁగా, తటకటక=వలయాకారతీరమందు, రూఢ=మొలిచినవియును, ప్రౌఢ=ప్రవృద్ధములైన, తరు=వృక్షములయొక్క, పటల = సమూహమువల్లనుండి, పరిపతిత=అంతటరాలిన, పరాగబృందంబులు=పుప్పొడులకుప్పలు, నెరయునందంబునకున్=వ్యాపించియున్న శృంగారమునకు, ఆనందంబు నొందుచున్=సంతోషమును బొందుచును,

అద్దముధూళిగొని మెఱుఁగుబాసినపుడు జాపాడితో మెఱుఁగుబెట్టుట ప్రసిద్ధము. అద్దమునలు కెలంకుల నాజాపొడి జాఱును. వనదేవతలు తమపత్త్రరేఖాతిలకాదులఁ జూచుకొనుటకుఁ గమలాకరమను నద్దమునకు మెఱుఁగిడ నలుగెలకులరాలిన జాపొడివలెఁ దరుపతితపుష్పరజములరాలుచున్నదని భావము. అలం. శ్లేషమూలకోత్ప్రేక్ష.

నందన=సంతోషకరమయిన, ఆరామ = ఉద్యానవనముయొక్క, సీమా=చివరదనుక నైనట్టి, విహార=సంచారమువలన-అనఁగా దూరవిహారముచేత ననుట. సీమాశబ్ద మాకారాంత స్త్రీలింగము. (ని. 'సీమసీమే స్త్రియా ముభే' అని అ.) పరిశ్రాంతలగు=మిక్కిలియు నలసినవారైన, తమకున్=తమకు, ఉపభోగ్యంబుగాన్ = అనుభవయోగ్య మగునటులుగా, వినమ్ర=మిక్కిలి వంగిన, శాఖా=కొమ్మలయొక్క, అంచల=అగ్రములయందలి, ప్రవాళ=చిగురుటాకులనెడు, తాళవృంతంబులన్=విసనకఱ్ఱలచేత, విసరివిసరి = పలుమాఱును విసరి, మృదుల=కోమలమయిన, పవన=వాయువుయొక్క, వలన=చలనముచేత, గళిత=జారిన, కుసుమ సముదయంబులన్=పుష్ప సమూహములచేత, పువ్వుగట్టి=వాసనాయుక్తముగాఁ జేసి, అబ్జాకర వారిపూరంబున్=సరోవరమందలి జలసమృద్ధిని, అతితుషారంబున్=అత్యంత శీతలముగాను, అపారసౌరభోదారంబునుం జేయు=మితిలేని పరిమళముచేత నతిశయమగు నటులుగాను గాలికి రాలిపడిన పువ్వులచేతఁ బరిమళయుక్తమగునటులుగాను జేయుచున్నవని గ్రహింపవలయును. ఆలాగునఁ జేయుచున్నట్టి, శిశిరకిరణ=చంద్రసంబంధములయిన, శిలాఫలక=రాతిపలకలయొక్క అనఁగా జంద్రకాంత శిలలయొక్క, పాళికా=శ్రేణిచేత, స్థాపిత=కట్టఁబడిన, సోపాన=మెట్లయొక్క, ఉపాంత = సమీపమందు, కల్పిత=రచింపఁబడిన, ఆలవాల=పాదుకలయొక్క, మూల=మొదళ్ళయందలి, సలిలసేక=నీళ్ళపోతచేత, సంవర్ధిత=వృద్ధిపొందింపఁబడిన, సేవంతికా=చేమంతులును, వాసంతికా=బండిగురువిందలును, మల్లికా=మల్లెలును, ఆది=మొదలుగాఁగలిగిన, వల్లికల=తీఁగెలయొక్క, అల్లికలకున్=అల్లుకొనిన వైఖరులకు, ఉల్లసిల్లుచున్=ఉల్లాసమునుబొందుచు, చంద్రకాంత శిలాలవాలములలో వాసంతికామల్లికాదులను నాటినీరుపోసిపెంచిరి. అవిపెరిగి పెద్దవియై తీవియలుసాగి కొనలనున్న చివురు జొంపములచే వనవిహారశ్రాంతలగు చెలువలకు విసరుచుఁ బూలతావిచే సరోవరజలమును సుగంధయుతముగను జివుళ్ళపైఁగలమంచు చినుకులచే శైత్యముగనుజేయుచుండెననియు లతలు రమణీయముగానున్నవనిభావము. అలం. ఉత్ప్రేక్ష.

పైతామహాశ్రమంబునన్ = ప్రయాగయందని యర్థము.

శ్లో. 'క్షేత్రం ప్రజాపతేః పుణ్యం సర్వేషామేవదుర్లభమ్,
లభ్యతేపుణ్యసంభారైర్నాన్యదార్థస్యరాశిభిః'

అని ప్రయాగమహిమానువర్ణనమందుఁ జెప్పఁబడియున్నది. పితామహునకు ననఁగా బ్రహ్మకాశ్రమమయిన పద్మమందనిభావము. కిరణమాలి సాహాయ్యరంజితకింజల్క కీలీకీలామధ్యంబునన్ = కిరణమాలి యనఁగా సూర్యుఁడు. అతని సాహాయ్యముచేత రంజితములైన కింజల్కములనెడు, అనఁగా బద్మకేసరములనెడు నగ్నిజ్వాలలయొక్క మధ్యప్రదేశమందలి యర్థము. నాలుగుదిక్కులను బ్రజ్వరిల్లుచున్న యగ్నిచతుష్టయము సూర్యునితోఁగూడి పంచాగ్నులగుచున్నవి గనుక నిక్కడ సూర్యసాహాయ్య రంజితకింజల్క పుంజములయొక్క మధ్యప్రదేశమును బంచాగ్ని మధ్యప్రదేశమునుగా జెప్పి

నాఁడు. పెక్కుకాలంబు నిల్చినకతంబునన్ =అనఁగాఁ బైతామహాశ్రమంబునఁ బంచాగ్ని మధ్యమందుఁ దడవుకాలము నిలిచి తపస్సుచేసినహేతువువల్ల ననియర్థము. పద్మమందుఁ గింజల్కములనడుమఁ దడవుకాలము నివసించుచున్నవనిభావము. ఆత్మమాలిన్యంబు దొరంగి=మనోమాలిన్యమును విడిచి యని యర్థము. దేహనైల్యమును బోఁగొట్టుకొని యని యర్థాంతరము. అభినవసువర్ణ తేజోవిరాజమానంబు లగు తెఱంగునన్ =సువర్ణము బ్రహ్మవర్ణముగనుక బ్రహ్మతేజోవిరాజమానములైనట్టులుగా ననియర్థము. బంగారపు కాంతివంటి కాంతిచేత విరాజమానములైనట్టులుగా ననియర్థాంతరము. తరంగిత=తెర తెరలుగా వ్యాపించుచున్న, తదీయరజః=అపద్మసంబంధమైన పరాగముయొక్క, అనుషంగ=సంపర్కముచేత, పిశంగితాంగంబులగు=పసపుచాయగాఁ జేయఁబడిన శరీరములుగలిగిన,భృంగంబులంగని యుప్పొంగుచున్ =తుమ్మెదలనుజూచి మిక్కిలి సంతోషించుచు, పద్మకింజల్కములలోఁదడవు నివసించిన కతంబున మేనిమాలిన్యముతొలంగి సువర్ణకాంతితో విరాజిల్లినటుల మేనఁబసిమిరంగుల్లసిల్ల మెలంగు తుమ్మెదలనుగాంచి గిరికయుఁ జెలిమికత్తెలుల్లసిల్లిరని భావము. అలం. రూపకసంకీర్ణమగునుత్ప్రేక్ష.

తరుణతరణి=బాలసూర్యునియొక్క, కిరణ=కిరణములనెడు, ఛద=వస్త్రములయొక్క, ఛటా =సమూహముచేత, ఆచ్ఛాదితంబును=కప్పఁబడినదియును, తపనీయవర్ణ=సువర్ణచ్ఛాయగల, కర్ణికా= మిద్దెయనెడు రథకర్ణికకు, అధివాసంబును = స్థానమైనదియును, తామ్ర కేసర = అరుణకింజల్కముల యొక్క, వ్రాత=సముదాయమనెడు, జాతరూప స్తంభ సంభార=కాంచన స్తంభ సమూహముచేత, సంభృతంబును=లెస్సగ భరింపఁబడినదియును, తటిద్రాగ=మెఱుపుతీఁగెవలె నెఱ్ఱగానున్న, పరాగ=పుప్పొడియొక్క, పరభాగ=గుణోత్కర్షము లనెడు, (ని. 'పరభాగో గుణోత్కర్షే') అని కోశము.పరంపరిత=పరంపరగా నాచరింపఁబడిన, పట్టాంబరవితాన=పట్టువస్త్రపు మేల్కట్లచేత! (ని. 'అస్త్రీవితానముల్లోచః' అని అ.) సందీపితంబును = లెస్సగాఁ బ్రకాశించుచున్నదియును, అగు=అయినట్టి, ఇందిరామహాదేవి యెక్కిన లక్ష్మీదేవి యారోహణము సేసిన, శోణారవింద స్యందనంబుక్రిందటన్ =అరుణకమలమనెడు రథముక్రింద, పటికంపుటిరుసున సంఘటించిన=స్ఫటికమయమగు నిరుసునఁ బూన్చిన, భర్మరథాంగ యుగ్మంబులభంగిన్ =సువర్ణరథచక్రములో యన్నట్టులుగా, అంగీకృత=స్వీకరింపఁబడిన, ఏక=ఒక్కటైన, మృదు=కోమలమైన, మృణాళకాండ=తామరతూఁడుచేత, మండిత=అలంకరింపఁబడిన, తుండంబులగు=చంచువులుగలిగిన, రథచరణదంపతుల=చక్రవాకమిథునములయొక్క, సొంపున కింపుమీఱుచున్ =చక్కఁదనమునకు నిష్టమువహించుచు, లక్ష్మీదేవి యెఱ్ఱతామరతేరెక్కెను. ఆ తేరునకుఁ గింజల్కసమూహము కాంచన స్తంభములు, పుప్పొడిమేల్కట్టులగుపట్టువలువలు. నోటఁ దమ్మితూడుగొనియున్న యంచజంటచక్రములు. నోటఁగల తూడిరుసు. రథకర్ణికతమ్మిగద్దియ. సూర్య కిరణములు పట్టువస్త్రములుగా నున్నవనిభావము. దానినిగాంచి యానందించిరనుట.

అలం. రూపకము.

త్రిభువన=స్వర్గమర్త్యపాతాళములయందలి, యువలోక=యౌవనపురుషసమూహముయొక్క, మోహప్రపంచ=మోహవిస్తారమనెడు ప్రపంచముయొక్క,నిర్మాణ=సృష్టియందు, చుంచుండగు=ప్రసిద్ధుఁడైన, (నిర్మాణచుంచుం డనికలిపి యర్థము వ్రాయవలెను. చుంచుండని విడఁదీసినచో 'చుంచు' అనునది ప్రత్యయ ముగావునఁ బ్రకృతినివిడచి ప్రత్యయమున కర్థముఁ జెప్పరాదు.) ('తేనవిత్తశ్చుంచుప్చణపౌ') అని ప్రసిద్ధార్థమందుఁ జుంచుప్ప్రత్యయము. పంచశరవిరించునకున్ =మన్మథుఁడనెడు బ్రహ్మ

'విరిఞ్చిః విరిఞ్చః విరిఞ్చనః' అని మూఁడువిధములుగాఁ బ్రయోగములు గలవు. పడివాగెవట్టిన=జుల్లు తీలుపట్టిన, కలధౌత=వెండితోఁ జేసిన, ఖలీనసూత్ర=కళ్లెపుత్రాడులతోడ, సంకలిత = కూడుకొన్న, కంఖాణరాజంబులై=హయశ్రేష్ఠములై, సంచలిత=సంచలించుచున్న, చంచుపుట=దొప్పలవంటి ముక్కులయందు, కంచుకిత=దట్టమైయున్న, సరసబిసఖండ=పచ్చితామరతూఁడులయొక్క, సంతాయమాన=దీర్ఘములగుచున్న, తంతు=సూత్రములచేత, సందానిత=కట్టఁబడిన, అంసంబు లగు=మూపులుగలిగినవైన, హంసంబులన్ = మరాళములను, ప్రశంసించుచున్ = కొనియాడుచును, మన్మథప్రపంచము మోహప్రపంచము, ఇతనియశ్వంబులు హంసములు అని తెలియునది. హంసము తనయంసమువఱకు వ్రేలుచున్న తమ్మితూఁడు నోటఁ గొనియుండెను. వెండికళ్లెము నోటఁబెట్టి పొడవైనకళ్లెపుఁబగ్గములు వీపుపై వైచిన మన్మథాశ్వములవలె నంచలు కనుపించుచున్నవని భావము. అలం. రూపకసంకీర్ణోత్ప్రేక్ష.

తరళ=చంచలించుచున్న, తరంగ = కరుళ్ళయొక్క, మాలికా=పంక్తులయొక్క, ఆస్ఫాలన=తాఁకుడులచేత, నటత్=కదలియాడుచున్న, కమల=పద్మములనెడు, కరపుట=దోయిలివల్లనుండి, సరయ=వేగముతోఁ గూడుకొన్నట్టులుగా, సముత్పతన=పైకెగయుటచేతను, పతన=ఎగసి తిరుగఁబడుటచేతను, బంధుర=సుందరములగుచున్న, గంధాంధ=మదాంధములైన, పుష్పంధయ=తుమ్మెదలయొక్క, స్తనంధయ=పిల్లలనెడు, దంభంబునన్=వ్యాజముచేత, జంభరిపు = ఇంద్రసంబంధమైన, శిలా=రాళ్ళచేత-అనఁగా నింద్రనీలమణులచేత, సంఘటిత=రచింపఁబడిన, ఘుటికా=గుండ్లయొక్క, వినోదంబులు సలుపు = ఆటలాడుచున్న, సరోవరలక్ష్మీ=పద్మాకర లక్ష్మియొక్క, జలభ్రమ = సలిలావర్తములనెడు, తాటంక చక్రంబులన్=చక్రాకారములైన పోజులకమ్మలయందు, తళుక్కురను=తళుక్కురని మెఱయుచున్న, తిర్యక్ప్రసారిత=అడ్డముగాఁ బ్రసరించుచున్న, కటాక్ష=క్రేగంటి చూపులయొక్క, చాకచక్యంబులపగిదిన్=చకచకాయమానములో యన్నట్టులుగా, నెగడు=ప్రకటమగుచున్న, మగబేడిసమొత్తంబుల = గండుబేడిస చేపతండములయొక్క, బిత్తరంబులు=విలాసములను, చిత్తగించుచున్ = మనస్కరించుచును, సరోవరలక్ష్మి యాడుకొను బాలిక, తరంగముల తాకిడిచేఁ గదలుతమ్మిపూ లామె కరపుటములు, అందుండి యెగురుచు వ్రాలుచున్న తుమ్మెదలు ఇంద్రనీలశిలాకల్పితములగు నచ్చనగండ్లు, ఎగసిపడుచున్న బేడిసమీలు చెవినిగల వజ్రాలకమ్మలపైఁ దళుక్కురను గడగంటి చూపులుగ నిందుఁ జెప్పఁబడెను.

అలం. రూపకసంకీర్ణోత్ప్రేక్ష.

జలాధిదేవత=సలిలాధిదేవత యనెడు దేవకాంత, తనకున్=తనకు, అఖర్వ = ఉన్నతమును, సార్వకాలిక=శాశ్వతమునైన, సర్వతోముఖ=అంతటవ్యాపించునట్టి, సమృద్ధికై=సంపదకొఱకని యర్థము. అధికమును సర్వకాలస్థితము నైన సర్వతోముఖముయొక్క అనఁగా నుదకముయొక్క సమృద్ధికొఱకని భావము. వరలక్ష్మి నావహింపఁజేసి=వరలక్ష్మీదేవిని నావ్హానముచేసి యని యర్థము. పద్మములు లక్ష్మీ దేవికి విహారస్థానములని భావము. కింజల్కపుంజరక్తాక్షతంబులున్ = పద్మకేసరములనెడి యెఱ్ఱనియక్షతలును, కీర్ణపరాగ హరి చందనంబులున్=వ్యాప్తమైన పుప్పొడియనెడు పచ్చని శ్రీచందనంబులును, కీలితాగ్రశైలపలాశంబులున్ = అంతర్నిక్షిప్తము లైనమొదళ్లు గల శైవలములనెడు, అనఁగా నాచుతీఁగెలనెడు నాకులును, క్రీడత్=విహరించుచున్న, అళి=తుమ్మెదలనెడు, ధూపధూమం

బులున్=అగరు సాంబ్రాణి ధూపములయొక్క పొగలును, పరిథవిల్లన్=ఒప్పుచుండునట్లుగా, నోమిన=నోచినట్టి, సుధాధౌత=సున్నముచేతఁ దెల్లనైన, నూతన=నవీనములైన, పూర్ణకలశంబుల=జలపూరితములైన కలశములయొక్క, సొంపుసంపాదించు=శృంగారమును గలుగఁజేయుచున్న, అనఁగా వానివలెనే యున్నట్టివనుట. ఆమంద=అతిశయమయిన, మకరంద=పూఁదేనియచేత, పూరిత=నిండింపఁబడిన, ఉదర=గర్భములుగలిగిన,దరవికస్వర=కొంచెముగా వికసించిన,దరవికస్వరములు గనుకఁ గలశములవలె నున్నవనిచెప్పినాఁడు. అటువంటి, పుండరీక షండంబుల=శ్వేతపద్మసమూహములయొక్క, మెండునకున్=బాహుళ్యమునకు, నిండువేడుక నెరపుచున్ = పూర్ణోత్సాహమును బ్రకటించుచు, కొంచెమువిచ్చి తేనెనిండిన తామరపూవులు జలదేవత లక్ష్మి నాహ్వానముఁ జేసి పూజించుపాత్రములటులున్నవనియుఁ గింజల్కము లక్షతలవలెను,పరాగము గందమువలెను, నాచు పాత్రాంతమందుంచిన యాకులవలెను, తుమ్మెదలు ధూపమువలెను, లోని తేనియ పాత్రాంతరమునగల జలమువలెను నుండెనని భావము. అలం. రూపకసంకీర్ణ నిదర్శన.

చంచరీకకుటుంబినీ=ఆఁడుతుమ్మెదలయొక్క, ఝుంకార=ఝుంకారములనెడు, మంగళ సంగీత నాదంబులతోన్=మంగళార్థకములైన సంగీతరవములతోడను, చలాచల = చలితములైన, క్రౌంచ=కొంగలయొక్కయు, కారండవ=కన్నెరేడు పులుగులయొక్కయు, మండలీ=సమూహములయొక్క, పక్ష=ఱెక్కలయొక్క, పటపటత్కార=పటపట యను ధ్వనులనెడు, పటహారవంబులతోన్=తప్పెటలయొక్క నాదములతోడను, చపలతర=మిక్కిలి చలించుచున్న, తరంగ=కెరటములనెడు, భుజ=హస్తములచేత, ఉత్క్షిప్త=ఎగఁజల్లఁబడుచున్న, శీకర=తుంపురులనెడు, ఆచారలాజంబులతోన్=మంగళాచారలాజములతోడను, ఇందుకు, (శ్లో. 'ఆచారలాజైరివ పౌరకన్యాః') అని రఘువంశమందుఁ బ్రయోగము. లాజములనఁగా వరిపేలాలు. విహారదీర్ఘిక = క్రీడాసరోవరము, అనతిదూరమ్మునన్=సమీపమందు, వచ్చు=వచ్చుచున్న, తమ్ము నెదుర్కొనన్=తమ్ము నెదురుకొనెడుకొఱకు, కక్ష్యాంతరంబులు గడచి యేతెంచుసొంపుదెలుపు=బలవంతులయొక్క యంతరములు దాఁటివచ్చునట్టి యొయ్యారము గనుపఱుచుచున్న, కక్ష్యయనఁగా బవంతి. (ని. 'కక్ష్యా ప్రకోష్ఠే హర్మ్యాదేః' అని అ.) నిజ=తమయొక్క, వదన=ముఖములనెడు,చంద్ర=చంద్రులయొక్క,చంద్రికా=వెన్నెలచేత, ఆవృత=ఆవరింపఁబడిన, ప్రతీర చంద్రకాంత=తీరమందలి చంద్రకాంతమణులవల్ల,(ని. 'కూలం రోధశ్చ తీరఞ్చ ప్రతీరఞ్చ తటం త్రిషు' అని అ.) జాత=పుట్టిన, నూతన=నవీనములయిన, స్రోతః=జలప్రవాహములయొక్క, భరంబుల=అతిశయములయొక్క, ఉబ్బునకున్ = హెచ్చునకు, అబ్బురపాటు దొరయుచున్=ఆశ్చర్యమును బొందుచు, పొలఁతుకల మోము జాబిల్లిచలువచే సరోవరపుగట్టునఁగల చంద్రకాంతశిలలనుండి నీరుబుకుట చెలువల నెదుర్కొనవచ్చునట్లుగను, తేటిమ్రోఁతలు సన్నాయిగను పక్షరవములు మద్దెలలుగను, దరంగములనుండి లేచుతుంపురులు లాజములుగను నుండి స్వాగతవస్తుసంతతివలె నలరెనని భావము. ముఖచంద్రునివలనఁ జంద్రకాంతశిలలు స్రవించుట, కలువలు వికసించుట లోనగునవి కవిసమయసిద్ధములు.

అలం. రూపకసంకీర్ణోత్ప్రేక్ష.

మఱియుఁ దత్త్వాసారంబు=మఱియు నాకొలను, అపరిమిత=మితములేని, పాండు=పాండురాజసంబంధులైన యుధిష్ఠిరప్రభృతులయొక్క, పక్ష=బలముచేత, విశేష భూషితంబుగావునన్=మిక్కి

లీయు నలంకరింపఁ బడినది గనుక, ప్రదర్శిత=కనుపఱుపఁబడిన, ధార్తరాష్ట్ర=దుర్యోధనాదులయొక్క, ముఖశ్యామికంబై=ముఖవైవర్ణ్యము గలదై యని యర్థము. పాండుపక్షములనఁగాఁ దెల్లనెక్కలుగలహంసలు, (ని. 'హంసాస్తు శ్వేతగరుతః' అని అ.) ధార్తరాష్ట్రములనఁగా మిక్కిలినల్లనైన ముక్కులును బాదములునుగల హంసలు, (ని. 'ధార్తరాష్ట్రాస్సితేతరైః' అని అ.) కాఁబట్టి యపరిమితములైన హంసవిశేషములచేత శోభితమైనదియు ధార్తరాష్ట్రములనెడు హంసలయొక్క చంచుచరణ నైల్యముగలదియునని భావము. శ్లేషమూలక కావ్యలింగాలంకారము. బహుల = అపరిమితములయిన, హరివిలాస = నారాయణునియొక్క విలాసములచేత, భాసురంబు గావునన్ = ప్రకాశమాన మయినదిగనుక, ప్రథమాన=ప్రసిద్ధమగుచున్న, మీనకూర్మాద్యవతారధారకంబై=మత్స్యకూర్మాద్యవతారయుక్తమయినదై యనియర్థము. బహు=అనేకములయిన, లహరి=మహత్తరంగములయొక్క, విలాసభాసురంబు=విలాసముచేతఁ బ్రకాశమానమయినదియును, మత్స్యకూర్మాదిజలజంతువులయొక్క, యావిర్భావములచేత ధారాళమయినదియు నని భావము. ఊర్మిళాభాసమానంబు గావున లక్ష్మణోపభోగభవనంబై=ఊర్మిళయనఁగా లక్ష్మణునిభార్య. ఊర్మిళాదేవితోడఁ బ్రకాశమానమయినది గనుక లక్ష్మణునకుఁ గేళీగృహమయినదై యని యర్థము. ఊర్మి = తరంగములయొక్క, లాభ=ప్రాప్తితోడ, అసమానంబు=అసమానమయినదియు, లక్ష్మణా=ఆఁడుబెగ్గురుపక్షులకు, ఉపభోగభవనంబై=భోగార్హమయినదియునని భావము. లక్ష్మణాశబ్దము సారసములనెడు పేరుగల బెగ్గురుపక్షులయొక్క యాఁడుపక్షులకుఁ బేరు. (ని. 'హంసస్యయోషి ద్వరటా సారసస్య తు లక్ష్మణా' అని అ.) మానసజయమహనీయంబుగావునన్=మనోజయముచేత మహనీయమయినది గనుక, అంతరున్మీలిత=అంతర్భిన్నమయిన, నాళికోపరి=షట్కములోపరిస్థితమయినట్టి, ఇక్కడ నాళికశబ్దము కమలపరము. వికస్వర కమలకర్ణికా=సహస్రారపద్మ కర్ణికాకార చంద్రమండలమువల్లనుండి, నిర్నిరోధ=నిరర్గళమగునట్టులుగా, బోధ=ఉద్భవమయిన, మాధురీ=సుధామాధురికి, ధురీణంబై = ధురంధర మయినదై యని యర్థము. ఈ యర్థము సాంబభుజంగమందుఁ జెప్పఁబడినది.

శ్లో. 'తమోమోచకై రేచకైః పూరకాద్యై స్సముద్దీపితాధారపీఠ్యబ్జషట్కైః,
హతాల్లంబికారాజయోగప్రభావా ల్లుఠత్కుండలివ్యక్తముక్తావకాశామ్,
సహస్రారపద్మస్థితాపారవారాం సుధామాధురీం సాధురీత్యాపిబద్భిః.'

అని సాంబభుజంగమునఁ గలదు గనుక నీశ్లోకార్థ మనుసంధింపవలయును. మానససరోవరజయముచేత మహనీయమయినదియు నంతరున్మీలితనాళికములును అనఁగా లోపల నుత్పన్నమగుచున్న నాళములును, ఇక్కడ నాళికశబ్దము నాళపరము. ఉపరివికస్వరకమల=ఉపరిభాగమందు వికసించుచున్న కమలములును, కర్ణికానిర్నిరోధబోధమాధురి యనఁగా, కమలములయందలి మిద్దెలయొక్క నిరోధాభావమయిన వికాసమును, వీనికి, ధురీణంబు అనఁగా భారవాహియైనదియుఁ నని భావము. మధురసంబంధమయినది మాధురి, మాధురియనఁగా నిక్కడ మనోహరత్వమని తెలియవలయును. రాణించుటకున్=ఈలాగంటివై యొప్పుటకు, ఉదంచితరోమాంచ=ఉత్కృష్టమయిన గగ్గురుపాటుచేత, కంచుకిత=వ్యాప్తములయిన, దేహలై = శరీరముగలవారై, అప్సరారోహలు=అప్సరస్త్రీలు, ముదంబునన్=సంతోషముచేత, తదంబుఖేలనాయత్తలై=ఆసరోవరజలక్రీడాధీనములైన మానసములు గలవారై, ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

సీ. తనయిల్లు దామర♦తంపమై మెఱయ సంపన్నలినాక్షి గా♦పున్నచోటు
వలరాజు ముజ్జగం♦బులు గెల్చి దర్ప మేర్పడ నిజాంకశరంబు ♦ లిడినచోటు
వలిగాలి పన్నగా♦వలిగాహితగరాగ్ని ఘోరసంజ్వరము వీ♦డ్కొనినచోటు
తొగకొమ్మదమిగ్రమ్మఁ♦దగురాజుకరమంటి యెండకన్నెఱుఁగక♦యెసఁగుచోటు
తే. ఇందుముఖులార యిది సుఁడీ ♦ యిందుఁ గ్రుంకి
మదనుఁ బూజింపఁ గోర్కులు ♦ పొదలు ననుచుఁ
దొడవు లటు వెట్టి వలిపెపా♦వడలు గట్టి
శృంగములు వట్టి నీరాడఁ ♦ జేరునపుడు. 155

తనయిల్లు దామరతంపమై మెఱయన్ = తనయొక్క యిల్లు పుత్రపౌత్రాభివృద్ధి గలదై ప్రకాశించునట్లుగా, సంపన్నలినాక్షి(సంపత్ +నలినాక్షి)=లక్ష్మీదేవి, కాపున్నచోటు=కాపురమున్న స్థలము అని యర్థము. తామర యిల్లుగాఁ గలదైయున్నదని భావము. అభివృద్ధి విషయమై తామరతంపమనుట లోకోక్తి.అర్థద్వయమునకు నభేదాధ్యవసాయము. తనయిల్లు దామర తంపమై మెఱయ నని చెప్పుటచేత నభివృద్ధికరత్వంబును సంపన్నలినాక్షి కాపున్నదని చెప్పుటచేత నిశ్చలసంపత్ప్రదత్వంబును జోటునకుఁ దెలియఁ బడుచున్నది. వలరాజు=మన్మథుఁడు, ముజ్జగంబులు గెల్చి = మూఁడు లోకములను జయించి, దర్పమేర్పడన్=గర్వము తేటపడునట్లుగా, నిజాంకశరంబు లిడినచోటు = అంక మనఁగా ధ్వజంబును, శరములనఁగా బాణములును గనుకఁ దనయొక్క ధ్వజబాణములను బెట్టియుంచిన స్థలమని యర్థము. మీనములును బద్మములును గలిగియున్నదనిభావము. త్రిభువనజయసాధనాశ్రయత్వము చోటునకుఁ దెలియఁబడుచున్నది. వలిగాలి=చల్లగాలి-అనఁగా మలయమారుతము, పన్నగావలి = మలయాచలమందలి సర్పసమూహమువల్ల, గాహిత = ప్రవేశించిన, గరాగ్ని = విషానలముయొక్క, ఘోర=భయంకరమయిన, సంజ్వరము=సంతాపమును, వీడ్కొనిన చోటు=పోఁగొట్టుకొనిన స్థలమని యర్థము. శీతలోదకములు గలదని భావము. ఉపద్రవనివర్తకత్వము చోటునకుఁ దెలియఁబడుచున్నది. తొగకొమ్మ=కుముదినీకాంత, తమిగ్రమ్మన్=తమకము గ్రమ్మఁగా, తగురాజుకరమంటి=తగినరాజుయొక్క పాణిగ్రహణమువడసి, ఎండకన్నెఱుఁగక యెసఁగుచోటు=కష్టలేశమును గుర్తెఱుఁగక యొప్పుచున్న స్థలమని యర్థము. తమిగ్రమ్మన్=రాత్రికాఁగానే, తగురాజు కరమంటి =యుక్తుఁడైన చంద్రునియొక్క కిరణస్పర్శగలదై,ఎండకన్నెఱుఁగక యెసఁగు=సూర్యరశ్మిని గుర్తెఱుఁగక యున్నదని భావము.తగురాజుకరమంటియని చెప్పుటచేత శుభహేతుత్వంబును, ఎండకన్నెఱుఁగక యెసఁగుట యని చెప్పుటచేత సుఖసంపాదకత్వమును జోటునకుఁ దెలియఁ బడుచున్నది.

ఇందుముఖులార యిదిసుఁడీ=ఓచెలులారా యీపైనిఁ జెప్పఁబడిన గుణములుగల స్థలమిసుండీ యిది, ఇందుఁగ్రుంకి=ఈకొలనులో స్నానముచేసి, మదనుఁ బూజింపఁ గోర్కులు పొదలు ననుచున్=మన్మథునిఁబూజింపఁగాఁ గోరికలు సిద్ధించునని యొకరికొకరు చెప్పుకొనుచు, తొడవులటువెట్టి = ఆభరణములు తీసి యొక్కచోటనుంచి, వలిపెపావడలుగట్టి=సన్నపుబట్టలుదొడిగి, శృంగములువట్టి=చిమ్మనఁగోవులుచేతఁబట్టుకొని, నీరాడఁజేరునపుడు=జలక్రీడసలుపునిమిత్తమై చేరినసమయమందు.

లక్ష్మీగృహము తామరతంపరయగుటయుం వలరాజు మూఁడులోకములు గెలుచుటయుం, వలిగాలి ఘోరసంజ్వరము తొలంగుటయుఁ గలువకన్నె యెండయెఱుంగక బ్రతుకుటయుం సరోవర

ప్రశస్తిహేతువులు. ఇన్నియు మదనప్రీతికరములె గాన మన్మథపూజార్థ మిందు స్నానముచేయుట యొప్పియున్నదని భావము. అలం. అతిశయోక్తి. కావ్యలింగము.

చ. కరముల మూఁపు లూఁదుకొని • కన్నెలు చన్నులబంటి నొండొరుల్
బరిగొని నిల్వఁ దత్పరిధి • ప్రాంశుదృగంశుకలాపపూరితాం
తర మయి పొల్చె భావభవ • దైవతభావిత హేమకుంభసం
భరితమృణాళమండలిత • పద్మమయప్లవమండలం బనన్. 156

కరములమూఁపులూఁదుకొని=హస్తములచేత భుజములుపట్టుకొని, కన్నెలు=పడుచులందఱును, చన్నులబంటిన్=కుచములపర్యంతమైన నీటియందు, ఒండొరు ల్బరికొనినిల్వన్=పరస్పరమును జుట్టురాఁ దిరిగినిలువఁగా, తత్పరిధి = ఆకన్నెలయొక్క పరివేషాకారమండలము, ప్రాంశు=హెచ్చైన, దృగంశు కలాప=నేత్రకాంతి స్తోమముచేత; పూరిత=నిండింపఁబడిన, అంతరమయి=మధ్యప్రదేశము గలదై, భావభవ=మన్మథుఁడనెడు, దైవత=దేవునికొఱకు, భావిత=కల్పింపఁబడిన, హేమకుంభసంభరిత=సువర్ణకుంభములచేత లెస్సఁగా భరింపఁబడినదియు, మృణాలమండలిత = తామరతూఁడులచేత మండలాకారముఁ జేయఁబడినదియునగు, పద్మమయప్లవ=తామరపువ్వుల తెప్పయొక్క, మండలం బనన్=వలయమో యన్నట్టులుగా, పొల్చెన్=ప్రకాశించెను.

ఇక్కడఁ గుచయుక్తమైనదియు భుజావలయిత మయినదియునగు మండల మధ్యప్రదేశమందుఁ బ్రసరించిన నేత్రకాంతిస్తోమమును హేమకుంభ సంభరితంబును మృణాళమండలితము నైన మండలాకార పద్మపల్లవమునుగా నుత్ప్రేక్షించినాఁడు. బరియనెడు పదమందలి రేఫము శకటరేఫ మని సంశయింపఁ జనదు. గుబ్బలు పయికిఁ గానుపింపఁ జెలులు చక్రాకారముగా నీటిలోఁ దిరుగ సాగిరి. వారిగుబ్బలు కుండలవలెను, వారిచూపులు పద్మములవలెనుంటచేఁ దెప్పయుత్సవమునాఁటి పడవలవలెఁ జెలులు కాన్పించిరి. కాని జరుగవలసినది భావభవుని తెప్పయుత్సవము గాన గుబ్బలు తమ్మిమొగ్గలవలెను జూపులు తమ్మితూడులవలెనుండి వానితోఁ గట్టిన పడవవలె వారియునికి యుండెనని భావము. అలం. ఉత్ప్రేక్ష.

చ. నెలఁతలు బంతి గట్టుకొని • నీరెగఁ జల్లఁ దదీయమంజులాం
జలికలితోదకం బెగయు • జాడ నుతింపఁగ నయ్యెఁ దత్కుచాం
చలజఘనాభిఘాతములు • సైఁచక మ్రోయుచుఁ బద్మయుక్తమై
కొలను సరోజబాంధవున • కున్ మొఱ వెట్టఁగ నేగుకైవడిన్. 157

నెలఁతలు బంతిగట్టుకొని=స్త్రీలు చుట్టుకైవారముగాఁ బంక్తిగట్టుకొని, నీరెగఁజల్లన్=నీరుపై నెగఁజల్లఁగా, తదీయ=స్త్రీలసంబంధమైన, మంజుల=మనోహరములైన, అంజలి=దోసిళ్లయందు, కలిత=ఒప్పుచున్న, ఉదకంబు=నీరు, ఎగయుజాడ=ఎగసెడురీతి, నుతింపఁగనయ్యెన్=కొనియాడఁ దగియుండెను. ఏలాగుననినన, తత్=ఆస్త్రీలయొక్క, కుచాంచల=స్తనాగ్రములయొక్కయు, జఘన=కటిపురోభాగములయొక్కయు, అభిఘాతములు=తాఁకుడుదెబ్బలను, సైఁచక=సహింపలేక, మ్రోయుచున్=ధ్వనిసేయుచు, పద్మయుక్తమై=కమలములతోఁ గూడుకొన్నదై, కొలను=సరోవరము, సరోజబాంధవునకు న్మొఱవెట్టఁగ నేగుకైవడిన్=కమలములకాప్తుఁడైన సూర్యునకు మొఱపెట్టుకొనుటకొఱకుఁ బోవుచున్నదో యన్నట్టులుగా, నుతింపఁగనయ్యె నని సంబంధము.

ఇక్కడ నంజలియుక్తములైన సరోవరసలిలములయొక్క సముత్పతనమును సరోజయుక్తమయిన సరోవరము సరోజబాంధవునితో మొఱచెప్పఁబోవుటగా నుత్ప్రేక్షించినాఁడు. అనఁగా సరోవరము దనయందుఁ బుట్టిన సరోజములతోఁగూడుకొని యాసరోజములకు బాంధవుఁడైన సూర్యుని యొద్దకు మొఱవెట్టఁ బోవునట్లుండెననుట. నెలఁతలు బంతిగట్టుకొని కుచాంచలాభిఘాతములు జఘనాభిఘాతములొనర్చుట దుస్సహమయ్యెను. కాన మ్రోయుటయే మొఱపెట్టుకొనుట. పద్మములతోఁ గలసి సరోవరము మొఱపెట్టుకొననేగుట పద్మబాంధవుని సహాయము బడయుటకు. అనఁగా సరోవరమందు సతులు జలక్రీడఁగావింప జలము కల్లోలమయ్యెననియు వినోదమునకై సతులు జలమెగఁజిమ్ముచు జలక్రీడలు గావించిరనియు భావము. అలం. ఉత్ప్రేక్ష.

మ. చిగురుంజిమ్మనగ్రోవిలో నొకతె రా◆జీవాసవం బుంచి పై
నిగిడింపన్ గమకింప నొక్కనవలా◆నెమ్మోము వేఁ ద్రిప్పిన
న్జగజంపై నెఱిగుంపు గప్పుకొనియె ◆ న్దత్క్షిప్తమాధ్వీరసం
బు గొనం బంచినచంచరీకపృతనా◆పుంజంబుచందంబునన్. 158

చిగురుంజిమ్మన గ్రోవిలోన్=చిగురుటాకులచేత రచింపఁబడిన చిమ్మనగొట్టములో, ఒకతె=ఒకస్త్రీ, రాజీవాసవంబుంచి=పద్మసంబంధమైన మకరందమునునింపి, పైనిగిడింపన్ గమకింపన్=పైనఁ జిమ్ముట కుద్యుక్తపడఁగా, ఒకనవలా=ఒకస్త్రీ, నెమ్మోము వేఁ ద్రిప్పినన్=ముఖమును శీఘ్రముగా నవతలికి మళ్లింపఁగా, జగజంపై నెఱిగుంపు = సొగసుమించి తలవెండ్రుకల యొక్క గుంపు, కప్పుకొనియెన్=ముఖమును గ్రమ్ముకొనియెను. అనఁగా ముఖము ద్రిప్పఁగానే కొప్పువీడి వెండ్రుకలు పరవంజె నని యర్థము. ఏలాగనిన, తత్ = ఆమొదటిస్త్రీచేత, క్షిప్త=చిమ్మఁబడిన, మాధ్వీరసంబు=మకరందమును, కొనన్=హరించుకొఱకు, పంచిన=పంపఁబడిన, చంచరీక పృతనాపుంజంబు చందంబునన్=భ్రమర సేనాసమూహమో యన్నట్లులుగా కప్పుకొనియె నని సంబంధము.

నెఱిగుంపుసొంపు నెఱపెన్ అని సోమకవిపాఠము. అనఁగాఁ గొప్పువీడ్చి వెండ్రుకలఁబఱచె ననుట. పెన్నెఱిజగజంపు (మిక్కిలిజంపు)గానుంటవలనఁ జంచరీకములనక చంచరీకపృతనాపుంజమని చెప్పఁబడెను. తుమ్మెదసేనలగుంపులు గానఁ జివురాకుగ్రోవిలోనితేనెఁ గ్రోలుట సామాన్యకార్యమె. అలం. ఉత్ప్రేక్ష.

ఉ. కొందఱుమందగాములుల◆కోమలపాణితలంబు లొక్కయిం
దిందిరనీలవేణితెలి◆నెమ్మొగ మంబుల ముంచునొప్పు నె
న్నం దగుఁ దావుబల్మి నలి◆నమ్ములు దొమ్ములు గూడి క్రమ్మి పూ
ర్ణేందుని మున్ను గొన్నరుచు ◆ లిమ్మని నీటికిఁ దార్చుకై వడిన్. 159

కొందఱు మందగాములుల=కొంతమంది స్త్రీలయొక్క, కోమలపాణితలంబులు = మృదువైన హస్తతలములు, ఒక్కయిందిందిరనీలవేణి=ఒకానొక స్త్రీయొక్క, తెలినెమ్మొగము=తేటగల చక్కని ముఖమును, అంబులన్ ముంచునొప్పున్=జలములయందు ముంచుచున్న సొగసును, ఎన్నందగున్=కొనియాడఁదగును. ఏలాగనిన, తావుబల్మిన్=స్థానబలముచేత, నలినమ్ములు=కమలములు, దొమ్ములుగూడి క్రమ్మి=దొమ్మిచేసిచుట్టుకొని, పూర్ణేందునిన్=సంపూర్ణచంద్రుని, ఇక్కడ ముఖచంద్రునని

భావము. మున్నుగొన్నరుచులిమ్మని=మునుపుతీసికొన్న కాంతులను-అనఁగా రాత్రిహరించినమాయొక్క శోభల నిమ్మని, నీటికిఁ దార్చుకై వడిన్=నీళ్లలోకిఁ బడలాగుచున్నవో యన్నట్టులుగా ఎన్నఁదగునని సంబంధము. ఇక్కడ స్త్రీలయొక్క హస్తతలములకును మఱియొక్క స్త్రీయొక్క ముఖమునకును బూర్ణచంద్రునకును నుపమేయోపమానభావ మని గ్రహింపవలయును.

పలువురు చెలువలు కరములసాచి యొకచెలువమోమును నీటిలో ముంచసాగిరి. ఇది స్థానబలముచేఁ దామరపూవులు దొమ్మిచేసి తమ్ము ముకుళింపఁజేసి కాంతిగొనిన పూర్ణచంద్రునిఁ దొల్లిఁటి కాంతు లిమ్మని నీటిలోనికిఁ బడలాగుచున్నటులుండెను. అలం. ఉత్ప్రేక్ష. సమాసోక్తి.

ఉ. బంగరుకొమ్ము పూని యొక • ప్రౌఢ రయంబున నీరు చల్ల ము
గ్ధాంగన యోర్తు వక్త్రకిర • ణాప్తిఁ గరంగెడుచంద్రకాంతపున్
శృంగము పూని దాని గెలి • చెన్ వెస నక్షయకాండలబ్ధి ను
ప్పొంగరె రాజరత్నపరి • పూర్ణబలంబున నెట్టివారలున్. 160

ఒక ప్రౌఢ=ఒకప్రగల్భయైనస్త్రీ, బంగరుకొమ్ముపూని=బంగారపుచిమ్మనగ్రోవిఁ బట్టి, రయంబున నీరుచల్లన్=వేగముగా నీళ్లుచిమ్ముచుండఁగా, ముగ్ధాంగనయోర్తు=ఒక ముద్దరాలైనస్త్రీ, వక్త్రకిరణాప్తిఁగరంగెడు=ముఖకాంతి వ్యాప్తిచేతఁ గరఁగి నీరగుచుండెడు, చంద్రకాంతపున్ శృంగముపూని=చంద్రకాంతమణి కల్పితమైన చిమ్మనగ్రోవిఁబట్టి, దానిగెలిచెన్=తనమీఁద నీరుచల్లుచున్న ప్రౌఢ స్త్రీనిజయించెను. ఇక్కడ వక్త్రమందుఁ జంద్రభ్రాంతిని జెప్పవలయును. ఎట్టివారలున్=ఎటువంటివారైనను-అనఁగాఁ బ్రౌఢిమ చాలనివారైనను, రాజరత్న పరిపూర్ణబలంబునన్=రాజశ్రేష్ఠునియొక్క పరిపూర్ణబలముచేతనైన, అక్షయకాండలబ్ధిన్ = అక్షయబాణలాభముచేత, వెసన్ = శీఘ్రముగా, ఉప్పొంగరె=ఉత్సాహమును బొందరా యేమి యని యర్థము. రాజనఁగాఁ జంద్రుఁడు, రాజరత్నమనఁగాఁ జంద్రకాంతమణి, దానియొక్క పరిపూర్ణబలముచేతనైన యక్షయకాండలబ్ధి ననఁగా నక్షీణోదక లాభముచేత నుప్పొంగదా యనిభావము.

చంద్రకాంతపున్ శృంగము అన్నచోట 'సమానేషు నుమ్యోచ్చతః' అనెడు శబ్దానుశాసన సూత్రమందలి 'సమానేషు' అనెడు బహువచనముచేతఁ బుంప్వాది వికారమునకంటెఁ బరంబుగ నుమాగమమువచ్చునని యర్థము. కనుక నిక్కడఁ జంద్రకాంతపున్ శృంగమని నుమాగమము వచ్చినది. కరంగుకురంగభృన్మణిశృంగమని సోమకవిపాఠము. ఇం దిట్టి సందియమున కెడములేదుగాని ప్రత్యంతరములలో నీపాఠము గానరామి నిది సోమకవికల్పితమేమోయని తోఁచెడిని. ప్రౌఢతొలుత బంగరుక్రోవితో నీరు ముగ్ధపై రయంబునఁ జల్లెను. ముగ్ధ చంద్రకాంతశృంగముతో మరల నీరు జిమ్మ మొదలిడెను. సువర్ణశృంగము నీటముంచుట తీయుటతో నాలస్యము జరుగ ముగ్ధ ముఖచంద్ర సహాయమునఁ దనశృంగము నక్షయకాండలబ్ధిగ నొనర్చి జయించెను. ముగ్ధగెలుచుటకుఁ గారణము రాజరత్నము. అలం. సమాధి. అర్థాంతరన్యాసము.

ఉ. హాసవిలాసచంద్రికల • కబ్జిని మోము ముడుంచు దీని కు
ద్భాసిరమావలేపము గ • దా యని యోర్తు దళప్రకాండము

ల్గాసిలఁ జేసి కైకొనియెఁ • గర్ణికఁ దత్కమలాధివాససిం
హాసనముం హరించి నిజ•హస్తగతంబుగఁ జేయుచాడ్పునన్. 161

ఓర్తు=ఒకవనిత, హాసవిలాసచంద్రికలకున్=నాయొక్క చంద్రికాసదృశమయిన నవ్వుయొక్క విలాసములకు, అబ్జిని మోము ముడుంచున్=కమలము ముఖము ముడిచిపెట్టుచున్నది-అనఁగా సహింపకయున్నదనుట. దీనికిన్=ఈకమలమునకు, ఉద్భాసి=మిక్కిలి ప్రకాశించుచున్న, రమా=సంపద్విషయమయిన, అవలేపముగదాయని=గర్వముగదా యని యర్థము. కమలము లక్ష్మీస్థానమని భావము. ఓర్తు=ఒకస్త్రీ, దళప్రకాండముల్గాసిలఁజేసి=దళములనఁగాఁ దామరరేకులును సేనలును, శ్రేష్ఠమయిన రేకులనెడు సేనాసమూహములు గాసిపడునట్లుచేసి, తత్కమలాధివాససింహాసనమున్ హరించి నిజహస్తగతంబుగఁ జేయుచాడ్పునన్=ఆలక్ష్మీవాసమయిన సింహాసనమును దీసికొని తనహస్తగతము చేసికొన్నట్టులుగా, కైకొనియెఁ గర్ణిక=ఆకమలమందలి మిద్దె చేతిలోకిఁ దీసికొనెను. తమ్మిపూవు చెలుల నగవు వెన్నెలఁగాంచి యోరువక మూతి ముడుచుచున్నది. దీనికి రమావలేపముగలదని కినుకనొంది యొకచెలి దళములుగిల్లి కమలాసింహాసనమును వశపఱచికొనినటుల తమ్మిలోనిగద్దియఁ జేకొనెను. అలం. ఉత్ప్రేక్ష. సమాసోక్తి.

శా.ఓలోలాంబక యోలు యోల యన నో•లో లంచు మేలంబునన్
లో లంబాలక యోర్తు గ్రుంకి బిసవ•ల్లుల్ద్రుస్సి తూఁటాడి కెం
గేలం బట్టె తటాలునన్ నెగసె న•క్షీణాంబునాథాంబుజా
క్షీలోకంబు జయించి వారలయశ•శ్శ్రీఁ దెచ్చుచందంబునన్. 162

ఓలోలాంబక=చంచలనేత్రములుగల యోచెలియా, ఓలంబాలకయని పాఠాంతరముగలదు. ఆపక్షమున, లంబ=వ్రేలుచున్న, అలక=ముంగురులుగల యోచెలియాయని యర్థమగుచున్నది. ఓల యోలయనన్=మీఁద నీరుచల్లుచు ఓలయోలయని యొకస్త్రీచెప్పఁగా, ఓలోలంచుమేలంబునన్= ఓలయోలయని తిరిగిపలుకుచుఁ గోడిగముచేత, లోలంబాలకయోర్తు=లోపలవ్రేలుచున్న ముంగురులు గలయొక్క స్త్రీ, రలయోరభేదః అని యున్నది గనుక లోలంబాలక రోలంబాలక యగును. అనఁగాఁ దుమ్మెదలవంటి ముంగురులుగల స్త్రీయని యయినను జెప్పవచ్చును. ని. 'ఇందిందిర శ్చంచరీకో రోలంబో ఋంభరోపిచ' అని అ. రోలంబాలకయనెడు అహోబలపత్యంగీకృతపాఠమందును దుమ్మెదలవంటి ముంగురులుగల యొకస్త్రీయని యర్థము. గ్రుంకి=నీటిలోమునిఁగి, బిసవల్లుల్ద్రుస్సితూఁటాడి= తామరతూండ్లను ద్రుంచి తునుకలుచేసి, కెంగేలంబట్టె=చేతఁబట్టుకొని, తటాలునన్నెగసెన్=గుప్పునఁ బైకిలేచెను. ఏలాగనిన, అక్షీణ=సంపూర్ణమయిన, అంబునాథ=జలాధినాథుఁడైన వరుణునియొక్క, అంబుజాక్షీ లోకంబున్=స్త్రీజనసమూహమును, జయించి=సౌందర్యముచేత గెలిచి, వారల యశశ్శ్రీఁ దెచ్చుచందంబునన్=వారియొక్క కీర్తిసంపదను దీసికొని వచ్చినట్టులుగా, తటాలున నెగసె నని సంబంధము. తటాలున న్నెగసె నన్నచోట నెగసె ననెడిపదము నకారాదిపదమేకాని స్వరాది పదముగాదని గ్రహింపవలయును.

ఈపద్యమునందలి రెండవచరణము మొదట రోలంబాలక యను నహోబలపత్యంగీకృతపాఠమయుక్తము. రేఫమునకును ళకారమునకును విశ్రమము చెల్లదు గనుక లోలంబాలక యనెడి పాఠమే

సాధువు. లోపలి లంబాలకయని యర్థము. అని యీరీతిగాఁ గాకునూర్యప్పకవివర్యుండు చెప్పినాఁడు. దీని సమ్మతింపక యహోబలపతి వ్రాసినదియేమనిన, రేఫలకారముల కభేదము గనుక విశ్రమము చెల్లుచున్నదనియు నిది చెల్లదని యప్పకవి విచారింపక చెప్పినాఁడనియు, 'రాయంచకాళ్లదౌలకయమున్నె' అనునది మొదలుగాఁగల యీకవిప్రయోగములు సాధువులయి యున్నవనియును వ్రాసినాఁడుగాని తవులుట యనెడుచోటఁ దౌలుట యనునటులుగా వక్రతమమువచ్చుటచే నాకరమేమో తెలియఁజేయఁడయ్యె. శ్లో, 'అయిగవుగాదేశౌ స్తఃక్రమేణ సర్వత్ర వక్రతమయోర్వా' అనెడు సూత్రముచేత వచ్చినదని చెప్పెడుపక్షమందు నాసూత్రార్థము స్వభావసిద్ధమయిన వక్రతమములకు అయి అవు అనెడు నాదేశములు వికల్పము గావచ్చునని యున్నదేకాని యీలాటి వ్యస్తవర్ణములకు వక్రతమాదేశము వచ్చునని యుండలేదు గనుకను రాయంచకాళ్లఁ దౌలకయమున్నె అనెడు వాక్యమునకు కలహంసకాళ్ళఁ దవులకమున్నెయని పాఠభేదమును నున్నదిగనుకను రేఫలకారములకు విశ్రమము భారతాది మహాకవి ప్రబంధములయం దెక్కడను గనుపడలేదుగనుక లోలంబాలక యనెడు పాఠమే సాధువని విచారింపఁ దగియున్నది. లోలంబాలక యనియే రామరాజభూషణకవిహృదయమని తోఁచుచున్నది. విద్వజ్జనరంజనీ వ్యాఖ్యాత యగుసోమకవియు నిట్టే వ్యాఖ్యానము వ్రాసెను. రేఫలకు డవర్ణములో యతిప్రాసములమైత్రి నెఱపుట యాధునిక కావ్యములలోఁ గ్వాచిత్కముగాఁ గలదు.

"లలి నొకటీశుఁ జూపఁగఁ దర్థంబె" చమత్కారమంజరి.

తౌలు అనురూపమునకుఁ బ్రయోగములు కానరావు కాని రాఘవపాండవీయమున నీక్రింది ప్రయోగముగలదు.

"సుస్థిరుని నుమావిభుండనుమతిన్ వెనుదౌలెద మాదరంబునన్."

ఇట్టిప్రయోగములు తఱచుగాఁగానరామిచేఁ గవ్యభిప్రాయ మిదియనుటకిది తోడ్పడఁజాలదు.
అలం. ఉత్ప్రేక్ష.

సీ. కేలఁ దమ్మి ఘటించి ♦ పాలమున్నీటిలోఁ బొడమినజవరాలిఁ♦బోలె నొకతె
యమలమృణాళనా♦ళాక్షసూత్రముఁ బాణిఁ గీలించి యజురాణిఁ♦బోలె నొకతె
వెలిదమ్మిఱేకువే♦నలి నంట లేనెలపువ్వుఁ దాల్చుభవానిఁ♦బోలె నొకతె
కలువపుప్పొడి రాల్చి♦కాయజాస్త్రములతుప్పాలుడుల్చురతిదేవిఁ♦బోలె నొకతె
తే. సారకాసారసాగర♦జనితజలజ
కుండమాధ్వీసుధాధార♦గ్రోలఁ దివురు
ప్రబలరోలంబమాలికా♦రావముఁ బఱపి
దంభనారాయణి యనంగఁ ♦ దనరె నొకతె. 163

ఒకతె=ఒకస్త్రీ, కేలఁదమ్మిఘటించి=హస్తమందుఁ గమలము ధరించి, పాలమున్నీటిలోఁబొడమినజవరాలిన్=క్షీరసముద్రమం దుద్భవించినస్త్రీని - అనఁగాఁ గమలపాణియైన లక్ష్మీదేవిని, పోలెన్=పోలినదాయెను. ఒకతె=మఱియొకస్త్రీ, అమల=స్వచ్ఛమయిన, మృణాళనాళ=తామరతూఁటికాడయనెడు, అక్షసూత్రమున్=స్ఫటికపు పూసల జపమాలికను, పాణిఁ గీలించి=హస్తమందు సంఘ

టించి, అజురాణిఁ బోలెన్=సరస్వతీదేవిని బోలినదాయెను. ఒకతె=మఱియొకస్త్రీ, వెలిదమ్మిరేకు= తెల్లదామరపువ్వుయొక్క రేకు, వేనలినంటన్=కొప్పునందంటుకొనఁగా, లేనెలపువ్వుఁదాల్చు=బాల చంద్రరూపమయిన పుష్పమును ధరించిన, భవానిన్=పార్వతీదేవిని, పోలెన్=పోలినదాయెను. ఒకతె =మఱియొకస్త్రీ, కలువపుప్పొడిరాల్చి = కలువపువ్వులయందలి పుష్పపరాగమును దులిపి, కాయజాస్త్రముల తుప్పులుడుల్చు=మన్మథబాణములయొక్క తుప్పునదలించుచున్న, రతిదేవిన్=మన్మథభార్యయైన రతిదేవిని, పోలెన్ = పోలినదాయెను.

ఒకతె=ఒకస్త్రీ, సార=శ్రేష్ఠమయిన, కాసార=సరోవరమనెడు, సాగర = సముద్రమువలన, జనిత=పుట్టిన, జలజకుండ=కమలమనెడు కలశమందలి, మాధ్వీ=మకరందమనెడు, సుధాధార = అమృతపూరమును, గ్రోలఁదివురు=పానముసేయుటకు యత్నపడుచున్న, ప్రబలరోలంబమాలికా = బలిష్ఠమయిన మధుకరపంక్తియనెడు, రాహున్=రాహుగ్రహమును, పఱపి=వెడలఁగొట్టి, దంభనారాయణి యనంగఁదనరెన్=దంభనారాయణి యనఁగా నమృతము పంచిపెట్టునెడల రాక్షసులను వంచించు కొఱకు నారాయణుఁడు మోహినీరూపముఁదాల్చినాఁడు గనుక నట్టిమోహిని యనునట్టులుగా నొప్పినదాయెను. ఒకచెలువ తేనెనిండియున్న తమ్మిమొగ్గను గొనివచ్చుచుండఁ దుమ్మెదలు ముసరెను. వానిని మోసగించి తమ్మిమొగ్గను చేతనుంచుకొనుట సముద్రజన్యమగు నమృతము దేవతలకుఁ బంచుతఱి రాహువు రాఁగా వానిని జక్రాహతిని వధించి యమృతరక్షణ మొనరించినటులుండెను. అలం. ఉపమ.

ఉ. ఆటకొలంకునం గరఁగి ♦ యంబుజగంధులగంధసారము
ల్గాటుకయున్ హారిద్రయును ♦ గానఁగ నయ్యె నితాంతధన్య ల
జ్జోటులు మున్గువేళఁ బరి♦శుద్ధసితాసితనిర్ఝరంబు ల
న్నీటఁ బిశంగవర్ణతటి♦నీమణితోఁ దలచూపెనో యనన్. 164

ఆటకొలంకునంగరఁగి=క్రీడాసరోవరమందుఁ గరఁగినవై, అంబుజగంధుల=ఆస్త్రీలయొక్క, గంధసారములు=చందనములు, (ని. 'గంధసారో మలయజః' అని అ.) కాటుకయున్ = కన్నులకాటుకయును, హారిద్రయును = పసపును, కానఁగనయ్యెన్ = చూడనొప్పెను. ఏలాగనిన, నితాంత ధన్యలు=మిక్కిలి పుణ్యవతులైన, అజ్జోటులు = ఆస్త్రీలు, జోటియనునది యోషిచ్ఛబ్దతద్భవము. మున్గువేళన్=స్నానము సేయుచున్న సమయమందు, పరిశుద్ధ = పవిత్రములైన, సితా సిత నిర్ఝరంబులు=గంగా యమునా సంబంధములైన తెల్లనివియు నల్లనివియునగు ప్రవాహములు, అన్నీటన్ = ఆసరోవరజలమందు, పిశంగవర్ణ తటినీమణితోన్ = పచ్చని వర్ణముగల నదితోడ-అనఁగా సరస్వతీ నదితోఁ గూడ,

శ్లో. 'సరస్వతీ రజోరూపా తమోరూపా కళిందజా,
సత్త్వరూపాచ గంగాత్ర త్రితయం బ్రహ్మనిర్గుణమ్'

అని చెప్పఁబడియున్నది గనుకఁ బిశంగవర్ణతటినీమణి యనఁగా సరస్వతీనదియని తెలియవలయును. తలచూపెనోయనన్=పొడచూపినదో యన్నట్టులుగా, చూడనొప్పె నని సంబంధము. కరఁగిన గంధసార కజ్జల హారిద్రలను గంగా యమునా సరస్వతులనుగా నుత్ప్రేక్షించుటచే ధన్యలగు నాకన్యలు స్నానము చేయునపుడీ పుణ్యనదులు పొడచూపె ననియర్థము.

పౌలఁతులు సరోవరమునందు స్నానముఁ జేయుచుండవారి గంధము, కాటుక, పసపునీటఁగలసి గంగాయమునాసరస్వతీరూపములతో సరస్సు తనరెను. అనఁగా జలము త్రివర్ణములచే నొప్పెననుట. ఆజోటులు నితాంతధన్యలు గానటు లొనగూడెను. అలం. కావ్యలింగము.

తే. కొలన నీరీతి నీరాడి ♦ కొప్పు లంబు, రాశినిర్గతవార్షికా ♦ భ్రములఁ బోల
నాత్మనిరసనభీతి నా ♦ ర్ద్రాంబరములు, తనులతలనంటఁ బెనఁగఁద ♦ త్తటముఁ జేరి.

కొలననీరీతినీరాడి = సరోవరమం దీరీతిగా స్నానముచేసి, కొప్పులు = కచభారములు, అంబురాశి = సముద్రమువల్లనుండి, నిర్గత = బయలువెడలుచున్న, వార్షికాభ్రములఁబోలన్ = వర్షాకాలమేఘములవలె నుండఁగాను, ఆత్మనిరసనభీతిన్ = తమ్మువిడిచి పెట్టుచున్నారనెడుభయముచేత, ఆర్ద్రాంబరములు = తడిపావడలు, తనులతలనంటఁ బెనఁగన్ = తీఁగెలవంటి దేహముల నంటుకొనియుండఁగాను, తత్తటముఁ జేరి = ఆకొలనియొక్క యొడ్డునఁ జేరినవారై - ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

కొప్పులు నీరాడివచ్చుటచే నీరువడియుచుండెను. అందుచే వర్షోన్ముఖములగువానకాలపుమబ్బులటులనుండెను. తమ్ముఁ విడతురే మోయని వెఱచి తడివస్త్రములు మేనితోఁ గలసిపోయెను. స్నానాంతరము కట్టుకొనిన సన్ననివలువ మేనితో నంటుకొనుట సహజము. అలం. ఉపమ. ఉత్ప్రేక్ష.

ఉ. కామిను లన్నగాత్మజకుఁ ♦ గల్పకభూరుహదత్తకోమల
క్షౌమముఁ గట్టనిచ్చి యల ♦ కల్దడి యార్చి విరుల్ఘటించి ము
క్తామణిభూషణంబు లిడి ♦ గంధ మలంది వెలందియానతిం
దాము నలంకృతాంగు లయి ♦ దర్పకరాడ్భజనాదరంబునన్. 166

కామినులు = గిరికాదేవి చెలికత్తెలు, అన్నగాత్మజకున్ = పర్వతపుత్త్రియైన యాగిరికాదేవికి, కల్పకభూరుహదత్త = కల్పవృక్షముచేత నియ్యఁబడిన, కోమల = మృదువైన, క్షౌమమున్ = దుకూలవస్త్రమును, కట్టనిచ్చి = కట్టుకొనుటకిచ్చి, (ని. 'క్షౌమం దుకూలే స్యాద్దతసీకుసుమే పిచ' అని విశ్వప్రకాశము నిఘంటువు.) అలకల్దడియార్చి = కుఱులు తడియారునట్లులుచేసి, విరుల్ఘటించి = కొప్పుపెట్టి పువ్వులు దుఱిమి, ముక్తామణిభూషణంబులిడి = ముత్తెములసొమ్ములుపెట్టి, గంధమలంది = చందనముపూసి, అనఁగా వస్త్రమాల్యాభరణచందనాలంకృతురాలిఁగా జేసి యనుట. వెలంది యానతిం దాము నలంకృతాంగులయి = ఆగిరికాదేవియొక్క యనుమతిచేతఁ దాముసు నలంకరింపఁబడిన దేహముగలవారై, దర్పకరాడ్భజనాదరంబునన్ = మన్మథమహారాజ సేవయందలి ప్రీతిచేత - ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

అలకలనెడుపదము కుశాదిగణములోఁ జేరినదిగావున 'లుగ్భవే త్కుశాదే ర్స్మోః' న. అనుసూత్రముచే ముపర్ణకలోపము వచ్చినది. ఇందుకు లాక్షణికోక్తి, క. 'పులకము లలకము లనఁగా, బులక లలక లనఁగ' అని చెప్పఁబడియున్నది.

దర్పకరాజభజనము జరుపవలసియున్నది. అదియాదరమున జరుగఁదగినదిగాన గిరికాదేవిని విలువలేనివస్తువులతో నలంకరించిరి. పూజావిధానమునఁ జెలులసాయకారము వలయునుగాన గిరిక చెలికత్తియలఁగూడ నలంకరించుకొనుమనెను.

సీ. నారంగములు వాస♦నారంగములు గొన్ని యళినాదమంత్రము♦ల్దెలుపుచోటఁ
దిలకఁబు లవనీజ♦తిలకంబు లవి గొన్ని ప్రసవాసవార్ఘ్యంబు ♦ లొసఁగుచోటఁ
గాంచనంబులు వనై♦కాంచనంబులు గొన్ని కళికాప్రదీపము ♦ ల్నిలుపుచోట
సహకారములు చైత్ర♦సహకారములు గొన్ని తలిరాకుటారతు♦ల్దాల్చుచోట
తే. ముప్పిరిఁ బెనంగి ద్రాక్షలు♦గప్పికొనిన, గొప్పకప్రంపుటనఁటుల♦చప్పరాల
నొప్ప రాలినకప్పురా♦లుప్పరాలఁ, బెనచువలిగాడ్పుధూప మ♦ర్పించుచోట.

వాసనారంగములు = సౌరభస్థానములైన, నారంగములుగొన్ని=కొన్ని నారంజిచెట్లు, అళినాదమంత్రము ల్దెలుపుచోటన్ = తుమ్మెదలయొక్క ఝంకారములనెడు మంత్రములు చెప్పుచుండునదియు, అవనీజతిలకంబులు=భూరుహశ్రేష్ఠములైన, తిలకంబులు = బొట్టుగుచెట్లు, అవిగొన్ని = కొన్నియైనయవి, ప్రసవాసవార్ఘ్యంబులొసఁగుచోటన్ = ప్రసవాసవము లనఁగా బుష్పమకరందములు, అవియనెడు నర్ఘ్యములిచ్చుచుండునదియు, వనైకాంచనంబులు = వనమునకు ముఖ్యప్రకాశకములైన, కాంచనంబులు=సంపఁగిచెట్లు, కొన్ని = కొన్ని, కళికాప్రదీపము ల్నిలుపుచోటన్ = మొగ్గలనెడు దీపములు నిలుపుచుండునవియు, చైత్రసహకారములు=వసంతునికిఁ దోడుపాటైన, సహకారములు=తియ్యమామిడిచెట్లు, కొన్ని=కొన్ని, తలిరాకుటారతు ల్దాల్చుచోటన్ = పల్లవనీరాజనములు వహించుచుండునదియు,

ముప్పిరిఁ బెనంగి=ముప్పేటగాఁ బెనఁగొని, ద్రాక్షలు=ద్రాక్షతీఁగెలు, కప్పికొనిన = అల్లుకొన్న, గొప్ప కప్రపుటనఁటుల చప్పరాలన్ =గొప్పలైన కర్పూరపరఁటి చప్పరములవల్ల, ఒప్పరాలినకప్పురాలు=ఒప్పిదమగునటులుగా రాలిన కర్పూరమును, ఉప్పరాలఁబెనచు=ఊర్ధ్వభాగములను బొందుచున్న, వలిగాలి=మలయమారుతము, ధూపమర్పించుచోటన్ = ధూపసమర్పణము సేయుచున్నదియు నగు నొకానొకస్థలమందని యర్థము.

పూజావిధానమునకు వలయుచోటు నిశ్చయింపవలసియున్నది. తుమ్మెదలరవళియే మంత్రములు. తిలకకుసుమాసవము అర్ఘ్యము. సంపంగిమొగ్గలు దీపములు. తీయమావిచివురు లారతులు. కర్పూరపుటనంటులపైనుండివచ్చి శీతపవమానము ధూపముగా నలరి మన్మథపూజకు స్వతస్సిద్ధముగాఁ దగియున్న నెలవును గన్గొనిరి. అలం. అతిశయోక్తి. వృత్త్యనుప్రాసము.

ఉ. గొజ్జఁగిమంచునం గలపి ♦ కూర్చినపుప్పొడితిన్నె మీఁద లా
మజ్జకకాయమాన లస♦మానవిమానముక్రింద నొక్కపూ
సెజ్జ ఘటించి యం దొకకు♦శేశయకర్ణికనిల్పి యందు సం
పజ్జలజేక్షణాసుతుని♦భావము వ్రాసి కురంగనాభికన్. 168

గొజ్జఁగిమంచునంగలపి=గొజ్జంగిపువ్వులుమీఁదనుండి కురిసినమంచు అనఁగా బన్నీరు, దానిచేతఁ గలయఁగలపి, కూర్చిన=సంఘటించిన, పుప్పొడితిన్నెమీఁదన్ = పుష్పపరాగవేదికమీఁద, లామజ్జక=వట్టివేళ్లయొక్క, (ని.'అభయం నళదం సేవ్య మమృణాళం జలాశయమ్, లామజ్జకం లఘులయ మవదాహేష్టకాపథే.' అని అ.) కాయమాన=పందిటియందు అనఁగా వట్టివేళ్లపందిటియందు, లసమాన=ఒప్పుచున్న, విమానముక్రిందన్ =పువ్వుచప్పరముక్రింద, ఒక్కపూసెజ్జఘటించి=ఒకపుష్ప

శయ్యానునిర్మించి, అందొకకుశేశయకర్ణికనిల్పి=ఆశయ్యాయం దొకతామరమిద్దెనిలిపి,అందుఁ=ఆమిద్దెయందు, సంపజ్జలజేక్షణాసుతుని=లక్ష్మీపుత్రుఁడైన మన్మథునియొక్క, భావము వ్రాసి=యథాస్థితమైన రూపమును లిఖించి, కురంగనాభికఁ=కస్తూరిచేత, కురంగనాభికఁ అనెడు నీపదము కాకాక్షిన్యాయమున పూర్వమునకు నుత్తరమునకును నన్వయింపవలయును. ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. పట్టివేళ్ళపందిరియందు గొజ్జంగినీటిచేఁ బుష్పాడిగలిపి వేదిక యొనరించి యందుఁ బూవులతో శయ్యనమర్చి యొకతమ్మిగద్దియ శిలగఁజేసి దానిపై మన్మథస్వరూపమును గస్తూరితో వ్రాసి చెలులు నిలిపిరి. మన్మథునిభావము వ్రాయుటగాన మసివలయును. కస్తూరియే మసి.

తే. అతనివామాంకమున రతి ♦ నావహించి
మ్రోల నుడురాజు ఋతురాజుఁ ♦ గీలుకొల్పి
ప్రక్కవల సగంధపవన కో♦కిల మరాళ
కీర సారంగముల వ్రాసి ♦ చేరి చెలులు. 169

అతనివామాంకమునఁ=ఆమన్మథునియొక్క యెడమ తొడమీఁద, రతినావహించి=రతీదేవిని నిలిపి, మ్రోలఁ=సన్నిధియందు, ఉడురాజుఁ=చంద్రుని, ఋతురాజుఁ=వసంతుని, కీలుకొల్పి = సంఘటించి, ప్రక్కవలఁ=పార్శ్వములయందు, సగంధపవన = సౌరభయుక్తమయిన వాయువును-అనఁగా మలయమారుతమును, కోకిల=కోయిలను, మరాళ=రాజహంసమును, కీర=చిలుకను, సారంగములఁ=తుమ్మెదలను, వ్రాసి=లిఖించి, చెలులు=స్త్రీలు, చేరి=సన్నిధికిఁ జేరినవారై-ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. మన్మథునకుఁ జుక్కలఱేఁడు, వసంతుఁడు, మలయమారుతము, హంసములు, చిలుకలు, గొరువంకలు పరిజనము. భార్య వామాంకస్థాయినిగాన వామభాగమున వ్రాసిరి. ఆజ్ఞాపాలకుఁడగు వసంతుఁడుమ్రోల, పరివారము ప్రక్కలనుంట ప్రసిద్ధముగాన వలకేలిబలగమునటులె లిఖించిరని భావము.

సీ. ధ్యానంబు హృదయవా♦స్తవ్యకుటుంబికి నావాహనము జగ♦ద్వ్యాపకునకు
నర్ఘ్యపాద్యములు నా♦రాయణప్రియసూతి కభిషేక మబ్ధిక♦న్యాంకశాయి
కలరుదోయిళ్లు పు♦వ్వులవింటిదొరకు గంధము గంధగిరిమరు♦ద్బాంధవునకు
ధూప మప్రతిమప్ర♦తాపోష్మ సురభికి దీపంబు తిమిరభ♦యాపహునకు
తే. మధురస ఫలోపహారంబు ♦ మధుపకీర
పరిజన పరాయణున కంచు ♦ భక్తి నొసఁగి
మానమథనాయ మదనాయ ♦ మధుసఖాయ
మనసిజాయ నమో నమో ♦ యనుచు మ్రొక్కి. 170

హృదయవాస్తవ్యకుటుంబికిఁ=హృదయమందుఁ గాపురమున్న గృహమేధికి, ధ్యానంబు = ధ్యానమనియర్థము. హృదయమందయున్నవాని హృదయమందు నిల్పి ధ్యానముసేయుట స్థితస్థాపన తుల్యము. అనఁగా హృదయమందయున్నవాని హృదయమందు నిలుపుటయేయని యాశయము. ఉత్తరత్ర యీలాగుననే యాశయమును గ్రహింపవలయును. జగద్వ్యాపకునకుఁ=జగత్తు నావహించి యున్నవానికి, ఆవాహనము=ఆవాహనమని యర్థము. నారాయణప్రియసూతికిఁ = నారములనఁగా జలములు-నారములే స్థానముగాఁగలవాఁడు నారాయణుఁడు.

శ్లో. 'ఆపో నారా ఇతిప్రోక్తా ఆపోవై నరసూనవః,
తాయదస్యాయనం పూర్వం తేన నారాయణ స్స్మృతః'

అని మనుస్మృత్యాదులయందుఁ జెప్పఁబడియున్నది. ఉదకములు స్థానముగాఁగల నారాయణు నకుఁ బ్రియనందనుఁడయినవానికి, అర్ఘ్యపాద్యములు = ఉదకముచేత నియ్యఁబడెడు నర్ఘ్యమును బాద్యమును అని యర్థము. అబ్ధికన్యాంకశాయికిన్ =జలధికన్యయైన లక్ష్మీదేవియొక్క తొడలపై శయ నించువానికి, అభిషేకము=జలాభిషేకమని యర్థము.

పువ్వులవింటిదొరకున్ =పుష్పధనుస్సుగల వానికి, అలరుదోయిళ్లు = పుష్పాంజలులని యర్థము. గంధగిరిమరుద్బాంధవునకున్ = గంధగిరివాయువునకు-అనఁగా మలయమారుతమునకు బాంధవుఁడైన వానికి, గంధము గందమనియర్థము. అప్రతిమ ప్రతాపోష్మసురభికిన్ -అప్రతిమ=సమానరహితమైన, ప్రతాపోష్మ=ప్రతాపముయొక్క వేఁడిమిచేత, సురభికిన్ =పరిమళించుచున్న వానికి, ధూపము=ధూప మనియర్థము. ఇక్కడ సౌరభ్యము గలవానికి ధూపముచేత నేమని యాశయము. లేక ప్రతాపోష్మ యనఁగా ధూపోష్మ, దానిచేతఁ బరిమళించుచున్న వానికి ధూపమనియర్థము. ధూపజనిత సౌరభ్యము గలవానికి ధూపముచేత నేమిప్రయోజనమని యాశయము. తిమిరభయాపహునకున్ =అంధకార భయ నాశకుఁడైనవానికి, దీపము = దీపమని యర్థము. రాగయుక్తులకు నంధకారభయము లేకపోవుట ప్రకటముకదా.

మధుపకీరపరిజనపరాయణునకున్ =మధురసఫలము భక్షించునట్టి మధుపకీరములనెడు పరిజనము నం దాసక్తుఁడైనవానికి, మధురసఫలోపహారంబనుచున్ =మధురసమనఁగాఁ దేనెగనుకఁ దేనెయును ఫలములును గానుకయని పలుకుచు, భక్తినొసఁగి=భక్తిచేత సమర్పించినవారై, మానమథనాయ=స్త్రీపు రుషులయొక్క ప్రణయకోపములను బోఁగొట్టువాఁడును, మదనాయ=స్త్రీపురుషులను మదింపఁజేయు వాఁడును, మధుసఖాయ=వసంతునికి మిత్త్రుఁడైనవాఁడును నగు, మనసిజాయ=మనస్సునందు బుట్టిన వానికొఱకు, నమోనమః=నమస్కారము నమస్కారము, అనుచుమ్రొక్కి=అనిసేవించినవారై,

నమోయనుచు మ్రొక్కియన్నచోట 'లోపోనమ ఆదికేవిసర్గస్య' అనెడు శబ్దానుశాసన సూత్రముచేత నమయనుచు నని చెప్పవలసినను, 'నమశ్శబ్దవిసర్గస్యలోపఓత్వ మపీష్యతే' అనెడు నథర్వణ వచనమువలన నమోయనుచు ననియును జెప్పవలయును. 'అనుకృతే స్తివాక్యంతు' న. అను సూత్రముచే నిచట ననుకరణమందు సంస్కృతవాక్యము ప్రయోగింపఁబడియెను. హృదయవాస్తవ్యమని ధ్యానముచేయుట జగద్వ్యాపకుని నాహ్వానముచేయుట, పూలవింటివానికిఁ బుష్పాంజలి యొసంగుట, అభిషేకమబ్ధికన్యాంకశాయి కొసంగుట వస్తుసమృద్ధిగలవానికి వస్తువుల నొసంగుటవంటిది. భక్తియె ప్రధానముగాన నటుల నతు లర్పించిరని భావము. అలం. సమాలంకారము.

క. కామ కమలాస్త్ర కమలా, కాముకసుత కామనీయకనిధీ యనుచుం
గామినులు విన్నవించిరి, కోమలకోకూయమానకోకిలఘణతిన్. 171

కామ=కాముఁడనెడు పేరుగలవాఁడా, కమలాస్త్ర=పద్మబాణముగలవాఁడా, కమలాకాము కసుత=లక్ష్మీకాముకుఁడైన విష్ణుదేవుని కుమారుఁడవైనవాఁడా, కామనీయకనిధీ=సౌందర్యమునకుస్థాన భూతుఁడ వైనవాఁడా, అనుచున్ =అనిపలుకుచు, కోమల=మృదువైన, కోకూయమాన=కుహూ కుహూ

ఆనెడు ధ్వనిగలుగుచున్న, కోకిలఫణితిన్=కోకిలలయొక్క పలుకులవైఖరిచేత, కామినులు=గిరికాదేవి చెలికత్తియలు, విన్నవించిరి=విజ్ఞాపనముచేసిరి. విన్నపము అనునది విజ్ఞాపనశబ్దముయొక్క తద్భవము.

శా. వాతాందోళితచందనాగరులతా◆వ్యాలీఢకేళీవనీ
జాతంబు ల్భవదీయనర్మగృహము◆ లైచైత్రుండు నీబంటు నీ
కేతత్కాననజాతవస్తునిచయం◆బే మిచ్చి పూజించుటల్
'శీతాంశో రమృతార్పణ' మ్మనుక్రియం◆ జేకొమ్ము చేతోభవా. 172

చేతోభవా=చిత్తసంభవుఁడయిన యోమన్మథుఁడా, వాత=వాయువుచేత, ఆందోళిత=ఊచఁబడుచున్న, చందన=శ్రీగంధముయొక్కయు, అగరు = కృష్ణాగరుయొక్కయు, లతా=శాఖలతోడ వ్యాలీఢ=కూడుకొన్న, కేళీవనీజాతంబులు = క్రీడావనసమూహములు, భవదీయనర్మగృహములు=నీయొక్క కేళికామందిరములు-అనఁగా నేవకాందోళిత డోలాస్థానీయము లని భావము. చైత్రుండు నీ బంటు=వసంతుఁడు నీయొక్కభృత్యుఁడు, నీకున్=ఈలాటివాఁడవైననీకు, ఏతత్కానన=ఈవనమందు, జాత=పుట్టిన, వస్తునిచయంబు = పుష్పఫలాది వస్తుసముదాయమును, ఏమిచ్చుటలు=మేమిచ్చుటయున్నది, శీతాంశోరమృతార్పణ మ్మనుక్రియన్=చంద్రున కమృతసమర్పణ మనునట్టులుగా విచారించి, చేకొమ్ము=గ్రహింపుము.

అమృతమయుఁడయిన చంద్రున కమృతనివేదనము సేయుట యెక్కువలోనిది గాదుగనుక నాలాగుననే మేము సమర్పించిన పుష్పఫలాదికము లెక్కువలోనివి కాకపోయినను నీ వనుగ్రహించి కైకొనవలయునని తాత్పర్యము. నీవు అనుపదమును చేకొమ్ము అను క్రియకుఁ గర్తగా గ్రహింపవలయును.

మ. బలవన్మేరుశరాసనంబును బర◆బ్రహ్మాస్త్రముం గల్గుబ
ల్విలుకానిం దృణ మైనచాపమున గా◆లిం బోవు లేయల్గులం
జల మూనించి సగంబు చేసి తవు నా◆ సంకల్పసిద్ధుల్గొనం
బలుమేరున్ నిరసింప లేఁజిగురుఁగొ◆మ్మం జేవ గా కుండునే. 173

బలవన్మేరుశరాసనంబున్=బలవత్తరమయిన మేరుధనుస్సును, పరబ్రహ్మాస్త్రమున్=పరబ్రహ్మమయిన విష్ణురూపాస్త్రమును, కల్గు=కలిగియుండునట్టి, బల్విలుకానిన్=మేటివిలుకాఁడయిన హరుని, తృణమయినచాపమునన్=గడ్డిపోచవలె లఘువైనవింటిచేతను, గాలింబోవులేయల్గులన్=గాలి కెగిరిపోవు మృదుతరబాణములచేతను, చలమూనించి=చలమాపాదించి, సగంబుచేసితవునా=కృశించి సగమగునట్టులుగాఁ జేసితివి మేలుమేలు అని యర్థము. తృణమయిన చాపమనఁగాఁ జెఱకు తృణవృక్షములలోనిది గనుకఁ జెఱకువిల్లనియును గాలింబోవు లేయల్గు లనఁగాఁ బుష్పబాణము లనియును సగమవుట యర్ధనారీశ్వరత్వమనియును భావము. తృణశబ్దమునకు, (ని. 'నడాదయ స్తృణం గర్మ చ్చాఖ్య మాక ప్రముఖా అపి' అని అ.) సంకల్పసిద్ధుల్గొనన్=సిద్ధసంకల్పులు చేపట్టిన, బలుమేరున్నిరసింపన్=బలిష్ఠమయిన మేరుపర్వతమును జయించుటకు, లేఁజిగురుగొమ్మం జేవగాకుండునే=లేఁతచిగురుకొమ్మయందే చేవపుట్టకపోవునా-అనఁగాఁ బుట్టుచున్నదియనుట. సంకల్పసిద్ధుఁడనఁగామన్మథుఁడని భావము. సంకల్పముచేత సిద్ధుఁడనుట. సంకల్పసిద్ధుఁడనినను సంకల్పసంభవుఁడనినను మన్మథుఁడనుట సిద్ధము.

సీ. సంకల్పసంభవాస్థానపీఠికవోలె వెడఁదయై కనుపట్టు నీయురము. (మనుచరిత్రము)

వెండియున్ వెండిన్ ఉండియున్ ఉండిన్ వలెఁ గొమ్మయున్ అనుచోఁ గవి కొమ్మన్ జేవ యని ప్రయోగించెనని యొకసంస్కర్త యూహించుచున్నాఁడు. ఇది యసమంజసము. 'కొమ్మన్' అని సప్తమ్యంతముగా గ్రహించుటయే యుక్తము. వ్యాకరణవిరుద్ధముగాకొమ్మన్ అనుదానికి కొమ్మయునని చెప్పిదోషము నెటులో సరిపుచ్చుకొనుటలోన రసతర మేమాత్రములేదు. ఇది కవిమతమునకుఁ బూర్వ వ్యాఖ్యాతల మతమునకు వ్యతిరేకము. ఆధునికులు కొమ్మన్ అనుచో సముచ్చయార్థయుఁవర్ణములో పించెనని వాదించుచున్నారు.

ఉ. కొండఁట విల్లు వేదలల•కుండలిరాజఁట నారి యమ్మనం
తుండఁట బైటిపల్లియలు • దున్మినవాఁడఁట యొండురెండు భ
ర్గుం డిది నిండుపౌరుష మొ•కో యని గెల్వవె ముజ్జగంబు లు
ద్దండత నొక్కతుంటవిలుఁ • దాలిచి యంటినఁ గందుతూఁవులన్. 174

కొండఁటవిల్లు=విల్లువిచారించిన మేరువుపర్వతమఁట, వేదలల కుండలిరాజఁట నారి=అల్లెత్రాడు విచారించిన వేయితలలుగల శేషాహియఁట. అమ్మనంతుండఁట = అమ్ము అనఁగా బాణము విచారించిన విష్ణుమూర్తియఁట. ఇట్టి ప్రబలసాధనములు గలిగియుండియును, భర్గుండు=శివుఁడు, ఒండురెండు= ఒకటిరెండు.-అనఁగా బహు స్వల్పమయిన, బైటిపల్లియలు=చాటులేక బట్టబైట నున్నపల్లెలను, తున్మి నవాఁడఁట=సంహరించినాఁడఁట.ఇది నిండుపౌరుషమొకో యని=ఇది నిండారైనపరాక్రమమాయని, (ని. 'పౌరుషం పురుషస్యోక్తం భావేకర్మణి తేజసి' అని వి.) ఉద్దండతన్ = పరాక్రమముచేత, ఒక్కతుంటవిలుఁదాలిచి=ఒకవింటిచెఱుకును జేతఁబట్టి,అంటినఁ గందుతూఁపులన్=చేతస్పృశించినఁగంది పోవు బాణములచేత, ముజ్జగంబులు=లోకత్రయములను, గెల్వవె=జయించినావుగావా, కాఁబట్టి నీ దేసామర్థ్యముగాని శివుని దేమి సామర్థ్యమని యర్థము.

బైటిపల్లియలనఁగా నంతరిక్షమం దున్నవనియును ఒండు రెం డనఁగాఁ త్రిపురములనియును పౌరుషమనఁగా బురుషత్వమనియును నర్ధనారీశ్వరుఁడుగనుకసంపూర్ణపురుషత్వము లేదనియును దుం టయనఁగాఁ జెఱకుతుంటయనియును నంటినఁ గందుతూపులనఁగాఁ బుష్పబాణములనియును భావము. శివుఁడు కొండవిల్లుజేసికొని యాదిశేషుని నారిగానలరించి విష్ణుని బాణముగా నొనర్చిచేసిన పని బైటి పల్లెలురెండుమూడు తునుముట, నీవో తుంటవింటితో నంటఁగందు పూదూపులతో మూఁడులోకములు గెలిచితివిగాన మన్మథుఁడా నీవె నేర్పరివని చెలులు ప్రశంసించిరి. అలం. విభావనము. వ్యతిరేకము.

ఉ. సూనశరాస నీశరము•సొచ్చినధాతకు నీమహోభరం
బానక రౌప్యభూధరగు•హాగృహ మీఁగినశూలికిం ద్వదీ
యానఘశౌర్యశక్తిహృదయంబునఁ బూనురమావిలాసికిన్
మానదు వో రజంబును ద•మంబును సాత్త్వికముం గ్రమంబునన్. 175

సూనశరాస=పుష్పధనుస్సుగల మన్మథుఁడా, నీశరము సొచ్చినధాతకున్=నీబాణమునాటిన బ్రహ్మకును అనియర్థము. మన్మథబాణము పద్మము గనుకఁ బద్మమందుఁ జొచ్చియున్నాఁడని భావము. నీమహోభరంబానక రౌప్యభూధరగుహాగృహ మీఁగినశూలికిన్ = నీయొక్క తేజోతిశయ

మున గాఁగలేక కైలాసాచలగుహ యనెడు గృహమందు డాఁగియున్నహరునకు అని యర్థము. కైలాసనిలయుఁ డని భావము. భరమనఁగా నతిశయమన్నందుకు, వి. 'అథాతిశయో భరః' అని అ. త్వదీయానఘశౌర్యశక్తి హృదయంబునఁ బూనురమావిలాసికిన్ = నీయొక్క యవ్యాజపరాక్రమశక్తిని మనస్సునఁ బూనిన విష్ణుదేవునకును అనియర్థము. లక్ష్మీదేవిని వక్షస్స్థలమందు ధరించినాఁ డని భావము. (ని. 'హృదయం మానసో రసః' అని వి.) లక్ష్మీదేవి నిగరణముచేసి యనఘశౌర్యశక్తి రూపముచేత నధ్యవసించినాఁడు. ఈభావార్థమందు రమావిలాసి యనెడుపదము సాభిప్రాయము. క్రమంబునన్=వరుసవెంబడిగా, రజంబును=రజఃకార్యమయిన యనురాగమును, తమంబును=మోహమును, సాత్త్వికమున్=సాత్త్వికభావమును, మానదువో=మానిపోదుగదా యని యర్థము. రజోగుణంబును దమోగుణమును సాత్త్వికగుణమును మానదనిభావము. త్రిమూర్తులను స్వవశులనుగాఁ జేసి కొన్నవాఁడవుగదా యని తాత్పర్యము. నీశరముసొచ్చినధాతకు అన్నచోట శరమందుఁ జొచ్చిన యనెడు సప్తమ్యర్థమందు, శ్లో. 'అన్యస్యాః క్వచిద్భవేచ్చాన్యా' న. అనెడు సూత్రముచేతఁ బ్రథమ వచ్చినదిగనుక రెండర్థములయందును బ్రథమాంతమయిన శరమనెడు పదమునకంటెఁ బరంబైన చకారమునకు సకారాదేశము వచ్చినది. మన్మథునిధాటికిఁ ద్రిమూర్తులు లోనైరనుటకు—

శ్లో. శంభుస్వయంభుహరయో హరిణేక్షణానాం, యేనాక్రియంత సతతం గృహకుంభదాసాః
వాచామగోచరవిచిత్రచరిత్రితాయ, తస్మై నమో భగవతే కుసుమాయుధాయ.

భర్తృహరిసుభాషితము.

అలం. ఉత్ప్రేక్ష. పర్యాయోక్తము.

క. మొన యంగనకా కటకట, మొనయం గనకాద్రిధరుఁడె ♦ ముదిత నుపవనా
తనుపవనాహతి కొసఁగక, తనుపవనా మదన నీయు ♦ దంచితకరుణన్. 176

మదన=ఓయిమన్మథుఁడా, మొనయంగనకా=మొనయనఁగా బారుదీరుటగనుక నట్టిమొన, అంగనకా=ఈయాఁడు చిన్నదానికొఱకా, అనఁగా నిది యేమి ఘనకార్య మనుట. కటకట=అయ్యయో, మొనయన్=తారసించుటకు, కనకాద్రి ధరుఁడె=మేరు విల్లుగా ధరించినహరుఁడా యేమి? ముదితన్=గిరికాదేవిని, ఉపవన=ఉద్యానవనమందలి, అతను=అధికమయిన, పవన=మలయమారుతము యొక్క, ఆహతికిన్=తాఁకుడునకు, ఒసఁగక=ఒప్పగింపక—అనఁగా మలయమారుతవేధకుఁ బాలుపఱుపక, నీయుదంచితకరుణన్=నీయొక్క ఘనమయిన దయారసముచేత, తనుపవనా=తనియునట్టులు చేయవన్నా, తనుపవు అనా యని పదవిభాగము. అనఁగా నీదయాపాత్రురాలినిఁగా జేయవయ్యా యనుట. అలం. యమకము.

మన్మథా నీవు మూఁడులోకములు జయించిన జగజెట్టివి. ఈచెలువ నీముందెంత. ఈయమ యీలువు మలయమారుతము పాలుపఱుపక నీదయచేఁ గాపాడుమని భావము.

సీ. లోకత్రయీరాజయో ♦ త్సేకంబుఁ దెల్పునీపడగ నారాయణ ♦ ప్రథమమూర్తి
రెం డంటఁ జేయునీ ♦ కొండచాతురికి నాద్యనివర్మనంబు వా ♦ మార్ధజాని
గాఢనాళీకసం ♦ గ్రస్తుఁ డై నేఁడును నీడాఁగువాఁడు వా ♦ ణీవిలాసి
యెక్కి త్రొక్కనిచోటు ♦ ద్రొక్కించునీయాజ్ఞ గడువఁడు పద్మినీ ♦ కాముకుండు

తే. కాంత లన నెంత నీయంత ఘనున కింక
నళిచికురఁ బ్రోవవయ్య పద్మాక్షిఁ గావ
వయ్య శుకవాణిఁ గరుణింపవయ్య పూర్ణ
చంద్రముఖి నేచకయ్య యోఁచక్కనయ్య. 177

లోకత్రయీజయోత్సేకంబుఁ దెల్పు=లోకత్రయీజయమనఁగాఁ బురాణవేదత్రయీజయమని యర్థము. లోకశబ్దము పురాణవాచక మైనందునకు—

శ్లో. 'నాశీర్వరం భవితు మర్హాతి విశ్వమేత ద్భుహ్యీశ్వరంతు నితరామయథాప్రమాణమ్,
తల్లోకవేదవిదితేశ్వరవర్జనేన కోయం ప్రభుః కలిచిదీశ్వరమన్యమాహుః.'

అని శివసూక్తిమాలయందుఁ బ్రయోగము. భువనత్రయజయమని భావము. దానియొక్క, ఉత్సేకంబుఁ దెల్పు = విజృంభణమును దెలుపుచున్న, నీపడగ = నీయొక్కధ్వజము, నారాయణప్రథమమూర్తి=నారాయణునియొక్క ప్రథమమూర్తియైన మత్స్యమని యర్థము. రెండంటఁజేయునీకాండచాతురికిఁ=రెండువస్తువు లొకటిగాఁ గలిసికొనునట్టులు చేయునట్టి నీబాణచాతుర్యమునకు, వామార్థజాని=అనఁగా నెడమపార్శ్వము సగమును భార్యగాఁగల సాంబమూర్తియే, ఆద్యనిదర్శనంబు=మొదటిసాక్షి. ఇక్కడ, శ్లో. 'ఏకమేవద్విధాకర్తుం బహవస్సంతిధన్వినః, మారఏకోమహాధన్వీద్వయమేకం కరోత్యసౌ' అనునీశ్లోకార్థ మనుసంధించి భావము గ్రహింపవలయును.

గాఢ=దృఢముగా, నాళీకసంగ్రస్తుఁడై=నాళీకమనఁగా బాణమును బద్మమును గనుక బాణరూపపద్మముచేత గ్రహింపఁబడినవాఁడై, నేఁడును=ఇప్పటికిని, వాణీవిలాసి=బ్రహ్మదేవుఁడు, నీడాఁగువాఁడు=నీయొక్కలాంఛనము గలవాఁడై యున్నవాఁడని యర్థము. మన్మథుఁ డరవిందబాణుఁడగుటయును బ్రహ్మ నిరంతరమును బద్మమందయుండుటయును బ్రకటముగదా. ఎక్కి త్రొక్కనిచోటు ద్రొక్కించు నీయాజ్ఞ=ఎక్కిత్రొక్కరానిచోటు నెల్లఁ గాముకులచేతఁ ద్రొక్కించునట్టి నీయాజ్ఞను, పద్మినీకాముకుండు=అనఁగా స్త్రీకాముకుఁడైన సూర్యుఁడు, గడువఁడు=అతిక్రమింపఁడని యర్థము. అనఁగా నెక్కిత్రొక్కరానిచోటుఁ ద్రొక్కుచున్నాఁడనుట. నళినీప్రియుఁడనియును గగనాగ్రభాగమున కెక్కి సర్వత్ర కిరణప్రసారణము సేయుచున్నాఁడనియును భావము.

కాఁబట్టి, నీయంతఘనునకుఁ=నీయంతగొప్పవానికి, కాంతలన నెంత=స్త్రీలనఁగా నెంతమాత్రము, ఇంకఁ=ఇఁకమీఁద, అళిచికురఁ బ్రోవవయ్య=తుమ్మెదలవంటి తలవెండ్రుకలుగల యాచిన్నదాని రక్షింపవయ్యా, పద్మాక్షిఁ గావవయ్య=పద్మములవంటి నేత్రములుగల యాచిన్నదానిం గావవయ్యా, శుకవాణిఁ గరుణింపవయ్యా=చిలుకపలుకులవంటి పలుకులుగల యాచిన్నదాని దయఁజూడవయ్యా, పూర్ణచంద్రముఖి నేచకయ్య=పూర్ణచంద్రునివంటి ముఖముగల యాచిన్నదాని బాధపెట్టకుమయ్యా; ఓచక్కనయ్య=సుందరుఁడవైన యోమన్మథుఁడా యని యర్థము.

అళి పద్మ శుకపూర్ణచంద్రులు నీకు మౌర్వి, బాణ, వాహన, బంధువులు గనుకఁ దత్సదృశములైన చికురనేత్రవాణీవదనములుగల గిరికాదేవి నీచేత సంరక్షణీయురాలుసుమీ యని భావము. త్రిమూర్తులును ద్విమూర్తిస్వరూపుఁడగు సూర్యభగవానుఁడుఁ నీకు లోనైరి. కాన నీవు ఘనుఁడవు. కావున నీముందుఁ గాంతలెంతవారు? అలం. విభావనము. వ్యతిరేకము.

"డాఁగు" అనఁగా గుఱుతనుటకుఁ బ్రయోగము.

చ. విరహిజనంబులన్ మరుఁడు వీపుల డాఁగులు వేయఁబూని ని
ష్ఠురుణ నిజప్రతాపశిఖి గ్రాచఁగఁ గ్రాగుసలాకలో యనన్
ధరపయి నెల్లెడన్ దరుల దట్టములై చిగురాకుజొంపముల్
నిరుపమలీలఁ బొల్చెఁ దరుణీ కనుఁగొంటె మిటారిచూపులన్. చంద్రభానుచరిత్రము.

క. వలదు కొల దాఁకు సుమ్మని, చెలువలు మరుఁ గొసర విసరె • జిలిబిలిగాడ్పు
ల్జలజల నలరులు రాలెను, గలకల మనుశుకపికాళి•కలకల మెసఁగెన్. 178

వలదు=వద్దువద్దు, కొలదాఁకుసుమ్మని = స్త్రీహత్యదగులును సుమా యని, చెలువలు మరుఁ గొసరన్=స్త్రీలు మన్మథుని వేఁడఁగా, విసరెజిలిబిలి గాడ్పులు=మలయమారుతములు విసరెను, జలజల నలరులురాలెను=పువ్వులు జలజల రాలెను, కలకలమను=కలకలగూయుచున్న, శుకపికాళి కలకల మెసఁగెన్=చిలుకలయొక్కయుఁ గోయిలయొక్కయుఁ దుమ్మెదలయొక్కయుఁ గోలాహల మతిశయించెను.

చ. అఱిమి రమాకుమారుఁ డపు • డగ్రతలంబున వచ్చి నిల్చిన
ట్లఱిముఱిఁ దోఁచినం గువల•యాక్షి వడంకి కడంకఁ దూలి మై
మఱచి సగంధగంధగిరి•మారుతపాతితవల్లికాభ యై
యొఱఁగిన సంభ్రమించి చెలు • లుద్గతబాష్పతరంగితాక్షు లై. 179

అఱిమి=అనఁగా గదమాయించి, రమాకుమారుఁడు=మన్మథుఁడు, అపుడు=ఆసమయమందు, అగ్రతలంబున వచ్చి నిల్చినట్లు=ఎదుటవచ్చి నిల్చినట్టులుగా, అఱిముఱిదోఁచినన్=నిశ్చయముగాఁ గనుపడఁగా, కువలయాక్షి=గిరికాదేవి, వడంకి=కంపించి, కడంకఁదూలి=ధైర్యముచెడి, మైమఱచి=శరీరస్మృతిదప్పి, సగంధ=గర్వసహితమైన, గంధగిరిమారుత=మలయవాయువుచేత, పాతిత=పడవేయఁబడిన, వల్లికా=తీఁగయొక్క, ఆభయై = కాంతివంటి కాంతిగలదై, ఒఱఁగినన్=మూర్ఛఁ గొనివ్రాలఁగా, సంభ్రమించి=తొందరగొని, చెలులు = గిరికాదేవియొక్క చెలికత్తియలు, ఉద్గత=బయలువెడలుచున్న, బాష్ప=కన్నీళ్ళచేత, తరంగిత=సంజాతతరంగములైన, అక్షులై=కన్నులుగలవారై, ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

ఈపద్యములో వడంకి యన్నది వేపథువనెడి సాత్త్వికభావము. క. 'మోదమునన్నైన రోషభయాదులనేనియును గంప మధికం బగుఁ దా, నేదేహిదేహమున నది, మేదిని వేపథు వనంగ మెఱయుచునుండున్' అని లక్షణము. మైమఱచియన్నది మొదలుకొని మోహామనెడిసంచారిభావము. శ్లో. 'మోహస్తుమూర్ఛనంభీతి దుఃఖావేశానుచింతనైః' అని లక్షణము. కువలయాక్షి యనుటవలన గిరికావయసు బింకము సూచితము. జవ్వనులకనులు నల్లగలువలతో సమముఁగఁ గవులు చెప్పుదురు. మన్మథుఁడు కనఁబడక గిరికకుఁ దోఁచుటకుఁ గారణము అతఁడనంగుఁడుగాన నే. తొలుత వణఁకుట, పిదపఁ దాలిమిదూలుట, ఆవల మైమఱచుట, ఒఱగుట ఇవి భయవశమునఁ గ్రమముగా జరుగునవి. చెలులు కారణ మెఱుంగరుగాన సంభ్రమించిరి. మఱియు బాష్పతరంగితాక్షులైరి.

సీ. మోహాపదేశతమోముద్రితములైన కనుదమ్ముల హిమాంబు • లునుప రాదు
శ్రమబిందుతారకాగమఖిన్నకుచకోకములఁ జంద్రనామంబుఁ • దలఁప రాదు
శీర్యదాశావృంతశిథిలితాసులతాంత మసియాడ వీవన • ల్విసర రాదు
పటుతాపపుటపాకపరిహీణతనుహేమ మింకఁ బల్లవపుటా • ర్చిడఁగ రాదు
తే. లలన కానంగకీలికీలాకలాప, సంతతాలీఢహృదయపాత్రాంతరాళ
పూరితస్నేహపూరంబు • పొంగి పొరలఁ, జల్లనిపటీరసలిలంబుఁ • జల్ల రాదు.

మోహ=మూర్ఛాదికమనెడు, అపదేశ=వ్యాజముగల, (ని. 'వ్యాజోపదేశౌలక్ష్యశ్చ' అని అ.) తమః=అంధకారముచేత, ముద్రితములైన = ముకుళింపఁబడిన, కనుదమ్ములన్ =నేత్రపద్మముల యందు, హిమాంబు లునుపరాదు=పన్నీరుంచరాదని యర్థము. తుషారోదక మునుపరాదనియును నర్థము. అర్థద్వయమునకు నభేదాధ్యవసాయము. ఉత్తరత్ర యర్థద్వయమున్నచోట నభేదాధ్యవసాయము సేయవలయును. కనులు మోహాంధకారముచే ముకుళించినవి గావున శైత్యోపచారములగు హిమాంబుసేకనము లిట తగదు. మంచునీరుసోఁకుటచే మఱింత ముకుళించును. చల్లఁదగిన హిమాంబువులు చల్లరాదనుట శబ్దశ్లేషచేఁ గవి సాధించెను.

శ్రమబిందు=శ్రమజలబిందూదయమనెడు, తారకాగమ=నక్షత్రోదయమువలన, ఖిన్న=ఖేదయుక్తములైన, కుచకోరకములన్ =చనుజక్కవలవిషయమై, చంద్రనామంబుఁ దలఁపరాదు=చంద్రనామమనఁగాఁ గర్పూరము గనుకఁ గర్పూరమును దలఁపఁగూడదని యర్థము. (ని. 'ఘనసారశ్చంద్రసంజ్ఞః' అని అ.) చంద్రునిపేరు దలఁపరాదనియును నర్థము. చెమ్మటబొట్టులను జుక్కలరాకచేఁ గుచచక్రవాకములు విచారపడుచున్నవి. ఇఁకఁ జంద్రునినామము తలంచుట మఱియు విచారకారణము. విరహిణులకు గుబ్బలపైఁ గప్పురపుఁబూతఁబూయుట యాచారము. దానికి శ్లేషమహిమచే ననుపపత్తి యధ్యవసింపఁబడినది.

శీర్యత్ =జాఱుచున్న, ఆశా=వసురాజవిషయమయిన యాశయనెడు, వృంత=తొడిమెవల్లనుండి, (ని. 'వృంతం ప్రసవ బంధనం' అని అ.) శిథిలిత=సడలిన, అసులతాంతము=ప్రాణమనెడుపుష్పము, అసియాడన్ =(ఎప్పుడో పడిపోయెడుదానివలె నుండుచుండఁగా) ఇంచుక కదలునటుల, వీవనల్విసరరాదు=విసనకఱ్ఱలచేత విసరరాదని యర్థము. గిరికప్రాణమనుపూవు తొడిమనుండి సడలినది. జారుటకు సిద్ధముగా నున్నది. కావున నించుకేని కదలునటుల వీవనతో వీచుట ప్రమాదకరము. పోను సిద్ధముగనున్న ప్రాణము లాసచే నెటులో పోకున్నవి. వీవనగాడ్పు అసులతాంతమున కపాయకరమని యధ్యవసితము.

పటు=సమర్థమయిన, తాప=చింతాదికృతసంతాపమనెడి, పుటపాక=పుటములయొక్క పచనముచేత, పరిహీణ=తరిగి కడపన్నెమట్టుకు నిలిచిన, తనుహేమము=దేహరూపసువర్ణము, ఇంకన్ = ఇగిరిపోవునట్టులుగా, పల్లవపుటార్చిడఁగరాదు=కిసలయశయ్యారూపమయిన యగ్నిజ్వాలపెట్టరాదనియును బల్లవపుటమనెడి పుటవిశేషముయొక్క యర్చి నిడరాదనియును నర్థము.

పుటపాకలక్షణము—

శ్లో. పుటపాకస్య పాకోయం లేపస్యాంగారవర్ణతా
లేపంచ ద్వ్యంగుళం స్థూలం కుర్యాద్ద్వ్యంగుళిమాత్రకం

కాశ్మీరవటజంబ్వాదిపత్త్రై ర్వేష్టన ముత్తమం.

పల్లవపుటార్చియనఁ జిగురుసెజ్జయని పుటభేదమని భావము.

లలనకున్ =గిరికాదేవికి, ఆనంగకీలి=మన్మథాగ్నియొక్క, కీలాకలాప=జ్వాలాసమూహముచేత, సంతత=ఎల్లప్పుడును, ఆలీఢ=వ్యాప్తమయిన, హృదయ=డెందమనెడు, పాత్ర=పాత్రయొక్క, అంతరాళ=లోపల, పూరిత=నిండియున్న, స్నేహపూరంబు = స్నేహమనెడు చమురు, పొంగిపొరలన్ = పొంగునట్లుగాగి తెర్లుచుండఁగా, చల్లనిపటీర సలిలంబు చల్లరాదు = చల్లనైన చందనసలిలమనెడు సలిలము చిల్కరింపరాదని యర్థము. ఈపద్యమందుఁ జెప్పఁబడిన కనుదమ్ములు మొదలైనవానికిని హిమాంబులు మొదలైనవానికిని సహజవిరోధమని భావము. అలం. రూపకానుప్రాణిత కావ్యలింగము.

క. ఏ మంద మేమి సేయుద, మేమం దని మందలింత మేమందమొ యిం
దేమందయాన నడుగుద, మే మందఱ మనుచుఁ దరళహృదయాంబుజ లై.

ఏమందము=ఏమనిచెప్పుదుము, ఏమిసేయుదము=ఏమిక్రియచేయుదము, ఏమందనిమందలింతము=ఏయౌషధమని మనము మందలింతము, ఏమందమొ = ఏమిచందమో, ఇం దేమందయాననడుగుదము=ఇక్కడ నేస్త్రీనినడుగుదము, ఏమందఱమనుచున్ = మేమందఱమునని పలుకుచు, తరళహృదయాంబుజలై=చంచలమయిన హృదయకమలములు గలవారై. ఈపద్యమందు విషాదమనెడు సంచారిభావము చెప్పంబడియెను.

మందలించుట యనఁ దలంచుట.

సీ. ముక్తకంచుక సక్తముక్తాఫలంబుల మందలింతురు గురువెందలట్లు.

కాళహస్తిమాహాత్మ్యము.

సీ. జవరాలియడుగులఁ జివురాకు లంటించి పొలఁతియూరులనంటిపొరలఁ బొదివి
కొమ్మచేదోయి చెందమ్ముల హత్తించి లేమబాహులుమృణాళికలఁ బెనచి
యతివగుత్తపుగుబ్బలలరుగుత్తులఁగూర్చి కాంతచెక్కులఁ జంద్రఖండ మలఁది
కలికిక్రేగన్నులు కలువఱేకులఁ గప్పి లలనపెన్నెఱుల వాలంబు ముడిచి
తే. నవనవగుణానుబంధబాంధవము లైన, చలువ లెన్నేనిఁ గావించి చెలువచెలులు
నెలఁతకీవసులాభంబు నించుమంచు, నించువిల్కాని మఱలఁ బ్రార్థించుటయును.

జవరాలియడుగులఁ జివురాకులంటించి = గిరికయొక్క పాదములయందుఁ జిగురుటాకులనంటించి, పొలఁతియూరులనంటి పొరలఁ బొదివి=గిరికయొక్క తొడల నరఁటిచెట్టు పైపొరలచేతఁ బొదిగి, కొమ్మచేదోయి చెందమ్ములహత్తించి=గిరికయొక్క హస్తద్వయము నెఱ్ఱదామరపువ్వులయందుఁ గదియించి, లేమబాహులు మృణాళికలఁ బెనచి = గిరికయొక్క భుజమును దామరతూఁడులతోఁ బెనచి, అతివగుత్తపుగుబ్బలలరుగుత్తులఁగూర్చి=గిరికయొక్క బిగిచన్నులు పూగుత్తులతో జోడించి, కాంతచెక్కులఁ జంద్రఖండమలఁది=గిరికయొక్క చెక్కులయందుఁ గర్పూరముఁబూసి, ఇక్కడ సాదృశ్యమందుఁ జంద్రశకలమని చెప్పవలయును.

కలికిక్రేగన్నులు కలువఱేకులఁగప్పి=గిరికయొక్క నేత్రపార్శ్వములు కలువఱేకులచేతఁగప్పి, లలనపెన్నెఱుల వాలంబుముడిచి=గిరికయొక్క గొప్పతలవెండ్రుకలయందుఁ గురువేరు ముడిచి, ఈ

యర్థమందు వాలమనఁగాఁగురువేరనియును సాదృశ్యార్థమందుఁ జమరీవాలమనియును జెప్పవలయును. (ని. 'వాలః కచే శ్వాదిపుచ్ఛే స్త్రీ, బేరేతు నపుంసకమ్' అని నా.) నవనవగుణాను బంధబాంధవము లైన = నవమనఁగా నభినవమును భిన్నభిన్నార్థమును, అభినవములైన రక్తిమాదిగుణాను బంధముచేత సదృశములైన వని యర్థము. ఏతీరుగుణము గలవారికి నాతీరు గుణముగలవారు బంధువులని యర్థాంతరము. చలువలెన్నేనిఁ గావించి = శైత్యోపచారము లెన్నెన్నియో చేసి, చెలువచెలులు = గిరికాదేవి చెలికత్తియలు, నెలఁతకున్ =గిరికాదేవికి, ఈవు=నీవు, అసులాభంబు నించుమంచున్ = ప్రాణలాభము గలుగఁజేయుమని పలుకుచు అనియర్థము. నెలఁతకు నీవసురాజలాభము గలుగఁ జేయుమని యును అర్థము. ఇంచువిలుకాని మఱలఁ బ్రార్థించుటయును=ఇంచనఁగా నిక్షుశబ్దతద్భవము అనఁగా చెఱకు గనుకఁ జెఱకువిలుకాఁడైన మన్మథుని మఱలఁ బ్రార్థింపఁగా.

అడుగులకుఁ జివురులు, చేదోయి కెంజిదామరలు, గుబ్బలకుఁబూవులగుత్తులు, పెన్నెఱులకు వాలములు గుణానుభావబాంధవముగలవి. మార్దవరక్తిమావర్తులాదిగుణములందు నెయ్యములనిభావము. ఏతీరుగుణముగలవారి కాతీరుగుణముగలవారె తగినబాంధవులుగాన నవయవముల కనుగుణములగు శిశిర వస్తుసమృద్ధిని జతపఱచిరనిభావము.

శా. ఆవాక్యంబులలో సుధామయశుభై కాయత్తచిత్తేశసం
జ్ఞావర్ణంబు లొకింత వీను లెనయన్ సంజాతచైతన్యయై
పూవుంబోఁడి సుధాంశుబింబసుషమాపూర్ణాభిషేకప్రమీ
లావీతోత్పలవల్లివోలెఁ గనుగల్వల్విప్ప నాళీజనుల్. 183

ఆవాక్యంబులలోన్ = చెలికత్తెలు పలికిన యావాక్యములలో, సుధామయ = అమృతప్రాయములైన, శుభైకాయత్త = శుభాధీనములైన, చిత్తేశసంజ్ఞావర్ణంబులు = హృదయేశ్వరుఁడైన వసురాజుయొక్క పేరిటియక్షరములు, వీనులెనయన్=చెవులుసోకఁగా, సంజాతచైతన్యయై = పుట్టినచైతన్యముగలదై, పూవుంబోఁడి=గిరికాదేవి, సుధాంశుబింబ = సంపూర్ణచంద్రబింబముయొక్క, సుషమాపూర = శ్రేష్ఠకాంతి పూరముయొక్క - అనఁగాఁ జంద్రికాపూరముయొక్క, అభిషేక = తడుపుటచేత, ప్రమీలావీత=సంకోచరహితమయిన, ఉత్పలవల్లివోలెన్=కలువతీఁగవలె, కనుగల్వల్విప్పన్= కలువలవంటి కన్నులుదెఱవఁగా, ఆళీజనులు = సఖీజనులు. ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

ఈపద్యమందు బోధమనెడి సంచారిభావము చెప్పంబడియెను. అందుకులక్షణము-

క. 'జగతిం జిత్తనిమీలన, మగునిద్రయనంగ మూర్ఛనందుకొ మోహం
బగుబోధ మెఱుకఁజెందుట, యగధృతమృతియత్నమంత మగుసెట్లున్నన్'

అని నరసభూపాలీయమునఁ జెప్పఁబడియున్నది.

వసుశబ్దము గిరిక చెవులకు సుధామయమై సోఁకుటవలన సంజాతచైతన్యయయ్యెను. ఉపచారములు నిరర్థకములనుట. పూవుంబోఁడియనుచోఁ బోఁడిశబ్దముతోఁ బూవుశబ్దము సమసించునపుడు "సర శేషరుక్షేచైవసమానేనుముతో భవేత్" అను నాథర్వణసూత్రానుసారముగ నుగాగమమువచ్చి వకారమునకు సరళాదేశము నుకారమునకు బిందాదేశము సిద్ధించెనని తెలియనగును.

అప్పావుంబోడులు ముప్పురతో. మను. ఆ. 6
చిగురుంబోడి యెఱుంగదే. కళాపూ.

ఉ. కొందల మేల బాల మనకూర్చుసపర్యకు మెచ్చి యిందిరా
నందనుఁ డిందు సన్నిధి యొనర్చె సుమీ సుమనఃప్రసాదముం
జెందె సుమీ శుకోక్తిఁ గలసేమము దెల్పె సుమీ సమీహితం
బందెడు సందియంబు వలదమ్మ యటం చభయంబు దెల్పుచున్. 184

కొందలమేల=విచారమెందుకు, బాల=ఓగిరికాదేవి, మనకూర్చుసపర్యకు మెచ్చు=మనముచేసినపూజకు హర్షించినవాఁడై, ఇందిరానందనుఁడు = మన్మథుఁడు, ఇందుసన్నిధియొనర్చెసుమీ=ఇక్కడ సాక్షాత్కరించినాఁడుసుమా, సుమనఃప్రసాదముంజెందెసుమీ=అనఁగాఁ బుష్పప్రసాదమునుబొందినాఁడుసుమా, శుకోక్తిన్=శుకవాక్యమనెడు వాక్యముచేత, కలసేమముదెల్పెసుమీ = సిద్ధముగాఁగల కుశలమును దెలిపినాఁడుసుమా! కాఁబట్టి, సమీహితంబందెడున్=కోరికసిద్ధించుచున్నది. సందియంబు వలదమ్మ=సందేహపడ నక్కరలేదమ్మా, అటంచున్=అనిపలుకుచు, అభయంబుదెలుపుచున్=భయము లేకపోవుటను దెలియఁజెప్పుచు. ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

మన్మథుఁడు ప్రత్యక్షమగుటవలనఁ దా మర్పించు సుమనఃప్రసాదము జెందినట్లును, చిలుకల పలుకులవలనఁగలసేమము నెఱింగించినట్లును, నిశ్చయించికొని చెలిమికత్తెలు గిరికాదేవి కభయమును దెలిపిరనిభావము. అలం. శ్లిష్టాశ్లిష్టసంకరము.

క. కేళికమనీయకానన, పాళిక వెలువడి కురంగపాళికళాబిం
బాళికలు బాళికడిమిన్, బాలికఁ దెచ్చిరి విహారభవనంబునకున్. 185

కేళి=క్రీడచేత, కమనీయ=సుందరమగుచున్న, కాననపాళికన్=వనప్రదేశమును, వెలువడి=బయలువెడలి, కురంగపాళి=మృగలాంఛనుఁడైన చంద్రునియొక్క, కళా=కళకు, బింబ=ప్రతిబింబమైన, అళికలు=ఫాలభాగములు గలమగువలు, (ని. 'లటాటమలికంగోధిః' అని అ.) ఇక్కడఁ జతుర్థి నాఁటి చంద్రునితోడను విదియచందురునితోడను అష్టమినాఁటిచంద్రునితోడను చెలులఫాలమునకు సాదృశ్యముగలదు గనుకఁ గళాబింబాళికలని చెప్పినాఁడు. బాళికడిమిన్ = చింతాతిశయనుచేత, బాలికఁదెచ్చిరి విహారభవనంబునకున్ = క్రీడాగృహమునకు గిరికాదేవిని వెంటఁబెట్టుకొని వచ్చిన వారైరి. ఈపద్యము ద్విప్రాసము గలదిగాఁ జెప్పంబడియెను.

ఆ శ్వా సాం త ము.

శా. పశ్యత్ఫాలవిలోచనానలశిఖాభాస్వన్మహోమిత్ర మి
త్రశ్యామారమణేక్షణప్రవణచేతఃపద్మపద్మాంగభూ
దృశ్యాగద్యుతిసంగ సంగరమదోద్వృత్తారిరాహుత్తరా
ద్వైశ్యాలోకభుజంగ జంగమనగద్వైదండపూర్ణాంగణా. 186

పశ్యత్ఫాల=చూచుచున్న నొసలుగలరుద్రునియొక్క, విలోచనానల = నేత్రాగ్నియొక్క, శిఖా = జ్వాలికవలె, భాస్వత్ = ఉజ్జ్వలమగుచున్న, మహః = ప్రతాపమే, మిత్ర = సుహృత్తుగాఁ గలవాఁడా, మిత్ర=సూర్యుఁడును, శ్యామారమణ నిశాపతియైన చంద్రుఁడును అనఁగా సూర్యచంద్రు

లు. ని. 'శ్యామా యాపనమధ్యస్థా త్రివృతా శారిబా నిశా' అని నా. ఈక్షణ = నేత్రములుగాఁగల విష్ణుదేవునియందు, ప్రవణ=ఆసక్తమైన, చేతఃపద్మ=చిత్తకమలము గలవాఁడా, పద్మాంగభూ=మన్మథు నియొక్కవలె, దృశ్య=చూడఁదగిన, అంగద్యుతి=దేహకాంతితోడ, సంగ=కూడుకొనినవాఁడా, సంగర=యుద్ధములయందు, మదోద్వృత్త= ఉన్మాదముచేత సముద్ధతులైన, అరి=శత్రుసంబంధులైన, రాహుత్తరాట్=యోధాగ్రేసరులనెడు, వేశ్యాలోక=వేశ్యాజనమునకు, భుజంగ=విటుఁడవైనవాఁడా, జంగమనగత్=సంచరించెడు పర్వతములవలె నాచరించుచున్న, వేదండ=ఏనుఁగులచేత, పూర్ణ=నిండిన, అంగణ=ముంగిలి గలవాఁడా యని కృతిపతింగూర్చి సంబోధనము. ఈపద్యము ముక్తపదగ్రస్తముగల దిగాఁ జెప్పంబడియెను.

క. శంబరనయనానూతన, శంబరహర విమతకుధరశంబ రణజయా
డంబరపీతాంబర యెం, తెంబరగండాంక యతులధృతినిశ్శంకా. 187

శంబరనయనా=లేడికన్నులవంటి కన్నులుగల స్త్రీలకు, నూతనశంబరహర=అభినవమన్మథుఁడవైనవాఁడా, విమత = శత్రువులనెడు, కుధర=పర్వతములకు, శంబ = వజ్రాయుధమయినవాఁడు, ని. 'శతకోటి స్వరు శ్శమ్బః' అని అ. రణజయాడంబరపీతాంబర=యుద్ధజయసంరంభమందు విష్ణుఁడవైనవాఁడా, ఎంతెంబరగండాంక = ఎంతెంబరుఁడనెడు రాజునకు మగఁడవుగనుక నెంతెంబరగండఁడనెడు బిరుదుగలవాఁడా, అతులధృతినిశ్శంకా = సమానరహితమయిన ధైర్యముగలవాఁడవుగనుక నేశంకారహితుఁడవయినవాఁడా అని సంబోధనము. ఈపద్యము ద్విప్రాసముగలదిగాఁ జెప్పంబడియెను.

కవిరాజవిరాజితము. అనయనిషూదన శశ్వదసాదనయప్రతిపాదన దివ్యఝరీ
వనమదనోదనకీర్తివినోదనవైరివనాదనమత్తకరీ
ఘనఘననాదనటజ్జయవాదనగాఢనినాదనతేంద్రగిరీ
వినమదసూదన మ్లేచ్ఛవినోదనవీరబరీదనరాదహరీ. 188

అనయ=నీతిరహితులైనవారికి, నిషూదన = సంహారకుఁడవైనవాఁడా, శశ్వత్=ఎల్లప్పుడును, అసాద=క్షీణింపని, నయ = నీతియొక్క, ప్రతిపాదన = ప్రతిపాదకుఁడవైనవాఁడా, సాదశబ్దము కార్శ్యవాచకము. ఇందుకు రఘువంశమందు, శ్లో. 'శరీరసాదాదసమగ్రభూషణా' అని ప్రయోగము. దివ్యఝరీ=ఆకాశగంగయొక్క, వన = ఉదకముయొక్క, ని. 'వనే సలిల కాననే' అని అ. మదనోదన = మదాపహారియైన, కీర్తివినోదన = కీర్తివినోదకుఁడవైనవాఁడా, ఇక్కడ నాకాశగంగయొక్క యుదకము తెల్లనిదని తెలియవలయును. వైరివనాదన = శత్రువులనెడు వనములయొక్క భక్షణమందు-అనఁగా భంజనమందు, మత్తకరీ = మదపుటేనుఁగు వైనవాఁడా, ఘన=అధికమయిన, ఘననాద=మేఘగర్జనమువలె, నటత్=ప్రవర్తించుచున్న, జయవాదన = జయభేరియొక్క, గాఢనినాద =నితాంతధ్వనికి, నత=వంగిన, ఇంద్రగిరీ=మహేంద్రపర్వతము కలవాఁడా, వినమత్=మిక్కిలి నమ్రులగుచున్నవారికి, అసూదన=సంహారకుఁడవు గానివాఁడా-అనఁగా రక్షకుఁడ వైనవాఁడా, మ్లేచ్ఛవినోదన=మ్లేచ్ఛులను సంహరించువాఁడా, వీర=పరాక్రమవంతుఁడయిన, బరీద=బెడదకోటనవాంబుసంబంధులనెడు, నరాద=రాక్షసులకు, హరీ=నారాయణుఁడవైనవాఁడా యని సంబోధనము. ఈవృత్త

మిరువదిమూఁడవ ఛందంబగు వికృతిచ్ఛందంబునం బుట్టినది. దీనికి నజజజజజజ వ గణము లుండవలయును. పదునాలవయక్షరము యతిస్థానము. ఈవృత్తము వృత్త్యనుప్రాసాంత్యప్రాసములు గలదిగాఁ జెప్పంబడియెను.

గద్యము. ఇది శ్రీమద్రామచంద్రచరణారవిందవందనపవననందనప్రసాదసమాసాదితసంస్కృతాంధ్రభాషాసామ్రాజ్యసర్వంకషచతుర్విధకవితానిర్వాహకసాహిత్యరసపోషణరామరాజభూషణప్రణీతం బైనవసుచరిత్రం బనుమహాప్రబంధంబునందుఁ దృతీయాశ్వాసము.

ఇది శ్రీమదాత్రేయకులకలశాంభోనిధి సంపూర్ణసోమ సోమాభిధానమంత్రివరపౌత్రుండును సోమసుతసిద్ధేశ్వరమంత్రీశ్వరపుత్రుండును శ్రీమత్పార్వతీరాజేశ్వరవరప్రసాదసమాసాదితహృద్యానవద్యనిఖిలవిద్యావిశారదుండును నగుసోమకవిచేత విరచితం బయినవిద్వజ్జనరంజనీనామక పూర్వవ్యాఖ్యానమునందలి విశేషవిషయసహితముగాఁ బరిష్కృతం బయి యొప్పారుప్రతిపదటీకారూపంబగు వసుచరిత్రనామకాంధ్రకావ్యరత్నవ్యాఖ్యానమునందుఁ దృతీయాశ్వాసము.

శ్రీరస్తు.

వసుచరిత్రము, సవ్యాఖ్యానము

చతుర్థాశ్వాసము.

శ్రీరంగరాయకలశాం
భోరాశినిశాసహాయ ♦ భూభువనధురా
ధౌరేయ వీరగోష్ఠీ
ధీరాద్భుతసాంపరాయ ♦ తిరుమలరాయా. 1

శ్రీరంగరాయ=శ్రీరంగరాయఁ డనెడు, కలశాంభోరాశి=క్షీరసముద్రమునకు, నిశాసహాయ=చంద్రుఁడ వైనవాఁడా, భూభువన=భూలోకముయొక్క, ధురా=భారమునకు, ధౌరేయ=ధురంధరుఁడ వైనవాఁడా, వీరగోష్ఠీ=వీరులయొక్క సభకు, (ని. 'సమజ్యా పరిష ద్గోష్ఠీ సభా సమితి సంసదః') అని అ. ధీర=మనోహరమును, అద్భుత = ఆశ్చర్యకరమునైన, సాంపరాయ=యుద్ధముగలవాఁడా, తిరుమలరాయా=తిరుమలరాయఁడను పేరుగలవాఁడా అని సంబోధనము. (ని. 'సాంపరాయో స్త్రియాం ద్వంద్వం యుద్ధం' అని యమరశేషము.) ఈపద్యము వృత్త్యనుప్రాసము గలదిగాఁ జెప్పంబడియెను. అలం. రూపకము.

తే. అవధరింపుము శౌనకా♦ద్యఖిలసన్ము, నీంద్రులకు రౌమహర్షణి♦యిట్లు పలుకుఁ
జెలులకై దండఁబూనియా♦చిగురుఁబోఁడి, చారుమణిధామమల్లనఁ♦జేరఁజనుడు.

అవధరింపుము=చిత్తగింపుము. శౌనకా ద్యఖిల సన్మునీంద్రులకున్=శౌనకుఁడు మొదలుగాఁగల సమస్త మునిశ్రేష్ఠులకు, రౌమహర్షణి=రోమహర్షణ పుత్త్రుఁడైన సూతుఁడు. ('రోమహర్షణస్యాపత్యంపుమాన్ రౌమహర్షణిః' అని.) ఇట్లుపలుకున్=ఈచెప్పఁబోవు ప్రకారముగా వచించెను. ఏమనియనిన, చెలుల కై దండఁ బూని=సఖులయొక్క చేయూఁతనవలంబించి, ఆచిగురుఁబోఁడి=ఆగిరికాదేవి, చారుమణిధామము=సుందరమైన మణిమందిరమును, అల్లనఁ జేరఁ జనుడున్=తిన్నగాఁ జేరఁబోఁగా.

సీ. పతి వంచనామౌనిఁ♦బంచి మించినవేడ్కఁ బొంచియుండినపువ్వు♦బోదలు సూచి
సమయానుగుణ సమా♦గమలీలఁ గాంచిన నరనాథు చరణాంక♦సరణిఁ జూచి
రమణీకృతోపచా♦రము లిచ్చఁ గైకొన్నప్రియుఁ డున్న సౌవర్ణ♦పీఠిఁ జూచి
రమణానుబింబభా♦గ్యములు నోఁచిన చకచకితమాణిక్యభి♦త్తికలు సూచి
తే. హైమగృహవాటి నాఁటివ♦రావలోక, కౌతుకం బప్పుడటుగన్న♦కరణిఁ దోఁప
నలసి సొలసి ప్రవాళశ♦య్యాతలమున, నల సితాపాంగ మై సేర్చి♦యడలునంత,

పతిపంచనామూనిఁ బంచి=వసురాజు కపటయతిని బంపించి, మించిన వేడ్కన్=అతిశయించిన వేడుకచేత, పొంచియుండిన=డాగియున్న, పువ్వుఁబోడలుసూచి=పూఁబోడలను జూచియును, సమయానుగుణ సమాగమలీలఁగాంచిన=సమయమున కర్తవ్యమగునట్టులుగా వచ్చిన రాకడయొక్క విలాసమును బొందియున్న, నరనాథు=వసురాజుయొక్క, చరణాంక=పాదములచేతఁ జిహ్నితమైన, సరణిఁ జూచి=మార్గమును జూచియును, రమణీకృతోపచారము లిచ్చఁగైకొన్న=స్త్రీలచేతఁ జేయఁబడిన యుపచారముల నాసక్తిచేత నంగీకరించిన, ప్రియుఁడు=మనోహరుఁడు వసురాజు, ఉన్న=కూర్చున్న, సౌవర్ణపీఠిఁజూచి=సువర్ణమయమయిన పీఠమును జూచియును, రమణ=రమణుఁడైన వసురాజుయొక్క, అనుబింబ=ప్రతిబింబముయొక్క, భాగ్యములునోచిన=భాగ్యములు గలుగునట్టులుగాఁ బూర్వజన్మమునందు నోములునోచిన, చకచకిత మాణిక్య భిత్తికలుసూచి=చకచకాయమానము లగుచున్న రత్నకుడ్యములను జూచియును,

హైమగృహవాటిన్=సువర్ణమయమైన గృహప్రదేశమందు, నాఁటివరావలోక కౌతుకంబు==నాఁడుపొందిన వసురాజ దర్శన జనితమైన సంతోషము, అప్పుడటుగన్నకరణిఁ దోఁపన్=అప్పుడట్టే పొందినట్లుగాఁ దోఁచుచుండఁగా, అలసి సొలసి=వ్యథనొంది తూలి, ప్రవాళశయ్యాతలమునన్=చిగురుటాకుల పాన్పునందు, అలసితాపాంగ=ధవళములైన క్రేఁగన్నులుగలయాగిరికాదేవి, మైసేర్చి=దేహమునుహత్తించి, అడలునంతన్=విచారపడుచున్నమీఁదట.

ఈపద్యమందు భూతార్థసాక్షాత్కారవర్ణనము చేసినాఁడు గనుక భావికాలంకారము. ని. 'భావికం భూతభావ్యర్థసాక్షాత్కారస్య వర్ణనమ్' అని లక్షణము.

చ. భవదనుజాత్మజన్ వసున్నృ•పాలుఁడు గైకొను నెల్లినేఁట న
య్యవనివరప్రసాదమున • నంటదువో భవదీయజాతికిం
బవిభయ మంచు మంచుమల•పట్టికి భావిశుభంబు లోకబాం
ధవుఁ డెఱిఁగింపఁ బోయినవి•ధంబున నేగెఁ బయోధిచెంతకున్. 4

భవత్=నీయొక్క, అనుజ=తమ్ముఁడైన కోలాహల పర్వతునియొక్క, ఆత్మజన్=కూఁతురైన గిరికాదేవిని, వసున్నృపాలుఁడు=వసురాజు, కైకొను నెల్లినేఁటన్=రేపటనేఁటఁ బరిగ్రహించుచున్నాఁడు-అనఁగాఁ బాణిగ్రహణము సేయుచున్నాఁడు. అయ్యవనివరప్రసాదమునన్ = ఆరాజుయొక్క యనుగ్రహముచేత, భవదీయజాతికిన్ = నీసంబంధమయిన పర్వతకులమునకు, పవిభయము=వజ్రాయుధ సంబంధమయిన భయము, అంటదువో=తగలదుసుమీ, అంచున్=ఇట్లని, మంచుమలపట్టికిన్=హిమవత్పర్వత పుత్త్రుఁడయిన మైనాకునికి, భావిశుభంబు = ముందుగాఁగల శుభమును, లోకబాంధవుఁడు=సూర్యుఁడు, ఎఱిఁగింపఁబోయినవిధంబునన్ = తెలియఁజెప్పెడుకొఱకుఁ బోవునట్టులుగా, పయోధిచెంతకున్=పశ్చిమసముద్ర ప్రాంతమునకు, ఏగెన్=పోయెను. అనఁగా సూర్యుఁడస్తమించు సమయమాయెనని తాత్పర్యము. ఇందులో లోకబాంధవశబ్దము సాభిప్రాయము. తాను లోకబాంధవుఁడగుటచే హితము దెలుప వలచి గిరికను వసురాజు పెండ్లాడుననియు శైలజాతి కింకమీఁదట వసురాజానుగ్రహవశమున వజ్రభయముండదని మైనాకున కెఱింగించుటకుఁబోవునటుల భాస్కరుఁ డస్తంగతుఁడయ్యెను. మైనాకుఁడు వజ్రపాతభయమున సముద్రమునసుండెఁ గాన నటకుఁ బోయినటుల నస్తమించెను. అలం. ఉత్ప్రేక్ష.

ఉ. కాలవశంబునం దనయఖండితచండిమ దూలి హేళి య
స్తాలయవాటికిం జనుచు నాత్మకరావృతదుర్గపాళి నా
ప్తాళి నమర్చె నాఁ బరిణతాతపము ల్గిరులెక్క నిక్కెఁ ద
న్మూలములం దనాతపసమూహము పేరిటియిర్లవేలముల్.

ఈపద్యమునందు దొల్లిఁటివిభవము గోల్పోయిన రాజుపరముగను సూర్యునిపక్షముగను నర్థద్వయము గలదు.

కాలవశంబునన్=సంధ్యాకాలాగమముచేతనని యర్థము. కాలవిపర్యయముచేత నని యర్థాంతరము. తన యఖండిత చండిమ దూలి = తనయొక్క సంపూర్ణమైన తీక్ష్ణత్వము చెడిపోయి యని యర్థము. తనయొక్కయౌద్ధత్యము చెడిపోయి యని యర్థాంతరము. హేళి=సూర్యుఁడు, అస్త=అస్తాచలమనెడు, ఆలయవాటికిం జనుచున్=గృహప్రదేశమునకుఁ బోవుచు, ఆత్మ=స్వకీయమయిన, కర=కిరణములచేత, ఆవృత=ఆవరింపఁబడిన, దుర్గపాళికిన్=పర్వతసమూహములయం దని యర్థము. నిజహస్తావృతగిరిదుర్గపాళియం దని యర్థాంతరము. అనఁగా దనకు హస్తగతములైన దుర్గములయం దనుట, ఆప్తాళినమర్చెనాన్=ఆప్తజనసమూహమును గావలిపెట్టినాఁడో యన్నట్టులుగా, పరిణతాతపము ల్గిరులెక్కన్=పండఁబారిన యెండలు పర్వతాగ్రముల కెక్కఁగా, తన్మూలములందున్=ఆపర్వతములయొక్క యడుగుమట్లయందు, అనాతప సమూహము పేరిటి-అనాతప=నీడలయొక్క, సమూహము పేరిటి=గుంపులనెడు, ఇర్లవేలముల్=చీఁకటులయొక్క దండ్లు, నిక్కెన్=విజృంభించెను.

కాలవశమున సూర్యుఁడు తనబీరము కోలుపోయి యస్తాచలము దరియనేగుచుఁ దొల్లి తాను కరములచే నలరించిన దుర్గములందుంచిన యాప్తులవలె సంధ్యారాగారుణప్రభలు శైలాగ్రములఁ గనుపించెను. శైలము ముట్టడింపవచ్చిన విరోధిసమూహమువలె నీడలను జీఁకటిగుంపులు విజృంభింపసాగెను. సూర్యుఁ డస్తంగతుఁడు కానుండ శైలాగ్రములసంజకావి మించెననియు నీడలు చీఁకటులవలె శైలమూలముల నలరెననియు భావము. అలం. ఉత్ప్రేక్షారూపకసాంకర్యము. సమాసోక్తి.

తే. అప్పు డపరానుషంగ లబ్ధాంగరాగ, మేర్పడఁగ నక్షిగతుఁడైన యినునిఁ జూచి
పద్మినిముడించె నెమ్మోము ప్రభ దలిర్పఁ, దయ్యె వెంబడిఁ జనకఛాయయును మఱలె.

అప్పుడు=ఆసమయమందు, అపరా=అపరదిశయొక్క,అనుషంగ=సంగతివలన, లబ్ధ=ప్రాప్తమైన, అంగరాగము=ఆకారముయొక్క రక్తిమ, ఏర్పడఁగన్=ప్రకటమగునట్టులుగావని యర్థము. అన్యకాంతాసంభోగమువలనఁ బ్రాప్తమయిన మయిపూఁత ప్రకటమగునట్టులుగా నని యర్థాంతరము. అక్షిగతుఁడయిన=దృగ్గోచరుఁడయినయని యర్థము. ద్వేష్యుఁడైన యనియర్థాంతరము. (ని.'ద్వేష్యే త్వక్షిగతః'అని అ.) ఇంతపర్యంతము నభేదాధ్యవసాయము సేయవలయును. ఇనునిఁజూచి=సూర్యుఁడనెడు పెనిమిటినిఁ జూచి, పద్మినిముడించె నెమ్మోము=పద్మలతయనెడు పద్మినీజాతిస్త్రీ ముఖము ముడిచిపెట్టుకొనె నని యర్థము. ఇక్కడఁ బద్మముకుళనమును మోముముడుచుటనుగా నధ్యవసించినాఁడు. ప్రభదలిర్పదయ్యెన్=ప్రభయనెడుస్త్రీ దలిర్పదయ్యె నని యర్థము. తలిర్పకపోవుట ప్రభాపక్షమందు మందమగుటయుఁను, స్త్రీపక్షమం దుల్లసిల్లక పోవుటయును నని తెలియవలయును. వెంబడి జనకఛాయయును మఱలెన్=ఛాయయనెడు స్త్రీ వెంటఁ బోవక మఱలెనని యర్థము. వెం

బడిఁ జనకపోవుటయనఁగా ఛాయాపక్షమందు వెనుకకు సాగుటయును, స్త్రీపక్షమందు ననుసరణము మాని మఱలుటయును. ఇక్కడ నుభయత్ర యేకదేశవర్తిరూపకము.

ఇక్కడ ఖండితయనెడు నాయికను జెప్పినాఁడు. ఇందుకు లక్షణము-

క. 'ఇతరదిశ రాత్రిరతిచి, హ్నితుఁడగు పతిరూపు గని సహింపనియది ఖం
డితయగుఁ గలహాంతరితయుఁ, బతి నవమానించి పిదపఁ బరితప్తయగున్.'

అని నరసభూపాలీయమునందుఁ జెప్పఁబడియున్నది.

ఇందులో ముఖముకుళనభావమాత్రముచేత, పద్మలతాస్త్రీని ముగ్ధయనియును దలిర్పకపోవుట చేతఁ బ్రభాస్త్రీని మధ్యయనియును వెంబడిఁ జనక మఱలుటచేత ఛాయాస్త్రీని ప్రౌఢయనియును దెలియవలయును. పద్మినియందు ముగ్ధాచేష్టయును బ్రకటముచేసినాఁడు గనుకఁ బ్రభాస్త్రీయందు మధ్యాచేష్ట చెప్పవలయును. ముగ్ధాదులకు లక్షణము-

శ్లో. 'ఉదయద్యౌవనా ముగ్ధా లజ్జా విజితమన్మథా
లజ్జామన్మథమధ్యస్థా మధ్యా మోదితయౌవనా
స్మరమందీకృతవ్రీడా ప్రౌఢా సంపూర్ణయౌవనా.'

నాయకుఁడు ధృష్టుఁడని తెలియవలయును. 'వ్యక్తాపరాధో గతభీ స్సధృష్ట ఇతికథ్యతే' అని లక్షణము.

సూర్యబింబము అస్తంగతమగుచుండ సంజకావి విస్తరిల్లెననియుఁ, దామరలు ముకుళించెనని యుఁ, బ్రకాశము మందగించెననియు, నీడలు వెనుమఱలి నిడుదలుగా సాగుచుండెననియు భావము.

అలం. రూపకము. శ్లేషమూలకసమాసోక్తి.

సీ. వనజాలయము మూసి • యినుజాడఁ దిలకించు లలితాబ్జినీ రాగ•లక్ష్మి యనఁగ
ఘనపదాయసపట్టి•కఁ దమోంజనము పట్ట నపరాశ యిడిన దీ•పార్చి యనఁగఁ
గప్పుచూపుచుఁ బాంథ•గణము నేచు ప్రదోషకరిమేని ధాతుశృం•గారమనఁగ
ద్విజసూక్తిఁ బతిరాక•దెలిసి మోమెత్తి రాత్రివహించు కాశ్మీర•తిలక మనఁగ
తే. సమయమృగహృత రవిరఘూ•త్తమునిసతిఁ బ్ర
భామయిఁ దమోనిశాటుండు • పరవకుండ
ననలధామంబులో డాఁచి • యమరు లిడిన
వంచనాగౌరగాత్రి నా • వరలె సంధ్య. 7

వనజాలయముమూసి=కమలములనెడు నిల్లుతలుపుమూసి, ఇనుజాడఁదిలకించు=('సాయంకాలే త్వయం విష్ణుః') అని యున్నది గనుక విష్ణుస్వరూపుఁడయిన సూర్యునిజాడఁ జూచుచున్నదియు, లలిత=ఒప్పుచున్నదియు నగు, అబ్జినీ=పద్మలతయొక్క, రాగలక్ష్మియనఁగన్=అనురాగలక్ష్మియో యన్నట్టులుగా నని యర్థము. రాగలక్ష్మి యన్నచోట సామ్రాజ్యలక్ష్మీత్యాది స్థలములయందుంబలె విచారింపవలయును. ఈచరణమందు నభిసారికయనెడు నాయికను జెప్పినాఁడు. ఇందుకు లక్షణము-(శ్లో. కాంతాభి సరణోద్యుక్తా స్మరార్తా సాభిసారికా' అని తామరపూవులు ముకుళించెననియు సంధ్యా

రాగము వ్యాపించెననియు భావము. తమ్మిమొగ్గలు పైకెత్తికొనియుండును గాన నినుని దిలకించుచున్నట్టులుండెననుట. అలం. రూపకోత్థాపితోత్ప్రేక్ష.

ఘనపదాయసపట్టికన్ =ఆకాశమనెడు నినుపఱేకునందు, తమోంజనము పట్టన్ = చీఁకటి యనెడు కాటుక పట్టెడుకొఱకు, అపరాశ యిడిన దీపార్చియనఁగన్ = పశ్చిమదిశయనెడు స్త్రీ పెట్టిన దీపజ్వాలయో యన్నట్టులుగా ననియర్థము. ఈచరణమందు వాసకసజ్జిక యనెడు నాయికను జెప్పినాఁడు.

శ్లో.'ప్రియాగమనవేళాయాం మండయంతీ ముహుర్ముహుః,
కేళీగృహం తథాత్మానం సాస్యా ద్వాసకసజ్జికా.'

అని లక్షణము.దీపార్చి యపరాశనిడినటులఁ జెప్పఁబడుట పశ్చిమదిక్కునుండి సంధ్యారాగము బయలువెడలుచున్నదనియు నాకాశము అయసపాత్రమువలెనున్నదనుటచేఁ జీఁకటులావరించి మిగిలినదిశలు నల్లగానున్నవనియు భావము. అలం. ఉత్ప్రేక్ష.

కప్పుచూపుచున్ =నైల్యముగనుపఱచుచు, పాంథగణము నేచు = విరహులనెడు తెరువరులను వేధించుచున్న, ప్రదోషకరిమేని=ప్రదోషకాలమనెడు నేనుఁగుశరీరమందలి, ధాతుశృంగార మనఁగన్ =రాజుచేత రచింపఁబడిన రేఖాలంకారమో యన్నట్టులుగా నని యర్థము. శృంగారమనఁగా గజమండనమునకుఁ బేరు. ('శృఙ్గార స్సురతే నాట్యే రసేపి గజమణ్డనే' అని వి.) ఏనుఁగు దేహమందు జాజురేఖలువ్రాయుట ప్రసిద్ధము. ప్రదోషకాలము చీఁకటులు పిక్కటిల్లసాగెను. చీఁకటులు సంధ్యయను నేనుఁగువలెనుండెననియు, సంధ్యారాగ మాయేనుఁగుమేనఁగల ధాతువర్ణమువలె నుండె ననియు భావము. అలం. రూపకమిశ్రోత్ప్రేక్ష.

ద్విజసూక్తిన్ =పక్షికలకలమనెడు బ్రాహ్మణవాక్యములవలన, (ని. 'దంత విప్రాణ్డజా ద్విజాః' అని అ.) పతిరాకఁదెలిసి=చంద్రుఁడనెడు పెనిమిటియొక్క రాకడనెఱింగి, మోమెత్తి=ప్రదోషమనెడు ముఖమెత్తి, మోమనఁగా రజనీముఖము. అనఁగాఁ బ్రదోషమును,వక్త్రంబును, ('ప్రదోషో రజనీముఖమ్' అని అ.) రాత్రి=ఇక్కడ స్త్రీలింగమహిమముచేత నొకానొక స్త్రీ స్ఫురించుచున్నది గనుక రాత్రియనెడుస్త్రీ, వహించు కాశ్మీరతిలక మనఁగన్ =ధరించిన కుంకుమపుబొట్టో యన్నట్టులుగా ననియర్థము. ఈచరణమందు ద్విజసూక్తిఁ బతిరాక దెలిసి యనెడు పర్యంతము ప్రోషితభర్తృకావస్థను జెప్పినాఁడు. ఇందుకు 'దేశాంతరగతే కాంతే ఖిన్నాప్రోషిత భర్తృకా' అని లక్షణము. పక్షులు కలకలము గావించుచుండెను. రాత్రికాంత మోమునఁ దీర్చిన సిందూరతిలకమువలె సంజ కావి యలరెను. చీఁకటులు దిగంతములవ్యాపించెననియు సంధ్యారాగవిస్తృతి తగ్గెననియుఁ భావము. అలం. ఉత్ప్రేక్ష.

మోమెత్తి రాత్రి వహించు కాశ్మీరతిలకమనఁగా ననెడుపర్యంతము వాసకసజ్జికను జెప్పినాఁడు. సమయ=సాయంకాలమనెడు, మృగ=మాయామృగముచేత, హృత=తీసికొనిపోఁబడిన, రవి=సూర్యుఁడనెడు, రఘూత్తముని=శ్రీరామునియొక్క, ప్రభామయిన్ =ప్రభయనెడు, సతిన్ = భార్యను, తమోనిశాటుండు=చీఁకటియనెడు రాక్షసుఁడు-అనఁగా రావణుఁడు, పరవకుండన్ =ఎత్తుకొనిపోకుండునట్లుగా, అనలధామంబులోన్ =అగ్నితేజమునందు, ఉభయత్ర తుల్యము. డాచి=దాచి

పెట్టి, అమరులు=దేవతలు, ఇడిన=ఎదుట నిలిపిన, వంచనాగౌరగాత్రినాన్=పసపుచాయ శరీరముగల మాయాసీతయో యన్నట్టులుగా, సంధ్య=సంధ్యారాగము, పఱలెన్=ప్రకాశించెను.

సూర్యునికాంతి దివాంతమందు నగ్నినిఁ జెందుట శ్రుతిప్రసిద్ధము. మాయాసీతావృత్తాంతము అధ్యాత్మరామాయణమునందుఁ జెప్పఁబడియున్నది.

శ్లో. 'అథరామోపి తత్సర్వం జ్ఞాత్వా రావణచేష్టితమ్
ఉవాచ సీతా మేకాం తే శృణు జానకి మద్వచః
రావణో భిక్షురూపేణ హ్యాగమిష్యతి తేఽంతికమ్
త్వంతుచ్ఛాయాం త్వదాకారాం స్థాపయిత్వోటజే విశ
అగ్నౌ వదృశ్యరూపేణ వర్షం తిష్ఠ మమాజ్ఞయా
రావణస్య వధాంతే మాం పూర్వవ త్ప్రాప్స్యసే శుభే.'

అని చెప్పంబడియున్నది.

సూర్యకాంతి దినాంతమునం దగ్నిని చెందుననుట సుప్రసిద్ధము.

ఉ. అంబుజినీపురంధ్రి హృదయాధిపుఁ డానక స్రుక్కి యబ్జవ
క్త్రంబునఁ దేఁటియూరుపుపొగల్వెడలం గడు మూర్ఛవోవఁ గో
కం బది హేళికిం దెలుపఁ గాదె ప్రియప్రమదావియోగశో
కంబు గణింప కేగె నిజకార్యము లెంతురె మిత్రతత్పరుల్. 8

అంబుజినీపురంధ్రి=పద్మలతయనెడు స్త్రీ, హృదయాధిపుఁ డానక=హృదయేశ్వరుఁడైన సూర్యునిఁ గానక, స్రుక్కి=వాడుదేరి, అబ్జవక్త్రంబునన్=పద్మమనెడు ముఖమందు, తేఁటియూరుపుపొగల్వెడలన్=తుమ్మెదలనెడు నిశ్వాసధూమములు బయలుదేరఁగా, కడుమూర్ఛవోవన్=మిక్కిలిమూర్ఛపోఁగా, కోకంబు=చక్రవాకము, అది=అనఁగా నాపద్మలత మూర్ఛవోవుట, హేళికిం దెలుపఁగాదె=సూర్యునికిఁ దెలియఁ జేయుటకొఱకేకదా, ప్రియప్రమదా వియోగ శోకంబు గణింపక=ప్రియాంగనావియోగమువలని దుఃఖమును లెక్కసేయక, ఏగెన్=పోయెను. (అది యుక్తమేగదా.) ఎట్లనిన, మిత్రతత్పరుల్=సుహృత్పక్షపాతముగలవారు, నిజకార్యములెంతురె=తమకార్యములను విచారించి చూతురా-అనఁగా విచారింపరని యర్థము. చక్రవాకములు సూర్యునియం దాసక్తగలిగినవని భావము.

మిత్రశబ్దము మిత్రత్వముగలవానియందును సూర్యునియందును వర్తించుచున్నది. ఈపద్యమందు విరహోత్కంఠితయనెడు నాయికను జెప్పినాఁడు. ఇందుకు లక్షణము-

క. 'విరహోత్కంఠిత యనునది, వరునితడవు సైఁపలేక వగనొందునదీ
శ్వరుఁ డిక్కకు రాకుండిన, భరపడునది విప్రలబ్ధ భావజుకాఁకన్.'

అని నరసరాజీయమునఁ జెప్పఁబడియున్నది.

తామరపూవులు సూర్యుఁ డస్తగతుఁడగుచుండ ముకుళించెను. తుమ్మెదలు తమ్ములను వీడి పోవుచుండెను. చక్రవాకము కవవీడి వియోగావస్థలోఁ దపించుచుండెను.

తుమ్మెదలు ముకుళింపనున్న తమ్ములను వీడిపోవుననుటకు-

చ. బుగబుగతావులం బొదలు పుష్పాడిచే మకరందధారచే
నొగిఁ దముఁ బ్రోచినంత వడియున్ గడు నర్మిలిఁజేరి కొల్చి మా
పగుటయుఁ దుమ్మెదల్ జలరుహంబుల తొల్లిటిరూపు దప్పినన్
దగఁ దొగల న్వసించెను గృతఘ్నుల నెందును నమ్మవచ్చునే. విప్రనారాయణచరిత్రము.

చ. మొగము మొగంబుఁ గూర్చి బలుముచ్చటఁ బక్షపుటాంతరంబులన్
బిగియఁ గవుంగిలించి తన ప్రేయసి ముంగలఁ జంచుపాళికా
విగళిత నాళదంభమున వేగనె రాఁ గత మిచ్చి యేగె లో
నొగులుచు నొక్కజక్కవ యినుండు సనం దదధీనవృత్తి యై. 9

మొగము మొగంబుఁగూర్చి = ముఖమునందు ముఖముచేర్చి, బలుముచ్చటన్=అధికమయిన ప్రేమచేత, పక్షపుటాంతరంబులం బిగియఁ గవుంగిలించి=ఱెక్కలయొక్క లోపలిపార్శ్వములచేత గాఢమగునట్టులుగాఁ గౌఁగిలించుకొని, తనప్రేయసిముంగలన్=తనభార్యముందర, ఇక్కడఁ బ్రేయసీశబ్దముచేతఁ బ్రోషితభర్తృక యనెడు నాయిక స్ఫురించుచున్నది. చంచుపాళికా=ముక్కునుండి, విగళిత=జారిన, నాళ=మృణాళనాళమనెడు, దంభమునన్=మిషచేత, వేగనెరాఁగతమిచ్చి=కతమనఁగా హేతువు, ఇక్కడ గుఱుతని చెప్పవలయును. ప్రాతఃకాలము కాఁగానే వచ్చుటకుఁగాను గుఱుతిచ్చి యని యర్థము. పద్మవికాసము ప్రాతఃకాలలక్షణము గనుకఁ బద్మనాళము ప్రాతఃకాలాగమనజ్ఞాపకమని తెలియవలయును. శీఘ్రముగా వచ్చుటకు గుఱుతిచ్చి యని యర్థాంతరము. వేగ ననెడుపదము కుశాదిగణపఠితము గనుక మువర్ణకమునకు లోపమువచ్చినది. లోనొగులుచున్=లోపల వ్యథపడుచును, ఒక్కజక్కవ=ఒకానొకచక్రవాకము, ఇనుండుసనం దదధీనవృత్తియై=సూర్యుఁ డస్తాద్రికిఁ బోవఁగా సూర్యానుగమనము గలదై యని యర్థము. ప్రభువు జైత్రయాత్రపోవఁగాఁ దదధీనజీవనముగలదై యని యర్థాంతరము. ఇక్కడ వృత్తియనఁగా జీవనము. (ని. 'ఆజీవో జీవికావార్తా వృత్తి ర్వర్తన జీవనే' అని అ.) ఏగెన్=పెంటినెడఁబాసిపోయెను.

ప్రోషితభర్తృకాలక్షణము-

క. 'ఒకదేశమునకుఁ దననా,యకుఁ డేగినఁ జిన్నవోవునది ప్రోషిత భ
ర్తృక నిలుపోవక ప్రియునొ,ద్దకుఁ జనునభిసారికాభిధాన దలంపన్.'

అని నరసరాజీయము.

మ. నటదీశానశిరస్తటత్రుటితరత్నచ్ఛాయఁ గల్లోలినీ
విటమధ్యంబున వ్రాలె నభ్రమణి తద్వేగాభిపాతోన్నమ
త్పటుపాథోలవధార తార లెగసెం దద్బిందుసంధానితో
త్కటసంధ్యానలధూమకందళము లై కన్పట్టెఁ గ్రొంజీఁకటుల్. 10

నటత్=సంధ్యాకాలమందు నాట్యము సేయుచున్న, ఈశాన=శివునియొక్క, శిరస్తట=శిరఃప్రాంతమువలననుండి, త్రుటిత=తెగిపడిన, రత్నచ్ఛాయ=మాణిక్యమో యన్నట్టులుగా, కల్లోలినీవిటమధ్యంబునన్=నదీనాథుఁడయిన సముద్రునియొక్క మధ్యప్రదేశమందు, అభ్రమణి=సూర్యుఁడు,

వ్రాలెన్ =పడినవాఁడాయెను, తద్వేగపాత=ఆమణియొక్క వేగముతోఁగూడిన పతనముచేత, ఉన్నమత్ =మీఁది కెగయుచున్న, పటు=సమర్థమయిన, పాథోలవధార = సముద్రజలబిందుపంక్తియన్నట్టులుగా, తారలెగసెన్ =నక్షత్రములెగసెను, తద్బిందు=ఆజలబిందువులతోడ, సంధానిత=సంగతమైన, ఉత్కట=అతిశయమయిన, సంధ్యానల=సంధ్యారాగమనెడు నగ్నివలనఁ బుట్టిన, ధూమకందళములై =ధూమాంకురములో యన్నట్టులుగా నున్నవై, క్రొంజీఁకటుల్ =తొలుతటిచీఁకటులు, కన్పట్టెన్ =కానఁబడియెను-అనఁగా ముందుగా సూర్యాస్తమయమాయెను, ఆవెంబడిగాఁ జుక్కలు గనుపడెను, ఆవెంబడిగా సందెచీఁకటులు గనుపడియె నని తాత్పర్యము.

"రక్తత్వమేవరత్నానాం" అను కావ్యకల్పలతాసూక్త్యనుసారము రత్నములు రక్తవర్ణగణములుగా నెంచుట కవిసమయము. అభ్రమణిశబ్దము సాభిప్రాయము. శివుఁ డభ్రకేశుఁడు గావున సూర్యుఁడు శివశిరోరత్నమని భావము. నటదీశానుఁడు గాన శిరోరత్నము త్రుటితమగుట సంభవించెను. అట్టి రత్నరక్తకాంతులే సంధ్యారుణకాంతులు. అపుడు సంద్రమునుండిలేచినతుంపురులే నక్షత్రములు. సంధ్యారాగ మగ్నిగాన నందుండి పొగలెగయుట సాజము. మొలకచీఁకటు లాయగ్నినుండి బయలువెడలిన పొగవలె నుండెను.

అలం. ఉత్ప్రేక్ష. రూపకము.

మ. అరవిందోదరమూర్తి భానుఁ డపు డూష్మాంతంబుగా సంకుచ
త్సరసీజేక్షణుఁ డై పయోనిధిఁ జొరన్ సంధ్యాతటిత్పూర్వమై
నెరసెం జీఁకటికాళ్మొగుల్జగతిపై నిమ్నోన్నతాభోగము
ల్సరి గావించుచు సర్వతోముఖమహస్సారప్రసారంబులన్. 11

ఈపద్యమునకు విష్ణుపరముగను సూర్యపరముగను నర్థద్వయముగలదు.

అరవిందోదరమూర్తి=అరవింద ముదరమందుఁగలవాఁడు గనుక నరవిందోదరుఁడు అనఁగా విష్ణువుయొక్కమూర్తిగలవాఁడు గనుక నరవిందోదరమూర్తి యనఁగా సూర్యుఁడని యర్థము. (శ్లో. 'సాయంకాలేత్వయంవిష్ణుః' అని ప్రమాణము.) అరవిందోదరసదృశమైన యరుణమూర్తిగలవాఁడని యర్థాంతరమును విచారింపవలయును. భానుఁడు = అట్టిసూర్యుఁడు, అపుడు=ఆసమయమందు, ఊష్మాంతంబుగాన్ = ఊష్మయనఁగా నెండయును గ్రీష్మర్తువును గనుక నెండయొక్క తాపము తీరిపోఁగానని సూర్యపరమైన యర్థము. గ్రీష్మర్తువుయొక్క యంతముకాఁగా నని విష్ణుపరమైన యర్థము. ('గ్రీష్మఊష్మకః' అని అ.) అనఁగా వర్షర్తువు రాఁగానేయనుట, సంకుచత్ =ముకుళించుచున్న, సరసీజేక్షణుఁడై = ఈక్షణములవంటి సరసిజములు గలవాఁడై యని సూర్యపరమైన యర్థము. మూఁతపడుచున్న పుండరీక సదృశేక్షణములు గలవాఁడై యని విష్ణుపరమయిన యర్థము. పయోనిధిఁజొరన్ =(ని.'పయః క్షీరం పయోంబు చ' అ.) అనియుండుటవలనఁ బయశ్శబ్దము జలమందును క్షీరమందును వర్తించుచున్నది గనుకఁ బశ్చిమజలధిలోఁ బ్రవేశింపఁగానే యని సూర్యపరమైన యర్థము. క్షీరసముద్రమందుఁ బవ్వళింపఁగానే యని విష్ణుపరమైన యర్థము. విష్ణువు వర్షర్తువురాఁగానే క్షీరసముద్రశాయి యగుట ప్రకటముగదా, సంధ్యాతటిత్పూర్వమై = సంధ్యారాగమనెడుమెఱపు తొలుతఁగాఁ గలిగినదై, చీఁకటి కాళ్మొగుల్ =అంధకారమనెడునీలమేఘము, జగతిపైన్ = భూమిమీఁద, నిమ్నోన్నతాభోగముల్సరి గావించుచున్ =పల్లమును మెరకను సమమగునట్టులుగాఁ జేయుచు, సర్వతోముఖ

మహాసార ప్రసారంబులన్-సర్వతోముఖ = సర్వదిగ్వ్యాపియైన, మహాసార=అధికబలయుక్తమయిన, ప్రసారంబులన్=ప్రసరణములచేతనని యంధకారపరము. సర్వతోముఖ=జలములయొక్క, (ని. 'కబంధముదకం పాథఃపుష్కరం సర్వతోముఖమ్' అని అ.) మహాసార=అధిక ధారాసంపాతములయొక్క, (ని. 'ధారాసంపాత ఆసారః' అని అ.) ప్రసారంబులన్ = ప్రచారములచేత నని మేఘపరము, నెరసెన్=వ్యాపించెను.

అనఁగా నాతపతాపశాంతియగుచుండఁగా ముకుళించుచున్న కమలములుగలవాఁడై సూర్యుఁడు పశ్చిమసముద్రమందుఁ గ్రుంకెననియును గాఢాంధకారము సర్వదిక్కులయందు వ్యాపించె ననియును దాత్పర్యము. సూర్యమండలమున విష్ణువుండెననుటకు-''నిత్యసంభృత విశ్వంభరులు, ధ్యేయస్సదా సవితృమండలమధ్యవర్తీ'' యనునంశములు తార్కాణములు. వర్షర్తువున శ్రీవిష్ణువు క్షీరసాగరమున శయనించుటకేగ మెఱుపులు నీలమేఘములు మించెననియు మిట్టపల్లము లేకమగునటుల వర్షముగురిసె నని శ్లేషార్థము. సూర్యుఁ డస్తమింపఁ దామరపూవులు ముకుళించెననియు సంధ్యారాగము పెచ్చురిల్లెనని యుఁ, జీఁకటి యావరించెననియుఁ బ్రకృతార్థము. అలం. ప్రకృతాప్రకృతశ్లేషము.

సీ. హరిహయవాహనా॰హంకారము హరించి వేడివేలుపుజాడ ॰ వెంట నంటి
తపనజాయసదండ॰తాండవం బెడలించి దనుజఘోరాకార॰దర్ప మడఁచి
కడలితేనిబిడార ॰ మడుగుముట్టఁ గలంచి గాలి రజోవ్యాప్తిఁ ॰ గాకు చేసి
ధనరాజనిధిముద్రఁ ॰ దనవశం బొనరించి యిభదైత్యహరునిప॰ట్టెల్లఁ జెఱిచి
తే. యవనిఁ గబళించి వభమెల్ల॰నాక్రమించి, కమలజాండకటాహంబు॰గడవఁ బెరిగెఁ
జాలితాదిత్యసంధ్యాభి॰చారహోమ, వీతిహోత్రభవాభీల॰వృత్రమూర్తి.12

ఈపద్యమువం ధకారపరముగను వృత్రాసురపరముగను నర్థద్వయ మెఱుంగునది.

చాలితాదిత్యసంధ్యాభిచారహోమవీతిహోత్రభవాభీలవృత్రమూర్తి=ఆదిత్యశబ్దము సూర్యుని యందును దేవతలయందును వర్తించును. (ని. 'అదితో్య భాస్కరే దేవే'అని మే.) వృత్రశబ్దమంధకారమందును వృత్రాసురునియందును వర్తించును. (ని. 'ధ్వాంతారి దానవా వృత్రాః' అని అ.) చాలిత = చలింపఁజేయఁబడిన, ఆదిత్య=సూర్యుఁడుగల - చలింపఁజేయఁబడిన దేవతలుగల అనియుఁ, సంధ్యా=సంధ్యారాగమనెడు, అభిచారహోమ=పరహింసాహోమనిమిత్తమైన, వీతిహోత్ర = అగ్ని యందు, భవ=పుట్టిన, ఆభీల=భయంకరమయిన, వృత్రమూర్తి = గాఢాంధకారమనెడు వృత్రాసురమూర్తి, (ని. 'హింసాకర్మాభిచార స్స్యాత్' అని అ.) హరిహయ వాహనాహంకారము హరించి-హరిహయ=ఇంద్రునియొక్క, వాహన = వాహనములైన మేఘములయొక్క, అహంకారముహరించి=గర్వము నపహరించి యని యంధకారపరమైన యర్థము. ఇంద్రాశ్వగర్వమడఁచి యని వృత్రాసురపరమయిన యర్థము. ఈరీతిగానే యుభయపరముగా సర్వత్ర చెప్పవలయును. వేడివేలుపుజాడవెంట నంటి=అగ్నియొక్క మలినమార్గము నాక్రమించి యనియును నగ్నిదేవుని వెనుదగిలి యనియుననర్థము.

తపనజాయసదండ తాండవం బెడలించి-తపనజ=సూర్యపుత్త్రుఁడైన యమునియొక్క, ఆయస దండతాండవం బెడలించి=ఇనుపకాలదండము నాక్రమించి యనియును, కాలదండసముద్దండత్వము నడఁగించి యనియును నర్థము. తనుజ ఘోరాకారదర్ప మడఁచి = నిర్ఋతియొక్క భయంకరమయిన

లాకృతి నాక్రమించి యనియును, ఆతనిభయంకరత్వ మడఁచి యనియును నర్థము. కడలి తేని= రుణునియొక్క, బిడారము=నేనాస్థానమనఁగా జలము, దానినడుగు ముట్టఁగలంచి యనఁగా నడు నసుండెడు నీలపంకము నాక్రమించి యనుట. అతనివైభవము నడుగుముట్టఁ గలఁత పెట్టి యనియును ర్థము. గాలి రజోవ్యాప్తిఁగాకు చేసి=వాయుదేవునియొక్క పరాగవ్యాప్తి నాక్రమించి యనియును, తనిరాజసవ్యాప్తినణఁచి యనియును నర్థము. దుమ్ము నలుపనుట కవిసమయసిద్ధము. దృష్టాంతము—

సీ. ద్యుమణిరథాంగహత్యుత్థఘనాఘనా శరతీశసృష్టశాంబరిక యనఁగ

... ...

గీ. ఔర యతినీలదీప్తిజాలానుపూర్తి, నమరె నవ్వేళ నిర్వేలతిమిరరాశి.

చంద్రికాపరిణయము. ఆశ్వా. ౪.

మ. ......సురీనిటలభాగన్యస్తకస్తూరితో

నవనీరేణువు సాటియై పరగె నాశాకాశసీమంబులన్.   విక్రమార్కచరిత్రము.

ధనరాజ నిధి ముద్రఁ దనవశంబుగఁ జేసి=కుబేరునియొక్క నిధులయందలి ముద్రికానీలాం ము లాక్రమించి యనియును, అతనిపెన్నిధులు తనవశముచేసికొని ముద్రించి యనియును నర్థము. ని. 'సాక్షరాంగుళిముద్రా సా' అని అ.) ఇభదైత్యహరుని పట్టెల్లఁ జెఱిచి = గజాసుర సంహారకుఁ నిన యీశానునియొక్క, పట్టనఁగా గజచర్మరూపమైన వస్త్రము, దానినాక్రమించి యనియును, తఁడు పట్టినపట్టెల్లఁ జెడఁగొట్టి యనియును నర్థము. ఈనాలుగుచరణములయందును నంధకారము కు నష్టదిగ్వ్యాపనమును వృత్రాసురున కష్టదిక్పాలభంజనమును జెప్పినాఁడు. అంధకారపరమై యుప హాలంకారము స్పష్టము. అవనిఁ గబళించి=భూమిని దిగమ్రింగి, నభమెల్ల నాక్రమించి = ఆకాశమం యు నావరించి, కమలజాండకటాహంబు గడవన్=బ్రహ్మాండభాండమును మించునట్టులుగా, పెరి గెన్=ఎదిగెను.

ముద్రికాంకము నీలముగాఁ జెప్పుట ప్రసిద్ధము. చూ. వసుచరిత్రమునందలి ఆ ౩. ౧౩౭ వ ద్యము. మఱియు—

మ. పురికోయంబు పయోధియుం గని జనంబుల్ రెంటికిన్ భేద మే

ర్పఱుపంజాలకయున్న బ్రహ్మ వివరింపంబూని వారాశిపైఁ

గరమొప్పన్ మసిముద్ర వేసె నదియాఁ గాకున్న నీలచ్ఛవిన్

ధరియింపం గతమేమి? యేటికి సముద్రఖ్యాతి మున్నిటికిన్.   ఉత్తరరామాయణము.

ఇం దష్టదిక్పాలకులను వృత్రాసురుఁడు జయించెననియుఁ జీఁకటి యష్టదిక్పాలసంబంధములగు లాంకముల నతిశయించి భూమ్యాకాశములు బ్రహ్మాండము వ్యాపించెననియు భావము. ఇప్పద్యమున ంధకారవ్యాప్త్యతిశయము చెప్పఁబడినది. అలం. ఉపమ. శ్లేషాలంకారము.

సీ. తమి నహల్యాజార•తాగతాశయుఁ డైన జంభారి కిది రత్న•జాల మయ్యె

వల్లవీతతిఁ గూడి • మల్లాడు మాయగొల్లని కిది చూడాక•లాప మయ్యె

దారుకావన మౌని•దార కాముకుఁడైన పశుపతి కిది గళా•భరణ మయ్యెఁ

దారాభిసార సాం•దరతిఁ ద్రిమ్మరిన తమ్ములదాయ కిది యురో•ముద్ర యయ్యె

తే. నభిమత నవీన వరనిధా•నాప్తిహేతు
దివ్యసిద్ధాంజనం బైన•దీనివంటి
యనుఁగుఁ గనుఁగవ నొత్తు టే•యరు దటంచుఁ
గులటలు నుతింపఁ దిమిరంపు•గుంపు లెసఁగె. 13

తమిన్=రాత్రియందు, (ని. 'రజనీ యామినీ తమీ' అని అ.) లేక తమకముచేత, అహల్యా=గౌతమభార్యయైన యహల్యయొక్క, జారతారత=జారత్వరతికార్యమందలి, ఆశయుఁడైన = అభిప్రాయము గలవాఁడైన, జంభారికిన్=ఇంద్రునికి, ఇది=ఈయంధకారము, రత్నజాలమయ్యెన్ = ఇంద్రనీలమణిమాలికారూపమైన యలంకారమాయెను. వల్లవీతతిఁ గూడి = గోపికాసమూహమును గూడి, మల్లాడు=క్రీడించునట్టి, మాయగొల్లనికిన్=కపటగోపుఁడైన శ్రీకృష్ణమూర్తికి, ఇది=ఈయంధకారము, చూడాకలాపమయ్యెన్=మయూరపింఛరూపమైన శిరోభూషణమాయెను. (ని. 'కలాపో భూషణే బర్హే తూణీరే సంహతా వపి' అని అ.) నెమిలియీఁకలను మిగులనలుపుగాఁ జెప్పుట కవిసమయము.

ఇందులకు దృష్టాంతము చూడుఁడు—

సీ. నవపింఛమయభూష లవధరించి నటించు పంకజాక్షునిచెల్వు సుంకమడిగి...

కటికి చీఁకటి రోదసీగహ్వరమున. మనుచరిత్రము.

దారుకావనవాని దారకాముకుఁడైన = దారుకావనమందలి మునిపత్నులకుఁ గాముకుఁడైన, పశుపతికిన్=శివునికి, ఇది=ఈయంధకారము, గళాభరణమయ్యెన్=కంఠాభరణమాయె నని యర్థము. కంఠకాళిమ యని భావము. తారా=బృహస్పతిభార్యయైన తారయొక్క, అభిసార = అభిసరణమందలి, సాదరతన్=ఆదరసహితత్వముచేత, ప్రసరిన=ప్రవర్తించిన, తమ్ములదాయకున్ = కమలవిరోధియైన చంద్రునకు, ఇది=ఈయంధకారము, ఉరోముద్రయయ్యెన్=ఉరస్స్థలాలంకార మాయెనని యర్థము. కళంకమని భావము. ఇక్కడ రాత్రియం దహల్యాది కాంతాభిసార మందాదరసహితులైన యింద్రాదులకు సమయానుకూలమయిన తదలంకార చతుష్టయమే తద్గమనోపయోగియై యహల్యాది స్త్రీలకుఁ దదాప్తిహేతువయ్యె నని తెలియవలయును. చంద్రునియందలి కళంకము మిక్కిలి నలుపుగా బిల్హణీయమునందు వర్ణింపఁబడియున్నది.

"ఇందో యద్దళితేంద్రనీలశకలశ్యామందరీ దృశ్యతే
తత్సాంద్రం నిశిపీత మంధతమసం కుక్షిస్థ మాచక్ష్మహే"

ఇదియునుంగాక, అభిమత=మిక్కిలియిష్టములైన, నవీన=అప్పటప్పటికి నూతనములైన, వర=ప్రియములగు, నిధాన=నిక్షేపములయొక్క, ఆప్తి=ప్రాప్తికి, హేతు=కారణమయిన, దివ్యసిద్ధాంజనంబైన = దివ్యమైన సిద్ధులచేతఁ గల్పింపఁబడిన యంజనమయిన, దీనివంటి=ఈయంధకారమువంటి, అనుఁగున్=చుట్టమును, కనుఁగవ నొత్తు టేయరుదటంచున్=కన్నులఁ గప్పుకొనుట యేమియాశ్చర్యమని పలుకుచు అని యర్థము. అంజనపక్షమందుఁ గన్నులధరించుటయనియును చుట్టముపట్టునఁ గన్నులఁ గప్పుకొనుట యనియును ప్రేమకార్యముగను, దిమిరముపట్టున దృష్టిప్రతిరోధకత్వ మనియును నర్థత్రయము గ్రహింపవలయును. కులటలునుతింపన్ = జారస్త్రీలు స్తోత్రము చేయఁగా, తిమిరంపుగుంపు లెసఁగెన్=అంధకారసమూహము లతిశయించెను.

లో యన్నట్టులుగా, అలం. ఉత్ప్రేక్ష. రవికిన్ =సూర్యునికి, మందేహ నిర్మథన సాధనములై =మందేహరాక్షస సంహారమునకు సాయుధములయి,వచ్చిన ద్విజమంత్రవర్ణములన్ =వచ్చిన బ్రాహ్మణమంత్రాక్షరములో యన్నట్టులుగా, సూర్యునియొక్క యుదయాస్తమయకాలములందు మందేహాది రాక్షసులు వచ్చి నిరోధింపఁగా నాసమయములయందు బ్రాహ్మణోత్తములచేత నియ్యఁబడిన మంత్రార్ఘ్యజలబిందువులు వజ్రాయుధప్రాయములయి యారాక్షసులను వధించుచున్న వని ప్రసిద్ధము. ఇందుకుఁ బ్రమాణము స్కాందమునందు—

శ్లో. 'మందేహ దేహనాశార్థ ముదయే సమయేరవిః,
సమీహతే ద్విజోత్సృష్ట మంత్రతోయాఞ్జలిత్రయమ్.'

అని చెప్పఁబడియున్నది. అలం. ఉత్ప్రేక్ష.

హరిపదంబును నీశశిరము నైన నభంబునన్ =విష్ణువునకుఁ బాదమును హరునకు శిరస్సునునయిన యాకాశమునందు, (ని. 'వియ ద్విష్ణుపదమ్' అని అ. 'వ్యోమకేశో భవో భీమః' అని అ.) నభోగతులు నించు=దేవతలు పూజచేసిన, ననలనంగన్ =పుష్పములో యన్నట్టులుగా, అలం. కావ్యలింగానుప్రాణితము. చరమగిరియను మరకాడు=అస్తాద్రియనెడు నోడసరంగు, జలధిసరణిన్ = సముద్రములోని మార్గమందు, తరణిడించినన్ = సూర్యునిడింపఁగా, అతఁడు=సూర్యుఁడు, తత్సలిలమగ్నవిమలముక్తాఫలంబులు=ఆసముద్రోదకమందు మునిఁగియున్న నిర్మలమౌక్తికములను, వెలికిఁ జొరిపెననఁగన్ =బయటికిఁ దెచ్చెనో యన్నట్టులుగాను, నవతారకానికాయంబు లడరెన్ =నూతనములయిన నక్షత్రసమూహములు ప్రకాశించెను. అలం. ఉత్ప్రేక్ష.

చ. ఘనతరగాఢసంతమసకల్పమహోదధి సన్న లోకముల్
తనయుదయారుణద్యుతివితానము పేరి రజోగుణంబుచే
ననువుపడన్ సృజింపఁ గమలాసనుఁడై ద్విజరాజు రా నమ
ర్చిన ధవళాబ్జపీఠ మనఁ జెన్నలరెం దొలితెల్పు తూర్పునన్. 16

ఘనతర=అత్యధికమైన, గాఢ=దట్టమైన, సంతమస = కటికిచీఁకటియనెడు, కల్పమహోదధి సన్నన్ =ప్రళయసముద్రము తీసిపోయినపిమ్మట, (ని. 'సంవర్తః ప్రళయః కల్పః' అని అ.) లోకముల్ = భువనములను, తనయుదయారుణద్యుతివితానము పేరి రజోగుణంబుచేన్ =తనయొక్క యుదయకాలరక్తిమయనెడు రాజసగుణముచేత, అనువుపడన్ సృజింపన్ =ఒప్పిదమగునట్టులుగా సృజించుకొఱకు, రజోగుణ మరుణవర్ణమని ప్రసిద్ధము. కమలాసనుఁడై ద్విజరాజురాన్ =బ్రహ్మయై చంద్రుఁడు రాఁగా నని యర్థము. కమలములను దిరస్కరించినవాఁడని భావము. ద్విజరాజుగనుకఁ గమలాసనుఁడైనాఁడని స్వారస్యమును గ్రహింపవలయును. అమర్చినధవళాబ్జపీఠమునన్ =అమర్చిపెట్టిన తెల్లదామరగద్దెయో యన్నట్టులుగా, తూర్పునన్ = పూర్వదిక్కునందు, తొలితెల్పు=ప్రథమధవళిమ, చెన్నలరెన్ =ఒప్పుచుండెను.చీఁకటి లోకమునం దంతటను వ్యాపించుటచే సమస్తలోకము లగోచరముగనుండెననియుఁ జంద్రుఁడు తన యుదయకాలమునందలి రక్తకాంతులచేఁ బ్రపంచమునంతయు వెలిగించుటకై తూరుపునఁ దెలిచాయఁ దోఁప నుదయించెనని భావము. చీఁకటియను ప్రళయసముద్రము లోకములను ముంచివేయ చంద్రుఁడను బ్రహ్మ రజోగుణవశమున మఱల సరాసరిగ సృజింప నరుదెంచ నమర్చిన

తెలితమ్మి గద్దియవలెఁ దూరుపుదిక్కునఁ దెల్లనిచాయ దోఁచెను. చంద్రోదయమునకు ముందు ఆకాశము తెలిచాయతో నలరు ననియు నుదయించుచంద్రుఁ డెఱ్ఱగానుండు ననుటకు-

సీ-గీ. ప్రాచి తెలిచాయ యనుమంచు ప్రబలభాస్వ, దంశుకవిహీనగావున నందు కోర్వ
జాల కూర్చిన నవకీలిచక్రమనఁగ, నపుడు తొలికెంపుతో సారసారి బొలిచె.

చంద్రికాపరిణయము ఆశ్వా. ౪.

క. అంతటఁ బ్రాచినిశాపతి, యంతికగతుఁ డగుటవిని ముఖాలంబితమః
కుంతలములు దీర్పఁగఁ గొను, దంతపుదువ్వెనయనంగ ధవళిమదోఁచెన్.

మ. స్ఫుటసౌగంధికరాగరక్తరుచి మైఁబూనెన్ జపాసన్నిధి
స్ఫటికంబ ట్లుదయాద్రిగైరికశిరస్థ్సానస్థితిన్ జంద్రుఁడు. మనుచరిత్రము. ఆశ్వా-తృ.

మ. హరిదంభోరుహలోచన ల్గగనరం♦గాభోగరంగత్తమో
భర నేపథ్యము నొయ్య నొయ్య సడలిం♦పన్ రాత్రిశైలూషికిన్
వరుసన్ మౌక్తికపట్టమున్ నిటలమున్ ♦ వక్త్రంబునుం దోఁచె నా
హరిణాంకాకృతి వొల్చె రేకయి సగం ♦ బై బింబమై తూర్పునన్. 17

హరిత్=దిక్కులనెడు, అంభోరుహలోచనల్=స్త్రీలు, గగన=ఆకాశమనెడు, రంగాభోగ=నాట్యస్థానపరిపూర్ణతయందు, రంగత్=ఒప్పుచున్న, తమోభర=చీఁకటియనెడు, నేపథ్యమున్=తెరను, ఒయ్యానొయ్యాసడలింపన్=తిన్నతిన్నఁగాఁ దగ్గింపఁగా, రాత్రిశైలూషికిన్=రాత్రియనెడు నాట్యస్త్రీకి, వరుసన్=క్రమముగా, మౌక్తికపట్టమున్ = ముత్యాలపట్టయును-అనఁగా నొసటికిఁబైన ముత్యాలతోఁగూర్చి యడ్డముగాఁ గట్టుకొనెడు పట్టయనుట, నిటలమున్=నొసలును, వక్త్రంబును=ముఖమును, తోఁచెనాన్=ప్రకాశించెనో యన్నట్టులుగా, హరిణాంకాకృతి=చంద్రునియొక్క రూపము, రేకయి=రేఖాకారమై, రేఖాశబ్దతద్భవము రేక, సగంబై=సగపాలై, బింబమై=సంపూర్ణమై, తూర్పునన్=తూరుపుదిక్కున, పొల్చెన్=ప్రకాశించెను. దీనఁ గ్రమాలంకారము చెప్పంబడియెను.

నేపథ్యమనఁగాఁ దెరయన్నందుకు విచారము. 'నేత్రయోః పథ్యం నేపథ్యమ్' అని వ్యుత్పత్తి. ఇది పృషోదరాదిగణములోఁ జేరినదిగనుకఁ ద్రకారలోపము వచ్చినది. ఇందుకుఁ బ్రయోగము. శ్లో. 'నేపథ్యాంతరితాభూత్వా నర్తకీనృత్తమాచరేత్' అని నృత్తప్రస్తావమందుఁ జెప్పఁబడి యున్నది. అలం. ఉత్ప్రేక్ష.

చ. తనుఁ గడుపారఁ గాంచినసు♦ధానిధిఁ గ్రాఁచుమహార్వకీలముల్
కనదుదయాంశుదంభమునఁ ♦ గైకొని వచ్చి యరిప్రజంబునె
మ్మనమున వైచి పాండురుచి♦మండలకీర్తికలాప మొందునిం
దునిమెయిఁ గందు దోఁచె నతి♦దుర్భరతద్భరణప్రసంగతిన్. 18

తనుఁగడుపారఁగాంచిన=తన్ను కడుపారఁగన్నట్టి, సుధానిధిన్=క్షీరసముద్రుని, క్రాఁచు=ఉడికించుచున్న, మహార్వకీలముల్=మహత్తరములయిన బడబాగ్నిజ్వాలలను, జ్వాలకీలశబ్దములు స్త్రీపుంలింగంబులుగలవు. ని. 'ద్వయో ర్జ్వాలకీలౌ' అని అ. కనత్=ప్రకాశించుచున్న, ఉదయాంశు=ఉదయకాలారుణకిరణములనెడు, దంభమునన్=వ్యాజముచేత, కైకొనివచ్చి=తీసికొనివచ్చి, అరి ప్ర

జంబు నెమ్మనమున వైచి=శత్రువర్గముయొక్క హృదయమందు వైచి యని యర్థము. చక్రవాకముల యొక్క హృదయమందునిచి యని భావము. హృదయమందు బడబాగ్నివైచుట యనఁగా నత్యంత శోకము పుట్టించుటయని తెలియవలయును. పాండురుచిమండల=చంద్రికాజాలమనెడు, కీర్తికలాప మొందు=కీర్తిసముదాయమును బొందుచున్న, ఇందుని మెయిన్=చంద్రుని దేహమందు, అతిదుర్భర= మిక్కిలియు భరింప శక్యముగాని, తత్=ఆబడబాగ్నిజ్వాలలయొక్క, భరణప్రసంగతిన్=భరణప్రసంగమువలన, కందుదోఁచెన్ = కమిలి కందు గనుపడియెను. అనఁగా నగ్నిభరణముచేత మాఁడి మచ్చ యేర్పడియెను.

చంద్రుని క్షీరసముద్రుఁడు కడుపారఁగనెను. కావునఁ బితౄణము దీర్చుకొనుటకుఁ జంద్రుఁడు సుధానిధిని గ్రాచు గొప్పబడబాగ్నిజ్వాలలు అరివ్రజహృదయములనించెను. కావునఁ జంద్రుఁడు కీర్తి కలాపమును గడించెను. తండ్రిని గ్రాఁచు బాడబాగ్నిజ్వాలలు మ్రోయుటచేఁ జంద్రునిమేను కమిలి మచ్చబడెను. అదియె కళంకము. తద్భరణము అతిదుర్భరముగావున మచ్చ గాటముగా నుండెననుట. అలం. అతిశయోక్తి. సమాసోక్తి. ఉత్ప్రేక్ష.

మ. పటుతారాపటఖండమండితనిజ♦ప్రాగంశుధారాపరి
స్ఫుటసూత్రంబులఁ బ్రోఁగువారి వెస నం♦భోవాహమార్గాఖ్య మా
నటవిం బ్రాక్తనభిల్లమౌళిమణి వేఁ♦టాడన్ మదానేకప
చ్ఛట లోదంబులఁ బడ్డయట్లు తమముల్ ♦ జారెన్ బిలశ్రేణికిన్. 19

పటు=దృఢమయిన, తారా=నక్షత్రములనెడు, పటఖండ=వస్త్రఖండములతోడ, మండిత = ఒప్పుచున్న, నిజ = తనయొక్క, ప్రాగంశుధారా = ధారాసదృశములైన ప్రథమకిరణములనెడు, పరిస్ఫుటసూత్రంబులన్ = ప్రకాశములయిన నూలుపగ్గములచేత, ప్రోఁగువారి = కూడఁబారినవాఁడై, వెసన్=శీఘ్రముగా, అంభోవాహమార్గాఖ్యమా=మేఘమార్గమైన ఆకాశమనెడు, అటవిన్=అరణ్యమందు, ప్రాక్తనభిల్ల=పురాతనకిరాతుఁడయిన హరునియొక్క, మౌళిమణి=చూడారత్నమయిన చంద్రుఁడనెడు, ప్రాక్తనభిల్లమౌళిమణి=ప్రాచీనకిరాతశ్రేష్ఠుఁడు, వేఁటాడన్=వేఁటాడఁగా, మద=మదయుక్తములయిన, అనేకపచ్ఛటలు=గజసమూహములు, ఓదంబులఁ బడ్డయట్లు=ఓదము లనఁగా నడవిలోవేఁటకాండ్రేనుఁగులను బట్టునపుడు వాని మోసపుచ్చెదుకొఱకు నిర్మించునట్టి కపటపుగుంటలు గనుక వానియందుఁ బడ్డట్టుగా, తమముల్=చీఁకటులు, బిలశ్రేణికిన్ = బిలసమూహములోనికి, జారెన్= చొచ్చెను. అనఁగా ముందుగాఁ జంద్రకిరణప్రసరమాయెను వెంటనే చంద్రుఁ డుదయించెను. అంతటఁ జీఁకటులు విచ్చిపోయె నని తాత్పర్యము.

ఉదయించుచంద్రునికిరణములు ప్రకాశవంతములగు నూలుపగ్గములవలె నుండెను. తారకారుచులు పగ్గములు మిగులఁ గట్టిగానుంటకుఁ జుట్టినగుడ్డపేలికలవలె నుండెను. ఆకసమను నడవిలో శివుఁడను వేఁటకాఁడాపగ్గలములను గట్టెను. ఏనుంగులు త్రొక్కచెంతనున్న ఓదములలోఁ బడినటులఁ జీఁకటులు గుహాలలోఁ జేరును. అలం. ఉత్ప్రేక్ష.

మ. ఉదయోలూఖల మెక్కి నిక్కి సహజాం♦కోపేంద్రసంయుక్తుఁడై
ఛద లన్ బూద శశాంకసీరి కరవి♦స్తారంబులన్ బట్టి బి

ట్టదమం గారెఁ జకోరగోపతతి పాఁలై చంద్రికాక్షీరముల్
పొదవెన్ ఘూర్ణితదుగ్ధధామనిబిడఁప్రోద్భూతసంరంభముల్. 20

శశాంక = చంద్రుఁ డనెడు, సీరి = బలరాముఁడు, సహజ = తనతోఁగూడఁ బొడచూపిన, అంక=చిహ్నమనెడు, సహజాంక=కూడఁబుట్టిన శ్రీవత్సలాంఛనముగల, ఉపేంద్ర=కృష్ణునితో నని యయినను లేక తోడఁబుట్టినవాఁ డనెడు సంజ్ఞగల కృష్ణునితో నని యయినను నర్థము. సంయుక్తుఁడై, ఉదయోలూఖల మెక్కి-నిక్కి = ఉదయాచలమనెడు రోటిపై నెక్కి పొడవుగా నిక్కి, చదల న్బాదన్=ఆకాశమనెడు బూదకుండను-అనఁగా నుట్టిపైనున్న పాలకుండను, కరవిస్తారంబులం బట్టి=కిరణవిస్తారములనెడు హస్తవిస్తారములతోఁ బట్టుకొని, బిట్టదమన్=గట్టిగా నొత్తఁగా, చంద్రికాక్షీరముల్=వెన్నెలలనెడుపాలు, చకోరగోపతతి పాలై=చకోరపక్షు లనెడు సహచరగోపకుల కుపయోగించినవై, కారెన్=స్రవించెను. ఘూర్ణిత=తిరుగుపడుచున్న, దుగ్ధధామ=క్షీరసముద్రమనెడు పాలుంచెడు గృహమందు, నిబిడ=సాంద్రమగునట్టులుగా, ప్రోద్భూత=ఉద్భవించుచున్న, సంరంభముల్=జలసంరంభంబులు-అనఁగాఁ గలకలములు, పొదవెన్=వ్యాపించెను. అంకశబ్దమునకు, (ని. 'అఙ్కో నాటకవిచ్ఛేదే సంఖ్యాయాం యుధి భూషణే, సమీపే రూపకే స్థానే మతా వుత్సఙ్గ చిహ్నయోః.' అని నానార్థరత్నమాల.) ఉదయాచలమెక్కి-కళంకసంకలితమగు చంద్రబింబము కిరణకాంతులు బ్రహ్మాండమునందంతటను బ్రజ్వలింపఁజేయసాగెను. చకోరము లానందముతో వెన్నెలను భుజించుచుండెను. చంద్రోదయమువలన సముద్ర ముప్పొంగెనని భావము. అలం. రూపకసంకీర్ణోత్ప్రేక్ష.

శా. ఆవేళం బతి సంభ్రమానుగుణ గంఁగాంభోఝరంబుల్వలెన్
ద్యోవీథిం దెలివెన్నెల ల్నిగుడ నింఁదుం డందుఁ గ్రీడించుదే
వావాసద్విప మయ్యెఁ దన్మథితశుఁభ్రాబ్జంబు లై తారెఁ దా
రావర్గంబులు తత్కరోదకము లైఁ రాలెం దుషారాంబువుల్. 21

ఆవేళన్=ఆసమయమందు, పతి=పెనిమిటియైన సముద్రునియొక్క, సంభ్రమ=సంతోషజనితభ్రమణములకు-అనఁగా నుత్సాహముచేత ఘూర్ణిల్లుటకు, అనుగుణ=అనుకూలమయిన, గంగాంభోఝరంబుల్వలెన్=ఆకాశగంగాజలప్రవాహములో యన్నట్టులుగా, ద్యోవీథిన్=ఆకాశవీథియందు, తెలివెన్నెలల్నిగుడన్=ధవళచంద్రికలు వ్యాపింపఁగా,

'ఆర్తార్తే ముదితా హృష్టే ప్రోషితే మలినా కృశా,
మృతే మ్రియేత యానారీ సా స్త్రీ జ్ఞేయా పతివ్రతా.'

అని శాస్త్రమున్నది గనుక నిక్కడఁ బతి సంతోషింపఁగాఁ దాను సంతోషించుటవలన గంగానదికిఁ బతివ్రతాధర్మసిద్ధి యగుచున్నది. కావునఁ దనభర్త యగుసముద్రుఁ డానందవశమున వెల్లివిరియఁ బతివ్రతయుఁ బతిసంభ్రమానుగుణయునగు గంగాప్రవంతియు వెల్లివిరిసెననుట. ఇందుండు=చంద్రుఁడు, అందుఁ గ్రీడించుదేవావాసద్విపమయ్యెన్ = ఆచంద్రికారూపమైన యాకాశగంగాప్రవాహమందు విహరించెడు స్వర్లోకగజమో యన్నట్లు - అనఁగా నైరావతమో యన్నట్లుండెను. తారావర్గంబు = నక్షత్రసమూహములు, తత్ = ఆచంద్రరూపమైన యైరావతముచేత, మథిత=పెకలింపఁబడిన, శుభ్రాబ్జంబు లై తారెన్=తెల్లదామరపువ్వులో యన్నట్లు కాంతిహీనమ్ము

లాయెను. తుషారాంబువులు = మంచుతుంపురులు, తత్కరోదకములై రాలెన్ = ఆచంద్రుఁడనెడు నైరావతముయొక్క తుండమువలన జారిన యాకాశగంగాజలశీకరములో యన్నట్టులుగా రాలెను. అనఁగాఁ జంద్రోదయానంతరమందు సముద్రముప్పొంగి ఘూర్ణిల్లెననియు నాకాశమందుఁ దెల్లనివెన్నెలలు గాసెననియుఁ జుక్కలు కాంతిదరిగె ననియు మంచు గురిసెననియును భావము.

సముద్రుఁడు వెల్లివిరియగాంచి యాకాశగంగయు వెల్లివిరిసెను. ఆవెల్లియందుఁ జంద్రుఁ డైరావతమువలెనుండెను. తెల్లదామరపూవులను గంగనుండి పెకలించినటులఁ గాంతిహీనములుగఁ జుక్కలొప్పెను. ఏనుఁగుపీల్చి విడచు జలబిందువులవలె మంచుకురియుచుండెను. అలం. ఉత్ప్రేక్ష.

సీ. మిత్రాధికారంబు ♦ మీఱ రా దని కాక వెసఁ బట్టపగలు గా♦వింప లేదె
మ్రాఁకులక్రింది సో♦మరు లెంత యని కాక మలసి నీడలరూపు♦మాప లేదె
బాడబాక్షేప పా♦పమున కోపక కాక యౌర్వాగ్ని నైనఁ జ♦ల్లార్ప లేదె
రాజకాంతాకృతి♦ప్రతిసర్గ మని కాక శిల లెల్ల సరసముల్ ♦ సేయ లేదె
తే. జగతి నిది యని జగములు ♦ వొగడ నెగడె
హరునితల యెక్కి తెలితమ్మి ♦ నడఁగఁ ద్రొక్కి
కలశవారాశి నెమ్మేనఁ ♦ గలయఁ బ్రాఁకి
కుముద రుచి నేలి కౌముదీ♦సముదయంబు. 22

కౌముదీసముదయంబు=చంద్రికాస్తోమము, మిత్రాధికారంబు మీఱరాదనికాక=మిత్రుఁడనఁగా నాప్తుఁడును సూర్యుఁడునుగనుక నాప్తజనాధికారమునతిక్రమింపరాదని కాక యనియర్థము. సూర్యాధికార్యమును మీఱరాదని కాక యని యర్థాంతరము. వెసఁ బట్టపగలు గావింపలేదె=శీఘ్రముగాఁ బట్టపగలుగాఁ జేయఁజాలదా, అనఁగాఁ జేయనేకల దనుట. పగలుగావించుట సూర్యాధికారమని తెలియవలయును. మ్రాఁకులక్రింది సోమరు లెంతయని కాక మలసి నీడలరూపు మాపలేదె = చెట్ల క్రిందఁ బడియుండెడు నత్యంతాలసు లెంతటివారని విచారించియే కాక, లేకపోయినం బైకి వ్యాపించి నీడలను నశింపఁజేయఁ జాలదా-అనఁగా నీలవర్ణము ధవళవర్ణముగాఁ జేయఁజాలదా యనుట. ఇక్కడ నీడలనే సోమరులని చెప్పినాఁడు. రూపు అనెడుపదము ఉకారాంతము. ఇందుకు, ని. 'ధూర్తమూర్ఖౌ నీచభ్రష్టౌ వుదస్తా వపి సమ్మతౌ, ఉత్త్వే నైవ భవం త్యన్యే ప్రయోగ స్తత్ర కారణమ్.' అని యథర్వణవచనము.

బాడబాక్షేపపాపమున కోపక కాక=బ్రాహ్మణాక్షేపదోషమునకు సహింపక కాకయనియర్థము. బడబానలమార్చుట యని యర్థాంతరము. ఔర్వాగ్నినైనఁ జల్లార్పలేదె=సముద్రజలమందుండియును నారనిబడబాగ్ని నైనను దనశైత్యగుణముచేతఁ జల్లారఁజేయఁజాలదా-అనఁగాఁ జేయఁజాలు ననుట. రాజకాంతాకృతి ప్రతిసర్గమనికాక=రాజాంతఃపురస్త్రీలయొక్క యాకారములకుఁ బ్రతిసృష్టియని కాకయని యర్థము. చంద్రకాంతశిలాకార ప్రతిసృష్టియని యర్థాంతరము. శిలలెల్ల సరసముల్ సేయలేదె=రాళ్ళన్నిటి నీరుగాఁ జేయఁజాలదా - అనఁగాఁ జేయఁజాలునే యనుట. జగతినిదియని జగములువొగడన్=జగత్తునందు నీచంద్రికాస్తోమము పైనఁ జెప్పఁబడిన ప్రకారము నేయనేకలదని లోకములో వారు స్తోత్రము సేయునట్టులుగా, హరునితలయెక్కి = ధవళిమచేత హరునితో సమా

నమై యని యర్థము. హరుఁడు చంద్రశేఖరుఁడు గనుకఁ దచ్ఛిరోవ్యాపకమై యని యర్థాంతరము. హరునికి శిర మాకాశము గనుక దానియందు వ్యాపించియనియును నర్థాంతరము.

తెలిదమ్మి నడఁగఁ ద్రొక్కి=పుండరీకమునకు సమానమై యని యర్థము. పుండరీకమును ముకుళింపఁజేసి యని యర్థాంతరము. స్వకాంతిచేతఁ దిరోహితముచేసి యనియును నర్థాంతరము. కలశవారాశి నెమ్మేనఁ గలయఁ బ్రాకి=క్షీరసముద్రసమానమైన యని యర్థము. క్షీరసముద్రములో నేకీభవించి యని యర్థాంతరము. ఆలింగనముచేసి యనియును నర్థాంతరము. కుముదరుచి నేలి=తెల్లగలువల కాంతితో సమానమై యని యర్థము. స్వకాంతిచేఁ బోషించి యని యర్థాంతరము. నెగడెన్=అభివృద్ధిఁ బొందెను. ఈగీతిలో నుపమా సమాసోక్తి మీలితాలంకారము లూహ్యంబులు. అనఁగాఁ జంద్రికాస్తోమ మత్యంతశుభ్రమై మిక్కిలి చల్లదనముగలదై లోకములయందంతట వ్యాపించెనని తాత్పర్యము.

వెన్నెల పట్టపగటివలెనుండు ప్రకాశముతోడను నీడలనైనఁ దెల్లఁగఁజేయు వెలుఁగుతోడను, బడబాగ్నినైనను జల్లార్పఁగల చల్లఁదనముతోడను శిలలన్నింటిని జంద్రకాంతములుగ నొనర్చి జలజల జలముగారించు నపూర్వశక్తితోడను దెల్లనివస్తువులయన్నింటి తలఁదన్ని యలరారెను. అలం. అతిశయోక్తి.

వ. వెండియు నఖండశశిమండలకుండలితకుసుమకోదండకాండాసనహిండితకరకుముదకాండప్రకాండతాండవితపాండురపరాగమండలంబున మెండుకొనుచు, నిండారవిరిసినబొండుమల్లియలతండంబులం బొదలు మృదులదళపుటాంతరంబుల వడిగొనిన తేటతేనియం దోఁచిన శిశిరకరకిరణాసారంబు లుత్ఫుల్లహల్లకపరాగమధురాచ్ఛమత్స్యండికాపుంజంబులం బొరలించి పుక్కిళ్లకు వెక్కసంబుగా ముక్కునబంటి మెక్కి మెడలు నిక్కించు చలచ్చంచుసుందరీబృందంబుల యానందబాష్పబిందుసందోహంబులం గ్రందుకొనుచు, జిగి మిగులు తొగల దొర నిగనిగల మిగుల బుగులుకొను నెగులునం దనమగని నగణితవనప్రదేశంబుల నరసియరసి వేసరి యోసరిలి సరసీమధ్యంబునం దననీడఁ జూచి కంటిఁ గంటి నంటుకొని ననుచు నంటం బోవ నదియునుం దవ్వుల కవలఁ జననాసన్నుండయ్యు నొల్లండు వల్లభుం డేల యని యుసురుసురనుచు నసురుసురై సొక్కు జక్కవజవరాలిబహువిధావిలవిలాపంబులకుం గనికరించిన తెఱంగునం గరంగుకురంగధరకాంతకందళంబుల జలజలని తెలినీటిజాలునం గ్రాలుకొనుచు నచ్చవెన్నెల విచ్చలవిడిఁ బెచ్చుపెరిగి పచ్చతామానికంపుఁ జిప్పలం బరిశుద్ధాసవంబు నించకయ నించినట్లుండఁ జంచలనఖాంచలంబులం బయలు చిందించువారును బూర్ణపాత్రంబులం దోఁచు నిండుచందురుం బిండియమృతం బని వాసితాసవంబుఁ గ్రోలుచుఁ గలంకశంకం గలువఱేకు దిగిచి వైచువారును బ్రతిఫలితతారకంబులు ద్రాక్షాఫలంబు లని రిత్తచప్పరించువారును నిజాననాంభోజభాజనంబులం బట్టిన మైరేయంబు మగలకుఁ ద్రావించు నెడ వారు వాసనార్పితసహకారపల్లవం బని చక్కెరమోవి చుఱుక్కున

నొక్కినం గలక్వణితకంకణాంకితకరంబులు విదిర్చుచుం గనీనికలు ఱెప్పల
తుదల నప్పళించుచుం గమనీయ సీత్కారకంఠనాదభేదంబులం గులుకరించు
చుం బానశాలాపురోభాగభాసమాన నలదకాయమానంబులం బొడము పొడ
వెన్నెలలఁ బువ్వు లని యెత్తి యువ్వంబోవువారును కాదంబరీమదోన్మాదమ్మున
మోదమ్ములు వెరిగి చేదమ్ములు చరచుచుం జిందులుగ నాడుచుం బాడు
చుం దమనృత్తంబులకు మెచ్చి నెత్తమ్ములపగఱ పుత్తెంచినయుడుగరలని
ముంగిళ్ళ రంగు మీఱు ముత్యాలయరుంగులచెఱంగులం దుఱంగలించు మె
ఱుంగులు కరాంగుళుల విప్పి కప్పుకొనఁబోవువారును నై యతిప్రబంధగంధో
త్తమాంగంధానుబంధబంధుర లగుసింధురయానల యుదస్తనాసామణిప్రభా
స్తబకంబుల నుల్లసితగల్లసితలోధ్రచూర్ణంబుల నున్న మితావటువిలంబిహా
రంబులఁ బేరెంబులు వారెనోయనం గొన్ని యెడల నున్నతచంద్రశాలాబహి
రంగణంబుల నడుగులకు మడుగులు పఱచినా రని చరణకిసలయాయాసంబు
లెఱుంగక చందనతిలకంబులు గరంగఁ జారుహారంబు లెగరఁ జలకుండలహీర
కోరకంబులు వెలుంగ భావిపుంభావసంభావనాపరిచయంబు సంపాదించు
పెంపునం బింపిళ్లు గూయు కలికికొమెరలమొలకచనుమోసులం దులకరించిన
తళుకుసిబ్బెంపుతళతళల దళముకొనియెనో యన నొక్కొక్కగడం గడవ
రానితమచేడియల బెడంగునుడుగుల నడుగులామడలుగా వచ్చి యభినవవిహార
హర్మ్యంబులు సొచ్చి శాతకుంభస్తంభంబుల నత్తమిల్లి యుత్తరీయంబులు
వట్టి తివియ నీడిగిలఁబడుచుం దనులతలయడంకువలందరగనివడంకులం దను
తాన ముడి సడలునిద్దంపువలువ లదరిపాటునం జరణాంగుళిదంశికలం బట్టి
నుసిమిన మిట్టిపడి యిట్టట్టు గదల నేరక వరులహృదయపంజరంబులు దూఱి
యెట్టకేలకుం జిట్టకాలకుం జెవి యొగ్గినసిగ్గరికత్తియలు వాతాయనంబులడగ్గర
మెలంగుచలినిగ్గులగనిం గని తొంగి చూచుధూర్తసఖీసుస్మితవదనం బని
యదరిపడి పొదవుకొన్నసున్న చేలలఁ జిన్నారినెరికలఁ జెన్నారుమిసమిసలఁ గ
న్నంబు వెట్టి కైకొనియెనో యనఁ గతిపయస్థలంబులం బచ్చి దేరునంగమచ్చం
బులతో వచ్చి తచ్చనవినయంబులు దెచ్చుకొని మోవి మాటి మాటాడియుఁ
జేతులు గట్టుక నిలిచియు గట్టువాతనంబున కొడిగట్టినదిట్టవిటులంబట్టి పూదం
డలం గట్టి ప్రేలింపం జాలాగతకిరణదండంబులకుఁ జెయి సాచుముగుదమగు
వలకరనఖరకాంతిభంగంబులం బొంగిపార లెనో యన వేఱొండుచాయలం గో
యక కోయుకాయజునిమాయకత్తుల రాయిడిం బడలేక ధవళాంబరమాల్యా
నులేపననేపథ్యంబులు పూని మునిమాపు చూచివచ్చినకర్పూరకదళికాంకిత
కుంజంబులకు వచ్చి యచ్చట నఖిలకుంజంబులు నట్ల యుండఁ గొండొకసేపు
వివరింప లేక వలపువలనం దెలసి నిజసమయనిలయంబు లీఁగు నిత్వరీజనంబుల

మనంబు లరయ వలసి మూర్ఛగలు మాటున కరుగుటయు నవ్వేళ నెవ్వారిం గానక యరణ్యరోదనంబు నిజం బయ్యెనని నిశ్శబ్దంబుగా నేడ్చుచుం జేయునది లేక చేష్టలు దక్కియున్న యన్నెలుగులు వారింప సన్నిహితులై వారు కన్నీరు దుడిచి కవుంగిట మన్నించినం గనుదెఱచి చూచునన్నెలంతలవిస్మయసూచనలోచనప్రభాదట్టంబుల నిట్టవాడిచెనో యన మఱియుం బెక్కునెళవులం గళల యిక్కువలు దెలిసినయదన మదనకదనంబున సదమదంబు లగునంగంబుల సంగదట్టంబులు మార్పడ వైచుకొని యుప్పరిగలబయళ్ళకు నేగుదెంచి చందమామగుటికలు గ్రోలుమందయానలచెక్కుల వెలుంగువలి వెలుంగుం జూపి మీమొగములమిలమిలలు గిలుబాడ వచ్చెం జుమీ వెన్నెలబచ్చుముచ్చు పీం డిచ్చోట మసలుట మనకు నేర చుని నారులం బునారతంబులకు నెలయించి కొనిపోవు వలకారులజారుకొప్పులం దొరంగువిరిగుత్తులతోం బొత్తు గలసెనో యన వెలసి యభివ్యక్తశుద్ధవర్ణబ్రహ్మంబు గావున సువ్వం గలవారి నెల్ల సర్వజ్ఞులం జేయుచుం దారవాదధౌరేయంబు గావునం గొండలనెల్ల వెండికొండలం జేయుచుం బద్మాహితపాదప్రభూతనూతనస్రోతోవిశేషంబు గావున నఖిలభువనమాలిన్యంబులం దొలంగింపుచుం బంకజభవాండమంటపంబు సంకు చేసినపొంకంబున నంకింపుచు నకలంకమీనాంకనిరంకుశయశోమరీచివీచీసధ్రీచీనం బై విజృంభించుసమయంబున. 23

వెండియుఁ౯=మఱియును, ఆచంద్రికాస్తోమము, అఖండ=సంపూర్ణమైన, శశిమండల = చంద్రబింబమనెడు, కుండలిత=చక్రాకృతిగా నాచరించఁబడిన, కుసుమకోదండ=మన్మథునియొక్క, కాండాసన=పుష్పధనుస్సువలన, హిండిత = బయలుదేఱుచున్న, ('హిడిగతౌ' అనిధాతువు.) కర=కిరణములనెడు, కుముదకాండప్రకాండ=కువలయబాణశ్రేష్ఠములయందు, తాండవిత = సంజాతతాండవములయిన-అనఁగా గాలికిలేచియాడుచున్న, పాండుర పరాగ మండలంబున౯ =తెల్లని పుప్పొడియొక్క సముదాయముచేత, మెండుకొనుచు౯ =దళముపారుచును, చంద్రబింబము అఖండముగావున షోడశకళాభిరామమనియుఁ గాననే పాండురకాంతిపుంజములు మెండుకొనెననియుభావము. కుసుమకోదండము కుండలితమనుటవలన మన్మథుఁడాకర్ణాంతముగ లాగెననియు నందుండి విడువఁబడిన కలువపూములుకులు మెండుకొనుట సంభవించెననియుఁ గ్రాహ్యము.

నిండారవిరిసిన=సంపూర్ణముగా వికసించిన, బొండుమల్లియల=బొండుమల్లె పుష్పులయొక్క, తండంబులంబొదలు = సమూహములయందొప్పుచున్న, మృదుల దళపుటాంతరంబుల౯ = కోమలములయిన రేకులనడుమనుండి, వడిగొనిన=లోపలికి వడిసిన, తేటతేనియల౯ = తేరితేటగానున్న పూఁదేనియలయందు, తోఁచిన=వ్యాపించిన, శిశిరకరకిరణాసారంబులు = చంద్రకిరణధారాసంపాతములను, ఉత్ఫుల్ల=లెస్సగావికసించిన, హల్లక=ఎఱ్ఱగలువలయొక్క, పరాగ=పుప్పొడియనెడు, మధుర=తియ్యనైన, అచ్ఛ=స్వచ్ఛమైన, మత్స్యండికా=ఖండశర్కరయొక్క, (ని. 'మత్స్యండీ పాణితం ఖణ్డ వికారే శర్కరా సితా' అని అ.) పుంజంబుల౯ = పొళ్ళయందు, పొరలించి = పొలిపి, పుక్కిళ్ళకు

వెక్కసంబుగాన్=దవడలకు నెక్కువౌనట్టుగా, ముక్కనబంటిమెక్కి = ముక్కులకువెళ్ళ భక్షించి, ముక్కనబంటి అన్నందుకు, (శ్లో.'మాత్రాద్యర్థేతు బంట్యాది స్తతః పూర్వేతు నః క్వచిత్' అని యథర్వణవచనము.) మెడలునిక్కించు=కుత్తుకలు పైకెత్తుకొన్న, చలచ్చంచు సుందరీబృందంబుల = చకోరస్త్రీసమూహములయొక్క, చలచ్చంచువు లనఁగా చకోరము లన్నందుకు, (ని. 'చలచ్చఞ్చు ద్విజజ్యోత్స్నాప్రియాశ్చ విషసూచకాః' అని ని.) ఆనందబాష్ప బిందు సందోహంబులన్=సంతోషబాష్ప జలకణములయొక్క సమూహములచేత, క్రందుకొనుచున్=సందడివడుచును - అనఁగా బలిష్ఠమౌచును. ఇక్కడ నిండారవికసించిన బొండుమల్లెపువ్వులు వెండిగిన్నెలకుఁ బ్రతియనియును, వానిలోఁ పూఁదేనియ మద్యమునకుఁ బ్రతియనియును, అందువ్యాపించిన చంద్రకిరణములు పాండురభక్ష్యవిశేషములకుఁ బ్రతియనియును తెలియవలెను.

జిగిమిగులు = కాంతిచేమించుచున్న, తొగలదొర=చంద్రునియొక్క, నిగనిగలన్=తళతళలవల్ల, మిగులన్ బుగులుకొను=ఆవరించుచున్న, నెగులునన్=చింతచేత, తనమగనిన్=తనయొక్క పెనిమిటియైన పురుషపక్షిని, అగణిత వనప్రదేశంబుల నరసియరసి = అనేకములయిన జలాశయములందు వెదకివెదకి, వేసరి=విసికి, ఓసరిలి=ఒత్తగిలినదై, సరసీమధ్యంబునన్=నివాసస్థానమయిన కొలంకులోపల, తననీడఁజూచి = తనయొక్క ప్రతిబింబమునువీక్షించి, కంటిఁగంటి నంటుకానిననుచు నంటంబోవన్=అంటుకాఁడనఁగా బ్రియుఁడు, ప్రియునిఁజూచితి నని దాపునకుఁ బోవఁగా, అదియునుందవుల కవలఁ జనన్=ఆనీడయును జిక్కక యవతలికిఁ బోఁగా, ఆసన్నుండయ్యున్ = సమీపమునకు వచ్చినవాఁడయ్యును, ఒల్లండు వల్లభుం డేల యని=పెనిమిటి నన్నొల్లఁడు దీనికేమిహేతువో యని, ఉసురుసురనుచున్=నిట్టూర్పులుపుచ్చుచు, అసురుసురై=బడలినదై, పొక్క=వ్యథపడుచున్న, జక్కవజవరాలి=చక్రవాకస్త్రీయొక్క, బహువిధ=అనేకవిధములయిన, ఆవిల=కలకనొందిన, విలాపంబులకున్=దుఃఖాలాపములకు, కనికరించిన తెఱంగునం గరంగు=జాలిపడినట్టులుగాఁ గరఁగుచున్న, కురంగధరకాంతకందళంబులన్ =మొలకలవంటి చంద్రకాంతమణులవలన, జలజలని=జలజలప్రవహించుచున్న, తెలినీటిజాలునన్=ధవళసలిలప్రవాహముచేత, క్రాలుగొనుచున్=ప్రకాశించుచు, వెన్నెలవెలుఁగు మెండైనకొలఁది చక్రవాకికి విచారము మెండయ్యెను. అందుచేఁ బ్రియునికొఱకు వెదకివెదకి వేసారిప్రతిబింబమును బ్రియుఁడని తలంచి చేరఁబోవ నది దూరమయ్యెను. అదిగని మగఁ డొల్లఁడయ్యెనని జక్కవ జవరాలు చింతింపసాగెను. దానివిచారముచే జాలిపడినటులఁ జంద్రకాంతములనుండి జలమూరుచుండెను. జక్కవజవరాలు ప్రతిబింబమున భర్తగా నరయుననుటకు-

సీ. ... ...
అరసి కన్నీటితో మరలి తామరయెక్కి వదనమెండఁగ సరోవారి నద్దు
నద్ది త్రావఁగ నైప కట్టిట్టు గన్గొని ప్రతిబింబ మీక్షించి భ్రమసి యుఱుకు
... ...
గీ. సంజప్రియుఁబాసి వగనొక్క చక్రవాకి. మనుచరిత్రము. తృతీ.

అచ్చవెన్నెల=స్వచ్ఛమైనచంద్రిక, విచ్చలవిడిఁ బెచ్చుపెరిగి=అడ్డములేనట్టులుగా విజృంభించి, పచ్చటామానికంపుఁ జిప్పలన్=మరకతమణిపాత్రలయందు, పరిశుద్ధాసవంబు=తెల్లసారా, నించకచు నించినట్లుండన్=పోయకయే పోసినట్టులుగానుండఁగా, చంచల నఖాంచలంబులం బయలు చిందింయె

వారును=చలించుచున్న గోళ్ళకొనలచేత వెలుపలికిఁ జిందఁగొట్టెడువారుకొందఱును, ఆసవమనఁగాఁ జెఱకురసముతోఁ జేయఁబడిన మద్యము. సంపూర్ణపాత్రంబులందోఁచు=సంపూర్ణపాత్రములయందుఁ బ్రతిబింబించిన, నిండుచందురుం బిండి = సంపూర్ణచంద్రుని నాపాత్రములలో నలిపి, అమృతం బని=ఆచంద్రునివలన స్రవించిన యమృతమేయని నిశ్చయించి, వాసితాసవంబుఁ గ్రోలుచున్ =కలువలుమొదలయిన పువ్వులచేత వాసనాయుక్తముగాఁ జేయఁబడిన మద్యమును బానముచేసి, కళంక శంకం గలువరేకు దిగిచివైచువారును=ఆసవములోనున్న నల్లగలువరేకును బిండఁబడిన చంద్రునివలన జారిన కళంకమని తీసివైచువారు కొందఱును, అపక్వమగు చెఱకురసముతోఁ జేయఁబడునది యాసవ మనియుఁ బక్వమగు రసముతోఁ జేయఁబడునది సీధువనియుం గేవలవృక్షసారము మద్యమనియు వ్యవహరింతురు. మరకతపాత్రములలోఁ బండువెన్నెల ప్రసరింప దానినిండఁ దెల్లసారాయము నించినటు లుండఁ దెలియకకొందఱు కొంతగోళ్లతోఁ జిమ్మసాగిరి. మద్యములో సుగంధము కలుగుటకు గలువ పూవులు వేయుదురు. పానసమయమునఁ బూవులు తీయుటయందుఁ బ్రతిబింబించిన చంద్రునిలోని యమృతము పిండి కళంకము పాఱవేయునటులుండె ననుట.

ప్రతిఫలితతారకంబులు=పానముసేయఁబడుచున్న యాసవమందుఁ బ్రతిఫలించిన నక్షత్రములు, తారకశబ్దము నపుంసకలింగంబును గలదు. (ని. 'కనీనికాయాం నక్షత్రే తారకం తారకా పిచ' అని వి.) ద్రాక్షాఫలంబులని=ఆసవములో వైవంబడిన ద్రాక్షపండ్లని భ్రమిసి, రిత్త చప్పరించువారును=వట్టిదే చప్పరించువారు కొందఱును, నిజాననాంభోజభాజనంబులం బట్టిన=తమయొక్క ముఖపాత్రములచేతఁ బట్టిన-అనఁగాఁ దమపుక్కిళ్ళతోఁ బట్టిన, మైరేయంబు=మైరేయమనఁగా ధాతకీ పుష్పమిశ్ర గుడ సహిత ధాన్యాంబుకృతమైన మద్యముపేరు గనుక నట్టిమద్యమును, మగలకుఁ ద్రావించునెడన్=ప్రియులకుఁ దమపుక్కిళ్లతోడనే త్రాగించుసమయమందు, వారు = ఆప్రియులు, వాసనార్పితసహకార పల్లవంబని=పరిమళయుక్తముగాఁ జేయఁబడిన తియ్యమామిడి చిగురుటాకని, చక్కెరమోవి చుఱుక్కున నొక్కినన్ = చక్కెరవలెఁ దియ్యనైన పెదవిని జురుక్కుమనునట్లు దంతక్షతముసేయఁగా, కలక్వణిత=సంజాతావ్యక్తమధుర నినాదములైన, కంకణ=హస్తాభరణములచేత, అంకిత=చిహ్నితములైనఁ కరంబులు=చేతులు, విదిర్చుచున్=విదళించుచును, కనీనికలు=ఱెప్పలతుదల, అప్పళించుచున్ = నల్లగ్రుడ్లు కొనరెప్పలచేతఁ గ్రమ్ముచును, కమనీయ = ఒప్పుచున్న, సీత్కార=నొప్పిచేత సీయనిపలికెడు సీత్కారములను, కంఠనాదంబును = అనఁగా రతికాలమందు స్త్రీకంఠజనితములైన పారావత నాద సదృశనాదములను, గులుకరించుచున్=మురిపెములుగాఁ బలుకుచును, పానశాలా=మద్యపానముసేయుం గృహవిశేషముయొక్క, పురోభాగ=ముందర, భాసమాన=ప్రకాశించుచున్న, నలద=వట్టివేళ్ళచేత నిర్మింపఁబడిన, (ని. 'నళదం స్యా త్పుష్పరసో శీరమాంసీషు నద్వయోః' అని మే.) కాయమానంబులన్=పందిళ్లయందు, పొడము=సంభవించుచున్న, పొడవెన్నెలలన్=వెన్నెలపొడలను, పువ్వులని=తెల్లనిపువ్వులని భ్రమసి, ఎత్తియువ్వంబోవువారును=వానిం దీసికొని యాప్రియులమీఁద ఱువ్వఁబోయెడు వారు కొందఱును, గుబ్బెతలు పుక్కిలినిండ మైరేయముంచుకొని మగలఁ ద్రావించుచుండిరి. మైరేయ మునఁ దావికి మావిచివురులుంతురుగాన జెలులపెదవులు మావిచివురులని ప్రియులు చురుక్కుననటుల నొక్కిరి. చెలులు సీత్కారములతో నావలికేగి పందిళ్లకుఁగట్టిన వట్టివేళ్ల తడికలనుండి ప్రసరించు

వెన్నెలపొడలను బువ్వులని ప్రియులపై రువ్వఁబోయిరి. సీత్కారము ప్రియులకు రతిసమయమణితాదుల వలె నానందకరముగ నుండెను.

సీత్కారములు పురుషుల కానందకరములనుటకు—

శ్లో. 'సీత్కారాంచితలోచనా సపులకం యైశ్చుంబితామానినీ
ప్రాప్తం తై రమృతం శ్రమాయ మథితో మూఢై స్సురై స్సాగరః.' అమరుకావ్యము.

కాదంబరీ మదోన్మాదంబునన్=మద్యపానజనితమైన యున్మత్తతచేత, (వ్యు. 'కదంబరస్య కుత్సితాంబరస్య నీలాంబరస్య ఇయం, కాదంబరీ' అనివ్యుత్పత్తి.) బలరామునికిఁ బ్రియమైనదిగనుకఁ గాదంబరియనఁగా మద్యము, (ని. 'గంధోత్తమా ప్రసన్నేరాకాదంబర్యః' అని అ.) మోదమ్ములు వెరిగి=వెట్టివెట్టిసంతోషము లతిశయించి, చేదమ్ములుసరచుచున్=చప్పట్లుగొట్టుచును, చిందులుగనాడుచుంబాడుచున్=చిందులుద్రొక్కినట్లుగా నాడుచును బాటలుపాడుచును, తమనృత్తంబులకు మెచ్చి = తమయొక్కనాట్యములకు మెచ్చుకొని, సెత్తమ్ముల పగఱ=కమల విరోధియైనచంద్రుఁడు, పుత్తెంచిన=పంపించిన, ఉడుగరలని=కట్నములని విచారించి, ముంగిళ్ళరంగుమీఱు=గృహాంగణములయందు వన్నెమీఱుచున్న, ముత్యాలయరుంగులచెఱంగులన్=ముత్యాలుగూర్చిన వేదికలయొక్కతుదలను, తుఱంగలించు మెఱుంగులు=ప్రకాశించుచున్న వెన్నెలతళుకులను, కరాంగుళులవిప్పి కప్పుకొనఁ బోవువారును=చేతులతోవిప్పి కప్పుకొనఁబోవువారు కొందఱును, ఐ=అవుచునుండి—అనఁగా నీపైనఁ జెప్పఁబడిన వారికందఱకు నన్నివిధములుగా వెన్నెలభ్రాంతి పుట్టించుచున్నదని తాత్పర్యము. కాదంబరిమదమును ఉన్మాదమును గలిగించునుగానఁ బానముచేసినవారు వికారనృత్యములు గావించుటయు నొరులు మెచ్చి బహూకృతి సలిపిరని తలంచుటయు సహజము.

అతిప్రబంధ = మిక్కిలివాసనగట్టిన, గంధోత్తమా=మద్యముయొక్క, గంధ=వాసనాస్వాదనమందలి, అనుబంధ=ఆసక్తిచేత, బంధురలగు=ఒప్పుచున్నవారైన, సింధురయానల=స్త్రీలయొక్క, ఉదస్త=మద్యపానార్థమై మీఁదికెత్తఁబడిన, నాసామణి = ముంగరముత్తియములయొక్క, ప్రభాస్తబకంబులన్=కాంతిపుంజములచేత, ఉల్లసిత=ఒప్పుచున్న, గల్ల=చెక్కిళ్ళయందలి, సితలోధ్రచూర్ణంబులన్=(అలంకారార్థమై ధరించిన) తెల్లనిలొద్దుగుపుప్పొడిచేతను, స్త్రీజన మలంకారార్థమై ముఖమందుఁ దెల్లని లొద్దుగుపుప్పొడి ధరించుటకలదు. ఇందుకుఁ గాళిదాసప్రయోగము. శ్లో.'నీతాలోధ్రప్రసవరజసా పాణ్డుతా మాననే శ్రీః' అని యున్నది. ఉన్నమిత=ఎత్తఁబడిన, అవటు=మెడవంపులయందు, విలంబి=వ్రేలుచున్న, హారంబులన్=ముత్యాలపేరులచేతను, పేరెంబులు వారెనోయనన్=పరుగులెత్తెనో యనునట్టులుగాను, (తుదవాక్యమందుఁ జెప్పఁబడిన వెలసి, అనెడు క్రియాపదమును నంతట నన్వయింపవలయును.)

కొన్నియెడలన్ = మఱికొన్నిస్థలములయందు, ఉన్నత = పొడవైన, చంద్రశాలా = శిరోగృహములయొక్క, బహిరంగణంబులన్=బయటి ముంగిళ్లయందు, అడుగులకు మడుఁగులు పఱచినారని=పాదములక్రిందఁ జలువచేసినవస్త్రములు పఱచినారని యనుకొని, చరణకిసలయాయాసంబులెఱుంగక=చిగురుటాకులవంటి పాదములయొక్కయాయాసములను గుర్తెఱుఁగక, చందనతిలకంబులు గరఁగన్=చెమటచేత శ్రీగంధపుచుక్కబొట్లు కరఁగిపోఁగాను, చారుహారంబు లెగరన్=సుందరమైన ముత్యాలపేరు లెగయఁగాను, చపల=చలించుచున్న, కుండల=కర్ణాభరణములయందలి, హీరకోరకం

బులు=మొగ్గలవంటి వజ్రములు, వెలుంగన్ = ప్రకాశింపఁగాను, భావి=ముందరఁ జేయఁబోయెడు, పుంభావ = ఉపరిసురతముయొక్క, సంభావనా=విచారములయందలి, పరిచయంబున్ =అభ్యాసమును, సంపాదించుసొంపునన్ = సంపాదనము చేసికొనురీతిగా, పింపిళ్లుగూయు = చిడుగుడుకూయుచున్న, కలికిగొామెరల = చక్కని చిన్నపడుచులయొక్క, మొలక చనుమోసులన్ = మొలకలవంటిపూపచన్ను లయందు, తులకరించిన=పొటమరించిన, తళుకుసిబ్బెంపుతళతళ=తళుకుగలశోభయొక్క తళతళ యనుకాంతులచేత, దళముకొనియెనోయనన్ =సాంద్రమైనదో యన్నట్టులుగాను, ఇందులోఁ జందన తిలకములు కరఁగుటయును జారుహారము లెగురుటయును జపలములైన కర్ణకుండలములయొక్క హీర కోరకములు వెలుఁగుటయును, క్రీడావిశేషమందు నుపరిసురతమందును సంభవించుచున్నవని తెలియ వలయును. పింపిళ్లుగూయుట మణితరచనముగఁ జెప్పఁబడెను. పురుషాయితమునఁ దిలకము కఱఁ గుట, హారములెగురుట, కుండలాదులరత్నములు ప్రకాశించుట, గుబ్బలనిగ్గులు ప్రబ్బికొనుట సాజము కలికిగొామెరలుగాననే పుంభావనాభ్యాసమున కలవాటుపడుట. ప్రౌఢలైన నందాఱితేరియే యుందురు. కలికిగొామెరలుకాననే పూపచన్నులు.

ఉపరిసురతమందలి నాయికావస్థ యిట్లు చెప్పఁబడెను-

శ్లో. ఆలోలామలకావళిం సకుసుమాం బిభ్రచ్చలత్కుండలం
కించిన్మృష్టవిశేషకం తనుతరైః స్వేదోద్గమైః సీకరైః
తన్వ్యాయత్సురతాంతతాంతనయనం వక్త్రం రతివ్యత్యయే
తత్త్వాంపాతు చిరాయ కిం హరిహరబ్రహ్మాదిభిర్దైవతైః. (అమరుకావ్యము)

కుండలములు కదలుటయుఁ దిలకము కఱఁగిపోవుటయు నీశ్లోకమునఁ జెప్పఁబడెను. ఇటులే తక్కినవిశేషములు కవిప్రయోగములవలన గ్రాహ్యములు. విస్తరభీతిచే నుదాహరింపమైతిమి.

ఒక్కొక్కకడన్ =ఒక్కొకడిక్కున, గడపరాని తమచేడియల = త్రోయరాని చెలికత్తియల యొక్క, బెడంగునుడుగులన్ = ప్రౌఢవాక్యములచేత, అడుగు లామడలుగావచ్చి=ఒక్కొక్కయడు గొక్కొక్కయామడ యగునట్టులుగా యత్నాతిశయముచేతవచ్చి, అభినవవిహారహర్మ్యంబులుసొచ్చి= నూతనములైన క్రీడాసౌధములయందుఁ బ్రవేశించి, శాంతకుంభస్తంభంబుల నత్తమిల్లి=సువర్ణస్తంభం బులయందుఁ జేరఁగిలబడి నిలిచి, ఉత్తరీయంబులుపట్టితివియన్ = మీఁదనున్నవస్త్రములపట్టి పెనిమి టులు తియ్యఁగా, ఈడిగిలం బడుచున్ = రాకమారుమసలుచును, తనులతల యడంకువలన్ =తీఁగెల వంటి దేహములయొక్క సంకోచములచేతను, తరగని వడంకులన్ =శమింపని కంపములచేతను, తను వాన ముడిసడలు=తనంతట తానే ముడివీడిన, నిద్దంపువలువలు=నునుపుగలవస్త్రములు, అదరిపాటునన్ =ఏమరిపాటున, చరణాంగుళీదంశికలఁ బట్టి=దంశికయనఁగాఁ బట్టుకారు, పట్టుకారువలె జోడించిన కాలివ్రేళ్ళచేతఁ బట్టి, నుసిమినన్ =కౌఁగిటిలోనలుపఁగా, మిట్టిపడి= బెదురుకొని యదరిపడి, ఇట్టట్టు దలనేరక=ఈవలావలఁ గదలఁజాలక, వరులహృదయ పంజరంబులుదూఱి=పెనిమిటులయొక్క పంజ ములవంటి వక్షస్థలములయం దడఁగియుండి, ఎట్టకేలకున్ =కొంతసేపటికి, చిట్టకాలకుఁ జెవియొగ్గిన సయ్యాటముల కనుకూలించిన, సిగ్గరికత్తియలు=లజ్జావతులు-అనఁగా ముగ్ధాంగనలు, ఇందు ముగ్ధాం గమమభివర్ణితము. సిగ్గరికత్తియలుగాన సురతమునందు వెఱపుమెండు కాననే గడువరాని చెలిమిక త్తియలనేరుపుమాటలే యడుగామడయైనను గమ్యస్థానము జేర్పించినవి. యత్నాతిశయముచే వచ్చినను

జారపలేకుంటచే సిగ్గరికత్తియలు బంగరుకంబముమాటునఁ జేరఁగలిగి. మీఁదివలువఁ బ్రియుం డెడలించి లాఁగ ఈడిగిలఁబడుట, మేనుముడుచుట వడఁకుట ముగ్ధాసహజకృత్యములు. ప్రియులువలువలులాగ నవి నునుపువిగానఁ ద్వరలో ముడివీడెను. అపుడెటులోఁ బ్రియులు కౌఁగిటఁ దార్చిరి. సయ్యాటములకు విధిలేక యనుకూలించిరి.

వాతాయనంబుల డగ్గఱమెలంగు=గవాక్షముల సమీపమునం దిరుగుచున్న, చలినిగ్గులగనిం గని =చలినిగ్గులగని యనఁగా శీతకిరణముల కాకరమయిన చంద్రుఁడు గనుక నట్టిచంద్రునిఁ జూచి, తొంగి చూచు ధూర్తసఖీసుస్మిత వదనంబని = గవాక్షములనుండి తొంగిచూచునట్టి దుండగపు చెలికత్తె యొక్క నవ్వుమొగమనుకొని, అదరిపడి పొదవుకొన్న = సిగ్గుచేత బెదరుకొని కప్పుకొన్న, నున్నచేలలన్ =నునుపుగల వెలివస్త్రములయందును, చిన్నారిసెఱికలన్ =చిఱుత పావడలయందును-అనఁగాఁ దాబందులయందును, చెన్నారు=ఒప్పుచున్న, మిసమిసల=కాంతివిశేషములను, కన్నంబువెట్టి కైకొనియెనో యనన్ =కన్నమునిడి దొంగిలించినదో యన్నట్టులుగా, కతిపయస్థలంబులన్ =కొన్ని ప్రదేశములయందు, పచ్చిదేరు నంగమచ్చంబులతో వచ్చి=పచ్చియాఱని దంతక్షతాది చిహ్నములతో వచ్చి, తచ్చన వినయంబులు దెచ్చుకొని=కొడిగపువినయములు గల్పించుకొని, మోవి మాటిమాటాడియు = పెదవి గనుపడనియ్యక మాటలాడియును, చేతులుగట్టుక నిలిచియు=చేతులు జోడించుకొని నిలిచియును-అనఁగా నతివినయములుచేసియనుట. గట్టువాతనంబున కొడిగట్టిన=ధూర్తత్వమున కాలాయపడిన, దిట్టవిటులఁ బట్టి = గడుగుగాయలైన విటులనుబట్టుకొని, పూదండలఁగట్టి = పుష్పమాలికలచేతఁ గట్టివైచి, వ్రేలింపన్ = వేలాడఁదీసెడుకొఱకు, చెయిసాచు = చెయిచాచుచున్న, ముగుదమగువల=ముగ్ధస్త్రీలయొక్క, నఖరకాంతి భంగంబునన్ =నఖకాంతి తరంగములచేత, పొంగిపొరలెనో యనన్ =పైకిఁబొంగి పొరలినదో యన్నట్టులుగా, ఇక్కడఁ గరనఖరకాంతి తెల్లనిదని తెలియవలయును. విటులు గడుసరులు, చెలువలు ముగ్ధలు. కాన విటులమేననున్న దంతక్షతాదిచిహ్నములు పరకాంతాభోగమును సూచించుటయెఱింగి ముగ్ధలగు ప్రియురాండ్రదరి మాటుపఱచికొనుచుండిరి. కృత్రిమవినయము, మోవిమాటిడుకొనుట, చేతులుజోడించి నిలుచుట. ఇవి యంగమచ్చములు మరుగుపఱచు చేఁతలు. చెలువలిది యెఱింగి శిక్షింపఁబూనిరి. కోపముతో శిక్షించుటకాదు ప్రణయకోపమున. కానఁ బూదండలతో బంధింపఁ బూనిరి.

వేఱొండుచాయలన్ =మఱియొకవైపులను, కోయకకోయు=కోసినట్టులు గనుపడకయ కోఁత వెట్టునట్టి, కాయజు మాయకత్తుల=మన్మథుని మాయకత్తులయొక్క, రాయిడింబడలేక=శ్రమకు సహింపఁజాలక-అనఁగా మదనవేదనకు సహింపఁజాలక యనుట. ధవళాంబర మాల్యానులేపన నేపథ్యంబులు పూని=తెల్లవస్త్రములు పుష్పమాలికలు మైపూఁతలు వీనితోఁగూడిన వేషములువహించి, మునిమాపు చూచివచ్చిన=సాయంకాలమందుఁ జూచివచ్చిన, కర్పూరకదళికాంకిత సంకేత నికుంజంబులకు వచ్చి=కర్పూరపరఁట్లచేత గుఱుతుగాఁ జేయఁబడిన సంకేతపు పొదరిండ్లకువచ్చి, ఇక్కడ ధవళాంబర మాల్యానులేపనములు ధరించి సంకేతనికుంజములకు వచ్చినారని చెప్పినాఁడు గనుక జ్యోత్స్నాభిసారికలని తెలియవలయును.

శ్లో. 'మల్లికామాల్యధారిణ్య స్సర్వాఙ్గీణార్ద్రచన్దనాః,
క్షౌమావత్యో న లక్ష్యన్తే జ్యోత్స్నాయా మభిసారికాః'

అని చెప్పఁబడియున్నది. అచ్చట నళికుంజంబులు నట్లనయి యుండఁగ=అక్కడ నన్నిపొదలును నారీతిగానే యుండఁగా - అనఁగా వెన్నెలచేత నన్నిపొదలును గర్పూరకదళికాంకిత సంకేతనికుంజ ములవలెనే యుండఁగా ననుట. కొండొకసేపు వివరింపలేక = కొంతసేపు తమసంకేతనికుంజముల నే ర్పాటుచేసికొని తెలియలేక, వలపులవలనఁ దెలిసి=కర్పూరవాసనలవలనఁ దెలిసికొని, నిజసమయనిల యంబు లీఁగు = తమరు సమయముచేసికొన్న పొదరిండ్లుదూరిన, ఇత్వరీజనంబుల = జారస్త్రీజనముల యొక్క, (ని. 'పుంశ్చలీ ధర్షణీ బన్ధ క్యసతీ కులటే త్వరీ' అని అ.) మనంబు లరయవలసి=మన స్సులు గనవలసి, మార్మగలు = ఉపపతులు, మాటునకరుగుటయుఁగ=చాటునకుఁ బోఁగా, అవ్వేళ నెవ్వరిం గానక = ఆసమయమందెవ్వరినింగానక, అరణ్యరోదనంబు నిజంబయ్యెనని=అడవియేడుపన్న మాట నిజమాయెనని, నిశ్శబ్దంబుగా నేడ్చుచుఁ = అలుకుడుగాకుండ నేడ్చుచు, చేయునదిలేక=ఏమి యుఁ దోఁచక, చెయ్వులు దక్కియున్నఁ=నిశ్చేష్టితలై యుండఁగా, ఇక్కడ అవ్వేళ నెవ్వరిం గానక నిశ్శబ్దముగా నేడ్చుచున్నారని చెప్పినాఁడు గనుక విప్రలబ్ధలనెడి నాయికలనియును బరకీయ లనియును గ్రహింపవలయును. విప్రలబ్ధలకు-

శ్లో. 'క్వచి త్సఙ్కేత మావేద్య దయితే నాథ వఞ్చితా,
స్మరార్తా విప్రలబ్ధేతి కళావిద్భిః ప్రకీర్తితా'

అని లక్షణము. అన్నెగులువారింప సన్నిహితులై = ఆవిచారమును బోఁగొట్టెదు కొఱకు దగ్గర వచ్చినవారై, వారికన్నీరుదుడిచి కవుంగిటమన్నించినఁ=ఆస్త్రీలయొక్క కన్నీళ్లు దుడిచి కౌఁగిటిలోఁ జేర్చి మన్ననసేయఁగా, కనుదెఱచిచూచు = కన్నులు విచ్చిచూచునట్టి, అన్నెలంతల = ఆజార స్త్రీలయొక్క, విస్మయసూచనలోచనప్రభాదట్టంబులఁ=ఆశ్చర్యద్యోతకములైన నేత్రకాంతిస్తోమ ములచేత, నిట్టవోడిచెనో యనఁ=నిగ్గినదో యన్నట్లుగాను, మఱియుం బెక్కునెళవులఁ=మఱియుం ననేకస్థలములయందు, కళల యిక్కువలఁదెలిసి=మన్మథకళాస్థానములు గుర్తెఱిఁగి, కలసినయదనఁ= సంభోగముచేసినసమయమందు, మదనకదనంబునఁ=మన్మథయుద్ధమందు, సదమదంబులగు నంగంబు లఁ=బడలి నలినలియైన దేహములయందు, అంగదట్టంబులు మార్పడవైచుకొని=అనఁగా స్త్రీపురుష లొకరిపావడ లొకరుపైనిఁ గప్పుకొనియనుట. ఉప్పరిగల బయళ్ళకు నేగుదెంచి = మేడలయొక్క బయళ్లకువచ్చి, చందమామగుటికలుగ్రోలు=చంద్రకిరణాస్వాదనము సేయుచున్న, మందయానల = స్త్రీలయొక్క, చెక్కుల వెలుంగు=చెక్కిళ్ళయందుఁ బ్రతిఫలించిన, వలివెలుంగుం జూపి=చంద్రునిఁ జూపి, మీమొగంబుల మిలమిలలు గిలుబాడవచ్చెఁజుమీ = మీవదనములయందలి తళతళలను సంగ్ర హించుకొనెడుకొఱకు వచ్చినాఁడుసుమా, వెన్నెలబచ్చు=వెన్నెల నాణెగాఁడు-అనఁగా నీచంద్రుఁడు, ముచ్చువీఁడు = వీఁడుదొంగ, కాఁబట్టి, ఇచ్చోట మసలుట మనకు నేరమని = ఇక్కడ నాలస్యము సేయుట మనకుఁ దప్పిదమని పలికి, నారులం బునారతంబులకు నెలయించికొనిపోవు=స్త్రీలను బున స్సంభోగముల కుల్లసిల్లఁజేసి వెంటఁబెట్టుకొని పోవునట్టి, వలకారుల జారుకొప్పులం దొరఁగు=విటుల యొక్క జారుసిగలవల్లనుండి రాలుచున్న, విరిగుత్తుల=పుష్పమంజరులతోడ, పొత్తుగలసెనో యనఁ =జతగూడినదో యన్నట్టులుగా, వెలసి=ప్రకాశించి, అభివ్యక్త=ప్రత్యక్షమయిన, శుద్ధవర్ణబ్రహ్మంబు వునఁ=పరిశుద్ధాక్షర బ్రహ్మము గనుక, ఉర్విఁగలవారినెల్లఁ=భూమిలోఁగలవారి నందఱను, సర్వ

జ్ఞులఁ జేయుచున్=సకలవిద్యాపారంగతులఁ జేయుచు నని యర్థము. కళాస్థానములను శాస్త్రానుగుణముగా గుర్తించి కలసినయెడలఁ జెలువలు త్వరగాఁ బరితృప్తినొందుదురు. దాన బడలిక పెచ్చరిలి తమ్ముదామె మఱచునంతటి బద్ధకమునకు లోనగుదురు. కాననే యంగదట్టములు మార్పడుట సంభవించెను.

కళాశాస్త్రమునఁ గళాస్థానములు పదియాఱని యిట్లు చెప్పఁబడెను-

సీ. తల యురస్థన్నలి వామ దక్షిణకరములు వలిదున్న లూరు లావర్తనాభి
ఫాలజాతరనితంబస్థలంబులు వీపు చంకలు గుహ్యంబు చరణతలము
ఆదిగాఁగల పదియాఱుతానకములఁ బ్రతిదినంబునఁ బంచబాణుఁ డుండు
గావున స్త్రీయంగకంబులు శుక్లపక్షంబుల నెక్కుఁ గృష్ణముల దిగును
తే-గీ. విటులు తలములు పదియాఱు విస్ఫులింగ
భావములుగాఁగఁ జూచి యప్పట్ల దలఁచి
పొందనేర్చిన మోహంబు పొదలుచుండు....

లేక శుద్ధవర్ణబ్రహ్మమనఁగా ధవళవర్ణబ్రహ్మము హరుఁడని చెప్పి యాదేవుఁ డభివ్యక్తుఁడైన తాను సర్వజ్ఞుఁడు గనుక నుర్విఁగలవారినెల్ల సర్వజ్ఞులఁ జేయుచున్నాఁడనఁగా సారూప్య దేదీప్యమానులఁ జేయుచున్నాఁడని యర్థాంతరము. అభివ్యక్త ధవళవర్ణ ప్రవృద్ధ మనియును, ఉర్విఁగలవారినెల్ల సకలపదార్థజ్ఞానము గలవారిని జేయుచున్నదనియును జంద్రికాపరమయిన భావము. బ్రహ్మమనఁగా, 'బృహబృహివృద్ధౌ' అనెడి ధాతువువలనఁ బ్రవృద్ధమయిన వస్తువని తెలియవలయును. తారవాదధౌరేయంబు గావునఁ గొండలనెల్ల వెండికొండలఁ జేయుచున్=తారమనఁగా రజతము గనుక దానియొక్క వాదము తారవాదము-అనఁగా రజతచ్ఛాయ. లేక తారవాదమనఁగా రసఘుటికకును పేరు. ఏలాగనిన, తరుసంబంధమయినది తారవము-అనఁగా వృక్షరసము దాని భక్షించునది గనుకఁ దారవాదమని తెలియవలయును. తారవాదధౌరేయము గనుకఁ గొండలనన్నిటిని వెండికొండలుగాఁ జేయుచు నని యర్థము. తారశబ్దము నక్షత్రార్థక మయినప్పుడును నపుంసకలింగ మవుచున్నది. ఇందుకు శ్రీనాథుని ప్రయోగము-

సీ. 'గ్రహతారనక్షత్రగణము నాస్ఫాలించి విధుకిరీటునిమౌళి వెల్లిఁ గొల్పి'

అని యున్నది గనుకఁ దారవాదధౌరేయ మనఁగా నక్షత్రములతోడ వాదధౌరేయమయినది. అనఁగా నక్షత్రకాంతి నడఁగించునది యనియును గొండలనన్నిటిని ధవళములుగాఁ జేయుచున్నదనియును జంద్రికాపరమయిన భావము.

పద్మాహిత పాదప్రభూత నూతన స్రోతోవిశేషంబు గావున నఖిలభువన మాలిన్యంబు లడఁగించుచున్-పద్మా=లక్ష్మీదేవికి, హిత=ప్రియుఁడైన విష్ణుదేవునియొక్క, పాద=పాదమువలన, ప్రభూత=సంభవించిన, నూతనస్రోతోవిశేషంబు గావునన్=అభినవప్రవాహవిశేషము గనుక, అనఁగా విష్ణుపాదోద్భవమైన భాగీరథి గనుక, అఖిలభువన = సమస్తలోకములయొక్క, మాలిన్యంబు లడఁగించుచున్=పాతకపటములను భంగించుచు నని యర్థము. పద్మ=కమలములకును, అహిత=శత్రువైన చంద్రునియొక్క, పాద=కిరణములవలన, ప్రభూత=పుట్టిన, నూతనస్రోతోవిశేషంబు గావున ననఁగా

పూర్ణమైనదనియును సకలభువనాంధకార నివారకమనియును భావము. ఇక్కడఁ జంద్రికయందుఁ జంద్రకిరణ జనిత స్రోతోవిశేషారోపము చేసినాఁడు గనుక రూపకాలంకారము. చంద్రకిరణ జనిత స్రోతోవిశేషము కవికల్పితము గనుక రూపకము గాదనఁగూడదు. అదేమన్నను, ('స్వర్గఙ్గావిమనస్కశోకవదనప్రస్తా మృణాళీలతా' అనుచో) స్వర్గంగావిమనస్కశోకవదన ప్రస్తమైన మృణాళీలత కవికల్పితమయినదైనను, ఇది రూపకాలంకారమున కుదాహరింపఁబడియున్నది గనుక నని తెలియవలయును. పంకజభవాండమండపంబు సంకుచేసిన ఘాంకంబున నంకించుచుఁ=బ్రహ్మాండమనెడు గృహవిశేషమును దెల్లరంగుచేసినరీతి నుల్లసిల్లుచును, అకలంకమీనాంక నిరంకుశ యశోమరీచిసధ్రీచీనంబై -అకలంక=నిర్మలమయిన, మీనాంక=మన్మథునియొక్క, నిరంకుశ=అడ్డములేని, యశః=కీర్తియొక్క, మరీచి=కాంతితోడ, సధ్రీచీనంబై = సమానమైనదై - అనఁగా మన్మథయశఃకాంతియో యన్నట్టులుగా నున్నదై యనుట. విజృంభించుసమయంబునఁ = ప్రకాశించుచున్న సమయమునందు.

శా. అచ్ఛంపుం దెలినిండువెన్నెలలతో ♦ నబ్జారి వచ్చెం గడుఁ
హెచ్చెం బచ్చనివింటిజోదు చలిగా ♦ డ్పేతెంచె నిచ్చోట ము
చ్చిచ్చుం గూడిన నోర్చునే చెలి యయో ♦ చెల్లంచు నాళీజనం
బిచ్చఁ మెచ్చఁగ మంజువాణి సకలా♦భీష్టక్రియాధుర్యయై. 24

అచ్ఛంపుం దెలినిండు వెన్నెలలతోఁ=స్వచ్ఛమైన ధవళకాంతిగల సంపూర్ణచంద్రికలతోడ, అబ్జారివచ్చెఁ=చంద్రుఁడు వచ్చెను. కడుఁ హెచ్చెం బచ్చనివింటిజోదు=మిక్కిలి మన్మథుఁడు పెచ్చుపెరిగెను, చలిగాడ్పేతెంచెఁ=మలయమారుతమువచ్చెను, ఇచ్చోట ముచ్చిచ్చుం గూడినఁ= ఇక్కడ నగ్నిత్రయమును గూడినదగుచుండఁగా, ఓర్చునేచెలి=గిరికాదేవి తాళఁగలుగునా, అయోచెల్లంచుఁ=అయ్యయో నేఁజెల్ల ననిపలుకుచు, ఆళీజనం బిచ్చమెచ్చఁగఁ=సఖీజనము మనస్సున మెచ్చుకొనునట్టులుగా, మంజువాణి=మంజువాణి యనెడు చెలికత్తియ, సకలాభీష్టక్రియాధుర్యయై= సమస్తహితకార్యధురంధరురాలై, ముందరిపద్యముతో నన్వయము.

ఒక్కయగ్నికోర్చుటయే మిగుల కష్టము. ఇపుడు గిరికకు మూఁడు చిచ్చులు ప్రాప్తమైనవి. ఒక చిచ్చు పండువెన్నెల, మఱియొకచిచ్చు మన్మథుఁడు, వేఱొకచిచ్చు మలయమారుతము. మంజువాణి కోరికలొనగూర్చు చెయిదములలో నారితేఱిన గడుసరి. కానఁ జెలులుమెచ్చ సమయోచితకార్యముల నుపక్రమించెను.

సీ. రిక్కరాయనికళ♦ ల్పెక్కు గీటక మున్న వెడతూపు దృగ్వీథిఁ ♦ బడక మున్న
యెలతుమ్మెదలదిమ్ము ♦ తలఁ గ్రమ్మకయమున్న చిగురు చేపట్లకు ♦ డిగక మున్న
కలికికోయిల గళ♦గ్రహము సేయక మున్న రాచిల్కమాటకు ♦ రాక మున్న
నిసువుతెమ్మెరదంట ♦ యుసురు లంటకమున్న కలహంస కాళ్లఁ ద♦వులక మున్న

తే. యబ్జముఖులార యేఁ బోయి ♦ యచలకన్య
యుత్తలముఁ దెల్పి వసుర జా♦చిత్త మరసి
వత్తు నత్యంతశుభవా ర్తఁ ♦ దెత్తు ననుచుఁ
గొమ్మహారంబు పూని యే♦గుటయు నిచట. 25

అబ్జముఖులారా=చెలికత్తెలారా!, రిక్కరాయనికళ ల్చెక్కుగీటకమున్న=చంద్రునియొక్క కళలు గిరికాదేవియొక్క బుగ్గలు పొడవకమునుపే యని యర్థము. వెడతూపుదృగ్వీథిఁ బడకమున్న =వెడతూపు అనఁగా వెఱ్ఱిఁబుట్టించునట్టి మన్మథునిబాణము అనఁగా కమలము గనుక నది దృష్టిపథమునఁ బడకమునుపే యని యర్థము. ఇటఁ జంద్రకళలకుఁ జెక్కులకుఁ గమలములకుఁ జూపులకు సాదృశ్యము గ్రాహ్యము. ఇందుఁ జంద్రుఁడు తామరపూవులు ప్రతికూలచేష్టితములగు బుగ్గలు పొడుచుట చూపు త్రోవకడ్డుపడుట యను క్రియలు చెప్పఁబడెను. మన్మథునిబాణము లైదింటిలో మొదటిది తామరపూవు. ఇది యున్మాదకరముగాన వెడమాపని పేరొందెను. ఉన్మదనబాణమనియు నున్మాదబాణమనియు దీనిని వ్యవహరింతురు. ఉన్మదనబాణము మరులుకొన్నవారిని లోఁగొనుననుటకు—

ఉ. ఆవసుధాధినాథుని మహాధృతిశాలి జయించు తెంపునన్
భావజుఁ డప్పు డున్మదనబాణము తియ్యనివింటఁ గూర్చుచోఁ
గేవలసాహసంబు మదిగీల్కొనఁ జేసియు ముంచెఁ దాఁ ద్రిలో
కీవిజయార్జితంబులగు కీర్తిభరంబులు సంశయాంబుధిన్. శృంగారనైషధము. ఆశ్వా. ౧.

ఉన్మదనబాణమె వెడబాణము. ఇది మదనునిపంచబాణములలో నొకటి.

శ్లో. ఉన్మాద నస్తాపనశ్చ శోషణ స్తంభన స్తథా,
సమ్మోహనశ్చ కామస్య పంచబాణాః ప్రకీర్తితాః.

మన్మథబాణముల కృత్యములు.

క. కూడుడిగించు నశోకము, వాడించును మల్లెవిరి, వివర్ణతఁ జేయున్
జూడఁగఁ జూతము, తలఁపుల్, జోడించును తమ్మిచంపఁ జూచున్ గలువల్.

ఎలతుమ్మెదలదిమ్ము = కొదమతుమ్మెదలయొక్క రొద, తలఁగ్రమ్మకయమున్న=తలపట్టుకొనక మునుపే యని యర్థము. చిగురుచేపట్లకు డిగక మున్న=చిగురుటాకు చేసరసములకు రాకమునుపే యని యర్థము. కలికికోయిల గళగ్రహము నేయకమున్న=చక్కని కోయిల గొంతు పట్టుకొనక మునుపే యని యర్థము. రాచిల్కమాటకు రాకమున్న=రాజకీరము వాదమునకు రాకమునుపే యని యర్థము. నిసువు తెమ్మెరదంట=బాలసమీర మనెడుగడుసరి, అసువులంటకమున్న=ప్రాణము లంటక మునుపే యని యర్థము. కలహంస కాళ్ళఁ దవులకమున్న=హంసవిశేషము కాళ్ళకుఁ దగులకమునుపే యని యర్థము.

ఏఁబోయి=నే నచ్చటికిఁ బోయి, అచలకన్య=గిరికాదేవియొక్క, ఉత్తలముఁ దెల్పి=వ్యాకులమును దెలియఁజేసి, వసురాజుచిత్తమరసి=వసురాజుయొక్క మనస్సును విచారించి, వత్తున్=ఏతెంచుచున్నాను. అత్యంతశుభవార్తఁ దెత్తున్ = అత్యంతమైన శుభవృత్తాంతమును దెచ్చుచున్నాను. అనుచున్=అని పలుకుచు, కొమ్మహారంబు పూని యేగుటయున్ = గిరికాదేవియొక్క మౌక్తికహారము చేతఁబట్టుకొని పోఁగా, ఇచటన్=గిరికాదేవి యున్నయీస్థలమందు, మన్మథపరికరములగు చంద్రుఁడు, తమ్మితూపు, తుమ్మెదలు, చిగురులు, కోకిల, రాచిలుక, తెమ్మెరలు, రాజహంస బుగ్గలు పొడుచుట, కంటఁబడుట, తలను గ్రమ్ముకొనుట, గళము గ్రహించుట, మాటకడ్డుపడుట, ప్రాణముల కలంచుట, కాళ్ళకడ్డుపడుటలోనగుచేఁతలు ప్రతికూలచేష్టితములు. చంద్రుఁడు చెక్కులతోఁబోలుట

లానగునవి సాదృశ్యములు. ఇందు సదృశసంబంధములు ప్రాతికూల్యవివక్షితములుగఁ గల్పితములు. అలం. అతిశయోక్తి.

ఇక్కడ రాయంచకాళ్ళఁ దౌలకయమున్న యని పాఠాంతరము. అది యహోబలపత్యంగీకృత పాఠము. ఆ పక్షమందు రేఫలకారములకు విశ్రమము చెల్లవలయును. ఈవిచారము తృతీయాశ్వాసములో 162 వదియైన, ఓలోలాంబక యనెడు పద్యపుటీకయందు వ్రాయఁబడినది గనుక నక్కడఁ జూడఁదగినది. ఇంతమట్టుకుఁ జంద్రాదివస్తువులు తటస్థోద్దీపనవిభావములు గనుక విరహవేదనాహేతువులని తెలియవలయును. ఇందులో గిరికాదేవియొక్క కపోలాద్యవయవములకు రిక్కరాయనికళలు మొదలైనవానితో సాదృశ్యసంబంధము స్ఫురించుచున్నది. నిసువు తెమ్మెరదంట యసువులంటక మున్న యన్నచోటఁ బ్రాణవాయులకు సాజాత్యసంబంధము స్ఫురించుచున్నది.

శా. క్రీడామందిరజాలమార్గములచక్కిన్ నిక్కి జాబిల్లిఱా
గోడల్ నీరుగ జారఁ ద్రోచి నెలతళ్కుల్ చొచ్చి వెన్నాడి మై
నాడం గోమలి యోర్వ లేక వలవంతం బద్మినీజాతికిం
గీ డౌనుగ్రశిఖామణిం బలికె నక్షీణానులాపంబులన్. 26

క్రీడామందిర=కేళీగృహముయొక్క, జాలమార్గములచక్కిన్ నిక్కి=గవాక్షరంధ్రములనుండి సాగిపోయి, జాబిల్లిఱాగోడల్=చంద్రకాంతభిత్తికలను, నీరుగ జారఁద్రోచి=నీరై జారిపోవునట్టులు చేసి, నెలతళ్కుల్=చంద్రకళలు, చొచ్చి=లోపలఁ బ్రవేశించి, వెన్నాడి=వెంటనంటి, మైనాడన్=దేహమందుఁ దగులఁగా, కోమలియోర్వలేక=గిరికాదేవి సహింపఁజాలక, వలవంతన్=విచారముచేత, పద్మినీజాతికింగీడౌ నుగ్రశిఖామణిన్=పద్మినీజాతిస్త్రీలకు సేగియైన యుగ్రజనశ్రేష్ఠునిఁగూర్చి యని యర్థము. చంద్రుఁడు నలినీజాతికి విరోధియనియును నుగ్రముగల హరునకు శిఖామణియనియును భావము. ఉగ్రుఁడన శివుఁడు. ఉగ్రః కపర్దీ శ్రీకంఠః శితికంఠః కపాలభృత్' అని అ.) అక్షీణ=తక్కువగాని, అనులాపంబులన్=ముహుర్భాషణములచేతను-అనఁగా రెట్టింపుమాటలచేత, ని. 'అనులాపోముహుర్భాషా' అని అ. పలికెన్=వక్ష్యమాణప్రకారముగా పచించెను.

ఉగ్రశిఖామణియన క్రూరులయందు మిన్న. అట్టివాఁడు గవాక్షములనుండి చూచి గోడల దాఁటి వెన్నాడుటకు సాహసింపఁ గోమలు లోర్వలేకపోయిరి. ఇట్టివారిసంపర్కము పతివ్రతామణులగు పద్మినులకుఁ గీడు. కాన వలవంతతో గిరికాదేవి చంద్రునిగూర్చి భాషింపఁ దొడఁగెను. అలం. సమాసోక్తి. పర్యాయోక్తము.

శా. రాజీవాక్షుల నేచుపాతకివి చంద్రా రాజవా నీవు నీ
రాజత్వంబునఁ జక్రము ల్మనియెనో రంజిల్లి సత్సంతతుల్
తేజం బందెనొ డిందెనో యహిభయోద్రేకంబు తాఁ జెల్లరే
రా జై పుట్టుట రశ్మిమాత్రఫలమే రా జౌట దోషార్థమే. 27

ఈపద్యమునందు దుష్టుఁడగు రాజుపరముగను చంద్రునిపరముగను నర్థద్వయము గలదు.

చంద్రా=ఓయిచంద్రుఁడా, రాజీవాక్షుల నేచుపాతకివి=కమలాక్షులైన స్త్రీలను బాధించునట్టి పాపాత్ముఁడవు, రాజీవాక్షులనెడు స్త్రీవిశేషణము సాభిప్రాయము. రాజవానీవు=నీవు రాజవేనా

యని యర్థము. రాజనామము గలవాఁడని భావము. నీరాజత్వంబునన్=నీప్రభుత్వముచేతనని యర్థము. నీచంద్రత్వముచేత నని భావము. చక్రముల్మనియెనో=రాష్ట్రము లేమయిన మనియెనా యని యర్థము. చక్రవాకములు మనియెనా యని భావము. రంజిల్లి=సంతోషించి, సత్సంతతుల్తేజంబందెనో=సత్పురుష సమూహములు ప్రభావమును బొందెనా యని యర్థము. తేజశ్శబ్ద మిక్కడఁ బ్రభావపరము. నక్షత్రసమూహములు ప్రకాశమును బొందెనా యని భావము. డిందెనో యహిభయోద్రేకంబు=అహిభయమనఁగా రాజులకు స్వపక్షమువలనఁ బుట్టిన భయము, అది యేమైనను దక్కువాయెనా యని యర్థము. (ని. 'మహీభుజా మహిభయం స్వపక్ష ప్రభవం భయమ్' అని అ.) సర్పరూపుఁడైన రాహువువలని భయమడఁగెనా యని భావము. తాఁజెల్లరే=నేఁజెల్లఁబో, రాజైపుట్టుట=లోకమందు రాజైజన్మించుట యని యర్థము. రాజనామముచేతఁ బుట్టుట యని భావము. రశ్మిమాత్రఫలమే=ధనమార్జించుమాత్రపు ఫలమేనా యని అర్థము. కిరణసంపత్తిమాత్రపు ఫలమేనా యని భావము. రాజౌట దోషార్థమే, ('రాజ్యాంతే నరకం ధ్రువమ్') అని యున్నది గనుక రాజవుట పాతకముకొఱకేనా యని యర్థము. రాత్రికొఱకేనా యని భావము. దీనిచే నిశాకరశబ్దార్థము స్ఫురించుచున్నది.

స్త్రీలయభిమానములను గాపాడుట, రాష్ట్రమును జక్కఁగాఁ బాలించుట, పండితుల సంతోషింపఁజేయుట, ఈతిబాధలు తొలంగించుట రాజధర్మము. రాజైపుట్టుట ధనము బొక్కసమునందు నించుటకుఁ గాదని యర్థము. చంద్రుఁడు విరహిణులను జక్రవాకములను సంతాపింపఁజేయుననియు నక్షత్రములు కాంతిమాయుట, రాహుగ్రహణభయము కలుగుట రాత్రియేర్పడుటదక్క నతనివలన లాభములేదనియు నర్థాంతరము. అలం. శ్లేషము.

ఉ. ఇంతుల నేచుపాతక మ◆దింతట నంతటఁ బోదు పాంథలో
కాంతక నిన్ను ఘోరతమ◆మై ఘనమై యజహత్కళంక మై
వంతలఁ బెట్టి యాఱుపది◆వ్రక్కలు సేయక పూర్వపక్షపుం
గంతుల కేమి చూచెదవు◆గా తుది నీబహుళార్తిఖేదముల్. 28

పాంథలోకాంతక=విరహిజనమారకుఁడవైన యోచంద్రుఁడా, ఇంతులనేచు పాతక మది=స్త్రీలను బాధపెట్టెడు పాప మేదిగలదో యది, నిన్నున్ ఘోరతమమై=అతిఘోరమైయని అర్థము. భీకర రాహురూపమై యనిభావము. (ని. 'రాహౌ ధ్వాంతే గుణే తమః' అని వి.) ఘనమై=మహోల్బణమై యని అర్థము. మేఘమై యని భావము. అజహత్కళంకమై=విడువని యపవాదమయి యని యర్థము. చిహ్నమైయని భావము. (ని. 'కళఙ్కోఙ్కాపవాదయోః' అని అ.) ఇక్కడ రాహు మేఘ కళంకత్వముల నపహ్నవించి పాతకత్వ మారోపించినాఁడు. పాతకము నీలవర్ణమని కవిసమయసిద్ధము. వంతలఁ బెట్టి=బాధలఁ బొందించి, ఆఱుపదివ్రక్కలు సేయక=పదియాఱు తునుకలుగా నొనర్పక, ఇంతట నంతటఁ బోదు=ఊరకే యింత టంతటితోఁ దప్పిపోదని యర్థము. షోడశకళలని భావము. కాఁబట్టి, పూర్వపక్షపుం గంతులకేమి = ముందరికిరాని యిప్పటి గంతుల కేమివచ్చె నని యర్థము. శుక్లపక్ష దినదినాభివృద్ధి కేమి వచ్చెనని భావము. చూచెదవుగదా తుది నీబహుళార్తిఖేదముల్=చివరకు నీ మహత్తరమయిన వ్యథవలని దుఃఖములను నీవే చూచెద వని యర్థము. బహుళపక్షమందలి దినదినక్షయము లని భావము. అలం. శ్లేషము. అపహ్నవము.

చంద్రకిరణప్రసారము విరహిణులకు వ్యథాకరము. కాన నిది పాంథలోకాంతకుఁడగు చంద్రున కిది పాపము. ఈపాపము విడువరాని ఘోరకళంకమై చంద్రుని పదియాఱుఖండములు చేయుచున్నది. ఈయార్తియంతయు బహుళపక్షమునం దనుభవమునకు రానే వచ్చుచున్నది.

సీ. కమలించెఁ గాక యం•గజవిరోధి శిరోధిఁ దల కెక్కఁ జాలెనే•హాలహలంబు
క్రాచెఁ గాక పయోధి•కాండప్రకాండంబుఁ బైకిఁ బొంగించెనే • బాడబంబు
తూరెఁ గాక ముకుంద•తుందప్రఘాణంబు వెడలెనే యెదఁ గాలి • విపినకీలి
యడఁచెఁ గాక శిలోచ్చ•యచ్ఛదాహంకృతు ల్గరఁచెనే నీరుగా•సురపహేతి
తే. నీకరణి నిట్లు దయలేక•లోక మేర్చు, నీకరణి యైన యలయత్రి•నేత్రమునకు
ఖరకరాలోకగాఢని•ష్ఠురతపోగ్నిఁ, బెటిలిపడ కున్కి భరమె కృ•పీటజన్మ. 29

కృపీటజన్మ=కృపీట మనఁగా నుదకము, దానివలననైన జన్మము గలవాఁడు, కృపీటజన్మ-అనఁగా నగ్నియును జంద్రుఁడును గనుక, ఓయి యగ్నిహోత్రుఁడా అనియర్థము. చంద్రుఁడా యని భావము. ఈరెండర్థముల కభేదాధ్యవసాయము. హాలహాలంబు=కాలకూటము, అంగజవిరోధి=మన్మథవైరి యైన హరునియొక్క, శిరోధి=కంఠమును, కమలించెఁ గాక=కమలి నల్లఁబడునట్లులు చేసెను గాని, నీకరణిన్=నీవలె, తలకెక్కఁజాలెనే=నెత్తికెక్కఁగలిగెనా యని యర్థము. చంద్రుఁడు హరశిరోభూషణ మైనవాఁడని భావము. ఈపద్యగీతికి మొదటనున్న నీకరణి నను పదము సర్వత్ర అన్వయింపవలయును.

బాడబంబు=బడబానలము, పయోధి=సముద్రముయొక్క, కాండప్రకాండంబున్=ప్రశస్తోదకమును, క్రాచెఁగాక=కాలునట్లులు చేసెనుగాని, పైకిఁ బొంగించెనే=నీవలెఁ బొంగి పొరలునట్లులు చేయఁజాలెనా యని యర్థము. చంద్రోదయసమయమునందు సముద్రము పొంగుచున్నదని భావము. నీవు సముద్రమున జనించితివి. నీవలెనే బడబానలముగూడ సముద్రమున జనించినది. బడబానలము సముద్రోదకమును గ్రాచుచున్నది. నీవును సకలజంతూపద్రవకరముగాఁ బూర్ణిమారాత్రులందు సముద్రుని పొంగఁజేయుచున్నాఁడవు. ఇది లోకవిప్లవదాయకము.

విపినకీలి=దవానలము, ముకుంద=శ్రీకృష్ణావతారమును బొందిన విష్ణుదేవునియొక్క, తుంద=ఉదరమనెడు, ప్రఘాణంబు=గృహవిశేషమును, తూరెఁగాక=దూరియడఁగిపోయెను గాని, ప్రఘాణ మనఁగా దలవాకిటి ముందరనుండు నల్పగృహము, (ని.'ప్రఘాణ ప్రఘణా లింద బహిర్ద్వార ప్రకోష్ఠకే' అని అ) వెడలెనేయెదఁగాలి=నీవలె హృదయముదహించి బయలువెళ్లెనా అని యర్థము. చంద్రుఁడు విష్ణుదేవుని మనస్సువలనఁ బుట్టినాఁడను శ్రుత్యర్థ మనుసంధింపవలయును. కృష్ణస్వామి దావానలపానము సేయుట పురాణప్రసిద్ధము. కృష్ణుఁడు గోవులను గోపాలురను గాపాడుటకై దావానలము మ్రింగినకథ భాగవతదశమస్కంధమునందుఁ గలదు.

సురప=సురల కధిపతియైన యింద్రునియొక్క, హేతి=ఆయుధమైన వజ్రము-అనఁగా వజ్రాయుధము, శిలోచ్చయ=పర్వతములయొక్క, ఛద=ఱెక్కలయొక్క, అహంకృతుల్=అహంకారములను, అడఁచెఁ గాక=అణఁగించెను గాని, కరఁచెనే నీరుగాన్=శిలలు నీరవునట్లులు కరఁగింపఁజాలెనా యనియర్థము. చంద్రకిరణప్రసారణముచేతఁ జంద్రకాంత శిలలు గరఁగుచున్నవని భావము. అనఁగాఁ గాలకూటఁబడబానల దవానల వజ్రాయుధములకంటె నీవు తీక్ష్ణమయినవాఁడవని తాత్పర్యము. ఇట్లు=

ఈప్రకారముగా, దయలేకలోకమేర్చు=నిర్దయుఁడవై లోకములను దహించుచున్న, నీకున్=అనఁగా నగ్నిహోత్రుఁడవైననీకు, అరణియైన=జన్మస్థానమయిన, అల అత్రి నేత్రమునన్=ఆఅత్రిమహాముని లోచనమునకు, ఖరకరాలోక=సూర్యావలోకనరూపమును, గాఢ=దృఢమును, నిష్ఠుర=కఠినమునునగు, తపోగ్నిన్=తపస్సువల్లఁ బుట్టిన అగ్నిచేత, పెటిలిపడకున్కి=పెట్లిపడిపోకయుండుట, భరమె=అది యొక భారములోనిదా అనఁగాఁ గాదనుట. ఖరకరశబ్దము సాభిప్రాయము.

చంద్రుఁడు కృపీటజన్మ. హాలాహలము, బడబానలము, దావాగ్ని, వజ్రాయుధము చంద్రుని యంత తీవ్రమయినవి కావు. ఇవి నిర్దయభావముతో లోకమును దహింపలేదు. చంద్రుఁ డిందఱి కంటెఁ దీవ్రుఁడు. కాలకూటాదులకంటెఁ దీవ్రతరుఁడగు శశిని గనెను గాన అత్రి సూర్యాలోకన మొనర్చుచు ఘోరతపము గావించుటలో నచ్చెరువులేదు. అలం. పరికరము. రూపకము.

మ. విషరాశిన్ జనియింపవో విషసహా♦విర్భూతి వాటింపవో
విషభృన్మార్గము నంటవో విషధరు♦ ల్వేష్టింపఁ గా లూఁదవో
విషభుక్చూలికఁ బిన్ననాఁడె కనవో♦ విఖ్యాతకౌటిల్యమున్
విషమం బెట్లగు నీకు జీవకృతవి♦ద్వేషంబు దోషాకరా. 30

దోషాకరా=పాపములకాకరమైన చంద్రుఁడా యని యర్థము. రాత్రినిజేయువాఁడని భాష్యము. దోషాశబ్దము రాత్రివాచక మయినప్పుడు అవ్యయము. ని. 'దోషా నక్తఞ్చరజనా వపి' అని అ. విషరాశింజనియింపవో=విషపుంజమందుఁ బుట్టినావు కావా యని యర్థము. విషమనఁగా జలంబును గనుక జలరాశియందుఁ బుట్టినాఁడవని భావము. విషసహావిర్భూతివాటింపవో=కాలకూటవిషముతోఁ గూడ నావిర్భవించినావు కావా అని అర్థము. విషభృన్మార్గమునంటవో=విషమును భరించిన వారియొక్క ప్రవర్తనము నవలంబించినావు కావా అని అర్థము. విషమనఁగా జలము దాని భరించినవి మేఘములు వానిమార్గ మాకాశము గనుక నాకాశము నంటియున్నావని భావము. విషధరుల్వేష్టింపఁ గాలూఁదవో విషభుక్చూలికన్=విషమునుధరించినవారు పరివేష్టింపఁగా విషభోజియైనవాని తలయెక్కియున్నావు కావా అని అర్థము. విషధరులనఁగా సర్పములును, విషభోజిహరుఁడును గనుక సర్పములు పరివేష్టింపఁగా హరునిశిరస్సునం దున్నాఁ డని భావము. (ని. 'సర్పప్రోతకలాపశుక్తిశకలైర్వ్యాకీర్ణసచ్ఛేఖరమ్' అని చెప్పఁబడియున్నది.) పిన్ననాఁడె కనవో విఖ్యాతకౌటిల్యమున్=బాల్యమందే ప్రసిద్ధమైన కుటిలభావమును బొందినావు కావా అని యర్థము. బాలచంద్రుఁడు వక్రాకారము గలవాఁడని భావము. కాఁబట్టి, నీకున్=ఇట్టివాఁడవైననీకు, జీవ=ప్రాణులయందు, కృత=చేయఁబడిన, విద్వేషంబు=విరోధము, విషమంబెట్లగున్=అనర్హమయినది యేలాగగుచున్నది. అనఁగా నర్హమగుచున్నదని అర్థము. జీవశబ్దము బృహస్పతియందును వర్తించుచున్నది గనుక బృహస్పతియందుఁ జేయఁబడిన విరోధము విషము గాలేదని భావము. (ని. 'జీవః ప్రాణిని గీష్పతౌ' అని విశ్వనిఘంటువు.)

నీవు దోషాకరుఁడవు. నీపుట్టువు, విషమునందు తోఁబుట్టువు విషజన్మయగు కాలకూటము. త్రోవ విషవంతులేఁగునది. నిలుకడ విషధరధారియగు విషభోక్తపైని. నీకుఁ బుట్టుకతోఁ గుటిలము కలదు కానఁ బ్రాణులహింసించుటలో నీకు విషమభావములేదు. అలం. శ్లేషమూలకకావ్యలింగము.

మ. కమలాభర్త భవద్విరోధిపయిఁ జక్రంబుం బ్రయోగింప ను
త్తమశస్త్రం బది యాత్మనామకభిదాదర్పాంధు నిన్నుఁ మోరం
గి మహారాహువుఁ దున్మియుం దునుమ కేఁగెం గాక చక్రంబుచేఁ
దుము రై పోవనివారలుం గలరె నీదోషంబు గాదే శశీ.   31

శశీ=ఓయిచంద్రుఁడా, కమలాభర్త=ఇది సాభిప్రాయపదము, లక్ష్మీనాథుఁడైనవిష్ణువు, నీవు లక్ష్మీసోదరుఁడవు గనుక, భవద్విరోధిపయిన్=నీశత్రువైన రాహువుమీఁద, చక్రంబుం బ్రయోగింపన్=సుదర్శనచక్రమును బ్రయోగింపఁగా, ఉత్తమశస్త్రంబది=శ్రేష్ఠమయిన అనఁగా నప్రతిహతమయిన యాచక్రము, ఆత్మనామకభిదాదర్పాంధునిన్ను న్మోరంగి, ఆత్మనామక=చక్రమనెడు తన పేరువహించిన చక్రవాకములయొక్క, భిదా=భేదనమందు, దర్పాంధున్ = గర్వాంధుఁడవైన, నిన్ను న్మోరంగి=నిన్ను మోసముచేసి, మహారాహువున్=అధికుఁడయిన రాహువును, తున్మియుం దునుమ కేఁగెం గాక=చంపినట్టులుగాఁ గనుపఱచి చంపకయెపోయెను గాక అనియర్థము. శిరశ్ఛేదనము చేసియును జీవితునిగాఁ జేసెనని భావము. లేనట్టయిన, చక్రంబుచేఁ దుమురై పోవనివారలుం గలరె=చక్రాయుధముచేతఁ బొడిపొడియై పోనివారునుగలరా? ఇంతకునేమనిన, నీదోషంబుగాదే=నీవు చేసికొన్న పాపమేకదా.

అనఁగా నీయందలి బంధువాత్సల్యముచేత విష్ణుదేవుఁడు ప్రయోగించినప్పటికిని జక్రమమోఘసాధన మయినప్పటికిని జక్రహతిచేతఁ దలదెగినవాఁడైనప్పటికిని రాహువు బ్రతికియుండుట యతనిచేత నెప్పటికిని బాధపడవలయునట్టులుగా నీవుచేసికొన్న పాపకర్మమేగాని మఱియొకటి కాదని తాత్పర్యము. ఇక్కడ స్వపక్షాభిమానియైన విష్ణుదేవునిచేత నుండునది గనుకఁ జక్రమును స్వపక్షాభిమానము నిలిపినదని యాశయము. ఇక్కడ నుల్లాసాలంకారము. శ్లో. 'ఏకస్య గుణదోషాభ్యా మల్లాసోన్యస్యతే యది' అని లక్షణము.

చ. సమధికకాలనేమిగుణశాలివి నీ వుదరస్థలోకసం
ఘములకుఁ గీ డొనర్తు వని కైటభదానవభేది యంతరం
గము వెడలించెఁ గాని నినుఁ గండడఁగింపక పోయె నిందిరా
రమణిఁ దలంచి రాత్రిచరరాగనిమగ్నుల కేడ ధర్మముల్.   32

రాత్రిచర=ఓరినిశాచరుఁడా, అనఁగా రాక్షసుఁడా యని యర్థము. చంద్రుఁడా యని భావము. సమధికకాలనేమిగుణశాలివి=కాలనేమియనెడు రాక్షసునియొక్క గుణములవంటి గుణములు గలవాఁడ వనియర్థము. కాలమునకు నేమిగుణశాలి యనిచెప్పుటచేతఁ గాలమునకుఁ జక్రసామ్యము గమ్య మగుచున్నది. నీవుదరస్థలోకసంఘములకుఁ గీడొనర్తువని=నీవు తనకుక్షిలోనున్న లోకసమూహముల కుపద్రవము సేయుదువని, కైటభదానవభేది=విష్ణుదేవుఁడు, అంతరంగము వెడలించెఁగాని=లోననుండి బయటికి వెడలఁదోలిచినవాఁడాయెనుగాని, ఇందిరారమణిఁ దలంచి=నీతోడఁబుట్టిన లక్ష్మీదేవిని విచారించి, నిను గండడఁగింపక పోయెన్=నిన్నుఁ జంపకపోయె నని యర్థము. అంతరంగము వెడలించుటయనఁగాఁ జంద్రుఁడు విష్ణుదేవుని మనస్సువలనఁ బుట్టినాఁడనిభావము. రాగనిమగ్నుల కేడధర్మముల్=స్త్రీకాముకత్వమునకు లోఁబడి మునిఁగియుండువారికి మర్యాదలెక్కడివి.అనఁగా వారికి మర్యాదయందలి విచారమే లేదనుట. విష్ణునియుదరమునందుఁ బదునాలుగులోకములున్నవి. నీవు

కైటభరాక్షసునివలె లోకవిద్రోహివని విష్ణుఁ డెఱింగియుఁ లక్ష్మివంక నీకుఁగల చుట్టఱికము విచారించి సంహరింపక హృదయమునుండి వెడలఁగొట్టెను. లక్ష్మియందలి యనురాగముచే విష్ణుఁడు తనధర్మమగు దుష్టశిక్షణము వదలెను. కావున రాగమగ్నులు ధర్మము నెన్నఁటికి నిర్వహింపఁజాలరనుటకు చంద్రా! నిన్ను విష్ణుఁడూఱకవదలుటయే తార్కాణము. అలం. ఉత్ప్రేక్ష. అర్థాంతరన్యాసము.

ఉ. కొండొకసేపు నిన్ను మదిఁ ♦ గూర్చిన మాధవునంతవానికిం
బండె వధూవధప్రబల♦పాతక జాతకళంక మింక నీ
దుండగ మేమి చెప్పఁ దగుఁ ♦ దోయజవైరి శిఖండవీథి నీ
ఖండము పూనుశంకరుఁ డ♦ఖండజగన్మథనుండు గాఁడొకో. 33

తోయజవైరి=కమలవిరోధివైన యోచంద్రుఁడా, కొండొకసేపు=కించిత్కాలము, నిన్ను మదిఁగూర్చిన మాధవునంతవానికిన్=నిన్ను నాంతర్యమందుఁ జేర్చుకొన్న విష్ణునంతవానికని యర్థము. మానసమువలనఁ బుట్టకముందు చంద్రుని విష్ణుదేవుఁడు మానసమందు నిల్పినాఁడని భావము. వధూవధ ప్రబలపాతక జాతకళంకము=నీయందున్న వధూవధప్రబలపాతకజాతకళంకము, పండెన్=ఫలించెను. అనఁగా సమకూడె ననియర్థము. ఇక్కడఁ జంద్రపక్షమందు విరహిణీవధవలని ప్రబలపాతక సమూహరూపమయిన మాలిన్యమని చెప్పవలయును. కలంకత్వము నపహ్నవించి పాతకత్వారోపణము చేసినాఁడు గనుక నపహ్నవాలంకారను. విష్ణుదేవుని పక్షమందు భృగుపత్నీవధ వలని ప్రబలపాతకసంజాతమైన యపవాదమని చెప్పవలయును. జాతమనఁగా సమూహంబును సంజాతమైనదియును, కళంకశబ్ధమంకమందును నపవాదమందును వర్తించుచున్నది. (శ్లో. 'కళంకోంకాపవాదయోః' అని అ.) మాధవుఁడు భృగుపత్నీహననముచేసి భృగుశాపమువలన దశావతారము లెత్తుట దేవీభాగవతములోఁ జతుర్థస్కంధమందు ౧౦-౧౨వ అధ్యాయములలోఁ జెప్పఁబడియున్నది. ఇంక నీదుండగ మేమిచెప్పఁ దగున్=ఇంకమీఁద నీయొక్క ధూర్తత్వ మేమని చెప్పవచ్చును. కాఁబట్టి, శిఖండవీథిన్=లలాటోపరిప్రదేశమందు, (శ్లో. 'కాకపక్ష శ్శిఖణ్డకః' అని అ.) నీఖండముపూను=నీయొక్క అర్ధాకృతినిమాత్రము ధరించిన, శంకరుండు=సుఖకరుఁడైన హరుఁడు. అఖండజగన్మథనుండుగాఁడొకో=నీవలె సమగ్రలోకసంహారకుఁడు గాకపోవునా-అవుచున్నాఁడనుట.

''సంసర్గజా దోషగుణాభవంతి'' యను నార్యోక్తి ననుసరించి నీసావాసము కొన్నాళ్లు మాధవుఁడు గావించి వధూవధాపాపము నార్జించెను. శివుఁడు తలపై నీయందలి భాగమునే ధరించెను. అతఁ డఖండజగన్మథనుఁ డైనాఁడు. కావునచంద్రా! నీదుండగమింతయని వర్ణింపరానిది. స్వల్పకాలము మాధవుఁడు మదిగూర్చియుం, శంకరుఁడు ఖండముదాల్చియుఁ బాపకృత్యములకు లోనగుట నీదుండగమువలననే. అలం. అతిశయోక్తి. పరికరము.

శా. ఈ వజ్జుండవు నీటఁ బుట్టితి సుమీ ♦ యే నంచు మోమోటపుం
ద్రోవ ల్చెప్పఁగ సిగ్గు గాదె మఱి నీ♦తోఁబుట్టు శ్రీదేవిలీ
లావాసంబు సిరుల్హరింతు వనుచో ♦ నయ్యో కళాదుండు చే
తోవీథిన్ సహజాధనాపహరణో♦ద్యోగంబు నెగ్గించునే. 34

తోయజవైరి=చంద్రుఁడా-అని అధ్యాహారము. నీతోఁబుట్టు=నీతోడఁబుట్టినదైన, శ్రీదేవి=లక్ష్మీదేవియొక్క, లీలావాసంబు=క్రీడాగృహముయొక్క, సిరుల్హరింతువనుచో=సంపదల నపహరించు

చున్నావని చెప్పుచుండఁగా నని యర్థము. లక్ష్మీనివాసమైన పద్మముయొక్క శోభను హరించుచున్నాఁడని భావము. ఈవబ్జుండవు=నీవు నీటియందుఁ బుట్టినవాఁడవు, నీటఁ బుట్టితిసుమీ యేనంచున్=నేనును శుక్తిమతీజలమందుఁ బుట్టినానుసుమా అని, మోమోటపుంద్రోవల్సెప్పఁగ సిగ్గుగాదె మఱి=చుట్టరికము కలియఁదెల్పుకొని నీవు మోమోటమును బొందునట్లుగాఁజెప్ప నాకు లజ్జగాదా యిఁకను, అనఁగా సాక్షాత్తుగాఁ దోడఁబుట్టిన లక్ష్మీదేవియొక్క యింటిసంపదహరించిన నీకు నీవును నేనును నీటియందుఁ బుట్టినవాండ్రముగదా నాయందుఁ బక్షమవలంబింపుమని యంతలపొంతల చుట్టరికములు దెలుపుకొన్నందువలన దయపుట్టునా అనుట. ఇక్కడ ముఖసామ్యంబును జంద్రునకు స్ఫురించుచున్నది. అయ్యో=అయ్యయో యెక్కడనైనను, కళాదుండు = కంసాలవాఁడు, (ని.'నాడిన్ధమ స్స్వర్ణ కారః కళాదో రుక్మకారకే' అని అ.) చేతోవీథిన్ = మనస్సునందు, సహజా=తోడఁ బుట్టినదాని యొక్క, ధనాపహరణోద్యోగంబునన్=సొమ్ము దొంగిలించునట్టి యత్నమును, ఎగ్గించునే=అయుక్తమని విచారించునా-అనఁగా విచారింపఁడనుట, లోకములోఁ గంసాలవాఁడు తోడఁబుట్టినది చేయుమని తనచేతికిచ్చిన సొమ్ములోఁగూడ దొంగిలించునని ప్రతీతిగలదు గనుక దాని ననుసరించి చెప్పినాఁడు. కళాదుఁడనఁగా దేవతలకుఁ గళాప్రదానము సేయుచంద్రుఁడని భావము.

చంద్రా! నీవు నీట జనించినంతన మంచివాఁడవు కాఁజాలవు. తోఁబుట్టువగు లక్ష్మికి మందిరమైన కమలమునే నీవుముకుళింపఁ జేయుచున్నాఁడవు. కాన నీగుణప్రశంసలజ్జాకరము. అలం-అర్థాపత్తి-అర్థాంతరన్యాసము.

తే. నీరజారాతి నినుఁ దన•నెలవు గూల
నేల సృజియించె విధి సృజి•యించుఁ గాక
యేల జైవాతృకునిఁ జేసె • నేల తప్పుఁ
బుడమిఁ "బాపీ చిరాయు" వ•న్బడగునుడుగు. 35

నీరజారాతి=ఓ చంద్రుఁడా, విధి=బ్రహ్మదేవుఁడు, తననెలవుగూలన్=తనయిల్లుధ్వంసముగాను, ఏల సృజియించెన్=నిన్నెందుకుఁ బుట్టించె నని యర్థము. బ్రహ్మగృహము నీరజముగనుక నది ముడుచుకొని చెడిపోవునట్టులుగా నేల నిన్ను సృజించె నని భావము. నీరజారాతియనెడు సంబోధనము సాభిప్రాయము. సృజియించుఁగాక = పుట్టించిననేమాయెను, ఏలజైవాతృకునిఁ జేసెన్=జైవాతృకశబ్దము దీర్ఘాయుష్మంతునియందును జంద్రునియందును వర్తించుచున్నది గనుక దీర్ఘాయుష్మంతుఁ డవునట్టులుగా నేలచేసె నని యర్థము. జైవాతృకనామము గలవానినిగాఁ జేసినాఁడని భావము. (శ్లో. 'జైవాతృకః కృశే చన్ద్రే భేషజా యుష్మతో రపి' అని అ.) అయిన, పుడమిన్ = భూమియందు, పాపీచిరాయువన్బడగునుడుగు, శ్లో. 'పాపీచిరాయు స్సుకృతీగతాయుః' అనెడిమాట అనఁగాఁ బాపాత్ముఁడు దీర్ఘాయుష్యము గలవాఁ డగుచున్నాఁ డనెడుమాట, ఏలతప్పున్=ఎందుకుఁ దప్పును. నిన్ను సృజించుకతన బ్రహ్మయిల్లు కూలినది. పద్మములు ముకుళించుచున్నవనుట. అట్టి ద్రోహినిన్ను దీర్ఘాయుష్మంతునిజేయుట బ్రహ్మలోప మన నోరురాకున్నది. పాపాత్ముఁడు కలకాలము బ్రదుకునుగదా? అలం. శ్లేషము.

సీ. స్వామియై నిగమాంతి•భూమియై సురపురోగామియై యబ్ధిజా•కామి యుండ
హారియై హాలహాలా•హారియై భవదంశుధారియై ప్రసవాయు•ధారి యుండ

ధాత వైయె కుశలసం♦ధాత వైయె భువననిర్మాత వైయె వాగ్వధూ♦నేత యుండ
మిత్రుఁ డై పరమప♦విత్రుఁ డై విమలచారిత్రుఁ డై నలినీక♦ళత్రుఁ డుండఁ

తే. దొలుదొలుతఁ గృష్ణవర్త్మకుఁ ♦ గళ యొసంగి
నంటు గావించు టెల్ల న♦నాథయువతి
జనతనూదాహసాహాయ్య♦మునకుఁ గాక
కానవా వారి నెవ్వారిఁ ♦ గమలవైరి. 36

కమలవైరి=చంద్రుఁడా, స్వామియైన = సకలమునకు నధినాథుఁడై, నిగమ=వేదములకు, అతిభూమియై=ప్రతిపాదింప నలవిగానివాఁడై, సురపురోగామియై = దేవతలలో నగ్రేసరుఁడై, అబ్ధిజాకామియుండఁగ=లక్ష్మీకాముకుఁడయిన విష్ణుదేవుఁడుండఁగాను, హారియై=సమస్తగుణములచేత నొప్పుచున్నవాఁడై, హాలహాలాహారియై=జగదుపద్రవకరమయిన కాలకూటమును హరించినవాఁడై, భవదంశధారియై=కేవలము నీయొక్క కళను ధరించియున్నవాఁడై, ప్రసవాయుధారియుండఁగ=మన్మథవిరోధియైన శివుఁడుండఁగాను, ధాతయై=జగత్తులను ధరించినవాఁడై, కుశలసంధాతయై=క్షేమమును బొందించువాఁడై, భువననిర్మాతయై=లోకములను నిర్మించువాఁడై, వాగ్వధూనేతయుండఁగ = సరస్వతీనాథుఁడయిన బ్రహ్మయుండఁగాను, మిత్రుఁడై=మిత్రత్వము గలవాఁడనియును, మిత్రనామము గలవాఁడనియును నర్థద్వయము చెప్పవలయును. పరమ=ఉత్కృష్ట మగునట్టుగా, పవిత్రుఁడై=తాను స్వతస్సిద్ధముగాఁ బవిత్రుఁడై, యన్యులను బవిత్రులనుగాఁ జేయువాఁడై, విమలచారిత్రుఁడై=నిర్దుష్టమైన చరిత్రముగలవాఁడై, నలినీకళత్రుఁడుండఁగ=సూర్యుం డుండఁగాను,

తొలుదొలుతఁ గృష్ణవర్త్మకుఁగళయొసంగి, శ్లో. 'ప్రథమాం పిబతే వహ్ని ర్ద్వితీయాం పిబతే రవిః' అని యున్నది గనుక, ప్రప్రథమమునందు నగ్నిహోత్రునికిఁ గళాప్రదానముచేసి, నంటుగావించుటెల్లఁ=స్నేహముచేసికొనుట యంతయు, నంటు అనెడిపదము నకారాది, అనాథయువతిజనతనూదాహ సాహాయ్యమునకుఁగాక=నాథులులేని స్త్రీలయొక్క దేహములను దహించుటయందలి సహాయత్వముకొఱకే, కాక = లేనట్టయిన, కానవావారి నెవ్వారిఁ=ఆవిష్ణువు మొదయినవారి నెవ్వరినిగానవా-అనఁగా వారిలో నెవరికయినను ముందుగాఁ గళాప్రదానము సేయరాదాయనుట.

ఇందులో హరిహర హిరణ్యగర్భ కమలాప్తులయొక్క విశేషణములు సత్పాత్రతాభిప్రాయములును గృష్ణవర్త్మకమనెడి యగ్నినామ మపాత్రతాభిప్రాయగర్భము నని తెలియవలయును. పూర్వోక్త పుణ్యమూర్తులు నలువురు లోకోపకారులు దాన యోగ్యులు. వారలయోగ్యతల నించుకేని గమనింపక యగ్నికిఁగళలొసంగి చెలిమిగావించుట సహవాసదోషముచే వేఁడియెక్కిన కిరణములచే విరహిణులమేను కాల్చుటకే. విరహిణులకుఁ జంద్రకిరణములు వేఁడిగానుండునసుటకు-

శ్లో. 'చంద్రః చండకరాయతే మృదుగతి ర్వాతోపి వజ్రాయతే
మాల్యం సూచికులాయతే మలయజాలేపం స్ఫులింగాయతే
ఆలోక స్తిమిరాయతే విధివశాత్ ప్రాణోపి భారాయతే' (శృంగారతిలకము)

అలం. ఉత్ప్రేక్ష. పరికరము.

ఈపద్య మవకళివడిసీస మని తెలియవలయును. సీసపద్యములు సమ సర్వతఃప్రాసాక్కలిప్రాస వడిసీసావకళివడిసీస విషమసీసంబు లని యేడు తెఱంగులం బరఁగు.

క. అని మఱియుఁ బెక్కుభంగుల, వనజారిని దూరి నారి ♦ వనితాజనతా
ఘనతాపవజ్రఘనతా, భినుతాంబకధరుని మరునిఁ ♦ బేర్కొని కినుకన్. 37

అనిమఱియున్=ఈలాగనిపలికి మఱియును, పెక్కుభంగులన్ = అనేకవిధములచేత, వనజారినిదూరి=చంద్రునిదూషించి, నారి=గిరికాదేవి, వనితాజనతా = విరహిణీస్త్రీసమూహముయొక్క, ఘనతాప=అధికమయిన తాపమనెడు, వజ్ర=అశనికి, ఘనతా = మేఘమువంటి దగుటచేత, అభినుత = మిక్కిలి కొనియాడఁబడిన, అంబకధరునిన్=బాణముధరించిన, మరునిన్=మన్మథుని, పేర్కొని = పేరుపుచ్చుకొని, కినుకన్=అత్యంతమయిన కోపముచేత.

క. వలదాశుగశిఖికీలల, వల దాశుగతిన్ నిగుడ్ప ♦ వలరాయఁడ చె
ల్వలదాయవె కలదా కే,వలదారుణవృత్తి దయ ల♦వంబును వలదా. 38

వలరాయఁడ=మన్మథుఁడా,వలత్=చుట్టఁబెట్టుచున్న, ఆశుగశిఖికీలలన్=బాణాగ్నిజ్వాలలను, ఆశుగతి న్నిగుడ్పవలదు=తీవ్రగతిచేతఁ బ్రయోగింపవద్దు. ఏమనిన, చెల్వలదాయవె=నీవేమయినను స్త్రీలకుఁ బగవాఁడవా,కలదా కేవలదారుణవృత్తి=కేవలము నింత దారుణవ్యాపార మెక్కడనయినఁ గలదా, దయ లవంబునువలదా=దయయన్నది కించిన్మాత్రమైన నుండ నక్కఱలేదా. (శ్లో. ఎదాతౌ ప్రశ్న లక్షణౌ భవతః' న.) అను సూత్రమువలన, చెల్వలదాయవె = కలదా, వలదా అను నేతత్పదత్రయాంత్యములయందును, ఎ,ఆ అను ప్రశ్నార్థద్యోతకము లగునచ్చు లుంపఁబడుటచే నివి ప్రశ్నార్థకములని తెలియవలయును. ఈపద్యము ద్విప్రాసముగలదిగాఁ జెప్పఁబడియెను. మన్మథుఁడా! నీవు స్త్రీజనమునకు సహజవిరోధివికావు. స్త్రీలు దయాభావముతోఁ జూడఁదగినవారు. కావున దయాలేశముతో వర్తింపుము.

ఉ. శంబరవైరి వీవు పటు♦శంబరపోషణశాలి యాతఁ డ
బ్జాంబకధారి వీవు మథి♦తాబ్జుఁ డతండు నిశాటఘాటద
ర్పం బడఁగించుబల్లిదుని♦పట్టివి నీవు నిశాటుఁ డాతఁ డో
యంబుచరాంక నీకుఁ దగు♦నా హరిణాంకునితోటి కూటముల్. 39

ఈవు=నీవు, శంబరవైరివి=శంబరహరణశాలివి, ఆతఁడు=ఆచంద్రుఁడు, పటుశంబరపోషణశాలి =శంబరభరణశాలి యని యర్థము. నీవు శంబరాసుర హరుఁడవనియు నతఁడు మృగధరుఁ డనియును భావము. (ని. 'శంబరం సలిలే పుంసి మృగ దైత్యవిశేషయోః' అని మేదిని.) అబ్జాంబకధారివీవు =నీవబ్జబాణధరుఁడవును, అతండు=ఆచంద్రుఁడు, మథితాబ్జుఁడు=అబ్జవిరోధియు నని యర్థము. నిశాటఘాట దర్పం బడఁగించు బల్లిదుని పట్టివినీవు=నీవు రాక్షససమూహ గర్వాపహారకుఁ డయిన విష్ణుదేవుని కుమారుఁడవును, అతఁడు=ఆచంద్రుఁడు, నిశాటుఁడు=రాక్షసుఁడును అని యర్థము. రాత్రియందు సంచరించువాఁ డని భావము. ఓయంబుచరాంక = జలచరాంకుఁడవయిన యోమన్మథుఁడా, హరిణాంకునితోటి కూటములు=హరిణమనఁగా నిఱ్ఱి, అది భూమియందు సంచరించునది గనుక భూచరాంకుఁడైన చంద్రునితో స్నేహములు, నీకుఁ దగునా=అనఁగా నీకు నర్హముగాదనుట. ఇక్కడ హరిణశబ్దమునకు వలయని యర్థముచెప్పి వల జలచరణమునకు విరోధి గనుక జలచరాంకునకు హరిణాంకునితో స్నేహ మర్హముగాదని చెప్పుచున్నారు. ('హరిణో మృగవారణః' అని యాకరము వినఁబడుచున్నదిగాని యది యేనిఘంటువులోనిదో విచారింపవలసియున్నది.) మన్మథుఁడా! సమానులకై

చెలిమికుదురుట సాజము. విరుద్ధప్రకృతిగల చంద్రునితో నీకుఁ జెలిమి యెటుల సరిపడినది. నీవు శంబరాసురుని జంపితివి, అతఁడో శంబరపోషణుఁడు. నీకుఁ దమ్ములు ముల్కులు, అతఁడు తమ్ములదాయ. నీతండ్రి రాత్రించరులఁ జంపినజెట్టి, అతఁడు రాత్రించరుఁడు కాన చంద్రునిచెలిమి నీ కనుచితము. అలం. శ్లేషమూలక కావ్యలింగము.

ఉ. అద్దిర జీవమాత్రచరి • తార్థక నీయెడ గాలివోయె న
స్మద్దయనీయవాక్యములు • శాంభవలోచనవహ్నిఁ గ్రాఁగి పె
న్నిద్దురఁ బూని మే నెఱుఁగ • నేరక యుండెడునీకు మ్రొక్కి వే
సుద్దులు చెప్పినన్ మనసు • చొచ్చునె బోధము పుట్ట నేర్చునే. 40

అద్దిర=ఔరా, జీవమాత్రచరితార్థక=ప్రాణధారణమాత్రముచేతఁ జరితార్థుఁడవయినవాఁడా- అనఁగాఁ బరోపకారశూన్యుఁడా యని యర్థము. దేహములేనివాఁడని భావము. అస్మత్=నాసంబంధమయిన, దయనీయవాక్యములు=దయపుట్ట నాడినమాటలు-అనఁగా నా దీనవాక్యములు, నీయెడ గాలివోయెన్=నీయందుఁ గాలికిఁ బోయెను-అనఁగావ్యర్థమాయెననుట. ఇక్కడ గాలిపిశాచమువలెనుండు నీయందు గాలికిఁ బోవలయునని స్వారస్యము. శాంభవలోచనవహ్నిఁ గ్రాఁగి=శంభుదేవుని సంబంధమయిన నేత్రాగ్నిచేతఁ దపించి, పెన్నిద్దురఁ బూని=గాఢనిద్రవహించి, మే నెఱుఁగనేరకయుండెడు=శరీరస్మృతిలేక యుండునట్టి యని యర్థము. దీర్ఘనిద్రను బొందినవాఁడసియు, ననంగుఁడనియును భావము. నీకు మ్రొక్కి=నీకుదండముపెట్టి, వేసుద్దులుచెప్పినన్=వేయిమాటలు చెప్పినప్పటికిని, మనసు చొచ్చునె=మనస్సునందుఁ జొచ్చునా, బోధముపుట్టనేర్చునే = తెలివి పుట్టనేర్చునా-అనఁగా నీకెండును లేవనుట. ఇక్కడ నిద్రపోవువానికాళ్ళకు మ్రొక్కినట్లన్న లోకోక్తి ననుసంధింపవలయును. నీవు గాఢనిద్రావస్థలోనుంటవలన మ్రొక్కినను బెక్కుసుద్దులు తెలిపినను నిష్ఫలమయ్యెను. కాననే బోధము జనింపదాయెను మన్మథుఁడు శివలోచనాగ్నిచేఁ గ్రాఁగి మరణించి యతనుఁడయ్యెను. దేహములేని నీకింతకంటె రానున్న యాపదయేమున్నదని నామనవి యాలకింపకున్నాఁడవని యర్థాంతరము.

అలం. అర్థాంతరన్యాసము.

మ. అణుమధ్యాతతిమీఁద నంతవిరసం • బౌచాపమున్ సీధుపా
రణమత్తా గొని సోలునారి శిఖిమి • త్రంబైన తేరున్ వనాం
గణలుబ్ధానుగకోటిఁ బూని వెడలం • గా నిట్టి దేధర్మ మే
గుణ మేయెక్కు డిదేబలంబు సుమనః • కోదండ నీకెంతయున్. 41

సుమనఃకోదండ=పుష్పమయమయిన ధనస్సుగల మన్మథుఁడా, అంత విరసంబౌచాపమున్=అంతటి విరోధియయినధనుస్సును, సీధుపారణ=సురాపానముచేత, మత్తాగొని = మత్తుగొని, సోలు=సోలిపడుచున్న, నారి=మౌర్వియును, మత్తాయనుపద మాకారాంతమైన దేశ్యపదము గనుక హ్రస్వము రాలేదు. ఇందుకు, (శ్లో. 'దీర్ఘాణాం హ్రస్వస్స్యాన్న చ దేశ్యపదే' అని శబ్దానుశాసనసూత్రము.) శిఖిమిత్రంబైన తేరున్=అగ్నికల్పమయిన రథంబును, పూని=వహించి, అణుమధ్యాతతిమీఁదన్=స్త్రీజనసమూహముమీఁద, వెడలంగాన్ = బయలుదేరుటకు అని యర్థము. విల్లయిన చెఱకు తుంటయంతమందు రసములేని దనియును నారియయిన తుమ్మెదలు మకరందపానముచేత మత్తిల్లి సోలుచుండునవి యనియును రథమయినవాయువు వహ్ని మిత్ర మనియును ననుచరసమూహమయిన శుక

పికాది పక్షిగణము వననివాసలుబ్ధమనియును భావము. లుబ్ధశబ్దము కిరాతునియందును గాంక్షగలవాని యందును వర్తించుచున్నది. (సి. 'లుబ్ధో మృగయు కాంక్షిణోః' అవి వి.) నీకెంతయున్ = నీకెట్లు విచారించినను, ఇట్టి దేధర్మము=అనఁగా నిదియేమి న్యాయమనియును నేమిప్రశస్తమయిన ధనుస్సని యును నర్థము. ఏగుణము=అనఁగా నేమిసద్గుణమనియును నేమిప్రశస్తమయిన నారియనియును నర్థము. ఏయెక్కుఁడు=అనఁగా నేమియతిశయమనియును నేమిప్రశస్తవాహన మనియును నర్థము. ఇదే బలంబు=అనఁగా నిది యేమిసామర్థ్యమనియును నేమిప్రశస్తమయిన సైన్యమనియును నర్థము. దీనం గ్రమాలంకారము చెప్పఁబడియెను. అలం. శ్లేషమూలకాతిశయోక్తి.

మ. అనిదానాగ్రహముం బ్రియోక్తుల సమ♦ర్షాధిక్యముం బాంథమ
ర్దన నీకున్ మధుమత్తభావమునఁ గా♦దా కల్గెఁ గాకున్న నీ
వనిలాంకూరము నెక్కి యాడుదువొ వ♦న్యానీడజశ్రేణిచేఁ
బనిపాటల్ గొనఁ జూతువో మఱతువో♦ ప్రఖ్యాతకాయక్రియల్. 42

పాంథమర్దన=విరహిజనమర్దనుఁడా యనియర్థము. త్రోవరులఁ గొట్టెడువాఁడా యని యర్థాంతరము-అర్థద్వయమునకు నభేదాధ్యవసాయము, నీకున్=నీకును, అనిదానాగ్రహమున్-అనిదాన=కారణములేని, ఆగ్రహమున్=నిగ్రహమును, ప్రియోక్తుల నమర్షాధిక్యమున్=ప్రియమయినవాక్యములచేతఁ గోపాధిక్యమును-అనఁగా మంచిమాటలాడినం గోప మతిశయించుటయును, మధుమత్తభావమునఁ గాదా కల్గెన్=సురాపానమత్తతవలననే కాదా కలిగెను అని యర్థము. మన్మథుఁడు మధుమాసమందు విజృంభించుచున్నాఁడని భావము. కాకున్న=ఆలాగునఁ గాకపోయిన, నీవనిలాంకూరము నెక్కి యాడుదువొ=నీవు లేఁతవాయువుమీఁద నెక్కి క్రీడింతువా, వన్యానీడజశ్రేణిచేఁ బనిపాటల్గొనఁజూతువో=వనసమూహమందైన పక్షిశ్రేణిచేతఁ బనిపాటలు చేయింపఁ జూతువా, మఱతువో ప్రఖ్యాతకాయక్రియల్=ప్రసిద్ధములైన శరీరచేష్టలు మఱచిపోదువాయని యర్థము.

అనిలారూఢత్వమును బక్షినియామకత్వమును జేష్టారహితత్వమును సురాపానమువలనఁ బుట్టెడు గుణము లనియును మన్మథస్వభావగుణము లనియును దెలియవలయును. మద్యపానముగావించి మత్తుగొనియున్నవాఁడు మంచిని చెడుగాఁ దలంచుట, గాలికిసోలుట, జంతువులు పక్షులు మొదలగువానికిఁ బనిపాటలుచెప్పుట శరీరధర్మములు మఱచుట సహజము. మన్మథుని విజృంభణము మధుమత్తుని యున్మాదచేష్టాదికముగా నిందుఁ జెప్పఁబడెను. అలం. శ్లేషము.

సీ. మునుప లేఁడాయెనే ♦ మోహకగ్రాహసంగ్రస్తసామజపరి♦త్రాణమునకు
మనుప లేఁడాయెనే ♦ మనుజాశనునిఁ జీరి యనఘునిష్ఠాయుక్తు ♦ నాత్మభక్తుఁ
జెనుప లేఁడాయెనే ♦ పృథ్వీసుపర్వకుమారునిర్గతజీవ♦మారుతముల
నునుప లేఁడాయెనే ♦ యుగ్రఫాలాగ్నిఁ దూలినలోక మెల్లఁ దో♦ల్లింటిపగిది
తే. శౌరి యఘటితఘటనావి♦హారహారి
యేమి గావింపఁగా నేరఁ♦ డామహాత్ముఁ
డపదృశచరిత్రు నినుఁ బుత్త్రుఁ♦ డనక కినుక
గిరిశఫాలాగ్నిఁ బడ నుపే♦క్షించెఁ గాక. 43

మోహక=వంచనకారియైన, గ్రాహ=మొసలిచేత, సంగ్రస్త=లెస్సగా గ్రహింపఁబడిన,

సామజ=గజేంద్రునియొక్క, పరిత్రాణమునకున్=సంరక్షణమునకు, మునుపలేఁడాయె నే=ముందుగాఁ దానుసమర్థుఁడు గాకపోయెనా, మనుజాశనునిఁజీరి=నరభోజనుఁడైన హిరణ్యకశిపునిఁబట్టి బ్రద్దలుగాఁ జీల్చి, అనఘు=నిష్కల్మషమయిన, నిష్ఠా=భక్తిప్రపత్తినిష్ఠతోడ, యుక్తున్=కూడుకొన్న, ఆత్మభక్తున్=తనభక్తుఁడైన ప్రహ్లాదుని, మనుపలేఁడాయె నే=బ్రతికింపఁ జాలకపోయెనా,

పృథ్వీసుపర్వకుమారు=బ్రాహ్మణకుమారునియొక్క, నిర్గతజీవమారుతములన్=లేచిపోయిన ప్రాణవాయువులను, పెనుపలేఁడాయె నే=తిరిగి పెనవేయఁ జాలకపోయెనా-అనఁగా మృతినొందిన బ్రాహ్మణకుమారుని మరల జీవవంతునిగాఁ జేయఁజాలకపోయెనా, ఉగ్రఫాలాగ్నిఁ దూలినలోకమెల్లన్=రుద్రునియొక్క ఫాలనేత్రానలముచేత ననఁగాఁ బ్రళయాగ్నిచేత నశించిపోయిన లోకమునంతయును, తొల్లింటిపగిదిన్=పూర్వప్రకారముగా, ఉనుపలేఁడాయె నే=ఉండునట్టులు చేయఁజాలకపోయెనా,

అఘటిత=పొందింపఁబడని కార్యముయొక్క, ఘటనావిహార=పొందించునట్టి సామర్థ్యముచేత, హారి=ఒప్పుచున్న, శౌరి=విష్ణుమూర్తి, ఏమిగావింపఁగా నేరఁడు=ఏమి చేయఁజాలఁడు. గనుక, ఆవిష్ణుమూర్తి, అసదృశచరిత్రున్=లోకవిరుద్ధాచరణ శీలుఁడవయిన, నినున్=నిన్ను, పుత్త్రుఁడనక=కుమారుఁడని విచారింపక, కినుకన్=కోపముచేత, గిరిశఫాలాగ్నిఁబడన్=రుద్రుని ఫాలనేత్రాగ్నియందుఁ బడఁగా, ఉపేక్షించెఁగాక=చూచుచు నూరకుండెనుగాక-లేనిపక్షమందు నిన్ను బాగుపఱుప లేకపోయినాఁడా యని తాత్పర్యము. ఈ సీసపద్యముయొక్క ప్రథమచరణమందు గజేంద్రమోక్ష వృత్తాంతమును రెండవచరణమందు బ్రహ్లాదచరిత్రమును మూఁడవచరణమందును శ్రీరామస్వామి చేతఁగాని శ్రీకృష్ణస్వామిచేతఁగాని ప్రాణదానము సేయఁబడిన బ్రాహ్మణకుమారుని కథయును నాలుగవ చరణమునందు శ్రీమహావిష్ణుమూర్తికిఁగల సర్వలోక సంరక్షణశక్తియును సూచింపఁబడినవి. ఈపద్య మక్కలిప్రాససీసము. అలం. ఉత్ప్రేక్ష.

తే. అనుచు ననవింటిపెనుదంట ♦ నాడ రాని
కొంటసము లాడి మఱియు న♦మ్మంటమారిఁ
గలయ నెక్కించుకొని వచ్చు ♦ మలయనగభు
జంగవిషదిగ్ధపవనుపైఁ ♦ జలము వొడమ. 44

అనుచున్=ఈలాగనిపలుకుచు, ననవింటిపెనుదంటన్ = పుష్పచాపము గలధూర్తశ్రేష్ఠుని-అనఁగా మన్మథుని, ఆడరానికొంటసములాడి = ఆడందగని కంటసపుమాటలాడి, మఱియునమ్మంటమారిన్=మఱియును గోపశీలుఁడైన యామన్మథుని, కలయనెక్కించుకొనివచ్చు = కదియునట్టులుగాఁ దనపై నెక్కించుకొనివచ్చుచున్న, మలయనగ=మలయాచలమందలి, భుజంగ = సర్పముల యొక్క, విష=విషముచేత, దిగ్ధ=పూయఁబడిన, పవనుపైన్=వాయువుమీఁద-అనఁగా మలయమారుతముమీఁద, చలమువొడమన్ = చలముదయింపఁగా, ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

మన్మథుఁడు తాపకారిగావున మంటలమారి. అతని గొనివచ్చువాఁడు దోషిగావున మలయమారుతముపైఁగూడ గిరికాదేవికిఁ గినుక పొడమెను. పాము విసపుమైపూఁత గలవాఁడుగావున మలయమారుతుఁడు ౘలమునకుఁ దగినవాఁడే. అలం. కావ్యలింగము.

ఆ. విరియుఁ గువలయంబు • విధిపదంబు చలించు, నెసఁగు భువనభంగ • మీవు వోలయ
మలయ వల దుపవన • జలదవేణికలపై, మలయవల దుపవన • వలయభవన. 45

మలయ=మలయాచలమును, వలత్=పరివేష్టించుచున్న, ఉపవన = ఉద్యానవనములయొక్క, వలయ=ఆవరణమే, భవన=ఆలయముగాఁ గలిగిన, పవన=పవనుఁడా-అనఁగా మలయమారుతమా యనుట. ఈవు వోలయన్=నీవు వ్యాపించినమాత్రముచేత, విరియుఁగువలయంబు=భూవలయ మవసి పోవునని యర్థము. కలువ వికసించుచున్నదని భావము. (ని. 'కువాలయం కువలయం కువాలం కువలం కువమ్' అని ద్విరూపకోశము.) విధిపదంబుచలించున్=బ్రహ్మకుస్థానమైయుండు సత్యలోకము కంపించునని యర్థము. కమలము చలించుచున్నదని భావము. ఎసఁగు భువనభంగము=భువనమనఁగా లోకమును జలమును, భంగమనఁగాఁ బ్రళయమును దరంగమును గనుక లోకప్రళయము సంభవించునని యర్థము. జలతరంగము లతిశయించునని భావము. కాఁబట్టి, జలదవేణికలపైన్=మేఘసదృశములైన జడలుగలస్త్రీలమీఁద, మలయవలదు=విసరవద్దు. ఇక్కడ జలదవేణికలు గనుక నీకు నాగఁజాల రని యాశయము.

మారుతమా! నీధాటికు భూవలయమె యవిసిపోవును. సత్యలోకము వణఁకును. ప్రపంచమునకుఁ బ్రళయము కలుగును. ఇట్టిచో సుకుమారిణులగు చెలువ లోర్వఁగలరా? కాన వారిపై కేగకుమని భావము. గాలివీవఁ గలువలు విరియుటయుఁ దమ్ములు కదలుటయు నీటినుండి యలలులేచుటయు మేఘములు విచ్చిపోవుటయుఁ బ్రసిద్ధము. అలం. శ్లేషమూలకకావ్యలింగము.

ఉ. కీలియు నీవుఁ గూడి యుడి • కింతురు లోక మటంచు నెప్పుడున్
మూలల వైచె మిమ్ము నలు • మోముల వేల్పటు వైచినం జనం
జాలక హవ్యవాహుని • సంగతి నుండి జగంబు గాలుపం
గాలుపదంబు చేరితి ప్ర • కంపన నీ వనుకంప చాలమిన్. 46

ప్రకంపన=లోకములను మిక్కిలి కంపింపఁజేసెడు పవనుఁడా యనిసంబోధనము, ఈపదము సాభిప్రాయపదము. కీలియు నీవుఁగూడి=అగ్నిహోత్రుఁడును నీవును గలిసికొని, ఉడికింతురు లోకమటంచున్=లోకము నుడుకునట్లు చేయుదురని విచారించి, నలుమోములవేల్పు=చతుర్ముఖబ్రహ్మ, ఎప్పుడు న్మూలలవైచె మిమ్మున్=ఎల్లప్పుడును మిమ్ము నామూల నొకరిని నీమూల నొకరిని బడవైచెనని యర్థము. వాయవ్యాగ్నేయ కోణములయందుంచినాఁడని భావము. అటువైచినన్=ఆలాగుననుంచినప్పటికిని, చనంజాలక=ఒకరినొకరు విడఁబాసిపోలేక, నీవు హవ్యవాహుని సంగతినుండి=నీవు నగ్నిహోత్రుని యండనుండి, జగంబు గాలుపన్=జగత్తును దహించెడుకొఱకు, కాలుపదంబుచేరితి=యమునియొక్క స్థానమును జేరితివి. ఎందువలనననిన, అనుకంపచాలమిన్=దయాగుణము లేకపోవుటవలన నని వెనుకకన్వయము. వాయు వగ్నిసఖుఁడనియును దక్షిణదిశాసంభవమును బొందుచున్నాఁడనియును భావము.

అగ్నికి గాలితోడైన ప్రపంచము నిలువదని బ్రహ్మ మీయిరువురను జెరి యొకమూలను బడవైచెను. అటులుండియు నగ్నిపొత్తువదలక దయాశూన్యుఁడవై ప్రాణిలోకవధకు యమునిస్థానముఁ జేరితివి. ఇవి దయాశూన్యుని చేష్టలు. (అగ్నికి వాయువు తోడైనఁ బ్రపంచవిప్లవమగునని బ్రహ్మ అష్టదిక్కులలో రెంటిని బ్రత్యేకస్థలములలోఁ జేర్చెనఁట. మలయమారుతము యమునిదిశ నుద్భవిం

చును గావున లోకసంహారమునకుఁ బ్రక్కనున్న యగ్ని చెల్మిచేసి చెలరేఁగెనని భావము. అలం. ఉత్ప్రేక్ష.

క. గో లలనావల్లభుఁ డిది, గో లలనలయుసురు వోసుకొందు వని వనీ
బాలానిల నిను మెసవం, గాలాహికి నేండ్లు వేయు గావించె వెసన్. 47

గోలలనావల్లభుఁడు=వాగ్వనితాప్రియుఁడైన బ్రహ్మదేవుఁడు, గోశబ్దము వాక్కునందును వర్తించును. (శ్లో.'స్వర్గేషు పశు వా గ్వజ్ర ది జ్నేత్ర ఘృణి భూ జలే, లక్ష్యదృష్ట్యా స్త్రియాం పుంసి గౌః'అని అ.) ఇదిగో లలనలయుసురు వోసుకొందువని=ఇదిగో యీప్రకారముగా స్త్రీలయొక్క ప్రాణములను బుచ్చుకొంచున్నావని, వనీబాలానిల = వనసంబంధమైన బాలసమీరణుఁడా-అనఁగా మలయమారుతమా యనుట. నిను మెసవన్=నిన్నుఁ దినుకొఱకై, కాలాహికిన్ = కాలసర్పమునకు, ఏండ్లు వేయు గావించె వెసన్=యుక్తమగునట్టులుగా నాయుర్వత్సరములు వేయి యగునట్టులుగాఁ జేసెను.

అనఁగా సహస్రసంవత్సరములు సర్పభక్షితుఁడ వైనప్పటికిని నశింపక యున్నావు గనుక నీ బ్రతుకు మిక్కిలి మొండిబ్రతుకుగదా యని భావము. శ్లో. 'గృధ్రోలూకశుకధ్వాంక్ష సర్పాణాం తు సహస్రకమ్' అని యున్నది గనుక సర్పములకు వర్షసహస్రజీవనము ప్రసిద్ధము. అలం. ఉత్ప్రేక్ష.

మ. అమితోల్లాసిపలాశివృత్తి వయి బాల్యావస్థఁ గొల్లాడి తా
సుమనస్సంపద నింక నీవతనువిస్ఫూర్తిన్ విజృంభింప లో
కము ధూళిం జనదే ప్రభంజన రమాకాంతుం డనంతావతా
రమహాయత్నము పూని కాని నినుఁ దీర్పం జాలఁ డల్పంబునన్. 48

ప్రభంజన=ఓయిపవనుఁడా యని సంబోధనము. మిక్కిలి భంజించువాఁడు గనుక ప్రభంజనుఁడని సాభిప్రాయము. అమిత=మితము లేకుండునట్టులుగా, ఉల్లాసి=వికాసమును బొందిన, పలాశివృత్తివయి=రాక్షసకృత్యము గలవాఁడవై, బాల్యావస్థన్=పిన్ననాఁడే, కొల్లాడి తా సుమనస్సంపదన్=దేవతలయొక్క సంపదను జూఱగొంటివి యపునుభళా అని యర్థము. పలాశిశబ్దము రాక్షసుని యందును వృక్షమందును వర్తించును. (శ్లో. 'పలాశీ వృక్ష రక్షసోః' అని వి.) సుమనశ్శబ్దము దేవతలయందు బుష్పములయందును వర్తించును. (శ్లో.'సుమనాః పుష్పమాలత్యో స్త్రీదశే కోవిదేపి చ' అని వి.) బాలసమీరము వృక్షములయందలి వర్తనముగలదై పుష్పములను రాల్చు నని భావము. ఇంక నీవతనువిస్ఫూర్తి న్విజృంభింపన్=ఇంకమీఁద నీవధికస్ఫురణముచేత ననఁగాఁ బ్రౌఢత్వముచేత విజృంభించినపక్షమందు, లోకముధూళింజనదే=లోకమంతయు నెగిరిపోదాయని యర్థము. అతనుఁడనఁగా మన్మథుఁడును గనుక మన్మథవిస్ఫూర్తిచేత నీవు విజృంభించినపక్షమందు లోకమంతయు వ్యాకులమవునని భావము. పెద్దగాలి విసరి దుమ్ము గప్పుచున్నదనియును దేహవిస్ఫూర్తియొక్క యభావము చేత విజృంభించుచున్నదనియును వాయుస్వభావపరముగాఁ జెప్పవలయును. రమాకాంతుండు=విష్ణుదేవుఁడు, అనంతావతారమహాయత్నముపూనికాని=అసంఖ్యములయిన యవతారములయొక్క యధిక ప్రయత్నమును వహించినమీఁదటఁ గాని, అల్పంబునన్=కొంచెమున, నినుఁదీర్పంజాలఁడు=నిన్ను సంహరింపలేఁడాయె నని యర్థము. ఆదిశేషావతారముఁ దాల్చియు నిన్ను మర్దింపలేఁడాయె నని భావము. (శ్లో. 'శేషోనన్తః' అని అ.) ఈభావార్థంబును నన్వయించుచున్నది. శేషుఁడు సహస్ర

ముఖుఁడని సాభిప్రాయము. చిన్నతనమున నీవు రాక్షసవృత్తితో దేవతలసంపద కొల్లలాడితివి. పెద్దవాఁడవైన లోకముల దుమ్ముచేయుదువని విష్ణుఁడు నిన్ను మహాప్రయత్నము లొనర్చియు సంహరింపఁజేయలేకపోయెను. రాక్షసులు వేల్పుల బాధింప విష్ణుఁడు వారించుట పురాణప్రసిద్ధము. వాయువు చెలరేఁగుటచేఁ బూవులతావులు వ్యాపక మగుచున్నవనియు నింకను బాగుగా గాలి వీచె నేని పుష్పరజము దిగంతవ్యాప్తమగుననియు భావము.

క. చలదలఘుచటులకీలా, హాలహాలమున నఖిలభువన•హారణక్రీడా
హాలహాలిక వెలయుబలియునిఁ, గలయం బవమాన నీవ • కాంచితివి గదా. 49

పవమాన=ఓయిసమీరణుఁడా, చలత్ = చంచలములగుచున్న, అలఘు = మహత్తరములును, చటుల=తీక్ష్ణములునైన, కీలా=జ్వాలికలనెడు, హాలహాలమునన్=కాలకూటముచేత, అఖిలహారణక్రీడా హాలహాలికన్=సమస్తలోకములయొక్క సంహారక్రీడయందలి తొట్రుపాటుచేత, వెలయు=ప్రకాశించుచున్న, బలియునిన్=అనఁగాఁ బ్రళయాగ్నిని, కలయన్=కూడుకొనునట్టులుగా, లేక నంతటఁ గలయునట్లుగా, నీవకాంచితివిగదా=నీవేకంటివిగదా యనియర్థము.

వాయువువలన నగ్నిపుట్టెనని శ్రుతియున్నది గనుక నగ్నివాయుకుమారునిఁగాఁ జెప్పినాఁడు. అనఁగా నట్టిప్రళయాగ్నికి జనకుండ వైనావు గనుక నతనికంటెఁ గ్రూరుఁడవని తాత్పర్యము. హాల హాలమనుటకు-('హాలాహాలో హాలహాలో హాలాహాల ఇతిశ్రుతః' అని కోశము.) క్రూరుని జనకుఁడ వగు నీవు మిగులఁ గ్రూరుఁడవని భావము.

చ. నిబిడతమోనుబంధమహ•నీయమహామహిజతమైత్రిమైఁ
బ్రబలుశనైశ్చరుండ వతి•పాంసుల నీ విఁక భీకరాకృతిం
గబళము గొందు గాక త్రిజ•గంబు వడంక బెడంక నిత్తువే
యబలలజీవనానిలము • లన్నియు నాఝషకేతుసంగతిన్. 50

అతిపాంసుల=అతిపాపాత్ముఁడా యని సంబోధనము. పరాగకలితుఁడని భావము. నీవు= ఈవు, నిబిడ=ఎడతెగని, తమః=రాహువుయొక్క, అనుబంధ=సాంగత్యముచేత, మహనీయ=ఒప్పుచున్న, మహాత్=అధికుఁడైన, మహిజాత=భూపుత్రుఁడైన యంగారకునియొక్క, మైత్రిమైన్= సఖ్యముచేత, ప్రబలు=అతిశయించుచున్న, శనైశ్చరుండవు=శనిగ్రహమవు అని యర్థము.నిబిడతమో నుబంధ=సాంద్రమయిన యంధకారసాంగత్యముచేత, మహనీయ=మహనీయములైన, మహామహి జాత మైత్రిమైన్=గొప్పవృక్షములయొక్క సంబంధముచేత, ప్రబలుశనైశ్చరుండవు=ప్రబలుచున్న మందగామివని భావము. ఇఁకన్=ఇంకమీఁద, భీకరాకృతిన్=భయంకరమయినరూపముచేత, ఆఝష కేతుసంగతిన్=మీనమందున్న కేతుగ్రహ సాంగత్యమువలన నని యర్థము. ఝషకేతుఁ డనఁగా మీనకేతనుఁడైన మన్మథుఁడు గనుక మన్మథసాంగత్యమువలన నని భావము. త్రిజగంబువడంకన్= మూఁడులోకములునుసంచలనమునుబొందునట్టులుగా, అబలలజీవనానిలములన్నియున్=స్త్రీలయొక్క ప్రాణవాయువులనన్నిటిని, కబళముగొందుగాక = మ్రింగుదువేకాక, బెడంకనిత్తువే = బెణికిపోనిత్తువా-అనఁగా దొలఁగిపోనిత్తువా యనుట. (శ్లో. 'క్రూరా భానుతమ శ్శని ధ్వజకుజాః') అని కాలామృతమున నున్నది గనుక నిక్కడఁ బాపగ్రహకూటము గలుగునట్టులుగాఁ జెప్పినాఁడు.

క. అని వనిత నాలిగాలిం, గనలుచుఁ బోనాడి తుహినకరకిరణఝరిఁ
మునుఁగఁ జనఁ జెలులు గని హా, యని వనరుచు నడ్డగింప నతిశోకమునన్. 51

అని=ఈలాగని, వనిత=గిరికాదేవి, నాలిగాలిఁ=కుటిలకారియైన మందమారుతమును, కన లుచుఁ బోనాడి=కోపగించుచు నిందించి, తుహినకరకిరణఝరిఁ=చంద్రకిరణ ప్రవాహమందు,మునుఁ గఁజనఁ=మునుఁగవలయునని పోఁగా, చెలులు గని=చెలికత్తియలుచూచి, హా యని వనరుచుఁ= అయ్యోయని విచారపడుచు, అడ్డగింపఁ=నివారింపఁగా, అతిశోకమునఁ = అత్యంతదుఃఖముచేత, ముందరిపద్యముతో నన్వయము.

గిరికకు మలయపవమానము, మారుఁడు చంద్రుఁడు తాపకరులగుటచే నోరువఁజాలక ప్రాణ త్యాగమునకు సిద్ధపడెను. జలమందు దుమికి మరణింప నెంచెను. జలమేది. చంద్రకిరణములను నెల యేట మునుఁగ యత్నించెను. విచారహేతువు గానఁ జెలికత్తెలు పరితపింపఁ దొడఁగిరి.

శా. ఆజాబిల్లివెలుంగువెల్లికల డాయక లేక రాకానిశా
రాజశ్రీసఖమైనమోమునఁ బటాగ్రం బొత్తి యెగ్గెత్తి యా
రాజీవానన యేడ్చెఁ గిన్నరవధూరాజత్కరాంభోజకాం
భోజీమేళవిపంచికారవసుధాపూరంబు తోరంబుగాన్. 52

ఆజాబిల్లివెలుంగువెల్లికల డాయక లేక=ఆచంద్రునియొక్క కాంతిపూరములను డావలించి పోఁజాలక, రాకానిశారాజశ్రీసఖమైన-రాకా=పున్నమనాఁటి, నిశారాజ=చంద్రునియొక్క, శ్రీ= శోభకు, సఖమైన=మిత్రమయిన-అనఁగా రాకాచంద్రసదృశమయిన, మోమునఁ=ముఖమందు, పటాగ్రంబొత్తి=పైటకొంగుచేర్చి, ఎగ్గెత్తి=గొప్పగొంతుచేసికొని, ఆరాజీవాననయేడ్చెఁ=ఆగిరికా దేవి రోదనముచేసెను. ఏలాగనిన, కిన్నరవధూ=కిన్నరస్త్రీలయొక్క, రాజత్=ప్రకాశించుచున్న, కరాంభోజ=హస్తకమలములయందలి, కాంభోజీమేళ=కాంబోదిరాగమేళముతోఁ గూడిన, విపంచి కారవ=వీణాస్వనమనెడు, సుధాపూరంబు = అమృతప్రవాహము, తోరంబుగాఁ=విస్తరించునట్టు లుగా-అనఁగాఁ గిన్నరస్త్రీకరకలితకాంభోజీరాగమేళవీణారవతులిత మగునట్టులుగా రోదనముచేసె నని సంబంధము.

కాంభోజీరాగము దీనస్వరమగుట ప్రకటనముగదా. ఇక్కడఁ గరుణాత్మక వియోగశృంగా రమును జెప్పినాఁడు. ఇందుకు నరసరాజీయమున-

క. 'వనిత పరోక్షంబునఁ బతి,యును బ్రియుని పరోక్షమునఁ బయోజాక్షియుం రో
దన మొనరించుట పర్ణిం,చినఁ గరుణాత్మకవియోగశృంగారమగుఁ.' అని లక్షణము.

విరహాతిశయముచే వెన్నెలవెల్లులు నాయికకు మిగుల వేఁడిగానుండెను. కాన సమీపింపఁ జాలకపోయెను. కాన నెలుగెత్తి యేడ్చెను. ఎలుగెత్తుటవలన విచారాతిశయము సూచితము. కాం భోజిరాగము దీనస్వరము గావున గిరికావిలాపము వినువారికి మిగులఁ జాలికలిగించుచుండెననిభావము.

ఉ. అప్పుడు ముద్దరాలిఁ జెలు లక్కునఁ జేర్చి ముఖాబ్జ మెత్తి కఁ
దెప్పలబొప్పము ల్దుడిచి తేపె నృపాలుఁడు గారవింప నీ
వొప్పుల కుప్ప వై సిరుల నొందెద వేటికిఁ గుందె దమ్మ మా
యప్పవు గా మదిం దలఁప కమ్మ వినూతనసాహసంబులన్. 53

అప్పుడు=అపుడు, ముద్దరాలిన్ = ముగ్ధయైన గిరికాదేవిని, చెలులు=చెలికత్తెలు, అక్కునఁ జేర్చి=కౌఁగిలించుకొని, ముఖాబ్జమెత్తి=వంచుకొన్న ముఖమును మీఁదికెత్తి, కన్ఱెప్పల బాష్పముల్దుడిచి=కనుఱెప్పలయందు నిండిన కన్నీళ్లు దుడిచి, ఈవెన్నృపాలుఁడు గారవింపన్ = నేఁడు లేదు ఈపటిదినమే వసురాజు మన్నింపఁగా, నీవొప్పులకుప్పవై=నీవ యొప్పులకన్నిటికిని గుప్పవై-అనఁగా సకలశుభములకు నాస్పదురాలవై, సిరులనొందెదవు=సంపదలను బొందుచున్నావు. కాఁబట్టి, ఏటికిఁ గుందెదమ్మ=ఎందుకు విచారపడుచున్నావమ్మా, మాయప్పవుగా=మానాయనవుగా-ఇది యత్యంత ప్రేమచేతఁ బలికెడు వాక్యము. వినూతన సాహసంబులన్=క్రొత్తక్రొత్త తెగువలను - అనఁగా మరణోద్యోగముల ననుట. మదిం దలఁపకమ్మ = మనస్సులోఁ దలఁచుకొనఁబోకమ్మా.

చ. అని మన సూర నూఱడిల ♦ నాడి యయో మనమంజువాణియుం
జని తడవయ్యె నేమిటికి ♦ జాగొనరించెనొకో నగేంద్రనం
దనమది కొందలం బెఱుఁగ ♦ దా తగదా పగదాయవెన్నెలన్
మునిఁగెడుబాల నెత్తి నయ ♦ ముం బ్రియముం దయ మున్నుగాఁ గనన్. 54

అని=ఈలాగని, మనసూరన్=మానసము శాంతిఁ జెందునట్లుగాను, ఊఱడిలన్=ఊఱటఁ బొందునట్లుగాను, ఆడి=పలికినవారై, మనమంజువాణియును జని తడవయ్యెన్=మనమంజువాణియును వసురాజుసన్నిధానమునకుఁ బోయి చాలాసేపాయెను. ఏమిటికి జాగొనరించెనొకో=ఎందునిమిత్త మాలస్యము చేసెనో, నగేంద్రనందన మది కొందలం బెఱుఁగదా=గిరికాదేవి మనస్సునందుండెడు విచారము తాను గుర్తెఱుఁగదా, పగదాయవెన్నెల మ్మునిఁగెడు బాలనెత్తి=ఇప్పుడు పగదాయమైన-అనఁగా శత్రువయిన వెన్నెలయందు మునుఁగుచున్న గిరికాదేవిని లేవనెత్తి, నయమున్=మన్ననయును, ప్రియమున్=హితవును, దయమున్నుగాఁగనన్=దయాపురస్సరముగాఁ జూచుటకు, తగదా=అర్హురాలుకాదా యని అర్థము. ముందరిపద్యముతో నన్వయము.

శా. ఎట్టోకా కని యన్ను లన్ని దెసల ♦ న్వీక్షింప నప్పట్టునం
బుట్టుంగెంపున నింపు మీఱు రవి పెం ♦ పుం బెంపి దట్టంపుకెం
బట్టుంబుట్టమురంగు నింగిరమ కా ♦ పాదించు దివ్యప్రభా
ధట్టం బొక్కటి పుట్టెఁ గట్టెదుర సం ♦ ధ్యాలక్ష్మికిం జుట్టమై. 55

ఎట్టోకాకని=మంజువాణి రాదాయెనేమో కాని యని, అన్నులు=స్త్రీలు-అనఁగా గిరికాసఖులు, అన్ని దెసల వీక్షింపన్=సమస్తదిక్కులను జూచుచుండఁగా, అప్పట్టునన్=ఆసమయమందు, పుట్టుంగెంపుననింపుమీఱు=ఉదయరక్తిమచేత మనోహరుఁ డగుచున్న, రవి=సూర్యునియొక్క, పెంపున్=అతిశయత్వమును, పెంపి=పోఁగొట్టి-అనఁగా నిరసించి, దట్టంపు కెంబట్టుం బుట్టమురంగు=దట్టమయిన యెఱ్ఱపట్టుచీరయొక్క శృంగారమును, నింగిరమ కాపాదించు=ఆకాశలక్ష్మికి ఘటింపఁజేయుచున్న, దివ్యప్రభాధట్టం బొక్కటి=ఒకానొక దివ్యమయిన కాంతిస్తోమము, సంధ్యాలక్ష్మికిం జుట్టమై = సంధ్యారాగసంపదకుఁ జుట్టమై-అనఁగా సంధ్యారాగసదృశమై, కట్టెదురన్=సూటిగా నెట్టయెదుట, పుట్టెన్=సంభవించెను. అనఁగాఁ గనుపడియెననుట. సాంధ్యారాగమువంటి రక్తకాంతి యాకాశమున గాన్పించెను. ఉదయించు సూర్యుని కెంజాయ్యనుమించిన యాకాంతిస్తోమము వసుధా

జొనంగిన పద్మరాగాంగుళీయకప్రభయని మీఁదిపద్యమువలనఁ దెలియును.

సీ. ఇది తమ్మికంటిపై ♦ నీసడించిననిశాధవుఁ దోలులోకబాం♦ధవునిపొడవు
పొడవు గా దిది తల్లి ♦ పడఁతి కెత్తఁగఁ దెచ్చు రక్తరాజీవనీ♦రాజనార్చి
యర్చి గా దిది సహా♦జానురక్తి నగాత్మజను బ్రోవఁ గదియునో♦షధులచాయ
చాయ గా దిది కూఁతు♦చంద మారయ వచ్చు కోలాహలునిరక్త♦కూటదీప్తి
తే. దీప్తిమాత్రంబు గా దిది ♦ దివ్యధామ
మనుచుఁ జెలు లాడుకొన వచ్చె ♦ నంత నాన్నృ
పార్పితనవాబ్జరాగము♦ద్రాంగుళీయ
రంజితాత్మీయపాణి యై ♦ మంజువాణి. 56

ఇది=ఈకనుపించుచున్నరక్తిమ, తమ్మికంటిపైన్ = కమలములవంటి కన్నులుగల గిరికాదేవి మీఁద, ఈసడించిన=విరోధించిన, నిశాధవున్=చంద్రుని, తోలు=పలాయనమును బొందించుచున్న, లోకబాంధవుని=సూర్యునియొక్క, పొడవు=ఉదయము-ఇక్కడఁ దమ్మికంటి యనెడుపదము సాభిప్రాయము. తమ్ములకుఁ బ్రియుఁడయిన సూర్యునిచేతఁ దమ్మికంటి రక్షణీయురాలని యభిప్రాయము. లోకబాంధవశబ్దంబును సాభిప్రాయము. లోకములకు బంధువు గనుక నార్తజనరక్షణము కర్తవ్యమని యును నాశయము.

పొడవుగాదిది=ఇది సూర్యోదయముకాదు. ఇంక నేమనిన, తల్లి=గిరికామాతయగుశుక్తిమతి, పడఁతికెత్తఁగఁ దెచ్చు=గిరికాదేవి కర్పించునిమిత్తమై తీసికొనివచ్చుచున్న, రక్తరాజీవ నీరాజనార్చి =అరుణారవిందరూపమయిన నీరాజనదీపజ్వాలిక, అర్చిగాదిది=ఇది యాజ్వాలికగాదు. ఇఁకనేమనిన, సహజానురక్తిన్=తోడఁబుట్టినదానియందలి యనురాగముచేత, నగాత్మజను బ్రోవఁగదియు=పర్వత పుత్రియైన గిరికాదేవిని రక్షించునిమిత్తమై కదియవచ్చుచున్న, ఓషధులచాయ=ఓషధులనఁగా సంజీవ సంధాన విశల్యా సౌవర్ణకరణులు గనుక వానియొక్క ఛాయ. ఇక్కడ నగాత్మజ యనెడుపదము సహజత్వమును సమర్థించుచున్నది.

చాయగాదిది=ఇది యోషధులయొక్క ఛాయగాదు. ఇఁకనేమనిన, కూఁతు చంద మారయ వచ్చు=కూఁతురగు గిరికయొక్క వర్తమానము విచారింపవచ్చెడు, కోలాహలుని రక్తకూటదీప్తి=కోలాహలపర్వతునియొక్క గైరికధాతుమయ శిఖరములయొక్క యరుణకాంతి, దీప్తిమాత్రంబుగాదిది= ఇది సాధారణకాంతిమాత్రముగాదు. మఱియేమనిన, దివ్యధామము=ఏదియో యొకదివ్యమైన తేజస్సు, అనుచున్=ఈలాగనుచు, చెలులాడుకొనన్=సఖు లనుకొనుచుండఁగా, అంతన్=అంతట, ఆన్నృపార్పిత=ఆవసురాజుచేత నియ్యఁబడిన, నవాబ్జరాగ ముద్రాంగుళీయ=అభినవపద్మరాగమణిముద్రాన్వితమైన యుంగరముచేత, రంజిత=ప్రకాశించుచున్న, ఆత్మీయపాణియై=తనయొక్క హస్తముగలదై, మంజువాణి=మంజువాణియనెడు గిరికాదేవియొక్క ప్రియసఖి, వచ్చెన్=ఏతెంచినదాయెను.

మంజువాణి పద్మరాగముద్రికాంగుళీయకముతో వినుత్రోవను వచ్చునపుడు దూరమందుండ నుదయరాగమువలెఁ దోఁచెను. కొంచెము సమీపింప శుక్తిమతి గిరికాదేవికొసంగు కెంగలువవని వాళివలెనుండెను. ఇంకను సమీపింపఁ గోలాహలాగ్రస్థితములగు నోషధులకాంతివలెను, జేరువకు రాగా నెఱ్ఱని చఱియవలెను సమీపింపఁ బద్మరాగనిర్మితదివ్యభవనమువలెను దోఁచెను. సమీపించిన కొలఁది కాంతి యతిశయించెననుట. అలం. సందేహాఘ్లు.

క. వచ్చి వసురాజశేఖరుఁ, డిచ్చినముద్రిక లతాంగి ◆ యెదుట నిడి చెలుల్
గ్రచ్చుకొని యడుగ నిట్లను, నచ్ఛోడియ దనయుదంత ◆ మాద్యంతంబున్. 57

వచ్చి = ఏతెంచినదై, వసురాజశేఖరుఁ డిచ్చినముద్రిక = వసురాజశ్రేష్ఠుఁ డానవాలుగా నిచ్చినయుంగరము, లతాంగియెదుటనిడి=గిరికాదేవియెదుట నుంచి, చెలుల్గ్రచ్చుకొని యడుగన్ = చెలికత్తెలందఱును గ్రమ్ముకొని యడుగఁగా, అచ్ఛోడియ=ఆమంజువాణి, తనయుదంత మాద్యంతంబున్=తనవృత్తాంతమంతయు, ఇట్లనున్=ఈలాగనిపలికెను. (వి. 'వార్తా ప్రవృత్తి ర్వృత్తాంత ఉదంతః' అని అ.)

ఉ. అమ్మనుజేంద్రచంద్రుహృద ◆ యమ్మది యెట్టిదయో యెఱింగి యీ
కొమ్మమనమ్మునం గలుగు ◆ కొందల మంతయుఁ దెల్పి రమ్ము పో
పొమ్మని మీరు పంపఁ బనిఁ ◆ బూని పొలంతుకలార కార్యవే
గమ్మున నంబరోత్పతన ◆ కౌశల మందితిఁ దత్క్షణంబునన్. 58

అమ్మనుజేంద్రచంద్రు = ఆవసురాజుయొక్క, హృదయమ్మదియెట్టి దయోయెఱింగి = చిత్తమేరీతిగానున్నదో తెలిసికొని, ఈకొమ్మమనమ్మునంగలుగు కొందలమంతయుఁ దెల్పిరమ్ము = ఈగిరికాదేవియొక్క మనస్సునఁగల విచారమును యావత్తును దెలియఁజెప్పిరా, పోపొమ్మని మీరుపంపన్ = పోపో అని మీరందఱు పంపింపఁగా, పనిఁబూని=కార్యముపహించి, పొలంతుకలార=ఓచెలియలారా, కార్యవేగమ్మునన్=పూనుకొన్నపదవియందలి త్వరచేత, తత్క్షణంబునన్=ఆక్షణమందే, అంబరోత్పతన కౌశలమందితిన్=ఆకాశమున కెగయు నేర్పును బొందితిని—అనఁగా గగనమార్గసంగతురాలనైతి ననుట.

సీ. బడివాయ కిల నగ ◆ ప్రతతితో జివ్వున నెగిరిన ట్లై తోఁచు ◆ మగువలార
పైపై సమీరణా ◆ ర్భటి నింగి భోరున నరచిన ట్లై తోఁచు ◆ నతివలార
నిఖిలభూములు జవ ◆ నిక వాప దారున నెదిరిన ట్లై తోఁచు ◆ నింతులార
చనఁజన వెడఁద యై ◆ శశిమేలు గ్రక్కునఁ బెరిగిన ట్లై తోఁచుఁ ◆ దరుణులార
తే. గొండ లచ్చునగం డ్లయి ◆ నిండుచెరువు
లెల్ల నద్దంపుబిల్ల లై ◆ యేర్లు ముత్తి
యంపుసరు లై యరణ్యంపు ◆ గుంపు లెల్ల
నారు లై తోఁచుఁ బొడవున ◆ నారులార. 59

మగువలార=ఓచెలియలారా, బడివాయక=వెంటనెడఁబాయక, ఇల = భూమి, నగప్రతతితోన్=పర్వతసమూహముతోఁగూడ, జివ్వునన్=అతివేగముగా, ఎగిరిన ట్లై తోఁచున్=మీఁదికెగసివచ్చునట్లుగాఁ గనుపడును, అతివలార=ఓచెలియలార, పైపైన్=మీఁదమీఁద, సమీరణార్భటిన్=వాయువుయొక్క యార్భాటముచేత-అనఁగా వాయువుయొక్క తాఁకుడుచేత, నింగి=ఆకాశము, భోరుననరచినట్లై తోఁచున్ = భోరుమనిరొదచేసినట్టులుగాఁ గనుపట్టును, ఇంతులార=ఓచెలియలారా, నిఖిలభూములు=సమస్తలోకములును, జవనికవాపన్=తెరదియ్యఁగానే, దారున నెదిరినట్లై తోఁచున్=తెప్పున నెదిరిపడునట్టులుగాఁ గనుపడును, తరుణులార, చనఁజనన్=అరుగనరుగఁ

గా, శశిమేను=చంద్రునిదేహము, వెడఁదయై = విశాలమై, గ్రక్కునఁ బెరిగినట్లై తోఁచున్=అతిశీఘ్రముగా వృద్ధిఁబొందినట్లు గనుపట్టును, నారులార=ఓచెలియలారా, కొండలచ్చునగండ్లయి=పర్వతములన్నియు నచ్చునగాయలంతలై, 'నిండుచెరువులెల్ల నద్దంపుబిళ్ళలై=పూర్ణీభవించియుండెడు తటాకములన్నియు నద్దంపుబిళ్ళలంతలై, ఏర్లుముత్తియంపుసరులై=నదులన్నియు ముత్యాలపేరులంతలై, అరణ్యంపుగుంపులెల్ల నారులై=వనసమూహములన్నియు నారుపోసిన మొలకలంతలై, తోఁచున్=కనుపడును. ఎప్పుడనిన, పొడవునన్=ఊర్ధ్వభాగమందుఁ బోవుచున్నసమయమందు, ఈపైనిఁ జెప్పఁబడిన ప్రకారముగాఁ గానవచ్చె నని సంబంధము. శైలములు మహోన్నతములు గావున మంజువాణి శైలములపై కెగయువఱకుఁ గొంతకాలము పట్టును. అంతవఱకుఁ గొండలు తనవెంటవచ్చుచున్నటులఁ దోఁచెను. ఊర్ధ్వలోకములు నాటకములోఁ దెఱదీయ వేషధారు లెదురైనటు లెదురుపడెను. ఇంక నెత్తున కేగుటచేఁ బ్రపంచమునందలి జీవనదులు ముత్తెపుసరులుగను కొండలచ్చునగండ్లుగను దోఁచెనని భావము. అలం. సహజము.

చ. పురములు దుర్గము ల్శిబిర•ము ల్వెలిపేటలు నూళ్లు పల్లియల్
ధరపయిఁ గుప్ప వోసినవి•ధంబున నేర్పడ కున్కిఁ గొంతసే
పరయుట కై వినిశ్చలత•రాకృతి నుండి వసుక్షమాతలే
శ్వరనగరీలలామకము•చాయఁ గనుంగొని సంభ్రమంబునన్. 60

పురములు=పట్టణములును, దుర్గముల్=గిరిదుర్గములును, శిబిరముల్=సేనానివేశములును-అనఁగా దండుదిగియుండెడు స్థలములును, వెలిపేటలు = పట్టణముయొక్క బయటిపేటలును, ఊళ్ళు=గ్రామములును, పల్లియల్=పల్లెలును, ధరపయిఁగుప్పవోసినవిధంబున నేర్పడకున్కిన్=భూమిమీఁద రాశిపోసినట్టులుగా నిదియదియని యేర్పఱుపరాకుండుటచేత, కొంతసేపు=కించిత్కాలము, అరయుటకై=విమర్శచేసెడికొఱకై, వినిశ్చలతరాకృతినుండి=కదలకనిలిచియుండి, వసుక్షమాతలేశ్వరనగరీలలామకము చాయఁగనుంగొని=వసురాజుయొక్క పట్టణశ్రేష్ఠపుజాడఁ దెలిసికొని, సంభ్రమంబునన్=ఉద్దేశకార్యజనితత్వరచేత, ముందరిపద్యముతో నన్వయము.

మంజువాణి మిగుల నెత్తేగుటవలన జనపదములు గ్రామములు పల్లెలు గుప్పవలెఁ గానరాఁదొడఁగెను. గమ్యస్థాననిర్ణయమిందుచే మిగులఁ గష్టసాధ్యమయ్యెను. వసురాజురాజధాని సామాన్యనగరము కాదు. నగరీలలామము. అదియుఁ గుప్పవలెనుంటచేఁ గనుఁగొనుట దుస్తరము గావున నిలుకడగ నిలచిచూచుటచేఁ గనఁబడెను.

సీ. పోవఁబోవఁగఁదోఁచెఁ•బురరమామకుటమాల్యంబులై భర్మహా•ర్మ్యధ్వజంబు
లేఁగ నేఁగ నెదిర్చె•గృహదేవతామౌళి కలితాబ్జకళికలై•కలశతతులు
చేరఁ జేరఁ దలిర్చె•వీరలక్ష్మీవాస వనజాతదళము లై•వప్రశిఖలు
చనఁ జనఁ దులకించె•జగతీసతీకాంచి హీరపర్వంబు లై•తోరణంబు
తే. లరుగ నరుగంగఁ జూపట్టె•సిరియనంత, తనువులై మల్లఖురళీకా•భినయవాటి
కాకరితురంగశాలికా•గంధవిపణి, కాముఖార్పితమణిపుత్రి•కాచయంబు. 61

పోవఁబోవఁగన్=భూమికై దిగి యరుగఁగా నరుగఁగా, పురరమామకుటమాల్యంబులై=పురలక్ష్మియొక్క కిరీటమందలి పుష్పమాలికలో యన్నట్టులుగా, భర్మహర్మ్యధ్వజంబులు=బంగారుమేడల

మీఁదనుండెడు కేతనపటములు, (ని. 'ధ్వజ శ్చిహ్నే పతాకాయామ్' అని వి.) తోఁచెన్=కనుప డెను, ఏగనేగన్=మఱియును బోఁగాఁబోఁగా, గృహదేవతా=గృహాధిదేవతయొక్క, మౌళికలిత= శిరస్సునందొప్పుచున్న, అబ్జకళికలై=తామరమొగ్గలో యన్నట్టులుగా, కలశతతులు=గృహోపరిభాగ ములయందలి కలశసమూహములు, ఎదిర్చెన్=ఎదురుపడెను, చేరఁజేరన్=మఱియు సమీపించిపోఁగా, బోఁగా, వీరలక్ష్మీవాస వనజాతదళములై=వీరలక్ష్మీవాసములైన పద్మములయొక్క ఱేకులో యన్నట్టు లుగా, వప్రశిఖలు=కోటకొమ్మలు, (ని. 'సాను ప్రాకారయో ర్వప్రః' అని వి.) (ని. 'శిఖా శిఖా యాం చూడాయాం జ్వాలాయా మగ్రమాత్రకే' అని వి.)తలిర్చెన్=చూడనొప్పెను. చనఁజనన్= మఱియును బోఁగాఁబోఁగా, జగతీసతీ=భూకాంతయొక్క, కాంచి=మొలనూలునందలి, హీరపర్వం బులై=వజ్రగ్రంథులో యన్నట్టులుగా-అనఁగా వజ్రపుకట్లో యన్నట్టులుగాను, (ని.'పర్వ స్స్యా ద్ు త్సవే గ్రంథౌ' అని వి.) తోరణములు=బహిర్ద్వారములు, (ని. 'తోరణో స్త్రీ బహిర్ద్వారమ్' అని అ.) తులకించెన్=ప్రకాశించెను.

అరుగనరుగంగన్=మఱియును జనఁగాఁజనఁగా, సిరియనంతతనువులై=లక్ష్మియొక్క యనేక మూర్తులో యన్నట్టులుగాను, మల్లఖురళికా = సాముగరిడీలయొక్కయు, అభినయవాటికా=నాటక శాలలయొక్కయు, కరితురంగశాలికా=గజాశ్వ శాలలయొక్కయు, గంధవిపణికా=పరిమళద్రవ్యము లమ్మెడునంగడివీధులయొక్కయు, ముఖ=మొగదలలయందు, అర్పిత=నిలుపఁబడిన, మణిపుత్రికా చయంబు=రత్నప్రతిమలయొక్క సమూహము, చూపట్టెన్=కనుపించెను. మల్లఖురళికలనఁగా సాము గరిడీలన్నందుకుఁ బ్రయోగము-

గీ. 'బహువిరోధిమణిప్రభాపల్లవాగ్ర, మల్లసంగ్రామఖురళికామండలాయ
మాన నానాపరిష్కారమహితగాత్రి, మనుజపుత్రిక యాస్థానమునకువచ్చె.' అని శ్రీనాథుండు
హర్మ్యములు భర్మమయములు గావునఁ బురలక్ష్మికిరీటమువలెను నందుండు బెక్కెములు

కిరీటమునందలి మాల్యములవలెను నుండెను. దీనిని జూచుచుఁ బోవఁబోవ గృహములపైఁగల బంగా రుకుండలు, కోటకొమ్మలు, బహిర్ద్వారములు కనిపించెను. లక్ష్మీదేవీస్వరూపాంతరములవలె నాట్యగృ హములందు హయశాలలందు సుగంధవస్తువిపణులందు మణివిగ్రహములు లెక్కకుమిగులగోచరించెను. అలం. రూపకోత్ప్రేక్షలు.

క. అందు ఘనసారమృగమద, చందనకాశ్మీరసార♦సౌరభలహరీ
సందోహదోహదానిల, కందళి నుపశమితగగన♦గమనశ్రమ నై. 62

అందున్ = అట్టిపట్టణమందు, ఘనసార = కర్పూరముయొక్కయు, మృగమద=కస్తూరియొ క్కయు, చందన = శ్రీగంధముయొక్కయు, కాశ్మీర = కుంకుమపూవుయొక్కయు, సార=శ్రేష్ఠ మయిన, సౌరభ=పరిమళముయొక్క, లహరీసందోహ = మహాతరంగసమూహమునకు, దోహద= ఉత్పాదకద్రవ్యమయిన - అనఁగాఁ గర్పూరాదులయొక్క పరిమళమును బ్రకటింపఁజేయుచున్న, అనిలకందళిన్=పవనాంకురముచేత - అనఁగాఁ బిన్నవాయువులచేత, ఉపశమిత=నివారింపఁబడిన, గగనగమనశ్రమనై=ఆకాశగమనజనితమయిన శ్రమగలదాననై-ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. విపణులయందున్న సుగంధవస్తువుల తావియేకాదు. తదుత్పాదకమగు ద్రవ్యమగు నని లకందళములు బొలసినవి. మంజువాణి యాకసమునుండి యంగడివీధులచెంతకు దిగెను. మనోహర

సుగంధసంపత్తి యాకాశగమనాయాసము తొలంగించెను. పరిమళము లహరీసందోహముగనుంటయు మారుతము ఆదోహదములతోఁ బొలయుఁ బురసౌభాగ్యాతిశయమును దెలుపును.

చ. అదె యిదె వింతనీడ యని • యారెకు లూరక సంభ్రమింపఁగాఁ
జెదరి కపోతముల్ గొణిగె • చేరక తారకవీథిఁ బాఱఁగా
నిదురఁ దొఱంగి కేకిరమ•ణీనివహంబు విధూతపక్షమై
రొద లొదవింపఁగా నొకశి•రోగృహపాళిక వ్రాలి యున్నెడన్. 63

అదె యిదె వింతనీడయని=అదిగో యిదిగో క్రొత్తనీడ గనుపించుచున్నదని, ఆరెకులు=తలారులు-అనఁగా గస్తుదిరిగెడువారలు, ఊరకసంభ్రమింపఁగాన్=ఏమో తొందరపడఁగాను, చెదరి=గుంపుచెడి, కపోతముల్=పావురాలు, తారకవీథిఁబాఱఁగాన్=ఆకాశమందు సంచరింపఁగాను, నిదురఁ దొఱంగి = నిద్రనువిడిచిపెట్టి, కేకిరమణీనివహంబు = ఆఁడునెమళ్లయొక్క సమూహము, విధూతపక్షమై=చలింపఁజేయఁబడిన ఱెక్కలుగలదై, రొదలొదవింపఁగాన్=రొదలుసేయఁగాను, ఒకశిరోగృహపాళికన్ = ఒకానొక చంద్రశాలాప్రదేశమందు, వ్రాలియున్నెడన్ = ప్రవేశించి యున్న సమయమందు.

మంజువాణి మేడపై వ్రాలినది రాత్రికాలము గావున గస్తుదిరుగువారి కది నీడవలెనుండెను. ఆసందడికిఁ జూఱులందు నిదురించు పారావతములు బెదరిపాఱెను. మేడకొనలందు నిదురించుచున్న యాఁడునెమిళ్లు ఱెక్కలువిదిర్చి కూయసాగెను. అనఁగా మంజువాణిరాక యారెకు లెఱుంగరనియు మేడపైఁ జేరెననియు భావము.

ఉ. సాలము యంత్రపీఠము వి•శాలకవాటికఘట్టనంబు దృ
ఙ్మీలన మైందవామృతస•మేతపతాకిక జిహ్వ చంద్రికా
జాలము భూతిపూఁత నవ•చంద్రశిలాంబువు లశ్రుధారగాఁ
బ్రోలు ప్రశాంతఘోష మయి • పూర్ణసమాధిఁ జెలంగె నయ్యెడన్. 64

సాలము=ప్రాకారమే, (ని.'ప్రాకారో వరణస్సాలః' అని అ.)యంత్రపీఠము=యంత్రమయమయినపీఠమును, విశాలకవాటికఘట్టనంబు=విశాలములయిన తలుపులయొక్క మూఁతయే, దృఙ్మీలనము=కనుమూఁతయును, ఐందవ=చంద్రునివలనఁబుట్టిన, అమృత=జలముతోడ-అనఁగా హిమజలముతో ననుట. సమేత=కూడుకొన్న, పతాకిక=కేతనమే, ఐందవ=సహస్రారకమలమందలి చంద్రమండలమువలన స్రవించిన, అమృత=అమృతముతోడ, సమేత=కూడుకొన్న, జిహ్వా=జిహ్వయును, అని యైందవామృతసమేతపదము పతాకికకును జిహ్వకును విశేషణము, చంద్రికాజాలము=చంద్రికాసమూహమే, భూతిపూఁత=భస్మలేపనమును, నవచంద్రశిలాంబువులు=నూతనమయిన చంద్రకాంతశిలలవలన స్రవించుచున్నజలములే, అశ్రుధారగాన్=ఆనందబాష్పధారగాను, ప్రోలు=పట్టణము, ప్రశాంత=వినఁబడని, ఘోషమై=శబ్దముగలదై, పూర్ణసమాధిన్=సంపూర్ణమైన లంబికాయోగసమాధిచేత, అయ్యెడన్=ఆనిశీథకాలమందు, చెలంగెన్=ఒప్పుచుండెను.

సమాధిలక్షణము-

శ్లో. 'శబ్దాదీనాంచ తన్మాత్రా యావత్కర్ణాదిషు స్థితాః
తావదేవ కృతం ధ్యానం స్యాత్సమాధిరతః పరమ్

జలసైంధవయో స్సామ్యం యథా భవతి యోగతః
తథాత్మమనసోరైక్యం సమాధి రిహ భణ్యతే.'

ఇత్యాదులు తెలియునది. సమాధియన మనస్సును శబ్దాదులనుండి పూర్తిగాఁ దొలంగించి యాత్మతో లయింపఁజేయుట. సమాధినిష్ఠాయుక్తుఁడు యంత్రపీఠముచెంతఁ గనులమూసికొని సహస్రారకమలమందలి చంద్రమండల సుధాసారము గ్రోలుచు భూతిపూతతో ఆనందబాష్పములతో నిశ్శబ్దప్రదేశమునందుండును. అటులె ప్రాకారములమధ్యనున్న పురమున జనులు కనుమూసి నిదురించుచుండిరి. చంద్రకాంతములనుండి జలము కారుచుండెను. ప్రశాంతముగా నుండెనని భావము. అలం. రూపకసంకీర్ణోత్ప్రేక్ష.

సీ. పతిగళార్పితభుజా♦లతిక లై రతికేళి యల పార్ప ముంగిళ్ళ ♦ మెలఁగువారు
నలగి యేఁగుచుఁ బ్రియు ♦ ల్నిలిపిన నిజభుజంగీ భావ మేర్పడఁ ♦ గెరలువారు
వరులొండుకడ కేఁగఁ♦బురుషభూమికఁబూని తెరువాఁగిభంగింపఁ ♦ దివురువారు
రాకుమారులయిండ్ల ♦ కేకతంబునఁ దదాప్తులవెంట బుడిబుడిఁ ♦ బోవువారు
తే. మదనమంత్రరహస్యము ♦ ల్సదనవలభి, నిభృతపారావతములకు ♦ నేర్పువారు
నైనవెలయాండ్రచే నప్పు♦రాధిరాజ, వేశవాటికచూడ్కికి ♦ వేడ్క యొసఁగె.

పతి=విటులయొక్క, గళ=కంఠములయందు, అర్పిత=చేర్పఁబడిన, భుజాలతికలై=తీఁగెలవంటి బాహువులుగలవారై, రతికేళిన్=సురతక్రీడలయందలి, అలపార్పన్=అలయికదీర్చుకొనుకొఱకు, ముంగిళ్ళమెలఁగువారు = ఇంటిముంగిళ్ళయందు సంచరించుచుండువారు కొందఱును, అలగియేగుచున్=అలుకవహించి లేచిపోవుచు, ప్రియుల్నిలిపినన్=ప్రియవిటులు పోకుండ నడ్డగించుకొనఁగా, నిజభుజంగీభావమేర్పడన్=భుజంగియనఁగా సర్పాంగనయును విటకత్తెయును గనుకఁ దమయొక్క సర్పాంగనాచేష్ట ప్రకటమగునట్టులుగానని యర్థము. తమయొక్క విటకత్తెతన మేర్పడునట్టుగా నని భావము. (శ్లో. 'భుజఙ్గో విట సర్పయోః' అని అ.) (ని. 'భావ స్సత్తా స్వభావా భిప్రాయ చేష్టాత్మజన్మసు' అని అ.) కెరలువారు=చిరాకుపడువారు కొందఱును, వరు లొండుకడకేగన్=తమయొక్క నుపుకాండ్రు-అనఁగా లంజెకాండ్రు మఱియొకస్థలమునకుఁ బోఁగా, అనఁగా నన్యకాంతాసంభోగమునకుఁ బోఁగా, పురుషభూమికఁ బూని=తాము పురుషవేషము ధరియించి, (శ్లో. 'భూమికా రచనాయాం స్యా స్స్థూర్యంతరపరిగ్రహే' అని వి.) తెరువాఁగి=దారిగాచి, భంగింపఁదివురువారు=భంగపఱుపవలెనని యుద్యుక్తులయ్యెడువారు కొందఱును, రాకుమారులయిండ్లకున్ = రాచకుమారుల యిండ్లకు, ఏకతనంబునన్=రహస్యముగా, తదాప్తులవెంటన్ = ఆరాజకుమారుల కిష్టులైనవారితోఁ గూడ, బుడిబుడిఁబోవువారు=తెప్పతెప్పనఁ బోయెడువారు కొందఱును,

మదనమంత్రరహస్యముల్=మన్మథమంత్రములయొక్క రహస్యార్థములను, సదనవలభి=ఇండ్లచూరుపట్టెలయందు, నిభృత=చలింపకుండునట్టి, పారావతములకున్=పావురాలకు, నేర్పువారు=ఉపదేశము సేయువారు కొందఱును, ఐన=అయినట్టి, వెలయాండ్రచేన్=వేశ్యాంగనలచేత, అప్పురాధిరాజవేశవాటిక=ఆపట్టణశ్రేష్ఠమందలి వేశ్యాజనసమాశ్రయము-అనఁగా బోగమువీధి, చూడ్కికి వేడ్కయొసంగెన్=చూపులకు వేడుకపుట్టించెను. (శ్లో. 'వేశో వేశ్యాజనసమాశ్రయః' అని యమర నిఘంటువు.)

పురమంతయు నిద్రావస్థలోనున్నను వేశ్యలుమాత్రము విటసంపర్కమున రేల జాగరణము గావించుచు వినోదపరాయణలై యుండిరనియు నిద్రావస్థలోనున్న యానగరమున వేశ్యవాటి దర్శనీయముగ మనోహరముగ నుండెను. అలం. స్వభావోక్తి.

సీ. కమనీయకౌముదీకాంతి వారివియోగ గాఢపాండిమపొత్తు గలయఁ బోలు
వలివెల్లుటాకెల్లువలు వారిమదనవహ్నిజ్వాలికల వేఁడి నిగురఁ బోలుఁ
బ్రతిహట్టరత్నదీపములు వారిదృగంశు యమునోర్మిమాలిక నడఁగఁ బోలు
యామికారభటీభయంబు వారిమనోజ భూవరాజ్ఞాసిద్ధిఁ బొలయఁ బోలుఁ

తే. బండువెన్నెల యనక యాపయి విధూప
లాంబు వనక యాత్రోవరత్నాంశురార్చు
లనక యామీఁద నారెకు లనక చనిరి
తరుణులోకకొంద లవి యెల్ల నరసికొనుచు. 66

కమనీయ=ఒప్పుచున్న, కౌముదీకాంతి=చంద్రికయొక్క ధవళకాంతి, వారివియోగగాఢపాండిమపొత్తుగలయఁబోలుఁ_వారి=ఆస్త్రీలయొక్క, వియోగ = విరహమువలనఁబుట్టిన, గాఢపాండిమ=సాంద్రమయిన ధవళిమతోడ, పొత్తుగలయఁబోలుఁ=జతగూడఁబోలును_అనఁగా మిళితమై యుండఁబోలును. వలివెల్లుటాకెల్లువలు_వలివెల్లుటా = చంద్రకాంతశిలలయొక్క, వెల్లువలనఁగా వెన్నెలచేతఁగరఁగి స్రవించిన జలప్రవాహములు. అట్టి చంద్రకాంతశిలా జలప్రవాహములు, వారి=ఆస్త్రీలయొక్క, మదనవహ్నిజ్వాలికలవేఁడిఁ=మన్మథాగ్నిజ్వాలలయొక్క వేండ్రముచేత, ఇగురఁబోలుఁ=ఇగిరిపోయియుండవచ్చును, ప్రతిహట్టరత్నదీపములు=ప్రతియంగడివీథులయందు నుండెడు రత్నమయదీపములు, వారి=ఆస్త్రీలయొక్క, దృగంశు = దృష్టికాంతులనెడి, యమునోర్మిమాలికఁ = యమునాజలతరంగపంక్తిచేత, అడఁగఁబోలుఁ=అణఁగిపోయియుండవచ్చును, యామికారభటీభయంబు = తలారులయొక్క యార్భాటమువలనిభయము, వారి=ఆస్త్రీలయొక్క, మనోజభూవరాజ్ఞాసిద్ధిఁ=మన్మథమహారాజుయొక్క యాజ్ఞాసిద్ధిచేత, పొలియఁబోలుఁ = నాశనమయి యుండవచ్చును.

కనుకనే, పండువెన్నెలయనక=ముదురువెన్నెలగదాయని విచారింపక, ఆపయిఁ=అటుమీఁదట, విధూపలాంబువనక=చంద్రకాంతశిలాజలపూరమని విచారింపక, ఆత్రోవరత్నాంశురార్చులనక=ఆమార్గమునందు రత్నదీపజ్వాలికలున్నవని విచారింపక, ఆమీఁద నారెకులనక=అటుమీఁదఁ దలారులున్నారని విచారింపక, తరుణులోకకొందఱు = కౌమరువయసుగల స్త్రీలుకొందఱు, అవియెల్ల నరసికొనుచుఁ=వానినన్నిటినిజూచుచు, చనిరి=పోయినవారయిరి.

కొందఱు జారస్త్రీలు ప్రియసంకేతములను గూర్చిపోవునెడలఁ బండువెన్నెలయును జంద్రకాంతశిలాజలపూరమును రత్నదీపకాంతులును దలారులయొక్క యార్భాటములును విరోధములయి నప్పటికిని గామాతురత్వముచేత వాని నెంతమాత్రమును విచారింపకపోయిరని తాత్పర్యము.

చ. హరిహయసౌధసన్నిభము లన్నియు నన్నియు నద్భుతాకృతుల్
హరితమణిప్రకల్పితము లన్నియు నన్నియుఁ జిత్రకేతువుల్

హరిపదమార్గలంఘనము ♦ లన్నియు నన్నియు హేమవప్రము
ల్పురిభవనంబు లిందు నృప♦పుంగవుమంగళధామ మెద్దియో. 67

పురిభవనంబులు = పట్టణమందలి గృహములు, అన్నియున్ = సకలములును, హరిహయసౌధసన్నిభములు = ఇంద్రునిమేడతో సమానములయియున్నవి, అన్నియున్ = అన్నియు, అద్భుతాకృతుల్ = ఆశ్చర్యకరమైన రూపముగలిగియున్నవి, అన్నియున్ = అన్నియు, హరితమణిప్రకల్పితములు=హరితమణులనఁగాఁ బచ్చలు గాన నాపచ్చలచేత నిర్మింపఁ బడియున్నవి, అన్నియున్= అన్నియు, చిత్రకేతువుల్=విచిత్రములయిన ధ్వజములు గలిగియున్నవి, అన్నియున్ = అన్నియు, హరిపదమార్గలంఘనములు = హరిపదమనఁగా విష్ణుపదము-అనఁగా నాకాశము గనుక నాకాశమార్గముయొక్క యతిక్రమణము గలిగియున్నవి, అన్నియున్=అన్నియు, హేమవప్రములు=సువర్ణప్రాకారములు గలిగియున్నవి. కాఁబట్టి, ఇందున్ = ఈగృహములలో, నృపపుంగవు మంగళధామ మెద్దియో=వసురాజశ్రేష్ఠునియొక్క శుభాస్పదమైన గృహమేదో కదా - ముందరి పద్యముతో నన్వయము.

మ. అని చింతించుచు నొక్కధామమునకున్ ♦ యక్షాంగన ల్పుష్కర
ధ్వనితోఁ జారణకన్యక ల్చటులవా♦గ్వైచిత్రితోఁ బన్నగాం
గన లుద్యన్మణిదీపమాలికలతో ♦ గంధర్వకాంత ల్సుకం
ఠనినాదాతిశయంబుతోఁ బ్రహరి చు♦ట్టం గంటిఁ జిత్రంబుగాన్. 68

అని చింతింపుచున్=పూర్వోక్తప్రకారముగా విచారించుచు, ఒక్కధామమునకున్ = ఒకానొకగృహమునకు, యక్షాంగనల్పుష్కరధ్వనితోన్=పుష్కరమనఁగా వాద్యభాండముఖము, (ని. 'పుష్కరం కరి హస్తాగ్రే వాద్య భాణ్డ ముఖే జలే' అని అ.) యక్షస్త్రీలు పుష్కరమనెడు వాద్యభాండముతోడను, చారణకన్యకల్=చారణస్త్రీలు, చటులవాగ్వైచిత్రితోన్=పటుతరమైన వాక్యచమత్కృతితోడను, పన్నగాంగనలు=నాగకన్యకలు, ఉద్యన్మణిదీపమాలికలతోన్ = ప్రకాశించుచున్న రత్నదీపశ్రేణులతోడను, గంధర్వకాంతల్ ==గంధర్వస్త్రీలు, సుకంఠనినాదాతిశయంబుతోన్= యోగ్యమయిన కంఠధ్వనివిశేషముతోడను-అనఁగాఁ బాటతోడను, ప్రహరిచుట్టన్=అలంగముదిరుగుచుండఁగా, చిత్రంబుగాన్=ఆశ్చర్యమగునట్టులుగా, కంటిన్=చూచితిని.

ఇక్కడ యక్ష చారణ పన్నగ గంధర్వ కాంతలకుఁ దత్తదుచితవ్యాపారమును జెప్పినాఁడు· అన్నియు దివ్యభవనములుగాఁ బొడసూపుటచే మంజువాణి రాజమందిరము గుర్తింపఁజాలదయ్యెను. యక్షకాంతలు వాద్యము లొనరించుట, చారణకాంతలు పొగడికపాటలఁ బాడుట, నాగాంగనలు మణిమాలికలతో నివాళులనిచ్చుట,గంధర్వకాంతలు పాడుట రాజభవన నిశ్చయమునకుఁ దోడ్పడెను. వారందఱు నొకభవనమునఁ బ్రదక్షిణము గావించిరి.

మ. నరలోకంబఁట సిద్ధసాధ్యఫణిగం♦ధర్వాంగనాసేవనా
పరిపాకంబఁట యెంతవింత యనుచుం ♦ బల్మాఱు వీక్షించి యే
సురరాడ్దత్తవిమానచిత్రమహిమ ♦ ల్గా యంచు నూహించి యా
ధరణీనాథకులావతంసభవన♦ద్వారంబు సేరం జనన్, 69

నరలోకంబఁట=లోకము విచారింపఁగా మనుష్యలోకమఁట. సిద్ధసాధ్యఫణి గంధర్వాంగనాసేవనాపరిపాకంబఁట=పరిచర్యవిచారింపఁగా సిద్ధ సాధ్య పన్నగ గంధర్వ స్త్రీలయొక్క పరిచర్యాసిద్ధి యఁట. ఎంతవింతయనుచున్ = ఎంతయాశ్చర్య మిది యని తలంచుచును - అనఁగా మనుష్యలోకములో దేవతాస్త్రీలు సేవసేయుట మిక్కిలి యద్భుతము గదా యని తలంచుచు ననుట. పల్మాఱు వీక్షించి=మాటిమాటికిఁజూచి, ఏన్ =నేను, సురరాట్=దేవేంద్రునిచేత, దత్త=వసురాజునకొఱ కియ్యఁబడిన, విమాన=దివ్యవిమానముయొక్క, చిత్ర=అద్భుతకరములయిన, మహిమల్సాయంచున్ =ప్రభావములు సుమీ యని, ఊహించి=భావనచేసి, ఆధరణీనాథ కులావతంస భవనద్వారంబు సేరంజనన్ =రాజకులశ్రేష్ఠుఁ డయిన యావసురాజుయొక్క గృహద్వారమును సమీపించి పోఁగా.

మనుష్యలోకమునందలి రాజభవనమునకు వేలుపుఁబ్రోయాండ్రు ప్రదక్షిణము తిరుగుట మిగుల వింత. ఇందులకు సురరాజొసంగిన విమానమహిమయె కారణము. ప్రదక్షిణలుచూడ రాజభవన మిది యని మంజువాణికిఁ దెలిసెను.

క. దానాగతరసికాళిస, దానాహతగీతి చెవుల • నంటఁగ నిదురల్
పూననిబహిరంతరవీ, రానేకపరాజి యచట • నచ్చెరు వొసఁగెన్. 70

దాన=మదజలాస్వాదనముకొఱకు, ఆగత=వచ్చిన, రసిక=సరసములయిన, అళి = తుమ్మెదలయొక్క, సదాఅనాహత=ఎప్పుడు నెడతెగని, గీతి=ఝుంకారధ్వనియని యర్థము. దాన=అర్థప్రదానముకొఱకు, ఆగత=వచ్చిన, రసికాళి=రసికజన సమూహముయొక్క, సదానాహత=సంతతమును గొట్టఁబడకయున్న, గీతి=గానస్వరమని యర్థాంతరము. చెవులనంటఁగన్ =కర్ణములయందు సోఁకఁగా, నిదురల్పూనని=నిద్రఁజెందక యున్నట్టి, బహిరంతర వీరానేకపరాజి=బాహ్యాభ్యంతరములయందలి మత్తమాతంగశ్రేణి యని యర్థము. జాగరూకులయియున్న బహిరంతరవీరశ్రేష్ఠసమూహమని యర్థాంతరము. అచటన్ =ఆపట్టణమందు, అచ్చెరువొసఁగెన్ =ఆశ్చర్యమును బుట్టించెను.

మదధారలకాసించి తుమ్మెదలు దిమ్ముచేయుటచే మెలఁకువతోనున్న యేనుఁగులును, ఈవి కాసించి స్తోత్రపాఠములు పండితులొనర్చుటచే జాగరూకులగు వీరోత్తములు రాజమందిరమునందుఁ గనిపించిరి. అలం. శ్లేషము.

సీ. పటుహీరములెచాలుఁ • బాలసున్న మొనర్ప శక్రాశ్మములెచాలు • జాదుపూయ
శశికాంతములెచాలు • జలసేక మొనరింపఁ గలికిపచ్చలెచాలు • నలికివైవ
విద్రుమంబులెచాలు • వింతజాజుఘటింప ముక్తామణులెచాలు • ముగ్గు లిడఁగ
వైదూర్యములెచాలు • వన్నెలతెరలుంపఁ దేటకెంపులెచాలు • దివియ లెత్తఁ
తే. జకచకితపుష్యరాగమా • లికలె చాలు
గగనచిత్రవితానసం • గతి యొసంగ
నిమ్మహాస్థాని కనఁ దోఁచెఁ • నృపుహజార
మామహామంటపము దాఁటి • యవలఁ జనుచు. 71

ఇమ్మహాస్థానికిన్ =ఈసభామంటపమునకు, పాలసున్న మొనర్పన్ = మెఱుఁగుసున్నము చేయుంటకు, పటుహీరములెచాలున్ = సమర్థమయిన వజ్రమణులేచాలును-అనఁగాఁ జెక్కఁబడినవజ్రములే మెఱుఁగుసున్నము చేసినట్టులుగాఁ గనుపడుచున్న వనుట. సర్వత్రయీలాగుననే గ్రహింపవలయును.

శక్రాశ్మములెచాలుఁ జాదుపూయర్=చాదనఁగా నల్లరంగుచేసెడు వర్ణద్రవ్యము గనుక నదిపూయుటకు, శక్రాశ్మములెచాలుర్=ఇంద్రనీలమణులేచాలును. జలసేకమొనరింపర్=నీళ్లుచల్లుటకు, శశికాంతములె చాలుర్ = చంద్రకాంతమణులేచాలును. అలికివైవర్=అలుకుటకు, కలికిపచ్చలెచాలుర్=సుందరమయిన మరకతమణులేచాలును. వింతజాజుఘటింపర్=వింతగానుండెడు సెజ్జజాజుపట్టెలు తీర్చుటకు, విద్రుమంబులెచాలుర్=పగడములేచాలును. ముగ్గులిడఁగర్=రంగవల్లికలు పెట్టుటకు, ముక్తామణులెచాలుర్=ముత్తెములేచాలును. వన్నెలతెరలుంపర్ = వన్నెవన్నెలతెరలు-అనఁగాఁ బరదాలుంచుటకు, వైదూర్యములెచాలుర్=వైదూర్యమణులేచాలును. దివియలెత్తర్=దీపములుపెట్టుటకును, తేటకెంపులెచాలుర్=తేటగల పద్మరాగమణులేచాలును. గగనవిచిత్రవితానసంగతియొసంగర్=ఊర్ధ్వభాగమందు విచిత్రమయిన మేలుకట్టు కట్టడమునకు,

చకచకితపుష్యరాగమాలికలెచాలుర్=చకచకాయమానములయిన పుష్యరాగమణిపంక్తులే చాలును.అనర్=అనునట్టులుగా,నృపుహజారము=రాజుయొక్క కొలువుకూటము,.తోఁచెర్=కనుపడియెను. ఆమహామంటపముదాఁటి=మహత్తరమయిన యీసభామంటపము నతిక్రమించి, అవలఁజనుచుర్=అవతలఁ బోవుచును, ముందరిపద్యముతో నన్వయము. ఇందుఁలో నవరత్నములకును దత్తద్వర్ణోచితక్రియలను జెప్పినాఁడు. మణిమయమైన యీమహామండపము సర్వవిధాలంకృతులతో దర్శనీయముగా మనోహరముగనుండెను. పుష్యరాగములు మాలికలుగాఁ గూర్పఁబడి సభామందిరమున వ్రేలాడఁగట్టఁబడి యుండెను. అవి కదలుచుంటచే కాంతులువెల్లివిరిసి పైభాగమునందంతటను బాగుగాఁ బ్రసరించుటచే నా కాంతిపుంజములు పైనిగట్టిన చాందినీవలె నుండెనని భావము.

చ. తళుకుపసిండియోవరులు ♦ దంతపుచావడు లర్చనాగృహం
బులు గుడినీరుమేడలును ♦ భోజనశాలలు గెంపుటోడుబి
ళ్ళలగరిడీలు శీతలశి♦లాతలము ల్భువనేశ్వరంబు లు
జ్జ్వలజలయంత్రధామములు ♦ సజ్జలు దాఁటి ధరావతీర్ణనై. 72

తళుకుపసిండియోవరులు=మెఱుపుగలబంగారపు కేళీగృహ విశేషములును, దంతపుచావడులు=దంతపుచవికలును, అర్చనాగృహంబులు=దేవపూజామందిరములును, గుడినీరుమేడలును=పానీయశాలలును, భోజనశాలలు=భోజనచావళ్లును, కెంపుటోడుబిళ్ళలగరిడీలు=కెంపులచేఁ జేయఁబడిన గూనపెంకులుగప్పిన సాముగరిడీలును, శీతల శిలాతలముల్=చంద్రకాంత శిలాకుట్టిమములును-అనఁగాఁ గట్టునేలలును, భువనేశ్వరంబులు=చుట్టుబవంతులును, ఉజ్జ్వలజలయంత్రధామములు=ప్రకాశములయిన యీతుఖానాలుండెడు గృహములును, సజ్జలు=గృహవిశేషములును, దాఁటి=అతిక్రమించి, ధరావతీర్ణనై=భూమిమీఁదికి దిగినదాననై-ముందరిపద్యముతో నన్వయము.

సీ. ఒకవంక నిర్మలో♦దకశంక సంకుచత్పరిధాన నైరిత్తఁ ♦ బొఱఁ దలఁతు
నొకచోట విఘటితో♦రుకవాటగృహవాటమనిమిన్నకయతూఁజే♦చనఁ దలంతు
నొకయిక్క నిదివిత♦ర్దిక నిక్కమని పదాగ్రమునిక్క రహినెక్కఁ♦గాఁ దలంతు
నొకచాయఁజిత్రభి♦త్తికగాయనుచుపోయగమునఁ బాయకడాయఁ♦గాఁదలంతు
తే. నిట్లు గృహరాజకీలితా♦నేకరత్న
వివిధరుచివైభవంబులు ♦ వెగడుపఱుప

నిదియ కాఁబోలు నృపుకేళి♦సదన మనుచు
నచట మాయాబల తిరోహి♦తాంగి నగుచు. 73

ఒకవంకన్ = ఒకవైపున, నిర్మలోదకశంకన్ = స్వచ్ఛమయిన యుదకమనెడు సందేహముచేత, సంకుచత్పరిధానసై=పైకిముడువఁబడుచున్నవస్త్రముగలదానవై, రిత్తఁబాఱఁదలఁతున్ = ఏమియులేనిచే వడిగానడువఁజూతును, ఒకచోటన్=మఱియొకస్థలమందు, విఘటిత=తెరువఁబడిన, ఉరుకవాట = గొప్పతలుపులుగల, గృహవాటమని = గృహపంక్తియనుకొని, మిన్నకయతూఱి చనఁదలంతున్=ఊరకదూరిపోఁజూతును, ఒకయిక్కన్=మఱియొకస్థలమందు, ఇది వితర్దికనిక్కమని = ఇది నిజముగా నరుగేకాని మఱియొకటికాదని, (ని. 'స్యాద్వితర్దిస్తు వేదికా' అని అ.) పదాగ్రమునిక్కన్=పాదములచివర లెత్తఁబడునట్టులుగా, రహినెక్కఁగాఁదలంతున్=ఉల్లాసముచేత నెక్కఁజూతును, ఒకచాయన్=మఱియొకవైపున, చిత్రభిత్తికగా యనుచున్=చిత్తరువువ్రాసిన గోడగదా యనుకొనుచును, సోయగమునన్=విలాసముచేత, పాయక డాయఁగాఁ దలంతున్=తొలఁగిపోక సమీపించిపోఁజూతును.

ఇట్లు=ఈప్రకారముగా, గృహోరాజ=మందిరశ్రేష్ఠమందు, కీలిత=కూర్పఁబడిన, అనేకరత్న=బహువిధములయిన రత్నములయొక్క, వివిధ రుచివైభవంబులు=నానాప్రకారములైన కాంతిసంపదలు, వెగడుపఱుపన్=విభ్రాంతి పొందించుచుండఁగా, ఇదియకాఁబోలునృపుకేళిసదనమనుచున్=రాజుయొక్క క్రీడాగృహమిదే కాఁబోలు ననియూహించుకొని, అచటన్=ఆగృహమందు, మాయాబల తిరోహితాంగి నగుచున్=మాయాప్రభావముచేతఁ బరులకు దృగ్గోచరముగాని దేహముగలదాననై-అనఁగా నదృశ్యాకారముగలదాననై యనుట. ముందరిపద్యముతో నన్వయము. ఈపద్యమక్కిలిప్రాససీసము.

రాజగృహమునందుఁ జెక్కఁబడినరత్నములు లెక్కయిడరానియన్ని. కావున వానికాంతులు విచిత్రరుచివైభవములు. మణికాంతు లాయాస్థలములఁ బ్రసరించి మంజువాణిని విభ్రాంతురాలినిగా నొనరించెను. ఇవియన్నియుఁ గ్రీడాగృహచిహ్నములు. వీనిమూలమున నది రాజుమందిరమని గుర్తించి మంజువాణి మాయాబలముచే నదృశ్యమయ్యెను.

చ. అనుపమరత్నసౌధకమ♦లాలయవాటిక నొత్తగిల్లి పైఁ
జనుమొన దోఁప నొంటివలి♦జక్కవతో నరవిందము ల్మొగి
డ్చినయెలదమ్మితీవియల♦తీవిఁ గనుంగవ మూసి యున్నయం
గనల ననంగదేవతలఁ ♦ గాంచితి రాజసమీపభూములన్. 74

అనుపమ=సమానరహితమైన, రత్నసౌధ=రత్నమయమైన మేడయనెడు, కమలాలయ వాటికన్=సరోవరప్రదేశమందు, ఒత్తగిల్లి=ఒత్తగిలిపరుండి, పైఁ జనుమొనదోఁపన్=మీఁదిప్రక్కనున్న కుచాగ్రము గనుపడఁగాను, ఒంటివలిజక్కవతోన్=చక్రవాకి నెడఁబాసి యొంటిగానున్న చక్రవాకముగోడను, అరవిందముల్మొగిడ్చిన=పద్మములను ముకుళింపఁజేసిన, ఎలదమ్మితీవియలకీవిన్=నూతనపద్మలతల, కనుంగవమూసియున్న=కన్నులుమూసియున్న, అనంగదేవతలన్ = మదనదేవతలవలె నుండు అంగనన్=కొందఱుస్త్రీలను, కాంచితి రాజ సమీపభూములన్=వసురాజసమీప ప్రదేశముల గాంచితి ననియర్థము, చంద్రసమీప ప్రదేశములయందని యర్థాంతరము.

వసురాజ కేళీసౌధమం దాయనసమీపస్థలములను గొందఱు స్త్రీ లొకవైపుచను మొనలు పైకిఁ గనుపడునట్టులుగా నొత్తగిలిపరుండి కన్నులుమూసికొని నిద్రింపఁగా వారేలాగునఁ గనుపడిరనినఁ జంద్రోదయాంతస్థల కమలాకరమందు స్త్రీవియోగముచేత నొంటిగానున్న చక్రవాకముతోఁ గూడుకొనియున్న తామరమొగ్గడిగల శ్వేతతమ్మితూడులేమో యనునటులుండిరి. ఇందు మేడకుఁ దమ్మికొలంకునకును నిదురించుచెలువ యొంటికుచమునకును గవబాసిన యాఁడుజక్కవకును, ముకుళించిన తామర పూవునకు మోడ్చిన కనులకును శ్వేతతామరతూండ్లకును అంగనలమేనులకును గలపోల్కి తెలియు నది. అలం. రూపకోపమల సంకరము.

సీ. ఒకతె చన్నులమీఁది•యుదిరికిన్నరగాలిఁ బలుకవింతచలించి • బయలుమీటు
నొకతె యూరుపుగాలి•నురిలిపూసురటి తేనియచిందఁ గనువిచ్చి•బయలువిసరు
నొకతెచంద్రాశ్మవే•దికముఖద్యుతిఁ జల్లఁబడ నుల్కి చేయాకు • బయలుసాచు
నొకతె కప్రపుకళా•చిక దేంట్లు సందడింపఁగ మిట్టిపడి కేలు•బయలుపట్టు
తే. నిదురతమి నైన నుడిగంపు•చదురు లిట్లు
వాసనాబలమునఁ బూను•వనజముఖులఁ
గంటిఁ గని తత్ప్రదేశంబు • గడచి చనఁగ
నువిద లిద్దఱు పతియొద్ద • నుండి వచ్చి. 75

ఒకతె=ఒకస్త్రీ, చన్నులమీఁది=స్తనములమీఁదనున్న, ఉదిరికిన్నర=శుద్ధసువర్ణమైన వీణావిశేషము, గాలిన్=వాయువశముచేత, పలుకన్=తనంతట తాను మ్రోయఁగా, ఇంతచలించి=ఇంచుకంత చలనమునుబొంది, బయలుమీటున్=రిత్తబయలున వ్రేళ్ళతో మీటును, ఒకతె=మఱియొక స్త్రీ, ఊరుపుగాలి నురిలి=నిశ్వాసమారుతముచేత నురలఁబడి, పూసురటి దేనియ చిందన్=పువ్వులచేతఁ గట్టఁబడిన విసనకఱ్ఱయందలి తేనియ పైనిఁజిందఁగా, కనువిచ్చి=మేలఁకువదగిలి-కన్నులు తెఱచి, బయలు విసరున్=ఒట్టిబయలువిసరును, ఒకతె=మఱియొక స్త్రీ, చంద్రాశ్మవేదిక = తానునిలుచున్నచంద్రకాంత శిలారచితమయిన యరుఁగు, ముఖద్యుతిఁజల్లఁబడన్=ముఖచంద్రకాంతిచేతఁ జల్లఁబడఁగా, ఇక్కడఁ జంద్రుఁడని చెప్పకపోయినఁ జంద్రకాంతస్రవణము సంభవింపనేరదని తెలియవలయును. ఉల్కి =ఉలికిపడి, చేయాకు బయలుసాచున్=చేతనున్నయాకుమడుపును బయలునకందిచ్చును, ఒకతె= మఱియొక స్త్రీ, కప్రపుకళాచిక = కర్పూరసహితమయిన పేటికావిశేషమును-అనఁగా నొకవిధమయిన పెట్టెను, తేంట్లుసందడింపఁగన్=తుమ్మెదలుకదలింపఁగా, మిట్టిపడి=అదరిపడి, కేలుబయలువట్టున్ =హస్తమును బయలునకుఁ జాపిపట్టును,

నిదురతమినైనన్=నిద్రాపరవశత్వముచేతనైనను, ఉడిగంపుచదురులు=ఊడిగపుపనులయందలి మెలకువలు, ఇట్లు=ఈచెప్పఁబడినప్రకారము, వాసనాబలమునఁబూను=పూర్వపరిచితియొక్క దార్ఢ్యముచేత వహించుచున్న, వనజముఖులన్=పరిచారికాస్త్రీలను, కంటిన్=చూచితిని, కని=చూచి, తత్ప్రదేశంబు గడచి చనఁగన్=ఆస్థలము దాఁటిపోఁగా, ఉవిదలిద్దఱు=ఇద్దఱుస్త్రీలు, పతియొద్దనుండివచ్చి= రాజసన్నిధినుండి వచ్చినవారై, ముందరిపద్యముతో నన్వయము. నిద్రాపరవశలైయుండి బయలు మీటుచెలువ వీణావాద్యమునందు నేర్పరి, బయలువిసరుచున్నసతి వీవనతో రాజునకు విసరుపనికత్తియ,

బయలునఁ జేయిసాచుపోఁతి తాంబూలమునందిచ్చు పరిచారిక, బయలుకేలఁ బట్టుముగుద సుగంధద్రవ్యమిశ్రమగు కళాచిపట్టుచెలి. పూర్వపరిచితకార్యములు నిదురలోఁగూడ నిర్వహించుట రాజభక్తి విశేషమునకుఁ దార్కాణములు.

శా. ఏమే హేమలతా యటంచుఁ బని యే • మే మాధవీ యంచు నీ
భామామన్మథుచంద మెట్లనుచుఁ జె • ప్పం జాల భూపాలుఁ డా
రామక్షోణికిఁ జన్ననాఁటఁగోలె ని • ద్రాసౌఖ్యము ల్మానినాఁ
డేమో యంచు వచింప వింటిఁ దమలో • నేకాంతలీలాగతిన్. 76

ఏమేహేమలతాయటంచున్=ఓసి హేమలతా యేమే యనియును, పనియేమే మాధవీయంచున్=ఓసిమాధవీ కార్యమేమేయనియును, ఈభామామన్మథుచంద మెట్లనుచున్=స్త్రీజన మన్మథుఁడయిన యీయనవర్తమాన మేలాగంటిదే యనియును, చెప్పంజాలన్=నేఁజెప్పఁజాలను, భూపాలుఁడారామక్షోణికిఁ జన్ననాఁటఁగోలె=రాజు క్రీడావనభూమికిఁ బోయినదిమొదలుకొని, నిద్రాసౌఖ్యముల్మానినాఁ డేమోయంచున్ = నిద్రాసంబంధములయిన సుఖభావములను మానినాఁడు – అనఁగా నిద్రఁజెందకయున్నాఁ డదెందువల్లనోకాని యనియును, తమలో నేకాంతలీలాగతిన్ = తమలోఁదాము రహస్యప్రకారముగా, వచింపన్=ఆయిద్దఱును సంభాషింపఁగా, వింటిన్=నేనువింటిని, ఇందులో నుక్తిద్వయమును ప్రత్యుక్తిద్వయమును నని విచారింపవలయును.

క. ఆమాట కొంత చెవులకు, నామెతగాఁ బ్రియము విస్మ • యము నాదుమనో
భూమిఁదళుకొత్త నృపమణి, ధామాభ్యంతరము సొచ్చి • తడయక యచటన్.

ఆమాట=అనఁగా రాజు వనభూమికిఁ బోయివచ్చినది మొదలుకొని నిద్రాసుఖము మానినాఁడన్నమాట, కొంతచెవులకు నామెతగాన్=కొంతకొంతచెవులకును విందగునట్టులుగాను, ప్రియము=ఇష్టమును, విస్మయము = ఆశ్చర్యమును, నాదుమనోభూమిఁ దళుకొత్తన్ = నామనస్సున హత్తఁగాను, నృపమణి ధామాభ్యంతరము సొచ్చి=రాజుయొక్క రత్నమందిరములోఁ బ్రవేశించి, తడయక యచటన్=ఆలస్యముచేయక యాస్థలమందు, ముందరిపద్యముతో నన్వయము.

చ. మొలకమెఱుంగుకెంపుమొన • ముక్కుల నిక్కుకిరీటిపచ్చఱా
చిలుకలకోళ్ళతోఁ జికిలి • చెంద్రికవన్ని యపట్టుపట్టెతోఁ
దొలఁకుపసిండిప్రాఁతతెర • తో నెఱతావులమేలుకట్టుతోఁ
జలువలు చిందుముత్తియపుఁ • జప్పరమంచముపై మహోన్నతిన్. 78

మొలకమెఱుంగు కెంపుమొనముక్కులనిక్కు=పద్మరాగరత్నాంకురములచేతఁ గల్పింపఁబడిన ముక్కులుగలిగి నిక్కుచున్న, కిరీటిపచ్చఱాచిలుకలకోళ్ళతోన్=మరకతమణి నిర్మితములైన చిలుకలుంగల కోళ్లతోడను, చికిలిచెంద్రికవన్నియ పట్టుపట్టెతోన్ = తళుకుగల సిందూరవర్ణపు పట్టునవారుతోడను, తొలఁకుపసిండిప్రాఁతతెరతోన్=తులకించుచున్న బంగారపుప్రాఁతపనిగల తెరతోడను, నెఱతావులమేలుకట్టుతోన్=నిండారయిన సువాసనలుగల చందువాతోడను-అనఁగా వితానముతోడను, చలువలుచిందు ముత్తియపుఁ జప్పరమంచముపైన్=చలువలు గ్రమ్మరించుచున్న ముత్యాలుగూర్చిన

దోమతెర మంచముమీఁద, మహోన్నతిన్=అధికౌన్నత్యముచేత, ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

సీ. సేసకొప్పున జాఱు • చెంగల్వమొగడలు జాగరారుణకటా • క్షముల నెనయ
నిద్దంపుకపురంపు • నిడుదయొంటులచాయ గండపాండిమకుఁ గై • దండ యొసఁగ
నెత్తమ్మినూలిజ • న్నిదము శయ్యావివ ర్తనలూనహారసూ • త్రములఁ బెనఁగఁ
బలుచనివలిపెదు • వ్వలువతావియ చిక్కఁ బూసినగందంపు • పూఁతఁ బోల
తే. నొప్పుపుప్పొడిపరుపుపై • నొత్తగిల్లి
మోముదమ్మి తలాడపై • మోపి యడుగుఁ
జివురు చిగురాకుబటువునఁ • జేర్చి చిత్ర
ఫలక మీక్షించునాసార్వ • భౌముఁ గంటి. 79

సేసకొప్పునజాఱు=చెంపకొప్పువలన జాఱుచున్న, చెంగల్వమొగడలు = ఎఱ్ఱగలువమొగ్గలు, జాగర=నిద్రవేగించుటచేత, అరుణ = ఎఱ్ఱఁబడిన, కటాక్షములన్=క్రేఁగన్నులతోడ, ఎనయన్= మిళితమగుచుండఁగాను, నిద్దంపు=తేటగలిగిన, కపురంపు = కర్పూరముతోఁజేయఁబడిన, నిడుదయొంటులు=సోగలయిన పాలకాయయొంట్లు - అనఁగాఁ గుండలములు, వానియొక్క, చాయ=కాంతి, గండపాండిమకుఁ గైదండయొసఁగన్=చెక్కులయందలి విరహజనిత ధవళిమకుఁ జేయూతయియ్యఁగాను, నెత్తమ్మినూలిజన్నిదము = మృణాలతంతు నిర్మితమైన యజ్ఞోపవీతము, శయ్యావివ ర్తన=పరపుపైని పొర్లాడుటచేత, లూన=తెగిన, హార = ముత్యాలహారములయొక్క, సూత్రములన్=దారములతోడ, పెనఁగన్=పెనచుకొనఁగాను, పలుచని వలిపెదువ్వలువ = తేలికయైన సన్నపుదుప్పటి, తావియచిక్కఁబూసిగందంపుపూఁతఁబోలన్ = పరిమళముమాత్రమే నిలుచునట్టులు పలుచనఁగాఁ బూసిన శ్రీచందనలేపనముతో సమానమై కనుపింపఁగాను,

ఒప్పుపుప్పొడిపరపుపై నొత్తగిల్లి = ఒప్పుచుండెడు పుష్పపరాగముచేత రచింపఁబడిన శయ్యమీఁద నొత్తగిలి పరుండి, మోముదమ్మి తలాడపై మోపి = కమలసదృశమైనముఖము తలగడమీఁద నానించి, అడుగుఁజివురు=పాదపల్లవము, చిగురాకుబటువునఁజేర్చి = చిగురుటాకులతోఁజేసిన బటువుబిళ్ళమీఁదను అనఁగా గుండ్రని చిన్నబాలీసుమీఁద మోపి, చిత్రఫలకమీక్షించు=చిత్తరువువ్రాసిన పలకను జూచుచున్న, ఆ సార్వభౌముఁ గంటిన్=సర్వభూమిపాలకుఁడైన యీవసురాజును జూచితిని. కడగంటి చూపులందుఁ గెంజాయయుఁ జెక్కులందుఁ బాండువర్ణమును జన్నిదములు హారములతోఁ బెనఁగొనుటయు మేనఁ గందపుఁబూఁత యలరుటయుఁ బుప్పొడిపఱుపుపైఁ దమ్మితలగడనుపయోగించుటయుఁ జూడవసురాజు వలపురాయిడిచే నిదురమానెననియు, విరహవ్యథాభరమున శయ్యపైఁ బొరలుచుండెననియు, వలపుతాపమునకు సైపఁజాలక శిశిరోపచారములు గావించుకొనుచుండెననియుఁ దోఁచుచున్నది. ఇందులకుఁ దార్కాణము చిత్రపటమును సందర్శించుట.

ఇం దనంగదశావిశేషములగు జాగరణము కృశించుట లోనగునవస్థలు చెప్పఁబడినవి. అనంగదశలు.

శ్లో. "చక్షుఃప్రీతి ర్మనస్సంగ స్సంకల్పోథ ప్రజాగరః
అరతి స్సంజ్వరః కార్శ్యం లజ్జాత్యాగో భ్రమో మృతిః
దశావస్థా భవం త్యేతే విప్రలంభేభిలాషజే"

"అభిలాషచింతనానుస్మృతిగుణసంకీర్తనోద్వేగాః"
"చక్షుః ప్రీతిః ప్రథమం చింతాసంగస్తతోఽథసంకల్పః
నిద్రాచ్ఛేదస్తనుతా విషయనివృత్తిస్త్రపానాశః"

చ. కనుఁగొని యానృపాలకశి♦ఖామణిడెందము శైలకన్యకా
మననమహానురాగఝర♦మగ్నమొ కాక ప్రియాంతరస్పృహా
ఘనరసపోషరూపితమొ ♦ కందము గా కని గంధతైలభా
జనభవనప్రదీపికల♦చాటున నల్లనఁ బొంచి యుండఁగాన్. 80

కనుఁగొని=చూచినదాననై, ఆనృపాలకశిఖామణిడెందము = ఆరాజశ్రేష్ఠునియొక్క హృదయము, శైలకన్యకా=గిరికావిషయమైన, మననమహానురాగ=అనుసంధానయుక్తమైన యధికప్రేమ యనెడు, ఝర=ప్రవాహమందు, మగ్నమొ = మునిఁగియున్నదో - అనఁగా గిరికానురాగాధీనమై యున్నదో, కాక=అట్లుకాక, ప్రియాంతర = మఱియొక ప్రియురాలివిషయమైన, స్పృహా=ఆసక్తి యనెడు, ఘనరసపోష = జలసమృద్ధిచేత, రూపితమొ = వ్యాపింపఁబడినదో - అనఁగా ముంపఁబడినదో, కందముగాకని=చూతముకాక యని, గంధతైల=సంపంగినూనెతోఁగూడిన, భాజన=పాత్రలయందలి, భవనప్రదీపికల = గృహదీపములయొక్క, చాటునన్=మరుగున, అల్లఁ బొంచియుండఁగాన్=తిన్నగా డాగియుండఁగాను, ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. వసురాజు అనురాగముచే వంతనొందుచున్నాఁడని మంజువాణి తెలిసికొనెనుగాని గిరికాదేవి కొఱకా? అన్యకాంతకొఱకా యనునది విచారణీయాంశముగానఁ దెలిసికొనుటకుఁ బొంచియుండెను.

చ. ఉసురనుఁ గన్ను మోడ్చుఁ దల♦యూచుఁ దలంచు నగుం జెమర్చు న
ల్దెసలు గనుంగొనుం బొరలు ♦ లేచు వడంకుఁ జలింపకుండు హా
ప్రసవసుగంధి యంచుఁ బువు♦పాన్పున వ్రాలు నృపాలపుంగవుం
డసమశరప్రవీరనిశి♦తాశుగదుర్దినధూయమానుఁడై. 81

నృపాలపుంగవుండు = నరపాలశ్రేష్ఠుఁడైన వసురాజు, అసమశర = మన్మథుఁడనెడు ప్రవీర=వీరశ్రేష్ఠునియొక్క, నిశిత=వాఁడిగలిగిన, ఆశుగ=బాణములవలన నయిన, దుర్దిన=ముసురుదినముచేత-అనఁగా వర్షముచేత, ధూయమానుఁడై=కంపింపఁబడుచున్నవాఁడై, ఉసురనున్=ఉస్సురని నిట్టూర్పుపుచ్చును, కన్నుమోడ్చున్=కన్నులు మూసికొనును, తలయూచున్=శిరఃకంపము సేయును, తలంచున్=తలఁచుకొనును, నగున్=నవ్వును, చెమర్చున్ = చెమటతోఁగూడుకొనును, నల్దెసలు గనుంగొనున్ = నాలుగుదిక్కులును గలయఁజూచును, పొరలున్ = పొరలుకాడును, లేచున్=దిగ్గున లేచును, వడంకున్=కంపించును, చలింపకుండున్=కదలక యూరకుండును,

హా ప్రసవసుగంధియంచున్=హాపుష్పగంధీయని, పువుపాన్పున వ్రాలున్=పుష్పశయ్యమీఁదఁబడును. ఇందులో నుసురనుట పొరలుట చింతయనెడు సంచారిభావమున కనుభావములు. పొరలుట తాపకార్యము, తాపము చింతాకార్యము, తలయూచుట స్మృతియనెడు సంచారిభావమున కనుభావము. తలంచుట స్మృతియనుసంచారిభావము. నగుటయును నల్దెసలు గనుంగొనుటయును లేచుటయును, హా ప్రసవసుగంధియంచుఁ బువుపాన్పున వ్రాలుటయును నున్మాదమనెడు సంచారిభావమున కనుభావములు.

చెమర్చుటయును వడంకుటయును జలింపకుండుటయును స్వేదవేపథుస్తంభములనెడు సాత్త్వికభావములు. ఇచటఁ గ్రియాసముచ్చయాలంకారము.

క. భావగతభావనాసం, భావితభావంబు లిట్లు ♦ మల్లడిగొనఁ గో
త్రావల్లభుఁ డిట్లను జి,త్రావేశితవనితఁ గని మ♦హామోహమునన్. 82

భావగత=చిత్తగతములైన, భావనా=సంస్కారములచేత, సంభావిత=స్వీకరింపఁబడిన, భావనంబులు=సాత్త్విక సంచారిభావములు, ఇట్లు=ఈపైనిఁజెప్పఁబడిన ప్రకారముగా, మల్లడిగొనన్=చుట్టఁబెట్టఁగా, గోత్రావల్లభుఁడు=వసురాజు, చిత్రావేశిత వనితఁగని=చిత్తరువులోఁ జేర్పఁబడియున్న స్త్రీనిఁ జూచి, మహామోహమునన్=అధికమయిన మోహముచేత, ఇట్లనున్=వక్ష్యమాణప్రకారముగా నొకవాక్యము పలికెను.

ఉ. ఏమిటి కల్గితే కువల♦యేక్షణ పల్కవిదేటికే వధూ
టీమణి యేల యాకటికి♦డెందము వూనితివే లతాంగి య
య్యో మనసారఁ దావకప♦యోధరపాళి దృఢాంకపాళి నీ
వే మృదువాణి నీకు నొక♦యెగ్గును జేయఁ గదే తలోదరి. 83

ఏమిటికల్గితే కువలయేక్షణ = కలువరేకులవంటి కన్నులుగలదానా యెందుకల్గితివే, వధూటీమణి=స్త్రీలలోపల శ్రేష్ఠురాలవైనదానా, పల్కవిదేటికే=మాటలాడవిది యెందుకే, లతాంగి=తీఁగెవంటి దేహముగలదానా, ఏల = ఎందుకొఱకు, ఆ=ఆయిపంటి, కటికి=కఠినమైన, డెందము = హృదయమును, వూనితివే=వహించితివే, అయ్యో=అక్కటా, మనసారన్ = మనస్సుదీరునట్టులుగా, తావకపయోధరపాళి=నీయొక్క కుచపాళియొక్క, దృఢాంకపాళి=గాఢాలింగనమును, (ని. 'అంకపాళిః పరిష్వఙ్గ స్సంశ్లేష ఉపగూహనమ్' అని యమరశేషము.) ఈవే = ఇయ్యవే, మృదువాణి=మృదువైన వాక్యములుగలదానా, నీకు నొకయెగ్గునుజేయఁగదే=నీకొక్క తప్పిదమైనను జేయలేదుగదే, తలోదరీ=ఓవనితా.

ఇక్కడ ఏమిటియనెడు పదమునందలి మధ్యపువర్ణము లుప్తమైనదిగనుక ఏటికనియుఁను బ్రయోగింపఁబడినది. ఇందుకు, (శ్లో. 'భూయోపి దేశ్యశబ్దేషు లోపవర్ణాగమశ్రుతిః') అని యథర్వణవచనము.

చ. అళులకు మోము ద్రిప్పుగతి ♦ నంచల రాఁ జెలిఁ బిల్చురీతి రా
చిలుకకుఁ బండ్లు గోయుక్రియఁ ♦ జిత్రగృహంబుననుండి పోవుచున్
సొలపున నీవు నన్నుఁ ♦ జూడఁ ద్రిశుద్ధిగ నేలి తంచు నే
నలరితిఁ గాని భావజుని ♦ కగ్గము సేయు టెఱుంగఁ గోమలీ. 84

అళులకు మోము ద్రిప్పుగతిన్=ముఖపద్మవాసనకు ముసురుకొనెడు తుమ్మెదలకుఁగాను ముఖము మళ్ళించినట్టులును, అంచలరాఁ జెలిఁ బిల్చురీతిన్=పార్శ్వమందుఁగూడవచ్చెడు నిమిత్తము చెలికత్తియను వెనుకఁదిరిగి పిలిచినట్టులును, రాచిలుకకుఁ బండ్లుగోయుక్రియన్=రాజకీరమునకుఁ బండ్లుగోయునిమిత్తము వెనుకకు మళ్ళిచూచినట్టులును, చిత్రగృహంబుననుండి పోవుచున్=రత్నచిత్రితమయిన గృహములోనుండి పోవుచును, సొలపుననీవు నన్నలిచూడన్ = దీనభావముచేత నీవునన్ను

వెనుకఁదిరిగిచూడఁగాను, త్రిశుద్ధిగ నేలితంచు నేనలరితిఁగాని=త్రికరణశుద్ధియనఁగా మనోవాక్కాయశుద్ధిగా నన్నుఁజేకొంటివని నేను సంతోషించితినిగాని యని యర్థము. త్రివారదర్శనమనిభావము. కోమలీ=ఓతరుణీ, భావజుని కగ్గము నేయు టెఱుంగక=మన్మథునికప్పగించుట గుర్తెఱుఁగనయితిని. అళులకు మోముద్రిప్పుటనుబట్టి నాయిక పద్మినీజాతియని ద్యోతకమగును. కావుననే అళులు మూఁగుటయు మోము ద్రిప్పుటయునని యెఱుంగునది. పద్మినీస్త్రీలక్షణము.

శ్లో. "పద్మముకుళమృద్వీఫుల్లరాజీవగంధి సురతపయసి యస్యాః సౌరభం దివ్యమంగే,
చకితమృగదృగాభే ప్రాంతరక్తేచనేత్రే స్తనయుగళ మనర్ఘం శ్రీఫలశ్రీవిడంబి.
వ్రజతి మృదుసలీలం రాజహంసీవతన్వీ త్రివళిలలితమధ్యా హంసవాణీసువేషా,
మృదుశుచిలఘుభుంక్తే మానినీగాఢలజ్జా ధవళకుసుమవాసా వల్లభా పద్మినీస్యాత్."
(రతిరహస్యము.)

అంచలరాక అనుచో అంచలురాక అనుపాఠముకల్పించి యొకవ్యాఖ్యాత హంసలు వెంట వచ్చుచుండ నను నర్థముతెలిపి అంచల=అనఁగాఁ బార్శ్వమున నను నర్థము కనుపింపదని వ్రాసియున్నాడు. కాని అంచలయనఁ బార్శ్వమందనుటకుఁ బూర్వకవి ప్రయోగములు గలవు.

ద్విపద. జాళువాగిండి యంచలదాల్చి శుకుఁడు. విష్ణుమాయావిలాసము.

ఆ. గురునిగుణముఱొజ♦గిరులుగాంచినఁ గాంచుఁ, గాక నీమనంబు♦ గాంచ నేల
తల్లికుటిలవృత్తి ♦ తగుఁ గాక కురులకు, నింతి నీదుచెయ్వు ♦ లెనయ నేల. 85

ఇంతి=ఓమగువా, గురునిగుణము = నీతండ్రియైన కోలాహలగిరియొక్క కాఠిన్యమును, ఉరోజగిరులు గాంచినఁ గాంచుఁగాక=నీకుచగిరులు పొందినఁ బొందునుగాక - అనఁగా గిరిగుణము గిరుల కుపయుక్తమనుట. ఇక్కడ గురుత్వవాచకమయిన గురుశబ్దమును బుచ్చుకొన్నాఁడు గనుక గురుఁడయిన కోలాహలుని కాఠిన్యపుగుణము గురువులయిన నీకుచముల కుపయుక్తమనియును జెప్పవచ్చును. నీమనంబు గాంచనేల=నీ మనస్సును నట్టికాఠిన్యపుగుణము నేల పొందవలయును, తల్లికుటిలవృత్తి = నీకుఁదల్లియై కుటిలగామినియైన శుక్తిమతియొక్క కుటిలత్వము, తగుఁ గాక కురులకుక=నీ తలవెండ్రుకలకుఁ దగుఁగాక-అనఁగాఁ గుటిలగామినియొక్క కుటిలత్వము కుటిలములయిన కురుల కుపయుక్తమనుట. నీదుచెయ్వు లెనయనేల = నీయొక్క చేష్టలట్టి కుటిలత్వము నెందుకు పొందవలయును.

సీ. కలికిపెన్నెఱులిం ద్ర♦శిలలయందముఁ జూపుఁ జూపుక్రొన్ననవిల్తు♦తూపుచిలుకు
చిలుకుతేనియల జొ♦బ్బిలుమోవి సురమణి రమణీయవజ్రాళి♦రదనపాళి
పాలిండ్లు పసిఁడిగు♦బ్బలులయి చెన్నారు నారు శాతకృపాణి♦యంప మెఱుఁగు
మెఱుఁగుచక్రమువింఁచు♦మించులజఘనము ఘనమూరురుచికరి♦కరముకన్నఁ

తే. గన్నళవు సేయుఁ గచ్ఛపా♦కారగరిమఁ, గరిమరాళికయాన నీ♦చరణమహిమ
మహిమనోభవమణిపుత్త్రి♦మాడ్కి నీకు, నీకుటిలకర్కశతమాను♦నేలకలికి. 86

కలికిపెన్నెఱులు = సుందరమైన సోగవెండ్రుకలు, ఇంద్రశిలలయందముఁ జూపుక=ఇంద్రనీలచ్ఛాయలను దెలుపును, చూపు=కనుచూపు, క్రొన్ననవిల్తుతూపు చిలుకు = మన్మథబాణము యొక్క యలుఁగు-అనఁగా ములికియనుట. చిలుకుతేనియల జొబ్బిలుమోవి=చిందుచున్న తేనియల

చేత జొబ్బిల్లుచున్న యెఱ్ఱనిపెదవి, సురమణి = చింతామణి, రదనపాళి=దంతపంక్తి, రమణీయ వజ్రాళి=చక్కని వజ్రమణిశ్రేణి, పాలిండ్లు=స్తనములు, పసిఁడిగుబ్బలు లయిచెన్నారుఁన్=బంగారు కొండలవంటివై యొప్పును, ఆరు=నూఁగారు, శాతకృపాణి యందమెఱుఁగున్=తీక్ష్ణమైన ఖడ్గము యొక్క సౌందర్యమును గుర్తెఱుఁగును-అనఁగా నారీతిగానే యుండుననుట. జఘనము=కటిపురోభాగము, మెఱుఁగుచక్రమున్=మెఱుపుగల రథచక్రమును, మించులన్=కాంతులచేత, మించున్= అతిక్రమించును, ఊరురుచి=తొడలయొక్క శోభ, కరికరముకన్నన్=గజతుండమునకంటె, ఘనము= శ్రేష్ఠము.

కరి=ఏనుఁగుయొక్కయు, మరాళిక=హంసాంగనయొక్కయు, యాన=నడకలవంటి నడకలు గలదానా, నీ చరణమహిమ=నీయొక్క చరణోపరిభాగసౌందర్యము, కచ్ఛపాకారగరిమన్=కూర్మాకృతియొక్క యతిశయమును, కన్నశవుసేయున్ = అగడుసేయును. ఎట్లనిన, మహిన్=భూమియందు, మనోభవ మణిపుత్త్రిమాడ్కిన్=మన్మథునియొక్క రత్నప్రతిమవలె, నీకున్=నీకును, ఈ కుటిల కర్కశత మానునేల కలికి=ఈ యసాధ్యమయిన కఠినత్వము-అనఁగా నిర్దయత్వ మెందుకుమానునో సుందరీయని యర్థము.

ఈ పద్యమందుఁ గలికియనెడుపదమును నాద్యంతములయందుఁ జెప్పినాఁడు. 'కలికియొప్పిదంబు కాంతమయ్యో' నని నిఘంటువు. దీనం గాంతియను కావ్యగుణము చెప్పంబడియెను. కరిమరాళిక అనుచోట సమాహారద్వంద్వము గావున నపుంసకము. మరాళిక అని స్వార్థకప్రత్యయముఁ జేసినచో ననుకూలముగా నుండును. కఠినభావమును బట్టి మణిపుత్త్రియనియు వలపు నెఱపుటంబట్టి మనోభవపుత్త్రియనియు భావము. పూర్వపద్యమునందలి కఠినత్వము కుటిలత్వ మిందుఁ జెప్పఁబడినవి.

చ. అని విభుఁ డింతిఁ బల్క విని • యప్రతిమానసుధాపయోధిజీ
వనములఁ దేలినట్లు బహు•వాసరపుణ్యఫలంబు కన్నులం
గనుఁగొనఁ జాలినట్లు త్రిజ•గంబులు నొక్కట యేలినట్లు ప
ద్మనయనలార సంతసముఁ • దాల్చితి మామకమానసంబునన్. 87

అని=ఈ ప్రకారముగా, విభుఁడు=వసురాజు, ఇంతిఁబల్కన్=గిరికాదేవినిగూర్చి పల్కఁగా, విని=విన్నదానవై, అప్రతిమాన=అసమానమయిన, సుధాపయోధి= అమృతసాగరముయొక్క, జీవనములన్=జలములయందు, తేలినట్లు = ఓలలాడినట్టులుగాను, బహువాసరపుణ్యఫలంబు=అనేక దినములుచేసిన సుకృతఫలము, కన్నులం గనుఁగొనఁజాలినట్లు = కన్నులఁజూచినట్టుగాను, త్రిజగంబులు నొక్కటయేలినట్లు=మూఁడులోకములు నొక్కసారిగానే యేలినట్టులుగాను, పద్మనయనలార=ఓ చెలులారా, మామకమానసంబునన్=నామనస్సునందు, సంతసముఁదాల్చితిన్=సంతోషమును వహించితిని.

సుధాప్లావనము, తపఃఫలసందర్శనము, త్రిజగత్పరిపాలనము సంతోషకారణములు. వసురాజును గిరికను వలచినటుల నిశ్చయింపఁదగినపలుకులు ఈమాటికంటె మిగుల సంతోషప్రదములు గాన మంజువాణి యానందము నిరుపమానము.

ఉ. వెండియు దూఱుచుండెఁ బృథి♦వీపతి యానరలోకపుష్పకో
దండునిఁ బల్కరించి వని♦తామణియున్కియుఁ దెల్పి యాత్మకుం
బండు వొనర్తు నంచు నృప♦మంచసమంచితయంత్రపుత్త్రికా
మండలిలోన నొక్కమణి♦మండితపుత్త్రిక నై రయంబునన్. 88

వెండియున్=మఱియును, దూఱుచుండెఁబృథివీపతి=వసురాజు గిరికాదేవి నుద్దేశించి నిష్ఠుర వాక్యములు పలుకుచుండెను. ఆనరలోక పుష్పకోదండునిఁ బల్కరించి=నేను నానరలోక మన్మథుఁడయిన వసురాజును మాట్లాడించి, వనితామణియున్కియుఁ దెల్పి=మనగిరికాదేవియున్న యునికియు నాయనకు విశదపఱిచి, ఆత్మకుంబండువొనర్తునంచున్ = ఆయాత్మకు నుత్సవము సేయుదుఁగాక యని, నృపమంచసమంచిత=రాజుయొక్క మంచముదాపున నొప్పుచున్న, యంత్రపుత్త్రికా=కీలుబొమ్మలయొక్క, మండలిలోనన్ = గుంపులోపల, ఒక్కమణిమండితపుత్త్రికనై=నేనును రత్నమయమయిన యొక బొమ్మనై, రయంబునన్=శీఘ్రముగా, ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

రాజు మరల మరల దూషించి గిరిక నగడుసేయుట వలపు పరుసమున, ప్రతిక్రియ చెలియునికి యెఱుంగఁజేయుట అది భూలోకమన్మథుఁడగు రాజున కుత్సవకారణము. అందులకు మంజువాణి రాజును మఱియు సమీపించెను.

చ. పకపక నవ్వి యోవసునృ♦పాలక బాలిక దూఱె దేల సా
రెకుఁ బరతంత్ర లింతులు వ♦రింతురె కాంతులఁ దమ్ముఁదామ క
న్యకలకు నేరమా యది య♦నన్యగతిన్ సుదతిన్ మనోజబా
రికి నెరఁ జేసి లోఁ గనిక♦రింపనివారివి కాక నేరముల్. 89

పకపకనవ్వి=పకపకనవ్వినదానవై, ఓ వసునృపాలక=ఓ వసురాజా, బాలికదూఱెదేలసారెకున్=ఆచిన్నపడుచు నెందుకు పలుమాఱును నిందించుచున్నావు, పరతంత్రలింతులు=స్త్రీలు పరాధీనలు, వరింతురెకాంతులఁ దమ్ముఁదామ=కాఁబట్టి తమకుఁదామే పెనిమిటులను వరింతురా-అనఁగా వరింపరుగదా యనుట. కన్యకలకు నేరమాయది=అట్లువరింపకపోవుట పడుచులకు నేరమా-అనఁగా నేరముకాదనుట. ఇఁక నేమనిన, అనన్యగతిన్=మఱియొక రేలుకొనఁదగినవారు లేకయున్నట్టి, సుదతిన్=స్త్రీని, మనోజబారికి నెరఁజేసి=మన్మథబాధకుఁ బాల్పడఁజేసి, లోఁగనికరింపనివారివిగాక నేరముల్=మనస్సులో జాలిపడకుండెడువారివే తప్పిదములు గాక, కన్యకలు పురుషులను దామైవరింపకపోవుట నేరము గాదని సంబంధము. వసురాజు సంభాషణము పరిహాసపాత్రముగ నున్నది. కావునఁ బ్రౌఢయగుమంజువాణి పకపకనవ్వినది. ఇంతులు పరాధీనలు. అందు గిరికకన్యక తనకయి తాను వరింపఁజాలదు. ఈలోపము బాలికను వలపునకు గుఱియొనరించి కనికరించనిమగవానిది. అట్టిచో వసురాజు గిరికను దూషించుట యయుక్తము.

శా. మాయాశీలురు చంచలాత్ము లనుకం♦పాశూన్యు లాత్మైకకా
ర్యాయత్తు ల్సమయానుకూలహృదయ♦వ్యాపారగోపాయన్నో

పాయజ్ఞు ల్మగవార లాపయి మహీపాలు ర్మహావైభవ
శ్రీయోగాంధులు సెప్ప నేల మగవారిఀ నమ్మఁగా వచ్చునే. 90

మాయాశీలురు=కృత్రిమస్వభావులు, చంచలాత్ములు=నిలుకడలేని మనస్సుగలవారును, అనుకంపాశూన్యులు=దయారహితులును, ఆత్మైకకార్యాయత్తుల్=స్వకార్యపరులును, సమయానుకూల=అప్పటిసమయమునకుఁ దగునట్టులుగా, హృదయవ్యాపార=మనోవ్యాపారముయొక్క, గోపాయన=రక్షణమందలి, ఉపాయజ్ఞుల్=నేర్పు గుర్తెఱిఁగినవారును, మగవారలు=పురుషులు-అనఁగాఁ బురుషసామాన్యులే యిట్టివారనుట. ఆపయిన్=అందుమీఁదట, మహీపాలురు=భూపాలకులు, మహావైభవశ్రీయోగాంధులు=అధికవైభవసమృద్ధియొక్క సాంగత్యముచేతఁ గన్నుగాననివారు కాఁబట్టి, చెప్ప నేల=వారిమాటచెప్ప నేపనిలేదు. మగవారిన్నమ్మఁగావచ్చునే=మగవారినినమ్మవచ్చునా-అనఁగా నెన్నివిధములచేతను బురుషులను నమ్మనేకూడదనుట. అనుకంపయనుటకు- (ని. 'కృపా దయానుకంపా స్యా దనుక్రోశః' అని యమరము.) మగవారే కుటిలురు. అందు రాజులు ఐశ్వర్యయోగముచేఁ గనులు గలిగిన గ్రుడ్డివారు. మగవారిని నమ్మరాదు. ఐశ్వర్యవిశిష్టులగురాజుల నంతకుమున్నె నమ్మరాదనుట. అలం. కావ్యలింగము.

ఉ. అంటి ననంగ నంగజ నిభాంగుఁ డభంగురవిస్మయార్ణవం
బంటినచూడ్కితో విని ప్రియాహృదయానుశయాగ్నిసూచనం
గంటకితాఖిలాంగుఁ డయి కంతువనాటవిపాటఝాటసం
లుంటితమైనడెందము ఝులుక్కని పెక్కుతలంపు లూరఁగాన్. 91

అంటిన్=ఈప్రకారముగా నేనంటిని, అనంగన్ = అనఁగానే, అంగజనిభాంగుఁడు=మన్మథాకృతివంటి యాకృతిగల యావసురాజు, అభంగుర విస్మయార్ణవం బంటినచూడ్కితోవిని=అవిచ్ఛిన్నమయిన యాశ్చర్యసముద్రముచేత నావరింపఁబడిన చూపుతో విన్నవాఁడై, ప్రియా=ప్రియురాలయిన గిరికయొక్క, హృదయానుశయాగ్ని=హృదయతాపానలముయొక్క, సూచనన్=సూచనచేత, కంటకిత=గగురుపొడిచిన, అఖిలాంగుఁడయి=సకలావయవములు గలవాఁడై, కంతు=మన్మథుఁడనెడు, వనాట=కిరాతునియొక్క, విపాటఝాట=విదారణార్థమయిన శస్త్రవిశేషముచేత, (ని. 'ఝాటో నికుఞ్జే కాంతారే వ్రణాదీనాం చ మారణే' అని మేదిని.) సంలుంటితమయిన=లెస్సగా భేదింపఁబడిన, డెందము=హృదయము, ఝులుక్కని=ఝల్లుమని, పెక్కుతలంపులూరఁగాన్ = అనేకభావము లుదయింపఁగా-ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

ఉ. చారణకన్యయో ఖచరసారసగంధియొ కాక కిన్నరాం
భోరుహపాణియో చిలువపొల్తుకయో మఱి శైలకన్యకా
ధీరవయస్యయైనవనదేవతయో యొకమంజువాణి యే
తేరఁగఁ బోలు బాలగతిఁ దెల్పఁగ నిచ్చటి కద్భుతంబుగాన్. 92

చారణకన్యయో=చారణస్త్రీయో, ఖచరసారసగంధియొ = దేవతాస్త్రీయో, కాక=లేక, కిన్నరాంభోరుహపాణియో=కిన్నరస్త్రీయో, చిలువపొల్తుకయో=నాగకన్యకయో, మఱి=ఇదియునుం గాక, శైలకన్యకాధీరవయస్యయైన వనదేవతయో=కోలాహలశైలకన్యకయైన గిరికాదేవియొక్క

ప్రౌఢసఖియైన వనదేవతయో, ఒకమంజువాణి=మనోహరమయిన వాక్యములుగల యొకానొక స్త్రీ, బాలగతిఁ దెల్పఁగన్=గిరికయొక్క రీతిని దెలియఁజేసెదుగాక, ఇచ్చటికిన్=ఈస్థలమునకు, అద్భుతంబుగాన్=ఆశ్చర్యమగునట్టులుగా, ఏతేరఁగఁబోలున్=వచ్చియుండవచ్చును. వయస్య యనుటకు-(ని. 'ఆళి స్సఖీ వయస్యా చ' అని యమరము.)

గిరికకు వనదేవతలు దేవతాంగనలు చెలిమికత్తియలు. కావుననే మంజువాణియు బాలికయవస్థ యెఱిఁగింప నరుదెంచియుండును. మంజువాణిపేరు చెలికత్తెకుఁగూడ సరిపోవుట స్వారస్యము.

మ. అని యూహించి నదీతనూజతల పాహా! మామకప్రేమబం
ధనిమగ్నం బని పల్కు వింటి నిఁక నా తాపానలం బాఱెఁ బ్రా
క్తనపుణ్యంబు ఫలించెఁ బంచశరశస్త్రశ్రేణినిం జీరికిం
గొనఁ బో నే నిఁక నొక్కఁ డా ప్రియతమా ఘోరార్తికిం గుందెదన్. 93

అనియూహించి=పయినిఁ జెప్పఁబడినప్రకారముగా నూహించి, నదీతనూజతలఁపు=గిరికాదేవియొక్కమనస్సంకల్పము, ఆహా=ఆశ్చర్యము, మామక=నాసంబంధమయిన, ప్రేమ=అనురాగమనెడు, బంధ=బంధనమందు, నిమగ్నంబని=మునిఁగియున్నదని-అనఁగా నా గిరికాదేవియొక్క కోరిక నాయనురాగమందు లీనమైయున్నదని, పల్కువింటిన్=వచింపఁగా నాలించినవాఁడనైతిని, ఇఁక నాతాపానలం బాఱెన్=ఇఁకమీఁద నాయొక్క తాపాగ్ని చల్లారెను, ప్రాక్తనపుణ్యంబు ఫలించెన్=పూర్వసుకృతము ఫలించెను. ఏను=నేను, పంచశరశస్త్రశ్రేణినిం జీరికిం గొనఁబోన్=మన్మథాయుధపంక్తిని గణ్యముసేయనుగదా, ఇఁకనొక్కఁడు=ఇఁకమీఁద నొకటిగలదు. అదియేమనిన, ఆప్రియతమా ఘోరార్తికిం గుందెదన్=ప్రియతమురాలయిన యాగిరికయొక్క ఘోరమయిన వ్యథనుగురించి విచారపడుచున్నాను.

శా. నా డెందంబుననుండి కందెనొ కటా! నన్నాత్మలో నుంచి తా
వాడంబాఱెనొ నేనె తా నగుట నా వర్ధిష్ణుసంతాపచిం
తాడోలాకలనంబు దా నెనసెనో తథ్యంబు నావంకకై
తా డస్సెన్ నవలా యటంచు నొఱఁగెన్ దల్పప్రఘాణంబునన్. 94

నాడెందంబుననుండి కందెనో=విరహాగ్నితప్తమైన నాహృదయమందు నిలిచి కమలిపోయెనో, కటా=అయ్యో, నన్నాత్మలోనుంచి తావాడంబాఱెనో=లేక తపించుచున్న నన్నుఁ దనహృదయమందు నిల్పుకొని వాడిపోవుచున్నదేమో, లేక, నేనెతానగుటన్=నేనే తానైయున్నందున-అనఁగాఁ దన్ను ధ్యానముచేసి తనయొక్క తాదాత్మ్యమును బొందియున్న దగుటచేత ననుట. నా=నాయొక్క, వర్ధిష్ణు=వృద్ధినొందుచున్న, సంతాప=పరితాపముగల, చింతా=విచారమనెడు, డోలాకలనంబు=ఉయ్యెలయందలి యాందోళనమును, తానెనసెనో=తానుబొందెనో, తథ్యంబు నావంకకై తాడస్సె న్నవలా యటంచున్=మీఁదఁజెప్పిన యీమూఁడువిధములచేత నిశ్చయముగా నానిమిత్తమై గిరికాదేవి తాను శ్రమపడెనుగదా యని పలుకుచు, తల్పప్రఘాణంబునన్=శయ్యాంగణమందు, ఒఱఁగెన్=వ్రాలెను. కందుట, వాడఁబారుట, చింతనొందుట, బడలుట విరహావస్థావిశేషములు. ఇవియన్నియుఁ దననుండి కలిగిన యవస్థలుగావున గిరికాస్థితి రాజునకుఁ బరితాపకారణమయ్యెను. కావుననే శయ్యపై నొరిగి సంతాపాతిశయము ననుభవించెను. కందుట, వాడఁబారుట అనంగదశావిశేషములు.

చ. ఒఱఁగినఁ జూచి యానృపకు•లోత్తముచిత్తము కూర్మి కాత్మ ని
వ్వెఱపడి తాపవారకము • విస్మయనీయము నింతినెయ్యపు
న్గుఱుతును నైనమత్కరవి•నూతనహారము చేరఁ బోయి యా
నెఱదొరకంఠపీఠమున • నిల్పితి నిల్పఁ బ్రఫుల్లనేత్రుఁడై. 95

ఒఱఁగినఁజూచి = ఆరీతిగా శయ్యమీఁద వ్రాలఁగాఁ జూచి, ఆనృపకులోత్తము చిత్తముకూర్మికిన్=ఆరాజవంశశ్రేష్ఠునియొక్క మనఃప్రేమకు, ఆత్మనివ్వెఱపడి=చిత్తమందాశ్చర్యపడి, తాపవారకము=తాపమును బోఁగొట్టునదియును, విస్మయనీయమున్ = ఆశ్చర్యపడఁదగినదియు, ఇంతినెయ్యపున్గుఱుతును=గిరికాదేవియొక్క ప్రీతిపూర్వకమయిన యానవాలును, ఐన=అయినట్టి, మత్కరవినూతనహారము=నాచేతనున్న నవీనముక్తాహారమును, చేరఁబోయి = దగ్గరగాఁబోయి, ఆనెఱదొర కంఠపీఠమున నిల్పితిన్=ఆమహారాజుయొక్క కంఠపీఠికయందుంచితిని, నిల్పన్ = ఆలాగున నుంచఁగానే, ప్రఫుల్ల నేత్రుఁడై=వికసించిన నేత్రములు గలవాఁడై.

ఉ. అబ్బలభిన్నిభుండు మణి•హారముఁ దప్పక చూచి యౌర యెం
తబ్బుర మీయమూల్యమణి•హారము రాఁ గత మెద్ది యొకో యే
గుబ్బెతహార మొకో యిది • కూరిమి నేచెలి దెచ్చె నొకో హా
నిబ్బర మైనతాపము జ•నింపదు వో యిది మేను సోఁకఁగాన్. 96

అబ్బలభిన్నిభుండు=ఇంద్రసమానుఁడయిన యారాజు, మణిహారముఁ దప్పకచూచి = ముత్యాలహారమును ఱెప్పవేయక చూచి, ఔర=భళా, ఎంతబ్బురము=ఎంతయాశ్చర్యము, ఈయమూల్యమణిహారము=విలువలేని యీముత్యాలహారము, రాఁగతమెద్దియొకో=వచ్చుటకుఁ గారణమేమో, ఏగుబ్బెతహారమొకో=ఏజవరాలియొక్క హారమో, ఇదికూరిమి నేచెలిదెచ్చెనొకో=ఈహారము ప్రేమచేత నే స్త్రీ తీసికొనివచ్చెనో, హా=హా, ఇదిసుఖమం దనుకరణము. ఇది మేనుసోఁకఁగాన్=ఈహారము శరీరముతగులఁగా, నిబ్బరమయిన తాపముజనింపదువో = నిశ్చలమయిన తాపము పుట్టకయున్నదిగదా. బలభిన్నిభుం డనుటవలన వసురాజు సౌభాగ్యాతిశయము సూచితము. తప్పకచూచుట ప్రేమాతిశయమువలన, ముత్తెపు హారములు తాపనివారణములు గావున నిఁక విరహతాపము జనింపదని నిశ్చయించుకొనెను. హారము మణిమయము. అమూల్యము నగుటవలన ఎవతెహారము ఎవరు తెచ్చిరి. ఎటులవచ్చెనని వసురాజు సంశయించెను.

హారములు తాపనివారణము లనుటకు—

శ్లో. 'సచందనాంబువ్యజనోద్భవానిలైః సహారయష్టి స్తనమండలార్పణైః
సవల్లకీకాకలిగీతనిస్వనై ర్విబోధ్యతే సుప్తఇవాద్య మన్మథః.' గీష్మర్తువర్ణనము. ఋ-సం.

శా. ఈహారం బొకమాటు పిమ్మటికి నే • నెచ్చోటనో కన్నయ
ట్లూహం బయ్యెడి నీయమూల్యమణిహా•రోత్తంసముం జిత్రక
న్యాహారంబు నుదారవైఖరి నొకం • డై తోఁచె నీహార మా
నీహారాద్రిజకన్యహార మగు సం•దేహంబు లేదెంతయున్. 97

ఈహారంబు=ఈముత్యాలహారము, ఒకమాటు=ఒకసారి, పిమ్మటికిన్=వెనుకటికి-అనఁగా ముందు, నేనెచ్చోటనో కన్నయట్లూహంబయ్యెడిన్=నేనెక్కడనో చూచినట్టులుగాఁ దోఁచుచున్నది, ఈయమూల్యమణి హారోత్తంసమున్ = విలువలేని యీముత్యాలహారంబును, చిత్రకన్యాహారంబును = చిత్తరువుపలకయందలి చిత్రితగిరికయొక్క ముత్యాలహారంబును, ఉదారవైఖరి నొకండైతోఁచెన్= అతిశయరీతిచేత నొక్కటిగాఁ గనుపడెను. కాఁబట్టి, ఈహారము = ఈముత్యాలహారము, ఆనీహారాద్రిజకన్య హారమగున్ = హిమాచలనందనుఁడయిన కోలాహలుని కొమార్తెయొక్క హారమేయవును, సందేహంబులే దెంతయున్=ఇందు కొంతమాత్రమును సంశయములేదు.

ఊహాశబ్దమునకు('సంభావనం యదిత్థం స్యా దిత్యూహో న్యస్య సిద్ధయే') అని చంద్రాలోకమునందుఁ బ్రయోగము. ఒకండనునది యమహత్తయిన హారమునకు విశేషణంబైనను డుజ్జువచ్చినది. ఇందుకు- శ్లో. 'క్వచిదమహతోపిడుజ్స్యాత్' అని శబ్దానుశాసనసూత్రము. ఈసూత్రమందలి యపిశబ్దమువలననే కాదిశబ్దములకును డుజ్జువచ్చునని యర్థము. ఇదిగాక 'ఏకాదేరమహతాంచడాపున్న' అనెడు శబ్ధానుశాసనసూత్రముచేత డుజ్ వర్ణము పరమయ్యుండినను ఉత్వమురాదయ్యెనని గ్రహింపవలయును.

మాలినీవృత్తము. అని విభుఁ డెద నుంచున్ ♦ హార మందందఁ గాంచున్
గనుఁగవఁ గదియించున్ ♦ గంఠపీఠిన్ ఘటించున్
దను వఖిలము చేర్చుం ♦ దత్క్షణస్వేదధారా
ఘననయనజలంబుల్ ♦ గాఢతన్మైత్రిఁ జూపున్. 98

అని=ఇట్లనిపలికి, విభుఁడు=వసురాజు, హారము=ముత్యాలహారమును, ఎదనుంచున్=రొమ్ముమీఁద నిలుపును, అందందఁ గాంచున్ = మాటిమాటికిని జూచును, కనుఁగవఁ గదియించున్=నేత్రయుగళమందుఁజేర్చును, కంఠపాళిన్ ఘటించున్ = కంఠపీఠికయందుఁ గూర్చును-అనఁగా మెడను ధరించుకొనును, తనువఖిలముచేర్చున్=శరీరమందంతట హత్తించును, తత్క్షణ = ఆక్షణమందయిన, స్వేదధారా=శ్రమజలధారలచేత, ఘన=అధికమగుచున్న, నయనజలంబుల్=బాష్పజలములను, గాఢతన్మైత్రిన్=దృఢమైన యాగిరికాదేవియందలి స్నేహభావమును, చూపున్=కనుపఱుచును. ఈమాలినీవృత్తమునకు న న మ య య గణము లుండవలయును. తొమ్మిదవయక్షరము యతిస్థానము.

క. ఈగతి నారా జుపకం, ఠాగతనక్షత్రదామ ♦ మభినవకరసం
యోగమున గారవించుచు, రాగోపనిబద్ధబంధు♦రంబుగఁ బల్కెన్. 99

ఈగతిన్=ఈప్రకారముగా, ఆరాజు=ఆవసురాజు అని యర్థము. ఆచంద్రుఁడని యర్థాంతరము ఉపకంఠాగత నక్షత్రదామము=కంఠప్రాప్తమైన నక్షత్రమాలికయనెడు ముక్తాహారము ననియర్థము. ని. 'సైవనక్షత్రమాలా స్యా త్సప్తవింశతిమౌక్తికైః' అని అ. ఉపకంఠ=సమీపమునుగూర్చి, ఆగత=వచ్చిన, నక్షత్రదామము=అశ్విన్యాది నక్షత్రసమూహము నని యర్థాంతరము. అభినవకరసంయోగమున గారవించుచున్=నూతనహస్తస్పర్శముచేత మన్నించుచు నని యర్థము. కిరణస్పర్శముచేత మన్నించుచు నని యర్థాంతరము. ఇంతపర్యంతమును బ్రకృతాప్రకృత శ్లేషాలంకారము. రాగ=స్వరవిశేషముచేతను ననురాగముచేతను, ఇక్కడ నర్థద్వయంబును బ్రకృతపరముగానే చూడవలయును. ఉప

బద్ధ=కట్టఁబడినదై, బంధురంబుగన్=మనోహర మగుచుండునట్లుగా, పలికెన్=పచించెను. అనఁగా స్వరభేదము ననురాగమును గనుపడునట్లుగా వచించెననుట. ఏమనిన,

మ. కమనీయద్యుతిధామమా విమలము♦క్తాదామమా సేమమా
కమలామోదకుఁ దత్సఖీసమితికిం ♦ గల్యాణమా తన్మరా
ళమయూరీశుకశాబశారికల కె♦ల్లన్ భద్రమా తెల్పుమా
ప్రమదారత్నము పేరుగా నెద నినుం ♦ బాటించి ప్రార్థించెదన్. 100

కమనీయ=మనోహరమైన, ద్యుతి=కాంతికి, ధామమా=స్థానమైనదానా, ఇక్కడ ధామశబ్దము ద్యుతివాచకమును గనుకఁ బునరుక్తవదాభాసాలంకారము. విమల=స్వచ్ఛమైన, ముక్తాదామమా=మౌక్తికహారమా, కమలామోదకున్=పద్మగంధియైన గిరికాదేవికి, సేమమా=కుశలమా, తత్సఖీసమితికిం గల్యాణమా=ఆగిరికయొక్క సఖీసమూహమునకు శుభమా, తత్=ఆగిరికయొక్క, మరాళ=పెంపుడుహంసలకును, మయూరీ=ఆఁడునెమళ్ళకును, శుకశాబ=చిలుకపిల్లలకును, శారికలకున్=గోరవంకలకును, ఎల్లన్=అన్నిటికిని, భద్రమా=సుఖమా, తెల్పుమా=తెలియఁజెప్పుము. ఏమనిన, ఆ ప్రమదారత్నముపేరుగా నెద నినుం బాటించి ప్రార్థించెదన్ = స్త్రీరత్నమయిన యాగిరికాదేవి మారుగా వక్షస్స్థలమందు నిన్ను మన్నించి వేఁడుకొనుచున్నాను అని అర్థము. ఆగిరికాదేవియొక్క ముత్యాలపేరుగా నిన్ను వక్షస్స్థలమందు మన్నించుచున్నానని భావము. కమలామోద యనుటవలన నాయిక పద్మినీజాతియనుట, సఖీజనులు వలపుగొలుపుటలోఁ జెలిమి నెఱపిరి గావున వారిసేమమును దెలిసికొనుట, మరాళమయూరాదులు గిరికనెచ్చెలులు విరహోద్దీపనదాయకములు. గిరికవలపు మిక్కుటము చేయుటకుఁ దనయందామెను బద్ధానురాగ నొనర్చుటకు నవియె ప్రధానములుగాన వాని సేమమును దెలిసికొనఁ గోరెను.

మ. నిను భాగ్యాక్షరపంక్తిగాఁ దలఁతునో ♦ నిర్వేలమూర్ఛాపనో
దనదివ్యామృతధారగా మనమునం ♦ దర్కింతునో కాక మ
ద్ఘనపుణ్యద్రుమకోరకావళియ కాఁ ♦ గన్గొందునో ప్రేమ నే
మని వర్ణింతుఁ బ్రియాపయోధరవిహా♦రా హారవంశోత్తమా. 101

ప్రియా=ప్రియురాలైన గిరికయొక్క, పయోధర=కుచములమీఁద, విహార=విహరించునట్టి, హారవంశోత్తమా=ముక్తాహార కులశ్రేష్ఠమా, నినున్=నిన్ను, భాగ్యాక్షరపంక్తిగాఁదలఁతునో=మాయొక్క భాగ్యవర్ణశ్రేణినిగా విచారింతునా, నిర్వేల=అమితమైన, మూర్ఛా=నన్నుఁబొందిన మూర్ఛయొక్క, అపనోదన=పోఁగొట్టుట యందలి, దివ్యామృతధారగాన్=యోగ్యమైన యమృతధార యగునట్టులుగా, మనమునందర్కింతునో=మనస్సునం దూహింతునా, కాక=అట్లుకాక, మత్=నాయొక్క, ఘన=అధికమయిన, పుణ్య=సుకృతమనెడు, ద్రుమ=వృక్షముయొక్క, కోరకావళియ కాన్=పూమొగ్గలయొక్క పంక్తినిగానే, కన్గొందునో = చూతునా, ప్రేమ నేమనివర్ణింతున్ = నాకునీయందుండెడు ప్రేమచేత నేమనికొనియాడుదును-అనఁగాఁ గొనియాడఁజాల ననుట.

హారవంశోత్తమా యనెడు సంబోధనమందును తద్విశేషణమయిన ప్రియాపయోధరవిహారా యనెడు సంబోధనమందును మువర్ణకము చెప్పనందుకు నధర్వణవచనము. శ్లో. 'అఙ్గభృఙ్గాదిశబ్దే

భ్యోమ్యాది రామంత్రణేతువా' అని చెప్పంబడియున్నది. హారము సామాన్యమైనదికాదు. హారవంశోత్తమము కావుననే ప్రియాపయోధరప్రాంతవిహారభాగ్యాతిశయమును గడింపఁగలిగెను. హారగత రత్నములు పుణ్యాక్షరపంక్తివలెను, హారమువరుస అమృతధారవలెను, హారమణులు కోరకములవలెను నుండెనని భావము. ప్రియమైనదానిని సౌభాగ్యాక్షరపంక్తిగా వర్ణింతురు. ఇందులకు-

శ్లో. 'సౌభాగ్యాక్షరమాలికేవ లిఖితం పుష్పాయుధేన స్వయం
మధ్యస్థాపి కరోతి తాపమధికం రోమావళిః కేనసా.' (భర్తృహరి.)

చ. వనజముఖీ కుచోపరినివాససుఖోన్నతి నున్కి మాని నా
మనికిత మార్ప వచ్చితివి మౌక్తికహారమ నీగుణంబు లే
మని వినుతింతు నట్టిద కదా యవదాతసువృత్తమూర్తు లెం
దును నిజసౌఖ్యభంగము గనుంగొన రార్తులఁ బ్రోచువేళలన్. 102

వనజముఖీ=గిరికాదేవియొక్క, కుచోపరి=స్తనములయొక్క యుపరిభాగమందలి, నివాస సుఖోన్నతిన్=నివాసమువలని సుఖాతిశయముచేత, ఉన్కిన్=ఉండుటను, మాని=విడిచిపెట్టి, నామనికిత మార్పవచ్చితివి=నాయొక్క మనోవ్యథను బోఁగొట్టవచ్చినదానవైతివి, మౌక్తికహారమ = ముక్తామణి హారమా, నీగుణంబు నేమనివినుతింతున్=నీయొక్క సద్గుణము లేమని కొనియాడుదును - అనఁగాఁ గొనియాడఁజాల నని యర్థము.

ముత్యాలయొక్క ఆణి సుపాణి సుతారము లనెడు మూఁడుగుణములని భావము. ఇందుకు ప్రమాణము-

క. 'అఱలేని చుక్క తెఱఁగున, మెఱయుం సుతారంబు మేలిమిగ వట్రువయై
మెఱుఁగొందు పాణి ఘనమై, నెఱసిరివట్రువ సుపాణి నిర్మలకాంతిన్.'

అని రత్నపరీక్షయందు, అట్టిదకదా = అదియుక్తమేకదా. ఏమనిన, అవదాత = పరిశుద్ధమైన, సువృత్త=సద్వర్తనముగలిగిన, మూర్తులు=స్వరూపముగల సుజనులని యర్థము. ముత్యములు శుభ్రంబును వర్తులంబునైన మూర్తిగలవని భావము. (శ్లో. 'అవదాత స్సితే పీతే విశుద్ధే ప్రవరే పిచ.' అని వి.) ఎందును=ఎక్కడను, ఆర్తులఁ బ్రోచువేళలన్=వ్యథపడుచున్నవారిని రక్షించు సమయములయందు, నిజసౌఖ్యభంగముగనుంగొనరు=తమయొక్క సౌఖ్యము చెడిపోవుటను విచారింపరు.

వనజముఖీ కుచోపరినివాసము సుఖోన్నతి. అదిమానివచ్చుట రాజుమనోవ్యథ పోకార్చుటకు, అట్టిరాకగలవానిగుణములు అనిర్వాచ్యములు. నిజసౌఖ్యభంగము పుణ్యాత్ములుపాటింపరనుట కిదియె తార్కాణము. సువృత్తము లనుటవలన హారమణులు వట్రువగను అవదాత యనుటవలనఁ దెల్లగను నున్నవనిభావము. హారము శ్వేతగణములోనిదనుటకు సరస్వతీప్రార్థనము చూచునది.

చ. చెలుల మొఱంగి నాఁడు మణిచిత్రగృహంబున మోము వాంచి తో
య్యలి భవదేకదర్శితమదాకృతిఁ జూచెఁ గదా వినీలకుం
తలహృదయంబు నీకు విదితంబు గదా యిఁక దాచ నేటికిన్
వెలఁదిమనంబు దెల్పఁ గదవే మణిహారమ నిన్ను వేఁడెదన్. 103

చెలుల మొఱంగి=చెలికత్తియలను వంచనచేసి, నాఁడు=అనఁగా నే నక్కడికివచ్చియున్న నాఁడు, మణిచిత్రగృహంబునన్=రత్నచిత్రితమయిన గృహమందు, మోమువాంచి=సిగ్గుచేత ముఖము

వంచుకొని, తొయ్యలి=గిరికాదేవి, భవదేకదర్శితమదాకృతి=నీచేత ముఖ్యముగానట్టులుగాఁ గనుపడిన - అనఁగా నీయందుఁ బ్రతిఫలించిన నాయొక్క రూపమును, చూచెఁగదా = చూచెనుగదా, వినీలకుంతల హృదయంబు నీకు విదితంబుగదా=ఆగిరికయొక్క మనస్సు నీకుఁ దెలియఁబడియున్నదిగదా యని యర్థము. ఆగిరికయొక్క వక్షస్థలము నీకుఁ దెలియఁబడియున్నదిగదా యని భావము. ని. 'హృదయం మానసో రసః' అని వి. ఇఁక దాచ నేటికిన్ = ఇఁకమీఁద దాచిపెట్టవలసిన దేమి, వెలఁదిమనంబు దెల్పఁగదవే=గిరికాదేవియొక్క మనం బేలాగునున్నదో తెలియఁ జెప్పఁగదవే, మణిహారమ=ముక్తామణిహారమా, నిన్ను వేఁడెదన్=నిన్ను బ్రార్థించుచున్నాను. అని వెనుకకన్వయము.

గిరికరాజునుజూచి సిగ్గుపెంపునఁ దలవాల్చినది. కావున రాజదర్శనము హారమణియందుఁ దక్కఁ గనుపింపదుగావున భవదేకదర్శితమని చెప్పఁబడెను. హృదయము విదితమనుటవలన గుబ్బలనొరసియుండుగావున నాయికతలంపు నెఱింగియుందువనుట.

ఉ. గ్రావసుతాకుచాగ్ర పరి♦రంభ నిగుంభసుఖోపలంభ సం
భావిత భావిమత్కరవి♦మర్దన కోఁడకుమీ విశుద్ధము
క్తావలి బాలికానవస♦మాగమయోగ్యమహోపలాలన
శ్రీ వెలయింతుఁ గాని నినుఁ ♦ జిక్కులఁ బెట్టఁ జుమీ రయంబునన్. 104

గ్రావసుతా=పర్వతపుత్త్రియైన గిరికాదేవియొక్క, ని. 'గిరి గ్రావా చల శైల శిలోచ్చయాః' అని అ. కుచాగ్ర=చనుమొనయొక్క, పరిరంభనిగుంభ=ఆలింగనసంఘటనమువలననైన, సుఖోపలంభ=ఆనందానుభవముచేత, సంభావిత=పూజితమయినదానా, ఇక్కడ గ్రావసుత యన్నందునఁ గుచములయందుఁ గాఠిన్యము స్ఫురించుచున్నది. భావిమత్కరవిమర్దన కోఁడకుమీ=ముందుగలుగఁబోయెడు నాయొక్క హస్తపీడనమునకు భయపడఁబోకుమీ, విశుద్ధముక్తావళి=పరిశుద్ధమైన ముక్తామణిమాలికా యని యర్థము. శుభ్రవర్ణము గలదని భావము. బాలికా=గిరికాదేవియొక్క, నవసమాగమ=ప్రథమసంగమమునందు, యోగ్య=ఉచితమయిన, మహోపలాలనశ్రీ వెలయింతుఁగాని=మహత్తరమయిన బుజ్జగింపు సంపదచేత నుల్లసింపఁజేయుదునేకాక, నినుఁ జిక్కులఁబెట్టఁజుమీ రయంబునన్=త్వరితముగా నిన్ను మనికితములఁ బెట్టనుసుమా యని యర్థము. చిక్కుపఱుప నని భావము.

ముక్తావలి విశుద్ధమైనది. అనఁగా నిష్కళంకమైనది. కావున నిట్టిదానికిఁ జిక్కులుగూర్పఁజనదు. గిరికతో జరుగనున్నది నవసమాగమము. అందు యోగ్యములగు మహోపలాలనములుండును. అట్టిచో బుజ్జగించుచుఁ గుచములనంటుట తటస్థించునుగావున ముక్తావలి చిక్కులపాలుగావలసిన యవసరముండదనిభావము.

శా. శుక్తిక్రోడకుటీగుహావసతి వై ♦ సూచ్యగ్రసంస్థాయి వై
ముక్తాహారమ వై భజించితి గదా ♦ ముగ్ధాకుచద్వంద్వసం
సక్తిం దాదృశభూతి తావకకృపా♦సంసిద్ధిలే కబ్బునే
ముక్తాహారత నున్నయంతనె తలం♦పు ల్నింపు నా కింపుగాన్. 105

శుక్తిక్రోడకుటీగుహావసతివై - శుక్తి = ముత్తెపుచిప్పయొక్క, క్రోడ=మధ్యప్రదేశమనెడు, కుటీగుహా=కుటీరమువంటి గుహయందలి, వసతివై=ఉనికిగలదానవై, సూచ్యగ్రసంస్థాయివై = సూది

మొనమీఁద నిలిచినదానవై, ముక్తాహారవవై=వర్జింపఁబడిన యాహారముగలదానవై యనియర్థము. అనఁగా నీచెప్పఁబడిన గుహావసతియును సూచ్యగ్రసంస్థాయిత్వమును నిరాహారత్వమును దపశ్శాలురయొక్క ధర్మములుగనుక నట్టి తాపసధర్మములు గలదానవై, తపస్సుచేసినదానవై యనుట. ముత్తియములు ముత్తెపుచిప్పయందుండు చున్నవియును సూదిమొనచేత రంధ్రముచేయఁబడుచున్నవియును గనుక వానిచేతఁ గూర్పఁబడిన హారమనిభావము. ముగ్ధా = నవోఢయైన గిరికయొక్క, కుచద్వంద్వ=స్తనద్వయముయొక్క, సంసక్తిక్=సంపర్కమును, భజించితిగదా=పొందితివిగదా, ముక్తాహారతనున్నయంతనె=గుహావాసమును సూచ్యగ్రనివాసమును చేయలేక నేను నిరాహారత్వమాత్రముచేత నున్నందువలననే, తాదృశభూతి=అనఁగా నీచేత సంపాదింపఁబడిన గిరికాకుచసంపర్కరూపమయిన వైభవము, తావకకృపాసంసిద్ధిలేకబ్బునే=గుహావాసమును సూచ్యగ్రనివాసమును నిరాహారత్వమును గలిగిన నీకృపాపరిపాకము లేకయే ప్రాప్తమగునా, కాఁబట్టి, తలంపుల్నింపునాకింపుగాక్=నాకిష్టమగునట్టులుగాఁ గోరిక లొనగూర్చుము - అనఁగా గిరికాకుచసంపర్కము గలుగఁజేయుమని యర్థము. నిరాహారత్వమును ముక్తావళిత్వముగా నధ్యవసించి తనయందు ముక్తావళిత్వమాత్రమును దెలిపి నీవలె నేనును ముక్తావళిని గనుక నాకును సంపర్కయోగ్యత యున్నందునఁ దత్ప్రాప్తి నొనఁగూర్పుమని ప్రకారాంతరము.

ముత్తెపుఁజిప్పలయందుఁ జిరకాలము నివసించి సూది బెజ్జములకోర్చి చేరులుగానుంటచే ముగుదగుబ్బలపై నధివసించుసౌభాగ్యాతిశయము లభించెను. ఇతరసుకృతాతిశయములులేక కేవలముక్తాహారత (ఆహారవిసర్జనము) నొందినరాజున కాయదృష్టమెట్లు కలుగును? ముత్యములు గుహాలలో సూదిపై నిలిచి తపముజేసి యాహారాదుల మానుటవలననే పూర్వోక్తసుకృతాతిశయము కలిగెనని భావము. అలం. శ్లేషము.

ఉ. చిన్నటనాఁట నుండియును ♦ జెల్వకుఁ గూర్చినదానవౌట నేఁ
డెన్నిక కెక్కఁ దద్వ్యథకు ♦ నీవును గుందితి గాన సద్గుణా
భ్యున్నతరత్నమాలిక య♦యో నిను మచ్ఛ్రమశీకరార్ద్రిమో
ఛిన్నవగంధసారముల♦చేఁ దెలి వొందఁగఁ జేయు టెన్నఁడో. 106

చిన్నటనాఁటనుండియును=చిన్నప్పటినుండియు, చెల్వకుఁ గూర్చినదానవౌట=గిరికాదేవికాప్తమయినదానవైనందున నని యర్థము. గిరికాదేవికొఱకు సఖులచేతఁ గూర్పఁబడినదానవని భావము. సఖుల నధ్యాహరింపవలయును. (ఇక్కడ, శ్లో. 'అన్యస్యాః క్వచిద్భవేచ్ఛాన్యా' శ్లో. 'కర్మాదేః కర్తృత్వం ప్రథమాచ నవర్ణకశ్చ తద్వత్స్యాత్' అనెడు శబ్దానుశాసన సూత్రద్వయముయొక్క యర్థమును విచారింపవలయును.) నేఁడెన్నికకెక్కక్=నేఁడు ప్రసిద్ధికెక్కునట్టులుగా, తద్వ్యథకు నీవును గుందితి=ఆగిరికాదేవియొక్క విరహవ్యథకు నీవును డస్సినదానవయితివి అని యర్థము. గణనకెక్కినదనియును గిరికాదేహతాపముచేతఁ గందినదనియును భావము. కానక్ = కాఁబట్టి, సద్గుణాభ్యున్నతరత్నమాలిక = సఖ్యపాలనరూప సద్గుణములచేత నతిశయించిన మణిహారమా యని యర్థము. సూత్రమునందు నొకదానిమీఁద నొకటిగాఁగూర్పఁబడి యున్నతస్థితినొందిన రత్నములయొక్క మాలికయని భావము. అయో = అకటా, నినుక్=నిన్ను, మత్=నాయొక్క, శ్రమ=రతిశ్రమవలనఁ బుట్టిన,

శీకర=జలకణస్రవణముచేత-అనఁగాఁ జిఱుచెమటచేత, ఆర్ద్ర=తడిసిన, యోషిత్=గిరికాదేవియొక్క, నవ=నూతనమయిన, గంధసారములచేన్=చందనములచేత, తెలివొందఁగఁజేయు టెన్నఁడో=ఉల్లసింపఁజేయు టెన్నటికో కదాయని యర్థము. కందు పోఁగొట్టుట యనిభావము. గంధసారప్రభృతి వస్తుచూర్ణసమేతజలములయందుఁ గందు పోవుట ప్రకటము కదా.

ఆబాల్యస్నేహముచే గిరికాశరీరతాపమును భరించి రత్నమాలిక కందిపోయినది. ఇది సద్గుణాఢ్యున్నత రత్నమాలికకు రాఁదగనియవస్థ. దీనికి ప్రతికృతి తడిసినగంధముతోఁ గలియతోముట. అటులొనరించినఁ దావియుఁ బూర్వకాంతియుఁ గలుగును. ఇవి వసురాజు గిరికతోఁ దొలికూటమి చేయునపుడు రాజుమేనిచెమట గిరికగుబ్బలపైఁగల గందపుఁబూఁతతోఁగలిసి రొంపి యగునపుడు తటస్థించునని భావము.

మ. అని రాజేంద్రుఁడు రత్నపుత్త్రిఁ గని యీ • హారాధిరాజంబుఁ దె
చ్చిన యోయప్రతిమోపకార సుకృత • శ్రీగణ్య దాక్షిణ్యశా
లిని నీకుం బ్రతిమాపదేశ మిఁక నే • లే పల్కవే సన్నిధిన్
వనితావల్లభజీవితంబులు సఖీ • వాక్యస్థితంబు ల్గదే. 107

అని=ఈలాగని, రాజేంద్రుఁడు=రాజశ్రేష్ఠుఁడు, రత్నపుత్త్రిఁగని=రత్నమయమైన ప్రతిమను జూచి, ఈహారాధిరాజంబుఁ దెచ్చిన=ఈహారశ్రేష్ఠమును దీసికొనివచ్చిన, ఓయప్రతిమోపకారసుకృతశ్రీగణ్య దాక్షిణ్యశాలిని - అప్రతిమ=సమానరహితమయిన, 'ఉపకార = ఉపకృతిరూపమయిన, సుకృతశ్రీ=పుణ్యసమృద్ధిచేత, గణ్యా=కొనియాడఁదగిన, దాక్షిణ్యా=పరకార్య నిర్వహణ శక్తిచేత, శాలిని=ఒప్పుచున్నదానా యని యర్థము. అప్రతిమా=ప్రతిమగానిదానియొక్క, ఉపకారసుకృతశ్రీగణ్యాదాక్షిణ్యశాలిని యని యర్థాంతరము. నీకున్=ఈలాటినీకు, ప్రతిమాపదేశ మిఁకనేలే=ప్రతిమ యనెడు వ్యాజ మిఁకమీఁద నెందుకు, పల్కవే సన్నిధిన్=సమ్ముఖమందు మాటాడవే, వనితావల్లభజీవితంబులు=నాయికానాయకులయొక్క బ్రతుకులు, సఖీవాక్యస్థితంబుల్గదే=దూతికావాక్యములయందున్నవే కదే. అలం. కావ్యలింగము.

సీ. అన విని రఘునంద • నుని సన్నిధిఁ బ్రభూతచైతన్య యై నిల్చు • చట్టు పోలఁతి
కరణి రత్నపుబొమ్మ • గతి మాని ధృతి పూని క్షితిజానికి జొహారు • చేసి నిలిచి
పలికెతి నోమహా • భాగ తావకమహామహితోక్తి దప్పునే • మంజువాణి
నచలకన్యకబోటి • నగుదుఁ గన్నియయున్కిఁ దెలుపవచ్చితిఁ గదా • తెలియవనిట్లు
తే. పంచశర శాతశర హేతి • పాలు చేసి, తిరిగిచూడవు దగునయ్య • దొరలకెందు
మఱపుగలిగిన ననదల • మఱతురయ్య, వెలఁది దూఱినదూఱులు • వినఁగదయ్య.

అనవిని=ఈలాగనిరాజుపలుకఁగావిని, రఘునందనుని సన్నిధిన్ = రఘురాముని సన్నిధానమందు, ప్రభూత=పుట్టిన, చైతన్యయై=చేతనభావముగలదై, నిల్చు=నిలువఁబడిన, చట్టుపోలఁతికరణిన్=పాషాణరూపమైన యహల్యవలె, రత్నపుబొమ్మగతిమాని=మణిపుత్త్రికనై యుండుటమాని, ధృతిపూని=ధైర్య మవలంబించి, క్షితిజానికి జొహారుచేసి నిలిచి=భూకాంతునకు దండము సమర్పించి నిలువఁబడి, పలికెతిన్=సంభాషించితిని. ఏమని యనిన, ఓమహాభాగ = మహాభాగ్యవంతుఁడ వయిన

వాఁడా, తావక మహామహితోక్తి దప్పనే = నీయొక్క ఘనమయిన సత్యవాక్య మబద్ధమగునా, కాఁబట్టి, మంజువాణి నచలకన్యకబోటి నగుదున్ = నేను మంజువాణి యనెడు పేరుగలదానను గిరికాదేవిచెలికత్తియను నవుదును. ఇక్కడ, చారణకన్యరో యనెడి ౯౨వ పద్యమందలి మఱిశైలకన్యకాధీరవయస్యయైన వనదేవతయో, యనెడి వాక్యమును మంజువాణియనెడిపదమును ననుసరించిచెప్పినాఁడు. కన్నియయున్కిఁ దెలుపవచ్చితినిగదా=గిరికాదేవి యున్నయునికిఁ దెలియఁ జేయవచ్చినానుసరేకదా,

తెఱవన్=ఆచిన్నదానిని, ఇట్లు=ఈప్రకారముగా, పంచశర=మన్మథునియొక్క, శాత=వాడిగలిగిన, శర=బాణములయొక్క, హేతి = అగ్నిజ్వాలలయొక్క, పాలుచేసి=వశముచేసి - అనఁగా మన్మథబాణాగ్నిజ్వాలల కొప్పగించి, తిరిగిచూడవు తగునయ్యా=అటకై తిరిగిచూడక యున్నావుగదా యిదినీకుఁ దగునటయ్యా, దొరలకెందు మఱపుగలిగినన్=ప్రభువులకు మఱిదేనియందు మఱపుగలిగినప్పటికిని, అనదల మఱతురయ్యా=అనన్యగతికులైన దీనులను మఱచిపోదురటయ్యా, వెలఁదిదూఱిన దూఱులు వినఁగదయ్యా=మాగిరికాదేవి నిన్నుగుఱించి నిందించినమాటలు కొన్నిగలవు వాని వినఁగదయ్యా వసురాజేంద్రా. దుర్బలస్య బలం రాజా యన్నటులఁ బ్రభువు లనదలకాపాడుట ధర్మము. విరహతాపమునకుఁ జెలిని గైవసముజేసి చూచిచూడనటులుంట తగదు. మన్మథుఁడుకాఁడు వాఁడు పంచశరుఁడు. వానిములుకులు సామాన్యములుగావు శాతశరములు. శరకాంతులుజ్వాలలు. ఇంతకుఁ జెలియ యోరువఁజాలదు. వలపు పెంపుసైపలేక నిన్నుదూఱినది. ఆనిందావాక్యములు విన్నయామె మోహాతిశయము ద్యోతకమగును గావున నాపలుకులు వినఁదగినవి.

ఉ. తావకశైలభేదనక♦థాబిరుదాంకము లేము పేర్కొనం
దా విని వెచ్చ నూర్చి వని♦తామణి నిత్యకఠోరము ల్కుల
గ్రావము లండ్రు వానిఁ బద♦ఘట్టనఁ గీ టడఁగించినట్టిగో
త్రావరుఁ డింక నేమిటఁ గ♦రంగు నయో యని నించు బాష్పముల్. 109

తావక=నీయొక్క, శైలభేదనకథా=కోలాహలపర్వత భంజనచరిత్రతోఁగూడిన, బిరుదాంకములు=బిరుదావళులు, ఏము పేర్కొనన్=మేమువచింపఁగా, తావిని=తానువిన్నదై, వెచ్చనూర్చి=వేఁడినిట్టూర్పులు పుచ్చి, వనితామణి=గిరికాదేవి, నిత్యకఠోరముల్కులగ్రావములండ్రు=ఎప్పటికిని కఠినములఁ కులపర్వతములని చెప్పుదురు, వానిఁ బదఘట్టనఁ గీటడఁగించినట్టి=అట్టికులపర్వతములను పాదఘట్టనముచేత గర్వభంగముచేసినట్టి, గోత్రావరుఁడు=భూకాంతుఁడు-అనఁగా వసురాజు, ఇంక నేమిటఁ గరంగున్=ఇఁకమీఁద దేనిచేతఁ గరఁగుచున్నాఁడు - అనఁగా మెత్తఁబడుచున్నాఁడు, అయోయని=అక్కటాయని, నించుబాష్పముల్=కన్నీరునించును. వెచ్చనూర్చుట నిరాశావశమున.

మ. జనలోకస్పృహణీయభవ్యసుషమా♦సౌభాగ్యముల్ భాగ్యవ
జ్జనభోగానుగుణత్వముం దదితరా♦శానిత్యదైన్యవ్యథా
జనకత్వంబును గల్గఁ జూచియొ ధరా♦జంభారి కంభోజజుం
డొనరించెన్ వసునామ మంచు నవలా♦యూహించు మోహంబునన్. 110

జనలోక=జనసమూహమునకు, స్పృహణీయ=ఆశింపఁదగిన, భవ్య=యోగ్యమయిన, సుషమా సౌభాగ్యమున్=ఉత్కృష్టకాంతి సుభగత్వమును, ని. 'సుషమా పరమాశోభా' అని అ. భాగ్యవజ్జన భోగానుగుణత్వమున్=భాగ్యవంతులకు భోగానురూపత్వమును, తదితరాశా నిత్యదైన్యవ్యథాజనకత్వంబును=అభాగ్యులకు నాశాదైన్యక్లేశసంపాదకత్వమును, కల్గఁజూచియు=ఉండఁజూచియే కాఁబోలును, ధరాజంభారికిన్=భూదేవేంద్రునికి, అంభోజజుండు=బ్రహ్మదేవుఁడు, వసునామము=వసువనెడి నామధేయమును, ఒనరించెన్=చేసెను. అంచున్ = అని యీప్రకారముగా, నవలా యూహించు మోహంబునన్=గిరికాదేవి వ్యామోహముచేత నూహించును. వసువనఁగాఁ గాంచనముగాఁ బైనిఁ జెప్పఁబడిన కాంచనసంబంధగుణములు రాజునందుఁ గలిగినందున రాజును గాంచనార్థకమయిన వసునామముగలవానిగా బ్రహ్మదేవుఁడు చేసెనని తాత్పర్యము.

సీ. అనుఁగుఁదమ్ములఁ బాసి • కనుసన్నల మెలంగు నిందిరఁ దృణముగా • నెంచు ననినఁ
గూర్మాసనాభ్యాస • కర్మఠ యై భజించు ధరిత్రిఁ జులకగాఁ • జూచు ననిన
మధురాధరస్పంద • విధివశంవద యైన భాష నొండొకమాఱు • పల్కఁ డనిన
నాత్మపాణిస్పర్శ • నాయత్త మగు కీర్తి నెనసి దిక్కులకడ • నునుచు ననిన
తే. జగతిఁ గోటినోముల నోఁచిన • జలజముఖుల
కూరిమి గణించి యతఁ డేల • గారవించు
వరుని బహువల్లభామనో • హరునిఁ గోరు
ముదిత మందితయె యని బాల • మోము వాంచు. 111

అనుఁగుఁదమ్ములఁ బాసి=ప్రియానుజుల నెడఁబాసి, కనుసన్నల మెలంగు=ఆజ్ఞావశవర్తులై ప్రవర్తించుచున్న, ఇందిరన్=లక్ష్మీకాంతను, తృణముగా నెంచుననినన్ = లాఘవయుక్తముగాఁ జూచునని చెప్పఁగాను అనియర్థము. ప్రేమాస్పదములయిన తామరలను రాత్రియందు దెడఁబాయుచున్నదనియును దృష్టిప్రసారములపై నుదయించుచున్నదనియును నర్థుల కిచ్చునెడఁ దృణప్రాయముగాఁ జూడఁబడుచున్నదనియును భావము. కూర్మాసనాభ్యాస కర్మఠయై=కూర్మాసనమనెడు నాసనవిశేషమందలి యభ్యాసమువలనఁ గర్మశూరురాలై, (ని. 'కర్మశూరస్తు కర్మఠః' అని అ.) భజించు=సేవించునట్టి, ధరిత్రిన్=భూకాంతను, చులకగాఁ జూచిననినన్=అగౌరవముగాఁ జూచునని చెప్పఁగాను అని యర్థము. ఆదికూర్మముమీఁద నిలిచియున్నదనియును దన్నుఁ బొందినదనియును, దుష్టనిగ్రహము చేసి భారము లేకుండునట్లు చేయఁబడుచున్నదనియును భావము.

మధురాధరస్పందవిధివశంవదయైన=పెదవిని గదలించినమాత్రముచేత వశ్యురాలైన, భాషన్=వాణీకాంతను గూర్చి, ఒండొకమాఱు పల్కఁడనినన్=రెండవసారి మాటాడఁడని చెప్పఁగాను అని యర్థము. స్వకీయమధురాధరస్పందనిధానమువలన స్వాధీనురాలనియును, గంభీరుఁడుగనుకఁ బలుమాఱు పలుకఁడనియును భావము. ఇక్కడ విధియనఁగా బ్రహ్మదేవుఁడును భాషయనఁగా సరస్వతీదేవియును గనుకఁ బ్రకృతములును సహపఠితములునైన సరస్వతీ బ్రహ్మవాచకపదములఁ జెప్పుటచేత రత్నావళ్యలంకారము. (శ్లో. 'క్రమికం ప్రకృతార్థానాం న్యాసం రత్నావళిం విదుః' అని లక్షణము.) ఆత్మపాణిస్పర్శనాయత్తమగు కీర్తిన్ = నిజపాణిగ్రహణాధీనయైన కీర్తికాంతను, ఎనసి దిక్కులకడ

నునుచు ననినన్=కలిసి చేరువనుంచి యాదరింపక దూరముగాఁ జేసినాఁడనిచెప్పఁగాను అనియర్థము. తనయొక్క బాహుపరాక్రమాధీనమై యున్నదనియును దిగంతములయందు వ్యాపింపఁ జేయఁబడుచున్నదనియునుభావము. ఇక్కడఁ గీర్తికిని స్త్రీలింగమహిమముచేతఁ బ్రతీయమానయైన నాయికను నభేదాధ్యవసాయము.

జగతిన్=భూమియందు, కొఱనోమునోచిన=తక్కువనోములునోచిన, జలజముఖుల=తనవంటి స్త్రీలయొక్క, తూరిమిగణించి=ప్రేమనువిచారించి, అతఁడేలగారవించున్ = ఆరాజెందుకు మన్నించును, వరునిబహువల్లభామనోహరునిఁగోరు=పెక్కండ్రగుప్రియురాండ్రకు వల్లభుఁడయినపురుషుని వాంఛ నేయునట్టి, ముదిత=స్త్రీ, ముదితయె=సంతోషచిత్తురాలేనా, అని=ఈప్రకారముగాఁ జెప్పి, బాల=గిరికాదేవి, మోమువాంచున్=చింతచేత మొగము వంచుకొనును.

కేవలభాగ్యశాలినులును బ్రియురాండ్రునైన శ్రీ భూ వాణీ కీర్తికాంతలనే యాదరింపనివాఁడు భాగ్యహీనురాలనయిన నన్నుమన్నించునా యనియును నట్టిబహుస్త్రీవల్లభుఁ డయినవానిని గోరినందున సంతోషపరిపూర్తి యగునా యనియును తాత్పర్యము.

చ. అనుటయుఁ బిన్ననవ్వు వొల • యం బ్రణయంబున సారెసారెకున్
వినుచుఁ దదుక్తికౌశలము • వేమఱు నాత్మఁ దలంచి మెచ్చుచున్
జనపతి యాదరాతిశయ • సాంద్రముగా నుచితోత్తరంబుగా
ఘనరసభావబోధకము • గాఁ బలికెం గిలికించితంబుగాన్. 112

అనుటయున్=నే నీలాగని పలుకఁగా, పిన్ననవ్వువొలయన్=మందహాసము వ్యాపించునట్టులుగా, ప్రణయంబున సారెసారెకు న్వినుచున్=ప్రేమచేత మాటిమాటికి నాలకించుచును, తదుక్తికౌశలము=ఆవాక్యనిపుణత్వమును, వేమఱునాత్మఁదలంచి మెచ్చుచున్=పలుమాఱును మనస్సునందుఁ దలఁచుకొని మెచ్చుచును, జనపతి=వసురాజు, ఆదరాతిశయసాంద్రముగాన్=మన్ననయొక్క యతిశయముచేత నిబిడమగునట్టులుగా, ఉచితోత్తరంబుగాన్=నేనాడినమాటలకు నుచితమయిన ప్రత్యుత్తరమగునట్టులుగా, ఘనరసభావబోధకముగాన్-ఘన=అధికమయిన, రస=అనురాగముగల, భావ=తాత్పర్యమునకు, బోధకముగాన్=తెలియఁజేయునట్టిది యగునట్టులుగాను-అనఁగాఁ దనయొక్క యనురాగమును దెలియఁజేయునట్టులుగాను, కిలికించితంబుగాన్=(శ్లో. 'క్రోధాశ్రుహర్షభీత్యాదే స్సంకరః కిలికించితమ్' అని చెప్పఁబడియున్నది గనుక) కోపమును గన్నీరును సంతోషమును భయమును మొదలయినవానియొక్క సంకరము కిలికించిత మనఁబడునుగనుక నట్టికిలికించిత యుక్తమగునట్టులుగాను, పలికెన్=వచించెను. ఏమని యనిన,

శా. ఏమేమీ జగతిం గఠోరములు శై • లేంద్రంబు లౌఁగా తదీ
యామేయస్మయభేది యంతకుఁ గఠో • రాకారుఁ డౌనే కదా
యామేటిన్ ధృతి వాపి చూపులనె యు • ట్టాడించువా రెంతవా
రో మీనేక్షణ తా నెఱుంగదె తదా • రూఢప్రభావోన్నతుల్. 118

ఏమేమీ=ఏమియేమోయంటివి, జగతిన్=భూమియందు, కఠోరములు=కాఠిన్యముగలవి, శైలేంద్రంబులౌఁగా=పర్వతములౌనుగదా, తదీయ=ఆపర్వతసంబంధమయిన, అమేయ=అపరిమితమయిన, స్మయ=గర్వమును, భేది=పోఁగొట్టినవాఁడు, అంతకుఁగఠోరాకారుఁడౌనేకదా=ఆపర్వతములకంటెఁ గఠి

నాత్మఁ డేకదా, ఆ మేటికిన్ ధృతివాపి=అట్టికఠినుని ధైర్యమును బోఁగొట్టి, చూపులనె యాటాడించువారు=చూచుటచేతనే యుఱ్ఱూతలూగించువారు, ఎంతవారో = ఎంతటివారో, తత్ = ఆకఠోర వస్తుత్రయములోపల, ఆరూఢ=కాఠిన్యోత్కర్షస్థానమేదో దానియొక్క, ప్రభావోన్నతుల్=మహిమాతిశయములు, మీనేక్షణ=ఆగిరికాదేవి, తానెఱుంగదె = తానుగుర్తెఱుఁగదా.-అనఁగాఁ గాఠిన్యోత్కర్ష స్థానముగనుక గిరికాదేవి యారూఢురాలని తెలియవలయును.

శైలములు కఠినములు. శైలగర్వమువాపిన మేటి యంతకంటెను గఠినుఁడు. అట్టికఠినతరుని చూపులచే నాటలాడించుగిరిక యాత్మబలము నెఱుంగఁజాలకున్నది. చెలువలచూపులు ఇంద్రాదులను గూడ జయించుననుట ప్రసిద్ధము. ఇందులకు-

శ్లో. నూనంహితే కవివరా విపరీతవాచో, ఏనిత్యమాహు రబలాఇతి కామినీస్తాః
యాభి ర్విలోలతరతారకదృష్టిపాతైః, శక్రాదయోఽపి విజితా స్త్వబలాః కథంతాః

ఉ. ఆసలఁ బెట్టి యేచు వసు ♦ వంచు వచింపఁగ నేల సంతతో
ద్భాసినిజాభిజాత్యమునఁ ♦ దద్వసువుల్ వెలఁ గొన్న మోహసం
వాసపదంబు దా రమణి ♦ వారక శుక్తిమతిన్ జనించె ల
క్ష్మీసముదగ్ర మై జగ మ♦శేషము నివ్వెఱ గందఁ జేయఁగాన్. 114

ఆసలఁ బెట్టియేచువసువంచు వచింపఁగనేల=వసువనఁగాఁ గాంచనమును వసురాజును గనుకఁ గాంచనమాశఁగొలిపి శ్రమపెట్టుచున్నదని యేమిటి కనవలెను అని యర్థము. వసురాజని భావము. సంతత=ఎల్లప్పుడును, ఉద్భాసి=మిక్కిలి ప్రకాశించుచున్న, నిజ = స్వకీయమయిన, అభిజాత్యమునన్=కులీనత్వముచేత నని యర్థము, సౌందర్యముచేత ననిభావము. (ని. 'అభిజాతస్థిస్తే న్యాయ్యే కులీన ప్రాప్తరూపయోః' అని వి.) తద్వసువు ల్వెలఁగొన్నమోహసంవాసపదంబు = ఆకాంచనమును గొనిన మోహనివాసస్థానమయిన, ఉదారమణి=శ్రేష్ఠరత్నము-అనఁగా ముక్తామణియని యర్థము. (ని. 'ఉదారో దాతృమహతోః' అని అ.) ఆవసురాజును గొనిన మోహనివాసస్థానమయినగిరిక యని భావము. ఇక్కడ గిరికాదేవిని నిగరణముచేసి మణిగా నధ్యవసించినాఁడు. వారకశుక్తిమతిన్ జనించి=వాలాయముగా శుక్తిమతియం దుద్భవించి, లక్ష్మీసముదగ్రమై=కాంతిచేతఁ బరిపూర్ణమైయని యర్థము, సంపదచేతఁగాని లావణ్యముచేతఁగాని పరిపూర్ణమై యనిభావము. జగ మశేషము నివ్వెఱగందఁ జేయఁగాన్=సమస్తప్రపంచమును విభ్రాంతిని బొందునట్టులు చేయఁగా-ఆసలఁబెట్టి యేచువసువంచు వచింపఁగనేల యనిసంబంధము.

ప్రసిద్ధమగు జాతిశ్రేష్ఠతచేఁ గాంచనమును లోఁగొన్న మోహనివాసస్థానమైన శ్రేష్ఠతరముక్తారత్నము శుక్తిమతియందు జనించి కాంత్యతిశయముచే సమస్తజగమునకు విభ్రాంతిఁ గూర్చుచుండఁ గాంచనమాసగొల్పి వేధించుచున్నదనుట పొసఁగదని యర్థము.

ఎడతెగని యుత్కృష్ట సౌందర్యముచే వసురాజును లోఁగొన్నసుందరీమణియగు గిరికాదేవి శుక్తిమతియందు జన్మించిసంపదచేతను లావణ్యముచేతను నతిశయించి జగత్తునంతయు భ్రమింపఁజేయుచుండ వసురాజు ఆసగొల్పుచున్నాఁడన నేల యనిభావము. అలం. రూపకాతిశయోక్తి.

శా. శ్రీవాణీధరణీముఖాంగనలపైఁ ♦ జిత్తంబు లే కున్కి కే
మీ వేమాటలును దూఱ నిత్యగుణల ♦ క్ష్మిన్ సంతతావక్రవృ
త్తావిర్భావ నఖండరూపనిధిఁ గ ♦ న్యం గోరువాఁ డేల సం
భావింతున్ సిరిపెంపు వాగ్విలసన ♦ ప్రౌఢిన్ మహీభోగమున్. 115

శ్రీ వాణీ ధరణీ ముఖాంగనలపైన్=లక్ష్మియు సరస్వతియు భూమియు మొదలుగాఁగల స్త్రీల మీఁదను, చిత్తంబులేకున్కికిన్=మనస్సు లేకపోవుటనుగురించి, ఏమివేమాటలునుదూఱన్=పలుమాటలును నిందింపవలసిన దెందుకు, నిత్యగుణలక్ష్మిన్=అచంచలమయిన గుణములుగలలక్ష్మియు నని యర్థము. అచంచలగుణసమృద్ధి గలదనిభావము. సంతత=ఎల్లప్పుడును, అవక్రవృత్త=అకుటిలవృత్తితోడ, ఆవిర్భావన్ = ఆవిర్భవించిన సరస్వతియును, అఖండరూపనిధి = పూర్ణసౌందర్యమునకు స్థానమయిన భూమియును నయినట్టి, కన్యంగోరువాఁడు=కన్యనుగోరెడువాఁ డని యర్థము. లక్ష్మీదేవి చంచలగుణముగల దనుట, సిరులు నిలుకడలేని వని భావము. సరస్వతియైతే సంతతమును నవక్రవృత్తావిర్భావము లేనిదనుట. వక్రవృత్తావిర్భావము గలదని భావము. అనఁగా గురువులు వక్రాకారములును లఘువు లవక్రాకారములును నగునట్టులుగా వ్రాయఁబడుచున్నవి గనుక గురులఘు యుక్త వృత్తరూపావిర్భావము గలదని తెలియవలయును. భూమి ఖండరూపనిధియనుట—నవఖండస్వరూపము గలదని భావము. సిరిపెంపు= లక్ష్మియొక్క యతిశయత్వమును, వాగ్విలసనప్రౌఢిన్ = సరస్వతియొక్క విలాసప్రౌఢిమను, మహీభోగమున్ = భూమియొక్క సుఖమును, ఏలసంభావింతున్=ఎందుకుమన్నించును—అనఁగా మన్నింపఁ డనుట.

గుణశాలియైన గిరికాదేవిని గోరుచున్నతాను శ్రీవాణీధరణీకాంతలయొక్క పెంపును ప్రౌఢిమయును భూసౌఖ్యమును భోగంబును సంభావింప ననియర్థము సంపదలయొక్క యభివృద్ధియును విద్యాప్రౌఢిమయును భూసౌఖ్యమును దనకు రుచింపకున్న దనిభావము. ఇక్కడ నభేదాధ్యవసాయము. ఇందులో నరతి యను నవస్థాభేదంబును జెప్పినాఁడు. శ్లో. 'అన్యత్రా ప్రీతి రరతిః' అని లక్షణము. అలం. శ్లేషమూలకకావ్యలింగము.

క. నా విని చతురాస్యుఁడ వరు,దే వచనప్రౌఢి నీకుఁ ♦ దెలివ యిఁక వియో
గావృత్తి కోర్వ దేచెద,వో వెసఁ బ్రోచెదవొ తెలుపు ♦ ముల్లం బనినన్. 116

నావిని=వసురా జీలాగని పలుకఁగా విని, చతురాస్యుఁడవు=అనఁగా బ్రహ్మవని యర్థము. చతురవాక్యములు గలవాఁడవని యర్థాంతరము. అరుదే వచనప్రౌఢి నీకున్=వాక్ప్రౌఢిమ నీకొక యాశ్చర్యమా, తెలివ యిఁక వియోగావృత్తి కోర్వదు=గిరికాదేవి యిఁకమీఁద విరహముయొక్క పునఃప్రాప్తికి సహింపఁజాలదు, ఏచెదవో వెసఁ బ్రోచెదవొ=ఈలాగుననే వ్యథపెట్టుచున్నావో లేక యింతట రక్షించుచున్నావో, తెలుపు ముల్లం బనినన్=నీమానసమును దెలియఁ జేయుమని నేను బలుకఁగా—

ఉ. నామదిలోనఁ బాయనియ ♦ నారతసారతరానురాగచిం
తామయదామయంత్రపరి ♦ ణాహము దాహము మోహముం బురం
ధ్రీమణి నీవ చూచితి గ ♦ దే తగదే జగదేకధన్వి య
క్కామునియాన సంధియము ♦ గా ననుఁ బల్కి యఘుంబు గైకొనన్. 117

నామదిలోనఁ బాయని=నామనస్సునం దెడఁబాయని, అనారత=నిత్యమైన, సారతర=బలిష్ఠమయిన, అనురాగ=ప్రేమతోఁగూడిన, చింతామయ=చింతారూపమయిన, దామయంత్ర=ఉరిత్రాఁటియొక్క, పరిణాహము=విశాలతయును, (ని. 'పరిణాహో విశాలతా' అని అ.) దాహము=తాపమును, మోహముక్=అపేక్షయును, పురంధ్రీమణి=స్త్రీరత్నమవయిన యోమంజువాణీ, నీవ చూచితిగదే=నీవే కంటివిగదా. కాఁబట్టి, జగదేకధన్వి = జగత్తులోపల మేటివిలుకాఁడయిన, అక్కాముని యాన=ఆమన్మథునితోడు, ఆన యనెడుపద మాజ్ఞాశబ్దమునకుఁ దద్భవము. సందియముగా ననుఁబల్కి=సంశయమున్నట్టులుగా నన్నుగురించి వచించి, అఘంబుగైకొనక్=పాపముగట్టుకొనుటకు, తగదే=నీకు నర్హముగాదే, అనఁగా నాదురవస్థను జూచియును నాయందు సందేహమున్నట్లుగాఁ బల్కి పాపముగట్టుకొనుట నీ కుచితముగాదే యనుట. అనురాగము చింతామయమైనది. అది విశాలమగు నురిత్రాడు. దీనికిఁ దోడు విరహతాపము. మోహము మిక్కుటమైనది. ఇవియన్నియు మంజువాణి కనులారఁ జూచుచున్న సంగతులు. గిరికను వసురాజు వలచినవిషయము సంశయాస్పదమనుట పాపము కట్టుకొనుటయె.

ఆ. నాతి విను నగేంద్ర♦నందన గురుజనా, ధీన గాన మనసు ♦ గాన కుంట
నెసఁగు సందియమున ♦ నిన్నాళ్లు నీఖేద, జలధిఁ గడువఁ దెప్ప♦గలిగె నేఁడు.

నాతి విను=ఓమంజువాణీ వినుము, నగేంద్రనందన=కోలాహలపర్వతరాజపుత్త్రి యైనగిరిక, గురుజనాధీన గానక్=తల్లిదండ్రులయొక్క యధీనురాలు గనుకను, మనసు గానకుంటక్=ఆగిరిక యొక్కమానసము దెలియకపోవుటవలనను, ఎసఁగుసందియమునక్=అతిశయించుచున్నసందేహముచేత, ఇన్నాళ్ళు నీఖేదజలధి గడువక్=ఇన్నిదినములపర్యంతమును దుఃఖసముద్రమునందు నీఁదుచుండఁగా, తెప్ప గలిగె నేఁడు=నేటికి నీవనెడు తెప్ప సంప్రాప్తమాయెను.

ఉ. మన్ననబోఁటి నేఁటిమును♦మాపు మహేంద్రభుజిష్య వచ్చి తా
నన్నియుఁ దెల్పె నింద్రుఁడు మ♦దాశయ మాత్మ నెఱింగి భక్తిసం
పన్నతఁ బాణిపీడనశు♦భం బొనఁగూర్చుటకై నగోత్తముం
గన్నియ వేఁడ వచ్చునఁట ♦ కౌతుకసాంద్రమునీంద్రకోటితోన్. 119

నేఁటిమునుమాపు = నేఁటిసాయంకాలము, మన్ననబోఁటి=బహుమానపాత్రురాలయిన, మహేంద్ర భుజిష్య వచ్చి=మహేంద్రునియొక్కపరిచారిక వచ్చి, తా నన్నియుఁ దెల్పెక్=తనంతట తానే యన్నివర్తమానములును జెప్పెను. ఏమనిన, ఇంద్రుఁడు మదాశయమాత్మ నెఱింగి=ఇంద్రుఁడు నాయభిప్రాయమును మనస్సునందుఁ దెలిసికొని, భక్తిసంపన్నతక్=భక్తిసమృద్ధిచేత, పాణిపీడన శుభం బొనఁగూర్చుటకై=పాణిగ్రహణరూపమయిన శుభకార్యమును సంఘటనపఱుచుకొఱకుఁగాను. కౌతుకసాంద్ర మునీంద్రకోటితోక్=సంతోషసమగ్రమయిన మునిసమూహముతోడ, నగోత్తముం గన్నియ వేఁడవచ్చునఁట=కోలాహలపర్వతశ్రేష్ఠునిఁ గన్నెనడిగెడు నిమిత్తమువచ్చునఁట. ముందరిపద్యముతో నన్వయము.

క. ఆచల్లనితియ్యనిశుభ, వాచావిభవంబు విన్న♦వాఁడ నయి సుమీ
వాచాల మదనగుణనా, రాచార్భటి కోర్చినాఁడఁ ♦ బ్రాణంబులతోన్. 120

ఆ చల్లనితియ్యనిశుభవాచావిభవంబు=శీతలమయినదియు మధురమయినదియు శుభకరమయినదియు నగు నాయింద్రపరిచారిక పలికిన వాగ్వైభవమును, విన్నవాఁడనయినుమీ=ఆలకించినవాఁడయినందువలన సుమా, వాచాల=మ్రోయుచున్న, మదనగుణ=మన్మథునివింటినారియొక్కయు, నారాచ=బాణపాతముయొక్కయు, ఆర్భటికిన్=ఆర్భాటమునకు, ప్రాణములతోన్=ప్రాణములతోడను, ఓర్చినాఁడన్=సహించియున్నాఁడను.

ఉ. ఈశుభవార్త మీచెలియ ♦ కిప్పుడ పోయి యెఱుంగఁ జెప్పి కా
మాశుగపీడితంబు లగు♦ప్రాణము లూఱడిలంగఁ జేయు మో
పేశలవాణి యంచు ననుఁ ♦ జేర్కొని యీమహితాంగుళీయ ము
ర్వీశుఁ డొసంగి వీడ్కొలిపె ♦ నేనును వచ్చితి నీక్షణంబునన్. 121

ఈశుభవార్త=శుభకరమయిన యీవృత్తాంతము, మీచెలియకున్=మీగిరికాదేవికి, ఇప్పుడ పోయియెఱుంగఁ జెప్పి=ఇప్పుడే వెళ్ళి తెలియఁజెప్పి, కామాశుగపీడితంబులగు = మన్మథబాణముల చేత బాధింపఁబడుచున్న, ప్రాణములు=ఆగిరికయొక్క ప్రాణములు, ఊఱడిలంగఁజేయుము=ఊఱటఁబొందునట్టులుగాఁ జేయుము, ఓపేశలవాణియంచు ననుఁజేర్కొని=ఓమంజువాణీ యని నన్నుఁ జేరఁ బిలిచి, ఈమహితాంగుళీయము = ప్రశస్తమయిన యీముద్రిక, ఉర్వీశుఁడొసంగి=వసురాజు నాచేతికినిచ్చి, వీడ్కొలిపెన్=పంపించెను, ఏనును వచ్చితి నీక్షణంబునన్=ఈక్షణమందే నేను వచ్చితిని.

ఇది శుభవార్త. శుభస్య శీఘ్రమందురు గానఁ ద్వరగా నెఱింగింపఁ జనును. గిరికప్రాణములు కామాశుగపీడితములు. కాన నూఱడించుట యావశ్యకము. సంతాపస్థితిలో నున్నగిరిక యీమాటలు విశ్వసింపదనుకొందువేమో ఇదిగో మహితాంగుళీయకము జూపుమనుటచేఁ గొనివచ్చితినని భావము.

చ. అని యఖిలంబుఁ దెల్పి రమ♦ణాంగుళిముద్రిక మంజువాణి యి
చ్చిన నవలా విలాసమునఁ ♦ జేకొని కైశ్యపయోదపద్ధతిం
దనరఁగఁ జేయు నేత్రనలి♦నంబుల నొత్తు ఘటించు నున్నత
స్తనయుగళీరథాంగములఁ ♦ దద్రవితేజము నేకతంబునన్. 122

అని యఖిలంబుఁ దెల్పి=ఈలాగని యావద్వృత్తాంతమును జెప్పి, రమణాంగుళిముద్రిక=ప్రియుఁడయిన వసురాజుయొక్క సికాయుంగరమును, మంజువాణి యిచ్చినన్=మంజువాణి యియ్యఁగా, నవలా=గిరికాదేవి, విలాసమునఁ జేకొని=శృంగారచేష్టచేతఁ గైకొని, తద్రవితేజమున్=సూర్యప్రభలవంటి ప్రభలుగల యా ముద్రికను, ఏకతంబునన్=ఒంటరిపాటున, కైశ్య=కేశబృందమనెడు,(ని. 'తద్బృందే కైశికం కైశ్యమ్' అని అ.) పయోదపద్ధతిన్=మేఘమార్గమందు-అనఁగానాకాశమునందు, తనరఁగఁజేయున్=ఒప్పునట్టులుగా నొనర్చును-అనఁగా మేఘమువంటి కొప్పుపైఁ జేర్చుకొనుననుట, నేత్రనలినంబుల నొత్తున్=కమలములవంటి కన్నులనొత్తుకొనును, ఘటించు నున్నత స్తనయుగళీ రథాంగములన్=చక్రవాకములవంటి యున్నతకుచయుగళమందు హత్తించుకొనును.

ముద్రికను రవితేజమని చెప్పినాఁడు గనుకఁ గైశ్యపయోధ్ధతియందును నేత్ర కమలములయందును స్తనచక్రవాకములయందును జేర్చుకొన్నదని చెప్పుట యానుకూల్యమని విచారింపవలయును.

రవితేజమని చెప్పినందుననే ముందరవర్ణింపఁగల సూర్యోదయము సూచింపఁబడుచున్నది గనుక ముద్రాలంకారము (శ్లో. 'సూచ్యార్థసూచనంముద్రా ప్రకృతార్థపరైఃపదైః') అని దీనికిలక్షణము. ముద్రికాశబ్దవిశేషణమయిన రవితేజమనెడుపదమునకు, 'ఉభయవిధమమహతీనామ్' అనెడు నన్నయసూత్రముచేత, నపుంసకలింగత్వము సమ్మతమని తెలియవలయును. గిరిక ముగ్ధ, కావున సిగ్గరి. తొలుత వసురాజును జూచునపుడె చెలులుపరిహాసించిరిగావున ముద్రిక నేకతమునఁ గేశములందుఁ గనులందు గుబ్బలందు నుంచికొనెను. ప్రియుఁడు ప్రేమతోఁ బంపిన వస్తువు గాన గిరిక తనయనురాగము నాముద్రికను గైకొనుటతోఁ గాదు విలాసముగాఁ గైకొనుటతోఁ బ్రకటించెను. విలాసమన శృంగారరసముల్లాసము. చూపులయందు విలాసముదాల్చెనని భావము. విలాసలక్ష్యమిటులఁ జెప్పఁబడెను—

క. ఇరుగడల వెడలి సుడిగొని, తరళములై వెలికి బెళికి తళతళమనుచున్
బరగురువారపుఁజూపుల, హరిణాక్షి నృసింహవిభున కారతిఁ జేసెన్.

క. పతిఁ గనఁ దాత్కాలికమగు, సతులవికారము విలాసము... నరసభూపాలీయము.

ఉ. మున్నుగ నన్నగాత్మజకు ♦ ముద్రికపైఁ బతిపేరు సూడఁ దోఁ
చె న్నృపుఁ జూచినట్లనునుఁ♦సిగ్గు తదూర్మిక వ్రేలఁ బూన భా
గ్యోన్నతిఁ దత్కరగ్రహమ♦హోత్సవ మప్పుడె కాంచినట్లు మిం
చె న్నవకాంతివిభ్రమవి♦శేషససంభ్రమవైభవోన్నతుల్. 123

మున్నుగన్=ముందుగా, అన్నగాత్మజకున్=ఆగిరికాదేవికి, ముద్రికపైఁ బతిపేరుసూడన్=ముద్రికమీఁదనున్న వసురాజుయొక్క నామధేయమును జూడఁగానే, నృపుఁజూచినట్ల=ఆవసురాజును జూచినట్టులుగా, నునుసిగ్గు=మృదువైనలజ్జ, తోఁచెన్=ఉదయించెను. తదూర్మిక వ్రేలఁబూనన్=ఆయంగుళీయకము తనవ్రేలఁ బెట్టుకొనఁగా, భాగ్యోన్నతిన్=భాగ్యాతిశయముచేత, తత్కరగ్రహమహోత్సవ మప్పుడె కాంచినట్లు=ఆవసురాజుయొక్క పాణిగ్రహణమహోత్సవము నప్పుడే పొందినట్టులుగా, నవకాంతి = నవీనలావణ్యమును, విభ్రమవిశేష=విలాసవిశేషములును, సంభ్రమవైభవ = ఆదరసమృద్ధితోఁగూడిన, ఉన్నతుల్=ఔన్నత్యములును, మించెన్=అతిశయించెను. (ని. 'సంభ్రమ స్సాధ్వసేపి స్యా త్సంవే గాదరయో రపి' అని విశ్వనిఘంటువు.)

సీ. ఒకనాఁడు చూచె బా♦లిక నిలాపతి యంచుఁ బతియంచుఁ దనకున♦ప్పార్థివేంద్రు
నతివ గోరఁగమించె ♦ నంగజానలమంచు నలమంచుచాయవాఁ ♦ డబల నేచ
నుర్వీశుకడ కేఁగ♦నొకబోటికొమ్మంచుఁ గొమ్మంచు నతఁడును ♦ గుఱుతొసంగి
చెలియతోఁ దెలిపెఁ దొ♦య్యలిమీఁదితమి యంచుఁ దమి యంచు ముట్టునం♦ [తనె బలారి
తే. వచ్చునంట విందునకు నిందు ♦ వనిత నడుగ
ననుచు ననుచువయస్యలా♦ద్యంతమును నె
ఱుంగఁ జెప్పిన విని మహా♦భంగగరిమఁ
బొంగె జనయిత్రి మిన్నందె ♦ భూమిధరము. 124

ఒకనాఁడుచూచె బాలిక నిలాపతియంచున్ = వసురాజొకనాఁడు గిరికాదేవిని జూచెనని యును, పతియంచుఁ దనకు నప్పార్థివేంద్రు నతివ గోరఁగ మించె నంగజానల మంచున్=తనకుఁ

జెనిమిటి యని యావసురాజును గిరికాదేవి యిచ్ఛయింపఁగా మన్మథాగ్ని యతిశయించె ననియును, అలమంచుచాయవాఁ డబల నేచ నుర్వీశుకడ కేగి నొకబోటికొమ్మంచుఁ=మంచుచాయవాఁడు-చంద్రుఁడు గిరికాదేవిని వేధింపఁగా వసురాజుయొక్క సన్నిధానమునకు నొకబోటికొమ్మ యనఁగాఁ జెలికత్తె పోయె ననియును, కొమ్మంచు నతఁడును గుఱుతొసంగి చెలియతోఁ దెలిపెఁ దొయ్యలిమీఁది తమియంచుఁ=పుచ్చుకొమ్మని యావసురాజు తనయుంగర మానవాలిచ్చి యాచెలికత్తెతో గిరికాదేవి మీఁదఁ దనకుంగల యభిలాషమును దెలియఁ జెప్పె ననియును, తమి యంచుముట్టునంతనె=రాత్రి తుదముట్టఁగానే-అనఁగాఁ దెల్లవారఁగానే,బలారివచ్చునఁట విందునకు నిందు వనిత నడుగననుచుఁ=ఇంద్రుఁడు విందునకు ననఁగా నాప్తుఁడయిన వసురాజునకు గిరికాదేవి నడిగెడు నిమిత్తమై యిక్కడికి వచ్చునఁట యనియును,

ననుచువయస్యలు=ననువు అనఁగా నెనరుగాన నెనరుగల గిరికాసఖులు, ఆద్యంతమును నెఱుంగఁ జెప్పినవిని=మొదటినుండి చివరవఱకు జరిగినవృత్తాంతమును దెలియఁజెప్పఁగా విని, మహాభంగగరిమఁ బొంగె జనయిత్రి-జనయిత్రి = గిరికాదేవితల్లియైన శుక్తిమతి, మహ=ఉత్సవముయొక్క, అభంగ=అవిచ్ఛిన్నమైన, గరిమన్=అతిశయముచేత, పొంగెన్=ఉప్పొంగె నని యర్థము.

మహాశబ్దమునకు నర్థమిక్కడ నుత్సవపరంబును అకారాంతంబును అని విచారింపవలయును. మహత్తయిన తరంగాతిశయముచేతఁ బొంగెనని యర్థాంతరము. మిన్నందె భూమిధరము=కోలాహల పర్వతము మిన్నుముట్టె నని యర్థము. గగనపర్యంతౌన్నత్యము గలిగియుండె నని యర్థాంతరము.

చ. అపు డరవిందగంధి హృదయాంబుజఖేద మడంప వచ్చి తో
రపురుచితో వెలుంగు వసురాజుకరోర్మికఁ గాంచి భీతిమైఁ
జపలవిలోచనం బొదువఁ జాలక తారభటాలితో నిశా
ధిపునిబలంబు లేగినగతిన్ రహి పీడెను బాండుచంద్రికల్. 125

అపుడు=ఆసమయమందు, అరవిందగంధి = గిరికాదేవియొక్క, హృదయాంబుజఖేదమడంప వచ్చి=అంబుజమువంటి హృదయమునుయొక్క ఖిన్నత్వమును నివారింపవచ్చి, వసురాజుకరోర్మికన్= అనఁగా వసురాజు చేతియుంగరమునని యర్థము. వసువులనఁగా రశ్ములు వానికి రాజు సూర్యుఁడును, ఆయన కిరణోర్మిక నని యర్థాంతరము. ఈయర్థమం దూర్మికయనఁగా రేఖయని చెప్పవలయును. తరంగము రేఖాకృతియగుట ప్రకటముగదా. ఇది ప్రకృతశ్లేషము. కాంచిభీతిమైఁ జపలవిలోచనం బొదువఁజాలక=అనఁగా గిరికాఖేదనివారణార్థమై వచ్చిన రాజుచేతియుంగర మనుసూర్యకిరణమును జూచి భయముచేత గిరికాదేవి నాక్రమింపఁజాలక సూర్యోదయము కాఁగానే వివాహప్రసంగ మారబ్ధమగుచున్నది గనుక సూర్యోదయము గిరికాదేవి కానందమగుటచేత సూర్యకిరణప్రసరమును గిరికాఖేదనివారణముకొఱకు వచ్చుటగా వర్ణించినాఁడు, తారభటాళితోన్ = నక్షత్రసదృశులైన భటులయొక్క సమూహముతోడ నని యర్థము. భటులవంటి నక్షత్రములతోడ నని యర్థాంతరము. నిశాధిపుని బలంబులేగినగతిన్=చంద్రుఁడనెడు రాజుయొక్క సైన్యములు తీసిపోయినవోయన్నట్లుగా, రహిపీడెను బాండుచంద్రికలు=తెల్లని వెన్నెలలు కాంతిహీనములాయెను. ఇది యుత్ప్రేక్షాలంకారము.

నాయిక అరవిందగంధి. హృదయము అరవిందము. కావున వసురాజుకరోర్మిక తోరపురుచితోఁ దోడ్పడవచ్చెను. చంద్రుఁడీకఁ దనప్రయత్నములు సాగవని సైన్యబలముతోఁ జెలినేచుట మానిపోయినటుల వెన్నెలలు తెల్లనయ్యెను. అనఁగా ఉంగరము చూచినంత గిరికకుఁ జింతతొలంగెననియు నంతలోఁ దెల్లవారెననియు భావము.

మ. ఒకనాఁ డింద్రునియంతవేలుపు మదీయోక్తి న్విడంబించి తా
నొకకాలం బెఱిఁగింప వచ్చి మునిశాపోద్వృత్తిపా లయ్యె మా
మకశబ్దం బిది యల్పమే త్రిమునిసంభావ్యత్రికాలీవిబో
ధక మట్లీరితిఁ ద్రిభంగిగా మొరసెఁ జెంతం దామ్రచూడౌఘముల్. 126

ఒకనాఁడు=ఒకానొకదినమందు, ఇంద్రుని యంతవేలుపు=దేవుఁడైన యింద్రుని వంటివాఁడు, మదీయోక్తిన్విడంబించి = నాయొక్కశబ్దము ననుకరించి, తానొకకాలం బెఱిఁగింపవచ్చి=తాను నొకానొకమైన ప్రాతఃకాలమును దెలియఁజేయవచ్చి, మునిశాపోద్వృత్తిపాలయ్యెన్=గౌతమమునియొక్క శాపాతిశయమునకు స్వాధీనుఁడాయెను. మామకశబ్దంబిదియల్పమే=నాయొక్క శబ్దం బిది స్వల్పమా-అనఁగా మహాఘనమయినదనుట. ఏమనిన, త్రిముని = వ్యాకరణశాస్త్రప్రవర్తకులైనపాణిని, కాత్యాయనుఁడు, పతంజలి యనెడు మునిత్రయముచేత, సంభావ్య = ఆదరింపఁదగిన, త్రికాలీ=కాలత్రయమునకు, విబోధకము=తెలివిడిపఱుచునట్టిది, అట్లీరితిన్=అన్నట్లుగానని యర్థము. త్రికాలియనఁగా హ్రస్వ దీర్ఘ ప్లుత కాలములనుట, చెంతన్ = సమీపమందు, తామ్రచూడౌఘముల్ = కుక్కుటసమూహములు, ని. 'కృకవాకు స్తామ్రచూడః కుక్కుట శ్చరణాయుధః' అని అ. త్రిభంగిగామొరసెన్=ప్రకారత్రయవిశిష్టముగా ధ్వనిచేసెను.

ఇంద్రునికొక్కటేకాలము-ఒకమునిచేతనైనను సంభావితమైనదికాదు. (దేవేంద్రునియంతవాఁడె తమయఱపు ననువదించెను. దానికి గౌతముఁడు కినిసి శాపమునొసంగెను.) అటులఁ గాలము చెప్పి యొకమునివలనసైతము దేవేంద్రుఁడు గౌరముపొందలేదు.

తమకు మూఁడుకాలములును మునిత్రయముచేత సంభావితములైన వన్నట్లుగాఁ గుక్కుటములు మూఁడు ప్రకారములు గలుగునట్లు మొరసెనని యర్థము. మునిత్రయమును గుక్కుటధ్వనియందున్నట్టి ఉ ఊ ఊ 3 అనెడి హ్రస్వదీర్ఘ ప్లుత కాలముల ననుకరించి యకారాదిస్వరములకు హ్రస్వదీర్ఘప్లుతములను జెప్పినారు గనుకఁ గుక్కుటశబ్దమందలి కాలత్రయమును మునిత్రయసంభావ్యమని తెలియవలయును.

క. ఆతఱి నొకకాతరనేత్రాతిలకము కలికిఁ బలికెఁ బ్రాభాతికశో
భాతిశయవత్కుశేశయ, నూతనమధుమధురతామనోహరఫణితిన్. 127

ఆతఱిన్=ఆసమయమందు, ఒకకాతరనేత్రాతిలకము=స్త్రీలలో శ్రేష్ఠురాలైన యొకవెఱపుఁజూపుల చెలికత్తియ, ప్రాభాతిక=ప్రాతఃకాలసంబంధమైన, శోభాతిశయవత్=కాంత్యతిశయము గలిగిన, కుశేశయ=శతపత్రములయందలి,నూతన=నవీనమైన, మధు=మకరందముయొక్క,మధురతా=మాధుర్యమువంటి మాధుర్యముచేత, మనోహర=ఒప్పిదమైన, ఫణితిన్=వాగ్వైఖరిచేత, కలికిఁబలికెన్=గిరికాదేవినిగూర్చి యొకవాక్యము పలికెను.

మ. అమృతాంశుండు నిశాసతిం గలసి శీర్యచ్చంద్రికాగంధశి
ల్పముతోఁ బుష్కరశయ్యఁ బాసి చన వేళాదూతి తత్కాలసం
భ్రమసంశీర్ణతరోడుహారమణివారం బేరి తా నొక్కచో
గుమిగాఁ బోసెనొ నా మినుక్కరను వేగుంజుక్కఁ గంటే చెలీ. 128

అమృతాంశుండు=చంద్రుఁడనెడునాయకుఁడు, ఇక్కడ నేకదేశవివర్తి రూపకము, నిశాసతింగలసి=రాత్రియనెడు నాయికనుగూడి, శీర్యచ్చంద్రికా గంధశిల్పముతోన్ = విశీర్ణమగుచున్న వెన్నెలయనెడు గంధపుఁబూఁతతోడ, శిల్పమనఁగా రచన, పుష్కరశయ్యఁ బాసి చనన్=ఆకాశమనెడుపానుపు విడిచిపోఁగా, (ని. 'పుష్కరం పంకజే వ్యోమ్ని పయఃకరికరాగ్రయోః' అని వి.) వేళాదూతి=ఉషఃకాలమనెడు దూతిక, తత్కాల=సద్యస్కాలమనెడు రతికాలమందలి, సంభ్రమ = సంవేగముచేత, సంశీర్ణతర=మిక్కిలివిశీర్ణములైన, ఉడు=నక్షత్రములనెడు, హారమణివారంబేరి=హారమౌక్తికముల నేర్పఱచి, తానొక్కచోగుమిగాఁబోసెనొనాన్ = తానొకచోట రాశిగాఁ బోసినదో యన్నట్టులుగా, మినుక్కరను=తళుక్కుమని మెఱయుచున్నట్టి, వేగుంజుక్కఁగంటే = వేగుచుక్కను జూచితివా, చెలీ=ఓగిరికాదేవీ యనియర్థము.

వెన్నెలలు పలుచఁబాఱుచుండెననియు, జంద్రుఁ డస్తంగతుఁడయ్యెననియు జుక్కలన్నియుఁ గాంతిమాసెననియు వేగుచుక్కదోఁచెననియు భావము. వెన్నెలలు పలుచఁబాఱుట చంద్రుఁడు నిశాసతితోఁగవయ మేనిగంధపుఁబూఁత రాలునట్లును, ఆకాసమువదలుట శయ్యవదలుటగను వేగుచుక్క దోఁచుట రతిసంభ్రమమున దెగినముత్తెములను గుప్పగాఁజేయుటగను నుత్ప్రేక్షింపఁబడెను. వేగుచుక్క చుక్కలన్నింటికాంతిని గ్రహించి వెలుఁగుచుండెనని ఫలితార్థము. అలం. ఉత్ప్రేక్ష.

మ. తొవకుం దూరపునంటు రేమగువపొందుం బూర్వపక్షంబు వ
మ్మవుఁ దాఁ గారుచి మద్విభూతి నది గాకబ్జారితో వారికే
యవినాభావము నాకుఁ గాక యని చంద్రాపాయవేళం బ్రదీ
పవిపాండుద్యుతి పేరఁ జంద్రిక శిఖం బ్రాపించె నీక్షించితే. 129

తొవకుం దూరపు నంటు=కలువతీఁగెకు దూరపు స్నేహమని యర్థము. చంద్రునకును గుముదములకును ద్విలక్షయోజన వ్యవధానమని భావము. నంటనెడుపదము నకారాదిగాని స్వరాదికాదు. రేమగువపొందుం బూర్వపక్షంబు=నిశాకాంతసంగతియును నిలుకడలేనిదనియర్థము. శుక్లపక్షమందే యోగమనిభావము. (శ్లో. 'అన్యస్యాః క్వచిద్భవేచ్చాన్యా.' న.) అనెడుసూత్రముచేత సప్తమ్యర్థమందుఁ బ్రథమవచ్చినది, వమ్మవుతారారుచి మద్విభూతిన్=రుచియనఁగా నభిరతియును గాంతియునుగనుక నశ్విన్యాది తారలయందలి యభిరతి నాయొక్క సంపదవలన వ్యర్థమైపోవునని యర్థము. వెన్నెలవలనఁ జుక్కలు కాంతి రహితము లగుచున్నవని భావము. అదిగాక=అదియునుంగాక, అబ్జారితోన్=చంద్రునితోడ, వారికేయవినాభావము నాకుఁగాక=అవినాభావమనఁగా నెడతెగనికూటమి, కుముదలతకును రాత్రికిని దారలకును గమనాగమనములు సంభవింపవు గనుకను దనకు సంభవించుచున్నవి గనుకను గుముదలతాదుల కవినాభావము లేదనియునుదనకుఁ గలదనియును దాత్పర్యము. అని=ఈలాగని, చంద్రాపాయవేళన్ = చంద్రుఁ డపాయమును బొందినసమయమందు, చంద్రిక=

వెన్నెలయనెడునాయిక, ప్రదీపవిపాండుద్యుతిపేరన్ = దీపములయొక్క ధవళకాంతియనెడు మిషచేత, శిఖింబ్రాపించెన్ =అగ్నిప్రవేశమాయెను, అనఁగా సహగమనముచేసెను, ఈక్షించితే=చూచితివా యని యర్థము.

కలువకన్నెకుఁ జంద్రునకు దూరము. రేమగువకుఁ జంద్రునకు మైత్రి పూర్వపక్షము. చుక్కలకాంతి వెన్నెలవెలుంగుచే నశించుచున్నది. కావునఁ జంద్రునకు వెన్నెలకు అవినాభావసంబంధము కలదు. అట్టియెడ సహగమనము యుక్తమని వెన్నెల యగ్నిని జొచ్చెననియర్థము. చంద్రాస్తమయ సమయమున దీపములు తెల్ల బాఱెననిభావము. అలం. శ్లేషమూలక కావ్యలింగము. సమాసోక్తి.

శా. తారాసస్యము పండినన్ గగనకే◆దారంబునం జంద్రికా
నీరం బారఁగఁ గోసి తద్రుచిఫలా◆నీకంబు ప్రాతర్మహా
సీరిగ్రామణి తూరుపెత్తెననఁ దోఁ◆చెం దూర్పునం దెల్పు త
ద్దూరన్యస్తపలాలరాశిక్రియ నిం◆దుం డేఁగె నిస్సారుఁడై. 130

తారాసస్యముపండినన్ = నక్షత్రములనెడు వరిపైరుపండఁబారఁగా, గగనకేదారంబునన్ = ఆకాశమనెడు వరిమడియందు, చంద్రికానీరంబారఁగన్ =వెన్నెలయనెడు నీరెండిపోవఁగా, కోసి= కోఁతగోసి, తద్రుచిఫలానీకంబు = ఆనక్షత్రకాంతి పుంజమనెడు ధాన్యరాశిని, ప్రాతర్మహాసీరిగ్రామణి-ప్రాతః=ప్రాతఃకాలమనెడు, సీరమనఁగా నాగలిగాన నది గలవాఁడు, సీరి-అనఁగాఁ గాఁపువాఁడు, మహాసీరిగ్రామణి యనఁగాఁ బెద్దకాఁపువాఁడు, తూరుపెత్తెననఁదోఁచెం దూర్పునందెల్పు = తూరుపుదిక్కునందుఁ దూర్పారఁబట్టెనో యన్నట్టులుగాఁ దూర్పుదిక్కునందుఁ దెలుపు గనుపించెను-అనఁగాఁ దూర్పు తెల్లవాఱెననుట, తత్ =తూర్పారిన యాధాన్యరాశికి, దూరన్యస్త = దూరముగాఁ దీసిన, పలాలరాశిక్రియన్ = పొల్లురాశియో యన్నట్లు, (శ్లో. 'పలాలో స్త్రీసనిష్ఫలః' అని అ.) నిస్సారుఁడై=కాంతిహీనుఁడై, ఇందుండు=చంద్రుండు, ఏఁగెన్ =పడమటదిక్కునకుఁ బోయెను.

వరిపండినపిదప నీరివురనిచ్చి పంటగోసి ధాన్యమును దూరుపారఁబట్టుదురు. పొల్లంతయు దూరముగాఁబడును. వెన్నెలలంతరించుట నీరివురనిచ్చుటవలెను, బడమటివైపుకాంతి శూన్యుఁడై చంద్రుఁడు దూరముగాఁబడిన పొల్లుధ్యానమువలెను నుండెనని భావము. అలం-రూపకము-ఉత్ప్రేక్ష.

మ. సిరి నెత్తామరయింటికిన్ మగుడి రాఁ◆ జెంతన్ ద్విజారావమా
ధురిఁ బుణ్యాహముఁ దెల్పుచున్ గురుతరు◆ ల్దోడ్తో నటత్పల్లవో
ధరనీహారజలంబు చిల్కఁగ నయు◆క్తం బొంటిమై నుండ నం
చు రథాంగంబు ద్విజాతిగానఁ గవయై ◆ చూపట్టె నప్పట్టునన్. 131

సిరి=లక్ష్మీదేవి, నెత్తామరయింటికి మగుడిరాన్ =విడిచిపెట్టిన కమలగృహమునకుఁ దిరిగిరాఁగా ననియర్థము. ప్రాతఃకాలమందుఁ గమలములు శోభాయుక్తము లగుచున్నవని భావము. చెంతన్ = సమీపమందు, ద్విజారావమాధురిఁబుణ్యాహముఁ దెల్పుచున్ =ద్విజశబ్దము బ్రాహ్మణులయందును బక్షులయందును వర్తించుచున్నది గనుక బ్రాహ్మణమంత్రఘోషమాధుర్యముచేతఁ బుణ్యాహవాచన మాచరించుచు నని యర్థము. పక్షికలకలస్వనమాధుర్యముచేత మనోజ్ఞమైన దినమును దెలుపుచునని భావము. ఇక్కడఁ బుణ్యమనఁగా మనోజ్ఞము. (ని. 'పుణ్యా మనోజ్ఞే విహితం తథాసుకృతధర్మయోః' అని వి.)

అహమనఁగా దినమును, గురుతరులు = పెద్దలైనవారని యర్థము. గొప్పవృక్షము లనిభావము. తోడ్తోఁ=పుణ్యాహవాచనము కాఁగానే యనియర్థము. పక్షులు కలకలధ్వనులు సేయఁగానే యనిభావము. నటత్పల్లవ=హ స్తవశమువలన నటించుచున్న చిగురుటాకులచేత,ఉదరనీహారజలంబుచిల్కఁగన్ = కలశోదరమందలి పుణ్యాహవాచనసంబంధమైన పన్నీరు చిలుకరింపఁగా ననియర్థము. వాయువశముచేత నటించుచున్న వృక్షపల్లవములచేత నుదరగతమైన మంచునీరును జిలుకరింపఁగా ననిభావము. రథాంగంబు=చక్రవాకము, ద్విజాతిగానన్ = ద్విజాతియనఁగా బ్రాహ్మణుఁడు, బ్రాహ్మణజాతిగనుక, అయుక్తంబొంటిమై నుండనంచున్ = ఒంటిగా నెదురుపడియుండుట యనుచితమని, అప్పట్టునన్ = ఆలక్ష్మీగృహప్రవేశకాలమందు, కవయైచూపట్టెన్=జోడైకనుపడె నని యర్థము.

చక్రవాకము పక్షిగనుక జన్మద్వయము గలదనియును బ్రాతఃకాలమున నాఁడుపక్షితోజోడు గూడె ననియును భావము. అనఁగాఁ బ్రాతఃకాలమందు సరోవరకమలములు వికాసమునుబొందెనని యును సరోవరతీరములయందలి గొప్పవృక్షములపైనున్న పక్షిసమూహము కలకలధ్వనులు చేసెనని యును వాయువశముచేతఁ జలించుచున్న యావృక్షపల్లవములవల్ల నుండి మంచునీ ళ్ళాకమలము మీఁదఁ బ్రసరించె ననియును జక్రవాకములు రాత్రియెల్ల నెడఁబాసియుండి యప్పుడు తిరుగా జోడుగూడె ననియును దాత్పర్యము. తెల్లవారుతరి పతగము లఱచుటయుఁ జిఱుగాడ్పులు వీచుటయు సహజము. తెల్లవారగనె చక్రవాకము జంటపులుగును గలసికొనుననుట కవిసమయసిద్ధము. ద్విజాతులగు జక్రవాకములు తెల్లవారఁగనే జోడుగూడెను. బ్రాహ్మణులిద్దఱగుపడుట మంగళమని భావము. ఇందులకు-

శ్లో. 'కన్యాగౌ భేరిశంఖం దధిఫలకుసుమం పావకం దీప్యమానం
యానంవా విప్రయుగ్మం...'

చ. ఎలమి మనోజలుబ్ధుఁ డెనయించినజక్కవదీముపెంటి పే
రెలుఁగునఁ బిల్చి చూడ్కిఁ గదియించి యెదుర్కొని మేను మేను ని
శ్చలగుణసంగతిం బెనఁచి చక్రము దామరతెంకిఁ జేర్పఁ ద
త్కలకలశంకఁబోలె విహగంబులు వీడెఁ గులాయకూటముల్. 132

ఎలమిన్=ఉత్సాహముచేత, మనోజలుబ్ధుఁడు=మన్మథుఁడనెడు కిరాతుఁడు, ఎనయించిన = పొందించిన, జక్కవదీముపెంటి=దీమనఁగా నొకజాతిపక్షులను మోహపెట్టెడుకొఱకుఁ దజ్జాతి స్త్రీపక్షినుంచి యందులో నురులొడ్డియుంచెడు బోనుపెట్టెకుఁ బేరుగనుకఁ జక్రవాకియనెడు దీము పెంటి, పేరెలుఁగునఁబిల్చి=పెద్దయెలుఁగుచేతఁ బిలిచి, చూడ్కిఁగదియించి = ఆలాగునఁ బిలువఁబడి వచ్చునట్టి పురుషపక్షియందు దృష్టినిలిపి, ఎదుర్కొని=అభిముఖమైనిలిచి, ఈమూఁడుచోట్లను బ్రకృతాప్రకృతసాధారణమని విచారింపవలయును. మేను మేను నిశ్చలగుణ సంగతిం బెనఁచి=శరీరములు రెండును నిశ్చలత్వసంగతియనెడు నిశ్చలసూత్రసంగతిచేతఁ బెనవైచి, చక్రము=చక్రవాకమును, తామరతెంకిఁ జేర్పన్=తామరయనెడు నివాసస్థానమును జేర్పఁగా ననియర్థము. ఈయర్థమందుఁ జక్రమనెడుపదమునందలి ద్వితీయకుఁ బ్రథమవచ్చినది గనుకఁ దామరయనెడిపదమునందలి మొదటి తకారమునకు దకారాదేశము వచ్చినది. ధామర యనఁగా నురుగట్టినత్రాడు గనుకఁ ధామరతెంకిఁ

జేర్పఁగానే యని యర్థాంతరము. తత్కాలకలకలశంకఁబోలెన్=ఆయుఱిలోఁబడినపక్షియొక్క కలకల మనెడు సందేహముచేతవలెను, విహగంబులు=పక్షులు, కులాయకూటములు = నివాసస్థానములైన గూళ్ళను, వీడెన్=విడిచిపెట్టెను. (ని. 'కులాయో నీడ మస్త్రియామ్' అని అ.)

ప్రాతఃకాలము కాఁగానే రాత్రి చక్రవాకము నెడఁబాసియున్న చక్రవాకియెలుఁగిచ్చి పిలిచి రాఁగానే చూచి యెదురుకొని తనశరీరము దానిశరీరముతోఁ బెనఁచికొని వాసస్థానమయిన తామరకుఁ బ్రవేశపెట్టెననియును సమస్తపక్షిజాతములును నాహారార్థము గూళ్ళవిడచి పోయెననియును నర్థము. తెంకి యనుపద మిచటఁ దకారాదియేకాని టకారాది కాదు. ఇందుకుఁ బ్రయోగము–ఉ. 'తెంకులువేదము ల్రఘుపతీశరణాగతవజ్రపంజరా' అని వజ్రపంజరశతకమునందు. అలం. రూపకానుప్రాణితోత్ప్రేక్ష.

ఉ. పంచశిలీముఖుండు తుదఁబాణమునన్ జగ మెల్ల గెల్చి య
భ్యంచితపుష్పవృష్టి మరుదావళి నింపఁగ నిప్పు డల్లు ము
ద్రించినజాడఁ దెల్పె సుదతీ మధుపంబు పరిచ్ఛదచ్ఛటా
కంచుకితోత్పలంబుతుదఁ కచ్చునఁ జిక్కి యచంచలాకృతిన్. 138

పంచశిలీముఖుండు=అయిదుబాణములుగల మన్మథుఁడు, తుదబాణమునన్=అనఁగా, ని. 'అరవింద మశోకంచ చూతంచ నవమల్లికా, నీలోత్పలంచ పంచైతే పంచబాణస్య సాయకాః' అనియున్నదిగనుకఁ దుదబాణమనఁగా నీలోత్పలము.

కాఁబట్టి యట్టినీలోత్పలబాణముచేత, జగమెల్ల గెల్చి=అనఁగా రాత్రియందే తనకు నుద్రేకంబును రాత్రియందే నల్లగలువలకు వికాసంబును గనుక నల్లగలువచేతనే ప్రపంచమునంతయు జయించి, అభ్యంచితపుష్పవృష్టిమరుదావళినింపఁగన్=మరుచ్ఛబ్దము దేవతలయందును వాయువులయందును వర్తించును. ని. 'మరుతౌ పవనామరౌ' అని అ. మిక్కిలియు నొప్పుచున్న పుష్పవర్షమును దేవతాశ్రేణి గురిపింపఁగానని యర్థము. వాయువులు పువ్వులురాల్పఁగా ననిభావము. ఇప్పుడు=ఈ సమయమందు, మధుపంబు=తుమ్మెద, ఉపరిచ్ఛదచ్ఛటా=పైనున్నపత్రస్తోమముచేత, కంచుకిత=ఆచ్ఛాదింపఁబడిన, ఉత్పలంబు=నల్లగలువయొక్క, తుదకచ్చునఁజిక్కి=చివరఱేకులకప్పులోఁ జిక్కుపడి–అనఁగాఁ గొంతదేహము పైకిఁ గనుపించునట్లుగాఁ జివరను జిక్కుకొన్నదై, అచంచలాకృతిన్=చలింపనిదేహముతోడ, అల్లుముద్రించినజాడఁ దెల్పెన్ = నీలోత్పలబాణపుటలుగుమీఁద నీకాచేసినరీతిని దెలియఁజేసె ననియర్థము. ఇక్కడఁ బైనున్నపత్రస్తోమముచేత నాచ్ఛాదితమైనదని యుత్పలపరమైన యర్థము.

ఉపరిభాగమందు వస్త్రచ్ఛటాచ్ఛాదితమని బాణపరమైన యర్థము. ఛదశబ్దము వస్త్రపరమయినందుకు, శ్లో. 'ఇభేడార్ద్రాజి నాచ్ఛచ్ఛదః' అని కాళిదాసప్రయోగము. అలం. పరికరము. నిదర్శనము.

మన్మథుఁ డరవిందము మొదలైన మీఁదినాలుగుబాణములును బ్రయోగించినమీఁదటఁ బ్రయోగించెడు బాణముగనుకఁ దుదబాణమన్నాఁడని తెలియవలయును. ఇందుకుఁ బద్యము–

క. 'కూడుడిగించునశోకము, వాడించును మల్లెవిరి వివర్ణితఁజేయుం

జాడఁగఁ జూతము తలఁపు, జ్జోడించుం దమ్మి చంపఁ జూచుం గలువల్.'

అని చెప్పఁబడియున్నది గనుక సర్వజ్ఞుఁడైన యమరకోశకారుఁడును నీ యభిప్రాయముచేతనే నీలోత్పలమును దుదను జెప్పినాఁడు.

ఉ. తమ్మిపతంగపత్ని తమిఁ ♦ దాల్చినపాండురకోరకాండము
ల్గ్రమ్మి నిమీలితచ్ఛదప♦రంపరచేఁ బ్రసవాప్తివేళ రా
నిమ్ముగ వాని నొయ్య విరి♦యించిన హేతుగుణాప్తిఁ బాంథవ
ర్గమ్ముల నేచు తేఁటిపిలు♦క ల్వెడలెన్ సహజాసితచ్ఛవిన్. 134

తమ్మి=పద్మలతయనెడు, పతంగపత్ని=పతంగశబ్దము పక్షియందును సూర్యునియందును వర్తించుచున్నది గనుకఁ బక్షికాంతయని యర్థము. సూర్యపత్నియనిభావము. తమిఁదాల్చిన=రాత్రియందుఁబెట్టిన, (ని. 'రజనీ యామినీ తమీ' అని అ.) పాండురకోరకాండముల్=తెల్లనిమొగ్గలనెడు గ్రుడ్లను, నిమీలితచ్ఛదపరంపరచేన్ = ముకుళితపత్రపరంపరయనెడు నాకుంచితపక్షపరంపరచేత, క్రమ్మి=పొదిగి, ప్రసవాప్తివేళరాన్=వికసించి పుష్పములయ్యెడు సమయమనెడు ప్రసవకాలమురాఁగానే, అనఁగా గ్రుడ్లు నవియించునట్టికాలము రాఁగానే, (ని. 'స్యాదుత్పాతే ఫలే పుష్పే ప్రసవో గర్భమోచనే' అని వి.) ఇమ్ముగన్=యుక్తముగా, వానినొయ్యవిరియించినన్=ఆమొగ్గలను వికసింపఁజేయఁగా నని పద్మలతాపరమయిన యర్థము. గ్రుడ్లను ముక్కుతోఁ బొడిచి యవియింపఁగానని పక్షిపరమయిన యర్థము. ఉభయత్ర యభేదాధ్యవసాయము. హేతుగుణాప్తిన్=హేతువైన రాత్రియొక్క గుణప్రాప్తిచేత, పాంథవర్గమ్ములనేచు=విరహిజనసమూహములను వ్యథపెట్టునట్టి, తేఁటిపిలుకల్=తుమ్మెదలనెడుపిల్లలు, సహజాసితచ్ఛవిన్=స్వభావసిద్ధమయిన నీలకాంతితోడ, వెడలెన్=బయలుదేరెను. రూపకాలంకారము.

ఇక్కడ రాత్రి కారణమును రాత్రియందుఁబెట్టిన కోరకాండములవలనఁబుట్టిన తేఁటిపిలుకలు కార్యములును నవుచున్నవి గనుక, 'కారణగుణాహి కార్యగుణానారభంతే' అనెడు న్యాయముచేతఁ గారణమగురాత్రియొక్కగుణములైన పాంథవర్గబాధకత్వమును నసితచ్ఛవియును గార్యములైన తేఁటిపిలుకలయందుఁ గనపడియెనని యెఱుంగునది. పులుగుచెలువ ముడువఁబడిన ఱెక్కలచే దరుణము వఱకుఁ దెల్లనిగ్రుడ్లను పొదిగి యుచితకాలమున ముక్కుతోఁ బొడిచి పిల్లలను బయటికి వెడలించినట్లు పద్మలత రేయెల్లదళములతోఁ బద్మకుట్మలస్థమగు తుమ్మెదలనుగప్పి తెల్లవారఁగనే విడచిపెట్టినట్లు బయలువెడలెనని భావము.

చ. సమయమహర్షి బోధగుణ♦శాలి మహోదయభూమిభృద్వతం
సమునకుఁ బ్రాగ్వధూటియెడఁ ♦ జక్రహితుండు నశేషదేవతాం
శము నగుసూనునిం దలఁచి ♦ సాంధ్యమహామయహోమవహ్ని దీ
ప్తముగ నొనర్చెఁ దారచరు♦భక్తశతాహుతిపూర్వకంబుగాన్. 135

సమయమహర్షి=ప్రాతఃకాలమనెడి ఋషీశ్వరుఁడు, ఆయనయెట్టివాఁడనిన, బోధగుణశాలి=మేలుకొనుటయనెడు పరిజ్ఞానముచేత నొప్పుచున్నవాఁడు, ఆయన, మహోదయభూమి భృద్వతంసమున్=మహత్తయిన యుదయగిరీంద్ర మనెడు మహాభ్యుదయముగల రాజశ్రేష్ఠునకు, (ని. 'ఉద

యస్తు పుమా న్పూర్వపర్వతే చ సమున్నతౌ' అని మే. (ని. 'భూభృ ద్భూమిధరే నృపే' అని అ.) ప్రాగ్భూధాటియెడన్ = పూర్వదిశయనెడు ధర్మపత్నియందు, చక్రహితుండున్ = చక్రవాకహితుండును, అశేష దేవతాంశమునగు = సమస్తదేవతాత్మకుఁడునునయిన, సూనునిన్ = సూర్యుఁడనెడు, చక్రహితుండును = రాష్ట్రహితుండును, అశేష దేవతాంశమునగు = అష్టదిక్పాలకాంశమునయిన, సూనునిన్ = కుమారుని, తలఁచి = సంకల్పించి, ఇక్కడ నభేదాధ్యవసాయము. సూనుశబ్దమునకు, (ని. 'సూనుః పుత్రే నుజేరవౌ' అని వి.) సూర్యుఁడు సమస్తదేవతాత్మకుఁ డన్నందుకు నాదిత్యహృదయమందు, (శ్లో. 'ఏష బ్రహ్మాచ విష్ణుశ్చ శివః స్కందః ప్రజాపతిః, మహేన్ద్రో ధనదః కాలో యమ స్సోమో హ్యపాం పతిః') అని చెప్పఁబడియున్నది. రాజకుమారుఁ డష్టదిక్పాలకాంశ మన్నందుకు, (శ్లో.'అష్టాభి ర్లోకపాలానాం మాత్రాభి ర్నిర్మితో నృపః')అని చెప్పఁబడియున్నది. సాంధ్యమహాహోమయ హోమవహ్నిన్ = ప్రాతస్సంధ్యారాగమనెడు హోమాగ్నిని, తారచరుభక్తశతాహుతిపూర్వకంబుగాన్ - తార = నక్షత్రములనెడు, చరుభక్తశతాహుతి పూర్వకంబుగాన్ = హోమయోగ్యపక్వాన్న భాగశతాహుతిపూర్వకముగాను, దీప్తముగనొనర్చెన్ = ప్రకాశమానమగునట్లుగాఁ జేసెను.

భక్తమనఁగా అన్నము, (ని. 'భిస్సా స్త్రీ భక్తమంధోన్నమ్' అని అ.) అనఁగా మేలుకొనుట యనెడు పరిజ్ఞానముచేత నొప్పుచున్న ప్రాతఃకాలమనెడు ఋషీశ్వరుఁడు, మహత్తయిన యుదయాచలేంద్రమనెడు మహాభ్యుదయముగల రాజశ్రేష్ఠునకుఁ బ్రాగ్దిశయనెడు ధర్మపత్నియందుఁ జక్రవాకహితుఁడును సమస్తదేవతాత్మకుఁడును నయిన సూర్యుఁడనెడు రాష్ట్రహితుఁడును నష్టదిక్పాలకాంశమును నయిన కుమారుఁడు గలుగునట్లుగా సంకల్పించి సంధ్యారాగమనెడు హోమాగ్నిని నక్షత్రములనెడు హోమయోగ్యపక్వాన్నభాగశతాహుతిపూర్వకముగాఁ బ్రకాశమానమగునట్లుచేసెను. అనఁగాఁ బుత్రకామేష్టిహోమముచేసెనని తాత్పర్యము.

మ. కుముదాధారవిహారము ల్కమల కన్గొంచ జాల కంభోజగే
హాము మయాయం దెలిపింతు వేగ నని వామాలోకము న్మాటి యా
సమయోపేంద్రుఁడు దక్షిణాక్షిఁ దెఱచెన్ ♦ సంజాతరాగానుబం
ధముతో నా విధుఁ డేఁగెఁ బ్రొద్దు వొడిచెన్ ♦ బంధూకబంధుచ్ఛవిన్. 136

కుముదాధారవిహారముల్ = కుశబ్దముభూమియందు వర్తించుచున్నది గనుక సవతియైన భూదేవియొక్క ప్రీతి కాధారములైన విహారములని యర్థము. (ని. 'గోత్రాకుః పృథివీ పృథ్వీ' అని అ.) కుముదముల కనఁగాఁ గలువల కాధారములయిన విహారములననిభావము. కమల = లక్ష్మీదేవి, కన్గొంచ జాలక = చూడఁజాలక - అనఁగాఁ జూచి యోర్వలేక యనుట. అంభోజగేహాముమయాయన్ = తామరయింటివాఁకిలి మయాయఁగానే యనియర్థము. రాత్రియందుఁ దామరలు ముకుళించుచున్నవనిభావము. తెలిపింతువేగనని = అనఁగా శీఘ్రముగాఁ దెలిపింతునని యర్థము. తెల్లవారఁగానే తామరలు వికసించుచున్న వనిభావము. ఆసమయోపేంద్రుఁడు = ప్రాతఃకాలమనెడు శ్రీమహావిష్ణువు, వామాలోకము న్మాటి = ఎడమకన్నుమూసి, సంజాత = పుట్టిన, రాగానుబంధముతోన్ = ఎడతెగని యనురాగముతోడ, దక్షిణాక్షిఁ దెఱచెన్ = కుడికన్ను దెఱచినవాఁడాయెనో, నాన్ = అన్నట్లుగా, విధుఁడేగున్ = చంద్రుఁ డస్తంగతుఁడాయెను, బంధూకబంధుచ్ఛవిన్ = బంధూకమనఁగా మంకెనపువ్వు గనుక దానితో సమానమయినకాంతితోడ, ప్రొద్దువొడిచెన్ = సూర్యుఁడుదయించెను.

అనఁగా ననురాగ మరుణవర్ణమని మహాకవి ప్రసిద్ధము గనుక ననురాగయుక్తమయిన కుడికన్ను తెఱచెనో యన్నట్టులుగా మంకెనపువ్వుతో సమానమైన యరుణకాంతితోడ సూర్యుఁ డుదయించెనని తెలియవలయును. దృష్టికిని ననురాగయుక్తత్వము ప్రతాపరుద్రీయమందుఁ జెప్పఁబడినది. శ్లో. 'కాకతిక్ష్మాపతేర్దృష్టి రనురాగతరఙ్గితా, లగ్నా కల్హారమాలేవ వక్షస్సుజ్జ్వలచద్వయే.' అని విష్ణునకు సూర్యుఁడు కుడికన్ను, చంద్రుఁ డెడమకన్ను, కుముదాధారవిహారము సవతి పెంపు గానని సైపఁజాలక లక్ష్మి తనగృహము మూసికొనెను. కుడికన్ను విష్ణునకు సూర్యుఁడు గానఁ గుడికన్ను తెఱవఁగనే సవతిపెం పడఁగెను. లక్ష్మీమందిరముఁ దెఱవఁబడెను. అనఁగాఁ గలువలు ముకుళింపఁ దమ్ములు వికసింపఁ దూర్పుకట్టెఱవార సూర్యుఁడుదయించెనని తా. అలం. ఉత్ప్రేక్ష.

శా. ఓచామీకరచారుగాత్రి నిను గోత్రోత్తంసముల్ వేఁడి నేఁ
డా చేదిక్షితిపాలశేఖరునితో ♦ హత్తింపఁగా వచ్చు త
త్ప్రాచీభర్తకుఁ బట్టుపట్టుగొడు గై ♦ భానుండు దోఁపం బ్రభా
వీచుల్ తద్గతరత్నగుచ్ఛముల తీ♦విం బొల్చెఁ బ్రాంతంబునన్. 137

ఓచామీకరచారుగాత్రి=చామీకరమనఁగా బంగారము, (ని. 'చామీకరం జాతరూపం మహారజతకాఞ్చనే' అని అ.) బంగారపు కణికవంటి దేహముగల యోగిరికాదేవీ, నినుగోత్రోత్తంసముల్ వేఁడి=నిన్ను వసురాజునకుఁ బర్వతశ్రేష్ఠుఁడైన కోలాహలుని యాచించి, నేఁడు=ఈదినమందు, ఆచేదిక్షితిపాలశేఖరునితో హత్తింపఁగావచ్చు=చేదిదేశాధీశ్వరశ్రేష్ఠుఁడైన యావసురాజుతోఁ గూర్చుటకై వచ్చుచున్న, తత్ప్రాచీభర్తకున్=పూర్వదిశానాథుఁడైన యాయింద్రునకు, ఇది సాభిప్రాయపదము. పట్టు=పట్టిన, పట్టుగొడుగై=ఎఱ్ఱపట్టుగొడుగో యన్నట్లుగా నున్నవాఁడై, భానుండుదోఁపన్=సూర్యుఁడు గనుపింపఁగా, ప్రభావీచుల్=తరంగప్రాయములయిన యరుణకాంతులు, ప్రాంతంబునన్=సమీపమందు, తద్గతరత్నగుచ్ఛములతీవింబొల్చెన్=ఆసూర్యుఁడనెడు గొడుగునంటియున్న కెంపు మణులగుత్తులవలెనే ప్రకాశించెను.

సూర్యుఁడు ఇంద్రునకుఁ బట్టిన కెంబట్టుగొడుగువలెనుండెననియు సూర్యకిరణము లాగొడుగునకుఁ గట్టిన జాలరులవలెనుండెననియు భావము. అలం. రూపకోపమలు.

క. అని విన్నవించుటయుఁ గ్రొ,న్ననపానుపు డిగి ప్రసన్న♦నలినానన దా
ననఘదినాననకృత్యము, లొనరించి గురుల్ భజించి ♦ యుండెం బ్రీతిన్. 138

అని విన్నవించుటయున్=ఈలాగని చెలికత్తె విజ్ఞాపనము సేయఁగా, క్రొన్ననపానుపుడిగి=పుష్పశయ్యమీఁదినుండి క్రిందికిదిగి, ప్రసన్ననలినానన=విలాసయుక్తమయిన పద్మమువంటి ముఖము గల గిరికాదేవి, తాన్=తాను, అనఘదినాననకృత్యములొనరించి - అనఘ = దోషరహితమయిన, దినాననమనఁగా నహర్ముఖము. అనఁగాఁ బ్రాతఃకాలముగనుకఁ బ్రాతఃకాలకృత్యములు జరిగించి- అనఁగా ముఖప్రక్షాళనాదికార్యములు నిర్వర్తించి, గురుల్ భజించి=తండ్రియైన కోలాహలుని సేవించి, ఉండెంబ్రీతిన్=సంతోషముతో నుండెను.

ఆశ్వాసాంతము.

మ. అధరీభూతజయంతకంతుసుకుమా♦రాకార రాకారజ
న్యధికోత్తేజితరాజబింబరుచిధా♦రాధార రాధారమ

ణ్యధినాథాంఘ్రిసరోరుహద్వితయసే• వాచార వాచారమా
మధురాశేషవిశేషభూషితసుధీ•మందార మందారతా. 139

అధరీభూత=తిరస్కృతులైన, జయంత=ఇంద్రునికుమారుఁడైన జయంతుండును, కంతు=మన్మథుఁడును గల, సుకుమార=మృదులమైన, ఆకార=రూపముగలవాఁడా, రాకారజనీ=పూర్ణిమారాత్రిచేత, అధికోత్తేజిత=అత్యంతమగునట్టులుగాఁ బ్రకాశింపఁజేయఁబడిన, రాజబింబ=చంద్రబింబముయొక్క, రుచిధారా=కాంతిప్రవాహములవంటిలావణ్యధారలకు, ఆధార=ఆస్పదమైనవాఁడా-అనఁగాఁ జంద్రబింబమందలి లావణ్యమువంటి లావణ్యముగలవాఁ డనుట. రాధారమణీ=రాధికాదేవియొక్క, అధినాథ=ప్రాణనాథుఁడైన శ్రీకృష్ణస్వామియొక్క, అంఘ్రిసరోరుహద్వితయసేవా=పాదారవిందద్వయసేవయే, ఆచార=ఆచరణముగాఁ గలవాఁడా, వాచారమా=వచోలక్ష్మియొక్క, మధుర=మనోహరములయిన, అశేషవిశేష=సమస్తవిశేషములచేత, భూషిత=అలంకృతులయిన, సుధీ=విద్వాంసులకు, మందార = మందారమనెడు దేవతావృక్షమైనవాఁడా-అనఁగా వారియొక్క వాంఛితార్థముల నిచ్చెడువాఁడ వనుట. మందారతా - మంద=అలసులయందు, అరతా=ఆసక్తిలేనివాఁడా అని యాశ్వాసాంతమందుఁ గృతిపతిసంబోధనము.

క. అబ్రాశిధీరధీరచితబ్రాహ్మీధవవివేక • తరుణచరణభా
గిబ్రామశరణ సకలక, కుబ్రామాభరణకరణ • గుణసంభరణా. 140

అబ్రాశి=జలరాశివలె-అనఁగా సముద్రునివలెనే, ధీర=తొణకనివాఁడా-అనఁగా గంభీరుఁడవైనవాఁడా యనుట. ధీ=స్వకీయమైనబుద్ధిచేత, రచిత=విరచితమైన, బ్రాహ్మీధవ=బ్రహ్మయొక్క, వివేక = యుక్తాయుక్తపరిజ్ఞానముగలవాఁడా-అనఁగా వివేకమందు బ్రహ్మసమానుఁడాయనుట. తరుణచరణభాక్=కోమలములైన పాదములనుబొందిన - అనఁగాఁ బాదప్రణతుఁడైన, ఇబ్రామ=ఇబరామనెడు రాజునకు, శరణ=రక్షకుఁడవైనవాఁడా, సకల=సమస్తమయిన, కకుబ్రామా=దిక్కాంతలకు, ఆభరణకరణ = అలంకారములయిన, గుణ = గుణములను, సంభరణ=భరించినవాఁడా అని సంబోధనము. ని. 'దిశస్తు కకుభః కాష్ఠా' అని యమరము.

మాలినీవృత్తము. పరిచితకరహాటీ•ప్రాప్తకర్పూరవీటీ
విరుతకటకలాటీ•విశ్రుతస్వర్ణశాటీ
స్థిరవిజయకిరీటీ • తిమ్మమాగర్భపేటీ
వరమణినిభ ధాటీ•వల్గుధారాటఘోటీ. 141

పరిచిత=పరిచితురాలైన, కరహాటీ=కరహాటదేశస్త్రీచేత, ప్రాప్త=పొందఁబడిన, కర్పూరవీటీ=కర్పూరతాంబూలము గలవాఁడా, విరుతకటక=ఝుణఝుణత్కారముగల కంకణములు గలిగిన, లాటీ=లాటదేశస్త్రీచేత, విశ్రుత = తెలియఁబడిన, స్వర్ణశాటీ=తదీయోత్తరీయ సువర్ణశాటిగలవాఁడా, స్థిరవిజయకిరీటీ=స్థిరమయిన విజయమందర్జునుఁడవైనవాఁడా, తిమ్మమాగర్భపేటీ వరమణినిభ = తిమ్మాంబయొక్క గర్భమనెడుపెట్టెకు మాణిక్యమువంటివాఁడా, ధాటీవల్గుధారాటఘోటీ - ధాటీ=దాడివెళ్లుటయందు, వల్గు = మనోహరమయినదియును, ధారా=అశ్వగతిపంచకముచేత, అట=సంచరించునదియును నగు, ఘోటీ=గుఱ్ఱములుగలవాఁడా, లేక, ధారాట=ధారాటదేశసంభవములయిన, ఘోటీ=

అఁడుగుఱ్ఱములుగలవాఁడా - అనఁగా మాదువాను గుఱ్ఱములుగలవాఁడా యనుట. ధారాశబ్దము దేశ విశేషవాచక మైనందుకు నాముక్తమాల్యదయందుఁ బ్రయోగము. ప. 'బాహ్లీకపారసీకశకధారారట్ట ఘోట్టాణముల్' అని చెప్పఁబడియున్నది.

గద్యము. ఇది శ్రీమద్రామచంద్రచరణారవిందవందనపవననందనప్రసాదసమాసాదిత సంస్కృతాంధ్రభాషాసామ్రాజ్యసర్వంకషచతుర్విధకవితానిర్వాహక సాహిత్య రసపోషణరామరాజభూషణప్రణీతం బయినవసుచరిత్రం బనుమహాప్రబంధంబు నందుఁ జతుర్థాశ్వాసము.

ఇది శ్రీమదాత్రేయకులకలశాంభోనిధిసంపూర్ణసోమ సోమాభిధానమంత్రివరపౌత్త్రుండును సోమసుతసిద్ధేశ్వరమంత్రీశ్వరపుత్త్రుండును శ్రీమత్పార్వతీరాజేశ్వరవరప్రసాదసమాసాదితహృద్యానవద్యనిఖిలవిద్యావిశారదుండును నగుసోమకవిచేత విరచితం బయిన విద్వజ్జనరంజనీనామకపూర్వవ్యాఖ్యానమందలివిశేషవిషయసహితంబుగాఁ బరిష్కృతంబయి యొప్పారుప్రతిపదటీకారూపం బగు వసుచరిత్రనామకాంధ్రకావ్యరత్నవ్యాఖ్యానమునందుఁ జతుర్థాశ్వాసము.

శ్రీ ర స్తు.

వసుచరిత్రము సవ్యాఖ్యానము

పం చ మా శ్వా స ము.

శ్రీసదృశవెంగళాంబా
భాసురలాక్షాంఘ్రిశంఖ•పద్మశుభాంక
ప్రాసాదకేళిరసిక సు
ధీసన్నుతగుణనికాయ • తిరుమలరాయా. 1

శ్రీసదృశ=లక్ష్మీసమానురాలయిన, వెంగళాంబా=వెంగళమ్మయొక్క, భాసుర=ప్రకాశమానమైన, లాక్షా=లత్తుకచేత, రంజిత=రంజింపఁబడిన, అంఘ్రి=పాదములయందలి, శంఖపద్మ=శంఖములను బద్మములను సూచనసేయుచున్న, శుభాంక=శుభచిహ్నములుగల—అనఁగా నెట్టిని శంఖపద్మరంగవల్లికలచేత-అనఁగా ముగ్గులచేత నలంకరింపఁబడినదానివలెనున్న, ప్రాసాద=మేడయందలి, కేళి=క్రీడయందు, రసిక=రసికుఁడైనవాఁడా, ఇక్కడ వస్తువుచేత నలంకారధ్వని. సుధీ=విద్వాంసులచేత, సన్నుత=స్తోత్రముచేయఁబడిన, గుణనికాయ=సుగుణసమూహము గలవాఁడా, తిరుమలరాయా=తిరుమలదేవరాయా, అని యాశ్వాసాదియందుఁ గృతిపతియొక్క సంబోధనము.

తే. అవధరింపుము శౌనకా•ద్యఖిలసన్ము
నీంద్రులకు రౌమహర్షణి • యిట్టు లనియె
నాత్మకన్యోపలాలనా•యత్తహృదయుఁ
డై హిమాహార్యసుతుఁ డున్న•యవసరమున. 2

అవధరింపుము=చిత్తగింపుము, శౌనకాద్యఖిలసన్మునీంద్రులకున్=శౌనకుఁడు మొదలయినసమస్తమునిశ్రేష్ఠులకును, రౌమహర్షణి=రోమహర్షణపుత్త్రుఁడైనసూతుఁడు, ఇట్టులనియెన్ = ఈలాగని పలికెను, హిమాహార్యసుతుఁడు=హిమవత్పర్వతకుమారుఁడయినకోలాహలుఁడు, ఆత్మకన్యా=తనకూఁతురైనగిరికాదేవియొక్క, ఉపలాలన=గారవించుటయందు, ఆయత్త=అధీనమయిన, హృదయుఁడై=చిత్తముగలవాఁడై, ఉన్నయవసరమునన్=ఉన్నసమయమందు, ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

సీ. తొలుదొల్తఁ బారిజా•తలతాంతమాలికాపవనంబు ఘుమ్మునఁ • బరిమళించె
నావెన్క నాకాండి•కాభ్రగర్జార్భటి బుభుదుంధుభు ల్గుభు•ల్గుభులు మనియె
నాపిమ్మట వియచ్చ•రీపాణివల్లకీగుంభస్వరంబులుఁ • ఘుమ్ము రనియె
నాపిదప నఖండ • మై దండిమై నొక్కదివ్యతేజము ధిగ•ద్ధిగ వెలింగెఁ

తే. జదల నొకకొంత సేపున♦కిది విమాన, పంక్తి యనియును వీరు ది♦క్పాలురనియు
మునులనియు లేఖభామిను♦లనియు నవని,గలజనులకద్భుతంబుగా♦గానవచ్చె.

తొలుదొల్తన్=ముందుముందుగా, పారిజాత లతాంత మాలికా పవనంబు=పారిజాత పుష్ప మాలికలయొక్క వాయువు, ఘుమ్మునఁబరిమళించెన్=ఘుమ్ముమని వాసనగొలిపెను, ఆవెన్కన్=ఆతరువాత, ఆకాండిక=అకాలసంభవమయిన, అభ్ర=మేఘముయొక్క, గర్జార్భటిన్=ఉఱుముల యార్భాటములవంటి యార్భాటములచేత, బుభుదుందుభులు=దేవదుందుభులు, గుభుల్గుభులుమనియెన్=గుభులుగుభులు మని మ్రోసెను, ఆపిమ్మటన్=ఆవెనుక, వియచ్చరీ=దేవతాస్త్రీలయొక్క, పాణి=హస్తములయందలి, వల్లకీ=వీణలవలన, గుంభ=కల్పితములయిన, స్వరంబులు=షడ్జపంచమాదిస్వరములు, ఘుమ్మురనియెన్=ఘుమ్ముమని వినఁబడియెను, ఆపిదపన్=ఆపిమ్మట, అఖండమై=అవిచ్ఛిన్నమై, దండిమైన్=బలమగునట్టులుగా, ఒకదివ్యతేజము = ఒకానొక దివ్యతేజస్సు, ధిగద్ధిగ వెలింగెన్=దిగధిగయని ప్రకాశించెను.

చదల నొకకొంత సేపునకున్=ఆకాశమందుఁ గొంతసేపటికి, ఇది విమానపంక్తి యనియును=ఇది విమానశ్రేణియనియును, వీరుదిక్పాలురనియున్=వీరుదిక్పాలకులనియును, మునులనియున్=వీరు మునులనియును, లేఖభామినులనియున్ = వీరు దేవతాస్త్రీలనియును, అవనిఁగలజనులకున్=భూలోకమందుండెడు జనులకు, అద్భుతంబుగాఁ గానవచ్చెన్=ఆశ్చర్యమగునట్టులుగాఁ గానవచ్చెను.

పారిజాతసుగంధము మిగుల వ్యాప్తిగలదిగానఁ దద్వాసన లింద్రాగమసూచకముగఁ దొలుతఁ బొలసెను. తరువాత వేల్పులు మ్రోగించు దుందుభుల మ్రోఁత వినవచ్చెను. సమీపింప వేలుపుఁజెలుల వీణాగానము వినఁబడెను. రత్నస్థగితమగుటచే విమానకాంతి వెలింగెను. చేరువకు రాఁగానందున్నవారి గుర్తింప నవకాశము కలిగెను. అలం. సహజోక్తి.

క. హరిముఖ హరిదీశానులు, హరిహయ సామజ విమాన♦హరిహరిణాక్షీ
హరిముఖముఖులును దోఁపఁగ, హరిహరి యంబరము చిత్ర♦మై విలసిల్లెన్. 4

హరిముఖ=ఇంద్రుఁడు మొదలైన, హరిదీశానులు=దిక్పతులును, హరిహయ=దేవేంద్రునియొక్క, సామజ=ఏనుఁగును-అనఁగా నైరావతగజమును, విమాన=విమానమును, హరి=గుఱ్ఱమును-అనఁగా నుచ్చైశ్శ్రవమును, హరిణాక్షీ=అప్సరసలును, హరిముఖ=అశ్వముఖులైన గంధర్వులును, ముఖులును=మొదలుగాఁగలవారందఱును, తోఁపఁగన్=కనుపడఁగా, హరిహరి=అనఁగా నాశ్చర్యపూర్వకమయిన హరిస్మరణ, అంబరము=ఆకాశము, చిత్రమైవిలసిల్లెన్=చిత్తరువువ్రాయఁబడినదానివలెనున్నదై ప్రకాశించెను. హరిశబ్దమునకు-(ని. 'హరి ర్వాతార్క చంద్రేంద్ర యమోపేంద్ర మరీచిషు, సింహాశ్వ కపి భేకాహి శుక లోకాంతరేషు చ' అని విశ్వనిఘంటువు.)

మ. ప్రబలాకారముతో గిరీశశిరముం♦ బ్రాపింపఁ బెన్ బాఁగ నాఁ
గ బెడంగయ్యె జనాపవాద మిది యు♦క్తం బౌనె నాకంచుఁ దా
నబలాకారముఁ బూని చయ్యన గిరీ♦శావాప్తికిన్ వచ్చెన
వ్విబుధేంద్రాపగ పద్మపాదపదవీ♦విన్యస్తభృంగాక్షి యై. 5

ప్రబలాకారముతోడ్=ప్రబలమైనరూపముతోడ, గిరీశశిరముంబ్రాపింపక్=కైలాసాధీశ్వరుఁడైన శివునియొక్క తలపై నెక్కినందున, పెద్దాఁగనాఁగ బెడంగయ్యె జనాపవాదము = పెద్దతాఁగ యనఁగా ధూర్తస్త్రీ యనునట్లుగా జననింద యతిశయించెను, ఇది=ఈజననింద, యుక్తంబె నా కంచుక్=నాకుఁదగునా యని, తా నబలాకారముఁ బూని = ప్రబలముగాని యల్పాకారమును వహించి, చయ్యనక్=శీఘ్రముగా, గిరీశావాప్తికి న్వచ్చెక్=గిరీశునిఁజెందుటకు వచ్చెనని యర్థము, స్త్రీరూపము దాల్చి పర్వతశ్రేష్ఠుఁడైన కోలాహలునిఁ జేరవచ్చెనని భావము. ఎవ్వరనిన, అవ్విబుధేంద్రాపగ=ఆదేవనది యనఁగా నాకాశగంగ, ఏలాగునవచ్చెననిన, పద్మపాదపదవీవిన్యస్తభృంగాక్షియై=పద్మసదృశమయిన పాదపద్ధతియందునుపఁబడిన భృంగసమాననేత్రములు గలదైయని స్త్రీపరమయిన యర్థము. పాదములవంటి పద్మములయం దుంపఁబడిన నేత్రసదృశభృంగములుగలదై యని యాకాశగంగాపరమయిన యర్థము. తాఁగలక్షణము నెత్తినెక్కుట, ఇది జనాపవాదహేతువు. కాన నిది యయుక్తము. సాధ్వీధర్మ మబలాకారధారణము. పరుల దిలకింపక నేలను దిలకించుట సాధ్వీధర్మము. గంగ సాధ్వీధర్మమూని కోలాహలునిచెంత కరుదెంచెనని భావము. అలం. ఉత్ప్రేక్ష.

సీ. తవిలి యర్ధపులాయి♦తమున జోడనఁ జూపు నోజ జేజేరాచ♦తేజి డిగియెఁ
దులకించు మొనవ్రేలఁ♦దలవంచుకొన్న వన్నియ మీఁఱ వేల్పుక♦న్నియలు డిగిరి
కరఘూతపతదబ్ద♦ఘటఁ గొమ్ముకొనఁ జిమ్ముతమి దోనెడొగ్గి చౌ♦దంతి డిగియె
రేచకాభ్యాససం♦సూచకాత్మీయచాతురిఁ జేసి బాసవా♦ల్దొరలు డిగిరి

తే. గిరిగరుచ్ఛేదిముఖ వియ♦చ్చరులయుచిత
గమనకథనకటాక్షరే♦ఖాగుణముల
వెంబడిన దివ్యరథకందం♦బంబు డిగియె
వసుధ నుద్గ్రీవు లై యెల్ల♦వారుఁ జూడ. 6

తవిలి=అంటి, అర్ధపులాయితమునక్=మండలగతివిశేషమందు, జోడనఁజూపునోజక్ = ధారకగతి గనుపఱిచినట్టులుగా-అనఁగా కావాదిరిగినట్టులుగా, జేజేరాచతేజి డిగియెక్=ఇంద్రునిగుఱ్ఱము-అనఁగా నుచ్చైశ్శ్రవము క్రిందికిదిగెను, తులకించు మొనవ్రేలఁ దలవంచుకొన్నవన్నియ మీఁఱక్= ఒప్పుచున్న కాలి బొటనవ్రేలియందుఁ దలవంచి చూచుకొనెడిరీతి యతిశయించునట్లుగా, వేల్పుకన్నియలు డిగిరి=అప్సరసలు దిగిరి, మొనవ్రేలికై తలవంచుకొనుట స్త్రీలకు స్వాభావికమయిన చేష్టావిశేషము.

కర=తుండముచేత, ఘూత=కదల్పఁబడినదై, పతత్=పడుచుండెడు, అబ్దఘట=మేఘమాలికను, కొమ్ముకొనఁజిమ్ము=దంతాగ్రముచేతఁ జిమ్మివైచెడి, తమిక్=కోరికచేత, దోనె డొగ్గి=క్రిందికి మోఁకరించికొని, చౌదంతి డిగియెక్-చౌదంతి=చతుర్దంతదంతావళము-అనఁగా నైరావతము, డిగియెక్= దిగెను, రేచకాభ్యాస = రేచకమనఁగాఁ బ్రాణవాయువు నధోముఖము సేయుట గనుక దానియందలి యభ్యాసమును, సూచక=తెలియఁజేయునదియయిన, ఆత్మీయ=స్వకీయమయిన, చాతురిఁజేసి=చాతుర్యమువలన, బాసవాల్దొరలు డిగిరి=వాక్కులే కత్తులుగాఁగల మునీశ్వరులు దిగిరి-అనఁగా మాటలచేతనే కత్తిచేయుంపని చేయుమునులు దిగిరనుట.

గిరిగరుచ్ఛేది ముఖవియచ్చరుల=పర్వతపక్షచ్ఛేదియైన యింద్రుఁడు మొదలైనవారియొక్క, ఉచిత=తగిన, గమన=నడకను, కథన=తెలియఁజేసెడు, కటాక్షరేఖా=క్రేఁగంటిచూపులయొక్క పంక్తుల నెడు, గుణముల=త్రాళ్ళయొక్క, వెంబడిన=వెంటనే, దివ్యరథకదంబంబు డిగియెన్ = దివ్యవిమాన సమూహము దిగియెను. ఏలాగునననిన, వసుధన్=భూమియందు, ఉద్గ్రీవులై=ఎత్తఁబడిన కంఠములు గలవారై, ఎల్లవారుఁజూడన్=సమస్తమైనవారును జూచుచుండఁగా, పైనిఁజెప్పఁబడిన వారందఱు ను క్రిందికి దిగిరని సంబంధము. ప్రజలందఱు మెడలుపైకెత్తి విమానములరాక మిగుల నానందముగాఁ జూడసాగిరి. ప్రజలకటాక్షరేఖలు దివ్యరథములకు వేలుపుచెలువలకు, ఐరావతమునకుఁ ద్రోవలుజూపు చున్నటులుండెను. కటాక్షములు రేఖాగుణములు-అనఁగా పగ్గములు. పగ్గములసహాయమున రథములు సూటిగా దిగెను.

రేచకలక్షణము:-

సీ. హృదయగతప్రాణుఁ డేతెంచునాసికావివరంబువలనను వెలికి ద్వాద
శాంగుళపర్యంత మది రేచకంబగు... (సీతారామాంజనేయము.)

మ. సకలామర్త్యభటాళికిన్ భటుల నా•చౌదంతికిన్ దంతిఁ దే
జికిఁ దేజిన్ మణిబింబదంభమునఁ దా•ల్చెం గాక పై వచ్చువ
జ్రికి గట్టేమియు నల్కఁ డయ్యె వసుధా•త్రీభృన్నఖాగ్రంబు వేఁ
తకు బిట్టోర్చినగట్టు దా వెఱచునే • దంభోళిభృత్కేళికిన్. 7

సకలామర్త్యభటాళికిన్భటులన్ = సమస్తదేవభృత్యసమూహమునకును నాలాటిభృత్యులను, ఆచౌదంతికిన్ దంతిన్=ఆవెల్లయేనుఁగునకును నాలాటియేనుఁగును, తేజికిఁ దేజిన్=ఉచ్చైశ్శ్రవమనెడు గుఱ్ఱమునకు నాలాటిగుఱ్ఱమును, మణిబింబదంభమునన్=తనయందలిమణులయందుఁ బ్రతిఫలించిన ప్రతి బింబములనెడుమిషచే, తాల్చెంగాక=ప్రతిబింబత్వమువహించెనేకాక-అనఁగాఁ బ్రతిఘటించినాఁడే కాని, పైవచ్చువజ్రికిన్ = తనపైకివచ్చుచున్న వజ్రాయుధముగల యింద్రునికి, గట్టేమియునల్కఁ డయ్యెన్=కోలాహలపర్వతుం డెంతమాత్రమును భయపడఁడాయెను. ఏమనిన, వసుధాత్రీభృన్నఖా గ్రంబువేఁతకుబిట్టోర్చినగట్టు=వసురాజుయొక్క పాదనఖాగ్రముచేతిదెబ్బకు మిక్కిలియు సహించిన కోలాహలపర్వతుఁడు, తావెఱచునేదంభోళిభృత్కేళికిన్ = వజ్రాయుధముధరించిన యింద్రునియొక్క యాటలకుఁ దాను వెఱచునా, అనఁగా వెఱవఁడనుట. కోలాహలపర్వతమందున్న మణికూటముల యందు అమర్త్యభటులయుఁ జౌదంతియు, తేజియుఁ బ్రతిబింబము లలరి పైనుండివచ్చు వజ్రి నెదిరింప నలరించిన బలమువలెఁ జూపట్టెను. వజ్రాయుధముకంటె వసురాజునఖము మిగులఁ గఠినమైనది. దాని కోర్చినమేటిగాన నింద్రునివజ్రమునకుఁ గోలాహలుఁడు వెఱవలేదని భావము. అలం. అపహ్నవము.

చ. అమరసమాగమావిలమృ•గౌఘవిలంఘనదీర్ణధాతుచూ
ర్ణము బహువర్ణరత్నశిఖ•రద్యుతితో నపు డభ్రమార్గముం
గమిచె నగేంద్రుఁ డింద్రశుభ•కార్యసమాగతి కిచ్చ మెచ్చి త
త్సముచితచాపచంచదుప•దాధరుఁడై యెదు రేఁగుకైవడిన్. 8

ఈపద్యమందలి యింద్రశబ్ద మింద్రునితో సమానకక్షను దెలుపుచున్నది. నరేంద్రుఁడు=పర్వతశ్రేష్ఠుఁడైన కోలాహలుఁడు, ఇంద్రశుభకార్యసమాగతికిన్ = ఇంద్రునియొక్క శుభకార్యమును

గురించివచ్చుటకు,ఇచ్చమెచ్చి=ఆత్మయందు మెచ్చుకొని, తత్=ఆ యింద్రునికి, సముచిత=తగిన,చాప=మణిచాపమనెడు, చంచత్=ప్రకాశించునట్టి, ఉపదాధరుఁడై=కానుకపట్టినవాఁడై, ఎదురేఁగుకైవడిన్=ఎదురుగాఁబోయినాఁడో యన్నట్టులుగా, అమర= దేవతలయొక్క, సమాగమ=రాకనుగురించి, ఆవిల=కలఁతనొందిన, మృగౌఘ=మృగసమూహముయొక్క, లంఘన = దాఁటుపరుగులచేత, దీర్ణ=భేదింపఁబడిన-అనఁగా నలిగిన, ధాతు=గైరికాదిధాతువులయొక్క, చూర్ణము=పరాగము, బహువర్ణరత్నశిఖరద్యుతితోన్=అనేకవర్ణములుగల రత్నములచేతఁ బ్రచురములైన శృంగములయొక్క కాంతితోడ, అపుడు=ఆసమయమందు, అభ్రమార్గముంగమిచెన్ = గగనమార్గమును బ్రాపించెను, అభ్రమార్గమనఁగా మేఘమార్గమైన యాకాశమనియైనను జెప్పవచ్చును. (ని. 'అభ్రం నభ స్స్వర్గ వలాహకేషు' అని వి.) ఇక్కడ గైరికాదిధాతుచూర్ణపటలమునకును గోలాహలునికిని, బహువర్ణరత్నశిఖరద్యుతికిని మణిచాపమునకును నుపమానోపమేయభావము. అలం. ఉత్ప్రేక్ష.

హరిణములు సహజభయలోలములు. దేవతలరాకకవి వెఱచిదుముకుచుండుటచే శైలధాతువులు చెదరి ధాతుచూర్ణము బహువిధరత్నశిఖరకాంతులతోఁగలసి మిన్నంటెను. ఇది శుభకార్యార్థమువచ్చునింద్రునెదుర్కొనుటకు సముచితమగు మణిమయ ధనుస్సుగొని కోలాహలుఁడెదురేఁగుచున్నటులుండెనని భావము. ధాతుచూర్ణము, రత్నకాంతులు మిన్నంటుచున్నవనుటచే శైలోన్నతి సువ్యక్తము.

సీ. సరసపర్జన్యసం•జ్ఞాధరంధరుఁడు రా నా తెఁ గాంతారఘో•రానలార్చి
శతకోటిదీప్తిదీ•పితకరుం డరుదేరఁ దరలె గుహాంతర•ధ్వాంతరాజి
సకలజగన్నియా•మకుఁడు చెంగట నిల్వ వదలె జంతుజజాతి•వైరవిహృతి
సతతసర్వర్తుసే•వితుఁడు చెంతకుఁ జేరఁ జనియెఁ గేకపికాది•సమయముద్ర
తే. యమరపతి జంగమస్థావ•రాభివాద, నీయ చరణాంబుజుండు స•న్నిధి యొనర్ప
ధరణిధరరాజమునఁగల్గు•తరు లతావ, రంపరలు మించె బహు ఫల•ప్రసవవృష్టి.

సరసపర్జన్యసంజ్ఞాధురంధరుఁడు రాన్=పర్జన్యుఁడనఁగా నింద్రుఁడును మేఘుఁడును,(ని. 'పర్జన్యో మేఘశబ్దేపి ధ్వన దమ్బుద శక్రయోః' అని వి.) సరస=రసికుఁడైన, పర్జన్యసంజ్ఞాధురంధరుఁడు రాన్=పర్జన్యనామము వహించిన యింద్రుఁడు రాఁగానే యని యర్థము. జలసహితుఁడైన మేఘుఁడు రాఁగానే యని యర్థాంతరము. కాంతార = వనసంబంధమైన, ఘోరానల=భయంకరాగ్నియొక్క, అర్చి=జ్వాలిక-అనఁగా దావానలజ్వాలిక, ఆరెన్=చల్లారెను, శతకోటి = వజ్రాయుధముయొక్క, దీప్తి=కాంతిచేత, దీపిత=ప్రకాశింపఁబడుచున్న, కరుఁడు=హస్తముగల యింద్రుండు, అరుదేరన్=రాఁగానే యని యర్థము. శతకోటి=అసంఖ్యములైనవియును, దీప్తిదీపిత=కాంతిచేఁ బ్రకాశమానము లగుచున్నవియునగు, కరుఁడు = కిరణములుగలసూర్యుఁడు రాఁగానే యని యర్థాంతరము. తరలె గుహాంతరధ్వాంత రాజి=గుహలయందలి తిమిరసమూహము విరిసిపోయెను.

సకలజగన్నియామకుఁడు చెంగటనిల్వన్ = త్రిభువననియంతయైన యింద్రుఁడు సమీపమందు నిల్వఁగా నని యర్థము. సమస్తభువననియామకుఁడైన యీశ్వరుఁడు చెంగటనిల్వఁగా నని యర్థాంతరము. జంతుజ జాతివైర విహృతి-జంతుజ=జంతువులవలనఁబుట్టెడు-అనఁగా మృగపక్షి ప్రభృతులకుఁ గలిగియుండునట్టి, జాతివైరవిహృతి=అనఁగా నాజన్మవైరవిహారము, వదలెన్=విడిచిపోయెను,

సతత=నిరంతరమును, సర్వర్తు=సమస్తమైన ఋత్వధిదేవతలచేత, సేవితుఁడు = సేవింపఁబడిన యింద్రుఁడు, చెంతకుఁ జేరన్=చేరువకు రాఁగానే, చనియెం గేకి పికాదిసమయముద్ర=నెమళ్లు కోయిలలు మొదలైనవానియొక్క వాఙ్నియమము వదలిపోయెను - అనఁగా వర్షర్తువందుఁ గేకారవములు సేయుట నెమళ్ళకును వసంతర్తువందుఁ గుహూకారములు సేయుట కోకిలములకును నియతము గనుక నానియమము వదలి యవియును ధ్వనులుచేసె నని తాత్పర్యము.

జంగమ స్థావరాభివాదనీయ చరణాంబుజుండు = చరాచరభూతములచేత నమస్కరింపఁ దగిన పాదపద్మములు గలిగిన, అమరపతి=దేవేంద్రుఁడు, సన్నిధియొనర్పన్=సన్నిధానము సేయఁగా-అనఁగా సమీపస్థుఁడు కాఁగా, ధరణిధరరాజమునఁ గల్గు=కోలాహలపర్వత శ్రేష్ఠమందుఁ గలిగిన, తరులతాపరంపరలు=వృక్షములయొక్కయుఁ దీఁగెలయొక్కయు సమూహములు, బహుఫలప్రసవవృష్టిన్=అపరిమిత ఫల పుష్ప వర్షముచేత, మించెన్=అతిశయించెను. అలం. శ్లేషానుప్రాణిత కావ్యలింగము.

మ. పతయాళుప్రబలప్రపాతఝురము ♦ ల్పాద్యంబుగాఁ దిర్యగా
యతమందారతరుప్రసూనఘటనం ♦ బర్చావిధానంబుగా
నతదివ్యోపలకూటదర్శనము నా ♦ నారత్నపూజాసమా
గతిగా నింద్రున కన్నగేంద్రుఁడు నతు ♦ ల్గావించె నత్యున్నతిన్. 10

పతయాళు=పడుచున్న, ప్రబలప్రపాత=బలిష్ఠములైన తటములయందలి, (ని. 'ప్రపాత స్తుతటో భృగుః' అని అ.) ఝురముల్=ప్రవాహములు, పాద్యంబుగాన్ = పాదములయందర్పించునట్టి జలములుగాఁగాను, తిర్యక్=అడ్డముగా, ఆయత=విస్తరించియున్న, మందారతరు=మందారము లనెడు దేవతావృక్షములయొక్క, ప్రసూనఘటనంబు = పుష్పసంఘటనము, అర్చావిధానంబుగాన్=పూజావిధానముగాఁగాను, నత = వసురాజుపాదఘట్టనముచేత వంగిన, దివ్యోపలకూట=దివ్యములైన మణిశృంగములయొక్క ఇక్కడ నుపలశబ్దము మణిపరము. (ని. 'ఉపలః ప్రస్తరే మణౌ' అని వి.) దర్శనము=చూచుట, నానారత్నపూజాసమాగతిగాన్=నానావిధరత్నసమర్పణ రూపమయిన పూజావిధిగాఁగాను, ఇంద్రునకున్=దేవేంద్రునికి, అన్నగేంద్రుఁడు=పర్వతశ్రేష్ఠుఁడైన యాకోలాహలుఁడు, అత్యున్నతిన్=అత్యధికౌన్నత్యముచేత, నతుల్గావించెన్=ప్రణామములు చేసెను. అతిథిపూజయవసరముగాన నాగతుఁడగు నింద్రునకుఁ దొలుత తమంతట తటములనుండి దొరలు సెలయేటినీటిచేతఁ బాద్యము, వ్రాలియున్న మందారశాఖలయందలిపూలతో నర్చావిధము. ఒరిగియున్న మణికూటసందర్శనముచేఁ బూజావిధి కోలాహలుఁడు నెఱవేర్చెను. తా నున్నతాత్ముఁడుగావున నతులన్నియు నత్యున్నతిని నెఱవేర్చెను. ఉన్నతుఁడు నతుఁడగువిధము శ్లేషచేఁ బరిహారము.

తే. వెండియు నగేంద్రతనయుండు ♦ వేఁడివేల్పు
మున్నుగా వేఁడి వేల్పుల ♦ మునుల కెఱఁగి
గంగ నలరించి క్రమ మెసఁ ♦ గంగఁ గ్రతుభు
గంగనల నందఱ మృదూక్తి ♦ నాదరించి. 11

వెండియున్=మఱియును, నగేంద్రతనయుండు = పర్వతరాజపుత్రుఁడైన కోలాహలుఁడు, క్రమ మెసఁగంగన్=వరుసపడి యొప్పునట్లుగా, వేఁడివేల్పుమున్నుగాన్=అగ్నిదేవుఁడు మొదలుగా,

వేల్పులన్=దేవతలను, వేఁడి=ప్రార్థించి, మునులకెఱఁగి=మునీశ్వరులకు నమస్కరించి, గంగనలరించి=ఆకాశగంగను వినయసంభాషణములచేత సంతోషింపఁజేసి, క్రతుభుగంగనలనందఱన్=దేవతాస్త్రీల నందఱను,మృదూక్తి నాదరించి=మృదువాక్యములచేత మన్నించినవాఁడై ముందరిపద్యముతో నన్వయము.

ఉ. నాకులదైవతంబు లల♦నాకులభూషణ మీలతాంగి మే
నాకులభూధరేంద్రుల య♦నాకులనిర్మలభాగ్యరాశి మై
నాకులముద్దుఁగూఁతురు పి♦నాకులకోడ లటంచుఁ దెల్పి నా
నాకులపాలిక ల్వొగడ ♦ నాకుల మ్రొక్కఁగఁ బంపెఁ గన్నియన్. 12

ఈలతాంగి=ఈచిన్నది, నాకులదైవతంబు=నాయొక్క వంశమునకు దేవతయైనదియు,లలనాకుల భూషణము=స్త్రీసమూహమునకు భూషణమైనదియును, మేనాకులభూధరేంద్రుల = మాతలిదండ్రులయిన మేనకాదేవియొక్కయుఁ గులపర్వతశ్రేష్ఠుఁడైన హిమవంతునియొక్కయు,అనాకుల నిర్మలభాగ్యరాశి=అవ్యాకులమును నిష్కల్మషమునునయిన భాగ్యమునకు నిధియైనదియును, మైనాకులముద్దుఁగూఁతురు=మాయన్నగారైన మైనాకపర్వతులయొక్క గారాబపుఁగూఁతురైనదియును, ఇక్కడఁ బూజ్యార్థమందు బహువచనమని తెలియవలయును. ఇందుకు, (శ్లో. 'స్యాత్పూజ్యత్వవివక్షాయాం మహతాం బహుతామతా' అని యథర్వణవచనము.) పినాకులకోడలు=పినాక మనెడు ధనుస్సుగల హరునకు మేనగోడలైనదియును, ఇక్కడను బహువచనము, పూర్వప్రకారంబ యని యెఱుంగునది. హరునకు మేనగోడ లేలాగున ననిన కోలాహలుఁడును పార్వతియును దోడఁబుట్టినవారు గనుకఁ గోలాహలుని కూఁతురు పార్వతికి మేనగోడలైనందున నామె పెనిమిటియైన హరునకును మేనగోడలని తెలియవలయును. అటంచుఁదెల్పి=అని తెలియఁజెప్పి, నానాకులపాలికల్వొగడన్=సమస్తమయిన కులస్త్రీలు కొనియాడఁగా, కన్నియన్=కూఁతురైన గిరికాదేవిని, నాకులన్=దేవతలను గూర్చి, మ్రొక్కఁగఁ బంపెన్=నమస్కారము చేయుకొఱకు నియమించెను-అనఁగా దేవతలకందఱకును మ్రొక్కించెననుట. కులపాలికాశబ్దమునకు-(ని.'కులస్త్రీ కులపాలికా' అని యమరము.)మైనాకుల పినాకులని బహువచనము జెప్పుట పూజ్యార్థము గావున నిందులకుఁ బ్రయోగము భాస్కరరామాయణమునుండి—

క. ఆకరుణానిధులగు వా,ల్మీకులశాపాక్షరములు మితసమవర్ణ
శ్రీకరపాదచతుష్క, శ్లోకంబయి జగతిఁ బరగె సుశ్లోకంబై.

క. గురుననుమతి గురుకుచభృతి, సరి నవనతిఁ గాంచి నిలుచు♦శైలజఁ గనఁగా
సురలయనిమేషభావము, హరిబహులోచనతయుం గృ♦తార్థతఁ జెందెన్. 13

గురుననుమతిన్=తండ్రియైన కోలాహలుని యాజ్ఞచేత, గురు కుచభృతిన్= గొప్పలైన కుచములయొక్క భారముచేత, సరిన్ = సమానముగా, అవనతిఁ గాంచి నిలుచు=నమ్రత్వమును బొంది నిలుచున్న, శైలజన్ = గిరికాదేవిని, కనఁగాన్=చూడఁజూడఁగా, సురలయనిమేషభావము=దేవతలయొక్క ఱెప్పపాటు లేమియును, హరి బహులోచనతయున్=ఇంద్రునియొక్క సహస్రాక్షత్వమును, కృతార్థతఁ జెందెన్=సార్థకత్వమును బొందెను.

అనఁగా గిరికాదేవి చక్కఁదనము చూచునెడల దేవతలందఱును ఱెప్పవ్రాల్పక చూచిరి. దేవేంద్రుఁడు వేఁగన్నులచేతఁ జూచెను.దేవతలకుఁగల ఱెప్పపాటులేమి సహజమైనను నింతవఱకు

సార్థకముగాలేదు. అనితరరూపసౌందర్యవిలాసభాసురయగు గిరికను ఆపూర్వక యదియె చూపుగాఁ జూచుటవలన వేలుపులచూపులు కృతార్థతనొందెను. వేలుపులదొర వేయికన్నులుగలవాఁడు గావున నన్నింటికిననుకూలముగ సౌందర్యమును సందర్శింపఁగలిగెనుగాన నాతఁడును గృతార్థుఁడయ్యెనని భావము.

ఇంద్రుఁ డాదరాతిశయమున వేయికనులతోఁ గాంచుననుటకు-

తే. ఇందుబింబాస్య నారాక కెదురుసూచు
నయనములు వేయువిరియించి నాకభర్త. శృంగారనైషధము ఆ. ౪.

సీ. తలయెత్త దయ్యెఁ గే•వలజడస్థితి రంభ జళుకుచూపులఁ జూడ•సాగె హరిణి
కుందుకుందునఁ జెంది • కొదఁ దెల్పె శశిరేఖ పలపల నై వెల్ల•వారెఁ దార
యుచితకార్యవివేక • ముడిగె మదాలస మానె నుద్ధతభాష • మంజుఘోష
మరువక పూనె మై•మరువు వరూథిని చెయ్వు లన్నియుఁ దక్కెఁ • జిత్రరేఖ
తే. రాపడియెసానుమతిసాంద్ర•తాపమునఁగ,రంగె హేమాభిధాన ని•ర్జరలతాంగు
లిట్లు దనుఁజూచి సిగ్గుపా•గెనయ వినయ, వినతయై యున్నగరాజ•తనయఁ జేరి.

రంభ = అనఁగా నొకయప్సరసయును నరఁటిచెట్టును - రంభయనెడు నప్సరస. కేవలజడస్థితిన్ =కేవల మందభావముచేత, తలయెత్తదయ్యెన్ = వంచినతల యెత్తదాయె ననియర్థము. అరఁటిచెట్టు కేవలజడస్థితిచేత నగ్రభాగము వంచుకొనియుండె నని యర్థాంతరము. లడల కభేదము. జళుకుచూపులఁ జూడసాగె హరిణి=హరిణియనఁగా నొకయప్సరసయును లేడియును - హరిణియనెడు నప్సరస యెదిరించి చూడఁజాలని చూపులచేతఁ జూచెనని యర్థము. లేడి స్వభావసిద్ధమయిన బెదురుచూపులచేతఁ జూచెనని యర్థాంతరము. కుందుకుందునఁ దెల్పె శశిరేఖ=శశిరేఖయనఁగా నొకయప్సరసయును జంద్రరేఖయును - శశిరేఖ యనెడు నప్సరస. కుందు కుందునఁ జెంది=కృశించుటయనెడు చింతనుబొంది, కొదఁదెల్పెన్ = లోపము గనుపఱిచెనని యర్థము. చంద్రరేఖ క్షీణభావమునుబొంది తక్కువైపోవుట గనుపఱిచెనని యర్థాంతరము. పలపల నై వెల్లవారెఁదార = తారయనఁగా నొక యప్సరసయును నక్షత్రంబును-తారయనెడు నప్సరస. పలపల నై వెల్లవారెన్ = డిల్లపడి వెలవెలపోయెనని యర్థము. నక్షత్రము పలచపారి కాంతి హీనమాయెనని యర్థాంతరము.

ఉచితకార్యవివేక ముడిగె మదాలస = మదాలసయనఁగా నొక యప్సరసయును మద్యపానమదముచేత నలసురాలయినదియును-మదాలసయనెడు నప్సరస. సౌందర్య పరాభవమువలని చిత్తవిభ్రమముచేత, ఉచితకార్యవివేక ముడిగెన్=అర్హాకృత్యమందలి వివేకమును విడిచిపెట్టెనని యర్థము. మద్యపానమదాలసురాలు, వివేకమునశించి యకార్యము లాచరించె నని యర్థాంతరము. మానె నుద్ధతభాష మంజుఘోష=మంజుఘోషయనఁగా నొకయప్సరసయును మనోహరకంఠనాదము గలదియును-మంజుఘోష యనెడు నప్సరస. మానెనుద్ధతభాష = దృఢసంభాషణ మానెను - అనఁగా మాటలు హీనస్వరము పడియెనని యర్థము. మనోహరకంఠనాదము గలది పరుషభాషణములు మానెనని యర్థాంతరము. మరువకపూనె మై మరువు వరూథిని = వరూథిని యనఁగా నొకయప్సరసయును సేనయును, మైమరువనఁగాఁ జైనిమునుకును గవచంబును, వరూథిని యనెడు నప్సరస మైమునుకు సేమ

రక వహించెనని యర్థము. నేన కవచ మేమరక పూనెనని యర్థాంతరము. చెయ్వులన్నియుఁ దక్కఁ జిత్రరేఖ = చిత్రరేఖయనఁగా నొక యప్సరసయును జిత్తరువును - చిత్రరేఖయనెడు నప్సరస చేష్టలు మానెనని యర్థము. చిత్తరువు నిశ్చలత్వమును వహించె నని యర్థాంతరము.

రాపడియెసానుమతి = సానుమతి యనఁగా నొక యప్సరసయును సానువులు – అనఁగాఁ గొండచరులు అవి గలదియును, సానుమతియనెడు నప్సరస రాయిడి పడెనని యర్థము. సానువులు గలది పాషాణమయమాయె నని యర్థాంతరము. సాంద్రతాపమునఁ గరంగెహేమాభిధాన=హేమాభిధాన యనఁగా హేమయను పేరుగల యప్సరసయును బంగారమును-హేమయనెడు నప్సరస గాఢపరితాపముచేత నీరై పోయెనని యర్థము. బంగారము గాఢాగ్నిసంతాపముచేతఁ గరఁగెనని యర్థాంతరము. నిర్జరలతాంగులిట్లు = దేవతాస్త్రీలీప్రకారముగా, తనుఁజూచి సిగ్గుపాటెనయన్ = తన్నుఁ జూచి తమయందలి సౌందర్యహీనతచేత సిగ్గుపడుచుండఁగా, వినయవినతయైయున్న = అడఁకువచేతఁ దలవంచుకొనియున్న, నగరాజతనయఁజేరి = గిరికాదేవి సమీపమునకుఁబోయి - ముందరిపద్యముతో నన్వయము.

గిరికాదేవి సౌందర్యాతిశయము వేలుపు పూవుబోండ్ల సౌందర్యాతిశయమును మించియుండె నని భావము. ఉపమానములగు నాయావస్తువుల స్వాభావికచేష్టలు శ్లేషచే సమర్థింపఁబడినవి.

ఉ. మన్నన నీశమౌళిమణి • మండన మై శుచివృత్తిఁ జల్లఁగా
మన్న నదీలలామ గరి • మన్ ననబోణిని గౌఁగిలించి యో
యన్నువపట్టి నిన్ గనిన • యన్న వసుంధర సింధుజాతిలో
వన్నియ కెక్కె నీవు గలు • వన్ నియతోన్నతిఁ గాంచెఁ దండ్రియున్. 15

మన్ననన్ = ఆదరముచేత, ఈశమౌళిమణిమండనమై = ఈశుఁడనఁగాఁ బెనిమిటియును శివుఁడును - పెనిమిటికి శిరశ్లాఘ్యమై యని యర్థము. శివశిరోభాగమునకు ముత్తెపుదండవలె నున్నదని భావము. శుచివృత్తిఁ జల్లఁగామన్న = పరిశుద్ధవృత్తిచేత సుఖముగా మనిన యనియర్థము. పావనవృత్తిగలదనియును శైత్యప్రకృతియనియును భావము. నదీలలామ = నదులలో భూషణమయిన యాకాశగంగ, గరిమన్ = గౌరవముచేత, ననబోణిని గౌఁగిలించి = గిరికాదేవి నాలింగనము చేసికొని, ఓయన్నువపట్టి = ఓచిన్నబిడ్డా, నిన్ గనినయన్న = నిన్నుఁగన్నట్టిమగువ, వసుంధరన్ = భూమియందు, సింధుజాతిలోన్ = నదీజాతిలో, వన్నియకెక్కెన్ = ప్రసిద్ధికెక్కెను, నీవు గలువన్ = నీవు గలుగఁగా, తండ్రియున్ = మీజనకుఁడయిన కోలాహలుఁడును, నియతోన్నతిఁ గాంచెన్ = ప్రమాణమయిన యౌన్నత్యమును గాంచెనని యర్థము. పర్వతము గనుక నున్నతమయినదని భావము. ఈపద్యములో నాలవచరణమందు కలుగననెడి పదమందలి యంత్యగకారమునకు- శ్లో. ‘క్వచిద్గకారో వః.’ అనెడు శబ్దానుశాసనసూత్రముచేత వకారాదేశము వచ్చినది.

మ. చరణాగ్రానమితాచలేశ్వరునిగా • సన్మార్గసంచారిఁగా
స్థిరకల్యాణసమాఖ్యుఁగా హరికృపన్ • శీఘ్రంబ చేపట్టి యో
గిరికన్యా యర లేక నీ పతఁడు నే • కీభావముం జెందుమా
గిరికన్యామణికన్న ధన్య వయి య • క్షీణానుమోదంబునన్, 16

చరణాగ్ర = పాదములయొక్క యగ్రభాగమందు, ఆనమిత = నమ్రములై నమస్కరించుచున్న, అచలేశ్వరునిఁగాన్ = భూమీశ్వరులు గలవానిఁగాను అని యర్థము. పాదాగ్రనిహతిచేత లెస్సగావంగిన పర్వతాధీశ్వరుఁడైన కోలాహలుఁడుగలవానిగా నని యర్థాంతరము. సన్మార్గసంచారిగాన్ = సజ్జనమార్గప్రవర్తకునిఁగా నని యర్థము. విమానముతో గగనమార్గసంచారముగలవానిఁగా నని యర్థాంతరము. స్థిర = శాశ్వతమైన, కల్యాణ=శుభమును, సమాఖ్యా=కీర్తియును గలవానిఁగా ననియర్థము. (ని. 'యశఃకీర్తి స్సమాఖ్యా చ' అని అ.) కల్యాణమనఁగా సువర్ణమును సమాఖ్యయనఁగా నామమును గనుకఁ గల్యాణసమాఖ్యయైన వసుసంజ్ఞగలవానిఁగా ననియర్థాంతరము. హరికృపన్ శీఘ్రంబ చేపట్టి = భగవదనుగ్రహముచేతఁద్వరఁగాఁ జెట్టఁబట్టి యనియర్థము. ఇంద్రునియొక్క దయచేత శీఘ్రముగాఁ జేపట్టి యని యర్థాంతరము. ఓగిరికన్యా=పర్వతపుత్త్రివైన యోగిరికాదేవీ, అరలేక= భేదములులేక యనియర్థము. అర్థశరీరత్వములేక యని యర్థాంతరము. (ఇది పార్వతికంటె ధన్య యనుటకుహేతువు) నీవతఁడు నేకీభావముం జెందుమా = నీవును నీ పెనిమిటియును నేకమగుటను బొందుమా యని యర్థము. ఏలాగుననవిన, గిరికన్యామణికన్న ధన్యవయి = హిమవత్పర్వతపుత్త్రియైన పార్వతికంటెఁ గృతార్థురాలవై, అక్షీణానుమోదంబునన్ = సంపూర్ణమైన సంతోషముచేత, నీవతఁడు నేకీభావముం జెందుమా యని సంబంధము.

రాజులచే నుతులొందువాఁడును గీర్తిశాలియు సన్మార్గసంచారియునగు వసురాజు శివుఁడు. గిరిక పార్వతి. ఈ యిరువురివివాహము పార్వతీ పరమేశ్వరుల దాంపత్యముకంటెఁ బొసఁగియున్నది. పార్వతీపరమేశ్వరుల దాంపత్య మర్థాంగీకారము. అందుచే అరఁగలది. ఈదాంపత్య మేకీభావము కాఁగలదు గావున నక్షీణానుమోదకరము. కావున గిరికన్యకంటె గిరిక సర్వవిధముల ధన్యురాలని భావము.

క. అని యనిమిషనదివలికిన, విని వినియతహృదయుఁడగుచు వినయమునఁ బునః
పునరవనతి సలిపి సురేం, ద్రున కవనిధరేంద్రుఁ డిట్లనుఁ గృతాంజలి యై. 17

అని = ఈలాగని, అనిమిషనదివలికినన్ = దేవతానది యనఁగా నాకాశగంగపలుకఁగా, విని = విన్నవాఁడై, వినియత హృదయుఁడగుచున్ = నియమయుక్తమైన మనస్సుగలవాఁడగుచు, వినయమునన్ = నమ్రభావముచేత, పునఃపునరవనతిసలిపి = మాటిమాటికి నమస్కరించి, సురేంద్రునకున్ = దేవేంద్రునికి, అవనిధరేంద్రుఁడు = పర్వతశ్రేష్ఠుఁడైన కోలాహలుఁడు, కృతాంజలియై= దోసిలిపట్టినవాఁడై, ఇట్లనున్ = వక్ష్యమాణప్రకారముగాఁ బలికెను.

మ. ఘనము ల్వాహనము ల్వదాన్యమణి యాఁకల్పంబు కల్పాగము
ల్వనము ల్వేలుపుగిడ్డి దొడ్డిపసి దేఁవా నీకుఁ బాదార్ఘ్య మి
త్తునొ రత్నాంజలి యిత్తునో యలరుటెత్తు ల్దివ్యసద్వస్తు లి
త్తునొ యీ వేమిట మెత్తు వేమి దగ నిత్తున్ భక్తపుంజప్రియా. 18

భక్తపుంజప్రియా = భక్తసమూహమున కిష్టుండవైన మహాత్ముఁడా, ఘనముల్వాహనముల్ = సమస్తమైన జంతువులకును జలప్రదానముచేసెడు మేఘములు నీయెక్కుడు గుఱ్ఱములు, వదాన్యమణి= సకలవస్తువులనునిచ్చు చింతామణి, ఆకల్పంబు = నీయాభరణము, కల్పాగముల్వనముల్ = అభీష్ట

యకములైన కల్పవృక్షములు నీయుద్యానవనములు, వేలుపుగిడ్డి దొడ్డిపసి = కామధేనువు నీ గోని పసరము, దేవా = స్వామీ, నీకుక్ = అనఁగా సర్వవస్తుప్రదాతలైన మేఘాదులుగలనీకు, ర్ఘ్యమిత్తునో = పాద్యమనియిత్తునా, రత్నాంజలియిత్తునో = రత్నములయొక్కదోసిలి యని నా, అలరుటెత్తుల్ = పూదండలును, దివ్యసద్వస్తులు=దివ్యములైన యనఁగా దేవతాసంబంధము శ్రేష్ఠవస్తువులను, ఇత్తునో = ఒసఁగుదునా అని క్రమాలంకారము. ఈవేమిటమెత్తువు = నీవుదేని మెచ్చుకొందువు, ఏమిదగనిత్తుక్=ఏవస్తువు నీకుఁదగునట్టులుగా నిత్తును - అనఁగా నేను నీకీఁదగు లన్నియుం నీయధీనములుగాన నేదియును నీకుఁ దగినట్టుగా నీఁజాలననుట.

దేవేంద్రుఁడు మహావైభవశాలి. అతనివాహనము జలోత్పత్తి ప్రధానమగు మేఘము. జలముతోఁ ్మిచ్చుట యెంత? ఆభరణము చింతారత్నము. రత్నములతోఁ బూజించుటయెంత? కామధేను దొడ్డిపశువులు. సద్వస్తువులనిచ్చుట యెంత? కావున వస్తురాజియొసంగి దేవేంద్రుని సంతృప్తి మదమన్నఁ గోలాహలుశక్తి చాలదు. భక్తపుంజప్రియుఁడు గావున భక్తిపూర్వక పరిచర్యా విశే ుచేఁ బరితృప్తి నొనర్పవలసియున్నది. అలం - పరికరము - పరిశేషము.

మహనీయ యోగసన్నహసాధకుండనై యనఘాపగాంబుగాహనముగనుట
వసురాడఖర్వతీవ్రతరాంఘ్రిసహుఁడనై గాఢసంతాపాగ్నిఁ గ్రాగుచుంట
బహుదూరగతభూరిపశుగౌరవుఁడనై పరమనిశ్చలవృత్తిఁ బాదుకొనుట
మనవాప్తగురుబాంధవనిబంధనుండనై గిరికానన రసైకపరత మనుట
ఇది మదీయాపదానంబు కృప నపార
తరతపోరచనంబుగాఁ దలఁచి నన్నుఁ
గాన వచ్చితొ యహహ వెంగలికిఁ దోడు
వేల్పు లనుమాట నిజముగా విబుధవర్య. 19

మహనీయ=అతిశయమైన, యోగ=సంభోగముయొక్క, సన్నహ = ప్రయత్నమందు, సాధ ుడనై=సాధించినవాఁడనై, అనఘ=నిష్కల్మషమైన, ఆపగాంబుగాహనము గనుట = శుక్తిమతీనదీ ప్రవేశముగనుట - అనఁగా శుక్తిమతీప్రాప్తిఁగనుట యని యర్థము. అతిశయమయిన యష్టాంగ గప్రయత్నసాధకుఁడనై పుణ్యనదీస్నానము సేయుట యని యర్థాంతరము. వసురా డఖర్వ తీవ్ర ంఘ్రి సహుఁడనై=వసురాట్టనఁగా వసురాజును సూర్యుఁడును-అంఘ్రిశబ్దము పాదమందును యందును వర్తించుచున్నది. వసురాట్ = వసురాజుయొక్క, అఖర్వ = అధికమైన, తీవ్రతర = లి తీక్ష్ణమైన, అంఘ్రి = పాదాహతిని, సహుఁడనై = సహించినవాఁడనై, గాఢసంతాపాగ్నిఁ గుచుంట = దృఢమైన పరితాపమనెడు నగ్నిచేత వేగుచుంట యని యర్థము. సూర్యునియొక్క కతీక్ష్ణకిరణములను సహించినవాఁడనై నాలుగుదిక్కులను గాఢసంతాపమయిన యగ్నిచేత వేగు చుటయని యర్థాంతరము.

బహుదూరగత = ఎక్కడనోపోయిన, భూరి=అపరిమితమయిన, పశుగౌరవుఁడనై=ఎక్కల క్క గౌరవముగలవాఁడనై, పరమనిశ్చలవృత్తిఁ బాదుకొనుట=కేవలము కదలనేరని విధముచేత ముగా నిలిచియుండుటయని యర్థము. బహుదూరమైపోయిన కాంచనవిషయమయిన గౌరవము

గలవాఁడవై యుత్కృష్టమైన నిశ్చల మనోవ్యాపారముచేత స్థిరీభూతుఁడవైయుండుటయని యర్థాంతరము. (ని. 'భూరిప్రాజ్యసువర్ణయోః' అని వి.) అనవాప్త=పొందఁబడని, గురుబాంధవ=గురువులను బంధువులనునైన పర్వతములయొక్క, నిబంధనుఁడవై = కూడికలుగలవాఁడవై, గిరికాననరసైకపరత మనుట=కొమార్తెయైన గిరికయొక్క, ముఖావలోకనానురాగ పరత్వముచేత బ్రతుకుట యనియర్థము. గురువులయొక్కయు బంధువులయొక్కయు సాంగత్యములు విడనాడినవాఁడవై పర్వతారణ్యముల యందును జలములయందును ముఖ్యాసక్తితోడ మనుట యని యర్థాంతరము.

ఇది=ఇటువంటి, మదీయాపదానంబు=నాచేతఁ జేయఁబడిన కార్యమును, (ని. 'అపదానంకర్మవృత్తమ్' అని అ.) కృపన్=దయచేత, అపారతరతపోరచనంబుగాఁ దలఁచి=అనంతమైన తపశ్చరణముగా విచారించి, నన్నుఁ గావవచ్చితో=నన్ను రక్షింపవచ్చితివా యేమి. ఏలాగుననిన, అహహ=ఆశ్చర్యము. వెంగలికిఁ దోడు వేల్పులనుమాట నిజముగాన్=వెఱ్ఱివానికి సహాయము వేల్పులు అనులోకోక్తి నిజమౌనట్టులుగా, నన్నుఁ గానవచ్చితివా యని సంబంధము. విబుధవర్య=దేవతాశ్రేష్ఠుఁడా యని సంబోధనము. ఇందులో నర్థాంతరములు తపోరచనపరములని గ్రహింపవలయును.

నిర్మలజలావగాహనము, సంతాపాగ్ని గ్రాఁగుట, నిశ్చలవృత్తినుండుట, గిరికానను ప్రీతిని మెలంగుట కోలాహలుని కర్మవృత్తములు. అర్థాంతరముచే నివి తపోరచనములు. తపస్సంపన్నులకు ఇంద్రుఁడు తోడ్పడుటకలదు. కోలాహలుఁడు నిజముగాఁ దపస్సంపన్నుఁడు కాఁడు. ఇట్టియెడ నింద్రుఁడు తోడ్పడ నరుదెంచుట వెంగలికి వేల్పుతోడనుసామెత సార్థకముచేయుటకువలె నున్నది.

ఉ. ఇచ్చటఁ జేదిరాజనఖ హేతిహతిన్ గతి దూలి యున్న యీ
పిచ్చుకగుంటుమీఁద గృప పెంపున నామరలోకవాహినిం
దెచ్చితిగా నగారి జగతిం గృతి నైతి భవత్ప్రసన్నతన్
హెచ్చె మదీయగౌరవ మహీన మహీధరజాతి లోపలన్. 20

ఇచ్చటన్=ఈస్థలమందు, చేదిరాజ=చేదిదేశాధీశ్వరుండైన వసురాజుయొక్క, నఖ=పాదనఖమనెడు, హేతి=ఖడ్గముయొక్క, హతిన్=దెబ్బచేత, గతిదూలి=గతిచెడియనియును, గమనములేకయనియును నర్థము. ఉన్న=ఉన్నట్టి, ఈపిచ్చుకగుంటుమీఁదన్=పిచ్చుకవలెఁ గుంటివాఁడైన వీనిమీఁద-అనఁగాఁ దనమీఁదను, కృపపెంపునన్=దయాసమృద్ధిచేత, అమరలోకవాహినిం దెచ్చితిగా=దేవలోకమందుఁ బ్రవహించునట్టి గంగను దెచ్చితివిగదా-ఇక్కడ పిచ్చుకగుంటుమీఁద భాగీరథి యనెడు లోకోక్తి ననుసంధింపవలయును. నగారి = పర్వతవిరోధివైన యింద్రుఁడా, జగతిం గృతి నైతిన్=గంగవచ్చుటచేత లోకమందుఁ బుణ్యాత్ముండనైతిని. ఇదియునుంగాక, భవత్ప్రసన్నతన్=నీయొక్క యనుగ్రహముచేత, అహీనమహీధరజాతిలోపలన్=అధికమైనపర్వతకులములో, మదీయగౌరవము=నాయొక్క యతిశయమును బృథుత్వమును, హెచ్చెన్=మించినదాయెను. దేవేంద్రుఁడు నగారి. అట్లయ్యు నగముపద్దకు వచ్చుటయు, వచ్చునపుడు గతిదూలియున్నాఁడని పిచ్చుకుంటు ననుగ్రహించి వెంటగొనివచ్చుటయుఁ గోలాహలుఁడు కృతార్థుఁడగుటకును గౌరవశాలియగుటకును హేతువులు. ఇట్టిరాకకుఁ గారణము ఇంద్రునకు సహజములగు కృపపెంపు ప్రసన్నభావము.

మ. అన నింద్రుం డను లాఁతిరీతి నచలేంద్రా యేల యి ట్లాడ నీ
జనకుం డధ్వరభాగభోక్త యనిమేషశ్రేణిలోఁ బెద్ద త
త్తనయగ్రామణి వైననీకు నరుదే ధాత్రీధరేంద్రాభినం
ద్యనితాంతోన్నతకీర్తిగౌరవము మేనాశుక్తిముక్తామణీ. 21

అననింద్రుండనున్=కోలాహలుఁ డీరీతిగాఁ బలుకఁగా విని దేవేంద్రుం డంచున్నాఁడు. ఏమని యనిన, అచలేంద్రా=పర్వతాధీశ్వరా, లాఁతిరీతిన్=అన్యునివలె, ఏలయిట్లాడన్=ఈలాగన నేల, నీజనకుండు=నీతండ్రియైన హిమవంతుఁడు, అధ్వరభాగభోక్త=యజ్ఞభాగ మనుభవించువాఁడు. ఇదియునుంగాక, అనిమేషశ్రేణిలోఁ బెద్ద=దేవసమూహములో గొప్పవాఁడు, తత్తనయగ్రామణి వైననీకున్=ఆహిమవంతునియొక్క కుమారశ్రేష్ఠుఁడవైన నీకును, ధాత్రీధరేంద్ర=పర్వతశ్రేష్ఠులచేత, అభినంద్య=కొనియాడఁదగిన, నితాంతోన్నత=మిక్కిలియు హెచ్చైన, కీర్తి=యశస్సును, గౌరవమున్=అతిశయమును ననియర్థము. ఉన్నతుఁడనెడు కీర్తియును బృథుత్వమును నని యర్థాంతరము. ఇక్కడ కీర్తిగౌరవము అన్నప్పుడు, ('జాతిరప్రాణినామ్') అనియుండుటచేత నేకవద్భావము వచ్చినది. మేనా=మేనకాదేవియనెడు, శుక్తి=ముత్తెపుచిప్పకు, ముక్తామణీ=ముత్తెమవైన కోలాహలుఁడా, అరుదే=ఆశ్చర్యమా-అనఁగా నీకు నీకీర్తిగౌరవములు స్వభావసిద్ధములే కాని యాశ్చర్యము లోనివి కా వనుట.

శా. చేదిక్ష్మావరపాదకంజకృతకుంఠీభావముం జెందునీ
ఖేదం బార్పఁగఁ గల్గె నీతనయ లక్ష్మిం గన్న దుగ్ధాబ్ధి నా
నాదాక్షాయణిఁ గన్న పెన్నగము నా నర్హాధినాథార్పణా
హ్లాదం బందఁగ రాదె మామకనియోగాయత్తచిత్తుండ వై. 22

చేదిక్ష్మావర=చేదిదేశాధిపతియైన వసురాజుయొక్క, పాదకంజ=పదకమలముచేత, కృత=చేయఁబడిన, కుంఠీభావమున్=కుంటితనమును, చెందు=పొందిన-అనఁగాఁ గుంటివాఁడవైన, నీ=నీయొక్క, ఖేదంబార్పఁగన్=దుఃఖమును బోఁగొట్టెదుకొఱకు, కల్గెనీతనయ=ఈకొమార్తె నీకుఁ గలిగినది కాఁబట్టి, లక్ష్మింగన్న దుగ్ధాబ్ధినాన్=లక్ష్మీదేవినిగన్న క్షీరసముద్రునివలెను, ఆదాక్షాయణిఁ గన్న పెన్నగమునాన్=ఆపార్వతినిగన్న హిమవత్పర్వతునివలెను, అర్హాధినాథార్పణాహ్లాదంబందఁగ రాదె మామకనియోగాయత్తచిత్తుండవై = తగినవరుని కిచ్చుటవలని సంతోషమును బొందరాదా నాయొక్క యనుజ్ఞ నంగీకరించినవాఁడవయి-అనఁగా నా యనుమతి ప్రకారముగాఁ దగినవరుని కిమ్మనుట. గిరికాజననముచే వసురా జెగురమీటుటవలనఁ గలిగిన విచారము కోలాహలునకుఁ దొలఁగఁ గలదు. ఇందులకుఁ బ్రతిక్రియ అర్హవరునకు గిరిక నొసంగుటయే. దాన క్షీరాబ్ధివలె హిమవంతునివలెఁ గోలాహలుని పెంపతిశయము కాఁగలదు. ఇందుల కనుమతించె నేని ఇంద్రుని నియోగము నెఱవేర్చుటయే కర్తవ్యము.

క. అగతనయ యగతనయ నిగ, నిగనిగని మెఱుంగు దెగడు నీకన్నియకున్
మగనిఁ దగునతని గుణగరి, మగని న్వినుపింతు వినుము మత్ప్రాణసఖున్. 23

అగత=అనాగతమైన, నయ=నీతిమార్గము గలిగిన, అగతనయ=పర్వత పుత్త్రుఁడవయిన కోలాహలుఁడా, నిగనిగని మెఱుంగుదెగడు = నిగనిగని మెఱయు మెఱుపుతీఁగెను దిరస్కరించుచున్న, నీకన్నియకున్=నీసుతకు, తగునతనిన్=తగినవాఁడైన, గుణగరిమగనిన్=గుణగౌరవమునకు గనియైన, మగనిన్=పెనిమిటిని, మత్ప్రాణసఖున్=నాకుఁ బ్రాణస్నేహితుఁడైనవానిని, వినుపింతున్=తెలియఁజెప్పుచున్నాను. వినుము=ఆలకింపుము.

మ. చరణాగ్రానమితాచలేంద్రుఁడు సదా•సన్మార్గసంచారి సు
స్థిరకల్యాణసమాఖ్యుఁ డావసుధరా•ధీశుండు వో గోత్రశే
ఖర గంగావచనం బపార్థ మగునే • కల్యాణి నీకన్నె న
న్నరనాథాగ్రణిరాణిఁ జేసి కనుమా • నానావిధైశ్వర్యముల్. 24

చరణాగ్ర=పాదాగ్రమందు, ఆనమిత=నమ్రులై నమస్కరించుచున్న, అచలేంద్రుఁడు=భూమీశ్వరులుగలవాఁడును-పాదాగ్రనిహతిచేత లెస్సగా వంగిన పర్వతశ్రేష్ఠుఁడు గలవాఁడును, సదాసన్మార్గసంచారి = ఎల్లప్పుడును సజ్జనమార్గ ప్రవర్తకుఁడును-విమానముతోడ గగనమార్గసంచారము గలవాఁడును, సుస్థిర=శాశ్వతమైన, కల్యాణ = శుభమును, సమాఖ్యుఁడు=కీర్తియును గలవాఁడును-కల్యాణమనఁగా సువర్ణంబును, సమాఖ్యయనఁగా నామమును గనుకఁ గల్యాణ సమాఖ్యయైన వసుసంజ్ఞగలవాఁడును, వసుధరాధీశుండువో=ఆవసురాజేసుమా, గోత్రశేఖర=కులభూషణుఁడా యని యర్థము. పర్వతశ్రేష్ఠుఁడా యని భావము. గంగావచనం బపార్థమగునే=గంగయొక్కమాట నిరర్థకమవునా. ఏమనిన, పైనిఁజెప్పఁబడినవిశేషణత్రయముగల వరునిఁ జేపట్టుమని యామె యాశీర్వచనము చేసినది గనుక నావిశేషణములు గలవాఁడు వసురాజేయైనాఁడు. కాఁబట్టి, కల్యాణిన్=శుభస్వరూపురాలయిన, ఈకన్నెన్=ఈచిన్నదానిని, అన్నరనాథాగ్రణిరాణిఁ జేసి=ఆరాజశ్రేష్ఠునియొక్క భార్యనుగాఁజేసి, కనుమా నానావిధైశ్వర్యముల్ = సకల వైభవములను బొందుమా.

గంగ గిరికాదేవికి నాశీర్వచనము సేయుట యీయాశ్వాసమునందు చరణాగ్రానమితాచలేశ్వరునిఁగా అనెడు ౧౩ వ పద్యమందుఁ జూడఁదగినది. గంగావచనము సార్థకమగును గావున బుద్ధిపూర్వకముగా నామోదించుట నానావిధైశ్వర్యములకు సాధనము. రాజు సామాన్యుఁడు కాఁడు. నరనాథులలో నగ్రణి. అంతయగాదు ఇంద్రునకుఁ బ్రాణసఖుఁడు. కాన నీసంబంధ మెంతయుం నొప్పియున్నది.

శా. లోకత్రయ్యభినందనీయవిమలా•లోకుండు సుశ్లోకుఁ డా
లోకాలోకధరాధురీణుఁ డతఁ డ•ల్లుం డయ్యెడిన్ నీతపః
పాకం బెట్టిదొ కాని పాదనిహతిం • బైకొన్నవాఁ డంఘ్రినా
ళీకద్వంద్వనతుండుగా నెరపఁ గ•ల్గెం గల్మియున్ బల్మియున్. 25

లోకత్రయి = మూఁడులోకములవారిచేతను, అభినందనీయ=మిక్కిలి స్తోత్రముచేయఁదగిన, విమల=స్వచ్ఛమయిన, ఆలోకుండు=ప్రకాశముగలవాఁడు-అనఁగాఁ బ్రతాపము గలవాఁడనుట. సుశ్లోకుఁడు=యోగ్యమయిన కీర్తిగలవాఁడు, ఆలోకాలోకధరాధురీణుఁడు=చక్రవాళపర్యంతమయిన

భూమియొక్క భారమును వహించినవాఁడు. ని. 'లోకాలోక శ్చక్రవాళః' అని అ. అతఁడు=అట్టి యావసురాజు, అల్లుండయ్యెడిఁ=నీకల్లుఁ డగుచున్నాఁడు. నీతపఃపాకంబెట్టిదో కాని=నీవుచేసిన తపస్సుయొక్క పరిపాకమెట్టిదో కాని, పాదనిహతింబైకొన్నవాఁడు=చరణాహతిచేత నాక్రమించిన వాఁడు, అంఘ్రినాళీకద్వంద్వనతుండుగాన్=నీరెండుకాళ్లకు వంగి మ్రొక్కెడువాఁడగునట్టులుగా-అల్లుఁడు మామకాళ్ళకు మ్రొక్కుట ప్రసిద్ధము. కల్మియున్=ఐశ్వర్యమును, బల్మియున్=సామర్థ్యమును, నెరపఁగల్గెన్=ప్రకటము సేయఁ గల్గెను.

వసురాజు సమస్తలోకనంద్యకీర్తిశాలి. అట్టివాఁ డల్లుఁడగుట తపఃపరిపాకవిశేషమే. నాఁటి పాదనిహతి నీహృదయముననుంటచే ననుమతింపవేమో? పుత్రిక నొసంగెదవేని యల్లుఁడు పాదములపై నొరగి నమస్కరించును. పైకొన్నవాఁడు ప్రణతుఁడగుట కల్మికి బల్మికిఁ గారణములు.

ఉ. నా వలచుట్టి హర్షకల•నావలమానమనోంబుజంబుతో
నావలవైరిఁ బల్కు నచ•లాగ్రణి మామకశోకవార్ధికిన్
నావ లతాంగి నబ్ధిరశ•నావలయేశ్వరు కేలఁ గూర్చెదే
నావలవంత దీర్చెదె య•నంతకృపారసవాస వాసవా. 26

నాన్=అనియింద్రుఁడు పలుకఁగా, అచలాగ్రణి=కోలాహలుఁడు, వలచుట్టి=ప్రదక్షిణము చేసి, హర్షకలనా=సంతోషాతిశయముచేత, వలమాన=ఆవరింపఁబడుచున్న, మనోంబుజంబుతోన్=మనఃపద్మముతోడ, ఆవలవైరిఁబల్కున్=బలాసురవైరియైన యాయింద్రునిఁ గూర్చి పలికెను. వల వైరియన్నచోట వబలకభేదము. మామకశోకవార్ధికిన్నావ=నాయొక్కపరాభవ జనితమయిన దుఃఖ సముద్రమునకు నోడయైన, లతాంగిన్=తీఁగెవంటిదేహముగల నాకొమార్తెను, అబ్ధి=సముద్రములు, రశనా=మొలనూలుగాఁగల భూమియొక్క, వలయ=ఆవరణమునకు, ఈశ్వరు=ప్రభువైన వసురాజు యొక్క, కేలఁగూర్చెదే=హస్తమందుఁ గూర్చుచున్నావా-అనఁగా వసురాజపాణిగ్రహణము సేయించుచున్నావా. నావలవంతదీర్చెదె=ఇంతటితో నాచింత దీర్చుచున్నావా, అనంత=అపరిమితమయిన, కృపారస=కరుణారసమునకు, వాస=నివాసస్థానమయిన, వాసవా=ఇంద్రుఁడా యని సంబోధనము. వసురాజు సముద్రముచే నావరింపఁబడిన సమస్తభూవలయమున కధిపతి. అట్టివాఁ డల్లుఁడగుట శోకవార్ధితరించు నుపాయము. ఇట్టి శుభప్రాప్తికిఁ గారకుఁడని ఇంద్రునకు వసురాజు ప్రదక్షిణము గావించెను. ఇంద్రుఁడు అనంతకృపాశాలి గావునఁ గోలాహలున కిట్టి యల్లునితోడిపొత్తుఁ గూర్చెను.

తే. అవని నొకవేల్పు ప్రత్యక్ష•మైన సిరులు
దొరలు నం డ్రెందఱే వేల్పు•దొరలు గొలువ
నీవ ప్రత్యక్షమై కృప•నింపఁగా ఫ
లింపవె తలంపులెల్ల ని•లింపరమణ. 27

అవనిన్=భూమియందు, ఒకవేల్పు ప్రత్యక్షమైనన్ = ఒకానొకదైవము ప్రత్యక్షమయిన మాత్రముచేతనే, సిరులు దొరలునండ్రు=సంపదలు పొందునని చెప్పుదురు, ఎందఱేవేల్పుదొరలు గొలువన్=అనేకులైన దేవతాధిపతులు సేవింపఁగా, నీవ ప్రత్యక్షమై కృపనింపఁగాన్=నీయంతట నీవే సాక్షాత్కరించి దయారసము పూర్ణమవునట్టులు చేయఁగా, ఫలింపవెతలంపులెల్లన్=కోరికలన్నియు ఫలింపవా-అనఁగా ఫలించుచున్నవనుట. నిలింపరమణ=దేవాధిపా యని సంబోధనము.

చ.సతి నడిగించుభవ్యగుణ◆శాలి వసుండఁట వేఁడ వచ్చువాఁ
డతులితదేవరాజ్యభర◆ణైకధురంధరుఁ డైనయాశత
క్రతుఁడఁట సత్కృపామహిమఁ ◆ గన్నియ నిచ్చుట సర్వదేవతా
హితమఁట యింతకన్న శుభ ◆ మెయ్యది తొయ్యలిఁ గన్నవారికిన్. 28

సతినడిగించు భవ్యగుణశాలి వసుండఁట=కన్యనడుగనంపించిన శుభగుణశాలి వసురాజఁట, సత్కృపామహిమన్=యోగ్యమయిన కరుణాతిశయముచేత, వేఁడవచ్చువాఁడు=అడుగవచ్చినవాఁడు, దేవరాజ్యభరణైకధురంధరుఁడైన=దేవతారాజ్య భరణమందు ముఖ్యసమర్థుఁడైన, ఆశతక్రతుఁడఁట=శతాశ్వమేధియైన యాయింద్రుఁడఁట, కన్నియనిచ్చుట = కన్యను వసురాజునకిచ్చుట, సర్వదేవతాహితమఁట=సమస్తదేవతలకు నిష్టమయినదఁట, తొయ్యలిఁ గన్నవారికిన్=ఈచిన్నదానిఁగన్నవారికి, ఇంతకన్న శుభమెయ్యది=ఇంతకంటె వేఱొండు శుభమేదిగలదు - అనఁగా నిదియెశుభముగాని యింతకంటె మఱియొకటి లేదనుట.

ఉ. ఇమ్మని వేఁడ వేఱొకఁడ◆నే భవదీయజనుండఁ గానె నా
సొమ్మన నెద్ది నీయది య◆సు మ్మఖిలమ్మును దేవ యీయదూ
రమ్మున నున్న శుక్తిమతి ◆ రాఁ గరుణించి తదీయబంధుజా
తమ్ము మదాప్తులం బిలిచి ◆ తావకమిత్రున కిమ్ము కన్నియన్. 29

ఇమ్మని వేఁడన్=కన్యనిమ్మనియడుగుటకు, వేఱొకఁడనే=నేనన్యుఁడనా, భవదీయజనుండఁగానె=నేను నీవాఁడనుగానా-నాసొమ్మనఁగా నేమియున్నది. నీయదియసుమ్మఖిలమ్మును=సమస్తమునీదే సుమా, దేవ=స్వామీ, ఈయదూరమ్ముననున్న శుక్తిమతిరాఁగరుణించి=ఈసమీపమందేయున్న శుక్తిమతియిక్కడికి వచ్చునట్లు దయచేసి, తదీయబంధుజాతమ్మున్=ఆశుక్తిమతియొక్క బంధుసమూహమును-అనఁగా నదీసమూహమును, మదాప్తులన్=నాయొక్క బంధువులను-అనఁగాఁ బర్వతసమూహములను, పిలిచి=ఆహ్వానముచేసి, కన్నియన్=చిన్నదాని, తావకమిత్రునకిమ్ము=నీ స్నేహితుఁడైన వసురాజునకు సమర్పింపుము - అనఁగా వసురాజునకిచ్చి వివాహము సేయు మనుట.

ఇంద్రునిహితులలోఁ గోలాహలుఁడొకఁడు గాన నతనియంగీకార మనవసరము. కోలాహలుని సర్వస్వము దేవేంద్రునిదెగాన నిట కొంకఁబనిలేదు. శుక్తిమతి, ఇతరబంధువులు ఈసంబంధము నాలకించుట వారియంగీకృతి పడయుటతడవుగ వసురాజునకుఁ గన్యనిచ్చి పెండ్లిచేయనగును.

చ. అనుటయుఁ దాతపార్శ్వగత ◆ యై తగునాలతకూన దా నతా
నన యయి కేలికేళినలి◆నంబు మొనల్నఖరాంచలంబులం
దునుముచు నుండె వజ్రధర◆దోరశనిప్రతిమానమానలాం
ఛనవిశిఖంబు లింక నఖ◆సాధ్యము లంచు గణించుకై వడిన్. 30

అనుటయున్=కోలాహలుఁ డింద్రునితో నీలాగనిపలుకఁగా, తాతపార్శ్వగతయైతగు=తండ్రిపరసనున్నదై యొప్పుచున్న, ఆలతకూన=ఆగిరికాదేవి, తాన్=తాను, నతాననయయి=వంపఁబడినముఖముగలదై, కేలి=హస్తమందున్న, కేళినలినంబుమొనల్ =లీలాపద్మముయొక్క చివరలను, నఖరాంచలంబులందునుముచు నుండెన్=గోటికొనలచేతఁ ద్రుంచుచుండెను. ఎటువలెననిన, వజ్రధర=

-, దోః=భుజమండలి, అశని=వజ్రాయుధముతోడ, ప్రతిమాన=సమానమైన, మీన
ములు=మన్మథబాణములైన పద్మములు, ఇంకన్=ఇఁకమీఁద, నఖసాధ్యములంచుగణించు
ఁ జిమ్మివైవఁ దగినవని యెంచినట్టులుగాఁ దునుముచుండె ననిసంబంధము.
జ్జాతిశయమునఁ దలవంచెను. దానిని మఱుఁగుపఱచుటకై కేలనున్న తామరపూవును
ంపెట్టుచుండెను. చూచువారి కిది మన్మథబాణము లిఁక గోటగిల్లివేయవచ్చునని గిరిక
ంలుండెను. పార్శ్వగతయనుటచే గిరిక యింద్రునిసంభాషణము కోలాహలుని యంగీకృతి
భావము. అలం. ఉత్ప్రేక్ష.

మున్న సర్వకలుషాంతక మానగవైరివాక్యముం
వచ్చునెచ్చెలులచే విని పుణ్యమహాతరంగిణీ
దాను శుక్తిమతి కౌశికుఁ గొల్వఁగ వచ్చె దేవతా
మాత్మ నాత్మశుభసంతతికల్మికి సంతసిల్లఁగాన్. 31

ముున్న = అంతకుముందుగానే, సర్వకలుషాంతకమా = సమస్తకల్మషాపహారమైన, నగ
=దేవేంద్రునియొక్క వాక్యమును - అనఁగా వసురాజునిమిత్తమై గిరికనడిగినమాట,
నెచ్చెలులచే విని=తన సమీపమునకువచ్చిన చెలికత్తియలవలన విని, పుణ్యమహాతరం
దాను = పుణ్యప్రదలయిన మహానదీకాంతలు దానును, శుక్తిమతి = శుక్తిమతీమహా
ంతతి = దేవసమూహము, ఆత్మన్ = మనస్సునందు, ఆత్మశుభసంతతికల్మికిన్=తన
సంతానపు కలిమికి, సంతసిల్లఁగాన్=సంతోషింపఁగా, కౌశికుఁ గొల్వఁగవచ్చెన్=
వింప వచ్చినదాయెను. (ని. 'మహేంద్ర గుగ్గులూ లూక వ్యాళగ్రాహిషుకౌశికః' అని

మూర్తివహించుహరజటాసంభవ సుమనోమణులఁ బ్రోచుసోమకన్య
స్మరించుభూదారరాజతనూజ తమమెల్ల వారించుతపనపుత్త్రి
షమ్మ్యమ్ము గడపురుద్రాంఘ్రిజ చలువలువెదఁజల్లు మలయదుహిత
సాధనరత్న మగుపినాకోత్పన్న యాధ్యాప్తి నెసఁగుశ్రీతాద్రిజాత
ఁ దక్కినపుణ్యనిమ్నగలు మరుద, ధీశభవ్యనిదేశాప దేశమున ని
క్తిమతీతనయావివాహ, మహామునకువచ్చి రాత్మీయమహిమ మెఱసి.

తమూర్తివహించు హరజటాసంభవ=అమృతమనఁగా మోక్షము గనుక మోక్షస్వరూపము
కాశగంగయును అనియర్థము. హరుఁ డమృతస్వరూపుఁడు గనుక నతని జడలవలనఁ
ము నమృతస్వరూపమును వహించినదనుట. అమృతమూర్తి యనఁగా జంద్రుఁడు గనుక
ద్రునివహించినాఁడు గనుక హరజటాసంభవయైన గంగయును చంద్రునివహించినదని
ము. అమృతమనఁగా నుదకము గనుక నుదకస్వరూపములు వహించినదనిభావము. ఇక్క
ృతమూర్తిని వహించినదనఁగా గంగోదకములు సుధామధురము లనియును నుపమయును
మన్నది. సుమనోమణులఁబ్రోచు సోమకన్య = దేవతాశ్రేష్ఠులను బ్రోచెడు నర్మదా
నియర్థము. సోముఁడు దేవతాశ్రేష్ఠులను బ్రోచెడువాఁడు గనుక నతనివలనఁబుట్టిన

నర్మదయును దేవతాశ్రేష్ఠులను బ్రోచుచున్న దనుట. మంచి మనస్సుగలవారిని రక్షించుచున్నదని భావము.

ధరనుద్ధరించు భూదారరాజతనూజ = భూమి నుద్ధరించెడు భూదారరాజతనూజ యనెడు నది యని యర్థము. ఆదివరాహము భూమినుద్ధరించినది గనుకఁ దత్సంభవయైన నదియును భూమి నుద్ధరించుచున్నదనుట. భూమి జనుల నుద్ధరించుచున్నదని భావము. తమమెల్లవారించు తపనపుత్రి = అంధకారనివారణముసేయు యమునానది యని యర్థము. సూర్యుఁ డంధకారనివారకుఁడు గనుకఁ దత్పుత్రియును నంధకారనివారణము సేయుచున్నదనుట. అజ్ఞాననివారణము సేయుచున్న దనిభావము. కాలవైషమ్యమ్ము గడపు రుద్రాంఘ్రిజ=కాలవిపర్యాసమునుగడపుచున్న రుద్రాంఘ్రిజయనెడు నదియును అనియర్థము. రుద్రుఁడు కాలత్రయాబాధ్యుఁడు గనుకఁ దదంఘ్రిజయును 'గాలత్రయాబాధ్యయనుట యమదండనము లేకుండునట్లుగాఁ జేయుచున్నదని భావము. చలువలు వెదఁజల్లు మలయదుహిత = శైత్యములను వెదఁజల్లునట్టి తామ్రపర్ణీనదియును అని యర్థము. మలయపర్వతము చందనాలయమై చలువలు వెదఁజల్లుచున్నదిగనుకఁ దత్పుత్రియును జలువలు వెదఁజల్లుచున్న దనుట. అతిశీతలోదకము గలదని భావము.

అభవసాధనరత్న మగుపినాకోత్పన్న = అభవునికి సాధనశ్రేష్ఠమయిన పినాకినీనదియును అని యర్థము. పినాక మభవునకు నుత్తమసాధనము గనుకఁ దదుత్పన్నయును నభవునకు నుత్తమసాధన మనుట. అభవమనఁగా జన్మరాహిత్యము గనుకఁ దత్సాధనములలో శ్రేష్ఠమగుచున్నదని భావము. ఆర్యాప్తినెసఁగుశీతాద్రిజాత = గౌరీప్రాప్తిచేత నొప్పుచున్న శీతాద్రిజాత యనెడు నదియును అని యర్థము. శీతాద్రి గౌరీప్రాప్తిచేత నొప్పుచున్నది గనుకఁ దత్సంభవయును గౌరీప్రాప్తిచేత నొప్పుచున్నదనుట. ఆర్యజనప్రాప్తిచేత నొప్పుచున్నదని భావము.

ఇంతవఱకును శ్లో. 'కారణగుణాహి కార్యగుణానారభంతే' అనెడున్యాయము ననుసంధించిచెప్పినాఁడు. మఱియుఁ=వెండియు, తక్కినపుణ్యనిమ్నగలుఁ=శేషించినపుణ్యనదులును, మరుదధీశ = దేవతాధిపతియైనయింద్రునియొక్క, భవ్య=ముఖ్యమయిన, నిదేశ=రమ్మనుమని యాజ్ఞాపించుట యనెడు, అపదేశమునఁ=వ్యాజముచేత, నిజాప్త=తనకాప్తురాలైన, శుక్తిమతీ=శుక్తిమతీనదియొక్క, తనయా=కూఁతురైన గిరికాదేవియొక్క, వివాహమహమునకుఁ=వివాహోత్సవమునకును, ఆత్మీయమహిమ మెఱసి=స్వకీయప్రభావముచేతఁ బ్రకాశించి–అనఁగాఁ గామరూపత్వముచేత స్త్రీరూపధారణముచేసి యనుట వచ్చిరి=ఏతెంచిరి.

నెయ్యురాలగు శుక్తిమతిచేయుఁ పుత్రికాపరిణయమున నుత్సాహముతో గంగ, నర్మద, వారాహి, యమున, రుద్రాంఘ్రిజ, తామ్రపర్ణి, పినాకిని, శీతాద్రిజాతయను నదీకాంత లరుదెంచిరి. నదీకాంత లరుదెంచుటకు ఆత్మీయమహిమలు తోడ్పడెను.

పొడవైనశృంగములు, ఎత్తగుచఱియలు ఇంద్రునియాన పాలించురీతితో శైలములు వచ్చెనని ప్రకృతార్థము. విఱుగనికొమ్ములు,పిఱుఁదులపెంపు; పొదుగుపెరుగు, ఆఁబోతు అనుసరింపఁదగినసొంపు గోబృందమువచ్చెనని శ్లేషార్థము. అలం. శ్లేషము.

శా. ఉత్సాహంబున నిట్లనేకతటినీ♦వ్యూహంబు లేతేరఁగా
వత్సాళిఁ వెనుకొన్న గోగణము లే♦వఁ వచ్చెఁ దోడ్తో మహీ

భృత్సందోహ మభంగశృంగమును నా♦పీనస్నుతాంచన్నితం
బోత్సేధంబు వృషోపసర్పణవిధా♦యోగ్యక్రమంబుం దగన్. 33

ఉత్సాహంబునన్=ఉల్లాసముచేత, ఇట్లు = ఈప్రకారముగా, అనేకతటినీవ్యూహంబులు = బహునదీసమూహములు, ఏతేరఁగాన్=రాఁగా, వత్సాళిస్వేనుకొన్న=లేఁగదూడలను వెంబడించి వచ్చిన, గోగణముతేవన్=ఆవులగుంపువలె, తోడ్తోన్ = నదులవెంట, మహీభృత్సందోహము=పర్వత సమూహము, వచ్చెన్ = ఏతెంచెను. ఏతీరుగాననిన, శృంగములనఁగా శిఖరములును గొమ్ములును. (ని. 'శృఙ్గం ప్రభుత్వే శిఖరే చిహ్నే పి జలయంత్రకే, విషాణో త్కర్షయోః' అని వి.) అభంగ=వైకల్యములేని, శృంగములు=శిఖరములు అని పర్వతపరమయిన యర్థము. వైకల్యరహితములైన కొమ్ములును అని గోగణపర మయినయర్థము. ఆపీన=అంతట స్థూలములైన, (ని. 'స్నుః ప్రస్థ స్సాను రస్త్రియామ్' అని అ.) స్నుశబ్దము కొండచరులయందు వర్తించును గనుక, స్నుతా=చరులుగలుగుటచేత, అంచత్=ఒప్పుచున్న, నితంబ=కటకప్రదేశములయొక్క, ఉత్సేధంబు = ఔన్నత్యము అని పర్వత పరమయిన యర్థము. ఆపీనమనఁగాఁ బొదుగు. (ని. 'ఊధ స్తు క్లీ బ మాపీనమ్' అని అ.) స్నుతమనఁగా స్రవించునట్టిది. (ని. 'స్యన్నం రీణం స్రుతం స్నుతమ్'అని అ.) ఆపీన స్నుత=స్రవించునట్టి పొదుగుల యొక్కయు, అంచన్నితంబ=ఒప్పుచున్న పిఱుఁదులయొక్కయు, ఉత్సేధంబు=ఔన్నత్యమని గోగణ పరమయిన యర్థము. వృషభానుసరణయోగ్యక్రమంబున్=వృషశబ్దము నకారాంతమై యింద్రుని యందు వర్తించును గనుక నింద్రానుసరణమందలి యోగ్యమైనరీతియును అని పర్వతపరమైనయర్థము. వృషభానుసరణయోగ్యక్రమ మని గోగణపరమయిన యర్థము. తగన్=తగియుండఁగా, వచ్చెనని సంబంధము.

ఈపద్యములో 'వత్సాళి స్వేనుకొన్న గోగణముతేవన్' అనిచెప్పుట యెందుకనిన, నదులన్నియుఁ బర్వతములవలనఁ బుట్టినవి గనుక లేఁగదూడలు ముందరనడువఁగా నావులు వెనుదగిలి నడిచినట్టులు నదులు ముందుపోఁగాఁ బర్వతములు వానివెంటనేపోయె ననుటకు గోగణమునకును బర్వతసమూహమునకు నుపమానోపమేయభావము గల్పించి యర్థద్వయము గలుగఁజెప్పినాఁడు.

సీ. అజ్ఞాతగోత్ర య♦నాదిశక్తిసుగోత్ర భవ యయ్యె నితనిగ♦ర్భమునఁ బుట్టి
యాదిభిక్షుండు దు♦ర్గాధ్యక్షుఁ డయ్యె నీతనిపాదతీర్థ మా♦దల ధరించి
మితతేజుఁ డగుజగ♦న్మిత్రుఁ డుత్కటవసుస్థితి నొందె నీతని♦దిక్కుఁ జేరి
కులమువా రభిరామ♦గో రత్నములు గాంచి రితని శేషంబున ♦ కిచ్చగించి

తే. తన కొకమఖాంశ మొసఁగుని♦య్యనిమిషులకు
ననవరతయాగభాగభో♦జనము లొసఁగి
యితఁ డపర్ణైకగురుఁ డన ♦ నెసఁగు ననుచు
నాకులు నుతింప వచ్చె మే♦నాకుటుంబి. 34

ఈపద్యములో హిమవత్పర్వతమును వర్ణించినాఁడు. ఏలాగనిన, అజ్ఞాతగోత్ర = గోత్రమనఁగా నిక్కడఁ గులమని యర్థము. తెలియఁబడని కులముగలదయిన, అనాదిశక్తి = ఆదియేర్పడనిశక్తి,

ఇతనిగర్భమునఁబుట్టి=ఇతని కడుపునఁబుట్టి, సుగోత్రభవయయ్యెన్=సత్కుల ప్రసూతురాలాయెనని యర్థము. కులములేనిదనియును హిమవత్పర్వతమునకుఁ బార్వతిగాఁ బుట్టినదనియును భావము.

ఆదిభిక్షుండు = జన్మమెత్తినది మొదలు భిక్షుకుఁడైనవాఁడు, ఈతనిపాదతీర్థ మాదలధరించి = ఇతని పాదోదకము శిరస్సునధరించి, దుర్గాధ్యక్షుఁడయ్యెన్=దుర్గాధిపతి యయ్యెనని యర్థము. ఆదిభిక్షుఁడనెడు నామముగల శివుఁడు హిమవంతునియొక్క పాదములయందు-అనఁగాఁ బ్రత్యంతపర్వతములయందుఁ బ్రవహించుచున్న గంగను శిరస్సున ధరించినాఁడనియును దుర్గాదేవికిఁ బెనిమిటియయినాఁ డనియును భావము. (ని. 'పాదాః ప్రత్యంతపర్వతాః' అని అ.)

మితతేజుఁడగు జగన్మిత్రుఁడు=అల్పతేజుఁడైన లోకోపకారకుఁడు, ఈతనిదిక్కుఁజేరి=ఇతని ప్రాపునఁజేరి, ఉత్కట వసుస్థితినొందెన్ = అపరిమిత ధనస్థితిని బొందెనని యర్థము. జగద్బంధుఁడయిన సూర్యుఁడు దక్షిణాయనమందు మితతేజుఁడగుచున్నాఁడనియును నుత్తరాయణమం దుత్కటతేజుఁ డగుచున్నాఁడనియును భావము. (ని.'దేవభేదే నరే రశ్మౌవసూ రత్నే ధనేవసు' అని వి.) హిమవంతుఁ డుత్తరదిక్కునం దుండెడువాఁడు గనుక నీతనిదిక్కుఁ జేరియని చెప్పినాఁడు. హిమవంతుఁడు భూభాగమునకు ఉత్తరదిశయందుండు ననుటకుఁ బ్రమాణము-

శ్లో. అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా హిమాలయో నామనగాధిరాజః
పూర్వాపరౌ వారినిధీ విగాహ్య స్థితః పృథివ్యామివ మానదండః. (కుమారసంభవము.)

కులమువారు=కులమువారందఱును, ఇతనిశేషంబున కిచ్చగించి=ఇతని భుక్తశేష మనుభవించుటకు సమ్మతించి, అభిరామ గోరత్నములు గాంచిరి=మనోహరణప్రకాశముగల రత్నములను గాంచిరని యర్థము. ఇక్కడ గోశబ్దము కిరణవాచకము, సమస్తపర్వతములును వత్సాకృతియైన హిమవంతుని యెంగిలి కిచ్చగించి యభిరామములయిన గోరూప భూసంబంధి రత్నములను బొందినవని భావము. ఇక్కడ గోశబ్దము భూవాచకము. (ని. 'స్వర్గే షు పశు వా గ్వజ్ర ది జ్నేత్ర ఘృణి భూజలే, లక్ష్యదృష్ట్యా స్త్రియాం పుంసి గౌః' అని అ.) పూర్వకాలమందు సమస్తమయిన పర్వతములును భూమిని గోవునుగాను హిమవంతుని లేఁగనుగానుం జేసి రత్నములను నోషధులనుం బితికినవని పురాణప్రసిద్ధము. ఈయంశమె కుమారసంభవమునందుఁ గాళిదాసుఁ డీవిధముగాఁ జెప్పియున్నాఁడు-

శ్లో. యం సర్వశైలాః పరికల్ప్య వత్సం మేరౌ స్థితే దోగ్ధరిదోహదక్షే
భాస్వంతి రత్నాని మహౌషధీశ్చ పృథూపదిష్టాం దుదుహు ర్ధరిత్రీం.

తనకొకమఖాంశమొసఁగు=తనకు నొక్క యజ్ఞభాగమిచ్చిన, అనిమిషులకున్ = దేవతలకు, అనవరత యాగభాగ భోజనము లొసఁగి = సంతతమును యజ్ఞభాగభోజనములుపెట్టి యని యర్థము. యజ్ఞాంగములయిన సోమలతాదుల కుత్పత్తిస్థానమనియును నిజోపరిప్రదేశకృత యాగభాగ భోజనము లొనఁగూర్చె ననియును భావము. ఇతఁడపర్ణైకగురుఁ డననెసఁగున్=అపగతమయిన ఋణముగలవార లపర్ణులు - అనఁగా ఋణములేనివారు. ఇతఁడు ఋణములేనివారికి ముఖ్యగురువు-అనఁగా నన్ృణశ్రేష్ఠుఁ డగునట్టులుగా నొప్పును అని యర్థము. ఋణములేనివాఁడు పరమసంతుష్టుఁడని మహాభారతమందలి యారణ్యపర్వమందుఁ జెప్పియున్నది.

శ్లో. 'పఞ్చమేహాని షష్ఠే వా శాకం పచతి స్వే గృహే,
అనృణో హ్యప్రవాసీ చ స వారిచర మోదతే.'

అని యక్షప్రశ్నలలో, కో మోదతే యన్న ప్రశ్నకు ధర్మరాజు చెప్పినయుత్తరము గారీజనకుఁడని భావము. అనుచున్=అనిపలుకుచు, నాకులునుతింపన్=దేవతలుపొగడఁగా, మేనాకుటుంబి=మేనకాదేవికి భర్తయయిన హిమవంతుఁడు, వచ్చెన్=ఏగుదెంచెను. పార్వతి హిమవంతుని గర్భవాసమునఁ బుట్టి సుగోత్రజాతయయ్యెను. ఇతని పాదతీర్థము తలఁదాల్చి శివుఁడు దుర్గాధిపతియయ్యెను. జగన్మిత్రుఁ డీతని దిశచేరి బాగుగాఁ బ్రకాశించెను. ఇతనియెంగిలి తిని కులమువారు వస్తురాజముల నొందిరి. ఒకయజ్ఞభాగమొసంగి దేవత లీతనివలన నిత్యము యాగభాగము లొందుచున్నారు. కావున నిట్టి యోగ్యతగలవాఁడని వేలుపులు హిమవంతుని పెంపు పొగడుచుండిరని భావము.

తే. ఆపడఁకుమెట్టదొరకు హ•స్తావలంబ
మగుచు మేనక వచ్చె భ•వ్యగుణమంజి
మ నమరాలిమానసమున • మన మరాళి
మనమరాలివివాహసం•భ్రమముఁ జూడ. 35

ఆపడఁకుమెట్టదొరకున్ = ఆహిమవత్పర్వతరాజునకు, హస్తావలంబమగుచున్ = చేయూఁతయగుచు, మేనకవచ్చెన్=మేనకాదేవివచ్చెను. ఎందుకనిన, భవ్యగుణమంజిమన్=సుగుణములయొక్క మంజులత్వముచేత, అమరాళిమానసమునన్=దేవతాసమూహముయొక్క మానసమనెడు మానససరోవరమందు, మనన్=మనుటకు, మరాళి = హంసాంగనయయిన, మనమరాలి=కుమారుని కూఁతురైన గిరికయొక్క, వివాహసంభ్రమముఁ జూడన్ = కల్యాణోత్సవమును జూచుకొఱకు, వచ్చెనని సంబంధము. ఈపద్యమునందు మనుమరాలను నెడ మనమరాలని చెప్పఁబడెను. మనమరాలను నకారరూపము లాక్షణికగ్రంథములయందుఁ గానరాదు. మనుమరాలని యందుమనిన ననుప్రాసముభంగమగును గావునఁ గవ్యభిప్రాయము మనమరాలేయనుట స్పష్టము. సుగుణసంపదచే గిరిక, వేలుపుమనస్సులను మానససరోవరమునందు విహరింపఁదగియున్నదని భావము వచ్చువాఁడు పడఁకుమెట్టదొర, కావుననే మేనక హస్తావలంబనముగా నేతెంచెను. పడఁకుచున్నవాని కెవరేని తోడ్పడవలయును గదా!

సీ. పిడుగుకైదువుపెట్టు•తడకట్టుగాఁ బయోధి మహౌషధిరసంబు•చమరె ననఁగఁ
గడలికరళ్లరా•యిడిఁ గీడ్పడి తటాంతవనరాజి మై నంట • వ్రాలె ననఁగ
కున్నీటిపెన్నీటి • ముదురుచిల్వలయలజడికిఁ బచ్చలజోడు • దొడిగె ననఁగఁ
దనకుందనపుచాయ • పెనునీటికుప్పక ప్పెనసినపసఁ బస • రెక్కె ననఁగ
తే. సంతతజలాంతరాళసం•స్థానమహిమఁ
బ్రాఁచి పట్టినమేనితో • బయలు మెఱసి
వచ్చె వలిగట్టుతోలిపట్టి • వాసవాధి
వాహితనిజానుజభవావి•వాహమునకు. 36

పిడుగుకైదువుపెట్టు=వజ్రాయుధపుదెబ్బకు, తడకట్టుగాన్ = స్తంభనమగునట్లుగా, పయోధి=సముద్రుఁడు, మహౌషధిరసంబు చమరెననఁగన్ =సిద్ధమూలికలయొక్క రసము పూసెనో యన్న

ట్టులుగాను, కడలికరళ్ళ రాయిడిఁ గిడ్వడి = సముద్రతరంగ ఘట్టనముచేత మరలఁబడి, తటాంతవనరాజి=తీరమందలి వనసమూహము, మైనంటవ్రాలెననఁగన్=దేహమంటునట్టులు వ్యాపించెనో యన్నట్టులుగాను,

మున్నీటి=సముద్రముయొక్క, పెన్నీటి ముదురుచిల్వల=పెద్ద నీరుత్రాఁచుపాములయొక్క, అలజడికిన్=విషవేధకు-అనఁగా విష మెక్కుచుండునట్టులుగా, పచ్చలజోడు దొడిగెననఁగన్=గరుడపచ్చలచేత నిర్మింపఁబడిన కవచము దొడిగినాఁడో యన్నట్టులుగాను, గరుడపచ్చలు విషహారములని ప్రసిద్ధము. గరుడపచ్చలను ధరించినవారికి సర్వవిషభయ ముండదనుట ప్రసిద్ధము.

శ్లో. విషరోగోపశమనే కర్మస్వాథర్వేషుచ, శస్యతే మునిభి ర్యస్మా దయం మరకతోమణిః.

(గరుడపురాణము)

తనకుందనపుచాయ=కుందనపుబంగారమువంటి తనదేహకాంతి, పెనునీటికుప్ప=మహాజలరాశియొక్క, కప్పెనసిన=నీలిమగల-అనఁగా, పసఁబసరెక్క ననఁగన్=మెఱుపుగల పసరుచాయ యేర్పడియెనో యన్నట్టులుగాను, కుందనపుఁగాంతి మేనికాంతివలెనుండును.

తే-గీ. కుందనమువంటిమేను మధ్యందినాత, పోష్మహతిఁ గందె వడదాఁకె.

(మనుచరిత్రము, ద్వితీ.)

సంతత=నిరంతరమును, జలాంతరాళ=ఉదకముయొక్క యంతఃప్రదేశమే, సంస్థాన=నివాసముగాఁగలిగిన, మహిమన్=ప్రభావముచేత, ప్రాఁచిపట్టిన = పచ్చప్రాఁకుడుపట్టిన, మేనితోన్=శరీరముతోడ, బయలుమెఱసి = సముద్రపు కుక్షివల్లనుండి బయలుదేరి, వలిగట్టు తొలిపట్టి=హిమవంతుని ప్రథమపుత్త్రుఁడయిన మైనాకుఁడు, వాసవ=ఇంద్రునిచేత, అధివాహిత=పూనుకొనఁబడిన, నిజానుజభవా వివాహమునకున్=తనతమ్ముని కూఁతురైన గిరికాదేవిపెండ్లికి, వచ్చెన్=అరుగుదెంచెను.

మైనాకుఁడు ఇంద్రునివజ్రపాతమునకు వెఱచి చిరకాలము సముద్రమునఁ బడియుండెను. అట్టివాఁ డింద్రుఁడుచేయించు వివాహమునకు వచ్చుట యెటులన, జరుగనున్నది తనసోదరునిబిడ్డపెండ్లి. కోలాహలుని పురస్కరించి తనను మన్నించునని.

చ. ఇరువురు దేవసంభరణు • లిర్వురు నబ్జధరోన్నమత్కరాం
తరమహనీయు లిర్వురు న•నంతగుణాఢ్యులు గావునం బర
స్పరసమతాసమగ్రతర•సఖ్యమునం గవగూడి మేరుమం
దరధరణీధరాన్వయవ•తంసులు వచ్చిరి తత్క్షణంబునన్. 37

ఈపద్యమున మందరపర్వత మేరుపర్వతములకు రెంటికిని నర్థద్వయమును గలుగఁజెప్పినాఁడు గనుక నభేదాధ్యవసాయమని తెలియవలయును. ఎట్లనఁగా,

ఇరువురు దేవసంభరణులు=ఇద్దఱును దేవసంభరణులనంగా దేవతలకు గృహమయి భరించినవాఁడని మేరుపర్వతపరమయిన యర్థము. దేవతలచేత సముద్రమథనార్థమయి భరింపఁబడినవాఁడని మందరపర్వతపరమయిన యర్థము. ఇర్వురున్=ఇద్దఱును, అబ్జధరోన్నమత్కరాంతర మహనీయులు=అబ్జశబ్దము చంద్రునియందును శంఖమందును వర్తించుచున్నవి గనుక, అబ్జధర=చంద్రధరుఁడయిన హరునియొక్క, ఉన్నమత్కరాంతర=ఎగచియున్న హస్తమందు, మహనీయుఁడు=చాపమయి యొప్పిన

వాఁడని మేరుపర్వతపరమయిన యర్థము. అబ్జధర=పాంచజన్యధరుండయిన శ్రీమహావిష్ణువుయొక్క, ఉన్నమత్కారాంతరములచేఁ దరువఁబడినవాఁడని మందరపరమయిన యర్థము. (ని. 'అబ్జో ధన్వంతరౌ చంద్రే నిచుళే శఙ్ఖపద్మయోః' అని వి.) ఇర్వురు ననంతగుణాఢ్యులు=ఇద్దఱును ననంతగుణాఢ్యులనఁగా శేషరూపశింజినీగుణయుక్తుఁడని మేరుపరమయిన యర్థము. దీర్ఘమయి వాసుకిరూపమైన కవ్వపుత్రాఁటితోఁ గూడినవాఁడని మందరపరమయిన యర్థము. కావునన్=అయినందున, పరస్పర=ఒకరితో నొకరికైన, సమతా=సమానధర్మమువలని, సమగ్రతర=సంపూర్ణమయిన, సఖ్యమునన్=మైత్రిచేత, కవగూడి=జతగూడినవారై, మేరు మందర ధరణీధరాన్వయ వతంసులు = మేరుమందర పర్వతకుల శ్రేష్ఠులు, వచ్చిరి తత్క్షణంబునన్=ఆక్షణమంద యరుదెంచిరి.

ఉ. రోహణశైలరాజము మ◆రుద్గిరితోడనె వచ్చి నిల్చె వై
వాహికకార్యకర్త మఖ◆వంతుఁ డనంతసువర్ణరత్నసం
దోహము రాశి వోసి విబు◆ధుల్మనుజుల్భుజగుల్నుతింపఁగా
నాహిమవత్కుమారతన◆యామణి కుంకువ దెచ్చెనో యనన్. 38

రోహణశైలరాజము=రోహణాచలశ్రేష్ఠము, మరుద్గిరితోడనెవచ్చినిల్చెన్=మేరుపర్వతముతోఁగూడ వచ్చినిలిచెను. ఎటులనినను, వైవాహికకార్యకర్త=పెండ్లికార్యముచక్కపఱుచునట్టి, మఖవంతుఁడు=ఇంద్రుఁడు, అనంతసువర్ణ రత్నసందోహము రాశివోసి=అపరిమితమైన బంగారముయొక్కయు మణులయొక్కయు సమూహము కుప్పఁగాఁ బోసి, విబుధులు=దేవతలును, మనుజులు=మానవులును, భుజగులు=పన్నగులును, నుతింపఁగాన్ = కొనియాడఁగా, ఆహిమవత్కుమారతనయామణికిన్ = హిమవత్పర్వతపుత్రుఁడైన యాకోలాహలునియొక్క పుత్రికారత్నమునకు-అనఁగా గిరికాదేవికి, ఉంకువదెచ్చెనోయనన్ = ఉంకువయనఁగాఁ బడుచుగలవారి కిచ్చునట్టియోలి గనుక నట్టియోలిదెచ్చినాఁడో యనునట్టులుగా, సువర్ణరత్నమయములైన మేరు రోహణాచలశ్రేష్ఠములు వచ్చి నిలిచెనని సంబంధము. అలం. ఉత్ప్రేక్ష.

మ. మఱియున్ వచ్చిరి ధాత్రిఁ గల్గునగసా◆మ్రాజ్యైకధౌరేయు లం
దఱుఁ దద్భూరిభరాప్తిఁ గ్రుంగునవనిం◆దామ్యత్ఫణారాజిఁ బ
ల్మఱు సంధించుచు నుండెఁ గాని వసుక◆ల్యాణంబు వీక్షింప రా
వెఱచెన్ శేషుఁడు శేషవృత్తికగునే◆విస్రంభసంచారముల్. 39

మఱియున్=వెండియును, ధాత్రిఁగల్గు = భూమియందుఁగలిగిన, నగసామ్రాజ్యైకధౌరేయులందఱున్ = పర్వతసామ్రాజ్యమునకు ముఖ్యధురంధరులైనవారందఱును - అనఁగాఁ బర్వతాధీశ్వరులందఱును, వచ్చిరి=ఏతెంచిరి. తత్=ఆపర్వతశ్రేష్ఠులయొక్క, భూరి = అధికమయిన, భర=భారముయొక్క, ఆప్తిన్=ప్రాప్తిచేత, క్రుంగు=దిగఁబడుచున్న, అవనిన్=భూమిని, శేషుఁడు=శేషాహి, తామ్యత్ = సుడివడుచున్న, ఫణారాజిన్ = పడగగుంపునందు, పల్మఱుసంధించుచున్ = మాటిమాటికిని గుదురుపఱుచుచు, ఉండెఁగాని = ఉండెనే కాని, వసుకల్యాణంబు వీక్షింపరావెఱచెన్ = వసురాజువివాహము చూచునిమిత్తము వచ్చుటకు జడిసెను. వసుకల్యాణ మన్నచోట కాంచనార్థకమైన శబ్దద్వయమును బుచ్చుకొన్నాఁడుగనుకఁ బునరుక్తవదాభాసాలంకారము. శేషవృత్తి

కిన్=దాసవృత్తిగలవానికని యర్థము. శేషశబ్దవృత్తిగలవానికని భావము. వృత్తియనఁగా నభిధాన వృత్తి, విస్రంభసంచారముల్=ప్రణయసంచారములు-అనఁగా వేడుకకొఱకైన విహారములు.అగునే= అవునా- అనఁగా యుక్తపడ దనుట. అలం. అర్థాంతరన్యాసాలంకారము.

ఉ. వచ్చినసింధుకాంతల నవారితసత్కృతిణాభివృద్ధిచే
హెచ్చుగఁజేసి గోత్రశిఖరీంద్రుల నున్నతి గారవించి వై
యచ్చరలోకభర్తయు హిమాలయసూతికి నాస్పదంబుగా
నచ్చట నొక్కనూతనమహానగరంబు మదిం దలంచినన్. 40

వచ్చిన సింధుకాంతలన్=వివాహార్థమై వచ్చిన నదీకాంతలను, అవారితసత్కృతిణాభివృద్ధిచే హెచ్చుగఁజేసి=అనివారితమైన సత్కృపారసాభివృద్ధిచేత నతిశయింపఁజేసి, గోత్రశిఖరీంద్రులన్= కులపర్వతశ్రేష్ఠులను, ఉన్నతిగారవించి=ఔన్నత్యముచేతఁ బెద్దరికముచేసి, అభివృద్ధి యన్నచోట ఉన్నతి యన్నచోటను స్వారస్యము స్పష్టము. ఏమనిన, ఏధర్మముగలవారియందు నాధర్మ మాపాదిం చినవాఁడాయె ననుట. వైయచ్చరలోకభర్తయున్=స్వర్గలోకాధిపతియైన యింద్రుఁడును, హిమా లయసూతికి నాస్పదంబుగాన్ = కోలాహలపర్వతున కాధారమగునట్లుగా, అచ్చట నొక్కనూతన మహానగరంబు మదిందలంచినన్ = ఆస్థలమందొక నవీనమైన మహాపట్టణమును మనస్సునఁ దలం పఁగా-ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

సింధుకాంతలు నదులు, నదు లభివృద్ధిచే హెచ్చునవి. గోత్రశైలేంద్రులు ఉన్నతిచే గౌర వము నొందఁదగినవారు. కావున నింద్రుఁ డుచితవిధమున గౌరవించెను. వివాహమునకు సామాన్య మందిరముగాని సామాన్యనగరముకాని చాలదు. నదు లభివృద్ధిస్వభావలు. శైలములు ఉన్నతిగలవారు వీరు పెండ్లిపెద్దలు. వీరలందఱు నివసింపఁ గ్రొత్తనగరము కావలసివచ్చినది. అనుకూలస్థలమా సమావేశ ప్రదేశమునసే. ఇంద్రుఁడు వియచ్చరలోకభర్త-కావున సంకల్పమాత్రముననే నిర్మించెను.

సీ. నిమ్నప్రపాతాంతనిర్ఝరపరిఖతోఁ గనుపట్టెఁ గోట యై కటకపరిధి
మణిచిత్రకిరణతోరణమాలికలతోఁ బ్రకాశించె గృహములై గహ్వరములు
శుచికరోపలభంగసోపానసరణితోఁ జెలఁగె సౌధాళి యై శిఖరపాళి
ఘనసారవసుసారగంధసారములతో నలరె నంగడు లై తటాజిరములు
తే. కలమధురకోకిలాలాప కలనతోడఁ, జెన్నలరెఁ గన్నెలై కొన్ని చిన్నిలతలు
సమధికస్కంధశాఖాభుజములతోడఁ, దనరెఁ దరుణాగ్రగణ్యులై తరువులెల్ల.

నిమ్న=లోఁతైన, ప్రపాతాంత=ప్రపాతమనఁగాఁ బర్వతశిఖరముక్రింద నుండెడు నున్నతప్రదే శము. (ని. 'ప్రపాతస్తు తటో భృగుః' అని అ.) అట్టిప్రపాతముల చివరలను బ్రవహించునట్టి, నిర్ఝర=సెలయేఱులనెడు, (ని. 'ప్రవాహో నిర్ఝరోఝరః' అని అ.) పరిఖతోన్=అగడ్తతోడను, కటకపరిధి=కటకమనఁగా సానువు, (ని. 'కటకంవలయే సానౌ' అని వి.) పరిధియనఁగా వలయము. (ని. 'పరివేషస్తు పరిధిః' అని అ.) వలయాకారసానువు=అనఁగా వలయాకారముగానున్న నిలువు బండలచాలు, కోటయై = ప్రాకారమై, కనుపట్టెన్ = చూడఁబడియెను. మణి=రత్నములయొక్క, చిత్ర=నానావిధములైన, కిరణ=కాంతులనెడు, తోరణమాలికలతోన్=తోరణపంక్తులతోడ, గహ్వ

రములు=గుహలు, గృహములై=మందిరములై, ప్రకాశించెన్ = విలసిల్లెను. వలయాకారముగనున్న శిలలు కోటయయ్యెను. సెలయేళ్లు లగడ్తయయ్యెను. జరుగనున్నది వివాహశుభకార్యముగాన మణితోరణములతో గుహలు గృహములయ్యెను.

శుచికర=ధవళకిరణుఁడైన చంద్రునియొక్క, ఉపల=శిలలయొక్క - అనఁగాఁ జంద్రకాంతశిలలయొక్క, భంగ=శకలములనెడు, సోపానసరణితోన్=మెట్లచాల్పులతోడ, శిఖరపాళి=శృంగపంక్తి, సౌధాళియై=హర్మ్యశ్రేణియై, చెలఁగెన్=ఒప్పెను. ఘనసార=కర్పూరపరఁటులనెడు కర్పూరముతోడను, వసుసార=రత్నశ్రేష్ఠములనెడు యోగ్యతరమణులతోడను, గంధసార = చందనవృక్షములనెడు చందనముతోడను, తటాజిరములు=అజిరమనఁగా నంగణము గనుక తటాంగణములు, అంగడులై=ఆపణములై, అలరెన్=ఒప్పెను. చంద్రకాంతశిలావృతములగు శిఖరములు సౌధములుఁగను ఘనసాగరు యుక్తములగు నంగణములు సుగంధభాండాగారములుగను మారెను.

కలమధుర=అవ్యక్తమధురములైన, కోకిలాలాప=కోయిలలపలుకులనెడు, కలనతోడన్=అవ్యక్తమధురములైన కోయిలపలుకులవంటి పలుకులతోడ, కొన్నిచిన్నిలతలు=కొన్నిలేఁదీఁగెలు, కన్నెలై=కన్నెపడుచులై, చెన్నలరెన్=బాగుమీఱెను, సమధిక=ఉన్నతములైన, స్కంధ=ప్రకాండములనెడు భుజశిరస్సులుగల, శాఖ=కొమ్మలనెడు, భుజములతోడన్=బాహువులతోడ, తరువులెల్లన్ = వృక్షములన్నియు, తరుణాగ్రగణ్యులై=తరుణపురుషజనశ్రేష్ఠులై, తనరెన్=ఒప్పుచుండెను. ఇక్కడ నింద్రానుగ్రహముచేత నిర్ఝరాదులకుఁ బరిఖాదిరూపములు సిద్ధించుటవలన నారోపశంక సేయఁగూడదు. తీవెలు కన్నెలైరి. వారిమాటలు కోయిలపలుకులు. వృక్షములు సమధికములు, స్కంధశాఖలు భుజములుగ నొప్పుటచే నవియెల్లఁ దరుణపురుషసముదాయ మయ్యెను.

ఉ. ధాతుపరాగరక్తియును ♦ దంతవిభక్తియుఁ జామరప్రకా
శాతిశయంబు సంకులమ♦దాంకనముం గదళీకదంబసం
భూతియుఁ గర్బురాకృతియుఁ ♦ బుష్కరభూతియుఁ బూని భద్రతా
ఖ్యాతి వహించె మించెఁ బృథు♦గండము లచ్చట నద్భుతంబుగాన్. 42

ఈపద్యమందుఁ గోలాహలపర్వతస్థితగండశిలలు పట్టణోచితభద్రగజత్వఖ్యాతిని వహించినవని చెప్పినాఁడు గనుక గండశిలాధర్మములన్నియును భద్రగజధర్మములుగాఁ జెప్పఁబడుచున్నవి.

ఏలాగనిన, ధాతుపరాగరక్తియును=గైరికధాతుపరాగరక్తియును - గైరికరేఖాశృంగారరంజనంబును, దంతవిభక్తియున్=దంతశబ్దము సానువునందును వర్తించుచున్నది. (ని. 'దన్త స్సానుని కథ్యతే' అని వి.) సానువిభాగమును=గజదంతవిభాగమును, చామరప్రకాశాతిశయంబు=చమరీమృగసమూహముయొక్క ప్రకాశాతిశయమును - వింజామరలయొక్క ప్రకాశాతిశయమును, సంకులమదాంకమునన్=సంకులమనఁగా జవ్వాదిపిల్లులు గనుక వానియొక్క మదచిహ్నము నని యర్థము. సంకులమైన గజమదచిహ్నమునని యర్థాంతరము. కదళీకదంబసంభూతియున్ = కదళీవృక్షములయొక్కయును గదంబవృక్షములయొక్కయును సంభవమును, బతాకాసమూహసంభవమును, (ని. 'కదళీ వైజయన్త్యాం చ రమ్భాయాం హరిణాన్తరే' అని వి.) (కదంబ మాహు స్సిద్ధార్థే నీపేపి నికురుంబకే' అని వి.) కర్బురాకృతియున్=తమయొక్క నీలవర్ణమును గజనీలవర్ణమును,పుష్కరమనఁగా

జలమును గజశుండాగ్రమును, (ని. 'పుష్కరం కరిహస్తాగ్రే వాద్య భాణ్డముఖేజలే' అని అ.) భూతి యనఁగా సమృద్ధియును మాతంగశృంగారమును, (ని. 'భూతి ర్మాతఙ్గశృఙ్గారే జాతౌ భస్మని సంపది' అని వి.) పుష్కరభూతియుఁ = జలసమృద్ధిని శుండాదండశృంగారమును, పూని=ధరించి, పృథుగండములు=మహత్తరములైన గండశిలలు, అచటఁ = ఆస్థలమందు, అద్భుతంబుగాఁ = ఆశ్చర్యమగునట్టులుగా, భద్రతాఖ్యాతివహించిమించెఁ=భద్రశబ్దము భద్రగజమందును శుభమందును వర్తించుచున్నది. గనుక భద్రగజత్వఖ్యాతిని వహించి, అనఁగా భద్రగజములయి మించెనని యర్థము. గండములనఁగా గండదోషములును గనుక గండదోషములు శుభములయ్యెనని యద్భుతార్థము. సంకులన్నచోట, (శ్లో. 'అసంబుద్ధ్యభవేద్వావురస్త్రియాం ల్వాదివర్గకే' అనెడు నథర్వణ వచనము చేత వుప్రత్యయము చెప్పినవాఁడు గాఁడు. సంకులమదాంకమన్నది షష్ఠీతత్పురుష తత్సమసమాసము.) ('షష్ఠీభవే ద్ద్వితీయా తుల్యా తత్పురుషసంస్థితానామ్నామ్' న. అనెడుసూత్రముచేత షష్ఠీ స్థానమందు, సంకులఁ అని ద్వితీయవచ్చినది.)

ఏనుఁగులపై నలంకారముగాఁ బతాకములు గట్టుటయుఁ జామరములు గట్టుటయుఁ గలదు. ఇటులె యశ్వములకును గట్టుదురు. అశ్వములకుఁ బతాకములు గట్టుదురనుటకు గ్రంథాంతరములందు దృష్టాంతములుగలవు. ఏనుఁగులపతాకములు గట్టుటకు-

"కదళీకాంచన కక్ష్యలం బొలుచు లేఖస్వామిచౌదంతిపైఁ" మను.

ఉ. జాతికి నెల్ల రాజపరి♦చర్యయు గాలికి నెక్కు డన్నవి
ఖ్యాతియు రాఁ గురంగములు ♦ గట్టున నేమితపం బొనర్చెనో
యాతతశృంగభారరహి♦తాత్మమహాముఖకాంతతాప్తి నౌ
రా తనరారె నన్నియుఁ దు♦రంగములై తదభీష్టసంపదన్. 43

జాతికినెల్లఁ = తమయొక్క కురంగసామాన్యమునకంతటికిని, రాజపరిచర్యయుఁ = నృపసేవయును అనియర్థము. చంద్రసంగతి యనిభావము. గాలికినెక్కుడన్న విఖ్యాతియుఁ=గమనవేగము చేత వాయువునకంటె నధికమనెడు ప్రఖ్యాతియును అనియర్థము. వాయుదేవునకు వాహనమని భావము. రాఁ=ఈరెండును వచ్చుకొఱకు, కురంగములు=లేళ్లు, గట్టున నేమితపంబొనర్చెనో=కోలాహలపర్వతమందు నెట్టితపస్సుచేసెనో, తదభీష్టసంపదఁ = వానికోరికప్రకారముగా, ఆతత = ఒప్పుచున్న, శృంగభారరహిత=కొమ్ములులేనట్టి, ఆత్మమహాముఖ=స్వకీయమహాముఖములయొక్క, కాంతతాప్తిఁ = సౌందర్యప్రాప్తిచేత, ఔరా తనరారెనన్నియుః దురంగములై = అన్నియును దురంగములైయొప్పెను భళాయనియర్థము. శృంగమనఁగా నుకారముగనుక, ఆతతశృంగభారరహిత = ఉకారరహితమయిన, ఆత్మమహాముఖ = తమకురంగశబ్దముఖవర్ణమయిన, కాంత=కకారముయొక్కయంతము-అనఁగా లోపముగల, తాప్తిఁ=తకారప్రాప్తిచేత, తురంగములై తనరారె ననియును నర్థము.

అనఁగా నుకారరహితమయిన కురంగశబ్దాది కకారము కేవలకకార మని గ్రహింపవలయును. కేవల కకారస్థానమందుఁ దకారమువచ్చి కకారముమీఁది యుకారముతోఁ గూడుకొని తువర్ణమయినదని యాశయము. అనఁగాఁ గురంగాకారము తురంగాకారమై కురంగశబ్దము తురంగశబ్దమై యాకృతిచేతను నామముచేతను గురంగములు తురంగము లయ్యె ననుట. కురంగములతపఃఫలము శృంగభారముతొలంగుట, ముఖకాంతతాప్తియగుట (కొమ్ములుపోయి చక్కనిమొగములో నలరుట), గమనవేగమునకుఁ గొమ్ము లడ్డుపడకుంటయు మొగ మందముగ నుంటయుఁ దపఃఫలములయ్యెను.

చ. హరిపరతంత్రవృత్తియు మ♦హామణిచాపశరానుబంధబం
ధురతయు రాజహంసకవి♦నోదనముం బవిఘోషఘర్ఘర
స్వరమును జిత్రవిగ్రహవి♦శంకటభావముఁ బూని శైలరా
ట్పురి నరదంబులై శరద♦ము ల్నెరసెం జపలాంశుసంపదన్. 44

ఈపద్యమందుఁ గోలాహలపర్వతమందలి మేఘములు పట్టణోచితరథము లయ్యెనని చెప్పినాఁడు గనుక మేఘధర్మములన్నియును రథధర్మములుగాఁ జెప్పఁబడుచున్నవి. ఏలాగనిన,

హరిపరతంత్రవృత్తియున్=హరిశబ్దము దేవేంద్రునియందును నశ్వమందును వర్తించుచున్నది గనుక నింద్రపరాధీనవృత్తిని నశ్వతరాధీనవృత్తిని, మహామణిచాప శరానుబంధ బంధురతయున్ = మణిచాపమనఁగా నింద్రధనుస్సును రత్నమయచాపంబును, శరమనఁగా జలంబును బాణంబును, గనుక ఇంద్రచాప జలసాంగత్య సౌందర్యమును రత్నమయ చాపబాణ సాంగత్య సౌందర్యమును, రాజహంస=రాయంచలనెడు, కవి=జలపక్షులయొక్క, నోదనమున్=తిరస్కారమును-లేక, రాజ = చంద్రునియొక్కయు, హంస=సూర్యునియొక్కయు, కవి=శుక్రునియొక్క, నోదనమున్=ఆచ్ఛాదనమును, రాజహంసక=రాజశ్రేష్ఠులయొక్క, వినోదనమున్=క్రీడను, పవిఘోషఘర్ఘరస్వరమును= ఘర్ఘరస్వరమువంటి యనఁగా నేమిధ్వనివంటి వజ్రనిర్ఘోషమును అనఁగా గర్జితమును వజ్రనిర్ఘోష సదృశమయిన నేమిధ్వనిని, చిత్రవిగ్రహ విశంకటభావమున్=కామరూపశరీర మహత్త్వమును నద్భుతాకార మహత్త్వమును, (ని. 'విశఙ్కటం పృథుబృహ ద్విశాలం పృథులంమహత్'అని అ.)పూని= వహించి, శైలరాట్పురిన్=కోలాహలపర్వతరాజ పట్టణమందు, అరదంబులై=రథంబులై, శరదముల్ = మేఘములు, చపలా=మెఱుపుతీఁగెలయొక్క, అంశుసంపదన్=కిరణసంపత్తిచేత నని మేఘపరమయిన యర్థము. చంచలములయిన కాంతిసంపదలచేత నని రథపరమయిన యర్థము. నెరసెన్=వ్యాపించెను.

చ. గిరివరఘోరకందరలఁ♦ గేవలవన్యగజైకవృత్తిచేఁ
దరలక యున్నసత్కృతము♦ తప్పనె యప్పురికేసరుల్ నృకే
సరు లయి పూర్ణపౌరుషవి♦శాలత మించె మహానృకేసరిం
బరునకు మార్గ్గొగం బిడమి♦ భక్తునిఁ బ్రోవ సటల్ఘటింపమిన్. 45

గిరివర=కోలాహలపర్వతసంబంధములైన, ఘోర=భయంకరమైన, కందరలన్=గుహాలయందు, (ని. 'దరీతు కందరో వాస్త్రీ' అని అ.) కేవల=ముఖ్యమగునట్టులుగా, వనీ=వనమందలి, అగ=వృక్షములవలన, జ=పుట్టిన ఫలాదికములయందైన, ఏకవృత్తిచేన్=ఒకవృత్తిచేత-అనఁగాఁ గేవలవనవృక్షఫలాద్యాహారనియతవ్యాపారముచేతను అని యర్థము. అడవియేనుఁగులే ముఖ్యాహారముగా నుంచున్నవని భావము. తరలకయున్నసత్కృతము=చలింపకయున్న సత్కార్యము-అనఁగాఁ దపశ్చర్య, తప్పనె=వ్యర్థమవునా, కాదుకనుకనే, కేసరుల్=సింహములు, అప్పురిన్=ఆపట్టణమందు, నృకేసరులై=పురుషశ్రేష్ఠులై, పూర్ణపౌరుషవిశాలతన్=సంపూర్ణపరాక్రమాతిశయత్వముచేత ననియర్థము. పూర్ణపురుషాకృతిచేత ననిభావము. (ని. 'పౌరుషం పురుషస్యోక్తం భావే కర్మణి తేజసి' అని వి.) మహానృకేసరిన్=మహా నృసింహుని, మించెన్=అతిక్రమించెను. ఎందువల్లననిన, పరునకు మార్గొగం బిడమిన్=శత్రువునకు విముఖత్వము వహింపకపోవుటచేతను, భక్తునిఁబ్రోవ సటల్ఘటింపమిన్=సట

లనఁగా నసత్యములు గనుక భక్తజనరక్షణమున కసత్యములాడకపోవుటచేతను, మహానృసింహుని మించెనని సంబంధము. మహానరసింహుఁడు పరునకు మార్గ్గాగముపెట్టినవాఁడును భక్తులను బ్రోచుట కసత్యములు ఘటించినవాఁడును అని దోషారోపము.

మార్గ్గాగంబిడుట యనఁగా సింహవక్త్రము వహించినవాఁడనియును, సటలుఘటించుట యనఁగా మెడమీఁద వెంట్రుకలు గలవాఁడనియును భావము. కేసరులు నృకేసరులై మహానృకేసరిని జయించినవన్నందున కేసరు లుత్కృష్టమయిన నృకేసరిజన్మమును బొంది యాజన్మమందుఁ దమకంటె నధికుఁ డయినమహానృకేసరిని జయించిన సర్వోత్కృష్టదశను జెందెనని స్వారస్యము స్ఫురించుచున్నది. సటయన్నపద మసత్యవాచకమన్నందుకు - క. 'పలుపులు సట వావులు నహి' అని సారంగధరచరిత్రమునందుఁ బ్రయోగింపఁబడియున్నది. పూర్వపౌరుషభావములేమియుఁ బరునకు మారుమొగ మిడుటయుఁ సటలు ధరించుటయు నృకేసరియెడఁగల గుణములు. పూర్తిగ మగబీరములేనివాఁడనియు వేఱొకమోముగలవాఁడనియుఁ గల్లలాడువాఁడనియు నృకేసరి లోపములు తెలుపుచో శ్లేషార్థము. అలం. శ్లేషానుప్రాణితవ్యతిరేకము.

సీ. విపులవప్రంబులు • విప్రవరావాసవాటము ల్కల్యాణ•కూటములును
భూదారవర్గము • ల్భూరికంచుకిఖడ్గి హరిరాజతతులు యూ•థాధిపతులు
శ్యామాసమాజము • ల్సామోదవిటపప్రకాండము ల్సరసుల•తండములును
నిర్జరస్థానము • ల్నిరుపమగణికావినోదము ల్వంశీని•నాదములును
తే. గలుగుఁగా కేమి నగములఁ•గలుగుటరుదె, కలయనివియెల్ల నిజనామ•గరిమవదల
కచటనుచితార్థగతిఁబూను•టరిదిగాక, యనఁగ హరికృపఁబట్టణం•బయ్యె వనము.

విపులవప్రంబులు=విస్తారములైన సానువులును, విప్రవరావాసవాటముల్=పక్షిశ్రేష్ఠనివాసవాటములును, కల్యాణకూటములును=కాంచనశృంగములును, (శ్లో. 'కూటో స్త్రీశిఖరం శృఙ్గమ్' అని అ.) భూదారవర్గముల్=వరాహసమూహములును, భూరికంచుకి=అనేకసర్పములయొక్కయు, ఖడ్గి=ఖడ్గమృగములయొక్కయు, హరి = సింహములయొక్కయు, రాజ = యక్షులయొక్కయు, తతులు=సమూహములును, (ని. 'రాజా ప్రభౌ నృపే చంద్రే యక్షే క్షత్రియశక్రయోః' అని వి.) యూథాధిపతులు=మృగయూథాధిపతులును, శ్యామాసమాజముల్=ప్రేంకణపుఁబెగుంపులును, సామోద=పరిమళయుక్తములయిన, విటప=తరువిస్తారములుగల, ప్రకాండముల్=వృక్షస్కంధములును, సరసులతండములును=కొలఁకులయొక్క సమూహములును, నిర్జరస్థానముల్=దేవతాస్థానములును, నిరుపమగణికావినోదముల్=సమానరహితములయిన యడవిమొల్లలయొక్క వినోదములును, (ని. 'గణికా యూథికాంబష్ఠా' అని అ.) వంశీనినాదములును=బొంగువెదుళ్ళయొక్క నాదములును, కలుగుఁగా కేమి=కోలాహలాద్రియందుండఁగా నేమాయెను, నగములఁ గలుగుటరుదె=పర్వతములయందుండుట యాశ్చర్యమా-అనఁగా నాశ్చర్యముకాదు.

ఇఁక నేమనిన, కలయనివియెల్లన్=ఈచెప్పఁబడిన వప్రాదులన్నియును, నిజనామగరిమవదలక=స్వకీయనామధేయ గౌరవమును విడిచిపెట్టక, అచటన్=ఆస్థలమందు, ఉచితార్థగతిఁబూనుట=పట్టణోచితరీతిని వహించుట. అనఁగా, విపులవప్రంబులు=విస్తారములయినకోటలును, (ని. 'సాను

ప్రాకారయో ర్వప్రః' అని వి.) విప్రవరావాసవాటముల్ =బ్రాహ్మణశ్రేష్ఠులయొక్క నివాసశ్రేణులును, కల్యాణకూటములును=శోభనగృహములును, (శ్లో. 'వాసః కూటో ద్వయో శ్శాలా' అని అ.) భూదారవర్గముల్ =భూపతిసమూహములును, భూరికంచుకి ఖడ్గిహరిరాజితతులు-భూరి = అనేకులయిన, కంచుకి=కవచధారులయొక్కయు, ఖడ్గి = ఖడ్గధరులయొక్కయు, హరి = అశ్వముల యొక్కయు, రాజ=క్షత్రియులయొక్కయు, తతులు=సమూహములును, యూథాధిపతులు = సేనానాయకులును, శ్యామాసమాజముల్ = యౌవనమధ్యస్థలయిన స్త్రీలయొక్క సముదాయములును, సామోదవిటప్రకాండముల్ = సంతోషయుక్తులయిన విటశేఖరసమూహములును, (శ్లో. 'విటపో నస్త్రియాం స్తంబ శాఖా విస్తార పల్లవే, విటాధిపే నా' అని మేదిని.) సరసుల తండములును = రసికజనులయొక్క సమూహములును, నిర్జరస్థానముల్ = యువజననివాసస్థానములును, నిరుపమ గణికావినోదముల్ = అసమానలైన వేశ్యాంగనలయొక్కవినోదములును, వంశీనినాదములును = పిల్లనగ్రోవులయొక్క సునాదములును, అవుట, అరిదిగాక = ఆశ్చర్యముగాక, అనఁగన్ =అనునట్టులుగా, హరికృపన్ =ఇంద్రానుగ్రహముచేత, వనము = కోలాహలపర్వతారణ్యము, పట్టణంబయ్యెన్ =ఒక పట్టణమాయెను.

వప్రములు, భూదారవర్గము, శ్యామాసమాజము, గణికావినోదములు లోనగునవి నగములయందు సహజముగాఁ గలవు. ఇవియన్నియుఁ దొల్లిటినామములతోనే యలరి యుచితార్థములచే నగరానుకూలవస్తుసమృద్ధిగా మాఱుట ఆశ్చర్యకరము. హరికృపయున్న నసాధ్యములేదని భావము.

మ. ఘనఘోషార్భటియున్ సమీరణముఖా♦ఘూతాహితానాహత
స్వననానాసుషిరావళీఘుమఘుమ♦వ్యాపారముం గిన్నరీ
నినదంబుం గలకంఠికారవసుధా♦నిష్ఠ్యూతియున్ ఝర్ఝరా
ఘనినాదంబును నందుఁ గ్రందుకొనుచుం ♦ గప్పెం గకుప్పాళికన్. 47

ఘనఘోషార్భటియున్ =మేఘగర్జనయును అనియర్థము. తాళాదికాంస్య వాద్యఘోషమని యర్థాంతరము. (శ్లో. 'కాంస్యం తాళాదికం ఘనమ్' అని అ.)సమీరణ=వాయువుచేత,ముఖాఘూత=ముఖప్రదేశమందలి తాఁకుడుచేత, ఆహిత=కూర్పఁబడినదియు, అనాహత=అప్రతిహతమైనదియు నయిన, స్వన=నాదముగల, నానాసుషిరావళీ=నానావిధ బిలసమూహమందలి, ఘుమఘుమవ్యాపారమున్ =ఘుమఘుమాకారమును అనియర్థము. ('సమీరణ సమ్యక్ ఈరణం సమీరమ్' అని వ్యుత్పత్తి.) అనఁగా లెస్సఁగా ఖలుకుచున్నదైన, ముఖ=ముఖముచేత, ఆఘూత=పూరించుటచేత, ఆహితానాహత =ఆహితమును అనాహతము నైన, స్వన=నాదముగల, నానా=నానావిధములైన, సుషిరావళీ=వంశాది వాద్యములయొక్క ఘుమఘుమవ్యాపార మని యర్థాంతరము. (శ్లో. 'వంశాదికం తు సుషిరమ్' అని అ.) కిన్నరీనినదంబున్ =కిన్నరపక్షికాంతా నినాదమును అని యర్థము. కిన్నరీవాద్యవిశేష నినాదమని యర్థాంతరము. కలకంఠికా=ఆఁడుకోయిలలయొక్క, ఆరవసుధానిష్ఠ్యూతియున్ =నాదామృతనిష్ఠీవనము అనియర్థము. అవ్యక్తమధురమైన కంఠనాదముగల స్త్రీలయొక్క మధురారావమని యర్థాంతరము. ఝర్ఝరాఘనినాదంబును=విశీర్ణనదీప్రవాహనినదమును అనియర్థము. వాద్యవిశేషధ్రుత నినదమని యర్థాంతరము. అనఁగా జేగంటలనాదమనుట. (శ్లో. 'వాద్యప్రభేదా డమరు

మడ్డు డిండిమ ఝర్ఝరాః' అని. అ.) (శ్లో. 'విలంబితం ద్రుతం మధ్యం తత్వ మోఘో ఘనం క్రమాత్' అని అ.) అందుఁ గ్రందుకొనుచున్ = ఆకోలాహలాచలపట్టణమందు సంకులధ్వని యవుచును, కకుప్పాళికన్=దిక్సమూహమును, కప్పెన్ = ఆచ్ఛాదించెను, అనఁగా దిక్కులనన్నిటిని గ్రమ్మెననుట. (శ్లో. 'దిశస్తు కకుభః కాష్ఠాః' అని యమరము.)

మ. అగురుక్షోదపటీరభేదఘనసా♦రామోదసంభేదము
ల్మృగనాభిద్రవచర్చిక ల్వికచమ♦ల్లీమాలిక ల్కీరరా
జగరుద్రాజివిరాజితోరణము లం♦చచ్చామరంబు ల్ధగ
ద్ధగితామూల్యమణీవితానకములుం ♦ దద్భూమిఁ బొల్చెం దగన్. 48

అగురుక్షోద=అగురువృక్ష చూర్ణముయొక్కయు, పటీరభేద = చందనభేదముయొక్కయు, ఘనసార=కర్పూరపరఁటులయొక్కయు, ఆమోదసంభేదముల్ = పరిమళమేళములని యర్థము. అగురు చందన కర్పూర మేళములని యర్థాంతరము. మృగనాభిద్రవచర్చికల్=మృగములయొక్క నాభిరక్తపుపూఁతలని యర్థము. కస్తూరికా కర్దమ చర్చలని యర్థాంతరము. వికచమల్లీ మాలికల్=వికాసయుక్తములైన మల్లెతీఁగెలయొక్క చాల్పులని యర్థము. వికసించిన మల్లెపూలదండలని యర్థాంతరము. కీరరాజగరుద్రాజి విరాజితోరణములు, ఉరణములు=కొండగొఱ్ఱెలు విరాజితోరణముల వలెనుండెడురాజకీరములయొక్క ఱెక్కలచాల్పులని యర్థము. కీరరాజగరుద్రాజిసదృశవిరాజితోరణములని యర్థాంతరము. అంచచ్చామరంబుల్=ఒప్పుచున్న చమరీమృగ సమూహములని యర్థము. వింజామరలని యర్థాంతరము. ధగద్ధగితామూల్యమణీవితానకములుల్=ధగధగ మెఱయు విలువలేని మణిస్తోమములని యర్థము. రత్నముల మేలుకట్టులని యర్థాంతరము. (శ్లో. 'అస్త్రీ వితాన ముల్లోచః' అని అ.) తద్భూమిఁబొల్చెందగన్=అస్థలమందు యుక్తమగునట్టులుగాఁ బ్రకాశించెను.

పర్వతమునందలి సుగంధవస్తువులగు అగురుగంధము పచ్చకప్పురము కస్తూరి లోనగు నలంకారవస్తుసమూహము నగరోచితవస్తుసమృద్ధిగా నలరారెనని భావము.

సీ. పద్మినీనవపాత్ర♦పాళికానీతగంధరజంబు లొకవంకఁ ♦ దావు లీన
వరవర్ణినీవర్గ♦పరికల్పితాంగరాగవిశేష మొకచాయఁ ♦ గడలుకొనఁగ
రంభోరుకాండోత్క♦రపురోముఖన్యస్త ఫలజాత మొకదెసఁ ♦ బరిఢవిల్లఁ
బూగీసుకంధరా♦పుంఖితక్రముకతాంబూలీదళము లొక్క♦పొంత నెసఁగ
తే. మిత్రకాంతాభిలక్షితా♦రాత్రికములు
శ్రుతిహితద్విజకామినీ♦సుస్వరములు
మృగవిశాలేక్షణాదత్త♦మృగమదములు
బలసి యందు శుభార్థమై ♦భవము దెలుప. 49

పద్మినీ=పద్మలతచేత, నవపాత్రపాలికా=పాలికాకారనూతనపత్రసమూహముచేత, ఆనీత=స్వీకరింపఁబడిన, గంధరజంబులు=పరిమళయుక్తములయిన పుష్పాదులని యర్థము. పద్మినీ=పద్మినీజాతిస్త్రీలచేత, నవపాత్రపాలికా=నూతనపాత్రశ్రేణిచేత, ఆనీత=తేఁబడిన, గంధరజంబులు=గంధవాళ్ళని యర్థాంతరము. ఒకవంకఁదావులీనన్=ఒకవైపున వాసనలు గుప్పఁగాను, వరవర్ణినీవర్గ=ప్రేం

కణపుతీఁగెలయొక్క-సమూహముచేత, పరికల్పిత=కల్పింపఁబడిన, అంగ=స్వకీయాకారముయొక్క-, రాగవిశేషము=రక్తచ్ఛాయావిశేష మని యర్థము. ప్రేంకణపుతీఁగె లెఱ్ఱగానుండును. వరవర్ణినీవర్గ. స్త్రీసమూహముచేత, పరికల్పిత=చేయఁబడిన, అంగరాగవిశేషము=మైపూఁతయని యర్థాంతరము= (శ్లో. 'స్త్రీరత్నే చ ఫలిన్యాం చ దృశ్యతే వరవర్ణినీ' అని వి.) ఒకచాయఁగడలుకొనఁగన్=ఒకవైపునఁ బ్రకాశింపఁగాను,

రంభా=అరఁటిచెట్లచేత, ఉరు=గొప్పలయిన, కాండ=స్కంధములయొక్క-, ఉత్కర=సమూహముయొక్క-, పురోముఖ=అగ్రభాగమందు, న్యస్త=ఉంపఁబడిన-అనఁగా గెలవేయఁబడిన, ఫలజాతము=ఫలసమూహ మని యర్థము. రంభోరు=స్త్రీలయొక్క-, కాండ = సమూహముయొక్క-, ఉత్కర=ఉన్నతకరములయొక్క-, పురోముఖ=అగ్రభాగమందు, న్యస్త=ఉంపఁబడిన, ఫలజాతము=నానావిధ ఫలసమూహ మని యర్థాంతరము. ఒకదెసఁబరిఢవిల్లన్=ఒకవైపున నొప్పుచుండఁగాను, పూగీ=పోఁకచెట్లచేత, సుకంధరా=యోగ్యమయిన కంఠప్రదేశమందు, పుంఖిత = నిండింపఁబడిన, క్రముక=పోఁకలును, తాంబూలీదళములు=తమలపాకుతీఁగెలును అనియర్థము.అనఁగాఁ బోఁకచెట్లును దమలపాకులతీఁగెలును మెలఁగి యున్నవనుట. పూగీసుకంధరా = పోఁకపోఁడెలవంటి కంఠములుగల స్త్రీలచేత, పుంఖిత=కూర్పఁబడిన, క్రముకతాంబూలీదళములు = పోఁకలును దమలపాకులును అని యర్థాంతరము. ఒక్క-పొంతనెసఁగెన్=ఒకవైపున నతిశయింపఁగాను,

మిత్రకాంత=సూర్యకాంతములచేత, అభిలక్షిత=కనుపఱుపఁబడిన, అరాత్రికములు=రాత్రిభావముగల సమయములని యర్థము. అనఁగా సూర్యకాంతమణిదీప్తులచేత రాత్రులును బగళ్ళవలె నుండుచున్నవని భావము. ఇక్క-డ రాత్రియనుపదముపై బహువ్రీహియందు కప్రత్యయము. మిత్రజనులయొక్క- కాంతలచేత నివాళింపఁబడిన, మంగళ=శుభనిమిత్తములయిన, ఆరాత్రికములు=ఆరతులని యర్థాంతరము. శ్రుతిహిత=శ్రవణానందకరములయిన, ద్విజకామినీ=పక్షికాంతలయొక్క-, సుస్వరములు=యోగ్యమైన కంఠనాదములని యర్థము. శ్రుతిహితద్విజ = వేదాధ్యయనపరులయిన బ్రాహ్మణోత్తములయొక్క-, కామినీ=స్త్రీలయొక్క-, సుస్వరములు=యోగ్యమైన పెండ్లిపాటయొక్క-స్వరములని యర్థాంతరము. మృగవిశాలేక్షణా=కస్తూరీమృగకాంతలచేత, దత్త=ఈఁబడిన, మృగమదములు=కస్తూరికలని యర్థము. మృగములయొక్క- నేత్రములవలె విశాలములయిన నేత్రములుగల స్త్రీలచేత నీఁబడిన మృగమదములని యర్థాంతరము. బలసి=ఈచెప్పఁబడినవన్నియు బలిష్ఠములయి, అందున్=ఆకోలాహలపర్వతపట్టణమందు, శుభార్థవైభవము దెలుపన్=శుభనిమిత్తకమైన విభవమును దేఁటపఱుపఁగా, ముందరిపద్యముతో నన్వయము.

గంధరజము తావులీనుట, అంగరాగకాంతులు వ్యాపించుట, అనంటులు ఫలములతో నలరుట, పూగీతాంబూలదళము లొకచో నుండుట, ద్విజకామినీసుస్వరములు ఇవియన్నియు వివాహమంగళసూచకములు. ఆయాప్రదేశములందు సహజములగు పరికరములు కళ్యాణశుభసూచకముగా నుండెనని తాత్పర్యము.

చ. కనుఁగొని కన్నె నెచ్చెలులు • కానన దేవత లాయహార్యశా
సనవసువాసవప్రబల•సఖ్యము నాత్మమనోరథద్రుమా

తనఫలపాకరేఖయు ముదంబున నెన్నుచుఁ బుణ్యవాహినీ
వనితలు దారు సామయికవైభవముల్ సమకూర్చునంతటన్. 50

కనుఁగొని = చూచి, కన్నెనెచ్చెలులు = గిరికాదేవియొక్క ప్రియసఖులయిన, కాననదేవతలు=వనదేవతలు, ఆయహార్యశాసనవసువాసవప్రబలసఖ్యముఁ = పర్వతభంజనులయి యేకకార్యధుర్యులయిన వసుభూమీంద్ర మహేంద్రులయొక్క ప్రబలమైన స్నేహమును, ఆత్మమనోరథద్రుమాతన ఫలపాకరేఖయుఁ=తమకోరికలనెడు వృక్షములయొక్క ఫలపరిణతియును - అనఁగా ఫలించుటయును, (ని. 'పలాశీద్రుద్రుమాగమాః' అని అ.) ఎన్నుచుఁ=కొనియాడుచు, ఇక్కడ నెచ్చెలులు వనదేవతలుగనుక వారికి వృక్షఫల సంబంధము స్ఫురించుచున్నది, పుణ్యవాహినీవనితలుదారు= పుణ్యనదీకాంతలును దామును, సామయికవైభవము ల్సమకూర్చునంతటఁ = సమయసంభవములయిన వైభవములను సిద్ధపఱుచుచున్నమీఁదట. ముందరిపద్యముతో నన్వయము. వసురాజును దేవేంద్రుఁడును పర్వతగర్వభంజనులు. సమర్థులగు నీయిరువురిచెలిమి వనదేవతల కుత్సాహకరముగానుండెను. కావున వారికోర్కెద్రుమములకు వీరిచెలిమి ఫలరేఖవలెనలరెను. సమయసంబంధములగు శుభవస్తువుల సంతరించి శుభకార్యములలోఁ బాల్గొనువారు పుణ్యనదీకాంతలు.

క. ఈరే యొకశుభలగ్నం, బీరే వివరించి వరున కింతికిఁ గుశలం
బీరే యన వాచస్పతి, యీరేడుజగంబు లేలు నేలికఁ బలికెన్. 51

ఈరేయి=ఈరాత్రి, ఒకశుభలగ్నంబు=ఒకమంచిముహూర్తమును, ఈరేవివరించి = మీరేవిచారించి, వరునకింతికిఁ=వధూవరులకు, కుశలంబీరేయనఁ = క్షేమమియ్యరే యని పలుకఁగా, వాచస్పతి = బృహస్పతి, ఈరేడుజగంబు లేలు నేలికఁబలికెఁ = చతుర్దశభువనపరిపాలకుఁడయిన యింద్రునిఁ గూర్చి యొక్క వాక్యము పలికెను.

శా. సూర్యాదిగ్రహతారకాతదధిపస్తోమంబుతో నిట్టిస
త్కార్యం బీవు భరింప శోభనముహూర్తధ్యేయపుణ్యాపగా
హార్యస్వాములు పెండ్లిపెద్ద లయిరా నస్మత్కృతాచార్యకం
బార్యప్రస్తుత మై వధూవరుల కత్యైశ్వర్య మీఁ జాలదే. 52

సూర్యాదిగ్రహ=సూర్యుఁడుమొదలయిన నవగ్రహములతోడను, తారకా=అశ్విన్యాదినక్షత్రములతోడను, తదధిపస్తోమంబుతోఁ=ఆనక్షత్రములకధిదేవతలయిన యశ్వినీదేవతలు మొదలైనవారితోడను, ఇట్టిసత్కార్యంబీవుభరింపఁ=ఇట్టిసత్కార్యము నీవు పూనుకొనఁగాను శోభనముహూర్తధ్యేయపుణ్యాపగాహార్యస్వాములు = సుముహూర్తకాలమందు మహాసంకల్పములోఁ జెప్పఁబడుచున్న గంగాది పుణ్యనదులును మేరుప్రముఖపర్వతములును, పెండ్లిపెద్దలయిరాఁ = పెండ్లికిఁ దీర్పరులైనవారై వచ్చియుండఁగాను, అస్మత్కృతాచార్యకంబు=నాచేతఁ జేయఁబడిన యాచార్యత్వము, ఆర్యప్రస్తుతమై=పూజ్యులచేత స్తోత్రముచేయఁబడినదై, వధూవరుల కత్యైశ్వర్యమీఁజాలదే=వధూవరుల కత్యంతవైభవము నియ్యఁజాలదా-అనఁగా నియ్యఁగలుగుననుట. నక్షత్రాధిపతులనిర్ణయము కాలామృతగ్రంథమునందు 3వ శ్లోకమందుఁ జెప్పఁబడి యున్నది.

మహాసంకల్పమునందు గంగాదిపుణ్యనదులు మేర్వాదిమహాశైలములు చెప్పఁబడుచున్నవి. వీరు పెండ్లిపెద్దలుగాఁ జనుదెంచుట, సూర్యాదిగ్రహములు అశ్విన్యాదినక్షత్రములు, వానికధిపతులగు నశ్విన్యాదిదేవతలు వెంటరాఁగ నింద్రుఁడు శుభకార్యమునకుఁ బూనుకొనుట సుకృతవశమున సమకూరినవి. ఇట్టియెడ బృహస్పతిపెట్టులగ్నము స్తోత్రపాత్రమనుటలో ఐశ్వర్యదాయకమనుటలో సంశయములేదు.

చ. అళిఘటమీనకేసరిశ♦రాసనగోమకరంబులం గచం
బులఁ గుచనేత్రమధ్యముల♦ భ్రూకటిజంఘికలన్ జయించి ని
స్తులత నజాంగనాధికయ♦శోనిధి యైనయవక్రవృత్తికిం
గలికికి నియ్యెడ న్మిథున♦కల్పన యోగ్య మటంచుఁ బల్కినన్. 53

అళి ఘటమీన కేసరి శరాసన గోమకరంబులన్=అళియనఁగా వృశ్చికమును తుమ్మెదయును (ని. 'అళి ర్వృశ్చిక భృఙ్గయోః' అని వి.) గోవనఁగా వృషభమును భూమియును, వృశ్చిక కుంభ మీన సింహ ధను ర్వృషభ మకరరాసుల ననియర్థము. కచంబులన్=తలవెండ్రుకలచేతను, కుచ=కుచముల చేతను, నేత్ర=నేత్రములచేతను, మధ్య=నడుముచేతను, భ్రూకటిజంఘికలన్-భ్రూ=కనుబొమలచేతను, కటి=నితంబోపరిభాగముచేతను, జంఘికలన్=పిక్కలచేతను, జయించి=తిరస్కరించి యని క్రమాలంకారము. ఇక్కడఁ గచములచేత నళిని జయించినదనఁగాఁ దుమ్మెదను జయించినదనియును గటిచేత గోవును జయించినదనఁగా భూమిని జయించినదనియును భావము. ఘటాదిపదముల కర్థద్వయము స్పష్టము. (ఇచటఁ బ్రాణ్యంగముల కేకవద్భావముచేసి కుచనేత్రమధ్యమున భ్రూకటిజంఘమునన్-అని పాఠముఁజేసిన బాగుగానుండును.) నిస్తులతన్ = అనఁగాఁ దులారాశి నతిక్రమించుటచేత ననియర్థము. సమానరహితత్వముచేత ననిభావము. అజాంగనాధికయశోనిధియైన=అజమనఁగా మేషరాశియును గనుక వీనికంటె నధికురాలనెడికీర్తికి నిధియైన యని యర్థము. అజాంగనయనంగా సరస్వతి గనుక నాయమకంటె నధికధవళమైనకీర్తికి నిధియైనదని భావము. అవక్రవృత్తికిన్=కర్కటరాశివలె వక్రవృత్తిలేనిదాని కని యర్థము. చక్కని నడకగలదనిభావము. కలికికిన్ = ఇట్టిగిరికాదేవికి, మిథునకల్పనయోగ్య మటంచుఁబల్కినన్=మిథునలగ్ననిర్ణయము యుక్తమనిపలుకఁగా అనియర్థము. మిథునరాశి స్త్రీపురుషయుగ్మరూపము గనుక మిథుననామక లగ్నకల్పనయోగ్యమనియును నర్థము. ముందరి పద్యముతో నన్వయము.

శా. ఆచార్యోదితలగ్నమంగళ మహా♦ర్యస్వామికిం దెల్పి యా
ప్రాచీపాలుఁడు చేదిభర్త కెఱిఁగిం♦ప న్వాచ్ఛఁ జంచత్పతా
కాచాంచల్యము కార్యసిద్ధియు సురీ♦గానంబు కల్యాణచ
ర్యాచారంబును దూర్యఘోషము వరా♦హ్వానంబు సూచింపఁగాన్. 54

ఆచార్య=బృహస్పతిచేత, ఉదిత=చెప్పఁబడిన, లగ్నమంగళము=ముహూర్తరూపమైనశుభమును, అహార్యస్వామికిందెల్పి=పర్వతాధిపతియైన కోలాహలునికిఁ దెలియఁజేసి, ఆప్రాచీపాలుఁడు=తూర్పుదిక్కును బాలించునట్టి యాయింద్రుఁడు, చేదిభర్తకున్=వసురాజునకు, చంచత్పతాకాచాంచల్యము కార్యసిద్ధియున్=ప్రకాశించుచున్న ధ్వజపటచలనము కార్యసిద్ధియగుటను, సురీగానంబు

కల్యాణచర్యాచారంబును=దేవతాస్త్రీలయొక్క సంగీతము వివాహమంగళాచారమును, తూర్యఘోషము వరాహ్వానంబున్=చతుర్విధవాద్యధ్వని-అనఁగాఁ గాంస్యతాళమృదంగవేణువీణానాదము వరునిఁ బిలుచుటకును, సూచింపఁగాన్=సూచనసేయఁగా, ఎఱిఁగింపన్=తెలియఁజేయుటకు-అనఁగా వివాహకార్యసిద్ధిని దెలియఁజేయుటకు, వచ్చెన్=అరుగుదెంచెను.

అనఁగా నింద్రుఁడు వసురాజునకు వివాహకార్యము సిద్ధపఱిచి వచ్చిన లక్షణములు ధ్వజపటచాంచల్యాదులచేత సూచనసేయుచును దద్వృత్తాంతము వసురాజునకుఁ దెలియఁజేసెడుకొఱకు వసురాజునొద్దకు దేవేంద్రుఁడు వచ్చెనని తాత్పర్యము. కాలోచితయత్నము లందుటకుఁ దొలుతఁ గోలాహలుని హెచ్చరింపవలసియున్నది కావున బృహస్పతిచెప్పిన ముహూర్తము దేవేంద్రుఁడు కోలాహలునకుఁ దొలుతఁ జెప్పెను. ఇచటిప్రయత్నములు త్వరలోఁ బూర్తియగునుగావునఁ జేదిభర్తవద్ద కింద్రుఁడు స్వయముగా బయలుదేరెను. కేతనచలనము కార్యసిద్ధికి, వేల్పుచెలులగానము శుభాచారమునకు, మంగళవాద్యములు వరాహ్వానమునకు సూచకములుగా నుండెను.

ఉ. నిండుమనంబునం దనమ • నీషిత మెల్ల ఘటింప వచ్చునా
ఖండలురాక చారణము • ఖంబున మున్న యెఱింగి చేదిభూ
మండలభర్త గాంచె నతి • మాత్రముదం బది యెందుఁ జిత్రమే
కొండలు పిండి సేయుశత • కోటియుతుండు హితుండు గల్గినన్. 55

నిండుమనంబునన్ = సంపూర్ణభావముచేత, తనమనీషితమెల్ల ఘటింపవచ్చు = తనవాంఛితమంతయు సమకూర్పవచ్చిన, ఆఖండలురాక=దేవేంద్రునియొక్క వచ్చుటను, చారణముఖంబునన్=చారణులముఖవచనమువలన, మున్నయెఱింగి = ఇంద్రుఁడురాకముందుగానే తెలిసికొని, చేదిభూమండలభర్త=చేదిరాజ్యాధిపతియైన వసురాజు, అతిమాత్రముదంబు=అతిశయమయిన సంతోషమును, కాంచెన్=పొందెను. అదియెందుఁజిత్రమే=ఆలాగునసంతోషించుట లోకములో నాశ్చర్యమా-అనఁగాఁ గాదనుట. ఏమనిన, కొండలుపిండిసేయు=పర్వతములను నుగ్గునుగ్గుచేసెడు, శతకోటియుతుండు=వజ్రాయుధహస్తుఁడు, హితుండుగల్గినన్=ఆప్తుఁడుగాఁగా నని యర్థము. ఇది వెనుక కన్వయము. అసాధ్యసాధకుఁడైన శతకోటిపదార్థము గలవాఁడు హితుఁడుగాఁగా ననియు నర్థము స్ఫురించుచున్నది. దేవేంద్రునిరాక తనకార్యమును నెఱవేర్చుటకు. శుభకార్యసాధనమున కింద్రుఁడు రానున్నసంగతి ముందుగనె వసురాజు వినెనుగావున నింద్రాగమనమును వసురాజు కోరికనెరవేర్చుటకుగా నిశ్చయించెను. కార్యసిద్ధి యచిరకాలములో నున్నదనియు నింద్రుఁడంతవాఁడు చెలికాఁడయ్యెననియు వసురాజు మిగుల నానందించెను.

తే. రత్నకూటవిహారగౌ • రవమె కాని
యెందుఁ గుస్పృష్టి యెఱుఁగని • యింద్రపదము
లపుడు నిజమౌళిరత్నకూ • టాగ్రసరణిఁ
గూర్చె నుచితంబుగా వసు • క్షోణిభర్త. 56

రత్నకూట=రత్నసమూహముమీఁది, విహార=సంచారమందలి, గౌరవమెకాని=ఘనతయేకాని, ఎందున్=ఎప్పుడును, కుస్పృష్టియెఱుఁగని=కుత్సితజన స్పర్శ మెఱుఁగని, ఇంద్రపదములు=దేవేంద్రుని

పాదములను అనియర్థము. ఇంద్రునిపాదములు, రత్నకూటమనఁగా మేరుపర్వతముగనుక దానియందు సంచరించునవి యన్నియును గుస్పష్టియనఁగా భూస్పర్శముగనుక నది యెఱుఁగనివనియును భావము. అపుడు=ఆసమయమందు, వసుక్షోణిభర్త=వసురాజు, ఉచితంబుగాన్=అర్హమగునట్టులుగా, నిజమాళి రత్నకూటాగ్రసరణిఁగూర్చెన్=తనకిరీటమందలి రత్నసమూహముయొక్క యగ్రభాగమందు సందర్శముచేసెను. అనఁగా రత్నకూటవిహారముగల యింద్రపదములకు రత్నకూటవిహారమే యొనఁగూర్చినాఁడని యర్థము. అనఁగా నింద్రునిపాదములు తనకిరీటముమీఁద సోఁకునట్టులుగా నింద్రునకు వసురాజు నమస్కరించె నని తాత్పర్యము.

క. అడుగుల కెరఁగినఁ బెండిలి, కొడుకవు గ మ్మనుచు నలమి♦కొని వజ్రి ముదం
బడర నొడలెల్లఁ గన్నులు, గడలుకొనం జూచి యవని♦కాంతునిఁ బలికెన్. 57

అడుగులకెరఁగినన్=పాదములకు నమస్కరింపఁగా, పెండిలికొడుకవు గమ్మనుచున్=పెండ్లికొడుకవు గమ్మని, అలమికొని=కౌఁగిలించుకొని, వజ్రి=దేవేంద్రుఁడు, ముదంబడరన్=సంతోషమతిశయింపఁగా, ఒడలెల్లగన్నులు గడలుకొనంజూచి=తన గాత్రమంతయును నేత్రమయ మగునట్టులుగా నతిప్రీతిచేతఁ జూచి యని యర్థము. గాత్రకలిత సహస్రనేత్రుఁడని భావము. అవనికాంతునిఁ బలికెన్=వసురాజునుగూర్చి యొకవాక్యము పలికెను. ఒడలెల్లఁ గన్నులుగాఁ జూచుటయాదరాతిశయము నని భావము.

శ్లో. సజానే సమ్ముఖాయాతే ప్రియాణి వదతి ప్రియే
సర్వాణ్యంగాని కిం యాంతి నేత్రతా ముత కర్ణతాం.

తే-గీ. ఎల్లచిగురాకుబోండ్లకు నెంతవేడ్క, యంత వేడుక తనలోన నతిశయిల్ల
నొక్కగుబ్బలకొమరాలు చక్కవచ్చి, కనియె నొడలెల్లఁ గన్నులై మనుజవిభుని.

శృంగారనై-ఆ. ౬.

ఉ. నిన్నటిమాపు మాపురమ♦ణీరమణీయసభావిభాగభా
గున్నతరత్నపీఠిఁ గొలు♦వుండి సురాంగన లాడఁ గిన్నరు
ల్కిన్నర మీటి పాడఁ దిల♦కించుచు నియ్యెడ కేల రాఁడకో
మన్నిరవద్యమిత్రుఁ డని♦ మక్కువ మీఱ నినుం దలంచితిన్. 58

నిన్నటిమాపు=నిన్నటిదినము రాత్రివేళ, మా=మాయొక్క, పురమణీ=పట్టణశ్రేష్ఠమైనస్వర్గమందలి, రమణీయ=సుందరమైన, సభా=సుధర్మాఖ్య సభయొక్క, విభాగ=ఏకదేశమును, భాక్=పొంది యున్న, ఉన్నత=పొడవైన, రత్నపీఠిన్ = చింతామణి రత్నమయసింహాసనమందు, కొలువుండి=కొలువుదీరికూర్చుండి, సురాంగనలాడన్=రంభాద్యప్సరసలు నృత్యము సేయఁగాను, కిన్నరు ల్కిన్నర మీటిపాడన్=కిన్నరులనెడు దేవయోనులు వీణావిశేషములుమీటుచు గానముసేయఁగాను, తిలకించుచున్=విమర్శించిచూచుచు, ఇయ్యెడకేలరాఁడకో మన్నిరవద్యమిత్రుఁ డని=నాయొక్క సర్వోత్కృష్టుఁడైన స్నేహితుఁ డిక్కడి కెందుచేత రాఁడాయెనో యని, మక్కువమీఱ నినుం దలంచితిన్=ప్రేమ యతిశయింపఁగా నిన్నుఁ దలఁచితిని.

క. తలఁచి భవదీయమానస, తలచింత యెఱింగి యెంత♦ తలఁకైనొకో నా

చెలి పేరామనిచెలికిం, గలువలచెలి కనుచు నిదుర ♦ కంటికి రామిన్. 59

తలఁచి=తలఁచుకొని, భవదీయమానసతల చింతయెఱింగి=నీమనఃప్రదేశమందలి విచారమును దివ్యజ్ఞానసంపత్తిచేతఁ దెలిసికొని, నాచెలి=నా స్నేహితుఁడు, పేరామనిచెలికిన్=వసంతునికి సఖుఁడయిన మన్మథునికిని, కలువలచెలికిన్=చంద్రునకును, ఎంతతలఁకెనొకో=ఎంత భయపడెనో కదా, అనుచున్=అని విచారించుచు, నిదురకంటికిరామిన్=కంటికి నిద్ర రాకపోవుటచేత అని యర్థము. దేవత లస్వప్నులని భావము. ముందరిపద్యముతో నన్వయము.

ఉ. అంబకపంచకంబుఁ గల ♦ యం బచరించుచు నంబకత్రయా
డంబరశాలిచేఁ గడు వి ♦ డంబితుఁ డైనయనంగుఁ డాసహ
స్రాంబకబాంధవుం జెనకి ♦ యారడిఁ బెట్టెడివాఁడె యంచుఁ జి
త్తంబునఁ దావకాంగభవ ♦ తాపనివారణతత్పరుండ వై. 60

అంబకపంచకంబున్=బాణపంచకమును, కలయంబచరించుచున్=కలియునట్టులుగాఁ బ్రయోగము సేయుచును, అంబకత్రయాడంబరశాలిచేన్=బాణత్రయముగలవానిచేత, కడువిడంబితుఁడైన=మిక్కిలి తిరస్కృతుఁడయిన, అనంగుఁడు=అంగరహితుఁడయిన మన్మథుఁడు, ఆసహస్రాంబకబాంధవుంజెనకి యారడిఁబెట్టెడివాఁడెయంచున్=సహస్రబాణములుగలవానియొక్క స్నేహితునిఁ దగిలి బాధపెట్టెడువాఁడాయెనా యని తలంచుచును అని యర్థము. అంబకశబ్దము నేత్రమందును వర్తించుచున్నది గనుక హరుఁడు త్రిలోచనుఁడు దేవేంద్రుఁడు సహస్రలోచనుఁడును అని భావము. చిత్తంబునన్ = మనస్సునందు, తావకాంగభవతాపనివారణ తత్పరుండవై=నీయొక్క మన్మథతాపమును నివారించుటయందలి యాసక్తిగలవాఁడవై-ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. ఇందులో ననంగపదమువలన నంగరహితుఁడు గనుక దుర్బలుఁ డని సాభిప్రాయము.

మన్మథుఁడు అయిదు అంబకములు గలవాఁడు. మూఁడంబకములు కలవానిచేఁ దిరస్కరింపఁబడెను. పైగా అనంగుఁడు. ఇట్టివాఁడు వేయియంబకములుగలవాని చుట్టమును దాఁకొని బాధపెట్టుట సాహసము. ఇందులకుఁ బ్రతిక్రియఁ గావించుటకు ఇంద్రుఁడు రానెంచెను. చేయవలసిన పని యంగభవతాపనివారణము. అలం. కావ్యలింగము. ఇంద్రునిముందు మరుఁడెంత యనుటకు—

తే-గీ. మూఁడుకన్నులవానితో మోహరించి, నేఁడు దేహంబు లేకయున్నాఁడు దాను
వేయికన్నులవేల్పుతో నుగ్రహించి, వనిత యింకేమి కానున్నవాఁడొ మరుఁడు.

శృంగారనైషధము.

ఉ. ప్రొద్దున వచ్చి శీతనగ ♦ పుత్త్రినిఁ గన్నియ వేఁడి గట్టురా
పెద్దలఁ బుణ్యవాహినులఁ ♦ బెండ్లికి రా నియమించి నీకు న
మ్ముద్దులకన్నె నిచ్చునగ ♦ ముఖ్యున కొక్కపురీలలామకం
బుద్ధవిడిన్ సృజించి సుము ♦ హూర్తము నేఁడె యనన్ రయంబునన్. 61

ప్రొద్దునవచ్చి=నేఁటియుదయకాలమునవచ్చి, శీతనగపుత్త్రినిఁగన్నియవేఁడి = హిమవత్పర్వతపుత్త్రిఁడయిన కోలాహలునిఁ జిన్నదానినడిగి, గట్టురాపెద్దలన్=పర్వతశ్రేష్ఠులైన మేరుమందరాదులను, పుణ్యవాహినులన్=పుణ్యనదులను, పెండ్లికిరానియమించి=వివాహోత్సవమునకు వచ్చునట్టులుగా

నాజ్ఞాపించి, నీకు నమ్ముద్దులకన్నెనిచ్చు నగముఖ్యునకున్=నీకాచక్కని కన్నెనిచ్చునట్టి కోలాహలునికి, ఒక్కపురీలలామకం బుద్దవిడిన్ సృజించి=ఒకపట్టణశ్రేష్ఠమును శీఘ్రముగా నిర్మించి, సుముహూర్తము నేఁడెయనన్=మంచిముహూర్తము నేఁడే యని బృహస్పతిగారు చెప్పఁగా, రయంబునన్=శీఘ్రగతిచేత-ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

శా. గంధర్వానకదుందుభిధ్వనులతో ♦ గంగాదిసాధ్వీరమా
బంధుశ్రీపరిణీతిగానములతో ♦ భవ్యద్విజాశీర్వచ
స్సంధానంబులతో నగేంద్రతనయా♦సాంద్రానురాగద్విప
స్కంధారూఢుని నిన్నుఁ బెండ్లికొడుకుం ♦ గావింపఁగా వచ్చితిన్. 62

గంధర్వ=గంధర్వులచేత వాయింపఁబడునట్టి, ఆనక=నిస్సాణములయొక్కయు, దుందుభి=భేరులయొక్కయు, ధ్వనులతోన్=నాదములతోడను, గంధర్వానకధుంధుమధ్వనులతో నని పాఠాంతరముగలదు. అప్పుడు ధుమధుమ యని యానకధ్వని కనుకరణ మగుచున్నది. గంగాది=మందాకిని మొదలయిన, సాధ్వీ=పుణ్యాంగనలయొక్క, రమాబంధుశ్రీపరిణీతి గానములతోన్=లక్ష్మీనారాయణులయొక్క పెండ్లిపాటలతోడను, భవ్యద్విజాశీర్వచస్సంధానంబులతోన్=యోగ్యులయిన బ్రాహ్మణులయొక్క యాశీర్వాదసంఘటనములతోడను, నగేంద్రతనయా=గిరికాదేవియందలి, సాంద్రానురాగ=దట్టమైన యనురాగమనెడు, ద్విపస్కంధారూఢుని నిన్నున్=ఏనుఁగునెక్కిననిన్ను, ఇక్కడఁ బెండ్లికొడుకులకు విహితమైన శ్వశురగృహాగమనకాలకర్తవ్యమైన గజారోహణమును సూచించినాఁడని స్వారస్యము గ్రహింపవలెను. దీన ముద్రాలంకారము చెప్పఁబడియెను. పెండ్లికొడుకుం గావింపఁగా వచ్చితిన్=పెండ్లికొడుకును జేసెడునిమిత్తము వచ్చినాను.

దుందుభిధ్వనులు సాధ్వీగీతములు ద్విజాశీర్వాదరావములు వివాహశుభలక్షణములు. శ్వశురగృహాగమనము కర్తవ్యము. ద్విపస్కంధారూఢుఁడై యరుదెంచుట శ్రుతివిహితముగాన నటులఁ జనుదెమ్మను స్వారస్యము గ్రాహ్యము.

చ. అనిన మహేంద్రునానతి ము♦ఖానతిఁ గాంచుమహీమహేంద్రునె
మ్మనము నవంబుగా నెఱిఁగి ♦ మంత్రిపురోహితదండనాథశా
సనధరు లాక్షణంబ శుభ♦సంభ్రమసన్నహనానులాపముల్
మొనపఁగ నమ్మహానగర♦ముం గయిసేయఁగఁ బంచి రెంతయున్. 63

అనిన మహేంద్రునానతిన్=ఈలాగనిపలికిన దేవేంద్రుని యనుమతివలన-ఇక్కడ, నానతి యనెడుపద మాజ్ఞప్తిశబ్దమునకుఁ దద్భవము. ముఖానతిగాంచుమహీమహేంద్రు=ముఖానతియనఁగా సిగ్గుచేత ముఖమువంచుట గనుకఁ దత్క్రియనుబొందిన ధరాపురందరుఁడయిన వసురాజుయొక్క-ఇక్కడ నానతివలన నానతిఁ గాంచెననియును మహేంద్రునకు వసురాజు ప్రతిమహేంద్రుఁడనియును జమత్కారము గ్రహింపవలయును. నెమ్మనము నవంబుగా నెఱిఁగి=మనస్సు సరసమగుటను గ్రహించి, మంత్రి పురోహిత దండనాథ శాసనధరులు=మంత్రులును బురోహితులును సేనానాయకులును నాజ్ఞాధారకులును, ఆక్షణంబ=తత్క్షణమే, శుభ=శుభ కార్యప్రయుక్తమైన, సంభ్రమ=అత్యాదరముతోఁ గూడుకొన్న, సన్నహన=ప్రయత్నమందలి, అనులాపములు=ముహుర్భాషణములు-అనఁగా

మాటిమాటికిని జెప్పఁబడెడువాక్యములు, మొనపఁగన్=ప్రకటమగునట్టులుగా, అమ్మహానగరముం గయిసేయఁగఁ బంచిరెంతయున్=ఆ యధిష్ఠానమనెడు మహాపట్టణమును శృంగారించుకొఱకు, పుర జనుల కందఱకు నాజ్ఞాపించిరి.

వసురాజు మహీమహేంద్రుఁడు. అట్టిచో మహేంద్రునిగాంచి తలవంచుట సిగ్గువెంపునని భావము. రాజు తలవంచుటచే నంగీకారము తెలిపెను. జరుగవలసినది నగరాలంకరణము. కావున శాసనధరులాకార్యము సంభ్రమము, సన్నాహనము, అనులాపములు మొనపుచుఁ బరిజనుల కాజ్ఞాపించి రని భావము.

సీ. పన్నిరి మేరువు ♦ ల్బహుసంఖ్యలకొలంది చంద్రసూర్యాకల్ప ♦ శతముతోడ
నాటిరి హరిచంద ♦ ననగంబు లెన్నేని నధికాయమానరం ♦ భాళితోడ
సవరించి రింద్రర ♦ త్నవితానములు పెక్కు వజ్రకూటప్రభా ♦ వలులతోడ
నిలిపిరి చిత్రరే ♦ ఖలచాలు మితి మీఱ నతులహేమాకృతి ♦ ప్రతతితోడఁ
తే. గట్టి రగణితపుండరీ ♦ కవ్రజంబు, తగునెడ ననంతకుముదసం ♦ తతులతోడ
వాసవపురస్థితానేక ♦ వస్తుమహిమఁ, జూచి వాసవపురివారు ♦ చోద్యమంద. 64

చంద్రసూర్య=చంద్రసూర్యులనెడు, ఆకల్పశతముతోడన్ = అసంఖ్యాలంకారముతోడను, బహుసంఖ్యలకొలంది=అసంఖ్యములుగాను, మేరువులు = మేరుపర్వతములను, పన్నిరి=అమర్చి రని యర్థము. చంద్రసూర్యరూపచిహ్నములను సారువులను బన్నిరనిభావము. అధికాయమాన=అధికమగు నట్టులుగా నాచరించుచున్న-అనఁగా నసంఖ్యమైన, రంభాళితోడన్=రంభానామకయైన యప్సరస్త్రీ సమూహముతోడను, ఎన్నేనిన్=అసంఖ్యములయిన, హరిచందననగంబులు = హరిచందనసంజ్ఞగల దేవతావృక్షములను, నాటిరి=పాదుకొలిపి రని యర్థము.

అధికాయమాన = కాయమానమనఁగాఁ బందిరి, పందిళ్లనుమించిన, రంభాళితోడన్=కదళీ వృక్షములతోఁగూడను, హరిచందననగంబు లనఁగాఁ బీతచందనవృక్షములను నాటిరని భావము. (ని. 'హరిచందన ముఖ్యాతం గోశీర్షే సురపాదపే' అని వి.) వజ్రకూట ప్రభావలులతోడన్= వజ్రాయుధసమూహములయొక్క కాంతిసముదాయములతోడను, ఇంద్రరత్నవితానములు పెక్కు= ఇంద్రనీలసమూహములను దఱుచుగా, సవరించిరి=కుదురుకొలిపి రని యర్థము. వజ్రమణి సమూహ కాంతులతో నీలములుకూర్చిన వితానములు-అనఁగా మేలుకట్లు తఱుచుగాఁ గట్టిరని భావము. (ని. 'వజ్రో స్త్రీహీరకే పవౌ' అని అ.) అతుల = సమానరహితమయిన, హేమాకృతిప్రతతితోడన్= హేమాభిధాన లగునప్సరస్త్రీసమూహముతోడ, మితిమీఱన్=అధిక మగునట్టులుగా, చిత్రరేఖల చాలు=చిత్రరేఖానామకాప్సరస్త్రీలయొక్క పంక్తిని నిలిపిరని యర్థము. కాంచనపు ప్రతిమలను జిత్రపటములను నిలిపినారని భావము.

అనంత=అపరిమితమయిన, కుముదసంతతులతోడన్=కుముదనామక దిగ్గజసమూహములతో డను, తగునెడన్=ఉచితస్థలమందు, అగణిత పుండరీకవ్రజంబు = అసంఖ్యపుండరీకనామక దిగ్గజ సమూహమును, కట్టిరి=బంధించిరనియర్థము. కుముదములనఁగాఁ దెల్లగలువలును, బుండరీకములనఁ గాఁ దెల్లదామరలును గనుకఁ దెల్లగలువలును దెల్లదామరలును దోరణములుగాఁ గట్టిరని భావము

యేలాగుననినన, వాసవపురస్థితానేకవస్తుమహిమఁ జూచి=వసురాజు సంబంధమయిన పట్టణమందున్న వస్తువులయొక్క మహత్త్వమును జూచి, వాసవపురివారు చోద్యమందన్=స్వర్గపురసంబంధులయిన వారు.

అనఁగా దేవతలు ఆశ్చర్యమును బొందునట్టులుగా అని సంబంధము. అనఁగా నధిష్ఠానపురమును స్వర్గపురమును వాసవపురములయినప్పటికిని మేరువు మొదలయిన వస్తువులయొక్క యనేకత్వముచేత నధిష్ఠానపురము స్వర్గనివాసుల కాశ్చర్యకరమాయె ననుట. ఈభావార్థములయందుఁ జెప్పఁబడినప్రకారముగా నధిష్ఠానపురమును శృంగారించిరని ఫలితార్థము. అలం. అతిశయోక్తి - కావ్యలింగము.

చ. పరిణతదివ్యగంధఫల♦భారనమత్కదళీపరంపరా
పరివృతకాయమానములఁ ♦ బర్వుఫలావళిఁ జూచి పైపయిం
బరిగొని వచ్చు రాజశుక♦పంక్తులచొప్పున నొప్పె నప్పు డ
ప్పురవిపణిప్రఘాణముల ♦ భూరిహరిన్మణితోరణావళుల్. 65

పరిణత=కాలపక్వమైన, దివ్యగంధ=యోగ్యపరిమళముగలిగిన, ఫల=పండ్లయొక్క, భార=బరువుచేత, నమత్=వంగుచున్న, కదళీపరంపరా=అరఁటిచెట్లయొక్క చాల్పులచేత, పరివృత=ఆవరింపఁబడిన, కాయమానములన్=పందిళ్ళయందు, పర్వు=వ్రేలుచున్న, ఫలావళిఁజూచి=పండ్లగెలలను జూచి, పైపయింబరిగొనివచ్చు=మీఁదమీఁదఁ జాల్పుగట్టివచ్చుచున్న, రాజశుకపంక్తుల చొప్పునన్=రాచిలుకలయొక్క చాల్పులా యేమి యన్నట్టులుగా, అప్పుడు = ఆశృంగారించినసమయమందు, అప్పురవిపణిప్రఘాణములన్=ఆపట్టణపుటంగడులయొక్క బహిర్ద్వారగృహములయందు, భూరిహరిన్మణితోరణావళుల్=అనేకములైన మరకతమణితోరణములు, ఒప్పెన్=ప్రకాశించుచుండెను. అనఁగా నాయధిష్ఠానపురమందలి యంగడులముందరి చోపాలయందుఁ బందిళ్ళువేసి పండ్లగెలలతోనున్న యరఁటిచెట్లు నిలిపి వానిమీఁద మరకతమణితోరణములు గట్టఁగా నవి యేలాగుననుండెననిన నాయరఁటిపండ్లనిమిత్తముగా బార్లుగట్టుకొని వచ్చినిలిచిన రాచిలుకచాల్పులో యన్నట్టులుగా నుండెనని తాత్పర్యము. ప్రఘాణశబ్దమునకు-(ని. 'ప్రఘాణప్రఘణాళిందా బహిర్ద్వారప్రకోష్ఠకే' అని యమరనిఘంటువు.) అలం. ఉత్ప్రేక్ష.

పందిరులందు శుభసూచనార్థము కదళీతరువులను గట్టిరి. వానికి దివ్యగంధముగల పరిణతఫలములు గలవు. ఫలభారముచేఁ దరువులు వంగి గ్రహణయోగ్యముగ నుండెను. దివ్యసుగంధము గావున ఫలముల తావి దూరము వ్యాపించెను. రామచిలుకలు గుంపులుగా పరుగునవచ్చుట ఫలసుగంధ మాఘ్రాణించియే మరకతతోరణములు ఫలగ్రహణార్థమువచ్చిన చిలుకగుంపువలె నుండెనని ఫలితార్థము.

చ. పసిఁడికురుంజులన్ మెలఁగు♦బంగరుబొమ్మలఁ జూచు దేవతా
ప్రసవసుగంధులన్ ధ్వజప♦రంపరఁ బిల్చి వివాహపీఠికా
విసర మొసంగ నెత్తువసు♦పీరపురేందిరబాహులో యనన్
లసదహివల్లికావృతఫ♦లక్రముకంబులు నాటి రెల్లెడన్. 66

పసిఁడికురుంజులన్మెలఁగు=బంగారుమంచెలమీఁద సంచరించుచున్న, బంగరుబొమ్మలఁజూచు = బంగారపుకీలుబొమ్మలను వింతఁగాఁ జూచుచున్న, దేవతాప్రసవసుగంధులన్ = దేవతాస్త్రీలను,

ధ్వజపరంపరఁబిల్చి = కేతనపటాంచలములచేతఁ బిలిచి, వివాహవీటికావిసరమొసంగన్ = పెండ్లి తాంబూలము లిచ్చెదుకొఱకు, ఎత్తు = మీఁదికెత్తిన, వసువీరపురేందిర = వసురాజపురలక్ష్మియొక్క, బాహులోయనన్=భుజదండములో యన్నట్టులుగా, లసత్=ఒప్పుచున్న, అహివల్లికా = నాగవల్లీ లతలచేత-అనఁగాఁ దమలపాకుతీఁగెలచేత, (ని. 'తాంబూలవల్లీ తాంబూలీ నాగవల్ల్యపి' అని అ.) ఆవృత=ఆవరింపఁబడిన, ఫల=ఫలసహితములైన, క్రముకంబులు=పోఁకచెట్లను, ఎల్లెడన్=అంతటను, నాటిరి = పాదుకొలిపిరి. కురుజులన బురుజులని లోగడవ్యాఖ్యాతలు వ్రాసిరి గాని యాయర్థ మున్నటులఁ గానరాదు. ఎత్తైనమంచెలను కురుంజులందురు.

ఉ. అప్పుడు వారు తీర్పరుల నందులకున్ సమకూర్ప జాళువా
యొప్పులకుప్పలై మెఱయుచుండెడిమేరువులున్ గురుంజులున్
జప్పరముల్ వితానములు సర్వము నాయితవెట్టి. విజయవిలాసము-ఆశ్వా. ద్వి.

మందిరములముందునాఁటిన యున్నతములగు పోకమ్రాకులు పురలక్ష్మిబాహువులవలెను, పోక లతో నలరుచున్న తమలపాకుదీవియలయాకులు పెండిలికరుదెంచు వేలుపుఁబూవుబోండ్లకొసంగు తాంబూలమువలెను, గాలికిఁగదలు టెక్కెములు దేవకాంతలఁ బిలుచునట్లును నలరారెననిభావము. వేలుపుఁజెలువలు మంచెలపైనున్న విగ్రహములను దిలకించుటకువచ్చిరి. చేరువకువచ్చినవారిని నాహ్వా నించుట ధర్మము. ధ్వజము లాపని యొనరించునవి. వివాహావసరముగావునఁ దాంబూలములొసంగుట యవసరముగాన నవి నాగవల్లీలతాలింగితక్రముకవృక్షము లొనర్చినవి.

చ. హిమసలిలాభిషిక్తయును • హేమపటావృతయుం బటీరకుం
కుమరసలిప్తయుం గుసుమ•గుంభితయు న్నవధూపధూమసం
భ్రమరపరిజృంభమాణశిఖి•బర్హశిరోజయు నై యొసంగె భూ
రమణపురాధిదేవత హి•రణ్మయదర్పణదీప్యమాన యై 67

ఈపద్యములోఁ బురాధిదేవతయని చెప్పినాఁడుగనుక స్త్రీలింగస్వారస్యముచేత స్ఫురింపఁ బడుచున్న నాయికాపరముగా రెండవయర్థము చెప్పఁబడుచున్నది. ఎట్లనిన,

హిమసలిలాభిషిక్తయును = అనఁగా శీతోదకములచేతఁ దడుపఁబడినదని పట్టణపరమైన యర్థము. పన్నీటిచేత స్నానము సేయింపఁబడినదని నాయికాపరమైనయర్థము. హేమపటావృతయున్ =కనకవస్త్రములచేత నావరింపఁబడినదని యర్థము. కనకపీతాంబరము గట్టుకొన్నదని యర్థాంతరము. పటీరకుంకుమరసలిప్తయున్=శ్రీచందన కుంకుమ రసములచేత బూయఁబడినదియును, కుసుమగుంభి తయున్=పుష్పములచేతఁ గూర్పఁబడినదియును అని యుభయత్రసమము. నవ=నూతనమైన, ధూప ధూమ=కృష్ణాగరుధూప ధూమముచేత లక్షితమగుచున్న మేఘమండలి, సంభ్రమ=ఆదరముచేత, పరి జృంభమాణ=విస్తీర్ణములగుచున్న, శిఖిబర్హశిరోజయున్=శిరోజములవలె నుండెడు నెమిలిపింఛములు గలదనియర్థము. నవధూపధూమార్థమయిన యాదరముచేత విస్తీర్ణములైనదియు శిఖిబర్హసదృశములైన శిరోజములు గలదనియు నర్థాంతరము. ఐ=అయినదై, భూరమణపురాధిదేవత = వసురాజుయొక్క పట్టణాధిదేవత, హిరణ్మయదర్పణ దీప్యమానయై = గోడలయందుఁ గూర్పఁబడిన సువర్ణమయదర్పణ ములచేతఁ బ్రకాశమానమయినదై యనియర్థము. అవలోకనార్థమై తేఁబడిన కాంచనదర్పణమందుఁ

ప్రతిబింబించిన రూపముచేతఁ బ్రకాశించినదై యని యర్థాంతరము. ఎసంగెన్ = ఒప్పినదాయెను.

అనఁగా వసురాజుయొక్క పట్టణము చల్లనినీటిచేత నంతటఁ దడుపఁబడినదియును సువర్ణమయములైన ధ్వజపటములచేత నావరింపఁబడినదియును శ్రీచందన కుంకుమరసములచేతఁ బూయఁబడినదియుఁ బుష్పమాలికలచేత నలంకరింపఁబడినదియుఁ గృష్ణాగరుధూపధూమములు గలుగుచుండఁగా, వానియందలి మేఘభ్రాంతివలన నటించునెమిళ్ళచేత విప్పఁబడినపింఛములు గలదియుఁ గోడలయందుఁ గూర్పఁబడిన సువర్ణమయదర్పణములు గలదియు నై ప్రకాశించె నని తాత్పర్యము. అలం. శ్లేషము.

ఉ. కాంచనపత్త్రికావళులఁ ♦ గౌతుకసూచకవాచికంబు వ్రా
యించి సమస్తదేశవసు♦ధేశుల కంచిన వారు మౌళి సం
ధించి సువర్ణపట్టభృతి ♦ నేఁడు గదా మన కంచుఁ దెచ్చి ర
భ్యంచితపత్త్రయోగ్యనవ♦హాటకపుష్పఫలోపహారముల్. 68

కాంచనపత్త్రికావళులన్=బంగారపుటాకులయందు, కౌతుకసూచక = వివాహసూచకమైన, వాచికంబు = సందేశవాక్యమును, (ని. 'సందేశవాగ్వాచికం స్యాత్' అని అ.) వ్రాయించి = లేఖనముచేయించి, సమస్తదేశవసుధేశులకంచినన్ = సమస్తదేశముల రాజులకును బంపఁగా, వారు మౌళి సంధించి = ఆరాజులు తలమీఁదఁ బెట్టుకొని, సువర్ణపట్టభృతినేఁడుగదా మనకంచున్ = సువర్ణపట్టభృతి యనఁగాఁ గాంచనపట్టికాభరణంబును శోభనవర్ణయుక్త పట్టికాభరణంబును—అనఁగా రాజచిహ్నమయిన కాంచనపట్టికాభరణంబును భాగ్యసూచక వర్ణయుక్త పట్టికాభరణంబును మనకు నేఁడు గదా యని, అభ్యంచిత=మిక్కిలియునొప్పుచున్న, పత్త్ర=వాహనరూపమయినదియును, యోగ్యనవహాటక పుష్పఫల=యోగ్యమయిన హాటకరూపమయినదియుం,నూతనములైన పుష్పఫల రూపములైనదియుం నని క్రమాలంకారము. ఉపహారముల్=కానుకలు, తెచ్చిరి=తీసికొనివచ్చిరి. అనిఁయైనను, లేక అభ్యంచిత=ఒప్పుచున్న, పత్త్ర=సువర్ణమయశుభలేఖకు, యోగ్య=అర్హమగునట్టులుగా, నవ=నూతనమయిన, హాటక=సువర్ణమయములైన, పుష్పఫల=పుష్పఫల రూపములైన, ఉపహారముల్=కానుకలు, తెచ్చిరి=తీసికొనివచ్చి రని యైనను నర్థము. పత్త్రయోగ్యములగు నుపహారములు పుష్పఫలములు. పత్త్రము సువర్ణమయముగావున నుపహారములును నటులైనవహాటకవయవములు. కావుననే పత్త్రయోగ్యములు. వివాహసందేశముగలశుభలేఖలను సమస్తదేశవసుధేశులు మౌళిదాల్చుటవలన వసురాజు సార్వభౌముఁడని తెలియును.

సీ. వైణికవల్లకీ♦శ్రేణి నిమ్ముల మీఁటె గాయకగాంధర్వ♦గమకరేఖ
గాంధర్వగమకరే♦ఖఁ బరాహతము చేసె వాంశికవంశికా♦వైభవంబు
వాంశికవంశికా♦వైభవం బెగ నూఁదెఁ దాళికాధరకర♦తాళగరిమ
కరతాళగరిమంబు ♦ కంచుమించుగ నొత్తె నానద్ధచటులతూ♦ర్యవ్రజంబు

తే. చటులతూర్యవ్రజము నంటఁ ♦ జరచెఁ బరిణ
యాగతదిగంతనృపతినా♦గాశ్వరథప
దాతికోలాహలంబు రో♦దసి నఖండ
మగుచు నాదాత్మకబ్రహ్మ ♦ మతిశయిల్ల. 69

వైణిక=వీణవాయించువారియొక్క, వల్లకీశ్రేణిక్ = వీణాసమూహమును, గాయకగాంధర్వగమకరేఖ=గమకమనఁగా, (శ్లో. 'స్వనస్సకంపో గమకస్స చపఞ్చవిధస్మృతః') అని యున్నది గనుక సంగీతమందలి కంపముపేరు, గాయక=సంగీతపాఠకులైనవారియొక్క, గాంధర్వగమకరేఖ = సంగీతవిషయమైన స్వరకంపము-అనఁగాఁ గంఠనాదమందలికదలిక, ఇమ్ములమీటెక్ = ఉచితభంగిని నఖవాదము చేసెనని యర్థము. ఇక్కడ మీటఁదగినదాని మీటినదని యానురూప్యము గాయకులగానగమకము వీణానాదములను మీటెను. అనఁగా నణఁచెననిభావము. గాంధర్వగమకరేఖక్ = అట్టి గాంధర్వగమకమును, వాంశిక=పిల్లనగ్రోవును వాయించువారియొక్క, వంశికావైభవంబు=వేణుగానము, పరాహతముచేసెక్=ఆహతానాహతస్వరలక్షణము-

శ్లో. 'ఆహతోఽనాహత శ్చేతి ద్విధా వాదో నిగద్యతే
సోఽయం ప్రకాశతే ఖణ్డ స్సస్వాతణ్డో విధీయతే
తత్ర చానాహతం నాదం మునయస్సముపాసతే
గురూపదిష్టమార్గేణ ముక్తిదం నతు రఞ్జకమ్
ఆహతః కేవలం లోకరఞ్జకో భవబంధకః
శ్రుత్యాదిద్వారతః' (సంగీతశాస్త్రము)

పర=ఉత్కృష్టమైన, ఆహతముచేసెననఁగా ఖండసంజ్ఞచేఁ గేవలలోకరంజకమయినదానిఁగాఁ జేసెననియర్థము. ఇక్కడ నాహతస్వరమైనదాని నాహతస్వరముగాఁ జేసినదని యానురూప్యము. అట్టిగాయక గాంధర్వ గమకమును వాంశికులయొక్క వేణుగానము పరాహతముచేసెననిభావము. వాంశికవంశికావైభవంబు=అట్టివాంశికులయొక్క వేణుగానమును, తాళికాధర=తాళగాండ్రయొక్క, కర=హస్తములయందలి, తాళగరిమ = కాంస్యతాళ గౌరవము, ఎగసూఁదెక్=నిశ్వాసమారుతముచేతఁ బూరించెననియర్థము. ఇక్కడ నూఁదఁదగినదాని నూఁదినదని యానురూప్యము. ఆవేణుగానమును గాంస్యతాళనాద మెగనూఁదెననఁగా నిలిచి కనుపడకుండఁ జేసెననిభావము. కరతాళగరిమంబు=అట్టి తాళగౌరవమును, ఆనద్ధ = మృదంగాదికములయొక్క, చటులతూర్యవ్రజంబు = వడిగలవాద్యధ్వని సమూహము, కంచుమించుగానొత్తెక్=కాంస్యముమించుగ నొత్తెననియర్థము. ఇక్కడ, గాంస్యమయినదానిఁ గాంస్యముమించుగనొత్తినదని యానురూప్యము. ఆతాళనాదమును మృదంగాదివాద్యరవము చెదరఁగొట్టెనని భావము.

చటులతూర్యవ్రజముక్=అట్టివడిగల మృదంగాదివాద్యధ్వనిసమూహమును, పరిణయాగత = పెండ్లికివచ్చిన, దిగంతనృపతి=దిగంతములయందలి రాజులయొక్క, నాగాశ్వ రథ పదాతి=ఏనుఁగులు గుఱ్ఱములు రథములు కాలిబంట్లు ననునీచతురంగబలముయొక్క, కోలాహలంబు=కలకలధ్వని, అంటఁ బరచెక్ = లెస్సగా వాయించెననియర్థము. ఇక్కడ వాయింపఁదగినదాని వాయించిన దని యానురూప్యము. ఆమృదంగాదివాద్యధ్వనులను జతురంగబలకోలాహల మడఁగఁ గొట్టెనని భావము. ఏక్రితిగా ననిన, రోదసి యనఁగా భూమ్యంతరిక్షములు. ని. 'ద్యావాపృథివ్యౌ రోదస్యౌ' అని అ. రోదసిక్=భూమ్యంతరిక్షములయందు, అఖండమగుచుక్=సంపూర్ణమయినదై, నాదాత్మకబ్రహ్మము=శబ్దాత్మక బ్రహ్మ, అతిశయిల్లక్=అధికమగునట్టులుగా, చతురంగబల కోలాహలధ్వని యంటఁబఱచె నని సంబంధము.

ఈపద్యము మొదటినాలుగుచరణములయందు వీణయును, గీతంబును, వేణువును, తాళంబును, మృదంగాదికమును గూడ పంచవిధవాద్యములను జెప్పినాఁడు. ఎత్తుగీతియందుఁ జతుర్విధబలమును జెప్పినాఁడు. ఈచెప్పఁబడిన భావార్థములందుఁ బూర్వవస్తువులకంటె నుత్తరోత్తరవస్తువులయందు నాధిక్య మని తెలియవలయును. ఈసీసపాదములు ముక్తపదగ్రస్తములుగాఁ జెప్పంబడియెను. తొలుత వీణవాయించు గాయకులు పిమ్మట పిల్లనగ్రోవి పాడువారు వారివెనుక తాళములను బ్రయోగించువారు ఆవలవాద్యములను బ్రయోగించువారును బయలువెడలిరి. ఈ సంగీతసంకులధ్వనియంతయుఁ బెండ్లిక రుదెంచిన సమస్తరాజన్యుల చతురంగబలముల కోలాహలమునందు లీనమయ్యెను. బ్రహ్మము సర్వత్ర పెరిగి యుండునది. నాదము నటులెయుంటవలన నాదాత్మకబ్రహ్మమని చెప్పఁబడినది.

క. హరియనుమతి సప్తవ్రతి, హరిమధ్యలు దెచ్చి రరిది • హరివాణములన్
హరితశతపర్వికాఫల, హరిచందనవీటికాశు • భాక్షతవితతిన్. 70

హరియనుమతిన్ = ఇంద్రునియనుజ్ఞచేత, సప్తవ్రతిహరిమధ్యలు = సప్తమహర్షులయొక్క భార్యలు, అరిది హరివాణములన్=గొప్పపళ్లెరములచేత, హరిత = పసరువర్ణముగల, శతపర్వికా=గఱికయును, (ని. 'దూర్వాతు శతపర్వికా' అని అ.) ఫల=ఫలములును, హరిచందన=పీతవర్ణచందనమును, వీటికా=పోఁకలాకులును, శుభాక్షతవితతిన్=శుభప్రయుక్తమయిన పచ్చనియక్షతలును, తెచ్చిరి= పట్టుకొనివచ్చిరి.

హరిశబ్దమునకు-

'హరి ర్యమా ర్కా శ్వా గ్నీం దు విష్ణ్వం ద్రాంశు శుకేషునా
వాయు భేకా హి సింహేషు కపౌ చ కపిలే త్రిషు' అని నానార్థరత్నమాలాకోశము.

చ. అకుటిలసౌమ్యమాననిల • యస్ఫురణంబును నాతిమాత్రతా
రకపరివర్తనంబు శుభ • రాగమిళత్పదపల్లవాంకము
ద్రికయును బెంపు మీఱ నజ • దృష్టులఁ బోలినసింధుకన్యకా
ప్రకటవివాహగీతికలు • పాడిరి పుణ్యపురంధ్రికామణుల్. 71

అకుటిల=నిర్వక్రమమును, సౌమ్య=రమ్యమునయిన, మాన=ప్రమాణముగల, ని=నిషాదస్వరముయొక్కయు, లయ = లయలయొక్కయు, స్ఫురణంబును = స్ఫూర్తియును అని గీతికాపరమయిన యర్థము.

నిషాదస్వరమునకు-

'శ్రుతిభ్య స్స్యు స్స్వరాషడ్జర్షభగాంధారమధ్యమాః
పఞ్చమో ధైవత శ్చాథ నిషాద ఇతిస ప్తతే'

తేషాంసంజ్ఞా స్సరిగమపధనీ త్యపరామతాః.' అని లక్షణము. లయకు-(శ్లో.'తాళాంతరానువర్తియః కాలోసౌలయనాల్లయః' అని లక్షణము.) అకుటిలమును సౌమ్యమును మానసనిలయము నైన స్ఫురణ మని దృష్టిపరమయిన యర్థాంతరము. నాతిమాత్ర = అతిశయముగాని, తారకపరివర్తనంబు = ఉచ్చైస్స్వర సంచారమును అనియర్థము. అతిశయముగాని కనీనికలయొక్క పరివర్తన మని యర్థాంతరము. తారకశబ్ద మిక్కడఁ గనీనికాపరము. శుభరాగ=రాగవిశేషములతోడ, మిళత్=కూడుకొన్న, పదపల్లవాంకముద్రికయును=పదపల్లవులయొక్క యంకితమును అనియర్థము. శుభ=

శుభకరమయిన, రాగ=రక్తిమతోడ, మిళత్=కూడుకొనుచున్న, పదపల్లవాంకముద్రికయును=చరణకిసలయమందలి యంకముద్రిక యని యర్థాంతరము. అనఁగాఁ బాదవిన్యస్తదృష్టు లనుట. పెంపుమీఱన్ = అంతకంతకు మిక్కుటముగా, నిజదృష్టులఁబోలిన=తమచూపులనుబోలిన, సింధుకన్యకా=సముద్రునికొమార్తెయైన లక్ష్మీదేవియొక్క, ప్రకట=ప్రసిద్ధములయిన, వివాహగీతికలు=పెండ్లిసంబంధమయిన పాటలు, పుణ్యపురంధ్రికామణుల్=పుణ్యాంగనారత్నములు, పాడిరి = అనఁగా లక్ష్మీకల్యాణములు పాడిరనుట. సింధుకన్యకాశబ్దము సాభిప్రాయము.

పృథ్వీవృత్తము. సుపర్వణికామణిస్ఫురణ తాసుధారమ్యపా
త్రపాలికలతో శుభార్థ మగువేలుపున్మ్రానితో
నృపాలగృహసీమఁ జొందె హరిరాణి రామాసుధా
సుపాత్రతరుమాత్రవత్సురపదర్ప మల్పంబుగాన్. 72

సుపర్వగణికామణిస్ఫురణతోన్=అప్సరస్త్రీరత్నములయొక్క స్ఫూర్తితోడ ననియర్థము. సుపర్వ=మంచికణుపులుగల, గణికా = అడవిమొల్లతీఁగెయొక్కయు, మణి=రత్నముయొక్కయు, ఇది శోభార్థమై తేఁబడెను. స్ఫురణతోననిభావము. సుధారమ్యపాత్రపాలికలతోన్=అమృతవిశిష్టకలశములతోడ ననియర్థము. సుధయనఁగా సున్నంబును గనుక సున్నముపూసిన జాజాలమూఁకుళ్ళతో లేక కుండలవరుసతో నని భావము. శుభార్థ మగువేలుపున్మ్రానితోన్ = శుభనిమిత్తకమయిన పారిజాతవృక్షముతో ననియర్థము. కులదేవతయగు వృక్షవిశేషముతో ననిభావము. హరిరాణి=లక్ష్మీదేవి యనియర్థము. హరిరాణియనిభావము. అనఁగా నరివేణియనుట. రామాసుధాసుపాత్రతరుమాత్రవత్సురపదర్పమల్పంబుగాన్ = అప్సరఃస్త్రీలును నమృతకుంభములును బారిజాతవృక్షమునుమాత్రముగల యింద్రునిగర్వము క్షీణమగునట్టులుగా, నృపాలగృహసీమఁ జొందెన్=వసురాజుగృహమందుఁ బ్రవేశించెను.

వసురాజుగృహమందు హరిరాణిరాకడ యెక్కువచెప్పినందున నింద్రునిదర్ప మడఁగెననుట. సముద్రమథనకాలమందు లక్ష్మీదేవి యింద్రుని వరింపక శ్రీమహావిష్ణువును వరించుట ప్రకటము. రామా సుధాపాత్ర, తరువులు వసురాజునకును ఇంద్రునకును సమానము. హరిరాణిచెందుటచే వసురాజు ఇంద్రుని మించిపోయెననిభావము. ఈవృత్తమునకు జసజసయవ గణము లుండవలయును. తొమ్మిదవయక్షరము యతిస్థానము.

ఉ. ముజ్జగ మేలువేల్పు తలఁమోసలనుండి వివాహయత్నముల్
సజ్జ మొనర్ప నాతనిప్రసాద మెఱింగి సురాంగనాజనం
బజ్జగతీమహేంద్రుశిరసంట నలుం గిడ బుజ్జవంబునన్
మజ్జన మార్పఁ గల్పకుసుమంబులు గూర్పఁ గడంగి రయ్యెడన్. 73

ముజ్జగమేలు వేల్పు = మూఁడులోకము లేలుచున్న దేవుఁడు - అనఁగా మహేంద్రుఁడు, తలమోసలనుండి=తలవాకిటనిల్చి, వివాహయత్నముల్ సజ్జమొనర్పన్=పెండ్లిప్రయత్నమంతయు సిద్ధపఱుచుచుండఁగా, ఆతనిప్రసాద మెఱింగి=ఆయింద్రునియొక్క యనుగ్రహాతిశయమును గుర్తెఱిఁగి,

సురాంగనాజనంబు=దేవతాస్త్రీసమూహము, అజ్జగతీమహేంద్రు = భూమియందు మహేంద్రుఁడయిన యావసురాజుయొక్క, శిరసంటన్=తలయంటుటకును, నలుంగిడన్ = నలుఁగుపెట్టుటకును, ఋజ్జనంబున న్మజ్జనమార్పన్=లాలనముచేత స్నానముచేయించుటకును, కల్పకుసుమంబులుగూర్పన్=కల్పవృక్షములయొక్క పుష్పము లలంకరించుటకును, కడంగిరయ్యెడన్ = ఆసమయమందుఁ బూనుకొన్నవారైరి. జగతీమహేంద్రపదములోని మహేంద్రపదము రాజునకు నప్సరస్త్రీసేవార్హతఁ దెలుపుచున్నది.

మహేంద్రుఁడు ముజ్జగములను బరిపాలించువాఁడయ్యు వసురాజుమోసాల నాశ్రయించి వివాహయత్నములు గావించుచుండెను. వివాహము జగతీమహేంద్రునిది. కాన నింద్రప్రసాదముగు ర్తెఱిఁగిన సురాంగనలు రాజున కుచితసేవలు గావింపసాగిరి. ఇంద్రునియంతవాఁడు పెండ్లిపెత్తనము చేయుచుండ నింద్రానుగ్రహపాత్రలగు నప్సరఃస్త్రీలు వివాహోచిత రాజసపర్యగావించుటలో విశేషము లేదనిభావము.

మొగసాలరూపాంతరము మోసల. మోసలయనుటకు-

'మో,సలఁ గొల్వై తలవంచి ఖిన్నుఁడయి చాంచల్యంబుతో నుండఁగన్.' మను. తృతీ.

సీ. ఈరాజుఁ గరమొప్పఁ♦జేరి సేవలు సేయఁ దఱితారసిలెఁ గదే♦ తారయనుచు
రాజమాత్రుఁడె ధరేం♦ద్రస్వామి యితనిమై నంటుమైనంటు మే♦నకయటంచు
నీసర్వమంగళా♦వాసుని శిర సంట శశిరేఖ నీవ పో♦ జాణ వనుచుఁ
గమనీయగతిఁ దిలో♦త్తమ నేర్పుఁ గాక నూనియయంట నెవ్వారు♦ నేర్తురనుచుఁ
తే. బరమవసుసంవహనలీలఁ♦ బరిఢవిల్ల
రత్నమంజరి నీవ నే♦ర్పరి వటంచు
నతిచటులచాటుచతురోక్తు♦ లాడుకొనుచుఁ
గదిసి తత్కాలమున శుభా♦క్షతము లునుప. 74

ఈ పద్యమందు నప్సరసలు తమలోఁ దాము చతురవాక్యములాడుకొనుచు వసురాజునకు సేవ సేయ నారంభించిరని చెప్పినాఁడు. ఏలాగనిన,

తార=అనఁగా నొకయప్సరసయును నక్షత్రంబును గనుకఁ దారయనెడు పేరుగల యోమగువా, ఈరాజున్ = ఈ వసురాజును, కరమొప్పఁజేరి=మిక్కిలి యొప్పిదమగునట్టులుగా సమీపించి, సేవలుసేయన్=పరిచర్యలుసేయుటకు, తఱితారసిలెఁ గదే=సమయము తటస్థమాయెను గదా, అనుచున్=అని పలుకుచును అనియర్థము. తార=ఓనక్షత్రమా, ఈరాజున్=ఈచంద్రుని, కరమొప్పఁజేరి=కరమనఁగాఁ గిరణంబును గనుకఁ గిరణప్రసారణముచేత నొప్పునట్టులుగాఁ జేరి, అని యీయర్థమందు కరమన్నప్పుడు తృతీయచెప్పి యన్వయింపవలయును. సేవలుసేయఁ దఱితారసిలెఁగదే యని యర్థాంతరము.

మేనక=అనఁగా నొకయప్సరసయును హిమవంతునిభార్య యైన మేనకాదేవియును గనుక మేనక యనుపేరుగల యోమగువా, ధరేంద్రస్వామి=భూమీంద్రశ్రేష్ఠుఁడయిన యావసురాజు, రాజమాత్రుఁడె=సామాన్యపురాజులవంటివాఁడా-అనఁగా రాజాధిరాజుగదా యనుట, ఇతనిమై=ఈయన

శరీరమును, నంటుమైక్ =గారాబముచేత, అంటు=చమురంటుము. ఇక్కడఁ బ్రార్థనార్థక మువర్ణకము రాదయ్యె. అటంచుక్ =అని పలుకుచు అని యర్థము. మేనక=ఓ మేనకాదేవీ, ధరేంద్రస్వామి=పర్వత శ్రేష్ఠుఁడైన హిమవంతుఁడు, ఇతనిమై=ఇతనిశరీరమును, నంటుమైనంటు=ప్రేమచేతను హత్తుకొనుము అని యర్థాంతరము.

శశిరేఖ=అనఁగా నొక యప్సరసయును చంద్రరేఖయును గనుక శశిరేఖయనెడుపేరుగల యోమగువా, ఈసర్వమంగళావాసుని శిరసంటక్ = సకలశుభాస్పదుఁడయిన యీవసురాజుయొక్క తలయంటుటకు, నీవపోజాణ వనుచుక్ =నీవేసుమా చమత్కారముగలదానవు అని పలుకుచు అని యర్థము. శశిరేఖ=ఓ చంద్రరేఖా, ఈ సర్వమంగళావాసుని=సర్వమంగళయనఁగాఁ బార్వతి గనుక నామెను వామాంగమందు వహించిన హరునియొక్క, శిరసంటక్ =శిరస్సునంటియుండుటకు నీవేతగినదాన వని యర్థాంతరము.

కమనీయగతిక్ =ఒప్పిదమగునట్టులుగా, నూనియయంటక్ =నూనెయంటుటకు, తిలోత్తమనేర్చుఁగాక=తిలోత్తమయనఁగా నొకయప్సరసయును నుత్తమతిలలుగలదియును గనుకఁ దిలోత్తమయను పేరు గల యప్సరసయే నేర్చుఁగాక, ఎవ్వరునేర్తురనుచుక్ =మఱియెవ్వరు నేర్తు రనిపలుకుచును అని యర్థము. ఉత్తమతిలలుగలదే నేర్చుఁగాక మఱెవ్వరు నేర్తు రని యర్థాంతరము. రత్నమంజరి=అనఁగా యప్సరసయును మణిగుచ్ఛమును గనుక రత్నమంజరి యను పేరుగల యోమగువా, పరమ=అంగీకారమగునట్టులుగా, వసుసంవహనలీలఁ బరిఢవిల్లక్ =వసురాజుయొక్క శరీరమర్దనక్రియచేత విలసిల్లుటకు, నీవనేర్పరివటంచుక్ =నీవేనేర్పుగలదానవని పలుకుచును అని యర్థము. ఓమణిగుచ్ఛమా యుత్కృష్టకాంచనవహనముచేత విలసిల్లుటకు నీవేతగినదాన వని యర్థాంతరము. వసుశబ్ద మిక్కడఁ గాంచనపరము. ఈలాగున, అతిచటుల = అత్యంతసమర్థములైన, చాటు = ఆదరపూర్వకములైన, చతురోక్తులాడుకొనుచుక్ = చాతుర్యపుమాటలాడుకొంచును, కదిసి = సమీపించి, తత్కాలమునక్ =ఆ వసురాజు నొసటియందు, శుభాక్షతములునుపక్ =శుభప్రయుక్తమయిన పచ్చనియక్షతలుంపఁగాను.

ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. ఈ పద్యమం దప్సరస్స్త్రీనామములైన తారాదిపదములు నక్షత్రాద్యర్థాంతర వాచకములును గనుక నర్థద్వయమునకును అభేదాధ్యవసాయము చేసి యనురూపవ్యాపారముచేయవలసినదిగాఁ జెప్పినాఁడు గనుక నతిశయోక్త్యనుప్రాణితమైన సమాలంకారము.

చ. తఱు లరనిక్కఁ బూఁతనెఱితావియ చిక్క నపాంగమాలికల్
మెఱుఁగులు గ్రక్క నూరుపులమేలిమిఁ దేఁటులు చొక్క హారముల్
కుఱుచలఁ ద్రొక్క ముంగురులు గ్రొంజెమటం బద నెక్క వేలుపుం
దెఱవ యొకర్తు చేదిజగతీపతికిక్ శిర సంటె వేడుకన్. 75

తఱులరనిక్కక్ = తఱులనఁగాఁ గడుపుమీఁది మడతలుగనుక నవిసగపాలుపైనిక్కఁగాను, పూఁతనెఱితావియచిక్కక్ = మైపూఁతయొక్క నిండుపరిమళముమాత్రమే శేషింపఁగాను - అనఁగా గంధపుపూఁతరాలిపోఁగా ననిభావము. అపాంగమాలికల్ = క్రేఁగంటిచూపులు, మెఱుఁగులుగ్రక్కక్ = కాంతులు వెదచల్లఁగాను, ఊరుపులమేలిమిక్ = నిశ్వాసమారుతములయొక్క వాసనా

సౌష్ఠవముచేత, తేఁటులుచొక్కన్ = తుమ్మెదలు పారవశ్యమును బొందఁగాను, హారముల్కుఱుచలుద్రొక్కన్ = ముక్తాహారములు తుంపెసలాడఁగాను, ముంగురులు గ్రొంజెమటం బదనెక్కన్ = నొసటిపై ముంగురు క్రొత్తచెమటచేతఁ దడియఁగాను, వేలుపుం దెఱవయొకర్తు = అప్సరస యొక్కతె, చేదిజగతీపతికిన్ =చేదిభూపతియైన వసురాజునకు, వేడుకన్ =వేడుకచేత, శిరసంటెన్ =తలయంటెను.

వసురాజును పీఠముపైఁగూర్చుండబెట్టి యొకవేలుపుముగుద తలయంటెను. తలయంటువారించుక యెత్తుగనుందురు గావున మేనువంచియంటుతఱి వళులు సగముగా నలరెననిభావము. రాజును దాఁకుటచే వేలుపుఁజెలువకు మేనుపులకించెను. దాన గంధము రాలిపోయి తావిమాత్రము మిగిలెను. తలయంటుతఱి హస్తాదులచలనమువలన గుబ్బలపైనున్న హారము లెగిరిపడుచుండెను. అందుచేఁ గుఱుచలుగా హారములు కనిపింపసాగెను. ఇటులే నిశ్వాసస్వేదాదులు గ్రాహ్యములు.

సీ. భ్రమరకంబులచిక్కు ♦ వాపవే యన నింక భ్రమరకంబులచిక్కు ♦ వాయుననుచుఁ
బృథులకుచంబు ను ♦ బ్బింపకే యనఁ బృథుల కుచప్రకాశకా ♦ లం బటంచుఁ
గరఁగెఁ బో సరతిల ♦ కం బన సుస్నేహకలనఁ గరఁగు వర ♦ తిలక మనుచుఁ
గడు మొరయింపకే ♦ కటకంబులన మ్రోయుఁ గటకముల్సభయత్న ♦ గరిమ ననుచుఁ
తే. జెలిపలుకుఁ గేరడించుచుఁ ♦ జికిలిగోళ్ల
సొగసుసోఁకులఁ గళలు నిం ♦ చుచు మెఱుంగు
ముంగురులు గూడ దువ్వుచు ♦ ముడికిఁ దార్చి
మజ్జనపువేళ తడ వేల ♦ మహీప యనుడు. 76

ఇటఁ గవి తలయంటుచెలువకును నాయమచెలికత్తెకును గలుగు చతురోక్తి ప్రత్యుక్తిని జెప్పుచున్నాఁడు.

భ్రమరకంబులచిక్కువాపవేయనన్ =భ్రమరకములనఁగా ముంగురులును దుమ్మెదలును గనుక ముంగురులచిక్కు విడదీయవేయని చెలికత్తెపలుకఁగా, ఇంక భ్రమరకంబులచిక్కు వాయుం ననుచున్ = ఇఁకమీఁద ముంగురులచిక్కు వీడిపోవుచున్నది యని పలుకుచు అని యర్థము. తుమ్మెదలవలని విరోధమిఁకమీఁద వీడిపోవుచున్న దని యర్థాంతరము. పృథు=గొప్పలయిన, లకుచంబులు=నిమ్మపండ్లు, (ని. 'లకుచో లికుచో డహుః' అని అ.) ఉబ్బింపకేయనన్ = పట్టియొత్తకే యని యనఁగా, పృథుల కుచప్రకాశ కాలంబటంచున్ =పృథువులైన కుచములయొక్క ప్రకాశకాలమే యిది యని పలుకుచునని యరము. అభ్యంజనకాలమందుఁ దలకు నిమ్మపండ్లరసము పెట్టుటగలదు. పృథులములైన కుచముల యొక్క ప్రకాశకాలమే యిదియని యర్థాంతరము. వలపుగొన్నచెలువలకు స్పర్శమాత్రమున గుబ్బ లుబ్బుట సాజము కావున అచ్చరపొలంతికి నటులె గుబ్బలుబ్బుచూపఁ జెలులు పరిహసింపసాగిరని భావము. గుబ్బలుబ్బుసూపుటకు-

శా. "ప్రాంచద్భూషణబాహుమూలరుచితో పాలిండ్లు పొంగారి పై
యంచుల్ మోపఁగఁ గౌఁగిలించి యధరం బాసింప" మను. ద్వి.
శ్లో. "మోక్తుం నైవేచ్ఛతి కుచపటీ మాత్మనాస్నై వభిన్నా." బిల్హణీ.
శ్లో. "ప్రాగుత్తుంగఘనస్తనాంగణగళచ్చారూత్తరీయాంచలా" పుష్ప-వి.

కరఁగెఁబో వరతిలకంబనన్=వరమనఁగా గుంకుమ, (ని. 'వరం కాశ్మీరజన్మతమ్' అని అ.) వరుఁడనఁగా బురుషుఁడును-అనఁగా బెండ్లికొమారుఁడును, వరతిలకంబు = కుంకుమతిలకము, కరఁగెఁబో=కరఁగిపోయినదిసుమీ, అనన్=అని పలుకఁగా, సుస్నేహాకలనన్=స్నేహమనఁగా దైలంబును విశ్వాసంబును మంచితైలస్పర్శచేత, కరఁగువరతిలకమనుచున్ = కుంకుమతిలకము కరఁగుచున్నదియని పలుకుచును అని యర్థము. విశ్వాసముచేత వరశ్రేష్ఠుఁడు కరఁగుచున్నాఁడని యర్థాంతరము. కడుమొరయింపకేకటకంబులనన్=కటకములనఁగా గాజులును బాదవలయములును గనుక, గాజులు మిక్కిలి చప్పుడుగానీయకే యని చెప్పఁగా, మ్రోయుఁగటకము ల్శుభయత్నగరిమ ననుచున్=శుభయత్నగరిమయనఁగా బెండ్లిపనులయొక్క బాహుళ్యమును, సంభోగమును గనుక పెండ్లిపనులయొక్క బాహుళ్యముచేత, కటకములు=గాజులు, మ్రోయున్=మ్రోయుచున్నవి యని పలుకుచును అని యర్థము. సంభోగక్రియచేఁ బాదవలయములు మ్రోయునని యర్థాంతరము.

చెలిపలుకుఁ గేరడించుచున్ = ఈలాగని చెలికత్తెయాడినమాట పరిహాసపర్యవసానముచేయుచు, చికిలిగోళ్లసొగసు సోఁకులన్=వాఁడిగలగోళ్లయొక్క యొయ్యారపు బెణుకులచేత, కళలునించుచున్=కాంతులను బూర్ణీభవింపఁజేయుచును, మన్మథకళలూరఁ జేయుచును అని యర్థము. మెఱుంగుముంగురులు గూడదువ్వుచున్=మెఱుపుగల ముంగురులుగూడఁ బారునట్టులుగాఁ గలయ దువ్వుచును, ముడికిదార్చి=తలవెండ్రుకలు ముడివైచి, మజ్జనపువేళ=స్నానసమయము, తడవేళ=ఆలస్యమెందుకు, మహీప=వసురాజా, అనుచున్=అనిపలుకఁగా, ముందరిపద్యముతో నన్వయము. తుమ్మెదలబాధ తొలంగుట, గుబ్బలుబ్బుజూపుట, అనురాగాతిశయమునఁ బ్రియుఁడు కరఁగుట, సంభోగమునందుఁ గటకాదులు మొరయుట లోనగునవి సంభోగక్రీడానుకూలక్రియలు. వెండ్రుకలు చిక్కుదీయుట, నిమ్మపండ్లరసమునించుట, తిలకముకరఁగుట, కంకణాదు ల(భ్యంగవశమున) మొరయుట యభ్యంగనోచితధర్మములు. సమయోచితాభ్యంగధర్మములు సంభోగవ్యాపారముల కన్వయించి చెలులు పరిహాసింపఁ దొడఁగిరని భావము.

తే. సింహగతిమీఱు వసురాజు చెంతనొక్క, తోయధరవేణి పాదము ల్దుడిచి మెట్లు
వెట్టనొకకన్య హస్తమ ర్పింపవచ్చె, సలిలభవనంబునకుఁ బ్రజో త్సవము మెఱయ.

సింహగతిమీఱు వసురాజుచెంతన్ = సింహపరాక్రమముచేత నతిశయించుచున్న వసురాజుచెంతనని యర్థము. సింహరాశి నతిక్రమించుచున్న సూర్యునిచెంత నని యర్థాంతరము. ఒక్కతోయధరవేణి=మేఘమువంటి జడగలయొక స్త్రీయని యర్థము. వేణివంటిమేఘమని యర్థాంతరము. పాదము ల్దుడిచి మెట్లువెట్టన్=అడుగులు దుడిచి పాదుకలుంపఁగానే యని యర్థము. కిరణప్రసారణముగాకుండఁజేసి నిలుకడపఱుపఁగానే యనియర్థాంతరము. ఒకకన్య హస్తమర్పింపన్ = ఒకమగువ కైదండయొసఁగఁగా నని యర్థము. కన్యారాశి హస్తనక్షత్రమందుఁ బ్రవేశము సేయింపఁగా నని యర్థాంతరము. ('హస్తచిత్తార్ధంకన్యా' యని యున్నదని తెలియవలయును.) ప్రజోత్సవము మెఱయన్=ప్రజలయొక్కసంతోషము ప్రకాశించునట్టులుగా, సలిలభవనంబునకున్=మజ్జనగృహమునకని యర్థము, జలరాశికి లేక జలోత్పత్తికని యర్థాంతరము. వచ్చెన్=ఏతెంచెను.

భవనమనఁగా గృహంబును నుత్పత్తియును అని విచారింపవలయును. అనఁగా సింహపరాక్రమముచేత నతిశయించుచున్న వసురాజుసన్నిధి నొకయప్సరస యాయనయడుగులుదుడిచి పాదుకలు

పెట్టఁగానే మఱియొకయప్సరసకై దండయియ్యఁగా మజ్జనగృహమునకుఁ బ్రజాసంతోషము ప్రకాశింపఁగా వచ్చెనని యర్థము. సింహరాశి నతిక్రమించుచున్న సూర్యునిసమీపమందు నొకనీలమేఘము కిరణప్రసారము గాకుండఁజేసి నిలుకడనేయఁగానే కన్యారాశి హస్తానక్షత్రమందుఁ బ్రవేశము నేయింపఁగాఁ బ్రజానుమోదము ప్రకాశించునట్టుగా సలిలోత్పత్తికి వచ్చె నని యర్థాంతరము.

చ. పతియభిషేకవేళఁ గర♦భావితకుంభకురంగభృన్మణి
ప్రతిమలు నిర్జరీసుముఖ♦భావముఁ గన్గొని నీరు వంచి య
య్యతివలు సిగ్గునం గనలి ♦ యాస్యము వంచిన నూర కుండె న
ప్రతిమరసజ్ఞరత్నపరి♦పాకము లిట్టివి గావె ధారుణిన్. 78

పతియభిషేకవేళన్ = వసురాజుయొక్క స్నానసమయమందు, కరభావిత = కరస్థితములైన, కుంభ=కలశములుగల, కురంగభృన్మణి ప్రతిమలు = చంద్రకాంతరత్నప్రతిమలు - అనఁగా హస్తగత చంద్రకాంత కలశములైన చంద్రకాంత ప్రతిమలనుట, నిర్జరీ = అప్సరసలయొక్క, సుముఖభావమున్=సుముఖత్వమును, కన్గొని=చూచి, నీరువంచి = కలశములవలన నీరుగ్రమ్మరించి అని యర్థము. ఇక్కడఁ బ్రతిమాహస్తములయందలి కుంభములుకించిదధరములుగానుండుచున్నవని తెలియవలయును. నిర్జరీముఖములుచూచి చంద్రభ్రాంతిచేత స్రవించినవని భావము. అయ్యతివలు సిగ్గునంగనలి యాస్యమువంచినన్=ఆయప్సరసలు తమకుఁ బ్రయత్నసాధ్యమైన ప్రయోజన మప్రయత్నముగాఁ బ్రతిమలుచేసినందున సిగ్గుపడి కోపగించి ముఖమువంపఁగానే - అనఁగా వైముఖ్యమును బొందఁగానే, ఊరకుండెన్=నీరుగ్రుమ్మరించుట మాని యూరకుండె నని యర్థము. చంద్రభ్రాంతిజనకములైన ముఖములయొక్క వంచుటచేత స్రవింపకపోయెనని భావము. ధారుణిన్ = భూమియందు, అప్రతిమ=అసమానులైన, రసజ్ఞరత్న=రసికజన శ్రేష్ఠులయొక్క, పరిపాకములు=స్వభావములు, ఇట్టివిగావె=ఈలాటివేకావా యని యర్థము.

రసజ్ఞరత్నములనఁగాఁ జంద్రకాంతములు అప్ప్రచురములైన ప్రతిమలు అనఁగా జలప్రచురములైన ప్రతిమలు వేనివల్లనో యవి యప్ప్రతిమములు. అవియ రసజ్ఞరత్నములు, వానియొక్క పరిపాకము లీలాటివే కావా యని యర్థాంతరము. అచ్చరలమోములు నిండుజాబిల్లివలెనుండెను. జాబిల్లినిగాంచినంతన చంద్రకాంతశిలలనుండి జలమూరుట ప్రసిద్ధము. అచ్చరలు మోమెత్తి చూచినంతన గించిదధరములగు పాత్రములనుండి జలము స్రవించెను. తమసుముఖత రాజు గ్రహించునేమొ యను జంకున మోముత్రిప్ప నూరకుండెను. ముఖచంద్ర సందర్శనమునఁ జంద్రకాంతములనుండి జలము స్రవించుననుట కవిసమయము. అలం. శ్లేషోత్థాపితార్థాంతరన్యాసము.

మ. ఘనచాంపేయకవాసనావివశభృం♦గశ్రేణిఁ జేపట్టి చ
ల్లనిపూఁదేనియ చల్లి తేర్చుమధువే♦ళాలక్ష్మిరో నాఁగ సో
గనెఱు ల్సంపఁగినూనెనిగ్గు సడలం♦గాఁ బైపయిన్ దువ్వి నే
ర్పున గంధామలకంబు వెట్టె నొకయం♦భోజాక్షి భూజానికిన్. 79

ఘన=అధికమైన, చాంపేయక=సంపఁగియొక్క, వాసనా = పరిమళముచేత, వివశ=మూర్ఛఁజెందిన, భృంగశ్రేణిన్=తుమ్మెదచాలును, చేపట్టి=చేతఁబట్టుకొని, చల్లనిపూఁదేనియచల్లి=శీతలమైన

మకరందము చిల్కరించి, తేర్చు=సేదదేర్చునట్టి, మధువేళాలక్ష్మియోనాఁగన్ = వసంతలక్ష్మియో యన్నట్లుగా, సోఁగనెఱుల్సంపఁగినూనె నిగ్గుపడలంగాఁ దైపయిందువ్వి=సోఁగలైన తలవెండ్రుకలు సంపఁగినూనెయొక్క జిడ్డువదలునట్లుగా మీఁదమీఁదదువ్వి, నేర్పునన్=మెళకువచేత, ఒకయంభోజాక్షి=ఒకయప్సరస, భూజానికిన్ = వసురాజునకు, గంధామలకంబు వెట్టెన్ = పరిమళయుక్తమైన యుసిరికపిండియటకలి శిరస్సుపైఁ బెట్టెను. అనఁగా, జమురువదలునట్లుగా పులుముటకై గంధపుటటకలి పెట్టె ననుట. గంధామలకము అభ్యంగావసరమున నుపయోగించుట ప్రసిద్ధము.

"పరగంధామలకంబు పెట్టెను సుధావారాశితోల్పట్టికిన్" తారాశశాంకము.

సోఁగనెఱులకు సంపంగినూనెపూయుట, దువ్వుట, గంధామలకంబు పెట్టుట, వసంతసమయమునందు సంపెంగపూఁదావికి తుమ్మెదలు సొమ్మసిలుట, వనలక్ష్మి తుమ్మెదల బుజ్జగించుట చల్లనిపూఁదేనియ చల్లుటగాఁ గవి యుత్ప్రేక్షించెను. అలం. ఉత్ప్రేక్ష.

చ. కరముల నుజ్జ్వలాభినవ•గైరికకుంభము లంటఁ గూర్చి పు
ష్కరములు కంకణప్రకర•సంభ్రమ మొప్పఁగ వంచి రాజకుం
జరునకుఁ గుంభినీభరణ•సమ్మదశాలికిఁ బద్మినీపరం
పర పరమానురాగమున • మజ్జన మార్చెఁ బయోగృహంబునన్. 80

ఈపద్యమునందు రాజకుంజరశబ్దముచే రాజపరముగను గుంజరపరముగను నర్థద్వయము తెలియుచున్నది.

కరములన్=హస్తములయందు, ఉజ్జ్వల=ప్రకాశమానములయిన, అభినవ = మిక్కిలి నూతనములైన, గైరికకుంభములు=కనకకలశములను, అంటఁగూర్చి=దృఢముగా సంధించి యని యర్థము. కరములన్=తుండములను, ఉజ్జ్వలాభినవగైరిక=ప్రకాశమానములును నూతనములు నయినజాజురేఖలుగల, కుంభములంటఁగూర్చి = కుంభస్థలములయందు సంఘటించి యని యర్థాంతరము. ని. 'గైరికం కనకే ధాతౌ' అని వి. పుష్కరములు=ఉదకములను, కంకణప్రకర సంభ్రమమొప్పఁగన్=హస్తకంకణములయొక్క ఝణఝణధ్వను లొప్పఁగా, వంచి=క్రుమ్మరించి యని యర్థము. పుష్కరములు = శుండాగ్రములు, కంకణప్రకరసంభ్రమ మొప్పఁగవంచి = జలబిందుసందోహములయొక్క చిందుటయొప్పఁగాఁ గ్రిందికి వంచి యని యర్థాంతరము. పద్మినీపరంపర = పద్మినీజాతిస్త్రీపరంపర యని యర్థము. పద్మములనఁగా బిందుజాలకములు. అనఁగా నెఱ్ఱనిపొడలు గనుక నవిగలది పద్మిని యనఁగా స్త్రీగజము గనుక స్త్రీగజపరంపర యని యర్థాంతరము. (ని. 'పద్మకం బిందుజాలకమ్' అని అ.) పరమానురాగమునన్=అతిశయప్రేమచేత, పయోగృహంబునన్ = మజ్జనశాలయం దని యర్థము. సరోవరమందని యర్థాంతరము. కుంభినీభరణసమ్మదశాలికిన్=భూభరణమందలి సంతోషముచేత నొప్పుచున్న, రాజకుంజరునకున్=రాజశ్రేష్ఠున కని యర్థము. కుంభినియనఁగా స్త్రీగజము గనుకఁ గరిణీభరణశాలియైన పురుషగజశ్రేష్ఠమునకని యర్థాంతరము. మజ్జనమార్చెన్ = స్నానముచేయించెను. హస్తములందు బంగారుకలశములను ధరించి కంకణములు మొఱమ్రోయుచుండ వంచుచుఁ బద్మినీజాతి స్త్రీరత్నములు సంతోషముతో వసుభూపాలునకు లజకమార్చిరని భావము. మగయేనుంగులకు ఆడుమాతంగములు కొలంకులందుండి తుండములను గుంభస్థలములంట నెత్తి యంబుకణములు రాలునట్లు జలకమార్చెనని యర్థాంతరము.

చ. పడఁతి యొకర్తు చెందిరిక • పావడఁ బైతడి యొత్తివైవ సు
గ్గడితపుజీబునేత్ర మొక • కామిని గట్ట నొసంగ సంజకెం
పెడలిచి నిండువెన్నెల వ • హించి పయోనిధిమండలంబు వె
ల్వడునుడురాజు నా నలక • ళానిధి యంబుగృహంబు వెల్వడన్. 81

పడఁతియొకర్తు = ఒక యప్సరస్త్రీ, చెందిరికపావడన్ = చందురుకావిపావడచేత, పైతడి యొత్తివైవన్ = శరీరముపైనుండెడు తడిదుడిచివైవఁగాను, సుగ్గడితపుజీబునేత్ర మొకకామినిగట్ట నొసంగన్ = = చక్కని సన్నపుతెల్లవస్త్రము నొకయప్సరస కట్టనీయఁగాను, ఇచట సుగ్గడితము, జీబు అనుశబ్దములు విశేషణవిశిష్ట వస్త్రవాచకములైనను నేత్రశబ్ద సాన్నిధ్యమువలన విశేషణమాత్రపర్యవసన్నములగును. (ని. 'నేత్రం వస్త్రే క్షి వైశాఖగుణ భూరుహ మూలయోః' అని నా.) సంజకెంపెడలిచి = ఉదయసంధ్యారుణిమను వదలి, నిండువెన్నెలవహించి పయోనిధిమండలంబు వెల్వడు= పూర్వసముద్రమండలమువల్లనుండి బైలుదేరిన, ఉడురాజునాన్ = చంద్రుఁడో యనునట్టులుగా, అలకళానిధి = లావణ్యనిధియైన యావసురాజు, అంబుగృహంబువెల్వడన్ = మజ్జనశాలబయలు వెళ్ళఁగా నని యర్థము.

కళానిధియనఁగాఁ జంద్రుఁడనియును నంబుగృహమనఁగా సముద్రమనియును జమత్కారము గ్రహింపవలయును. జంద్రకావిపావడకు నుదయసంధ్యారుణిమకును దట్టమైన సన్నపు తెల్లవస్త్రమునకును నిండువెన్నెలకును మజ్జనశాలలోనుండి బయలుదేరిన వసురాజునకును బయోనిధిమండలము బయలుదేరిన చంద్రునకును నుపమేయోపమానభావమని తెలియవలయును. అలం. ఉత్ప్రేక్ష.

తే. నవనవావర్తమండలో • న్నమితకద్రు
విద్రుమంబులఁ ద్రిప్పుసా • ముద్రభద్ర
విమలతరవీచికలచంద • మమర నమర
రమణు లెత్తిరి మంగళా • రాత్రికములు. 82

నవనవ = మిక్కిలినూతనములైన, ఆవర్త = సుళ్ళయొక్క, మండల = సమూహమందు, ఉన్నమిత = పైకిలేచిన, కద్రు = పిశంగవర్ణములైన-అనఁగా నెఱుపుమించిన పసపుచాయగల, (ని. 'కడారః కపిలః పిఙ్గ పిశఙ్గౌ కద్రు పింగళౌ' అని అ.) విద్రుమంబులన్ = పొగడపులేఁగెమోసులను, త్రిప్పు = తిరుగునట్టులుగాఁ జేయుచున్న, సాముద్ర = సముద్రసంబంధమును, భద్ర = రమ్యమును, విమలతర = మిక్కిలి స్వచ్ఛములు నయిన, వీచికల = తరంగములయొక్క, చందమమరన్ = రీతి గనుపడునట్టులుగా, అమరరమణులు = దేవతాస్త్రీలు, ఎత్తిరిమంగళా రాత్రికములు = మంగళపుహారతులిచ్చిరి.

ఇందులో నావర్తమండలమునకు నారతిపళ్లెరములకును, విద్రుమములకును, దీపకళికలకును, తరంగములకును, దేవతాస్త్రీలకును నుపమానోపమేయ భావమని తెలియవలయును. ఆవర్తములు నూతనములుగాన వానితో విద్రుమలతలును బయటికివచ్చినవి. నూతనములుగానిచో మునిఁగిపోయెడివె. విద్రుమములు ద్రుమములు గావున విస్తృతినిబట్టి రమణులందఱును బట్టుమంగళపుటారతులవలె నుండెనని భావము. అలం. ఉపమాలంకారము.

శా. అంభోజేక్షణుపత్తుమోఁ యన శుభాం • కాలంకృతంబున్ జతు
స్తంభశ్రీకరవైభవాన్వితము భ • ద్రశ్రీకృతామోదముగ్

శుంభన్నూతనవైజయంతికము నై • శోభిల్లువైవాహికా
రంభస్థాపితవేదిఁ జెందె వసురా•డ్రత్నంబు భవ్యోన్నతిన్. 83

అంభోజేక్షణువక్షమో యనన్=శ్రీమహావిష్ణువుయొక్క వక్షస్థ్సలమో యనునట్టులుగా, శుభాంకాలంకృతంబున్=శుభచిహ్నములచేత నలంకరింపఁబడినదియును అని వేదికాపరమైన యర్థము. శుభాంకమనఁగా శ్రీవత్సలాంఛనము గనుక దానిచేత నలంకరింపఁబడిన దని విష్ణువక్షస్థ్సలపరమైనయర్థాంతరము. చతుస్తంభ=నాలుగు స్తంభములయొక్క, శ్రీకరవైభవ=శోభాకరమయిన విభవములతోడ, అన్వితము=కూడుకొన్నదియును అని యర్థము. చతుః=నాలుగైన, స్తంభశోభవంటి శోభగలిగిన, కర=హస్తములయొక్క, వైభవాన్వితము=వైభవముతోఁ గూడుకొన్న దని యర్థాంతరము. భద్రశ్రీ=చందనముచేత, (ని. 'భద్రశ్రీ శ్చందనో స్త్రియామ్' అని అ.) కృత=చేయఁబడిన, ఆమోదమున్=పరిమళము గలదియును అని యర్థము. భద్ర=శుభాస్పదురాలయిన, శ్రీ=లక్ష్మీదేవికి, కృత=చేయఁబడిన, ఆమోదము=సంతోషము గలదని యర్థాంతరము. శుంభత్=ప్రకాశించుచున్న, నూతన=నవీనమైన, వైజయంతికము = పతాకలుగల దనియు నని యర్థము. ప్రకాశమానమైన వైజయంతీమాలిక గలదని యర్థాంతరము. ఐ=అయినదై, శోభిల్లు=ప్రకాశించుచున్న, వైవాహికారంభస్థాపితవేదిన్ = వివాహకర్మారంభమందుఁ బ్రతిష్ఠింపఁబడిన వేదికను, వసురాడ్రత్నంబు=వసురాజశ్రేష్ఠుఁడని యర్థము. వసుశబ్దము రత్నపరంబును గనుక, వసురాట్ = రత్నశ్రేష్ఠమయిన, రత్నంబు=మణి–అనఁగాఁ గౌస్తుభమణియని యర్థాంతరము. చెందెన్=పొందెను.

వసురాజు శుభాలంకారసమన్వితము చతుస్స్తంభవిరాజితము శ్రీచందనవాసితము వివిధపతాకాలంకృతమునగు వివాహవేదికను జేరెనని భావము. రత్నశ్రేష్ఠము కౌస్తుభము. శ్రీవత్సాంకితము చతుర్భుజాభిరామము. లక్ష్మీసమ్మోదకరము వైజయంతీవిరాజితమునగు శ్రీమహావిష్ణుని వక్షస్స్థలము బ్రాపించెనని యర్థాంతరము.

సీ. ఆగిరిజాసక్తు•నౌదలతడి యార్చె నొకశరద్రమ్యరా•జోజ్జ్వలాస్య
యారాజహంసుపై • నడరించె మృదుజలార్ద్రానిలం బొకమాన•సాభిరామ
యామోహనాగ్రణి•కలరు లందిచ్చె నొక్కొలతానిభాత్యంత•కోమలాంగి
యాజగజ్జీవను • నలరించె వరగంధపరిలేపమున నొక్క•సురభిచరిత
తే. ఘటితఘనకంకణశుభాంక•గరిమఁ దాల్చు
నాయగణ్యలావణ్య ర•త్నాకరునకు
బహువిధామూల్యమణికలా•పంబు లునిచె
నిర్మలస్వాతివిఖ్యాతి•నిధి యొకర్తు. 84

శరత్=శరత్కాలమందు, రమ్య=ఒప్పుచున్న, రాజ=చంద్రునివలె, ఉజ్జ్వల=ప్రకాశమానమగుచున్న, ఆస్య=ముఖముగల యొకస్త్రీ, ఆగిరిజాసక్తు=పార్వతియందాసక్తుఁడైన యాహరుని యొక్క, ఔదలతడి=శిరోగంగను, ఆర్చెన్=కాంతిచేత నడఁగించెనని యర్థము. గిరికాదేవియందాసక్తుఁడైన యావసురాజుయొక్క తల తడియార్చెనని భావము. శరద్రాజనిభాస్యయనుట ముఖకాంతి

విశేషము సూచితము. శరచ్చంద్రుఁడు ధావళ్యాతిశయుఁడు గావున నట్టిముఖముచే నాకాశగంగా ధావళ్య మడంచెనని భావము.

ఒక మానసాభిరామ=మానససరోవరమువలెఁ జక్కనిదైన యొకస్త్రీ, ఆరాజహంసుపైన్=ఆ రాజహంసమీఁద, మృదు=మందమును, జలార్ద్ర=శీతలమునయిన, అనిలంబు=వాయువును, అడరించెన్=వ్యాపింపఁజేసె నని యర్థము. ఆరాజశ్రేష్ఠునిమీఁద విసనకఱ్ఱచే నొకసుందరి జలార్ద్రమగు చిఱుగాడ్పులు వీచునట్లు విసరెనని భావము.

ఒకొక్క=ఒకతెయైన, లతా=తీఁగతోడ, నిభ=సమానమైన, అత్యంతకోమలాంగి=అతిమృదుల దేహముగలస్త్రీ, ఆమోహనాగ్రణికిన్=ఆమన్మథునకు, అలరులందిచ్చెన్=పువ్వులందిచ్చెనని యర్థము. సుందరపురుషులలో నగ్రణి యైనరాజునకుఁ బువ్వులందిచ్చెనని భావము. లతా యన ప్రేంకణపు దీవియని యొకానొకరు వ్రాసియున్నారు. మరునకుఁ బూదూపులకుఁ బూవులు రావలయును గావునఁ బూవులందించినది లత. లతను బ్రత్యేకించి ప్రేంకణమనుటకంటె తీఁగయని చెప్పుట యుక్తము. సామాన్యలతాపరముగఁ జెప్పుటయే కవ్యభిప్రాయము.

ఒక్కసురభిచరిత - సురభి=వసంతునియొక్క, చరిత=చరిత్రవంటి చరిత్రగలదని యర్థము. ప్రఖ్యాతమయిన చరిత్రగలదని భావము. అట్టియొకస్త్రీ, ఆజగజ్జీవనున్=జగత్ప్రాణుఁడైన యావాయువును, వరగంధవరిలేపమునన్=శ్రేష్ఠమయిన సౌరభయోగముచేత, అలరించెన్=సంతోషింపఁజేసెనని యర్థము. జగత్ప్రేమకుఁడైన యీరాజును గుంకుమగంధానులేపనముచేత సంతసిల్లఁజేసెనని భావము. వరశబ్ద మిక్కడఁ గుంకుమ.

ఘటిత=సంఘటింపఁబడిన, ఘన=మేఘముయొక్క, కంకణ=జలకణరూపమయిన, శుభాంకగరిమఁదాల్చు=శుభచిహ్నగౌరవమును వహించిన, ఆ=అట్టి, అగణ్యా=అప్రమేయుఁడైన, లావణ్యరత్నాకరునకున్=లవణసముద్రమునకు, ఇక్కడ లవణమే లావణ్యమని విచారింపవలయును. నిర్మల=స్వచ్ఛమయిన, స్వాతి=స్వాతినక్షత్రమువంటి, విఖ్యాతి=కీర్తికి, నిధి=స్థానమయిన యొకయప్సరస యనియర్థము. స్వకీయమయిన యతివిఖ్యాతినిధి యని భావము. బహువిధ=ఆణి సుపాణి యనునివి మొదలుగాఁగల యనేకవిధములైన, అమూల్య=విలువలేని, మణి=ముక్తామణులయొక్క, కలాపంబులునిచెన్=సమూహములనునిచె నని యర్థము.

ఘటిత=సంఘటింపఁబడిన, ఘన=ఘనతరమైన, కంకణ=వివాహసూత్రమనెడు, శుభాంకగరిమఁదాల్చు=శుభచిహ్నగౌరవమునువహింపఁగల, ఆయగణ్యలావణ్యరత్నాకరునకున్=అప్రమేయమైన లావణ్యమునకు సముద్రుఁడైన యీరాజునకు, బహువిధామూల్యమణికలాపంబులునిచెన్=అనేకవిధములైన యమూల్య రత్నాభరణములను ధరింపఁజేసెనని భావము. తాల్చు ననెడుపదము వర్తమానార్థకమును భవిష్యదర్థకము నని గ్రహింపవలయును.

ఈపద్యములో మూఁడవచరణమందు నొక్కయనెడు పదములోనికకారమందు హ్రస్వమైన క్రమంబుండనగును. ఇందుకు లక్షణలక్ష్యము లప్పకవీయములో వర్ణపరిచ్ఛేదమందుఁ జెప్పఁబడినవి.

ఒక్కయనుటకు మాఱుగా ఒకొక్కయనుటకు-

మ. సమదాటోపత వాయునందనుఁడు ధృష్టద్యుమ్నుశైనేయు లే

కమనోవృత్తి గడంగి తో నడువ దోర్గర్వంబు శోభిల్ల శౌ
ర్యము సొంపార నిలింపకోటి పొగడన్ రారాజుసైన్యంబు లో
క్కొ_మొగిన్ బెల్లగిలంగఁ బిట్టదిమె సక్రోధాంతరంగంబునన్. భారతము కర్ణపర్వము.

కం. ఇటఁ బాండవకౌరవులొ, క్కొ_ట నందఱు గురువనుజ్ఞఁగొని. భారత. ఆది. ఆశ్వా. ౫

చ. ఘనఘనసారచూర్ణతిల•కంబు వహించి నిధీశదత్తనూ
తనమకుటంబుఁ దాల్చె వసు•ధాపతి వక్రవతంసఖండచం
ద్రుని దిగఁ ద్రోచి యక్షయశి•రోమణిభావవిభాసమాను నా
యనుపమభాను భానుఁ దన•యౌదలఁ బూనుమహేశుకైవడిన్. 85

వసుధాపతి=వసురాజు, ఘన=శ్రేష్ఠమైన, ఘనసారచూర్ణ=కర్పూరవిరచితమైన, తిలకంబు=నెలవంకనామమును, వహించి=ధరియించి, నిధీశ=కుబేరునిచేత, దత్త=యియ్యఁబడిన, నూతనమకుటంబున్=నవీనమయిన కిరీటమును, తాల్చెన్=ధరించెను. ఎటువలెననిన, వక్రవతంసఖండచంద్రుని దిగఁద్రోచి = వక్రాకారుఁడైన యవతంసార్ధచంద్రుని దిగువగాఁజేర్చి, అక్షయ = నాశములేని, శిరోమణిభావ = చూడామణిత్వముచేత, విభాసమానున్ = మిక్కిలి ప్రకాశమానుఁడగుచున్నవాఁడును, ఇక్కడ హరుఁడు వ్యోమకేశుఁడు గనుక వ్యోమమణివ్యవహారముగల సూర్యుఁ డాయనకు శిరోమణియగుచున్నాఁడని తెలియవలయును. చంద్రుఁడు క్షయిష్ణుఁడు గనుక నక్షయశిరోమణి కాఁడనుట. ఆ = అట్టి, అనుపమభానున్ = సమానరహితములైన కిరణములుగలిగినవాఁడునునగు, భానున్=సూర్యుని, తనయౌదలఁబూను=తన శిరసునందు ధరించిన, మహేశుకైవడిన్ = హరునివలెనని సంబంధము.

మహేశపదము రాజపరంబును గనుక స్వారస్యము గ్రహింపవలయును. కుబేరుఁడు నిధీశుఁడు గనుక నతనికి రత్నకీలితమకుట ప్రదాతృత్వమును జెప్పినాఁడు. ఉత్తరత్ర దాతృదాతవ్యసంబంధము విచారింపవలయును. వసురాజన్యుఁడు నెలవంకనామమును నొసటతీర్చి కుబేరదత్తమగు మణికిరీటమును శిరమున నలంకరించుకొనెను. ఇది సహజవక్రుఁడు ఖండస్వరూపుఁడగుచంద్రుని దిగువకుఁదోసి యనుపమకాంతిసమేతుఁడగు సూర్యుని దలపై మహేశ్వరుఁడు ధరించినటులుండెనని భావము. అలం. ఉత్ప్రేక్ష.

మ. వసురాజన్యకిరీటవీధి ననఘ•స్వర్లోకవాస్తవ్యభ
వ్యసతీకల్పితకల్పదామఘటితం•బై ముత్తెపుంబాసికం
బెసఁగెం గాంచనశైలరోహణమహా•శృంగంబుపై నుద్భవిం
చుసురద్వీపవతీత్రిరూపవిపుల•స్రోతోవిశేషం బనన్. 86

వసురాజన్యకిరీటవీధిన్ = వసురాజుయొక్క కిరీటపాళికయందు, అనఘ=నిర్దోషమైన, స్వర్లోకవాస్తవ్య = ఇంద్రునియొక్క, భవ్యసతీ=ప్రియాంగనయైన శచీదేవిచేత, కల్పిత = కట్టఁబడిన, కల్పదామ=కల్పవృక్షకుసుమమాలికలచేత, ఘటితంబై = కూర్పఁబడినదై, ముత్తెపుంబాసికంబు = ముక్తామయమయిన బాసికము, ఎసఁగెన్=ఒప్పెను. ఎటువలెననిన, కాంచనశైల=మేరుపర్వతమందలి, రోహణ=రోహణమనెడుపేరుగల, మహాశృంగంబుపైన్=మహత్తరమయిన శిఖరముమీఁద, ఉద్భ

వించు=పుట్టిన, సురద్వీపవతీ=దేవతానదియొక్క-అనఁగా గంగయొక్క, త్రిరూప = మూఁడువిధము లైన, విపుల=విస్తారమయిన, స్రోతోవిశేషంబనన్=ప్రవాహవిశేషమోయన్నట్టులుగా, ఎసఁగెనని సంబంధము.

ఈలాగనిచెప్పటచేత వసురాజు కాంచనశైలమువలె నున్నాఁడనియుఁ గిరీటము రత్నమయమైన రోహణశృంగమువలె నున్నదనియు ముత్తెపుబాసికము మూఁడుమార్గములుగాఁ బ్రవహించిన గంగాప్రవాహమువలె నున్నదనియును దాత్పర్యము. రోహణము మేరుపర్వతశిఖరము. వసురాజు బంగారువంటి మేనిచాయగలవాఁడుగావున మేరుగిరివలెనుండెను. రత్నకీలితమగు కిరీటము శిఖరమగు రోహణాద్రివలెనుండెను. కల్పకుసుమమాలికాలంకృతమై స్వచ్ఛకాంతితో నలరారు బాసికము త్రిపథగయగు గంగవలె నుండెననిభావము. అలం. ఉత్ప్రేక్ష.

ఉ. క్షోణిబలారికిన్ బలని॰షూదనదత్తము లైనగొప్పక
ట్టాణిసుపాణియొంటు లల॰రాఁరె నగాత్మజలక్షణంబు శ
ర్వాణికి శక్రురాణికిని ॰ వాణికిఁ గాన మటంచు నాఘన
శ్రోణివిధంబు దెల్ప గురు॰శుక్రులు వీనులు సేరిరో యనన్. 87

క్షోణిబలారికిన్=భూలోకదేవేంద్రుఁడైన వసురాజునకు, బలనిషూదనదత్తములైన=ఇంద్రునిచేత నీయఁబడిన, గొప్పకట్టాణిసుపాణియొంటులు=గొప్పలైన కట్టాణి సుపాణి యనెడు భేదములుగల ముత్యాలుగూర్చిన చెవులుయొంట్లు-అనఁగా నంటుపోగులు, అలరారెన్=మిగులనొప్పుచుండెను. ఏలాగునననిన, నగాత్మజలక్షణంబు=గిరికాదేవియొక్క వైఖరి, శర్వాణికిన్=పార్వతికిని, శక్రురాణికిని=శచీదేవికిని, వాణికిన్=సరస్వతికిని, కానమటంచున్=ఉన్నట్టులుగాఁ జూచినవారముగామని, ఆఘనశ్రోణివిధంబుఁదెల్పన్=గొప్పపిఱుఁదులుగల యాగిరికయొక్కలక్షణము తెలియఁజెప్పెడుకొఱకు, గురుశుక్రులు=బృహస్పతి శుక్రులు, వీనులుసేరిరోయనన్=చెవులయొద్దకువచ్చిరో యనునట్టులుగా, కట్టాణిసుపాణియొంటు లలరారెనని సంబంధము.

బలనిషూదనుఁడు క్షోణిబలారికిచ్చెనన్నచోట బలారి క్షోణిబలారికిచ్చె నని స్వారస్యము గ్రహింపవలయును.

మ. వెలిదీవిం దెలిబావిలో నమృతము ॰ న్వే త్రావి దివ్యాంబుదం
బులు వర్షింప సుధాబ్ధిలోఁ బొడముబ॰ల్ముాపస్ఫుటింపన్ సుధా
గుళికానిర్మలహార మయ్యె నిది గై॰కొ మ్మాయురారోగ్యము
ల్గలుగు న్నీ కని యబ్ధినాథుఁ డొకము॰క్తాహార మర్పించినన్. 88

వెలిదీవిన్=శ్వేతద్వీపమందు, తెలిబావిలోన్=అమృతపుబావియందలి, అమృతము న్వేత్రావి=అమృతమును శీఘ్రముగాఁ బానముచేసి, దివ్యాంబుదంబులువర్షింపన్=దేవసంబంధములయిన మేఘములు వర్షింపఁగా, సుధాబ్ధిలోఁబొడము=క్షీరసముద్రములోఁబుట్టిన, బల్ముాపస్ఫుటింపన్=బలిష్ఠములైన ముక్తామణులు కూర్చుటవలన, సుధాగుళికానిర్మలహారమయ్యెన్ = అమృతగుళికలచేతరచింపఁబడిన మాలిన్యరహితమైన హారమైనది, ఇది=దీనిని, కైకొమ్ము=పరిగ్రహింపుము. ఆయురారోగ్యముల్గలుగున్నీకున్=నీకుఁ జిరకాలాయుష్యంబును రోగరహితత్వంబును గలుగుచున్నది. అని ఈప్రకార

ముగాఁ జెప్పి, అబ్ధినాథుఁడు=సముద్రముల కధినాథుఁడైన వరుణుఁడు, ఒకముక్తాహార మర్పించినన్ = ఒకముత్యాలహార మియ్యఁగా, ముందరిపద్యముతో నన్వయము. అమృతమును పానముచేయుటవలన మేఘములు దివ్యాంబుదములయ్యెను. దివ్యాంబుదములు సుధాబ్ధిలో వర్షించుటవలన సుధాగుళికలవంటి రమణీయహారము లయ్యెను. అమృత మాయురారోగ్యకరముగావున సుధాగుళికానిర్మలహారముగూడ నటులె యాయురారోగ్యకరదాయకమనిభావము. సముద్రజన్యమగునిట్టిహార మన్యజనాలభ్యముగావున నబ్ధినాథుఁడు గడించి వసురాజున కర్పింపఁగలిగెనసుట.

ఉ. మానవనాథుఁ డయ్యమృత♦మౌక్తికహారము పేరురంబునం
బూనె నగాత్మజాభజన♦భూరిసుఖాచిరలాభహర్షసం
ధానవిశల్యకౌషధము♦న న్మది నాటినపంచసాయకా
నూనలతాంతకోరకస♦ముత్కరము న్వెలిఁ బర్వెనో యనన్. 89

మానవనాథుఁడు = వసురాజు, అయ్యమృత మౌక్తికహారము = అమృతమయమయిన యాముత్యాలహారమును, పేరురంబునంబూనెన్ = విశాలవక్షస్స్థలమందు ధరించెను, నగాత్మజా = గిరికాదేవియొక్క, భజన=పొందికవలని, భూరిసుఖ=అధికసౌఖ్యముయొక్క, అచిరలాభ = శీఘ్రప్రాప్తివలననయిన,హర్షసంధాన=సంతోష సంఘటనమనెడు, విశల్యకౌషధమునన్=విశల్యకరణిచేత-అనఁగా నాటిన బాణములను బయటికి వెడలించునట్టి మహౌషధముచేత, మదినాటిన = హృదయమందు నాటుకొన్న, పంచసాయక=మన్మథ సంబంధమైన, అనూన=అధికమయిన, లతాంతకోరక=పుష్పకళికారూపబాణములయొక్క, సముత్కరమున్=సమూహము, వెలిఁబర్వెనోయనన్=బయలువెడలెనో యన్నట్టులుగా, పేరురంబునంబూనె నని సంబంధము. హారమును మునుపె పేరురంబునం బూనెననిచెప్పి మరల నిచటఁ జెప్పుటవలనఁ బునరుక్తవదాభాసాలంకారము. తల్లక్షణము-

శ్లో. 'యత్రార్థః ప్రథమే కించి ద్భాసతే పునరుక్తవత్
పునరుక్తవదాభాస స్సోలంకార స్సతాం మతః.'

విశల్యకౌషధమునన్ అనుచో సంధానశబ్ద మోషధీపరముగావున నిట రత్నావళ్యలంకారము. తల్లక్షణము-

శ్లో. 'క్రమికాం ప్రకృతార్థానాం న్యాసం రత్నావళిం విదుః.'

విశల్యకరణి యెదనాటినములుకులను వెడలించునట్టిది. రత్నహారము గిరికాసంధానవిశల్యకరణి కావున మరుఁడు గాటముగా నెదనాటినములుకుల వెలికిఁ దీయఁగలిగెను.

ఈపద్యమునకే పాఠాంతర మీక్రింద వ్రాసి టీక చేయఁబడుచున్నది.

ఉ. మానవనాథుఁ డయ్యమృత♦మౌక్తికహారము పేరురంబునం
బూనె నగాత్మజాపృథుస♦మున్నతవృత్తకుచోపగూహన
శ్రీనిరవద్యవైభవము ♦ చెంతకుఁ దెచ్చినభాగ్యవర్ణసం
తానము తద్భుజాంతరము♦నం బ్రకటం బయి తోఁచెనో యనన్. 90

మానవనాథుఁడు=వసురాజు, అయ్యమృత మౌక్తికహారము = అమృతమయమైన యాముత్తెపుదండ, పేరురంబునం బూనెన్ = విశాలమయినవక్షస్స్థలమందు ధరించెను. ఎటువలెననిన, నగా

త్మజా=గిరికాదేవియొక్క, పృథు=గొప్పలైన, సమున్నత=మిక్కిలియున్నతములైన, వృత్త=వట్రువలు నయిన, కుచ=స్తనములయొక్క, ఉపగూహనశ్రీ=ఆలింగనసంపత్తియొక్క, నిరవద్య=ఉత్కృష్టమైన, వైభవము=విభవమును, చెంతకుఁ దెచ్చిన=సమీపమునకుఁ దెచ్చిన, భాగ్యవర్ణ సంతానము=భాగ్యాక్షరపంక్తి, తద్భుజాంతరమునం బ్రకటంబయి తోఁచెనోయనన్=అవసురాజుయొక్క బాహుమధ్యమునందు స్ఫుటమై కనుపించెనో యన్నట్టులుగా, పేరురంబునం బూనెన్ = విశాలవక్షస్థలమందు ధరించె నని సంబంధము.

చ. గరుడసమర్పితాభినవ॥ గారుడరత్నమయాంగదంబు భూ
వరభుజపీఠిఁ బొల్చె నగ॥వర్యసుతావరణాభ్యసూయచేఁ
దరలని భూతధాత్రియనఁ ॥ దత్సతిఁ బల్కులు నూరడించువై
ఖరి నడరెం దదీయభుజ॥ కాండపరిస్ఫురణంబు లయ్యెడన్. 91

గరుడ=గరుత్మంతునిచేత, సమర్పిత=ఈఁబడిన, అభినవ=నూతనమయిన, గారుడరత్నమయ=గరుడపచ్చలుచెక్కిన, అంగదంబు = బాహుపురి, భూవరభుజపీఠిః బొల్చెన్ = వసురాజుయొక్క బాహుపీఠమందుఁ బ్రకాశించెను. ఏలాగనిన, నగవర్యసుతా = గిరికాదేవియొక్క, వరణ = పాణిగ్రహణవిషయమయిన, అభ్యసూయచేన్=అసహిష్ణుత్వముచేత, తరలని=కదలకనిలిచియున్న, భూతధాత్రియనన్=భూకాంతయో యన్నట్టులుగా నని వెనుకకన్వయము.

అయ్యెడన్=ఆ సమయమందు, తత్సతిఁ బల్కులనూరడించువైఖరిన్=ఆభూకాంతను మాటిమాటికి నూరడించుచున్నట్లుగా, తదీయ = ఆవసురాజుయొక్క, భుజకాండ = దక్షిణబాహుదండముయొక్క, పరిస్ఫురణంబులు=అదరుటలు-అనఁగాఁ జలనములు, అడరెన్=ఒప్పెను.

ఇక్కడఁ బురుషునకు దక్షిణభుజ మదరుట శుభకరమని శాస్త్రసిద్ధము.

శ్లో. 'దక్షిణాక్షి పరిస్పందా ద్దక్షిణస్య భుజస్యచ
మనసశ్చ ప్రసాదేన సానుకూల్యానిలేనచ
ఏవంనిమిత్తై ర్నిశ్చిత్య విజయం భూపతి ర్వ్రజేత్.' అని మానసోల్లాసము.

కాళిదాసుఁడుగూడ నిటులె వామభుజస్పందనము శుభహేతువుగాఁ జెప్పియున్నాఁడు:-

శ్లో. 'శాంత మిద మాశ్రమపదం స్ఫురతిచ బాహుః కుతఃఫల మిహాస్య
అథవా భవితవ్యానాం భవంతి ద్వారాణి సర్వత్ర.'

అలం. ఉత్ప్రేక్ష.

భూదేవిశ్యామలవర్ణమని మహాకవిప్రసిద్ధము. ఇందుకు మనుచరిత్రములోఁ బ్రథమపద్యమందు-శా. 'శ్రీవక్షోజకురంగనాభ మెదపైఁ జెన్నొంద విశ్వంభరా, దేవిం దత్కమలాసమీపమునఁ బ్రీతి న్నిల్పినాఁడో యనంగా'నని యల్లసాని పెద్దనామాత్యుండు చెప్పినాఁడు. హరిద్వర్ణము శ్యామలవర్ణమం దంతర్భూతము గనుక గారుడరత్నమయాంగదమును భూదేవిగా నుత్ప్రేక్షించినాఁడు. ఈలాటి వర్ణనము లనేకములుగలవు. సీ. 'ఉరుభుజశాఖలనుండు తేఁటులఁబోలెఁ గేలఁబచ్చలకడియాలుదనర' అనునిత్యాదులు.

శా. సుత్రామప్రియమిత్ర పాణియుగళిన్ • శోభిల్లెఁ జిత్రప్రభా
పాత్రస్ఫారవిదూరజాభరణము • ల్పర్జన్యరాడ్దత్తముల్
క్షేత్రశ్రీకరసూత్రసన్నహనల • క్ష్మిం దన్నృపాగామిస
త్క్షేత్రశ్రీకరసూత్రసన్నహనల • క్ష్మీవైఖరు ల్దెల్పుచున్. 92

సుత్రామ=దేవేంద్రునకు, ప్రియమిత్ర=ఇష్టసఖుఁడయిన వసురాజుయొక్క, పాణియుగళిన్=హస్తద్వయమందు, పర్జన్యరాడ్దత్తముల్=మేఘశ్రేష్ఠునిచేత నీఁబడిన, చిత్రప్రభా=చిత్రకరములైన కాంతులకు, పాత్ర=భాజనములును, స్ఫార=అధికములును, విదూరజ=వైదూర్యమణిమయములునయిన- అనఁగా వైదూర్యమణిఖచితములయిన, ఆభరణముల్=హస్తకంకణములు,

ఇక్కడ మేఘధ్వనివలన వైదూర్యరత్నములు పుట్టుచున్నవి గనుకఁ బర్జన్యరాజు విదూరజాభరణము లిచ్చినాఁడని చెప్పినాఁడు. ఇందుకు-

శ్లో. 'తయాదుహిత్రాసుతరాంచకాశే స్ఫురత్ప్రభామండలయాసవిత్రీ
విదూరభూమి ర్నవమేఘశబ్దా దుద్భిన్నయారత్నశలాకయేవ'

అని కుమారసంభవమందుఁ బ్రయోగము.

క్షేత్ర=ఆవైదూర్యరత్నములయందలి, శ్రీకర = శోభాకరములైన, సూత్ర=నూలుదిరుగుటలయొక్క, సన్నహనలక్ష్మిన్=ప్రయత్నసమృద్ధిచేత, తన్నృప=ఆవసురాజుయొక్క, ఆగామి=ముందు రాఁగల, సత్క్షేత్ర=ఉత్తమకళత్రమయిన గిరికాదేవికి, (ని. 'క్షేత్రం శరీరే కేదారే సిద్ధస్థాన కళత్రయోః' అని అ.) శ్రీకర=సౌభాగ్యకరమైన, సూత్ర=మంగళసూత్రముయొక్క, సన్నహన=బంధనముచేతనైన, ఈశబ్దము 'ణహబంధనే' యనెడు ధాతువువలన నిష్పన్నమైనది, లక్ష్మీవైఖరుల్=శ్రేయోవైఖరులను, తెల్పుచున్=సూచనసేయుచు, శోభిల్లెన్=ప్రకాశించెను.

వైదూర్యరత్నమందు సూత్రములు దిరుగుచున్నవి యనుటకు లక్షణము-

గీ. 'పగలుగొంది గానఁబడెడుబిడాలంబు, కన్నుఁబోలి వెలుగుగలిగి నూలు
దిరుగునట్టు మీఁదఁ దెరబారువైదూర్య, రత్నమునకు దీప్రయత్నమునకు.'

అని రత్నపరీక్షయందుఁ జెప్పంబడియున్నది. వైడూర్యమునందు సహజముగా నూలుదిరుగునటులఁ గనిపించును. ఇది గిరికాకంఠమునందుఁ గావింపఁబోవు మంగళసూత్రబంధనమును సూచింపసాగెనని భావము. అలం. ఉత్ప్రేక్ష.

మ. అలకారాజకుమారుఁ డద్భుతముగా • నర్పించుచొక్కంపుఁగెం
పులపెండేరము చేదిరాజచరణాం • భోజంబునం బొల్చె నీ
బలవద్దీప్తిఁ బ్రదీప్తమయ్యె నిదె నా • పార్శ్వద్వయం బంచు నా
వలయగ్రావము వందనప్రవణ మై • వర్తిల్లుచందంబునన్. 93

అలకారాజకుమారుఁడు = కుబేరపుత్త్రుఁడైన నలకూబరుఁడు, అద్భుతముగా నర్పించు=ఆశ్చర్యమగునట్టులుగా సమర్పించిన, చొక్కంపుఁగెంపుల పెండేరము=చొక్కమయిన యనఁగా నతిశయకాంతిసంపన్నములైన కెంపులుచెక్కిన గండపెండేరము, చేదిరాజచరణాంభోజంబునం బొల్చెన్=వసురాజు పాదమందుఁ బ్రకాశించెను. ఏలాగనిన, నీబలవద్దీప్తిన్=నీయొక్క బలిష్ఠమైన యరుణకాంతిచే,

ఇదె=ఇదిగో, నాపార్శ్వద్వయంబు=నాయొక్క వెనుకముందరివైపులు, ప్రదీప్తమయ్యెన్=మిక్కిలి యుం బ్రకాశించెను, అంచున్=అనిపలుకుచు, ఆచలయగ్రావము = ఆచక్రవాళపర్వతము, వందన ప్రవణమై=నమస్కారమందలి యాసక్తిగలదై, వర్తిల్లుచుండంబునన్ = ప్రవర్తించుచున్నదో యన్న ట్టులుగా, ప్రకాశించె నని సంబంధము. చక్రవాళపర్వతము భూమండలమును జుట్టుకొనియుండుట వలన దానికావలిభాగమునందు సూర్యచంద్రకిరణప్రసారములుండవు. అందుచే నావలి భాగమంత యును నంధకారబంధురము. చక్రవాళమున కావలంగూడం బ్రకాశము వ్యాపించుటకు వసురాజు ప్రతాపము కారణము. ఆవలం బ్రతాపరూపమునం గాంతి ప్రసరింపఁజేయుటచేఁ గృతజ్ఞత నెఱపం జక్రవాళము వెండెరముగాం బాదములసేవించుచున్నదని భావము. అలం. ఉత్ప్రేక్ష.

క. చెఱఁగు లుప్పొంతపసిండిప్రాంతమిసిమిం ♦ జిత్రాతిచిత్రంబు లై
మెఱయున్ రత్నపుకుచ్చు లంచులబడిన్ ♦ మించు ల్దువాళించుక్రొ
మ్మెఱుఁగుంజంద్రికకావిపట్టు సురభూ♦మీజార్పితం బిచ్చె నా
తఱుచుంగన్నుల వేల్పుపట్టి వసుగో♦త్రామండలస్వామికిన్. 94

చెఱఁగుల్పొంతపసిండి ప్రాంతమిసిమిన్ = అంచులు మొలా మాబంగారపు ప్రాంతపనియొక్క కాంతివిశేషముచేత, చిత్రాతిచిత్రంబులై మెఱయన్ = అద్భుతములైన వానికంటె మిగుల నద్భుత ములై ప్రకాశింపఁగాను, రత్నపుకుచ్చులు=ముత్యాలకుచ్చులు, అంచులబడిన్=అంచులవెంట, మిం చుల్దువాళించు=కాంతులను వెదచల్లుచున్న, క్రొమ్మెఱుఁగుంజంద్రికకావిపట్టు = క్రొత్తమెఱుఁగుగల చంద్రకావిపట్టుతాప్తాను, సురభూమీజార్పితంబు = కల్పవృక్షముచే నర్పింపఁబడిన దానిని, ఆతఱు చుంగన్నుల వేల్పుపట్టి=ఆవేఁగన్నులుగల యింద్రునికుమారుఁడైన జయంతుఁడు, వసుగోత్రామండలస్వా మికిన్=భూమండలాధీశ్వరుఁడైన వసురాజునకు, ఇచ్చెన్=సమర్పించెను. అమూల్యము అసమానము నగు నాచంద్రికకావిపట్టువలువచెఱుగుల బంగారుపూఁత అంచు ముత్తెములకుచ్చులు సమకూర్చినది. ఇట్టియుత్తమవస్త్రము నొసంగినది కల్పభూరుహము. వసురాజున కొసంగినది జయంతుఁడు. ఇతఁ డును నీసంబంధమునెడ నభిమాని యని భావము.

ఉ. వ్రీళ వివర్తితాస్య యయి ♦ వేలుపుటింతి యొకర్తు చేదిభూ
పాలమహేంద్రుకట్టెదుటఁ ♦ బట్టె మణీమయదర్పణంబు శో
భాలలితాభిరూప్యమునఁ ♦ బార్థివ యీముకురంబు మేలొ నా
మేలిమిచెక్కుటద్ద మిది ♦ మేలొ కనుంగొను మన్విధంబునన్. 95

వ్రీళన్=సిగ్గుచేత, వివర్తితాస్యయయి=అడ్డముగా మరలింపఁబడిన ముఖముగలదై, వేలుపు టింతియొకర్తు=అప్సరస్త్రీయొకతె, చేదిభూపాలమహేంద్రుకట్టెదుటన్ = వసురాజునెట్టయెదుట, పట్టెమణీమయదర్పణంబు=రత్నవికారమయిన యద్దమును బట్టినదాయెను. ఏమనియనిన, శోభా= కాంతిచేత, లలిత=ఒప్పుచున్న, అభిరూప్యమునన్=చక్కఁదనముచేత, పార్థివ=ఓయిరాజా, ఈముకు రంబుమేలో=ఈయద్దముబాగో, నా మేలిమి చెక్కుటద్దమిదిమేలో=నాయొక్క మేలిమి బంగారము వంటి చెక్కుటద్దముబాగో, కనుంగొనుమన్విధంబునన్ = చూడుమని యన్నట్టులుగా, అద్దము నెదు ట్టఁ బట్టెనని సంబంధము.

వేలుపుటింతి వెనుకనిలిచి వసురాజున కద్దమును జూపుచుండెను. వసురాజు భూపాలమహేంద్రుఁడు. తాను వేల్పుటింతి గానఁ దనప్రతిబింబము దర్పణగతమగుటకు సిగ్గుపడెను. అపుడు సురకాంత మోమోరఁ జేసెను. మోము త్రిప్పుటచేఁ జెక్కులద్దమునఁ బ్రతిబింబించెను. ఇదియంతయు వేలుపుటింతి వసురాజును నాచెక్కులు మెఱుంగుగానున్నవా? దర్పణము మెఱుంగుగానున్నదా యని ప్రశ్నించినటులుండెనని భావము. అలం. ఉత్ప్రేక్ష.

చ. వసువసుధాసుధాంశునకు • వారిదవాహనుఁ డాక్షణంబునం
  దసదృశచిహ్న మొక్కటి మ•హామహనీయమహోచితంబుగా
  నొసఁగఁ దలంచి దివ్యసరి•దుద్భవరత్నమృణాళినీబిస
  ప్రసవసరంబు మంగళక•రంబు గరంబున నెత్తి యిట్లనున్. 96

వసు వసుధాసుధాంశునకున్ = భూలోకచంద్రుఁడైన వసురాజునకు, వారిదవాహనుఁడు= మేఘవాహనుఁడైన యింద్రుఁడు, ఆక్షణంబునందున్ = తత్క్షణమందు, అసదృశచిహ్న మొక్కటి= సమానరహితమయిన యొకలాంఛనమును, మహాత్ =అధికమయిన, మహనీయ=శ్రేష్ఠమయిన, మహ =ఉత్సవమునకు, ఉచితంబుగాన్ = తగియుండునట్లుగా, ఒసఁగఁ దలంచి = ఈఁదలఁచినవాఁడై, మంగళకరంబు=శుభకరమయిన, దివ్యసరిత్ =ఆకాశగంగయందు, ఉద్భవ=సంభవించిన, రత్న మృణాళినీ=రత్నమయమైన తామరతీఁగయందలి, బిసప్రసవ=పద్మములచేత రచింపఁబడిన, (ని. 'బిస ప్రసూన రాజీవ పుష్కరాంభోరుహాణి చ' అని అ.) సరంబు=మాలిక, కరంబున నెత్తి=తనహస్తము చేతఁ బైకెత్తి, యిట్లనున్ =వక్ష్యమాణప్రకారముగా నొకవాక్యము పలికెను.

వివాహశుభోత్సవమునకుఁ దగిన యసదృశచిహ్నమును దేవేంద్రుఁడు వసురాజున కొసంగఁ దలంచెను. అది పద్మమాలిక. దానిజననము ఆకాశగంగయందలి రత్నమయమైన తామరతూడునందు. అది గైకొన నర్హమైనది వివాహశుభోచితమైన వసురాజు. మంగళకరము.

ఉ. కమ్మపసిండిగట్టుపయిఁ • గ్రమ్మెడు వేలుపుటేటిపార్శ్వదే
  శమ్ముల నిమ్ములై పొదలు•చాగపుమ్రాఁకులమానికంపుఁబూ
  దుమ్ములు రాలఁగా నయిన•తోరపుపేరసటం జనించె నీ
  తమ్ములు చిత్రదీప్తిమహి•తమ్ము లొసంగు నభీప్సితమ్ములన్. 97

కమ్మపసిండిగట్టుపయిన్ =మనోజ్ఞమైన కాంచనాచలముమీఁద-అనఁగా మేరుపర్వతముమీఁద, క్రమ్మెడు=వ్యాపించుచున్న, వేలుపుటేటి=దివ్యనదియొక్క-అనఁగా నాకాశగంగయొక్క, పార్శ్వదేశమ్ములన్ =రెండువైపులను, ఇమ్ములైపొదలు=గుబురులైయొప్పుచున్న, చాగపుమ్రాఁకుల=చాగమను పదము త్యాగశబ్దతద్భవము గనుకఁ ద్యాగశీలములైన వృక్షములయొక్క - అనఁగాఁ గల్పవృక్షముల యొక్క, మానికంపుఁబూదుమ్ములురాలఁగానయిన=మాణిక్యమయపుష్పపరాగము లాగంగలో రాలి నందున నేర్పడిన, తోరపుపేరసటన్ =విస్తారమయిన పెద్దబురదయందు, 'జనించెనీతమ్ములు=ఈకమలములు జన్మించెను. ఇవియెట్టివియనిన, చిత్రదీప్తిమహితమ్ములు=విచిత్రకాంతిచేత నొప్పుచున్నవి, ఇవి, అభీప్సితమ్ములన్ =వాంఛితార్థములను, ఒసంగున్ =ఇచ్చును.

ఇక్కడఁ జిత్రదీప్తిమహితత్వమందును నభీప్సితప్రదానమందును మీఁదఁజెప్పఁబడిన తమ్ముల యొక్క విశేషణములు హేతువులని గ్రహింపవలయును. ఈపద్మములు లోకోత్తరములు. కావునఁ జిత్రదీప్తి మహితమ్ములు. మేరుపర్వతమునందు ఆకాశగంగాతీరమున గుబురుగానున్న కల్పవృక్షముల నుండి మాణిక్యమయపరాగము రాలి యదియె బురదగాఁ జేరుకొనెను. అందీతమ్ములు జనించిన వగుటచే నభీప్సితప్రదములై యున్నవి.

ఉ. అవ్యయనవ్యవాసన లొ◆కప్పుడు వీడక వాడకుండు నీ
దివ్యసరోజదామకము ◆ దీధితిమాత్రదినేశమిత్రతా
భవ్యము దీనిఁ గన్న నెడఁ◆బాయుఁ బ్రదోషము లన్నచోఁ బ్రదో
షవ్యసనంబు పైకొనఁగఁ ◆ జాలునె దీని జగత్త్రయంబునన్. 98

అవ్యయ=నాశనములేని, నవ్య=నూతనములగుచున్న, వాసనలు=పరిమళములు, ఒకప్పుడు వీడక =ఒకానొక సమయమందును వదలక, వాడకుండు=వాడిపోకుండునట్టి, ఈదివ్యసరోజదామకము= దివ్యమయిన యీకమలమాలిక, దీధితిమాత్ర దినేశ మిత్రతా భవ్యము-దీధితిమాత్ర=కాంతిమాత్రముచేత, దినేశ=సూర్యునియొక్క, మిత్రతా = స్నేహమునకు, భవ్యము=యోగ్యమయినది-అనఁగా లోకములోఁ గమలమువలెఁ గాంతిన పేక్షించి సూర్యునకు మిత్రములుగావనియును సమానకాంతిచేత మిత్రములైనవనియును దెలియవలయును. దీనిఁగన్న నెడఁబాయుఁ బ్రదోషములన్నచోన్=దీనిఁజూడఁ గానె ప్రదోషకాలము లెడఁబాయునని చెప్పుచుండఁగా, ప్రదోషవ్యసనంబు పైకొనఁగఁ జాలునె దీని జగత్త్రయంబునన్=వ్యసనమనఁగాఁ గ్లేశము, ప్రదోషకాలమందు నుదయించెడు స్త్రీవిరహక్లేశము దీనిం బైకొనఁజాలునా మూఁడులోకములయందును అని యర్థము.

ప్రదోషకాలకృతమయిన దృష్టి విరోధత్వము దీనిం బైకొనఁజాలునా యనియును బ్రదోష కాలమందలి ముకుళీభావము దీనిఁ బైకొనఁజాలునా యనియును బ్రకారాంతములు. ప్రదోషమనఁ గాఁ బాతకము గనుక నీపద్మమాలికను జూడఁగానే పాతకము లెడఁబాయు నని చెప్పుచుండఁగాఁ బాతకజనితక్లేశము దీనిం బైకొనఁజాలునా యనియును జెప్పవచ్చును. ఈ నాలుగర్థములలోఁ బ్రథమ ద్వితీయ చతుర్థార్థములు పద్మమాలికను ధరించినవారికే చెప్పవలయును. తృతీయార్థము పద్మమాలికకుఁ జెప్పవలయును. ప్రదోషశబ్దమునకు - (ని. 'ప్రదోషః కాలభేదే స్యాత్ప్రదోషో దోష ఇష్యతే' అని వి.) వ్యసనశబ్దమునకు - (ని. 'వ్యసనం త్వశుభే శక్తౌ పాన స్త్రీ మృగయాదిషు' అని విశ్వనిఘంటువు.)

తావులు వీడకుండుట, వాడకుండుట, దివ్యసరోజదామకము గావున, దివ్యపద్మము లెపుడును వికసించియే యుండును గావున నీదివ్యపద్మములకు సూర్యుఁడు సమానకాంతిచే మిత్రుఁడు. దీనిని దాల్చుటవలన లభ్యమగు ఫలము ప్రదోషవ్యసనపరిహారము. అలం. అర్థాపత్తి.

క. ఈశరజాతములకు నెన, యేశరజాతములఁ గాన ◆ మివి బవరములో
నాశరజాతము వరపెడు, నాశరజాతముల నడఁచు ◆ నభినవమహిమన్. 99

ఈశరజాతములకు నెన యేశరజాతములఁ గానము=ఈపద్మములకు సమాన మేపద్మములనుం జూడము. ఏమనిన, ఇవి=ఈపద్మములు, బవరములోన్=యుద్ధములో, ఆశరజాతము వరపెడు=రాక్షస

సమూహము ప్రయోగించునట్టి, ఆశరజాతముల నడఁచు నభినవమహిమన్=ఆబాణసమూహములను బ్రతిహతముసేయును నూతనప్రభావముచేత నని యర్థము.

ఆశరులనఁగా రాక్షసులన్నందుకుఁ బ్రయోగము - కందార్థము. దాశరథీ కీశరథీ, యాశర నిర్వపణ వేంకటాచలరమణా' అని యున్నది. ని. 'స్రప ఆశరః' ఈపద్యము పంచప్రాసకందమని యెఱుంగునది. ఈదివ్యాబ్జముల మహిమ యభినవము. యుద్ధమునందు రక్కసులు ప్రయోగించు బాణముల నివి యడంచును. కావుననే యిట్టిపద్మములు లోకమున లేవనిచెప్పుట. ఈపద్యము పంచప్రాసము. అలం. కావ్యలింగము.

శా. పోఁక న్వచ్ఛశిలీముఖంబుల నడంచున్ రాజహంసాళి న
ట్టాఁకం బెట్టు ననంతరత్నరుచి వోనాడుం దపశ్శ్రీలకు
న్వేఁకం బై వెలయున్ ఘనోదయమున న్విప్పారు నిప్పద్మముల్
వీఁకం జిత్రచరిత్రపాత్రములు గావే ధాత్రి నూహింపఁగాన్. 100

పోఁకన్వచ్ఛశిలీముఖంబులనడంచున్=శిలీముఖశబ్దము తుమ్మెదయందును బాణమందును వర్తించును. (ని. 'అళిబాణౌ శిలీముఖౌ' అని అ.) ముట్టవచ్చెడుతుమ్మెదల నివారించునని యర్థము. నాట వచ్చెడు బాణములను బ్రతిహతముసేయునని భావము. రాజహంసాళి నట్టాఁకంబెట్టున్=రాయంచల ను రాకుండ నడ్డగించు నని యర్థము. రాజశ్రేష్ఠుల నిరాకరించునని భావము. అనంతరత్నరుచివో నాడున్=అనంతరత్నమనఁగా సూర్యుఁడు గనుక నతనియందలి ప్రీతి నిరసించునని యర్థము. అపరి మితములైన పద్మరాగమణులయొక్క కాంతిని దిరస్కరించు నని భావము. తపశ్శ్రీలకు న్వేఁకంబై వెలయున్=తపస్సనఁగా గ్రీష్మర్తువందలి యాతపదీప్తుల కసాధ్యమై ప్రకాశించునని యర్థము. తప స్సంపదలకు దుర్లభములని భావము. ఘనోదయమునన్విప్పారున్=మేఘాగమమందు-అనఁగా వర్షర్తు వందు వికసించునని యర్థము. అధికాభ్యుదయముచేత నుల్లసిల్లునని భావము. ఇప్పద్మములు=ఏతా దృశగుణవిశిష్టములైన యీపద్మములు, ధాత్రిన్=భూమియందు, ఊహింపఁగన్=విచారింపఁగా, వీఁకన్=ప్రభావముచేత, చిత్రచరిత్రపాత్రములుగావే=అద్భుతచరిత్రకుఁ దగినవిగావా.

అనఁగా మీఁద నర్థముగాఁ జెప్పఁబడిన భృంగనివారకత్వాది పద్మేతరధర్మములు గలిగిన వగుటచేత నీపద్మములు చిత్రచరిత్రములు గలవి యనుట. ఈపద్యము నాల్గనచరణమందుఁ గాకుస్వర యతి. అలం. కావ్యలింగము.

ఉ. కమ్మనివింటిజోదు నెఱకైదువు లైనమిటారితమ్ము లీ
తమ్ముల నెట్లు వోలు సతతమ్ము లతాంగులమానయుక్తచి
త్తమ్ములఁ గూడఁబాఱు నవి తమ్ము లసన్మహిళామనోంబుజా
తమ్ములు గూడి మోహసహితమ్ములుగా నివి మించు మించులన్. 101

కమ్మనివింటిజోదు=మన్మథునియొక్క, నెఱకైదువులైన = ఉత్తమాయుధములైన, మిటారి తమ్ములు=చక్కఁదనముగల పద్మములు, ఈతమ్ముల నెట్లువోలున్=ఈపద్మముల నేలాగునఁ బోలఁ గలవు-అనఁగాఁ బోలలేవనుట. ఎందువల్లననిన, అవి=ఆమన్మథాయుధములైన పద్మములు, సతతమ్ము= నిరంతరమును, లతాంగుల=స్త్రీలయొక్క, మానయుక్తచిత్తమ్ములఁగూడఁబాఱున్=అలుకతోఁగూడిన

చిత్తములను వెంబడించును, ఇవి=ఈమాలికలయందలి పద్మములు, తమ్ముక్=తమ్ము, లసత్=ఒప్పుచున్న, సన్మహిళా=శ్రేష్ఠులయిన స్త్రీలయొక్క, మనోంబుజాతమ్ములు=మనకకమలములు, కూడి=కలిసికొని, మోహసహితమ్ములుగాక్=మోహయుక్తమగునట్టులుగా, మించులక్=కాంతులచేత, మించుక్=అతిశయించును.

మన్మథాయుధములైన పద్మములు స్త్రీలచిత్తముల ననుసరించునట్టివియును, నీపద్మములు స్త్రీల చిత్తములచేతఁ దామనుసరింపఁబడునట్టివియును గనుక నాపద్మము లీపద్మములకు సరిగావనియర్థము. మన్మథుఁడు సామాన్యపువిలుకాఁడు గాఁడు జోదు. వాని నెఱకైదువులు మిటారితమ్ములు. అయిన నేమి? చెలువలయలుకనిండిన చిత్తములనివి వెంబడించును. ఇదియొకలోపము. ఇట్టిలోపము లేకపోఁగా నీదివ్యకమలములు లతాంగుల మనోంబుజములను మోహయుక్తము లొనర్చుచున్నవి. కావున నివి యితరతామరసముల మించినవనిభావము.

ఉ. తమ్ములకెల్లఁ బెద్ద యగు • తామరసోదరనాభికాసరో
జ మ్మది విశ్వము న్విధివ•శమ్మునఁ గాని సృజింపఁ జాల దీ
తమ్ములయెత్తు చిత్రచరి•తమ్ము జగత్త్రయసారవస్తుజా
తమ్ము సృజింప నేర్చు నిర•తమ్ము దలంచినయంతలోపలన్. 102

తమ్ములకెల్లఁబెద్దయగు=కమలములకన్నిటికిని మొదటిదైన, తామరసోదరనాభికాసరోజమ్మది=విష్ణుదేవుని నాభియందలి యీ కమలము, విశ్వము న్విధివశమ్మునఁగాని సృజింపఁజాలదు=ప్రపంచమును దైవవశముచేతఁగాని నిర్మింపఁజాలదు అనియర్థము. బ్రహ్మమూలముచేతనని భావము. ఈతమ్ముల యెత్తు=ఎత్తనఁగా నౌన్నత్యంబును బువ్వమాలికయును గనుక నీకమలమాలిక, చిత్రచరితమ్ము=అద్భుత చరిత్రముగలది. ఎందువలననినిన, నిరతమ్ము=నిరంతరమును, తలంచినయంతలోపలక్=తలఁచుకొన్న మాత్రముననే, జగత్త్రయసారవస్తుజాతమ్ముసృజింపనేర్చుక్=మూఁడులోకములయందుండెడు శ్రేష్ఠ వస్తుసమూహమును గల్పింపనేర్చును.

తమ్ములకెల్లఁ బెద్దయన్నచోట ననుజుల కగ్రజుఁడనియును, తమ్ములయెత్తన్నచోట ననుజుల యౌన్నత్యమనియును జమత్కారము గ్రహింపవలయును. ఈ చెప్పుటవలనఁ దమ్ములకందఱికిఁ బెద్ద యయ్యును దైవవశముచేతనేకాని స్వశక్తిచేతఁ బ్రపంచనిర్మాణము చేయఁజాలని విష్ణునాభి కమలమునకంటెఁ దమ్ముల యౌన్నత్యముచేతనే జగత్త్రయసారవస్తుజాతము సృజింపఁబడుట గలిగిన యీ పద్మమాలిక యధికప్రభావము గలది యనుట. అలం. వ్యతిరేకము.

ఉ. వాసవమాలికాంకమున • వర్తిలునీనిరవద్యవాసనా
వాసవరాసవాభినుత•వారిజదామము ధాత్రిఁ జెందియుఁ గ్రొ
వాసవమాలికాంకమున • వర్తిలుఁ దావక మై వసుంధరా
వాసవ చాల నెత్తయిన•వారికి నెందును బేరు దప్పునే. 103

వాసవమాలికాంకమున వర్తిలు=వాసవమాలిక యనెడు నామముచేతఁ బ్రవర్తించుచున్న, ఈ నిరవద్య=ఈయుత్కృష్టమైన, వాసనావాస=పరిమళమునకు వాసస్థానమైన, వరాసవ=శ్రేష్ఠమైన మకరందముచేత, అభినుత=కొనియాడఁబడుచున్న, వారిజదామము=పద్మమాలిక, ధాత్రిఁ జెందియుఁక్=

భూలోకమును బొందియుఁ, వసుక్షమావాసవ=భూలోకదేవేంద్రుఁడైన వసురాజా, తావకమై=నీ సంబంధమైనదై, వాసవమాలికాంకమున వర్తిలుక్=వాసవమాలికానామముచేతనే వర్తిల్లును, చాల నెత్తయిన...దప్పునే = మిగులనున్నతిగలవారి కెందయినను బ్రసిద్ధితప్పునా యని యర్థము. (ఎత్తన నున్నతియుఁ బూదండయుఁ.)

ఇక్కడ స్వర్గమందు వాసవుని మాలికగనుక వాసవమాలిక యనియును భూమియందు వసుసంబంధినియైన మాలికగనుక వాసవమాలిక యనియును దెలియవలయును. లేక, వసురాజును క్షమావాసవుఁడని చెప్పినందున వసురాజును వాసవుఁడే గనుక వాసవునియొక్క మాలికయనియును జెప్పవచ్చును. చాలనెత్తయినవారికి నెందును బేరుదప్పునే=ఎత్తనఁగా నున్నతమును బువ్వుదండయును, పేరనఁగా నామమును హారమును గనుక మిక్కిలి యౌన్నత్యముగలవారి కెక్కడనైనను బ్రసిద్ధిదప్పునా యని యర్థము. పువ్వుదండకుఁ బేరని చెప్పుటదప్పునా యని యర్థాంతరము. ఈ పద్యము ద్విప్రాసముగలదిగాఁ జెప్పంబడియెను. అలం. శ్లేషమూలకార్థాంతరన్యాసము.

చ. ఉరగుల కీసుపర్ణరుచి • యుక్తము డాయఁ గడింది ధాత్రిపై
నరులకుఁ బోల దీకమల • నాయక తేజముఁ దేరి చూడ నీ
పరమమహేంద్రమాలిక సు • పర్వుల కైన భరింప భార మో
గిరిహర నీవు నే నని స • ఖిత్వము మీఱఁగ నీకొసంగితిన్. 104

ఉరగులకుఁ = పాతాళవాసులైన పన్నగులకు, ఈసుపర్ణరుచియుక్తము డాయఁగడింది = సుపర్ణుఁడనఁగా గరుత్మంతుఁడు గనుక గరుత్మంతునియొక్క ప్రతాపముతోఁగూడుకొన్న యీపద్మమాలికను సమీపించిపోవుటకే కఠినము అని యర్థము. సుపర్ణము లనఁగా శోభనపత్రములు గనుక వానియొక్క కాంతితోఁ గూడుకొన్నదని భావము. ధాత్రిపైనరులకుఁ = భూమిపైనున్న మనుష్యులకు, ఈ కమలనాయక తేజముదేరిచూడఁ = కమలనాయకుఁ డనఁగా సూర్యుఁడు గనుక సూర్యప్రకాశముగల యీపద్మమాలికలను దృష్టినిలిపి చూచుటకే, పోలదు = శక్యముగాదని యర్థము. కమలనాయకము లనఁగా కమలశ్రేష్ఠములు గనుక వానియొక్క తేజముగలదని భావము. ఈ పరమమహేంద్రమాలిక=ఉత్కృష్టమైన యీ యింద్రమాలిక, సుపర్వులకైన భరింపభారము= దేవతలకయినప్పటికిని భరింప నలవిగాదు. అనఁగా స్వర్గ మర్త్య పాతాళవాసు లయినవారి కెవ్వరికిని భరింప నలవిగాదనుట. అయినప్పటికిని, ఓగిరిహర = పర్వతభంజకుండవైన యో వసురాజా, నీవు నేనని = అనఁగా నీవు బర్వతభంజకుఁడవు నేనును బర్వతభంజకుండను గనుక నీవు నేనుగాని వేఱుగాదని, సఖిత్వముమీఱఁగఁ = మిత్రభావ మతిశయించునట్టులుగా, నీకొసంగితిఁ = నీకిచ్చితిని.

ఈహారము నాగులకును నరులకును సుపర్వులకును సాధ్యముగాదు. త్రిలోకోత్తరుఁడవుగాన నీకొసంగితిని. ఉరగులు సుపర్ణుని సమీపింపలేరు. ఇదిసుపర్ణరుచిసహితముగావున వారు ధరింపఁజాలరు. మనుజులో పద్మనాయక తేజము సహించిచూడలేరు. ఇదిమహేంద్రమాలికగదా! దేవతలు భరింపలేరు. ధరింపఁదగినవాఁడు గిరిహరుఁడు. ఇరువురము గిరిహరులముగావున సఖిత్వము దలంచి యీదివ్యహారము నీకొసంగితినని భావము. అలం. కావ్యలింగము. పరికరము.

శా. భూనాథోత్తమ యస్మదీయవరసం♦భూతామరత్వంబుతో
దీనిం గొమ్మని వాసవుం డొసఁగఁ జే♦దిస్వామినెమ్మేన న
మ్లానస్వచ్ఛసరోజమాల్య మది చా♦లం బొల్చె నింద్రైక్యదీ
క్షానిర్ణేతృమహాసహస్రనయనీ♦సౌభాగ్యముం దెల్పుచున్. 105

భూనాథోత్తమ=రాజాగ్రణీ, అస్మదీయవర=నాయొక్కవరమువలన, సంభూత = సంభవించిన, అమరత్వంబుతోన్=దేవత్వముతోడ, దీనింగొమ్మని=దీని గ్రహింపుమని, వాసవుండొసఁగన్ = ఇంద్రుఁడియ్యఁగా, చేదిస్వామినెమ్మేనన్ = వసురాజుదేహమందు, అమ్లానస్వచ్ఛసరోజమాల్యమది, అమ్లాన = ఎప్పటికిని వాడిపోని, స్వచ్ఛ = నిర్మలమైన, సరోజమాల్యమది = ఆపద్మమాలిక, చాలంబొల్చెన్=మిక్కిలియుఁ బ్రకాశించెను. ఏలాగుననినను, ఇంద్ర = ఇంద్రునితోడ, ఐక్యదీక్షానిర్ణేతృ=అభేదదీక్షను నిర్ణయపఱుచుచున్న, మహాసహస్రనయనీ=అధికమయిన సహస్రలోచనముల యొక్క, సౌభాగ్యముందెల్పుచున్ = చక్కఁదనమును దెలియఁజేయుచు, చాలంబొల్చెనని సంబంధము.

కమలములు నేత్రములవంటివి గనుక వసురాజు కమలమాలికను ధరించినవాఁడై సహస్రలోచనుఁడయిన యింద్రునివలె నుండెను. దివ్యకుసుమమాలిక ధరింపఁదగినవారు దివ్యులు. కావునఁ దొలుత వసురాజునకు దివ్యత్వము వరప్రసాదరూపమున నింద్రుఁడొసంగెను. సరోజమాల్యము అమ్లానము. వాడుటయెఱుంగనిది. రేకులెప్పుడు వికసించియుండును. వికసితములగు దళములు సహస్రనయనముల వలెనుండెను. గిరిహారరూపముననే కాక సహస్రనయనరూపమునఁగూడ వసురాజు ఇంద్రునివలెనుండెననిభావము. సహస్రనయనీ యనుచోనేకపద్యాభీద్విగువు.

క. ఆవేళ దివిజమురజవి, రావము హారిరచితగిరిపు♦రప్రాంగణవీ
థీవితతం బై గిరిజా, వైవాహికకలనమునకు ♦ వడిఁ దరు విడియెన్. 106

ఆవేళన్ = ఆసమయమందు, దివిజమురజవిరావము = దేవతాసంబంధమయిన మర్దలధ్వని, హారి=ఇంద్రునిచేత, రచిత=నిర్మింపఁబడిన, గిరిపుర = కోలాహలపర్వతపట్టణముయొక్క, ప్రాంగణవీథీ=ముంగిటియందు, వితతంబై=విస్తరించినదై, గిరిజావైవాహికకలనమునకున్=గిరికాదేవియొక్క వివాహసంబంధమయిన వ్యాపారమునకు, వడిఁదరువిడియెన్=త్వరగాఁ దరువుపెట్టెను-అనఁగాఁ దొందర పుట్టించెను.

కోలాహలపర్వతనగరమందు వసురాజునొద్ది దేవతామురజధ్వనులు వినఁబడఁగానే గిరికావివాహసంబంధమయిన వ్యాపారము త్వరగా జరిగింపవలయు నని యక్కడివారందఱును దొందరపడిరని భావము.

ఉ. ఆయెడ సంభ్రమం బెసఁగ ♦ నాప్తసఖీకుల ముత్సవాకులం
బై యగకన్యఁ జేరి శిర ♦ సంటుఁడు మజ్జన మార్పుఁ డర్థిఁ గై
సేయుఁడు లేశముం దడవు ♦ సేయకుఁ డంచు ముహూర్త మెంతయుం
డాయఁగ వచ్చె నంచు వినుఁ♦డా నృపతూర్యము లంచుఁ బల్కఁగాన్. 107

ఆయెడన్=అనఁగా వసురాజునొద్దవాయించిన దేవతామురజధ్వనులు వినఁబడునపుడు, సంభ్రమంబెసఁగన్=సంతోషముతోఁ గూడిన తొందర యతిశయింపఁగా, ఆప్తసఖీకులము = గిరికాదేవి

యొక్క యిష్టసఖీజనసమూహము, ఉత్సాహకులంబై=వేడుకచేతఁ దొట్రుపడుచున్నదై, ఆగకన్యఁ జేరి =గిరికాదేవిని జేరఁబోయి, శిరసంటుఁడు=తలయంటుఁడు, మజ్జనమార్చుఁడు = స్నానముచేయింపుఁడు, అర్థిఁ గైసేయుఁడు=చక్కఁగానలంకరింపుఁడు, లేశముం దడవుసేయకుఁ డంచుఁ = ఎంతమాత్రము సాలస్యము చేయకుఁడనియు, ముహూర్తమెంతయుం డాయఁగవచ్చెనంచుఁ = పెండ్లిలగ్నము మిక్కిలి సమీపించి వచ్చెననియు, వినుఁడా నృపతూర్యములంచుఁ =వసురాజు తరలివచ్చెడు భేరీమృదంగాది వాద్యధ్వను లాలకింపుఁడీ యనియును,పల్కఁగాఁ =ఒకరితోనొకరు సంభాషించుకొనఁగా, ఈ పద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. ఇందు వినుఁడా యనునది ప్లుతయతి. ఉత్సాహకులముచే సంభ్రమము. శిరసంటుఁడు కైసేయుఁడని తొందరించుట ముహూర్తము సమీపించెనని. నృపతూర్యరవములు రాజాగమన సూచకములు. రాజువచ్చువఱ కలంకారములన్నియుఁ బూర్తిచేయవలయునని భావము.

చ. హరికరుణాకటాక్షమహి♦మాగతదివ్యవివాహమందిరో
దరకురువిందవేదియెడఁ ♦ దార్చిననిర్మలవజ్రపీఠిపై
ధరసుత నుంచి నెన్నుదుటఁ ♦ దామ్రతరాక్షతము ల్ఘటించి పె
ట్టిరి నలుఁగు ల్సకుంకుమప♦టీరరజంబునఁ బుణ్యభామినుల్. 108

హరి=దేవేంద్రునియొక్క, కరుణాకటాక్షమహిమాగత=దయాసహితమైనకటాక్షప్రభావము చేత సంప్రాప్తమయిన, దివ్యవివాహమందిరోదర = యోగ్యమయిన పెండ్లిచవికలోనున్న, కురువిందవేదియెడన్=కెంపులచేతఁగట్టఁబడిన యరుగునందు, తార్చిన=ఉంచిన, నిర్మలవజ్రపీఠిపైన్ = స్వచ్ఛమయిన వజ్రపుపీటమీఁద, ధరసుతనుంచి=గిరికాదేవిని కూర్చుండఁబెట్టి, నెన్నుదుటఁ దామ్రతరాక్షతముల్ఘటించి = నొసట నెఱ్ఱని యక్షతలుపెట్టి, పుణ్యభామినుల్=ముత్తయిదువలు, సకుంకుమపటీరరజంబునన్=కుంకుమపువ్వు గలిపిన శ్రీచందనచూర్ణముచేత, పెట్టిరినలుఁగులు=నలుఁగులిడిరి. వివాహమందిరమునందుఁ గురువిందవేదికయుం వజ్రపుఁబీఠము సమర్పఁబడెను. ఈపీఠమును హరికటాక్షమహిమాగతము దివ్యముగావున నింద్రకల్పితము. కుంకుమమిశ్రమగు పటీరరజమువలెఁ గురువిందవేదికపై వజ్రపీఠముండెనని స్వారస్యము.

సీ. కంకణగోమేధి♦కచ్ఛాయ దొలుదొల్తఁ దేటనూనియనిగ్గు ♦ నీటు నెఱపఁ
దరళవక్షోజము♦క్తాధార బడిబడి జాళువాబిందెల ♦ జాలుపఱుపఁ
గమనీయనిశ్వాస♦కందళం బెడనెడ సురటివట్రువగాలి♦సొగసు దెలుపఁ
దరుణారుణాంగుళీ♦కిరణము ల్పయిపయిఁ జెంగల్వరేకుల♦ చేరు చెరువ
తే. మున్నుగా నాత్మశృంగార♦ములె లతాంగి
మంగళస్నానవిభవసా♦మగ్రిఁ గూర్ప
గమ్మనఁ బిసాళివలపులు ♦ గ్రుమ్మరించు
కమ్మజవ్వాదిఁ దల యంటెఁ ♦ గలికి యొకతె. 109

కంకణగోమేధికచ్ఛాయ=హస్తకంకణములయందలి గోమేధికరత్నకాంతి, తొలుదొల్తన్= ముందుముందుగా, తేటనూనియనిగ్గునీటు నెఱపఁ = తేటగలనూనెయొక్క మెఱుపును జక్కఁ పఱుపఁగాను.

అనఁగా నూనెను గలుగఁజేయఁగాననుట. ఇక్కడ గోమేధికరత్నములు గోమూత్రచ్ఛాయగలవి గనుక నూనెతోఁ బోలికచేసినాఁడు. ఇందుకు ప్రమాణము-

క. 'గోమేధికమణినిర్మల, గోమూత్రచ్ఛాయఁ జాలఁ గొమరై మేనం
బ్రేమ ధరించిన విజయో, ద్దామంబుగ నలవిధుండు దత్ప్రీతుఁడగున్.'

అని రత్నపరీక్షయందుఁ జెప్పఁబడియున్నది.

తరళ=కదాచిచ్చలనముగల, వక్షోజముక్తాధార=కుచాగ్రములమీఁది ముత్యాలహారముయొక్క ధారారూపమయినకాంతివిశేషము, బడిబడి=వెంబడివెంబడిగా, జాళువాబిందెలజాలువఱుపన్=బంగారుబిందెలనుండిబయలుదేరునట్టి నీళ్ళజాలును గల్పింపఁగాను, బిగువుగుబ్బలమీఁదనున్న ముత్తెపుసరులు గొంచెము కొంచెము చలించుచుండెను. ముక్తాహారకాంతి ధారారూపముగను గబ్బిగుబ్బలకాంతిజాళువాబిందెలవలెను నుండెను. ముత్తెపుసరులు తరళములగుట గుబ్బలుకదలుటవలన, గుబ్బలుకదలుట నీరు పోయుతఱి బిందియ వంచుటవలె నుండెనని యాశయము.

కమనీయ=మనోహరమయిన, నిశ్వాసకందళంబు=నిట్టూర్పువలని మొలకవాయువు, ఎడనెడన్=అంతటంతట, సురటివట్రువగాలి సొగసుదెలుపన్ = వట్రువగానుండెడు విసనకఱ్ఱగాలియొక్క సొగసును గనుపఱుపఁగాను, తరుణ=కోమలములయిన, అరుణ=ఎఱ్ఱని, అంగుళీ=వ్రేళ్ళయొక్క, కిరణములు=కాంతులు, పయిపయిన్=మీఁదమీఁద, చెంగల్వరేకులచేరుచెరువన్=ఎఱ్ఱగలువరేకులందంతటను జేర్పఁగాను, నిశ్వాసములు కందళములుగావున నిశ్వాసమారుతము సురటిగాలివలెఁ దగుమాత్రముగా నుండెను. చిఱుగాడ్పు లెడతెగక వీవవు. అంతటంతట వీచునుగావున నెడనెడయని చెప్పఁబడెను. నిశ్వాసములు హృదయరంజకముగాఁ దగువిధముగాఁ బొలయుచున్నవిగావునఁ గమనీయములు.

మున్నుగాన్=ముందరగా, ఆత్మశృంగారములె=తనయొక్కసొగసులే, లతాంగిమంగళస్నానవిభవసామగ్రిఁ గూర్పన్=గిరికాదేవియొక్క వివాహప్రయుక్తమయిన మంగళస్నానమునకుఁ దగిన వైభవసామగ్రిని ఘటనపఱుచుచుండఁగా, గమ్మనబిసాళివలపులు గ్రమ్మరించు=గమ్ముమనునట్టులుగా దట్టమయిన వాసనలు వెదచల్లుచున్న, కమ్మజవ్వాదిన్=మనోహరమయిన జవ్వాదిచేత, కలికియొకతె=ఒకసుందరియైన చెలికత్తె, తలయంటెన్=గిరికాదేవికి శిరసంటెను.

స్నానోచితవ్యాపారములు నూనెయంటుట, నీరుపోయుట, సురటితో వీచుట, కెంగలువలు మేనఁజేర్చుట. ఇవి యన్నియు గోమేధిక కంకణములు, చలించుగుబ్బలపైనిగల ముత్తెపుసరులు, నిట్టూర్పులు రక్తాంగుళులు నిర్వహించెను. అందుచే యచ్చరమిన్న సౌందర్యమె గిరికకు మంగళస్నానమాచరించునటులుండెనని భావము. అలం-సమాధి.

ఉ. మంజులచంద్రకాంతమణిమజ్జనశాలవిశాలహేమపీ
ఠిం జపలేక్షణార్పితపటీరజలోక్షితకేశపాశ యై
కంజనిభాస్య వాల్చె నతిగౌరసుధానిధిమధ్యవీచికా
పుంజితఫేనయుక్త యయి పుట్టుసరోరుహగేహయో యనన్. 110

మంజుల=మనోహరమైన, చంద్రకాంతమణి = చంద్రకాంతమణిమయమైన, మజ్జనశాలన్=స్నానగృహమందు, విశాలహేమపీఠిన్ = విశాలమయిన బంగారుపీటమీఁద, చపలేక్షణా=స్త్రీల

చేత, అర్పిత=అర్పింపఁబడుచున్న, పటీరజల=చందనోదకముచేత, ఉక్షిత = తడుపఁబడిన, కేశపాశయై = తలవెండ్రుకలు గలదై, కంజనిభాస్య = పద్మమువంటి ముఖముగల గిరికాదేవి, పొల్చెన్ = ప్రకాశించెను. ఏలాగునననిన, అతిగౌర=మిక్కిలి తెల్లనైన, సుధానిధి=క్షీరసముద్రమందలి, మధ్యవీచికా=నడిమినీటితెరచేత, పుంజిత=నిండింపఁబడిన, ఫేన=నురుఁగుతోడ, యుక్తయయి=కూడుకొన్నదై, పుట్టు = ఉద్భవించుచున్న, సరోరుహగేహయోయనన్ = పద్మమేగృహముగాఁగల లక్ష్మీదేవియో యనునట్టులుగా, పొల్చెనని సంబంధము.

ఇందులోఁ జంద్రకాంతమణిమయమజ్జనశాలకును క్షీరసముద్రమునకును, హేమపీఠమునకును నాసనపద్మమునకును, చందనోదక మర్పించుచున్న స్త్రీకిని మధ్యవీచికకును, చందనోదకమునకును ఫేనమునకును, గిరికాదేవికిని లక్ష్మీదేవికిని నుపమానోపమేయభావము. లక్ష్మీకేశపాశము తుమ్మెదల బారువలె నల్లఁగనుండవలసినదేగాని క్షీరసముద్రడిండీరస్పర్శమువలనఁ దెల్లఁగానుండెను. అటులె చందనద్రవముచేఁ దడుపఁబడుటచేత గిరికాదేవికేశపాశముగూడఁ దెల్లఁగానుండెనని భావము.

మ. ప్రమదాభ్యున్నతిఁ జెక్కుదోయి చెమరింపం బూర్ణశృంగారతన్
సుమనోదంతులు శాతకుంభకలశీశుద్ధాంబువు ల్నింపఁగాఁ
గమలాభ్యంచితపాణి వొల్చె సురరాట్కారుణ్యలబ్ధానివా
ర్యమహైశ్వర్యకులాద్రిధుర్యగృహసాక్షాల్లక్ష్మిచందంబునన్. 111

ప్రమదాభ్యున్నతిన్=ఆనందాతిశయముచేతనని స్త్రీపరమైన యర్థము. మదాతిశయముచేతనని దేవతాపరమైన యర్థము. చెక్కుదోయిచెమరింపన్ = చెక్కులు చెమ్మటిల్లఁగానని యర్థము. గండస్థలములు మదజలార్ద్రములుగాఁగానని యర్థాంతరము. పూర్ణశృంగారతన్ = సంపూర్ణమయిన సింగారముతోనని యర్థము. సిందూరరేఖాశృంగారముతోనని యర్థాంతరము. ఇక్కడ శృంగారమనఁగా గజమండనమునకుఁ బేరు. సుమనోదంతులు = సుమనములనఁగాఁ బుష్పములు-అనఁగా మొల్లలు వానివంటిదంతములుగల స్త్రీలనియర్థము. దేవతాగజములని యర్థాంతరము. శాంతకుంభ=సువర్ణమయములైన, కలశీ = కుంభములచేత, శుద్ధాంబువుల్నింపఁగాన్ = నిర్మలోదకములు పైనిబోయుచుండఁగా, కమలాభ్యంచితపాణి = కమలములవలె మిక్కిలియు నొప్పుచున్న హస్తములుగల గిరికాదేవి, కమలాభ్యంచితపాణి = కమలములచేత నొప్పుచున్న హస్తములుగలదైన, సురరాట్ = దేవేంద్రునియొక్క, కారుణ్యా = అనుగ్రహముచేత, లబ్ధ = పొందఁబడిన, అనివార్య = అడ్డములేని, మహైశ్వర్య=మహావైభవముతోఁగూడిన, కులాద్రిధుర్యగృహ=కులపర్వతాధ్యక్షుఁ డయిన కోలాహలుని గృహమందలి, సాక్షాల్లక్ష్మిచందంబునన్ = ప్రత్యక్షలక్ష్మియో యన్నట్టులుగా, పొల్చెన్ = ప్రకాశించెను.

ఇక్కడ, శ్లో. 'లక్ష్మీర్దివ్యై ర్గజేంద్రై ర్మణిగణఖచితైః స్నాపితా హేమకుంభైః' అనెడు శ్లోకపాదార్థము ననుసంధింపవలయును. గజలక్ష్మీస్నాన మిట ననుసంధింపఁబడినది. లక్ష్మియు గిరిజయుఁ గమలాభ్యంచితపాణులు. ఇరువురిని స్నానము జేయించువారు సుమనోదంతులు. చెక్కుదోయి చెమరుట, శాతకుంభకలశీశుద్ధాంబువులునించుట నుభయత్ర (ఏనుగులు, అచ్చరలయెడ) సమానధర్మములు.

ఉ. మెలఁతలు శైలరాట్తనయ • మేదడి యొత్తఁగఁ గూర్చునిండువె
న్నెలపొరవంటిదువ్వలువ • నిద్దపుగుబ్బల వ్రాలుచుం గళం
బలముచుఁ జెక్కు లంటుచు ను • దంచితరాగరసార్ద్రమయ్యెఁ బూఁ
పల మెయి సోఁకిన న్విమల • భావము నిల్చె నెట్టిపట్టునన్. 112

ఈపద్యమందు గిరికాదేవిశరీరము తడిదుడుచుటకై స్త్రీలు సంఘటించిన వెలిపట్టుదుప్పటి యందు నాయకత్వారోపణముచేసి యర్థద్వయము గలుగఁ జెప్పినాఁడు. ఏలాగనిన,

మెలఁతలు=స్త్రీలు, శైలరాట్తనయ = గిరికాదేవియొక్క, మేదడియొత్తఁగన్ = శరీరపుకడి దుడుచుటకు, కూర్చు=సంఘటించిన,, నిండువెన్నెలపొరవంటిదువ్వలువ=సంపూర్ణమయిన వెన్నెలపొరవలెనున్న దువ్వలువ- అనఁగా వెల్లపట్టు దుప్పటి, నిద్దపుగుబ్బలవ్రాలుచున్ = నిగ్గుగలచన్నులమీఁదవ్రాలుచును, గళంబలముచున్ = కంఠము నప్పళించుచును, చెక్కులంటుచున్=కపోలస్పర్శము నేయుచును, ఈమూఁడు కార్యములు నాయకకృత్యములుగాను గ్రహింపవలయును. ఉదంచితరాగరసార్ద్రమయ్యెన్=ఒప్పుచున్నకుంకుమాదులయొక్క రక్తిమతోఁగూడిన జలముచేతఁ దడుపఁబడినదాయె నని యర్థము. అనురాగరసార్ద్రమయ్యెనని నాయకపరమయిన యర్థము. పూఁపల మెయి సోఁకినన్ = కౌమరుప్రాయముగల పడుచులయొక్క శరీరమునంటినమీఁదట, ఎట్టిపట్టునన్=ఎటువంటి వెలిపట్టువస్త్రమం దైనను, విమలభావము నిల్చె=ధావళ్యము నిల్చునా యనియర్థము. ఎట్టిపట్టునన్=ఏస్థలమం దైనను, విమలభావము నిల్చె=పరిశుద్ధత్వమునిల్చునాయని నాయకపరమయిన యర్థము. గుబ్బలపైనను గంఠమునందును జెక్కులందును గుంకుమపూఁవు పూయఁబడియుండుటచేఁ దెలిదువ్వలువను గెంజాయ నిండారెను. చెలికత్తెలు స్నానాంతరము గిరిజగుబ్బలను గంఠమును జెక్కులను దువ్వలువతోఁ దడియొత్తిరని భావము. గుబ్బలు కంఠము చెక్కులు కళాస్థానములు. ఉచితకాలములందు వానిని దాఁకిన రాగరసార్ద్రభావము జనులొందుదురు.

చ. కళుకుమెఱుంగుక్రొంబసిఁడి • కాంచిక యై కటి మించఁ జాలు నం
చులమణు లంఘ్రిభూష లయి • శోభిలఁ జాలుఁ జెఱుంగుముత్తియం
బులె యెద నుంపఁ జాలు సర • ములు పటవాసకసౌరభంబె మైఁ
గలపము నింపఁ జాలు ననఁ • గట్టిరి దివ్యదుకూల మింతికిన్. 113

కళుకనఁగాఁ దళుకు, ఇందుకుఁ బ్రయోగము. చ. 'కళుకులు దేరుగండములు గండము లాకశిఖండలక్ష్మికిన్' అనియున్నది. కళుకుమెఱుంగుక్రొంబసిఁడి = తళుకుగలకాంతితోఁగూడిన బంగారపుతగటు, కాంచికయై కటిమించఁజాలున్ = గంటలమొలనూలై పిఱుఁదులయం దతిశయింపఁజాలును, అంచులమణులు = అంచులయందుఁగూర్చిన రత్నములు, అంఘ్రిభూషలయి శోభిలఁజాలున్ = పాదభూషణములయి ప్రకాశింపఁజాలును, చెఱంగుముత్తియంబులె = పైఁటకొంగునందుఁ గూర్పఁబడిన ముత్యములే, ఎదనుంపఁజాలు సరముల్ = వక్షస్స్థలమందు హారములను గల్పింపఁజాలును, పటవాసక=వస్త్రములఁ బరిమళింపఁజేయు బుక్కాముయొక్క, సౌరభంబె=పరిమళమే, మైన్ = శరీరమందు, కలపమునింపఁజాలున్ = సుగంధద్రవ్యములుగూర్చిచేసిన మెయిపూఁతను గల్పింపఁజాలును, అనన్=ఈలాగనునట్టులుగా, దివ్యదుకూలము = దివ్యమయిన వెలిపట్టుచీరె, ఇంతికిన్ = గిరికాదేవికి, కట్టిరి = కట్టించిరి. గిరికకుఁగట్టినవలువ దివ్యముగావున దానిప్రభావ మనన్యమైనది. ఆచీరెనడుమ

మెఱుంగులు గ్రక్కుజలతారుపనితనములు గలవుగాన గట్టుకొన్నంత: మొలకుగంటలుగల యొడ్డాణము వలెను, కొనలందు మణులఁగూర్చియుంటచే బాదములకు రత్నభూషణములవలెను, జెఱంగులకు ముత్తెములుగూర్పఁబడియుంటచే గుబ్బలపయి ముక్తాహారముగను ఆపలువ తావిమేనికిఁ గలవమువలెనుండెను.

చ. తమతమతమ్ములం దిగిచి ♦ తన్ముఖలక్ష్మికిఁ ద్రిప్పరీతి ను
త్తమతమపుణ్యసింధువని♦త ల్బహుచిత్రదళంపుటారతుల్
క్రమమున నెత్త నయ్యచల♦కన్యక వచ్చె నమూల్యపద్మమా
ల్యమున నెసంగుచేదిపభు♦జాంతరకల్పవివాహవేదికిన్. 114

ఉత్తమతమ = అత్యంతశ్రేష్ఠముగలిగిన, పుణ్యసింధువనితల్ = గంగాయమునాది పుణ్యనదీకాంతలు, తమతమతమ్ములందిగిచి=తమతమయందుండెడు పద్మములను దీసి, తన్ముఖలక్ష్మికిఁ ద్రిప్పరీతిన్ =ఆగిరికాదేవిముఖసౌందర్యసంపత్తికి బడిమి ద్రిప్పినట్టులుగా, బహు=అనేకములయిన, చిత్ర=వింత వింతలైన, దళంపుటారతుల్ =ఱేకులుగల పద్మమయనీరాజనములను, క్రమముననెత్తన్ =వరుసవెంబడి సమర్పింపఁగా, అయ్యచలకన్యక=ఆగిరికాదేవి, అమూల్య = విలువలేని, పద్మమాల్యముననెసంగు = ఇంద్రుఁడిచ్చిన పద్మమాలికచేత నొప్పుచున్న, చేదిప=వసురాజుయొక్క, భుజాంతరకల్ప=వక్షస్థ్సల సమానమయిన-అనఁగానమూల్యపద్మమాలికాలంకృతమయిన, వివాహవేదికిన్ =పెండ్లియరుఁగుమీఁదికి, వచ్చెన్ = ఏతెంచెను.

ఇందు అమూల్యపద్మమాల్యముననెసంగు ననెడిపదము వక్షస్థ్సలమునకును వివాహవేదికిని సాధారణవిశేషణము. ఆరతులొసంగువారు పుణ్యనదీకాంతలు. వారొసంగునారతులు చిత్రమైనవి. తమ్మిదళము ఆరతిపళ్లెరము. విచ్చినకెందామరయందుంచినదీపము. దళపుటారతులు గిరికాముఖలక్ష్మికిఁ దమయందలితామరపూవులను దిగదుడిచివేయనటులుండెననిభావము. వసురాజు వక్షస్థ్సలమును వివాహవేదికయు నమూల్య పద్మరాగాలంకృతములె. అలం - ఉపమా - ఉత్ప్రేక్ష.

క. ఆకల్పలలామకములు, నాకల్పకదామకములు ♦ నపు డగసుత కా
ర్యాకల్ప కనిచె హరిసతి, యాకల్పవిభూతి గలుగ ♦ నాళీతతిచేన్. 115

ఆకల్పలలామకములున్ =అలంకారశ్రేష్ఠములును, ఆకల్పకదామకములున్ =ప్రసిద్ధకల్పప్రసూనమాలికలును, హరిసతి=ఇంద్రునిభార్యయయిన శచీదేవి, అపుడు=ఆసమయమందు, ఆర్యాకల్పకున్ = పార్వతీసమానురాలైన, అగసుతకున్ = గిరికాదేవికి, ఇక్కడ అగసుతయనెడి గిరికానామ మార్యాసామ్యమం దుపయుక్తమగుచున్నది. ఆకల్పవిభూతిగలుగన్ = కల్పావధికమయినయైశ్వర్యముగలుగు నట్టులుగా, ఆళీతతిచేన్ =సఖీసమూహముచేత, అనిచెన్ =పంపించెను. ఈపద్యము ద్విప్రాసముగలదిగాఁ జెప్పంబడియెను.

సీ. జవరాలినెఱివేణి♦జడవాహములమించఁ దడియార్చి ముడిచెఁ బై♦దలియొకర్తు
తరుణికిఁ బ్రొవ్విదతుమ్మె♦దలదాఁటుదాఁట సంపఁగిదంటచెరివెఁ గో♦మలియొకర్తు
చెలువ వేనలిచిమ్మ♦చీఁకటిగికురింపఁ జంద్రసూర్యులనుంచెఁ ♦ జామయోర్తు
మగువకొప్పునభంబుఁ ♦ దెగడ నిర్దోషంపుచుక్కచేఁబుఘటించె ♦ సుదతియోర్తు

తే. నెలఁతతుఱుము మహామహా•నీలరాశిఁ
బకపకహసింప మరకత•శకలకలిత
మృదులదూర్వాంకురములలోఁ• గదియఁ జేసెఁ
జకితసారంగశాబలో•చన యొకర్తు. 116

జవరాలినెఱివేణి=గిరికాదేవికేశబంధము, జడవాహములమించక = మేఘముల నతిక్రమించుకొఱకు, తడియార్చి ముడిచెఁ బైదలి యొకర్తు = ఒకచెలికత్తె తడిదుడిచి ముడిచెను, తడిలేకపోవుటయును ముడిగొనుటయును మేఘములకు సంభవింపవని భావము. తరుణిక్రొవ్వెద = గిరికాదేవికొప్పు, తుమ్మెదల దాఁటు దాఁటక=తుమ్మెద గుంపు నతిక్రమించుకొఱకై, సంపఁగిదండచెరివెఁ గోమలియొకర్తు = ఒకచెలికత్తియ సంపఁగిపూదండచుట్టెను, తుమ్మెదలకు సంపంగిపువ్వులయొక్క సాంగత్యము లేదనిభావము. చెలువవేనలి=గిరికాదేవికొప్పు, చిమ్మచీఁకటిఁగికురింపక = కాఱుచీఁకటిని వంచించుకొఱకు, చంద్రసూర్యులనుంచెఁ జామయొర్తు = ఒకచెలికత్తియ చంద్రసూర్యుల నునిచెనని యర్థము. చంద్రసూర్యరూపాభరణముల నుంచినదని భావము. చీఁకటి చంద్రసూర్యులురాఁగా విరిసిపోవునని భావము. చామయనెడుపదము శ్యామాశబ్దమునకుఁ దద్భవము.

మగువకొప్పు=గిరికాదేవికచభారము, నభంబు దెగడక = ఆకాశమును దిరస్కరించుకొఱకు, సుదతియొర్తు=ఒకచెలికత్తియ, నిర్దోషంపు చుక్కచేరు ఘటించెక=రాత్రియం దుదయింపని చుక్కచాలును ఘటించెనని యర్థము. ఆకాశమందు రాత్రి లేకపోయినచోఁ జుక్కలు గాన్పించవనిభావము. (ని. 'దోషా నక్తఞ్చరజనా' అని అ.) దృశ్యాదిదశవిధదోషరహితమయిన ముత్యాలచేఱును అని భావము.

నెలఁతతుఱుము=గిరికాదేవికొప్పు, మహామహానీలరాశిక=గొప్పలయినమహానీలములయొక్క సమూహము, పకపకహసింపక=పకపకనవ్వెడుకొఱకు - అనఁగా నపహాస్యముచేసెడుకొఱకు, చకితసారంగశాబలోచనయొకర్తు = భయపడినలేడిపిల్లకన్నులవంటి కన్నులుగల యొకచెలికత్తియ, మరకతశకలకలిత=మరకతపుపచ్చలయొక్క మొలకలవలె నొప్పుచున్న, మృదుల=కోమలములైన, దూర్వాంకురములక=లేఁతగఱికిపోఁచలను, లోఁగదియఁజేసెక=లోపల నడఁగియుండునట్టులుగా ముడిచెను- అనఁగా నంతర్లీనముచేసెనని యర్థము.

మహానీలములు'తృణము నంతర్లీనముగాఁ జేయవనుట. శుభార్థముగా దూర్వలను గొప్పునఁగూర్చినారనిభావము. మహానీలమనఁగా, (శ్లో. 'సింహళ స్యాకరో ద్భూతా మహానీలా స్తు తే స్మృతాః') ఇందుకు లక్షణము-

క. 'కప్పెసఁగువెన్న వెదిరికి, పుష్పారవన్నియకు సవతుబోలుననంగా
ముప్పాతికరంగులతో, నొప్పుమహానీల మది శుభోన్నతిఁజేయుక.

క. కసవుల నిసువులు గరమున, వెసనిడి నీలంబుమీఁద విడనూదుటయు
న్వెస నెగసిపోకనిలిచిన, వసుధఁ దృణగ్రాహి యనఁగ వర్ణనకెక్కుక.'

అని రత్నపరీక్షయందుఁ జెప్పంబడియున్నది.

సూర్యచంద్రులను భూషణవిశేషములను నెఱిలందుఁ బూర్వము దాల్చునాచారము గలదు. ఇటులనుటకు-

చ. తరణిశశాంకు లాభరణదంభమునన్ వదనాక్షికైతవాం
బురదసితోత్పలాగ్రమున ముద్దియ కుంతలదేశ మాక్రమిం
చి రాకఫలంబు గాననగుఁ జివ్వనుచుం బరరూపయుక్తి ని
బ్బరముగ నంతసాంతముగ బ్రహ్మయొనర్చిన సీమపొల్పగున్. సర్వకామదాపరిణయము.

మ. ఘనశృంగారరసోత్తరంగరుచిరం•గద్వేణికిం బాసికం
బున దండం బలుగట్ట గట్టి విలస•న్ముక్తాకలాపచ్ఛలం
బునం దూ మేర్పఁడ బెట్టి బోటి గిరిజా•భ్రూపుండ్రసౌభాగ్యము
ల్దనరం గస్తురిరేఖ దీర్చె నవకు•ల్యావైఖరి న్మించఁగన్. 117

ఘన=అధికమైన, శృంగారరస=శృంగారరసమనెడురసముచేత-అనఁగా జలముచేత, ఉత్తరంగ=సాంద్రమయిన, అని వేణీపరమయిన యర్థము. ఉన్నతతరంగములుగలదని నదీప్రవాహపరమైన యర్థము. రుచిరంగత్-రుచి=కాంతియనెడు మాధుర్యరుచిచేత, రంగత్=రంజితమయిన, వేణికిన్=జడయనెడు నదీప్రవాహమునకు, బాసికంబునన్=బాసికముచేత, దండన్=సమీపమందు, బలుగట్ట గట్టి=దృఢమైనకట్టగట్టి, విలసత్=ఒప్పుచున్న, ముక్తాకలాప=ముత్యాలబొట్టనెడి, ఛలంబునన్=మిష చేత, తూమేర్పడఁబెట్టి=తూముకట్టి,బోటి=చెలికత్తియ, గిరిజా=గిరికాదేవియొక్క, భ్రూ=కనుబొమ్మలనెడు,పుండ్ర=ఎఱుపుగలిసిననల్లచెఱకుయొక్క,సౌభాగ్యముల్దనరన్=సౌష్ఠవములొప్పునట్లుగా, ఇక్కడ భ్రూసౌందర్యంబును నిక్షుమాధుర్యంబును ననిగ్రహింపవలయును. పుండ్రమనఁగా నెఱుపుగలిసిన నల్ల చెఱకన్నందుకు-(శ్లో. 'ఇక్షుఃపీతఃపుండ్రకఃకృష్ణరక్తః కాంతారస్స్యచ్ఛ్వేతపీతస్తథైవ' అని యాకరము వినఁబడుచున్నది.) నవ=నూతనమయిన, కుల్యా=కాలువయొక్క, వైఖరిన్=రీతిచేత, మించఁగన్=అతిశయించునట్టులుగా, కస్తురిరేఖదీర్చెన్ = రేఖాకృతిగాఁ గస్తూరిబొట్టుదీర్చెను. ఇందులోఁ జెఱకునకు మంచినీళ్లు పారినందునఁ దీపిపుట్టును గనుక రుచిరంగద్వేణి యని చెప్పినాఁడు. అలం. రూపకము. అపహ్నుతి.

శా. శ్యామోజ్జృంభితతారకావరరుచిన్ • సంధించి యెంచు న్వసు
స్వామిన్ గన్గొనుచుం బ్రకామశరవ•ర్షస్ఫూర్తిఁ జెన్నొంది వి
శ్వామోదంబున మించు మంచుఁ జెలి నే•త్రాబ్జంబుల న్వశ్యల
క్ష్మీమూలం బగు గావు నించె నన నుం•చెం గజ్జలం బింతికిన్. 118

ఈపద్యములో నేత్రాబ్జంబులన్-అని చెప్పుటచేత నబ్జపరముగాను నేత్రపరముగాను నర్థద్వయము విచారింపవలయును. ఏలాగనిన,

శ్యామోజ్జృంభిత తారకా వరరుచిన్ సంధించి-శ్యామా=రాత్రియందు, ఉజ్జృంభిత=ప్రకాశమానుఁడైన, తారకావర=చంద్రునియొక్క, రుచిన్=ప్రీతితోడ, సంధించి=కూడుకొనియని యబ్జపరమైనయర్థము. (ని. 'శ్యామా స్యా చ్ఛారిబా నిశా' అని అ.) శ్యామ=నీలకాంతిచేత, ఉజ్జృంభిత=ప్రకాశమానమయిన, తారకా = కనీనికలయొక్క, వర=శ్రేష్ఠమయిన, రుచిన్=కాంతితోడ సం

ధించి యని నేత్రపరమైనభావము. ఎందుఁ = సకలదిక్కులయందును, వసుస్వామిన్గన్గొనుచుఁ = సూర్యునిఁజూచుచునని యర్థము. వసురాజునుగన్గొనుచునని భావము. ప్రకామశరవర్షస్ఫూర్తిఁజె న్నొందె-ప్రకామ=అధికమయిన, శరవర్షస్ఫూర్తిఁ=జలవర్షస్ఫూర్తిచేత, చెన్నొందె=సొంపు వహించి యని యర్థము. ఆధికమైన మన్మథబాణ వర్షస్ఫురణముచేతఁ జెన్నొందియని భావము. నిత్యామో దంబున మించుము=శాశ్వతమయిన పరిమళముచేత నతిశయింపుమని యర్థము. ఆనందముచేత నతిశ యింపుమనిభావము. అంచుఁ=అనిపలుకుచు, చెలి=చెలికత్తియ, ఇంతికిఁ=గిరికాదేవికి, నేత్రాబ్జం బులఁ=కమలములవంటి నేత్రములయందు, వశ్యలక్ష్మీమూలంబగు = అనఁగాఁ జంద్రసూర్యాదిమిత్రా మిత్రవశ్యసంపత్తికి మూలమయిన, కాపునించెననఁ = కావలిబొట్టుపెట్టినదో యన్నట్టులుగా నని యర్థము. వసురాజవశ్యసంపదమూలమని భావము. ఉంచెంగజ్జలంబు=కాటుకపెట్టెను. శరశబ్దమునకు- (ని. 'శరో దధ్యాద్యగ్రసారే బాణే కాణ్డే తృణాంతరే, శరంతునీరే' అని నానార్థరత్నమాల.) తామ రపూవులు చంద్రకాంతిని సహింపఁజాలవు. సూర్యుని దర్శింపఁగలవు. అధికమగు వర్షకాలమునఁ దావు ల గోలుపోవును. కనుదమ్ములు చంద్రకాంతిని దిలకింపఁగలవు. సూర్యకాంతిని సందర్శింపఁజాలవు. వర్ష కాలమున నామోదముగోలుపోవు. మిత్రులను మిత్రులుగాఁ జేసికొనుట కాదు. శత్రువులనుమిత్రులఁ జేసి కొనుట కర్తవ్యము. ఇందులకు వశ్యాంజనము బెట్టుకొనునటుల గిరిక కనులకుఁ గాటుకఁ బెట్టుకొనె నని భావము. అలం. శ్లేషము. ఉత్ప్రేక్ష.

మ. అతితీవ్రాశుగవృత్తిమై నతనుధ♦న్వాభోగసీమ న్గతా
గతము ల్సల్పి భ్రమించులోలతరవీ♦క్షాపాతపాంథాళికిఁ
శ్రుతికూపాంతసుధానిపానకము లై ♦ శోభిల్లునిత్యప్రభాం
చితవజ్రోపలకుండలంబులు ఘటిం♦చెఁ బోటి పూఁబోఁడికిన్. 119

అతితీవ్రాశుగవృత్తిమైఁ - ఆశుగశబ్దము బాణమందును వాయువందును వర్తించుచున్నది. (ని. 'ఆశుగౌ వాయు విశిఖౌ' అని అ.) అతితీవ్ర=అత్యంతతీక్ష్ణమయిన, ఆశుగవృత్తిమైఁ=బాణ వృత్తిచేతనని వీక్షాపరమయిన యర్థము. అతివేగముగల వాయువృత్తిచేతను-అనఁగా వడగాలి వేగము చేత నని పాంథపరమయిన యర్థము. అతనుధన్వాభోగసీమఁ - అతను=మన్మథునియొక్క, ధన్వా భోగసీమఁ = ధనుఃపరిపూర్ణత్వసీమయందునని వీక్షాపరమైన యర్థము. ఇక్కడ నుపమానమయిన మన్మథచాపముచేతనే యుపమేయమయిన భ్రూవల్లిని జెప్పినాఁడు. అతను=అధికమయిన, ధన్వాభోగ సీమఁ-ధన్వయనఁగా జాంగలదేశంబును గనుక మరుభూప్రదేశమందని పాంథపరమయినయర్థము. (ని. 'ధన్వజాఙ్గలదేశేస్యా ద్ధన్వ చాపే స్థలే పిచ' అని వి.) గతాగతముల్సల్పి భ్రమించు=రాకపో కలుచేయుచుఁ దిరుగుచుండెడు, లోలతరవీక్షాపాతపాంథాళికిఁ = లోలశబ్దము చలనమందును తృష్ణ గలవానియందును వర్తించుచున్నది. (ని. 'లోల శ్చలస తృష్ణయోః' అని వి.) లోలతర=మిక్కిలి చంచలములైన, వీక్షాపాత = దృష్టిపాతములనెడు, లోలతర=మిక్కిలి తృష్ణతోఁగూడిన, పాంథాళి కిఁ=పథికసమూహమునకు, శ్రుతికూపాంతసుధానిపానకములై-శ్రుతి=కర్ణములనెడు, కూప=బావుల యొక్క, అంత=సమీపమందలి, సుధానిపానకములయి = సుధయనఁగా సున్నమును నమృతమును, నిపానమనఁగా నీళ్ళకుఁ గట్టించిన ధర్మగాడియును జలాశయమును, (శ్లో. 'ఆహావస్తు నిపానం స్యా

దుపకూపజలాశయే' అని అ.) సున్నపుగచ్చుచేసిన నిపానములయి యని యర్థము. లేక యమృత జలాశయములనియును జెప్పవచ్చును. శోభిల్లు=ప్రకాశించుచున్న, నిత్యప్రభాంచిత=నిత్యమయిన కాంతిచేత నొప్పుచున్న, వజ్రోపలకుండలంబులు = వజ్రమణిమయములయినకమ్మలు, పూఁబోడికిన్=గిరికాదేవికి, బోటి=ఒకచెలికత్తియ, ఘటించెన్=సంఘటనముచేసెను-అనఁగాఁ జెవులఁబెట్టెననుట. కనుబొమ్మలు మరునివిండ్లు. ఇందుండివచ్చుములుకులు వీక్షాపాతములు. అవి తీవ్రములు, లోలతరములు. కడకంటిచూపులు కర్ణపర్యంతము ప్రసరించి యటనుండి మఱలుచున్నవి. అంతలో నాగకరాకపోకలు చేయుచున్నవి. ఇదియంతయు పెనుగాలిచే నలసినబాటసారి మరుభూమిలో నిటునటుతిరిగి జలాశయముజేరి నీరుద్రావి విశ్రమించినటులుండె నని భావము.

చూపులు శ్రవణసీమలను విశ్రమించుచున్నవనుటచే నపాంగములదైర్ఘ్యము కటాక్షములదైర్ఘ్యము సూచితము. చూపులు చెవివద్ద నాగుననుట సుప్రసిద్ధము.

తే-గీ. 'శ్రవణపుటకూపవినిపాతసాధ్వసమున, నిగిడి యవ్వలి కటుపోక నిల్చెఁ గాక
యధికచపలస్వభావంబు లైనయట్టి, దీనికన్నులు తలచుట్టు తిరిగి రావె.' శృంగారనై.ఆ. 3

శ్లో. 'శ్రుతేరపి పరం పారంగతే లోచనే.' భర్తృహరి.

మ. శ్రుతికూపామృతము న్వతంసకళికా♦ర్ణోయంత్రసంక్రాంతదీ
ధితిదండోజ్జ్వలవర్తులాభరణపా♦త్రి న్నించి తాటంకక
ల్పితకుల్యాముఖహీరసారకిరణో♦ద్భేదంబుపేర న్వెలా
ర్చి తటిద్దేహకు నవ్యపత్రలతికా♦శ్రీ నించి రాళీజనుల్. 120

శ్రుతికూపామృతమున్ = చెవియనెడు బావియందలి యుదకమును, వతంస = కర్ణపూరమైన, కళికా=పూమొగ్గయనెడు, అర్ణోయంత్ర = ఏతపుసిడియందు, సంక్రాంత = తగులుకొన్న, దీధితి=కాంతియనెడు, దండ=దండకాష్ఠముచేత, ఉజ్జ్వల = ప్రకాశించుచున్న, వర్తులాభరణ = రత్నపుబవిరయనెడు, పాత్రిన్=పాత్రయందు, నించి=నిండించి, తాటంక = కర్ణకుండలమనెడు, కల్పితకుల్యాముఖ = కుల్యాముఖమనఁగాఁ గాలువ మొదటనుండెడు నేతపుబానలో నీళ్ళు గ్రుమ్మరించెడు మోటతొట్టి గనుక కల్పింపఁబడిన కుల్యాముఖముయొక్క, హీరసారకిరణోద్భేదంబుపేరన్= వజ్రమణులయొక్క శ్రేష్ఠమయిన కిరణప్రసరణమనెడు మిషచేత, వెలార్చి=వెళ్ళఁబోసి, తటిద్దేహకున్ = మెఱుపుతీఁగెవంటి దేహముగల గిరికాదేవికి, ఆళీజనుల్=సఖీజనులు, నవ్య=నూతనమయిన, పత్రలతికా=మకరికాపత్రరచనలనెడు, పత్రలతికా = పత్రయుతములైన తీఁగెలయొక్క, శ్రీ=సమృద్ధిని, నించిరి=కలుగఁజేసిరి.

ఇందులో గిరికాదేవియొక్క కర్ణావతంసమయిన పూమొగ్గ నేతపుసిడిగాను రత్నపుబవిరను నేతపుబానగాను బవిరయొక్కకిరణమును దండకాష్ఠముగాను, ననఁగా నేతపుగడగాను వజ్రకుండలమును బానలో నీళ్ళు గ్రుమ్మరించెడుకాలువ మొదటితొట్టిగాను గుండలహారకిరణప్రసరణమును శ్రుతికూపోదకనిస్సరణముగాను బత్రరచనలను బత్రయుతలతలుగాను జెప్పినాఁడు. గిరికకు వజ్రమయములగు కర్ణభూషణములు, రత్నఖచితములగు బవిరలు నలంకరించిరనియుఁ జెక్కులమకరికాపత్రాతిరేఖలు చెవిపువ్వునలరించిరని భావము. చెవియందలంకారమ్ముగాఁ బూవునో పూమొగ్గనో యలంకరింతురు.

సీ. 'అవతంసకుసుమంబున౯ దున్న యెలదేటి రుతికించిదంచితశ్రుతులనీన.' మనుచరిత్రము.

చ. సురభికురంగనాభికఱ ♦ చొక్కపుఁగుంకుమఁ గప్పి కుంకుమ
స్ఫురితమహోష్మఁ గప్పురపు♦సోఁకుల మాన్పి కప్పురంపుచ
ల్మిరి మెఱుఁగుంజవాది నెడ♦లించి కదంబము గూర్చి నెచ్చెలు
ల్దరుణి కలంది రన్నియును ♦ దత్తనువాసనఁ బూవుగట్టుచున్. 121

సురభి=మనోహరమయిన పరిమళముగల, కురంగనాభి=కస్తూరియొక్క, కఱ=డాగు, చొక్కపుఁగుంకుమకప్పి=శ్రేష్ఠమయిన కుంకుమపువ్వుచేతఁ గప్పికపఱచి, కుంకుమస్ఫురితమహోష్మ౯=ఆకుంకుమపువ్వునందు స్ఫురించుచున్న యెక్కువకాకను, కప్పురపుసోఁకులమాన్పి = కర్పూరమేళనముచేత నివారించి, కప్పురంపుచల్మిరి = ఆకర్పూరమందలిశైత్యమును, మెఱుఁగుంజవాదినెడలించి=నిగ్గుగల జవ్వాదిచేతఁబోఁగొట్టి, కదంబముగూర్చి=కలపమేర్పఱిచి, అన్నియును దత్తనువాసనఁబూవుకట్టుచు౯ = ఈచెప్పఁబడిన పరిమళద్రవ్యము లన్నిటిని నాగిరికాదేవియొక్క శరీరపరిమళముచేత వాసనాయుక్తములనుగాఁ జేయుచును, నెచ్చెలులు = చెలికత్తియలు, తరుణికి౯ = గిరికాదేవికి, అలందిరి = పూసిరి. గిరిక మేన సుగంధవస్తువు లందవలయునుగానఁ దొలుతఁ గస్తురిబూసిరి. అది నల్లగనుండుటచేఁ గుంకుమచే నాకఱఁ గప్పిరి. కుంకుమపూవు వేఁడిగాననావేఁడిని బచ్చకప్పురపుఁబూతతో నివారించిరి. పచ్చకప్పురము చలువగాన నాచలువ జవాదితో నుపశమింపఁజేసిరి. అన్నియుఁ దొలంగించి కలప మలందిరి. సుగంధవస్తువులకంటె నాయికమేనే సుగంధముగా నుండెననిభావము.

సీ. అధరమాధుర్యభి♦క్షాగతం బగుసుధాఘుటిక నా ముంగరఁ ♦ గుదురుపఱచి
సమయానుగుణమహో♦చ్చగతగ్రహాళినాఁ జనుదోయి నవరత్న♦సరముపైచి
కిసలకోరకభృంగ♦కీరవర్గంబు నా దోర్వల్లి బలువన్నె♦తొడవు లునిచి
ఘనకుచాంగజదుర్గ♦కల్పితాధరవప్రపరిధి నా నొడ్డాణ ♦ మిఁరవుకొల్పి
తే. యనఘజఘనానుషంగ మ♦ష్టాంగయోగ
కలన నివి గాంచె నన వజ్ర♦కాంచిక లిడి
యంగజితరతిబిరుదాంక ♦ మంఘ్రిఁ గట్టు
కరణి మణిమయమకరనూ♦పురము దొడిగి. 122

అధరమాధుర్యభిక్షాగతంబగు=అధరోష్ఠమందలి తియ్యఁదనముయొక్క భిక్షమడుగుకొనునిమిత్తమయివచ్చిన, సుధాఘుటికనా౯=అమృతగుళికయో యన్నట్టులుగా, ముంగరఁగుదురుపఱచి=ముక్కుముత్తియమును గుదురుగాఁబెట్టి, సమయానుగుణమహోచ్చగతమనెడువిశేషము గ్రహాళికిని నవరత్నసరమునకును నుభయత్ర చెప్పవలయును. ఏలాగనిన,

సమయానుగుణ=వివాహసమయమున కనురూపముగా, మహోచ్చగత=పరమోచ్చను బొందిన, అని గ్రహాళిపరముగాఁ జెప్పవలెను. సమ్యక్=లెస్సయిన, అయ=శుభావహకర్మ దేనియందో యది సమయము. ని. 'అయ శ్శుభావహో విధిః' అని అ. అటువంటియు, అనుగుణ=గుణమనఁగా సూత్రము గనుక ననుగతమయినసూత్రము దేనికిఁ గలదో యది యనుగుణము, అటువంటియుం, మహోచ్చగత=సుచరూపమయిన యున్నతస్థానమును బొందినదియుం నని నవరత్నసరముపరముగాఁ జెప్పవల

యును. అనఁగా సమయానుగుణ మహోచ్చగతగ్రహపంక్తియో యన్నట్టులుగా సమయానుగుణ మహోచ్చగత నవరత్నసరమును జనుదోయియందు వైచి యని యర్థము. నవరత్నములను వర్ణసామ్య నిమిత్తముచేత నవగ్రహములనుగా నుత్ప్రేక్షించినాఁడు. గ్రహపరమయిన యర్థమహోచ్చగతులన్నం దుకు సూర్యాదిగ్రహములకు మేషాదిరాసు లుచ్చస్థానములు. మేషాదిరాసులయొక్క ౧౦-౩-౨౮-౧౫-౫-౨౭-౨౦ భాగములు పరమోచ్చభాగములు. ఉచ్చస్థానమున కేడవది నీచస్థానము. ఇందుకు, శ్లో. 'అజవృషభమృగాఙ్గనాకులీరాఝషవణిజౌచ దివాకరాదితుఙ్గాః, దశశిఖిమనుయుక్తిథీంద్రియాంశై స్త్రినవకవింశతిభ స్తద స్తనీచః' అని జ్యోతిశ్శాస్త్రము.

కిసల=ఎఱ్ఱని చిగుళ్లయొక్కయు, (ని. 'కిసాలయం కిసలయం కిసాలం కిసలం కిసమ్' అని ద్విరూపకోశము.) కోరక=తెల్లని పూమొగ్గలయొక్కయు, భృంగ=నల్లని తుమ్మెదలయొక్కయు, కీర=పచ్చనిచిలుకలయొక్కయు, వర్గంబునన్=సమూహమో యన్నట్టులుగా, దోర్వల్లిన్=బాహువనెడు తీఁగెయందు, పలువన్నెతొడవులునిచి=రక్త శ్వేత నీల హరిద్వర్ణములు గల పద్మరాగ మౌక్తిక హరి నీల మరకతమణిమయము లైనభూషణములు పెట్టి, ఘన=గొప్పలయిన, కుచ=స్తనములనెడు, అంగజ దుర్గ=మన్మథగిరిదుర్గములకు, కల్పిత=రచింపఁబడిన, అధరవప్ర=క్రిందికోటయొక్క, పరిధినన్=వలయమోయన్నట్టులుగా, ఒడ్డాణమిరవుకొల్పి=ఒడ్డాణముపెట్టి,

అనఘ=రమ్యమయిన, జఘన=కటిపురోభాగముయొక్క, అనుషంగము=సాంగత్యమును, ఇవి=ఈవజ్రకాంచికలు, అష్టాంగయోగకలనన్=(యమ నియ మాసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యాన ధారణా సమాధిరూపాష్టాంగయోగములచేత నని యర్థము.) అష్టధారాయోగముచేత ననిభావము. వజ్రమున కష్టధారలుండును.

ఇందుకుఁ బ్రమాణము-

క. 'రూపొందవి చులకనై మెఱుఁ, గేపారఁగ వానిధార లెనిమిది యగుచున్
దా పొల్చు మూలలాఱై, చూపట్టుట వజ్రమణికి శుద్ధగుణంబుల్.'

అని రత్నపరీక్షయందుఁ జెప్పఁబడియున్నది.

కాంచెననన్=పొందినవోయన్నట్టులుగా, వజ్రకాంచికలిడి=వజ్రమణిమయములైన మొలనూళ్లుపెట్టి, అంగ=శరీరసౌందర్యముచేత, జిత=జయింపఁబడిన, రతి=రతీదేవియొక్క, (ని. 'అథో రతిః, రతీ కామప్రియాప్రీత్యోః' అని నానార్థరత్నమాల.) బిరుదాంకము=మకరాకారమగు బిరుదు టెక్కెమును, అంఘ్రిఁగట్టుకరణిన్=కాలను గట్టినట్టులుగాను, మణిమయమకరనూపురము దొడిగి=రత్నమయమయిన మకరాకారమంజీరమును దొడిగినవారై, (ని. 'పాదాఙ్గదం తులాకోటి ర్మఞ్జీరో నూపురోస్త్రియామ్' అని యమరము.)

గిరికాదేవి నాసికకు ముంగరయు, గుబ్బలపై రత్నహారములు, బాహువులకు రత్నఖచిత వివిధభూషణములు, నడుమునకు నొడ్డాణము, కటిపురోభాగమునందు వజ్రకాంచికలును, పాదములకు మణినూపురములు చెలికత్తె లలంకరించిరని భావము. అలం. ఉత్ప్రేక్ష.

చ. చెలువలు బాల నిట్లు గయిసేయఁగఁ బైదలి యోర్తు రాగ మం
ఘ్రుల నలరించి చూచితిరె కొమ్మలు తమ్ము లినాంఘ్రిరాగకం

దళిం దగు ధాత్రి నీయరిది♦తమ్ము లినోజ్జ్వలమౌళిరంజనా
కలనము లంచుఁ బల్కఁ జెలి♦కన్నుల నించుక నించె రాగమున్. 123

చెలువలు=చెలికత్తియలు, బాలనిట్లుగయి సేయఁగన్=గిరికాదేవి నీప్రకారము శృంగారింపఁగా, పైదలియొర్తు=వారిలో నొకచెలికత్తె, రాగమంఘ్రులనలరించి=లాక్షారసమును పాదములయందలంకరించి, చూచితిరె కొమ్మలు=చెలులందఱును జూచినారటే, ధాత్రిన్=భూమియందు, (ని. 'ఉపమాతా చ ధాత్రీ స్యా ద్భూమి రామలకీ చ సా' అని నానార్థరత్నమాల.) తమ్ములు=ప్రసిద్ధములయిన కమలములు, ఇనాంఘ్రిరాగకందళిందగు-ఇనశబ్దము పతియందును సూర్యునియందును వర్తించుచున్నది. (ని. 'ఇన స్సూర్యే నృపే పత్యౌ' అని వి.) ఇన=పతియొక్క, అంఘ్రి=పాదములయొక్క, రాగకందళిన్=రక్తిమాంకురములచేత, తగున్=ఒప్పుచుండును, అని యర్థము. అనఁగాఁ దద్రంజితములనుట. సూర్యకిరణజన్య రక్తాంకురములచేతఁ దగు నని భావము. ఈయరిదితమ్ములు=అనఁగా నీగిరికాచరణరూపము లయిన విచిత్రకమలములు. ఇక్కడఁ జరణములను నిగరణముచేసి తమ్ములని చెప్పినాఁడు. ఇన=పతియొక్క, ఉజ్జ్వల=ప్రకాశమానమగుచున్న, మౌళి=కిరీటముయొక్క, (ని. 'మౌళిస్సంయుతకేశేషు చూడాయాం మకుటే ద్వయోః' అని నానార్థరత్నమాల.) రంజన=రంజనమందు-అనఁగాఁ గిరీటమును ప్రకాశింపఁజేయుటయందు, ఆకలనములు=సమర్థములయినవి, అంచున్=ఈలాగని, పల్కన్=వచింపఁగా-అనఁగా సురతబంధవిశేషమందుఁగాని ప్రణయకోపనివారణార్థముగాని, పెనిమిటిచేత శిరసావహింపఁ బడుచున్నవని తాత్పర్యము. చెలి=గిరికాదేవి, కన్నులన్=నేత్రములయందు, రాగమున్=రక్తిమను, ఇంచుకనించెన్=కొంచెముగా నింపెను. అనఁగాఁ జెలికత్తెపలికిననర్మోక్తికి లజ్జాయుక్తమయిన కోపముచేత నించుకంత కన్నెఱ్ఱఁజేసెననుట.

ఈపద్యమున ళలకభేదప్రాసము. దీనికి లక్షణము-

తే. 'రేఫమునకుఁ బైనుండు మాతృకకుఁ బెద్ద
ళాయభేదావ్యయప్రాస మై యెసంగు.' అని యప్పకవీయము.

కమలములు ఇనాంఘ్రిరాగకందళమున రాగవంతములగుచుండును. గిరికాపాదము లరిదితమ్ములు. కావున ఇనోజ్జ్వలమౌళిరంజనాకలనములు. అనఁగా గిరికాపాదములు సురతవిశేషములందును, ప్రణయకోపమునందును వసురాజుచే శిరసావహింపఁబడనున్నవని భావము. గిరిక కనులందు రాగము (అనురాగము కెంజాయ) నించుట యించుక చెలికారముకొలఁది కోపము సూచించుటకు.

శా. కాంత ల్శుక్తిమతీనగేంద్రభవము♦క్తారత్నరాజిం దదే
కాంతస్వచ్ఛశరీరయుక్తి ననుజా♦కల్యాణవేళార్హస
త్కాంతు ల్నించిరి గాక కానియెడ లో♦కశ్లాఘ్యసౌభాగ్యవ
త్కాంతాలోకమణి న్మణీశతములం ♦ గై సేయఁగా ముద్ధలే. 124

కాంతల్=గిరికాదేవిచెలికత్తెలు, శుక్తిమతీ=శుక్తిమతీనదివల్లను, నగేంద్ర=కోలాహలునివల్లను, భవ=సంభవించిన, ముక్తా=ముత్యములయొక్కయు, రత్న=పద్మరాగాదిమణులయొక్కయు, రాజిన్=సమూహమందు, ఇక్కడ శుక్తిమతీసంభవములయినవి ముత్యములనియుఁ గోలాహలపర్వతసంభవము లయినవి పద్మరాగమణులనియును గ్రమాలంకారము. తత్=ఆగిరికాదేవియొక్క, ఏకాంతస్వచ్ఛ=

నితాంతనిర్మలమైన, శరీర=దేహముయొక్క, యుక్తిః=యోగముచేత, అనుజా=తోఁడఁబుట్టినదైన గిరికాదేవియొక్క, కల్యాణవేళా=వివాహసమయమునకు, అర్హా=తగిన, సత్కాంతులే=శ్రేష్ఠమయిన కాంతులను, నించిరిగాక=నిండఁజేసిరే కాక, ఇక్కడ శుక్తిమతీనగేంద్రభవయనెడు ముక్తారత్న రాజియొక్క విశేషణము గిరికాదేవికి రత్నానుజత్వమును సమర్థించుచున్నది. అనఁగా రత్నముల కనుజయైన గిరికాదేవియొక్క వివాహసమయమునకుఁ దగునట్టులుగా గిరికాదేహకాంతులచేత నలంకరించినారనుట. కానియెడల్=అనఁగా గిరికాదేహకాంతులచేతనే రత్నముల నలంకరించుట గాక పోయినట్టయిన, లోకశ్లాఘ్య=లోకములవారిచేతఁ గొనియాడఁదగిన, సౌభాగ్యవత్=సౌందర్యముగలిగిన, కాంతాలోక=మనోహరప్రకాశము గలిగిన, మణిః=రత్నమును అని యర్థము. (ని. 'ఆలోకో దర్శనద్యుతీ' అని అ.) కాంతాజనరత్నమని భావము. మణీశకలములన్=రత్నసమూహములచేత, కైసేయఁగాన్=అలంకరించుటకును, ముగ్ధలే=తెలియనివారా-అనఁగాఁ గారనుట. (ని. 'అథ త్రిషు, ముగ్ధ స్సౌమ్యే నవే మూఢే' అని నానార్థరత్నమాల.)

గిరికాదేవికి నలంకరించినరత్నాభరణము లామెయొక్కదేహకాంతిచేతఁ బ్రకాశించుచున్నవే కాని యాభరణము లామెదేహమును ప్రకాశింపఁజేయఁజాలక యుండెనని ఫలితార్థము. ముత్యములు శుక్తిమతీసంజనితములు, రత్నములు కోలాహలసంజాతములు. ఈరెంటికిని గిరిక యనుజ. తోఁబుట్టువు వివాహము నగ్రజాతులలంకరించుకొనవలయును గదా! గిరికాదేవియొక్క యేకాంతస్వచ్ఛతను సంపర్కమున ముక్తారత్నము లలంకృతములయ్యెను. సోదరీవివాహమున నగ్రజాతములగు ముక్తారత్నముల నలంకరించుట జరిగినది. మనోహరాకారములకు భూషణము లలంకరణములు కాఁజాలవు. ఇటులనుటకు-

శ్లో. 'సరసిజమనువిద్ధం శైవలేనాపి రమ్యం, మలినమపి హిమాంశో ర్లక్ష్మ లక్ష్మీం తనోతి
ఇయ మధికమనోజ్ఞా వల్కలేనాపి రమ్యా, కిమివహి మధురాణాం మాకృతి ర్మండనానాం.'
అభిజ్ఞానశాకుంతలము.

శా. నానాభూషణరత్నజాలములలో◆నం బొల్చునాత్మీయకా
యానుచ్ఛాయలచేఁ గరం బలరె మే◆నాపత్యసత్పుత్త్రి నె
మ్మేను ల్దాల్చి శుభాధిదేవతలు సం◆ప్రీతిం బ్రవేష్టింప ని
త్యానందంబున నంద మొందునరవిం◆దావాసచందంబునన్. 125

నానాభూషణరత్నజాలములలోనన్ = సకలాభరణములయందలి రత్నసమూహములలోపల, పొల్చు=ప్రకాశించుచున్న, ఆత్మీయకాయానుచ్ఛాయలచేన్=నిజశరీరప్రతిబింబములచేత, మేనా=మేనకాదేవియొక్క, అపత్య=కుమారుఁడయినకోలాహలునియొక్క, సత్పుత్త్రి=కుమారికయైన గిరికాదేవి, కరంబలరెన్=మిగుల నొప్పుచుండెను. ఏలాగనిన, నెమ్మేనుల్దాల్చి=చక్కని శరీరములు ధరించి, శుభాధిదేవతలు=మంగళాధిదేవతలు, సంప్రీతిం బ్రవేష్టింపన్=అధికప్రేమచేతఁ బరివేష్టించికొలువఁగా, నిత్యానందంబున నందమొందు=నిత్యమయిన యానందముచేత నొప్పుచుండెడు, అరవిందావాసచందంబునన్=లక్ష్మీదేవివలె, కరంబలరె నని సంబంధము.

ఇందులో భూషణ రత్నసమూహములయందుఁ బ్రతిబింబించిన గిరికాదేహములను శుభాధిదేవతలనుగాను గిరికాదేవిని లక్ష్మీదేవినిగాను జెప్పినాఁడు. అలం. ఉపమ.

క. ఐదువగాణీలశుభా, పాదనగేయములపేర ♦ భారతి సతిపై
మోదమున ధవళవర్ణ, ప్రాదుర్భావంబు నెఱపెఁ ♦ బలుమఱు నచటన్. 126

ఐదువగాణీల=గాణీశబ్దము గాయనీశబ్దతద్భవము. ముత్తైదువలయిన గాయనులయొక్క, శుభాపాదనగేయములపేరన్=మంగళగానములనెడు వ్యాజముచేత, భారతి=సరస్వతీదేవి-అనఁగా గేయరూపభారతియనుట. సతిపై మోదమునన్=గిరికాదేవిమీఁదిసంతోషముచేత, ధవళవర్ణప్రాదుర్భావంబు నెఱపెఁ బలుమఱు నచటన్=మాటిమాటికి నివాసస్థలమందు శుభస్వరూపప్రాదుర్భావమును ఘటింపఁజేసెననియును ధవళాక్షరప్రాదుర్భావమును ఘటింపఁజేసె నని యర్థము.

ధవళవర్ణములనఁగాఁ బెండ్లిపాటలయొక్క రాగములని భావము. పెండ్లిలో ధవళముపాడుట ప్రకటము. భారతీశబ్దమునకు, (ని. 'బ్రాహ్మీ తు భారతీ భాషా గీర్వాగ్వాణీ సరస్వతీ' అనియమరము.) ధవళములు వివాహములలోఁ బాడుట ప్రసిద్ధమనుటకు గ్రంథాంతరములందు సైత మాధారములు గలవు.

క. ఎడలేదు లగనమనుచున్, బడిబడి పిలువంగ నపుడు బలువాయిదముల్
గడలుకొనంగా నచ్చర, పడఁతుల ధవళములు పెండ్లిపాటలు చెలఁగెన్.

యయాతిచరిత్రము. ఆ. ౪.

ఆశ్వాసాంతము.

శా. సంధాభార్గవ భార్గవహ్నినయన ♦ జ్వాలాభశౌర్యప్రభా
సంధానాదర నాదరక్తిరసిక ♦ శ్యామామనోవారణా
స్కంధారోహణ రోహణప్రతిమదో ♦ శ్చారుక్ష్మాపాలసం
బంధాపాదన పాదనమ్రహయరా ♦ డ్భాస్వత్సపాదాంకనా. 127

సంధా=ప్రతిజ్ఞయందు, భార్గవ=పరశురాముఁడవైనవాఁడా, ని. 'సంధా ప్రతిజ్ఞా మర్యాదా' అని అ. భార్గ=భర్గసంబంధియైన-అనఁగా శివసంబంధియైన, వహ్నినయన = అగ్నిమయనేత్రముయొక్క, జ్వాలా=మంటలయొక్క, ఆభ=ప్రకాశమువంటిప్రకాశముగల, శౌర్యప్రభా=ప్రతాపప్రకాశముయొక్క, సంధాన=కూర్పుటయందలి, ఆదర = ఆసక్తిగలవాఁడా-అనఁగాఁ బ్రతాపశీలుఁడనుట. నాదరక్తిరసిక=గానమందలి రసికత్వముగల, శ్యామా = యౌవనమధ్యస్థలైన స్త్రీలయొక్క, మనః=మనస్సనెడు, వారణస్కంధ = గజస్కంధమందలి, ఆరోహణ = ఎక్కుటగలవాఁడా యనియర్థము. గానరసికత్వముగల శ్యామలయొక్క, అనఁగా యౌవనమధ్యస్థలైన ప్రేంకణపుతీఁగలయొక్క, మనః = మనస్సనెడు, అవారణస్కంధ = అవార్యప్రకాండమందలి, ఆరోహణ = ఎక్కుటగలవాఁడాయనియును నర్థాంతరము. ప్రేంకణమునకు గానము దోహదక్రియయని ప్రసిద్ధము. శ్యామయనఁగా నప్రసూతాంగనయును బ్రేంకణమును, స్కంధమనఁగా భుజమూలంబును వృక్షప్రకాండంబును, అనఁగా వృక్షమూలము మొదలుకొని కొమ్మలపర్యంతముండెడు మ్రాఁకు, ని. 'స్కంధః ప్రకాండే కాయేచ బాహుమూల సమూహయోః' అని అ. రోహణప్రతిమ=రత్నప్రదానమందు రోహణాచలసమానమయిన, దోః=దక్షిణబాహువుచేత, చారు=ఒప్పుచున్న, క్ష్మాపాల=రాజులతోడ, సంబంధాపాదన=సంబంధముచేసినవాఁడా, పాదనమ్ర=పాదప్రణతుఁడయిన, హయరాట్=అశ్వపతియొక్క, భాస్వత్=అన్వర్థభాసురమయిన, సపాదాంకనా=సపాదుఁడనెడు నామము

గలవాఁడా, అని యాశ్వాసాంతమందుఁ గృతిపతిసంబోధనము. ఈపద్యము ముక్తపదగ్రస్తము గలదిగాఁ జెప్పంబడియెను.

క. ఖల్యాభయకర హయఖుర, హల్యాహతజన్యజాంగ•లాంగణఫలసా
కల్యావహ బహుదిగ్జయ, కల్యాణ నిజాముగుప్త•కల్యాణహరా. 128

ఖల్యా=ఖలసమూహమునకు,భయకర=భయంకరుఁడవైనవాఁడా, ని. 'ఖలానాం ఖలినీ ఖల్యా' అని అ. హయ=గుఱ్ఱములయొక్క, ఖుర=గిట్టలనెడు, హల్యా=హలసమూహముచేత, ని. 'హల్యా హలానాం' అని అ. ఆహత=దున్నఁబడిన, జన్య = యుద్ధమనెడు, జాంగలాంగణ=ని. 'జాంగలో జల నిర్ముక్తదేశే' అని వి. జలనిర్ముక్తప్రదేశమునకు, ఫలసాకల్యావహా=సస్యసమగ్రతాసంపాదకుఁడ వైన వాఁడా యని యర్థము. ఫలమనఁగా బాణాగ్రమని భావము. ని. 'సస్య బాణాగ్రయోః ఫలమ్' అని వి. నిర్జలప్రదేశమందు సంపూర్ణఫలప్రాప్తిచేసినాఁడని యద్భుతార్థము. బహుదిగ్జయకల్యాణ=అనేక దిగ్జయరూపమయినమంగళముగలవాఁడా, నిజామ=నిజాముచేత, గుప్త=రక్షింపఁబడిన,కల్యాణ=కల్యాణ పట్టణమును, హరా=సాధించినవాఁడా యనియర్థము. నిజామునిచేత దాఁచఁబడిన సువర్ణమును హరించినవాఁడా యని యర్థము.

తరల. ద్రమిళలాటకురువరాట•దహాళఖోటకుంభినీ
రమణజూటతటకిరీట•రత్నపాటలప్రభా
కమలఝాట కలితకూట•కనకవాటసంభ్రమ
ద్భ్రమితఘోట బెడదకోట•పటుకవాటపాటనా. 129

ద్రమిళలాటకురువరాటదహాళఖోట=ద్రమిళ లాట కురు వరాట దహాళ ఖోట అనెడు దేశములయొక్క, కుంభినీరమణ=రాజులయొక్క, జూటతట=శిరస్సులయందలి, కిరీట=కిరీటములయందలి, రత్న=మణులయొక్క, పాటలప్రభా = తెలుపుగలిసిన యెఱుపుచాయలనెడు, కమలఝాట= పద్మవనముగలవాఁడా, కలిత=ఉన్నతములయిన, కూట=శిఖరములుగల, కనక=కనకగిరియొక్క, ఇక్కడ, ని. 'నామైకదేశే నామగ్రహణమ్' అనియున్నది గనుకఁ గనకశబ్దముచేతఁ గనకగిరి చెప్పఁ బడినది. వాట=మార్గమందు, ని. 'వాటో మార్గే వృతిస్థానే' అని మేదిని. సంభ్రమత్=ధాటీవేగము చేత, భ్రమిత=భ్రమించుచున్న, ఘోట=గుఱ్ఱములుగలవాఁడా, బెడదకోట=బెడదకోటయనెడు పట్టణముయొక్క, పటు=సమర్థములయిన, కవాట = పెద్ద దరవాజాతలుపులయొక్క, పాటనా = భేదనముగలవాఁడా అనఁగా బెడదకోటపట్టణపు తలుపులు బ్రద్దలుచేసి లోపలికిఁబోయి జయించినాఁడనుట, ఈవృత్తమునకు న భ స న జ ర గణము లుండవలయును. పదునొకండవ యక్షరము యతి స్థానము.

గద్యము. ఇది శ్రీమద్రామచంద్రచరణారవిందవందనపవననందనప్రసాదసమాసాదిత సంస్కృతాంధ్రభాషాసామ్రాజ్య సర్వంకషచతుర్విధకవితానిర్వాహకసాహిత్య రసపోషణరామరాజభూషణప్రణీతం బయినవసుచరిత్రం బనుమహాప్రబంధంబునందుఁ బంచమాశ్వాసము.

ఇది శ్రీమదాత్రేయకులకలశాంభోనిధిసంపూర్ణసోమసోమాభిధానమంత్రివరపౌత్త్రుండును, సోమసుతసిద్ధేశ్వరమంత్రీశ్వరపుత్త్రుండును శ్రీమత్పార్వతీరాజేశ్వరవరప్రసాదసమాసాదితహృద్యానవద్య నిఖిలవిద్యావిశారదుండును నగుసోమకవిచేత విరచితం బయినవిద్వజ్జనరంజనీనామకపూర్వవ్యాఖ్యానమందలివిశేషవిషయసహితంబుగాఁ బరిష్కృతంబయి యొప్పారుప్రతిపదటీకారూపంబగు వసుచరిత్రనామకాంధ్రకావ్యరత్నవ్యాఖ్యానమునందుఁ బంచమాశ్వాసము.

శ్రీ ర స్తు.

వసుచరిత్రము సవ్యాఖ్యానము

షష్ఠాశ్వాసము.

శ్రీ రామచరణవందన
పారీణ యపారరణకృ • పారీణధను
ర్నారాచ నవ్యదీవ్య
ద్వీరాచరితాంక గేయ • తిరుమలరాయా. 1

శ్రీరామ=శ్రీరామస్వామియొక్క, చరణవందన=పాదప్రణామమునందు, పారీణ=తుదముట్టినవాఁడా, అపార=అమితమైన, రణ=యుద్ధమందు, కృపారీణ=దయారహితమైన, (ని. 'స్యన్నంరీణమ్' అని అ.) ధనుర్నారాచ=ధనుర్బాణములు గలవాఁడా, నవ్య = నూతనమైన, దీవ్యత్ = ప్రకాశమానమయిన, వీరాచరితాంక=శౌర్యాంకములచేత, గేయ=స్తోత్రముచేయఁ దగినవాఁడా, తిరుమలరాయా = తిరుమలరాయనామధేయుఁడవయినరాజాగ్రణీ, అని యాశ్వాసాదియందుఁ గృతిపతినిగూర్చి సంబోధనము.

తే. అవధరింపుము శౌనకా • ద్యఖిలసన్ము
నీంద్రులకు రోమహర్షణి • యిట్లు వలుకు
నితర దిక్పాలకాంతలు • నిగురుఁబోఁడి
కర్హభూషావిశేషంబు • లనిపి రపుడు. 2

అవధరింపుము=చిత్తగింపుము, శౌనకాద్యఖిలసన్మునీంద్రులకున్ = శౌనకుఁడు మొదలుగాఁగల సమస్తమునిశ్రేష్ఠులకు, రోమహర్షణి యిట్లు పలుకున్=రోమహర్షణపుత్రుఁడయినసూతుఁ డీవక్ష్యమాణ ప్రకారముగాఁ బలుకుచున్నాఁడు. ఏమనియనిన, ఇతరదిక్పాలకాంతలున్=మున్ను చెప్పినశచీదేవిగాక తక్కినదిక్పాలకులభార్యలును, ఇగురుఁబోఁడికిన్=గిరికాదేవికి, అర్హభూషావిశేషంబు లనిపి రపుడు= తగినయలంకారవిశేషముల నావివాహసమయమునందుఁ బంపిరి.

శా. పౌలోమీప్రభృతు ల్కుమారి నిటు సం • భావింపఁగా మున్న ది
క్పాలు ర్భూభు నలంకరించి శుభల • గ్నంబుం బ్రతీక్షింపఁగా
నాలోఁ దాను దదర్హవస్మణివిశే • షాన్వేషసన్నద్ధుఁడో
నా లోకాప్తుఁడు చేరె రాగమహిమ • న్రత్నాకరప్రాంతమున్. 3

పౌలోమీప్రభృతుల్=శచీదేవిమొదలయినవారు, కుమారిన్=గిరికాదేవిని, ఇటుసంభావింపఁగాన్=ఈప్రకారము సన్మానముసేయఁగాను, మున్ను=ఇంతకుముందుగా, దిక్పాలుర్=దిక్పాలకులు,

భూషు నలంకరించి=వసురాజును శృంగారించి, శుభలగ్నంబుం బ్రతీక్షింపఁగాన్=వివాహసుముహూర్తమున కెదురుచూచుచుండఁగాను, ఆలోఁదాను=ఆసమయమందుఁదానును, తత్=ఆగిరికావసురాజులకు, అర్హ=తగిన, సన్మణివిశేష=శ్రేష్ఠమయిన మణివిశేషములయొక్క, అన్వేష=వెదకుటకు, సన్నద్ధుఁడో నాన్=యత్నపడినవాఁడో యన్నట్టులుగా, లోకాప్తుఁడు=లోకబాంధవుఁడయినసూర్యుఁడు, రాగమహిమన్=ప్రేమాతిశయముచేత ననియర్థము. రక్తిమాతిశయముచేత ననిభావము. రత్నాకరప్రాంతమున్ = రత్నములకు స్థానమయిన పశ్చిమసముద్రముయొక్కసమీపమును, చేరెన్=చేరినవాఁడాయెను, అనఁగా సూర్యాస్తమయమాయె ననుట.

ఇందులో లోకాప్తుఁడనెడుపదంబును రత్నాకరమనెడుపదంబును సాభిప్రాయములు. దిక్పాలురు, అన్నచోట దిక్పాలశబ్దము లకారాంతముగనుక, శ్లో. 'లాంతాత్తురశాతయోః క్రమేణ స్తః.' న. అనెడుసూత్రముచేత బహువచనమునకుఁ బ్రథమా రువర్ణకము వచ్చినది. 'క్వచిద్రేఫగస్యస్యాదుతో లోపః ప్రయోగతః' అనెడు నథర్వణవచనమువలన దిక్పాలురు అనెడిశబ్దమందలి రేఫమువీఁది యుకారమునకు లోపమువచ్చినది. పౌలోమీప్రభృతులు దిక్పాలపత్నులు. పత్నులు నాయికను భర్తలగు ఇంద్రప్రభృతులు వసురాజు నలంకరించిరి. ఇందఱిన్నివిధముల సత్కరించినపుడు లోకాప్తుఁడు గూడ లోకేశ్వరుని సత్కరింపవలయును. సత్కరింపఁదగిన దర్హమణులతోడను గావున వెదకఁదగిన చోటు రత్నాకరము. అలం. ఉత్ప్రేక్ష.

మ. వసుసమ్రాడ్గిరికాకరగ్రహమహా•వ్యాలోకనానందసాం
ద్రసురేంద్రప్రమదాశ్రయం బగునభః•ప్రాసాదదేశంబునన్
ఘుసృణాలేప మొనర్చి ధూప మిడి ము•గ్గు ల్వెట్టిరో నాఁ గరం
బెసఁగెన్ సంజయు నిర్లుఁ దారకలు భూ•యిష్ఠప్రకాశంబునన్. 4

వసుసమ్రాట్=వసురాజుయొక్కయు, గిరికా = గిరికాదేవియొక్కయు, కరగ్రహమహ= పాణిగ్రహణమహోత్సవముయొక్క, వ్యాలోకన = విశేషదర్శనమందలి, ఆనందసాంద్ర = ఆనందముచేతఁ బూర్ణీభవించిన, సురేంద్రప్రమదా=ఇంద్రునిభార్యయైన శచీదేవికి, ఆశ్రయంబగు=స్థానమైయున్న, నభః=ఆకాశమనెడు, ప్రాసాదదేశంబునన్=మేడయందు, ఘుసృణాలేపమొనర్చి=కుంకుమపూఁతపూసి, ధూపమిడి=కృష్ణాగరుధూపమిచ్చి, ముగ్గుల్వెట్టిరో నాన్ = ముత్యాలముగ్గులు తీర్చినారో యనునట్టులుగా, సంజయున్=సంధ్యారాగంబును, ఇర్లున్=చీఁకటులును, తారకలు = నక్షత్రములును, భూయిష్ఠప్రకాశంబునన్ = అతిశయప్రకాశముచేత, కరంబెసఁగెన్=మిగులనొప్పుచుండెను.

ఇక్కడ సంధ్యారాగమును గుంకుమపూఁతగాను జీఁకట్లను ధూపధూమములుగాను, నక్షత్రములను ముత్యపుముగ్గులుగాను నుత్ప్రేక్షించి చెప్పినాఁడు.

గిరికావసురాజుల వివాహము వేలుపుటింతులకు సంతోషకారణము. కాన వారు ఆకాశహర్మ్యములందుండి క్రీడావిశేషములను దిలకింపసాగిరి. గృహాలంకరణము కుంకుమపూవుతోనలుకుట. ఇది సంజకావి. ధూపము చీఁకటులు. ముగ్గులు నక్షత్రసముదాయము. అలం. ఉత్ప్రేక్ష.

ఉ. ఒప్పుననంతసౌధమున • నుండి తదుత్సవచిత్రసంపదల్
ముప్పదిమూఁడుకోట్లసుర•ముఖ్యులపట్టపుదేవు లందఱుం

దప్పక చూడఁగా నిడిన • దట్టపుసోరనగండ్లు నా దెస
ల్గప్పురుచిప్రరోహములఁ • గానఁగ నయ్యె నపారతారకల్. 5

ఒప్పు = ప్రకాశించుచున్న, అనంతసౌధముననుండి = ఆకాశమనెడి మేడలోపలనుండి, తదుత్సవచిత్రసంపదలు = ఆవివాహమహోత్సవముయొక్క విచిత్రవైభవములను, ముప్పదిమూఁడుకోట్లసురముఖ్యులపట్టపుదేవులందఱున్ = ముప్పదిమూఁడుకోట్లదేవతాశ్రేష్ఠులయొక్క భార్యలందఱును, తప్పకచూడఁగా నిడిన = తప్పకచూచెదుకొఱ కేర్పఱచిన, దట్టపుసోరనగండ్లునాన్ = సాంద్రగవాక్షములో యన్నట్లుగా, అపారతారకలు=మితములేని నక్షత్రములు, దెసల్గప్పు=దిక్కుల నాచ్ఛాదించుచున్న, రుచిప్రరోహములన్ = ప్రభాంకురములచేత, కానఁగనయ్యెన్ = చూడ నొప్పెను.

చుక్కలపుడె తలసూపుటచే వానికాంతు లంకురములు. అయినను ప్రకాశాతిశయముగా నుండెను అపారములుగావున. వివాహోత్సవము చిత్రసంపదలతో నిండారునది. తిలకించువారు ముప్పదిమూఁడుకోటుల వేలుపులపట్టపురాణులు. కావున విశాలసౌధము కావలయును. కాననే యనంతసౌధము. పట్టపుదేవు లవరోధకాంతలు కావున మఱుఁగుననుండి చూడఁదగినవారు. అట్టిచో గవాక్షములైన నెదటివారికిఁ గనుపింతురు. కావున సోరణగండ్లు ఉచితము. సోరణగండ్లను తెఱలకును గోడలకును నవరోధస్త్రీలు వింతలుచూడ నేర్పఱచు చిన్నరంధ్రములు. ఇవి పెక్కులున్నగాని చూడవీలుండదు. ఇటు లనే యర్థము చెప్పనగునుగాని గవాక్షము లనఁదగదు.

తే-గీ. మలయమారుత మేతెంచు తలిరుటాకు, గములసందులు సోరణగండ్లుగాఁగ.
భానుమతీపరిణయము.

సీ. పరులదృష్టికి నగోచరమగు సంవృతస్థలినిల్చి రాణివాసపుజనంబు
చూచునట్టుగఁ జేసి. ప్రభావతీప్రద్యుమ్నము. అ. ౪.

ఇటుల రాణివాసపుజనులు చూచునట్లు చేసినవియే సోరణగండ్లు.

ఉ. ఉన్నతవైజయంతవల • యోపరిభాగము చేరి చేదిభూ
భృన్నగరీమహోత్సవము • పెంపఖిలంబును నిక్కి చూచు వేఁ
గన్నులవేల్పురాణిముఖ • కంజము పైపయిఁ దోఁచు రేఖ రే
గన్నియ తేని మేను తొలు • గట్టుతుదం బొదలెం గ్రమంబునన్. 6

ఉన్నత=పొడవైన, వైజయంతవలయ = వట్రువగానుండునట్టి యింద్రునిమేడయొక్క, ని. 'స్యాత్ప్రాసాదో వైజయంతః' అని అ. ఉపరిభాగముచేరి = ఊర్ధ్వప్రదేశమందుఁ బ్రవేశించి, చేదిభూభృత్ = చేదిదేశాధిపతియైనవసురాజుయొక్క, నగరీ = పట్టణమందలి, మహోత్సవముపెంపు = మహత్తరమయినవివాహమహోత్సవసమృద్ధిని, అఖిలంబును నిక్కిచూచు = సకలమును దలయెత్తిచూచుచున్న, వేఁగన్నులవేల్పురాణి = సహస్రాక్షుఁడయినయింద్రునిభార్యయొక్క - అనఁగా శచీదేవియొక్క, ముఖకంజము = పద్మమువంటిముఖము, పైపయిఁదోఁచురేఖ = మీఁదమీఁదఁ గనుపించుచున్నదో యన్నట్టులుగా, రేగన్నియతేనిమేను = నిశానాథుఁడయిన చంద్రునియొక్క బింబము, తొలుగట్టుతుదన్ = పూర్వశైలాగ్రమందు, క్రమంబునన్=వెంబడివెంబడిగా, పొదలెన్=ప్రకాశించెను.

చ. సరసిరుహారి యప్పు డిలఁ • జందనసేకము దిక్తటంబులం
బరమసుధానులేపము నభంబునఁ బాండువితానలక్ష్మియుక్
నిరుపమకౌముదీరుచుల • నించుచు సారె నలంకరించె నా
సురకులసార్వభౌమహిత • శోభనవేళ నజాండగోళమున్. 7

సరసిరుహారి = చంద్రుఁడు, అప్పుడు = ఆసమయమందు, ఇలన్ = భూమియందు, చందనసేకము = తెల్లనిశ్రీచందనముచేతఁ దడుపుటను, దిక్తటంబులన్ = దిక్కులయొక్క పార్శ్వములయందు, పరమసుధానులేపము = యోగ్యమైనసున్నపుపూఁతను, నభంబునన్ = ఆకాశమందు, పాండువితానలక్ష్మియున్ = తెల్లనిమేలుకట్టుయొక్క-అనఁగాఁ జాందినీయొక్క-శోభను, నిరుపమకౌముదీరుచులన్ = ఉపమానరహితమైన వెన్నెలయొక్క శుభ్రకాంతులచేత, నించుచున్ = నిండించుచు, అజాండగోళమున్ = బ్రహ్మాండకుహరమును, ఆ = అట్టి, సురకులసార్వభౌమ = దేవేంద్రునకు, హిత = ఆప్తుఁడైనవసురాజుయొక్క, శోభనవేళన్ = వివాహసమయమందు, అలంకరించెన్ = శృంగారించెను. చంద్రుఁడు జరుగనున్నయింద్రహితుఁడగు వసురాజువివాహమునకు బ్రహ్మాండము నలంకరించెను. చంద్రకిరణములు భూమినిచందనపుగలయంపిని చల్లినట్లు, ఆకసమును జాందినిగట్టినట్లు దిక్కులను సున్నముగొట్టినట్లు నలంకరించెను. కౌముదీరుచి నిరుపమముగావున బ్రహ్మాండము నిటుల నొనర్పఁగలిగెను. అలం. ఉత్ప్రేక్ష.

చ. అతినికటంబు లగ్న మని • యాంగిరసుం డపు డెచ్చరింప దై
వతవిభుఁ డాదరోక్తిఁ బిలు • వ న్నలువంకలఁ బుణ్యభామినీ
కృతశుభగేయము ల్మగధ • కీర్తనవైభవము ల్చెలంగఁగా
సితకరి నెక్కి యొప్పెఁ బతి • శీతనగోజ్జ్వలశంకరాకృతిన్. 8

అతినికటంబులగ్నమని = లగ్నము మిక్కిలి సమీపించినదని, అంగిరసుండపుడెచ్చరింపన్ = బృహస్పతి యప్పు డెచ్చరికసేయఁగా, దైవతవిభుఁడు = దేవేంద్రుఁడు, ఆదరోక్తిఁబిలువన్ = గారవింపుమాటలచేతఁ బిలువఁగాను, నలువంకలన్ = నాలుగుదిక్కులను, పుణ్యభామినీకృతశుభగేయములు = పుణ్యాంగనలచేతఁ జేయఁబడుచున్న పెండ్లిపాటలును, మగధకీర్తనవైభవములు = మాగధులు చేయునట్టి గానముతోఁగూడిన కైవారములయొక్క వైభవమును, చెలంగఁగాన్ = ఒప్పుచుండఁగాను, పతి = వసురాజు, సితకరినెక్కి = వెల్లయేనుఁగునెక్కి, శీతనగోజ్జ్వలశంకరాకృతిన్ = హిమవత్పర్వతముమీఁదఁ బ్రకాశించు సాంబమూర్తివలె, ఒప్పెన్ = చూడనొప్పెను. సితకరిదేవేంద్రదత్తము. ఈయంశము క్రిందివచనములోవ్యక్తపఱుపఁబడినది. మంచుకొండపలెఁదెలియేనుఁగును శంకరునివలె వసురాజు నుండెను. అలం. ఉపమ.

వ. ఇవ్విధంబున నవ్వసుంధరాధురంధరుండు పురందరసింధురస్కంధాధిరూఢుండై పాండురద్వీపరాజోపరిక్రీడనోల్లాసి యగుసింధుజావిలాసియో యన ననంతమణిమాలికామహితమహాభోగాతపత్రసహస్రంబులనడుమ విలసిల్లుచు నతితుములతమధిమీమికాతమ్మటభేరికాపటహాతుత్తుంభికాదివాదిత్ర గంభీరఘోషసంరంభంబు కుంభినీకబళనారంభ జృంభమాణ జంభారిపురమురవరవంబు

పై అవఱవంబోలె హాటకగిరికూటకటకవాటికాపాటనాటోపంబు వాటింప, నిబిడతరవిద్యోతమాననూతనకేతనప్రకాండదండాఘాతకాతరత్వంబున ధరాతలంబునకు డిగినజ్యోతిర్జాతంబుకరణి గణనాతీతగంధతైలదీపితకరదీపికా నికాయంబులు వెలుంగ, సమగ్రతరసామ్రాణికధూపధూమంబులజాడలను జడిగొన్నగొడుగులనీడలను గెరలి తెరలెత్తునిరులం దెరలింప ననేకరూపంబులం దీపించుతమోరిపుత్రయం బనం జిత్రయంత్రకారసంధానితలీలాగ్నియంత్రచంద్రసూర్యజ్యోతులమరిచిఘట్టంబులు దట్టంబులై నెట్టనం బట్టపగలు గావింప, నాత్మీయసామ్రాజ్యలక్ష్మీసకాశంబున ననిందితస్థైర్యవిద్యాపరిచయంబు పచరింప నవతరించినక్రొమ్మించుదీవియగుంపునింపు వెలయం గలయ వెదకికొన వచ్చినతదీయవిరహాపాండురం బగునంబుదంబుడంబు విడంబించుచుం, గంబుకంఠీకదంబంబు పయిం బట్టినయుల్లాభంబు పశ్యల్లోచనవల్లభం బై మెఱయం బాకశాసనశాసనంబునం బరిణయోచిత దివ్యవస్తుసంభారసంభావనంబునకు నై విశ్వంభరావలయంబుం జెందినమందారవల్లికలయందంబునం గొంద ఱిందువదనలు చిత్రజాంబూనదాంబరఫలకుసుమాదిమంగళద్రవ్యంబులు పూని కురంగట నడువ, జగత్త్రయజేగీయమానస్థైర్యాసమానవసుమానవనాథచిత్తంబు శైలజాయత్తంబుగా సమకట్టి గాసింబెట్టిన జగజెట్టినెఱజో దని బిరుదు వక్కాణించి చెఱకువిలుకానికోదండదండంబులం బూదండలు గట్టి యగ్గించుతదీయవిజయేందిరలచందంబున మఱికొంద ఱిందీవరాక్షులు పుష్పమాలికాలంకృతపుండ్రేక్షుకాండంబులు పూని పురోభాగంబున నడ తేరం, గందర్పకోటిసౌందర్యశాలి యగునితనికామనీయకంబు భవదీయలోకాలోకనీయకుమారబృందంబునందు నెందేనియుం గంటిరే యని దివిజభుజగరాజరాజీవగంధులకుం దెలుపు పోలుపున లాస్యప్రవీణకమలాస్య లభినయముఖంబుగాం గరకిసలయంబులు సాచి మెలపు సూప, వైవాహికముహూర్తసారప్రతీక్షాపరమహర్షులు పరమహర్షులై పర్వానుపర్వసుపర్వపాతితపారిజాతపరాగపాళికాదుర్లక్ష్యం బగునంతరిక్షంబువలన సమక్షంబునకు నాకర్షించి దాక్షాయణీచక్రంబుకై వడి నవక్రచక్రడోలాయంత్రంబులం దిరుగుమెఱుంగుబోండ్లతండంబు శాణభ్రమన్మదనబాణభ్రమం బొనరింప, నెడనెడం బన్నినయపరంజికురుంజులపై రంజిలుచు మృదంగదింధిమిధ్వానంబులకు నాడుయంత్రపాంచాలికా సముదయంబు విమలమణివిమానమండలంబున నుండి గొండ్లిం బరిఢవించు తెఱగంటి తెఱపల తెఱంగు నంగీకరింప, వర్ణనీయవారవరవర్ణినీవారవారణదుర్లభయానవైభవంబు వాసవావాసవామలోచనావర్గంబులకు వసుధాపదన్యాసవైధుర్యంబు సంపాదింపం, బల్యంకికాదివాహనంబులు డిగ్గి పాదచారంబుల నడుచుపట్టాభిషిక్తుల పద్మరాగ

కిరీటపాటలప్రభాపటలంబులు పవనసఖశిఖాముఖంబులకు మలినసరణి సవరింప, సమస్తజనసముచిత మార్గమర్యాదానుశాసనసముద్దండదండధరసంభ్రమంబులు సమవర్తికి సమధికశ్యామిక సమకూర్పఁ బ్రబలతమస్ఫారదురహంకార వీరభటకృపాణికాచాకచక్యంబులు రాత్రించరకరాళకరవాల కాళిమంబులు మూలకుం జొనుప, బహుళసితదంతిఘారాటకోటీసమాటీకనిర్వేలసర్వతో ముఖవాహినీశ్వరసంసేవ్యమానరసాధినాథ సన్నాహంబులు వారిధిస్వామికి వదలనిజడస్థితి యొసంగఁ, బరిమిళితఘనసారగంధసారపరిమిళితకస్తూరికాసా రంబుల వసంతమాడుసామంతబాంధవావళి గంధవహుని కపారతారళ్యం బు వెనుప, గంభీరబిరుదగాథాపఠనపరాయణపాఠకపరంపరలకు నెడనెడ హితపురోహితామాత్యజనం బొసంగునసంఖ్యాతధనసంఘాతంబున ధనదున కమందమందాక్షభావంబు సంఘటింపఁ, బ్రచండతరనటనప్రకాండతాండవ పాండిత్యంబులు ప్రాచీననటునినెమ్మేనఁ బాండిమంబు నిండింప, నిట్లాశాపతు లకు నాశాసనీయంబును నహివల్లభులకు నతిదుర్లభంబును సిద్ధుల కననుభూత సిద్ధంబును సాధ్యుల కసాధ్యంబును చారణులకు నవిచారణీయంబును య తులకు ననతిలక్షితంబును నైనయనన్యసామాన్యమహావిభవంబునం గోలా హలపురంబుఁ జేరం జనుసమయంబున. 9

ఇవ్విధంబునన్=ఈచెప్పఁబడినప్రకారముగా, అవ్వసుంధరాధురంధరుండు=భూభారవహుఁడయినయావసురాజు, పురందరసింధురస్కంధారూఢుండయి=ఇంద్రగజమయినయైరావతముయొక్క మెడమీఁద నెక్కినవాఁడయి, పాండురద్వీపరాజ = శ్వేతద్వీపరాజముయొక్క, ఉపరి = ఊర్ధ్వభాగమందలి, క్రీడన = విహరించుటయందు, ఉల్లాసియగు = ఉల్లాసముగలవాఁడయిన, సింధుజావిలాసియోయనన్ = లక్ష్మీకాంతుఁడోయన్నట్లు – అనఁగా నైరావతారూఢుఁడైన వసురాజు శ్వేతద్వీపవాసియైన లక్ష్మీకాంతుఁడో యన్నట్లుండెననుట. ఇక్కడ వసుంధరాధురంధరుండు విష్ణుదేవుఁడును సింధుజావిలాసి వసురాజును నగుదురుగనుక స్వారస్యము గ్రహింపవలయును. అనంతమణిమాలికామహితమహాభోగాతపత్రసహస్రంబునడుమ విలసిల్లుచున్–అనంత = అసంఖ్యములయిన, మణిమాలికా = రత్నమాలికలచేత, మహిత = ఒప్పుచున్న, మహాభోగ=అతివిస్తారమయిన, ఆతపత్ర=వెల్లగొడుగులయొక్క, సహస్రంబు=సమూహముయొక్క, నడుమన్ = మధ్యప్రదేశమందు, విలసిల్లుచున్ = ప్రకాశించుచును, అని రాజపరమయిన యర్థము. అనంత=శేషునియొక్క, మణిమాలికామహిత = రత్నశ్రేణులచేత నొప్పుచున్న, మహాభోగాతపత్ర = ఆతపత్రములవంటి – అనఁగా వెల్లగొడుగులవంటి మహత్తరములయిన భోగములయొక్క, అనఁగాఁ బడగలయొక్క, సహస్రంబునడుమ విలసిల్లుచునని విష్ణుపరమయిన యర్థము. రాజులు ధరించుగొడుగులు తెల్లనివలువలతో సువర్ణదండములతో నలరారుచుండును.

“నిచితంతుమాంసపత్త్రైః, కృకవాకుమయూరసారసానాం
దాకూలేనన వేనతు, సమగ్రతశ్చాదితంశుక్లం.
ముక్తాఫలై రుపచితం, ప్రలంబమాలావిలం స్ఫటికమూలం

షడ్ఢస్తశుద్ధహైమం నవపర్వనగైకదండంచ.
దండార్థవిస్తృతంతత్, సమవృత్తం రత్నభూషితముదగ్రం
నృపతేస్తదాతపత్త్రం, కళ్యాణకరం విజయదంచ.” బృహత్సంహిత.

అతితుములతమ = మిక్కిలి సంకులమగుచున్న, ఢమామికాతమ్మట భేరికాపటహాతుత్తుంభికా= ఢమామికా తమ్మట భేరికా పటహాతుత్తుంభికా, అనునివి, ఆది=మొదలుగాఁగల, వాదిత్ర=చతుర్విధ వాద్యములయొక్క,(ని.'చతుర్విధమిదంవాద్యం వాదిత్రాతోద్యనామకమ్' అని అ.) గంభీర=మంద్రమైన, ఘోష=ధ్వనియొక్క, సంరంభంబు=విజృంభణము, కుంభినీకబళన = భూమిని మ్రింగివేయుటయొక్క, ఆరంభ=ప్రయత్నమందు, జృంభమాణ=విజృంభించుచున్న, జంభారిపుర=స్వర్గపురమందలి, మురవ=మద్దెళ్ళయొక్క, రవంబుపైన్=ధ్వనిమీఁది, అవఅవంబోలెన్=కొఅకొఅచేతవలె - అనఁగా నసూయచేతఁబలె, హాటకగిరి=మేరుపర్వతముయొక్క, కూట=శృంగములయొక్కయు, కటక=సానువులయొక్కయు, వాటికా=శ్రేణియొక్క, పాటన=భేదనమందలి, ఆటోపంబువాటింపన్=విజృంభణము గనుపఱుపఁగాను అనియర్థము. అనఁగా వివాహసమయమున స్వర్గమందును భూమియందును వాద్యధ్వనులు చెలఁగుచుండఁగా స్వర్గమందలి వాద్యధ్వనులు కుంభినీకబళన సంరంభమునుఁ జూపఁగా నే వానిమీఁది యసూయచేతవలె భూమియందలి వాద్యధ్వనులు దేవతాస్థానమయిన మేరుగిరిశిఖరముల యొక్కయుఁ జరులయొక్కయు వాటికను భేదించెనని తాత్పర్యము. అనఁగా వాద్యధ్వనులు మేరువు భేదిల్లునట్టులుగాఁ జెలఁగుచుండెననుట.

నిబిడతర = మిక్కిలి దట్టమగునట్టులుగా, విద్యోతమాన = ప్రకాశించుచున్న, నూతన = నవీనములైన, కేతనప్రకాండ=శ్రేష్ఠములయిన టెక్కెములయొక్క, దండాఘాత=కఱ్ఱదెబ్బలవలని, కాతరత్వంబునన్ = భయముచే, ధరాతలంబునకుడిగిన = భూప్రదేశమునకుదిగిన, జ్యోతిర్జాతంబు కరణిన్ = నక్షత్రసమూహమోయన్నట్లు, గణనాతీత=లెక్కకెక్కువైన, గంధతైలదీపిత=చందన తైలముచేత వెలిఁగింపఁబడిన, కరదీపికానికాయంబులు = చేదివ్వెలయొక్క-అనఁగా దివిటీలయొక్క సమూహమును, వెలుంగన్=ప్రకాశింపఁగాను, టెక్కెములు మిగులఁ బొడవైనవి. మిగులదట్టముగాఁ బ్రకాశించునవి. కాంతులచేఁ బరాభవించుటయేగాక దండాఘాతములచేఁగూడఁ డెక్కెములు చుక్కలను బరాభవించెను. కావుననే కాతరములయ్యెను. కరదీపికలు చుక్కలవలె నసంఖ్యాకములుగను సన్నతములుగను నుండెనని భావము.

సమగ్రతర=సంపూర్ణములయిన, సామ్రాణికధూప = సాంబ్రాణిదూపములయొక్క, ధూమంబుల=పొగలయొక్క,జాడలను=మార్గములచేతను, జడిగొన్న గొడుగులనీడలన్=ముసురుకొన్న శ్వేతచ్ఛత్రములయొక్క నీడలచేతను, కెరలి=విజృంభించి, తెరలెత్తు = తెరలుగట్టుచున్న, ఇరులన్=చీఁకటులను, తెరలింపన్=పోఁగొట్టెడుకొఱకు, అనేకరూపంబులదీపించు=బహురూపములచేతఁ బ్రకాశించు చిత్రితమోరిపుత్రయంబనన్=చంద్రసూర్యాగ్నులో యన్నట్లుగాను,(ని.'చంద్రాగ్న్యర్కాస్తమోనుదః' అని అ.) చిత్రయంత్రకార=బాణాకారీలచేత, సంధానిత=ఘటింపఁబడిన, లీలాగ్నియంత్ర=వేడుకకొఱకైన కొమ్ముసల్లాలు మొదలయినవానియొక్కయు, చంద్రసూర్యజ్యోతుల = చంద్రజ్యోతుల యొక్కయు సూర్యజ్యోతులయొక్కయు, మరీచిఘట్టంబులు=కాంతిపుంజములు, దట్టంబులై=సాంద్ర

ముతై, నెట్టనం బట్టపగలుగావింపన్=శీఘ్రముగా దివాభాగమును జేయుచుండఁగాను, ఆత్మీయ = తనయొక్క, సామ్రాజ్యలక్ష్మీ=అచంచలయైన రాజ్యలక్ష్మియొక్క, సకాశంబునన్=సన్నిధానమందు, అనిందిత=నిందింపఁబడని, స్థైర్యవిద్యా=చలించిపోకుండెడు విద్యయొక్క, పరిచయంబుపచరింపన్ = అభ్యాసముచేయుంకొఱకు, అవతరించిన = క్రిందికిదిగివచ్చిన, క్రొమ్మించుదీవియగుంపునింపు వెలయం గలయ వెదకికొనవచ్చిన = మెఱుపుతీఁగెలయొక్క గుంపును నింపు గనుపడునట్లుగా నంతట వెదకెడు నిమిత్తముగా వచ్చినదియు, తదీయ=ఆమెఱుపు తీఁగెలయొక్క, విరహ=వియోగముచేత, పాండురంబగు=పాలితెల్లఁబడినదియునగు, అంబుదంబు=మేఘముయొక్క, డంబువిడంబించుచున్=వైఖరిని గనుపఱుచుచును, కంబుకంఠీకదంబంబుపయింబట్టిన=స్త్రీజనసమూహముమీఁదఁబట్టిన, ఉల్లాభంబు =వెలిపట్టుమేలుకట్టు-అనఁగా నుల్లెడ,పశ్యత్=చూచుచున్నవారికి, లోచనవల్లభంబై=కన్నులపండువై, మెఱయన్=ప్రకాశింపఁగాను, ఇక్కడ మెఱుపుతీఁగెలకును స్త్రీలకును ధవళమేఘమునకును నుల్లెడకును నుపమానోపమేయభావము. నీలమేఘముల వెంటనంటి మెఱుపులుండును. శరత్కాలశుభ్రమేఘముల ననుసరించి మెఱుపులుండమి ప్రసిద్ధము. మేఘములు తెల్లఁగానుండుట మెఱుపుదీఁగలయెడవాటువలనఁబాలిపోయి యని గ్రాహ్యము. లక్ష్మి చంచలురాలు. రాజ్యలక్ష్మియచంచల. అచాంచల్యమును మెఱుపుదీఁగలు రాజ్యలక్ష్మివద్ద నేర్చుకొనుటకుఁ గ్రిందికి దిగివచ్చినటుల మెఱుంగుబోండ్లలరారుచుండిరని భావము.

పాకశాసనశాసనంబునన్=ఇంద్రునియాజ్ఞచేత, పరిణయోచిత=వివాహమునకుఁదగిన, దివ్యవస్తు=దేవతాసంబంధమయిన వస్తువులయొక్క, సంభార=సముదాయముయొక్క, సంభావనంబునకునై =బహుమానముకొఱకు, విశ్వంభరావలయంబుఁ జెందిన=భూవలయమును బొందిన-అనఁగా భూమికి వచ్చిన, మందారవల్లికలయందంబునన్=మందారమనెడు దేవతావృక్షముయొక్కతీఁగెలోయన్నట్లు, కొందఱిందువదనలు = కొందఱుస్త్రీలు, చిత్ర=చిత్రవర్ణముగలిగిన, జాంబూనద=సువర్ణమయములయిన, అంబర=వస్త్రములును, ఫల=ఫలములును, కుసుమ = పుష్పములును, ఆది=మొదలుగాఁగలిగిన, మంగళద్రవ్యంబులు=శోభనవస్తువులను, పూని=పట్టుకొని, కురంగటనడువన్ = సరసనునడువఁగాను, జగత్త్రయ=మూఁడులోకములవారిచేతను, జేగీయమాన=కొనియాడఁబడుచున్న, ధైర్య=ధీరత్వమందు, అసమాన=సమానరహితుఁడయిన, వసుమానవనాథ=వసురాజుయొక్క, చిత్తంబున్=మానసమును, శైలజాయత్తంబుగా సమకట్టి=గిరికాదేవియొక్క యధీనమగునట్టులుగా సమకూర్చి, గాసింబెట్టిన= శ్రమపెట్టిన,జగజెట్టినెఱజోదన్=శ్రేష్ఠులయిన శూరులలో మేటిశూరుఁడని, బిరుదుపకాణించి= బిరుదావళియుగ్గడించి, చెఱకువిలుకాని=చెఱకువిల్లుగాఁగల మన్మథునియొక్క, కోదండదండంబులన్ =వింటికఱ్ఱలయందు, పూదండలుగట్టి=పుష్పమాలికలుగట్టి, అగ్గించు=పొగడుచున్న,తదీయవిజయేందిరలచందంబునన్ = ఆమన్మథునియొక్క విజయలక్ష్ములో యన్నట్లు, మఱికొందఱిందీవరాక్షులు=మఱికొందఱుస్త్రీలు, పుష్పమాలికాలంకృత పుండ్రేక్షుకాండంబులుపూని = పువ్వుదండలచేత శృంగారింపఁబడిన నల్లచెఱకుగడలుపట్టుకొని, పురోభాగంబుననడతేరన్=ముందరనడువఁగాను, వివాహములయందుఁ జెలులు చెఱకుగడలకుఁ బూవులు చుట్టికొనిపోవుట యిట ననుసంధింపఁదగినది. వసురాజు మూఁడులోకములలో బీరమునందుఁ బేరెన్నికఁగన్నవాఁడు. అట్టివానిని గిరికకు లోఁబఱిచి శ్రమ

పెట్టుట మన్మథుని జెగజెట్టితనమునకు జోదుతనమునకు సాధనములు. శూరులను ప్రశంసించి వారివిండ్లకు మాలికాదులు గట్టినట్టు చెఱకువింటికిఁ బూలదండలు గట్టిరని భావము.

కందర్పకోటిసౌందర్యశాలియగు=కోటిమన్మథులయొక్క చక్కఁదనముచేత నొప్పుచున్న, ఇతని=ఈవసురాజుయొక్క, కామనీయకంబు = సౌందర్యము, భవదీయలోక = మీమీలోకములయందు, ఆలోకనీయ = చూడఁదగియున్న, కుమారబృందంబునందున్ = యౌవనపురుషసమూహమునందు, ఎందేనియుంగంటిరేయని=ఎక్కడనైనప్పటికిని జూచితిరాయని, దివిజభుజంగరాజ రాజీవగంధులకుం దెలుపుచాలుపునన్=దేవతా శ్రేష్ఠులయొక్కయుఁ సర్పశ్రేష్ఠులయొక్కయు స్త్రీలకుఁ దెలియఁజేయుచున్నారో యన్నట్టులుగా, లాస్యప్రవీణ కమలాస్యలు=నాట్యమందు నిపుణలైన పద్మముఖులు-అనఁగా వేశ్యాంగనలనుట, అభినయముఖంబుగాన్=అభినయపూర్వకముగా, కరకిసలయంబులుసాచి=చిగురుటాకులవంటి హస్తములుచాపి, మెలపుసూపన్=చమత్కారము గనుపఱుపఁగాను, వసురాజు కందర్పశతకోటిసుందరుఁడు. కావున నిట్టిసుందరాకారులు భోగిలోకమునందును స్వర్గమునందును నరిది. వేశ్య లభినయము చేయుచుఁ గ్రిందికి మీఁదికిఁ జేయుహస్తవిన్యాసములు వసురాజువంటి సుందరాకారుఁడు భోగిలోకమున స్వర్గలోకమునఁ గలఁడాయని యడుగుచున్నటులుండెను. ఇదియ అభినయ రూపమగు చమత్కృతి.

వైవాహిక = వివాహసంబంధమయిన, ముహూర్త=లగ్నముయొక్క, సార=పుష్కరాంశముయొక్క, పుష్కరాంశములనఁగా,

శ్లో. 'ఏకవింశో మనుశ్చైవ జలాక్షి మునయ స్తథా
మేషాదిమీనపర్యంతరాశీనాం పుష్కరాంశకాః.'

మేష ౨౧ వృషభ ౧౪ మిథున ౨౪ కటక ౭ సింహ ౨౧ కన్య ౧౪ తులా ౨౪ వృశ్చిక ౭ ధనుస్సు ౨౧ మకర ౧౪ కుంభ ౨౪ మీన ౭ ఈరాసులయం దీభాగములు పుష్కరాంశములు, ప్రతీక్షాపర=కనిపెట్టుటయం దాసక్తులైన, మహర్షులు=ఋషిశ్రేష్ఠులు, పరమహర్షులై=పరమానందయుక్తులై, పర్వానుపర్వ=దట్టమగునట్టులుగా, సుపర్వపాతిత = దేవతలచేత గుప్పఁబడుచున్న, పారిజాతపరాగపాళికా = పారిజాతవృక్షములయొక్కపుప్పొడుల పరంపరలచేత, దుర్లక్ష్యంబగు = కనఁబడకయున్న, అంతరిక్షంబువలనన్=ఆకాశమువలన, సమక్షంబునకు నాకర్షించిన=తమయెదుటికి రప్పింపఁబడిన, దాక్షాయణీచక్రంబుకైవడిన్=నక్షత్రమండలమోయన్నట్టులుగా, (ని. 'దాక్షాయణ్యోశ్వినీత్యాదితారాః' అని అ.) అవక్ర = తిన్ననైన, చక్రడోలాయంత్రంబులం దిరుగు=చక్రాకృతి గలిగి తొట్లనమర్చిన యంత్ర విశేషములయందుఁ దిరుగుచున్న, మెఱుంగుబోండ్లతండంబు=స్త్రీసమూహము, శాణ=చికిలిసానమీఁద, భ్రమత్ = తిరుగుచున్న, మదనబాణ=మన్మథబాణములో యనునట్టి, భ్రమంబొనరింపన్=భ్రాంతిని గల్పింపఁగాను, మహర్షులు పుష్కరాంశములు గనిపెట్టుచుండ దట్టముగా వేలుపులురాల్చు పారిజాతరజఃపరంపర దృగ్గోచర్యము కలిగించెననియు నందుచేఁ జెంతకురప్పించిన గ్రహమండలమువలెఁ జక్రడోలాయంత్రమునందుఁ దిరుగుచెలువలుండిరని భావము. చక్రాకారముగఁ దిరుగుచెలులు సానపై మెఱుఁగుఁబెట్టఁబడు మదనబాణములవలె నుండిరి. సానఁబెట్టుటవలన బాణములకు మెఱుంగెక్కును, మెఱుంగుబోండ్లుగావున నట్లులుండిరనుట.

ఎడసెడంబన్నిన = అంతటంతటనమర్చిన, అపరంజికురుంజులపైన్ =మేలిబంగారు చప్పరముల మీఁద, రంజిలుచున్ = ప్రకాశించుచు, మృదంగదింధిమి ధ్వానంబునకున్ = దింధిమ్మని మ్రోయుచుండెడు మర్దలధ్వనులకు, ఆడు = తమయంతటతామే నాట్యముచేయుచున్న, యంత్రపాంచాలికా సముదయంబు=కీలుబొమ్మలయొక్క సమూహము, విమలమణీవిమానమండలంబుననుండి = నిర్మలమయిన రత్నములుగూర్చిన విమాన సమూహమునందు నిలిచి, గొండ్లిఁబరిఢవించు=నాట్యమును గనుపఱుచుచున్న, తెఱగంటి తెఱవల తెఱంగు నంగీకరింపన్ = దేవతాస్త్రీలయొక్క రీతిని బొందుచుండఁగాను,ఇక్కడఁ గీలుబొమ్మలును దెఱగన్నులుగలవియ గనుక తెఱగంటితెఱవలతోసామ్యమును జెప్పినాఁడు. కురుంజులనఁగా సెత్తగుమంచెలు.అందు యంత్రవిగ్రహములు విశేషముగా నమర్పఁబడియుండెను. అవిమద్దెలలమ్రోఁతలకు నాట్యమునలుపుట విమానమందున్న వేలుపులలనలునాట్యముచేయునటులుండెను. చిత్రప్రతిమలకు వేలుపుఁజెలువులకు ఱెప్పపాటుండదుగావున నిట నేకార్థము గ్రాహ్యము.

వర్ణనీయ=కొనియాడఁదగిన, వారవరవర్ణినీవార = వేశ్యాస్త్రీసమూహముయొక్క, వారణదుర్లభ=ఏనుఁగులకు లభింపని,యానవైభవంబు=నడకయొక్క వైభవము, వాసవావాస=ఇంద్రునకావాసమయిన స్వర్గసంబంధినులయిన, వామలోచనా=స్త్రీలయొక్క, వర్గంబులకున్=సమూహములకు, వసుధా=భూమియందలి, పదన్యాస = పాదసంచారముయొక్క, వైధుర్యంబు=శూన్యత్వమును, సంపాదింపన్, అనఁగా నీవారకాంతలయొక్క నడక చక్కఁదనము తమకులేనందున సిగ్గుపడి దేవతాస్త్రీలు భూమియందు నడుచుట మానినారని తాత్పర్యము. దేవతలు భూమిని స్పృశింపకుండుట ప్రకటము.

పల్యంకికాదివాహనంబులు డిగ్గి=పాలకి మొదలయిన సవారులుదిగి, పాదచారంబులనడుచు=కాలినడకలచేత నడుచుచున్న, పట్టాభిషిక్తుల = రాజులయొక్క, పద్మరాగకిరీటపాటలప్రభాపటలంబులు = పద్మరాగమణిమయములయిన కిరీటములయొక్క కొంచెము దెలుపుగలిసిన యెఱ్ఱనికాంతులయొక్క సమూహములు - అనఁగా నగ్నివర్ణముగల కాంతులు, పవనసఖ = అగ్నిహోత్రునియొక్క, శిఖా=జ్వాలికలయొక్క, ముఖంబులకున్=అగ్రములకు, మలినసరణిసవరింపన్=వైవర్ణ్యము గలుగఁజేయుచుండఁగాను-అనఁగా ముఖము నల్లఁబుచ్చుకొనుటను గలుగఁజేయఁగాను, ఇక్కడఁ బద్మరాగకిరీటపాటలప్రభ లపరిమితములు గనుకఁ బరిమితములయిన పవనసఖశిఖలయొక్క ముఖములకు వైవర్ణ్యంబు సంపాదించిన వని యర్థము. ముఖములనఁగా నగ్రములనియు మలినసరణియనఁగా శిఖాగ్రధూమమనియును భావము.పద్మరాగకిరీటపాటలప్రభలనంతములు. అగ్నిజ్వాలాముఖములుతొమ్మిది. అసంఖ్యాకబలముచే సంఖ్యాకమగు స్వల్పబల మోడిపోవుటయుఁ బరాభవవశమున నల్లనగుటయు సాజము. పరాభవమున మోము నల్లబడుననుటకు-

తే-గీ. దాసిచేసిన యప్పరిహాసమునకు, హాసపరిపాండురంబైన యక్కొలువున
నానృపాలు ముఖమ్లాని గానఁబడియె, నలుపు గానఁగఁబడుగదా తెలుపులోన.

(శృంగార-నై. ఆ. ౫)

సమస్తజన=సకలమయినవారికి, సముచిత=అర్హమగునట్టులుగా, మార్గమర్యాదా=త్రోవ నడుచుటకు, అనుశాసన=శిక్షకులయిన, సముద్దండ=పరభీకరులైన, దండధర=దండధరులయొక్క, సంభ్రమంబులు=తొందరలు, సమవర్తికిన్ = యమునికి, ని. 'ధర్మరాజః పితృపతి స్సమవర్తీ పరేతరాట్'

సమధికశ్యామిక = అత్యధికమయిన శరీరవైవర్ణ్యమును, సమకూర్పన్ = కలుగఁజేయఁగాను - అనఁగా సమస్తజన సముచితమార్గమర్యాదానుశాసనులై వర్తించినవారు గనుక సమవర్తులైన దండధరులనేకు లయినందున నొకసమవర్తియైన దండధరునకు శరీరవైవర్ణ్యము సంపాదించినారని యర్థము. దండధరులనఁగా వేత్రధరులనియుం శ్యామికయనఁగా శరీరనీలిమయనియును భావము.

ప్రబలతమస్స్ఫారదురహంకార-ప్రబల=బలిష్ఠమయిన, తమః=చీఁకటులయందు, స్ఫార=అతిశయించుచున్న, దురహంకార=దుర్గర్వముగలవారని యర్థము. అనఁగా రాత్రించరులనుట. ప్రబలతమమును స్ఫారమునయిన దురహంకారముగలవారని భావము. అటువంటి, వీరభటుల = శూరులయిన భటులయొక్క, కృపాణికా=ఖడ్గములయొక్క, చాకచక్యంబులు=చకచకాయమానములయిన కాంతులు, రాత్రించర=నైరృతియొక్క, కరాళ=భయంకరమయిన, కరవాల=ఖడ్గముయొక్క, కాళిమంబులు=మాలిన్యములను, మూలకుఁజొనుపన్ = అప్రయోజకమగునట్లు చేయఁగాను అని యర్థము. నిరృతి మూలను వసించుచున్నాఁడని భావము. కరవాలకాంతులు కృష్ణగణములోఁ జేరినవనుటకు దృష్టాంతములింతకుమున్నె సంగఁబడెను. నిరృతిరాక్షసుఁడు గావున నలుపుచాయగాఁ జెప్పఁబడెనని గ్రాహ్యము.

బహుల=అనేకములయిన, సితదంతి=వెల్లయేనుఁగులయొక్కయు, ఘోరాట = అశ్వములయొక్కయు-అనఁగా నైరావతోచ్చైశ్శ్రవములయొక్క, కోటీ=సమూహములయొక్క, సమాటీక=సంచారముగలిగిన, నిర్వేల=వేలాతిక్రాంతములయిన, సర్వతోముఖ=జలములుగలిగిన, వాహినీశ్వర నాథుల చేత=అనఁగా సముద్రములచేత, సంసేవ్యమాన=సేవింపఁబడుచున్న, రసాధినాథ=సలిలాధినాథులయిన వరుణులయొక్క, ఇక్కడ రసశబ్దము సలిలపరము. సన్నాహంబులు = ఆడంబరములు అని యర్థము. బహు=అనేకములయిన, లసిత=ఒప్పుచున్న, దంతి = ఏనుఁగులయొక్కయుం, ఘోరాట=అశ్వములయొక్కయుం, కోటీ=సమూహములయొక్క, సమాటీక = సంచారముగలిగినవియు, నిర్వేల=అతిమాత్రములయినవియుం, సర్వతోముఖ=నానాముఖములైనవియునగు, వాహినీ=సేనలకు, ఈశ్వర=నాయకులయినవారిచేత, సంసేవ్యమాన=సేవితులయిన, రసాధినాథుల=భూపతులయొక్క, సన్నాహంబులు=ఆడంబరములనిభావము. ఇక్కడ రసాశబ్దము భూమియందు వర్తించుచున్నది, వారిధిస్వామికిన్ =వరుణునికి, వదలనిజడస్థితియొసంగన్ =విడువనిజాడ్యమును సంపాదింపఁగాను అని యర్థము. అనఁగా ననేకములయిన నైరావతోచ్చైశ్శ్రవములయొక్క సంచారముగలిగి వేలాతిక్రాంతజలముగలిగిన యనేక సముద్రములచేత సేవింపఁబడుచున్న వరుణులనేకులు గనుక నొక్కయైరావతముయొక్కయు నుచ్చైశ్శ్రవముయొక్కయు సంచారముగలిగిన వేలాతిక్రమము సేయలేనిజలములు గలిగిన యొక్క సముద్రునిచేత సేవింపఁబడుచున్న యొకవరుణునికి జాడ్యమును సంపాదించినారనుట. జడస్థితియనఁగా జలస్థితియని భావము. ఐరావతము, ఉచ్చైశ్శ్రవము సముద్రజన్యములని పురాణప్రసిద్ధము.

పరిమళిత=సంజాతపరిమళములయిన, ఘనసారగంధసార=కర్పూర శ్రీచందనములతోడ, పరిమిళిత=కూడుకొన్న, కస్తూరికా=కస్తూరియొక్క, ఆసారంబులన్ =జలధారాసంపాతములచేత, వసంతంబులాడు=వసంతములాడుచున్న, సామంతబాంధవావళి=సమానప్రతిపత్తిగలబంధుజనసమూహము, గంధవహునకున్ =వాయువునకు, అపారతారళ్యంబు వెనుపన్ =అపరిమితచిత్తచాంచల్యముఁ బుట్టింపఁగాను-అనఁగా సురభిద్రవ్యములచేత వసంతములాడి గంధవహులయిన బంధువులు గంధవహునకుఁ జిత్తచాంచల్యము పుట్టించినారని యర్థము. వాయువు చంచలమని భావము. వివాహసమయమునందు

సుగంధవస్తువులు నీళ్లలో గలిపి సమానప్రతిపత్తిగల సామంతబాంధవాదులు ధారారూపముగ జలము చల్లుకొనునాచారము గలదు. సుగంధోదకములు నలుగడచల్లుకొనుటచేఁ దావియు నలుగడల వ్యాపించె ననియు నందుచే గంధవహుఁడై (తావిబరువు మోయువాఁడై)మందముగ నడుచుచు వాయువు చలింపసాగెనని భావము.

గంభీర=మంద్రధ్వని గలుగునట్లుగా, బిరుదగాథావఠన=వసురాజుయొక్క బిరుదావళులు చదువుటయందు, పరాయణ=ఆసక్తులైన, పాఠక=వందిమాగధులయొక్క, పరంపరలకున్=సమూహములకు, ఎడనెడన్=అప్పుడప్పుడు, హితపురోహితామాత్యజనంబు = ఇష్టపురోహితమంత్రిజనము, ఒసంగు=తామిచ్చునట్టి, అసంఖ్యాతధనసంఘాతంబులన్=లెక్కలేని ధనసమూహములచేత, ధనదునకున్=కుబేరునకు, అమందమందాక్షభావంబుసంఘటింపన్=అధికలజ్జాభావమునుగలుగఁజేయఁగాను-అనఁగా నసంఖ్యధనసంఘాతప్రదాతలయిన, హితపురోహితామాత్యజనులు నవసంఖ్యాకనిధిధనప్రదాతయయిన కుబేరుని సిగ్గుపడఁజేసినారని యర్థము. మందాక్షభావ మనఁగా గుబేరుఁడు పింగళాక్షుఁడు గనుకఁ దద్భావమని తెలియవలయును. అనఁగాఁ గాయకంటివాఁడని భావము. మందాక్షమన సిగ్గనుటకు (ని. 'మందాక్షంహ్రీస్త్రపాప్రీడా'అని అ.) మందాక్షునకు మందాక్షభావమును గలిగించిరని భావము. రాజులు మహారాజులుకాక సామాన్యమంత్రులు హితులు పురోహితులు వందిమాగధులను అసంఖ్యాకధనములొసంగి సత్కరించుట కుబేరునకు లజ్జాకరముగ నుండెననుట.

ప్రచండతర=దుర్ధర్షమయిన, నటన=వీరతాండవము గలవారిలో, ప్రకాండ=శ్రేష్ఠులయినవారియొక్క, తాండవపాండిత్యంబులు=నటనసామర్థ్యములు, ప్రాచీననటుని నెమ్మేనన్=హరునియొక్క దేహమందు, పాండిమంబునిండింపన్=తెల్లఁదనమును బూర్ణీభవింపఁజేయఁగాను అని యర్థము. ధవళిమయని భావము. సర్వత్ర యనేకత్వము వ్యతిరేకమని తెలియవలయును.

ఇట్లు=ఈప్రకారముగా, ఆశాపతులకాశాసనీయంబును=దిక్పతులకుఁ గోరఁదగినదియును,అహివల్లభులకు దుర్లభంబును=సర్పశ్రేష్ఠులకుఁ బొందశక్యముగానిదియును, సిద్ధులకననుభూతసిద్ధంబును=సిద్ధులకనుభవముగానిదియును, సాధ్యులకసాధ్యంబును=సాధ్యులకు సాధింపశక్యముగానిదియును, చారణులకు నవిచారణీయంబును=చారణులకు విచారింపనలవిగానిదియు, యక్షులకు ననక్షిలక్షితంబును=యక్షులకు దుర్లక్ష్యమయినదియును, ఐన=అయినట్టి, అనన్యసామాన్య మహావిభవంబునన్=అన్యసాధారణముగాని మహావైభవముచేత, కోలాహలపురంబుఁ జేరంజనుసమయంబునన్=కోలాహలపర్వతపట్టణమును సమీపించిపోవుచున్న సమయంబునందు.

శా. వ్రీడామంథరదృష్టిపాతముల నుర్వీపాలవంశాగ్రణీ
చూడారంజితపాదపీఠు నతనిం జూడ న్మణీనిర్మిత
క్రీడాసౌధతలంబు లెక్కిరి నవశ్రీమన్మహాశైలస
మ్రాడావాసపురాంగన లుత్కుతుకసామగ్రీసముద్దీప్తికన్. 10

వ్రీడా=లజ్జచేత, మంథర=మందప్రచారములుగలవైన, (ని. 'మందగామీతు మంథరః' అని అ.) దృష్టిపాతములన్=చూపులచేత, ఉర్వీపాలవంశాగ్రణీ=రాజవంశశ్రేష్ఠులయొక్క, చూడా=శిఖలచేత, రంజిత=ప్రకాశింపఁజేయఁబడిన, పాదపీఠున్=పాదములక్రిందిపీఠముగలిగిన, అతనిన్=

…వసురాజును, చూడన్=వీక్షించుటకు, నవ=నూతనమయిన, శ్రీమన్మహాశైల సమ్రాడావాసపుర=శ్రీమంతుఁడైన కోలాహల మహాపర్వతరాజునకు నివాసమయిన పట్టణమందలి, అంగనల్=స్త్రీలు, …తుకసామగ్రీ=సంతోష సామగ్రివలని, సముద్గ్రీవికన్=గ్రీవోన్నయనముతోడ-అనఁగా నెత్తఁబడిన కంఠములతోడ, (శ్లో. 'గ్రీవోన్నయన ముద్గ్రీవో గ్రీవికా చాపికథ్యతే' అనికోశము.) మణి…ర్మిత క్రీడాసౌధతలంబులెక్కి=మణులచేతఁ గట్టఁబడిన క్రీడార్హములైన మేడలమీఁది కెక్కి.

వసురాజు సామాన్యుఁడు కాఁడు. రాజన్యకిరీటమణిరంజితపాదపీఠుఁడు. రాజవంశాగ్రణి. అట్టి …నిని జూచుతఱి స్త్రీలకు సహజముగాఁ జూపులందు సిగ్గొలయుటయుఁ జూపులు మందగించు …యుఁ గలదు. గ్రీవోన్నయనమునకు హేతువు కుతుకసామగ్రి.

సీ. రాగంబుమూర్తమై • రహిఁ ద్రోవఁజూపు పెంపునఁ బదచ్ఛాయ ము • న్నున్న నిగుడ
వీక్షాప్రహితదూతి • వెసనేగుమని మ్రొక్కుగతి నంఘ్రిఁ గర్ణాబ్జ • కళికవ్రాల
నీవిఁ జుట్టినభోగి • నిట్టూర్పుగమి నుబ్బి సడలె నా నొడ్డాణ • మెడలి తూల
గందునెన్నడుముపైఁ • గరుణించి చనుదోయి చిందుపన్నీరు నాఁ • జెమరుదొరుగఁ
తే. గటికరటికంఠపీఠిపైఁ • గంతుఁ డనెడి
బిరుదుమావంతుఁ డేసిన • పిలిజల్లి
పెంపు గను పెన్నెఱులగుంపు • ప్రిదిలి జార
వచ్చె నొకసతి వసుమతీ • వరుని జూడ. 11

రాగంబు=అనురాగము, అరుణిమయనియును జమత్కారము గ్రహింపవలయును. మూర్తమై=ఆకృతివహించినదై, రహిన్=చక్కఁగా, త్రోవఁజూపు పెంపునన్=దారిచూపుచున్నదో యన్నట్టులుగా, పదచ్ఛాయమున్నున్న నిగుడన్=చరణారుణకాంతి ముందుముందుసాగఁగాను, 'రాగోనురాగే …గాక్షాదౌ మాత్సర్యే రక్తిమత్యపి' వి. వచ్చుట కనురాగప్రేరణము కారణము. కావుననే యను…రాగము మున్నున్న దారిచూపెననుట. రాగమాకారముదాల్చి త్రోవఁజూపుచుండఁ బాదకాంతులు …క్తవర్ణముతోఁ బ్రసరింప బయలుదేరెనని భావము.

వీక్షా=చూపనెడునాయిక చేత, ప్రహిత=రాజదర్శనాపేక్షచేతఁ బంపఁబడిన, దూతి=దూతిక …వెసనేగుమని మ్రొక్కుగతిన్=శీఘ్రముగాఁ బొమ్మని నమస్కారము సేయుచున్నదో యన్నట్టులుగా, …అంఘ్రిన్=పాదమందు, కర్ణాబ్జకళికవ్రాలన్=కర్ణావతంసమయిన తామరమొగ్గపడఁగాను, ఇక్కడ …అబ్జకళికను సన్నిహితవర్తినియైన దూతికనుగాఁ జెప్పినందున వీక్షకుఁ గర్ణాంతవిశ్రాంతత్వంబును …అబ్జాధికసౌందర్యసంపదయును స్ఫురించుచున్నది. ఇట దూతిక కర్ణావతంసమగు నబ్జకళిక. యజమానిని …అంటె దాసి కొంతతక్కువ గాన నబ్జము కనులకంటె సోగతనమునందు సొంపునందును వెనుకఁ …బడియున్నదని భావము. వేగగమనమువలన నవతంసము జారుట తొందరగఁ బయనము కన్మని.

నీవిఁజుట్టినభోగి=నీవి యనఁగాఁ బోకముడియును మూలధనంబును, (ని. 'నీవీ పరిపణే గ్రంథౌ స్త్రీణాం జఘనవాససి' అని వి.) పరిపణమనఁగా మూలధనము. ఇందుకు, (ని. 'నీవీ పరిపణం మూల…ధనమ్' అని యమరసింహుఁడు చెప్పినాఁడు గనుక) నీవి యనెడునీవిని, అనఁగాఁ బోకముడియనెడు మూలధనమును బరివేష్టించుకొనియున్న సర్పము. నిట్టూర్పుగమినుబ్బి=నిశ్వాసవాయు సముదాయము

చేత నుబ్బరించి, సడలెనాఁ=వదలినదో యన్నట్టులుగా, ఒడ్డాణమెడలితూలఁ=కమ్మరుపట్టావదలి తూలి పడుచుండఁగాను, నిధినిత్యేపాదులను భూతప్రేతములు సర్పస్పృశ్చకాదు లావరించియుండుననుప్రతీతి యిచట ననుసంధింపఁదగినది. కామేంగితమగు నిశ్వాసాతిశయమువలన నీవి సడలినదని భావము. తనంతన నీవి సడలుట కామేంగితమనుటకు-

శ్లో. 'స్రస్తా నీవీ నఖలు సహసా సా స్వయం ముక్తబంధా' బిల్హణీయము.
శ్లో. 'నీవీచ స్ఖలతి స్థితాఽపి సుదృఢం కామేంగితం యోషితాం.' రతిరహస్యము.

కందుకెన్నడుముపైఁ గరుణించి=బడలికనొందుచున్న నడుముమీఁద దయచేసి, చనుదోయిచిందు పన్నీరునాఁ-కుచద్వయము చిలకరించునట్టి పన్నీరో యన్నట్టులుగా, చెమరుదొరుగఁ=చెమటనీరు జారగాను, నడుము గమనవేగమునఁ జలించు గుబ్బలవ్రేఁకచేఁ గందిపోయెను. దయామృతరసము జిలికించునటులఁ జెమ్మట జారుచుండెను. స్వేదోత్పత్తి గమనాతిశయమువలనఁ గలిగిన యలసటచే నని భావము.

కటి=నితంబోపరిభాగమనెడు, కరటికంఠపీఠిపైఁ=గజస్కంధముమీఁద, కంతుఁడనెడి=మన్మథుఁడనెడి, బిరుదుమావంతుఁ డేసిన=శూరుఁడైన మావటీఁడిడిన, పీలిజల్లిపెంపుగను=నల్లసొరపుచౌరియొక్క ఘనతనొందుచున్న-అనఁగా దానివలెనున్న, పెన్నెఱులగుంపు=కచభారము, ప్రిదిలి=సడలి, జారఁ=వ్రేలఁగాను, ఒకసతి=ఒకస్త్రీ, వసుమతీపరునిజూడఁ = వసురాజును జూచునిమిత్తము, వచ్చెఁ=ఏతెంచెను.

ఈపద్యమందు నావేగమనెడు సంచారిభావమును జెప్పినాఁడు. ఇందుకు, శ్లో. 'ఇష్టానిష్టాగమాజ్జాత ఆవేగ శ్చిత్తవిభ్రమః' అని లక్షణము.

ఉ. డించగఁ బ్రొద్దు లే కెద ఘటించినరత్నవిపంచితో సువ
ర్ణాంచితమూర్తి యోర్తు ముఖరాంఘ్రిసమాశ్రితసత్కలాప యై
యంచల వచ్చుసోయగపుటంచలఁ దోలుచు మిన్కుచేడె యా
నంచు నుతింప వచ్చె వెస నాచతురాస్యునిమోముఁ గన్గొనన్. 12

డించగఁ బ్రొద్దులేక=దించి దిగువనుంచెడుమాత్రపు వ్యవధానములేక, ఎదఘటించిన=ఱొమ్మునఁ బూనిన, రత్నవిపంచితోఁ=రత్నమయమయిన వీణతోడను, సువర్ణ=బంగారపుకాంతివంటి కాంతిచేతఁగాని చంపకపుష్పకాంతివంటి కాంతిచేతఁగాని, అంచిత=ఒప్పుచున్న, మూర్తియోర్తు=శరీరముగల యొకమగువయని స్త్రీపరమైన యర్థము. శోభనవర్ణస్వరూపురాలని సరస్వతీపరమైన యర్థము. ముఖర=మ్రోయుచున్న, అంఘ్రిసమాశ్రిత=పాదముల నాశ్రయించుచున్న, సత్కలాపయై=శ్రేష్ఠమైన భూషణములుగలదై-అనఁగా నందెలుగలదై యని యర్థము. ముఖర=వాచాలురైన, అంఘ్రిసమాశ్రిత=పాదాశ్రితులైన, సత్ = సత్పురుషులయొక్క, కలాపయై = సమూహముగలదై యని సరస్వతీపరమైన యర్థము. (ని.'కలాపో భూషణే బర్హే తూణీరే సంహతౌ వపి' అని వి.) అంచలవచ్చుసోయగపుటంచలఁ దోలుచుఁ=అండగొనివచ్చినట్టి యొయ్యారపురాయంచలఁ దోలంగఁ దోలుచునని స్త్రీపరమైన యర్థము. వాహనసమీపముగా వచ్చుహంసములను దోలుచునని సరస్వతీపరమైన యర్థము. మిన్కుచేడె యానంచునుతింపఁ=సరస్వతీదేవియే యవునని కొనియాడఁగా,

వేసన్=త్వరితగతిచేత, ఆచతురాస్యుని మోము గన్గొనన్=చతురోక్తిగల యావసురాజుముఖమును జూచుకొఱకని స్త్రీపరమైన యర్థము. బ్రహ్మముఖస్థితికొఱకని సరస్వతీపరమైన యర్థము. వచ్చెన్= ఏతెంచెను.

సువర్ణాంచితమూర్తి గావున మినుకుచేడె. చతురాస్యుని సువర్ణాంచితమూర్తి చూడవచ్చుట యొప్పియున్నది. వీణడించమి దర్శనోత్సుకాతిశయమున. ఉత్సుకాతిశయమున బయలువెడలుచుం టచే వీణ డించఁదగినంత యవకాశము లేకపోయెఁ గావున డించఁ బ్రొద్దులేకపోయెనని భావము.

చ. పొలఁతి యొకర్తు చెంగలువ•పొట్లము చేతనె పూని వచ్చుచు
న్వలపులదండ జార గుణ•వద్దళమాత్రమె తాల్చె నిమ్మహీ
తలపతి కేన కూర్తు నని • తప్తపరశ్వథ మెత్తివైచి మం
జులదళతంతులేశపరి•శుద్ధి జనాళికిఁ దెల్పుకైవడిన్. 13

పొలఁతియొకర్తు=మఱియొకస్త్రీ, చెంగలువపొట్లముచేతనెపూని=ఎఱ్ఱగలువపూదండపొదిగిన పొట్లము చేతనేపట్టుకొని, వచ్చుచున్=ఏతెంచుచు, వలపులదండజారన్=పరిమళయుక్తమైన యా పూదండజారిపడిపోఁగా, గుణవద్దళమాత్రమెతాల్చెన్ = ఆపొట్లపుసంబంధమైనదారముతోఁగూడిన చిగురుటాకులను మాత్రమే చేతఁబట్టుకొన్నదాయెను. ఏలాగుననినిన, ఇమ్మహీతలపతికిన్ = ఈవసు రాజునకు, ఏన=నేనే, కూర్తునని=ప్రియురాలనౌదునని, తప్తపరశ్వథ మెత్తివైచి=ఎఱ్ఱగాఁ గాలిన గండ్రగొడ్డలిదూసివైచి, మంజుల=కమిలిపోక కోమలములయియున్న, దళ = చిగురుటాకులతోఁ గూడిన, తంతులేశ=సన్నపునూలుపోగులుగలుగునట్టులుగా, పరిశుద్ధిన్=తనయొక్క శపథపరిశుద్ధతను, జనాళికిన్=చూచెడువారికి, తెల్పుకైవడిన్=తెలియఁజేసినట్టులుగా, గుణవద్దళమాత్రమె తాల్చెనని సంబంధము.

లోకములో నెవరైనప్పటికిని ప్రమాణము సేయువారు సన్నపునూలుదారములతోఁగూడుకొన్న లేఁతచిగురుటాకులు దోసిటఁబెట్టుకొని యెఱ్ఱగాఁ గాలినయినుపముద్ద నాదోసిటనేపట్టి యెత్తివైచి యందువలన నెంతమాత్రమును గందకుండెడు దారములతోఁ గూడిన చిగురుటాకులు చూచెడువారి కందఱికిని గనుపఱిచిన దృఢాధ్యవసాయమును బ్రకటముచేయుట ప్రసిద్ధము గనుక నాప్రతీతి నను సంధించి చెప్పినాఁడు. గుణవంతమగు దళము కేలనుంచుకొను చిగురాకుదారము. కాలినగండ్రగొడ్డలి చెంగలువపూవులు. ఈరాజునకు నేనుగూర్తునని ప్రమాణముచేయునటులఁ జెలియయునికిఁదోఁపఁ జేసెను. అలం. ఉత్ప్రేక్ష.

ఉ. బిత్తరి యోర్తు ముత్తియపు•పేరు వలగ్నమునన్ ఘటించి కే
ల్గుత్తపుచన్నుదోయి నొనఁ•గూర్చి రయంబునఁ జూడ వచ్చె రా
జోత్తము నాత్మహారవిభ•వోజ్జ్వలమధ్యవిదారణక్రియా
యత్తము లైనచన్నులఁ బ్రి•యంబున వేఁడుచు వచ్చెనో యనన్. 14

బిత్తరియోర్తు=శృంగారవతియైన మఱియొకస్త్రీ, ముత్తియపుపేరు వలగ్నమునన్ ఘటించి=ముత్యాలహారము నడుమునదోపుకొని, కేలు=హస్తాగ్రమును, గుత్తచన్నుదోయినొనఁగూర్చి=గమనవేగము చేతఁ గంపించుచున్నవి గనుక బిగువైన కుచద్వయముపైనిజేర్చుకొని, రాజోత్తమున్=రాజశ్రేష్ఠుని,

రయంబునఁజూడవచ్చెన్=వేగముగాఁజూడవచ్చెను. ఏలాగనిన, ఆత్మహారవిభవ=తనసంబంధమయిన ముత్యాలహారముయొక్క వైభవముచేత, ఉజ్జ్వల=ప్రకాశించుచున్న, మధ్య=నడుముయొక్క, విదారణక్రియాయత్తములైన=భగ్నక్రియాచరణమునకధీనములైన-అనఁగా నడుమును భంగపెట్టుట కుద్యుక్తములగుచున్న, చన్నులన్=కుచములను, ప్రియంబున వేఁడుచువచ్చెనోయనన్=మంచితనముచేతఁ బ్రార్థించుచు వచ్చెనోయన్నట్టులుగా వచ్చెనని సంబంధము.

ఇందులో విభ్రమమును జెప్పినాఁడు. శ్లో. 'విభ్రమ స్త్వరయా కాలే భూషార్థనవిపర్యయః' అని లక్షణము. ముత్తెపుసరులు గుత్తపుఁజన్నుదోయి 'జవ్వాడునడుముగలది గావున బిత్తరి. హారము గుబ్బలపై వేసికొనఁబోవుతఱి రాజాగమనమువిని నడుమునదోపుకొని బిత్తరిత్వరగావచ్చెను. త్వరగా నేతెంచుటచే నుబ్బుగుబ్బలవ్రేగుననడుము మిగులఁగంపింపసాగెను. నడుమును విదారణముచేయుటకు బిత్తరిసహింపక గుబ్బలను బ్రతిమాలుచున్నటుల గుబ్బలపైఁ గేలుదోయియుంచుకొనివచ్చెను. గుబ్బలుబ్బుజూపుట కాయెంగితము. దానినిమఱుఁగుపఱచుట కేలుగవ చనులపై నొనగూర్చుట. అవుడునడుము మఱింతజవ్వాడెను.

మ. రమణీయోజ్జ్వలవజ్రకుట్టిమముపై ♦ రత్నాంకభూషానుబం
ధముతోడం బరువెత్తె మే లని పద♦ద్వంద్వంబుపై నాహిత
ప్రమదం బై హృదయంబు వేగవిగళ♦త్ప్రాలంబముక్తాభిషే
కము గావింపఁగ వచ్చె నోర్తు వసులో♦కస్వామి నీక్షింపఁగన్. 15

రమణీయోజ్జ్వల వజ్రకుట్టిమముపైన్ = మనోహరమగునట్టులుగాఁ బ్రకాశించుచున్న వజ్రమణులచేతఁ గట్టఁబడిన భూమిమీఁద, రత్నాంక = వజ్రమణిమయములైన, భూషా = అందెలయొక్క, అనుబంధముతోడన్=సంబంధావలంబనముతోడ, పరువెత్తెన్=జారిపడక వడిగాఁబరుగెత్తెను, మేలని=సెబాసని, పదద్వంద్వంబుపైన్=పాదద్వయముమీఁద, ఆహితప్రమదంబై=కూర్పఁబడిన సంతోషముగలదై, హృదయంబు=డెందము, వేగ=గమనవేగముచేత, విగళత్=తెగిజారిపడుచున్న, ప్రాలంబ=హారసంబంధములయిన, (ని. 'ప్రాలంబ మృజులంబి స్యా త్కంఠాత్' అని అ.) ముక్తా=ముత్తియములచేత, అభిషేకముగావింపఁగన్=అభిషేకముసేయుచుండఁగా, ఓర్తు=ఒకవనిత, వసులోకస్వామిన్=వసురాజును, ఈక్షింపఁగన్=చూచుకొఱకు, వచ్చెన్=ఏతెంచెను.

అనఁగా వసురాజును జూడవలెనన్న యపేక్షచేత నొకస్త్రీ వజ్రకుట్టిమముమీఁదఁ బరుగెత్తి నడువఁగా ముత్యాలహారము తెగి రాలుచున్న ముత్యము లాస్త్రీ పాదద్వయముమీఁదఁ బడుచుండఁగా నది హృదియము త్వరగాఁజూడవలెనన్న యభిలాషగలదిగనుక నందు కనుకూలముగా స్నిగ్ధమైన వజ్రకుట్టిమముమీఁదఁ బడుదునేమోయని యయినను విచారింపక పరుగెత్తుచున్నది సెబాసు అని మెచ్చుకొని యాపదద్వయముమీఁద ముక్తాభిషేకముచేయుచున్నదో యన్నట్టులుగా నుండెనని తాత్పర్యము. కుట్టిమము రమణీయోజ్జ్వలహారమయమనుటవలన మిగుల నునుపుగానుండెననిభావము. అందు నడచుటయే కష్టము. రత్నఖచితములగు నందియలతో నేగుట మఱియుఁ గష్టము. హృదయమును మన్నించియే పాదము లింతశ్రమకోర్చెను. అందులకై హృదయము ముక్తాహారమునందలి ముత్తెములు రాల్చుటతో నభిషేకమొనరించెను. ముక్తాఫలము తెగి ముత్తెములు జారుట వేగవశమున.

సీ. తను ఘనంబుగ నమ్మి♦ దరియు నెమ్మికిఁ గొప్పు మాల్యభోగి నొసంగి♦ మఱలఁ బంచెఁ
దనుఁ గొండ యని వచ్చు♦ నునుజింకఁ గుచము గారుడశిలాసర దూర్వ ♦ లిడి మరల్చెఁ
దనుఁ గల్పలతికఁ గాఁ ♦ దలఁచి వ్రాలెడు శారిఁ గరము రత్నఫలాళి ♦ నెరపి నిలిపెఁ
దనుఁ బద్మమని యంటఁ♦ బెనఁగు నంచకు నంఘ్రి హీరాంగదమృణాళ♦ మిచ్చి యనిచె
తే. నాత్మపోషితవర్గంబు ♦ లవని పావ
లోకగమనాంతరాయంబు ♦ గాక యుండ
నవయవంబులె తోడయ్యె ♦ నతివ కనుచు
నెచ్చెలులు మెచ్చ వచ్చె మా♦నిని యొకర్తు. 16

తనుఘనంబుగనమ్మి=తన్ను మేఘమని విశ్వసించియని యర్థము. ఉత్తమవస్తువని నమ్మియని యర్థాంతరము. దరియు=డాసివచ్చుచున్న, నెమ్మికిన్=నెమిలికి, కొప్పు=కబరీభారము, మాల్య=పువ్వుదండ యనెడు, భోగిన్=సర్పమును, ఒసంగి=ఇచ్చి, మఱలఁబంచెన్=వెనుకకుఁదిరుగఁ బంపించెను. ఇక్కడ మేఘమువలన నీరుపాములు పడుచున్నవిగనుక భోగినిచ్చుటగాఁ జెప్పినాఁడు. నెమిలికి పాము మాహారముగావున దానితోఁ దృప్తినొంది వెనుకకు మఱలెనని భావము. ఘనముగా నమ్ముటచేఁ గామితవస్తువిచ్చి తృప్తిపఱచుట.

తనుఁగొండయని=తన్నుఁ బర్వతమని భ్రాంతిపడి యనియర్థము. మహోన్నతవస్తువని యర్థాంతరము. వచ్చు=ఏతెంచుచున్న, నునుజింకన్=బాలకురంగమును, కుచము=గుబ్బచన్ను, గారుడశిలాసర=గరుడపచ్చలబన్నసరమనెడు, దూర్వలిడి=లేఁతగఱికిపోచలనిచ్చి, (ని. 'దూర్వాతు శతపర్వికా, సహస్రవీర్యా భార్గవ్యౌ రుహానంతా' అని అ.) మఱల్చెన్=తిరుగనంపించెను. నునుజింకగావున గఱికిమొలక లాహారము. గారుడశిలాహారము లేఁతగఱికివలెనుండునుగావున బాలహరిణమును హారమొసంగి మఱల్చెను. గరుడపచ్చలు గఱికివలె నుండుననుటకు-

సీ. ...రాజితదూర్వాంకురముల పసను, జిగితళుకొత్తరాచిలుక యెక్కలవన్నె
.............శుద్ధమరకతంబు. రత్నపరీక్ష.

తనుఁగల్పలతికఁగాఁదలఁచి=తన్నుఁ దీఁగెయనివిచారించియనియర్థము. కోరికలిచ్చెడిదానినిఁగాఁ దలఁచి యని యర్థాంతరము. వ్రాలెడు=వచ్చివ్రాలినట్టి, శారిన్=మాటాడెడు గోరువంకపక్షిని, కరము=హస్తము, రత్నఫలాళిన్=రత్నములనెడుఫలసమూహమును, నెరపి=వెదచల్లి, నిలిపెన్=నివారించెను. రత్నము రక్తగణములోఁ జేరినదికావున వెంటనంటినమచ్చిక గోరువంకకు రత్నఫలము నొసంగెను. దానినిఫలమనుకొని గోరువంక వెంటరాక యచటనే యాగిపోయెను. కీరశారికాదులురత్నములను ఫలములని భ్రమించుటయు సఖీజనము భ్రమింపఁజేయుటయు గ్రంథాంతరములందుఁ గలదు.

తనుఁబద్మమని=తన్నుఁ బంకజమనివిచారించియని యర్థము. పద్మమనెడునిధినిగా విచారించియని యర్థాంతరము. అంటఁబెనఁగు=కదిలిమల్లాడుచున్న, అంచకున్=హంసకు, అంఘ్రి=పాదము, హీర=వజ్రమయమయిన, అంగద=అందెయనెడు, మృణాళము=తామరతూఁడును, ఇచ్చి=అందిచ్చి, అనిచెన్=పంపించెను. చిరకాలమునుండి పద్మమని పాదముల నంచయాశ్రయించెను. పాదకంకణము మృణాళమువలెనుండెను గావున దాని నాయ్యంచకొసంగుటచే నది పరితృప్తినొంది వెనుకకు మఱలెను.

ఆత్మపోషితవర్గంబులు=తనచేతఁ బోషింపఁబడుచున్న యీమయూరాదికములు, అవనిప=వసురాజుయొక్క, అవలోక=దర్శనార్థమయిన, గమన=యానమునకు, అంతరాయంబుగాకయుండన్=విఘ్నకారులు గాకుండునట్లుగా, అవయవంబులె=అనఁగాఁ గొప్పు కుచము కరము అంఘ్రి యనునవయవములే, తోడయ్యెనతివకనుచున్=సహాయమాయె నీమగువకని, నెచ్చెలులు మెచ్చన్=చెలికత్తెలు మెచ్చుకొనఁగా, మానినియొకర్తు=ఒకస్త్రీ, వచ్చెను=ఏతెంచెను.

ఇంతమట్టుకు నావేగమనెడు సంచారిభావమును జెప్పినాఁడు. ఈపద్య మక్కలిప్రాససీసము. నెమిలికిఁ బాములు, జింకలకు గఱికి, శారికలకు ఫలములు, హంసలకు మృణాళములు నాహారములు. దండలు, మరకతహారము, రత్నము, కడియము నొసంగుటతో నెరులు, గుబ్బలు, కరములు, పదములు నాయాపోషితవర్గము నానందపఱచెననిభావము. ఇందు నాయిక యచ్చరలేమగావున శిరఃప్రభృతి పాదపర్యంత మభివర్ణితము.

ఉ. పౌరపురంధ్రు లిట్లు వసు♦పార్థివుఁ గన్గొన వచ్చి మంగళా
చారమనోజ్ఞలాజములు ♦ చల్లిరి సింధుభవావివాహదీ
క్షారమణీయమూర్తి యగు♦శౌరిపయిం గలశాబ్ధినిర్మలో
దారతరంగరేఖలు సు♦ధాలవము ల్వెదచల్లుకైవడిన్. 17

పౌరపురంధ్రులు=కోలాహలపుర సంబంధినులయిన స్త్రీలు, ఇట్లు=ఈపూర్వోక్తప్రకారముగా, వసుపార్థివుఁ గన్గొనవచ్చి=వసురాజును జూడనేతెంచి, సింధుభవా=క్షీరాబ్ధిసంభవయైనలక్ష్మీదేవితోడఁగాఁబోవు, వివాహ=పెండ్లియందలి, దీక్షా=నియమముచేత, రమణీయ=సుందరమగుచున్న, మూర్తియగు=ఆకృతిగలవాఁడైన, శౌరిపయిన్=విష్ణుదేవునిమీఁద, కలశాబ్ధి=క్షీరాబ్ధియొక్క, నిర్మల=స్వచ్ఛములైన, ఉదార=అతిశయములయిన, తరంగరేఖలు=తరంగశ్రేణులు, సుధాలవముల్వెదచల్లుకైవడిన్=అమృతజలబిందువుల వెదచల్లినట్లుగా, మంగళాచారమనోజ్ఞలాజములు=మంగళార్థములయిన వరిపేలాలు, సింధుభవా=శుక్తిమతీనదీసంభవయైన గిరికాదేవిసంబంధమయిన, వివాహదీక్షా=వివాహమందలినియమముచేత, రమణీయమూర్తియగు=సుందరమైన యాకృతిగలవాఁడైన, శౌరిపయిన్=శూరసంభవుఁడయిన వసురాజుమీఁద, చల్లిరి=చల్లినవారైరి.

శ్రీమహావిష్ణువునకును వసురాజునకును లక్ష్మీదేవికిని గిరికాదేవికిని క్షీరాబ్ధితరంగశ్రేణులకును బురస్త్రీలకును సుధాజలబిందువులకును శుభలాజములకును నుపమానోపమేయభావమని విచారింపవలయును. వరిపేలాలుచల్లుట మంగళార్థము. ఇటుల సంభ్రమముగా నేతెంచుట సకాలమున దర్శింపవలయుననియె కాదు. లాజలుచల్లి విధి నెఱవేర్పవలయునని. అలం. ఉత్ప్రేక్ష.

మ. అపు డద్రీశ్వరుఁ డాప్తబాంధవులతో ♦ నభ్రాపగాముఖ్యపు
ణ్యపురంధ్రీతతితో నెదుర్కొనఁ దదీ♦యద్వారసీమన్ సిత
ద్విపమున్ డిగ్గి సురాధిరాజపురవే♦త్రిశ్రేణి సాహో యనన్
నృపచూడామణి తత్ప్రధానజనతా♦నిర్దిష్టమార్గంబునన్. 18

అపుడు=ఆసమయమందు, అద్రీశ్వరుఁడు=కోలాహలుఁడు, ఆప్తబాంధవులతోన్=ఆప్తులైనబంధువులతోడను, అభ్రాపగాముఖ్యపుణ్యపురంధ్రీతతితోన్=ఆకాశగంగమొదలయిన పుణ్యాంగనా

సమూహముతోడను, ఎదుర్కొనన్ = ఎదురురాఁగా, తదీయద్వారసీమన్ = ఆకోలాహలపురద్వారదేశ మందు, సితద్వీపముఁడిగ్గి = వెల్లయేనుఁగునుదిగి, సురాధిరాజపురవేత్రిశ్రేణి = ఇంద్రపురసంబంధులైన వేత్రధరులయొక్క సమూహము - అనఁగాఁ జోపుదార్లు, సాహోయనన్ = పరాకుదెలుపఁగా, నృపచూడామణి = వసురాజశిఖామణి, తత్ప్రధానజనతానిర్దిష్టమార్గంబునన్ = ఆకోలాహలుని యొక్క మహామాత్యజనసమూహముచేత నియమింపఁబడిన మార్గముచేత, ముందరిపద్యముతో నన్వయము.

సీ. మణికుట్టిమములు భా♦మాగీతికార్ద్రవిభావభవ్యజలాప్తిఁ ♦ బాద్య మిడఁగ
మందారసుమకాయ♦మానము ల్పవమానశీర్ణకేసరముల♦ సేస చల్లఁ
జిత్రితారాత్రికా♦పుత్త్రిక ల్కరదీప్తరత్నదీధితుల నా♦రతులు ద్రిప్ప
బహువిధద్వారరం♦భాకోటిపరిపక్వఫలరసంబులమధు♦పర్క మొసఁగ
తే. మున్ను గా నన్న గాన్వయ♦ముఖ్యభవన
లక్ష్మి యిట్లు వివాహవే♦ళామహోప
చారముల నన్నిటి ఘటింప ♦ సాంద్రవిభవ
కలితకల్యాణవేదికఁ ♦ గదిసె నపుడు. 19

మణికుట్టిమములు=మణులచేతఁ గట్టఁబడిన కట్టుభూములు, భామా = స్త్రీలయొక్క, గీతికా =గానమహిమచేత, ఆర్ద్రవిభావ=కరఁగినందున, భవ్యజలాప్తిన్=యోగ్యమయిన యుదకప్రాప్తిచేత, పాద్యమిడఁగన్=పాద్యముసమర్పింపఁగాను, మందార = మందారమను దేవతరువుయొక్క, సుమ= పుష్పములచేత రచింపఁబడిన, కాయమానముల్=పందిళ్ళు, పవమాన=వాయువుచేత, శీర్ణ=రాల్పఁబడిన, కేసరములన్=కింజల్కములచేత, సేసచల్లన్=సేసచల్లఁగాను,

చిత్రిత=సంజాతచిత్రములైన-అనఁగాఁ జిత్రదళయుక్తములయిన, ఆరాత్రికా=ఆరతిపళ్లెరములతోఁ గూడుకొన్న, పుత్త్రికలు=కీలుబొమ్మలు, కర=హస్తములయందు, దీప్త=వెలుఁగుచున్న, రత్నదీధితులన్=మణికాంతులచేత, ఆరతులుద్రిప్పన్=నీరాజనములియ్యఁగాను, బహువిధ=అనేకవిధములయిన, ద్వార=వాకిళ్ళయందలి, రంభాకోటి=కదళీతరుసమూహము, పరిపక్వఫలరసంబులన్=చక్కఁగాఁబండిన పండ్లయొక్కరసముచేత, మధుపర్కమొసఁగన్=మధుపర్కమియ్యఁగాను, మధుపర్క మనఁగాఁ బెరుఁగును దేనెయును గలిపిచేసినదానికి పేరు.

'దధి సర్పి ర్జలం క్షౌద్రం సితైతాభిస్తు పంచభిః
ప్రోచ్యతే మధుపర్కస్తు సర్వదేవౌఘతుష్టయే
జలంతు సర్వతః స్వల్పం సితాదధిఘృతం సమం
సర్వేషా మధికం క్షౌద్రం మధుపర్కే ప్రయోజయేత్' కాళికాపురాణము.

ఉపవాసానంతరము పెండ్లికుమారుఁడు దీనిని భుజించుట సుప్రసిద్ధము.

ఇట్లు = ఈప్రకారముగా, మున్నుగాన్=ముందుగా, అన్నగాన్వయముఖ్యభవనలక్ష్మి=పర్వతకులశ్రేష్ఠుఁడయినయాకోలాహలుని గృహసంపత్తి, వివాహవేళామహోపచారములనన్నిటి ఘటింపన్= పెండ్లిసమయమందు వరునకుఁ జేయవలయునధికోపచారములను యావత్తును సమకూర్పఁగా, అపుడు=

ఆసమయమందు, సాంద్ర=నిబిడమైన, విభవ=వైభవముతోడ, కలిత=కూడుకొన్న, కల్యాణవేదికన్ = వివాహవేదికయైన బంగారపుటరుగును, (ని. 'కల్యాణం మఙ్గళే స్వర్ణే' అని నా.) కదిసెన్ = సమీపించెను.

మహోపచారములను భవనలక్ష్మియె యొనర్చెను. పాద్యమము కుట్టిమములు, మందారలతికలు సేసలు, చిత్రవిగ్రహములు ఆరతులు, ద్వారకదళీస్తంభములు మధుపర్కములు సమయోచితముగఁ బ్రసాదించెను.

మ. నరనాథోత్తము మ్రోల నున్నమితదం◆తస్తంభమై చారుచా
మరకక్ష్యాకదళీకలాపశుభకుం◆భంబై సదామోదమే
దురసారంగమదాంకసంకలితమై◆ తోడ్తో మహావారణ
స్ఫురణల్దెల్పు వివాహవేదికపయిన్◆ శోభిల్లెఁ బద్మావళుల్. 20

ఈపద్యమునందు 'మహావారణస్ఫురణల్' అనువిశేషమువలన వివాహవేదికాపరముగను గజపరముగను నర్థద్వయము కలదు.

నరనాథోత్తము మ్రోలన్=వసురాజునెదుట, ఉన్నమిత=ఎత్తఁబడిన, దంత=గజదంతకృతములైన, స్తంభమై=స్తంభములుగలదై యని వివాహవేదికాపరమయిన యర్థము. ఎత్తఁబడిన స్తంభసదృశదంతములుగలదై యని గజపరమైన యర్థము. చారు=సుందరమయిన, చామర=చమరీశబ్దము పువ్వుగుత్తియందును వర్తించుచున్నది. ('చమరీణాంసమూహశ్చామరమ్') అనఁగాఁ బువ్వుగుత్తులసమూహంబును, లేక వింజామరలును, (ని. 'చమరం చామరే స్త్రీతు మఞ్జరీ మృగభేదయోః' అని మేదిని.) కక్ష్యా=బంతులును, (అనఁగా సుమవీధులు) కదళీకలాప = రంభాతరుసమూహములను, శుభకుంభంబై =పూర్ణకలశములుగలదై యని వేదికాపరమయిన యర్థము. చారుచామర=సుందరములయిన వింజామరలును, కక్ష్యా=మధ్యభాగమందుఁ గట్టెడుత్రాఁడును, కదళీ=కేతనవస్త్రమును, కలాప=నెమలిపింఛమును, శుభకుంభంబై=కుంభస్థలములునుగలదై యని గజపరమయిన యర్థము. కక్ష్యాశబ్దమునకు, (శ్లో. 'కక్ష్యా బృహతికాయాంచ కాంచ్యాం మధ్యేభబంధనే, హర్మ్యాదీనాం ప్రకోష్ఠేచ' అని వి.) కదళీశబ్దమునకు, (ని. కదళీ వైజయంత్యాంచ రంభాయాం హరిణాంతరే') కలాపశబ్దమునకు, (శ్లో. 'కలాపో భూషణే బర్హే తూణీరే సంహతా వపి' అని అ.) కుంభశబ్దమునకు, (శ్లో. 'కుంభౌ ఘటేభమూర్ధాంశౌ' అని అ.) సత్=శ్రేష్ఠమయిన, ఆమోద=పరిమళముచేత, మేదుర=సాంద్రమయిన, సారంగమద=కస్తూరియొక్క, అంక=చిహ్నములతోడ, సంకలితమై = కూడుకొన్నదైయని వేదికాపరమయిన యర్థము. సదా=ఎల్లప్పుడును, మోదమేదుర=ఆనందసాంద్రములగుచున్న, సారంగ=తుమ్మెదలు గలిగిన, మద=మదజలముయొక్క, అంక=చిహ్నములతోడ, సంకలితమై=కూడుకొన్నదై యని గజపరమయిన యర్థము. సారంగశబ్దమునకు, (శ్లో. 'చాతకే హరిణే పుంసి సారఙ్గ శ్శబలే త్రిషు' అని అ.) తోడ్తోన్ = వెంబడిగా-అనఁగా గజపరముగాఁ జెప్పఁబడిన యర్థాంతరములచేతననుట. మహావారణస్ఫురణల్దెల్పు=మహాగజస్ఫూర్తులను కనుపఱుచుచున్న యని యర్థము. మహ=ఉత్సవముయొక్క, అవారణ=అనివార్యములయిన, స్ఫురణల్దెల్పు=స్ఫురణలను దెలుపుచున్నదనిభావము. ఇక్కడ, మహాభద్రవిస్ఫురణల్దెల్పు, అని పాఠాంతరము. భద్రమనఁగా గజవిశేషమును మంగళమును అని గ్రహింప

వలయును. వివాహవేదికపయిన్ = అట్టిపెండ్లియరుగుమీఁద, శోభిల్లెఁబద్మావళుల్ = పద్మమాలికలు ప్రకాశించె నని యర్థము. గజగాత్రబిందుజాలములని యర్థాంతరము. (ని. 'పద్మకం బిందుజాలకమ్' అని యమరము.)

వివాహవేదికను దంతంపుగంబములు పూవుగుత్తులు అరఁటిచెట్లు పూర్ణకుంభములు తావిచిందు కస్తూరియలుకు పద్మమాలికలు లోనగువానిచే నలంకరించిరనిభావము.

క. మనుజవిభుఁ డపుడు నగపతి, పనుపున మణిపీఠి నమరెఁ ♦ బ్రకటితకమలా
కనకాంబరకల్యాణాం, కన కాంత వివాహసదన♦కాంచనవేదిన్. 21

మనుజవిభుఁడు=వసురాజు, అపుడు=ఆసమయమందు, నగపతిపనుపునన్=కోలాహలపర్వతనాథునియనుజ్ఞచేత, ప్రకటిత=సిద్ధమగుచున్న, కమలాకనకాంబర = లక్ష్మీనారాయణులయొక్క, కల్యాణాంకన=పెండ్లిపాటలచేత, కాంత=ఒప్పుచున్న, వివాహసదన=పెండ్లిచవికలోనున్న, కాంచనవేదిన్ =బంగారపు పెండ్లియరుగునందలి, మణిపీఠిన్=రత్నమయమయిన పెండ్లిపీటయందు, అమరెన్=ఒప్పెను. అనఁగాఁ గూర్చుండెననుట.

చ. విధివిహితంబుగా బుధగ♦వీదధిమిశ్రసురద్రుమంజరీ
మధుమధుపర్కము న్విమల♦మౌక్తికపాత్రికఁ దెచ్చి యాగుణో
దధికి నొసంగె మామ మధు♦దానవవైరికి లచ్చి నిచ్చునం
బుధి యమృతాంశుతో నమృత♦పూరము మున్నె యొసంగుకైవడిన్. 22

విధివిహితంబుగాన్=శాస్త్రోక్తప్రకారముగా, బుధగవీ=కామధేనుసంబంధమయిన, దధీ=పెరుఁగుతోడ, మిశ్ర = కలిసిన, సురద్రు = కల్పవృక్షముయొక్క, మంజరీ = పువ్వుగుత్తియందలి, మధు =మకరందమనెడు, మధుపర్కమున్ = మధుపర్కమును, (శ్లో. 'దధిమధునీసర్పిర్వామధ్వలాభే' అని మధుపర్కలక్షణము.) విమలమౌక్తికపాత్రికఁదెచ్చి = స్వచ్ఛమైన ముత్తెపుగిన్నెతోఁ బట్టుకొని వచ్చి, ఆగుణోదధికిన్ = గుణసముద్రుఁడయిన యావసురాజునకు, మామ = మామయగుకోలాహలుఁడు, ఒసంగెన్=ఇచ్చెను. ఏలాగనిన, మధుదానవవైరికిన్ = శ్రీమహావిష్ణువునకు, లచ్చినిచ్చునంబుధి = లక్ష్మీదేవి నిచ్చునట్టి క్షీరసముద్రుఁడు, అమృతాంశుతోన్ = చంద్రునితోడ, అమృతపూరమున్=సుధాపరిపూర్తిని, మున్నెయొసంగుకైవడిన్ = ముందుగానే యిచ్చినట్లువలె, ఇచ్చెనని సంబంధము,

వసురాజునకు గిరికాదేవి నిచ్చునట్టి కోలాహలుఁడు మౌక్తికపాత్రతో మధుపర్క మిచ్చుట విష్ణుదేవునకు లక్ష్మీదేవి నిచ్చునట్టి సముద్రుఁడు చంద్రునితో నమృతపూరము నిచ్చినట్లుండెననియర్థము. అంబుధి యనఁగా నుదధియనిచెప్పి విష్ణుదేవుని మామయయిన యుదధికంటె గుణోదధికిమామయయిన కోలాహలుఁ డధికుఁడని వ్యతిరేకమును విచారింపవలయును. మామయయిన యుదధికంటె గుణోదధికి మామయయినవాఁ డధికుఁడగుట యుక్తము. ద్రుశబ్దమునకు, (ని. 'అనోకహః కుట స్సాలః పలాశీ ద్రు ద్రుమా గమాః' అని అ.)

మౌక్తికపాత్రమనుటకు బదులొకరు శంఖపాత్రమని చెప్పియున్నారు. మౌక్తికపాత్రికయనుచో ముత్తెపుఁజిప్పను జెప్పుటయెయుచితము. ముత్తెములలో ముత్తెపుఁజిప్పలందుఁబుట్టినవి ప్రశస్తములు. అటులె మౌక్తికపాత్రములలో ముక్తాపాత్రములే గణ్యములు. ఇటులనుటకు.

శ్లో. కరీంద్రజీమూత వరాహ శంఖ మత్స్యాహి శుక్త్యుద్భవ వేణుజాని
ముక్తాఫలాని ప్రథితానిలోకే తేషాంతు శుక్త్యుద్భవ మేవభూరి.

చ. అపుడు పురంధ్రివర్గవృతయై చరణాంకకృతార్థమైనక
ప్రపునుమ్రుగ్గుపై మకరపద్మము లేర్పడ నీక్షణప్రభా
స్నపనపవిత్రకుట్టిమమున న్వరనీలనిధు ల్జనింప నా
నృపమణిభాగ్యలక్ష్మికరణిం దరుణీమణి వచ్చె నొయ్యనన్. 23

అపుడు=ఆసమయమందు, పురంధ్రి వర్గవృతయై=ముత్తయిదువలగుంపుచేత నాదరింపఁబడినదై, చరణాంక = పాదచిహ్నములచేత, కృతార్థమైన = ధన్యమయిన, కప్రపునుమ్రుగ్గుపైన్ = కర్పూర పరాగ రచితమయిన రంగవల్లికమీఁద, మకరపద్మములేర్పడన్ = మకరపద్మనిధు లేర్పడఁగాను అని యర్థము. మకరపద్మరేఖలు - అనఁగా మకర పద్మాకృతులుగల ముద్ర లేర్పడఁగానని భావము. ఇక్కడ రంగవల్లీరూపక మకరపద్మములను మకరపద్మనిధులుగా నధ్యవసించినాఁడు. చరణాంక కృతార్థమన్నచోట, చరణాంక = సకలసంపత్సంపాదకములైన పాదచిహ్నములచేత, కృత=చేయఁబడిన, అర్థము = మకరపద్మనిధిరూపార్థముగలదని యొక యర్థము. మకరపద్మరూపములు గలవై కర్పూరపరాగగతములయిన పాదచిహ్నములచేతఁ జేయఁబడిన-అనఁగా నభేదాధ్యవసాయసంపాదితమయిన మకరపద్మనిధిరూపార్థముగలదని మఱియొక యర్థము. ఈలాగున నర్థద్వయమును సూక్ష్మదృష్టిచేత గ్రహింపఁదగినది. ఈక్షణప్రభా = దృష్టిప్రభలయొక్క, స్నపన=స్నానముచేత, పవిత్ర= పావనమయిన, కుట్టిమమునన్ = కట్టుభూమియందు, వరనీలనిధుల్జనింపన్ = వరనిధియును నీలనిధియును జనింపఁగా నని యర్థము. శ్రేష్ఠమయిన నీలకాంతిస్తోమములు జనింపఁగా నని భావము. ఇక్కడ శ్రేష్ఠములయిన నీలకాంతిస్తోమములను వరనిధియును నీలనిధియునుగా నధ్యవసించినాఁడు. ఆనృప మణిభాగ్యలక్ష్మికరణిన్ = ఆవసురాజుయొక్క భాగ్యలక్ష్మి వలె, తరుణీమణి= గిరికాదేవి, ఒయ్యనన్ =ఒప్పిదమగునట్టులుగా, వచ్చెన్=వేంచెను. అనఁగా వసురాజుయొక్క భాగ్యలక్ష్మివంటిది గనుకఁ దాను ద్రొక్కినచోట మకరపద్మనిధులును దాను జూచినచోట వరనీలనిధులును జనింపఁగా గిరికాదేవి వచ్చెననుట. ఈక్షణరుచులను నీలముగను శ్వేతముగను జెప్పుటకలదు.

"యస్యాః కర్ణశ్రవణాంతరేణతరళా తీక్ష్ణాకటాక్షచ్ఛటాః
భృంగాధిష్ఠిత కేతకాగ్రిమదళ ద్రోణీ సదృక్షచ్ఛవిః" కర్పూ.
"వేశ్యాః త్వత్తో నఖపదసుఖాన్ ప్రాప్య వర్షాగ్రబిందూన్
ఆమోక్ష్యన్తే త్వయిమధుకరశ్రేణి దీర్ఘాన్ కటాక్షాన్." మేఘదూతము.

ఉ. ఐదువ లామహేంద్రగురునానతిఁ గొందెర యెత్తి విశ్వధా
త్రీదయితుం సతిం గదియఁదెచ్చిరి వేడ్కఁ బ్రభాతవాతసం
పాదితబోధ లైనసవపద్మిను లాత్మపరాగపాళికా
చ్ఛాదన మావహించి కవజక్కవలం గదియించుకైవడిన్. 24

ఐదువలు = సువాసినులు, ఆమహేంద్రగురునానతిన్ = ఆబృహస్పతియొక్క యనుజ్ఞచేత, కొందెరయెత్తి=ఎఱ్ఱపట్టుతెరఁబట్టి, విశ్వధాత్రీదయితున్ = సమస్తభూమికిని వల్లభుఁడయిన వసురా

జును, సతిన్=గిరికాదేవిని, కదియఁదెచ్చిరివేడ్కన్ = వేడుకచేత సమీపించునట్టులుగా దెచ్చిరి. ఏలాగనిన, ప్రభాతవాత = ప్రాతఃకాలవాయువుచేత, సంపాదిత = పొందఁబడిన, బోధలైన=వికాసముగలవైన, నవపద్మినులు=నూతనపద్మలతలు, ఆత్మపరాగపాళికాచ్ఛాదన మావహించి = తమయొక్కయరుణపరాగ పటలముచేత మాటుచేసి, కవజక్కవలం గదియించుకైవడిన్ = చక్రవాక మిథునమును గదియఁజేసినట్టులుగా, కదియించిరని సంబంధము.

ప్రాతఃకాలవాయువుచేత సంపాదింపఁబడిన వికాసముగల పద్మలతలు తమయొక్క యరుణ పరాగపటలమును మాటుచేసి చక్రవాకమిథునమును గదియఁజేసినట్టులుగా బృహస్పతి యనుమతిచేత సంపాదితబోధలై సువాసినులెల్లపట్టు తెరఁబట్టి వసురాజును గిరికాదేవిని గదియించిరని యర్థము. పద్మినులనఁగా స్త్రీలును గనుక స్వారస్యమును గ్రహింపవలయును. ప్రభాతమునందు మందపవమానము వీచును. ఆవాయువులు పద్మములకు నితరకుసుమములకు వికాసహేతువులు. గాలికిలేచు పద్మపరాగము కెందెర. పరాగము రక్తగణముగఁ జెప్పఁబడినది. ప్రాతఃకాలమునందు వీచుగాడ్పులు మృదుతరముగ నుండును.

చ. తెలతెలవార నొయ్యఁ జనుదెంచి నితాంతరతాంతతాంతలా
చెలువలకింపుగా మెలఁగి చెక్కులఁగూరిన చూర్ణకుంతలా
వళిసరళంబుగా జడిసి వాడినసెజ్జలమీఁదిప్రావిరుల్
తొలఁగఁ బ్రభాతవాయువులు దోఁచుఁ బురిం బరిచారికాకృతిన్.
(పాండురంగమాహాత్మ్యము)

రేలయందు జక్కవలజంట వీడిపోవును. రెండును విరహార్తిమెయి తపించుచుండును. వేగినంతనఁ జిఱుగాలివీచును. అపుడు తమ్మిపూదుమారము తెరవలె లేచును. ఆతెర తొలంగఁగనే చక్రవాకద్వయము గలసికొనును. కవవీడిన జక్కవపులుగులవలెఁ బరస్పరాలోకనోత్సాహముమై గిరికావసురాజు లుత్సాహాతిశయమున నుండిరనిభావము. ప్రభాతమునందు జక్కవలజంట గలిసికొనుననుటకు-

సీ. సంజ్వరార్తరథాంగసమ్మదప్రతిపాది దారుణతిమిరకాంతారవహ్ని
గీ. గ్రహావతంసంబు పూర్వాద్రి గాన నయ్యె. (పంచతంత్రము)

ఉ. రాజకరానుషంగమున ♦ రామకరాంబుజ మొప్పఁ గన్యకా
రాజితహస్తయోగమున ♦ రాజకరంబు నతిప్రకాశ మై
రాజిల రక్ష గట్టుక్రియ ♦ రాజముఖీకరపంకజంబున
న్రాజకరంబునన్ గురుఁ డొనర్చె సమంత్రకకౌతుకాంకముల్. 25

రాజకరానుషంగమునన్ = వసురాజుయొక్క హస్తస్పర్శముచేత, రామకరాంబుజమొప్పన్=గిరికాదేవియొక్క యంబుజమువంటి హస్తమొప్పునట్టులుగా ననియర్థము. చంద్రకిరణానుషంగముచేత రమణీయకరసదృశాంబుజ మొప్పఁగా నని యర్థాంతరము. ఇక్కడ రామపదము రమణీయార్థము. కన్యకారాజిత హస్తయోగమున రాజకరంబు నతిప్రకాశమయి రాజిలన్=అనఁగా గిరికాదేవియొక్క యొప్పిదమయిన హస్తస్పర్శముచేత వసురాజుయొక్క హస్త మత్యంతప్రకాశమై యొప్పునట్టులుగా నని యర్థము. కన్యారాశియైన హస్తనక్షత్రముతోడియోగముచేతఁ జంద్రకిరణము

ప్రకాశింపఁగా నని యర్థాంతరము. ఇంతవఱకు నభేదాధ్యవసాయము. రక్షగట్టుక్రియన్=రక్షాబంధనముచేసినట్లుగా, రాజముఖీకరపంకజంబునన్ = గిరికాదేవియొక్క హస్తకమలమందును, రాజకరంబునన్=వసురాజుయొక్క హస్తమందును, గురుఁడు=బృహస్పతి, సమంత్రక కౌతుకాంకముల్=వేదమంత్రసహితములయిన కంకణలాంఛనములను, ఒనర్చెన్ = చేసెను. అనఁగాఁ గంకణములు గట్టెననుట.

కౌతుకమనఁగా వివాహసూత్రము. కౌతుకమునకు సమంత్రకత్వము ధర్మశాస్త్రమందు,

శ్లో. 'విశ్వేత్తాతే త్ర్యృచా పుంసాం బధ్నీయా ద్దక్షిణేకరే
అథ వామకరే స్త్రీణాం బృహత్సామేతి మంత్రతః.'

అని చెప్పఁబడియున్నది.

మ. సుముహూర్తం బని సన్మును ల్దెలుప నం•చో ద్దివ్యశైలేంద్రుఁ డా
యమరాధీశహితక్రియానిరతు నా•యమ్లానమాలాకలా
పమనోహారి నకుంఠవిక్రమునిఁగా • భావించి లక్ష్మీగురు
త్వము దీపింపఁగ ధార వోసెఁ దనయ • న్వర్ధిష్ణు సంపన్నిధిన్. 26

సముహూర్తంబని సన్మునుల్దెలుపన్=ఇది మంచి ముహూర్తసమయమని మునిశ్రేష్ఠులు బోధింపఁగా, అచ్చోన్=ఆయెడ, దివ్యశైలేంద్రుఁడు = దేవతామహిమగల కోలాహలశైలశ్రేష్ఠుఁడు, ఆ యమరాధీశహితక్రియానిరతున్=ఇంద్రున కిష్టమయిన కార్యమందాసక్తుఁడయిన వసురాజునని యర్థము. రాక్షససంహారముజేసి దేవతాధిపతులకు హితముసేయుచున్నవాని నని విష్ణుపరమైన యర్థాంతరము. ఆ=అట్టి, అమ్లాన=వాడకుండు, మాలాకలాప=పద్మమాలికాభూషణముచేత,మనోహారిన్=ఒప్పుచున్నయావసురాజునని యర్థము వైజయంతీమాలికాలంకృతునని యర్థాంతరము. అకుంఠవిక్రమునిఁగా భావించి=విశబ్దము పక్షియందును వర్తించును గనుక నిక్కడ గరుత్మంతుఁడని చెప్పవలయును. క్రమ మనఁగా సంచారంబునుగనుక నకుంఠమయిన గరుత్మత్సంచారముగలవానిఁగా భావించి-అనఁగా నారాయణస్వరూపునిఁగా భావించి యని యర్థము. వసురాజకుంఠిత పరాక్రమముగలవాఁడని భావము. లక్ష్మీగురుత్వము దీపింపఁగన్ = లక్ష్మీజనకత్వము ప్రకాశింపఁగానని యర్థము. విభవగౌరవము దీపింపఁగాననిభావము. వర్ధిష్ణుసంపన్నిధిన్=వృద్ధిఁబొందెడు సంపదల కాస్పదురాలయిన లక్ష్మీదేవినని యర్థము. అభ్యుదయములకు నిధియయినదాని నని భావము. తనయన్ = అట్టికొమార్తెను, ధారవోసెన్ = ఉదకధారాపూర్వకముగా దానముచేసెను. వసురాజు అమ్లానమాలోదరుఁడు. అకుంఠవిక్రముఁడు గావున విష్ణుమూర్తి.గిరిక వర్ధిష్ణుసంపన్నిధిగావున లక్ష్మీదేవి. కోలాహలుఁడు సముద్రుఁడుగావున లక్ష్మీగురువు. ఇటులనుటకుఁ గన్యాదానసమయమున విష్ణుస్వరూపునిగానల్లుని భావించి కన్యనులక్ష్మిగాఁ దెలుపుమంత్రములతో ధారారూపముగాఁ గన్యాదాతగావించు కన్యాదానవిధి యిట గ్రాహ్యము.

మ. నతచూడాపరికర్మచంద్రతపను • ల్నక్షత్రదామంబునం
బ్రతిబింబింపఁగ నున్నకన్నెయఱుత • న్మాంగల్యసూత్రంబు శా
శ్వతకల్యాణగుణావహుం డునిచె నా•చంద్రార్కనక్షత్రసం
తతిపై మించుతదీయనిత్యగుణము • ల్నాకు ల్ప్రశంసింపఁగన్. 27

నత=సిగ్గుచేత వంచుకొనఁబడిన, చూడా = శిరస్సునందలి, పరికర్మచంద్రతపనుల్ =అలంకారభూతచంద్రసూర్యులు, నక్షత్రదామంబునన్ = ముత్యాలహారమందు, ప్రతిబింబింపఁగన్ =ప్రతిఫలించునట్లుగా, ఉన్నకన్నెయిఱతన్ =ఉన్నట్టి గిరికాదేవియొక్క కంఠమందు, మాంగల్యసూత్రంబు = మంగళసూత్రమును, శాశ్వతకల్యాణగుణావహుండు=శాశ్వతమంగళసూత్రావహుఁడని యర్థము. శుభగుణావహుఁడని భావము. అట్టి వసురాజు, ఉనిచెన్ = ఉంచెను. ఏలాగనిన, ఆచంద్రార్కనక్షత్రసంతతిపైమించు, ఇక్కడ ఆఙ్ అనునవ్యయమభివ్యాప్తిని జెప్పుచున్నది. (ని. 'ఆ జీషదర్థే భివ్యాప్తౌ సీమార్థే ధాతుయోగజే' అని అ.) చంద్రసూర్యసమేతనక్షత్ర సమూహామమీఁద వ్యాపించుచున్న, తదీయనిత్యగుణములు=ఆ గిరికాదేవియొక్క నిత్యములయిన సుగుణంబులనియర్థము.

గుణములు భూమియందు వ్యాపించి యూర్ధ్వలోకమందును వ్యాపించినవనుట. ప్రతిబింబితచంద్రార్కసమేతనక్షత్రదామముమీఁద నున్న గిరికాదేవియొక్క మంగసూత్రత్రయము నని యర్థాంతరము. మంగళసూత్రత్రయమన్నందుకు గృహ్యాకారులచేతఁ జెప్పఁబడినది.

శ్లో. 'మాఙ్గల్యతంతునానేన బధ్వా మఙ్గళసూత్రకమ్
హేమహస్తసరం బధ్వా కణ్ఠేచ త్రిసరంతథా.'

ఈయాచారము దేశాంతరవిషయమని తెలియవలెను. నాకుల్ప్రశంసింపఁగన్ =దేవతలు శ్లాఘింపఁగా, మంగళసూత్రమును గట్టెనని సంబంధము. నక్షత్రదామమనుటకు, (ని. 'సైవ నక్షత్రమాలా స్యా త్సప్తవింశతిమౌక్తికా' అని యమరము.)

చంద్రసూర్యభూషణములు నొసటగలవని యొకరువ్రాసిరి. ఇది ప్రమాదము. మూలమున స్పష్టముగాఁ జూడాభాగాలంకృతములని కలదు. వసురాజుగుణములు భూలోకమునందు నూర్ధ్వలోకమునందును వ్యాపించెను. గిరిక తలవంచుకొనుటచే నాయమతారహారముపై శిరఃకలిత సూర్యచంద్రప్రతిబింబమేర్పడెను. మంగళసూత్రములు మూఁడా హారముపైఁగట్టుట సూర్యచంద్రనక్షత్రములపై వసురాజు మంగళగుణములవ్యాప్తిగా నధ్యవసితము. వసురాజుగుణము లూర్ధ్వలోకవ్యాప్తములు గావు ననే నాకులు ప్రశంసించిరని భావము.

చ. అతివ సతీకరోన్నమిత ♦ యై విభునౌదల నేసఁ జల్లెఁ ద
త్పతినవమౌళిరత్నగత♦భవ్యనిజాకృతి చూచి కంటిరే
పతిశిర నెక్కె నీక్షణమె ♦ బాలయటంచు ధరాధరోపరి
స్థితిసరిదాత్మసంభవకుఁ ♦ జెల్లదె యంచు సఖు ల్వచింపఁగన్. 28

అతివ=గిరికాదేవి, సతీకరోన్నమితయై=పతివ్రతాస్త్రీలయొక్కహస్తములచేత నెత్తఁబడినదై, విభునౌదలన్ =పతియైన వసురాజు శిరస్సునందు, సేసఁజల్లెన్ =తలఁబ్రాలు పోసెను. ఏలాగనిన, తత్పతి = ఆవసురాజుయొక్క, నవ=నూతనమయిన, మౌళి=కిరీటసంబంధములయిన, రత్న=మణులయందు, గత=పొందియున్న-అనఁగాఁ బ్రతిఫలించిన, భవ్య=యోగ్యతరమయిన, నిజాకృతిచూచి=తనయొక్క రూపమును జూచినవారై, కంటిరేపతిశిరసెక్కెనీక్షణమె బాలయటంచున్ =చూచినారటే యీక్షణమందే యీ చిన్నది పెనిమిటితలపై నెక్కెను అని పలుకుచు, ధరాధరోపరిస్థితి సరిదాత్మసంభవకుఁ జెల్లదెయంచున్ =పర్వతాధిపునియొక్క యుపరిభాగమందలి యునికి నదీసంభవయైనదానికిఁ జెల్లదా

యని పలుకుచు అని యర్థము. వసురాజశిరస్స్థితి శుక్తిమతీసంభవయైన గిరికాదేవికిం జెల్లదాయని భావము. సఖుల్వ్రచింపంగన్ = చెలికత్తెలు సరసోక్తులాడంగా, సేసచల్లెనని సంబంధము. వసురాజు మణిఖచిత కిరీటాలంకృత శిరస్కుఁడు. నిలిచి గిరిక సేసలుచల్లునపుడు ఆమె ప్రతిబింబము వసురాజు శిరోరత్నములయందుఁ బ్రతిబింబించెను. మగనితలయెక్కినది గిరికయని కొందఱును అది తగియె యున్నదని కొందఱును బలుక సాగిరి. గిరికనదీసంభవ. వసురాజు ధరాధరుఁడు. ధరాధరోపరిస్థితి నదీసంభవకుఁ దగియుండునని పలికిరని భావము. కొండలపై సెలయేళ్లుంట సాజమెగదా యని యభిప్రాయము.

ఉ. శుక్తిమతీకుమారి కరశుక్తుల ముత్తెపుసేస చల్లనా
రక్తసరోజపాణిపయి రమ్యగుణాబ్ధియు నట్లనించెఁ ద
న్మౌక్తికము ల్వధూకచసమాజకరాంబుజకాయకాంతిసం
సక్తి ననేకవర్ణమణిజాలము లై విభవంబుఁ దెల్పఁగన్. 29

శుక్తిమతీకుమారి = గిరికాదేవి, కరశుక్తులన్ = హస్తములనెడు ముత్తెపుచిప్పలచేత, ముత్తెపుసేసచల్లన్=ముత్యాలతలఁబ్రాలు పోయఁగా, ఇక్కడఁ దల్లి శుక్తులుగలదిగనుకఁ గుమారికయును గరములనెడుశుక్తులు గలదని స్వారస్యమును గ్రహింపవలయును. ఆరక్తసరోజపాణిపయిన్=ఎఱ్ఱదామరపువ్వులవంటి హస్తములుగల యీ గిరికాదేవిమీఁద, రమ్యగుణాబ్ధియు నట్లనించెన్ = రమ్యగుణాబ్ధియనెడు నబ్ధియును-అనఁగా సుగుణసముద్రుఁడయిన వసురాజనెడు సముద్రుఁడును నాప్రకారముగా ముత్యాలతలఁబ్రాలు నించెను. ఏలాగుననినన్, తన్మౌక్తికముల్ = ఆముత్తియములు, వధూ=గిరికాదేవియొక్క, కచసమాజ=తలవెండ్రుకలయొక్కయు, కరాంబుజ=హస్తకమలములయొక్కయు, కాయ=శరీరముయొక్కయు, కాంతి=కాంతులయొక్కయు, సంసక్తిన్=సంపర్కముచేత, అనేకవర్ణమణిజాలములై =అనేకవర్ణములుగల రత్నసమూహములై-

అనఁగాఁ గచకాంతిచేత నింద్రనీలములును గరకాంతిచేతఁ బద్మరాగములునుశరీరకాంతిచేతఁ బుష్యరాగములును నైనవని తాత్పర్యము. ఇక్కడ రక్తసరోజపాణియనెడు గిరికానామము సాభిప్రాయము. విభవంబుఁ దెల్పఁగన్=వైభవము గనుపఱుపఁగా, అట్లనించెనని వెనుకకు నన్వయము.

ఉ. ఆతఱి నమ్మహోనిధి నిరావరణస్ఫురణంబుతోఁ బరి
ద్యోతితపద్మినీసుమమృదుచ్ఛదసంగ్రథితాంశుకాంతుఁ డై
యాతతదీప్తివైభవవృతాంబరపీఠికఁ బొల్చి ప్రాజ్యయో
గాతిశయప్రకాశము హుతాశికిఁ గూర్చె మహాద్భుతంబుగన్. 30

ఆతఱిన్=ఆసమయమందు - అనఁగా సుముహూర్తము రాత్రియందు గనుక రాత్రియందని యర్థము. అమ్మహోనిధి=ప్రతాపనిధియయిన యీవసురాజని యర్థము. సూర్యుఁడని యర్థాంతరము. నిరావరణస్ఫురణంబుతోన్=తెరచాటులేని యునికితోననియర్థము. తమోరూపావరణములేక యని యర్థాంతరము. పరిద్యోమిత=మిక్కిలి ప్రకాశమానమగుచున్న, పద్మినీ=పద్మినీజాతిస్త్రీయైన గిరికాదేవియొక్క, సుమమృదుచ్ఛద=పుష్పకోమలమైనవస్త్రముతోడ, సంగ్రథిత=కూర్పఁబడిన, అంశుకాంతుఁడై=వస్త్రాంచలముగలవాఁడై యని యర్థము. పరిద్యోతిత=ప్రకాశితమైన, పద్మినీ=పద్మలతయొక్క,

సుమమృదుచ్ఛద = పుష్పములయొక్క కోమలదళములతోడ, సంగ్రథిత=సంయోజితములయిన, అంశు=కిరణములచేత, కాంతుఁడై=ఒప్పువాఁడైయని యర్థాంతరము. ఆతత=విస్తారమైన, దీప్తివైభవ=రత్నకాంతులయొక్క వైభవముచేత, వృత = ఆవరింపఁబడిన, అంబర = వస్త్రముగల, పీఠిన్=రత్నపీఠమందు, పొల్చె=ప్రకాశించి యని యర్థము. అతిశయదీప్తిచేత వ్యాపింపఁబడిన గగనమనెడు పీఠమందుఁ బ్రకాశించినవాఁడైయని యర్థాంతరము. మహాద్భుతంబుగన్=అత్యంతాశ్చర్యకరమగునట్టులుగా, ప్రాజ్యయోగ=ప్రకృష్టమయిన యాజ్యాహుతిచేతనైన, అతిశయప్రకాశము=అధికప్రకాశము, హుతాశికిన్=అగ్నిహోత్రునికి, కూర్చెన్=కలుగఁజేసెనని యర్థము. ప్రాజ్యయోగ=ప్రాజ్యమనఁగా నధికము గనుక నధికసంయోగముచేతనైన, యతిశయప్రకాశము నగ్నికిఁగూర్చెనని సూర్యపరమైన యర్థాంతరము.

శ్లో. 'దినాంతేనిహితంతేజ స్సవిత్రేవహుతాశనః' అని చెప్పఁబడియున్నది గనుక నస్తంగతుఁడయిన సూర్యునిచేతనే యగ్నికిఁ బ్రకాశమయినందున పరిద్యోతిత అనునది మొదలు, పొల్చె అనువఱకు అనస్తమితుఁడుగాఁ జెప్పఁబడిన సూర్యుఁడు ప్రకాశము నగ్నిదేవునకుఁ గూర్చెననుట యద్భుతము. ఇందుకు శ్రుతిప్రమాణము. 'ఆదిత్యోవా స్తమయన్నగ్నిమనుప్రవిశతి, అగ్నింవావాదిత్యస్సాయం ప్రవిశతి.' అనియున్నది. అయితే యిక్కడ రాత్రియం దుదయించిన సూర్యునివలన నగ్నికిఁ బ్రకాశ మాశ్చర్యమును గనుక నర్థాంతర మాశ్చర్యముగా నుండెననియు విచారింపవలయును. పగలు సూర్యుఁడుదయించి యస్తమయమునఁ దనతేజము నగ్నిహోత్రమునందుంచుట ప్రసిద్ధమైయుండఁగా (అర్థాంతరముచే) రాత్రియందుదయించుచుఁ దనతేజము నగ్నియందుంచుట మహాద్భుతముగదా! సూర్యుఁ డస్తమించుచుఁ దనప్రకాశము నగ్నిహోత్రమునందుంచుననుటకు-

శ్లో. రుచి ధామ్ని భర్తరి భృశం విమలాః పరలోక మభ్యుపగతే వివశుః
జ్వలనంత్విషః కథమివేతరథా సులభోన్యజన్మని సఏవపతిః. మాఘకావ్యము.

ఉ. లేజవరాలిపాణియుగళీపరిరంభణపాటలీభవ
ల్లాజచయంబు భావినిఖిలక్రతుభుక్తినిమంత్రణాక్షత
శ్రీజనకంబు గాఁగ నునిచెన్ శిఖి నాశిఖియుం బ్రసన్నుఁడై
యాజితచిత్తభూరతుల కారతు లిచ్చెఁ బ్రదక్షిణార్చులన్. 31

లేజవరాలి=లేఁతవయస్సుగల గిరికాదేవియొక్క, పాణియుగళీ=హస్తద్వయముయొక్క, పరిరంభణ=సంపర్కముచేత, పాటలీభవత్=పాటలవర్ణమగుచున్న, అనఁగాఁ దెలుపునెఱుపుగలిసిన వర్ణమగుచున్న, లాజచయంబు=పరిపేలాలు, ఇక్కడ గిరికాదేవి హస్తము లెఱ్ఱనికాంతిగలవిగనుకఁ దత్సంపర్కముచేతఁ దెల్లనిలాజలు పాటలవర్ణములయినవని యాశయము. భావి=ముందుచేయఁబోవు, నిఖిలక్రతు=అశ్వమేధాంతములయిన సకలయజ్ఞములయందలి, భుక్తి=భోజనముకొఱకు, నిమంత్రణాక్షత=నియమించి యిచ్చునట్టి యక్షతలయొక్క, శ్రీ=సమృద్ధికి, జనకంబు గాఁగన్=సంపాదకమగునట్టులుగా, శిఖిన్ = అగ్నియందు, ఉనిచెన్ = ఉంచెను. అనఁగా నగ్నియందు లాజహోమముచేసెననుట. ఆశిఖియున్=ఆ యగ్నిహోత్రుఁడును, ప్రసన్నుఁడై=అనుగ్రహించినవాఁడయి, ఆజితచిత్తభూరతులకున్ = సౌందర్యముచేత జయింపఁబడిన మన్మథుఁడును రతీదేవియునుగల వసురాజు

నకు గిరికాదేవికిని, ప్రదక్షిణార్చులన్ = ప్రదక్షిణాకారజ్వాలలచేత, ఆరతులిచ్చెన్ = నీరాజనము లిచ్చెను.

అగ్ని దేవుఁడు కుడిదిక్కుకై ప్రజ్వరిల్లిన శుభము చేకూడు నని ప్రసిద్ధము. లాజలు చయము గావున రెండుచేతులతోఁ గలయఁబట్టుకొనెను. ఇదియ పరిరంభణము. ''ఈషద్రక్తస్తు పాటలః'' కావున స్వతస్సిద్ధముగాఁ దెల్లనివగు పేలాలు హస్తస్పర్శమున నెఱ్ఱబడెను. కావునఁ దెలుపునెఱుపు గలసియుండెను. ఇవి యగ్నియందుంచుట ముందుయజ్ఞాదులందు భుక్తికిని మంత్రణాక్షతల నొసంగు నటులుండెను. కావుననే యగ్నిభట్టారకుఁడు తృప్తినొంది నివాళు లొసంగెను.

మ. జనకోత్సంగనివాసవాసననొ రా♦జన్యస్తహస్తాభిమ
ర్శనసౌఖ్యామృతపారవశ్యముననో ♦ సైఁచెన్ శిలాయోజనం
బని సాధ్వు ల్వొగడం బ్రియాంఘ్రి సనెక♦ ల్ద్రొక్కించె భూజాని త
ద్ఘనభాగ్యంబు ఝుళంఝుళత్కటకర♦త్నంబు ల్ప్రశంసింపఁగన్. 32

జనక = తండ్రియైన కోలాహలపర్వతునియొక్క, ఉత్సంగ = తొడయందలి, నివాస=ఉనికి యొక్క, వాసననో = సంస్కారముచేతనో - అనఁగా నభ్యాసముచేతనో, లేక, రాజ = వసురాజు చేత, న్యస్త=ఉంపఁబడిన, హస్త = కరముయొక్క, అభిమర్శన = సంపర్కమువలననయిన, సౌఖ్యామృత = అమృతప్రాయమైన సుఖభావముచేత, పారవశ్యముననో = పరవశత్వముచేతనో, శిలాయోజనంబు=ఱాయిదాఁకుటను, సైఁచెన్=సహించెను, అని=అన్నవారై, సాధ్వులు=పతివ్రతలు, పొగడన్=కొనియాడుచుండఁగా, భూజాని = వసురాజు, ప్రియాంఘ్రిన్ = ప్రియురాలయిన గిరికాదేవి పాదమును, సనెకల్ద్రొక్కించెన్ = సన్నెకల్లుతాఁకించెను. ఏలాఁగనిన, తద్ఘనభాగ్యంబు = ఆసన్నెకల్లు త్రొక్కించుటయొక్క వైభవమును, ఝుళంఝుళత్ = ఝుళంఝుళమని మ్రోయుచున్న, కటక= అందెలయొక్క, రత్నంబుల్=మణులు, ప్రశంసింపఁగన్=శ్లాఘించునట్లుగా, సనెకల్ద్రొక్కించెను. అని సంబంధము.

రత్నములు శిలాజాతియే కావున మనజాతిలోని సన్నెకల్లు గిరికాపదస్పర్శభాగ్యముం బొందె నని ఝుళంఝుళధ్వని యనువాక్యముచేఁ బొగడె నని తాత్పర్యము. కటకములు రత్నఖచితములు. అవి మొరయుట సహజముగనె. కానిరత్నములు తమకృతార్థత వెలిబుచ్చుగతి మెఱసె ననుభావ మిట గ్రాహ్యము. వసురాజు గిరికపాదమును బట్టుకొని సన్నెకల్లును దాఁకించెను. కావుననే హస్తాభిమర్శన సౌఖ్యామృతపారవశ్యము గిరికకుఁ గలిగెను. గిరికతండ్రి శిలామూర్తి కోలాహలుఁడు. అతనియుత్సంగనివాసము అభ్యాసవాసన. గిరిక సుకుమారి, లేజవరాలు. శిలాయోజనముసైచుట స్పర్శసుఖపరవశము ననో అభ్యాసవాసననో యైయుండును. లేకున్న నోరువఁజాలదని భావము.

చ. సిరులు ఫలింప దంపతులు ♦ చెంత నరుంధతిఁ జూచుచోఁ బర
స్ఫురనయనాంతము ల్గదియ ♦ బాలికచూపులు పర్వె నప్పుడ
ప్పరమసతీపదాబ్జముల♦పై భవదీయసువాసినీత్వవై
ఖరిఁ గరుణింపు మంచు విరి♦గల్వలఁ బూజలు సల్పెనో యనన్. 33

సిరులుఫలింపన్=సకలసంపత్తులును జేకూడెడునట్లు,దంపతులు=వధూవరులు, చెంతనరుంధతిఁ జూచుచోన్ = ఈవివాహార్థమైవచ్చి సమీపమందేయున్న యరుంధతిని జూచెడుసమయమందు, పరస్పరనయనాంతము ల్గదియన్ = అన్యోన్యావలోకనముగాఁగానే, బాలికచూపులు=గిరికాదేవివీక్షణములు, అప్పుడు=ఆసమయమందు, అప్పరమసతీపదాబ్జములపైన్=పరమపతివ్రతయైన యాయరుంధతి యొక్క పాదములమీఁద, పర్వెన్=వ్యాపించెను. అనఁగా దంపతులకుఁ బరస్పరాలోకనము సిద్ధింపఁగానే గిరికాదేవి లజ్జచేతఁ దలవంపఁగా నాయమచూపు లరుంధతియొక్క పాదములమీఁదఁ బ్రసరించెనని తాత్పర్యము. ఆప్రసరించుట యేలాగుననుండెననిన, భవదీయసువాసినీత్వ వైఖరిఁగరుణించుమంచున్=నీయొక్క ముత్తైదువతనమువంటి ముత్తైదువతనమును దయచేయుమని, విరిగల్వలఁబూజ సల్పెనోయనన్=వికసించినకలువపూవులచేతఁ బూజచేసినదో యన్నట్టులుగా నుండెననుట. జవ్వనుల చూపులు నల్లకలువలవలె నుండుననుట ప్రసిద్ధము.

శ్లో. కాంతేత్యుత్పలలోచనేతి విపులశ్రోణీభరేతి. — భర్తృహరి.
చ. ఇరువురు నీలనీరజనిభేక్షణ లించినవేడ్కతో. — శృంగారనైషధము.
శ్లో. నీరాత్తీర ముపాగతా శ్రవణయోస్సీమ్నిస్ఫురన్నేత్రయోః
శ్యామం లగ్నమిదం కిముత్పలమితి జ్ఞాతుం కరం న్యస్యతి. — రసమంజరి.
శ్లో. ఇందీవరేణ నయనం ముఖ మంబుజేన
కుందేన దంత మధరం నవపల్లవేన. — ఋతుసంహారము.

సీ. వెలయించి రభిజాత♦వేదులతో జాతవేదుఁ బ్రదక్షిణా♦పాదనములఁ
గాంచిరి ధ్రువపదం♦ బంచితామరవర్యవరముతో నుత్తరో♦త్తరముగాఁగఁ
దాల్చిరి గురుతపో♦ధనులదీవనలతో నమృతవర్ణంబు లా♦ర్ద్రాక్షతములు
తిలకించి రవలోకి♦చలకిరీటములతో రత్నరమ్యములు నీ♦రాజనములు
తే. తనిపి రనుపాధికహవప్ర♦దత్తరుచిమ
దమృతసారాన్నసామగ్రి ♦ నాత్మబంధు
జాతములతో మహోత్సవా♦యాతసకల
శతమఖపురాధివాసుల ♦ సతియుఁ బతియు. 34

సతియుఁబతియున్=గిరికాదేవియును వసురాజును, అభిజాతులనఁగా సత్కులీనులును, వేదులనఁగా వేదముగలవారునుగనుక సత్కులీనులైనశ్రోత్రియులతోడ, (ని.'అభిజాతస్తుకులజేబుధే'అని అ.) జాతవేదున్=అగ్నిహోత్రుని, ప్రదక్షిణాపాదనములన్=ప్రదక్షిణాపాదనములచేత, వెలయించిరి=ఉల్లసిల్లఁజేసిరి, అనఁగా నగ్నిదేవుని బ్రదక్షిణములచేతను శ్రోత్రియులను బ్రకృష్టదక్షిణలచేతను వెలయించిరని యర్థము. విధివిహితముగా నగ్నిదేవుని భూదేవుల సంతుష్టిపఱచి రనుట.

అంచితామరవర్యవరముతోన్=ఒప్పుచున్న దేవతావరముతోడ, ధ్రువపదంబు=ధ్రువునియొక్క స్థానమును, ఉత్తరోత్తరముగాఁగన్=అనఁగా నుత్తరస్థితములైనచుక్కలకు నుత్తరస్థితముగాను నుత్తరోత్తరాభివృద్ధిగాను, కాంచిరి, అనఁగా ధ్రువపదమును జూచిరనియును దేవతావరము బొందిరనియును నర్థము.

గురుతపోధనులదీవనలతోన్=పెద్దలైనమునులయొక్క దీవనలతోడ, అమృతవర్ణంబు లార్ద్రాక్షతములు=అనఁగానమృతధవళములని యక్షతపరమైనయర్థము. అమృతాక్షరములు గలవియని దీవనల పరమైన యర్థము. కనుక నమృతధవళాక్షతములను నమృతాక్షరసహితములైనదీవనలను, తాల్చిరి=వహించిరి.

అవలోకి=చూచెడివారియొక్క, చల=శిరఃకంపమువలనచంచలములైన, కిరీటములతోన్=కిరీటములతోడ, రత్నరమ్యములు నీరాజనములు=అనఁగా రత్నములవలె రమ్యములైనవని నీరాజనపరంబును రత్నములచేత రమ్యములైనవని కిరీటపరంబును గనుక రత్నరమ్యములైన నీరాజనములను నవలోకిజనశిరఃకిరీటములను, తిలకించిరి = కటాక్షించి చూచిరనియర్థము.

ఆత్మబంధుజాతములతోన్=తమబంధుసమూహములతోడ, మహోత్సవ=వివాహమహోత్సవమునకు, ఆయాత=వచ్చిన, సకల=సమస్తమైన, శతమఖపురాధివాసులన్=ఇంద్రపట్టణమే నివాసముగాఁగలదేవతలను, అనుపాధిక=అయత్నసిద్ధమైనదియు, హవప్రదత్త=హోమముచేత నీఁబడినదియు, రుచిమత్=చవిగలిగినదియునగు, అమృతసారాన్నసామగ్రిన్=హవనముచేత దత్తమైనదిగనుకనమృతరూపమైన సారాన్నసామగ్రిచేత,తనిపిరి=దేవతలను దృప్తిబొందించిరనియును నయత్నసిద్ధమైనదియు, హవప్రదత్తమనఁగా నాహ్వానముచేత నీఁబడినదియు, రుచిమత్=షడ్రుచులుగలిగినదియునగు, అమృతసారాన్నసామగ్రిన్=అమృతమువలె సారమైన యన్నసామగ్రిచేత నాత్మబంధువులను దృప్తిబొందించి రనియును నర్థము.

క. వీడు చదివించె నయ్యెడ, వీడనివేడుక బలారి • విబుధులతో లే
వీడు మణు లనఁగఁ దగుతన, వీడునఁ గలమానికములు • వివిధాంబరముల్. 35

అయ్యెడన్=ఆసమయమందు, బలారి=ఇంద్రుఁడు, విబుధులతోన్=దేవతలతోడ, వీడని వేడుకన్=శిథిలముగాని యుత్సవముచేత, లే వీడు మణు లనఁదగు=వీనికి సమానములైన మణులులేవను నట్టులుగాఁ దగియున్న, తనవీడునఁగలమానికములు=తనపట్టణమందు-అనఁగా స్వర్గమందుఁ గలిగిన రత్నములును, వివిధాంబరముల్=నానావిధములైనదివ్యాంబరములును, వీడుచదివించెన్=కట్నము చదివించెను.

సీ. గండశైలములకుఁ • గరపాదములు వచ్చెనో యన మెఱయునా • గాయుతములు
హరిణజాతికి మరు • న్నిరసనోద్ధతి గల్గెనో యనఁ దగుసైంధ • వోత్కరములు
నంభోదములకుఁ బా • యనిమించు లొదవెనో యన మించుమణిమయ • స్యందన [ములు
నవలతావళికి యా • నవిలాస మెసఁగెనో యనఁ బొల్చుసరసక • న్యాయుతంబు
తే. లాత్మ మణిహేమరజతంబు • లపుడ యుచిత
తనువులు వహించెనో యనఁ • దనరువివిధ
శయనపాత్రాసనములు భూ • జాని కొసఁగె
హరికృపాలబ్ధశుభ శాలి • యచలమాలి. 36

గండశైలములకున్ = గండశిలలకు - అనఁగా గొప్పగొప్పఱాళ్ళకు, కరపాదములువచ్చెనో యనన్=తుండములును కాళ్లును వచ్చినవాయేమి యనునట్టులుగా, మెఱయు=ప్రకాశించుచున్నట్టి, నాగా

యుతములు = అయుతమనఁగాఁ బదివేలకుఁ బేరు. అట్టియనేకాయుతసంఖ్యలు గలయేనుఁగులను, ఏనుఁగులు నడగొండలవలెనున్నవనుటవలన దేహదార్ఢ్యము స్థూలోన్నతములు సూచితములు. కరపాద భేదములేకున్న నేనుంగులు కొండ లుపమానముగా నుండుననుట.

హరిణజాతికిన్=లేళ్ళసమూహమునకు, మరున్నిరసనోద్ధతిగల్గెనో యనన్=వాయువును దిరస్కరించెడి యెగువుగలిగినదాయేమి యనునట్లులుగా, తగు=ఒప్పుచున్న, సైంధవోత్కరములు=అశ్వసమూహములను,హరిణములు వాయువునకువారువములు. వాయువును మోయుటచే భారవహనమువలన గమనమాంద్యమేర్పడెను.వాయువును దిరస్కరించినచో నిరాటంకముగా నతిశయవేగముతోఁ బోగలుగు ననుట. గాలిని దిరస్కరించువేగముగల యశ్వములిచ్చెనని భావము.

అంభోదములకున్=మేఘములకు, పాయనిమించులాదవెనొయనన్=ఎడతెగనిమెఱుపులుపొందినవారేమి యనునట్లులుగా,మించు=అతిశయించుచున్న, మణిమయస్యందనములు=రత్నమయములైన రథములను, అరదములున్నతముగనుండి రత్నఖచితములై ప్రకాశించుచుండెననిభావము. స్యందనములు మమణిమయములు.కావుననే యెడతెగక ప్రకాశించుట. మణికాంతు లెడతెగక కాంతిల్లుమెఱుపుల వలె నుండెననిభావము.

నవలతావళికిన్=లేఁదీఁగెలయొక్కగుంపులకు, యానవిలాసమెసఁగెనోయనన్ = నడకయొక్కవిలాసమొప్పినదాయేమియనునట్లులుగా, పొల్చు=ప్రకాశించుచున్న, కన్యాయుతములు=అయుత సంఖ్యలుగలస్త్రీలను, కన్యామణులందఱు తీఁగవంటిమేనుగలవారు. తీఁగలుగమనశక్తిలేనివి. వీరియందు గమనవిలాసముగలదు. ఇట్టికన్య లొకతెకాదు పదివేలమంది.

ఆత్మమణిహేమరజతంబులు=తనసంబంధమై - అనఁగాఁ దనయందున్న రత్నములును బంగారును వెండియు, అపుడ=ఆసమయమందే, ఉచితతనువులు వహించెనోయనన్ = అర్హములైనదేహములను ధరించినవారేమి యనునట్లులుగా, తనరు = ఒప్పుచున్న, వివిధ=నానావిధములైన, శయన=శయ్యలును, పాత్ర=పాత్రసామగ్రులును, ఆసనములు=పీఠములును, హరి = ఇంద్రునియొక్క, కృపా=దయచేత, లబ్ధ=పొందఁబడిన, శుభ=శుభములచేత, శాలి=ఒప్పుచున్న, అచలమాళి=పర్వతశ్రేష్ఠుఁడైన కోలాహలుఁడు, భూజానికొసఁగెన్=వసురాజున కిచ్చెను. గండశైలములు, హరిణములు, మేఘములు, తీఁగలు మణిహేమరజతములు ఇవి పర్వతస్థితవస్తుసముదాయము. ఇవి నగరోచితవస్తువులుగా మాఱినటులఁ జూపఱకుఁ దోఁచుచుండెను.

సీ. కస్తూరిమెకములు ♦ కమ్మజవ్వాదిపిల్లులు సుమ్మివి మదంక♦విలసితములు
ఘనసారకదళిక ♦ ల్గంధద్రుపులు సుమ్మివి మదీయజీవన♦సమధికములు
కిన్నరద్వంద్వము ♦ లీక్కరరాజములు సుమ్మివి మదీయక్రోడ♦వివళితములు
మాణిక్యసారంబు ♦ లాణిముత్యములు సుమ్మివి మదాకరవంశ♦హిండితంబు

తే. లివి మృదులదివ్యవసనంబు ♦ లివి యమూల్య
భూషణము లివి యమ్లాన♦పుష్పములు మ
దగ్రసంతానజములు సు ♦ మ్మనుచుఁ దెలిపి
యల్లునికి నిచ్చె వెండియు ♦ సాదరమున.

కస్తూరిమెకములు=కస్తూరిమృగములును, కమ్మజవ్వాదిపిల్లులు=మనోహరమైన జవ్వాదిని గలుగఁజేసెడుపిల్లులును, ఇవి=ఇవి, మత్=నాయొక్క, అంక=తొడమీఁద, విలసితములుసుమ్ము=ఒప్పుచుండునట్టివి సుమాయని యర్థము. సమీపమం దొప్పుచుండునవియని యర్థాంతరము. ఘనసారకదళికల్=కర్పూరపనంటులును, గంధద్రుములు=శ్రీచందనవృక్షములును, ఇవి=ఇవి, మదీయజీవనసమధికములుసుమ్ము=నాయొక్క బ్రతుకునకంటె నధికములైనవి-అనఁగా నాప్రాణమునకంటె నెక్కువైనవి సుమాయని యర్థము. నాయందలి యుదకమువలన నధికములైనవని యర్థాంతరము.

కిన్నరద్వంద్వముల్ = కిన్నరపక్షిమిథునములును, కీరరాజములు=రాచిలుకలును, ఇవి=ఇవి, మదీయ=నాయొక్క, క్రోడ=భుజాంతరమందు, వివళితములుసుమ్ము=ప్రవర్తించునట్టివి సుమాయని యర్థము. నాయొక్క గుహాంతరమందుఁ బ్రవర్తించునట్టివియని యర్థాంతరము. మాణిక్యసారంబులు=పద్మరాగమణిశ్రేష్ఠములును, ఆణిముత్యములు=ఆణియనెడు విశేషముగల ముత్తెములును, ఇవి=ఇవి, మదాకర=నాకు నాకరమయిన, వంశ=కులమందు, హిండితంబులుసుమ్ము=ప్రవర్ధమానములైనవి సుమాయని యర్థము. మత్=నాసంబంధమయిన, ఆకర=గనులయందును, వంశ=వెదుళ్లయందును, హిండితములుసుమ్ము=ప్రవర్ధమానములైనవని యర్థాంతరము.

ఇవి మృదుల దివ్యవసనంబులు=మృదువులైన దివ్యాంబరములివియును, ఇవి యమూల్యభూషణములు=విలువలేనియాభరణములివియును, ఇవి యమ్లానపుష్పములు=ఎప్పటికిని వాడిపోని పుష్పములివియును, మదగ్రసంతానజములుసుమ్ము=నాయొక్క జ్యేష్ఠపుత్రసంభవములు సుమాయని యర్థము. జ్యేష్ఠపుత్త్రునియొక్క సంతానము తండ్రికిఁ బ్రియమయినదగుట ప్రకటము. అగ్రభాగములయందలి సంతానము లనెడు దేవవృక్షములవలనఁ బుట్టినవని యర్థాంతరము. అనుచుఁ దెలిపి=ఈలాగనిపలుకుచుఁ దెలియఁజేసి, అల్లునికిచ్చెన్=అల్లుఁడైనవసురాజునకిచ్చెను, వెండియు నాదరమునన్=తిరుగా మున్నచేత, ముందరిపద్యముతో నన్వయము.

అంకవిలసితములు, జీవనాధికములు, క్రోడవివళితములు, వంశహిండితములు, అగ్రసంతానజము లనుటవలన నాయావస్తుసముదాయము కోలాహలునకు మిగులఁ బ్రియతరమైనదనుట. ఇట్టి ప్రియవస్తువుల నల్లునకొసంగుట "వెండియున్ ఆదరమున" వస్తుగుణవిశేషములు తెలిపి యిచ్చుట యుచితవిధి నాదరముతో నుపయోగించుకొనుమని.

చ. అసదృశభక్తి శుక్తిమతి ♦ యాత్మజరత్నములన్ నిరంకుశ
ద్విసృమరదీప్తివాని శుచి♦వృత్తమహత్త్వమువాని నన్నిటిన్
వసున కొసంగి యయ్యెడ న♦వారితభూరితదీయసామ్యవ
ద్వసుపదనామపుత్త్రమణిఁ ♦ దద్వసుపాదము సేర్చెఁ జేర్చినన్. 38

అసదృశభక్తిన్=సమానరహితమయిన భక్తిచేత, శుక్తిమతి=శుక్తిమతీనది, ఈశుక్తిమతీపదము సాభిప్రాయము. నిరంకుశత్=నిరంకుశమయినదానివలె నాచరించుచున్న-అనఁగా నప్రతిహతమును, విసృమర=వ్యాపనశీలమయిన, దీప్తివానిన్=కాంతిగలిగినవియు, శుచివృత్తిమహత్త్వమువానిన్=శుభ్రవర్తులపృథుత్వములు గలిగినవియును అనఁగా ధవళిమయును వట్రువయును నురువును గలిగిన, ఆత్మజరత్నములన్=తనవలనఁబుట్టిన ముక్తామణుల నని యర్థము. అప్రతిహతంబును వ్యాపనశీలంబు

నయిన ప్రతాపముగలిగినవియుఁ బరిశుద్ధవృత్తి మహత్త్వము గలిగినవియునగు కుమారరత్నముల నని యర్థాంతరము. అన్నిటిన్వసునకొసంగి=అన్నిటిని వసురాజునకిచ్చియని యర్థము. వసువనఁగాఁ గాంచనమనుగాన, శ్లో. 'అనర్ఘమపిమాణిక్యం హేమాశ్రయమపేక్షతే' అనియున్నది. వసువునకు, వసునకు, అని రెండువిధములుగాను బ్రయోగింపవచ్చును.

ఇందుకు లక్షణము—

తే. 'వుత్వము విసర్గలోపంబు నొందనొకటి, చను నుకారాంతశబ్దంబు దెనుఁగుసేయ
రఘురఘువు బాహుబాహువు రాహురాహు, వూరునూరువు నన మేరుమేరు వనఁగ.'

అని చెప్పంబడియున్నది.

ఆవారిత=అనివార్యమయిన, భూరి=అధికమయిన, తదీయ = ఆయాత్మజరత్నములయొక్క, సామ్యవత్=సమానధర్మములుగలిగిన, వసుపదనామపుత్త్రమణిన్=వసుపదుఁడనెడు పుత్త్రమణిని, అని యర్థము. మణిశబ్దము శ్రేష్ఠవాచకము.

ఇక్కడ మణికిని బుత్త్రమణికిని సౌందర్యసామ్యంబును శ్లిష్టవిశేషణసామ్యంబును నాత్మరత్నపదవాచ్యత్వసామ్యంబునునని తెలియవలయును. ఆత్మజరత్నములను వసున కొసంగియని చెప్పుటచేత రత్నము వసుపదమగుచున్నది గనుక వసుపదరూపమయిన యభిధేయత్వసామ్యంబును గలదని తెలియవలయును. తద్వసుపాదమునేర్చెన్=ఆవసురాజుయొక్క పాదమందుఁజేర్చెను-అనఁగా నమస్కారము నేయించెననుట, చేర్చినన్=ఆలాగునఁజేర్పఁగా, ముందరిపద్యముతో నన్వయము.

శక్తిమతి తనయందలి రత్నములనన్నింటిని వసురాజున కొసంగెను. రత్నములు నిరంకుశద్యుమరదీప్తివంతములు శుచివృత్తములు. వీనికిఁ దోఁబుట్టువగు వసుపాదుఁడును నిట్టివాఁడె. సామ్యము భూరియు, నవారితమును. ఇట్టిరత్నములు వసురాజున కొసంగుట నసాధారణభక్తిచేత. దీనిచేఁబుత్రిపైఁగల ప్రేమాతిశయము వ్యక్తము.

మ. సకలాశాంతనిశాంతరాజమకుటీసంక్రాంతమాణిక్యకో
రకనీరాజనము న్మహాకటకధౌరంధర్యముం గాంచి పా
యక పద్మోన్నతిఁ బూనుచు న్నిజసదాఖ్యాయోగ్యత న్మించ రా
జకులగ్రామణి యుంచె నవ్వసుపదున్ సైన్యాధిపత్యంబునన్. 39

సకలాశాంతనిశాంత = సమస్తదిగంతములయందును నివాసముగలిగిన, రాజ=రాజులయొక్క, మకుటీ=కిరీటములయందు, సంక్రాంత=కూడుకొన్న, మాణిక్యకోరక = మొగ్గలవలెనున్నమాణిక్యముల చేత, నీరాజనమున్=ఆరతియును, మహాకటకధౌరంధర్యమున్ = మహత్తరములైన పాదవలయములయొక్క ధురంధరత్వమును, కాంచి=పొందియని పాదపరమయిన యర్థము. దిక్కుదిక్కులయందలి రాజులు కిరీటమాణిక్యకాంతులు పరిభ్రమించునట్లుగాఁ జేయుచున్న శిరఃకంపములను మహాపట్టణధురంధరత్వమునం బొందియని వసుపదపరమయిన యర్థము. పాయకపద్మోన్నతిఁ బూనుచున్=విడువక పంకజోన్నతినిగాని పద్మరేఖోన్నతిగాని వహించుచునని పాదపరమయిన యర్థము. సంపదభ్యున్నతిని వహించుచును అని వసుపదపరమయిన యర్థము. నిజపదాఖ్యాయోగ్యతన్మించన్=తనయొక్క అనఁగా వసురాజుయొక్క పాదమందలి శోభయొక్క యోగ్యతచేత అనియర్థము.

పాదనామముయొక్క యోగ్యతచేత నని భావము. అనఁగా వసుపదుఁడను పేరునకు సర్థాత్వముచేత అతిశయించఁగా, రాజకులగ్రామణి=రాజశ్రేష్ఠుఁడయిన వసురాజు, అవ్వసుపదున్=ఆవసుపదుని, సైన్యాధిపత్యంబునన్=సేనాధిపతిత్వమందు, ఉంచెన్=ఉంచినవాఁడాయెను. అనఁగాఁ దనయొక్క సేనాధిపతినిగా నిర్ణయించె ననుట. కటకధురంధరత్వము, రాజమకుటమణినీరాజనము, పద్మోన్నతి వసుపాదమనెడ సహజవిభవములు. వసుపాదునకు సైన్యాధిపత్యము నొసంగుటవలన రాజ్యపాలనము, రాజసేవాగ్రహము, ఐశ్వర్యసమృద్ధి చేకూరెను. ఇవి వసుపాదు పేరికిని వసురాజుపాదమునకును సర్థాములు.

ఉ. రాజపురందరుండు నగ♦రాజతనూజయు నిట్లు శక్రసం
యోజితమంగళం బెనసి ♦ యున్కిఁ గనుంగొని మున్ను వారి ను
ద్వేజకతీవ్రతేజమున ♦ వేచినసాహసి గాన వేగ నం
భోజవిరోధి సేరెఁ బర♦భూధరకందరకోటరాంతమున్. 40

రాజపురందరుండు=రాజేంద్రుఁడైన వసురాజును, నగరాజతనూజయున్=కోలాహలపర్వత రాజనందనయైన గిరికా దేవియును, ఇట్లు=పూర్వోక్తప్రకారముగా, శక్రసంయోజిత మంగళంబె నసి=ఇంద్రునిచేత సంఘటపఱుపఁబడిన వివాహరూపశుభముఁబొంది, ఉన్కిఁ గనుంగొని=ఉండుటను జూచి, మున్ను=వివాహమగుటకుముందు, వారిన్=ఆదంపతులను, ఉద్వేజక=భయంకరమయిన, తీవ్ర తేజమునన్=తీక్ష్ణప్రతాపముచేతననియర్థము. వేచినసాహసిగానన్=బాధించిన సాహసవంతుఁడుగనుక, వేగన్=శీఘ్రముగానని యర్థము. తెల్లవారవచ్చెడు సమయమున నని యర్థాంతరము. అంభోజవిరోధి =చంద్రుఁడు, పరభూధర=పశ్చిమాచలముయొక్క, కందర=గుహయనెడు, కోటర=తొఱటయొక్క, అంతమున్=అంతఃప్రదేశమును, చేరెన్=ప్రవేశించెను. అనఁగా నస్తమించె ననుట. వివాహమంగళము ఇంద్రసంయోజితము. కావున దాంపత్యమెంతయు నొప్పియున్నదనుట. భావిశుభము గమనింపక సాహసియగు చంద్రుఁ డిరువురను మిగుల వేధించెను. ఇపుడు తనలోపముఁ దాను గమనించి దంపతులచూడ నోడి చంద్రుఁడు చాటునకేగెనని భావము. అవమానితులు చాటుననుంట సహజము.

మ. జనరాడ్దివ్యవివాహవైభవము మిం♦చన్ రేయి రేరాజు నిం
చినజ్యోత్స్నాంశువితానతారకసుమ♦శ్రేణు ల్నెఱు ల్వీడఁగా
దినరా జన్నియు నూడ్చి యయ్యెడ మిళ♦త్తేజోమయాతామ్రనూ
తనపట్టాంబరము ల్ఘటించె హరిదం♦తవ్యోమభాగంబునన్. 41

జనరాడ్దివ్యవివాహవైభవమమించన్=వసురాజుయొక్క యోగ్యమైన వివాహవైభవ మతిశయించునట్లుగా, రేయిన్=రాత్రియందు, రేరాజు=చంద్రుఁడు, హరిదంతవ్యోమభాగంబునన్= దిగంతగగనప్రదేశమందు, నించిన=నిండారునట్లుగాఁజేసిన, జ్యోత్స్నాంశువితాన=చంద్రికాకిరణ సమూహమనెడు వస్త్రముతోఁ గూర్చిన నవారుపట్టెలును గల మేలుకట్టునందలి, తారకసుమశ్రేణుల్=నక్షత్రములనెడు పుష్పపంక్తులు, నెఱుల్వీడఁగాన్=నెఱియనఁగా బాగు, బాగుదప్పి చెడిపోఁగా, దినరాజు=సూర్యుఁడు, అన్నియుఁనూడ్చి=వానినన్నిటిని దీసివైచి, అయ్యెడన్=ఆసమయమందు, మిళత్=మిళితమగుచున్న, తేజోమయ=అరుణకాంతియనెడు, ఆతామ్ర=అంతట నెఱ్ఱరంగు గలిగిన, నూతన=నవీనమైన, పట్టాంబరముల్ఘటించెన్=పట్టువస్త్రములు గూర్చెను.

అనఁగా రేరాజును దినరాజును దమతు విహితమైన కాలమందు వసురాజును సేవించిరని యాశయము. తెల్లవారఁగానే వెన్నెలయొక్కయుఁ జంద్రకిరణములయొక్కయు నక్షత్రములయొక్కయు సౌష్ఠవము చెడిపోయెననియును సూర్యునియొక్క యరుణకాంతి యంతటను వ్యాపించెననియును దాత్పర్యము. చంద్రుఁడు రాజువివాహమునకు కిరణములతో మేలుకట్టుకట్టి చుక్కలతోఁ బూవులలరించి పందిరివైచెను. అదిచెదరిపోఁగా సూర్యుఁడు తనరక్తాంశువులతోఁ గెంబట్టుగుడ్డలనలు దిక్కులకుఁ గట్టెనని భావము.

ఉ. ఇంతికిఁ జేదిభూపతికి ♦ నిట్లు వివాహమహంబు శేషహో
మాంత మొనర్చి యాచతుర♦హంబులఁ బూర్ణహవాదికక్రియా
సంతతదీయమానచరు♦సారములం బరితృప్తిఁ గాంచి య
త్యంతకుతూహలంబున సు♦ధాంధసు లిచ్చి రభీప్సితార్థముల్. 42

ఇంతికిన్=గిరికాదేవికిని, చేదిభూపతికిన్=వసురాజునకును, ఇట్లు=పూర్వోక్తప్రకారముగా, వివాహమహంబు=కల్యాణోత్సవము, శేషహోమాంత మొనర్చి=శేషహోమమే చివర యగునట్లుగా నాచరించి, ఆచతురహంబులన్=ఆ పెండ్లినాలుగుదినములయందును, పూర్ణహవాదిక=పూర్ణాహుతులు మొదలైన, క్రియా=హోమక్రియలయందు, సంతతదీయమాన=నిరంతరము నీఁబడుచున్న, చరుసారములన్=హోమయోగ్యపక్వాన్నశ్రేష్ఠములచేత, పరితృప్తిఁగాంచి = లెస్సగాఁ దృప్తినిబొంది, అత్యంతకుతూహలంబునన్=అధికసంతోషముచేత, సుధాంధసులు=అమృతమే యన్నముగాఁగల దేవతలు, ఇచ్చిరభీప్సితార్థముల్=వాంఛితార్థముల నొసంగిరి. అనఁగా గిరికావసురాజులకు సమస్తవరముల నిచ్చిరనుట.

సీ. సురభిసంతానవి♦స్ఫురణ మిచ్చె నగారి యిష్టార్థసంసిద్ధి ♦ నిడియె వహ్ని
యహతధర్మగుణంబు ♦ లర్పించె సమవర్తి కామరూపతఁగూర్చెఁ ♦ గ్రవ్యభోజి
భువనవశీకార♦ము ఘటించె సలిలేశుఁ డసమదివ్యామోద ♦ మొసఁగె గాడ్పు
కల్యాణసామగ్రి♦ఘటియించె నిధిరాజు జితదర్పకత్వంబు ♦ చేర్చె శివుఁడు

తే. ప్రబలదీర్ఘాయురారోగ్య♦భాగ్యకరము
లగువరంబులు సమకూర్చి ♦ రఖిలమునులు
నూతనవివాహకౌతుక♦ద్యోతమాన
మాననీయాకృతికిఁ జేది♦మనుజపతికి. 43

నూతన=నవీనమైన, వివాహకౌతుక = వివాహసంబంధమైన కంకణముచేత, ద్యోతమాన = ప్రకాశమానమైన, మాననీయ=మన్నింపఁదగిన, ఆకృతికిన్=ఆకారముగల, చేదిమనుజపతికిన్=చేదిదేశాధిపతియైన వసురాజునకు, నగారి=ఇంద్రుఁడు, సురభిసంతానవిస్ఫురణమిచ్చెన్ = సురభిసంతానవిస్ఫురణముగలవాఁడు గనుక సురభిసంతాన విస్ఫురణమిచ్చెననుట. ఉత్తరత్ర యీలాగుననే విచారింపవలయును. కామధేనుకల్పవృక్షస్ఫూర్తినిచ్చెనని యర్థము. సురభిగుణములచేతఁ బరిమళించుచున్న సంతానములనిచ్చె నని యర్థాంతరము. వహ్ని=అగ్నిహోత్రుఁడు, ఇష్టార్థసంసిద్ధినిడియెన్=యాగకార్యసంసిద్ధి నిచ్చెనని యర్థము. శ్లో. 'ఏకాగ్నికర్మహవనం త్రేతాయాం యచ్చ హూయతే, అంతర్వే

ద్యాంచ యద్దాన మిష్టం తదభిధీయతే.' అని స్మృతియందుఁ జెప్పఁబడియున్నది. అభీష్టార్థసంసిద్ధి నిచ్చెనని యర్థాంతరము.

సమవర్తి=యముఁడు, అహత ధర్మగుణంబు లర్పించెన్=అవిచ్ఛిన్నధర్మగుణములను సమర్పించె నని యర్థము. విరుగనివిల్లును తెగనినారిని నిచ్చెనని యర్థాంతరము. క్రవ్యభోజి=నైరృతి, కామరూపతఁగూర్చెన్=కామరూపత్వము ఘటింపఁ జేసెనని యర్థము. మన్మథసౌందర్యము గలుగుటనుగూర్చె నని యర్థాంతరము. సలిలేశుఁడు=వరుణుఁడు, భువనవశీకారము ఘటించెన్=జలవశీకరణము గలుగఁ జేసెనని యర్థము. లోకవశీకరణము గలుగఁజేసె నని యర్థాంతరము. గాడ్పు=వాయువు, అసమదివ్యామోదమొసఁగెన్ = సమానరహితమైన దివ్యసౌరభమునిచ్చెనని యర్థము. పరమోత్కృష్టమయిన యానందము నిచ్చెనని యర్థాంతరము.

నిధిరాజు=కుబేరుఁడు, కల్యాణసామగ్రి ఘటియించెన్=సువర్ణసామగ్రిని బొందించెనని యర్థము. శుభసామగ్రిని బొందించెనని యర్థాంతరము. శివుఁడు=ఈశానుఁడు, జితదర్పకత్వంబు చేర్చెన్=జయింపఁబడిన మన్మథుఁడు గలుగుటను సమకూర్చెనని యర్థము. జయింపఁబడిన గర్వగ్రస్తులుగలుగుటను సమకూర్చెనని యర్థాంతరము. అఖిలమునులున్=సమస్తమునీశ్వరులును, ప్రబలదీర్ఘాయురారోగ్యభాగ్యకరములగు వరంబులు సమకూర్చిరి = బలిష్ఠమైన దీర్ఘాయువును నారోగ్యమును భాగ్యమును గలుగఁజేయునట్టి వరములను బొందఁజేసిరి.

క. వెండియు నాఖండలుఁ డరి, ఖండనజయసాధనప్ర♦కాండము సమిదు
ద్దండ మొకదివ్యవైణవ, దండము దయనొసఁగి ధరణి♦ధవునకు ననియెన్. 44

వెండియున్=తిరుగ, ఆఖండలుఁడు=ఇంద్రుఁడు, అరిఖండనజయసాధనప్రకాండము=శత్రుఖండన జయప్రదాయుధశ్రేష్ఠమయిన, సమిదుద్దండము—సమిత్=యుద్ధమందు, ఉద్దండము=నిరంకుశ విహారముగలిగిన, సమిత్=కట్టెలయందు, ఉద్దండము=అతిశయమైన కట్టెయనియు నర్థము. ఒకదివ్య వైణవదండము=ఒకదివ్యమయిన వెదురుకఱ్ఱ, దయనొసఁగి = దయచేత నిచ్చినవాఁడై, ధరణిధవునకు ననియెన్ = వసురాజునుగూర్చి యిట్లు పలికెను. రాజులు సంగ్రామోత్సాహులు. కావున వైరుల జయింప ననువగుసాధనమును, యుద్ధమునందు నడ్డమాకలేనిదియు, దివ్యమునగు వెదురుకఱ్ఱను దేవేంద్రుఁడు వసురాజునకిచ్చి దండప్రభావము నిట్లు చెప్పుచున్నాఁడు.

సీ. తనయనంతాతిదు♦ర్దాంతమూలబలంబు లహిలోకతల మెల్ల ♦ నాక్రమింపఁ
దనశతకోటిప♦ర్వనితాంతమహిమ యంతికనగంబుల వకా♦వకలు సేయఁ
దనమేచకశిలోధి♦కనిరూఢనటన వంభ్రగపురంబుల నెల్ల ♦ రాయిడింపఁ
దనయభిజాతనూ♦తనసువర్ణస్ఫూర్తి విషధరంబుల మూఁక ♦ వి ఖ్యాపర్పఁ
తే. బుట్టె నేవంశ మపరంజి♦గట్టుమీఁద
దానితుదవ్రయ్య లీశాన♦దనుజహారుల
కాదిఁ బృథుకార్ముకము లయ్యె ♦ నయ్యఖండ
వేణుకాండంబు సుస్మితి ♦ విబుధమిత్ర. 45

తన=తనయొక్క, అనంత=అసంఖ్యములైన, అతిదుర్దాంత=అత్యంత దుస్సాధములయిన, మూలబలంబులు=వ్రేళ్ళసత్తువలు, అహిలోకతలమెల్ల నాక్రమింపన్ = పాతాళలోకప్రదేశమునుఁయావత్తు

నావరింపఁగా ననియర్థము. అనంతునియొక్క అనఁగా శేషునియొక్క యతిదుర్దాంతములయిన యాత్మ వర్గములు నాగలోకప్రదేశము నాక్రమింపఁగా నని యర్థాంతరము.

తన=తనయొక్క, శతకోటి=అనేకకోట్ల సంఖ్యలుగల, పర్వ=కణుపులయొక్క, నితాంతమహిమ=అతిశయప్రభావము, అంతికనగంబులన్=సమీపవృక్షములను, వకావకలుసేయన్=బ్రద్దలు సేయఁగాను అని యర్థము. శతకోటియనఁగా వజ్రాయుధము. అది దధీచియొక్క వెన్ను నెమ్ముగనుకఁ బర్వములనఁగా దానియొక్క గ్రంథులు వానియొక్క యతిశయమహిమ. పర్వములను ప్రక్కలుసేయఁగా నని యర్థాంతరము.

తన=తనయొక్క, మేచక=నల్లనైన, శిరః=అగ్రముయొక్క, అధికనిరూఢనటనము = అత్యంతమగునట్లుగా నభ్యస్తమయిన చలనము, అభ్రగపురంబులనెల్ల రాయిడింపన్=గగనగతలోకములనన్నిటిని రాపిడిపెట్టఁగా ననియర్థము. మేచకశిరోధికుఁడనఁగా నీలకంఠుఁడైనహరుఁడు. ఆయనయొక్క నిరూఢమయిన తాండవము గగనగతలోకములను రాపిడిపెట్టఁగా ననియర్థాంతరము. ఇక్కడ హరుఁడు తాండవము సలుపఁగా నాయనజటాసమూహమువలన గగనభాగము రాయిడి నొందుచున్నదని చెప్పినాఁడు. నటన మనఁగా విలాసమని యర్థముచేసి హరునివిలాసము పురత్రయమును రాయిడిపెట్టినదనియును జెప్పవచ్చును.

తన = తనయొక్క, అభిజాత=సంజాతమయిన, నూతనసుపర్ణస్ఫూర్తి = నవీనశోభనపర్ణములయొక్క స్ఫురణము, విషధరంబులమూఁకవిప్పొనర్పన్=విషధరములనఁగా జలధరములునుసర్పములును గనుక జలధరములకన్నిటికిని బలాయనము సిద్ధింపఁజేయఁగాను అని యర్థము. సుందరనవగరుడస్ఫూర్తి సర్పములకన్నిటికిని బలాయనము సిద్ధింపఁజేయఁగానని యర్థాంతరము. "మూఁక విప్పొనర్పన్" అనుపాఠము వ్యాఖ్యాతయగు సోమకవి యనుసరించినది కావున గ్రాహ్యము. ఎల్లవిప్పు అనుపాఠము ముద్రితగ్రంథములందు మాత్రముకలదు. సోమకవిపాఠమునే యిటగ్రహించితిమి.

ఏవంశము=ఏవెదురు, అపరంజిగట్టుమీఁదన్=కాంచనాచలముమీఁద, పుట్టెన్=సంభవించెనో, దానితుదప్రయ్యలు = దానియొక్క చివరబ్రద్దలు, ఈశానదనుజహరులకున్ = శివునకును విష్ణుదేవునకును, ఆదిన్ = పూర్వకాలమందు, పృథుకార్ముకములయ్యెన్ = గొప్పవిండ్లాయెను, అయ్యఖండవేణుకాండంబుసుమ్మిది = అట్టి సంపూర్ణమైన వెదురుయొక్క కఱ్ఱ సుమా యిది, విబుధమిత్ర=దేవసఖుఁడవైన వసురాజా, అని సంబోధనము. ఈపద్య మక్కిలిప్రాససీస మని తెలియవలయును.

క. ఈదండము పరపాదప, వేదండము పరమపటిమ • విహసితపురభి
త్కోదండము భవదీయభు, జాదండమునన్ ఘటింప • జయ మగు నాజిన్. 46

ఈదండము=ఈవేణుదండము, పర=శత్రులనెడు, పాదప = వృక్షములకు, వేదండము=ఏనుఁగైనది - అనఁగా నేనుఁగు వృక్షముల నేతీరుగా ధ్వంసముసేయునో యాతీరుగా శత్రువులను సంహరించుచున్నదని భావము. పరమపటిమన్ = ఉత్కృష్టమయిన సామర్థ్యముచేత, విహసిత=పరిహాసము చేయఁబడిన, పురభిత్కోదండము = త్రిపురసంహారకుఁడైన హరునిధనుస్సుగలిగినది-అనఁగా హరధనుస్సును దిరస్కరించెడు సామర్థ్యముగల దనుట, భవదీయ భుజాదండమునన్ ఘటింపన్ = నీయొక్క బాహుదండమునందు వహించినపక్షమందు, ఆజిన్ = యుద్ధమందు, జయమగున్ = గెలుపు సిద్ధించును.

సీ. ఘనమై ఘటించు లో♦కక్రూరనిర్ఘాత మాశుగమై కూల్చు ♦ నలఘుతరుల
నతిఘోరతమమై ప♦రాంధ్య మాపాదించుఁ గీలి యై సమిదిద్ధ♦కేళి సలుపు
విలసద్విశేషమై ♦ విషముల నేచు నచ్యుతమూర్తియై బలి♦స్ఫురణ మడఁచు
మహితోగ్రవృత్తియై ♦ యహితేభహతి సల్పు భానిధియై ప్రతా♦పంబు సూపుఁ

తే. పార్థివ యఖర్వసర్వసు♦పర్వవిభవ
ధూర్వహము గాన నిది యాజిఁ ♦ దోఁచు నఖిల
దివ్యసాధనసార మై ♦ దీనిఁ దాల్చు
ధన్యుఁ డుద్దండసుభటమూ♦ర్ధన్యుఁ డరయ. 47

ఘనమైఘటించు లోకక్రూరనిర్ఘాతము = ఘనతరమై లోకద్రోహి జనఘాత మాచరించునని యర్థము. మేఘమై లోకమందుఁ గ్రూరమగునశనిపాత మాచరించునని యర్థాంతరము. ఆశుగమై కూల్చు నలఘుతరులన్ = తీవ్రగమనము గలదై మిక్కిలియు నధికు లైనవారిని గూల్చునని యర్థము. వాయువై మహావృక్షములను గూలఁద్రోయునని యర్థాంతరము.

అతిఘోరతమమైపరాంధ్యమాపాదించున్ =మిక్కిలి భయంకరమయినదై శత్రునిరోధము సేయు నని యర్థము. అతిఘోరమయిన, తమమై=అంధకారమై, పరాంధ్యము=ఉత్కృష్టమయిన యంధత్వము నాపాదించునని యర్థాంతరము. కీలియైసమిదిద్ధకేళిసలుపున్ = కీలలనఁగాఁ జీలలును జ్వాలికలును, కీలియై=చీలలుగలదై, సమిదిద్ధకేళిసలుపున్ =యుద్ధక్రీడసలుపునని యర్థము. జ్వాలికలుగల వహ్నియై సమిత్తులనఁగా నింధనములును గనుక నింధనకేళిసలుపునని యర్థాంతరము.

విలసద్విశేషమై విషములనేచున్ =విలసితవిశేషముగలదై విషమజనుల బాధించునని యర్థము. వి=పక్షులలో, లసద్విశేషమై=శ్రేష్ఠమైన గరుత్మంతుఁడై విషనివారణ సేయునని యర్థాంతరము. అచ్యుతమూర్తియై బలిస్ఫురణమడఁచున్ =అభంగవిగ్రహముగలదై బలవంతులయొక్క విస్ఫూర్తినడఁచివేయు నని యర్థము. విష్ణుమూర్తియై అనఁగా వామనమూర్తియై బలిచక్రవర్తియొక్క విజృంభణమడఁచునని యర్థాంతరము.

మహితోగ్రవృత్తియై యహితేభహతిసల్పున్ -మహిత=ఒప్పుచున్న, ఉగ్రవృత్తియై=రౌద్రరస వ్యాపారముగలదై,అహితేభహతిసల్పున్ =శాత్రవశ్రేష్ఠులను హతము సేయునని యర్థము.ఇక్కడ ఇభ శబ్దము శ్రేష్ఠవాచకము. (ని. 'స్యురుత్తరపదేవ్యాఘ్రపుఙ్గవర్షభకుఞ్జరాః, సింహ శార్దూల నాగాద్యాః పుంసి శ్రేష్ఠార్థగోచరాః.' అని అ.) ఉగ్రవృత్తియై = హరునివృత్తిగలదై శత్రువైన గజాసురుని వధ సేయుననియర్థాంతరము. భానిధియై ప్రతాపంబుసూపున్ =ప్రకాశనిధియై ప్రతాపము గనుపఱుచునని యర్థము. సూర్యుఁడై యాతపతాపము గనుపఱుచు నని యర్థాంతరము.

పార్థివ=ఓయి వసురాజా,అఖర్వ=మహోన్నతమయిన, సర్వసుపర్వవిభవ=సమస్తమయిన మంచి కణుపులయొక్క సంపత్తికి, ధూర్వహము గానన్ =ధురంధరమయినదిగనుక నని యర్థము. అఖర్వమయిన సకలదేవతావిభవములకు ధురంధరమయినదిగనుక ననియర్థాంతరము. అఖిలదివ్యసాధనసారమై=సమస్త మయినదివ్యాయుధములలో శ్రేష్ఠమైయనియర్థము. దేవతాసాధనసారమయిన వజ్రమై యనియర్థాంతరము.ఇదియాజిఁదోఁచున్ =ఇదియుద్ధమందుఁగనఁబడును. కాఁబట్టి,దీనిఁదాల్చుధన్యుఁడు=దీనినిధరించిన

కృతార్థుఁడు, అరయన్ = విచారింపఁగా, ఉద్దండసుభటమూర్ధన్యుఁడు = ఉద్దండులయినశూరులలో శ్రేష్ఠుఁడుసుమా. ఉన్నతదండముగల శూరులలోననియుఁ జమత్కారము.

శా. సచ్ఛిద్రం బసమగ్రసార మొకవం♦శం బూని గోచక్ర మా
త్మేచ్ఛాధీన మొనర్చె గోపతనయుం ♦ డీదివ్యవంశోత్తమం
బచ్ఛిద్రం బతిమాత్రసార మిది బా♦హామండలిం బూనువాఁ
డచ్ఛిన్నంబుగ నేలఁ జాలఁడె సమ♦స్తావక్రగోచక్రమున్. 48

సచ్ఛిద్రంబు=రంధ్రయుక్తమనియును, అంతశ్ఛిద్రత్వరూపదోషయుక్తమనియును నర్థము. అసమగ్రసారము=అంతస్సారరహితంబును, దుర్బలంబును అనియర్థము. అటువంటి, ఒకవంశంబూని= ఒకవేణువును ధరించి, గోపతనయుండు=గోపాలబాలుఁ డని యర్థము. శ్రీకృష్ణస్వామి యనిభావము. గోచక్రము = అనఁగా భూచక్రమునని యర్థము. గోసమూహము నని భావము. ఆత్మేచ్ఛాధీన మొనర్చెన్=తనయొక్కయిచ్ఛ కధీనమయినదానినిగాఁజేసెను. అనఁగా స్వాధీనముగాఁ జేసికొనె ననుట. ఈదివ్యవంశోత్తమంబు=దేవసంబంధమయిన యీవేణుదండశ్రేష్ఠము. అచ్ఛిద్రంబు=ఛిద్రములులేనిదియును, అతిమాత్రసారము=అతిశయమయిన యంతస్సారము గలదియును నధికబలము గలదియును అనియర్థము. కాఁబట్టి, ఇది=ఈవేణుదండము, బాహామండలింబూనువాఁడు = భుజమండలమందు ధరించినవాఁడు, సమస్తావక్రగోచక్రమున్=సమస్తమయిన యకుటిలమయిన భూచక్రమును, అచ్ఛిన్నంబుగన్=అవిచ్ఛిన్నముగా, ఏలఁజాలఁడె=ఏలుటకు సమర్థుఁడుగాఁడా అనఁగా సమర్థుఁడే యనుట.

రంధ్రయుక్తంబును నంతస్సారము లేనిదియునయిన కొంచెముమాత్రపు వేణువుధరించిన గోపబాలుఁడు భూచక్రమునంతయుఁ దనయధీనముచేసికొనఁగా ఛిద్రములు లేనిదియును సంపూర్ణమయిన చేవగలదియు నయిన యీదివ్యవేణుదండశ్రేష్ఠమును ధరించిన పురుషుఁడు సమస్తభూచక్రము నేలఁగా సమర్థుఁడవుట కేమి యాశ్చర్యమనుట.

ఉ. చండతమంబు పర్వలవ♦సంధి నొకానొకవేళ రాజమా
ర్తాండులఁ బట్టి క్రాయు నది ♦ దారుణచండతమంబె యీమహో
ద్దండతమం బఖండగతిఁ ♦ దార్కొని క్రమ్మఱనీదు రాజమా
ర్తాండులఁ బర్వసంధిఘటి♦తద్రఢిమంబు నిరంతరంబుగన్. 49

చండతమంబు=అత్యంతకోపశీలమయిన రాహుగ్రహము, ని. 'చణ్డస్త్వత్యంతకోపనః' అని అ. 'తమస్తురాహు స్స్వర్భానుః' అని అ. పర్వలవసంధిన్=పర్వముయొక్క సూక్ష్మకాలసంధియందు-అనఁగాఁ బ్రతిపత్పంచదశ్యంతరమందనుట. ఒకానొకవేళన్ = ఒకానొకప్పుడును, రాజమార్తాండులఁబట్టిక్రాయున్=చంద్రసూర్యులను గ్రహించి వెంటనే వెళ్లఁగ్రక్కును. కాఁబట్టి, అది దారుణచండతమంబె=దారుణపదము చండత్వస్తుతిపరము, ఆరాహుగ్రహము దారుణచండతమమా, అనఁగాఁ గాదనియర్థము. అనఁగాఁ జండతమమనెడి నామమునకు యోగ్యముగాదనియుఁ జండతమమయినతమమత్యంతచండముగాదనియును, చండతమముగాని దారుణచండతమముగాదనియు నర్థాంతరము. ఈమహోద్దండతమంబు=అనఁగా మహోద్దండమయిన యీతనుము-అనఁగా రాహుగ్రహము

అని యర్థము. మహత్తరమయిన యున్నతదండశ్రేష్ఠ మని భావము. అతిమహోద్దండతమ మనీయును విచారింపవలయును. అఖండగతిఁ దార్కొని=సంపూర్ణగతితోడఁ దారసించి యని యర్థము. ప్రసిద్ధరాహువు ఖండితగాత్రుఁడనుట. క్రమ్మఱనీదు రాజమార్తాండులన్=చంద్రసూర్యులను దిరిగి పోనీయ దని యర్థము. రాజశ్రేష్ఠులనని భావము. ఏలాగనిన, పర్వసంధిఘటితద్రఢిమంబు నిరంతరంబుగన్=పర్వసంధియందు సంఘటితమయిన రాజమార్తాండ గ్రసనదార్ఢ్యము సంతత మగునట్లుగా ననియర్థము.

అనఁగా సంతతమును బర్వసంధియందుఁ బుట్టుట శిథిలముగాకుండునట్టులుగా ననుట. కణుపులయొక్క సంధిదార్ఢ్య మెడతెగకుండునట్టులుగా నని భావము.

క. ఈగద సాకారజయ, శ్రీగద జగదవనధుర్య ♦ చిరకీర్తివధూ
యోగద యనఁ దగుదీని క,యోగద లెన్నైనిఁ బోల ♦ నోపునె జగతిన్. 50

జగదవనధుర్య = లోకసంరక్షణధురంధరుఁడవైన యోవసురాజా, ఈగద=ఈగదాయుధము, సాకారజయశ్రీగద = ఆకృతివహించిన జయలక్ష్మిగదా, చిరకీర్తివధూయోగద యనఁదగుదీనికిన్ = శాశ్వతకీర్తికాంతాసంయోగము గలుగఁజేయునట్టిది యనుటకుఁ దగియున్నదీనికి, జగతిన్=లోకమందు, అయోగదలెన్నైనిఁ బోలనోపునె=ఇనుపగదలెన్నయినప్పటికిని బోలఁజాలునా–అనఁగాఁ బోలఁజాలవనుట. యోగదను అయోగదలు పోల వనియుఁ దాత్పర్యము.

చ. రతిపతితండ్రితూపును బు♦రత్రయశాసనుశాతహేతి భా
రతిపతియంబకంబు నగ♦రంధ్రవిధాయకుశక్తి దీనికిం
బ్రతి సమ మీడు జోడనఁగ ♦ రాదు ధరాధిప దీని భక్తితోఁ
బ్రతిసమముల్ భజించుచు స♦పర్య లొనర్ప శుభంబు నీ కగున్. 51

ధరాధిప=ఓవసురాజా, రతిపతితండ్రితూపును=మన్మథజనకుఁ డగువిష్ణుదేవుని యస్త్రమును, అనఁగా నారాయణాస్త్రంబును, పురత్రయశాసనుశాతహేతి=త్రిపురాంతకుం డగుశివునియొక్క నిశితాయుధమును–అనఁగాఁ బాశుపతాస్త్రంబును, లేక త్రిశూలంబును, భారతిపతియంబకంబు=బ్రహ్మాస్త్రంబును, నగరంధ్రవిధాయకుశక్తి=క్రౌంచపర్వతమునకు రంధ్రమేర్పఱిచిన కుమారస్వామి చేతనుండు శక్తియును, దీనికిన్=ఈవేణుదండమునకు, ప్రతిసమమీడుజోడనఁగరాదు=అనఁగా నారాయణాస్త్రము ప్రతియనియును, పాశుపతాస్త్రముగాని త్రిశూలముగాని సమమనియుఁను, బ్రహ్మాస్త్ర మీడనియును, శక్తి జోడనియును అనరాదు. అనఁగా దీనికి నవి సమానములు కావనుట. కాఁబట్టి, దీనిన్=ఈవేణుదండమును, ప్రతిసమముల్ భజించుచున్=ప్రతిసంవత్సరమును సేవించుచు–అనఁగాఁ గొలుచుచు, సపర్యలొనర్పన్=పూజలు సేయఁగా, శుభంబునీకగున్=నీకు శుభము గాఁగలదు, ప్రతిసమముల్=అన్నప్పుడు, ('సమాసుసమాసుప్రతిసమమ్' అని వ్యుత్పత్తి.) (ని. 'సంవత్సరో వత్సరో౽బ్దో హాయనో౽స్త్రీశరత్సమాః' అని అ.) సమాశబ్ద మాకారాంత స్త్రీలింగంబును నిత్యబహువచనాంతంబు నని తెలియవలయును.

త్రిమూర్తులయొక్కయుఁ గుమారస్వామియొక్కయు బాణము లీవేణుదండమునకు సమానములుగావు. ఉత్పత్తినిబట్టిచూడ దివ్యము. కావున భక్తితో భజింపఁదగినది. రతిపతితండ్రి నగరంధ్ర

విధాయకుఁడు. పురత్రయశాసనుఁడు. భారతీపతియను విశేషణములచే వారల యతిశయప్రభావశక్తిసామర్థ్యాదులు ద్యోతకములు. వారిహేతుల నిదిమించినది గాన భజనార్హము. దానిచే శుభప్రాప్తిఫలము.

ఆ. అనుచు దివ్యవంశ ♦ మాదివ్యవంశబాం, ధవున కఖిలధరణి♦ధవున కొసఁగి
యతుల హితుల నెనసి ♦ యతులవైఖరిఁ బోయె,వాసవుఁడు నిజాధి♦వాసమునకు.

అనుచున్=ఈలాగని పలుకుచు, దివ్యవంశము=దేవతాసంబంధమైన వేణుదండమును, ఆ దివ్యవంశబాంధవునకున్=యోగ్యమైన కులమందలి సగోత్రపురుషుఁడైన యనియర్థము. దేవతావర్గమున కాప్తుఁడని భావము. ఇక్కడ వంశశబ్దము వర్గపరము. ని. 'వంశో వేణౌ కులే వర్గే' అని వి. అఖిలధరణిధవునకున్ = సమస్తభూమికిని నాథుఁడైన వసురాజునకు, ఒసఁగి=ఇచ్చి, యతులహితుల నెనసి=యతీశ్వరులతోడను-అనఁగా మునీశ్వరులతోడను, నాప్తులతోడను గూడుకొని, వాసవుఁడు=దేవేంద్రుఁడు, నిజాధివాసమునకున్=తన యునికిపట్టయిన స్వర్గమునకు,అతులవైఖరిన్ గెన్=సమానరహితమైన వైఖరిచేతఁ బోయెను. ఈ పద్యము యమకయుక్తముగాఁ జెప్పంబడియెను.

క. గిరియును గిరిజామాతయు, గిరిజామాతయు యథార్హ♦కృతసత్కారా
దరగరిమ ననుపఁ దమతమ, యిరవుల కరిగిరి సరిద్గి♦రీశ్వరు లంతన్. 53

గిరియును=కోలాహలపర్వతుఁడును, గిరిజామాతయున్=అతనికల్లుఁడైనవసురాజును, ని. 'జామాతా దుహితుః పతిః' అని అ. గిరిజామాతయున్=గిరికాదేవికిఁ దల్లియైన శుక్తిమతియును,యథార్హకృతసత్కారాదరగరిమ ననుపన్ = వారివారికిఁదగునట్టులుగాఁ జేయఁబడినపూజలచేతను నాదరాతిశయముచేతను నంపకముసేయఁగా, ఇక్కడ, సత్కారాదరతంబనుపఁగ, అని పాఠాంతరముగలదు. తమతమ యిరవులకున్=తమతమ నివాసములకు, సరిద్గిరీశ్వరులు=నదులును బర్వతశ్రేష్ఠులును, అరిగిరి=పోయిరి, అంతన్=అమీఁదట.

ఉ. హేమలతానిభాంగికి నధీశనివేశనవప్రవేశదీ
క్షామహనీయమంగళము ♦ సర్వము సాంగముగా ఘటించి య
క్కోమలిఁ జేరఁ బిల్చి తల ♦ గ్రుచ్చి కవుంగిటఁ జేర్చి భూధర
గ్రామణి పల్కె గాఢతర♦గద్గదికాఘననిస్వనంబునన్. 54

హేమలతానిభాంగికిన్=బంగారుతీఁగెవంటి దేహముగల గిరికాదేవికి, అధీశ=పెనిమిటియొక్క, నివేశ=గృహమునందలి, నవప్రవేశ=నూతనప్రవేశముయొక్క, దీక్షా=నియమప్రయుక్తమైన, మహనీయమంగళము=ఒప్పిదమైన శుభము-అనఁగా నూతనగృహప్రవేశమునకుఁ దగినలాంఛనము, సర్వము సాంగముగా ఘటించి=సమస్తంబును సమగ్రమగునట్టులుగా సమకూర్చి, ఆకోమలిఁజేరఁ బిల్చి=ఆగిరికాదేవిని డాయంబిలిచి, తలగ్రుచ్చి కవుంగిటఁజేర్చి=తల కడుపులోనుంచి కౌఁగిలించుకొని, భూధరగ్రామణి=పర్వతశ్రేష్ఠుఁడయిన కోలాహలుఁడు, గాఢతర=మిక్కిలి యతిశయమైన, గద్గదికా=డగ్గుత్తికతోఁగూడిన, ఘననిస్వనంబునన్=గంభీరధ్వనిచేత, పల్కెన్=వక్ష్యమాణప్రకారముగాఁ బలికెను.

అత్తవారింటికి గిరిక క్రొత్తగా నేఁగుచున్నది. కావున జనకునకు మిగులఁ జింతాకారణము. ఇంటికిఁ బెద్ద గావున వసురాజెటులో కార్యవిధులు నిర్వర్తించెను. కాని నీతులు తెలుపవలసివచ్చు

వఱకు ఎడబాటువలని దుఃఖముచే దగ్గుత్తిక పడెను. అయినను నిబ్బరించి ఘనస్వరమున నిటులఁ జెప్ప సాగెను. పుత్రికావిశ్లేషణము దుఃఖహేతువనుటకు కణ్వోక్తి—

"శ్లో. యాస్య త్యద్య శకుంతలేతి విమయం సంస్పృష్ట ముత్కంఠయా
కంఠ స్తంభితబాష్పవృష్టి కలుష శ్చింతాజడం దర్శనం
వైక్లబ్యం మమతావదీదృశమహో స్నేహాదరణ్యౌకసః
పీడ్యంతే గృహిణః కథంను తనయావిశ్లేషదుఃఖై ర్నవైః." అభిజ్ఞానశాకుంతలము.

క. నీతమ్ములశుభవాసన, నీతలిదండ్రులగభీర•నిశ్చలగుణవి
ఖ్యాతియును దలఁచి మెలఁగుము, నాతల్లీ కులవధూజ•నమతల్లిక వై. 55

నీతమ్ములశుభవాసన=నీతోడఁబుట్టువులయొక్క శుభశీలంబును అని యర్థము. పద్మముల యొక్క యోగ్యమైన సౌరభమని భావము. నీతలిదండ్రుల=నీతల్లియైన శక్తిమతియొక్కయును నీతండ్రియైన నాయొక్కయు, గభీరనిశ్చలగుణవిఖ్యాతియును = గభీరగుణనిశ్చలగుణములయొక్క ప్రసిద్ధియునని యర్థము. లోఁతును గదలకుండుటయును అనిభావము. ఇక్కడఁ గ్రమాలంకారము. తలంచి=విచారించి, నాతల్లీ=మాయమ్మా, కులవధూజనమతల్లిక వై=పతివ్రతాజనములో శ్రేష్ఠురాల వై, మెలఁగుము=ప్రవర్తింపుము.

సీ. మాఱుమాటాడదు • మఱచియైనను గురువ్యాహారమున కీయ•హార్యతనయ
యానమ్రగతిఁ బూను • మానంపుసవతు లె ట్లైన నీదివ్యర•త్నానుజాత
తాఁగయై మేర మీ•ఱ దొకప్పుడును ఘన శ్రీలఁ బొంగియును నీ•సింధుకన్య
యేకాకృతి వహించు•నినురాగవృత్తికి నపరాగవృత్తికి • నబ్జసహజ
తే. యచ్చెరువు వింత యబ్బురం • బరిది యనుచు
విశ్వధాత్రీశ్వరులు మెచ్చ • వెలయవమ్మ
యమ్మ భవదీయచిత్రగు•ణాతిశయము
వలన మా కెల్ల పన్నె రా • మెలఁగవమ్మ. 56

ఈయహార్యతనయ=ఈ పర్వతకుమారిక, గురువ్యాహారమునకుఁ = పెద్దలైన యత్తమామలు మొదలగువారిమాటకు, మఱచియైనను = జ్ఞాపకములేకయైనప్పటికిని, మాఱుమాటాడదు=ప్రతికూల వాక్యము పలుకదు అనియర్థము. పర్వతమైతే గురువ్యాహారమునకు మాఱుమాటాడుచున్నదనుట. పెద్దపెట్టుగాఁ బలికినం బ్రతిధ్వని యిచ్చుచున్నదని భావము. వ్యాహారమనఁగాఁ బలుకు, (ని. 'వ్యాహార ఉక్తి ర్లపితమ్' అని అ.)

ఈ దివ్యరత్నానుజాత=యోగ్యమైన ముక్తామణులకుఁ దోఁబుట్టువైన యీచిన్నది, మానంపు సవతులెట్లైనఁ=కోపముగల సపత్నులు తనచోట నేలాగున విపర్యాసము జరిగించునప్పటికిని, ఆనమ్ర గతిఁబూనుఁ=నమ్రత్వమువహించును అని యర్థము. ముక్తామణులైతే మానంపుసవతులెట్లయినను నమ్రభావము వహింపవనుట. రత్నములు తుల్యమానములైన కట్టెలు నీవలావలనిడి తూచినప్పటికిని సమానముగానే యుండునుగాని మ్రొగ్గుచూపవని భావము. ఈపక్షమందిది సవతుశబ్దముయొక్క బహువచనరూపము.

ఈసింధుకన్య=నదీకన్యయైన యీచిన్నది, ఘనశ్రీలఁ బొంగియుండు=ఘనమైన సంపదలచేత నుప్పొంగుచున్నదయ్యును, ఒకప్పుడును=ఒకానొక సమయమందైన, తాఁగరయై మేరమీఱదు=గయ్యాళియై మర్యాదనతిక్రమింపదు, అని యర్థము. నదియైతే ఘనశ్రీలచేత నుప్పొంగి యొకప్పుడు తాఁ గరయై మేరమీఱుననుట. నదులు వర్షాకాలమందు మేఘోదకములచేతఁ బొంగి సంపూర్ణమై దరుల మించి ప్రవహించుచున్నవని భావము.

అబ్జసహజ=పద్మములతోడఁబుట్టిన యీ చిన్నది, ఇనురాగవృత్తికి నపరాగవృత్తికిన్=పెనిమిటియొక్క యనురాగయుక్తమయిన నడవడికిని ననురాగరహితమయిన నడవడికిని, ఏకాకృతి వహించున్=ఒక్కవిధముగానే యుండునని యర్థము. అబ్జములైతే యినునిరాగవృత్తికిని నపరాగవృత్తికిని ఏకాకృతివహించియుండవనుట. అబ్జములు సూర్యునియుదయమునకును నపరాద్రివర్తనమునకును నేకవిధముగా నుండవనిభావము. అచ్చెరువువింతయబ్బురం బరిది (ఈచిన్నది మొదటినాల్గు చరణములయందుఁ జెప్పినచొప్పునఁ దనబంధువులకు విరుద్ధములైన మంచిగుణములం జూపుటచే నాల్గింటికిని నాలుగాశ్చర్యవాచకములు),

అనుచున్=ఇట్లుచెప్పికొనుచు, విశ్వధాత్రీజనులుమెచ్చన్=సమస్తభూజనులును మెచ్చుకొనునట్టులుగా, వెలయవమ్మ=ప్రసిద్ధిఁబొందవమ్మా, అమ్మ=మాతల్లీ, భవదీయచిత్రగుణాతిశయమువలనన్=నీ యద్భుతకరమయిన గుణాతిశయమువలన, మాకెల్లవన్నెరామెలఁగవమ్మ=మాకందఱకును బ్రకాశత గలుగునట్టులుగాఁ బ్రవర్తింపవమ్మా.

చ. పతికృతధర్మకౌశలముఁపట్టునఁ దోడగునారి నారి దాఁ
బితృశరణప్రచింత మదిఁ బెట్టక యీశనివేశితాత్మ యా
సతి సతి రాశికెక్కి యినసత్కృతిఁ గైకొనుకన్య కన్య శా
శ్వతమతి నిట్లు గా మనినవామయె వామ గదమ్మ కోమలీ. 57

పతికృత ధర్మకౌశలము పట్టునఁ దోడగునారి నారి=ధర్మమనఁగా ధర్మంబును విల్లును, నారి యనఁగా స్త్రీయును శింజినియును, పతి=నాథునిచేత, కృత=చేయఁబడిన, ధర్మకౌశలముపట్టునన్=ధర్మనైపుణ్యపువేళయందు, తోడగు = సహాయమయిన, నారి = స్త్రీ, నారి = నార్యుచితధర్మవతి యనియర్థము. అధిపతిచేతఁ జేయఁబడిన విలువిద్యయందలి నేర్పుపట్టున సహాయమైయున్న శింజిని యని యర్థాంతరము. తాఁబితృశరణప్రచింతమదిఁబెట్టకయీశనివేశితాత్మయా సతిసతి = శరణమనఁగా గృహంబును సంరక్షణంబును, ఈశుఁడనఁగాఁ బెనిమిటియును హరుఁడును, ఆత్మయనఁగా మనస్సును దేహంబును, సతియనఁగాఁ బతివ్రతాంగనయును పార్వతియును, పితృశరణప్రచింత=తండ్రి యింటిమీఁదితలంపు, మదిఁబెట్టక=మనస్సునిడక, ఈశనివేశితాత్మయా=పెనిమిటియందుఁ జేర్పఁబడిన మనస్సుగలదైన, సతి=స్త్రీయే, సతి = పతివ్రత, అనియర్థము. పితృశరణప్రచింతమదిఁబెట్టక=తండ్రియైన దక్షునియొక్క సంరక్షణముమీఁదితలంపు మనస్సున నిడక, ఈశనివేశితాత్మయా=హరుని యందుఁ జేర్పఁబడిన యర్ధదేహముగలదైన, సతియే పార్వతియని యర్థాంతరము. రాశికెక్కి యిన సత్కృతిఁ గైకొనుకన్యకన్య-రాశికెక్కి = ప్రసిద్ధికెక్కి, ఇన=పెనిమిటియొక్క, సత్కృతిఁగైకొను =మన్ననను బొందిన, కన్యకన్య=స్త్రీయే స్త్రీయనియర్థము. రాశికెక్కి=ద్వాదశరాసులలోనొకరాశియై,

ఇనసత్కృతిఁ గాంచిన=సూర్యసత్కారమునుబొందిన, కన్యకన్య = కన్యయే కన్యారాశియనియర్థాంతరము. శాశ్వతమతినిట్లుగామనిన=స్థిరబుద్ధిచేత నీప్రకారముగా బ్రతికిన, వామయె వామగదమ్మ కోమలీ=స్త్రీయే యన్వర్థనామవతి-అనఁగా రమ్యమైనదిగదమ్మ యోగిరికాదేవీ యనియర్థము. ఈపద్యమున లాటానుప్రాసము.

శాశ్వతమతి నిట్లుగా మననివామయెవామ యనుపాఠము నూతనముద్రితప్రతులందుఁగలదు. వామయనుచో వక్రురాలని నూతనముద్రితప్రతిపాఠమునకర్థము. ఇదియె యొప్పియున్నదని సంస్కర్తయభిప్రాయము. వామలోచనేత్యాదులందు వామశబ్దము రమ్యార్థమున రూఢము. వామశబ్దమును ప్రతికూలార్థమునందు వాడుట కవ్యభిప్రాయముగఁ దోపదు. నారియెనారి కన్యయెకన్య సతియెసతి యనుచో ననుకూలశ్లేషార్థముగలదుగాన వామయనుచో మనోరార్థమె తగియున్నది. రసజ్ఞులువలసిన పాఠము గ్రహింతురుగాక.

శా. ఈశైవాలవతీప్రతీరభజనం ♦ బీనిర్మలప్రస్తరో
ద్దేశావాసము నీమృగార్భకశకుం♦తీసఖ్యముల్ లేమిఁ జిం
తాశల్యంబు వహింపకమ్మ చెలి యే♦తచ్చర్య లెల్లం దపః
క్లేశాంగంబులు నీ కభీష్టవరల♦క్ష్మీధన్య కింకేటికిన్. 58

ఈశైవాలవతీప్రతీరభజనంబు=ఈనదీతీరభజనమును, ఈనిర్మలప్రస్తరోద్దేశావాసము=ఈశుభ్రతరపాషాణోపరినివాసమును, ఈమృగార్భకశకుంతీసఖ్యముల్=ఈబాలకురంగములయొక్కయు నాఁడుపక్షులయొక్కయు మైత్రియును, లేమిన్=ఇఁకమీఁదలేకయుండుటచేత, చింతాశల్యంబువహింపకమ్మ=విచారమనెడు ఆయుధపుటలుగును హృదయమందు నిలుపుకొనఁబోకమ్మా, చెలి=ఓగిరికాదేవీ, ఏతచ్చర్యలెల్లన్=ఈనడవళ్లన్నియును, తపఃక్లేశాంగంబులు=తపోవిషయమైన దుఃఖమునకు నవయవములు, కనుక నివి, అభీష్టవరలక్ష్మీధన్యకున్=అభిమతవరసంపత్తిచేతఁ గృతార్థురాలవైన, నీకున్=నీకు, ఇంకేటికిన్=ఇకమీఁద నెందుకు-అనఁగా నక్కఱలేదనుట.

అనఁగా నిక్కడ గిరికాదేవియొక్క శుక్తిమతీనదీతీరవిహారాదులను దపశ్చర్యలుగాను నభిమతపురుషప్రాప్తిని నభీష్టవరసంపత్ప్రాప్తినిగాను జెప్పినాఁడని తెలియవలయును. గిరిక అభీష్టవరసిద్ధికై తపఃక్లేశమును సహించెను. తపస్సాధనములు-నదీతీరవాసము, పాషాణశయనము, మృగశకుంతాదికస్నేహము లోనగునవి. తపఃఫలము అభీష్టవరసిద్ధి. అదియె ధన్యతాహేతువు. కావున దపఃక్లేశాంగముల దలంచి చింతాశల్యముతో నవస్థపడకుమని భావము. నదీతీరము మాతృసన్నిధి, ప్రస్తరావాసము పితృసన్నిధి, మృగశకుంతీగణము మాతృపితృపరిజనము. వీనితోనెడబాటు చింతాహేతువని యర్థాంతరము.

క. అని తెలుప నశ్రుధారా, వినివేశవిలీయమాన♦వినతానన యా
తనయం గని కల్లోలిని, తనయంగనితాంతయుక్తిఁ ♦ దార్చుచుఁ బలికెన్. 59

అని తెలుపన్=కోలాహలుఁ డీలాగని బోధింపఁగా, అశ్రుధారా=బాష్పధారలయొక్క, వినివేశ=ప్రవేశముతోడ, విలీయమాన=సంకలితమగుచున్న, వినత=వంచుకొనఁబడియున్న, ఆననయా=ముఖముగలదైన, తనయంగని=కొమార్తెనుజూచి, కల్లోలిని=శుక్తిమతీనది, తనయంగనితాంతయుక్తిఁ

దార్చుచున్ = తనయొక్క శరీరసంయోగమును ఘటించుచు - అనఁగా నాలింగనముసేయుచు, పలికెన్ = వక్ష్యమాణ ప్రకారము గావించెను.

ఉ. తమ్ములఁ బంపుదు న్మణిశ♦తమ్ములఁ బంపుదు రాజహంసపో
తమ్ములఁ బంపుదున్ బరిచి♦తమ్ములఁ గాననదేవతాళిజా
తమ్ములఁ బంపుదున్ ద్రుతగ♦తమ్ముల నేనును సారణీప్రపా
తమ్ముల వత్తు విశ్వవిది♦తా ముదితా మదితాప మేటికిన్. 60

తమ్ములఁబంపుదున్ = నీయొద్దకుఁ దమ్ములను అనఁగా సహోదరుల నంపుదు నని యర్థము. కమలముల నంపుదు నని భావము. మణిశతమ్ములఁబంపుదున్ = అనేకములైన ముక్తామణులను బంపుదును, రాజహంసపోతమ్ములఁబంపుదున్ = రాయంచకొదమలనంపుదును, పరిచితమ్ములన్ = పరిచయముచేయఁబడిన, కాననదేవతా = వనదేవతలనెడు, ఆళిజాతమ్ములఁబంపుదున్ = సఖీసమూహములనుబంపుదును, ద్రుతగతమ్ములన్ = శీఘ్రగతులచేత, నేనును = నేనును, సారణీప్రపాతమ్ములవత్తున్ = సారణియనఁగాఁ బిల్లకాలువ, (ని. 'సారణీచాల్పసరితి' అని వి.) ప్రపాతమనఁగా నిర్ఝరము. (ని. 'ప్రపాతో నిర్ఝరే భృగౌ' అని వి.) అల్పసరిజ్ఝరీస్వరూపములతోడను వత్తును, విశ్వవిదితా = జగత్ప్రసిద్ధురాలవైన, ముదితా = ఓగిరికా దేవీ, మదితాపమేటికిన్ = నీకు మనస్సంతాపమెందుకు - అనఁగా నక్కఱలేదనుట, మదియొక్క తాపము అని షష్ఠీసమాసము.

సీ. మెదలుమిటారితు♦మ్మెదలు ఝుమ్మనిమ్రోయఁ బొదలునిచ్చటిపువ్వు♦పొదలు
దేరి మాధురిఁ గడ♦తేరి వేరివము నవారిసేయుమదీయ♦వారిఁ దేల [సూడఁ
వల నంది దరులక్రే♦వలనొందికొనుచు నావలనగల్చుమహార్మి♦ వలనమరయ
గములఁబాయకతరం♦గములపైఁ దగుసితాంగములమానసవిహం♦గములఁ బట్టు

తే. సరిదిప్రతముల సరిగంగ♦లాడఁ జైత్ర, శుచినభోబాహులతపోవి♦శోభిసకల
సమయములఁదావకప్రాణ♦సమునిఁ గూడి, యిచటనెమెలంగెదుకలంగ♦దేలతల్లి.

మెదలుమిటారితుమ్మెదలుఝుమ్మనిమ్రోయన్ = తిరుగుచుండెడు చక్కనితుమ్మెదలు ఝుమ్మనిధ్వనిసేయఁగా - అనఁగా ఝుంకారము సేయఁగాననుట, పొదలు = ఒప్పుచున్న, ఇచ్చటిపువ్వుపొదలుసూడన్ = ఇక్కడ నుండెడుపూఁబొదలను జూచుకొనుటకును, వసంతుర్తువునందుఁ బూవుపొదలు ననలచే నిండారి అళులరవళిచే నలరి నేత్రోత్సవకరముగనుండును. గావున నుద్యానములు పొదరిండ్లు విహారయోగ్యములు. మీరుచూడ నేతేరఁగలరు.

తేరి = మాలిన్యరహితమయి, మాధురిఁగడతేరి = మాధుర్యముచేతఁగడముట్టి - అనఁగాఁబూర్ణీభవించి, వేరివమును = అధికశీతలభావమును, ఇవమన్నప్పుడు, గకారస్థానమందు వకారమువచ్చినది. అవారిసేయు = అపరిమితమగునట్టులుగాఁ జేయుచుండెడు, మదీయవారిఁదేలన్ = నాసంబంధమయిన యుదకమందు జలక్రీడ సలుపుకొనుటకును, గ్రీష్మర్తువునందుఁ బ్రవాహోదకము స్నానయోగ్యముగనుండును. జలము తేరుటయు నెండవేళఁ జల్లఁగనుంటయు స్నానోచితమగు జలమునకుఁ దగినలక్షణములు. గ్రీష్మమున వారిస్నానయోగ్యమనుభావము కాళిదాసు ఋతుసంహారములో "సదావగాహక్షమవారిసంచయః" అని చెప్పియున్నాఁడు.

వలనంది=ఒప్పిదమునుబొంది, దరుల క్రేవలనొందికొనుచున్=దరులయొక్క-పార్శ్వములయందు వ్యాపించుచు, అవలన్=అటుతర్వాత, అగల్చు=భేదించునట్టి, మహోర్మి వలనమరయున్ = మహాతరంగవిహారము విమర్శ సేయుకొఱకును, వర్షర్తువునఁ దరంగముల పొందికలతోఁ దరంగిణులు దర్శనీయములగనుండును. మహోర్ములుగావున దరులనురెంటిని దాఁకుటయు నావలవిరియుటయు సహజగుణము. తరంగసందర్శనమె సంతోషదాయకమనిభావము.

గములఁబాయక=గుంపులనెడవాయక, తరంగములపైఁదగు=కరుళ్లమీఁదనొప్పుచుండెడు, సితాంగముల=తెల్లదేహముగల, మానసవిహంగములన్=మానససరోవరసంబంధములైనపక్షులను, అనఁగా రాజహంసలను, పట్టన్=పట్టుకొనుటకొఱకును, తరంగములు తఱుచుగా హేమంతశిశిరర్తువులలో నుండును. అందు మానససరోవిహారము జేయుచురాయంచలు గుంపులుగావచ్చి జంటలుగఁ జరించుచుండును. గములుగా నరుదెంచి యీదుచుండునుగాన సేయంచనేని క్రీడార్థము బట్టుకొనవచ్చును.

అరిదివ్రతములసరిగంగలాడన్=విశేషవ్రతములయందు సరిగంగాస్నానములు సేయుటకొఱకును, చైత్ర శుచి నభో బాహుల తపో విశోభి సకలసమయములన్=చైత్రాషాఢ శ్రావణ కార్తిక మాఘ మాసములచేత నొప్పుచుండెడు సమస్తసమయములయందును, శుచ్యాదిశబ్దచతుష్టయమునకు నిఘంటువులు, (ని. 'శుచిస్త్వయం, ఆషాఢే శ్రావణే తుస్యాన్నభా శ్శ్రావణిక శ్చసః, బాహు లోర్జౌ కార్తికిక తపామాఘే' అని అ.) ఇక్కడఁ జైత్రాదిమాస పంచకముచేత వసంత గ్రీష్మవర్షాశరచ్ఛిశిరర్తువు లనుగ్రహింపవలయును. హేమంతర్తువు శిశిరర్తువం దంతర్భూతమైనది. తావక ప్రాణసమునిఁ గూడి=ప్రాణసమానుఁడయిన నీవిభునిఁగూడి, ఇచట నెమెలంగెదు = ఇక్కడనే విహరింపఁగలవు. అనఁగా వసంతర్తువునందుఁ బూఁబొదలు చూచుకొఱకును, గ్రీష్మర్తువునందు జలక్రీడ లాడుకొఱకును, వర్షర్తువునందుఁ దరంగవిహారము విమర్శించుకొఱకును, శరదృతువునందు హంసలఁబట్టెడుకొఱకును, నీవు నీవిభునితోఁగూడి యిక్కడనే విహరింతువనుట. కాఁబట్టి, కలంగెదేలతల్లి = అమ్మా యేలచింతపడుచున్నావు. అనఁగాఁ జింతిలవలదనుట. ఈపద్య మపకలివడిసీసమని తెలియవలయును.

క. బెగడవల దనుచు బెట్టిద, మగు నెవ్వగ నగడుపడుచు • నాఁడుపడుచు లే
పగవారికి వల దన నా, పగవారికి నేల యొసఁగెఁ • బద్మజుఁ డనుచున్. 62

బెగడవలదనుచున్ = జడియకుమనిపలుకుచును, బెట్టిదమగునెవ్వగనగడుపడుచున్ = ఘనమైనవిచారముచేతఁ దొట్రుపడుచును, ఆఁడుపడుచు లేపగవారికివలదనన్ = ఎట్టి పగవారికైనను నాఁడుపడుచులు కలుగరాదని లోకము దనుకొఁగా, ఆపగవారికి నేలయొసఁగెఁ బద్మజుఁడనుచున్- ఆపగవారికిన్ = ఆపగయొక్కవారికి - అనఁగా నదీజలమునకు బ్రహ్మ యేలాయిచ్చెను అని పలుకుచును,

ఇక్కడ ఏపగవారికి వలదనఁగాను ఆపగవారికిచ్చెనని స్వారస్యము గ్రహింపవలయును. ఆపగవారియనునది తెనుఁగు షష్ఠీసమాసము గావున నాపగాశబ్దమునకు హ్రస్వముపచ్చినది. ఆపగాశబ్దమునకు, (ని. 'స్రోతస్వినీ ద్వీపవతీ స్రవంతీ నిమ్నగాపగా' అని యమరము.)

చ. అనుపమహేలతో నరవ • రాగ్రణి రత్నరథాధిరూఢుఁ డై
యనుపమహేలతోఁ గదలె • నాత్మపురంబున కభ్రమండలిన్

ఘననురవార్భటిం దెరువు ♦ గట్టి నిలింపనితంబినుల్ ఘనా
ఘనమురవార్భటి న్మెఱచు♦గాఱుమెఱుంగులరంగులీనఁగన్. 63

అనుపన్ = అంపకముసేయఁగా, (ఇక్కడ, ఆపగవారికి నేలయొసఁగెఁ బద్మజుఁడనుచున్, అని కులకముచెప్పినాఁడు. ఆంధ్రమందును కులకము చెప్పవచ్చునన్నందుకు, అథర్వణవచనము. శ్లో. 'క్వచిత్కులకసమ్బన్ధో వ్యత్రనాహితకృద్భవేత్' అని ప్రమాణము.) మహేలతోన్=స్త్రీతోఁగూడ-అనఁగా గిరికాదేవితోఁగూడ, మహిళాశబ్దంబును మహేలాశబ్దంబును రెండును గలవు. మహేలాశబ్దమునకు, (ని. 'మహేలా యోషితా యోషా యువతిః' అని యమరశేషము.) నరవరాగ్రణి=వసురాజు, రత్నరథాధిరూఢుఁడై = రత్నమయమైన రథము నెక్కినవాఁడై, అభ్రమండలిన్= గగనమండలమందు, ఘనమురవార్భటిందెరువుగట్టి=ఘనతరమయిన మృదంగధ్వనితోడ దారి నడ్డగించి, నిలింపనితంబినుల్ =దేవతాస్త్రీలు, ఘనాఘన=వర్షించుచున్న మేఘముయొక్క, రవార్భటిన్=రవార్భటితోఁగూడి-అనఁగా గర్జితముతోఁగూడి, మెఱచు=మెఱయుచున్న, కాఱుమెఱుంగుల=తొలకరిమెఱుపుతీఁగెలయొక్క, రంగులీనఁగన్=వైఖరులను గనుపఱుపఁగా అనుపమహేలతోఁగదలె నాత్మపురంబునకున్=అసమానమయిన విలాసముతోడఁ దనపట్టణమునకుఁ బోవుటకై కదలెను.

వసురాజు విమానసంచారశక్తిగలవాఁడు గావున గిరికతో నిజనగరమునకు అసమానవిలాసముతో రత్నకలితమగు రథమెక్కి యభ్రమండలిని బ్రయాణమయ్యెను. వేలుపుముగుద లాయుత్సవము చూచుటకు మురవాదివాద్యముల మ్రోఁగించుచుఁ దెరువుకట్టిరి. వేల్పువెలఁదుకలమురవధ్వనులుఱుములవలెను వారిమేనుదీవియలు తొలుకరి మెఱపుదీవియలవలెను నుండెను. మురవశబ్దోత్పత్తి, 'మురఃచర్మపట్టికాసంవేష్టనం తంవాతిప్రాప్నోతీతిమురవః.' వాగతిగంధనయోః అనిధాతువు.

ఉ. వేడుక నిట్లగణ్యరుచి♦విభ్రమధన్య యగేంద్రకన్య రాఁ
జూడఁ దలంచి నిల్చిరి వ♦సుక్షితిపాలపురీపురంధ్రికల్
మాడువులన్ హజారముల ♦ మచ్చుల సజ్జల గోపురంబుల
న్మేడల నాట్యశాలికల ♦ మేరువులన్ భువనేశ్వరంబులన్. 64

వేడుకన్=ఉత్సవముతోడ, ఇట్లు = ఈచెప్పఁబడినప్రకారము, అగణ్య=వర్ణింపనలవికాని, రుచి=కాంతిచేతను, విభ్రమ=విలాసముచేతను, ధన్య=కృతార్థురాలయిన, అగేంద్రకన్య=గిరికాదేవి, రాన్=రాఁగా, చూడఁదలంచి=చూడనిచ్ఛయించి, వసుక్షితిపాలపురీపురంధ్రికల్=వసురాజుయొక్క పట్టణమందుండుస్త్రీలు, మాడువులన్=ప్రాసాదవిశేషములయందును, హజారములన్=ముఖశాలలయందును-అనఁగా మొగసాలలయందనుట, మచ్చులన్=డాబాలయందును, సజ్జలన్=ఉప్పరిగలయందును, గోపురంబులన్=బహిర్ద్వారములయందును, మేడలన్=హర్మ్యములయందును, నాట్యశాలికలన్=నాటకశాలలయందును, మేరువులన్=పోఁతమట్టిదిన్నెలయందును, భువనేశ్వరంబులన్=గృహవిశేషములయందును, నిల్చిరి=నిలిచియుండిరి.

గిరిక నగేంద్రకన్య. మఱియు నగణ్యరుచివిభ్రమధన్య కావున నామెను సందర్శింపఁ బురకాంతలందఱు వచ్చిరి. మచ్చులు, హజారములు, మేరువులు, భువనేశ్వరములు నున్నతస్థలములు గాన దర్శనోత్సాహముచే నటఁ జేరిరని భావము. సజ్జయన శిరోగృహమనుటకు-

"ఉప్పరిగల్ సజ్జలు చప్పరాలు చవికల్ పైఁజూడ లేదెక్కి" రామాభ్యుదయము. ఆ. ౩.

మచ్చు అన మిద్దెయిల్లనుటకు-

తే-గీ. "... ... మచ్చులమేడల నెలవులెల్ల

క్రొత్తసింగారములఁ దళుకొత్తఁ జేసి." అచ్చతెనుఁగురామాయణము.

సీ. సరిగాదు మద్విధూసర్గమీసతికంచుఁ దెలుప నందఱుఁ దెచ్చెనలువ యనఁగ
నిజభాగ్యలక్ష్మిరా నెమ్మిఁ బోఁజిడ ననంగుఁడు మూలబలమెల్లఁ గూర్చె ననఁగఁ
గొనియె మాసిరుల నీకొమ్మంచుఁ బతికిఁ దెల్ప నశేషయావతం బెనసె ననఁగ
జలసుతాసమకన్య గలుగునో యని నేల యీసున వేవేల నీనె ననఁగ

తే. గణనమీఱివయోరూపగరిమమించు, లలనతోఁ దులఁదూఁగఁజాలక భజించి
రుపరిభాగంబు లనఁజేదినృపలలామ,పట్టణపయోజముఖులు చూపట్టి రపుడు.

నలువ=బ్రహ్మదేవుఁడు, సరిగాదు మద్విధూసర్గమీసతికంచున్ = నాయొక్క స్త్రీజనసృష్టి యీస్త్రీకి సమానముగాదని, తెలుపన్=తెలియఁజేయుకొఱకు, అందఱుఁదెచ్చెన్=స్త్రీలనందఱ నొక చోటికిఁదెచ్చెనో, అనఁగన్=అనునట్టులుగాను, పురసుందరులందఱును గిరికాదేవిని గాంచవచ్చిరి. వచ్చిన చెలువలందఱు బ్రహ్మసృష్టియందుఁ బేరెన్నికఁ గలవారలె. గిరిక యందఱికంటె సౌందర్యవతి. అందఱు సుందరులే తెంచుట గిరిక లోకాతిశయసౌందర్యవతియని నిరూపించుట కని భావము.

అనంగుఁడు=మన్మథుఁడు, నిజభాగ్యలక్ష్మిరాన్ = తనయొక్క భాగ్యలక్ష్మివచ్చుచుండఁగా, నెమ్మిన్=మైత్రిచేత, పోఁజిడన్=వెంటపోఁజుంచుటకు, మూలబలమెల్లఁగూర్చెననఁగన్=అప్తసైన్యమునంతయుఁ గూర్చినాఁడో-అనఁగా గుంపుచేసినాఁడో యనునట్టులుగాను, చక్కఁదనము మరుని భాగ్యము. సౌందర్యవతియగు గిరిక మరునిభాగ్యలక్ష్మి. తనయైశ్వర్యసమృద్ధిని దెచ్చునపుడు మూలబలమును వెంట బారులుతీర్చి నడిపించుటగలదు. గిరిక భాగ్యలక్ష్మి. చూడవచ్చిన పౌరసుందరులు మూలబలము. ఇదియంతయుఁ మన్మథుని బలప్రదర్శనమువలె నుండెనని భావము.

కొనియెమాసిరుల నీకొమ్మంచున్=ఈకొమ్మ అనఁగా నీగిరికాదేవి మాసౌందర్యసంపదల నపహరించెనని, పతికిఁదెల్పన్=వసురాజునకుఁ జెప్పుటకు, అశేషయావతం బెనసెననఁగన్=సమస్తయువతీసమూహమును గుంపుగూడినదో యన్నట్టులుగాను, గిరిక లోకాతిశయసౌందర్యవతి. సమస్తసుందరీసౌందర్యము రాశీకృతమొనరించి నలువ యీచెలువను సృజించెను. అదియె యువతీసౌందర్యముల హరించెననుట. గిరిక చెలువలందఱికంటెఁ జక్కఁదనమున మిన్నయగుట తమచెలువము దొంగలించుటవలన. దొంగను రాజునకుఁ బట్టి యీయ చెలువలు మూఁగినటులున్నదని భావము.

జలసుతాసమకన్యగలుగునో యని=జలోద్భవయైన గిరికాదేవితో సమానమైనకన్యకలుగునేమో యని, నేల=భూమితత్త్వము, ఈసునన్=జలతత్త్వముమీఁది యసూయచేత, వేవేల నీనె ననఁగన్=అనేకస్త్రీసహస్రములున్నట్టుల నీనినదో యనఁగాను, గిరిక జలసముద్భూత. అతిశయసౌందర్యాభిరామ. గిరికాజననవశమున జలతత్త్వము ప్రశస్తినొందఁ జూపోపక యంతకు మిన్నలగు సతుల భూమి గననెంచి పెక్కండ్రుచెలువల నీనినటుల రూపవతులు గిరికాదర్శనమునకు వచ్చిరని భావము.

గణనమీఱి లెక్క కెక్కువయై, పయోరూపగరిమమించు=పయోరూపముయొక్క గౌరవముచేత-అనఁగా భారముచేత నతిశయించుచున్న, లలనతోన్=గిరికాదేవితోడ, తలఁదూఁగఁజాలక=సరితూఁగలేక, భజించిరుపరిభాగంబులన్=పైకిఁ బోయినారో యనునట్టులుగా, మ్రొగ్గవహించి క్రిందనున్న గిరికాదేవితో సరితూఁగలేక మీఁది కెగసిరో యన్నట్టులుగా, చేదినృపలలామపట్టణపయోజముఖులు = వసురాజుయొక్కపట్టణమయిన యధిష్ఠానపురమందలి స్త్రీలు, అపుడు=అనఁగా సౌధోపరిభాగముల నెక్కి చూచుచున్నసమయమునందు, చూపట్టిరి=కనుపించిరి, ఈగీతి మొదటనున్న గణనమీఱి యనెడుపదము పయోజముఖుల్ చూపట్టిరన్నచోటి కన్వయింపవలయును.

కొమ్మంచున్ అనుట స్త్రీవాచకతత్సమాదులకు సంధిలేదను వ్యాకరణసూత్రముచే బాధితము. ఇటులె ఈయాశ్వాసమునందలి ఎనుబదవపద్యమునందును "అమ్మని" యనుచో స్త్రీవాచకసంధిగలదు. ఇట్టిసంధులు ప్రౌఢకవిప్రయోగములందుఁ గానరావు.

క. కమలోపమలోచన లా, కమలోపేంద్రులవిభాతిఁ • గనఁ దగుజగదు
  త్తమలోలాక్షీరమణులఁ, దమలో నెన్నుచు గుణార్హ్వ•తమలోభమునన్. 66

కమలోపమలోచనలు=పద్మములవంటి కన్నులుగలస్త్రీలు, ఆకమలోపేంద్రులవిభాతిన్=ఆలక్ష్మీనారాయణులవలె, కనఁదగు=చూడనొప్పుచున్న, జగదుత్తమలోలాక్షీరమణులన్=లోకోత్తరులయిన స్త్రీపురుషులను-అనఁగా గిరికావసురాజులను, తమలోనెన్నుచున్=తమలోఁ దాము స్తోత్రము సేయుచు, గుణార్హ్వతమలోభమునన్=గుణములచేతఁ బూజ్యులైనవారియందలియాసక్తిచేత, ముందరి పద్యముతో నన్వయము.

చ. అమరబలాపకృష్ట మయి • యంబుధిఁ జేరి యొసంగెఁ బూరుషో
  త్తమునకు మందరాగ మొక•తన్వి నదెంత యటంచు నీనగం
  బమర నమందరాగ మయి • యావరసింధువుఁ జేరి పూరుషో
  త్తమున కొసంగె నౌర వని•తామణి నంచు నుతించి రెంతయున్. 67

అమరబలాపకృష్టమయి=దేవతలచే బలాత్కారముగా నీడువఁబడినదై యనియర్థము. అమరసైన్యాపకృష్టమని భావము. (ని. 'స్థౌల్య సామర్థ్యసైన్యేషు బలమ్' అని అ.) అంబుధిఁజేరి=సముద్రమునఁ బ్రవేశించి, మందరాగము=మందమయిన యనురాగముగల మందరాచలము, ఒకతన్విన్=ఒకదిన్నదానిని, పూరుషోత్తమునకొసంగెన్=విష్ణుదేవునకిచ్చెను, అదెంతయటంచున్=అదియేమియెక్కువకార్యమని నిరాకరించుచు, ఈనగంబు=ఈకోలాహలాచలము, అమరనమందరాగమయి=ఒప్పిదమగునట్టులుగా నధికానురాగముగలదై, ఆవరసింధువుఁజేరి = శ్రేష్ఠమయిన యాసముద్రమునుజేరి యనియర్థము. శుక్తిమతీనదిని జేరియని భావము. సింధుశబ్దము సముద్రమందును నదియందును వర్తించును. (ని. 'సింధు స్సముద్రే నద్యాంచ' అని ని.) వనితామణిన్=స్త్రీరత్నమును, పూరుషోత్తమునకొసంగెన్=విష్ణుదేవున కిచ్చె నని యర్థము. పురుషశ్రేష్ఠుఁడైన వసురాజున కిచ్చెనని భావము. ఔర=ఆశ్చర్య, అంచున్=అనిపలుకుచు, నుతించిరెంతయున్ = మిక్కిలి స్తోత్రముచేసిరి. పూర్వపద్యాంతమందలి, గుణార్హ్వతమలోభమునన్, అనుపదము నీపద్యమందలి నుతించి రెంతయున్ అనువాక్యమున కన్వయింపవలయును.

వరసింధుపదములోని వరశబ్దంబును వనితామణియన్న పదములోని మణిశబ్దంబును వ్యతిరేకమును దెలుపుచున్నవి. మందరాగము మందగించిన రాగముగలది. మఱియు నమరబలావకృష్టము. అట్లయ్యుఁ బురుషోత్తమున కొసంగిన దొకానొక తన్వి. కోలాహలుఁడు వరసింధువునుపొంది వనితామణినొసంగెను. కావున నిది నుతిపాత్రము. పురుషోత్తమునకుఁ దగినది తన్వికాదు వనితామణి. ఇట్టిలోకోత్తరవనితామణి నొసంగుటచేఁ గోలాహలుఁ డెంతయుఁ గొనియాడఁబడెను.

ఉ. కాంతికలాపరూపజిత♦కంతుజయంతున కీవసుంధరా
కాంతునకుం జరాచరయు♦గంబున నీ డగుకాంత లేమి య
త్నాంతరశాలి యై విధి చ♦రాచరయోజనచే సృజించెఁ గా
కింతి ఝరిం గిరిం బొడము♦నే యని పల్కిరి గొంద ఱయ్యెడన్. 63

కాంతికలాపరూప జితకంతుజయంతునకున్ = కాంతిసముదాయముచేతను రూపముచేతను జయింపఁబడిన మన్మథుఁడును జయంతుఁడును గలిగిన, ఈవసుంధరాకాంతునకున్=ఈవసురాజునకు, చరాచరయుగంబునన్=జంగమములయందును, స్థావరములయందును, ఈడగుకాంతలేమిన్=ఈడైన స్త్రీలేనందున, యత్నాంతరశాలియై = నూతనముగా మఱియొకయత్నము చేసినవాఁడై, విధి=బ్రహ్మదేవుఁడు, చరాచరయోజనచే సృజించెఁ గాక=జంగమస్థావరములయొక్క పరస్పరయోగముచేత సృజించినాఁడేకాక, లేనట్టయిన, ఇంతి=స్త్రీ, ఝరింగిరిం బొడమునేయని పల్కిరి గొంద ఱయ్యెడన్=నదీప్రవాహమువలనను బర్వతమువలనను నుత్పత్తియగునా యని కొంద ఱాసమయమందుఁ బల్కిరి.

వసురాజు కాంతికలాపశాలి, రూపజితకంతుఁడు. ఇట్టివానికి లోకోత్తరసౌందర్యవతి నాయిక కాఁదగినది. నలువ యొనర్చిన చరాచరములలో వసురాజున కీడగు చెలువలేదు. విధి సామాన్యుఁడా? యత్నాంతరశాలి. చరము అచరమును సమకూర్చిన జరాచరములందులేని సౌందర్యవతి యుద్భవించునని శుక్తిమతీ కోలాహలులకుఁ బొందుఁ గూర్చెను. ఇది విధియత్నాంతరములేకున్న ప్రవాహమునకుఁ బాషాణమునకు బాలిక జన్మించుట యసాధ్యము. నది ప్రవహించునది గావునఁ జరము శైలము కదలనిది గాన నచరము. ఝరిగిరియనుటలో రెండవది నిందావాచకమయ్యుఁ గథ కన్వయించుట స్వారస్యము.

సీ. తరుణధూర్తశిఖావ♦తంసున కొక్కకాత్యాయనిఁ గూర్చిన♦యరఁగొఅంత
రాజుతో సత్కళా♦రాశితో నక్షత్రజాతిఁ దార్చినపక్ష♦పాతరచన
యభినవచ్ఛాయతో♦ నతిదుస్సహచ్ఛాయఁ జేర్చిననేరని♦చేఁత్రఅట్టు
రతితో ననిందితా♦కృతితో మధుపగుణంబులవానిఁ గూర్చిన♦మోహసృష్టి

తే. సమవయోవంశలావణ్య♦సద్గుణాభి, నుతులనీదంపతులశుభా♦న్వితులసంఘ
టించివారించికొని యెవి♦రించియనుచుఁ,బొగడిరొకకొందఱానంద♦పూర్ణఘణితి.

తరుణధూర్తశిఖావతంసున కొక్కకాత్యాయనిఁ గూర్చినయరఁగొఅంత = లేఁతవయస్సుగల విటాగ్రేసరునకు నొకయర్ధవృద్ధురాలిని-అనఁగా సగము ముదిసినదానిని ఘటనచేసిన హీనదృష్టి అని యర్థము. (ని. 'కాత్యాయ న్యర్ధవృద్ధాయా కాషాయవసనా ధవా' అని అ.) తరుణ=నూతనమైన,

ధూర్త=ఉన్మత్తపుష్పు, శిఖావతంసునకున్=శిరోభూషణముగాఁగల హరునకు, కాత్యాయనిఁగూర్చిన=గౌరీదేవిని సర్ధగేహముగాఁగూర్చిన, అరగొఱంత=అర్ధనారీశ్వరత్వసృష్టియని భావము. (ని. 'ధూర్తంతు ఖండలవణే ధుత్తూరే నావిటే త్రిషు' అని మేదిని.) శివుని ధూర్తకశిఖామణియని వ్యవహరించుటగలదు.

చ. పలుచఁదనంబునొంది జడభావము నూనినవారి మౌళిపై
నిలిపి స్వవిగ్రహైకగతి నిచ్చలు నార్యమహాగుణోన్నతిం
గలియఁగఁ జేసి ధూర్తకశిఖామణివై తని గౌరి యల్గఁగా
నలఘుమృదూక్తిఁ వేఁడు శివుఁ డాయతసౌఖ్యము మాకొసంగుతన్.

చంద్రికాపరిణయము. ప్ర. ఆ.

రాజుతో సత్కళారాశితో నక్షత్రజాతిఁ దార్చిన పక్షపాతరచన-సత్కళారాశితోన్=సకల విద్యానిధియైన, రాజుతోన్=క్షత్రియునితో, నక్షత్రజాతిఁదార్చిన=క్షత్రేతరజాతినిగూర్చిన, పక్షపాతరచన=పక్షపాతసృష్టి యనియర్థము. అనఁగా లోకములో జాతిగాని జాతిని గూర్చినాఁడు గనుక నిక్కడఁ బక్షపాతసృష్టి యనుట. (ఇక్కడ, న+క్షత్రమ్, సుప్సుపేతిసమాసః.) అని యైనను లేక అక్షత్రమ్ అని స్వరాదిగాఁ జెప్పి సంధిచేత నకారమువచ్చినదనియైనను జెప్పవచ్చును. షోడశకళానిధియైన చంద్రునితో నశ్విన్యాది నక్షత్రములనుగూర్చిన శుక్లపక్షకృష్ణపక్షపాతసృష్టియనిభావము. (ని. 'రాజా ప్రభౌ నృపే చంద్రే' అని వి.)

అభినవచ్ఛాయతో నతిదుస్సహచ్ఛాయుఁ జేర్చిన నేరనిచేఁతఋట్టు=కోమలమయిన ఛాయగల స్త్రీతో మిక్కిలి సహింపఁగూడని ఛాయగల పురుషునిఁగూర్చిన సృష్టివలని యపవాదమనియర్థము. సంజ్ఞాదేవితో నతితీవ్రతేజుఁడయిన సూర్యునిఁగూర్చిన నేరనిసృష్టి యనిభావము. అభినవచ్ఛాయ యన్నపదము స్త్రీసామాన్యవాచకము గనుక నిక్కడఁ బ్రకరణబలముచేత సంజ్ఞానామక స్త్రీవిశేష వాచకమయినదని గ్రహింపవలయును. లేక అభినవచ్ఛాయాదేవి యేస్త్రీవలననైనదో యది యభినవచ్ఛాయయని సంజ్ఞాదేవియొక్క యౌగిక నామముగానైనను గ్రహింపవలయును. సూర్యుని. తీవ్రకిరణములు సహింపలేక సంజ్ఞాదేవి ఛాయాదేవిని నిర్మించి గృహమందు నిల్పి తాను దపమాచరింపఁ బోవుట విష్ణుపురాణమునందును స్కాందపురాణమునందును జెప్పఁబడియున్నది.

రతితోననిందితాకృతితో మధుపగుణంబులవానిఁ గూర్చిన మోహసృష్టి-అనిందితాకృతితోన్=నిందితముగాని యాకృతిగల, రతితోన్=రతీదేవితో, మధుపగుణంబులవానిఁగూర్చిన=మద్యపాయి గుణములు గలవానిని గూర్చిన, మోహసృష్టి=భ్రాంతిసృష్టియని యర్థము. మధుపములు నారిగాఁగల మన్మథునిఁగూర్చిన సమ్మోహవిద్యాసృష్టి యని భావము. రతి స్తవనీయమగు నాకారవిశేషముగలది. అట్టిరూపవతికి ననంగుని మఱియుఁ ద్రాఁగుబోతును భర్తగాఁ గూర్చుట భ్రాంతిసృష్టి. ఒకయాకారమునందేగాక గుణములందుఁగూడ లోటుగూర్చుట మోహాతిశయమున గాన నట్టిసృష్టి గర్హ్యము.

సమవయోవంశలావణ్య సద్గుణాభినుతులన్-సమ=సమానమయిన, వయః=వయస్సుచేతను, వంశ=వంశముచేతను, లావణ్య=కాంతిచేతను, సద్గుణ=శ్రేష్ఠగుణములచేతను, అభినుతులన్=స్తుతి చేయఁబడిన, ఇక్కడఁ గ్రమాలంకారంబును సమశబ్దము వయోవంశలావణ్యసద్గుణములకు విశేషణంబును నని తెలియవలయును. శుభాన్వితులన్=శుభలక్షణములతోఁగూడిన, ఈదంపతులన్ = ఈ

వధూవరులను, సంఘటించి=కూర్చి, విరించి=బ్రహ్మదేవుఁడు, వారించికొనియెన్=పైనఁ జెప్పంబడిన సృష్టిదోషములనుఁ బోఁగొట్టుకొనెను, అనుచున్=అని పలుకుచు, ఒకకొందఱానందపూర్ణఫణితిన్=మఱికొందఱు సంతోషముచేతనైన సంపూర్ణవైఖరితోడ, పొగడిరి=స్తోత్రముచేసిరి.

బ్రహ్మకూర్చిన తొల్లింటిసంబంధములు నాలుగు వరుసగా వయస్సు, వంశము, లావణ్యము, గుణములందుఁ గొఱంతపడినవి. ఆలోపములన్నియు గిరికావసురాజుల వివాహము జతపఱచి వారించికొనుటచే బ్రహ్మ పొగడికకుఁ దగెను. విధిఘటన మీయెడ నానందపూర్ణహేతువై ప్రజారంజన మయ్యెనని భావము.

మ. అవి యాలించుచు వేడ్కనచ్ఛతరము♦క్తాలంకృతంబై ద్విజ
ప్రవరాధిష్ఠిత మై యనంతమణిశో♦భానిత్యనీరాజనో
త్సవదం బై తెలిదీవిఁ బోలునిజస♦ద్మంబుం బ్రవేశించె న
య్యవనీభర్త తరంగిణీప్రియసుతా♦హస్తాంబుజాలంబి యై. 70

అవనీభర్త యనుపదము విష్ణువునకు వసురాజునకుఁ జెల్లును గావున నర్థద్వయము గ్రాహ్యము.

అయ్యవనీభర్త=ఆ వసురాజని యర్థము. విష్ణుదేవుఁడని యర్థాంతరము. అవియాలించుచున్=పురజనులాడుకొనునట్టి యావాక్యములను వించును, వేడ్కన్=సంతోషముచేత, అచ్ఛతరముక్తాలంకృతంబై=స్వచ్ఛతరమౌక్తికాలంకృతమై యని రాజగృహపరమయిన యర్థము. పరిశుద్ధులైన ముక్తపురుషులచేత నలంకరింపఁబడినదై యని శ్వేతద్వీపపరమయిన యర్థము. ద్విజప్రవరాధిష్ఠితమైన=బ్రాహ్మణోత్తములచేత నధిష్ఠింపఁబడినదై యని గృహపరమయిన యర్థము. ద్విజప్రవరుఁడనఁగా గరుత్మంతుఁడు గనుక నాయనచేత నధిష్ఠింపఁబడిన దని శ్వేతద్వీపపరమయిన యర్థము. అనంతమణిశోభానిత్యనీరాజనోత్సవదంబై = అపరిమితరత్నకాంతులచేత నిరంతరమును నీరాజనోత్సవమును గలుగఁజేయుచున్నదై యని గృహపరమయినయర్థము. అనంతుఁ డనఁగా శేషుఁడు గాన నాయన ఫణామణికాంతులచేత నిత్యనీరాజనోత్సవ ప్రదాయకమై యని శ్వేతద్వీపపరమైన యర్థము. తెలిదీవిఁబోలు = శ్వేతద్వీపమునుబోలుచున్న, నిజసద్మంబున్ = తనయొక్క గృహమును, తరంగిణీప్రియసుతాహస్తాంబుజాలంబియై-తరంగిణీ = శుక్తిమతీనదియొక్క, ప్రియసుతా = ప్రియకుమారికయైన గిరికాదేవియొక్క, హస్తాంబుజాలంబియై = పద్మమువంటి హస్తముయొక్క యవలంబనము గలవాఁడై-అనఁగాఁ జేయిపట్టుకొన్నవాఁడై యని రాజపరమయిన యర్థము. తరంగిణీ ప్రియుఁ డనఁగా నదీనాథుఁడైన సముద్రుఁడు గనుక నాయనయొక్క సుతయైన లక్ష్మియొక్క హస్తావలంబనముగలవాఁడై యని విష్ణుపరమయిన యర్థము. ప్రవేశించెన్=అనఁగా వసురాజు పురజనులవాక్యములువించు గిరికాదేవి చెయిపట్టుకొని పైని జెప్పఁబడిన విశేషణములతోఁగూడిన నిజగృహమును బ్రవేశించె నని తాత్పర్యము.

అనంతమణికాంతులు నిత్యనీరాజనములవలె వెలుంగుటచేతను, నిర్మలములగు ముక్తాఫలములు కాంతిసంవృతయలై ప్రజ్వరిల్లుటచేతను, రాజగృహము తెల్దీవివలె నుండెను. వసురాజు పౌరప్రశంసావాక్యముల నాలించుచు గిరికాహస్తముగొని గృహప్రవేశము చేసెను.

వ. ఇట్లు శుభలగ్నంబునం గృశావలగ్నయుం దానును నమందవిభవసందీపితనిజ
మందిరప్రవేశమంగళం బంగీకరించి గురుబుధకవిసమాజంబునకు నతిభాస్వ

ద్రుచికలాపసౌభాగ్యంబు సంఘటించుచు రాజమండలంబునకు నక్షీణలక్ష్మీ
విలాసంబుఁ గల్పించుచు మిత్త్రవర్గంబునకు ననంఖ్యాతరతురంగతరంగితశతాం
గసంఘాతంబు నొసంగుచు మహానటులకు మహనీయచిత్రాంబరసంపదల
సొంపు సంపాదించుచు విద్యాధరులకు విపులవిపులాధిపత్యంబు వెలయించు
చు మఱియుం దక్షిణమార్గణగణంబులకు వేర్వేఱ నగణితఫలంబు లొదవ
వించుచు విశ్వవిశ్వంభరరాజనవిస్మయనీయవితరణచాతురీధురీణుం డై విలసిల్లు
నవ్విబుధరాజబాంధవుండు వివిధకల్యాణగుణవిభాసితం బగునొక్కసమ
యంబున. 71

ఇట్లు=ఈప్రకారముగా, శుభలగ్నంబునన్=శుభకరమైన ముహూర్తమందు, కృశావలగ్న
యుం దానును=సూక్ష్మమయిన నడుముగల గిరికాదేవియును దానును, అమంద=అధికమయిన, విభవ=
వైభవముచేత, సందీపిత=లెస్సగాఁ బ్రకాశింపఁజేయఁబడిన, నిజమందిర=తనయొక్కగృహమందలి,
ప్రవేశ=ప్రవేశయుక్తమయిన, మంగళంబు=శుభమును, అంగీకరించి=స్వీకరించి-అనఁగా గృహ
ప్రవేశముచేసియనుట, గురు=గురువులయొక్కయు, బుధ=పండితులయొక్కయు, కవి=కవీశ్వరుల
యొక్కయు, సమాజంబునకున్=సమూహమునకు, అతిభాస్వత్=మిక్కిలి ప్రకాశించునట్టి, రుచి=
కాంతులుగల, కలాప=భూషణములయొక్క, సౌభాగ్యంబునన్=సౌష్ఠవమును, సంఘటించుచున్=
ఘటనపఱుచుచు అనియర్థము. గురుబుధకవిసమాజంబునకున్=బృహస్పతి బుధశుక్రులకు, అతిభా
స్వత్=సూర్యాతిక్రాంతమయిన, రుచికలాప=కాంతిసమూహముయొక్క, సౌభాగ్యంబు సంఘటించు
చున్=సౌష్ఠవమును ఘటనపఱచుచును, అని యర్థాంతరము. (ని. 'భాస్వాన్ భాస్వర సూర్యయోః'
అని వి.) రాజమండలంబునకున్=రాజసమూహమునకు, అక్షీణ=అక్షయమయిన, లక్ష్మీవిలాసంబున్=
సంపద్విలాసమును, కల్పించుచున్=కలుగఁజేయుచును అని యర్థము. చంద్రమండలమున కక్షయ
శోభావిలాసమును గలుగఁజేయుచును అని యర్థాంతరము. (ని. 'శోభా సంపత్తి పద్మాసు లక్ష్మీ శ్రీశ్శ
రపి కథ్యతే' అని కోశము.) మిత్త్రవర్గంబునకున్=సుహృజ్జనసమూహమునకు, అసంఖ్యాతర=అగణితము
లైన, తురంగతరంగిత=అశ్వములచేతఁ బరంపరితమైన-అనఁగా ననేకాశ్వములనుబూన్చిన, శతాంగ
సంఘాతంబునొసంగుచున్=రథసమూహము నిచ్చుచునుఅనియర్థము. ద్వాదశాదిత్యులకు నగణితతురంగ
యుక్తరథసమూహ మిచ్చినాఁడని యర్థాంతరము. మహానటులకు మహనీయచిత్రాంబరసంపదలసొంపు
సంపాదించుచున్=అధికులైన నటులకు యోగ్యములయినచిత్రవస్త్రసంపదలయొక్క సౌష్ఠవమును
గలుగఁజేయుచును అని యర్థము. ఏకాదశరుద్రులకు యోగ్యమయిన చిత్రవర్ణముగల వ్యాఘ్రచర్మాం
బరము లిచ్చినాఁడని యర్థాంతరము. విద్యాధరులకు విపులవిపులాధిపత్యంబు వెలయించుచున్=విద్యా
వంతులకు విస్తారమయిన ధరాధిపత్యము గలుగఁజేయుచును అనియర్థము. దేవయోనివిశేషులైన విద్యా
ధరులకు భూపతిత్వము గలుగఁజేసినాఁడని యర్థాంతరము.

మఱియుం దక్షిణమార్గణగణంబులకు వేర్వేఱ నగణితఫలంబులొదవించుచున్=మార్గణశబ్దము
యాచకునియందును బాణమందును వర్తించును. (ని. 'మార్గణో యాచకే శరే' అని అ.) ఫలశబ్దము
లాభమందును బాణాగ్రమందును వర్తించును. (ని. 'ఫలం లాభ శరాగ్రయోః' అని వి.) మఱియును
మిగిలిన యాచకసమూహములకుఁ బ్రత్యేక ప్రత్యేకముగా నగణితలాభములను గలుగఁజేయుచును

అనియర్థము. బాణముల కొకటొకటి కనేకములయిన యగ్రము లొదవించినాఁడని యర్థాంతరము. విశ్వ=సమస్తమైన, విశ్వంభరరాజన=భూజనులచేత, విస్మయనీయ=ఆశ్చర్యమును బొందఁదగిన, వితరణచాతురీ=దాతృత్వప్రవీణతయందు, ధురీణుండై=ధురంధరుఁడై, విలసిల్లి=ఒప్పినవాఁడై, ఇక్కడ నర్థాంతరములు విస్మయకరములని గ్రహింపవలయును. అవ్విబుధరాజబాంధవుండు=ఇంద్రసఖుఁడైన యావసురాజు, వివిధ=నానావిధములయిన, కల్యాణగుణ=శుభగుణములచేత, విభాసితంబగు=ప్రకాశింపఁబడుచున్న, ఒక్కసమయంబునన్=ఒకానొకసమయమునందు, దీనికి ముందరిపద్యముతో నన్వయము.

సీ. అత్రాసవృత్తిఁ జె♦న్నలరినూతనరాగమహిమఁ గుల్కెడు కల్కి♦మానికములు
నవసమాగమమునఁ♦జవులు వక్కాణించి మించఁజాలు వెలంది♦మిన్నగములు
మరునితేజీలవై♦ఖరిఁ బొల్చి రతులనిరూఢిఁ జూపునితాంత♦రుచిరమణులు
ప్రౌఢపుంభావసం♦భావన ల్పచరించి ప్రబలువామాలోక♦రత్నతతులు
తే. గలయఁ గీలించి చిత్రించి ♦ కన్నియలకుఁ, గామ నిగమరహస్యప్ర♦కాశనం బొ
నర్పఁ బన్నినయాత్మీయ♦నర్మభర్మ, హర్మ్యరాజంబునకు వేడ్క♦నరిగి యచట. 72

అత్రాసవృత్తిఁజెన్నలరి=త్రాసమనఁగా బద్మరాగమణియొక్క షడ్విధదోషములలో భేదము. ఇందుకు రత్నపరీక్షయందు,

సీ. 'పగిలినగతి రేఖపైనున్నఁ ద్రాసంబు కలహ మెప్పుడు దానఁ గలుగుచుండు'

అని చెప్పఁబడియున్నది గనుకఁ, దద్దోషరహితవృత్తిచేత నొప్పుచున్నవై, నూతనరాగమహిమఁ గుల్కెడు=నవీనరక్తిమాతిశయముచేతఁ జక్కనగుచున్న, కల్కిమానికములు=సుందరమణు లని యర్థము. అనఁగాఁ బద్మరాగమణులనుట, త్రాసమనఁగా లజ్జాకార్యమైన భయము గనుక నత్రాసవృత్తియనఁగా లజ్జాభయరహితవృత్తి. అనఁగాఁ బౌఢత్వముగాన నట్టిప్రౌఢత్వముతోడ, చెన్నలరి=బాగుమీఱి, నూతనరాగమహిమఁగుల్కెడు=నవీనమైనయనురాగముచేత నొప్పుచుండెడు, కల్కిమానికములు=కాంతారత్నములును అనియర్థాంతరము. కలికియనఁగా సుందరమును గాంతయును, ని. 'కలికియొప్పిదంబు కాంతయయ్యె' అని యాంధ్రనిఘంటువు. కూటములలో గడితేఱి వెఱపుమఱచి క్రొత్తయనురాగమున మగల దనియించుట ప్రౌఢచెలువలచేఁతలు. అట్టిచెలువలు కలికిమానికములు. సుందరీమణులని భావము.

నవసమాగమమునఁ జవులు వక్కాణించి=చవులనఁగా ముత్యాలయొక్క తులామానములు, ఇందుకు విజయవిలాసమందుఁ బ్రయోగము- సీ. 'చక్కెరమోవిచ్చి చవులఁదేలించు నీముత్యాలకమ్మల ముద్దులాడి' అనియున్నది. నూతనముగా వచ్చుటయందుఁ జవులు ప్రకటనపఱిచి, మించఁజాలు=అతిశయింపఁజాలిన, వెలందిమిన్నగములు=మేలైనరత్నములని యర్థము. అనఁగా ముత్యములనుట. నూతనసంభోగానుభవములను దేటపఱిచి యతిశయింపఁజాలిన స్త్రీరత్నములును అనియర్థాంతరము. వెలందియనఁగా మేలైనదియును మగువయును, ఇందుకుఁ బ్రయోగము విజయవిలాసమునందు, తే. 'ఈ వెలందియొడలైన్ ఁడిలో వెలంది' అనియున్నది.

మరునితేజీలవైఖరిఁ బొల్చి = మరునితేజీలనఁగాఁ జిలుకలు గనుక వానివలెఁ బ్రకాశించి- అనఁగాఁ బసరుగలిసినకాంతిచేతఁ బ్రకాశించియనుట, రతులనిరూఢిఁజూపు=రతులనఁగాఁ బచ్చలయొక్క తులామానములు, ఇందుకు విజయవిలాసప్రయోగము. సీ. 'అతివినోదముగాఁగ రతులఁ దేలించు నీపచ్చలకడియాలపద్మగంధి' అనియున్నది గనుక నట్టిరతులయొక్క నిరూఢిని గనుపఱుచు

చున్న, నితాంతరుచిరమణులు=మిక్కిలి ప్రకాశమానములగుచున్న మణులని యర్థము. పచ్చలనుట. మన్మథునిగుఱ్ఱములవలెఁ బ్రకాశించి సురతనిరూఢిగనుపఱుచుచున్న యతిశయకాంతిగలరమణులని యర్థాంతరము.

ప్రౌఢపుంభావ సంభావన ల్పచరించి=పుంభావమనఁగాఁ బురుషత్వము, ప్రౌఢ=ప్రవృద్ధమైన, పుంభావ=పురుషత్వముయొక్క, సంభావనల్పచరించి=ప్రతీతులనుగనుపఱిచి-అనఁగాఁ బురుషరత్నములనెడు ప్రతీతిని గనుపఱిచియనుట, ప్రబలు=బలిష్ఠములగుచున్న, వామాలోకరత్నతతులు=మనోహరప్రకాశముగల రత్నసమూహము లనియర్థము. అనఁగా వజ్రములనుట, వజ్రములు పురుషరత్నము లని ప్రసిద్ధము. ప్రవృద్ధపురుషాయితరతియందలి బహుమానములను గనుపఱిచి విజృంభించుచున్న స్త్రీజనరత్నములును అని యర్థాంతరము.

కలయఁగీలించి చిత్రించి = అనఁగాఁ బైనిజెప్పఁబడిన పద్మరాగమౌక్తికమరకతవజ్రమణుల నంతటఁ జెక్కియనియును, స్త్రీరత్నములను జిత్తరువుగా వ్రాసియనియును గ్రమాలంకారము. కన్నియలకున్ = నవోఢలకు, కామనిగమరహస్యప్రకాశనం బొనర్పన్ = మన్మథవేదరహస్యములను - అనఁగా సంభోగకేళీరహస్యములను బ్రకటముచేయుటకొఱకు, పన్నిన = నిర్మించిన, ఆత్మీయనర్మభర్మహర్మ్యరాజంబునకున్-ఆత్మీయ=స్వకీయమైన,నర్మ=క్రీడార్హమైన,భర్మ=సువర్ణమయమయిన,హర్మ్యరాజంబునకున్=శ్రేష్ఠతరమైనమేడకు, వేడ్క నరిగి = వేడుకచేతఁబోయి, అచటన్=అక్కడను. ఈ పద్యమునకు ముందరిపద్యముతో నన్వయము. ఈసీసపద్యపు నాలుగుచరణములయందును బ్రౌఢలనే చెప్పినాఁడు.

హర్మ్యరాజము సువర్ణనిర్మితము. అందున్న చిత్తరువులన్నియుఁ గన్నియలకుఁ గామవేదరహస్యబోధకములుగానుండెను. కన్నెలు సురతమునం దప్రౌఢలు. భయవతులుగాన మెలపుమై చెలిమిచేయనగును. అందులకు సహకారముగఁ జిత్తరువులు శయ్యామందిరముల నలవరించిరి. అనురాగాతిశయము దెలుపుట, కూటమిలో రుచిఁజూపుటను, రతులలో నారితేరుట, మగచేఁతలొనర్చుట లోనగు క్రమాభివృద్ధి యాచిత్తరువులందుఁగలదు. ఇదియ కన్నియలకుఁ గామశాస్త్రరహస్యములఁ గ్రమముగా బోధించువైఖరి. మహిమగుల్కుట, మించజాలుట, నిరూఢిజూపుట, ప్రబలుట యాయాచిత్తరువులయందుఁగల కామశాస్త్రానుభవమునకుఁ దార్కాణలు. ఇట్టిగృహములో నవోఢతోఁ బ్రవేశించుట రాజునకు వేడుక కలిగించుట సాజము.

సీ. బందీకృతాన్యరా♦డ్భవనలక్ష్మీపరంపరలు నిట్టూరుపు ♦ ల్వారపుకరణిఁ
బుంజీకృతస్నేహ♦భూరిమోహనశక్తు లనురాగకళికలఁ ♦ బెనఁచుకరణి
నంగీకృతాంగజై♦త్రాధిదేవత లాత్మ సుమచోరుమచ్చంబు ♦ చూపుకరణిఁ
బ్రకటీకృతానంత♦రతిమూర్తులు లతాంతశరశాస్త్రసంచిక ♦ ల్సాఁచుకరణి

తే. యంత్రపాంచాలికలు గొన్ని ♦ యగురుధూప
వితతి వెడలింపఁ గొన్ని దీ♦వియలు దాల్పఁ
గొన్ని విరివీవనలు వీవఁ ♦ గొన్ని పసిఁడి
తళుకుఁదెలనాకు లొసఁగ సం♦తసము లెసఁగ. 73

బందీకృత=చెఱఁబెట్టఁబడిన - అనఁగా ఖైదుచేయఁబడిన, అన్యరాట్=శత్రురాజులయొక్క

భవనలక్ష్మీపరంపరలు = గృహలక్ష్మీశ్రేణులు, నిట్టూరుపుల్పొరపుకరణిన్ = నిట్టూర్పులుపుచ్చునట్లుగాను, భవనలక్ష్ములనుటచేఁ జిత్తరువుల యసామాన్య సౌందర్యాతిశయమువ్యంజితము. భవనలక్ష్ములబలలు. బందీకృతలగుటచే నేమియుఁ జేయఁజాలక సంతాపసూచకముగ నిట్టూర్పులుమాత్రము విడువసాగిరి. ఇది యగురుధూపము.

పుంజీకృత=సంపూర్ణముగాఁ జేయఁబడిన, స్నేహ=విశ్వాసముగల, భూరి=అనేకములైన, మోహనశక్తులు=సమ్మోహశక్తులు, అనురాగకలికలఁ బెనఁచుకరణిన్=అనురాగకోరకముల నవలంబించినట్లుగాను, అనియర్థము. ఇక్కడ మోహనశబ్దము భావార్థరహితల్యుట్ప్రత్యయాంతము. స్నేహమనఁగాఁ జమురును భూరియనఁగాఁ గనకమునుగనుకఁ బుంజీకృతస్నేహకనకమయసుందరశక్తులనియును నర్థము. ఇక్కడ మోహనపదము కర్త్రర్థవిహితల్యుట్ప్రత్యయాంతము. ఇట యంత్రపాంచాలికలుగావించు దీవియలుదాల్చుట గ్రాహ్యము.

అంగీకృత=స్వీకరింపఁబడిన, అంగ=దేహములుగల, చైత్రాధిదేవతలు=వసంతాధిదేవతలు, ఆత్మసుమచోరు=తమపువ్వులదొంగయొక్క, మచ్చంబుచూపుకరణిన్ = గుఱుతుచూపినట్లుగాను, పూపులతోఁగట్టఁబడినసురటీలు మేనుదాల్చిన వసంతాధిదేవతలవలె నుండెను. అందుండి వీచునపుడు తావిగాడ్పులు బయలువెడలుట, వాయువు తమకుసుమసుగంధములు కొల్లగొనినవిధము చూపునట్లుగ నుండెననిభావము. ఇందుఁ బాంచాలిక లొనర్చువీవనల వీచుటలు చెప్పఁబడెను.

ప్రకటీకృత=ప్రకటముగాఁజేయఁబడిన, అనంత=అపరిమితములైన, రతిమూర్తులు=ఇచ్ఛామూర్తులు, లతాంతశరశాస్త్రసంచికల్సాఁచుకరణిన్=మన్మథశాస్త్రపుసంచికలందిచ్చునట్లుగాను, యంత్రపాంచాలికలుగొన్ని తాంబూలముల నందీయసాగెను. ఇదియిచ్ఛామూర్తులు కామశాస్త్రసంపుటములను జదివికొనఁ గోడెకాండ్ర కొసంగుచున్నటులుండెనని భావము.

యంత్రపాంచాలికలు=జంత్రపుబొమ్మలు-అనఁగా కీలుబొమ్మలు, కొన్నియగురుధూపవితతి వెదలింపన్=కొన్నియగురుధూపసమూహములను బయలువెడలించుచుండఁగాను, కొన్నిదీవియలుదాల్పన్=కొన్నిదీపములు పట్టఁగాను, కొన్నివిరివీవనలువీవన్=కొన్నిపూసురటులువిసరఁగాను,కొన్నిపసిఁడితళుకుతెలనాకులొసఁగన్=కొన్ని బంగారువరకువేసిన పండుటాకులియ్యఁగాను, అని క్రమాలంకారము. సంతసము తెసఁగన్=సంతోషము లతిశయింపఁగాను, ముందరిపద్యముతో నన్వయము.

చ. చికిలిపసిండివ్రాఁతనును • చెంద్రికపన్నియ మేలుకట్టునం
జకచకపర్వఁ గ్రొవ్విరులు • చంపకముల్సవిఁ దేంట్లు మూతిము
ట్టక నవకంపుకెంపుమొగ • డల్గని రాఁ దెలిముత్తియంపుబ
ల్సకినలకూకలం గిలకి • లన్నగు మోహనశయ్య నున్నెడన్. 74

చికిలిపసిండివ్రాఁత = తళుకుగలబంగారువ్రాఁతపనిగలిగిన, నును=మృదువైన, చెంద్రికపన్నియ=చంద్రకాంతిరంగుగల, మేలుకట్టునన్=చాందినీయందు, చకచకపర్వన్=చకచకమెఱయుచుండెడుకాంతివ్యాపింపఁగాను, క్రొవ్విరులు=ఆచాందినీయందలంకరింపఁబడినపుష్పములను, చంపకముల్సవిన్=సంపంగిపువ్వులనెడు భ్రాంతిచేత, తేంట్లు=తుమ్మెదలు, మూతిముట్టక=ఆస్వాదింపక, నవకంపుకెంపుమొగడల్గనిరాన్ = శయ్యయందలి నేవళమయినపద్మరాగమణులచేతఁ జేయఁబడినమొగ్గలను జూచి దొబ్బినిపువ్వులని భ్రాంతిపడిరాఁగా, తెలిముత్తియంపుబల్సకినలకూకలన్=తెల్లనిముత్యములు

గూర్చిన కీఁచుబిళ్ళలమ్రోఁతలనెడువ్యాజముచేత, కిలకిలన్నగు=అపహసించుచున్న, మోహనశయ్యన్నెడన్ = మోహనకరమయిన పానుపుమీఁదఁ బ్రవేశించియున్నసమయమునందు. ఈపద్యమునకు ముందరిపద్యముతో నన్వయము.

శయనగృహమునం దమర్పఁబడిన మేలుకట్టు (చాందిని) పైనున్న పుష్పాదిచిత్రములు పసిండి వ్రాఁతమెఱుంగులచే సంపంగిపూవులవలెనుంటచేఁ దుమ్మెదలు ముట్టవెఱచి శయ్యాస్థగిత పద్మరాగములను రక్తాంభోజములని వ్రాలుచుండెను. తాఁకినంతనఁ గీచుకీచుమని మ్రోఁగుమత్తెములు చెక్కినదిండ్లు తుమ్మెదల తెలివితక్కువకు నవ్వునటులుండెను.

సావియనుటకు రూపాంతరము సవి. ఇందులకు భ్రాంత్యర్థమునఁ బ్రయోగము-

చ. తలపకుచ్ఛటఁ గ్రుక్కి బాతువులు కేదారంపుగుల్యాంతర
స్థలి నిద్రింపఁగఁ జూచి యూరెకు లుపస్నాన్నప్రయాతద్విజా
వళి పిండీకృతశాటులన్ సవి తదావాసంబు జేరంగ రే
వులు డిగ్గన్ వెసఁబాఱు వానిగని నవ్వున్ శాలిగోప్యౌఘముల్.

ఆముక్తమాల్యద. ఆశ్వా. ౧.

శా. ఆకోలాహలశైలసంభవ రస♦వ్యాకృద్ఘనాళిప్రయ
త్నైకప్రస్థిత యై ప్రతిక్షణసభం♦గారాళసంచార యై
వ్యాకీర్ణాంబరఫేన యై పిహితవ♦క్త్రాబ్జస్ఫురద్వేణి యై
శ్రీకల్యాణగుణార్ణవుం డలర వ♦చ్చె న్నూత్నరాగంబునన్. 75

ఆకోలాహలశైలసంభవ=కోలాహలపర్వతమువలన జన్మించిన యాగిరికాదేవియని యర్థము. సెలయేఱని యర్థాంతరము. సర్వత్ర రూపకము చెప్పవలయును. రసవ్యాకృద్ఘనాళిప్రయత్నైకప్రస్థితయై-అనఁగా, రస=శృంగారరసమును, వ్యాకృత్=వెదచల్లుచున్న, అనఁగాఁ దెలియఁజేయుచున్న, ఘనాళి=అధికురాండ్రైన సఖులయొక్క, ప్రయత్న=ప్రయత్నముచేతనే, ఏకప్రస్థితయై=ముఖ్యముగాఁ దరలుచున్నదైయని గిరికాపరమయిన యర్థము. రస=ఉదకమును, వ్యాకృత్=వెదచల్లుచున్న – అనఁగా వర్షించుచున్న, ఘనాళి=మేఘపంక్తియొక్క, ప్రయత్నముచేతనే ముఖ్యముగాఁ బ్రవహించుటగలదై యని యర్థాంతరము. ప్రతిక్షణసభంగారాళసంచారయై-ప్రతిక్షణ=ప్రతిక్షణమును, సభంగ=తొట్రుపాటుతోఁగూడిన, ఆరాళ=కుటిలమయిన, సంచారయై = గమనముగలదైయని యర్థము. ప్రతిక్షణమును దరంగయుక్తమయినదియును వక్రమయినదియునగు సంచారముగలదైయని యర్థాంతరము. వ్యాకీర్ణాంబరఫేనయై-వ్యాకీర్ణ=వ్యాప్తమయిన, అంబరఫేనయై=తెల్లని నురుగువంటి వస్త్రముగలదైయని యర్థము. వ్యాకీర్ణమయిన గగనముగలిగిన నురుగులుగలదైయని యర్థాంతరము. పిహితవక్త్రాబ్జస్ఫురద్వేణియై - పిహిత = ఆచ్ఛాదింపఁబడిన, వక్త్రాబ్జ=ముఖకమలముగలిగి, స్ఫురత్=ప్రకాశించుచున్న, వేణియై=జడగలదై యని యర్థము. ఆచ్ఛాదింపఁబడిన ముఖసదృశకమలములుగలదై ప్రకాశించుచున్న పాయలుగలదైయని యర్థాంతరము. శ్రీకల్యాణగుణార్ణవుండలరన్=సంపత్కరములయిన శుభగుణములకు సముద్రుఁడయినవసురాజు సంతోషించునట్లుగానని యర్థము. శుభగుణములుగల

సముద్రుఁడు సంతోషించునట్టులుగానని యర్థాంతరము. నూత్నరాగంబునన్=అభినవానురాగముచేత నని యర్థము. అరుణిమచేతనని యర్థాంతరము. వచ్చెన్=ఏఁగుదెంచెను.

గిరికాదేవిని చెలులు బలవంతముగాఁ గొనివచ్చుచుండ వెనుకడుగు మాటిమాటికి వేయుచుఁ బెన్నెఱివిరియ మోము మరుగుపఱచికొనుచు ననురాగము రేకెత్తి వసురాజానందించుచుండ నరుదెంచె ననిభావము.

ఉ. వచ్చి నృపాలకేళిగృహ♦వాటము నెచ్చెలిపిండుచాటునం
జొచ్చి మెఱుంగుదేరుతొగ♦చుట్టపుఱా మొగరంబుమాటుగా
నచ్ఛపలాక్షి నిల్వ నది ♦ యవ్వల భర్తకుఁ జూపె రాచసొ
మ్మెచ్చట నైన నిత్యశుచి♦వృత్తులు మాటికొనంగ నేర్తురే. 76

వచ్చి=పైనిజెప్పఁబడినప్రకారముగా నరుగుదెంచి, నృపాలకేళిగృహవాటమున్=వసురాజు యొక్క క్రీడామందిరప్రదేశమును, నెచ్చెలిపిండుచాటునంజొచ్చి = చెలికత్తియలగుంపుమఱుఁగునఁ బ్రవేశించి, మెఱుంగుదేరు తొగచుట్టపుఱా మొగరంబుమాటుగాన్=మెఱయుచున్న చంద్రకాంత శిలాస్తంభముచాటుగా, అచ్ఛపలాక్షినిల్వన్=ఆగిరికాదేవి నిలిచియుండఁగా, అది = ఆ స్తంభము, అవ్వలన్=ఆపిమ్మట, భర్తకుఁజూపెన్=పెనిమిటియైన వసురాజునకుఁ గనుపఱచెను, రాచసొమ్మెచ్చటనైనన్=రాజద్రవ్యమెక్కడనైనప్పటికిని, నిత్యశుచివృత్తులు=నిరంతరపరిశుద్ధవృత్తిగలవారనియర్థము, స్వచ్ఛవృత్తిగలవియనిభావము. మాటికొనంగనేర్తురే=దాచిపెట్టుకొనఁజాలుదురా-అనఁగాఁజాల రనుట.

చంద్రకాంతస్తంభము మెఱుంగులుదేరియుండెను. గిరిక చెలులచాటున శయనమందిరముచేరి తనమేను చంద్రకాంతశిలాస్తంభమునకు మాటుపఱచి నిలచెను. నిత్యశుచివృత్తులు రాజధనము మాటి కొనరుగావున చంద్రకాంతశిలనుండి గిరికాస్వరూపము రాజునకు గోచరించెను.

మ. నవరత్నప్రతిబింబదంభమున న♦న్నాళీకపత్రాక్షిఁ ద
త్సవయోరూపసఖు ల్భజింపఁ గని ల♦జ్జాయుక్తిమైఁ బోలె నా
ళివితానం బొకనేర్పున న్వెడల ని♦ల్చెం దాన వ్రీడావయ
స్యవధూటీలలితాంతరంగచిరస♦ఖ్యాభ్యాసబంధంబునన్. 77

నవరత్న = గృహసంబంధములైన నూత్నరత్నములయందలి, ప్రతిబింబ = నీడలనెడు, దంభ మునన్=వ్యాజముచేత, అన్నాళీకపత్రాక్షిన్ = ఆగిరికాదేవిని, తత్సవయోరూపసఖుల్భజింపన్= ఆగిరికాదేవికి సమానమయినవయస్సును రూపమును గలసఖులు సేవింపఁగా, కని = చూచి, లజ్జా యుక్తిమైఁబోలెన్=సిగ్గుతోఁగూడుకొనుటచేతవలె, ఆళివితానం బొకనేర్పునన్వెడలన్ = సఖీ సమూహ మొక్కొక్కనేర్పుచేత వెళ్ళఁగా, తాన=తానుమాత్రమే, వ్రీడా=లజ్జయనెడు, వయస్యావ ధూటీ = చెలికత్తెయొక్క, లలిత=మనోహరమైన, అంతరంగ = మనస్సుగలిసిన, చిర = చిరకాలజనిత మయిన, సఖ్య=స్నేహమందలి, అభ్యాసబంధంబునన్=పరిచయానుబంధముచేత, నిల్చెన్ = నిలిచి యుండెను.

సఖీసమూహము గిరికాదేవియొక్క ప్రతిబింబములను గిరికాదేవికి సమానవయోరూపసఖు లని భ్రాంతినొంది తాము సమానవయోరూపవతులు కారుగనుక నాసిగ్గుచేతవలె నొక్కొక్కపని గల్పించు

కొని వెళ్ళఁగానే గిరికాదేవి సిగ్గనెడుచెలికత్తెతో నిలిచెనని తాత్పర్యము. "సలజ్జా గణికా నష్టా నిర్లజ్జా చ కులాంగనా, అన్యదాభూషణం పుంసాం...లజ్జైన యోషితాం" అనులోనగు సుభాషితములవలనఁ గులకాంతలకు లజ్జ యలంకారమని చెప్పఁబడుచున్నది. యౌవనప్రాదుర్భావమునకు మున్నె చెలువలకు లజ్జ యంకురించును. చిరకాలసఖ్యముగల లజ్జమాత్రము గిరిక నాశ్రయించియుండెను. లజ్జకును గిరికకును గల చెలిమి అంతరంగచిరకాలాభ్యాసబంధము గావున విడిచిపోఁజాలదయ్యెను. పూర్వపరిచితలగు చెలులు విడిచిపోయిన కారణము ప్రతిబింబముల సవయోరూపసఖులని.

సీ. అంబుజాంబకుపూన్కి నతినిర్మలస్థాణువున మించువామార్ధతను వనంగ
మోహకాగ్రణియత్నమునఁ దోఁచి మగుడఁ గంబముఁ జేరుజంత్రంపుఁ బ్రతిమ
సహకారతరుపరిగ్రహమునఁ దగియుపఘ్నావాప్తి యెడలనితీవ యనఁగ [యనఁగ
మావంతుప్రార్థనామహిమ నాలానంబు దరలి వచ్చుమనోజదంతి
తే. నట్టిరమణుండు దివియ నసహ్యతనయ
విధుమణిస్తంభమున నరవెడలి బయలు
పడి పెనంగుచు మరలి కంబ మొకకేల
నూని యాఁతయుఁ దక్కి పాన్పెయ్యఁ జేరె. 78

అంబుజాంబకుపూన్కిన్=మన్మథునిపూనికచేత, అతినిర్మల స్థాణువునమించు=అత్యంతధవళవర్ణుఁడైన హరునియందు విలసిల్లుచున్న, వామార్ధతను వనంగన్=వామార్ధతనురూపగౌరియో యన్నట్లుగానని యర్థము. అంబుజాంబకుఁడనఁగా నంబుజములవంటికన్నులుగల వసురాజనియును అతినిర్మలస్థాణువున ననఁగా నతిస్వచ్ఛవిధుమణిస్తంభమందనియును వామార్ధతనువనఁగా వామయొక్క, అనఁగా సౌందర్యవతియైనగిరికాదేవియొక్క యర్ధదేహమనియును నర్థాంతరము. (ని. 'స్థాణుః కీలే స్థిరే హరే' అని వి.)

మోహకాగ్రణియత్నమునఁ దోఁచి=అనఁగా సూత్రధారియొక్క ప్రయత్నముచేత నావిర్భవించియని యర్థము. భువనమోహనసౌందర్యశాలియైన వసురాజుయొక్క యత్నముచేతఁ గనుపడియని యర్థాంతరము. మగుడఁగంబముఁ జేరు=తిరుగా స్తంభమును జేరుచున్న, జంత్రంపుఁబ్రతిమయనఁగన్=కీలుబొమ్మయో యన్నట్లుగాను, యంత్రపుబొమ్మలు లోకోత్తరసౌందర్యవిరాజితములు. వాని క్రీడాదికములు సూత్రధారి యాధీనమునందుండును. క్రీడాంతమున యథాస్థానమగు స్తంభముమఱుఁగుఁ జేరును. రాజు గిరికను లాగుట మఱుఁగువదలుటగను వదలించుకొని మఱుఁగుజేరుట స్తంభముచాటుచేరుటగ నుండెనని భావము.

సహకారతరుపరిగ్రహమునఁదగి=అనఁగా రసాలవృక్షముయొక్క పట్టుచేత నమరియనియర్థము. సహాయశ్రేష్ఠుఁడయిన వసురాజుయొక్క పరిగ్రహముచేతనని యర్థాంతరము. ఉపఘ్నావాప్తియెడలనితీవయనఁగన్=ఉపఘ్నమనఁగా సమీపాశ్రయము, గనుక దానియొక్క పొందికను వదలకుండునట్టి తీఁగెయో యన్నట్లుగాను, (ని. 'స్యాదుపఘ్నోఽంతికాశ్రయే' అని అ.)

మావంతుప్రార్థనామహిమన్=మావంతుఁడనఁగా మావటీఁడని యర్థము. మాయనెడుపదము లక్ష్మియందు వర్తించును గనుక శ్రీమంతుఁడయిన వసురాజని యర్థాంతరము. మావంతునియొక్క

ప్రార్థన మహిమచేత, అనఁగా బుజ్జగింపుమాటలయొక్క సామర్థ్యముచేత, ఆలానంబుదరలివచ్చుమనో జదంతియనఁగన్=ఏనుఁగుయొక్క కట్టుగంబమునుండి కదలివచ్చునట్టి మన్మథగజమో యన్నట్లుగాను, ని. 'ఆలానంబంధస్తంభే' అని అ. ఇక్కడ బంధస్తంభమనఁగా గజబంధస్తంభము.

అట్టిరమణుండుదివియన్=అటువంటిపెనిమిటి చెయిపట్టితియ్యఁగా, ఇక్కడ అట్టియనెడు పదము అంబుజాంబకాది పదములయొక్క యర్థాంతరము నావిష్కరణము సేయుచున్నది. అహార్య తనయ=గిరికాదేవి, విధుమణి స్తంభమున నరవెడలి=చంద్రకాంత మణిస్తంభము వల్లనుండి సగము తొలఁగినదై, బయలుపడిపెనంగుచున్=స్తంభమువదలియును రాకపెనఁగులాడుచు, మరలికంబమొక కేలనూని=తిరుగా స్తంభమొకచేతఁ బట్టుకొన్నదై, ఊఁతయుఁ దక్కి=స్తంభముపట్టుకొనుట మాని, పాన్పొయ్యఁ జేరన్=పానుపుమీఁదికిఁ దిన్నగాఁ బ్రవేశించెను.

హరునియందు నిలిసిల్లుచున్న యర్ధదేహముగల పార్వతివలెనే చంద్రకాంతమణిస్తంభము నుండి సగము తొలఁగియును, సూత్రధారియొక్క యత్నముచేత నావిర్భవించి తిరుగ స్తంభము చేరుచున్న జంత్రపుబొమ్మవలెనే బయలుపడి పెనఁగుచును, రసాలవృక్షావలంబనముగలిగియుఁ సమీ పాశ్రయావాప్తిని వదలని తీఁగెవలెనే వసురాజుచేతఁ బట్టువడియును దిరుగ స్తంభమొకచేతఁ బట్టు కొనియును మావంతునిప్రార్థనముచేతఁ గట్టుగంబముదరలివచ్చిన మన్మథగజమువలెనే స్తంభము పట్టు మానియును గిరికాదేవినాథుఁడు లాఁగఁగా మెల్లఁగ శయ్యఁ జేరెను. పెనఁగిలాగ కంబము దాఁటి కొంచెము సాగి, మరలఁ జాటునకేఁగి, కేల కంబముపట్టుకొని, చివరకు బుజ్జగింపుమాటలతో గిరిక శయ్యమీఁదికి మెల్లఁగఁ జేరెనని భావము.

మ. మృదుకర్ణోత్పలసంగతాళిరవభూరిప్రేరణన్బోలెఁ ద
త్సదనాధారము మాని మానిని సదాధారంబు భూభృజ్జయా
స్పదదోస్తంభము డాయఁ దాదృశభుజస్తంభోచ్ఛ్రియాసూయ న
భ్యుదితస్తంభము లయ్యె నంబకము లాభూమండలస్వామికిన్. 79

మృదు=కోమలమయిన, కర్ణోత్పల=చెవియందలినల్లగలువతోడ, సంగత=కూడుకొన్న, అళి రవ=తుమ్మెదయొక్కఝుంకారమనెడు, ఆళిరవ=సఖీవాక్యరవమువలని, భూరిప్రేరణన్బోలెన్=అతి శయప్రేరేపకత్వముచేతవలె, తత్సదనాధారముమాని, తత్=ఆ, సదనాధారముమాని = సత్పురుషుల కనాధారమయిన స్తంభమును విడిచిపెట్టి యనియర్థము. సదనముయొక్క యాధారమునని భావము. మానిని=గిరికాదేవి, సదాధారంబు=సజ్జనులకాధారమయిన యని యర్థము. శ్రేష్ఠమైన యాధారమని యర్థాంతరము. భూభృజ్జయాస్పదదోస్తంభమున్-భూభృత్=వసురాజుయొక్క, జయాస్పద= జయమున కాస్పదమయిన, దోస్తంభమున్=భుజమనెడు స్తంభమును, డాయన్=హత్తుకొనఁగా, తాదృశభుజస్తంభోచ్ఛ్రియాసూయన్=అట్టిభుజాస్తంభముయొక్క యతిశయమునందలి యసహిష్ణుత చేతనని యర్థము. భుజౌన్నత్యమని భావము. అంగకములు=అవయవములన్నియు, ఆభూమండల స్వామికిన్=ఆవసురాజునకు, అభ్యుదితస్తంభములయ్యెన్=అభ్యుదయమును బొందుచున్న స్తంభము లాయెనని యర్థము.

శ్లో. 'స్తంభ స్స్యా న్నిష్క్రియాఙ్గత్వం రాగభీత్యాదిసమ్భవమ్' అని చెప్పంబడియున్నది గనుక నభ్యుదితమయిన స్తంభాఖ్య సాత్త్వికభావము గలవారాయెనని భావము. అనఁగా గిరికాదేవి

చంద్రకాంతమణిస్తంభమును వదలి శయ్యపైకివచ్చి వసురాజుయొక్క భుజస్తంభమును హత్తఁగానే వసురాజునకు స్తంభమనెడు సాత్త్వికభావముదయించి, సర్వావయవములును నిశ్చలములై యుండె నని తాత్పర్యము. గిరిక చెవియందున్న నల్లగలువలోని తేటిపాట గిరికతో రాజును డాయుమని ప్రోత్స హించునటులుండెను. స్తంభము సత్ + అనాధారముగాన దానివదలి సత్ + ఆధారమగు జయాస్పద మగు రాజు దోస్తంభమును డాయుమనెను. స్తంభమను సాత్త్వికభావలక్షణము.

చ. కలికి నృసింహభూవరునిఁ గన్గొని నిశ్చలగాత్రవల్లియై
యలరువిలాసచేష్ట లాలయం గలయంగ నటింపఁజేయునా
వలపులసూత్రధారుఁ డనవద్యనృపాకృతిఁ జూచి తాను ని
శ్చలత వహింపఁగాఁ గదలఁజాలనిజంత్రపుబొమ్మయో యనన్. నరసభూపాలీయము. తృ.

సాత్త్వికభావాదులు స్త్రీకే గాక పురుషులకు నుదయించుననుటకు లక్ష్యములు పెక్కులుగలవు గాని విస్తరభీతిచే వదలితిమి. రసమంజరిలోని శ్రీకృష్ణుని రోమాంచమునుగూర్చిన యీక్రిందిశ్లోక మును జూచి యిట్లె యన్యములు పరికించునది.

శ్లో. "ఏతత్పరిస్ఫురతి పద్మదృశాంసహస్ర, మక్షిద్వయం కథయ కుత్ర నివేశయామి
ఇత్యాకలయ్య నయనాంబురుహే నిమీల్య, రోమాంచితేన వపుషా స్థిత మచ్యుతేన."

క. అమ్ముదితరత్నకటకచ,య మ్ముదితనినాద మయ్యెఁ నయ్యెడఁ జల మే
ల మ్మని పతితోఁ దగు మే,ల మ్మని సహజానురక్తిఁ లాలించుక్రియన్. 80

అమ్ముదిత=ఆగిరికాదేవియొక్క, రత్నకటకచయమ్ము = రత్నమయములయిన గాజులయొక్క సమూహము, అయ్యెడన్=ఆసమయమందు, ఉదితనినాదమయ్యెన్=పుట్టినధ్వని గలదాయెను. ఏలా గనిన, చలమేలమ్మని=చలమెందుకమ్మా అనియును, పతితోఁదగుమేలమ్మని = పెనిమిటితో సరసోక్తులా డుట తగుననియును, సహజానురక్తిన్=తోడఁబుట్టినదానియందలి యనురాగముచేత లేక సహజప్రేమ చేత, లాలించుక్రియన్=బుజ్జగించునట్లుగా, ఉదితనినాదమయ్యెనని సంబంధము.

ఇక్కడ గిరికాదేవియును రత్నములును సహజవస్తువులు గనుక, అనఁగాఁ గోలాహలాద్రి వలనఁ గాని • శుక్తిమతీనదివలనఁ గాని కూడఁబుట్టినవారు గనుక సహజానురక్తియని చెప్పినాఁడు. కోలాహలాద్రియందుఁ బద్మరాగాదిరత్నములును శుక్తిమతియందు ముత్యములును బుట్టుచున్నవని తెలియవలయును. గిరిక సిగ్గువెంపున నణంగియుండ రాజు మెలపుమెయి చుంబనాదులు నీవి కంచుక గ్రంథిమోక్షణాదులు చేయఁదొడఁగెను. గిరిక వారించుచుండఁ గరకంకణాదులు మ్రోఁగెను. కంక ణములు రత్నములు గానఁ దోబుట్టువనుప్రేమతో గిరికనొప్పించుటకు లాలించునటుల మొరసెనని భావము.

శా. ఆశారోధక మావృతాంబర మనూఁధాలోక ముచ్చైస్స్తనో
ద్దేశప్రావరణంబునై యలఘుస్ఫూర్తిన్ శ్యామమందాక్షము
ద్రాశుంభత్తిమిరంబు పర్వ మదనాంధ్వాన్యుండు ఖిన్నాత్ముఁడై
యాశించె న్గమనీయరాజకరలీలాలంబసంచారమున్. 81

ఈపద్యమందు మందాక్షముద్రాశుంభత్తిమిరంబు అని చెప్పుటచేత నంతపర్యంతంబును నర్థ ద్వయము. ఏలాగనిన, ఆశారోధకము=ఇచ్ఛాప్రతిబంధక మని మందాక్షపరమయిన యర్థము. దిక్కు

రోధక మని తిమిరపరమయిన యర్థము. ఆవృతాంబరము=కప్పఁబడిన యుత్తరీయముగలదని యర్థము. ఆవరింపఁబడిన గగనభాగము గలదని యర్థాంతరము. అనూఢాలోకము=పొందఁబడని చూపుగలదని యర్థము. పొందఁబడని కాంతిగలదని యర్థాంతరము. 'వహప్రాపణే' అనెడు ధాతువు మీఁద ఊఢశబ్దము నిష్పన్నమయినది. ఉచ్చైస్స్తనోద్దేశప్రావరణంబుగ్=ఉన్నత స్తనోపరిప్రదేశప్రావరణ మని యర్థము. ఉన్నతప్రదేశప్రావరణమని యర్థాంతరము. ప్రావరణమనఁగా ముసుఁగు, ఐ=అయినదై, అలఘువృత్తిక్=అధికవర్తనముచేత, శ్యామమందాక్షముద్రాశుంభత్తిమిరంబుపర్వక్ = మందాక్షము శ్యామలవర్ణమని కవిసంకేత సిద్ధము, గనుక, శ్యామ=నల్లనయిన లేక శ్యామయొక్క, మందాక్షముద్రా = లజ్జాస్వరూపమనెడు, శుంభత్తిమిరంబు=విజృంభమాణమయిన చీఁకటి, పర్వక్=వ్యాపింపఁగా, మదనాధ్వన్యుండు = మన్మథుఁడనెడు పథికుఁడు, అనఁగా దారినడుచువాఁడు, (ని. 'అధ్వనీనోధ్వగో ధ్వన్యః పాంథః పథిక ఇత్యపి' అని అ.) ఖిన్నాత్ముఁడై = ఏమియుం దోఁచకుండెడు మనస్సుగలవాఁడై, కమనీయరాజకరలీలాలంబసంచారముక్-కమనీయ=ఒప్పుచున్న, రాజకర=వసురాజుయొక్క హస్తమనెడు, రాజకర=చంద్రకిరణముయొక్క, లీలాలంబ=విలాసావలంబయుక్తమయిన, సంచారముక్=గమనమును, ఆశించెక్=ఇచ్ఛయించెను.

గిరికాదేవి గాఢలజ్జాన్వితురాలయియుండుటవలన మన్మథుఁడు తనశక్తిని గనుపఱుపఁజాలనివాఁడై యాలజ్జను విడిపించుకొఱకు వసురాజుహస్తమును సహాయమగునట్లుగాఁ గోరెనని తాత్పర్యము. ఈపద్యములో నలఘువృత్తియనెడు పదముచేత లజ్జకుఁ బ్రాబల్యమును మదనాధ్వన్యుండు ఖిన్నాత్ముఁడై యన్నందుచేత మన్మథునకు దౌర్బల్యమును జెప్పంబడినది గనుక గిరికాదేవి ముగ్ధయని తెలియవలయును. ఇందుకు లక్షణము- శ్లో. 'ఉదయద్యౌవనాముగ్ధా లజ్జా విజితమన్మథా' అని ఇదిగాక 'ఆశారోధక మస్ఫుటాక్షివలనం బాపాద్యమానాఖిలో, ద్దేశప్రావరణంబునై' అనెడు పాఠాంతరమునకు నర్థము స్పష్టము. రాజకరలీలాలంబసంచారమనుటచేఁ గళాస్థానములను రాజంటి వలపు గలిగించెనను స్వారస్యము గోచరించెడిని. సిగ్గుచే గిరిక చలించుచుండ మన్మథుఁడు తననేరుపుచాలమి రాజకరము నవలంబనముగాఁ గొనెను. ''దుర్బలస్య బలం రాజా'' అనునట్లు, గిరిక వసురాజు పైకొన తన తలంపు సాగమి వలువుచే నంగకములు మాటుపఱచికొనుచుఁ జూడక మోముద్రిప్పుచు, గుబ్బలపైఁ జైటబిగించుచు సిగ్గువెంపునఁ దప్పించుకొనుచుండెనని భావము. లజ్జచే మొగము నల్లనగుననుట కవిసమయము. ఇందులకు-

శ్లో. ''సంచారిణీదీపశిఖేవరాత్రౌ యంయం వ్యతీయాయ పతింవరాసా
నరేంద్రమార్గాట్టఇవప్రపేదే వివర్ణభావం సస భూమిపాలః.'' రఘువంశము.

ఇటులె శృంగారనైషధములో దమయంతీస్వయంవరఘట్టమున రాజులు లజ్జాజన్యవిచారమున నల్లఁబడిరని చెప్పఁబడెను.

తే-గీ. లలన పొద మవ్వలికటంచుఁ బలుకుటయును, బుష్కరద్వీపపతియాస్యపుష్కరమునఁ
దదనవాప్తిజఘనపరితాపవహ్ని, చిహ్నమగు కార్ణ్యధూమ మీక్షింపఁబడియె.

కృష్ణధూమము లజ్జాతిరేకముచే జనించెనని భావము.

ఉ. మంచుమునుంగు పూని లవమాత్రము పద్మినిమోముదమ్మి దీ
పించమిఁ జన్నుమొగ్గ లవిభేద్యతరచ్ఛదగుప్తి నేమియు

న్మించమి నొక్కటం గడు భ్ర♦మించుచుఁ దత్సుమనోవికాసవే
ళాంచితవైభవంబునకు ♦ నాసపడున్ నృపనేత్రభృంగముల్. 82

పద్మిని=పద్మినీజాతియయిన గిరికాదేవియనెడు పద్మలతయొక్క, మోముదమ్మి = పద్మమువంటి ముఖము ముఖమువంటిపద్మము, మంచుముసుంగుపూని=మంచువంటిముసుఁగు ముసుఁగువంటి మంచును వహించి, లవమాత్రము=లేశమాత్రమయినప్పటికిని, దీపించమిన్ = ప్రకాశింపకయున్నందుచేతను, చన్నుమొగ్గలు = కుచములనెడు కోరకములు, అవిభేద్యతరచ్ఛదగుప్తినేమియున్మించమిన్ - అవిభేద్యతర = భేదింపనలవిగాని, ఛద = వస్త్రమనెడు పత్రసమూహముయొక్క, గుప్తిన్ = కప్పికచేత, ఏమియున్మించమిన్ = ఎంతమాత్రమును నతిశయింపకయున్నందుచేతను, ఒక్కటన్ = ఏకరీతిగా, కడుభ్రమించుచున్=మిక్కిలి చుట్టిచుట్టితిరుగుచు, నృపనేత్రభృంగముల్=వసురాజుయొక్క నేత్రములనెడు తుమ్మెదలు, తత్సుమనోవికాస వేళాంచితవైభవంబునకున్ - తత్=ఆగిరికాదేవియనెడు పద్మలతయొక్క, సుమనోవికాసవేళా=యోగ్యమయిన మనోవికాసమనెడు పుష్పవికాససమయమందలి, అంచితవైభవంబునకున్ = ఒప్పిదమయిన వైభవమునకు, ఆసపడున్=ఎప్పుడోయని యాసపడుచుండెను.

అనఁగా గిరికాదేవి గాఢమయినలజ్జచేత సన్నపుముసుంగిడికొని ముఖము విప్పిచూడక దట్టమయినవస్త్రముచేతఁ గుచములు గప్పిపెట్టుకొనియుండఁగా నాగిరికాదేవియొక్క మానసోల్లాసవైభవమెప్పుడు గనుపడునని వసురాజుయొక్క నేత్రములు కోరుచుండెనని తాత్పర్యము. ఆ. ౬. ప. 3 గలోఁడించఁగన్ అనియు నీపద్యమున దీపించమి యనియు ముత్తుపరంబగుచో నాగమచకారమునకుఁ బకారంబు వచ్చునను వ్యాకరణసూత్రవిరుద్ధముగాఁ జెప్పఁబడెను. లాక్షణికులకవితయందుఁ గొన్నిచోటుల నిట్టిప్రయోగములు గాననయ్యెడిని.

క. మించి మదించినరిపుల వ్యథించక...... దశకుమారచరిత్రము.

క. నవలానవలావణ్యా, ర్ణవలాలితకాంతిరమకు ♦ నయనద్యుతుల
న్నవనీరాజన మొసఁగుచు, నవనీరాజాగ్రగణ్యుఁ ♦ డనియెం బ్రేమన్. 83

నవలా=గిరికాదేవియొక్క, ఇది దేశ్యపదము గనుక, (సూ. 'నచదేశ్యపదే' న. అను సూత్రముచేత హ్రస్వమురాలేదు.) నవ=నూతనమయిన, లావణ్య = కళయనెడు, అర్ణవ=సముద్రమందు, లాలిత=ఒప్పుచున్న, కాంతిరమకున్=రమయనఁగా సమృద్ధియును లక్ష్మియునుఁ గనుకఁ గాంతిసమృద్ధియనెడు లక్ష్మికి, నయనద్యుతులన్=తనయొక్క నేత్రకాంతులచేత, నవనీరాజనమొసఁగుచున్=అభినవనీరాజన మిచ్చుచు, అవనీరాజాగ్రగణ్యుఁడు=భూమియందుఁ గల రాజులలోఁ శ్రేష్ఠుఁడయిన వసురాజు, అనియెంబ్రేమన్=ప్రేమచేత నొకవాక్యము పలికెను. అనఁగా గిరికాదేవి గాఢమైన లజ్జచేత మనసియ్యకుండఁగా నాయమకాంతిసంపదను వసురాజు పలుమాఱు జూచుచున్నవాఁడై యనురాగముచేత నొకవాక్యము పలికెను. ఏమనియనిన,

సీ. వరపద్మమకరము ♦ ల్కరగతంబులు నీకు సతి నీవి యింత చే ♦ సడల రాదె
బహుశతచ్ఛదరాశి ♦ భవదక్షియుగళంబు నేత్రాంచలం బింత ♦ నెరప రాదె
యనఘదివ్యాహార♦ఖని నీదుకెమ్మోవి లేమ ముద్దింత పా♦లింప రాదె
తావిగంబూరంపు♦దీవి నీమొగ మొక్కపలు కింత నాపైని ♦ జిలుక రాదె

తే. చక్రవిజయం బొనర్చె నీ చన్నుదోయి
కంచుకం బేల యింకఁ జా♦లించ రాదె
నిర్మలామూల్యగుణరత్న♦నిధికి నీకు
వనజముఖి త్రాస మిది యేల ♦ వదల రాదె. 84

సతీ=ఓగిరికా, నీకు వరపద్మ మకరము ల్కరగతంబులు-నీకున్=నీకు, వర=వరనిధియును, పద్మ=పద్మనిధియును, మకరముల్=మకరనిధియును, కరగతంబులు=హస్తగతములయి యున్నవిగదా, నీవి=మూలధనమును, ఇంతచే సడలరాదె=ఇంచుకంత చెయివదలరాదా యనియర్థము. శ్రేష్ఠములయిన పద్మ మకరరేఖలు హస్తమందుఁ గలవనియును నీవియనఁగాఁ బోఁకముడియునుగనుక నది కొంచెము చేవదలరాదా యనియును భావము.

భవదక్షియుగళంబు = నీయొక్క నేత్రద్వయము, బహుశతచ్ఛదరాశి = అనేక శతపత్త్రరాసులుగలదిగదా, నేత్రాంచలంబింత నెరపరాదె=వస్త్రాంచలమును కొంచెమంత ఘటింపఁజేయరాదా యని యర్థము. (ని. 'స్యాజ్జటాంశుకయోర్నేత్రమ్' అని అ.) శతచ్ఛదమనఁగా శతపత్త్రము అనఁగాఁ గమలము గనుక నీ నేత్రద్వయమనేకమలమునకు రాశియైనదనియును నయనాంచలమును గించిన్మాత్రము ప్రకటింపరాదా యనియును భావము. (ని. 'శతపత్త్రం కుశేశయమ్' అని అ.)

లేమ=ఓ మగువా, నీదుకెమ్మోవి = నీయొక్క యరుణాధరము, అనఘదివ్యాహారఖని-అనఘ=నిష్కల్మషములయిన, దివ్య=శ్లాఘ్యములయిన, ఆహార=భోజ్యవస్తువులను, ఖని=గనియైనదిగదా, ముద్దింతపాలింపరాదె = ముద్దయనఁగాఁ గబళము గనుక నది కొంచెముగా భాగించి యివ్వరాదా యని యర్థము. దివ్యాహారఖనియనఁగా దివ్యులు దేవతలును, వారియొక్క యాహారమమృతంబును గనుక నట్టి యమృతమునకు గనియైన దనియును, ముద్దు అనఁగాఁ జుంబనము. అది కొంచెమంత దయచేయుమని భావము.

నీమొగము=నీయొక్క వదనము, తావిగంబూరంపుదీవి=పరిమళయుక్తమైన కర్పూరమునకు స్థానమయినది గదా, ఒక్క పలుకింతనాపైని జిలుకరాదె=ఆకర్పూరశకలమును గొంచెమంతనాపైఁ జిలుకరింపరాదా యని యర్థము. కర్పూరసౌరభస్థానమనియును వాక్యమును గొలఁదిగాఁ బలుకరాదా యనియును భావము.

నీచన్నుదోయి=నీయొక్క కుచద్వయము, చక్రవిజయంబొనర్చెన్=రాష్ట్రవిజయమును జేసెను గదా, కంచుకంబేలయింకఁజాలించరాదె = కవచధారణ మెందుకుఁగావలెను, ఇంకమీఁదఁ జాలింపరాదా యని యర్థము. చక్రవాకములను జయించినదనియును రవికె విడువరాదా యనియును భావము.

నిర్మలామూల్యగుణరత్ననిధికినీకున్ - నిర్మల = దోషరహితములయిన, అమూల్య = విలువలేని, గుణ=కాంత్యాదిగుణములతోఁగూడిన, రత్న = పద్మరాగమణులకు, నిధికినీకున్ = స్థానభూతురాలవైన నీకు, వనజముఖి = ఓగిరికాదేవీ, త్రాసమిదియేలవదలరాదె = త్రాసనామకరత్నదోషమిదియెందుకు విడిచిపెట్టరాదా యనియర్థము. గుణరత్నములనఁగా సద్గుణములు వానికి స్థానమనియును, త్రాసమనఁగా లజ్జాకార్యమయిన భయమనియును భావము. (ని. 'త్రాసోభీమణిదోషయోః' అని విశ్వనిఘంటువు.)

గిరికను వసురాజు బుజ్జగించుచు నీవి సడలింపనిష్టమనియుఁ గడకంటఁ గాంచుమనియు ముద్దుపనోసంగుమనియు లుకుమనియు రైకముడి విప్పనిమ్మనియు వెఱపు మానుమనియుఁ గోరెను.

సీ. లాలింతు నేఁ బాద♦నాళీకయుగళి నాకటకేశ్వరత్వంబు ♦ గణన మీఱఁ
పాలింతు నేఁ గటి♦స్పర్శవైభవము నానేత్రాహ్వయంబు వ♦న్నియకు నెక్కఁ
గీలింతు నేఁ గుచ♦శ్రీలాభగరిమ నానాయకత్వము సార్థ♦తాయుతముగ
శీలింతు నేఁ గర్ణ♦సీమాంతికంబు నాకువలయరాజత్వ ♦ మవనిఁ బొసఁగ
తే. నిగనిగనిసంజకెంజాయ♦పొగడు దెగడు
మోవిమానిక మాని సం♦పూర్ణరుచిస
మగ్రత వహింతు నే నింతి ♦ మామకాభి
రామవసునామ ముచితగౌ♦రవము దాల్ప. 85

ఇంతి=ఓగిరికాదేవీ, నేఁక్=నేను, నాకటకేశ్వరత్వంబుగణనమీఱక్=నాయొక్క పాదవలయ శ్రేష్ఠత్వమెన్నికకెక్కునటులుగానని యర్థము. పట్టణాధీశ్వరత్వమనిభావము. (ని. 'కటకో స్త్రీ నితంబో ద్రేర్దంతినాం దంతమణ్డలే, సాముద్రలవణే రాజధానీ వలయయో రపి' అనిమేదిని.) పాదనాళీకయుగళిక్=నీయొక్క పాదకమలద్వయమును, లాలింతుక్=లాలనముసేయుదును, అనఁగా నీపాదభజనముసేయుదుననుట. పాదములను లాలనముచేయుటవలనిఫలము కటకాధిపత్యము పొందుటయుం నందియ యగుటయునని భావము.

నేఁక్=నేను, నానేత్రాహ్వయంబువన్నియకునెక్కక్=నేత్రమనఁగా వస్త్రంబుగనుక నావస్త్రాభిధానము వన్నెకెక్కునట్లుగా నని యర్థము. నేతయనెడు, అనఁగా స్వామియనెడు నామమని భావము. ఈయర్థమున నేతృ+ఆహ్వయము=నేత్రాహ్వయము అని. కటిస్పర్శవైభవము=నీయొక్క నితంబస్పర్శవైభవమును, పాలింతుక్=పాలనముసేయుదును, నేత్రాహ్వయము సార్థముకావలయుననఁ గటిసంస్పర్శము తగినది. కటిస్పర్శము మోహోద్దీపకము.

నేఁక్ = నేను, నానాయకత్వము=నాయొక్క హారమధ్యనాయకత్వమని యర్థము. స్వామిత్వమనిభావము. (శ్లో.'నాయకో నేతరి శ్రేష్ఠే హారమధ్యమణా వపి' అని మే.) సార్థతాయుతముగక్=సార్థకత్వముతోఁగూడుకొనునట్లుగా, కుచశ్రీలాభగరిమక్=నీకుచశోభయొక్క లాభగౌరవమును, కీలింతుక్=సంఘటింతును, నేఁక్=నేను, నాకువలయరాజత్వము=నాయుత్పలశ్రేష్ఠత్వమని యర్థము. భూవలయరాజత్వ మనిభావము. అవనిఁబొసఁగక్=భూమియందొప్పునట్లుగా, కర్ణసీమాంతికంబు=నీయొక్క కర్ణప్రదేశసమీపమును, శీలింతుక్=ఒప్పిదమగునట్లుగాఁ జేయుదును.

నేఁక్=నేను, మామకాభిరామవసునామము-మామక=నాసంబంధియైన, అభిరామ=మనోహరమయిన, వసునామము=కాంచనాభిధాన మని యర్థము. వసురాజనామమని భావను. ఉచితగౌరవము దాల్పక్=అర్హమయినఘనతవహించునట్లుగా, నిగనిగనిసంజకెంజాయపొగడు దెగడుమోవిమానికమాని=నిగనిగనిమెఱయు సంధ్యారాగముయొక్క శ్లాఘ్యతను నిరసించునట్టి నీయొక్క పెదవియనెడు మాణిక్యమునుబొంది, సంపూర్ణరుచిసమగ్రతవహింతుక్=అత్యంతకాంతిపరిపూర్ణతను వహింతును. ముందరిపద్యముతో నన్వయము.

ఇందుఁ బాదాదిశిరఃపర్యంత మభివర్ణితము. తొలుత పాదసంస్పర్శాదికములతో బుజ్జగించుటయుఁ బిదప నీవీమోక్షణాదులతోఁ గటిస్పృశించుటయు,ఆవల రైకముడి సడల్చి గుబ్బలంటుటయు నవలఁ జెలిచెంత ఘంతనములాడుటయు ననంతరము మోవితేనియ లానుటయుఁ గా మోపభోగోచిత

క్రియలు. ఇవియన్నియు నానావిధముల ధన్యతాహేతువులు. మాణిక్యములు రక్తగణములోనివి గాన మోవిగాఁ జెప్పఁబడెను. వసునామము అభిరామము. దానికుచితగౌరవము మణితోసౌనయుంట. దాన ఫలితము సంపూర్ణరుచిసమగ్రత వహించుట యని భావము.

తే. అనుచు నరపతి కెంగేల ♦ నచలకన్య
కాత్రపాఝరగూఢాంగ♦కములు దడవె
నొయ్య నాభీకుచాదిని♦మ్నోన్నతప్ర
దేశములు తద్విగాహేచ్ఛఁ ♦ దెలియుకరణి. 86

అనుచున్=పూర్వోక్తప్రకారముగాఁ బలుకుచు, నరపతి=వసురాజు, కెంగేలన్=తనయొక్క హస్తముచేత, అచలకన్యకా=కోలాహలపర్వతపుత్త్రికయైన గిరికయనెడు పర్వతమువలనఁబుట్టిన సెలయేటియొక్క, త్రపాఝర=లజ్జయనెడు ప్రవాహముచేత, గూఢ=ఆచ్ఛాదింపఁబడియున్న, అంగకములు=అవయవములను, తడవెన్=విమర్శించెను. ఏలాగనిన, తద్విగాహేచ్ఛన్=ఆలజ్జాప్రవాహమందుఁ జొరఁబారవలెనన్న తాత్పర్యముచేత, ఒయ్యన్=తిన్నఁగా, నాభీకుచాదినిమ్నోన్నతప్రదేశములు=నాభియును గుచములును మొదలుగాఁ గల పల్లము మెరక యయిన స్థలములను, తెలియుకరణిన్=తెలిసికొనునట్లుంబలె, తడవెనని యన్వయము.

గిరికాదేవి లజ్జచేతఁ గప్పుకొనియున్న నాభీకుచాదికళాస్థానములను వసురాజు తనహస్తముచేత స్పృశించె నని భావము. కళాస్థానసంస్పర్శము కామోద్దీపకము. లజ్జ సెలయేరుగాఁ జెప్పఁబడుటచే నాయకసమావేశమునఁ గొండలుకొట్లుగవచ్చి సంభోగానంతరము తొలంగిపోవుననుభావ మూహ్యము. లజ్జసెలయేరు, దానస్నానమాడ నెంచినచో తొలుత మిట్టపల్లము లెఱుంగవలయును. నిమ్నము నాభి, ఉన్నతము గుబ్బలు. ఈ రెంటినెఱింగినపిదప విచ్చలవిడిగ సంచరింపవచ్చును. నాయిక నవోఢగావున లజ్జాతిశయమున నంగకములు మఱుఁగుపఱచికొనుచుండనాయకుఁడు కళాస్థానము లెఱింగి తాఁకఁదొడఁగెనని భావము.

మ. తరళాధార మతిప్రవాళశయగు♦ప్తం బంచు నభ్యంతర
స్మరుఁ డుత్తంభితకంపలోలపటసం♦జ్ఞం బిల్వ బాలాపయో
ధరదుర్గంబు గ్రహించె రాజకర మే♦తజ్జాతసంత్రాసవై
ఖరిఁ దెల్పెన్ జఘనస్థలీవరణజా♦గ్రద్ఘంటికాఘోషముల్. 87

తరళాధారము=అనఁగాఁ దరళశబ్దము హారమధ్యనాయకరత్నమందును దరళాశబ్దము గంజియందును వర్తించును, గనుక హారమధ్యగతరత్నమున కాధారమైయున్నదని కుచదుర్గపరమయిన యర్థము. గంజియె యాధారమైయున్నదని దుర్గపరమయిన యర్థము. అనఁగా దుర్గస్థితజనులకు గంజిమాత్రమేకాని యన్నములేదు గనుక సుఖసాధ్యమని భావము. (ని. 'తరళం చఞ్చలే షిద్గే భాస్కరే ఒపి త్రిలిఙ్గకమ్, హారమధ్యమణౌ పుంసి యవాగూ సురయో స్త్రియామ్.' అని మేదిని.) యవాగువనఁగా గంజి, అతిప్రవాళశయగుప్తంబు-అతిప్రవాళ=చిగురుటాకుల నతిక్రమించిన, శయ=హస్తములచేత, గుప్తంబు = ఆచ్ఛాదింపఁబడినదని యర్థము. వాలమనఁగా ఖడ్గము ప్రకృష్టమయిన వాలము ప్రవాళము, అతిప్రవాళ=అతీతములైన ప్రకృష్టఖడ్గములుగల, శయ=హస్తములుగలవారిచేత-

అనఁగాఁ జేతఁగత్తిలేని నిరాయుధులచేత, గుప్తంబు=కాపాడఁబడుచున్నదని యర్థాంతరము. అంచున్=ఈలాగని పలుకుచు, అభ్యంతరస్మరుఁడు = అనఁగా లోపలనుండునట్టి మన్మథుఁడనెడు, నభ్యంతరస్మరుఁడు = ఒళవిచ్చెడువాఁడు, ఉత్తంభిత కంపలోలపటసంజ్ఞం బిల్వన్ - ఉత్తంభిత = పొడుకొనియున్న, కంప=సాత్త్వికభావజనితమయిన వడంకుచేత, లోల=చలించుచున్న, పట=వస్త్రమనెడు విసరఁబడుచున్న వస్త్రముయొక్క, సంజ్ఞన్=సైగచేత, పిల్వన్=పిలువఁగా, రాజకరము=వసురాజుయొక్క హస్తము, బాలాపయోధరదుర్గంబు గ్రహించెన్ = గిరికాదేవియొక్క కుచగిరిదుర్గమును స్వాధీనముఁ జేసికొనెను. జఘనస్థలీవరణజాగ్రద్ఘంటికాఘోషముల్ - జఘనస్థలీ=కటిపురోభాగముయొక్క, వరణ=మొలనూలనెడు కోటయందలి, జాగ్రద్ఘంటికాఘోషముల్=హెచ్చరికసేయుచున్న ఘంటానాదములు, ఏతజ్జాతసంత్రాసవైఖరిఁ దెల్పెన్=అనఁగా రాజకరము పయోధరదుర్గమును గైకొన్నందువలనఁ బుట్టిన యధికభయలక్షణమును దెలియఁజేసెను.

హారమధ్యగతనాయకమణిచేత నొప్పుచున్నదియుఁ జిగురుటాకులవంటిహస్తముచేతఁ గప్పఁబడియున్నదియు గిరిదుర్గసదృశమయినదియునగు గిరికాదేవియొక్క కుచము మన్మథప్రేరితుఁడైనవసురాజునకు హస్తగతముగాఁగా లజ్జాకార్యమయిన భయముచేత గిరికాదేవి చలింపఁగానే మొలనూలిచిఱుగంటలు మ్రోసెనని తాత్పర్యము. రాజు కోటను బట్టుకొనఁదలఁచినపుడు ప్రతిపక్షుల దుర్బలస్థితి తొలుతఁ దెలిసికొనవలయును. లోనిపరివారము గంజియె ఆధారముగఁ జేసికొని నిరాయుధముగనుండెను. ఇది మిత్రునివలె లోననుండిన మరుఁడు కేతనసంచలనరూపమున రాజున కెఱింగింప రాజు దుర్గమును బట్టుకొనెను. వెలుపుచేఁ బరిజనము ఘంటికలమ్రోఁగించి విరోధిరాజవిజృంభణము సాటెనని దుర్గగ్రహణపరమగు భావము.

మన్మథుఁడు హృదయజుఁడు గావున అభ్యంతరస్మరుఁడని చెప్పఁబడెను. రాజును బ్రోత్సహించి గుట్టు తెలిపినది మరుఁడనుటచే గిరిక లోలోన మన్మథవేదన నొందుచుండెననియు నది రాజు గ్రహించెననియు భావము. ఉత్తంభితకంపము సాత్త్వికభావము. తదావేశవిశేషము పటము లోలమయ్యెను. తొలుత సాత్త్వికభావవశమునఁ గంపము గుబ్బలంటునంతనె వెలుపుగలిగెనని భావము. మొలనూలు మొరయుననుటకు-

శ్లో. ఏతశ్చలద్వలయనూపురమేఖలోత్థ, ఝుంకారనూపురపరాజితరాజహంసాః. భర్తృహరి.

ఉ. తొయ్యలి ముద్దరాలు కుచ♦దుర్గము లాత్మశయైకవంచనన్
నెయ్యపుఁజేనిపాల్పఱిచి ♦ నీవియుఁ గొల్లవడఁగాఁ దలంచెఁ గా
కయ్యెడ నేలకో యనిచె ♦ నాత్మశయద్వితయంబు మున్నె లో
నయ్యెసరాగమై నృపక♦రార్పణ కింకఁ బెనంగ నేర్చునే. 88

తొయ్యలి=గిరికాదేవి, ముద్దరాలు=ఎంతమాత్రము ప్రౌఢిమలేనిముగ్ధగదా. ఏమనిన, కుచదుర్గములు=స్తనములనెడు గిరిదుర్గములు, ఆత్మశయైకవంచనన్ = ఇక్కడ నాత్మశయైకవంచనయనెడు నాత్మశయైకవంచనచేత ననిచెప్పవలయును. ఆత్మశయమనఁగాఁ దనయొక్క హస్తము, ఆత్మశయుఁడనఁగా హృదయమును హత్తుకొనియుండెడు మన్మథుఁడును, ఎల్లప్పుడును దనయొద్దఁ గాచుకొనియుండెడు బంటును గనుక, తనయొక్క యేకహస్తమువలని వంచనచేత నని కుచపరమయినయర్థము. మన్మథుఁడనెడు నొకనమ్మకంపుబంటుయొక్క యొుళవుచేతనని దుర్గపరమయిన యర్థము. నెయ్యపు

కోనిపొల్పఱిచి=ప్రేమగలవసురాజు పాలుచేసియుం, నీవియుఁ గోల్పడఁ గాదలంచెఁ గాక=నీవియనఁ గాఁ బోఁకముడియును మూలధనమును గనుకఁ బోఁకముడియనెడు మూలధనమును బోఁగొట్టుకోఁ దలఁచినదియ, కాక లేనట్టయితే, అయ్యెడన్=ఆనీవిస్థానమందు, ఏలకోయునిచెనాత్మశయద్వితయంబు=ఆత్మశయద్వితయమనెడు నాత్మశయద్వితయము నెందుకుంచవలయును, అనఁగా వ్యర్థమనుట. ఇక్కడ నాత్మకరద్వితయమని వస్త్రగ్రంథిపరమయిన యర్థము. సంచకభటద్వితయమని మూలధనపరమయిన యర్థము. ఏమనిన, ఆయాత్మశయద్వితయము, అనఁగా నట్టిపంచనాభటద్వితయము, సరాగమై=అనురాగముతోఁగూడుకొన్నదై, నృపకరార్పణకున్=ఆమూలధనమును రాజుచేతి కప్పగించుటకు, మున్నె=మునుపే, లోనయ్యెన్=ఆలాయపడియుండెను. కాఁబట్టి ఇంకఁ బెనంగ నేర్చునే=ఇఁకమీఁద రాజు హరింపకుండఁ బోరాడఁ జాలునా యని యర్థము.

ఆయాత్మకరద్వితయము రక్తితోఁగూడుకొన్నదై వివాహానంతరమం దప్పగింతసేయునెడల రాజకరార్పణకుమునుపే లోఁబడియున్నదనియును నట్టిది వస్త్రగ్రంథిని రాజుహరింపకుండునట్లు పెనఁగఁజాలునా యనియును హస్తపరమయిన యర్థము. అనఁగా గిరికాదేవి రెండుహస్తములచేతను కుచద్వయమును గ్రమ్ముకొనియుండఁగా వస్త్రగ్రంథి సడలుటచే నదిజాఱకుండఁబట్టుకొనునిమిత్తమయి యొకచేయివదలఁగానే రాజు కుచగ్రహణముచేసెననియును నంతట రెండుహస్తములును వస్త్రగ్రంథియందే చేర్చుకొనియెననియును దాత్పర్యము.

గిరిక ముద్దరాలు గావున నృపకరార్పణమునకు సరాగముగ లోనయిన హస్తయుగమును గుబ్బలపైఁ గాపుంచెను. అవి తొలుతనే రాజునకు లోనైనవగుటచే వంచించి కుచములను నీవిని గూడ రాజునకుఁ బాలుపఱచెను. మున్ను లోఁబడినవానిని గాపుంచిన నవి సమయమున బెనంగి మాట దక్కించుట యసంభవము. ఇట్టిబంటుల నియోగించుటచే గిరిక ముద్దరాలని స్పష్టము.

క. అతినీతసమయుఁ డై పతి, సతినీవి హరింప లజ్జ • సనియెన్ దృఢయో
గత నీవిఁ గన్నబోంట్లును, గతనీవిక లైనవారి • కడ నుండుదురే. 89

అతినీతసమయుఁడై=అతిక్రమింపఁబడిననియమముగలవాఁడై, పతి=వసురాజు, సతి=గిరికాదేవి యొక్క, నీవిహరింపన్=మూలధనమునుహరింపఁగానే యనియర్థము. ఇక్కడ స్త్రీధనాపహరణము రాజునకు నిషేధము గనుక నది విచారింపక అతినీతసమయుఁడైనాఁ డని తెలియవలయును. వస్త్రగ్రంథిని హరింపఁగానే యనిభావము. లజ్జసనియెన్=లజ్జాసఖి తొలఁగిపోయె నని యర్థము. సిగ్గు తొలఁగిపోయె నని భావము. ఈయాశ్వాసమందు, 22 వ పద్యములో లజ్జానయస్యవధూటి యని చెప్పినాఁడు గనుక నాయర్థ మిక్కడి కాకర్షింపవలయును. దృఢయోగతనీవిఁగన్నబోంట్లును=దృఢసాంగత్యముచేతను ఈవిని బొందిన, అనఁగా ధనధాన్యలాభమును బొందియున్న సఖీజనములును, గతనీవికలైనవారికడనుండుదురే=గతమైనమూలధనముగలవారిదగ్గరనుందురా యనియర్థము. అనఁగా ధనహీనతను బొందినమీఁదట వారిదగ్గరనుండరుగదా యనుట.

లజ్జ వస్త్రగ్రంథిని బొందియున్నది గనుక వసురాజు వస్త్రగ్రంథిని హరించినమీఁదట గిరికాదేవి దగ్గర నెందుకొఱకుండునని భావము.

ఉ. చేడియకోమలావయవ • సీమలఁ జెల్వునిపోయ గంపుచే
యాడఁ బ్రభూతనూతనర • సాకృతిఁ గ్రొంజెమ రొయ్య నొయ్యఁ బై

యాడఁ గరఁగి జాఱె నెద • నంటినకస్తురిరేఖ లాకుల
వ్రీడతమంబు లాత్మపద • విన్నిలు పోపక పోవుకై వడిన్. 90

చేడియ = గిరికాదేవియొక్క, కోమలావయవసీమలన్ = మృదువైనకచకుచాద్యవయవముల యందు, చెల్వుని=పతియైన వసురాజుయొక్క, సోయగంపుచేయాడన్ =విలాసకరమైనహస్తము వ్యాపింపఁగాను, ప్రభూత=పుట్టిన, నూతన=అభినవమైన, రసాకృతిన్ =అనురాగరసమువలె, క్రొంజెమరు=సాత్వికభావజనితమైనక్రొత్తచెమట, ఒయ్యనొయ్యఁబైయాడన్ =తిన్నతిన్నఁగాఁ బైని వ్యాపింపఁగాను, ఎదనంటినకస్తురిరేఖలు=హృదయమంటియున్న కస్తూరికాపత్రరచనలు, కరంగిజాఱెన్ =కరఁగి నీరయిజాఱిపోయెను. ఏలాగనిన, ఆకులవ్రీడతమంబులు=తొట్రుపడుచున్న లజ్జా తిమిరములు, ఆత్మపదవిన్నిలుపోపక పోవుకైవడిన్ =తనమార్గమందు నిలువలేక తొలఁగిపోయినట్టులుగా, జాఱెనని సంబంధము.

వసురాజు తనసోయగంపుజేయిచే గిరికాయవయవములను గళాస్థానములెఱింగి స్పృశించెను. సాత్వికభావజన్యమగు క్రొంజెమట నూతనానురాగరసమువలె నుండెను. చెమటచేఁ గస్తురిరేకలు కరఁగిపోవుట తొట్రుపడులజ్జాతిమిరములు విడిపోవునటులుండెను. సోయగంపుచేయి యాడినచోటున నెల్ల లజ్జకు నిలువ నెలవులేకపోయెను. చెల్వుఁడనుటచే వసురాజు హృదయరంజకసుస్వరూపుఁడని భావము.

సీ. నెలఁతగుత్తపుగుబ్బ • నెత్తమ్మిమొగడల నెలకూనసోఁకులు • నిగుడకుండ
ముదితచందురుకావి • మోవిలేఁదలిరున కలఘుద్విజాహతి • యంటకుండ
మఁగువవెన్నెరిగుంపు • మొగులుజొంపమునఁ బ్రకంపనాయాసంబు • గదురకుండఁ
జెలువకప్రపుపూఁత • చిన్నివెన్నెలలకు ఘనతిరోధానంబు • గలుగకుండ
తే. సిరుల నలరించె నిద్దంపు • జిగి ఘటించె
నొయ్య నెఱయించె నొకయింత • యొఱపు నించె
లలితనవ్యోపభోగలీ • లాలతాంత
నాయకుఁడు చేదిమేదినీ • నాయకుండు. 91

లలిత=మనోహరమైన, నవ్యోపభోగ=నూతనసంభోగమందు, లీలాలతాంతనాయకుఁడు=లీలామన్మథుఁడైన, చేదిమేదినీనాయకుండు=చేదిభూపతియైన వసురాజు, నెలఁతగుత్తపుగుబ్బనెత్తమ్మిమొగడలన్ =గిరికాదేవియొక్క బిగువైనగుబ్బచన్నులనెడు చక్కనితామరమొగ్గలయందు, నెలకూనసోఁకులు=నెలకూనయనఁగా బాలచంద్రుఁడు-బాలచంద్రసదృశములైన నఖములయొక్క సోఁకులనెడు బాలచంద్రునియొక్క కిరణప్రసారణములు, నిగుడకుండన్ =వ్యాపింపకుండునట్లుగాను,

ముదితచందురుకావిమోవిలేఁదలిరునకున్ =గిరికయొక్క చంద్రకావిరంగుగల పెదవియనెడు లేఁతచిగురుటాకునకు, అలఘుద్విజాహతియంటకుండన్ =ద్విజశబ్దము దంతములయందును బక్షులయందును వర్తించుచున్నది గనుక దంతక్షతమనెడు పక్షిఘాత మంటకయుండునట్లుగాను, మోవియను తలిరున కంటనీయలేదని భావము. లేఁదలిరుగావున మిగుల సుకుమారముగ నుండును. అందు సహజముగ నిద్దంపుసిరి నిండారును. అలఘుద్విజాహతిసహజసౌకుమార్యమునకుఁ దగినది కాదు గాన దంతక్షతము లూర్పఁడయ్యెనని భావము.

మగువ పెన్నెరిగుంపు మొగులుజొంపమునన్ = గిరికయొక్క చికురసమూహమనెడు మేఘబృందమునందు, ప్రకంపనాయాసంబు గదురకుండన్ = ప్రకంపనశబ్దము ప్రకృష్టచలనమందును వాయువునందును వర్తించుచున్నది గనుకఁ బ్రకృష్టమైనచలనాయాసమనెడు పవనాయాసము తగులకుండునట్లుగాను, (ని. 'ప్రకంపన శ్చాతిబలః' అని యమరశేషము.) పెన్నెరిగుంపుగా నుండెనుగాన మొగులుజొంపముతోఁ బోల్కి చెప్పఁబడెను. కంపవిశేషాదికములచే గిరిక పెన్నెరివీడి చిక్కుబడకుండ నొనర్చెననుట. ప్రౌఢరతమున నెరివీడుట సహజము. "మేఘోవర్షతి మీనకేతువిశిఖాన్" ఇత్యాదిసురతవర్ణనములు గాంచునది.

చెలువకప్రపుఁబూఁత చిన్నివెన్నెలలకున్ = గిరికయొక్క కర్పూరలేపనమనెడుబాలచంద్రికలకు, ఘనతిరోధానంబుగలుగకుండన్ = ఘనతిరోధానమనెడు ఘనతిరోధానము గలుగకుండునట్లుగాను—ఘనతిరోధానమనఁగా ఘనమైన యదర్శనమనియును మేఘమువలనియాచ్ఛాదనమనియును దెలియవలయును. సిరులనలరించెన్ = సమృద్ధులచేత నొప్పునట్లు చేసెననియును, నిద్దంపుజిగిఘటించెన్ = స్నిగ్ధకాంతిని బొందించె ననియును, ఒయ్యనెఱయించె=తిన్నఁగాఁ జక్కపఱిచెననియును, ఒకయింత యొఱపునించెన్ = మఱికొంత మెఱుపుగలుగఁ జేసెననియును గ్రమాలంకారము. అనఁగా గిరికాదేవి ముగ్ధగనుకఁ బ్రథమసంగమమం దెంతమాత్రమును గాసిదగలకుండునట్లుగా వసురాజు క్రీడించెనని తాత్పర్యము.

వసురాజు నూతనసంభోగములం దారితేరిన చతురుఁడు. కాననే లీలాలతాంతసాయకుఁడు. కావున గుబ్బలపై గోటిగంటులుంచక నిద్దంపుసిరియు మోవిపై పలుగాటులుంచక నిద్దంపుజిగియుఁ బెన్నెరి విడిపోకుండ మెల్లఁగ నెఱపుటయు మేనిపూఁత తొలగిపోకుండ నొఱపునించుటయు నొనర్చెనని భావము.

ఉ. భూనుతకీర్తి వేఁడ నుడి • వోవనితావులగుబ్బగుత్తులన్
దేనియ లాన నానఁ గడ • తేరనివాచవిపండు నిచ్చె భూ
షానివహంబు దాల్చె మృదు • శాటిక మున్న యొసంగె సింధుసం
తానము గావునం గడు ను • దారత నాలతకూన యొప్పుచున్. 92

భూనుతకీర్తివేఁడన్ = భూజనులచేతఁ గొనియాడఁబడినకీర్తిగలవసురాజుయాచింపఁగా, ఆలతకూన = ఆగిరికాదేవి, సింధుసంతానము గావునన్ = సముద్రసంజాతదేవతరువిశేషముగాఁబట్టియని యర్థము. శక్తిమతీనదీసంతానమనిభావము. కడునుదారతన్ = మిక్కిలియాదార్యముచేత, ఒప్పుచున్ = ప్రకాశించుచు, ఉడివోవనితావులగుబ్బగుత్తులన్ = ఉడిగిపోనిపరిమళమునుగల వట్రువపువ్వుగుత్తులను—ఇక్కడ ఉడిగియనెడుపదమునందలి యంతిమవర్ణములోపించినది, తేనియలానఁగడతేరనివాచవిపండున్ = మధురరసాస్వాదనము చేయఁజేయఁగా నెప్పటికిని వాచవిదీరకుండెడుఫలమును ఇచ్చెనని యర్థము. స్తనగుచ్ఛములను నధరబింబమును నిచ్చినదని భావము. భూషానివహంబు దాల్చెన్ = ఆభరణములను వర్జించెనని యర్థము. అలంకారములు సడలిపోవునట్లుగాఁ బెనఁగెనని భావము. మృదుశాటిక మున్నయొసంగెన్ = మృదువైనవస్త్రమును ముందుగానే యిచ్చెనని యర్థము. కట్టుకొంగు ముందుగానే స్వాధీనపఱచెనని భావము.

సింధుసంతానము లతకూన యనువిశేషణములచే గిరికయెడఁ గల్పలతాభావము ద్యోతకమగుచున్నది. కల్పలతకు ఉడిగిపోనితావులు వాచవికడతేఱనిపంట్లు లోనగునవి సహజములు. మఱియుఁ గడునుదారతయుఁ గలదు. వసురాజు బుజ్జగించి గిరిక నొడంబఱచి గుబ్బలంటి మోవియాని సొమ్ములు రాలునంత దిటవుగఁ బెనంగి నీవితొలఁగించి రతులఁ దేలెనని భావము.

ఉ. ముప్పిరి గొన్న వాచవుల • మోహ మొకింతయుఁ దప్పనీదు కన్
ఱెప్పలు విప్ప నీ దొకతఱిం జెమ రారఁగనీదు మేన నె
ల్లప్పుడుఁ దృష్ణచేఁ దనివి • నందగనీదు నృపాలమౌళి నే
చొప్పునఁ బుట్టెనో భువన•సుందరి సింధువరామృతంబునన్. 93

భువనసుందరి=గిరికాదేవి, సింధువరామృతంబునన్-సింధువర=సముద్రములలో శ్రేష్ఠమైన క్షీరసముద్రసంబంధమయిన, అమృతంబునన్=సుధయందు అని యర్థము. సింధు = శుక్తిమతీనదియొక్క, వర=శ్రేష్ఠమయిన, అమృతంబునన్ = సలిలమందనిభావము. (ని. 'అమృతం యజ్ఞశేషేస్యా త్పీయూషే సలిలే ఘృతే' అని మేదిని.) ఏచొప్పునఁబుట్టెనో = ఏప్రకారముగా జన్మించినదోకాని, నృపాలమౌళిన్=వసురాజశ్రేష్ఠుని, ముప్పిరిగొన్న వాచవుల మోహ మొకింతయుఁ దప్పనీదు=ముబ్బడిగాఁ బెనఁచుకొన్ననోటి రుచులయందలి యాసక్తిని గొంచెమయినప్పటికిని వదలనియ్యదు, కన్ఱెప్పలువిప్పనీదు=కనుఱెప్పలు విప్పిచూడనీయదు, ఒకతఱిం జెమరారఁగనీదుమేనన్=ఒకసమయమందైనను దేహమందుఁ జెమటారనియ్యదు, ఎల్లప్పుడుఁ దృష్ణచేఁ దనివినందగనీదు=ఎప్పుడు దప్పిచేతఁ దృప్తిపొందనీదు.

అనఁగా నమృతమందుఁ బుట్టినదానికి నమృతధర్మములు లేక యమృతేతర ధర్మములు గల్గియుండుటవలన నమృతమం దేరీతిగాఁ బుట్టినదో యనియాశ్చర్యము. అమృతాస్వాదనముచేసిన దేవతలకు మఱియొకవాచవులయందు మోహములేకయుండుటయును గన్నులకు ఱెప్పపాటులేకయుండుటయును శరీరమందుఁ జెమటపట్టకుండుటయును దప్పిలేకయుండుటయును బ్రసిద్ధము. ఎంతక్రోలినను మోవిచవిపై మక్కువదీఱలేదనియు సుఖపరవశమునఁ గనుఱెప్పలువిప్పిచూడఁజాలఁడయ్యెననియు నతులితక్రీడావశమున మేనఁ జెమట పొడసూపెననియుంభావము. గిరిక భువనసుందరిగావునఁ దన్నిరతిశయవిభ్రమలావణ్యాదులచే వసురాజు పరవశుఁడయ్యెననుట.

మ. సతి సాహిత్యరహస్య మీశువలనన్ • సాధించి తోడ్తోన త
త్పతికిం బ్రత్యుపదేశ మిచ్చె నతుల•ప్రౌఢిన్ ధ్వనివ్యక్తిఁ ద
చ్ఛ్రుతికిం జొన్పుచు లోచనాంజనరస•ప్రోన్మేషము ల్తన్ముఖో
ద్గతము ల్సేయుచుఁ బ్రత్యలంకరణమౌ•ఖర్యంబు దీపింపఁగన్. 94

సతి=గిరికాదేవి యనియర్థము. పార్వతియని యర్థాంతరము. (ని. 'సతీదక్షసుతా సాధ్వ్యోః' అని నానార్థరత్నమాల) సాహిత్యరహస్యము=కలయికయొక్కమర్మమును-అనఁగా సంభోగరహస్య మని యర్థము. సాహిత్యవిద్యామర్మమని యర్థాంతరము. ఈశువలనన్=పతియయిన వసురాజువలన నని యర్థము. హరునివలననని యర్థాంతరము. (ని.' ఈశ శ్శమ్భౌ ప్రభౌ త్రిషు' అని సా.) సాధించి=

అభ్యసించి, తోడ్తోన=వెంబడిగానే, తత్పతికిం బ్రత్యుపదేశమిచ్చెన్=పతియయిన యావసురాజునకు నాసంభోగరహస్యమును దిరుగ నుపదేశముచేసె నని యర్థము. పతియయిన హరునకు నాసాహిత్య విద్యా రహస్యమును దిరుగ నుపదేశముచేసె నని యర్థాంతరము. ఏలాగనిన, అతులప్రౌఢిన్=అసమాన మయిన ప్రాగల్భ్యముచేత, ధ్వనివ్యక్తిఁ దచ్ఛ్రుతికిం జొన్పుచున్=గళధ్వనియొక్క ప్రాకట్యము నాతనిచెవికి వినఁబడునట్లుగాఁ జేయుచు ననియర్థము. ధ్వన్యర్థముయొక్క ప్రాకట్యము నతఁడు వినునట్లుగా జేయుచు నని యర్థాంతరము. లోచనాంజనరసప్రోన్మేషము ల్తన్ముఖోద్గతముల్సేయుచున్=కన్నుల యందలి కాటుక గలసిన యానందబాష్పసలిలవికాసములు వసురాజుయొక్క ముఖమందుఁ బడునట్లుగాఁ జేయుచునని యర్థము.

లోచనమనఁగాఁ గళాస్థానభేదము. దానికినంజనమయిన-అనఁగా దానిని గనుపఱుచునది కళా శాస్త్రముగనుక దానియందలి శృంగారరసవికాసముల నతని వచించునట్లుగాఁ జేయుచు అని సాహిత్య విద్యాపరమయిన యర్థాంతరము. ప్రత్యలంకరణమాఖర్యంబు దీపింపఁగన్ - ప్రత్యలంకరణ=కంకణనూపురాదిప్రత్యాభరణములయొక్క, మాఖర్యంబు=ముఖరభావము, అనఁగా మ్రోఁత, దీపింపంగన్=ప్రకాశింపఁగా అని యర్థము. ఉపమోత్ప్రేక్షాది ప్రత్యలంకారములయొక్క వాచాలత్వము ప్రకాశింపఁగానని యర్థాంతరము. ప్రత్యుపదేశ మిచ్చెనని సంబంధము.

అనఁగా గిరికాదేవి పెనిమిటివలన సంభోగరహస్యమును గ్రహించి యీపైని నర్థముగాఁ జెప్పఁబడిన క్రియలతోఁగూడుకొనునట్లుగాఁ బుంభావరతిసలిపెనని తాత్పర్యము. సంభోగరహస్యమును గిరికాదేవి వసురాజునుండి గ్రహించి వెంటనే మిగులనేరుపుతో భూషణాదినిస్వనము మణితాదిగళరవాదికములు పెంపార కనులకాటుకకన్నీరు వసురాజుమొగముపైఁబడ మగచేఁతగావించెనని భావము. పుంభావసురతవిశేషము పురుషుని సౌభాగ్యాతిశయమునగాని లభింపదని భర్తృహరి యిట్లు చెప్పియున్నాఁడు.

శ్లో. "ఉరసి నిపతితానాం స్రస్తధమ్మిల్లకానాం
ముకుళితనయనానాం కించి దున్మీలితానాం,
ఉపరిసురతఖేదస్విన్నగండస్థలానాం
అధరమధువధూనాం భాగ్యవంతః పిబంతి."

"అనేకార్థస్య శబ్దస్య వాచకత్వే నియన్త్రితే,
సంయోగాద్యై రవాచార్థ ధీకృద్వ్యాపృతిరంజనం." అను కావ్యప్రకాశికసూక్తినిబట్టి లోచనాంజన మనుచోఁ గళాశాస్త్రమనుటకంటె సాహిత్యవ్యంజనవ్యాపారమనుట యుచితమని యొకరు వ్రాయుచున్నారుగాని పూర్వవ్యాఖ్యాతృభావమె సుగమము సరసముగనున్నది.

శా. భూనాథాగ్రణికి స్వధూమణికి సంభోగాంతసౌఖ్యంబు బ్ర
హ్మానందానుభవంబుఁ దెల్పె ననవద్యం బై యవేద్యాంతరం
బై నిర్లేపకలాప మై క్రమవిముక్తానేకబంధానుసం
ధానం బై యపునర్భవప్రభవఖేదం బై విజృంభించుచున్. 96

భూనాథాగ్రణికిన్=వసురాజునకును, వధూమణికిన్=గిరికాదేవికిని, సంభోగాంతసౌఖ్యంబు=సురతాంతమందలి సుఖభావము - అనఁగాఁ గళలువదలెడు సమయమందలి సౌఖ్యము. బ్రహ్మానందానుభవంబుఁ దెల్పెన్=బ్రహ్మవిషయికమయిన యానందముయొక్క యనుభవమును దెలియఁజేసెను. ఏలాగనిన, అనవద్యంబై=అనిందితమైనదైయని సంభోగాంతసౌఖ్యపరమయిన యర్థము. నిర్దుష్టమయినదని బ్రహ్మానందానుభవపరమయిన యర్థము. అవేద్యాంతరంబై=తెలియఁదగినది మఱియొకటిలేనిదై యని యుభయత్ర అర్థము. నిర్లేపకలాపమయి=వీడిపోయిన భూషణములుగలదై యని సంభోగాంతసౌఖ్యపరమయిన యర్థము. నిర్గతమయిన సంసర్గసమూహము గలదని బ్రహ్మానందానుభవపరమయిన యర్థము. క్రమవిముక్తానేక బంధానుసంధానంబై=క్రమక్రమముగా విడువఁబడిన యనేక రతిబంధానుసంధానములు గలదై యని యర్థము. క్రమవిముక్తములయిన యనేక కర్మబంధానుసంధానములు గలదై యని యర్థాంతరము. అపునర్భవప్రభవఖేదంబై=పునర్భవశబ్దము నఖములయందును బునర్జన్మమందును వర్తించుచున్నది. (ని. 'పునర్భవః కరరుహో నఖో ఽస్త్రీ నఖరో ఽస్త్రియామ్' అని అ.) నఖక్షతములవలనఁ బుట్టెడు బాధలేనిదై యని యర్థము. పునర్జన్మమువలనఁ బుట్టెడుదుఃఖములేనిదని యర్థాంతరము. విజృంభించుచున్=సామర్థ్యప్రకారము గనుపఱుచుచు బ్రహ్మానందానుభవంబుఁ దెల్పెనని సంబంధము.

గిరికయు వసురాజును సంభోగసౌఖ్య బ్రహ్మానందలోలురై ప్రపంచమును, విడిపోయిన భూషణసమూహమును నెఱుంగక యనేకబంధములతోఁ గ్రీడించి నఖక్షతాది బాధలనుగూడ గణింపక చెలరేఁగి వర్తించిరని భావము.

క. సుమనోనాళీకార్పిత, సుమనోనాళీకకలనఁ ♦ జొక్కుచు వసుధీ
రమణియు రమణియు నీక్రియ, రమణీయతఁ గాంచి రనవ♦రతనవరతులన్. 96

సుమనోనాళీక=పుష్పములే బాణములుగాఁగల మన్మథునియందు, ఇక్కడ నాళీకశబ్దము బాణపరము. (ని. 'నాళీకం త్వబ్జే క్లీబం శరే పుమాన్' అని నా.) అర్పిత=సమర్పింపఁబడిన, సుమనోనాళీకకలనన్ = శోభనమనఃకమలములు గలుగుటచేత - ఇక్కడ నాళీకశబ్దము కమలవాచకము. చొక్కుచున్=పారవశ్యమును బొందుచు, వసుధీరమణియున్-వసు = వసునామముగల, ధీరమణియున్ = ధీరశ్రేష్ఠుఁడును, రమణియున్=గిరికాదేవియును, ఈక్రియన్ = ఈచెప్పఁబడినప్రకారముగా, అనవరతనవరతులన్=నిరంతరనూతనసంభోగక్రీడలచేత, రమణీయతఁగాంచిరి = ఒప్పిదమును బొందిరి.

సీ. అభిరామనవపల్ల♦వారామకుంజవాటికలఁ గీరముల నా♦డించికొనుచుఁ
బద్మాలయోదర♦ప్రౌఢసారసవీథి నంచలవేడుంబు ♦ లరసికొనుచు
గాంగేయధామశృం♦గవిటంకముల నీలకంధరోజ్జ్వలగతు ♦ ల్గాంచికొనుచు
విమలసింధుద్వీప♦వేదిక నరుణాస్తఖగవిహారప్రౌఢిఁ ♦ బొగడికొనుచు
తే. రతియుఁ జేతోభవుండు భా♦రతియు నజుఁడు
శచియు నమరాధినాథుండు ♦ జలధిసుతయు
నబ్జనాభుండు నన మించి ♦ యఖిలసమయ
సముచితక్రీడ సలిపిరి ♦ సతియుఁ బతియు. 97

అభిరామ నవపల్లవారామకుంజవాటికలన్ - అభిరామ=ఒప్పుచున్న, నవపల్లవ=క్రొంజిగుళ్లు గల, ఆరామ=ఉద్యానవనములయందలి, కుంజవాటికలన్=పొదరిండ్ల చాల్పులయందు, కీరములనాడించికొనుచున్=చిలుకగుజ్జుములనెక్కి త్రిప్పుచును అనియర్థము. చిలుకల నాటలాడించుకొనుచునని భావము. ఇందువలన రతీమన్మథులసామ్యము సిద్ధించుచున్నది.

పద్మాలయోదరప్రౌఢసారసవీథిన్-పద్మాలయ = సరోవరములయొక్క, ఉదర=గర్భమందు, ప్రౌఢ = వృద్ధిపొందిన, సారస = కమలములయొక్క, వీథిన్ = శ్రేణియందు, అంచలవేడంబులరసికొనుచున్=హంసవాహనములనెక్కి గతివిశేషములను బరీక్ష సేయుచు నని యర్థము. హంస విహారముల నవలోకించుచు నని భావము. అందువలన వాణీహిరణ్యగర్భులసామ్యము సిద్ధించుచున్నది.

గాంగేయధామ శృంగవిటంకములన్ - గాంగేయధామ = సువర్ణస్థానమైన మేరుపర్వతము యొక్క, శృంగవిటంకములన్=శిఖరములయొక్క యంచులయందు, (ని. 'తపనీయం శాతకుమ్భం గాఙ్గేయం భర్మ కర్బురమ్' అని అ.) నీలకంధరోజ్జ్వలగతుల్గాంచికొనుచున్ = కంధరశబ్దము మేఘమందును, గంధరాశబ్దము కంఠమందును వర్తించును గనుక, నీలకంధరమనఁగా నీలమేఘంబును నెమిలియును, (ని. 'గ్రీవాయాం కన్ధరా మేఘే పుమాన్' అని నా.) నీలకంధర=నీలమేఘవాహనములయొక్క, ఉజ్జ్వలగతులు=ప్రకాశమానమయిన గమనములను, కాంచికొనుచున్=పొందుచునని యర్థము. సువర్ణమయకోలాహలాచలశిఖరపార్శ్వములయందు నెమళ్ళయొక్క నడకలు చూచుకొంచునని భావము. ఇందువలన శచీసురేంద్రుల సామ్య మభిహితమయినది.

విమలసింధుద్వీపవేదికన్ - విమల=తెల్లనైన, సింధు=సముద్రమందలి - అనఁగా క్షీరసముద్రమందలి, ద్వీపవేదికన్=వేదికాసదృశమయిన శ్వేతద్వీపమందు, అరుణాప్తవిహారప్రౌఢిఁబొగడికొనుచున్=అరుణశబ్దము సూర్యసారథియైన యనూరునియందును సూర్యునియందును వర్తించుచున్నది. (ని. 'అరుణో ర్కే తత్సూతే' అని నా.) అరుణాప్తఖగ=అనూరుని కాప్తుఁడైన గరుత్మంతుని యందును, విహారప్రౌఢిఁ బొగడికొనుచున్=సంచారప్రౌఢిమను మెచ్చుకొనుచు నని యర్థము. సింధుశబ్దము నదియందు వర్తించుచున్నది గనుక స్వచ్ఛమయిన శుక్తిమతీనదియందలి వేదికవంటి యిసుకదిన్నెయందును, నరుణాప్తఖగములనఁగా సూర్యుఁడాప్తుఁడుగాఁగల పక్షులు చక్రవాకములుగనుక వానియొక్క విహారప్రౌఢిమను మెచ్చుకొనుచు ననిభావము. ఇందువలన లక్ష్మీనారాయణుల సామ్యముచెప్పఁబడినది.

రతియుఁజేతోభవుండున్=రతీదేవియును మన్మథుఁడును, భారతియునజుఁడున్ = సరస్వతీదేవియును బ్రహ్మయును, శచియు నమరాధినాథుండున్=శచీదేవియును దేవేంద్రుఁడును, జలధిసుతయు నబ్జనాభుండున్=లక్ష్మీదేవియును శ్రీమహావిష్ణువును, అనమించి=అనునట్టులుగా నతిశయించి యని క్రమాలంకారము. సతియుఁ బతియున్=గిరికాదేవియును వసురాజును, అఖిలసమయసముచితక్రీడ సలిపిరి = వసంతాదిసర్వర్తుసమయములయందును దగియుండునట్టి కేళీవిహారముచేసిరి.

మొదటిపాదమున వసంతఋతువునకు రెండవపాదమున శరదృతువునకు మూఁడవపాదమున వర్షర్తువునకు నాలుగవపాదమున హేమంతర్తువునకు ననుకూలములగు కీరాదికములు, నవపల్లవారామాది ఋతుధర్మములు చెప్పఁబడెను. ఆయాఋతుధర్మములకనుకూలములగు క్రీడాదికములెసముచితక్రీడలు. గిరికయు వసురాజు సముచితక్రీడాలోలురై సర్వర్తువులయందు సుఖమనుభవింప సాగిరని భావము.

తే. ఇట్లతఁడు శైలజకుఁ జొక్కు • బెట్టఁగి యొకొ్క
యలఘుసద్గోత్రనందన • యయ్యెఁ గీర్తి
యగతనయ యయ్యె జయరమ • యచలభూతి
మహితయై మించె నపుడు సా•మ్రాజ్యలక్ష్మి. 98

ఇట్లు=ఈ ప్రకారముగా, అతఁడు=ఆ వసురాజు, శైలజకుఁజొక్కుబెట్టఁగియొకొ్క=పర్వతపుత్త్రియైన గిరికాదేవికి స్వాధీనుఁడగుట దెలిసికొని కాఁబోలు, అపుడు=ఆసమయమందు, కీర్తి=వసురాజుయొక్క కీర్తికాంత, అలఘుసద్గోత్రనందనయయ్యె - అలఘు = అధికమయిన, సద్గోత్ర=కులపర్వతముయొక్క, నందనయయ్యెన్=కొమార్తెయాయెను అని యర్థము. సత్కులీనులను సంతోషింపఁజేయుచున్నదని భావము. ఇక్కడ గోత్రశబ్దము పర్వతమునందును గులమందును వర్తించును. (శ్లో. 'గోత్రం నామ్ని కులే క్షేత్రే గోత్రా భువి గవాఙ్గణే, గోత్రశ్శైలే' అని నా.) నందనశబ్ద మపత్యమందును సంతోషకరమయినదానియందును వర్తించును. (ని. 'నన్దనం వాసవోద్యానే నన్దనో హర్షకే సుతే' అని మే.) జయరమ=ఆతనిజయలక్ష్మి, అగతనయయయ్యెన్=పర్వతపుత్త్రిక యయ్యెనని యర్థము. అగత=పోకయుండునట్టి, నయయయ్యెన్=నీతిగలదాయెనని భావము. ఇక్కడ శబ్దశ్లేషము, సామ్రాజ్యలక్ష్మి=ఆయనరాజ్యలక్ష్మి, అచలభూతిమహితయై మించెన్=పర్వతసంభవత్వముచేత నొప్పినదై యతిశయించెనని యర్థము. చలింపని యైశ్వర్యముచేత నొప్పినదై యతిశయించెనని భావము.

ఇక్కడ అచలమనఁగాఁ బర్వతమును జలింపనిదియును, భూతియనఁగాఁ బుట్టువును నైశ్వర్యంబును, (ని. 'భూతి ర్మాతఙ్గశృఙ్గారే జన్మ సంపత్తి భస్మసు' అని నా.) అనఁగా నీరీతిగా వసురాజు గిరికాదేవియందాసక్తుఁడై ప్రవర్తించుచుండఁగా నాతనికీర్తి సత్పురుషులను సంతోషింపఁజేయుచుండెననియు నాతనిజయలక్ష్మి నీతిసహితయై యుండెననియు నాతనిరాజ్యలక్ష్మి సుస్థిరైశ్వర్యముచేత నొప్పుచుండె ననియును దాత్పర్యము.

సీ. ఆరాజువిమలవి•ఖ్యాతిచంద్రిక నిచ్చ రహిఁ గెక్కుఁ జాఱె జా•రప్రసంగ
మాఘునుదానధా•రాపూర్ణవర్ష మ్మురర్వరఁ బర్వ డిగియె స•వగ్రహార్తి
యాలోకహితుప్రతా•పాతపం బవిరతోదయరూఢిఁ దగ నింకె • దస్యుపంక
మాసద్గుణాబ్ధిచ•రామృతం బెల్లచో దయివారఁ దెరలె నా•మయవిభూతి
తే. యమ్మహాశైలవమనురా•జ్యమున నిట్లు
ఫలము లీనెడు చెట్లతోఁ • బాలవెల్లి
కాన్పుపసితో నఖండభో•గములతోడఁ
బ్రజలు గాంచిరి భూరివై•భవసమృద్ధి. 99

ఆరాజు=ఆవసురాజనెడు చంద్రునియొక్క, (ని. 'రాజా నృపే తాలభేదే పత్యౌ క్షత్త్రియ చన్ద్రయోః' అని నా.) ఇక్కడ శ్లిష్టరూపకము-సర్వత్ర వసురాజపరమయినవిశేష్యపదములకన్నిటికి నీలాగుననే విచారింపవలయును. విమలవిఖ్యాతచంద్రిక=శుభ్రకీర్తియనెడువెన్నెల, నిచ్చరహిఁ గెక్కన్=నిరంతరమును వన్నెకెక్కఁగా, జారప్రసంగము=విటులయొక్క ప్రసక్తి, జాఱెన్=వదలెను.

ఆఘనుసు=ఘనుఁడైన యావసురాజనెడు మేఘునియొక్క, (ని. 'మేఘే పుమాన్ ఘనః' అని నా.) దానధారా=దానజలధారలనెడు, ఆపూర్ణవర్షము=సంపూర్ణమైన వర్షము, ఉర్వరఁబర్వన్=సకలసస్యములచేతఁ బరిపూర్ణమైన భూమియందు వ్యాపింపఁగా, (ని. 'ఉర్వరా సర్వసస్యాఢ్యా' అని అ.) అవగ్రహార్తి=వర్షప్రతిబంధమువలన నైనపీడ, డిగియెన్=తగ్గిపోయెను. ఆలోకహితు=జనహితుఁడైన యా వసురాజనెడు సూర్యునియొక్క—ఇక్కడ సూర్యపరముగా లోకబాంధవశబ్దమనుసంధింపవలయును. (ని. 'ప్రద్యోతనో దినమణిః ఖద్యోతో లోకబాన్ధవః' అని అ.)

ప్రతాపాతపంబు=ప్రతాపమనెడు నెండ, అవిరతోదయరూఢిఁదగన్=నిరంతరాభ్యుదయరూఢిచేత నొప్పఁగా, దస్యుపంకము=శత్రువులును జోరులును ననెడుబురద, (ని. 'దస్యుః ప్రత్యర్థిచోరయోః' అని నా.) ఇంకెన్=ఇగిరిపోయెను. ఆసద్గుణాబ్ధి=సద్గుణసముద్రుఁడైన యా వసురాజనెడు సముద్రునియొక్క, చర్యా=శ్రుతిస్మృత్యాచారస్థిరవృత్తియనెడు, అమృతంబు=సుధారసము, ఎల్లచోదయివారన్=అంతటఁ బూర్ణీభవింపఁగా, ఆమయవిభూతి=రోగసంపత్తి, తెరలెన్=విచ్చిపోయెను.

అమ్మహాశైలదమను = కోలాహలపర్వతశిక్షకుఁడైన యా వసురాజనెడుశైలదమనునియొక్క—అనఁగా దేవేంద్రునియొక్క, రాజ్యమునన్=రాజ్యమందు, ఇట్లు=ఈప్రకారముగా, ఫలములీనెడు చెట్లతోన్=వాంఛితఫలములనిచ్చెడు మందారపారిజాతాదివృక్షములతోడ నని యర్థము. మధురఫలప్రదములయిన వృక్షములతోడ నని భావము. పాలవెల్లికాన్పుపసితోన్ = క్షీరసముద్రమువలనఁ బుట్టిన కామధేనుగణముతోనని యర్థము. పాలు వెల్లువఁబారనిచ్చునట్టి గోసమూహముతో నని భావము.

అఖండభోగములతోడన్=సంపూర్ణసుఖములతోనని యర్థము. అష్టభోగములతోననిభావము. భూరివైభవసమృద్ధిన్-భూరి=కాంచనముయొక్కయు, వైభవ=విభవములయొక్కయు, సమృద్ధిన్=సంపూర్ణతను, ప్రజలు గాంచిరి=జనులుపొందినవారైరి. (ని. 'స్వర్ణేపిభూరి' అని యమరము.)

క. అని యిట్లు రోమహర్షణ, తనయుఁడు వసురాట్కథాసుధారస మఖిలం
బును దెలుప విని మహోత్సవ, మునఁ బొదలిరి శౌనకాదిమునికులచంద్రుల్.

అనియిట్లు=ఈలాగని, రోమహర్షణతనయుఁడు=రోమహర్షణపుత్త్రుఁడైన సూతుఁడు, వసురాట్కథాసుధారసము=అమృతరసప్రాయమైన వసురాజుయొక్క చరిత్రము, అఖిలంబును దెలుపన్=సమస్తమును దెలియఁజెప్పఁగా, విని=ఆకర్ణించి, శౌనకాదిమునికుల చంద్రుల్=శౌనకుఁడు మొదలుగాఁగల మునివంశశ్రేష్ఠులు, మహోత్సవమునఁ బొదలిరి = మహత్తరమయిన వేడుకచే నొప్పిరి.

ఆశ్వాసాంతము.

మ. దృఢబాహాబలభీమ భీమసమరప్రేంఖజ్జయశ్రీపరి
బ్రఢిమాఢౌకితభూమ భూమహితతూర్యధ్వానదత్తైశధా
కృధమత్కారవినామ నామకథనక్లామ్యన్మహాఢిల్లికా
గఢరాడాద్యరిధామ ధామగరిమగ్రస్తగ్రహాధీశ్వరా. 101

దృఢబాహాబలభీమ=గాఢమయిన బాహుబలమందు భీమసేనుఁడవైనవాఁడా, భీమసమర=భయంకరయుద్ధములయందు, ప్రేంఖత్ = నటించుచున్న, జయశ్రీ=జయలక్ష్మియొక్క, పరిబ్రఢిమా=పరిబృఢత్వముచేత-అనఁగా నాధిపత్యముచేత, పరివృఢశబ్ద మధిపతియందు వర్తించును. ని. 'ప్రభుః పరివృఢోఽధిపః' అని అ. వబలకభేదము, ఆఢౌకిత=వ్యాపింపఁజేయఁబడిన, భూమ=సామర్థ్యముగలవాఁడా, భూమహిత = భూమియం దొప్పుచున్న, తూర్యధ్వాన=చతుర్విధవాద్యధ్వనులచేత, దత్త=ఈఁబడిన, ఈశఢాక్కాఢమత్కార = హరునియొక్క ఢక్కాసంబంధమయిన ఢమఢమధ్వనియొక్క, వినామ = నమ్రభావముగలవాఁడా-అనఁగా హరుని ఢక్కానాదమును దిరస్కరించిన భేరీకాహళాదిధ్వనులు గలవాఁడా యనుట. నామకథన=పేరుచెప్పినంత మాత్రముచేతనే, గ్లామ్యత్=వాడిపోవుచున్న, మహాఢిల్లికాగఢరాడాది = ఢిల్లి యాగఢా పాదుషాలు మొదలైన, అరి=శత్రువులయొక్క, ధామ=ప్రభగలిగినవాఁడా-అనఁగా నీరాజుపేరు వినఁగానే వారికి ముఖవైవర్ణ్యము సంభవించుచున్న దనుట. ధామగరిమగ్రస్త గ్రహాధీశ్వరా-ధామగరిమ=తేజోగౌరవముచేత, గ్రస్త=కబళింపఁబడిన, గ్రహాధీశ్వరా=సూర్యుఁడుగలవాఁడా-అనఁగా సూర్యతేజస్సునకంటె నధికమయిన తేజస్సుగలవాఁడనుట. అని యాశ్వాసాంతమందుఁ గృతిపతినిగూర్చి సంబోధనము. ఈపద్యము ముక్తపదగ్రస్తము గలదిగాఁ జెప్పఁబడియెను.

క. ధాటీబహుధాటీకన
ఘోటీఘోట్రాణకోటి♦ఖురకోటిరజ
శ్శాటీవృతహరిదవధివ
ధూటీకుచశైల ప్రబల♦దోర్బలలీలా. 102

ధాటియనఁగా, శ్లో. 'శత్రుసేనావమర్దాయ సద్యస్సుభటఘోటకైః, విజిగీషాప్రవృత్తిర్యా సాధాటీతి నిగద్యతే' అను నీశ్లోకోక్తలక్షణముగల ధాటియందు-అనఁగా దాడియందు, బహుధా=అనేకవిధములైన, ఆటీకన=గతివిశేషముగలిగిన, ఘోటీ=ఆఁడుగుఱ్ఱములయొక్కయు, ఘోట్రాణ=మొగగుఱ్ఱములయొక్కయు, కోటి=కోట్లయొక్క-అనఁగా ననేకములైన స్త్రీపురుషాశ్వసమూహములయొక్క, ఖుర=గొరిజలయొక్క, కోటి=కొనలవల్లఁబుట్టిన, రజః=ధూళియనెడు, శాటీ=వస్త్రముచేత, వృత=కప్పఁబడిన, హరిదవధివధూటీ=దిక్కులే చివరగాఁగలభూమియనెడు స్త్రీయొక్క, కుచశైల=స్తనప్రాయములైన పర్వతములుగలవాఁడా, ప్రబలదోర్బలలీలా=బలిష్ఠమైన బాహుబల విలాసముగలవాఁడా అని సంబోధనము.

సుగంధివృత్తము.

సారసాహితీసదధ్వ♦చారిభూరిధీరసా
ధీరసాహసోరుదోర♦తిస్ఫురన్మహారసా
హారసానుమత్తటీసు♦రాపగాసుధారసా
ధారసాధుకీర్తిహంస♦ధారిసూరిసారసా. 103

సార=శ్రేష్ఠమయిన, సాహితీ=సాహిత్యమనెడు, సదధ్వ=సన్మార్గమందు, చారి=సంచరించుచున్న, భూరి=అధికమైన, ధీరసా=బుద్ధిగుణములగలవాఁడా! ఇక్కడరసశబ్దముగుణార్థకము. ని. 'శృఙ్గారాదౌ

విషే వీర్యే గుణే రాగే ద్రవేరసః' అని అ. ధీరసాహస=మహత్తరమైనసాహసముగలిగిన, ఉరు=దీర్ఘమైన,దోః=బాహువునందు, అతిస్ఫురత్=మిక్కిలిప్రకాశించుచున్న, మహాత్=విస్తారమైన, రసా=భూమిగలవాఁడా, ని. 'రసావిశ్వమ్భరా స్థిరా' అని అ. హార=హారసంబంధమైన, సానుమత్=పర్వతముయొక్క-అనఁగా కైలాసపర్వతముయొక్క, తటీ=దరులకును, సురాపగా=దేవనదికిని-అనఁగా నాకాశగంగకును, సుధారస=అమృతరసమునకును, ఆధార=ఆధారమయిన, సాధు=లెస్సయిన, కీర్తి=కీర్తియనెడు, హంస=హంసను, ధారి=ధరించుచున్నది, సూరి=విద్వాంసులనెడు, సారసా=కమలములుగలవాఁడా అని సంబోధనము. ఈవృత్తము ముక్తపదగ్రస్తపాదములుగలదిగాఁ జెప్పంబడియెను. ఈ సుగంధివృత్తమునకు ర జ ర జ ర గణములుండవలయును. తొమ్మిదవయక్షరము యతిస్థానము. ఇది పదునేనవఛందంబగునతిశక్వరియందుఁ బుట్టినది. దీనిని శాలినీ ప్రశాంతిచామరవృత్తంబు లని కొందఱండ్రు, దీని నుత్సాహం బని కొందఱు భ్రమింతురు.

గద్యము. ఇది శ్రీమద్రామచంద్రచరణారవిందవందనపవననందనప్రసాదసమాసాదితసంస్కృతాంధ్రభాషాసామ్రాజ్య సర్వంకషచతుర్విధకవితానిర్వాహకసాహిత్యరసపోషణరామరాజభూషణప్రణీతం బయినవసుచరిత్రం బనుమహాప్రబంధంబునందు సర్వంబును షష్ఠాశ్వాసము.

ఇది శ్రీమదాత్రేయకులకలశాంభోనిధిసంపూర్ణసోమ సోమాభిధానమంత్రివరపౌత్త్రుండును, సోమసుతసిద్ధేశ్వరమంత్రీశ్వరపుత్త్రుండును శ్రీమత్పార్వతీరాజేశ్వరవరప్రసాదసమాసాదిత హృద్యానవద్యనిఖిలవిద్యావిశారదుండును నగుసోమకవిచేత విరచితం బయినవిద్వజ్జనరంజనీనామకపూర్వవ్యాఖ్యానమందలి విశేషవిషయసహితంబుగాఁ బరిష్కృతం బయి యొప్పారు ప్రతిపదటీకారూపం బగు వసుచరిత్రనామకాంధ్రకావ్యరత్నవ్యాఖ్యానమునందు సర్వంబును షష్ఠాశ్వాసము.

విద్వజ్జనరంజనీనామకప్రతిపదటీకారూపం బగువసుచరిత్రవ్యాఖ్యానమందలి శ్రీశేషాచలాధీశ్వరకరుణాసమాసాదితోభయభాషాకవితాధురంధర శేషాద్రిరమణకవిసోదరవిరచిత భావప్రకాశిక యను వివరణము సంపూర్ణము.

వసుచరిత్రము సవ్యాఖ్యానము షష్ఠాశ్వాసము
సర్వంబును సంపూర్ణము.

చెన్నపురి: 'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1926.

తప్పొప్పుల పట్టిక.

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
13	1	శివుఁడు	వినాయకుఁడు
16	24	ఁజేసిరి	ఁజేసెను
,,	34	ఆంధ్రోక్తిమయప్ర పంచపరముగాను న ర్థద్వయంబు	ఆంధ్రోక్తిమయప్ర పంచపరముగా ను, ప్రపంచపర ముగాను నర్థద్వ యంబు
18	12	దింస్కరింపఁ	దిరస్కరింపఁబడిన
,,	22	అర్థాంతరము	భావము
,,	24	నందనంబును	వందనంబును
19	8	భాగ	భార
,,	31	విమత	వినుత
,,	32	సమారంభ	శుభారంభ
21	11	రత్నాకర	రత్నరత్నాకర
27	15	కటక	నావార
33	14	కృతార్థులు	కృతార్థురాలు
36	27	దేవికి	దేవకి
37	12	నియుక్తములగు	నియుక్తమగు
,,	27	నల్లపు	నలుపు
,,	31	భావంబు	భోగంబు
40	32	కర్ణనివలెనువితర ణమహిమను	కర్ణునివలెను, ఖేచ రునివలెను విత రణమహిమను
42	4	జాతుర్మాస్య	ఁజాతుర్మాస్యదీక్ష
43	28	ధన్ను	మన్ను
56	19	గావించె	పొందువారిఁగావించె
65	6	బ్రకాశించునది	బ్రకాశించునదని
66	32	ఘాతుఁడయ్యెను	ఘాతమయ్యెను
,,	34	ప్రతాపకు	ప్రపాతకు
75	28	బోక	బోలిక
95	20	ఘనమేఘముల	మేఘముల
05	10	అనఁగాఁ	అనఁగా ముత్తెములు
27	19	వాహినుల	వాహినులుగ
31	18	శశాంక	శశాంగ
37	4	తోడను	తోడను నలరి
40	17	వరూధినిని జెప్పుచు	వరూధినివి
,	33	శ్రీతత్వద్యోతన	శ్రీత్వద్యోతన
18	7	వసురాజునాతని	వసురాజాతని

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
150	5	శవు ని	శివుని
,,	31	కల్పక్షాసవము	కల్పవృక్షాసవము
154	13	యలపులప	యలయికల నప
155	18	మగుడఁ	మగుడరాఁ
172	10	దేవకాంతి	దేహకాంతి
179	11	బొగ్గిలి	బొక్కిలి
185	29	నొందినను	శ్రమనొందినను
191	7	ఆహి=	ఆహిరాజన్య=
193	4	జనించి	చేరాగముజనించి
195	20	ఁగాన	ఁగోన
201	13	పదరురూప	పదరూప
206	9	గలిఁ	గలిగి
211	1	నర్థనము	నర్థము
220	2	వచ్చిన	విచ్చిన
,,	30	గలవాని	గలదాని
233	6	సుఖాద్వతి	సుఖాదతి
234	27	శాపశిఖి	తాపశిఖి
235	26	ఆతిశయమున	అతిశయమయిన
239	10	యర్థము	యర్థమని
,,	12	కవ్యభిప్రాయము	కవ్యభిప్రాయమొ
245	2	జసీ	జల
,,	3	దాల	దాసీ
,,	30	నెంచనేని	నెంచవేని
248	9	నటింపక్	చలింపక్
250	22	దగు	దగులు
251	20	మును	మునుగలుగ
262	31	క్షోణీధ	క్షోణీధవ [గున
271	2	నడుగున	నావజ్రశేఖయడు
274	29	వర్ణించు	వర్షించు
275	5	ఈరశ్చంద్రా	ఈశరచ్చంద్రా
276	18	బదులీమాన	బదులీవిమాన
,,	32	సర్వసౌఖ	సర్వసమయసౌఖ్య
277	9	చిత్రగ్రహము	చిత్రవిగ్రహము
281	29	ఆన్యేశ	అన్యేచ
284	9	వసుమమః	పసుమహా
,,	10	నెయ్యవహా	నెయ్యము [ట్యాము
286	7	నాట్యము	నాట్యమువంటినా
293	25	బూవి	బూవు

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
294	10	పన్నిఁటిని	అన్నిఁటిని
,,	11	అచ్చిన	వచ్చిన
298	13	యాఁకారము	యాప్రకారము
301	4	భంతి	భవంతి
306	28	గడించి	గడించిన
,,	29	పొడ	పొగడ
307	13	కతజ్ఞ	కృతజ్ఞతా
308	17	ములోకయత్	మలోకయత్
311	18	వాఁడ	వాఁడగు
315	30	ధనులన్న	ధ్వనులన్న
319	17	క్రియరూప	క్రియారూప
324	9	వాలన	వలన
,,	17	దర్శనః	దర్శనాత్
332	10	దటిర్విభాసి	దటిద్విభాసి
334	21	నఖక్ష్యము	నఖక్షతము[ములచే
335	7	కరములచే	సూర్యునివలెఁ గర
,,	31	దొదగెను	దొడఁగెను
336	22	దశైవస్సు	దశైవస్యః
338	1	సుత్యహతా	సుత్యపహతా
342	16	లంకారమును	లంకారమని
343	19	శుక్తి	శుక్తిమతి
349	31	చెవి	చెలి
,,	32	చెవి	చెలి
360	26	ఫలమాత్రము	తావిమాత్రము
370	22	తేనెసోర	తేనెసోన
,,	23	ననంటిపొన	నవంటిపొర
,,	29	సాగెనేగె	సాగె
382	8	గ్రీడదళిత	గ్రీడదళి
413	14	స్వదృష్ట	స్వధృష్ట
,,	32	సాభిసారికాః	సాభిసారికా
414	16	కాలము	కాలమున
423	1	తెలితమ్మి	తెలిదమ్మి
424	31	జేరును	జేరెను
428	15	కొమెర	కొమిరె
430	25	జారి	కన్నీరుజారి
,,	26	బింబమున	బింబమును
434	1	గళిగి	గలిగిరి
441	1	కాననిది	కాన
444	25	పధా	వధ
453	17	మహీజత	మహీజాత
457	22	మేలు	మేను
464	10	ప్రదక్షిణలు	ప్రదక్షిణములు
471	22	మధ్యపువర్ణము	మధ్యమువర్ణము
473	18	మనోభవ	మనోభవమణి
479	32	సంబోధనమందును	సంబోధనమందు మువర్ణముచెప్పి
490	32	పయోద్ధతి	పయోదోద్ధతి
498	26	బయలు	తుమ్మెదలుబయలు
510	14	పొగెనయ	పొసెనయ
514	13	గిరికానను	గిరికానన
,,	31	గ్రహించి	గ్రహించిగంగను
520	31	సొంపు	సొంపున
543	23	హాటకవయవ	హాటకమయ
558	16	మండలము	మంబలమునుండి
561	26	మవ్విధము	మన్విధము
572	19	వేయనటులు	వేయుఁనటులు
580	15	వివాహము	వివాహమున
592	10	జెలువులకు	జెలుఁవలకు
598	11	కాయేంగితము	కామేంగితము
626	9	మనోరార్థ	మనోహరార్థ
630	65	గూర్చు	గూర్చె
633	2	గేహము	దేహము
641	2	లజ్జేన	లజ్జేవ
,,	6	బింబముల	బింబములు
646	34	పనోసంగుమవియు లుకు	నోసంగుమనియుఁ బలుకు
649	21	విశేషము	విశేషమున
651	34	లూర్పు	లూన్పు

N. B. తేటి, దాచు, ఏగు, నాగన్, వ్రేగు, తీగ, తేగాను, కాక, మ్రోగి, ప్రాకి, పోక, నూగు, ఊచు, పీట, తోట, నాటి, మరుగు, పులుగు, దాక, నోచు, పోగాక్, మూగ, పూప, సైప, ఏటికిక్, తోబుట్టు లోనగుపదములయం దరసున్న జేర్చుకొనవలయును. ... ముందర, తరి, దగ్గర లోనగుచోట్ల శకటరేఫములును, గ్రహించక్, కని... లోనగు... పవర్ణములు జేర్చుకొనవలయును. 520 పుటలోని పొడపై నశృంగములు ... యందుఁగల 30, 31, 32 పంక్తులు 33-వ పద్యము క్రింద 521-వ పేజిలోఁ జేర్పవలయును.